# ప్రభుత్వ డిగ్రీ & పిజి కళాశాల

పుత్తూరు, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

Azadi Ka Amrit Mahotsav

Indian Council of Social Science Research

Vol. : 25  Issue : 12 (2)  Spl. Edition అక్టోబర్ - 2022  ISSN No. : 2457-0796


ICSSR SPONSORED TWO DAY NATIONAL SEMINAR

# "స్వాతంత్ర్యోద్యమ తెలుగు సాహిత్యంలో మహిళ పాత్ర"

# "The Role of Women in Telugu Literature during the Freedom Movement"

21 - 22 అక్టోబరు, 2022


UGC APPROVED JOURNAL

## మూసీ ప్రత్యేక సంచిక

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాస పత్రిక






నిర్వాహకులు

డా॥ పి. కుమారి నీరజ

తెలుగు శాఖ



వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి



# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 25 సంచిక : 12 (2) అక్టోబరు - 2022 'శుభకృత్' ఆశ్వీజ మాసం

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B. Anantha Laxmi

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : **మేనేజర్, మూసీ మాసపత్రిక,**
2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com


**ఈ పత్రికలోని వ్యాసాలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**


*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,**
3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

# ఐసిఎస్ఎస్ఆర్ జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

# స్వాతంత్ర్యోద్యమ తెలుగు సాహిత్యంలో మహిళ పాత్ర

**21-22 అక్టోబరు 2022**

**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక**

ప్రథమ ముద్రణ : అక్టోబరు 2022

ప్రతులు : 500

కాపీలకు : **డా॥ పి. కుమారి నీరజ,**
తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ & పిజి కళాశాల,
పుత్తూరు, తిరుపతి జిల్లా
ఫోన్ : 9885248649

**గమనిక :** ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయాలతో సంపాదక వర్గానికి సంబంధం లేదు.

**ఎడిటోరియల్ చిరునామా**
మేనేజర్, **మూసీ మాసపత్రిక,**
2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట,
బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
**email : editormusi@gmail.com**

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

ICSSR Sponsored Two Day National Seminar

# స్వాతంత్ర్యోద్యమ తెలుగు సాహిత్యంలో మహిళ పాత్ర

## The Role of Women in Telugu Literature during the Freedom Movement

**21 - 22 October 2022**

సంపాదకులు

**డా॥ పి. కుమారి నీరజ**

సహ సంపాదకులు

**డా॥ మన్యం నరసింహులు**

**తెలుగు శాఖ**

**ప్రభుత్వ డిగ్రీ & పిజి కళాశాల**

**పుత్తూరు, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్**



**డా॥ మట్లి భాస్కర్ రెడ్డి**
**కళాశాల అధ్యక్షులు**
**ప్రభుత్వ డిగ్రీ & పిజి కళాశాల, పుత్తూరు**

# అభినందనలు

ప్రపంచదేశాల్లో భారత దేశానికి, భారతీయులకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఆ స్థానం స్వాతంత్ర్య సాధన తర్వాత మరింత మెరుగైంది. బ్రిటిష్ వాళ్ళు మన దేశంలో తిష్ఠవేసి మనల్ని ఇబ్బందులపాలు చేసినప్పుడు ఎన్నో గుండెలు తల్లడిల్లాయి. ఆ బాధను భారతీయులంతా కలసికట్టుగా అనుభవించి, అంతే కలసి కట్టుగా బ్రిటిష్ వారిని తరిమికొట్టడానికి ఏకం కావడం సామాన్యమైన విషయం కాదు.

భారతమాతను బ్రిటిష్ వారి చెరనుండి విడిపించడానికి ఎన్నో ఉద్యమాలు, తిరుగుబాట్లు, జైలు శిక్షలు, ప్రాణత్యాగాలు ఆనాటి ఆ నాయకులు, ప్రజలకు దేశంపట్లున్న ప్రేమకు నిదర్శనం. స్వాతంత్ర్యోద్యమం సమాజంలో సగభాగమైన స్త్రీలు లేకుండా సాగిపోలేదు. ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఎందరో మహిళలు ఈ ఉద్యమంలో పాలు పంచుకున్నారు. ఐతే వారిలో కొందరు మాత్రమే వెలుగులోకొచ్చారు. చాలామంది గురించి తెలియనే తెలియదు. అలాంటి వారి తెగువ, ధైర్య సాహసాలు నేటి సమాజానికి ఎంతో అవసరం. స్వాతంత్ర్యం సాధించుకుని 75 వసంతాలు పూర్తిచేసుకున్న ఈ తరుణంలో అలాంటి వారినిగూర్చి తెలుసుకోవడంకోసం తెలుగు శాఖాధ్యక్షులు డా॥ పి. కుమారి నీరజ **'స్వాతంత్ర్యోద్యమ తెలుగు సాహిత్యంలో మహిళ పాత్ర'** అనే అంశంపై సదస్సు నిర్వహించ తలపెట్టడం చాలా గొప్ప విషయం. కళాశాల అధ్యక్షులుగా ఈ సందర్భంగా సదస్సు సంచాలకులు డా॥ పి. కుమారి నీరజకు, తెలుగు శాఖలోని ఇతర అధ్యాపకులకు శుభాభినందనలు తెలియజేస్తున్నాను. ఈ సదస్సు విజయవంతం కావాలని ఆశిస్తూ, నీరజ ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

(డా॥ మట్లి భాస్కర్ రెడ్డి)



## Prof. K. Raja Reddy

**Vice-Chancellor**
Sri Venkateswara University, Tirupati

# MESSAGE

[illegible]

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022



**డా॥ డి.ఎమ్. ప్రేమావతి**
**విశ్రాంత రీడర్**
**శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల, తిరుపతి.**

# స్వాతంత్ర్యోద్యమ తెలుగు సాహిత్యంలో - మహిళ పాత్ర

సమాజాన్ని, సమాజస్థితి గతుల్ని, రచనలో చొప్పించి, భావసంచలనాన్ని కల్గించి, ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలి అంటే సామాజిక చరిత్రపరిధిలో సాహిత్య పరిశీలన జరగడం అవసరం. అలాగే సాహిత్యం మీద సామాజిక పరిశీలన కూడా అవసరమే. ఇది ఆధునిక తెలుగు సాహిత్యంలో వచ్చిన మార్పు, ఒక శాస్త్రీయపద్ధతి. ఈ నేపథ్యంలో భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని పరిశీలించాలి. స్వాతంత్ర్య పోరాటం దాదాపు ఐదు దశాబ్దాలకు పైగా జరిగిన ఒక మహత్తరఘట్టం. ఉద్యమంలో ప్రజలు, స్త్రీలు, పురుషులు అన్న తేడాలేక, స్వచ్ఛందంగా పాల్గొన్నారు (పిల్లలు సైతం).

భారత జాతీయోద్యమ చరిత్రను పరిశీలించడం, స్త్రీలను ప్రత్యేకంగా వెలుగులోకి తీసుకురావాలన్న ప్రయత్నం ప్రస్తుత సదస్సు చేపట్టడం అభినందనీయం, చాలా అవసరం కూడా. స్వేచ్ఛ ఏమాత్రం లేక స్త్రీలు అటు కుటుంబాల్లో యిటు సమాజంలో, విద్యకు దూరమై ఎలా నిరాదరణకు గురి అయ్యారో (ఆరోజుల్లో) తెలిసిన విషయమే. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో స్త్రీలు పురుషుల కంటే మిన్నగా, స్వచ్ఛందంగా పోరాటంలో దూకడం ఒకింత సాహసమే. పోరాటంలో పాల్గొని యితరులను ప్రోత్సహించడం విశేషంగా చెప్పాలి. చరిత్రను పరిశీలిస్తే ఆశ్చర్యకర విషయాలు ఎన్నో కనబడతాయి. పోరాటాన్ని నడిపిన ఉదంతాలు ఉన్నాయి. అంటే స్వాతంత్ర్య ఉద్యమానికి చరిత్ర నిర్మాతలు ప్రజలే, స్త్రీలు, పురుషులు తేడా లేదు.

అనిబిసెంట్ సాగించిన హోంరూల్ ఉద్యమంలో స్త్రీలు అసంఖ్యాకంగా పాల్గొన్నారు. అలాగే బాలగంగాధర తిలక్ “స్వరాజ్యం నా జన్మహక్కు”, సహాయ నిరాకరణ ఉద్యమం (1920–22), 1930–1932ల్లో గాంధీ “ఉప్పుసత్యాగ్రహ” ఉద్యమాల్లో పట్టణ ప్రాంతాల్లోనుండేగాక, గ్రామీణ స్త్రీలు సైతం స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఉద్యమానికి ముందు గాంధీ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించినపుడు పల్లెపట్టులో స్త్రీలు తమ వంటిమీద నగలను ఉద్యమం కోసం గాంధీకి సమర్పించారు. ఉప్పుసత్యాగ్రహంలో గాంధీ ఆరెస్టు అయినపుడు శ్రీమతి సరోజినీనాయుడు ఆ ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఇలా అనేకానేక సందర్భాలలో సత్యాగ్రహాలు, ధర్నాలు చేపట్టిన శ్రీమతి దుర్గాభాయమ్మ, ఆచంట రుక్మిణమ్మ, పొణకా కనకమ్మ, ఉన్నవ లక్ష్మీభాయమ్మ మొదలగు స్త్రీలు పోరాటంలో పాల్గొన్నారు. స్త్రీలు చరిత్రను సృష్టించారనడంలో సందేహం లేదు.

ప్రస్తుత సమాజాన్ని ఉత్తేజ పరచి, చైతన్య పరచి ముందుకు సాగాలంటే యిలాంటి సదస్సులు అవసరం. స్వేచ్ఛ పునాదిగా సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో స్త్రీలు తమవంతు బాధ్యతలను తామే స్వీకరించడం సంతోషించాల్సిన విషయం. సమాజ సాహిత్యాల సంబంధ పరిశీలన అంటే ప్రధానంగా యిదే. సదస్సు రెండు రోజులు లోతైన చర్చ జరిపి, మరిన్ని విశేషాలు వెలికి తీస్తారని నమ్మకం. శిష్యురాలు డా॥ నీరజ, నిర్వాహక బృందానికి ఆశీస్సులు.

**(డా॥ డి.ఎమ్. ప్రేమావతి)**



## డా॥ తమటం రామచంద్రా రెడ్డి
**విశ్రాంత అధ్యాపకులు**
**తిరుపతి**

# అభినందన

ప్రపంచమొక పద్మవ్యూహం. కవిత్వమొక తీరని దాహం అంటాడు మహాకవి శ్రీశ్రీ. ఆ పద్మవ్యూహాన్ని ఛేదించాలన్నా, సాధించిన విజయాలు భావితరాలకు తెలియాలన్నా చక్కగా దోహదపడేది సాహిత్యం. ఈ ప్రపంచంలో ఇప్పటికీ వందలాది సాంఘిక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అందులో భాగమైన భారతదేశంలో కూడా అలాంటి ఘటనలు స్థానం పొందాయి. అలాంటివాటిలో అగ్రగణ్యమైనది జాతీయోద్యమం.

తెల్లదొరలు మనదేశాన్ని దాదాపు రెండువందల సంవత్సరాలు వారి గుప్పిట్లో పెట్టుకొని పాలించారు. మన సంపదను దోచుకున్నారు. మన సంస్కృతిని దెబ్బతీశారు. ఈ పరిణామాలను సహించలేని భారతీయులు వీరోచిత పోరాటం చేశారు. అందులో మహిళల పాత్ర ఎనలేనిది. కత్తిపట్టిన మహిళలు కొందరు, కలం పట్టిన మహిళలు మరి కొందరు. శాంతియుత పోరాటం చేసినవారు ఇంకొందరు. ఒక్కమాటలో చెప్పాలంటే కోట్లాదిమంది మహిళలు తమ శాయశక్తుల ఉద్యమించారు. వారి తిరుగుబాటు, శ్రమ ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం. ఈ పోరాటాన్ని ఎందరో కవులు అక్షరబద్ధం చేశారు. మహిళల త్యాగాన్ని శ్లాఘించారు.

ఈ స్వాతంత్ర్యపోరాటాన్ని పునాదిగా చేసుకుని నేడు మనం పురోగమిస్తున్నాం. పునాది రాళ్ళెప్పుడూ భవనాన్ని చూడలేవు. అయితే ఆ పునాది లేనిదే భవనం నిలబడదు. ఈ సంగతి నేటి విద్యార్థులకు తెలియాల్సిన అవసరం చాలావుంది. ఆ ఉద్యమాన్ని తెలుసుకుంటేనే నేటి యువత మన పూర్వీకుల ఔన్నత్యం, త్యాగం, నిస్వార్థం ఎలాంటిదో తెలుసుకొని, వారిని స్ఫూర్తిగా తీసుకొని మంచి పౌరులుగా ఎదుగుతారు. ఈ సత్యాన్ని గుర్తించిన డా॥ కుమారి నీరజ **'స్వాతంత్ర్యోద్యమ తెలుగు సాహిత్యంలో మహిళలపాత్ర'** అనే అంశంపై వారి కళాశాలలో సెమినార్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం నిర్వహించడం చాలా ముదావహం. మహిళలు కూడా వారి కళాశాలలో పెద్దసంఖ్యలో విద్యాభ్యాసం చేస్తున్నారు. వారు ఈ రెండు రోజుల సెమినార్‌ను సద్వినియోగం చేసుకొని స్ఫూర్తిపొందుతారని నేను గాఢంగా నమ్ముతున్నాను. కాలానుగుణంగా చక్కని అంశాన్ని ఎన్నుకొని సెమినార్ నిర్వహిస్తున్న నిర్వాహకులు డా॥ కుమారి నీరజకు, ఇతర తెలుగు శాఖ సిబ్బందికి, కళాశాల బృందానికి అభినందనలు తెలియజేస్తున్నాను.



(తమటం రామచంద్రా రెడ్డి)



**డా॥ ఎ. కె. వేణుగోపాల్ రెడ్డి**

**కుల సచివులు**

**ద్రావిడ విశ్వ విద్యాలయం, కుప్పం**

# అభినందన

ప్రతి పురుషుడి వెనక ఒక స్త్రీ ఉందన్నది ఎంత వాస్తవమో, ప్రతి ఉద్యమంలోనూ స్త్రీ ఉందన్నది అంతే వాస్తవం. మహోజ్వలమైన భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్యోద్యమం కీలక ఘట్టం. అందులో స్త్రీ పాత్ర అత్యున్నతం. ఇంట్లోనే ఉంటూ కొందరు, ఇంటి బయట ఉంటూ కొందరు, ఉద్యమానికి ఊతమందిస్తూ ఉత్సాహంతో, ఉద్రేకంతో ఉద్యమంలో పాల్గొన్నవారు మరి కొందరు. తమ వద్దనున్న బంగారాన్ని, డబ్బును అర్పించిన మాతృమూర్తులింకొందరు. ఉద్యమంలో పాల్గొన్న వారికి ఆశ్రయం కల్పించి, అన్నపానాదులు సమకూర్చిన స్త్రీ మూర్తులు మరెందరెందరో.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలు పూర్తిచేసుకొని ఆజాదికా అమృత్ మహోత్సవాలు జరుపుకుంటున్న ఈ తరుణంలో స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములౌతూ, తమ జాతిని జాగృతం చేసుకోవడానికి సంఘసంస్కరణోద్యమాలు, పత్రికలు నడిపిన వనితలెందరో ఉన్నారు. అలాంటి మహిళామణులను గుర్తించి, వారి త్యాగనిరతిని నేటితరం వారికి అందించాలనే దృఢ సంకల్పంతో **'స్వాతంత్ర్యోద్యమ తెలుగు సాహిత్యంలో మహిళ పాత్ర'** అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్న డా॥పి. కుమారి నీరజను అభినందిస్తున్నాను. దేశంకోసం పోరాడి తమ రచనలద్వారా తమవంతు కృషి చేసిన మహిళా మూర్తులను మరోసారి స్మరించుకొనే అవకాశం కల్పించిన పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల యాజమాన్యానికి నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

ఆ ఉద్యమ స్ఫూర్తి అప్పుడు, ఇప్పుడు ఎప్పుడూ మనందరికీ చాలా అవసరం. ఏ ఉద్దేశంతో అయితే ఈ సదస్సు నిర్వహిస్తున్నారో ఆ ఉద్దేశ్యం నెరవేరాలని మనసారా కోరుకుంటున్నాను.



(డా॥ ఎ. కె. వేణుగోపాల్ రెడ్డి)



**ఆచార్య టి. రామప్రసాద్ రెడ్డి**

**డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ & ఒఎస్‌డి యోగి వేమన పిజి సెంటర్, రాయచోటి**

**యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప**

# అభినందన

తెల్లదొరలని చెప్పుకునే బ్రిటిషర్ల చేతిలో చిక్కిన మన భారత దేశాన్ని, వారి చెరనుండి విడిపించుకోవడానికి జాతంతా ఏకమై చేసిన ఉద్యమమే జాతీయోద్యమం. ఆ ఉద్యమం గాంధీగారి రాకతో ఊపందుకుంది. స్త్రీలంతా ఇళ్ళనుండి కదిలి ముందుకొచ్చారు. ఉద్యమంలో భాగస్వాములయ్యారు. రాజ్యాల్ని కాపాడుకోవడానికి సివంగులైన వారు కొందరు, ఉద్యమానికి అండగా నిలిచిన వారు కొందరు, చేదోడు వాదోడుగా ఉన్నవారు కొందరు.

స్త్రీలు తమసమస్యలను తామే పరిష్కరించుకోవాలనే ఉద్దేశ్యంతో సంఘసంస్కర్తలందించిన ఉత్సాహంతో ఒకవైపు తమను తాము సంస్కరించుకుంటూ, మరోవైపు స్త్రీలను ఉద్యమానికి ఉసిగొల్పారు తమ ఉపన్యాసాలద్వారా, రచనలద్వారా. ఆనాటికామాత్రం చైతన్యం ఆశ్చర్యకరమే. భండారు అచ్చమాంబ లాంటి స్త్రీల రచనలు వారిని అన్నిరంగాల్లో రాణించేటట్లు ప్రోత్సహించాయి.

ఆనాటి సాహిత్యాన్ని వెలికి తీయాలనే ఆలోచనతో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా **"స్వాతంత్ర్యోద్యమ తెలుగు సాహిత్యంలో మహిళ పాత్ర"** అనే అంశంపై సదస్సు నిర్వహించ తలపెట్టిన ఔత్సాహికురాలు డా।। పి. కుమారి నీరజను మనసారా అభినందిస్తున్నాను. కళాశాల అధ్యక్షులకు, సిబ్బందికి, నిర్వాహకులకు శుభాభినందనలు.

ఈ సదస్సు దిగ్విజయంగా జరగాలని, వక్తలు, పత్రసమర్పకులూ మంచివిషయాలపై చర్చజరిపి విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు రేకెత్తించాలని ఆశిస్తున్నాను.

(ఆచార్య రామప్రసాద్ రెడ్డి)



**ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ**
**తెలుగు అధ్యయనశాఖ**
**శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటి, తిరుపతి.**

# అభినందన

ఆధునికకాలంలో వచ్చిన వివిధ భావనలలో ఒకటి 'జాతిభావన', రాజరికాల, భూస్వామ్య ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఒక భాషను మాట్లాడుతున్నవారు ఏకమై పోరాడి స్వతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. మనదేశంలో ఒకజాతి క్రింది వలసపాలనలో 300 సం॥ బానిసలమై ఉన్నాము. వలసపాలన కారణంగా ఏర్పడిన ఐకమత్యంతో బానిస సంకెళ్లను తెంపుకొని స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నాము. ఒక ఉద్యమం విజయవంతం కావడంతో ఉద్యమంతోపాటు ఆనాడు వెలువరించే సాహిత్యం ఇతోధికమైన పాత్రను పోషిస్తుంది. "ఈ రాజకీయ, సామాజిక ప్రయోజనం కోసం సాహిత్యాన్ని వినియోగించాలన్న సత్యాన్ని మన తెలుగు కవులు సైతం గుర్తించి వివిధ ప్రక్రియల్లో సాహిత్యాన్ని వెలువరించారు. ఇలా వెలువడిన సాహిత్యంలో మహిళల పాత్రను, త్యాగాన్ని, స్వదేశీ వస్తుసంస్కృతి ప్రోత్సహించడం. విదేశీ వస్తుబహిష్కరణ, వివిధ పోరాటాల్లో స్త్రీల భాగస్వామ్యం, విద్యకు, బాలవితంతువులకు, వితంతు పునర్వివాహాలకు, వివిధ బలహీనతలు, రుగ్మతల నుండి విముక్తి, సాంఘిక సమానత్వం, సంఘ సంస్కరణ వంటి వివిధ అంశాల నేపధ్యంలో విరివిగా సాహిత్యం వెలువడింది.

మనం స్వాతంత్ర్యాన్ని పొంది 75 సం॥ పూర్తి చేసుకున్న సందర్భంగా దేశమంతా ఘనంగా అమృతోత్సవాలను జరుపుకుంటున్న సందర్భంగా **"స్వాతంత్ర్యోద్యమ తెలుగు సాహిత్యంలో మహిళ పాత్ర"** అనే అంశం మీద రెండు రోజుల జాతీయసదస్సును నిర్వహించ తలపెట్టిన కుమారి నీరజకు అభినందనలు తెలుపుతూ ఈ సదస్సు ఉద్దేశ్యం సఫలీకృతం కావాలని కోరుకుంటూ అభినందనలు తెలుపుతున్నాను.

ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ

**(ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ)**



**డా॥ పొన్నంరెడ్డి కుమారి నీరజ**
**సదస్సు సంచాలకులు**
**చరవాణి : 9885248649**

# జాతీయ సదస్సు ఉద్దేశ్యము లక్ష్యాలు

ఒకప్పటి భారతదేశం ఎలా ఉండేదీ చూడలేదు. ఈ తరానికి చెప్పడానికి ఆ తరం వాళ్ళూ లేరు. ఐతే ఆ విషయాలు తెలుసుకోవడానికి మనకు మిగిలింది సాహిత్యమే.

కుటుంబ హింస, లైంగిక వివక్ష, అత్యాచారాలు ఇది నేటి భారతం. బ్రిటిష్ వారి పాలనలో ఆనాటి భారతంలో స్త్రీలు ఎలాఉన్నారు. ఇంటి పట్టునుంటూ, వివిధ రంగాల్లో రాణిస్తూ నేటికీ వివక్షకు గురౌతున్న స్త్రీలు భారత జాతీయోద్యమంలో ఎలా భాగస్వాములయ్యారు? వారినలా ప్రేరేపించిందెవరు? వారికి ఆ స్పృహ రావడానికి కారణాలేంటి? ఒకే ఒక్కశాతం అక్షరాభ్యాసతగల స్త్రీలలో అంత చైతన్యం ఎలా వచ్చింది? స్త్రీలలో మార్పు, చైతన్యం, ఉద్యమ స్పృహ కలగడానికి, వారు ఉద్యమానికి చేయూతనందించడానికి దోహదపడిన అంశాలేంటి? తెలుసుకోవాలని, తెలియజెప్పాలని...

రాజ్యాంగం అమలులోకి వచ్చి 70 వసంతాలు దాటినా స్త్రీలు పురుషులతో సమానంగా జీవించలేని దశలో ఉండటానికి కారణాలు విశ్లేషించుకోవాలి. ఆనాటి స్త్రీలలోని పాలనా దక్షత, తెగువ, ధైర్యసాహసాలు, ప్రేమాభిమానాలు, చైతన్యం, ఉద్యమ స్ఫూర్తి తెలుసుకోవాలి. వారు అంత చురుగ్గా తయారు కావడానికి దోహదపడ్డ వ్యక్తులెవరు, సాహితీ ప్రోత్సాహమెంత వంటి విషయాలు తెలుసుకోవాలనే కోరిక. స్వాతంత్ర్యోద్యమంనాటి స్త్రీల సాహిత్యాన్ని పఠించాలి. వివిధ సాహిత్య ప్రక్రియల్లో, పాత తెలుగు పత్రికల్లో నిక్షిప్తమైన విస్తృతమైన నాటి స్త్రీ సాహితీ చైతన్య కారకాలేంటి? ఆనాటి సాహిత్యంలో ప్రతిఫలించిన స్త్రీ స్వతంత్ర జీవన చైతన్యం, స్వరాజ్య హక్కుల పోరాటం వెరసి భారత స్వాతంత్ర్య సాధనా? ఇలాంటి నా మదిలో మెదిలే ప్రశ్నలకు సమాధానం వెతుక్కోవడమే ఈ జాతీయ సదస్సు ఉద్దేశం.

ఎందరో ఉపన్యాసకులు, ఆచార్యులు, సహాయాచార్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పరిశోధక విద్యార్థులు స్వాతంత్ర్యోమకాలంనాటి సాహిత్యాన్ని శోధించి, పరిశీలించి, పరిశోధించి చేసే ప్రసంగాలద్వారా, పత్ర సమర్పణలద్వారా నేటి యువతీ యువకులు స్ఫూర్తి పొందాలనేదే ఈ సదస్సు లక్ష్యం.



(డా॥ పొన్నంరెడ్డి కుమారి నీరజ)



**ఆచార్య కాత్యాయని విద్మహే**

**విశ్రాంత ఆచార్యులు, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.**

# కీలక ప్రసంగం

**“దేశ స్వాతంత్ర్య రణసన్నివేశములకు వీర తాండవ నృత్యమ్ము వెలయ సలిపి పేరు పొందిన యాంధ్ర కుమారి నేను” – శ్రీ సామవేదుల చిరంజీవమ్మ (ఆంధ్రపుత్రికను! సీస పద్య మాలిక, గృహలక్ష్మి 1939–40)**

1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం నుండి 1942 క్విట్ ఇండియా ఉద్యమం వరకు అంచలంచెలుగా విస్తరిస్తూ పదును దేలుతూ వికసించిన జాతీయోద్యమం ఫలవంతమై భారతదేశానికి బ్రిటిష్ వలస పాలన నుండి స్వాతంత్ర్యం వచ్చి ఇప్పటికి 75 ఏళ్ళు. ఆ చరిత్రను సమీక్షించుకుని స్ఫూర్తిని పొందటానికి అమృతోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంలో సాహిత్య రంగంలో పనిచేస్తున్నవాళ్ళ కర్తవ్యం స్వాతంత్ర్యోద్యమం సాహిత్యంలో ప్రతిఫలించిన తీరును, ప్రభావితం చేసిన తీరును అధ్యయనం చేయటమే. ఆ కర్తవ్య స్పృహతోనే పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ **“స్వాతంత్ర్య ఉద్యమ తెలుగు సాహిత్యంలో మహిళ పాత్ర”** అనే అంశంపై రెండురోజుల జాతీయ సదస్సు నిర్వహించేందుకు పూనుకొన్నది. అందుకు అవకాశం కల్పించి ప్రోత్సహిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్‌కు, కార్యోత్సాహం తో ఉన్న అధ్యాపక మిత్రులకు అభినందనలు.

నేషనల్ కాంగ్రెస్ ఏర్పడ్డ నాటి నుండి ఆత్మ గౌరవం, అవకాశాలతో సమానత్వం కీలక అంశాలుగా మొదలై సంపూర్ణ స్వరాజ్య స్థాపన పర్యంతం నడిచిన ఆరు దశాబ్దాల కాలపు దేశీయుల ఆరాట పోరాటాలకు అక్షరరూపం ఇచ్చిన సాహిత్యం పై జరగవలసినంత పరిశోధన జరగలేదు. విశ్వవిద్యాలయాలలో తెలుగు సాహిత్య పరిశోధనలు ప్రారంభమైంది 1920 వ దశకంలోనే అయినా ‘ఆధునిక తెలుగుసాహిత్యం పై జాతీయోద్యమ ప్రభావం’ అంచనా వేసే పరిశోధన జాతీయోద్యమం ఫలించి భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన పాతికేళ్ల తరువాత కానీ రాలేదు. ఆ పరిశోధన చేసింది మద్దూరి సుబ్బారెడ్డి. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండే. ‘విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన’ అనే గ్రంథం లో వెలుదండ నిత్యానందరావు 1929 నుండి 2012 వరకు 83 సంవత్సరాల కాలం మీద వచ్చిన 5225 పరిశోధనలను పేర్కొనగా వాటిలో జాతీయోద్యమ సాహిత్యం పై వచ్చిన పరిశోధనలు పట్టుమని పాతిక లేవు. వాటిలో సగానికి పైగా కవిత్వం మీద వచ్చినవే. కవిత్వం పై వచ్చినవాటిలో సగం నవల మీద వచ్చాయి (7). నాటకం మీద వచ్చింది ఒక్కటే. మొత్తం జాతీయోద్యమ సాహిత్యాన్ని కలుపుకొని వచ్చినవి రెండు. ఈ అన్నింటిలో కవిత్వం మీద వచ్చిన 14 లో స్త్రీల కవిత్వం మీద వచ్చింది ఒకటి. ఈ నేపథ్యంలో పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ స్వాతంత్ర్యోద్యమ సాహిత్యం మీద అందులోనూ మహిళల పాత్ర మీద ఈ సదస్సును తలపెట్టటం విద్యావిషయక అవసరం.

స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్య అధ్యయనానికి స్వాతంత్ర్యోద్యమ చరిత్ర తెలియటం మొదటి షరతు. ఆ క్రమంలో స్వాతంత్ర్యోద్యమ సాహిత్యంలో మహిళ పాత్ర అధ్యయనానికి ప్రాథమికంగా తెలియవలసినది స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళల భాగస్వామ్య చరిత్ర. స్వాతంత్ర్యోద్యమ చరిత్ర అంటే బ్రిటిష్ వలస విధానాల మీద విమర్శ, వలస పాలన పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేసే సభలు, సమావేశాలు, సహాయ నిరాకరణ, తత్సంబంధమైన ఘటనల పరంపర, విదేశీ వస్త్ర దహనం, ఉప్పు సత్యాగ్రహం, పన్నుల నిరాకరణ, మద్యవ్యతిరేకత మొదలైన ప్రత్యేక దశలు, సందర్భాలు, పోలీసుల దౌర్జన్యాలు, దేశభక్తుల కారాగారవాస జీవితం, స్వాతంత్ర్య సిద్ధి, విజయోత్సవాలు వాటికి సంబంధించిన తారీఖులు ప్రాంతాలు, వ్యక్తుల భాగస్వామ్యం – అది సమాచార పార్శ్వం. అది తప్పనిసరిగా కావలసినదే. అదే సమయంలో ఆ ఘటనలను ఒక క్రమంలో కూర్చటంలో చరిత్రకారులు నిర్వహించే పాత్ర ఒకటి ఉంటుందని, చరిత్రకారులు ఒక నిర్దిష్ట సమాజంలో జీవించే వాళ్ళు కనుక ఆ కాల స్వభావం చేత, సామాజిక నేపధ్యాల వల్ల ప్రభావితమై రూపొందే చైతన్యం , దృక్పథం చరిత్ర రచనలో భాగం అవుతుందని ఇహెచ్ కార్ అనే చరిత్రకారుడు చెప్పిన మాటను పరిగణలోకి తీసుకొని పరిశీలించటం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. చరిత్రకు వర్తించే ఈ సూత్రం జాతీయోద్యమ సాహిత్య అధ్యయనానికి కూడా ఉపకరిస్తుంది.

చరిత్ర అధ్యయనం గతానికి సంబంధించిన కుతూహలపూర్వకమైన చర్యే అయినా ఆ క్రమంలో అధ్యయన పరుల వర్తమాన అవసరాలు, చైతన్యం గుండా పరావర్తనం చెంది చరిత్ర కొత్త అర్థాన్ని సంతరించుకొంటుంది. అదేవిధంగా స్వాతంత్ర్యో ద్యమ సాహిత్య అధ్యయనంలో చరిత్రకారులతో పాటు, సృజన రచయితల వ్యక్తిత్వం, దృక్పథం కూడా భాగం అయివుంటాయన్న ఎరుక ఉండాలి. అంతిమంగా జాతీయోద్యమ సాహిత్య పరిశీలన విశ్లేషణ జాతీయోద్యమ రాజకీయ కార్యక్రమాలు, వ్యూహాలు ఏ సామాజిక వర్గాల ప్రమేయం, ప్రయోజనాలు ప్రధానంగా రూపొందాయి? మానవ సంబంధాలలో ఏ ప్రభావాన్ని చూపాయి? వంటి ప్రశ్నల ప్రాతిపదిక మీద జరిగినప్పుడు గతాన్ని వర్తమానపు వెలుగులో వ్యాఖ్యానించి భవిష్యత్తుకు దారిచూపగల కాగడాగా వెలిగించటానికి అవకాశం కలుగుతుంది.

ఈ చారిత్రక సైద్ధాంతిక భూమిక పై మనం పరిశోధించ తలచిన విషయం స్వాతంత్ర్యోద్యమ తెలుగు సాహిత్యంలో మహిళ పాత్ర. స్వాతంత్ర్యోద్యమ తెలుగు సాహిత్యం అంటే విగ్రహ వాక్యం ఎలా చెప్పుకొందాం? స్వాతంత్ర్యోద్యమ కాలపు తెలుగు సాహిత్యం లేదా స్వాతంత్ర్యోద్యమ సంబంధంలో వచ్చిన తెలుగు సాహిత్యం అని చెప్పుకోవాలి.

స్వాతంత్ర్యోద్యమ కాలపు తెలుగు సాహిత్యం అనుకొంటే 1885 నుండి 1947 వరకు ఆరు దశాబ్దాల కాలం మీద వచ్చిన సాహిత్యం మనకు పరిశీలనాంశం అవుతుంది. స్వాతంత్ర్యోద్యమ సంబంధంలో వచ్చిన తెలుగు సాహిత్యం అనుకొంటే 1885 నుండి ఇప్పటివరకు 137 సంవత్సరాల మీద వచ్చిన సాహిత్యాన్ని పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది.

1885 నుండి ఎందుకు అంటే వలసపాలన పట్ల దేశీయులలో కలుగుతున్న అసంతృప్తులకు, అసహనానికి ఒక స్వరం ఇచ్చే సంస్థగా ప్రారంభమై అచిరకాలంలోనే వలస పాలనకు వ్యతిరేకంగా జాతీయ ఉద్యమాన్నినడిపిన జాతీయ కాంగ్రెస్ ఏర్పడింది అప్పుడే కనుక. బ్రిటిష్ వారి జాతి వివక్షా విధానాన్ని నిరసిస్తూ ఉపన్యాసాలు ఇస్తూ జాతీయ ఉదార భావాల వ్యాప్తికి తోడ్పడిన సురేంద్రనాథ్ బెనర్జీ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యులలో ఒకడు. గురజాడ అప్పారావు కన్యాశుల్కం నాటకంలో ఇతని పేరు ప్రస్తావించబడింది. బుద్ధిగా చెప్పిన మాటలు వింటుంటే వెంకటేశాన్ని సురేంద్రనాథ్ బెనర్జీ అంతటివాడిని చేస్తానని గిరీశం అన్నట్లుగా వ్రాశాడాయన (మొదటి అంకం). గిరీశమే బండివాడికి నేషనల్ కాంగ్రెస్ విషయమై రెండు గంటలు లెక్చర్ ఇచ్చినట్లు చెప్పుకొనటం కూడా ఉంది ( ద్వితీయాంకం). ఆ రకంగా తొలి దశ జాతీయోద్యమ రాజకీయాలను గిరీశం వంటి మధ్యతరగతి స్వార్థపర యువత ఎలా అర్థం చేసుకొంటున్నది, ఎలా ఉపయోగిస్తున్నదీ, ఎలా వ్యాఖ్యానిస్తున్నదీ చూడమని మచ్చుకు చూపాడు గురజాడ. ఇప్పటికి తెలుస్తున్నంత వరకు సాహిత్యంలో జాతీయోద్యమ రాజకీయాల ప్రథమ ప్రతిఫలనం ఇది. చరిత్రకారులు తాము పరిశీలిస్తున్న ప్రజల మనస్సులను సానుభూతితో కాక ఆలోచనాత్మకంగా అర్థం చేసుకోవాలి అంటాడు ఇహెచ్ కార్.

ఆయన ఈ మాట అనటానికి అర్ధ శతాబ్దికి ముందే గురజాడ తన సమకాలపు జాతీయోద్యమ గతిని, దానిని నిర్దేశిస్తున్న విద్యావంతులైన ఉన్నత మధ్యతరగతి స్వభావంతో కలిపి ఆలోచనాత్మకంగా అర్థం చేసుకొనటం, వ్యాఖ్యానించటం చూస్తాం.

స్వాతంత్ర్యోద్యమ కాలపు సాహిత్యం నడుస్తున్న చరిత్ర గతిని కనిపెడుతూ అప్పుడు ఏ మేరకు అది ఎలా అర్థం అవుతున్నదో అలాగే నమోదు చేస్తుంది. సమకాలపు భావోద్వేగాల సంచలనాన్ని, సంరంభాన్ని కవులు, రచయితలు తాము అందులో భాగమవుతూ చిత్రిస్తారు. అది ఒకరకంగా ఆట నడుస్తున్నప్పుడు జరిగే రన్నింగ్ కామెంట్రీ వంటిది. అందువల్ల అది సాధికారంగానూ, పఠితలను, శ్రోతలను కూడా అందులో మమేకం అయ్యేట్లు చేసి హృదయాలను తట్టి ఉత్తేజితులను చేసేదిగానూ ఉంటుంది. 1947 లో దేశానికి స్వతంత్రం వచ్చాక వచ్చిన సాహిత్యంలో ప్రధానంగా స్వాతంత్ర్యోద్యమ కాలపు ఆశలు, ఆకాంక్షలు, ఆశయాలు ఏ మేరకు వాస్తవీకరించబడుతున్నాయి? అన్న ప్రశ్నతో కూడిన అంచనా ఉంటుంది. జాతీయోద్యమ గతిక్రమాన్ని చరిత్రగా చూసి అధ్యయనం చేస్తూ అందులోని ఔగాములను చర్చిస్తున్నట్లుగా అది ప్రజల సంస్కారాలపై వేసిన ప్రభావాలను పరిశీలిస్తున్నట్లుగా ఉంటుంది.

మాలపల్లి (1922), చివరకు మిగిలేది (1946) వంటి నవలలలో సమకాలపు జాతీయోద్యమ సంరంభమే కనబడుతుంది. మహీధర రామమోహనరావు 'కొల్లాయి గట్టితేనేమి'( 1965) వ్రాసేనాటికి అది 18 ఏళ్లనాటి చరిత్ర. రాచమల్లు రామచంద్రారెడ్డి దానిని చారిత్రక నవల అన్నాడు. అట్లాగే ఆ తరువాత మరొక అర్ధ శతాబ్ది కాలానికి 2016లో ఓల్గా వ్రాసిన గమనమే గమ్యం నవల వచ్చింది. రామచంద్రారెడ్డి అభిప్రాయం ప్రకారం ఇది కూడా చారిత్రక నవలే కావాలి. సమకాలంలో ఉద్యమాన్ని ప్రతిఫలించిన సాహిత్యానికి ఆ తరువాతి కాలంలో ఉద్యమ చరిత్ర అధ్యయనం కలిగించే అవగాహనతో ఉద్యమాన్ని పునర్నిర్మించే సాహిత్యానికి స్వభావంలో ఉండే తేడాను ప్రత్యేకంగా పరిశీలించాలి.

1885 –1947 మధ్య కాలంలో అంటే స్వాతంత్ర్య ఉద్యమం నడుస్తున్న కాలంలో వచ్చిన సాహిత్యం లో నైనా , 1947 తరువాత స్వాతంత్ర్య ఉద్యమం వస్తువుగా వచ్చిన సాహిత్యంలో నైనా ప్రత్యేకించి మహిళ పాత్ర చిత్రించబడిన తీరును అధ్యయనం చేయటంపై కేంద్రీకరించిన సదస్సు ఇది.

మహిళ పాత్రపై కేంద్రీకరణ అనేది మహిళా అస్తిత్వ చేతనకు సంబంధించిన వర్తమాన సామాజిక ఆకాంక్షల ఫలితం. 1980 వ దశకం నుండి పురుష చరిత్రకారుల కథనాలను సమగ్రం చెయ్యాలన్న పూనిక తో సామాజిక రాజకీయ ఆర్ధిక సాహిత్య సాంస్కృతిక వైజ్ఞానిక రంగాలలో ఉపాంతీకరణకు గురైన స్త్రీల చరిత్రను వేరువేరు వనరుల నుండి సేకరించిన సమాచారంతో తిరిగి వ్రాసే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగానే కమ్యూనిస్టు ఉద్యమంలో భాగస్వాములైన మహిళల అనుభవాలను, అభిప్రాయాలను నమోదు చేసిన మౌఖిక కథనాల సంకలనం 'మనకుతెలియని మనుచరిత్ర'(1986) వచ్చింది. జాతీయోద్యమంలో స్త్రీల భాగస్వామ్య చరిత్రను, స్త్రీల ఆశలను, ఆకాంక్షలను మదింపు చేయటానికి ఉన్న అవకాశాలను తెరిచి చూపటానికి ఇప్పుడీ సదస్సు ఉపయోగపడుతుంది.

నిజానికి స్త్రీల నిబద్ధత, త్యాగం లేకుండా ఏ సామాజిక ఉద్యమమూ లేదు. స్త్రీ విద్య , పునర్వివాహం వంటి సంస్కరణలను ఆశించి ప్రారంభమైన ఉద్యమం మొదట్లో స్త్రీల కోసం పురుషులు నడిపిందే అయినా రాజ్యలక్ష్మమ్మ సహకారం లేకుండా వీరేశలింగం పంతులుకు అయినా అది సాధ్యమయ్యేది కాదు. ప్రార్థనా సమాజాలు పెట్టుకొని స్త్రీలు వారానికి ఒక చోట సమావేశమయ్యే క్రమంలో సంఘటితం కావటానికి, స్త్రీ సమస్యల మీద స్వయంగా పనిచేయటానికి అవకాశాలు కలిసి వచ్చాయి. కొటికలపూడి సీతమ్మ, భండారు అచ్చమాంబ, పులగుర్త లక్ష్మీ నరసమాంబ, మొసలికంటి రామాబాయి, మాడభూషి చూడమ్మ, బాలాంత్రపు శేషమ్మ వంటి స్త్రీలు 20వ శతాబ్ది తొలి భాగంలోనే స్త్రీలదిగా చెప్పబడే ఇంటి నుండి పురుషుడిదిగా చెప్పబడే బయటి ప్రపంచంలోకి తమవైన ఆకాంక్షలతో, అభిప్రాయాలతో ప్రవేశించారు. ఆ రకంగా జాతీయోద్యమంలోకి స్త్రీలు నడిచి రావటానికి ఒక వాతావరణం సమకూడింది.

అయితే స్వాతంత్ర్య ఉద్యమంలోకి స్త్రీలు పురుషులు వచ్చినంత సహజంగా రాగలిగారా? ఉద్యమంలోకి రావటానికి వాళ్ళను ప్రేరేపించిన శక్తులు స్త్రీ పురుషులకు సమానమేనా? స్వాతంత్ర్య ఉద్యమంలో స్త్రీల భాగస్వామ్య స్వభావం, పురుషుల భాగస్వామ్య స్వభావం ఒకే విధంగా ఉందా ? స్త్రీ పురుషుల భాగస్వామ్య పరిధులు , పరిమితులు ఒకే రకంగా ఉన్నాయా ? భిన్నంగా ఉన్నాయా? స్త్రీల ఆశలు , ఆకాంక్షలు పురుషుల ఆశలు , ఆకాంక్షలతో ఏ మేరకు కలుస్తున్నాయి? ఎక్కడ భేదిస్తున్నాయి? వీటిలో కుటుంబం పాత్ర ఏమిటి? స్త్రీలు ఎదుర్కొన్న ప్రత్యేక సమస్యలు ఏవి? మొదలైన ప్రశ్నలతో స్వాతంత్ర్య ఉద్యమంలో స్త్రీల పాత్రను అదే సమయంలో స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యంలో స్త్రీల పాత్రను అనుశీలిస్తే తప్ప ఆలోచనాత్మకమైన స్త్రీల చరిత్ర రచన సాధ్యం కాదు. గేయం, పాట, కవిత్వం, కథ, నవల, నాటకం, స్వీయ చరిత్ర , జీవిత చరిత్ర, వ్యాసం, విమర్శ – ఇలా భిన్న ప్రక్రియలలో ఉన్న సాహిత్యం అంతా ఈ రకమైన చరిత్ర రచనకు అవసరమైన ముడిసరుకును ఇస్తుంది. ఒక్కొక్క ప్రక్రియలో వచ్చిన స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యాన్ని విడివిడిగా పరిశీలించవచ్చు. ఆ ప్రక్రియల ఇతివృత్తాలతో కూడా స్వాతంత్ర్య ఉద్యమ ప్రతిఫలనం కొన్నిటిలో ప్రధానంగా మరికొన్నిటిలో పాక్షికంగా ఇంకా కొన్నిటిలో ప్రస్తావనా వశంగా ఉంటాయి. అయినా కథాగమనంలో వాటికి ఉన్న కీలక స్థానం, స్త్రీల అనుభవానికి ఉన్న ప్రాధాన్యతల దృష్ట్యా ప్రతిదీ పరిశీలనార్హమే అవుతుంది.

అందరూ మనుషులే కానీ జాతి మత కుల లింగ ప్రాంత భేదాలచేత మనుషులందరూ సమానంగా లేరు. సమాన గౌరవ ప్రతిపత్తులకోసం, సామాజిక స్థాయి కోసం, విద్య ఉద్యోగ అవకాశలకోసం,అభివృద్ధిలో వాటా కోసం అస్తిత్వ చైతన్యంతో ప్రజలు సంఘర్షిస్తున్న కాలం ఇది. స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళ పాత్రను పరిశీలించేటప్పుడు దీనిని కూడా దృష్టిలో పెట్టుకోవాలి. ఉద్యమంలో భాగస్వాములవుతున్న స్త్రీలు ప్రధానంగా ఏ సామాజిక వర్గానికి చెందినవాళ్లు? ఏ సామాజిక వర్గపు ప్రయోజనాలకు ఉద్యమంలో ప్రాధాన్యత వుంది? ఈ స్పృహ స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యంలో ఎక్కడైనా కనబడుతుందా? అని పరిశీలించాలి.

అంతే కాదు. స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యంలో మహిళ పాత్రను మదింపు చేసేటప్పుడు ఆ సాహిత్యాన్ని తప్పనిసరిగా పురుషులు వ్రాసిన సాహిత్యం స్త్రీలు వ్రాసిన సాహిత్యం అని వర్గీకరించి పరిశీలించటం అవసరం. జాతీయోద్యమంలో స్త్రీల భాగస్వామ్యం గురించిన పురుష దృష్టికోణానికి , స్త్రీల దృష్టి కోణానికి ఉండే సంబంధ భేదాల చర్చ అందువల్ల సాధ్యమవుతుంది. తద్వారా పితృస్వామిక భావజాల సంస్కృతీ సంఘర్షణల స్థాయిని అర్థం చేసుకొనటానికి వీలవుతుంది. స్వతంత్రం, స్వేచ్ఛ, దేశభక్తి, స్వదేశీ మొదలైన భావనలను స్త్రీలు అర్థం చేసుకొన్న తీరును, నిర్వచించిన తీరును ప్రత్యేకంగా అధ్యయనం చేయటం భావజాల తాత్విక రంగాలకు స్త్రీలు చేసిన దోహదాన్ని గుర్తించటానికి వీలిస్తుంది.

ఇక మిగిలిన ఏడు రాజకీయార్థిక కథలలో 'ఒసే తువ్వాలందుకో', కోనేటి కథలు మూడు మధ్యతరగతి జీవితాలు కేంద్రంగా వున్న కథలు. ఒసే తువ్వాలు అందుకో కథ భార్యాభర్తల స్వగతాల రూపంలో సాగుతుంది. స్నానాలగదిలో భర్త, వంటగదిలో భార్య. భర్తను గురించి చెబుతూ కథకుడు ఇరవై ఏళ్ళ కిందటి నాన్‌కో ఆపరేషను పాటలు జ్ఞాపకం తెచ్చుకుంటున్నాడు అని చెప్పిన మాటలను బట్టి ఈ కథా కాలం 1940–42 అయివుంటుంది. రచనాకాలం ఏప్రిల్ 1947 భర్త స్వగతాలు భార్య మీద అధికారాన్ని ప్రదర్శించేవి. భార్య స్వగతాలు అస్వతంత్ర్య జీవితం నుండి పుట్టిన అసంతృప్తి జ్వాలలను ప్రదర్శించేవి. భార్యను 'పెళ్ళాం ముండ' అని తప్ప సంబోధించలేని దురహంకారం భర్తది. తన స్నానానికి వేన్నీళ్ళు, తన భోజనానికి వంట సిద్ధంచేసి పెట్టటానికే పెళ్ళాం ఉందనేది అతని సంస్కారస్థాయి. స్కూలు ఫైనలు దాకా చదివానని భార్య గర్వపడుతున్నదని అతని నమ్మకం. ఆడవాళ్ళకు చదువు అవసరమే లేదు, పైగా హానికరమని కూడా అతని అభిప్రాయం. ఆధిపత్యంతో ఆడదాన్ని అణిగిమణిగి వుండేలా చేయటమే మగవాడి కర్తవ్యం అన్నది అతని ఉద్దేశం. స్నానాలగది నుండి ఒసే తువ్వాలు అందుకో అని అతను వేసిన కేక భార్య మీద తన అధికారాన్ని నిరూపించుకొనటంలో భాగమే.

అదే సమయంలో భార్య 'వందేమాతరం' పాట వింటూ అసహనానికి గురవుతుంది. ఎందుకో ఈ జైళ్ళకు వెళ్ళటం,

ఎవరి స్వతంత్రం కోసం అని ప్రశ్నించుకొంటుంది. అడదానికి అడుగుతీసి అడుగువేసే అధికారం లేదు కదా అని తనలో తాను వాపోతుంది. నేనసలు పెళ్ళి చేసుకోననే అన్నాను. స్వతంత్రంగా బదుకుదామనుకొన్నాను – అని విఫలమైన తన మనోరథాన్ని తలుచుకొని దిగులుపడుతుంది. స్వాతంత్ర్యోద్యమం స్త్రీల స్వాతంత్ర్యం కోసం కాదన్న గుర్తింపు భార్య స్వగతంలో వుంది. భర్త ఎక్కడెక్కడికో పోతాడు, ఏవేవో ఖర్చులు చేస్తాడు కానీ తనను దమ్మిడీలతో సహ లెఖ?చూపమని అడగటం భార్యకు చాలా అవమానంగా అనిపిస్తుంది. 'నాకు స్వాతంత్ర్యం కావాలి. సమానత్వం కావాలి'. అని ఆక్రోశిస్తుంది. కుటుంబాలలో భార్యల మీద భర్తల అణచివేత రాజకీయాలను చూపిస్తూ, దేశానికే కాదు భార్యలకు కావల్సిన స్వాతంత్ర్యాన్ని గురించి హెచ్చరించింది ఈ కథ. దేశాన్ని ఎవరు పాలిస్తున్నారనేదానికి నిత్యజీవితంలో అంత ప్రభావం వుండకపోవచ్చుకానీ స్త్రీ మీద పురుషుడి అధికారం, నియంత్రణ ఆమె నిత్యజీవితాన్ని నిరంతర దుఃఖమయం చేసేది. వలసపాలన నుండి దేశానికి విముక్తి కోరుకొంటున్నవాళ్ళకు భర్తల, పురుషుల పెత్తనం నుండి స్త్రీలకు విముక్తి అన్న విషయాన్ని గురించి కూడా ఆలోచించగల ఒక సమగ్ర జీవితదృక్పథం ఉండాల్సిన అవసరాన్ని గుర్తు చేసే కథ ఇది. కోనేటి దినం, కోనేటి రాత్రి, కోనేటి జన్మ మూడు కథలకు కేంద్రం కోనేటిరావు. ఒక చిరుద్యోగి. కోనేటి రావు ఇంటి నుండి భోజనం చేసి తయారై ఆఫీసుకు వెళ్ళటంతో ప్రారంభించి, ఆఫీసులో పనిచేయటం, కాఫీ తాగటం, సాయంత్రం వరకూ మళ్ళీ పనిచేయటం – ఇంటికి తిరుగుముఖం పట్టటం వరకు కోనేటి దినం కథ. ఆఫీసు పనిలోని యాంత్రికత, ఆఫీసులోని అధికారం, చాలీచాలని జీతం, పూర్తిగా తీర్చుకోలేని ఆకలి, అప్పు తీర్చమనే ఒత్తిడి – ఈ అన్నింటి మధ్యలో కోనేటిరావు రోజులెలా ఈడుస్తున్నాడో ఈ కథ చైతన్యస్రవంతి శిల్ప పద్ధతిలో చూపింది. దినం – తద్దినం – చనిపోయిన రోజును సూచిస్తాయి కూడా. కోనేటి దినం – కోనేటి బ్రతుకు రోజువారీ చావులాగా వుందన్న విషయాన్ని సూచిస్తుంది.

కోనేటి రాత్రి కథ అతని స్వప్న ప్రపంచానికి సంబంధించినది. మనిషిలో అజ్ఞాతంగా అణచివేయబడిన భావాలకు ఉద్రేకాలకు అభివ్యక్తిస్థితి అనేక కారణాల చేత లేకపోవటం వలన నిద్రలో అవి కలల రూపంలో వస్తాయని ఫ్రాయిడ్ సిద్ధాంతీకరించాడు. అంతేకాదు కోరికలు తీరకపోవటం వలన నిత్యజీవితంలో కలిగే ఉద్విగ్నతలను ఈ కలలు తొలగిస్తాయని కూడా ఫ్రాయిడ్ అభిప్రాయపడ్డాడు. కోనేటిరావు ఒక రాత్రి నాలుగు కలలుకన్నాడు. ఆ కలలు అతనిలో అణచివేయబడిన కోరికల ప్రతిరూపాలే. నటుడిగా రాణించాలనీ, ఇంజనీర్?గానో మరే ఉన్నతోద్యోగిగానో ప్రఖ్యాతి పొందాలని, అధికారాన్ని ధిక్కరించాలని అతనూ ఆశించాడు. వాస్తవ జీవితంలో అవి సాధ్యం కాలేదు. బ్రతుకు తెరువుకు గుమాస్తా కావలసి వచ్చింది. తద్వారా తాను జీవించాల్సి వచ్చిన గానుగెద్దు జీవితం మీద అతనిలో అసహనం, కోపం, పేరుకుపోయాయి. ఈ ఒత్తిడులకు ఒక 'అవుట్?లెట్?' కల. సత్యాగ్రహోద్యమంలో పాల్గొన్నట్లు అతను కన్న కల నాలుగవది. ఇంగ్లీషువాడు దేశాన్ని వదిలిపోవాలంటే కేవలం అహింసనే పాటిస్తూ కూర్చోకూడదని కలలో అతననుకొంటాడు. బ్రిటిషు వలసపాలనకు ఒక ప్రతినిధిగా తాను పనిచేసే ఆఫీసును, తనమీద పెత్తనం చేసే ఆఫీసరును భావించుకొన్నాడు. ఆఫీసును విధ్వంసం చేయటం, ఆఫీసరును కొట్టటం అతని కలలో భాగాలు. తన జీవితాన్ని నియంత్రించిన, నిర్బంధించిన, ఛిద్రం చేసిన వ్యవస్థలపై సామాన్యుడి అసహాయ క్రోధానికి అభివ్యక్తరూపం ఈ కల. కోనేటిరావు ప్రతికలా ఒక మధ్యతరగతి గృహవాస్తవంతో భగ్నం కావటం, మధ్యతరగతి మనిషి కలలు కనగలడే కానీ తెగించి జీవన విధానాన్ని బాగుపరచుకొనే మార్గాలలోకి ప్రయాణించలేడనే అంశాన్ని సూచిస్తుంది.

కోనేటి జన్మ కథలో అతని నలభై అయిదో జన్మదినపు జీవితం వుంది. పుట్టిన రోజైనా అతని గందరగోళపు యాంత్రిక జీవితంలో మార్పేమీ లేకపోవటం చెప్పబడింది. తేడా అల్లా ఏమిటంటే ఆనాటికి భారతదేశానికి బ్రిటిషు వలస పాలన నుండి స్వతంత్రం రావటం. అంతపెద్ద చారిత్రక ఘటన జరిగినా కోనేటిరావు పంతులు జీవితంలో ఏ మాత్రం మార్పు రాలేదన్న విషయాన్ని మనదృష్టికి తీసుకొని రావటం శ్రీశ్రీ ఉద్దేశం. "ఇది వరకు అతణ్ణి కనబడకుండా బంధించిన సంకెళ్ళు ఇంగ్లండులో తయారైనవి. ఇప్పటి సంకెళ్ళను ఇండియా తయారుచేస్తుంది. ఇవి స్వదేశీ సంకెళ్ళు" అని కథ ముగింపులోని వాక్యాలు దానినే సూచిస్తున్నాయి. ఒసే తువ్వాలు అందుకో కోనేటిరావు కథలను కలిపి చూస్తే స్త్రీల జీవితంలోనూ, మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి చిరుద్యోగుల సామాన్యుల జీవితాలలోనూ ఏ మార్పూ తీసుకొని రాలేని దేశస్వాతంత్ర్య స్వభావం పట్ల శ్రీశ్రీ సందేహం స్పష్టపడుతుంది.

# విషయ సూచిక

1. స్వాతంత్ర్యోద్యమం స్త్రీల సాహిత్యం – *డా॥ పొన్నంరెడ్డి కుమారి నీరజ* 21

2. స్వాతంత్ర్యోద్యమ తెలుగు సాహిత్యం – స్త్రీల పత్రికలు : మహిళాభ్యుదయం – *ఆచార్య డి. విజయలక్ష్మి* 24

3. స్వాతంత్ర్యోద్యమ తెలుగు కథానికల్లో స్త్రీ – *ఆచార్య ఎం.రామనాథం నాయుడు* 31

4. స్వాతంత్ర్యోద్యమంలో 'శుభోదయం' – *డా॥ డి. నల్లన్న* 35

5. మాగంటి అన్నపూర్ణాదేవి లేఖాసాహిత్యం – దేశభక్తి – *డా॥ డి. శ్రీనివాసులు* 38

6. "స్వాతంత్ర్య చైతన్యాన్ని రగిలించిన మహిళల ఉపన్యాసాలు" – *డా.ఎం. షామీదాబేగం* 42

7. అతడు – ఆమె నవల – జాతీయోద్యమ చిత్రణ – *డా॥ కె. చెన్నకేశవరెడ్డి* 45

8. స్త్రీ చైతన్యమూర్తి 'కనుపర్తి వరలక్ష్మమ్మ' – *డా. వై. సుభాషిణి* 48

9. 'హృదయనేత్రి'లోని స్వాతంత్ర్యోద్యమ మహిళలు – *డా॥ డి. యువశ్రీ* 51

10. స్వాతంత్ర్య పోరాటం – ఉషా మెహతా "రహస్య రేడియో" – *డా॥ వేపిపోగుల వెంకటేశ్వర్లు* 54

11. స్వాతంత్ర్యోద్యమ నవలల్లో మహిళా చైతన్యం – *డా॥ ఎల్. కస్తూరి* 57

12. జాతీయోద్యమంలో స్త్రీ చైతన్య కవితలు – *డాక్టర్ పి.జయచంద్రుడు* 60

13. ధన్యనైతిని కథలోని స్వాతంత్ర్యోద్యమ భావాలు – *డా॥ వి. కృష్ణవేణి* 63

14. మహిళాభ్యుదయ స్వాతంత్ర్య దీపికలు – శారద లేఖలు – *ఎం. ప్రదీప్* 66

15. భారత స్వాతంత్ర్యోద్యమం – రేడియో – *శ్రీమతి వెంకటలక్ష్మి చెరుకూరి* 69

16. కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు – జాతీయోద్యమ స్పృహ – *తంగి ఓగేశ్వరరావు* 71

17. గృహలక్ష్మి మాసపత్రిక – మహిళాభ్యుదయం – *ముల్లంబుడు అప్పనరాజ్* 77

18. జాతీయోద్యమ ప్రస్థానంలో స్త్రీలపాత్ర – *బి.గోపిర్యా నాయక్, డాక్టర్ జి.ధర్మమూర్తి* 82

19. స్వాతంత్ర్యోద్యమస్ఫూర్తి – తెలుగు మహిళాదీప్తి – *డా॥ పి. విజయకుమార్* 84

20. స్వాతంత్ర్యోద్యమంలో – మహిళా చైతన్యం – *డా॥ ఎన్. సూర్యకాంతి* 88

21. స్వాతంత్ర్యోద్యమంలో మహిళల పాత్ర – పరిశీలన – *డా॥ సీతా విజయులు రెడ్డి, డా॥ వెంకటేశన్ పూజారి* 91

22. స్వాతంత్ర్యోద్యమం – రచయిత్రుల పాత్ర – *డా॥ ఎన్. నిశ్చల* 94

23. భారత స్వాతంత్ర్యోద్యమంలో చిట్టగాంగ్ వీర విప్లవ నారీమణులు – *జి. మాణిక్యం, డాక్టర్. జి.స్వాతి* 98

24. కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు – జాతీయోద్యమ ప్రభావం – *గెద్దల మోహిణి* 102

25. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి – ఆరుట్ల కమలాదేవి – *డా॥ బూర్గుల స్వరూప* 106

26. భారతదేశ స్వాతంత్ర్యోద్యమపోరాటంలో – వీరనారీమణుల పాత్ర – *డా. ఎం. ప్రభావతి* 109

27. స్వాతంత్ర్యోద్యమంలో "రామాబాయి" అందించిన సహకారం – *జి. రాజశేఖర్* 113

28. స్వాతంత్ర్యోద్యమం – తెలుగు మహిళల ధీరత్వం – *డా॥ సి. చినపాపమ్మ* 117

29. స్వాతంత్ర్యోద్యమ పినాకినీ మహిళా రత్నదీపాలు – *డా॥ గోపవరం పద్మప్రియ* 120

30. మహిళా చైతన్య స్ఫూర్తి ప్రదాత శ్రీమతి పొణకా కనకమ్మ – *డా॥ మల్లెపోగు మాదన్న* 123

31. జాతీయోద్యమ స్ఫూర్తి దీప్తి – పొణకా కనకమ్మ – *డా. పట్టపు శివకుమార్* 126

32. నెల్లూరుజిల్లా స్వాతంత్ర్య సమరయోధురాలు – పొణకా కనకమ్మ – *డా॥ కుమ్మెత లక్ష్మీ నారాయణరెడ్డి* 131

33. పోరాటంలోనూసగం – *డా॥ నల్లపనేని విజయలక్ష్మి* 135

34. ఆంధ్రమహిళా లలామ పొణకా కనకమ్మ – *డా॥ మన్యం నరసింహులు, డా॥ జి. గంగయ్య* 139

35. భారత స్వాతంత్ర్య సమరంలో ముస్లిం మహిళ – *డా॥ ఎస్. గులాబ్ జాన్* 142

36. డా॥ వాసా ప్రభావతిగారి “స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు మహిళలు”–కార్యదక్షత – *డా॥ జి. శైలమ్మ* 145

37. స్వాతంత్ర్యోద్యమంలో – స్త్రీలపాత్ర – *డాక్టర్ బి.చక్రవర్తి* 148

38. జాతీయోద్యమంలో మాగంటి అన్నపూర్ణాదేవి – *డా॥ సి. చెన్నకేశవులు, ఎం. ఏకాంబరం* 153

39. జాతీయోద్యమంలో తెలుగు వనిత – దువ్వూరి సుబ్బమ్మ – *పి. కేశవులు* 157

40. “జాతీయోద్యమానికి జీవితం అంకితం చేసిన వీరనారి–సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి”– *డా॥ యం. ధర్మారావు, డా॥ జి. తిరుమలయ్య* 160

41. కనుపర్తి వరలక్ష్మమ్మ కథ – విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమం – *డా॥ యస్.సి. సంజీవ రెడ్డి* 163

42. సహాయ నిరాకరణోద్యమంలో సుశీల పాత్ర – *ఈ. కుమరేషన్* 165

43. వీరమంగై మహారాణి వేలు నాచియార్ – *డా. కరణం శ్రీనివాసులు రెడ్డి* 168

44. స్వాతంత్ర్య ఉద్యమం – మహిళా చైతన్యం – *డా॥ దేవరపల్లి మంజునాథ* 171

45. స్వాతంత్ర్యోద్యమంలో మాగంటి అన్నపూర్ణదేవి – *డా॥ బి. తేజోవాణి* 173

46. స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వామ్యులైన ఆంధ్రమహిళలు – *ఎం.సి. సుధాకర్* 175

47. స్వతంత్రతతో స్వాతంత్ర్యోద్యమంలో స్త్రీలు – *ఐ. సజని* 180

48. స్వాతంత్ర్యోద్యమస్ఫూర్తి – మహిళామూర్తి – *డా॥ లంకిపల్లె జ్యోతీశ్వర నాయుడు* 184

49. స్వాతంత్ర్య పోరాటంలో అరెస్ట్ అయిన తొలి తెలుగు మహిళ – *డా. జూరెడ్డి నిర్మల* 187

50. తొట్టతొలి స్వాతంత్ర్య సమర యోధురాలు – రాణి వీరమంగ వేలు నాచియార్ –*డా. సగిలి సుధారాణి* 190

51. స్వాతంత్ర్యోద్యమం– మహిళా చైతన్యం – *వి. వెంకటేశులు* 193

52. “సిక్కోలు సివంగి” సాసుమాను గున్నమ్మ–*కొర్లాం సాయి వెంకటేష్, డా. జర్రా కోటేశ్వరరావు, శిరసన్మేటి పద్మావతి* 196

53. స్వాతంత్రోద్యమం – రచయిత్రుల పాత్ర – *డా॥ ఆర్. చంద్రమౌళి* 198

54. స్వాతంత్ర్య ఉద్యమంలో తెలుగు మహిళ పాత్ర – *డా॥ ఎన్. భీమన్న* 201

55. స్వాతంత్ర్య కాలం నాటి పాఠ్యపుస్తకాల్లో స్త్రీ జీవిత చిత్రణ – *డా. పెద్దింటి ముకుందరావు* 203

56. భారత స్వాతంత్ర్యోద్యమంలో స్విస్ వనిత మెల్లీ సోలింగర్–*డా. శాంసన్ రాజు చెరుకూరి, శైలజ తిరుకాల్వ* 207
*డా. నరసింహ వర్మ కర్లపూడి*

57. సింహపురి "కనకపుష్యరాగం" పొణకా కనకమ్మ – *డా. వై. దివ్య* 211

58. చరిత్ర మరచిన వీరనారి ఝల్కారీబాయి – *అర్జా. నాగేశ్వరరావు* 213

59. భారత స్వాతంత్ర్యోద్యమంలో చిట్టగాంగ్ వీర విప్లవ నారీమణులు – *జి. మాణిక్యం, డాక్టర్. జి.స్వాతి* 216

60. జాతీయోద్యమంలో విద్యావంతులైన స్త్రీల పాత్ర – *డా. టి. షర్మిలా ప్రతిమ* 220

61. జాతీయోద్యమ అనంత బెబ్బులి ఇల్లూరు కేశమ్మ – *డా॥ బత్తల అశోక్ కుమార్* 223

62. స్వాతంత్ర్య సమరంలో – మల్లు స్వరాజ్యం – *డా॥ జి. రాజేష్ కుమార్* 226

63. క్విట్ ఇండియా ఉద్యమ నాయకి అరుణా అసఫ్ అలీ – కె. విశ్వనాథ్ 228

64. స్వాతంత్ర్య సంగ్రామంలో – సర్దార్ అమరావతమ్మ – కె. *వెంకట స్వామి* 231

65. స్వాతంత్ర్యోద్యమ కాలము నాటి మహిళా శక్తి ప్రతీక– *శ్రీమతి దువ్వూరి సుబ్బమ్మ – డా. వి.వాసవి* 234

66. స్వాతంత్ర్యోద్యమంలో దువ్వూరి సుబ్బమ్మ పాత్ర – డా॥ కె.సుధాకర్ 236

67. వీరనారి కిత్తూరు చెన్నమ్మ – *పి.వీరేష్* 240

68. భారత మహిళా రత్నం – *డాక్టర్ ముత్తు లక్ష్మి – డాక్టర్. జి. తిరుమల వాసు దేవ రావు* 242

69. ఉన్నవ లక్ష్మీబాయమ్మ – *సంక్రాంతి రాజేంద్రుడు* 245

70. భారతనారీ చైతన్యస్ఫూర్తి "సరోజినీదేవి" – *డా॥ గుమ్మనూరు ఉషారాణి, డా॥ ఎస్. షంషాత్కర్* 247

71. భారత జాతీయోద్యమం – మహిళల ఉద్యమ పటుత్వం – *డా॥ ఇ. వాసు* 250

72. స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి స్త్రీల సామాజిక పరిస్థితులు–వారి సాహిత్యం–డా॥ *శ్రీభాష్యం అనూరాధ* 253

73. జాతీయ స్వాతంత్ర్యోద్యమం – సూర్యదేవర రాజ్యలక్ష్మీ దేవి – *ఎం.అశోక్ కుమార్* 255

74. స్వాతంత్ర్యోద్యమం – దువ్వూరి సుబ్బమ్మ – *డా॥ బి. సురేంద్ర* 257

75. భారత స్వాతంత్ర్య సమరంలో కస్తూరిబాగాంధీ పాత్ర – *డా॥ పి. గాయత్రి, డా॥ సి. నరసింహా రెడ్డి* 260

76. స్వాతంత్ర్య సమరంలో ముస్లీం మహిళల పాత్ర–పరిశీలన – *డా॥ కె.చిట్టి కళావతి* 263

77. మేము సైతం.... – *శ్రీ టి. నరసింహులు, డా॥ కె. నరసింహుడు* 268

78. జాతీయోద్యమంలో తెలుగు వీర నారీమణులు – *డాక్టర్ మామిడి మురళి* 271

79. స్వాతంత్ర్యయోధురాలు – "రాణి చెన్నమ్మ" – *ఒ. హరీష్* 275

80. తెలుగు సాహిత్యంలో భారత స్వాతంత్ర్య ఉద్యమం – *డా ॥ పి. శిరీషా కుమారి* 277

81. ఉప్పు సత్యాగ్రహం – స్వాతంత్ర సమర తెలుగు నాయకురాండ్లు – *పూజ ఎరికంబట్టు* 281

82. స్వాతంత్ర్యోద్యమ భావనలు – స్త్రీల ఆకాంక్షలు – *వంగాల సంపత్ రెడ్డి* 284

**83.** తెలుగు మహిళా చైతన్య జ్యోతి ఉన్నవ లక్ష్మీబాయమ్మ - *డాక్టర్. జి. స్వాతి, డాక్టర్. ఎం. తేజోమూర్తి,* **287**

**84.** "రాయలసీమలో తొలి మహిళా పట్టభద్రురాలు కె.నారాయణమ్మ : *ఒక పరిశీలన" - డా॥ డి.సహదేవుడు, డా॥ యం.హరిప్రసాద్* **289**

**85.** అహింసా వీరుడు పొట్టి శ్రీరాములును ప్రభావితం చేసిన ముగ్గురు మహిళలు - *వాడ్రేవు సుందర్రావు, డా॥ వందనావర్మ* **291**

**86.** కనుపర్తి వరలక్ష్మమ్మ కథల్లో చైతన్య స్ఫూర్తి - *డా॥ జయమ్మ* **295**

**87.** భారతమాత వీరపుత్రిక - రాణి అవంతిబాయి - *డా॥ మాలేపట్టు పురుషోత్తమాచారి* **300**

**88. Impactful of Women as First Teacher in Indian Freedom Movement-a Rewiew**
*Dr. Dhananjaya Reddy, Dr. S.K. Rushma* **302**

**89. Women in Independence Telugu Literature in India: a Study**
*Dr. C. Venkatakrishnaiah, Dr. A. Devaki, Mr. Saivenkatesh Korlam* **305**

**90. Impact of Women Writers in Indian National Struggle**
*S. Padmavathi, Mr. Sai Venkatesh Korlam, Dr. J. Koteswara Rao* **307**

**91. A Ray of Hope for Depressed Lives-Savitribai Phule-Mr. Pavuluri. Hanumantha Rao 310**

**92. The Role of Women as Social Reformer during Freedom Struggle in India-** *Dr. P. Anuradha* **314**

**93. Women Rulers Protest during East India Company Rule -** *Dr. P. Revathi Reddy* **318**

**94. Telugu Women in Freedom Struggle -** *Dr. N. Murali, Dr. C.N. Latha* **320**

**95. Role of Women in India's Freedom Struggle -** *Dr. G. Sreenivasulu* **323**

**96. Role of Women in Indian Freedom Struggle- a Review -** *Dr. A. Indira Priyadarsini* **328**

**97. Kanuparti Varalakshmi : a Pioneer of Freedom Movement -** *Dr. C. Rajyalakshmi* **330**

**98. The Role of Women in Telugu Literature During the Freedom Movement -**
*Dr. V. Siva Prasanna Kumar* **333**

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమం స్త్రీల సాహిత్యం

డా॥ పొన్నంరెడ్డి కుమారి నీరజ, తెలుగు శాఖాధ్యక్షులు, ప్రభుత్వ డిగ్రీ పిజి కళాశాల, పుత్తూరు, చరవాణి 9885248649

భారతీయుల సంస్కృతీ సంప్రదాయాలంటే అందరికీ మక్కువే. భారత దేశం మీద అందరికీ కన్నే. ఇక్కడి సంపదలు దోచుకొని దాచుకోవాలనే ఆలోచనే పాశ్చాత్యులది. భారతీయుల అమాయకత్వాన్ని, అనైక్యతను ఆసరాగా చేసుకుని ఇతర దేశీయులతో పోరాటాల్లో నెగ్గి మన దేశ పాలనాబాధ్యతలను లాక్కున్న బ్రిటిష్ వాళ్ళు మన వాళ్ళను ముప్పు తిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్లు తాగించారు. వారి దురాగతాల్ని అడ్డుకోవడానికి భారతదేశీయులందరూ కులమతాలకతీతంగా, చిన్నా పెద్దా, ఆడా మగా తేడా లేకుండా పోరాటం చేస్తేనే బ్రిటిష్ వారిని తరమగలిగాం.

బ్రిటిష్ వారిని తరిమికొట్టడానికి భారతజాతంతా ఏకమైంది. జాతీయోద్యమంలో అనేక ఉద్యమాలు భాగమయ్యాయి.

**ఆత్మబలంచే అంగన శక్తి నైతిక బలమే నారీశక్తికి ఊతం**

ఇంటిపట్టునుండే స్త్రీల్లో చైతన్యం వచ్చింది. ఇక్కడి కట్టుబాట్ల పట్ల అవగాహన పెరిగింది. సమాజంలో తామేంటో, తమ స్థితేంటే తెలుసుకున్నారు. ముందుగా తమను తాము సంస్కరించుకోవాలనుకున్నారు. ఒక వైపు తమను తాము సంస్కరించుకుంటూనే, జాతీయోద్యమంలో భాగస్వాములయ్యారు. విద్య, వివాహం, గౌరవం, తమని అణచి పెడుతున్న మూఢనమ్మకాలు అన్నింటిగూర్చి ఆలోచించారు. ఉపన్యసించారు. పత్రికలు నడిపారు, పత్రికలకు రాశారు. వ్యాసాలు, పద్యకవిత్వం, వచన కవిత్వం, పాటలు, కథలు, నవలలు, నాటకాలు,శతకాలు, స్వీయచరిత్రలు, జీవిత చరిత్రలు, లేఖలు వంటి సాహితీ సృజన ప్రక్రియలద్వారా స్త్రీలోకాన్ని మేల్కొల్పారు. విదేశీ విద్యనూ అభ్యసించారు. ఉద్యోగాలు చేశారు.

గాంధీగారి పిలుపుతో ఉద్యమంలో పాల్గొని తోచిన సాయమందించారు. అనేకమంది తెలుగు మహిళలు జైలుకెళ్ళారు.

స్త్రీల సాహిత్యమంటే స్త్రీలకోసం స్త్రీలే రాసుకున్నది. స్త్రీలకోసం పురుషులు రాసింది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో వచ్చిన సాహిత్యాన్ని గమనిస్తే స్త్రీల్లో చైతన్యం, వ్యక్తి స్వాతంత్ర్యం కోసం వచ్చిన సాహిత్యం, వారిని ఉద్యమానికి ప్రేరేపించడంకోసం, ఉద్యమంలో భాగస్వాముల్ని చెయ్యడానికి వచ్చిన సాహిత్యం అనే కోణాల్ని మనం గమనించవచ్చు.

వారిని వారే ఉద్ధరించుకుంటూ సమజ ఉద్ధరణకూ నడుంబిగించారు. ఇప్పటికీ స్త్రీల స్థితి మనం గమనిస్తున్నాం. స్వతంత్ర్యం సంపాదించుకుని 75 వసంతాలు దాటింది. మరి గాంధీ గారి కల స్త్రీల విషయంలో కల్లగానే మిగిలిపోయింది. స్త్రీలపై అరాచకాలు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. లింగవివక్ష ఇంకా అలానే వుంది. మరి ఇలాంటి స్థితిలో స్త్రీలకు ఆనాటి స్త్రీల్లోని తెగువ, ధైర్యం, సాహసం, తమను తామే కాపాడుకునే నేర్పు, పరాక్రమం, పరిపాలనా శక్తి, వ్యాపారనైపుణ్యం కావాలి. అవన్నీ ఆనాటి సాహిత్యంలో మెండు. బ్రిటిష్ వారినుండి రాజ్యాన్ని కాపాడుకున్న మహిళలూ, వారి చరిత్రలూ మనందరికి విదితమే.

తెలుగునాట 1896 నుండి స్త్రీలు ప్రాథమిక హక్కులకోసం పోరాటం చేశారు. స్త్రీల స్వతంత్రత పట్ల ఆలోచనకు 1896 నుండి 1947 వరకు తెలుగు పత్రికల్లో వచ్చిన స్త్రీల సాహిత్యమే నిదర్శనం. దేశ స్వాతంత్ర్య సాధనలో స్త్రీలు భాగస్వాములు కావాలంటే వ్యక్తి స్వాతంత్ర్యంగురించి ముందుగా ఆలోచించాలి. కందుకూరి వారు స్త్రీ విద్యకు పునాదులు వేస్తే 1896లోనే వేమూరి శారదాంబ తన మాధవశతకంలో స్త్రీ విద్యపట్ల ఆలోచనలను రేకెత్తింపజేసింది. 1902, 1903 నాటికి విద్యద్వారా జ్ఞానాన్ని పొందిన స్త్రీలు తమ బానిసత్వాన్ని తొలగించుకునే స్వతంత్ర ఆలోచనలు చేసినట్లు భండారు అచ్చమాంబ రచనల్లో కనబడుతుంది.

స్త్రీలు పత్రికారంగంలోకీ ప్రవేశించారు. విద్యకు ఆటంకంగా ఉన్న బాల్య వివాహాలను నిరసించారు. స్త్రీ పునర్వివాహ

హక్కునూ, గౌరవప్రదమైన జీవన హక్కులనూ గుర్తించారు. 1910నాటికి స్త్రీల సాహిత్యంలో స్త్రీ పురుషుల స్వతంత్ర జీవనంలోని తేడాలను గుర్తించే భావనలకు పెద్దపీట వేశారు.

ఆర్థిక స్వావలంబనకోసం గృహ పరిశ్రమలతో ఆదాయాన్ని పొందాలనుకున్నారు. తిలక్ ప్రస్తావించిన స్వదేశీ వస్తు తయారీలో భాగంగా స్త్రీలు నూలు వడకటం, సబ్బుల తయారీ వంటివి నేర్చుకున్నారు. విద్యావంతులైన స్త్రీలు పాశ్చాత్య ప్రపంచాన్ని అధ్యయనం చేయగలిగారు.

1911 నాటికి ఆరోగ్య భద్రత గురించి ఆలోచించారు. బహుభార్యత్వపు సంస్కృతిని నిరసించారు. వారసత్వపు ఆర్థిక హక్కుల ఆలోచన మొదలుపెట్టారు. 1914 నాటికి విడాకుల ప్రస్తావన తెచ్చారు. హిందూ వివాహ చట్టం గురించి ఆలోచనలు చేశారు. 1916 లో స్త్రీలకు సమాన ఆర్జనావకాశాల ఆవశ్యకతను గుర్తించారు. లింగవివక్ష కారణంగా రాజకీయాల్లోకి రాలేకపోతున్నామని, ఉద్యోగాల్లో సమానావకాశాలు ఉండాలనుకున్నారు.

1920లో గాంధీజీ పిలుపుతో సత్యాగ్రహోద్యమంలో భాగస్వాములై సహాయనిరాకరణోద్యమాన్ని ముందుండి నడపగలిగారు. 1925 నాటికి స్వరాజ్య సాధన స్త్రీల విధ్యుక్త ధర్మమని భావించారు. 1929 నాటికి విద్యావంతులైన స్త్రీలకు ఓటుహక్కు లభించింది. 1930 రాజకీయ స్వాతంత్ర్యం కోసం ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని గ్రామ స్వరాజ్యంలో స్త్రీల భాగస్వామ్యం అవసరమనుకున్నారు. 1935నాటికి స్త్రీలందరికీ ఓటుహక్కును కావాలనుకున్నారు. 1936 నాటికి తాము చేసే ఇంటి చాకిరీకి వేతనాలు కావాలన్నారు. 1937లో ఉద్యమంలో పాల్గొనడానికి గర్భధారణ ఆటంకంగా ఉందని భావించిన సందర్భంలో, స్త్రీలు సంతానాన్ని కనే యంత్రాలు కాదనీ, తల్లి కావడం, గర్భస్రావం వంటి విషయాల్లో నిర్ణయాధికారం ఉండాలని గుర్తించారు. స్త్రీలు సైన్యంలో చేరాలనే ఆలోచనలూ పెరిగాయి. 1938 నాటికి స్త్రీలు చట్టాల్లో ఉన్న లింగ వివక్షను గుర్తించడంతో సాంఘిక, ఆర్థిక, న్యాయాలను ప్రశ్నకు పెట్టారు. ఇదంతా ఒక ఎత్తైతే భారతీయ స్త్రీలే కాదు విదేశీ వనితలూ మేముసైతమంటూ ఉద్యమంలో పాలుపంచుకున్నారు.

కుమారి మార్గరెట్ ఎలిజబెత్ నోబుల్ ఐర్లండునుండి భారతదేశం వచ్చి ఇక్కడ భారతీయుల స్థితినిచూసి తన ప్రసంగాల ద్వారా, వ్యాసాలద్వారా, సాహిత్యంద్వారా అన్నిరకాలుగా వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచిస్వాతంత్ర్యోద్యమ ప్రేరణ రగిలించారు.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో రచయిత్రుల రచనాధోరణిని మూడు దశలుగా చూడవచ్చు. 1. భక్తికవితా దశ 2. భావకవితా దశ 3. స్వాతంత్ర్యపోరాట సాహితీ దశ.

భండారు అచ్చమాంబగారి అబలాసచ్చరిత్రగ్రంథమాల సుమారు 50మంది వివిధ రంగాల్లో రాణించిన స్త్రీలచరిత్రలతో సాగి, మహిళల్లో పెను మార్పునే తీసుకొచ్చింది.

భావకవిత్వంతోపాటే, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో, అభ్యుదయ భావాలతో కవిత్వం రాసిన వారిలో ముందుగా చెప్పుకోదగిన కవయిత్రి తల్లాప్రగడ విశ్వసుందరమ్మ. సర్కారు దొరతనము, స్త్రీల చెరసాలలో, ఆంగ్ల గౌరవము, సైమన్ కమిషన్, లాఠీరాజ్యము మొదలైన వ్యంగ్య కవితలు ఆమె రాజకీయ చైతన్నాన్నీ, మనోధైర్యాన్నీ తెలియజేస్తాయి.

దేశిరాజు భారతీదేవి 1940లో రచించిన కాంతాశతకము స్త్రీ ధర్మం, దేశసేవ, ఖద్దరు ధారణ మొదలైన సమకాలీన ప్రగతిశీల అంశాలను ప్రబోధించే నీతిశతకం. స్త్రీలు ఇంట్లో కూర్చుని వృధాగా కాలక్షేపంచేయకుండా నూలువడకడంవంటి ప్రయోజనాత్మకపనులు చేస్తూ స్వాతంత్ర్యోద్యమానికి దోహదం చెయ్యాలని ప్రబోధించింది.

స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా పత్రికా ప్రచురణ పుంజుకుంది. మొసలికంటి రామాబాయమ్మ 1902లోనే హిందూసుందరి పత్రికను స్థాపించారు. ఇందులోనే భండారు అచ్చమాంబ 1902లో ధనత్రయోదశి కథ రాశారు. స్త్రీలు తమను తాము ఆత్మరక్షణచేసుకోగలిగినప్పుడే నిజమైన రక్షణ అన్నారు.

దరిశి అన్నపూర్ణమ్మ హిందూ స్త్రీల హక్కులు, పరదా పద్ధతి, స్త్రీ విద్య, జాతీయత మొదలైన విషయాలపై తీవ్రంగా ఆలోచించి, ఉపన్యాసాలద్వారా, రచనలద్వారా స్త్రీలను చైతన్యపరిచేది. ఈమె భండారు అచ్చమాంబలాగా జ్ఞానాంబ వంటి స్త్రీ చైతన్య కథలు రాశారు.

కనుపర్తివరలక్ష్మమ్మ కథారచనను బాగా ఆకళింపు చేసుకున్నారు. కన్యాశ్రమము వంటి స్త్రీ పురుషుల్ని ఇరువురినీ జాగృతం చేసే కథలు రాశారు. వీరు కథ, నవల, నాటిక, లేఖ, పద్యం, వ్యాసం వంటి ప్రక్రియలన్నింటిలోనూ రచనలు చేశారు. ఆ రోజుల్లోనే రాజకీయ చైతన్యంతో నవభారతేతిహాసం అనే ఓటుపురాణాన్ని ఎన్నికల సమయంలో రాశారు. లేఖాసాహిత్యాన్ని సృజించిన ప్రథమ మహిళ ఈమె. ఆంధ్రలక్ష్మి, అనసూయ పత్రికల్లో లేఖలు రాయడం ప్రారంభించి గృహలక్ష్మిలో ధారావాహికగా రాసి, స్త్రీల విజ్ఞాన వికాసాలకు దోహదంచేశార. దేశభక్తి, సంఘుసంస్కరణ, నారీజన హక్కుల పోరాటం, స్త్రీ విద్య, శారదా చట్టం, విడాకుల చట్టం, బహుభార్యత్వం, వేశ్యావృత్తి బహిష్కరణ, మూఢభక్తి మొదలైన అంశాలు శారద లేఖలద్వారా స్త్రీలకు చర్చనీయాంశాలయ్యాయి.

మాగంటి అన్నపూర్ణాదేవి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విద్యావంతురాలై భర్త ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్తే స్వాతంత్ర్యపోరాటంలో భాగస్వామై సహాయనిరాకరణోద్యమంలో పాల్గొనింది. భర్తకు రాసిన ఉత్తరాల్లో అతనికి కూడా స్వాతంత్ర్యపోరాట స్ఫూర్తిని కల్గించింది.

ఆచంటశారదాదేవి ఉన్నతవిద్యావంతురాలు. స్త్రీలకు కుటుంబంలో ఎదురయ్యే అసమానతలగూర్చి ఆర్ద్రంగా కథలు రాశారు. ఇల్లిందల సరస్వతీదేవి 1936లో ఆంధ్రయువతీ మండలిని స్థాపించి మహిళల్ని జాగృతం చేయడానికి కథలూ, నవలలూ, నాటికలూ విరివిగా రాశారు. రేడియో ప్రసంగాల ద్వారా, కథలూ, వ్యాసాలద్వారా ఇల్లిందల సరస్వతీదేవి, యెల్లాప్రగడ సీతాకుమారి మహిళల్ని జాగృతం చేశారు.

గుమ్మడిదల లక్ష్మీబాయమ్మ స్వాతంత్ర్యపోరాటంలో ఉప్పు సత్యాగ్రహంలో ప్రముఖపాత్రవహించారు. వ్యాసాలూ, కథలూ రాశారు. ఆంధ్రమహిళ అనే పత్రికను 1940లో స్థాపించింది. ఆంధ్రమహిళాసభను స్థాపించి స్త్రీలకు విద్యా, ఉద్యోగావకాశాల్ని విస్తృతంగా కల్గించింది.

ఉద్యమ కాలంలో స్త్రీల అక్షరాస్యత చాలా తక్కువ కాబట్టి వారి ఉపన్యాసాలను పత్రికల్లో ప్రచురించి తక్కిన స్త్రీల్లో చైతన్యాన్ని తీసుకొచ్చారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో సుమారు 90 వరకు ప్రచురిత ఉపన్యాసాలు కనిపిస్తున్నాయి. స్త్రీలు విద్యావంతులైన తర్వాత అన్ని రచనలూ చేయడం ప్రారంభించారు. 470 వరకు వ్యాసాలు వివిధ పత్రికల్లో లభిస్తున్నాయి. 100 పైన కథలు, 3 స్వీయ చరిత్రలూ, 33 నాటకాలు, సుమారు 100 కవితలు, 6 శతకాలు, 12 లేఖలు, 5 నవలలు, పాటలూ వచ్చాయి.

**ఆనాటి స్త్రీల సాహిత్య చైతన్యమే నేటి స్త్రీవాదానికి ఆధారం అనేది నిజమని నేను గట్టిగా నమ్ముతున్నాను.**

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమ తెలుగు సాహిత్యం – స్త్రీల పత్రికలు : మహిళాభ్యుదయం

**ఆచార్య డి. విజయలక్ష్మి,** తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు-500 046.

తెలుగు నేల ప్రాచీన చరిత్రలో రత్నాలను రాశులుగా పోసి నడివీధుల్లో అమ్మేవారని, ప్రజలందరూ భోగభాగ్యాలతో సర్వసౌభాగ్యాలు అందుకున్నారని, మాట్లాడితే పద్యం చెప్పే నెరజాణతనంతో నిండిఉన్నారని, పురుషులతో సమానంగా రాజాస్థానాలల్లో కవనం చేశారని చరిత్ర అందిస్తున్న ఒక సుసంపన్న స్థితినుండి గతితప్పి కన్ను లొట్టపోయిన రీతిగా భారతీయ సమాజానికి 19వ శతాబ్దం పెను సవాలుగా మారింది. బ్రిటీష్ సామ్రాజ్యపు కోరల్లో చిక్కుకుని నన్ను విడిపించేనాథుడెవరని భారతమాత తల్లడిల్లుతున్న కాలంలో భారతదేశ పునాదులపట్టు సడలిపోసాగింది. ఆ స్థితిలో భారతసమాజంలో బాధకు, దు:ఖానికి, కడుపుకోతకుగురై జనం విలవిలలాడిపోయారు. బ్రిటీష్ ప్రభుత్వం తెచ్చిన ఆర్థిక సంస్కరణలు ప్రజలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేశాయి. అటువంటి సమయంలో భారతీయుల్లో పుట్టిన స్వాతంత్ర్యకాంక్ష మొదటగా సాంఘిక సమైక్యతను సాధించింది. కులమత వర్గ అడ్డుగోడలను ఛేదించి సమాజోద్ధరణకు పూనుకున్నారు.

19వ శతాబ్దంలో భారత సమాజంలో వేళ్లూనుకొనిన కరువు కాటకాలతో ప్రజలు తిండితిప్పలకు అల్లాడిపోయారు. విదేశీ వస్తువుల దిగుమతితో భారతీయ పరిశ్రమలన్నీ ఛిన్నాభిన్నమై షావుకార్ల పెత్తనం పెరిగిపోయింది. గ్రామాలలో నివసించే చిన్నాబన్నా జనం అప్పుల్లో కూరుకుపోయారు. అంతకు ముందు శతాబ్దాలలో ఉన్న సమాజ వ్యవస్థని ఆంగ్లేయులు ధ్వంసం చేశారు. ఆంగ్లేయులు పరిపాలన, విద్యా, న్యాయవ్యవస్థలను సమూలంగా మార్చేసి తమ అవసరాలకు అనుగుణంగా ఉండేట్లు మలచుకున్నారు. గ్రామీణ జీవనవ్యవస్థను అతలాకుతలంచేసి గ్రామీణులను ఋణగ్రస్తుల్ని చేసింది. ఈ నేపథ్యంలో మధ్యతరగతి కుటుంబాలలోనుండి కొందరు, విద్యాధికుల్లోనుండి కొందరు సంఘసంస్కరణకు నడుంబిగించారు.

ముఖ్యంగా మన సమాజంలోని సాంఘికదురాచారాలను, మతమౌఢ్యానికి స్వస్తి పలికి హేతువాద దృక్పథాన్ని, మానవీయకోణాన్ని, శాస్త్రీయ చింతనను పెంపొందించే దిశగా అడుగులు వేశారు. ఈ అడుగుల్లో కులమత ఎల్లలులేని కొత్త సాంఘికవర్గం ఏర్పడింది. దీని పని సంఘసంస్కరణ. ఈ దశలోనే రాజారామ్ మోహనరాయ్ బెంగాల్ లో ప్రారంభించిన సంఘవిద్రోహక కార్యకలాపాల నిర్మూలనలో భాగంగానే తెలుగు నాట వీరేశలింగంపంతులు సంఘసంస్కరణ ఉద్యమం నడిపారు.

తెలుగునాట జరిగిన సంఘసంస్కరణల్లో బాల్యవివాహాల నిర్మూలనం, సతీసహగమన దురాచారాన్ని ఆపటం, వితంతువివాహాలను ప్రోత్సహించటం, సమవయస్కులతో వివాహాలు జరిపించాలని ప్రచారం చేయటం, వరకట్నం, కన్యాశుల్కంవంటి దురాగతాలను మానిపించాలనే ప్రయత్నం, వీటితోపాటుగా స్త్రీవిద్యను ప్రోత్సహించటం, మహిళాభ్యుదయాన్ని సంస్కరణలు చేయాలను పూనుకోవటం ప్రారంభమైంది. తొలిదశలో బ్రిటీష్ ప్రభుత్వాన్ని పారద్రోలాలనికానీ, వారిని వ్యతిరేకించుకోవాలని కానీ ఉద్యమాలు జరగలేదు. సమాజగతమైన దురాచారాలను రూపుమాపాలనే ఉద్దేశ్యంలోనే సంఘ సంస్కరణోద్యమం జరిగింది. దీని ఫలితంగా సమాజంలో ప్రతి ఒక్కరూ కొంత మెలకువ గ్రహించటం, తమనుగురించి తాము ఆలోచించుకోవటం ప్రారంభమైంది. విద్య అవసరాన్ని గుర్తించిన విద్యను అభ్యసించటం జరిగింది. బ్రిటీష్ వారి కొలువుల్లో ఉద్యోగస్థులుగా చేరటం ప్రారంభించారు. బ్రిటీష్ కొలువుల్లో చేరిన భారతీయులు వలసవాద విధానాలలోని డొల్లతనాన్నీ, ఆర్థిక దోపిడీతనాన్ని గుర్తించారు. వారుకూడ సంఘసంస్కరణవాదులకు అండగా అక్కడి విషయాలను చేరవేసేవారు. సాంఘిక దురాచారాలపైనను, మతమౌఢ్య విధానాలపైనసూ ఉద్యమాలు చేస్తూనే వలసపాలకుల ఆర్థిక దోపిడీనీ నిరసించసాగారు. సాంఘిక ఉద్యమాలలో స్త్రీ సంబంధ విషయాలు కేంద్ర బిందువై నిలిచాయి. సామాజిక అభివృద్ధికి స్త్రీ ఎదుగుదల, స్త్రీ విముక్తి అవసరమని గుర్తించారు.

విస్తృతంగా సాగిన సంస్కరణోద్యమంలో స్త్రీ సంబంధ విషయాలలోనే సంస్కరణలు ప్రధానమైనాయి. ఎందుకంటే 19వ శతాబ్దపు మధ్యదశలోని స్త్రీకి తెలుగుసమాజంలో సముచిత స్థానమే లేదు అనే చెప్పాలి. స్త్రీలకి ఏ విషయంలోనూ స్వాతంత్ర్యమనేదే మచ్చుకి కనపడని కాలంగా చెప్పవచ్చు. ఆ కాలంలోనే బాల్యవివాహాల పేరుతో జరగరాని ఘోరాలన్నీ జరిగాయి. సమవయస్కులతో

కాకుండా ముసలి ముతకలైన పురుషులు పసికూనలైన బాలికలని వివాహమాడేవారు. ఆడపిల్ల రజస్వల అయ్యేనాటికి ఈ భర్త చనిపోవడమూ, మంచానపడి ఉండడమూ, లేకుంటే మనిషి ఉడిగిపోయి ఉండడమూ జరిగేది. యుక్తవయస్సులో వచ్చే లైంగిక కోరికలు తీర్చే స్థితిలో లేని భర్తతో సంసారం నరకప్రాయంగా ఉండేది. అతి పిన్న వయస్సులోనే వైధవ్యం పొందిన స్త్రీల స్థితి మరీ దైన్యంగా ఉండేది. పడుచుదనంపై అనుమానాలతో ముసలిభర్తలు తమ భార్యల శీలాన్ని శంకిస్తూ వారిని గృహబంధీలుగా చేసి హింసకు గురిచేసేవారు. అందరి నిరసనలకూ స్త్రీనే వినియోగించుకునేవారు. ఈ కాలంలోనే మహిళాభ్యుదయం దిశగా సాహిత్యం రూపుదిద్దుకుంది. అపుడపుడే పత్రికలు రావటం ప్రారంభమైంది. పత్రికల్లోనూ స్త్రీ జనోద్ధరణకై వ్యాసాలు, కథలు, కవితలు రాదొడిగాయి. స్త్రీ సమాజంలో పునరుజ్జీవన చైతన్యం మొదలైంది అని నిర్ధారించవచ్చు.

మొట్టమొదటిసారిగా స్త్రీలు విద్యావంతులు కావటానికి, తమ ఆర్థికస్థితిని తాముగా మెరుగుపరచుకోవటానికీ, కుటుంబంలో తామూ భాగస్వాములని ఎరుకపరచటానికీ ముందుకు రాసాగారు ఇది స్త్రీ చైతన్యంలో తొలిదశగా చెప్పవచ్చు. 19వ శతాబ్దంలో ఈ దశ రావటానికి సంఘ సంస్కరణవాదులు చాలా ఇబ్బందుల్ని ఎదుర్కొన్నారు. స్త్రీలలో చైతన్యం రావటం అంటే ఇంట్లోనూ వీధిలోను ఉన్న పురుషుల ఆలోచనల్లో వచ్చిన మార్పుగా కూడ దీన్ని గుర్తించవలసి ఉంది. ఏది వందశాతం ఉండదు. కొంచెంకొంచెంగా సాధించుకుంటు నిలదొక్కుకోవటమే ప్రగతిశీల సామాజిక చైతన్యం అవుతుంది. ఈ శతాబ్దంలో స్త్రీలను కుటుంబవ్యవస్థను దాటి వెలుపలికి రమ్మని పిలుపును ఇవ్వలేదు. స్త్రీలకు ఆర్థికపరమైన హక్కులు, పురుషులతో సమానంగా స్వేచ్ఛను అందించకపోయినా కుటుంబంలో స్త్రీ బానిస కాదు, అజ్ఞానికాదు, మూఢనమ్మక విశ్వాసికాదు అని తెలుసుకునే చైతన్యాన్ని కల్పించారు. ఈ చైతన్యమే స్త్రీలలో తమను తెలుసుకోడానికి తమలోని శక్తిని బహిర్గతం చేసుకోవటానికి మార్గాలను సుగమం చేసుకునే దిశలో అడుగులు వేశారు. విద్యావకాశాలను భారత రామాయణాలకు పరిమితం కాకుండా మరింత ముందుకుపోయి తమకుతాము తమగురించి తమకోసం రాసుకోవాలనే తపనలోకి అడుగుపెట్టారు.

ఈ దశలోనే పురుషులతోపాటుగా కందుకూరి రాజ్యలక్ష్మమ్మ, బాలాంత్రపు శేషమ్మ, కొటికలపూడి సీతమ్మ వంటివారు తమ రచనలతో స్త్రీ జాతిని ఉత్తేజితులను చేయసాగారు. స్త్రీలలో విజ్ఞానాభివృద్ధిని, విద్యా వికాసాభివృద్ధిని, ముఖ్యంగా కుటుంబమనే చెరలో బందీలుగా మారి ఉనికి కోల్పోయిన స్త్రీలను చైతన్యంవైపు దృష్టిమరల్చే పనికిపూనుకున్నారు. వీరేశలింగం పంతులుగారి స్ఫూర్తితో వీరు ప్రతిపట్టణంలో స్త్రీలకై సభలు ఏర్పాటుచేసేవారు. ప్రారంభదశలో వీరి సభలకు పట్టుమని పదిమంది స్త్రీలుకూడ వచ్చేవారుకాదు. రానురాను స్త్రీలలో మనోవికాసం కలిగి మనోధైర్యాన్ని కూడగట్టుకుని ఇల్లువదలి సభలకు రాసాగారు. సభలలో స్త్రీ జీవనవికాసాన్ని వివరిస్తున్నప్పుడు విని పదిమందితో పంచుకోవటం ప్రారంభమయింది. ఇలా బహిరంగంగానే కాకుండా అమ్మలక్కల కబుర్లద్వారాకూడా స్త్రీ జీవన వికాస అవసరాలను వినిన ఎందరో స్త్రీలు ఆ తదనంతరం సభలకు సమావేశాలకు రాసాగారు. ఈ అవకాశాలను కల్పించిన సంఘసంస్కరణాభిలాషులైన పురుషుల రచనలను చదవడం లేదా చదివించుకుని వినడం ప్రారంభించారు. ఇండ్లదగ్గరే అక్కడక్కడ గుమిగూడి అక్షరజ్ఞానాన్ని అభ్యసించసాగారు. పత్రికల్లో వచ్చే అంశాలను కరపత్రాలను చదవనారంభించారు. అలతి అలతి మాటలతో తమ అభిప్రాయాల కాగితాలపై రాయసాగారు. ఈ రకంగా స్త్రీలలో అభ్యుదయ దృక్పథం వెల్లివిరిసింది.

వీరేశలింగంపంతులు ఏర్పరచిన గ్రామసభలలో వీరంతా విద్యను అభ్యసించటం జీవనార్థికస్థితి పెంపుకై కుట్టుపనులు కుట్టుమిషనుపై బట్టలుకుట్టడం, అద్దకం పనులు చేయటం నేర్చుకున్నారు. వీటితోపాటు చేతివృత్తులను నేర్పించేవారు. ఇలా సమైక్య దృక్పథంతో ఒకరికొకరుగా అనేక విషయాలపై అవగాహన పెంపొందించుకోసాగారు. స్త్రీకి స్త్రీ శత్రువుకాదు, స్త్రీకి స్త్రీ ఆత్మీయురాలు అన్నట్లుగా స్త్రీలందరూ చేరి అనేకానేక విషయాలను అవగాహన చేసుకుంటూ ముందుకు పోసాగారు. అణచివేతకు గురౌతూ వంటింటికే పరిమితమై వెట్టిజీవనం సాగించిన మహిళలు చైతన్యం పొంది మహిళాసమాజాలు, మండలసభల నిర్వహణలు, స్త్రీలు తమకోసం తాము రాయదగిన రచయితలుగా ఎదగడం, వీధి ఊరేగింపుల్లో పాల్గొనడంవంటి స్థితికి ఎదిగిన మహిళాభ్యుదయాన్ని తొలిదశ విజయంగా మనం గుర్తించాలి.

తొలిదశలో వచ్చిన పత్రికలో మహిళాభ్యుదయం ప్రధానంగాకాకుండా సాదాసీదా విషయాలతో ప్రారంభమై స్త్రీ విద్యకు ప్రాధాన్యతను ఇచ్చాయి. ఈ కాలంలోనే పత్రికల్లో స్త్రీవిద్యను గురించి స్త్రీ చదువుకుంటే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుతుందని, పరిశుభ్రత పాటిస్తుందని, చదువుకున్న స్త్రీ కుటుంబంలో అందరి ఆలనాపాలనా చూడడమేకాకుండా అందరికీ కావలసిన ప్రకృతి వైద్యపరిజ్ఞానం కలిగి ఉంటుందని, పొదుపు నేర్చుకుంటుందని, వ్యవహారజ్ఞానం అలవడుతుందని దృష్టాంతాలతో పత్రికల్లో రాసేవారు. ఆ రకంగా పత్రికలు స్త్రీ విద్యకు ప్రోత్సాహాన్ని ఇచ్చాయి. స్ఫూర్తిపొందిన మహిళలు ప్రారంభదశలో వారి ఇంటినుండే చదువు నేర్చుకున్నారు. నేర్చిన చదువుని ఒకరికొకరు అందిచ్చుకున్నారు. పత్రికలను తాముగా చదివే స్థితికి ఎదగజాలారు.

కుటుంబపరంగా స్త్రీ విద్యవిషయంలో ఆదరాభిమానాలు పొందిన స్త్రీలు స్వతంత్రించి సమాజంపై అవగాహన పెంచుకుని రచనలు చేయటం ప్రారంభించారు. అప్పటికే సంఘసంస్కరణ ఉద్యమకాలంలో వేగం పుంజుకుని, చారిత్రాత్మక కర్తవ్యాన్ని నిర్వహిస్తూ, రాజకీయ సాహిత్య, సాంస్కృతిక ఉద్యమాలకు అండగా నిలిచాయి. ఈ దశలోనే స్త్రీలుకూడా సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పత్రికల్లో స్త్రీలకోసం మహిళాభ్యుదయ అంశాలను రచించేవారు. ఆ తదనంతరం స్త్రీల అభ్యుదయమే సమాజాభ్యుదయం అని గ్రహించి స్త్రీలకై ప్రత్యేకంగా పత్రికలను ముద్రించసాగారు.

**తొలితరంలో వచ్చిన పత్రికలుగా చెప్పుకోదగినవి:**

| **పత్రిక పేరు** | **సంపాదకులు** | **ప్రచురణ స్థలం** | **ప్రచురణ కాలం** | **పత్రిక ఉద్దేశ్యం** |
|---|---|---|---|---|
| సతీ హితబోధిని | కందుకూరి వీరేశలింగం పంతులు | రాజమండ్రి | 1888 | స్త్రీలను విద్యావంతులను చేయాలని, స్త్రీలకు ప్రకృతిశాస్త్రం, వైద్యశాస్త్రంపై అవగాహన కల్పించాలని, స్త్రీలు సాధువర్తనతో కుటుంబ నిర్వహణ చేసుకోవాలని అభిలషించింది. ఇందులో నీతిబోధక కథలు, |

ఉపన్యాసాలు, స్త్రీ ధర్మాలు, పుణ్యవతీ చరిత్రలు, ఆరోగ్యధర్మాలు, ప్రకృతిశాస్త్ర విషయాలు, జ్ఞానదాయకాలైన విషయాలను ప్రచురించేవారు. ఇందులో స్త్రీ ధర్మాలను కుటుంబపరంగా స్త్రీలు నెర్వర్తించుకోవలసిన ప్రాతివత్య ధర్మాలను వెలువరించారు. ఇదే మొదట వెలువడిన స్త్రీల పత్రిక.

| **పత్రిక పేరు** | **సంపాదకులు** | **ప్రచురణ స్థలం** | **ప్రచురణ కాలం** | **పత్రిక ఉద్దేశ్యం** |
|---|---|---|---|---|
| తెలుగు జనానా | మల్లాది వెంకటరత్నం/ రాయసం వెంకటశివుడు | బెజవాడ | 1898 | స్త్రీ విద్యే ధ్యేయంగా వెలువడింది. ఇంగ్లీషు పత్రికల్లో వచ్చిన వ్యాసాలను తెలుగులోకి అనువదించి ఇందులో ప్రచురించేవారు. |

ఈ పత్రిక కూడా స్త్రీ విద్యను ప్రోత్సహిస్తూ, స్త్రీ ధర్మాలను నూరిపోసినది. "హిందూస్త్రీల ఆరోగ్య ధర్మములు తెలియుట గురించి" అనుపేర ఒక స్త్రీ ఇందులో వ్యాసం రాసినట్లుంది. కానీ ఆమే పేరు లేదు. ఈ పత్రిక ముఖపత్రం మీద తెలుగుదేశపు స్త్రీల కోసం, బాలికల కోసం ప్రచురింపబడు మాసపత్రిక అని ముద్రించి ఉంటుంది.

| **పత్రిక పేరు** | **సంపాదకులు** | **ప్రచురణస్థలం** | **ప్రచురణకాలం** | **పత్రిక ఉద్దేశ్యం** |
|---|---|---|---|---|
| శ్రీ బాలిక | శ్రీకాకుళం | | | ప్రాచీనసాహిత్యంలోనుంచి స్త్రీ సంబంధ విషయాలు, నీతికథలు, సద్వర్తనలు, దేహారోగ్యం వంటివి ప్రచురించేవాళ్లు. |

ఇందులో ప్రాచీనసాహిత్యంలోని స్త్రీ సంబంధ విషయాలను సేకరించుకుని అర్థవంతంగా రాసేవాళ్లు, ఇందులో రచనలు చేసినవారంతా ఎక్కువమంది పురుషులే. విషయసూచికను ఇంగ్లీషు–తెలుగు భాషల్లో మొదటిపేజీలోనే ముద్రించేవారు. ఇది మాసపత్రిక.

| పత్రిక పేరు | సంపాదకులు | ప్రచురణ స్థలం | ప్రచురణ కాలం | పత్రిక ఉద్దేశ్యం |
|---|---|---|---|---|
| హిందూ సుందరి | మొసలికంటి రమాబాయి మాడభూషి చూడమ్మ, కళ్లేపల్లి వెంకటరమణమ్మ | ఏలూరు/ విద్యార్థి కాకినాడవరకు | 1902 – 1945 | స్త్రీల సమస్యల్ని సరైన పంథాలో చర్చించి ప్రశ్నించిన పత్రిక. |

సమాజం స్త్రీలు పత్రికలు ప్రచురించటం ఈ పత్రికతోనే మొదలైంది. ఈ పత్రికకు అనేకులు సంపాదకత్వం వహించి కొనసాగించారు. ఇది స్త్రీ పరంగా విప్లవాత్మక ధోరణిలో సాగిన పత్రిక స్త్రీని విద్యావంతురాల్ని చేయటమే కాకుండా స్త్రీ హక్కుల్ని ప్రశ్నించే పత్రికగాను సమాజంలో స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను నిష్కర్షగా ఖండించిన పత్రిక ఇదే. "స్త్రీలు చదువదగిన విషయములు ప్రచురించు పత్రిక"గా ప్రచారం పొందింది.

| పత్రిక పేరు | సంపాదకులు | ప్రచురణస్థలం | ప్రచురణ కాలం | పత్రిక ఉద్దేశ్యం |
|---|---|---|---|---|
| సావిత్రి | పులుగుర్తి లక్ష్మీ నరసమాంబ | కాకినాడ | 1904–1911 | స్త్రీవిద్యనుప్రోత్సహించేది. బాల్యవివాహాల్ని నిషేధించాలనింది కానీ వితంతువివాహాని వ్యతిరేకించింది. |

స్త్రీ విద్యను ఆదరిస్తూ స్త్రీకి పునర్వివాహాన్ని వ్యతిరేకించింది. ఈ పత్రిక వీరేశలింగంపంతుల స్త్రీ సంస్కరణవాదానికి వ్యతిరేకంగా పత్రికాముఖంగా తీవ్రమైన ఖండనలు పంపింది. అంతేకాకుండ స్త్రీలను తమ పత్రిక చదివేటట్లు ప్రోత్సహించమని పురుషులకు విజ్ఞాపనం చేసేవారు.

| పత్రిక పేరు | సంపాదకులు | ప్రచురణస్థలం | ప్రచురణ కాలం | పత్రిక ఉద్దేశ్యం |
|---|---|---|---|---|
| హిందూ యువతి | యామినీ పూర్ణతిలక | మద్రాసు | 1928 | కళావంతుల ఉద్ధరణ, హిందూ స్త్రీల జీవన సంస్కరణార్థం వెలువడిన పత్రికగా దీనికి ప్రాశస్త్యం. |

స్త్రీలకోసం వెలువడిన మొదటి పక్షపత్రిక. స్త్రీ విద్యను ప్రోత్సహించిన పత్రిక. సమాజంలో రెండవవర్గం స్త్రీలుగా గుర్తించబడిన కళావంతుల పక్షాన వకాల్తా పుచ్చుకున్న పత్రికగా గుర్తింపు పొందింది. వారికి విద్యను నేర్పించటంకోసం వారిని సుస్కరించటంకోసం ఈ పత్రిక చేసిన కృషి ఫలవంతం అయిందని చెప్పవచ్చు.

| పత్రిక పేరు | సంపాదకులు | ప్రచురణస్థలం | ప్రచురణ కాలం | పత్రిక ఉద్దేశ్యం |
|---|---|---|---|---|
| గృహలక్ష్మి | కె.ఎన్. కేసరి | మద్రాసు | 1927 | స్త్రీ లోకానికి జీవం జవం ఇచ్చింది. ఇంతకు ముందు ఎన్నో స్త్రీల పత్రికలు వచ్చినా ఇదే మొదటి స్త్రీల పత్రిక అన్నట్లు పేరు ప్రఖ్యాతులు పొందింది |

గృహలక్ష్మి పత్రిక తల్లి పడిన బాధలను చూచిన కె.ఎన్.కేసరి మరే ఇతర స్త్రీలు అలాంటి వ్యధలకు గురి కాకూడదని భావించి మహిళాభ్యుదయ పత్రికను తీసుకువచ్చారు. కె.ఎన్. కేసరిగారికి స్త్రీ విద్య, స్త్రీల ఆరోగ్యం, స్త్రీ అభ్యున్నతిపట్ల స్పష్టమైన అవగాహన కలిగినవారు. అందుకే ఈ పత్రిక స్త్రీల పత్రికల్లోకెల్లా గొప్పపత్రికగా పేరు పొందినది. ఇందులోని స్త్రీల ఆరోగ్య సంబంధ సూత్రాలు, మందులు, జాగ్రత్తలు ప్రతిపత్రికలో వచ్చేవి. శారదలేఖలు అనే శీర్షికన స్త్రీలకు సంబంధించిన గృహసంబంధ,

బంధుమిత్రుల సంబంధ, సమాజసంబంధ, సంస్కృతీసంబంధ, శరీరతత్వసంబంధ విశేషాలు అనేకానేకం సమస్య-పరిష్కారం దృక్పథంతో వెలువడేటివి. శారదలేఖలకోసమే ఆ పత్రికకు చందాదారులుగా చేరామని ఆరోజుల్లో చెప్పుకునేవారు. అప్పట్లో ఇదే తొలి స్త్రీలపత్రిక అనికూడ అనుకునేవారు.

| **పత్రిక పేరు** | **సంపాదకులు** | **ప్రచురణస్థలం** | **ప్రచురణ కాలం** | **పత్రిక ఉద్దేశ్యం** |
|---|---|---|---|---|
| ఆంధ్రలక్ష్మి | కళ్లేపల్లి వెంకటరమణమ్మ | బరంపురంలోని గంజాం | 1921 | మొదట శారదలేఖలు ఈ పత్రికలో ప్రచురితమయ్యాయి. |

శారదలేఖలు శీర్షిక ఈ పత్రికలోనే మొదట ఉండేది. ప్రతి లేఖలో స్త్రీసంబంధ సమస్యను ఒకదాన్ని విశ్లేషించేవారు. తర్వాత ఈ శీర్షిక గృహలక్ష్మీ పత్రికద్వారా ప్రఖ్యాతి పొందింది. స్త్రీవిద్యకు అధిక ప్రాధాన్యమిచ్చిన పత్రిక ఇది. స్త్రీలచేత రచనలు ఎక్కువగా చేయించిన పత్రికగా గుర్తింపు.

| **పత్రిక పేరు** | **సంపాదకులు** | **ప్రచురణస్థలం** | **ప్రచురణ కాలం** | **పత్రిక ఉద్దేశ్యం** |
|---|---|---|---|---|
| అనసూయ | వింజమూరి వెంకటరత్నమ్మ | కాకినాడ | 1914 | స్త్రీలలో పఠనసామర్థ్యాన్ని పెంపొందింప జేసిన పత్రిక.కొన్ని పుస్తకాలను ఈ పత్రికలో ప్రకటించి అందులోనుంచి ప్రశ్నలను సంధించేది. జవాబులకు బహుమతులను ప్రకటింపజేసేవారు. |

అనసూయ “బహుమతి పరీక్ష” అనే శీర్షికన స్త్రీలకు పోటీలు పెట్టి విజేతల పేర్లను మరుసటి పత్రికలో ప్రచురించి పాఠకులను ప్రోత్సహించేది. పత్రికలో తమ పేరు వేసుకోటానికి ఆ కాలంలో సంకోచించే స్త్రీలకు హితవచనాలు చెప్పి ఒప్పించి పేర్లు వేసేవారు.

| **పత్రిక పేరు** | **సంపాదకులు** | **ప్రచురణస్థలం** | **ప్రచురణ కాలం** | **పత్రిక ఉద్దేశ్యం** |
|---|---|---|---|---|
| ఆంధ్ర మహిళ | దుర్గాబాయ్ దేశ్ ముఖ్ తర్వాతికాలంలో చిన్నఘంటమ్మ, కె.రామలక్ష్మి, మాలతీచందూర్ | మద్రాసు | 1944-1960 | 1960 వరకు వెలువడింది. దేశ స్వాతంత్ర్య సమరం ఉచ్ఛస్థితిలో కొనసాగుతున్నప్పుడు వెలిసిన పత్రిక. ఇందులో సంపాదకీయం ప్రత్యేకం. ఈ పత్రికలో వ్యాపార ప్రకటనలు ఎక్కువగా ఉండేవి. |

ఈ పత్రికలో స్త్రీ సమస్యలు అనేకం చర్చించేవారు. సమాజంలో స్త్రీ అనేక విధాల దగాకు గురౌతుందని ఘోషించిన పత్రిక ఇది. స్త్రీలపట్ల గాంధీజీ అభిప్రాయాలను ఎప్పటికప్పుడు అందించిన పత్రిక. స్త్రీలను స్వాతంత్ర్య భావాలను నెలకొల్పి స్త్రీలకు సామాజిక స్వాతంత్ర్యంతో పాటు ఆర్థిక రాజకీయ స్వాతంత్ర్యం కావాలని కాంక్షించిన పత్రిక ఇది. స్త్రీల సమస్యల్ని గూర్చిన ఆసక్తికరమైన చర్చలు ఉండేవి.

ఇవేకాకుండ ఇంకా చాలాపత్రికలు స్వాతంత్ర్యానికి పూర్వం స్త్రీలపత్రికలుగా అనేకం వెలువడినాయి. వాటి పేర్లు కనపడుతున్నాయేగాని వాటి ప్రతులు లభ్యం కావడంలేదు. వీటికోసం ప్రత్యేకమైన శోధన వీటిపై ప్రత్యేకంగా పరిశోధన కూలంకషంగా జరగవలసి ఉంది.

మహిళాభ్యుదయానికి దోహదపడే వాటిలో పత్రికలు ముఖ్యమైన సాధనాలని గ్రహించి అనేక పత్రికలను వెలువరించారు. మొదట్లో స్త్రీలపత్రికలు పురుషుల సంపాదకత్వంలో వెలువడ్డాయి. తదనంతరం స్త్రీలు సంపాదకత్వం వహించి ముద్రించసాగారు.

ఈ రెండురకాలైన సంపాదకత్వాలకు స్పష్టమైన వైవిధ్యం ఉండేది. పురుషుల సంపాదకత్వంలో వచ్చిన స్త్రీల పత్రికలలో స్త్రీలకు హితబోధ చేసేవిగాను, స్త్రీ విద్యను ప్రోత్సహించేవిగాను, నైతికంగా ఉన్నతత్వం పొందేందుకు సహకరించినవిగాను, కుటుంబవ్యవస్థలో ఒడిదుడుకులులేని సంసారం సాగించుకోవాలని ఉద్బోధించేవిగాను ఉన్నాయి. స్త్రీలు సంపాదకులుగా వెలువరించిన పత్రికల్లో స్త్రీలహక్కుల్ని ప్రశ్నించుకుంటూ స్త్రీలు తమంతతాముగా అన్నిరంగాలలోనూ పురుషులతో సమానంగా ఎదగడానికి దోహదపడ్డాయి.

స్వాతంత్ర్యానికిపూర్వం వచ్చిన పత్రికల్లోని ముఖ్య అంశాలు: స్త్రీలు చదువుకోవాలి. స్త్రీలు చదవాలంటే స్త్రీలే ఉపాధ్యాయులుగా ఉండాలి. స్త్రీలు లభ్యం కానిచో వయస్సు పైబడిన పురుషులు ఉపాధ్యాయులుగా ఉండవచ్చు. స్త్రీలు ఉపాధ్యాయులుగా ఉంటే ఇంటినుండి బాలికలను ధైర్యంగా బడికి పంపుతారు అని పత్రికలన్నీ ఏకముఖంగా ప్రచురించాయి. చదువుకుంటే స్త్రీలు స్వేచ్ఛాజీవులైపోతారనే భయం కొందరిలో ఏర్పడింది అందుకోసం స్త్రీలకు పత్రికల్లో ప్రాతివత్య కథలు, పుణ్యస్త్రీలకథలు, కుటుంబవ్యవస్థ నిర్వహణ సూత్రాలు, అణకువలు, వంటి అంశాలనూ ప్రచురించాయి. స్త్రీలు చదువుకుంటే సరైన రీతిలో సంసార బాధ్యతలను నెరవేర్చుకుంటారనీ ఉద్బోధలు వెలువడ్డాయి. చాకలిపద్దులు రాయటంకోసం కాదు చదువు. విజ్ఞానవంతులు కావటంకోసమని తెలియజేశాయి. ఎంతోమంది స్త్రీలు విద్యావంతులై స్త్రీ సమాజానికి మార్గదర్శకులయ్యారు.

బాల్యవివాహాలవల్ల వచ్చే అనేక అనర్థాలను, వాటివల్ల స్త్రీ కోల్పోతున్న జీవనసౌభాగ్యాన్ని వివరించి చూపాయి. బాల్యవివాహాలను నిరోధించాలని సమవయస్కులతో వివాహాలు ప్రోత్సహించాలనీ, అసమ వయస్క వివాహాలను అడ్డుకోవాలనీ పత్రికలు ఘోషించాయి. వీటి ప్రభావంతో సమవయస్కుల వివాహాలు జరగడం ప్రారంభమయింది. అసమవయస్కుల వివాహాలు సన్నగిల్లాయి. బాల్యవివాహాలూ నిరోధించబడ్డాయి. వితంతువులు మారువివాహం చేసుకోవచ్చని అందులో దోషంలేదని వాదించిన పత్రికలూ ఉన్నాయి. వితంతు వివాహాలను వ్యతిరేకించిన పత్రికలూ ఉన్నాయి. వితంతు పునర్వివాహం సమ్మతమా కాదా అని పత్రికాముఖంగా విపరీతమైన చర్చలూ జరిగాయి. ఈ చర్చలు బాలికల తల్లిదండ్రులను ఆలోచింపజేసింది. ఈ చర్చల ప్రభావంతో బాల్యవివాహాలు తగ్గుముఖం పట్టాయి. స్త్రీ పురుషులు సమానమని చెప్పిన పత్రికలూ ఉన్నాయి. కుటుంబసంస్కృతిలో ఈ విషయంలో కొంత ఒడుదుడుకులు ఎదురవుతున్నా ఎదగాలనుకున్న స్త్రీలు ఎదుగుతూనే ఉన్నారు.

అనారోగ్యం వల్ల స్త్రీలు ఎంతటి నిర్లక్ష్యానికి గురౌతున్నారో తెలిపాయి. చాలా పత్రికలు ఆరోగ్య సూత్రాలను, గృహవైద్యాన్నీ అందించాయి. వైద్య విజ్ఞానంపై అవగాహన కల్పించుకోసాగారు. పత్రికలు ఇంటి విషయాలైన వంటలు, పరిశుభ్రత ఆరోగ్యం వంటి విషయాలను ప్రభోదించాయి. వీటివల్లా లభ్యం పొందినవారూ ఉన్నారు.

అర్థం పర్థం లేకుండా గుడ్డిగా నమ్మేస్తున్న మూఢనమ్మకాల్ని, కన్యాశుల్కం వరకట్నంవంటి దురాచారాలని, మద్యపాన స్వీకరణను, మూర?పు ఆలోచనలు, అనవసర భయాలను, నిజనిర్ధారణలేని ఉబుసుపోక మాటలను నివారించడానికి పత్రికలు అనేకానేక శీర్షికల్ని జోకులుగానూ, చిత్రపటాలద్వారానూ, చమత్కార సంభాషణల రూపంలోనూ, ప్రశ్న జవాబులద్వారాను ప్రచురించి స్త్రీలలో చైతన్యాన్ని కల్పించాయి పత్రికలు.

అలాగే భారతీయ సమాజంలో వేళ్లూనుకున్న కులమత వర్గ వైషమ్యాలను వైరుధ్యాలను తొలగించే ప్రయత్నాన్ని చేశాయి. ఆర్థిక స్థితిలో అట్టడుగున ఉన్నవారికి విద్యావకాశాలు కలిగించాలని విద్య ద్వారా అనేక తారతమ్య భేదాలు తొలగుతాయని సంఘ సంస్కరణాభిలాషుల పత్రికలద్వారా సమాజానికి తెలియజేసి ప్రజలను చైతన్యవంతులను చేసేవారు.

నాటి పత్రికలు స్త్రీలు పురుషులు సమానమని అంగీకరించకలేదు. స్త్రీ అభ్యుదయం సాధించాలి అని కోరుకున్నాయి. స్త్రీ కుటుంబంలో పరిమిత స్వేచ్ఛకే పరిమితురాలిగా ఉండాలి అని అన్ని పత్రికలూ బోధించాయి. కుటుంబవ్యవస్థ విచ్ఛిన్నం కావటానికి స్త్రీ అభ్యుదయం కారణం కాకూడదని పదేపదే ప్రచురించాయి. ఒక్క ఆంధ్ర మహిళ పత్రిక మాత్రమే స్త్రీ స్వేచ్ఛను గురించి, స్వతంత్ర జీవనాన్ని గురించి ప్రశ్నించింది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వస్తున్న స్త్రీల పత్రికలలోని విషయాలను స్వాతంత్ర్యం రాక మునుపు పత్రికలతో తులనాత్మక

పరిశీలన చేయవలసిన అవసరం కనపడుతుంది. ఎన్నో విధాలుగా స్త్రీల అభ్యున్నతికై పాటుపడిన నాటి సమాజంలోని స్త్రీల పత్రికలనుండి నాటి స్త్రీలు పొందిన స్ఫూర్తిని నేటి స్త్రీల పత్రికలనుండి నేటి స్త్రీలు పొందుతున్న స్ఫూర్తిని బేరీజు వేసుకోవలసి ఉంది. పత్రిక పనితనంతో సమాజం ఉద్ధరింపబడడంలోని ఔన్నత్యాన్ని నేటి పత్రికలు గుర్తించాలని ఆశిద్దాం.

**ఆధార గ్రంథాలు**

1. పద్మావతి డి. 1989: అస్పష్ట ప్రతిబింబాలు – తెలుగులో స్త్రీల పత్రికలు, స్వీయ ప్రచురణ, హైదరాబాదు.
2. రమాపతిరావు అక్కిరాజు 1972: వీరేశలింగం పంతులు సమగ్ర పరిశీలన, ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికింద్రాబాదు.
3. రామానుజరావు దేవులపల్లి 1972: తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనము (ఐదవకూర్పు), సాహితీ ప్రింటర్స్, హైదరాబాదు.
4. లక్ష్మణ రెడ్డి వి. 1985 : తెలుగు జర్నలిజం (అవతరణ వికాసం), గోపీచంద్ పబ్లికేషన్స్, విజయవాడ.
5. వరలక్ష్మి జె. 1977 : యుగయుగాల్లో భారతీయ మహిళ, ప్రియదర్శిని ప్రచురణ, హైదరాబాదు.
6. విజయవల్లీదేవి వేములకొండ, 2003: ఆంధ్ర శేషగిరిరావు గారి సాహిత్య జీవితము రచనలు, స్వీయ ప్రచురణ, విశాఖపట్నం.
7. వీరేశలింగం పంతులు కందుకూరి 1950: సతీహితబోధిని, హితకారిణీ సమాజము, రాజమహేంద్రవరము.
8. Seshagirirao (Ed) 1968: Studies in the history of Telugu Journalism Andhra Pradesh Book Distributors, Secundrabad.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమ తెలుగు కథానికల్లో స్త్రీ

**ఆచార్య ఎం.రామనాథం నాయుడు,** తెలుగు శాఖాధిపతి, కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, ముక్త గంగోత్రి,మైసూరు, చరవాణి: 87623 57996

ఆధునిక తెలుగు సాహిత్యంలోని గద్య ప్రక్రియల్లో సర్వాంగ సుందరంగా రూపొందిన తెలుగు కథకు ఆంగ్లకథా సాహిత్యమే ప్రేరణ అంటే అతిశయోక్తి కాదు. కథానిక లేదా ఆధునిక కథ వాస్తవంతో కూడుకుని ఉంటుంది. సామాజిక జీవితాన్ని కళాత్మకంగా చిత్రిస్తూ, పాఠకుడి హృదయానికి సన్నిహితమైన వర్తమాన సాహితీ ప్రక్రియ తెలుగు కథానిక. వాస్తవికత పునాదిగా గాఢత, క్లుప్తత, సౌందర్యం వంటి ముఖ్య లక్షణాలు కలిగి జీవద్భాషతో, పాఠకునితో సంభాషిస్తున్న ఉదాత్త సాహిత్య ప్రక్రియ మన తెలుగు కథానిక. ఈ కథానిక ప్రక్రియ ద్వారా సమాజంలో ఉద్యమ స్ఫూర్తిని కలుగజేయడానికి కథకులు ప్రయత్నించారు. అలాగే తెలుగుపత్రికలు వివిధరూపాలలో ప్రజల్లో చైతన్యం కలిగించడానికి ఎంతో కృషి చేశాయి.

ఉద్యమం జనంలో కదలిక పుట్టిస్తుంది. అలజడి రేకెత్తిస్తుంది. కొందరు ప్రత్యక్షంగా కార్యరంగంలోకి దూకుతారు. కొందరు వెనకనే ఉండి, తమకు చేతనయిన రీతిలోదానికి బలం చేకూరుస్తారు. తమలో కలిగిన స్పందనను మాధ్యమాల్లో వెల్లడిచేస్తారు. వాటిలో సాహిత్యానికి గొప్ప ప్రాధాన్యముంటుంది.

"ఉద్యమం" పుట్టుకకు మూలం "ఆలోచనే" అయినప్పటికీ ఆవేశంతోనే దానికి మనుగడ కలిగి ఉంటుంది. ఆవేశం కవిత్వానికి దగ్గరి చుట్టం. అందువల్ల స్వాతంత్ర్యోద్యమకాలంలో, సహజంగానే కవిత్వం చాలా వచ్చింది. అన్ని భాషల్లోనూ వచ్చింది. వందేమాతరగీతం ఇంటింటా గొంతు విప్పింది. వందేమాతరమన్న వాక్యాంశమే స్వాతంత్ర్యోద్యమ మంత్రమై దేశమంతటా నినదించింది. తెలుగు కవులు పొందిన స్పందన స్వాతంత్ర్యోద్యమ సాహిత్యానికి ప్రతిష్ఠ చేకూర్చింది.

అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ ఉద్యమప్రభావం ఎంతో కొంత ఉన్నమాట వాస్తవం. కాని కవితాప్రక్రియలో మాత్రమే అది ఉజ్జ్వలంగా ప్రకాశించింది. నవల, నాటకం, కథానిక దాని తరవాత చెప్పుకోవలసినవే.

దీనికి కారణాలు లేకపోలేదు. ఈ శతాబ్ది ప్రథమార్థంలో సృజనాత్మకరచన చేసిన వాళ్ళలో ఏ నలుగురయిదుగురో తప్పితే – తక్కినవాళ్ళంతా కవులు. సాహిత్యమంటే కవిత్వమొక్కటేననుకునే వాళ్ళు అప్పట్లో ఎక్కువ. పైగా నవ్యకవిత్వోద్యమం ఒకటి మొదలయింది. దానివల్ల రంగులుకొన్న ఉత్సాహం, మరో ప్రక్రియ మీద మనస్సు పెట్టనీయలేదు. ఆనాటి నవ్యకవుల్లో చాలామంది ఇతర ప్రక్రియల్లో కూడా కొన్ని రచనలు చేసినప్పటికీ స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని అంతగా ప్రతిఫలింపజేయలేదు. వాటిలో కూడా కథానిక మరీ మసకమసకగా కనిపిస్తుంది.

కథానికలు ప్రచురం కావడానికి అప్పట్లో పత్రికలే దిక్కు. వాటిలో ప్రముఖమైనవి 'భారతి' మాసపత్రిక, 'కృష్ణా' వారపత్రిక. తక్కిన పత్రికలు నిలకడగా నిలిచినవి కావు. ఏడాదికి సుమారు అరవై డెబ్భైకథలు అచ్చయితే గొప్ప. అందుకే రావూరి వేంకట సత్యనారాయణరావు గారు ఇలా అంటారు. "స్వాతంత్ర్యగానాలు వినిపించే ప్రగతి పథాన్ని సూచించే నవభారతికి నవ్యనీరాజనాలందించే కథలు అనుకొన్నంతగా బయటకు రాకపోవడం జరిగింది. అది కొంతవరకు నిజమైనప్పటికీ వెలువడినవాటిలో నయినా ఉద్యమస్ఫూర్తి ప్రస్ఫుటం కానందుకు ఆనాటి విమర్శకులు కొందరు సంతృప్తి కనబరిచారు.

సాహిత్యంలో కూడా క్రాంతి (పరివర్తన) తీసుకురావాలి. భారతయువకుని 'క్రాంతి' ప్రతిధ్వనించాలి. ఎందరో వురికంబాల నెక్కుతున్నారు; మరెందరో కూటికి మలమల మాడుతున్నారు. కథాకారుని హృదయంలో సంవేదన ఉత్పన్నమవుట లేదా? అతనిది పాషాణ హృదయమా? 'పుంజీపతుల' శోషణ, మిల్లు యజమానుల ఆవేదన కనిపిస్తాయి. ఇది సంఘర్షణ యుగం. ఏమూల చూచినా సంఘర్షణ. ఈ సంఘర్షణలో నిప్పురవ్వలు లేస్తున్నాయి. ఈ నిప్పురవ్వలు మానవత్వం యొక్క ప్రాచీనత్వ (రూఢితత్వం) పందుటాకుల్ని కాల్చివేయగ.. వీటికి సాహిత్యకారుడు సహాయపడాలి. తన సంవేదనాన్ని ప్రకటించాలి. సాహిత్యమనే నిప్పుగొట్టంలో ఉండాలి. అప్పుడు రూఢి పూర్ణమగు ప్రాచీనత్వం నూడిపోగలదు. నవీన ప్రాచీన విచార సంఘర్షణలో నవ్యవిచారం, స్వాతంత్ర్య

పారతంత్ర్యఘర్షణలో స్వాతంత్ర్యం జయం పొందగలవు. ఈ సంఘర్షణ యుగంలో ఇన్ని విషయాలు, పడి ఉన్నప్పటికీ మన తెలుగు కథాకారులకు నపుంసక విచారమే శరణ్యమవుతున్నది.

'కంట తడి పెట్టాల్సిన విషయం – మొన్నటి వరకూ సత్యాగ్రహ సమరంలో – స్వాతంత్ర్య వేదికమీద ఎందరో ఆంధ్రులు బలి అయినప్పటికీ ఆ రక్తపు వరదల్లోనే మన కథారచయితలు కౌగిలింతల్లో తల్లీనులయి ఉన్నారు. అనుకున్నంతగా ప్రగతిశీలత్వం రాలేదు. దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం సిద్ధించిన ఏభై ఏళ్ళకు – ఈనాడు మనం వెనక్కి తిరిగి చూసుకొన్నప్పుడూ ఆనాటి సాహిత్య విమర్శకుల ఆవేదనను మనస్సులో ఉంచుకొన్నప్పుడూ కొంత అసంతృప్తి కలిగేమాట నిజమే. కాని పూర్తిగా కాదు. చీకట్లో కూడా చిరుదివ్వెలున్నాయి.

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో ఇతివృత్తాలను రూపొందించుకొన్న కథానికా రచయితల్లో మొదట చెప్పుకోదగ్గవారు కనుపర్తి వరలక్ష్మమ్మగారు. వీరి కథల్లో 'కుటీరలక్ష్మి' (ఆంధ్రపత్రిక, సంవత్సరాది సంచిక, ఏప్రిల్ 5, 1924), 'ఐదు మాసముల యిరువది దినములు' (గృహలక్ష్మి, నవంబరు 1931) మనకు కావలసినవి. మొదటి కథలో రామలక్ష్మి, ఒకప్పుడు గొప్పగా బతికినదే. భర్తది బట్టల వ్యాపారం. 1914లో మొదటి ప్రపంచయుద్ధం ఆరంభం కావడంతో అతని వ్యాపారం దెబ్బతింది. అప్పులపాలై చనిపోయాడు. రామలక్ష్మి ఉన్నవన్నీ తెగనమ్మి అప్పులుతీర్చి ఒక పూరిల్లు కట్టించుకొని ఇద్దరు పిల్లలతో జీవనం చేస్తోంది. 1921లో సహాయనిరాకరణోద్యమ ప్రభావంతో ఖద్దరు ఉద్యమంకూడా మొదలు కావడంతో రామలక్ష్మి రాట్నం వడకడం నేర్చుకొని నూలు అమ్ముకొంటూ పిల్లలను పోషించుకొంటూ ఉండడం ఈ కథలో కనిపిస్తుంది. రెండో కథలో రుక్మిణి సంపన్నుల బిడ్డ. ఆమెభర్త గోపాలరావు జాతీయతావాది. అతడు ఖద్దరు బట్టలే కట్టుకొంటాడు. భార్య విదేశీ విల్లు బట్టలు కట్టుకొంటూ ఉండడం హర్షించలేకపోతాడు. ఆమెను నిర్బంధించకపోయినా ఆమెపట్ల ముభావంగా ఉంటాడు. విదేశవస్తు బహిష్కరణలో భాగంగా అతడు ఒకనాడు పికెటింగ్ చేసి అరెస్టవుతాడు. ఆరునెలల శిక్షపడుతుంది. 'సి' క్లాసుఖైదు.

'సత్యాగ్రహోద్యమముచే దేశమట్టుడికి నట్లుడికి పోవుచున్నను వానిని గురించి ఆమె కొంచెం గూడ విచారించి యుండలేదు' అంటారు రచయిత్రి. అతడు జైలుకు వెళ్ళిన తరువాత, చీ! నా పతికి అప్రియములగుటయేగాక శిక్షాహేతువులైన ఈ విదేశవస్త్రములు నాకేల?' అనుకొని వాటిని పరిహరిస్తుంది. 'ఇప్పుడు ఖద్దరు వస్త్రధారిణి... ఇప్పుడు ఎల్లవేళల రాట్నపు నినదము'. అతని నడవడికి మెచ్చుకొని జైలు అధికారులు, శిక్షాకాలం పూర్తికాకముందే అతన్ని విడుదలచేస్తారు. అతనిలో 'జవము సడలిపోయినది. మారురూపు పడిపోయినాడు. కాని యుజ్జ్వలములైన ఆ నేత్రములలో దీపించు ఆ దేశభక్తికి తరుగు ఒరుగులు లేవు. అతడు ఇంటికి రాగానే ఆమె అతని మెళ్లో పూలదండవేయబోతుంది. అది సీమనూలుతో కట్టిన దండేమోనని అతను సందేహం వెలిబుచ్చుతాడు. సీమమాల నా చేతినుండి తొలగి అయిదు మాసముల ఇరువది దినములు అంటుంది రుక్మిణి.

బందా కనకలింగేశ్వరరావుగారు, అస్పృశ్యతానివారణను ఇతివృత్తంగా తీసుకొని 'గుక్కెడు నీళ్ళు' అన్న కథ రాశారు. అందులో కరణం బ్రహ్మయ్య, మహలక్ష్మమ్మ దంపతులు. వారికి పిల్లలులేరు ఊళ్ళో కలరా వచ్చింది. బ్రహ్మయ్య చనిపోతాడు. అతని శవాన్నికాటికి తీసుకువెళ్ళడానికి ఊరి వాళ్ళు ఎవరూ ముందుకురారు. వెంకటప్ప ఒక్కడే మహలక్ష్మమ్మకు సాయపడతాడు. తరువాత అతనికీ కలరా వస్తుంది. వెంకటప్ప స్పృహతప్పి రోడ్డుమీద పడి ఉన్నాడని విని, మహలక్ష్మమ్మ పాలని ఇచ్చి అతన్ని తన ఇంటికి తెచ్చి ఉపచారాలు చేస్తుంది. అతను కోలుకొంటాడు. కాని కులం వాళ్ళు ఆమెను వెలివేస్తారు. ఆమె లెక్కచెయ్యదు. కొన్నాళ్ళకు ఆమెకు జబ్బుచేస్తుంది. గుక్కెడు తులసితీర్థం వెంకటప్ప చేత గొంతులో పోయించుకొని ఆమె ప్రాణం విడుస్తుంది. చనిపోయేముందు ఆమె విల్లు రాయిస్తుంది. తనకు పిల్లలు లేనందుకు తన ఆస్తి అంతా వెంకటప్పకు చెందేటట్లు చేస్తుంది. ఇంట్లో ఉన్న రూ.50 వేల రొక్కంలో సగం అతన్ని తీసుకోమనీ, తక్కినది అస్పృశ్యతానివారణకు ప్రచారం చెయ్యడానికీ, వాళ్ళకు ఇళ్ళూ సత్రాలనూ కట్టించడానికి వినియోగించుమనీ చెబుతుంది.

15.8.1949 నాటి 'కాకతీయపత్రిక'లో 'గొల్లరామవ్వ' అన్న కథ అచ్చయింది. రచయిత ఎవరో తెలియదు. కలం పేరు 'విజయ'. అందులో ప్రధాన పాత్రలు మూడే. రామవ్వ, ఆమె మనుమరాలు మల్లమ్మ, శరణాగతుడై వచ్చిన ఆగంతుకుడు.

ఒకనాటి రాత్రి ఒక శరణాగతుడు, కిటికీగుండా ఆమె ఇంట్లోకి చొరబడతాడు. అతను పోలిసో, రజాకారో అనుకొని రామవ్వ ముందు భయపడుతుంది. తర్వాత అతని సంగతి తెలుసుకొని జాలిపడుతుంది. అతనికి ఒళ్ళంతా గుచ్చుకొన్న ముళు ్ళ, అంటిన మన్ను, జ్వరం, మనమరాలిచేత ఉపచారాలు చేయించి గట్క తాగించి మంచం మీద పడుకోబెట్టింది. అతని దగ్గరున్న పిస్తోలు ఆమె కంటబడింది. పోలుసువాళ్ళను చంపానని చెబుతాడతను. 'ఇద్దర్నా?...... కాని ఇంకిద్దరు మిగిలిన్రు కొడుకా! సగంపనే చేసినవు' అంటుందామె.

ఇంతలో బయట అరుపులూ హాహాకారాలు వినిపిస్తాయి. రామవ్వను తలుపు తియ్యమని పోలీసులు ఒత్తిడి చేస్తారు. అప్పుడామె, శరణార్థికి గొల్లమురుగులు వేయించి, గొంగడి కప్పించి మనమరాల్ని కూడా అతని మంచం మీద పడుకోమంటుంది. పోలీసు జమాదారు లోపలకి వచ్చి 'కాంగ్రెసోడాయేం?' అని శరణార్థిని చూసి రామవ్వను అడుగుతాడు. అతడు తన మనమరాలి మగడని చెప్పడమే కాక, 'వాడెవ్వడా? ఎవ్వడు పడితే వాడు మా పక్కల్ల పండటానికి మేమేం బోగమోల్లమనుకున్నావా? నిన్నెవడన్న గట్లనే అడుగుతె ఎట్లుంటిది? ఈ మాట్తోలి మానం దీసుడెందుకు? పానం తియరాదుండి! అంటుంది. జమాదారు వెళ్ళిపోతాడు. అప్పుడు, శరణాగతుడైన యువకుడు అవ్వా నువ్వు సామాన్యురాలవుగావు. సాక్షాత్ భారతమాతవే! అంటాడు. భావలీనతో కళ్ళు మూసుకొని.

'దోడ్డ్! కొంటె పోరాడా! నాకే పేర్లు బెడుతున్నావు?.... నా పేరు గొల్లరామి! గంతే... ఇగ నువ్వెల్లు అత్తోరింటికి తోలుకపోత.. పొద్దెక్కుతుంది. ఊ యెల్లు.. ఇదీ కథ. వేలూరి శివరామ శాస్త్రిగారి 'వెలి' (1950 కి పూర్వం చాలా కాలం కిందట 'భారతి' పత్రికలో ప్రచురణ అయింది) కథలో స్వదేశి వస్త్రాలను గురించి, వేళాకోళపు సంభాషణలో ప్రస్తావన వస్తుంది. సురవరం ప్రతాపరెడ్డిగారి 'సంఘాల పంతులు' కథలో, ఆ పంతులు 'కూలి ఇయ్యనిది వెట్టి చేయకూడదు' అని ఊరివాళ్ళకు ఉద్బోధిస్తాడు. అమీనుకు ఉచితసేవలు ఆగిపోయాయి. పంతులును పిలిపించాడతను. పంతులుమీద జవాన్లకు కోపం వచ్చి ఆరిచారు. ఇంతలో జనం బయటినుంచి వచ్చారు. జవాన్లను, అమీన్‌ను మోదారు. వారందినాలకు మొహతెం మీం వచ్చి విచారణ జరిపి అమీన్‌ను భర్తరపు చేశాడు. ఊరివాళ్ళు పండుగ చేసుకొన్నారు. గోపీచంద్ గారు రాసిన 'బస్సు ఆగింది – పోయింది' అన్నకథలో రామచంద్రరావు అనే అతను పరిచయస్థుల ఇంటికి వెళ్ళినప్పుడు, ఆ ఇంట్లో వాళ్ళ సంభాషణల్లో ఆనాటి రాజకీయ పరిస్థితుల ప్రస్తావన వస్తుంది.

కొడవటిగంటి కుటుంబరావుగారి 'దీపావళి' కథలో, ఇంటి అల్లుడు, 'బీదవాళ్ళకి చౌకగా అందవలసిన బట్టలు దొంగవ్యాపారుల దగ్గిర బోలెడంత ధరపోసి కొనకపోతే హాయిగా నేతబట్టలుగాని ఖద్దరు బట్టలుగాని కొనరాదా అంటాడు. ఆయనే రాసిన 'నీకాలు మొక్కుతా! నీ బాన్చని' అన్న కథలో '... ఎంత ధైర్యంగా పోట్లాడుతున్నారోయ్, స్వాతంత్ర్యం కోసం! నేను కల్లోకూడా అనుకోలేదు సుమా! నయమే, నిజాములో కమ్యూనిష్టులు కూడా మంచిపనే చేస్తున్నారు. వాళ్ళని మెచ్చుకోక తప్పదు', అంటాడు. 'జ్ఞాని' కథలో ఒక పాత్ర అన్నది ఇది. 'ప్రపంచం తప్పుడు దారిని పడుతోంది. రాజకీయ సాధనాలు మార్చుకోకపోతే మానవజాతి ఇంకా అధోగతికి పోయేలా కనిపిస్తోంది. ఈ అయోమయావస్థలో గాంధీజీ ఒక్కరే సరైన రాజకీయ సాధనాలు చెప్పారు. సత్యాహింసలు మీరేమంటారు? అంటే దానికి మరో పాత్ర సమాధానం, '...సత్యమే తెలుసుకుంటే అహింసే లేదోయ్... కర్తవ్యం గ్రహించి కర్తృత్వం విసర్జించడమే సరయిన మార్గం', అంటూ గీతావాక్యాన్ని తన అభిప్రాయానికి అనువైన విధంగా వ్యాఖ్యానిస్తాడు. 'డ్యూయల్ డస్కులా? సింగల్ డస్కులా?' అన్న పేరుతో కవికొండల వెంకటరావుగారు ఒక కథ రాశారు. అందులో రాజకీయ విషయాలపట్ల కాలేజి విద్యార్థులకున్న ఆసక్తిని తెలియబరిచారు.

**తెలుగు కథలపై ఉద్యమాల ప్రభావం :-**

జ్వాలాముఖి, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి కనిపించే కథలను కొన్నిటిని ప్రస్తావిస్తూ 'జాతీయోద్యమ ప్రభావం కథావాఙ్మయం మీద అంతగా పడలేదు. జాతీయోద్యమ కథలు సుమారు లేవనే చెప్పవచ్చు అన్నారు. ఆయన పేర్కొన్న కథలు ఇవి.

1. రాయసం వెంకట శివుడుగారు 1925-26 మధ్యకాలంలో రాసిన 'పార్వతి అనుతాపం' అన్న కథ. శాంతినికేతన్ విద్యార్థి అయిన భర్తను మొదట్లో అనుసరించని భార్య ఆ తరవాత కాకినాడ కాంగ్రెసులో స్వచ్ఛందసేవికగా చేరుతుంది.

2. బుర్రా సుబ్రహ్మణ్యంగారి కథ 'జ్యోతిష్యం'. ఇది 1935 నాటి తీవ్రవాదుల జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. ఆంగ్లేయాధికారిని ఒక వంగ యువకుడు చంపిన సాహసగాథ ఇది.
3. ముద్దుకృష్ణ రాసిన 'నా మంత్రి' జాతీయోద్యమ కథ.
4. చలం రాసిన '1960' గాంధీగారి మద్యపాన వ్యతిరేకోద్యమాన్ని హేళన చేస్తూ రాసినది.
5. మల్లాది రామకృష్ణశాస్త్రిగారు 'కైంకర్యం' కథలో మద్యపాన నిషేధాన్ని వ్యతిరేకిస్తూ ఖద్దరును ప్రేమిస్తారు.
6. జి.వి.కృష్ణారావు 'అనిర్వచనీయ ఖ్యాతి'లో జాతీయోద్యమం వల్ల కొన్ని కుటుంబాలు ఎలా దురవస్థల పాలయిందీ చిత్రించారు.
7. 'ద్వేషం' అన్న కథలో అడవి బాపిరాజుగారు జాతీయోద్యమాన్ని ప్రధానవస్తువుగా తీసుకొన్నారు. ఇందులో కథానాయకుడు జాతీయోద్యమంలో పాల్గొని దీపాంతరవాస శిక్ష అనుభవిస్తాడు. ఆయన రాసిన 'వడగళ్లు' కథలో కూడా జాతీయతాభావన కనిపిస్తుంది.
8. 'అరాచకము' అన్న కథలో వేలూరి శివరామశాస్త్రిగారు జమీందారుల దౌర్జన్యాన్ని, కాంగ్రెసువారి తిరుగుబాటును, కమ్యూనిస్టుల వర్గ పోరాటాన్ని చిత్రించారు.
9. స్వాతంత్ర్య పోరాట కాలంలో తెలంగాణా ప్రజల జీవన సంఘటనలను ఆధారం చేసుకొని వట్టికోట ఆళ్వారుస్వామిగారు రాసిన కథలు 'జైలు లోపల' అనే పేరుతో ఒక సంపుటంగా వచ్చింది.

వీటితోపాటు, మల్లాది రామకృష్ణశాస్త్రిగారు రచించిన మరో రెండు కథలను గుర్తు చేసుకోవలసిఉంటుంది. 'చైత్రరథం'లో ఒకవేశ్య సత్యాగ్రహోద్యమంలో పాల్గొని దేశభక్తిని చూపినందుకు రాజకీయ బాధలు అనుభవించవలసి వస్తుంది.

మరోకథ పేరు 'మంత్రపుష్పం' రెండో ప్రపంచయుద్ధం కాలంలో మిలటరీవాళ్ళు వెళ్తున్న రైలు ఒక ఊళ్ళో ఆగింది. మిలటరీ వాళ్ళంటే ప్రజలకు భయం. ఆడపిల్ల కనిపిస్తే మిలటరీవాళ్ళు వదిలేవాళ్ళు కారట. ఈ ఊళ్ళో 'చిట్టి' అనే అమాయకురాలు ఉంది. ఆమె అనాథశ్రమంలో పెరిగిన పిల్ల. ఆమె మిలటరీవాళ్ళ దగ్గరికి వెళ్ళింది. ఊళ్ళో ఉన్న ఆడపిల్లలను ఏమీ చెయ్యవద్దని వాళ్ళకు చెప్పి, తాను వాళ్ళకు సుఖాన్ని ఇచ్చింది. వాళ్ళిచ్చిన కానుకలను అందరికీ పంచిపెట్టింది. ప్రభుత్వం ఆమెకు సేవాపథకమిస్తే దాన్ని అధ్యక్షులవారి భార్యమెడలో వేసింది. అలాంటి చిట్టి చనిపోయింది! 'చిట్టి భౌతిక శరీర లేశానికి వీరాధివీరోచిత మర్యాదలు జరిగినవి. త్రివర్ణపతాకాన్ని కప్పి, కాంగ్రెసు వాలంటీర్లు, రెండోరకం నాయకులు జయజయ నినాదాలతో బారులు తీరి ముందు నడవగా చిట్టి పితృవనానికి పయనించింది. మంచి గంధపుధూళిలో మరిగిపోయింది' అని వాళ్ళచేతనే చెప్పించారు రచయిత.

**ఆధార గ్రంథాలు :-**

1. డాక్టర్ సి.మృణాళిని, స్త్రీవాద నవలలు – కథలు : అస్తిత్వ పోరాటం వివేచన, పరిశోధన పత్రిక, జాతీయ సాహితీ సదస్సు ప్రత్యేక సంచిక, సంచిక 27, సెప్టెంబర్ 2006 (తెలుగు శాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు-7.
2. రాజేశ్వరి స్త్రీవాద దృక్పథం వ్యాసావళి, 2003.
3. ఆధునికాంధ్ర సాహిత్య వికాసం, దూరవిద్యాకేంద్రం ప్రచురణ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.
4. డాక్టర్ ద్వానా శాస్త్రి, తెలుగు సాహిత్య చరిత్ర, ప్రతిభ పబ్లికేషన్స్, హైదరాబాద్, ద్వితీయ ముద్రణ 2004.
5. పూర్ణి, సత్యవతి, స్త్రీవాద కవిత్వం – వస్తువైవిధ్యం, ఎం.ఫిల్., లఘు సిద్ధాంత వ్యాసం, శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, జూన్, 2005.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమంలో 'శుభోదయం'

డా॥ డి. నల్లన్న, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి – 517 507.

భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి ఎన్నో ఉద్యమాలు జరిగాయి. మతోద్యమాలు, భాషోద్యమాలు, ప్రాంతీయత రక్షణోద్యమాలు ఇలా ఎన్నో జరిగాయి. ఇవన్నీ ఒక ఎత్తు అయితే దేశ స్వాతంత్రోద్యమం మరో ఎత్తు. వందేమాతరోద్యమం నుంచి క్విట్ ఇండియా ఉద్యమం దాకా జరిగిన అనేక ఉద్యమాలను తనలో ఇముద్చుకొని స్వాతంత్రోద్యమం జాతీయోద్యమంగా, చైతన్యోద్యమంగా, విశిష్టోద్యమంగా విలసిల్లింది.

ఒకప్పుడు మనదేశానికి స్వాతంత్ర్యం లేదు. దాదాపు మూడు వందల సంవత్సరాలుగా విదేశీయుల పాలనలో దేశం యావత్తూ బాగా మగ్గిపోయింది. పరదేశీ వస్తువుల వాడకం మన మీద రుద్దబడింది. వాటి మీద మోజు పెంచబడింది. అందువల్ల స్వదేశీ వస్తువులకు గిరాకీ బాగా తగ్గిపోయింది. కాబట్టి దేశంలో దారిద్ర్యం తాండవించింది. కూడు, గుడ్డ, గూడు చాలామందికి కరువయ్యాయి. దేశం ఇక్కట్ల పాలయింది. బ్రిటిష్ వారి పరిపాలనలో వారిదే పై చేయి. వారి దయాదాక్షిణ్యాల మీద బ్రతుకవలసిన పరిస్థితి భారతీయులకు ఏర్పడింది. వాక్ స్వాతంత్ర్యం లేదు. మత స్వాతంత్ర్యం కూడా అంతంత మాత్రమే. తెల్లవారిని దొరలుగా భావిస్తూ బానిస బతుకులు బ్రతకడం ఇక్కడ అలవాటయిపోయింది. ఈ స్థితి మారాలనీ మేధావులు కొందరు భావించారు. ఆంగ్లభాషను నేర్చుకున్నారు. ఆంగ్లేయుల కుయుక్తులను పసిగట్టారు. తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. మొదట గౌరవంగానే మహజర్‌లతో పరిస్థితులను చక్కబెట్టచూశారు. అది ఆశించినంత ఫలితాలను ఇవ్వలేదు. బాలగంగాధర్ తిలక్ వంటి దేశభక్తులు 'స్వాతంత్ర్యం నా జన్మహక్కు' అని నినదించారు. 1930లో దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని కాంగ్రెసు మహాసభ తీర్మానం చేసింది. ఈ విధంగా బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారతదేశంలో అనేక ఉద్యమాలు జరిగాయి.

ఈ ఉద్యమాల నుంచి స్ఫూర్తి పొందిన చాలామంది కవులు, రచయితలు రాయడం మొదలుపెట్టారు. వారు పొందిన స్ఫూర్తినే పాఠకులకందించి వారిలో ద్విగుణీకృతోత్సాహన్ని పురికొల్పారు. ఫలితంగా ఉద్యమం ఊపందుకుంది. కవులు, రచయితలలో కొందరు ఉద్యమాల్లో పాల్గొన్నారు. జైళ్ళకు వెళ్ళారు. అక్కడి పరిస్థితులను ఆకళింపు చేసుకొని రాశారు. ఉద్యమకాలంలో లేనివాళు ్ళ కూడా ఆ ఉద్యమాల ప్రభావానికి లోనై ఉద్యమాత్మక రచనలు చేశారు. వారి ఉద్దేశం స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా స్వాతంత్రోద్యమ స్ఫూర్తితోనే మసలు కోవాలన్నదే. ప్రతి ఒక్కరు దేశభక్తితో తేజరిల్లాలన్నదే. ఇలా చేయగలిగితే భారతావని తన పూర్వవైభవాన్ని సంతరించుకుంటుందని వారి విశ్వాసం, ఆకాంక్షనూ. ఈ విధంగా రచన సాగించిన వారిలో ఉన్నవ విజయలక్ష్మి గారు ప్రసిద్ధులు. వీరు రచించిన 'శుభోదయం' నవలను పరిచయం చేసేందుకే ఈ వ్యాసం ప్రయత్నిస్తుంది.

విజయలక్ష్మిగారు స్వాతంత్రోద్యమ కాలంలో లేరు. కానీ వీరి కుటుంబం జాతీయోద్యమం చేత బాగా ప్రభావితమైన కుటుంబాలలో ఒకటి. అందువల్ల వీరికి స్వాతంత్రోద్యమ స్ఫూర్తి ఒంటబట్టింది. ఆ స్ఫూర్తితోనే 'శుభోదయం' అనే నవల రచించారు. భారతదేశానికి 'శుభోదయం' రావాలనే వీరి ఆకాంక్షను ప్రతిబింబింప చేశారు. శుభోదయం నవలలో ఉన్న వారు జాతీయోద్యమానికి ప్రముఖ స్థానమిచ్చారు. వందేమాతరం ఉద్యమం నుంచీ స్వాతంత్ర్యం సిద్ధించేదాకా సాగిన అన్ని ఉద్యమాలకు ఇందులో స్థానం కల్పించారు. స్వాతంత్ర్యం తరువాత చోటుచేసుకున్న ప్రజాజీవనాన్ని కూడా ఈ నవలలో విజయలక్ష్మిగారు చిత్రించారు. మొత్తానికి ఈ నవలంతా దేశభక్తి గుభాళిస్తూ ఉందంటే అతిశయోక్తి కాదు.

భీమవరంలో ఒక సంపన్న కుటుంబం ఉండేది. దానికి చెందినవారు చంద్రశేఖరం. ప్లీడరు చదువు పూర్తిచేశాడు. అంతలో జాతీయోద్యమం ప్రభావం అతని మీద పడింది. ప్లీడరు వృత్తి చేసేందుకు మనసు అంగీకరించలేదు. స్వాతంత్రోద్యమంలో దూకాడు. భార్యను, పిల్లలను కూడా ఆ ఉద్యమం వైపు నడిపించాడు. వారంతా కాంగ్రెసు మహాసభకు వెళ్ళి ప్రభావితులయ్యారు. కల్లుపాకల దగ్గర పికెటింగ్ చేశారు.

చంద్రశేఖరం కుమారుడు సత్యమూర్తి. కాకినాడ కళాశాలలో చదివేవాడు. అతని మిత్రుడు సుబ్బారావు. సత్యమూర్తి సుబ్బారావుకు కూడా జాతీయోద్యమ స్ఫూర్తిని ఒంటబట్టించాడు. తన ఇంటికి తీసుకువచ్చాడు. తన ఇంటి వాతావరణంతో అతడు ప్రభావితుడయ్యేటట్టు చేశాడు.

సత్యమూర్తి రోహిణిని వివాహం చేసుకున్నాడు. ఆమె అత్తవారింటికి వచ్చింది. అక్కడి వాతావరణం ఆమెకు నచ్చింది. దేశభక్తిని పెంపొందించుకుంది. ఆ కుటుంబంలో చక్కగా ఇమిడిపోయింది. భారతదేశానికి సైమన్ కమీషన్ వచ్చింది. అయితే ఆ కమీషన్‌కు వ్యతిరేకంగా భారతీయులు పోటెత్తారు. 'సైమన్ వెనుక వెళ్ళు' అని నినదించారు. సైమన్ వ్యతిరేకోద్యమంలో పాల్గొనేందుకు సత్యమూర్తి బయలుదేరాడు. రోహిణి సగర్వంగా, సగౌరవంగా అతణ్ణి సాగనంపింది.

పశ్చిమగోదావరి జిల్లాలో కూడా ఉప్పు సత్యాగ్రహం భారీ ఎత్తున సాగింది. చంద్రశేఖరం, పార్వతి, సత్యమూర్తి, సుబ్బారావు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. రోహిణి కూడా సత్యాగ్రహానికి సిద్ధపడింది కానీ అత్త వారించడం వల్ల ఆగిపోవలసి వచ్చింది. రోహిణి ఉద్యమనిర్మాణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంది. ఖద్దరు విక్రయించింది. కల్లుపాకల దగ్గర పికెటింగ్ చేసింది. 'మాకొద్దీ తెల్లదొరతనం' అని పాడుకుంటూ కార్యకర్తలతో కలిసి గ్రామాలలో తిరిగింది. రోహిణి ఉద్యమాలు నిర్వహణలో పాల్గొనడం తనకు ఎంతోనచ్చినట్లు మనసులో అనుకొన్న మాటల వల్ల తెలుస్తుంది. "నేను చాలా అదృష్టవంతు రాలిని. అందుకే ఇలాంటి దేశభక్తుల ఇంట పడ్డాను. ఏ ప్రయోజనమూ లేకుండా సారవిహీనంగా గడచిపోవలసిన నా జీవితానికి ఒక లక్ష్యం దొరికింది. నా శక్తి వంచన లేకుండా నా జన్మభూమికి సేవచేసుకోగలుగుతున్నాను అనే తృప్తి నాకు మిగులుతోంది". (శు భోదయం, పుట. 62) సత్యాగ్రహంలో పాల్గొన్న వారందరూ జైలుకు వెళ్ళారు. లాఠీదెబ్బలు తిన్నారు. జైల్లో ఉన్నప్పుడే సుబ్బారావు ఆరోగ్యం క్షీణించింది.

గాంధీ ఇర్విన్ ఒడంబడిక విఫలమయ్యింది. జాతీయోద్యమం మునుపటి కంటే అధికంగా ఊపందుకుంది. చంద్రశేఖరం, సుబ్బారావు, సత్యమూర్తి సభలకు వెళ్ళారు. లాఠీదెబ్బలు తిన్నారు. మళ్ళీ అరెస్టు అయ్యారు. రెండు సంవత్సరాలు జైలు శిక్ష పడింది. రెండేళ్ళు జైలులోనే గడిపి ముగ్గురు బయటికి వచ్చారు. అంతంత మాత్రంగానే ఉన్న సుబ్బారావు ఆరోగ్యం జైల్లో అడుగంటింది. విడుదలయ్యాక మంచమెక్కాడు. అతని ఆరోగ్యపరిస్థితి క్షీణించే కొద్ది సుబ్బారావులో దేశభక్తి పెరగసాగింది. తన దుస్థితికి వాపోయాడు. భార్య సుందరితో అతడు అన్న మాటలే దీనికి తార్కాణం "నేను జైల్లో ఉండగా మరణిస్తేనో" లేక లాఠీదెబ్బలకో, గుండె దెబ్బలకో మరణిస్తేనో బాగుండేది కదూ! అప్పుడు నేను అమరవీరుడని అయ్యేవాడిని. కానీ ఇదేమిటి ఇలా రోగంతో మంచం ఎక్కి దేశసేవ చెయ్యటానికి కూడా పనికిరాకుండా పోయి ఇలా చచ్చిపోతే నేను దేశం కోసం ప్రాణాలు వదిలినట్లు కాదు కదూ! ఆ విషయంలో నేను చాలా దురదృష్టవంతుడిని" (శుభోదయం, పుట. 73) వైద్యం ఫలించలేదు. సుబ్బారావు మరణించాడు. సుందరి అధైర్యపడలేదు. మనోవ్యథతో క్రుంగిపోలేదు. పైగా తానొక దేశభక్తుడి భార్య అని పొంగిపోయింది. పుట్టింటికి వచ్చింది. ఉద్యమ నిర్మాణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంది.

బ్రిటిష్ వారి పాలనలో ఆంగ్లభాషే అధికార భాషగా ఉండేది. దాన్ని దేశభక్తులు వ్యతిరేకించారు. భారతీయ భాషల్లో ఏదో ఒకటి అధికార భాష కావాలని పట్టుబట్టారు. అప్పుడు ఎక్కువ జనం మాట్లాడే భాష హిందీభాషే. అందువల్ల హిందీ భాషనే అధికార భాషగా ఉద్యమకారులు అంగీకరించారు. విభిన్న భాషలు మాట్లాడేవారు దాన్ని మాధ్యమంగా స్వీకరించారు. అందువల్ల సామాన్య ప్రజలకు హిందీ నేర్పడం కూడా నిర్మాణ కార్యక్రమాల్లో భాగమయ్యింది. సత్యమూర్తి సామాన్య జనానికి హిందీ నేర్పాలని సంకల్పించాడు. రోహిణితో కలిసి చెన్నైకి వెళ్ళాడు. త్యాగరాజ నగర్‌లో ఉన్న దక్షిణ భారత హిందీ ప్రచార సభలో చేరాడు. హిందీ నేర్చుకున్నాడు. స్వస్థలానికి తిరిగి వచ్చాడు. అందరికీ హిందీ నేర్పడం ఆరంభించాడు.

సత్యమూర్తి చెల్లెలు సుందరిని పునర్వివాహానికి పురికొల్పాడు. నచ్చజెప్పాడు. జీవితం మీద ఒక అవగాహన ఏర్పరచే ప్రయత్నం చేశాడు. పర్యవసానంగా సుందరి మోహనరావులకు పెళ్ళి జరిగింది. మోహనరావు కూడా చంద్రశేఖరం ఇంటి

వాతావరణ ప్రభావానికి లోనయ్యాడు. అతనికి కూడా దేశభక్తి అలవడింది. తాను చేస్తున్న హెడ్మాస్టర్ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. వ్యక్తి సత్యాగ్రహం వచ్చింది. చంద్రశేఖరం, సత్యమూర్తితో పాటు మోహనరావు కూడా పాల్గొన్నాడు. ముగ్గురిని రాయవేలూరు జైలుకు తరలించారు. అక్కడ తొమ్మిది నెలలు గడిపి ముగ్గురు బయటికి వచ్చారు.

పందొమ్మిది వందల నలభై రెండవ సంవత్సరం ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైంది. 'డు ఆర్ డై' అని గాంధీ మహాత్ముడు స్వాతంత్ర్యయోధులను బాగా పురికొల్పాడు. జనం తండోపతండాలుగా ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. జైళ్ళు నింపేశారు. చంద్రశేఖరం, సత్యమూర్తి, మోహనరావు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. జైలుకు వెళ్ళారు. యధాపూర్వంగానే జైలులో రకరకాల కష్టాలు అనుభవించారు. పందొమ్మిది వందల నలభై ఐదు సంవత్సరంలో జైలు నుంచి బయటకు వచ్చారు. అంటే మొత్తం మూడు సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించారన్న మాట.

చాలామంది జాతీయోద్యమ నవలాకారులు స్వాతంత్రోద్యమాన్ని ప్రధానంగా తీసుకొని తమ రచనను దానికే పరిమితం చేశారు. కొందరూ జాతీయోద్యమానికి పెద్దపీట వేస్తూనే స్వతంత్ర భారతదేశంలో కూడా ఉద్యమ లక్ష్య స్పృహతో, దేశభక్తితో జనం మసలుకోవాలనే విధంగా తమ నవలల్లో ఆవిష్కరించారు. ఉదాహరణకు మహీధర రామ్మోహనరావుగారు 'కొల్లాయి గట్టితేనేమి' నవలను స్వాతంత్రోద్యమానికే పరిమితం చేశాడు. మాలతీచందూర్‌గారు అలాగాక స్వతంత్ర భారతదేశ జీవితాన్ని కూడా వివిధ కోణాల నుంచి ఆవిష్కరించారు. అలాగే ఉన్నవ విజయలక్ష్మిగారు కూడా స్వతంత్ర భారతదేశంలోని రెండు తరాల జీవితాన్ని స్పృశించారు. ప్రతివారూ నిజాయితీతో, దేశభక్తితో మసలుకోవాలని ధ్వనింపచేశారు. స్వాతంత్రోద్యమకారుల లక్ష్యాన్ని సాధించేందుకు అదే మంచి మార్గమని అభివ్యక్తపరచారు.

'శుభోదయం' నవలలో చాలాభాగం స్వాతంత్రోద్యమానికే కేటాయించబడింది. లాయరు కావలసిన చంద్రశేఖరం ఆ వృత్తిని పక్కనబెట్టాడు. జాతీయోద్యమంలో పాల్గొన్నాడు. జైలుకు వెళ్ళాడు. కుటుంబాన్ని కూడా ప్రభావితం చేసి తన మార్గంలోనే నడిపించాడు. సత్యమూర్తి కూడా తండ్రి దారిలోనే నడిచాడు. సుబ్బారావును ప్రభావితం చేసి ఉద్యమంలోకి దింపాడు. సుబ్బారావు అయితే జైలుకు వెళ్ళి ఆరోగ్యం పాడుచేసుకున్నాడు. చివరికి ప్రాణాలు కోల్పోయాడు. మోహనరావు నిక్షేపం లాంటి ఉద్యోగాన్ని వదులుకొని ఉద్యమంలోకి దూకాడు. ఈ నవలలో చోటుచేసుకున్న మూడు స్త్రీ పాత్రలు కూడా స్వాతంత్రోద్యమం వైపు మొగ్గుచూపడం విశేషం. పార్వతి, రోహిణి, సుందరి జాతీయోద్యమంలో పాల్గొన్నారు. పార్వతి సరాసరి జైలుకు వెళితే సుందరి, రోహిణి ఉద్యమ నిర్మాణ కార్యక్రమాల్లో పాల్గొనడం విశేషం. మొత్తానికి ఉన్నవ విజయలక్ష్మిగారు రచించిన 'శుభోదయం' నవల చదివితే దేశ శుభోదయం కోసం ప్రతివారు ప్రయత్నించాలనే విషయం ప్రతివారికీ బోధపడుతుంది. ప్రతి ఒక్కరు ఉద్యమస్ఫూర్తితో మసలుకోవాలనే విదితమవుతుంది.

**ఆధారగ్రంథాలు :-**

1. కొల్లాయి గట్టితేనేమి – మహీధర రామ్మోహనరావు
2. తెలుగు నవలా వికాసం – ఆచార్య మొదలి నాగభూషణశర్మ
3. శుభోదయం – ఉన్నవ విజయలక్ష్మి
4. హృదయనేత్రి–పుదువెళ్ళం–తులనాత్మక అధ్యయనం – డా. బి. కల్పన
5. హృదయనేత్రి – మాలతీచందూర్

# మాగంటి అన్నపూర్ణాదేవి లేఖాసాహిత్యం – దేశభక్తి

డా॥ డి. శ్రీనివాసులు, తెలుగు అధ్యాపకులు, ఎన్.టి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వాల్మీకిపురం - 517 325. చరవాణి : 94946 96990.

**పరిచయం :** “నన్ను మరచినను దేశమును మరువవలదు – నేను స్థిరము గాదు” అని భర్తకు ఉత్తరం రాసిన ధీశాలి, త్యాగశీలి, అద్వితీయ దేశభక్తురాలు, అసమాన స్వతంత్రసమరయోధురాలు, విదుషీమణి, రచయిత్రి, సమాజసేవిక మాగంటి అన్నపూర్ణాదేవి. ఆమె తన 27వ యేటనే మరణించినా అప్పటికే భారత స్వాతంత్రోద్యమంలో ప్రముఖమైన పాత్ర నిర్వహించి మహాత్మాగాంధీ గారి మన్ననలు పొందినారు. ఆమె భర్త మాగంటి బాపినీడు దక్షిణాదిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు.

**బాల్యం – విద్యాభ్యాసం :** అన్నపూర్ణాదేవి గారు క్రీ.శ. 1900లో ఒక మధ్యతరగతి కుటుంబంలో కలగర రామస్వామి, పిచ్చమ్మ దంపతులకు జన్మించారు. ఏలూరుకు చెందిన రాలి శేషగిరిరావు ఆమెకు గురువు, మార్గదర్శి. ఆదిపూడి సోమనాధరావు అనే కవి, సంఘసంస్కర్త కూడా ఆమెపై ప్రభావం చూపారు. మొదట్లో ఆమె ఇంటివద్దనే చదువుకొన్నారు. తరువాత గుంటూరు మిషన్ స్కూలు, కలకత్తా బ్రహ్మసమాజ బాలికల పాఠశాలలో చదువుకున్నారు. ఆర్థికంగా బలహీనులైన ఆమె తల్లిదండ్రులు ఎంతో శ్రమించి ఆమె విద్యాభ్యాసానికి అవసరమైన ఖర్చులు భరించారు. కలకత్తాలో శ్రీమతి శకుంతలాదేవి, హేమచంద్ర సిర్కార్ వంటి విద్యావేత్తలు ఆమె చదువు, జీవితం రూపుదిద్దుకోవడంలో సహాయపడ్డారు. ఆమె పాఠశాల విద్యతోపాటు బెంగాలీ భాషలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. బెంగాలీ నుండి తెలుగులోకి పెక్కు అనువాదాలు చేశారు. స్వాతంత్ర్యపోరాటంలో అరవింద్ ఘోష్ రాసిన ఉత్తరాలను తెలుగులోకి అనువదించారు. ఐదేళ్ళ చదువు తరువాత ఏలూరుకు తిరిగి వచ్చారు. ఒక సంవత్సరం తరువాత మద్రాసు విశ్వవిద్యాలయం మెట్రిక్యులేషన్ పరీక్ష రాశారు.

తన చదువుకు కావలసిన ధనం సంపాదించుకోవడం కోసం 1917లో తన 17వ యేటనే ‘సీతారామ’ అనే పుస్తకాన్ని రాసి ప్రచురించారు. అది తరువాత ఉన్నత పాఠశాల చదువులకు పాఠ్యపుస్తకంగా నిర్దేశించబడింది. తరువాత ఆమె ఆరోగ్యం దెబ్బతిన్నది. ఒక సంవత్సరం పాటు వైద్యం నిమిత్తం 1919లో మదనపల్లె వెళ్ళారు. 1920లో ఆమె వివాహం మాగంటి బాపినీడుగారితో జరిగింది. ఆయన అప్పుడు కలకత్తా సిటీ కాలేజీలో చదువుతున్నారు. వారి వివాహానికి తెలుగులోనే మంత్రాలు చదివారు. ఉమేష్ చంద్ర విద్యార్థి, ఆదిపూడి సోమనాధరావు వంటి సంస్కర్తలు ఆ వివాహానికి అతిథులుగా వచ్చారు.

**స్వతంత్ర పోరాటం :** వివాహం తరువాత బాపినీడు ఉన్నత చదువులకు అమెరికా వెళ్ళారు. అతనితో పాటు అన్నపూర్ణ కూడా వెళ్ళాల్సి ఉంది కాని పొసగలేదు. భారతదేశంలో ఉన్న అన్నపూర్ణాదేవి మహాత్మాగాంధీ సందేశంతో ప్రభావితమై భారత స్వాతంత్ర్యపోరాటంలో క్రియాశీల కార్యకర్తగా పనిచేసారు. 1921లో గాంధీజీ ఆంధ్రా పర్యటనలో ఉన్నప్పుడు ఆమె తన చేతిగాజులు, మెడలో పెద్ద గొలుసు వారికిచ్చి గాంధీజీకి అభిమాన పాత్రురాలుగా మారారు అదే సమయంలో ఆమె డబ్బుకోసం చాలా ఇబ్బందులు పడ్డారు. అయినా 1200 రూపాయల ఖరీదైన చీరలన్నీ తగులబెట్టేశారు. ఏలూరులో మోహన్‌దాస్ ఖద్దర్ పరిశ్రమ స్థాపించారు. ఆంధ్రదేశం అంతటా పర్యటించి స్వదేశీ ఉద్యమానికి ఊపిరిలూదారు. 1923లో బాపినీడు అమెరికా నుండి తిరిగివచ్చారు. బొంబాయిలో అతను స్టీమర్ దిగిన వెంటనే ఆమె తను తెచ్చిన ఖద్దరు బట్టలు అతనికిచ్చి అతని విదేశీవస్త్రాలను సముద్రంలో పారవేయమన్నారు. అతను మారుమాటాడకుండా అలానే చేశారు. గాంధీ ఆమె గురించి "She had already 'acquired a gentle but commanding influence over her husband, by her purity and single-minded devotion' అని వ్రాశారు. అన్నపూర్ణమ్మగారు అనేక ప్రాంతాలు పర్యటించి సభలలో ప్రసంగించారు. తన కార్యదీక్ష, సత్ప్రవర్తనల ద్వారా అందరి మన్ననలూ పొందారు.

**మరణం :** 1924లో ఆమె ఆరోగ్యం మళ్ళీ క్షీణించసాగింది. భర్తతో కలిసి అనేక ఆరోగ్యకేంద్రాలకు వెళ్ళారు. ఈ సమయంలోనే రామకృష్ణ పరమహంస బోధనలను ఆమె తెలుగులోకి అనువదించారు. ఆమె భారతదేశం భవిష్యత్తులో మహిళల పరిస్థితి గురించి “నారి” అనే పుస్తకం వ్రాశారు. అతి పిన్న వయస్సులో 1927లో నవంబరు 9న ఆమె మరణించారు. అన్నపూర్ణమ్మ మరణం తరువాత ఆమె వ్యక్తిత్వం గురించి మహాత్మాగాంధీ ఇలా వ్రాశారు.

"1921 బెజవాడ మహిళాసమావేశంలో ఖద్దరు వస్త్రాలు ధరించిన ఒక అమ్మాయి అన్నీ తానై అందరినీ అదుపుచేస్తూ సమావేశం నిర్వహించింది. ఆమె అంతకు ముందు ధరించిన విలువైన ఆభరణాలు నాకు గుర్తున్నాయి. ఆమె మరణం వల్ల నేను కోల్పోయింది కేవలం ఒక సహాయకురాలు మాత్రమే కాదు. భారతదేశంలో నా స్వంత కూతురులా మెలగిన ఒక వనిత మనకు దూరమైంది. ఆమె విశ్వాసంలోను, పనిలోను ఎన్నడూ చలించలేదు. ఆమె కార్యదీక్ష అందరికీ ఆదర్శప్రాయమైనది". ఆ కాలంలో చదువుకున్నవాళ్ళు అందరిలాగే అన్నపూర్ణాదేవి గారికి కూడా లేఖలు రాసే అలవాటు ఉండేది. వాటిని ఆమె మరణానంతరం 1933లో ఆమె భర్త మాగంటి బాపినీడు 1. అమెరికాకు బోవకముందటి లేఖలు, 2. అమెరికాకు వ్రాసిన లేఖలు, 3. పరిశిష్టము – నారాయణరాజు గారికి రాసిన లేఖలు అని విభజించి 'అన్నపూర్ణాదేవి లేఖలు' అనే పేరుతో ఒక పుస్తకంగా ప్రచురించారు. కడమాట పేరుతో ఉన్నవ లక్ష్మీనారాయణ గారు పరిచయ వాక్యాలు రాసిన సదరు పుస్తకంలో వ్యక్తమైన అన్నపూర్ణాదేవిగారి దేశభక్తిని పరిచయం చేయడమే ఈ వ్యాసోద్దేశం.

**అమెరికాకు బోవకముందటి లేఖలు :** ఈ విభాగంలోని లేఖల్ని మరోరకంగా వివాహపూర్వ లేఖలు అని పేర్కొనవచ్చు. బాపినీడు గారికి రాసిన మొదటి లేఖలోనే అన్నపూర్ణ గారు జ్ఞానపిపాసి అని, దేశవిదేశ రాజకీయాల పట్ల ఆసక్తి కలిగిన వ్యక్తి అనీ తెలుస్తుంది. ఆమె నవంబర్ 3, 1921వ తేదీన ఆరోగ్యవరం నుండి రాసిన లేఖలో (12వ లేఖ) వైద్యుల సూచన ప్రకారం తాను రెండేళ్ళపాటు పెళ్ళికి దూరంగా ఉండాలనీ, అందువల్ల తను ఆ రెండేళ్ళ పాటు గాంధీ ఆశ్రమంలో గానీ, ఠాగూరు ఆశ్రమంలో గానీ గడపదలచాననీ రాశారు. దీన్నిబట్టి ఆమెలో అప్పటికే దేశభక్తి బీజాలు పడ్డాయని తెలుస్తున్నది. తర్వాత ఆమె ఆరోగ్యవరం నుండి రాసిన లేఖలో (13వ లేఖ) సబర్మతిలో గడపడానికి ప్రయత్నిస్తున్నానని, అక్కడ ఉండటానికి "గాంధిగారు సమ్మతించినచో నేను పైకమును బిచ్చమెత్తి సంపాదింప యత్నించెదను" అని, అందుకోసం సప్పుసప్పైనా చేస్తాననీ పేర్కొన్నారు. మాతృభూమి సేవకై తల్లిదండ్రులను ఎలాగైనా ఒప్పిస్తానని విశ్వాసంగా చెప్పారు. దీన్ని బట్టి ఆమెలో దేశంపట్ల ఎంత ప్రగాఢమైన భక్తి వేళ్ళూనుకొందో అవగతమవుతున్నది. తర్వాతి లేఖలో (15వ లేఖ) "దేవుడు మనలను ప్రియ మాతృభూమియగు భరతవర్షమునకై త్యాగమొనరించుటకు దీర్ఘాయుష్మంతులను జేయుగాక" అన్న వాక్యం వల్ల దేశసేవకు అంకితం కావాలని ఆమె గట్టిగా నిశ్చయించుకున్నారని తెలుస్తున్నది.

**అమెరికాకు వ్రాసిన లేఖలు :** వివాహానంతరం అన్నపూర్ణాదేవి భర్త బాపినీడు వ్యవసాయశాస్త్రము అభ్యసించడానికి అమెరికాకు వెళ్ళారు. ఆమె వెళ్ళడానికి వీలుకాలేదు. అమెరికాలో ఉన్న భర్తకు తమ స్వగ్రామం ఏలూరు సమీపంలోని చాటపర్రు నుండి ఆమె రాసిన మొదటి లేఖలో దేశభక్తి పొంగిపొర్లుతున్నది. అందులో ఆమె "మీ వియోగము నాకంత విచారముగ లేదు. మీరెందులకై భరతజనని నుండి విడివడి మహాసముద్రముల దాటి నవీన ప్రపంచమున కేగితిరో ఆ మహోద్దేశ్యమును సర్వదా మనమునందుంచుకొని విజయులై సమ్మానమును బడసెదరో? లేదో? యను సంశయమున నా హృదయము దుఃఖ పూరితమయ్యెను. ఏ దేశము పరరాజులకు కడుదూరముననుండి, శత్రువుల భయమొందజేయుచు, సర్వదా జయపతాకమున నలరారి వీరపుత్రులచే సన్మానింపబడుచుండెడిదో, అయ్యది అధోగతిపాలై, పరహస్తగతమై హేయముగ నుండవలసి వచ్చెగదా! దుర్బలులగు పుత్రులం బడసి జనని ఆక్రందనము సేయుచున్నది. ఆయాక్రందనము వీనుల బడకుండ గాఢనిద్రయందు నిమగ్నులై, మైమరచి కాలయాపనము సేయుచున్నారు. సహస్రమున నొక పుత్రుడుండిన నేమి ఫలము? శేషించినవారు వాంఛాశూన్యులై జననిని భక్తిగౌరవములతో బ్రేమింపక వ్యర్థభాషణముల (ఉపన్యాసములు) మూలమున గాలయాపన సేయుచున్నారు. మరికొందరు వాక్చాతుర్యమున వారి గౌరవము కొరకు బ్రయత్నించుచున్నారు. పరోపకారము దేశాభిమానము వారికత్యంత దూరముననున్నవి. కార్యనిర్వహమునగాని, ధనసహాయముచేతగాని వారు దేశాభిమానము జూపరు. మీరేశాఖలో జేరినవారు? మీ సంఘము మీకడనుండి యెంతయో లాభము బొందవలెనను కాంక్షతోనున్నది. సంఘమునకు దేశమునకు మీ ప్రాణమీయగలరేమోయను తలంపున మీ సహోదరులెంత గౌరవమున సన్మానించిరో యది సతతమును మదినుంచుడు. పుష్పహారముల వేసికొని పరదేశమున కేగినంతమాత్రమున గౌరవనీయులు కారు. దరిద్రుడైనను, పరదేశ సంచారి కాకపోయినను, మాతృభూమి కొరకై ప్రాణము సమర్పించువాడే ధన్యుడు. మీరు దేశమునకు లాభకరమగు వ్యవసాయ శాస్త్రమును నభ్యసించుటకు గుతూహలురై యరిగినందుల కెంతయు సంతసము" ఇందులో ఆమె తన

భర్త పరాయి సంస్కృతికి లోనై మాతృదేశాన్ని మరచిపోతాడేమోనన్న అనుమానం వెలిబుచ్చడం ఉంది. అతని దేశభక్తి పట్ల సందేహపడ్డం ఉంది. దేశసేవపట్ల ఆయనకిచ్చిన సందేశం ఉంది. అందుకోసం తను అంకితం కావాలన్న ప్రబోధం ఉంది. దానికోసం ఇక్కడివాళ్ళు పెట్టుకున్న ఆశల్ని స్పష్టం చెయ్యడం ఉంది. మొత్తం మీద తన భర్తని దేశసేవలో అట్టిపెట్టుకోవాలన్న తపన ఉంది. తద్వారా దేశసేవపట్ల ఆమె చిత్తశుద్ధి తెలుస్తున్నది. ఆ తర్వాతి లేఖలో తనకు ప్రాపంచిక సౌఖ్యాలపై ఆశలేదనీ, ధన సంపాదన చేయాలనేది కూడా దేశసేవకేనని తేటతెల్లం చేశారు. ప్రపంచంలో ధనంతోనే కార్యాలు నెరవేరుతాయనే ఆమె భౌతికవాదం ఈ లేఖలో స్పష్టంగా కనబడుతుంది.

ఆమె మే 28, 1920న బాపినీడు గారికి రాసిన లేఖలో (3వ లేఖ) ఏప్రిల్ 23, 1920న గాంధీగారు బెజవాడకు వచ్చిన సంగతి ప్రస్తావించారు. 4వ లేఖలో దేశహితం కోరి బాపినీడు దేశాంతరం పోయాడు కాబట్టి ఆ వియోగాన్ని తాను భరించగలనని రాశారు. దేశహితం చెయ్యడానికి తను లోకనిందలు వచ్చి పడ్డా సరే పోయి (సరోజినీ నాయుడు లేనప్పుడు వాళ్ళ ఇంటికి) చదువుకుంటానని చెప్పారు.

తర్వాత లేఖలో (6వ లేఖ) దేశసేవకై ఆమె ఆత్రుతనూ, తనశక్తిలేమినీ తలచుకుని వగచడం కనబడుతుంది. ఇంకా దేశంలో జరుగుతున్న రాట్నంతో నూలు వడకడం (స్వదేశీ ఉద్యమం), అసహాయోద్యమం (సహాయ నిరాకరణోద్యమం) ఆమె ప్రస్తావించారు. తర్వాతి లేఖలో మనుషులకంటే దేశం గొప్పదని, దేశహితం కోసం బంధువుల్ని మరచి జ్ఞానార్జన చెయ్యమని ఆమె భర్తను కోరినారు. 09-11-1920 తేదీన హైదరాబాదులోని సరోజినీనాయుడు గారి ఇంటినుండి రాసిన 11వ లేఖలో ఆమె దేశాన్ని, దేశభక్తినీ మరిచిపోవద్దని భర్తని హెచ్చరించారు. ఈ లేఖలోనే ఆమె "నన్ను మరచినను దేశమును మరువవలదు, నేను స్థిరము గాదు... దేశమునకు మీ జీవితమునర్పించిన స్థిరముగనుండును" అన్న ప్రసిద్ధవాక్యాలు రాశారు.

13వ లేఖలో సంపన్నదేశాల కంటే భారతదేశం గొప్పదనే భావన తనకున్నదని ఆమె తెలియజేశారు. 26-01-1920 తేదీన చాటపర్రు నుండి రాసిన 19వ లేఖలో కూడా ఆమె స్వదేశీ ఉద్యమం, అసహాయోద్యమాలను ప్రస్తావించి "గాంధీమహాత్ముని మూలమున దేశమంతయు నాందోళనముగనున్నది" అని రాశారు. 20వ లేఖలో ఆమె దేశంలో జాతీయ పాఠశాలలు స్థాపిస్తున్నారని, అందుకై తన భర్త ఆస్తి నుండి 5 ఎకరాల పొలం ఇవ్వవలసిందని గాఢంగా కోరినారు. ఆమె 21వ లేఖలో దేశంలో జరుగుతున్న ఉద్యమాల్లో తాను ఏ రకంగానూ భాగస్వామి కాలేకపోతున్నందుకు చింతించారు.

22వ లేఖలో విద్యావంతుల కంటే చదువుకోనివాళ్ళే దేశసేవ చక్కగా చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. 23, 24వ లేఖల్లో అంతవరకూ అమెరికా పోవడానికి తహతహలాడిన ఆమె దేశంలో ఉద్యమం ఉచ్ఛస్థితిలో ఉండగా తాను విదేశాలకు రాలేనని స్పష్టం చేశారు. ఉద్యమంలో స్త్రీపురుషులను నడిపిస్తున్న గాంధీగారిని అవతారపురుషుడిగా స్తుతించారు. స్వరాజ్యం చేరువలో ఉన్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. "ఆంధ్రులలో ... చెరుకువాడ నరసింహం, పట్టాభి సీతారామయ్య, టి. ప్రకాశం, కొండా వెంకటప్పయ్యగార్లు మున్నగు వారు దేశముకొరకు అనేక విధముల పాటుబడుచున్నారు. ఈ సమయమున మీరుండిన నెంతబాగుండెడిది?" అని ఆశపడ్డారు.

అన్నపూర్ణాదేవి గారు 1921 ఏప్రిల్ 06, 12 తేదీల్లో రాసిన 26, 27వ లేఖల్లో తను మార్చి 31వ తేదీ బెజవాడ వెళ్లి గాంధీగారిని, సరళాదేవిగారిని కలుసుకున్నానని చెప్పారు. ఈ లేఖల్లోనే "నా మాతృభూమికి నా భూషణములన్నింటిని సమర్పించివైచితని, నేను నా చీరలన్నింటిని మహాత్మాజీకి దక్షిణాఫ్రికాలో విక్రయించి వేయుటకు సంపబోవుచున్నాను" అని చరిత్రప్రసిద్ధమైన ఆ ఘట్టాన్ని పేర్కొన్నారు. స్వరాజ్యం వచ్చేవరకూ ముతకచీరలనే కట్టుకుంటానన్నారు. అది విష్ణుచక్రమని పేర్కొంటూ రాట్నమహిమను, తిలక్ స్వరాజ్యనిధి సంగతిని, సహాయనిరాకరణను, హిందూముస్లీం సమైక్యతను, గాంధీగారు తనను సబర్మతికి రమ్మనడాన్ని, ఆయన కాకినాడలో వేశ్యలను చూసి వేశ్యావృత్తి నిర్మూలనా బాధ్యతను తనకు అప్పగించడాన్ని ప్రస్తావించారు.

28వ లేఖలో విదేశీ ఆహార్య నింద, 'యంగ్ ఇండియా' పత్రికా ప్రస్తావన, గాంధీ ప్రశంస ఉన్నాయి. 29వ లేఖలో అగ్గవగా పేదలకు మగ్గాలు అమ్మాలన్న ఆకాంక్షను వెలిబుచ్చారు. 30వ లేఖలో తమ గ్రామంలో పేదలకు మగ్గాలు ఏర్పాటు చేస్తున్నానని పేర్కొన్నారు. 31వ లేఖలో బాపినీడు బ్రాహ్మణేతరోద్యమంవైపు మల్లడాన్ని నిరసించారు. 32వ లేఖలో ఉద్యమంలో బ్రాహ్మణాధిక్యతను పేర్కొని, అయినా తను వెనుదీయనని చెప్పారు. 33వ లేఖలో ఆ సమయంలో బాపినీడు గారు ఇక్కడ లేకపోవడం వల్ల దేశసేవ చేసే భాగ్యం లేదని బాధపడుతూ "దేశసేవ చేయజాలని జీవితమొక జీవితమా?" అని చింతించారు. దేశసేవకై తాను జైలుకుపోవడానికి, ఆత్మార్పణం చెయ్యడానికి సిద్ధమని ప్రకటించారు. దానికోసం ఉత్సాహపడ్డారు.

నవంబరు 1921లో రాసిన 34, 35వ లేఖల్లో డిసెంబర్లో స్వరాజ్యం సిద్ధించగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. శాసనోల్లంఘనోద్యమాన్ని ప్రస్తావించారు. 36వ లేఖలో జాతీయ కాంగ్రెసుకు పోవుట గురించి ప్రస్తావించారు.

40వ లేఖలో (ఇంకా అనేక లేఖల్లో కూడా) ఆమె భర్తను త్వరగా వచ్చి ఉద్యమంలో పాల్గొనమని ఆయనపై ఒత్తిడి తెచ్చారు. 41వ లేఖలో దండు నారాయణరావు, ప్రకాశం పంతులు, వారి స్వరాజ్య పత్రికల దేశసేవ గురించి గొప్పగా ప్రస్తావించారు. బాపినీడు స్వదేశం వచ్చిన వెంటనే తన విదేశీ దుస్తులను తగులబెట్టాలని ముందుగానే సూచించారు.

43, 44వ లేఖల్లో గాంధీగారు అరెస్టయిన విషయం ప్రస్తావించారు. దేశప్రజల యొక్క ఆర్థిక దుస్థితిని వర్ణించి, అమెరికాలో కంపెనీ పెట్టే నిర్ణయం మాని, వెంటనే స్వదేశం వచ్చి ఉద్యమంలో పాల్గొంటూ పేదప్రజలకు సాయపడమని రాశారు. అనేక లేఖల్లో ఆమె తమ దంపతులిద్దరూ కలసి దేశసేవ చేసి సంతోషపడాలన్న కోరిక బలంగా వెలిబుచ్చారు. 49వ లేఖలో తను స్థాపించదలచిన మోహనదాసు ఖద్దరు పరిశ్రమకు అమెరికాలో నిధులు సేకరించి పంపమని కోరినారు.

50, 51వ లేఖల్లో పరిశ్రమ ప్రయత్నం ఫలించుటలేదని తెలిపినారు. 52వ లేఖలో దండు నారాయణరాజు అరెస్టు విషయము పేర్కొన్నారు. 56, 57వ లేఖల్లో ఉద్యమంలో తను ఉండటాన్ని అవమానంగా భావిస్తూ, తనను దానికి దూరం చేయాలని చూస్తున్న తన బంధువుల గురించి, అలాంటి పరిస్థితుల గురించి వాపోయారు.

**పరిశిష్టము – నారాయణరాజు గారికి రాసిన లేఖలు :** అన్నపూర్ణాదేవి దండు నారాయణరాజు గారికి రాసిన ఉత్తరాల్లో ఉద్యమ విషయాలు, ఆధ్యాత్మిక విషయాలు ఉన్నాయి.

**ముగింపు :** అన్నపూర్ణాదేవి గారి మొదటి లేఖల్లో దేశభక్తి విషయాలు కొద్దికొద్దిగా మొదలై రానురాను ఉధృతినందుకుంటాయి. ప్రస్తుత సందర్భపు స్థలాభావం దృష్ట్యా వాటిని సమగ్రంగా విశ్లేషించడం సాధ్యం కాలేదు. ఈ లేఖల్లో స్వాతంత్ర్యోద్యమ ప్రస్తావనలే గాక దేశప్రజల స్థితిగతులు, దారిద్ర్యం, ఆర్థికపరిస్థితులు, వ్యవసాయం, పరిశ్రమలు, కుటుంబ పరిస్థితులు, వైవాహిక జీవితం, దాంపత్య విషయాలు, సామాజిక స్థితిగతుల్లాంటివెన్నో ఒక పీహెచ్.డి. పట్టాకు సరిపోయేన్ని ఉన్నాయి. ముందుముందు అలాంటి పని జరగాలి.

**ఆధార గ్రంథాలు :**

1. అన్నపూర్ణాదేవి లేఖలు – లోధ్ర ముద్రణాలయము, ఆంధ్రపత్రికా ముద్రణాలయము, ప్రకాశకుడు : మాగంటి బాపినీడు 25-06-1933 (ఇంటర్నెట్ ఆర్కైవ్స్ నుండి దింపుకున్న పిడిఎఫ్ ప్రతి)
2. వికీపీడియా

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# "స్వాతంత్ర్య చైతన్యాన్ని రగిలించిన మహిళల ఉపన్యాసాలు"

డా.ఎం. షామిదబేగం, తెలుగుశాఖ అధ్యక్షురాలు, సిల్వర్ జూబ్లి ప్రభుత్వ కళాశాల (స్వ). కర్నూలు. సెల్ : 9550083202

"స్వాతంత్ర్యం ఒకరు దానం చేయడానికి, ఇంకొకరు ప్రరిగ్రహించటానికి భిక్ష లాంటిది కాదు, స్వాతంత్ర్యాన్ని ఎవరికి వారే సంపాదించుకోవాలి. ఎవరికి వారే నిలబెట్టుకోవాలి" **– గుమ్మడిదల దుర్గాబాయమ్మ**

చరిత్రలో దాచేస్తే దాగని సత్యాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా రచయిత్రుల విషయంలో. భారతదేశ స్వాతంత్ర్యోద్యమానికి భూమికమైనది సంఘ సంస్కరణోద్యమం. ఆ క్రమంలోనే క్రీ.శ. 1900 నాటికే స్త్రీలలో వ్యక్తి స్వాతంత్ర్యపు స్పృహ పెంచింది. అది స్త్రీ విద్యావశ్యకతను, స్వతంత్ర జీవనావశ్యకతను గుర్తించే చైతన్యాన్ని రగిలించింది. ఆ చైతన్యమే క్రమంగా పెరిగి దేశ స్వాతంత్ర్య సాధన దిశగా కూడా కొనసాగి 1947 సంవత్సరం వరకు 50 సంవత్సరాల పాటు తెలుగులో స్త్రీలు వ్రాసిన వ్యాసాలు, ఉపన్యాసాలు వెలుగులోకి వచ్చాయి. స్త్రీల చైతన్యం కళా సౌందర్యంగా భాసిల్లిన సాహిత్య స్త్రీ సాహిత్యం. స్త్రీలు తమ వ్యక్తి స్వాతంత్ర్యసాధన కోసం కృషి చేస్తూనే అదనంగా పురుషులతో పాటు భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకొనిరావడానికి విశేషంగా కృషి చేసినారు.

స్త్రీల స్వతంత్రజీవనానికి ఆర్థిక స్వావలంబన అవసరమని భావించిన స్త్రీలు ఆదిశగా కృషిచేస్తూ అనేక ఉపన్యాసా లు చేస్తూ స్త్రీలలో ఆర్థిక, సాంఘిక, సామాజిక చైతన్యాన్ని రగిలించినారు. సాహిత్యం ద్వారా స్త్రీలు తమ అభిప్రాయ ప్రకటన చేయగలగటమే స్త్రీల స్వతంత్రతకు చిహ్నమని చెప్పవచ్చు, స్త్రీల స్వతంత్ర్యతయే దేశస్వాతంత్ర్యోద్యమంలో స్త్రీలను పాల్గొనేటట్లు చేసింది. స్త్రీలు ముందుగా వ్యక్తి స్వాతంత్ర్యం ఉండాలని భావించారు. దానికై స్త్రీ విద్యాభివృద్ధి చాలా అవసరమని గుర్తించినారు. స్త్రీలందరూ విద్యావంతులు కావాల్సిన అవసరాన్ని గుర్తించి ఆ అవసరాలను నెలవేర్చుకోవటానికి ఆలోచనలను పెంచుకొని, క్రియాశీల దృక్పథంలో ముందుకు వెళ్ళాలని తలంచి సాహిత్యాన్ని సాధనంగా చేసుకొన్నారు.

విద్యతో స్త్రీలు వ్యక్తి స్వాతంత్ర్యాన్ని పొందగలమని అనుకున్న స్త్రీలు, పురుషులు స్త్రీలు అనుభవిస్తున్న స్వాతంత్ర్యంలోని తేడాలను గుర్తించారు. సమాజంలోని లింగవివక్షా సంస్కృతిని గుర్తించి, స్త్రీలు, పురుషులు సమానమనే భావన కలిగేటట్లుగా స్త్రీలు సాహిత్యాన్ని సృష్టించారు. సామాజిక అస్వతంత్ర జీవనానికి కారణమైన సూక్ష్మాతిసూక్ష్మ అంశాలను గుర్తించారు. స్త్రీల స్వతంత్ర జీవనానికి ఆర్థిక స్వాలంబన అవసరమని భావించి స్త్రీలు ఆ దిశగా ఆలోచించారు. పురుషులతోపాటు సమానంగా రాజకీయ స్వాతంత్ర్యం కూడా కావాలని భావించారు. స్త్రీలు ముందుగా సాంఘిక చైతన్యం తెచ్చుకొని, తమ వ్యక్తి స్వాతంత్ర్యానికి అవసరమైన జీవన స్వతంత్రతకు కావాల్సిన ఉపన్యాసాలు చేశారు.

క్రీ.శ. 1900 సం.నాటికి స్త్రీలలో అక్షరాస్యత ఒక్కశాతం మాత్రమే. కాబట్టి సాహిత్య రచనలు విస్తృతంగా చేయటానికి అవకాశం తక్కువ ఉండేది. కావున ప్రారంభ దశలో స్త్రీలు ఉపన్యాసాలు ఎక్కువగా ఇచ్చినారు. తోటి స్త్రీలలో వ్యక్తి స్వాతంత్ర్యానికి, దేశ స్వాతంత్ర్యానికి సంబంధించిన ఆలోచనలు పెంచే దిశగా స్త్రీలు నిజాయితీతో, నిబద్ధతతో రచనలు చేయడానికి పూనుకున్నారు.

నిరక్షరాస్యులైన స్త్రీలలో స్త్రీ విద్య పట్ల చైతన్యం కల్గించటానికి క్రీ.శ.1902 నుండి ప్రారంభమైన స్త్రీ సమాజంలలో ఉపన్యాసాలు ఇచ్చారు. ఉపన్యసించడం కూడా ఒక కళ. మేధాశక్తికి, అభివ్యక్తి కరణకు, పరిజ్ఞానాన్ని పదునుపెట్టి స్త్రీలలో విషయం పట్ల అవగాహన, అనుభూతిని కల్గించడంతోపాటు ఆ విషయం వారి మనసులలో నాటుకునేటట్టుగా ఉపన్యసించాలి. అప్పుడే అది మంచి ఉపన్యాసం అవుతుంది. ఆనాటి స్త్రీలు తమ ఉపన్యాసాల ద్వారా ఎంతోమంది స్త్రీలను చైతన్యవంతులుగా తయారు చేసినారు.

20 శతాబ్దపు మొదటి దశకంలో స్త్రీవిద్య, వివాహాలు, గృహకృత నిర్వహణ, స్త్రీ సమాజాలు, స్త్రీల రాజకీయ వ్యవహారాలు, ఆస్తిహక్కులు వంటి విషయాలలో ప్రచురిత ఉపన్యాసాలు 39 స్త్రీల సాహిత్యంలో కనబడుచున్నాయి. అందులో ముఖ్యమైన ప్రముఖమైన స్త్రీల ఉపన్యాసాలు తెలుసుకుందాం.

**ఉపన్యాసాలు :** దేశంలోని వివిధ ప్రాంతాలలో ఆంధ్రేతర స్త్రీలు స్త్రీ విద్యాభివృద్ధికై చేసిన ప్రసంగాల యొక్క అనువాదాలు ప్రచురించి ఉపన్యాస రూపంలో తీసుకొని రావడానికి, స్త్రీలలో చైతన్యానికి నాంది పలకటానికి "జనానా" పత్రిక విశేషంగా కృషి చేసింది.

**కమలాంబ :** బందరులోని ఓరుగంటి శివరామకృష్ణయ్య పుత్రికయైన "కమలంబ సత్యనాధం" భారతదేశంలో మొట్టమొదటి సారిగా స్త్రీలకోసం పెట్టిన "హిందూసుందరి" అనే ఆంగ్ల పత్రికకు ఆమె సారథ్యం వహిస్తూ అనేక ఉపన్యాసాలిచ్చినారు.

'స్త్రీ విద్య'ను గురించి ఉపన్యసిస్తూ స్త్రీలు విద్యాలాభములను తెలుసుకోవాలని, మానవులలో ఉన్న శక్తులను అభివృద్ధి చేసేది విద్య అనీ, జ్ఞాన స్వీకారము మనసుసకు అభిరుచిని కలుగచేస్తుందని తెలియజేశారు. 1902 ఏప్రిల్ చెన్నపురిలో 'బాలికా విద్య'ను గురించి ఉపన్యశిస్తూ బాలికా విద్యను నేర్పిస్తే, స్త్రీ విద్య అభివృద్ధి చెందుతుందని తెలియజేసినారు. 1905లో 'ఉన్నత విద్య'పై ఉపన్యాసం ఇస్తూ స్త్రీలు ఉన్నత విద్యను అభ్యసించడానికి తగిత ధైర్యవంతులుగా మారాలనీ, విద్యను అభివృద్ధి చేసుకోవాలని, విశేష భాషాభివృద్ధి దేశచరిత్రలు, భూగోళం శరీరశాస్త్రాన్ని సాహిత్యాన్ని తెలుసుకోవాలనీ, దేశభాషలో ఉన్నత విద్యను అభ్యసించాలని ప్రతి ఒక మహిళలలో చైతన్యాన్ని రగలించింది కమలాంబ.

**భండారు అచ్చమాంబ :** భారతదేశీయ స్త్రీల చరిత్రను తెలియజేస్తూ "అబలా సచ్చరిత్రరత్నమాల" అనే గ్రంథం రాసి తన భర్తకు అంకితమిచ్చినది. "గుణపతియగు స్త్రీ" అనే వ్యాసంలో దశకుమార చరిత్ర యందలి కథను తెలియజేస్తూ స్త్రీలు సంసారమును పొదుపుగా చేయగల గృహకార్య నిర్వహణత్వాన్ని తెలియజేసింది.

'స్త్రీ విద్య యొక్క ప్రభావం" అనే అంశంపై ఉపన్యశిస్తూ లండన్ ద్వీపంలో స్త్రీ పురుషులందరూ సమానంగా విద్య నేర్చుకుంటారనీ, అట్లాగే భారతదేశంలో కూడా లింగ వివక్ష పాటించకుండా సమానంగా రాజకీయ హక్కులు మరియు రాజ్యవ్యవస్థను నిర్వహించుకోవాలని తెలియజేసింది.

'స్త్రీ విద్య"ను గురించి అచ్చమాంబ ఉపన్యశిస్తూ స్త్రీ విద్య బలహీనంగా ఉందనీ, స్త్రీల కొరకు పెట్టు పత్రికలకైనా స్త్రీలు వ్యాసము వ్రాసి పంపే ధైర్యముండటం లేదని చెప్పింది. బాలకాపాఠశాలలలోని లోపంతన్నివారణోసాయం" అనే మరొక ఉ పన్యాసంలో స్త్రీలు గొప్ప గొప్ప గ్రంధాలు చదివి ఉపన్యాసాలిచ్చే స్థాయిలో ఉండాలని చెప్పింది. కొంత స్వతంత్రత, కొంత పారతంత్రత ప్రతిజీవికి సమానమనీ, స్త్రీ పురుషులిద్దరూ సమాన స్వాతంత్ర్యం కలిగి ఒకరికొకరు లోబడి యుండాలని తెలియజేసింది. "విద్యావంతులకు యువతులకొక విన్నపం" అనే ఉపన్యాసంలో స్త్రీ విద్య యెడల విద్యావంతులైన స్త్రీలు బాధ్యత వహించాల్సిన విషయాన్ని విన్నవించింది. స్త్రీ సమాజాల ద్వారా స్త్రీ విద్యను ప్రోత్సహిస్తే ప్రయోజనం కలుగుతుందని, స్త్రీల మేధాశక్తిని దేశాభివృద్ధికి ఉపయోగించుకోవలసిన అవసరాన్ని తెలియజేసింది. స్త్రీ విద్య స్త్రీ వ్యక్తి స్వాతంత్ర్యానికి పునాది అని, స్త్రీలు అభివృద్ధి చెందడానికి, స్త్రీల భావప్రకటన స్వేచ్ఛకు ఏర్పాటు చేయబడ్డ స్త్రీ సమాజాల ప్రాధాన్యతను బండారు అచ్చమాంబ తెలియజేసింది. 1904లో మరణించిన భండారు అచ్చమాంబ యొక్క జీవిత చరిత్రను, వివిధ పత్రికలు తెలియజేశాయి.

**పి. కౌసల్య :** స్త్రీ విద్య అభివృద్ధి చెందాలంటే బాలికలకు పాఠశాలలను నెలకొల్పాల్సిన అవసరాన్ని గురించి ఉపన్యసించింది.

**కొటికలపూడి సీతమ్మ :** స్త్రీలు చదువుకోకపోతే సత్యాన్ని గ్రహించగల మంచిచేగల విచక్షణా భావం ఏర్పడదనీ, స్త్రీలు విద్యవల్ల అభివృద్ధి పొందితేనే సంతతిని వృద్ధిలోని తీసుకోగలరని విద్యతోనే మానవజన్మ సార్థకం కాగలుగుతుందని తెలియజేసింది.

**ఉన్నవ లక్ష్మీబాయమ్మ :** స్త్రీలు స్వేచ్ఛగా, నిర్భయంగా బతకాలంటే విద్యావంతులు కావాల్సిన అవసరాన్ని పేర్కొనటంతో పాటు విద్యావంతులైన స్త్రీలలో ఐకమత్యం ఉంటుందని బావించింది. స్త్రీలు తమ విద్యకై చేసే కృషియే దైవభక్తిగా భావించమని తెలియజేసింది.

**పులుగుర్తి లక్ష్మీనరసమాంబ :** స్త్రీలలో విద్యాసంబంధమైన ధైర్యాన్ని కలిగించే ప్రయత్నంగా ప్రార్థనా మందిరాన్ని వేదికగా చేసుకోవాలని తెలియజేసింది.

**సత్యవతి :** స్త్రీ విద్యకు, స్త్రీల స్వతంత్ర జీవనానికి ఉన్న లింకును తెలియజేస్తూ స్త్రీ విద్యను అటంకపరచవద్దని పురుషులకు విన్నవించింది.

**లక్ష్మీకాంతమ్మ :** పరమాత్మ ఇచ్చిన పంచేంద్రియ, జ్ఞానేంద్రియములను మంచి పనులకు వినియోగించడానికి తగిన జ్ఞానం కలగటానికి స్త్రీవిద్య అవసరమని చెప్పింది.

**గంటి జోగమాంబ :** స్త్రీలు చదువుకుంటే గానీ విచక్షణాజ్ఞానం అబ్బదనీ తెలియజేసింది. స్త్రీలలో సత్యజ్ఞానాన్ని పెంచేది చదవేదనని గట్టిగా తెలియజేసింది.

ఇంకా గొడవర్తి బంగారమ్మ, పలివేటి బాలాత్రిపుర సుందరమ్మ, వెంపల శాంతాబాయి, భట్టిప్రోలు రాజరాజేశ్వరమ్మ, కళ్ళే పల్లె వెంకటరమణమ్మ మొదలైన వారు తమ తమ ఉపన్యాసాలలో స్త్రీ విద్యకు ప్రాధాన్యత ఇస్తూ దేశ స్వాతంత్రానికి స్త్రీలు అందరూ విద్యవంతులు కావాలని తెలియజేసినారు.

**ఆధార గ్రంధం :**

స్వతంత్రత నుండి ......స్వాతంత్ర్యానికి – డాక్టర్ జంధ్యాల కనకదుర్గ

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# అతడు – ఆమె నవల – జాతీయోద్యమ చిత్రణ

డా॥ కె. చెన్నకేశవరెడ్డి, సహాయాచార్యులు, ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప, ఆంధ్రప్రదేశ్-516004. సెల్: 8639765669

ఉప్పల లక్ష్మణరావుగారు తెలుగు నవలా సాహిత్యంలో ఓ కొత్త ప్రక్రియా వైవిధ్యాన్ని “అతడు-ఆమె” నవల ద్వారా ప్రవేశపెట్టాడు. ఈ నవలలోని పాత్రల ద్వారా ఆనాటి జాతీయోద్యమం, అందులో పాల్గొంటున్న అతివాద, మితవాద ధోరణులను నవలలోని పాత్రలు విపులంగా చర్చిస్తాయి. పాత్రలను ప్రజాస్వామికరీతిలో ఎదగనివ్వడం లక్ష్మణరావుగారు ఈ నవలలో చేసిన అద్భుతం. లక్ష్మణరావుగారు సామాజిక బాధ్యత ఉన్న రచయితగా తాను నమ్మిన శాస్త్రీయ సోషలిజం ప్రచారాన్ని అన్ని కోణాలనుంచి పరిశీలించి, తన రచనల ద్వారా పాఠకుల్లో చైతన్యాన్ని కల్గించే కృషిచేశారు. ఈ నవలలో సమకాలీన సమాజం, సమాజం పట్ల వ్యక్తుల బాధ్యత, ముఖ్యపాత్రల ఆలోచనలు, అభిప్రాయాలు, స్వాతంత్ర్య ఉద్యమ ఘట్టాలు,నమ్మకాలు, ఉద్రేకాలు. ఇలా చాలా విషయాల ప్రస్తావన కనిపిస్తుంది. ఆనాటి రాజకీయాలు అప్పటి సామాజిక పరిస్థితులు గురించిన చక్కటి చిత్రాన్ని మనకు అందిస్తుందీనవల.

ఈ నవల కథంతా నాయికా నాయకుల డైరీ రూపంలో మనకు తెలుస్తుంది. డైరీ అనేది ఎటువంటి బేషజాలు లేకుండా ఉన్నదున్నట్లు మనసులో మాటలు రాసుకొనే సాధనం కాబట్టి ఈ ప్రక్రియ వల్ల రచనలో ఒక విధమైన నిజాయితి కనబడుతుంది. ఈ నవలలో నాయిక, నాయకుల వ్యక్తిత్వాలను తెలిపే క్రమంలోనే మనకు క్విట్ఇండియా ఉద్యమం, ఆనాటి జైలుజీవనం, గాంధీజీ నడిపించిన ఉద్యమాలు, అప్పటి కాంగ్రెసు, స్వాతంత్ర్యపోరాటం జరిగే రోజుల్లో ఆనాటి పరిస్థితులు వంటి వాటితోపాటు స్త్రీ స్వాతంత్ర్యం మొదలైన విషయాల గురించి అవగాహన కలిగిస్తారు రచయిత.

అతడు-ఆమె నవల ప్రధానంగా రెండు విషయాల మీద కేంద్రీకరింపబడింది. ఒకటి జాతీయోద్యమం. రెండు స్త్రీ పురుష సంబంధాలు. 1920 నాటి సహాయ నిరాకరణోద్యమం నుండి క్విట్ ఇండియా ఉద్యమం వరకు అన్ని ప్రధాన ఘట్టాలనూ, ఉద్యమసమయంలో కాంగ్రెసు పార్టీలోని అతివాదుల, మితవాదుల ఆచరణ, కమ్యూనిస్టుపార్టీ పంథానూ, సుభాస్‌చంద్రబోసు దేశభక్తి, కార్యాచరణనూ విమర్శించటమే కాకుండా విశ్లేషించమని మనల్ని ప్రేరేపిస్తుంది ఈ నవల. ఆసమయంలో వివిధ పార్టీల నాయకుల ఆలోచన ధోరణులనూ, వాటి బాగోగులను లక్ష్మణరావుగారు ‘అతడు-ఆమె’ నవలలో మనకు పరిచయం చేస్తారు. జాతీయోద్యమ వివరాలను విసుగెత్తించే ధోరణిలో కాకుండా జాతీయోద్యమ లోతుపాతులను తెలుసుకోవాలనే ఆలోచననూ, ఆసక్తిని మనలో కలిగిస్తుంది ఈ నవల.

‘అతడు-ఆమె’ నవలలో సమకాలీన సామాజిక పరిస్థితులకు, చైతన్యానికి ప్రతినిధులు అనిపించే పాత్రలను సృష్టించారు రచయిత. ఈ నవలలో మొదటి భాగంలో శాంతం-శాస్త్రిల పాత్రల ద్వారా, (శాంతమ్మ క్వీన్ మేరీస్ కళాశాలలో లెక్చరర్, వల్లభజోస్యుల చిదంబరశాస్త్రి న్యాయవాది) రెండు, మూడు భాగాలలో శాంతం-శాస్త్రిల పెంపుడు కుమార్తె శుభ- ఆమె ప్రేమించిన రైల్వే ఇంజనీర్ జనార్దనం రాసుకొన్న డైరీల ద్వారా, నాలుగో భాగంలో శాంతం కుమార్తె లక్ష్మి- భాస్కర్‌లు రాసుకొన్న డైరీల ద్వారా ఉద్యమ వివరాలను వివరిస్తాడు రచయిత.

ఈ నవలలో 1920నాటి సహాయ నిరాకరణోద్యమాన్ని గురించి రచయిత ఓచోట ప్రస్తావిస్తాడు. ఆ ఉద్యమకాలం నాటికి శాంతం-శాస్త్రిలకు వివాహం కాలేదు. ఆ ఉద్యమాన్ని గురించి శాంతం వాళ్ళ మామయ్య ద్వారా తెలుసుకుంటుంది. ఆ సమయంలో రాజకీయాల గురించి పెద్దగా ఆలోచించని శాంతం వాటికి దూరంగా ఉండాలని భావిస్తుంది. అయితే శాంతం మొదటిసారిగా రాజకీయాల గురించి ఆసక్తితో, శ్రద్ధగా ఆలోచించింది ఉప్పుసత్యాగ్రహ ఉద్యమ సమయంలోనే. ఒకరోజు శాంతం గాంధీగారి ‘యంగ్ ఇండియా’ పత్రిక చదువుతుంది. అందులో గాంధీజి ప్రత్యేకించి స్త్రీలను ఖద్దరు ధరించమని, పికెటింగ్‌లు చేయమని విజ్ఞప్తి చేస్తాడు. పత్రిక చదివిన శాంతం గాంధీ భావాలపట్ల, జాతీయోద్యమం చేత సహజంగానే ప్రభావితురాలౌతుంది. వెంటనే తన ఇంటిలోని మిల్లుబట్టలను తగలేసి ఖద్దరు ధరిస్తుంది. ఖద్దరు బట్టలు ధరించిన ఆమెకు కొత్త జన్మ ఎత్తినట్లనిపిస్తుంది. ‘నేను కూడా నలుగురితోపాటు యావద్భారత దేశంతోపాటు ఎందుకు సత్యాగ్రహంలో చేరకూడదు?

నేను మాత్రం ఎంచేత ఈ ట్రిప్లికేను బీచ్ అంటూ ఉప్పు చెయ్యకూడదు' అని దేశమంతా జరుగుతున్న ఉప్పుసత్యాగ్రహోద్యమం గూర్చి ఆలోచిస్తుంది. ఆరోజు నుండి ఆమె ఏదో ఒక రకంగా ఉద్యమంతో సజీవ సంబంధం పెట్టుకుంటుంది.

శాంతం ఉప్పుసత్యాగ్రహ సమయంలో వాలంటీర్‌గా చేరి అక్కడ సత్యాగ్రహులకు భోజన సదుపాయాలు చేయడం, వారిని ఊరేగింపులకు పంపడంలాంటి పనులు చేస్తుంటుంది. ఒకరోజు అనుకోకుండా సత్యాగ్రహ శిబిరానికి వెళ్ళుతుంది. అక్కడ జనం అంతా ఒక్కసారిగా భయంకరమైన పిడుగులాగా ఒక్క గొంతుకతో 'మహాత్మాగాంధీకి జై' అంటూ కేకలేస్తున్నారు. ప్రజల ఉత్సాహం ఉప్పొంగిపోతుంది. ఆసమయంలో పోలీసులు వచ్చి సత్యాగ్రహులపై లాఠీచార్జీ జేస్తారు. సత్యాగ్రహ శిబిరంలో కూర్చున్న సుబ్బయ్య, రామ్మూర్తి వంటి సత్యాగ్రహులను లాఠీలతో కొడుతుంటే చూసి సహించలేని శాంతం 'భరతమాత సుబ్బయ్య దగ్గర నిలబడి నన్ను పిలుస్తుంది గాంధీజీకి జై' అంటూ పరుగెత్తికెళ్ళి వారికి అడ్డంగా నిలబడి లాఠీ·దెబ్బలు తిని ఆస్పత్రి పాలవుతుంది.

సత్యాగ్రహ సమయంలో లాఠీదెబ్బలుతిన్న శాంతాన్ని కాంగ్రెసు కార్యనిర్వాహక సంఘంలోనికి ఎన్నుకుంటారు. శాంతం సత్యాగ్రహం రోజుల్లో తిన్న లాఠీదెబ్బలు, కాంగ్రెసులో ఆమెమీద ఉండే గౌరవం పెట్టుబడిగా వాడుకొని కాంగ్రెసు తరపున ఎన్నికల్లో నిలబడడానికి ఎత్తువేస్తాడు శాంతం భర్త శాస్త్రి. ఈ నవలలో సమకాలీన సమాజంలోని బూర్జువా మనస్తత్వానికి ప్రతినిధిగా మనకు కనిపించే పాత్ర శాస్త్రి. ఓ రోజు శాంతంతో "రాబోయే ఎన్నికల్లో నాక్కూడా అందరితో పాటు కాంగ్రెసు తరపున నిలబడాలని ఆశ పుట్టింది. నువ్వు కనుక నాయకులతో గట్టిగా సిఫారసు చేస్తివా వాళ్లు నీమాట తోసివెయ్యలేక నన్ను నిలబెడుతారు. నువ్వు తలచుకుంటే అవుతుంది" అంటాడు. ప్రతి నిత్యం కాంగ్రెసును ఆడిపోస్తూ మరో ప్రక్క బ్రిటిషు ప్రభుత్వాన్ని పొగుడుతూ ఎప్పుడూ దేశం కోసం త్యాగం అన్నదే తలపెట్టని మనిషి తన భర్త శాస్త్రి మాటలు విన్న శాంతం అతని స్వార్థధోరణిని అసహ్యించుకుంటుంది. 'ఇలాంటి వాళ్ళు పదిమంది కనుక కాంగ్రెసులోకి పెరటి దారిన ప్రవేశిస్తే ఇక సత్యాగ్రహం యొక్క పవిత్రతే పోతుందే? చూస్తూ అలాంటి వాళ్ళను గౌరవస్థానంలో ఎలా కూచో పెట్టగలం? ఇంత స్వార్థం వుందే– ప్రజాద్రోహం దేశాన్ని అమ్మేయడం క్రిందకు వస్తుందేమో?' అని చింతిస్తుంది.

1931 లో 'గాంధీ–ఇర్విన్ ఒప్పందం' కుదరడంతో సత్యాగ్రహ ఉద్యమాన్ని నిలిపి వేయాలని గాంధీ కాంగ్రెసు తరపున ప్రజల్ని కోరాడు. ఈ విషయం శాంతానికి చాలా ఆందోళన కలిగిస్తుంది. ఆ సందర్భంలో ఉద్యమాన్ని గూర్చి ఆమె మనసులో "మొత్తంమీద చూస్తే ఉద్యమం దేశంలో అందరినీ కూడగట్టుకు రాలేకపోయిందేమో అనిపిస్తోంది. పల్లెటూరి జనం, రైతులూ, కూలీనాలీ చేసుకునేవాళ్ళు – వీళ్ళనెవరిని ఆకర్షించలేకపోయింది. నాలాంటి వాళ్ళందరిని కుర్రకుంకలనీ, సోషలిస్టులనీ తిడుతూంటే ఈ నాయకులు దేశాన్ని ఎలా ముందుకు తీసుకువస్తారు. నాయకుల్లో లోపమా? అసలు తత్వంలో లోపమా? గాంధీ గారి సిద్ధాంతంలోనే లోపమైతే ఇంతమంది ఆయన శిష్యకోటిలో ఎలా చేరారు' అని చాలా సందేహాలు మొలకెత్తాయి. చివరకు 'గాంధీ గారే వున్నారు కదా! చివరంటూ ఆయన్నే నమ్ముకోవాలి. పాలముంచినా నీటముంచినా' అని గాంధీ పట్ల అమితమైన విశ్వాసాన్ని వ్యక్తం చేస్తుంది.

ఉప్పుసత్యాగ్రహ అనంతరం మళ్ళీ కాంగ్రెసు ప్రజలను కార్యరంగంలోకి పిలిచిన ఉద్యమం 'క్విట్ ఇండియా' ఉద్యమం. ఈ ఉద్యమకాలంనాటికి దేశంలోని రాజకీయ పార్టీలు రకరకాల వైఖరులు ప్రదర్శించాయి. కొందరు ఉద్యమంలో హింసాయిుతంగా, మరికొందరు సాయిధంగా పాల్గొన్నారు. ఈస్థితిలో సుభాస్‌చంద్రబోసు దేశాన్ని వదలి జర్మనీ, జపాన్ సాయాన్ని కోరాడు. 'క్విట్ ఇండియా' ఉద్యమస్థితి మనకు ఈ నవలలో మూడో భాగంలో కనిపిస్తుంది.

కాంగ్రెసు సోషలిస్టు భావాలు కలిగిన యువతరానికి ప్రతినిధి శాంతం–శాస్త్రిల పెంపుడు కూతురు శుభ. సమకాలీన పరిస్థితుల పట్ల తన పెంపుడుతల్లి శాంతంలాగానే శభలో సరియైన అవగాహన చైతన్యం కలిగివున్నాయి. 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని ప్రారంభిస్తూ బొంబాయిలో జరిగిన కాంగ్రెసు సమావేశంలో గాంధీ చావో బతుకో తేల్చుకొమ్మని తీవ్రంగా మాట్లాడాడు. ఆ సభలలోనే గాంధీతో పాటు జాతీయ నాయకులందరిని అరెస్టు చేసింది ఆంగ్లప్రభుత్వం. కాంగ్రెసు సభలకు బొంబాయి వెళ్ళిన శాస్త్రి తిరిగి వస్తూ కొన్ని కరపత్రాలను పట్టుకొస్తాడు. తండ్రి తీసుకొచ్చిన కరపత్రంలో రైలుపట్టాలు తొలగించడం, రైల్వేస్టేషన్లు,

పోస్టాఫీసులు నాశనం చేయడం వంటి విధ్వంసకర కార్యక్రమాలుంటాయి. అవి చదివిన శుభకు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్ వంటి వారు స్ఫూర్తి కొస్తారు. వాళ్ల అడుగుజాడల్లో నడవాలనుకొంటుంది. ఉద్యమం తీవ్రతరమైన కాలంలో శుభ తానుకూడా ప్రభుత్వ వ్యతిరేఖ కార్యకలాపాల్లో పాల్గొని జైలు కెళ్ళాలని తాపత్రయపడుతుంది. రైలు పట్టాలు తొలగించాలనుకొని సీతారాం అనే వ్యక్తి సహాయం కోరుతుంది. అతనికి తన అందాన్ని ఆశపెట్టి పని చేయించాలనుకుంటుంది. దేశం కోసం మానాన్ని కూడా త్యాగం చేయడం ఆమెకు గొప్పగా కనబడుతుంది.

ఈ నవలలో కమ్యూనిస్టు భావాలకు ప్రతినిధి అనిపించే పాత్ర శాంతం-శాస్త్రిల కుమార్తె లక్ష్మి. తండ్రి స్వార్థం ఈమెలో కనిపించకపోయినా, శాంతం పెంపకంలో పెరగడంవల్ల చైతన్యం, ఉత్తేజం మూర్తీభవించిన వ్యక్తిగా మనకు కనిపిస్తుంది. లక్ష్మీ కమ్యూనిస్టు సాహిత్యం, పత్రికలు చదవడం, పార్టీ పనులు చేయడమే కాకుండా, పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండే మనిషి. క్విట్‌ఇండియా ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీ పాల్గొనలేదు. ఆఉద్యమంలో విధ్వంసకాండ బీభత్సాన్ని పత్రికల్లో చూసిన లక్ష్మీ - శుభతో 'మీ సత్యాగ్రహ సోదర,సోదరిమణులు రావణకాష్టం వెలిగించారని సంతోషించవే' అంటూ ఎత్తిపొడుపు మాటలు మాట్లాడుతూ పత్రిక శుభకిస్తుంది. పత్రికలో విధ్వంసంకర సంఘటనలు చదివిన శుభకు మతి చలించిపోతుంది. శుభను కవ్విస్తూ లక్ష్మీ 'ఏమిటే అక్కా! అలా మీదచూపులు చూస్తున్నావు. మతిపోయినదానిలా?. మీ గాంధీ తాతగారి సత్యాగ్రహ సిద్ధాంతం, అహింసాతత్వం ఇలా తగలబడిందేననా?' అంటుంది. గాంధీ సిద్ధాంతాలు అలవరచుకున్న శుభ 'కోట్లాది జనం పాల్గొంటున్న ఉద్యమంలో దౌర్జన్యాలు తప్పవే' అంటూ సమర్థించుకుంటుంది. అక్క సమర్థనను అంగీకరించని లక్ష్మీ 'మరి ఆనాడు చౌరిచౌరాలో దౌర్జన్యాలు జరిగాయానే కదా సత్యాగ్రహనికి స్వస్తిచెప్పేసిన గాంధీగారు ఈనాడు పూరుకున్నారె' అంటుంది. ఇలా ఉద్యమస్థితిగతులను రచయిత అక్కా చెల్లెలమధ్య వాదోపవాదాలతో వివరిస్తాడు.

క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా జరిగిన విధ్యంసకాండలాంటి చర్యలు ఆంధ్రలో తెనాలి ప్రాంతంలో కూడా జరిగాయి. వాటిని గురించి ప్రజలు చర్చించుకుంటున్నపుడు గాంధీపట్ల ద్వేషంగల లక్ష్మీ ఇదంతా పత్రికలలో చదివి జాతీయ వాది అయిన తన తల్లి శాంతంతో 'అమ్మా మీ గాంధీ భరతవాక్యం పలికారు. ఇహమీరు మీ కాంగ్రెసు అంతర్జాతీయానికి తిలోకాదలిచ్చి జాతీయాన్నే ప్రతిష్టిస్తూన్నారన్నమాట' అనిఅంతర్జాతీయంగా కాంగ్రెసు వాళ్ళు ద్రోహం చేస్తున్నారని లక్ష్మీ మాట్లాడుతుంది. ఆవేశంలో ఉన్న కుమార్తెతో శాంతం 'కాంగ్రెసు వాళ్లు, కమ్యూనిస్టులు ఏనాడు శత్రువులు కారమ్మా? అంతర్జాతీయానికి జాతీయానికి వైరంలేదమ్మా. మీరు మేము కలసి నెమ్మదిగా ఆలోచించుకుంటే అందరం కలిసి బ్రిటిష్ సామ్రాజ్యాన్ని అంతం చెయ్యచ్చు' అని గాంధీ నాయకత్వం పట్ల నమ్మకాన్ని కలిగిస్తుంది.

ఉప్పల లక్ష్మణరావుగారు జాతీయోద్యమంలో పాల్గొన్న వ్యక్తి . రాజకీయాల పట్ల అవగాహన, అనుభవం అపారంగా ఉన్న వ్యక్తి. కమ్యూనిస్టు ఉద్యమంతో సన్నిహిత సంబంధాలు ఉండడంవల్ల 'అతడు- ఆమె' నవలలో జాతీయోద్యమాన్ని అన్ని కోణాల నుంచి పరిశీలించి చిత్రించారు. జాతీయోద్యమం కేవలం రాజకీయ స్వతంత్రసాధనకే కాదు, స్వదేశీ పెట్టుబడిదారుల దోపిడి నుండి కూడా ప్రజలకు విముక్తి లభించాలి. సోషలిస్టు వ్యవస్థాపన కూడా ఉద్యమానికి లక్ష్యం కావాలి అన్న సమకాలీన వాస్తవిక దృక్పథం ఈ నవలలో ప్రతిబింబిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. అతడు-ఆమె నవల (1,2,3, 4 భాగాలు) - ఉప్పల లక్ష్మణరావు
2. స్వాతంత్రోద్యమానికి మణి దర్పణం - అతడు - ఆమె సమీక్ష - ఆర్. సోమసుందర్
3. తెలుగు సాహిత్యం గాంధీజి ప్రభావం - మొదలి నాగభూషణ శర్మ
4. ఉప్పల లక్ష్మణరావు జీవితం సాహిత్యం - సి.రామచంద్రయ్య

# స్త్రీ చైతన్యమూర్తి 'కనుపర్తి వరలక్ష్మమ్మ'

డా. వై. సుభాషిణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం. తిరుపతి - 2

పాశ్చాత్యులరాకతో భారతదేశంలో మౌలికమైన మార్పులెన్నో చోటుచేసుకొన్నాయి. పాశ్చాత్యవిద్య, చట్టం, రాజకీయం, సాంస్కృతికపరమైన సమాజస్వరూపం, కర్మకాండ వంటివాటిలో ప్రాచీనకాలంనుండి నేటిదాకా సమాజం ఎన్నో మార్పులకు లోనైంది. స్వాతంత్ర్యోద్యమంతో పాటు మహిళాచైతన్య ఉద్యమం కూడా అంతర్వాహినిగా సాగింది. స్త్రీల అభ్యుదయంకోసం సాటిస్త్రీలే నడుంకట్టిన ఉదంతాలూ మనకెన్నో కనిపిస్తాయి. ఎంతోమంది స్త్రీలు ఉద్యమాల్లోనూ పాల్గొన్నారు.

బండారు అచ్చమాంబ, దుర్గాబాయ్ దేశ్ ముఖ్, టంగుటూరి సూర్యకుమారి, ఆనందీబాయి, మేడమ్ క్యూరీ వంటివారు ప్రముఖంగా కనిపిస్తారు. వారిలో కనుపర్తి వరలక్ష్మమ్మ స్ఫూర్తిదాయకమైన మహిళ. వాళ్ళందరితో పోల్చదగిన వ్యక్తి. ఆంధ్రదేశానికి చిరపరిచితురాలు. బహుముఖ ప్రజ్ఞావంతురాలు. ఆమె స్పృశించని ప్రక్రియలేదంటే అతిశయోక్తికాదు. అందులోనూ మహిళా సంక్షేమంపైన దృష్టి సారించిన తీరు ఒక్క కనుపర్తి వరలక్ష్మమ్మకే సొంతం. ఎలాంటి చదువు డిగ్రీలు లేకపోయినా మహామహా పండితులకోవలో ఎన్నో ప్రశంసలూ అందుకొన్న వ్యక్తి. "నా జీవముధర్మము, నా మతము నీతి, నా లక్ష్యము సతీ శ్రేయము. ఈ మూడింటినీ సమర్థించుటకే నేను కలము బూనితిని." అని చెప్పుకొని స్త్రీల సంక్షేమంకోసం ఎంతో సాహితీసేవ చేసిన వ్యక్తి. మహిళల్లో చైతన్యం నింపుతూ వారికి సరైన హక్కులు కల్పించడంలో కీలక పాత్రను పోషించారు వరలక్ష్మమ్మ. భారత అమృత మహోత్సవాల్లో భాగంగా ఇటువంటి మహనీయురాలిని స్మరించుకోవాల్సిన కనీస ధర్మం, బాధ్యత మనపై ఉన్నాయి.

సాహిత్య, సామాజిక, రాజకీయ, సేవారంగాలలోనూ విశేషమైన కృషిసల్పినవారు కనుపర్తి వరలక్ష్మమ్మ గారు. మహిళలకు నిరంతరం అండదండగా ఉండి, నిరంతరం ప్రోత్సహించినవ్యక్తి. స్త్రీవిద్య గగనమైన రోజుల్లో ఆమె కలం పట్టి సాహితీసేవ చేయడం సామాన్య విషయంకాదు. ఒక స్త్రీ చెప్పులేసుకొన్నా, కళ్ళజోడు పెట్టుకొన్నా, బయటికొచ్చినా తప్పుగా భావించే, ఏదో పెద్ద తప్పు చేశారనే రోజుల్లో వందేళ్ళకిందట ఆమె చేసిన సాహసం మనమందుకొని ఆచరించగలిగితే ఇప్పటికీ ఎంతో స్ఫూర్తి కలుగుతుంది.

స్వయంకృషితో ఏదైనా సాధించవచ్చని నిరూపించిన వ్యక్తి కనుపర్తి వరలక్ష్మమ్మ. ఆమె నేర్చుకొన్న విజ్ఞానమే తనకి గుండెధైర్యాన్నిచ్చింది. లేఖా సాహిత్యంద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేయడం మొదలుపెట్టిన ఆమె కథాసాహిత్యంతోనూ స్త్రీలను జాగృతపరిచింది. దాదాపు అరవై కథలుదాకా రాశారు. అందులో ఈ పత్రానికి నేను ఎంచుకొన్న కథలు ఆరు. ఈ ఆరు కథలూ ఒక్కోరకమైన చైతన్యానికి ప్రాతిపదికలు. స్త్రీల జీవితాలు ఉన్నతంగా ఉండాలని భావించే కథలు. వీటిలో కొన్ని కథలు కన్నీళ్ళు తెప్పిస్తే, మరికొన్ని కనువిప్పు కల్గించే కథలు అన్నీ వెరసి సామాజిక చైతన్యానికి, ముఖ్యంగా స్త్రీల అభ్యుదయాన్ని ప్రతిపాదించే కథలుగా వినుతికెక్కాయి.

మహిళా రిజర్వేషన్ బిల్లును గుర్తుచేస్తూ 'చట్టసభల్లో మెజారిటీ మీదేగా' కథ రాశారు. స్త్రీ పురుషుల సమానత్వాన్ని ప్రతిపాదిస్తూ రాసిన కథ ఇది. స్త్రీలను భోగ్యవస్తువుగా, జడపదార్థంగా, హేయపదార్థంగా చిత్రించిన పురుష ప్రపంచాన్ని నిలదీస్తూ "భగవంతుడు పురుషులను యే దినుసు పదార్థంతో చేశాడో స్త్రీనిగూడా అదే పదార్థంతో చేశాడు. కనుక స్త్రీ పురుషుడితో సమానమైన స్వరూపస్వభావ లక్షణాలుగల మానవప్రాణిగాని మగవారి కలపు పోకడలకు ఆస్పదమైన శుద్ధజడపదార్థంగాదు." అంటూ తీవ్రంగా ఖండించిన కథ (పుటః 62). చట్టసభల్లో మెజారిటీ పురుషులదేనని దానిని స్త్రీలు కూడా సాధించాలని, దానికి స్త్రీలంతా కలిసి సంఘాలుగా ఏర్పడి సాధించాల్సిన అవసరముందని చాటిన కథ ఇది. సమాజంలో స్త్రీకున్న స్థానం, ఆమెకు అంతవరకూ ఇచ్చిన విలువల పరిస్థితి, ఆమెకు రావాల్సిన స్థానం గురించి చక్కగా వివరించారు. అందుకే కనుపర్తి వరలక్ష్మమ్మగారి గురించి గొల్లపూడి మారుతీరావు గారు మాట్లాడుతూ 'కాలంకంటె ముందే ఆలోచించగల వ్యక్తి' ఆమె అంటారు. అది అక్షరాలా నిజమన్నది ఆమె సాహిత్యమే నిరూపిస్తోంది.

స్త్రీ పురుషుల సమానత్వాన్ని 'చట్ట సభల్లో మెజారిటీ మీదేగా' కథ పేర్కొంటే స్త్రీ పురుషుడితోపాటు సమాన గౌరవాన్ని పొందాలని తెలిపే కథ 'గౌరవస్థానం'. ఎన్నో మౌలికమైన ప్రశ్నలను సమాజం ముందుంచిన కథలు. స్త్రీల అభ్యుదయాన్ని ఆశించి నిర్మించిన కథలు. "స్త్రీ కూడా మనిషేననీ, ఆమెకు హృదయం ఉన్నదనీ, తెలివితేటలున్నవనీ, యుక్తాయుక్త పరిజ్ఞానమున్నదనీ, ఆమెను తనతో సమానంగా చూడటం తన ధర్మమనీ పురుషునకు తోచడమే లేదు. ఈ తలంపు పురుషుని హృదయంలో కలగనప్పుడు స్త్రీకి గౌరవమెట్లా వస్తుంది? చట్టాలు వీరిని రక్షిస్తాయి. అందువల్లనే మహాత్ముడు ప్రతి సంస్కరణకూ మనః పరివర్తన ముఖ్యమంటూ ఉండేవారు."అని కనుపర్తి వరలక్ష్మమ్మ సమాజానికి ప్రశ్నలవర్షం సంధించారు(పుటః 91). స్త్రీలు తమంతట తాము పోరాడి సాధించుకోనంతకాలం అది దక్కదని రచయిత్రి అభిప్రాయం. "పురుషదత్తమైన స్వేచ్ఛను అనుభవించటమంటే గుంజకు కట్టిన పశువు మెడకు తగిలించిన తాడు పొడవు మేరకు అనుభవించటం లాంటిదే అవుతుందంటారు కాత్యాయనీ విద్మహే, ఉషారాణి (తెలుగునాట మహిళల ఉద్యమం-విమర్శనాత్మక అంచనా, పుటః 41). అది ఈకథలో స్పష్టంగా ఉంది. తన ఇంట్లో తన ఉనికికి స్థిరత్వాన్ని ఆపాదించుకొంటూ తానున్న సమాజంలో పురుషుడితోపాటు తనకు చెందాల్సిన సమాన ప్రతిపత్తిని నిర్ధారించుకోవడానికి స్త్రీలు ప్రయత్నం చేయాల్సిన అవసరాన్ని వ్యక్తం చేసింది. అభివృద్ధిపథంవైపు అడుగులు వేయడానికి స్థిర నిశ్చయురాలవుతున్న స్థితి ద్యోతకమవుతుంది. ప్రముఖ సాహితీవేత్త శ్రీ పేరాల భరతశర్మగారు వరలక్ష్మమ్మగారి రచనా సామర్థ్యాన్ని ప్రశంసిస్తూ "ఆమె సాంప్రదాయానికీ అభ్యుదయానికీ సజీవ వారధి, అక్షర హారతి" అంటారు. స్త్రీలకు ఒక స్థాయీ స్థానం కావాలనీ, విద్యా విజ్ఞానాలద్వారా వారి వ్యక్తిత్వం వికసించాలని అభ్యుదయంవైపు స్త్రీలను నడిపిన ఆమె .సజీవవారధేనన్నది స్పష్టమవుతుంది.

కష్టాల్లో ఉన్న స్త్రీలకు మహిళా సంఘాలే ఆధారమనే సందేశాన్నిస్తూ రాసిన కథ ' సోదోయమ్మ సోది'. స్త్రీలు ఏర్పాటు చేసుకొన్న సమాజాలకు వెళ్ళకుండా ఆపుతున్నది పురుషులేననీ, వారు నూరిపోసిన సనాతనధర్మాల వల్లనే స్త్రీలు బయటికి రాలేకపోతున్నారని తెలియజేస్తూ రాసిన ఇంకో కథ 'ఎప్పటికీ జ్ఞానోదయం'. ఒక సోదికత్తె ద్వారా మహిళను ఒక కథలో జాగృతపరిస్తే, మరోకథలో 'పురాణాలకు పుణ్యకథలకు పంపినంత ధైర్యంగా తమ స్త్రీలను స్త్రీ సమాజాలకు పంపగల వారెందరున్నారో చెప్పండి.' అని పురుష ప్రపంచాన్ని ప్రశ్నించింది (పుటః 83). "స్త్రీల చేత స్థాపించబడి స్త్రీల అభ్యుదయంకోసం స్త్రీలు నిర్వహిస్తూ ఉన్న సమావేశాలకు పంపిన పురుషప్రపంచం హరికథలకు పంపుతుంది,"అని ఎద్దేవా చేసింది రచయిత్రి (పుటః 83). లక్ష్మీ సరస్వతులతో స్త్రీలను పోలుస్తూ మహిళలు కూటికీ గుడ్డకూ పురుషులపైన ఆధారపడాల్సిన అవసరంలేదని స్వయంకృషితో ఎదగమని చెప్తుంది. మహిళలంతా కలిసిమెలసి తమ బాధలను గట్టెక్కించుకోవాలనే స్పృహను అందిస్తుంది. "పుంజులతో పోరు పెట్టుకోకే అమ్మా! పెట్టలందర్నీ కూడగట్టుకోవే అమ్మా! సంఘమంతా ఒక్కటై, ఒక్కమాటమీద నిలిసి ఒక్కబాటమీద నడిసి పెద్ద మనిసనిపించుకోవే తెన్ను సూసుకోవే తల్లీ! పెద్దల పేరు నిలపవే తల్లీ! లోకమంతా నీదిగ సూసుకోవే తల్లే! లోకులంతా నీవారుగ ఎంచుకోవే తల్లే!" అంటూ కనుపర్తి వరలక్ష్మమ్మ మహిళలకు చేసిన హితబోధ గౌరవించదగింది, ఆహ్వానించదగింది. (పుటః 87). సమాజంలో ముఖ్యంగా తమ ఇంట్లో తన ఉనికికి సంబంధించిన విలువలు ఎలాంటివో స్త్రీలు గుర్తించమని రాశారనిపిస్తుంది. మరోవైపు మీ మహిళా సమావేశాలకు రాని స్త్రీలు హరికథలు వినడానికి వస్తారన్న రాఘవరావుతో ఆయన భార్య రాజేశ్వరి పాత్రద్వారా "స్త్రీ సమాజాలకు తమ స్త్రీలు వెళ్ళినట్లైతే వారిలో యే విజ్ఞానదీప్తి ప్రకాశిస్తుందో, ఏ స్వాతంత్ర్యకాంక్ష రేకెత్తుతుందో, ఏ సంఘీభావమేర్పడుతుందో, అందువల్ల తమ స్వార్థానికేమి మొప్ప మోఅని వారికి భయం. అందువల్ల యే ప్రమాదమున్నా తమ ఆధిపత్యానికేమీ మొప్పముండదుగదా అని తమ స్త్రీలనిట్టి కాలక్షేపాలకు మగవారు పంపుతూ ఉంటారు. సనాతన సాంప్రదాయాలమీద ఉండే గౌరవమూ, పుణ్యంమీద ఉండే ఆపేక్షా మావాళ్ళకి అసభ్యతను గోచరింపకుండా చేస్తున్నది" అంటూ నిట్టూర్చడమూ ఉంది. మగవారి స్వార్థాన్ని ఎండగట్టడమూ చేసింది (పుటః 83).

స్త్రీ జీవితంలో ప్రధానమైన భాగాన్ని ఆక్రమించేది వివాహం. ఆ వివాహం తెలిసీ తెలియని వయసులో జరిగితే కలిగే దుష్పరిణామాలు ఎన్నో. వీటిని తెలియజేస్తూ రెండు కథలను రాశారు. అందులో ఒకటి 'చిట్టి', చిట్టి అనే బాలిక గురించి రాసిన కథ. బాల్యవివాహంలాంటి దురాచారానికి వ్యతిరేకంగా రాసిన కథ. రెండవది 'దీర్ఘసుమంగళీభవ'. వితంతువివాహాన్ని ప్రోత్సహించిన

కథ. సంస్కరణ దృక్పథంతో రాసిన ఈ రెండు కథలూ ఎందరినో ప్రభావితం చేశాయి.

బాల్యవివాహాలను నిషేధిస్తూ భారత ప్రభుత్వం 1927లో శారదా చట్టం తీసుకొచ్చింది. అయినా చాలామంది తల్లిదండ్రులు నాడు చిన్నారులకు బాల్యవివాహాలు జరిపారు. ఆ బాలలు ఎలాంటి బాధలు పడాల్సి వస్తుందనే స్పృహ ఏమాత్రంలేకుండా చేసిన వివాహం వల్ల 'చిట్టి' అనేబాలిక అమాయకంగా తను నోము నోచుకుంటానని అడిగే స్థితిని హృద్యంగా చిత్రీకరించారు. బాలవితంతువైన 'చిట్టి అమాయకంగా తల్లితో సావిత్రీ గౌరునోము నోచుకొంటానని మారాము చేయడం అందరికీ కంటతడి పెట్టిస్తుంది. ఈకథ పరిమాణంలో చాలా చిన్నదే కాని ఆనాటి సాంఘిక దౌష్ట్యాన్ని కళ్ళకు కట్టినట్లుగా చిత్రించిన విషాదగాథ'ని చెప్పవచ్చు.

పరాశరుడు, వశిష్టుడు వంటి మునులు చెప్పిన శ్లోకాలను ఆధారంగా చేసుకొని వితంతు వివాహాలు సమ్మతమైనవేనని శాస్త్ర నిషిద్ధముకాదని సమర్థిస్తూ రాసిన మరోకథ 'దీర్ఘ సుమంగళీ భవ'. భర్త చనిపోతే సమాజంలో స్త్రీలు కుమిలిపోయే తీరును తెలిపిన కథ. వీరేశలింగం సంస్కరణోద్యమానికి సజీవ రూపాన్నిచ్చిన కథ. స్త్రీల పునర్వివాహానికి సంస్కరణోద్యమం ఒక ప్రాతిపదికగా నిలిచింది. మహిళలు స్వీయానుభవ జ్ఞానం నుండి తమ జీవన స్థితిగతులను విశ్లేషించుకొనే క్రమాన్ని తెలిపిన కథ. తన జీవితాన్ని చక్కదిద్దుకోవడానికి కథానాయకురాలు పార్వతి వేసిన అడుగులు స్ఫూర్తిదాయకం. భర్త చనిపోతే నాఖర్మ అనుకొని జీవితాన్ని కొనసాగించకుండా శంకరం అందించిన చైతన్యంతో వివాహం చేసుకొని తల్లిదండ్రుల దగ్గర 'దీర్ఘ సుమంగళీ భవ' అనిపించుకొంది పార్వతి. ఇందులో వితంతు వివాహ చట్టాలను ప్రోత్సహించిన ప్రగతిశీల రచయిత్రిగా కనుపర్తి వరలక్ష్మమ్మ కనబడతారు.

స్త్రీని కేంద్రంగా తీసుకొని ఆమె చుట్టూ ఉన్న సమస్యలను చిత్రించింది కనుపర్తి వరలక్ష్మమ్మ. ఆ సమస్యలను కేంద్రంచేసి దానిమధ్య నలిగిన స్త్రీలను చిత్రీకరించింది. సమాజ కట్టుబాట్లకు లొంగిపోయిన స్త్రీలు ఎన్ని ఇబ్బందులకు గురి అవుతున్నారో తెలిపింది. స్త్రీల వ్యక్తిత్వంలోనూ, దానికి పురుషులనుండి రావాల్సిన తోడ్పాటును గురించి ఆశించిన స్థితి కనిపిస్తుంది. సమాజం కల్పించిన సంకెళ్ళనుండి స్త్రీలను విముక్తుల్ని చేసి, వారి జీవితాల్లో చైతన్యాన్ని ఉత్సాహాన్ని నింపడానికి రచన చేసిన స్త్రీ చైతన్యమూర్తి 'కనుపర్తి వరలక్ష్మమ్మ'. "శ్రీమతి వరలక్ష్మమ్మగారి జీవితం, సాహిత్యమూ సంస్కారవంతమైన ఒకతరాన్ని తయారుచేసి తెలుగువారు మరచిపోలేని మహోపకారం చేశాయి. ఆమె రచనల్లో పటుత్వం లేని పటుత్వం కనిపిస్తుంది. ఆమె మూర్తిలో గర్వంలేని గాంభీర్యం స్ఫురిస్తుంది. ఆమె జీవితంలో ఆడంబరంలేని ఆదర్శం ద్యోతకమవుతుంది. గత అర్ధశతాబ్ది తాలూకూ గాంభీర్యమూ, ఈ అర్ధ శతాబ్దపు తీవ్రత రెండూ సమానంగా సమ్యక్ సమ్మేళనం చెందిన సజీవ సాహితీమూర్తి. ఆంధ్ర జీవన సాహితీ స్రవంతుల భూత భవిష్యత్ తీరాలను కలిపే వర్తమాన వచన కావ్యసారథి" అంటారు కట్టమంచి రామలింగారెడ్డిగారు. చదివింది ఐదో తరగతే అయినా తను సృష్టించిన సాహిత్యంద్వారా తరతరాలకు తరగని స్ఫూర్తిని అందించి చిరస్మరణీయురాలైంది కనుపర్తి వరలక్ష్మమ్మ.

**ఆధార గ్రంథాలు :-**

1. కనుపర్తి వరలక్ష్మమ కథలు
2. తెలుగునాట మహిళల ఉద్యమం – విమర్శనాత్మక అయనా : సంపా॥ కాత్యాయనీ విద్మహే

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# 'హృదయనేత్రి'లోని స్వాతంత్ర్యోద్యమ మహిళలు

డా॥ డి. యువశ్రీ, సహాయాచార్యులు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి. చరవాణి: 9885940011

మనదేశంలో ప్రాచీనకాలం నుంచీ కూడా ఉద్యమాలు జరుగుతున్నాయి. మతోద్యమాలు, భాషోద్యమాలు, విదేశీయులను ఎదుర్కొనే ఉద్యమాలు ఇలా ఎన్నో ఉద్యమాలు జరిగాయి. భారతదేశంలో చోటుచేసుకొన్న అన్నీ ఉద్యమాల కంటే కూడా స్వాతంత్ర్యోద్యమం మిక్కిలి ప్రాముఖ్యత వహించింది. ప్రాధాన్యం వహించింది. స్వాతంత్ర్యోద్యమాన్నే జాతీయోద్యమమని కూడా వ్యవహరించారు. ఆసేతు శీతాచలం భారత జాతి యావత్తూ ఒక వ్యక్తిగా, శక్తిగా ఈ ఉద్యమంలో పాల్గొంది. వందేమాతరం ఉద్యమం నుంచి క్విట్ ఇండియా ఉద్యమం దాకా చోటుచేసుకొన్న అన్నీ ఉద్యమాలు ఈ జాతీయోద్యమంలోనే ఇమిడిపోయాయి.

భారతదేశ స్వాతంత్ర్యోద్యమం చేత ప్రభావితులై కవులు, రచయితలు రచనలు సాగించారు. కొందరికి ఉద్యమం స్ఫూర్తైతే, మరికొందరు ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలబడ్డారు. పద్య కవితలు, వచన కవితలు, గేయ కవితలు విరివిగా వచ్చాయి. కథలు, నవలలు, నాటకాలు బాగా రూపుదిద్దుకొన్నాయి. పురుషులే గాక స్త్రీలు కూడా స్వాతంత్ర్యోద్యమ రచనలు చేశారు. వారిలో ప్రముఖంగా పేర్కోదగిన ప్రతిభాశాలి డా. మాలతీచందూర్ గారు. వీరి పుట్టింటి వారుగానీ, అత్తింటి వారు గానీ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గోలేదు. అయినప్పటికీ ఇతర ప్రాంతాల్లో చోటుచేసుకొన్న బార్డోలి సత్యాగ్రహం వంటి పలు సత్యాగ్రహాల గురించి విన్నారు, చదివారు. ఆంధ్ర దేశంలో జరిగిన చీరాల పేరాల ఉద్యమాన్ని పాఠకుల దృష్టికి తేవాలనుకొన్నారు. మాలతీ గారి ఆలోచన అంతరాల్లోంచి వికసించిన పువ్వే 'హృదయనేత్రి' నవల. ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందిన నవల ఇది. ఈ నవలలోని స్త్రీ పాత్రల గురించే ఈ వ్యాసం ప్రస్తావిస్తుంది.

ఆంధ్రదేశపు నడిగడ్డన పుట్టి తమిళనాడు రాజధానిలో స్థిరనివాసమేర్పరచుకొన్న మాలతీ చందూర్ గారు కృష్ణాజిల్లాలోని నూజివీడులో 1930వ సంవత్సరంలో జన్మించారు. వీరిది మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబం. వీరి తండ్రి శ్రీ పన్నాల వెంకటేశ్వర్లు, తల్లి శ్రీమతి పన్నాల జ్ఞానాంబ. మాలతీ గారు అన్ని విధాలా ఆదర్శ వ్యక్తిత్వం కలవారు. బాల్యంలోనే వీరి చదువు ఆగిపోగా అంతటితో విరమించకుండా విద్యావంతులైన మేనమామ శ్రీ. ఎన్. ఆర్. చందూర్ గారి ప్రోత్సాహంతో విద్యాసంబంధమైన స్వయం కృషిని ప్రారంభించారు. చందూర్ గారితో మాలతీ గారికి 1947వ సంవత్సరం ఫిబ్రవరిలో వివాహం జరిగింది. మాలతీచందూర్ గారు తమ పద్దెనిమిదవయేటనే రచనా వ్యాసంగం ప్రారంభించారు. వీరికి ఇటు ఆంధ్ర సంస్కృతితోనూ, అటు తమిళ సంస్కృతితోనూ పరిచయముంది. తెలుగు వారి జీవితం మీద, తమిళుల జీవితం మీద చక్కని అవగాహన ఉంది. మాలతీ చందూర్ గారు చదివిన ఆంగ్ల గ్రంథాలు, హిందీ పుస్తకాలు, తమిళ సాహిత్యం ఆమె అవగాహన పెరిగేందుకు ఎంతగానో ఉపకరించాయి. ఈ నేపథ్యంలో విస్తృతావగాహన ఉన్న వ్యక్తిగా వారు మనకు గోచరిస్తారు.

జాతీయోద్యమాన్ని చిత్రించిన ఇతర నవలలకు లేని ప్రత్యేకతలెన్నో 'హృదయనేత్రి'కి ఉన్నాయి. ఇది స్వాతంత్ర్యం వచ్చే దాకా సాగిన ఉద్యమాలకే గాక స్వతంత్ర భారతదేశంలో సాగిన ఉద్యమాలకు కూడా స్థానం కల్పించింది. తులనాత్మకంగా అధ్యయనం చేసేందుకు వీలుగా స్వతంత్రానికి మునుపటి సమాజాన్ని, స్వతంత్ర భారత సమాజాన్ని ఈ నవల చిత్రించింది. దేశభక్తులెలా తయారవుతారో, బాలబాలికలను దేశభక్తులుగా తయారు చేసే విధానమేమిటో ఈ నవల చక్కగా సూచించింది. రచయిత్రి 'హృదయనేత్రి' నవలనొక దేశభక్తి ఇతిహాసంగానే మలిచారు.

ఆంధ్రదేశంలో జరిగిన జాతీయోద్యమ ఘట్టాలను భావితరాల వారికి తెలియజేసి, వారిలో దేశభక్తి పెంపొందించేందుకు మాలతీ గారు ఈ నవలను రచించినట్టు తోస్తుంది. స్వతంత్ర సముపార్జనకు పాటుపడడంలో మనరాష్ట్రం మరే రాష్ట్రానికి తీసిపోదని, ఆంధ్రులు దేశభక్తిలో కూడా అగ్రగాములని ఈ నవల విస్పష్టం చేస్తుంది.

'హృదయనేత్రి'లో జాతీయోద్యమానికి సంబంధించిన ఎన్నో పాత్రలున్నాయి. కొన్ని జాతీయోద్యమంలో పాల్గొన్న నిజాయితీ పాత్రలు. మరికొన్ని నిజాయితీ లేని పాత్రలు. స్త్రీ పాత్రలు కూడా చాలా ఉన్నప్పటికీ జాతీయోద్యమ దృష్ట్యా చెప్పుకోదగ్గ పాత్రలు రెండే. ఒకటి రామలక్ష్మి పాత్ర. రెండు జానకమ్మ పాత్ర.

**రామలక్ష్మి :** 'హృదయనేత్రి' నవలలో రామలక్ష్మి పాత్రకు ప్రముఖ స్థానం ఉంది. నాయకుడు గోపాలరావు వ్యక్తిత్వ వికాసానికి బీజం వేయడమే గాక దోహదం చేసిన వ్యక్తి రామలక్ష్మి. రాముడత్తయ్యగా నవల ప్రారంభంలోనే ఈ పాత్ర పరిచయమవుతుంది. రామలక్ష్మి, మేనల్లుడు గోపాలరావును పక్కన పడుకోబెట్టుకొని స్వరాజ్యాన్ని గురించి చెప్పింది. గాంధీజీని గురించి చెప్పింది. దేశభక్తి నూరిపోసింది. అక్కడే, అప్పుడే అతని వ్యక్తిత్వానికి గట్టి పునాది వేసింది. పెద్దవాళ్ళు పిల్లల్ని చేరదీయాలి. వారికి మంచి విషయాలు చెప్పాలి. మంచి అలవాట్లు నేర్పాలి. అప్పుడే వారి వ్యక్తిత్వ వికాసానికి సముచితంగా దోహదం చేసినవారవుతారు అనే విషయాన్ని రామలక్ష్మి పాత్ర ద్వారా రచయిత్రి పాఠకులకు తెలియజేశారు.

భర్తప్రేరణతో, ఆయన సాహచర్యంతో రామలక్ష్మి దేశభక్తిని అలవర్చుకొంది. గాంధీగారి పట్ల కూడా ఎనలేని భక్తిని పెంచుకొంది. తాను నైష్ఠిక బ్రాహ్మణ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ భర్తతో కలిసి సభలకూ, సమావేశాలకూ వెళ్ళేది. బ్రాహ్మణేతరులతో కలసి భోజనం చేసేది. ఒక హరిజన బాలుణ్ణి తన ఇంట్లో పనిమనిషిగా పెట్టుకొంది. రామలక్ష్మి వైఖరిని విమర్శిస్తూ ఆమె తమ్ముడి భార్య సుబ్బమ్మ అన్న మాటలు ఇక్కడ గమనార్హం. "మీ అక్కయ్యకు అంటూసొంటూ లేదు – మైలకూడు తింటూంటారు. ఇంట్లో కడజాతి పిల్లవాడిని పనికి పెట్టుకొన్నారుట. ఆ తిరుగుళ్ళేమిటి? ఆ ఉపన్యాసాలేమిటి? – నిప్పులు కడిగే వంశంలో పుట్టిన ఈవిడ గారు" (పుట:6) అని సుబ్బమ్మ గొనుగుతూ ఉంటుంది. రామలక్ష్మి ప్రతిరోజూ గంటసేపు నూలు వడికేది. బెజవాడ కాంగ్రెస్ మహాసభకు కార్యకర్తలను చేర్చేందుకు పాటుబడేది. ప్రకృతి పరిసరాలను చూసినప్పుడు కూడా దేశపరిస్థితే ఆమె మనసులో మెదిలేది. రైల్వేస్టేషన్లో ఆమెలో ఉప్పొంగిన ఆలోచనలను రచయిత్రి ఆవిష్కరించిన వైనం రామలక్ష్మి మనసుకు అద్దం పడుతుంది.

"ఇది నాదేశం. పచ్చగా చల్లగా ఉన్న నా గడ్డ. అయితే ఈ గడ్డకీ, నాకూ స్వాతంత్ర్యం లేదు. ఎక్కడో వేలమైళ్ళ దూరాన్నుంచి వచ్చిన తెల్లవాడు, నాగడ్డపైన, నాజాతిపైన అధికారం చెలాయిస్తున్నాడు. ఈ చెట్లకి, ఈ నేలకి, ఈ జాతికి విముక్తి లభించేది ఎన్నడో!" (పుట:9). రామలక్ష్మి తన భర్త వాసుదేవరావుతో కలిసి కల్లు పాకల దగ్గర పికెటింగ్ చేసింది. గాంధీగారు రామనగరం వచ్చినప్పుడు గోపాలరావుకు ఆశీర్వాదమిప్పించింది. గాంధీగారికి తన నగలన్నిటినీ సమర్పించడమే గాక మంగళసూత్రాన్ని కూడా ఇవ్వడానికి ముందుకొచ్చింది. స్వరాజ్యం కోసం చేయవలసిన త్యాగాన్ని గురించి రామలక్ష్మి గోపాలంతో "మనకి స్వరాజ్యం రావాలంటే – ఇళ్ళు వాకిళ్ళు అన్నిటినీ పోగొట్టుకునేందుకు సిద్ధంగా ఉండాలి. మన సుఖాలు త్యాగం చెయ్యాలి" (పుట: 28) అని చెప్పింది.

"స్వరాజ్యం వస్తే ఎలా వుంటుంది"? (పుట:29) అని గోపాలరావు అడిగిన ప్రశ్నకు రామలక్ష్మి "మన దేశాన్ని మనం పాలించుకోవచ్చు. ప్రజలందరికీ తిండీ బట్ట వుంటుంది. దరిద్రం వుండదు. నీలాంటి పిల్లలు – స్వేచ్ఛగా, ధైర్యంగా పెరగవచ్చు" (పుట:29) అని ధీటుగా సమాధానం ఇచ్చింది. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన దేశభక్తులకు స్వాతంత్ర్యం ఎందుకు రావాలో స్పష్టమైన అవగాహన ఉండేది. స్వాతంత్ర్యం వస్తే దేశస్థితి ఎలా మెరుగుపడుతుందో వారు తమ మనో నేత్రాలతో దర్శించారు. రామలక్ష్మి ద్వారా ఆనాటి దేశభక్తుల ఆశయాన్ని, ఆలోచనలను మాలతీ చందూర్ గారు ఆవిష్కరించారు.

రామలక్ష్మి స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే గాక స్వతంత్ర భారతదేశంలోనూ నిజాయితీగా ఉండవలసిన ఆవశ్యకతను గోపాలానికి తెలియజేసింది. అతడు నిజాయితీపరుడుగా నిలబడేందుకు తోడ్పడింది. దేశభక్తురాలుగా భర్తను, అతని ఆశయాలను అర్థంచేసుకొని పురోగమించిన ఇల్లాలుగా, ఉద్యమంలో పాల్గొన్న వీరనారిగా, పోరాటం పట్ల కంటే నిర్మాణ కార్యక్రమాల పట్లే ఎక్కువ శ్రద్ధ వహించిన సేవాపరాయణురాలుగా రామలక్ష్మి పాత్ర ఈ నవలలో మనకు కనిపిస్తుంది.

**జానకమ్మ :** జానకమ్మ బాల వితంతువు. చీరాలలో అందరికీ తలలో నాలుక వంటి నారీమణి. ఈమె గాంధీగారి ప్రభావానికి, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారి ప్రభావానికి లోనైంది. ఖద్దరు విక్రయించడమే గాక తాను కూడా ధరించింది. నూలు వడకడంలో దిట్ట. స్వతంత్ర పోరాటంలోనూ, నిర్మాణ కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంది. చీరాల పేరాల ఉద్యమంలో స్త్రీలకు నాయకత్వం వహించింది. గాంధీగారు రామనగరం వచ్చినప్పుడు స్వరాజ్య నిధికి మొట్టమొదట నగలు ఇచ్చినావిడ జానకమ్మ. 'కంటె–కాసులపేరు' గాంధీజీ పాదాల ముందు వుంచినపుడు, అక్కడ సమావేశమైన వేలాదిమంది ఆశ్చర్యపోయారు. ఊపిరిబిగపట్టుకుని చూశారు.

అందరిళ్ళకి వెళ్ళి అడ్డమైన వాళ్ళకి పురుళ్ళు పోస్తున్నదని జానకమ్మ బంధువులు ఆమెకు దొడ్డివసారాలో అన్నం పెట్టబోయినప్పుడు ఆమె అన్నం తినలేదు. ఇక నుంచి అపక్వాహారం తప్ప వుడికిన పదార్థాలు తిననని శపథం పట్టారు. నానబెట్టిన

శెనగలూ, పెసలూ తిని, రాత్రిళ్ళు దేవుడి గుళ్ళో పడుకునే ఈ జానకమ్మ, తల మీద ముసుగుతో ఖద్దరు మూటలు భుజానికి ఎత్తుకుని అమ్మే ఈవిడ నగలని యిన్నాళ్ళు ఎక్కడ దాచుకుంది? అని చాలా మంది చెవులు కొరుక్కున్నారు. ఆమె బంధువులకి చాలా కోపం వచ్చింది. తిట్టారు. దుమ్మెత్తిపోశారు. ఈ గాంధీ తమని పకీర్లని చేస్తున్నాడని ఆడిపోసుకున్నారు. జానకమ్మ నోరు మెదపలేదు. నగల మూట యిచ్చేసి, నెత్తిమీద ముసుగు సవరించుకుంటూ వేదిక దిగింది–ఏమీ ఎరగనట్లు.

పోలీసుల దౌర్జన్యాన్ని ఎదుర్కొని జైలుకి వెళ్ళి అనారోగ్యంతో తిరిగి వచ్చింది. కాకినాడ కాంగ్రెస్ మహాసభలో పాల్గొంది. గోపాలరావు చీరాలలో నిర్మాణ కార్యక్రమాలు చేపట్టినప్పుడు జానకమ్మ అతనికి తోడ్పడింది. ఒత్తిడి చేసి అతణ్ణి ఎన్నికల్లో నిలబెట్టింది. ప్రభుత్వం వారు తనకిచ్చిన ఐదెకరాల పొలాన్ని మూడు కుటుంబాలకిచ్చి ఫలసాయం వారినే తీసుకోమంది. ఇది ఆమె ఔదార్యాన్ని ఆవిష్కరిస్తుంది. తన దగ్గరున్న పదివేల రూపాయలను గోపాలరావుకిచ్చి ఏదైనా సత్కార్యానికి వినియోగించమంది. హరిజనుల దయనీయ స్థితిపట్ల జానకమ్మ స్పందిస్తూ "హరిజనోద్ధరణ, అస్పృశ్యతా నివారణ అన్నాము. ఇప్పుడేం జరుగుతోంది? ఊరుబయట దూరంగా కాలనీలు కట్టించి వారిని ఇంకా అంటరాని వాళ్ళని చేస్తున్నారు. బాపూజీ ఇటువంటివి స్వప్నంలోనైనా ఊహించివుంటే, ఆయన ఎప్పుడో హిమాలయాలకి వెళ్ళిపోయేవారు – ఈ స్వరాజ్యం వద్దు స్వాతంత్ర్యం వద్దని" (పుట:176) అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

దేశభక్తుల కర్తవ్యం పట్ల జానకమ్మకొక స్పష్టమైన అవగాహన ఉండేది. "ప్రజల మధ్యకెళ్ళండి. ఈ రాజకీయ నాయకులు, మంత్రులు చేస్తున్న అన్యాయాలు ప్రజలకు చెప్పండి. ప్రజల కళ్ళు తెరిపించండి" (పుట:177) అని గోపాలరావుకు ఆమె చెప్పిన మాటలివి.

"అవినీతి, రాజకీయ దురహంకారం, కులతత్వాలు – వీటిని తరిమికొట్టాలన్న లక్ష్యసిద్ధి మీలాంటివాళ్ళలో యెందుకు కలగటం లేదు?" (పుట: 177) అనే జానకమ్మ ప్రశ్న నేటి యువతను, భారతజాతిని ఆలోచింపజేస్తుంది. కర్తవ్యోన్ముఖంగా నడిపిస్తుంది.

ప్రస్తుత దేశ ప్రజల మనోవైఖరి పట్ల, వారి చేతుల్లో వున్న దేశభవిష్యత్ పట్ల జానకమ్మ విచారం వెలిబుచ్చింది. "ఒకప్పుడు దేశానికి నేనేం చెయ్యాలి? ఏవిధంగా దేశానికి ఉపయోగపడగలను? అనుకొనే వాళ్ళు ఇప్పుడు దేశం నాకేం చేస్తుంది? నాకేం ప్రయోజనం జరుగుతుంది? అని ప్రతి పనికీ ప్రతిఫలం ఎదురు చూస్తున్నారు. ఇటువంటివాళ్ళ చేతుల్లో పడిన దేశం పురోగమించదు – వెనక్కి వెడుతుందే తప్ప" (పుట: 179) అని ప్రజల ఆలోచనా విధానంలో వచ్చిన మార్పును జానకమ్మ తులనాత్మకంగా ఆవిష్కరించింది.

ఆదర్శ దేశభక్తురాలుగా, అందరికీ సహాయపడే ఔదార్యం గల అతివగా జానకమ్మ ఈ నవలలో మనకు కనిపిస్తుంది.

'హృదయనేత్రి' సంపూర్ణ జాతీయోద్యమ నవల. దీనిలో స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలకు స్థానం కల్పించబడింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చోటుచేసుకొన్న చారిత్రక సంఘటనలను కూడా రచయిత్రి సముచితంగా, సందర్భోచితంగా చిత్రించారు. స్త్రీ పాత్రల ద్వారా దేశానికి అమూల్యమైన సందేశాన్ని మాలతీ గారు అందించారు. రామలక్ష్మి, జానకమ్మ ఇద్దరూ కూడా దేశభక్తులను తయారు చేయడంలో కృతకృత్యులయ్యారనే చెప్పాలి.

**ఆధార గ్రంథాలు :-**

1. హృదయనేత్రి – మాలతీచందూర్
2. హృదయనేత్రి పుదువెల్లం తులనాత్మక అధ్యయనం – డా॥బొల్లేపల్లి కల్పన

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్య పోరాటం – ఉషా మెహతా "రహస్య రేడియో"

డా॥ వేసిపోగుల వెంకటేశ్వర్లు, తెలుగు అధ్యాపకులు, తెలుగు శాఖ, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు, చరవాణి : 9963141500

బొంబాయి (ప్రస్తుత ముంబై)లోని గోవాలియా టాంక్ గ్రౌండ్‌లో 1942 ఆగస్టు 8న ఓ పెద్ద సభ జరిగింది. గాంధీ చెప్పే మాటలను వినాలని, ఆరోజు అక్కడికి వేలమంది వచ్చారు. ఆ సభలో గాంధీ ప్రసంగిస్తూ.. "ఈరోజు నేను మీకో నినాదం ఇస్తున్నా. దీన్ని హృదయంలో ఉంచుకోండి – డూ ఆర్ డై" అని అన్నారు. "క్విట్ ఇండియా" ఉద్యమంలో చేరాలని ప్రజలను అభ్యర్థించారు. అప్పుడు సభలో పాల్గొన్నవారిలో ఉషా మెహతా అనే ఓ యువ విద్యార్థిని కూడా ఉన్నారు. నిజంగానే గాంధీ "డూ ఆర్ డై" నినాదానికి ఆమె తన హృదయంలోనే స్థానం ఇచ్చారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో తన వంతు పాత్ర పోషించారు.

**రహస్య రేడియో :** "క్విట్ ఇండియా" ఉద్యమం మొదలవడంతో గాంధీ సహా కాంగ్రెస్‌లోని ప్రధాన నేతలను బ్రిటిష్ ప్రభుత్వం జైల్లో పెట్టింది. వాళ్ళందరినీ నిర్బంధంలోకి తీసుకోవడం ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలన్నది బ్రిటిష్ ప్రభుత్వ ఉద్దేశం. అయితే, అప్పటికే నాయకులు ఆ ఉద్యమం చాపకింద నీరులా విస్తరించేందుకు చేయాల్సిన ఏర్పాట్లు చేశారు. అలాంటి ఓ ఏర్పాటే 'రహస్య రేడియో'. చరిత్ర పుస్తకాల్లో 'కాంగ్రెస్ రేడియో'గా ఇది పేరుకెక్కింది. ఉషా మెహతా కథ ఈ రహస్య రేడియోతో ముడిపడినదే.

గుజరాత్‌లోని సూరత్ జిల్లాలోని సరస్ అనే గ్రామంలో 1920 మార్చి 25న ఉషా మెహతా జన్మించినట్లు సీతా ఓర్ఝా అనే ఆవిడ రాసిన 'హొమేజ్ టు ఉషా మెహతా' పుస్తకంలో ఉంది. ఉషా తండ్రి బ్రిటిష్ పాలనలో జడ్జిగా పనిచేసేవారు. ఆయన పదవీ విరమణ చేసిన తర్వాత వారి కుటుంబ నివాసం బొంబాయికి మారింది. ఉషా చిన్నతనంలోనే స్వాతంత్ర్య పోరాటంలో చేరారు. కాని ఆమె తండ్రి ఈ నిర్ణయం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అప్పటికి బ్రిటిష్ పాలనలో తాను జడ్జిగా ఉండటమే అందుకు కారణం. అయితే ఉషా మాత్రం తన నిర్ణయానికే కట్టుబడి వున్నారు.

నూలు వడకడం, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కరపత్రాలు పంచడం, సహాయ నిరాకరణ... ఇలా బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆమె చిన్నతనం నుంచే కార్యకలాపాలు మొదలుపెట్టారు. ఈ వివరాలన్నీ నవీన్ జోషి రాసిన 'ఫ్రీడమ్ ఫైటర్ రిమెంబర్' అనే పుస్తకంలో వున్నాయి. ఉషా మెహతాను నవీన్ జోషి ఇంటర్వ్యూ చేశారు. ఆ ఇంటర్వ్యూ కూడా ఈ పుస్తకంలో వుంది. 'బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నేను గొంతెత్తి అరిచిన మొదటి నినాదం 'సైమన్ గో బ్యాక్'. అప్పటికి నాకు ఎనిమిదేళ్ళు.' అని ఉషా ఆ ఇంటర్వ్యూలో చెప్పారు. గుజరాత్‌లో అప్పట్లో అబ్బాయిలు 'వానర సేన'గా ఏర్పడ్డారు. ఉషా లాంటి అమ్మాయిలు 'మంజర సేన'గా ఏర్పడ్డారు. గుజరాతీలో వానర అంటే కోతి అని, మంజర అంటే పిల్లి అని అర్థం. 1942 ఆగస్టులో బొంబాయిలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసిసి) సదస్సులో గాంధీ, నెహ్రూ, వల్లభ్‌బాయ్ పటేల్, మౌలానా ఆజాద్ లాంటి నాయకులు ప్రసంగించినప్పుడు ఉషా మెహతా కూడా అక్కడ వున్నారు.

వారి ప్రసంగాలు విన్న తర్వాత ఉషా, ఆమె సహచరులు రహస్య రేడియో స్టేషన్‌ను ప్రారంభించాలన్న కృతనిశ్చయానికి వచ్చారు. అందుకోసం ఏర్పాట్లు మొదలు పెట్టారు. 'అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ బ్రాడ్‌కాస్టింగ్ డ్యూరింగ్ క్విట్ ఇండియా మూమెంట్' అనే పుస్తకం ప్రకారం... విఠల్‌దాస్ ఖఖ్కర్, చంద్రకాంత్ ఝవేరి, జగన్నాథ్ ఠాకుర్, నారిమన్ ప్రింటర్, మిర్జా ఈ 'రహస్య రేడియో స్టేషన్' కార్యకలాపాల్లో భాగమయ్యారు. స్వాతంత్ర్యోద్యమానికి సంబంధింఎచిన వార్తలను ప్రసారం చేస్తూ, ప్రజలను సంఘటితం చేసేందుకు ఈ రహస్య రేడియో పనిచేసేది.

'పత్రికల గొంతు నొక్కి, వార్తలపై నిషేధం విధించినప్పుడు .. దేశంలోని మురుమూల ప్రాంతాల్లోని వారికి కూడా సమాచారం చేరవేసేందుకు రేడియో గొప్ప సాధనం' అని శంకర్ ఉమాకు 1969లో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఉషా చెప్పారు.

స్వాతంత్ర్యోద్యమ కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారికి ఆరోజుల్లో నిధుల లేమి పెద్ద సమస్యగా వుండేది. ఉషా బృందం కూడా అదే సమస్యను ఎదుర్కొంది. "కొంతమంది బంధువులు స్వచ్ఛందంగా వాళ్ళ నగలు తెచ్చిచ్చారు. వాటిని తీసుకునేందుకు

మేం ఒప్పుకోలేదు' అని ఉషా ఉమాశంకర్‌తో ఇంటర్వ్యూలో చెప్పారు. అయితే తమలాగే ఇతర బృందాలు కూడా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని ఉషా తెలుసుకున్నారు. వాటిని సంప్రదించేందుకు ఆమె ప్రయత్నించారు. అలాంటి ఓ రేడియో స్టేషన్ ఏర్పాటు చేసే ముందు లోహియాను తాను కలిశానని, రేడియో ఏర్పాటులో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారని ఆమె చెప్పారు.

ఉషా బృందం కొందరి సాయం తీసుకుంది. ఓ స్నేహితుడి ద్వారా రేడియో ట్రాన్స్‌మిటర్ తయారు చేయించుకుంది. 1942 ఆగస్టు 14న వారి రేడియో ప్రసారాలు మొదలయ్యాయి. రేడియో నడిపినవిధం: "ఇది కాంగ్రెస్ రేడియో. భారత్‌లోని ఓ చోటనుంచి 42.34 ఎం ఫ్రీక్వెన్సీపై ఇది ప్రసారమవుతోంది' అని అర్థం వచ్చేలా ఆ రేడియో ప్రకటన ఉండేది. ముంబైలోని చౌపట్టి సమీపంలో ఓ భవనం పై అంతస్తులో ఓ ప్రసార కేంద్రం నడిచేదని అరుణ్ చంద్ర 'ద క్విట్ ఇండియా మూమెంట్' అనే పుస్తకంలో పేర్కొన్నారు.

ఉషా బృందం రేడియోకు సాంకేతిక పరమైన సాయం షికాగో అండ్ టెలిఫోన్ కో.' అందించేది. 'మా రేడియోవి రహస్య కార్యకలాపాలు. పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు తరచూ కొత్త చోట్లకు మార్చుతూ ఉండేవాళ్ళం. మేం ప్రసారాలు అందించిన మూడు నెలల కాలంలో 6-7 సార్లు కొత్త చోట్లకు మారాం.' అని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరక్ష ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఉషా చెప్పారు. ప్రారంభంలో రోజూ రెండు సార్లు హిందీ, ఇంగ్లీష్‌లో ప్రసారాలు వచ్చేవి. కాని ఆ తర్వాత ఒకే బులెటిన్‌కు పరిమితమయ్యారు. రోజూ రాత్రి ఏడున్నర నుంచి ఎనిమిది వరకూ ఇది వచ్చేది.

"భారత్ వ్యాప్తంగా వున్న ప్రత్యేక దూతల నుంచి మాకు వార్తలు అందేవి. బొంబాయిలో ఉన్న ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కూడా మాకు ముఖ్యమైన సమాచారం అందిస్తూ ఉండేది. చిట్టగాంగ్ బాంబు దాడి వార్త, జంషెడ్‌పూర్ ఆందోళనలు, బల్లియా ఘటనలపై వార్తలను మొదటగా ప్రసారం చేసింది మేమే. అప్పటి పరిస్థితుల కారణంగా దినపత్రికలు ఈ అంశాల గురించి రాసేవి కావు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి, ప్రజలకు వాస్తవంగా జరుగుతున్నదేదో 'కాంగ్రెస్ రేడియో' మాత్రమే చెప్పేది' అని శంకర్ ఉమాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మెహతా చెప్పారు.

ఈ రహస్య రేడియో ద్వారా చాలామంది ప్రముఖులు కూడా ప్రసంగించేవారు. 'ఇప్పటివరకు మనం ఉద్యమం చేశాం. ఇప్పుడు చేస్తుంది మాత్రం విప్లవం. విప్లవంలో గెలుపో, ఓటమో ఉంటుంది. ఇది ఒక పార్టీ విప్లవం కాదు, మొత్తం జాతి విప్లవం' అని లోహియా ఈ రేడియో ద్వారా ఓసారి ప్రసంగించారట.

బ్రిటిష్ పాలనలో బొంబాయి ప్రభుత్వ అదనపు సెక్రటరీగా పనిచేసిన హెచ్‌వి.ఆర్. అయ్యంగార్ 'కాంగ్రెస్ రేడియో' గురించి చెప్పినట్లుగా 'అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ బ్రాడ్‌కాస్టింగ్ డ్యూరింగ్ క్విట్ ఇండియా మూమెంట్' పుస్తకంలో కొన్ని విషయాలను పేర్కొన్నారు. 'నేను ఈ రేడియో ప్రసారాలు వినేవాడిని. కాంగ్రెస్ సోషలిస్టు భావజాలం అందులో ప్రస్ఫుటించేది. స్వతంత్ర భారతం, రైతులు, కార్మికులు, కూలీలదిగా ఉండబోతుంది' అని ఓసారి, 'స్వాతంత్ర్యం కోసం జరుగుతున్న విప్లవం పేదల కోసం. స్వతంత్ర భారతం కార్మికులది, కర్షకులది' అని మరోసారి ప్రసారమైంది. బ్రిటిష్ ప్రభుత్వం దీన్ని 'సోషలిస్టుల విప్లవ ఉద్యమం' గా గుర్తించింది. అని అయ్యంగార్ చెప్పినట్లు ఆ పుస్తకంలో ఉంది.

**పోలీసులకు దొరకడం:** ప్రజల్లో కాంగ్రెస్ రేడియోకు మంచి ఆదరణ లభించింది. అయితే, నిధుల లేమి, ప్రభుత్వ నిఘా ఉషా బృందానికి సమ్యలుగా ఉండేవి. "వీలైనంతగా తలా ఇంత పోగేసుకుని ఆర్థిక ఇబ్బందులను తీర్చుకొన్నాం. కాని పోలీసు వ్యానులు నిత్యం మమ్మల్ని వెంబడించేవి. కొన్నిసార్లు వెంట్రుకవాసిలో తప్పించుకున్నాం.' అని శంకర్ ఉమాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఉసా చెప్పారు.

చివరకు 1942 నవంబర్ 12న వారిని బ్రిటిష్ ప్రభుత్వ పోలీసులు పట్టుకోగలిగారు. శంకర్ ఉమాకు యిచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని ఉషా గుర్తు చేసుకున్నారు.

అంతకు ఒక వారం ముందే షికాగో రేడియో కో. సహా ప్రముఖమైన రేడియో షాపుల్లో పోలీసులు తనిఖీలు చేశారని ఆమె

చెప్పారు. ఓ టెక్నిషియన్ నుంచి పోలీసులు సమాచారం రాబట్టుకోగలిగారు. ఆ తర్వాత నవంబర్ 12న పోలీసులు బాబు భాయ్ ఖఖ్కర్ కార్యాలయంపై దాడిచేశారు. ఆ సమయంలో ప్రసారాలకు సంబంధించిన వస్తువులతో ఉషా అక్కడే వున్నారు. పోలీసులు వస్తున్నట్లు మాకు తెలియగానే, కాంగ్రెస్ రేడియోకు సంబంధించిన ముఖ్యమైన ఫైళ్ళు, సాహిత్యాన్ని దాచే ప్రయత్నం చేశామని ఆమె చెప్పారు. అక్కడినుంచి వెంటనే ఉషా రికార్డింగ్ స్టేషన్‌కు పరుగుతీశారు. అక్కడ డాక్టర్ లోహియా, ఇతర సహచరులు సాయంత్రం ప్రసారం చేసే కార్యక్రమం కోసం సిద్ధమవుతూ వున్నారు. వారికి విషయమంతా ఉషా వివరించారు.

పోలీసులకు సమాచారం చేరవేసిన టెక్నిషియన్ సహాయకుడి సాయంతో మళ్ళీ ఆరోజు రేడియో ప్రసారాన్ని రోజూలాగే ఉషా మొదలు పెట్టారు. "హిందుస్థాన్ హమారా గీతాన్ని కొన్ని వార్తలను, ఒక చర్చా కార్యక్రమాన్ని ప్రసారం చేశాం. చివర్లో 'వందేమాతరం' గీతాన్ని ప్రసారం చేస్తుండగా పోలీసుల అలికిడి మాకు వినిపించింది' అని చెప్పారు.

**జైలు జీవితం:** పరేఖ్‌వాడీ భవనంలోని 105వ నెంబర్ గదిపై రాత్రి 9.05 కు పోలీసులు దాడిచేశారు. 'వాళ్ళు తలుపులు బద్దలు కొట్టారు. 'వందేమాతరం' రికార్డు ప్రసారాన్ని ఆపాలని ఆర్డర్ వేశారు. మేం ఒప్పుకోలేదు. రేడియో ప్రసారం వింటున్న మా సహచరులకు ఆ చప్పుళ్ళ ద్వారా మా అరెస్టు విషయం అర్థమవుతూ వుంది' అని ఉషా వివరించారు.

పోలీసులు ట్రాన్స్‌మిటింగ్ సెట్‌ను, రు.7 వేల నుండి రు.10 వేల విలువ చేసే 120 గ్రామోఫోన్ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఏఐసిసి సదస్సులకు సంబంధించిన ఫోటోలు, రికార్డింగులు ఉన్న 22 పెట్టెలు కూడా వారికి దొరికాయి. ఉషా సహా మిగతావారిని అరెస్టు చేసి, లాకప్‌లో పెట్టారు. ఆ మరుసటి రోజు దర్యాప్తు మొదలైంది. రెండు నెలల దర్యాప్తు తర్వాత ఉ షా మెహతా సహా ఐదుగురు నిందితులపై పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రత్యేక కోర్టులో ప్రముఖ రచయిత కన్నయ్యలాల్ మున్షి నిందితుల తరపున వాదించారు.

"కోర్టు విచారణ సాగిన ఆరు నెలలు తీవ్రమైన మానసిక హింస అనుభవించా. విదేశాల్లో చదువుకునే అవకాశం కల్పిస్తామంటూ జైలు అధికారులు ఆశచూపారు. కాని నేను అంగీకరించ లేదు.' అని ఉషా చెప్పారు. చివరకు కోర్టు శిక్షలు ఖరారు చేసింది. ఉషా మెహతాకు నాలుగేళ్ళ కఠిన కారాగార శిక్షపడింది. బాబుభాయ్ ఖఖ్కర్‌కు ఐదేళ్ళ జైలు శిక్ష, చంద్రకాంత్ ఝవేరీకి ఒక ఏడాది జైలు శిక్ష విధించబడింది. 1942 నుండి 1946 వరకు ఉషా జైలు శిక్ష అనుభవించారు. 1946 ఏప్రిల్‌లో ఆమె ఎరవాడ జైలునుంచి విడుదలయ్యారు. 'జైలు నుంచి బయటకు వచ్చాక నాకు సంతోషంగా, గర్వంగా అనిపించింది. గాంధీ పిలుపు 'డూ ఆర్ డై'ని ఆచరించానన్న సంతృప్తి కలిగింది' అని ఉషా అన్నారు.

ఉషా జైలునుంచి విడుదలయ్యాక పిహెచ్‌డి చేశారు. బొంబాయి విశ్వవిద్యాలయంలోని విల్సన్ కాలేజిలో 30 ఏళ్ళపాటు ప్రొఫెసర్‌గా పనిచేశారు. గాంధీ పీస్ ఫౌండేషన్‌కు అధ్యక్షురాలిగా వున్నారు. మణి భవన్, గాంధీ మ్యూజియం, గాంధీ మెమోరియల్ నిధి సంస్థలతో కలిసి పనిచేశారు. 1998లో భారత ప్రభుత్వం దేశంలోనే రెండో అత్యున్నత పౌర పురస్కారమైన 'పద్మ విభూషణ్'ను ఉషా మెహతాకు అందజేసింది.

ఉషా మెహతా 80 ఏళ్ళ వయసులో 2000 ఆగస్టు 1న కన్ను మూశారు.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోదమ నవలల్లో మహిళా చైతన్యం

డా॥ ఎల్. కస్తూరి, తెలుగు అధ్యాపకులు, శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల, (తి.తి.దే), తిరుపతి.

**"ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పంచగన్"** అని చిలకమర్తి వారన్నట్లు ఎందరో స్త్రీలు ప్రతిభాపాటవాలను ప్రదర్శించే విధంగా దిశానిర్దేశికులయ్యారు. కందుకూరి వీరేశలింగం గారి రచనా భావప్రభావాలతో స్ఫూర్తిని పొందిన ఎందరో మహిళలు వారి కాలం నాటి సామాజిక హద్దులను అధిగమిస్తూ తమ సత్తా చాటుకున్నారు. వారి బాటలో పయనించినవారు కనపర్తి వరలక్ష్మమ్మ, అడుసుమిల్లి సరస్వతీ, జంట కవయిత్రులు అయితం ఇందిరా భారతులు, సామవేదులు చిరంజీవమ్మ, కోకా హనుమాయమ్మ, దేవులపల్లి సత్యవతమ్మ, వీరుబొట్ల రామలక్ష్మమ్మ, వట్టికొండ విశాలక్షి మొదలైన స్త్రీలు. ఎందరో తమదైన శైలిలో రచనలు చేసి స్వాతంత్ర్యోద్యమంలో రచయితులుగా తమ వంతు కృషిని అందించారు.

రచయిత్రులు సామాజిక సమస్యల్ని రూపమాపే దిశగా పయనించేవాళ్ళు కొందరైతే, ఉద్యమాల్లో పాల్గొని ప్రాణత్యాగం చేసినవాళ్ళు మరికొందరు. మహిళలు ఇల్లు, పిల్లలకే అంకితం కాకుండా స్త్రీ శక్తి ముందు ఏదీ జడిలంకాదని ఇంటి బాధ్యతలతో పాటు తమ దేశ దాస్య శృంఘలాలను రూపుమాపే దిశగా అడుగులు వేశారు. మన సమస్యల్ని మనమే పరిష్కరించుకోవాలనే ధృఢ సంకల్పంతో సామాజిక సమస్యల్ని ఎదుర్కోవడానికి నడుం బిగించిన మహిళా రచయిత్రులు ఎందరో మరెందరో ఉన్నారు.

ఈ విధంగా స్వాతంత్ర్యోద్యమ కాలంలో మహిళల్లో చైతన్యం తీసుకురావడానికి మహిళా రచయిత్రులు సమాజంలోని తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని అధిగమించడానికి వివిధ సాహిత్య ప్రక్రియలైన కవితలు, కథానికలు, నాటకాలు, నవలలు, స్వీయచరిత్రలు, లేఖలు, వ్యాసాల వంటి వాటిని ఎంచుకొని రచనలు చేశారు. వీటిల్లో నవల సమగ్ర జీవితాన్ని చిత్రిస్తుంది. అందుకని కొందరు రచయిత్రులు స్వాతంత్ర్యోద్యమ భావాలను తమ నవలల ద్వారా అందించారు.

సమాజంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న నిస్సహాయులుగా ఉన్నటువంటి మహిళలకు చైతన్య స్ఫూర్తిని కలిగించే విధంగా కాంచనపల్లి కనకాంబ–రాధ, పులవర్తి కమలావతీదేవి–కుముద్వతి, పిరాట్టమ్మ–శోభావతి, దామెర్ల భ్రమరాంబ & కొండా లక్ష్మీబాయి– సేవాశ్రయము మొదలైన రచయిత్రులు రాసిన నవలల్లోని మహిళా చైతన్యం గురించి పరిశీలించడం ఈ పత్ర ముఖ్య ఉద్దేశం.

**కాంచనపల్లి కనకాంబ – రాధ:** శ్రీమతి కనకమ్మ గారు నటేష్‌శాస్త్రి 'దిక్కట్ర ఇరుకళందిగళ్' (ఇరువురు అనాధ బాలికలు) అని తమిళ భాషలో రాసిన నవలను 'రాధ' అనే పేరుతో 1917లో తెలుగులోకి అనువదించారు.

శ్రీమతి కనకమ్మ గారు 1893లో గంటూరు జిల్లాల్లో జన్మించారు. 1900 సం॥ నుంచి 1904 వరకు పాఠశాల విద్యను అభ్యసించేటప్పుడే పెళ్ళి జరగడం, వైధవ్యం కలగడంతో నెల్లూరిలోని తన అన్న దగ్గర ఆశ్రయాన్ని పొందారు. 1906లో నెల్లూరిలోని బాలికల పాఠశాలలో పునఃప్రవేశించి 3వ ఫారం (8వ తరగతి) వరకు చదువుకున్నారు. 1910లో టీచర్ ట్రైనింగ్ చేసి, ఆ పరీక్షల్లో ప్రథమ స్థానాన్ని పొందడమే గాక, విజ్ఞాన చంద్రికా పరిషత్ పరీక్షలు రాసి బంగారు పతకాన్ని సాధించారు. తాను చదువుకున్న పాఠశాలలోనే ఉపాధ్యాయినిగా పని చేశారు.

కనకమ్మగారు విద్యనభ్యసించడం వల్ల, దేశం పట్ల అభిమానాన్ని కల్గి ఉండడం వల్ల స్త్రీ విద్యా విషయాలలో అనేక కార్యక్రమాలు చేపట్టారు. సమాజంలో స్త్రీలు ఐక్యమత్యం, జ్ఞానం సామాజికతల వల్ల వివేకవంతులైనప్పుడు వాళ్ళని వాళ్ళ భర్తలు కూడా గౌరవిస్తారు. స్త్రీల సమస్యల్ని చర్చించుకుంటూ అవగాహన చేసుకోవచ్చు అనేది రచయిత్రి అభిప్రాయం. మిక్కిలి ప్రతిభాపాటవాలు కలిగిన కనకమ్మ కవితిలక కాంచనపల్లి కనకాంబగా ప్రసిద్ధి పొందారు.

'రాధ' నవల సమాజంలో ఎన్నో ఇబ్బందులకు గురైన స్త్రీలలో ధైర్య స్థైర్యాలుంటే విద్యావంతులైన స్త్రీలు అభివృద్ధిని సాధించగలరనే చైతన్యాన్ని కల్గిస్తుంది. రాధ పాత్ర ప్రధానమైంది. అనాధ బాలికలకు స్ఫూర్తి దాయకమైంది. ఇందులో సవతితల్లి కుట్రలవల్ల మార్గమధ్యలోనే ఇద్దరు అనాధ బాలికలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాకుడా ఆత్మస్థైర్యంతో, విచక్షణాజ్ఞానంతో జమీందారు

వద్ద ఆశ్రయం పొందుతారు. అతను ఆ పిల్లల్ని ఒక అనాధ శరణాలయంలో చేర్పిస్తారు. అక్కడ వాళ్ళు చక్కగా చదువుకొని, తోటి విద్యార్థినులతో కలిసి మెలిసి సన్నిహితంగా ఉంటారు. వాళ్ళిద్దరిలో ఒకరు స్నేహానికి ప్రాముఖ్యతనిస్తే, మరొకరు తన కాళ్ళ మీద తాను నిలబడటానికి ఉపాధ్యాయినిగా విద్యార్థులకు బోధిస్తూ ఉంటుంది. చివరకు తండ్రిని కలుసుకోవడం, వాళ్ళకు నచ్చినవారితో పెళ్లిళ్ళు చేసుకోవడంతో కథ ముగుస్తుంది.

ఈ నవల బాల్యవివాహాల వల్ల వితంతువులకు తాము అనాధలమనీ తామెలా జీవితాన్ని గడపగలమన్నవారికి స్ఫూర్తిని, ధైర్యాన్ని ఇస్తుంది. ఆడపిల్లలు తమకు ఎదురైన సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవచ్చని చెబుతుంది. విక్షణ జ్ఞానంతో మనుషులను అంచనా వేసుకుంటూ ముందుకు సాగాలనీ, తద్వారా విద్యావంతులైన జీవితాన్ని చక్కగా గడపవచ్చనే భరోసా కలిగించే కథా వస్తువు ఉన్న నవలను అనువదించి కనకాంబగారు అందరిలో స్ఫూర్తిని కల్గించారని చెప్పవచ్చు.

**పులవర్తి కమలావతీ దేవి–కుముద్వతి :** శ్రీమతి పులవర్తి కమలావతీ దేవిగారు 'కుముద్వతి' అనే చారిత్రక నవలను రాశారు. రాజమహేంద్రవరానికి చెందినవారు. తండ్రి కామరాజు, తల్లి సీతారామమ్మ, భర్త మాణిక్యలరావు. 1936లో శ్రీకేసరిగారిచే స్వర్ణకంకణం, తిక్కన జయంతి సందర్భంగా బంగారు పతకాన్ని పొందారు. పెద్దాపురంలో జరిగిన వైశ్యసభలో స్వర్ణ పతకంతోపాటు 'కవితిలక' బిరుదును పొందారు. కుముద్వతి నవలను స్కూలు ఫైనలుకు పాఠ్యగ్రంథంగా నిర్ణయించి ఎంపిక చేయడం విశేషం. రాజమందిర ఆంధ్రయువతీ సంస్కృత కళాశాల కార్యనిర్వాహక సభ్యురాలుగా పనిచేశారు.

1924లో సరస్వతీ శక్తి సంస్థ శ్రీమతి పులవర్తి కమలావతి దేవిగారు రాసిన 'కుముద్వతి' నవలను ప్రచురించారు. ఇందులో కముద్వతి పాత్ర ప్రముఖమైంది. శివాజీ కొడుకైన శంభాజీ నరేంద్రుని భోగలాలసతకు అతని రాజకీయాలకు కుముద్వతి తన పెళ్ళిని పణంగా పెట్టి తనని పెంచినవారిని కాపాడాలనుకుంటుంది. కానీ ఆ రాజు దుష్యంతుడు శకుంతలను మోసం చేసినట్లు కుముద్వతిని చేయాలనుకుంటాడు. అప్పుడు ఆమెకు చక్రవర్తియైన రాణా ప్రతాపుడు అండగా నిలబడతాడు. దీంతో కుముద్వతి శంభాజీ తనని మోసం చేశాడన్న విషయాన్ని అందరికీ తెలిసేటట్లు చేయాలనుకుంటుంది. తన సోదరుడైన వీరసేనుడికి అండగా నిలబడటమేగాక, శంభాజీ నరేంద్రునిచేతనే అతడు తనని రహస్యంగా పెళ్ళి చేసుకున్న విషయాన్ని అందరి మధ్య ఒప్పుకొనేటట్లు చేస్తుంది. చివరికి ఆమె మహారాష్ట్ర సామ్రాజ్యానికి రాణిగా బాధ్యతలు చేపట్టి బీదసాదలకు సహాయ సహకారాలందించిన కరుణామయి అర్థమవుతుందని అని చెప్పవచ్చు.

అశ్వ విద్యా తెలిసిన స్త్రీగా ఆమె ఒంటరిగా రాజు దగ్గరికి చేరి తన పెండ్లిని పణంగా పెట్టి బందీయైన తన వారిని కాపాడిన ధైర్యవతిగా, నీతిమంతురాలిగా, ప్రేమను త్యాగం చేసి రాజ్యాన్ని రక్షించిన వనితగా కుముద్వతి పాత్రను తీర్చిదిద్దారు. పోరాటపటిమను చూసి స్వాతంత్ర్యోద్యమ కాలంకు స్త్రీలలో స్ఫూర్తిని నింపే పాత్ర ఇది. రచయిత్రి స్వాతంత్ర్యోద్యమ నాటి స్త్రీలలో ధీరత్వాన్ని నింపేటట్లు ఈ రచన గావించారని చెప్పవచ్చు.

**అ.పె.పిరాట్టమ్మ – శోభావతి:** అ.పె.పిరాట్టమ్మ శోభావతి అనే సాంఘిక నవలను రాశారు. సాధారణంగా పురుషులు వేశ్యల్ని పంపడం, ఉన్నవారి భార్యలు ఓర్పుతో జీవితాన్ని గడపడమనేది సాంఘీకమైన సామాన్య విషయం. కానీ ఈ నవలలో ఒక వేశ్య తన దగ్గరకు వచ్చిన పురుషుడ్ని సన్మార్గంవైపు తిప్పి భార్యపై అనురాగం ఏర్పడేటట్లు చేసి కుటుంబ వ్యవస్థను కాపాడటం అనేది చాలా ప్రత్యేకమైన విషయం. వేశ్యలు పురుషులకు మోహంలోముంచి వారి ఆస్తిపాస్తులన్నీ దోచేస్తారనీ, కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తారనే భావన నుంచి వేశ్యలలో మంచి వాళ్ళుంటారని తెల్పుతుంది. దీనికి ఉదాహరణగా ఒక వేశ్య భార్యలు గతించిన వారి భోగానికి మాత్రం ఉపయోగపడాలనుకుంటుంది. కాని పెళ్లికాని యువకులు వచ్చినా వారికి పెళ్ళయ్యేటట్లు చేస్తుంది. భార్య ఉన్నా ఆమెను పట్టించుకోకుండా తన దగ్గరకు వచ్చిన వారికి హితబోధ చేసి భార్యపై అనురాగం ఏర్పరచుకునేటట్లు చేసి వారికి తమ భార్యలోని గొప్పతనాన్ని గుర్తించేటట్లు చేస్తుంది.

కుటుంబ వ్యవస్థలోని పురుషులు భార్య దగ్గర మాత్రమే సుఖాలను పొందాలని భావించేటట్లు చేసి కుటుంబాన్ని నిలబెట్టిన ఒక వేశ్య కథ. వేశ్యలలో రావాల్సిన సంస్కారంతోబాటు వేశ్యాలోలురైన భర్తలు కూడా తెలుసుకోవాల్సిన సంస్కారాన్ని తెల్పి, వారి దృష్టిని స్వాతంత్ర్యంవైపు మళ్ళించే ప్రయత్నం చేసిన నవల ఇది. దేశ సంరక్షణలో స్త్రీలు చూపించిన ధీరత్వాన్ని,

కుటుంబాలను నిలబెట్టిన వేశ్యలు కూడా ఉన్నారన్న సందేశాన్ని సమాజానికి తెల్పారు రచయిత్రి.

**దామెర్ల భ్రమరాంబ & కొండా లక్ష్మీబాయి – సేవాశ్రయము :** దామెర్ల భ్రమరాంబ మరియు కొండా లక్ష్మీబాయి ప్రేమ్‌చంద్ హిందీభాషలో రచించిన 'సేవాసదన్' అనే నవలను తెలుగులో 'సేవాశ్రయము' అనే పేరుతో అనువదించారు.

ఈ నవలలో ఒక స్త్రీ వేశ్యగా మారిన తీరు కన్పిస్తుంది. ఆర్థిక సమస్యలతో తల్లిదండ్రులు ఆడపిల్లలకు పెళ్ళి చేయలేని నిస్సహాయ స్థితిలో బాల్యవివాహాలు పేరిట వయో తారతమ్యం కలిగిన వ్యక్తులకిచ్చి పెళ్ళి చేసి కాపురానికి పంపిస్తారు. ఒకరోజు ఆ స్త్రీ ఒక సంగీత సభకు వెళ్ళి ఆలస్యంగా ఇంటికి వచ్చినందుకు సంఘసంస్కర్త అయిన తన భర్త అధైర్యంతో ఇంటికి రానియ్యడు. అదే వీధిలో ఉన్న ఒక వేశ్య ఆమెకు ఆశ్రయం కల్పించి, సంగీతం నేర్పించి నెమ్మదిగా ఏ మాత్రం ఆమె ప్రమేయం లేకుండా వేశ్యవృత్తిలోకి దింపుతుంది. తన జీవితాన్ని తలచుకొని పశ్చాత్తాపడుతూ ఉంటుంది. కానీ వచ్చే విటులతో ఎవరితో ఎలా ప్రవర్తించాలో తెలుసు కనుక మోహితులైన యువకులను మాత్రం చెడిపోకుండా చూడగలుగుతుంది.

కానీ ఆమె భర్త సంఘసంస్కర్త అయినప్పటికీ ఇంటికి రానియ్యకుండా చెయ్యడంతో కుటుంబ స్త్రీగా ఉన్న ఆమె వేశ్యవృత్తిలోకి నెట్టబడిందనీ, దాని వల్లనే ఆమె బాధపడటం జరిగిందని భావిస్తాడు. అంతేకాక ఆమె చెల్లెలి పెళ్ళి కూడా ఆగిపోవడంతో ఏర్పడిన పరిణామాలు తెలుసుకొని అతను తన మిత్రులతో కలిసి వేశ్యలను ఉద్ధరించాలనుకుని వారసత్వ వేశ్యావ్యవస్థ లేకుండా చేయడం కోసం వాళ్ళ పిల్లలకు చదువులు చెప్పించడం, పెళ్ళిళ్ళు చేయడం వంటివి చేస్తాడు.

వేశ్యవృత్తితో ఊరివెలుపల వేశ్యలవాడలో ఉన్న స్త్రీలను సేవాశ్రయాలలోకి తరలించాలనుకుంటాడు. దాని కోసం మున్సిపాలిటీలో బిల్లును ప్రవేశపెట్టి సవరణ చేయాలనుకుంటారు. కానీ ఎవరూ ఆమోదించకపోవడంతో తానే మున్సిపల్ అధ్యక్షుడిగా ఎన్నికై వేశ్యలను సేవాశ్రయాలలో ఉండేటట్లు చేసి వారిని సత్ప్రవర్తన గల స్త్రీలు మార్పు తీసుకొచ్చిన తీరు కన్పిస్తుంది. ఆనాటి ఆంధ్రప్రాంత పురుషులలో వేశ్యవ్యవస్థ నిషేదంపట్ల చైతన్యాన్ని తీసుకురావడం కోసం అనువాద సాహిత్యాన్ని స్త్రీలు సాధనంగా తీసుకున్నారని చెప్పవచ్చు.

పితృస్వామ్య సమాజంలో సంపన్న వర్గంవారు తమకనుకూలంగా ఉన్న వేశ్య వ్యవస్థను రద్దుచేయడం ఇష్టం లేక వ్యతిరేకిస్తారు. అయితే ఆ వేశ్యల ఘోషను ఎవరూ అర్థం చేసుకోలేరు. ఒక స్త్రీ వేశ్యగా మారడానికి సాంఘిక వ్యవస్థే కారణమని, వారి ఆర్థిక సమస్యల్ని పరిష్కరించి సన్మార్గంలో పెట్టి జన జీవన స్రవంతిలో కలపాలన్నది రచయిత్రి ఉద్దేశం. సంస్కారవంతమైన జీవితాన్ని అందిచాల్సిన బాధ్యతను గుర్తించిన నాటి స్త్రీ రచయితలు వేశ్యల జీవితాలను గురించి తెలుసుకోవాలంటే వేశ్య గృహాలకు వెళ్ళాలి. అంతధైర్యం ఆనాటి స్త్రీలకు లేవు. కనుక వేశ్యలకు సంబంధించి విషయాలతో కూడిన హిందీ నవలను ఆధారంగా తీసుకొని తెలుగులోకి అనువదించారని చెప్పవచ్చు.

ఈ విధంగా ఎందరో మహిళా రచయిత్రులు స్త్రీలు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలు బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, సతీసహగమనం, వేశ్యవృత్తి వంటి రుగ్మతల నుంచి బయట పడాలంటే తమవంతు కృషి చేయాలన్న దృక్పథంలో స్త్రీలను చైతన్య పరిచే విధంగా కథా వస్తువుల్ని తీసుకొని తీర్చిదిద్ది 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాతపి గరీయసి' అన్న సత్యాన్ని నిరూపించిన సాధ్వీమణులే మన భారతీయ మహిళలు.

**ఆధారగ్రంథాలు**

1. డా॥ కనకదుర్గ జంధ్యాల – స్వతంత్ర నుండి – స్వాతంత్ర్యానికి–జంకదు ప్రచురణలు, గుంటూరు–2021.
2. శ్రీమతి లక్ష్మీకాంతమ్మ, ఊటుకూరు – ఆంధ్ర కవయిత్రులు – బాపట్ల, గుంటూరు జిల్లా – 1980.
3. డా॥దుర్గాబాయ్ దేశముఖ్, అచ్యుతుని గిరిజ – స్వాతంత్ర్య సమరంలో ఆంధ్ర మహిళలు – ఆంధ్రరాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాలల శాఖ, హైదరాబాద్–1987.

# జాతీయోద్యమంలో స్త్రీ చైతన్య కవితలు

**డాక్టర్ పి.జయచంద్రుడు,** తెలుగు అధ్యాపకులు, ఎస్.వి.సి.ఆర్.ప్రభుత్వ డిగ్రీకళాశాల, పలమనేరు. చరవాణి: 97037 58519

**"యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతా:"**

స్త్రీలు ఎక్కడ పూజింపబడతారో దేవతలు అక్కడ సంచరిస్తుంటారని వేదవాక్కు. సృష్టికి మూలం స్త్రీ అని భారతపురాణ ఇతిహాసాలు ఘోషిస్తున్నాయి. సమాజంలోగానీ, కుటుంబంలోగానీ స్త్రీ పాత్రే అత్యంత ప్రధానమయినదని మన భారతభూమిలో విశ్వసిస్తున్నాం. ఇది ముమ్మాటికి నిజం. యావత్ ప్రపంచంలో స్త్రీ పాత్ర ప్రధానమని మనం ప్రత్యక్షంగా, అనుభవపూర్వకంగా మనం చూస్తున్నాం. స్త్రీలు అబలలని, బలహీనులనే అభిప్రాయాలూ ఉన్నాయి. కానీ పురాణాల్లో కావచ్చు, ఆదిమ సమాజ కాలం నుండి గానీ స్త్రీ పాత్ర మానవ జీవితంలో ఎంత ప్రభావవంతమైనదో కళ్ళారా చూస్తున్నాం. రాజ్యాలను ఏలిన రాజుల జీవితాలను ప్రభావితం చేసిన వాళ్ళూ స్త్రీలే. అవసరమైతే సామ్రాజ్య రక్షణకు పాలకులై ప్రత్యక్షంగా రాజ్యాలను ఏలిన స్త్రీలూ ఉన్నారు. ముఖ్యంగా భారతదేశంలో సుల్తానా రజియా, ఝాన్సీ లక్ష్మీబాయ్ ఆంధ్రదేశంలో రుద్రమదేవి లాంటివాళ్ళు మనకు చరిత్రలో తారసపడవారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో కొందరు కవయిత్రులు స్త్రీలను ఉద్యమంలోకి ప్రోత్సహించడానికి కలమెత్తి కవితలు రచించారు. వీరు ఒక వైపు ప్రత్యక్షంగా గళమెత్తి నినదించడమే కాకుండా కలమెత్తి తమ స్త్రీ జాతిని చైతన్యవంతులు చేసి జాతీయోద్యమ పోరాటంలో పాల్గొనేటట్లు చేశారు. జాతీయోద్యమ కాలంలో స్త్రీలను చైతన్యవంతం చేసే కవితలను కొందరు కవయిత్రులు రచించారు. అలాంటి రచనల్లో కనకదుర్గ జంధ్యాల సంకలనపరిచిన 'స్వతంత్రత నుండి.... స్వాతంత్ర్యానికి' అనే రచన ఒకటి. ఆ రచన నుండి ఇప్పుడు బ్రిటీష్‌వారి దురాగతాలను, దౌర్జన్యాలను సహించని రచయిత్రినులు తమ కవితలతో స్త్రీజాతిని ఎలా చైతన్య పరచారో వివరించడం నా పత్రోద్దేశం.

సహాయ నిరాకరణోద్యమంలో విదేశీ వస్త్ర బహిష్కరణ, స్వదేశీ వస్త్రధారణ ఒక ప్రధానమైన అంశం. బ్రిటిష్ వ్యాపార పద్ధతులు స్వదేశీ వస్త్ర వ్యాపారంపై, వస్త్ర ఉత్పత్తిపై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. స్వదేశంలోని ముడిసరకులను తీసుకెళ్ళి బ్రిటిష్‌వారు తమ దేశంలో వస్త్రాలను ఉత్పత్తి చేసి మన భారతదేశాన్ని వర్తక కేంద్రంగా మార్చుకోవడంతో భారతదేశంలోని వస్త్ర పరిశ్రమ దివాలా తీసింది. వస్త్ర పరిశ్రమపై ఆధారపడి జీవించే వారి బ్రతుకులు సర్వనాశనమయ్యాయి. వస్త్ర పరిశ్రమ పునరద్ధరించడానికి స్వదేశీ ఖద్దరును ప్రోత్సహించడానికి కనుపర్తి వరలక్ష్మి రచించిన 'స్వరాజ్యలక్ష్మి' అనే కవిత అత్యంత ప్రజాదరణ పొందింది. 1923 నవంబర్ అనసూయ పత్రికలో ప్రచురితమైన 'స్వరాజ్యలక్ష్మి' కవితను పరిశీలిద్దాం.

"మానసంబెంత చింతలో మఱుగుచున్న
జబ్బుచేనొడలస్సి చెడి జడతనున్న

మనదు ముద్దు స్వరాజ్యను గనినయంత
పోవు చింతయు రుజయును బోవునిజము"

"ఖద్దరు వసనమే గదా గట్టికొనియు
పేరు ముద్దు స్వరాజ్యగా బెట్టికొనియు

సరసగాంధి సందేశంబు సారమేదో
యదియ బోధించే నీ బాల నతివ చూడు"

సహాయ నిరాకరణోద్యమంలో గాంధీజీ స్వదేశీ విద్య, ఖద్దరు ధారణ, హరిజనోద్ధరణ, మద్యపాన నిషేధం వంటి విషయాలకు ప్రాధాన్యతనిచ్చి ప్రజలను వాటిని సాధించడానికి ఉద్యమించాలని సందేశమిచ్చాడు. ఆయన సందేశాన్ని స్త్రీలకు

అందించి వారిని చైతన్యపరచడానికి వరలక్ష్మమ్మ రచించిన కవిత ఇది.

భారతజాతీయోద్యమంలో ఎందరో మహానుభావులు ప్రాణాలను కోల్పోయారు. దాదాపు తొంభై సంవత్సరాల పోరాటం భారత దేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించి పెట్టింది. దానికి ప్రధాన కారణం ఐకమత్యం, యావత్తు భారతజాతి సమైక్యంగా పోరాటం వల్ల స్వరాజ్యమనే ఫలితం లభించింది. ప్రతి ఒక పౌరుడిలో దేశభక్తి ఉంటుంది. అలాగే పోరాట పటిమను ఉంటుంది. కానీ ఐక్యతాభావం లేనప్పుడు ఎంతటి దేశభక్తియైనా, ఎంతటి పోరాట పటిమైనా వృథా అవుతుంది. భారతీరత్నకాంబ అనే రచయిత్రి 'నక్షత్రమాలిక' అనే కవిత్వంలో దేశభక్తి, జాతీయత్వం, స్వమతాచారాభిలాష, పాతివ్రత్యం సత్ప్రవర్తన కలిగి ఉన్నప్పుడే స్వరాజ్యం సంభవిస్తుందని, స్వజాత్యాభిమానాన్ని నిరంతరం కాపాడుకోవటమే భారతజాతి రక్షణయని ఇలా తన జాతీయాభిమానాన్ని కవిత్వీకరించింది.

"జాతీయత్వము దేశభక్తి స్వమతాచారాభిలాషంబునన్
పాతివ్రత్యము, సత్ప్రవర్తనమునన్ సర్వాదరాస్థానమౌ
నీతిన్ గార్యములందు శ్రద్ధ యెడ నిండారుటన్ మాపయిన్
ప్రీతింజేసి యొనగ వేడెదను తల్లీ నిత్యమున్ భారతీ!"

భారతదేశంలో అనాదిగా స్త్రీకి ఎంతో గౌరవం ఉంది. కానీ పురుషాధిక్యం స్త్రీ స్వేచ్ఛను హరిస్తూ, స్త్రీలు అణచివేతకు గురౌతూ ఉండడం మనకు తెలిసిందే. కానీ స్త్రీ లేని, స్త్రీకి ప్రాధాన్యం లేని సమాజం అభివృద్ధికి నోచుకోదనే సత్యం మనకు తెలుసు. అందువల్ల స్త్రీవిద్య, స్త్రీలగౌరవ జీవనం, వితంతు సంస్కృతి నిరసన వంటి అంశాలపై స్త్రీల సంఘాలు, స్త్రీల ఉద్యమాలు తమ దృష్టిని సారించాలని వత్యం వెంకటానంతలక్ష్మి 'భారతమహిళా తారావళి' అనే కవితలో పేర్కొనింది. ఈ కవిత 1925 అక్టోబర్ నెలలో 'స్త్రీధర్మ' అనే మాసపత్రికలో ప్రచురితమైంది. ఇప్పుడు ఆ కవితను పరిశీలిద్దాం.

"వీరమును గొనుమాడ్కింజదువ
నేరువరా స్త్రీలు పతులు నియమించినచో...
కాలము మారుచున్నది
స్త్రీల స్వతంత్రంబు హెచ్చు శీఘ్రములోనన్..॥
"బాలికలు విద్యనేర్వక
గాలము పోనీయకుండు ఘనశాసనముల్
మేలగురీతిని సల్పగ
పాలకులను గోరవలదె భారతమహిళా!"

జాతీయోద్యమ కాలంలో కొందరు కవయిత్రులు బ్రిటిష్ ప్రభుత్వాన్ని నిరసిస్తూ కవితలు రాస్తే, కొందరు భరతజాతి గురించి కవితలు వల్లించారు. కొందరు భారతనారీమణులు శక్తులను వర్ణిస్తే కొందరు సమకాలీన జాతీయ నాయకుల త్యాగాలను, వారి ఆదర్శ మార్గాలను ప్రచారం చేసారు. మహాత్మాగాంధీ, తిలక్, నేతాజీ, భగత్‌సింగు లాంటి వారిని కీర్తిస్తూ ప్రజలలో దేశభక్తిని నింపడానికి ప్రయత్నించారు. వెలువోలు వసంతాదేవి 'మహాత్మాగాంధీ' అనే కవితలో గాంధీజీ సత్యం, అహింసా మార్గాలను, సత్యాగ్రహ దృఢ సంకల్పాన్ని, హరిజనోద్ధరణ వంటి గాంధీజీ ఆశయాలను ప్రజలకు తెలియజేసి వారిలో దేశభక్తిని పెంపొందించింది. గాంధీజీ స్ఫూర్తితో ఉద్యమంలో పాల్గొనాలని సూచించింది. ఇప్పుడు వసంతాదేవి రచించిన 'మహాత్మాగాంధీ' కవితను పరిశీలిద్దాం.

"సర్వసర్వం సహా జనశ్రవణ సుఖము
మధురమధురమ్మహింసాను మాన్యగీత

మాలపించు వసంత ఘికాధిపతివి
గాంధీ! మముబ్రోచు మీపాదకంజరజము
ఖండఖండాతర స్థితాఖండజనము
పూరుష శ్రేష్ఠుడని మిమ్ముంబొగడుచుండ
నతపరాధీన దు:ఖాననమ్ము నందు
దెల్లస్మితరేఖ భరత భూదేవి దాల్చు."

భారత స్వాతంత్ర్యోద్యమానికి నాంది పలికినది ఝూన్సీలక్ష్మీబాయి. ఝూన్సీలక్ష్మీబాయి ఉద్యమ స్ఫూర్తిని దేశప్రజలలో నింపడానికి స్థానాపతి రుక్మిణమ్మ 'ఝూన్సీలక్ష్మీబాయి' అనే కవితను రచించింది. ఈ కవిత 1929 అక్టోబరు 'గృహలక్ష్మి' పత్రికలో ప్రచురితమైంది. ఈ కవిత స్వాతంత్రోద్యమ కాలంలో స్త్రీలోకాన్ని ఎంతగానో ప్రభావితం చేసింది. స్త్రీలలో చైతన్యం కల్గించిన 'ఝూన్సీలక్ష్మీబాయి' కవితను పరిశీలిద్దాం.

"వీరలోకంబు వచ్చిన వీరబాల
లక్ష్మీబాయిని సతత మీయిలాతలాన
భరత వనితల హృద్వీథి ప్రబలుచుండ
ముదము తోడత జేమోడ్చి మొక్కదాన.."

ఆంధ్రదేశంలో జాతీయోద్యమంలో పాల్గొని, తెలుగు జాతి కోసం, తెలుగు జాతి స్త్రీలలో చైతన్యం నింపడం కోసం పాటుపడిన వారిలో దుర్గాబాయి దేశ్‌ముఖ్, మాగంటి అన్నపూర్ణ వంటివారు ప్రముఖులు. అన్నపూర్ణాదేవి కేవలం ఇరవై ఏడు సంవత్సరాలు మాత్రం జీవించింది. అతి తక్కువ వయస్సులో దేశం కోసం ఎంతో పాటుబడింది. దేశమునకై పుట్టి దేశమునకే చచ్చి తీరవలయుననే స్ఫూర్తికి సార్థక నామధేయురాలని పలువురిచే ప్రశంసింపబడిన దేశభక్తురాలు మాగంటి అన్నపూర్ణ. ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ, చట్టిరాధమ్మ, వి.జ్ఞానాంబ వంటివారు మాగంటి అన్నపూర్ణ దేశభక్తిని తన కవిత్వంలో ప్రశంసించారు. సహాయ నిరాకరణోద్యమంలో మాగంటి అన్నపూర్ణాదేవి ఖాదీపరిశ్రమలను స్థాపించిదని, స్త్రీలకు విశ్వవిద్యాలయాలను స్థాపించాలనే ఆలోచన ఉండేదని, తన వైవాహిక జీవితాన్ని ఉద్యమానికి దారబోసిన త్యాగధనులు. ఉద్యమ స్త్రీల సంస్కృతికి స్ఫూర్తినిచ్చిన వ్యక్తిగా ఆమెను పేర్కొనవచ్చు.

ఇలా జాతీయోద్యమ కాలంలో పురుషులే కాకుండా ఎందరో మహిళామణులు దేశభక్తితో కవితలు రచించి భరతమాత విముక్తికై తెల్లదొరల పతనానికి శ్రీకారం చుట్టారని చెప్పవచ్చు. కొందరు ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని తమ జీవితాలను దేశసేవకే అంకితం చేసి తమ జాతికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని చెప్పవచ్చు.

**పరిశీలనా గ్రంథాలు :**

1. స్వతంత్రత నుండి.... స్వాతంత్ర్యానికి – కనకదుర్గ జంధ్యాల
2. స్వాతంత్ర్య స్వరము – రాజేష్ కుమార్ పర్తి
3. కనుపరి వరలక్ష్మమ్మ – రాజ్యలక్ష్మి పోలాప్రగడ
4. తెలుగు సాహిత్య చరిత్ర – శాస్త్రి, ద్వా.నా.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# నే ధన్యనైతిని కథలోని స్వాతంత్ర్యోద్యమ భావాలు

డా॥ వి. కృష్ణవేణి, తెలుగు విభాగాధిపతి, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ & పి.జి. కళాశాల, తిరుపతి. చరవాణి :9441948530

భరతమాత ఆంగ్లేయుల కబంద హస్తాలలో సుమారు రెండు వందల సంవత్సరాలు చిక్కిశల్యమైంది. జన్మభూమి దాస్య శృంఖలాలను తెంచడానికి నాడు స్వాతంత్ర్య సమరయోధులు జీవితాలను అర్పించారు. ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించడానికి సాహిత్యం కూడా ప్రముఖ పాత్ర వహించింది. రచయితలు సమాజంలోని వ్యక్తులలో వీరరసం ప్రభోదించడానికి గేయాలు, కథలు, నవలలు, వ్యాసాల వంటి రచనలకు పూనుకున్నారు. నిరక్షరాస్యుల కోసం వీధినాటకాలు, తోలుబొమ్మలాటల ద్వారా మన బానిస బ్రతుకుల గురించి వివరించారు.

ఈ విధమైన స్వాతంత్రోద్యమ సాహిత్యంలో రచయిత్రుల కృషి కూడా వెలకట్టలేనిది. స్త్రీలు ఎక్కువశాతం నిరక్షరాస్యులుగా ఉన్న ఆ కాలంలో, కలం పట్టి స్వాతంత్ర్య ఉద్యమం గురించి వ్రాయాలన్న సంకల్పమే చాలా గొప్పది. బాల్య వివాహాలు, వితంతువుల బేలతనం, కన్యాశుల్కం... వంటి అనేక సమస్యలతో స్త్రీల ఉనికికే గుర్తింపు లేని రోజుల్లో భారతి వంటి సాహిత్య మాసపత్రికల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించే రచనలు రచయిత్రుల కలం నుండి వెలువడ్డాయంటే సంభ్రమాశ్చర్యాలు కలుగుతాయి.

బండారు అచ్చమాంబ, కనుపర్తి వరలక్ష్మమ్మ, క్రమదటి జానకీ దేవి, పులవర్తి కమలాదేవి, శ్రీమతి గుమ్మడిదల దుర్గాబాయి వంటి వారిని ప్రముఖగా పేర్కోనవచ్చు.

వీరిలో గుమ్మడిదల దుర్గాబాయి ప్రత్యేకంగా స్వాతంత్రోద్యమ పోరాటంపై రచనలు చేశారు. వీరి కథారచనల్లో 'మహారాణి దుర్గావతి' కథ 1924లో అనసూయ మాసపత్రికలో ముద్రించబడింది. 1929లో 'నే ధన్యనైతిని' కథ భారతి మాసపత్రికలో ప్రచురితమయింది. తిరిగి ఈ కథ 1986లో ఇదే పత్రికలో పునర్ముద్రణకు నోచుకుంది. 1930లో 'పశ్చాత్తాపం' కథ భారతిలోను, 1934లో 'లోకదృష్టియందాతడున్నత్ముడే' కథ భారతి పత్రికలోనే అచ్చయింది.

పై కథల్లో రెండుసార్లు ముద్రణకు నోచుకున్న 'నే ధన్యనైతిని' కథ స్వాతంత్రోద్యమ భావజాలాలను ప్రేరిపించేదిగా ఉంది. ఇందులో ప్రజలను స్వాతంత్ర్యమం వైపు నడిపించే వ్యక్తులతో పాటు, ఆంగ్లేయులకు బాసటగా నిలిచే స్వార్థపరులనూ చిత్రించారు రచయిత్రి దుర్గాబాయి. కథలో స్త్రీ పాత్రలను బేలతనంతో కాకుండా స్వేచ్ఛా భావాలు, దేశభక్తి, స్త్రీ విద్య వంటి ఆధునిక పోకడలతో తీర్చిదిద్దారు. రచయిత్రులు మహిళల ధీశక్తిని, పట్టుదల, ఓర్పులను చక్కగా చిత్రించగలరని ఈ కథలోని శారదాబాయి, లీల పాత్రల ద్వారా నిరూపించారు దుర్గాబాయి.

గ్రాంధిక భాషలో సాగే ఈ కథ ఎత్తుగడనే రాట్నంపైన గల దేశభక్తితో మొదలవుతుంది.

"లీలా! లీలా! యింతవఱకేమి చేయుచుంటివే! అబ్బా! రాట్నమున్న నీకు తిండియు, నిద్రయు కూడా నక్కరలేదు గదా! తండ్రిగారు నీకొఱంకై వేచి యున్నారు. భోజన మొనర్చ తిరుగబోగూడదా!"

అంటుంది లీల తల్లి కమలాబాయి.

తండ్రి శ్రీనివాసరావుతో లీల వారి పాఠశాలలోని పిల్లలు ఎవరయితే సన్నటి నూలును వడికి తెస్తారో వారికి బహుమతితో పాటు, కాంగ్రెస్ సభలో జరిగే వస్తు ప్రదర్శన శాలలో నూలు దండలు చేయడానికి అవకాశమిస్తారన్నారని అంటుంది. అందుకే పాఠశాల నుండి వచ్చినప్పటి నుండి రాట్నం ముందే కూర్చొని సన్నని నూలు దారం వడకటానికి ప్రయత్నిస్తున్నానంటుంది. తండ్రి లీల పట్టుదలను ప్రోత్సహిస్తాడు.

ఇలా వీరి కుటుంబం నిస్వార్థ దేశభక్తి కలదిగా పరిచయం చేశారు రచయిత్రి.

మరో కుటుంబం శ్యామసుందరుడిది. ఇరవై ఏళ్ళ వయసున్న శ్యామ సుందరం చదువు, క్రీడలు, దేశభక్తి కలగలపిన

వ్యక్తిత్వం. తండ్రి చిన్నపుడే మరణించగా అన్న ప్రసాదరావు, వదిన లక్ష్మీబాయిలు పెంచి పెద్దచేస్తారు. ప్రసాదరావుకు బ్రిటీష్ వారి ప్రాపకం సంపాదించాలని మక్కువ. తమ్ముడిని వారి వద్ద మంచి ఉద్యోగానికి కుదుర్చాలనుకుంటాడు. శ్యామ సుందరం తన వదినకు సమయం దొరికినపుడు రాట్నంపై నూలు వడకటం, స్వాతంత్ర్యం అవశ్యకతను బోధిస్తుంటాడు. అది ప్రసాదరావుకు నచ్చదు.

ఈ రెండు కుటుంబాల నేపథ్యం పరిచయం చేసిన రచయిత్రి దుర్గాబాయి కథనాన్ని వేగంగా దేశభక్తి భావాలవైపు నడిపారు. నాటి పరిస్థితులను ఇలా వివరించారు. ఫిబ్రవరి నెల దేశమంతయు సైమనుకమిషను బహిష్కరణాందోళనలతో అల్లకల్లోముగ నుండెను. ఏ పత్రికల జూచిన నీ వార్తయే! యెవరినోట విన్న నీ మాటయే! నాడు నగరమందెక్కడ చూచినను విద్యార్థులు సంరంభమే.

ఈ వాతావరణంలో అన్న వద్దన్నా వినకుండా శ్యామ సందరుడు ఖద్దరు దుస్తులు ధరించి, జాతీయ జెండా చేతపట్టుకొని 'మహాత్మా గాంధీకి జై' అంటూ యువకులను ప్రోత్సహిస్తూ, ఒక సభలోని దేశభక్తి ప్రసంగాన్ని వింటాడు. తరువాత ఒంటరిగా కూర్చొని ఆలోచిస్తాడు. తాను ఆంగ్ల విద్య మోజులోపడి దేశస్వేచ్ఛకై పోరాడటం లేదని గుర్తిస్తాడు. చదువును మాని పూర్తిగా దేశం కోసం పోరాడాలని కృత నిశ్చయుడవుతాడు.

ఇక్కడ లీల కుటుంబంలో విశాదం అలముకుంటుంది. తండ్రి మరణిస్తూ లీలతో దేశభక్తిని వదలద్దంటూ ప్రమాణం చేయించుకుంటాడు. ఈ దిగులుతో కొన్ని రోజులకు తల్లి కూడా చనిపోతూ తండ్రి మాటను నిలుపమంటుంది. ఒంటరిదైన లీలను బాలికల పాఠశాలను నడుపుతున్న శారదాబాయి చేరదీస్తుంది.

కథలో రచయిత్రి – తీర్చిదిద్దన ఉత్తమ పాత్ర శారదాబాయి.

శారదాబాయి బాల వితంతువు. భర్త మరణించిన తరువాత ఆమెను ఇంటిలోని వారే వంటచేస్తూ పొయ్యి దగ్గరున్నపుడు అందులోనే తోసి చంపెయ్యాలని చూస్తారు. అందుకు కారణం ఆమె చదువుకోవాలనే కోరికను వెల్లిబుచ్చటం. కొన్ని ప్రయత్నాల ద్వారా ఆమె తప్పించుకొని ఇంటి నుండి పారిపోయి పూణాకు చేరి, స్వచ్ఛంద సంస్థల ద్వారా నాలుగు సంవత్సరాలు చదువుకుంటుంది. తిరిగి తమ ఊరికి వచ్చి ఒక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరుతుంది. బాలిక విద్యకై చేస్తున్న కృషికి మెచ్చిన పాఠశాల యాజమాన్యం శారదాబాయికి యాజమాన్య బాధ్యతలను అప్పగిస్తుంది.

శ్యామ సుందరుడు పాఠశాలలోని విద్యార్థులను సైమన్ కమీషన్ బహిష్కరణ ఉద్యమంలో పాల్గొనటానికి ప్రోత్సహించినందుకు అతన్ని పాఠశాల నుండి బహిష్కరిస్తున్నట్లు ప్రసాద రావుకు ప్రధానోపాధ్యాయుని నుండి ఉత్తరం వస్తుంది. దాన్ని చూసి ప్రసాదరావు తమ్ముడిని నిందిస్తాడు. దేశభక్తి అంటూ తిరుగుతూ చదువు మానుకొని, వచ్చే ఉద్యోగం, డబ్బును వదులుకుంటున్నావంటా కేకలు వేస్తాడు. మరిది చేస్తున్నది సరయిన పనే అంటూ భర్తకు సర్దిచెప్పబోయిన లక్ష్మీబాయిని ప్రసాదరావు నిందిస్తాడు. ఇద్దరినీ వెళ్ళి వేరే ఇంటిలో ఉండమంటాడు. ఈ నిందను భరించలేని శ్యామసుందరుడు అక్క శారదాబాయికి పరిస్థితులను వివరిస్తూ ఉత్తరం రాస్తాడు. అతన్ని అక్క తన వద్దకు రమ్మంటుంది. లీల, శారదాబాయిలు శ్యామసుందరుని రాకకై ఎదురుచూస్తారు. శ్యామసుందర, లీలలు పరస్పరం ఆకర్షణకు లోనవుతారు. శ్యామసుందరుడు చేస్తున్న దేశసేవ పనులను రచయిత్రి ఇలా వివరించారు.

'శ్యామసుందరుడు ఆ గ్రామమున అడుగుడిన దాదిగ జాతీయ సంస్థల నిర్మించి అందు రాట్నములను, మగ్గములను పెట్టించి అనేకులు బీద వారల కుపాధి కల్గింప మొదలిడెను. ఇంతియ కాక, పల్లెటూరు గ్రామముల కేగి దేశపరిస్థితులు, దేశము, దేశదారిద్ర్యమన్న నెట్టిదియో యెరుంగక తమలో తాము తగవు లాడుకొనుచు, అన్యోన్యము ఐకమత్యమును వీడి మతకలహములచే తమ్ముతామే నిర్భాగ్యులుగ జేసికొనుచున్న పల్లెల వారిని విద్యావంతులుగా జేసి, వారలలో ఐకమత్యము గలిగించి రాట్నముల యందు, మగ్గముల యందు వారి కుత్సాహము జనింపజేసి వారి గౌరవమునకు పాత్రుడై, ఒక నిముసమైనను వృథ పుచ్చక ఒరుల హితము కొరకై పాటుపడ జొచ్చెను'.

పై మాటలు చాలు దుర్గాబాయి గారికి సమాజంపై, దేశసేవ గురించి ఉన్న అవగాహన అర్థం కావటానికి. గ్రామాలలోని నిరక్షరాస్యులలో చైతన్యం తేవలసిన ఆవశ్యకత గురించి ఇక్కడ అర్థమయ్యేలా చేశారు. మనలో మనం కలహించుకోవటం వల్లనే ఇతర దేశస్థులు మన పాలనను చేపట్టి మనపై పెత్తనం చెలాయిస్తున్నారన్న భావాలను ప్రజల్లోకి తీసుకుపోవటం ముఖ్యమనే అంశాలను శ్యామ సుందర పాత్ర నడవడి వల్ల తెలియజేశారు రచయిత్రి.

శ్యామ, లీలల గురించి రచయిత్రి మాటలు ఇలా ఉన్నాయి.

'శ్యామ సుందరుడు దినమంతయు పనిచేసి యింటికి వచ్చినతోడనే లీలకు నైతిక రాజకీయ ఆర్థిక విషయములను నేర్పుచుండను. వారు ప్రతిదినమును దినమంతయు, తామొనర్చిన సేవను, దాని లాభమును ఒకరికొకరు చెప్పుకొను చుందురు.'

అలాగే శారదాభవనమున శారదాబాయి, లీలలు స్త్రీవిద్యకై పాటుపడుత్ను వాతావరణాన్ని ఇలా తెలిపారు దుర్గాబాయి.

'బాలికలు చదువుకోవటానికి విశాలమైన గదులు, ఆడుకోవడానికి ఖాళీస్థలాలు, పూలమొక్కలు వంటి వాతావరణంను ఏర్పరచి బాలికలకు విద్య నందిస్తున్నారు'.

ఈ విధంగా దేశసేవకై పాటుపడుతున్న లీల, శ్యామసుందరులు ఉండగా కొంతకాలనికి శారదాబాయి ఆరోగ్యం క్షీణిస్తుంది. ఆమె అన్న ప్రసాదరావుకు విషయం తెలుస్తుంది. తమ్ముడి సత్ప్రవర్తన అతనిలో మార్పును తెస్తుంది. భార్య లక్ష్మీబాయితో కలిసి శారదాభవనానికి చేరతాడు. శ్యామసుందరుడికి లీలకు వివాహం చేయమని శారదాబాయి అన్నతో చెప్పి పాఠశాల బాధ్యతలను ఆ జంటకు అప్పగించమంటూ 'నే ధన్యనైతిని' అంటూ తనువు చాలిస్తుంది.

రచయిత్రి దుర్గాబాయి ఈ కథలోని ప్రతి పాత్రను నాటి స్వాతంత్ర్య పోరాట పరిస్థితుల చుట్టూ నడిపారు. కథ ద్వారా సమాజానికి కర్తవ్యబోధన చేశారు. యువతకు మార్గాన్ని నిర్దేశించారు. మహిళలు విద్య నేర్చుకోవాలన్నరు. రాట్నం గొప్పదనం వివరిస్తూ నూలు వడకటం, ఖద్దరు దుస్తుల ప్రాముఖ్యతను వివరించారు.

ఇలా ఉన్నత ప్రమాణాలు కల 'నే ధన్యనైతిని' కథను రచించిన గుమ్మడిదల దుర్గాబాయి రచయిత్రిగా చిరస్మరణీయాలు.

**ఆధార గ్రంథాలు :-**

1. కవయిత్రుల కవిత్వంలో స్త్రీ మనోభావాలు – పి. లక్ష్మి – నవోదయ బుక్ హౌస్–హైదరాబాద్
2. తెలుగు సాహిత్యంలో దేశభక్తి –తెలుగు భాషా వికాస పరిషత్తు, చెన్నై, ప్రచురణ
3. నేధన్యనైతిని – శ్రీమతి గుమ్మడిదల దుర్గాబాయి–భారత మాస పత్రిక – కథానిలయం.
4. స్వాతంత్ర్యోద్యమంలో మహిళల పాత్ర – ప్రజాశక్తి, హైదరాబాదు, ప్రచురణ.

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# మహిళాభ్యుదయ స్వాతంత్ర్య దీపికలు – శారద లేఖలు

ఎం. ప్రదీప్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, చరవాణి: 9100388510

మహిళలు కళ్ళజోళ్ళు – కాళ్ళజోళ్ళు వేసుకుని బయట కనిపిస్తేనే భయంకరంగా చూసే నాటి కాలంలో మగువలు మగవారికి ఏ మాత్రం తీసిపోరని మహిళాభ్యుదయాన్ని, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని పెంచే విధంగా రచనలు చేస్తూ ప్రత్యక్షంగా తాను స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనకపోయినా సాహిత్యోద్యమాన్ని నిర్వహిస్తూ, 1921వ సం॥లో మహాత్మ గాంధీ గారికి ఖద్దరే కడతానని మాటనిచ్చి, ఈ మాట ప్రకారం కాలం చేసే వరకు ఖద్దరునే కట్టి

**"ధర్మము నా జీవము**
**నీతి నా మతము**
**సతీశ్రేయము నా లక్ష్యము "**

అని ప్రకటించి, వీటిని సమర్థించుకొనుటకు కలం పట్టి సాహితీ లోకంలో తనకంటూ ఒక గుర్తింపును వర్తింపజేసుకుని, తెలుగు సాహిత్యంలో లేఖాసాహిత్యానికి సుభిక్షమైన స్థానాన్ని ఏర్పరచి, శారదలేఖలతో ఆంధ్ర శారదకు పట్టం కట్టిన విశిష్ట రచయిత్రి కనుపర్తి వరలక్ష్మమ్మ. వీరు చదివినది ప్రాథమిక విద్యే అయినా ప్రౌఢ రచయితలకు తీసిపోని రచనా ప్రౌఢిమను తమ రచనలలో ప్రతిఫలింపజేశారు. కథ, నవల, వ్యాసం, లేఖ, దండకం, గేయం ప్రక్రియ ఏదయినా రచనలో తనకని ఒక విలక్షణతను ప్రదర్శించిన కనుపర్తి వరలక్ష్మమ్మ గారు నాటి భావపురి అనగా నేటి బాపట్లలో 1896 అక్టోబర్ 6వ తేదీన పాలపర్తి శేషయ్య హనుమాయమ్మ దంపతులకు జన్మించారు. తన పన్నెండేళ్ళ వయస్సులో ఇదే బాపట్ల ప్రాంతానికి చెందిన కనుపర్తి హనుమంతరావు గారిని బాల్య వివాహం చేసుకున్నారు.

కె.ఎన్. కేసరి గారు 1928వ సం॥లో ప్రారంభిస్తున్న గృహలక్ష్మి పత్రికకు ఏదైనా రాసి యిమ్మని వరలక్ష్మమ్మను కోరినప్పుడు **'శారదా'** అనే కులం పేరుతో తన స్నేహితురాలు **'కల్పలత'**కు రాస్తున్నట్లు మొదటి శారద లేఖను గృహలక్ష్మి పత్రిక తొలి సంచికకు రాసిచ్చారు. ఇలా ప్రారంభమైన శారద లేఖలు కొన్ని సంవత్సరాలపాటు నిర్విరామంగా కొనసాగాయి.

ఈ లేఖలలో ఆనాటి సమకాలీన సమాజంలోని సమస్త విషయాలను చర్చించారు. ప్రధానంగా శారదా చట్టం, విడాకుల చట్టం, గాంధీగారి ఖద్దరు ప్రచారం, సహాయ నిరాకరణ ఉద్యమం, లవణ సత్యాగ్రహం, అస్పృశ్యతా నివారణ, హరిజన దేవాలయ ప్రవేశం, మద్యపాన నిషేదం, దొంగ సన్యాసులు, వరకట్నాలు, బహుభార్యత్వం మొదలైన మహిళా చైతన్యం, స్వాతంత్ర్య కాంక్షను పెంచే అంశాలను ప్రస్తావిస్తూ తనదైన శైలిలో సునిశిత అధిక్షేప ధోరణితో లేఖా రచన చేశారు.

'మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి' అని అహర్నిశలు ఆరాటపడే వరలక్ష్మమ్మ గారు వారిని చైతన్యపరిచే విధంగానే లేఖా వ్యాసంగాన్ని కొనసాగించారు. మహిళలకు హక్కులు ఎంత అవసరమో వాటి కోసం చైతన్య పరిచేవిధంగా లేఖలను రచించారు. హక్కులు ఎంత అవసరమో బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించటం కూడా అంతే బాధ్యత అని హక్కులు–బాధ్యతలు నాణేనికి ఉన్న బొమ్మ బొరుసు వంటివనే అంతస్సూత్రాన్ని తెలియజేశారు.

ఆ కాలంలో స్త్రీలు గడపదాటి బయటకు రావడమే గగనం. అటువంటి గడ్డు పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటూ నాలుగు అక్షరాలను నేర్చుకున్న విద్యావతులను కొందరు రచయితలు అవహేళన చేస్తూ రాసిన రచనలను తన లేఖలతో ఏకరవు పెట్టిన నిర్భరీకురాలు. స్త్రీలను అవమానపరిచే విధంగా రాసిన "కాలేజి గరల్" అనే నాటకాన్ని ఇదే పంథాలో నడిచిన ప్రహసనాలను, కథలను బహువిధాల అధిక్షేపించారు. ఇందుకు ఊతమిచ్చిన ఆంధ్రపత్రికలోని వసంతలేఖకు ధీటుగా సమాధానం చెప్పారు.

విద్యావతులైన యువతులే పెళ్ళయి బిడ్డలున్న వారిని వివాహం చేసుకుంటున్నారని, వీరు చదువుకున్న మూర్ఖులుగా

ఎందుకు ప్రవర్తిస్తున్నారనే ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూనే ఇందుకు గల కారణాలను తమ లేఖలలో ప్రస్తావించారు. వితంతు పునర్వివాహం, వర్ణాంతర వివాహం అని ఆడవారికి ఏదో సాయం చేస్తున్నామని నమ్మబలికి తీవ్రంగా మోసం చేస్తున్నారని ఇటువంటి వివాహాల మాటున జరుగుతున్న హేయమైన చర్యలపై తన కలుకు కలాన్ని ఝళిపించారు. సాహితీ లోకంలో ఉన్నత స్థాయిలో ఉన్న రచయితలు తమ రచనలలో హాస్యరస పోషణకు స్త్రీ పాత్రలను ఎన్ని రకాలుగా ఉపయోగించుకుంటున్నారో తెలియజేస్తూ, స్త్రీ ఇటువంటి పాత్రలకు తప్ప ఉదాత్త పాత్రలకు పనికి రాదా అని నాటి రచయితలను సూటిగా ప్రశ్నించారు.

వరకట్నం ఇచ్చుకోలేని తల్లిదండ్రుల దీనావస్థలను తెలియజేసే ఎన్నో సంఘటనలను తమ లేఖలలో తెలియజేశారు. రైలు ప్రయాణంలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, మహిళా బోగీల్లో పురుషులు ప్రవేశించి వాదనలు చేయడం వంటి జనసామాన్యంలో తరచూ జరిగే చిన్న చిన్న విషయాలు సైతం ఎంతటి ఇబ్బందిని కలిగిస్తాయో కళ్ళకు కట్టినట్లు రచించారు. పురుషుడు సంపాదిస్తే తిని ఇంట్లో ఖాళీగా కూర్చొనక స్త్రీలు సైతం వారికి చేదోడువాదోడుగా నిలవాలని హితవు పలుకుతూ గృహాలంకార వస్తువుల తయారీపై దృష్టిని నిలపాలని గృహ, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించే సూచనలు చేశారు.

సాటి రచయితల రచనల్లో స్త్రీ పాత్రలను తక్కువగా చూపడాన్ని ఎప్పుడూ సహించలేని ఉదాత్త స్త్రీవాది కనుపర్తి వరలక్ష్మమ్మ. గాంధీ గారి ఎడల వారి భక్తి అవాజ్యమైనది. 1947వ సంవత్సరం ఆగస్టు 15వ తేదీన మనకు లభించిన స్వాతంత్ర్యాన్ని ఒక లేఖలో విశదీకరిస్తూ సర్వజిత్ నామ సంవత్సరం అధిక శ్రావణ బహుళ చతుర్థశీ శుక్రవారము నాడు మనకు స్వాతంత్ర్యం వచ్చిందని తెలుగులోనే తెలియజేసిన భాషాభిమాని. ఇక తెల్లవారి పెత్తనం తెల్లవారిపోయిందని మనం స్వేచ్ఛాజీవులమని తెలియజేస్తూనే ఇందుకు పోరాడి అశువులు బాసిన ఎందరో త్యాగధనుల వీరపరాక్రమాలను గుర్తు చేసుకున్నారు. మన ప్రతినిధులే మనకు చట్టాలు చేస్తారు. అయితే ఈ శాసన ప్రతినిధులను ప్రజలే ఓటు ద్వారా ఎన్నుకోవాలి. ఇలా ఎన్నుకునేటప్పుడు ఓటర్లు తమ పరిశీలనా బుద్దికి పదును పెట్టాలని హితవు పలికారు. స్వాతంత్ర్యానికి ముందు 60 సంవత్సరాలు భారత జాతీయ మహాసభ చేసిన కృషిని బహువిధాల శ్లాఘించారు. స్వాతంత్ర్యం తమ జన్మ హక్కుని నొక్కి వక్కాణించిన నేతలు నేడు ఈ స్వాతంత్ర్యఫలం రుచి చూడలేదని వాపోయారు.

సందర్భం వచ్చినప్పుడల్లా జాతీయ సమైక్య భావాలను ప్రస్ఫురించే విధంగా లేఖలను నిర్మించారు. మసక చీకట్లో తిరుగుతున్న వారికి కరదీపికలు ఈ శారద లేఖలు. దిక్కు దోచని వారికి మార్గదర్శకాలు. వివేకం సన్నగిల్లిన వారికి వివేక చంద్రికలు.

"ఒక్కొక్క లేఖ ఒక్కొక్క మణిపూస.
ఓ లేఖలో మూఢ విశ్వాసాల్ని ఖండించారు.
మరో లేఖలో బాలవితంతవులు బాధల్ని హృదయ విదారకంగా చిత్రించారు.
ఒక లేఖ పరుషాధిక్యతను తెగనాడే కఠారి.
ఒకటి వరకట్నదురాచార సంహారి.
విదేశీ వస్తు బహిష్కరణని ఒక లేఖలో ప్రస్తావిస్తే,
రాట్నం పై నూలు వడకాలని మరో లేఖలో ప్రస్తావించారు"
అని పోలా ప్రగడ రాజ్యలక్ష్మి గారు శారద లేఖలను గురించి తెలియజేశారు.

"మూడు దశాబ్దాల ఆంధ్ర జీవితరేఖలు, ఈ లేఖలందు కనబడుతున్నవి. అంతేకాదు ఈలేఖలు ఆ రేఖల్ని తేజస్వంతం చేసినవి" అని శారద లేఖలను గురించి తల్లావఝ్ఝల శివశంకర స్వామి కీర్తించారు.

నారీలోక సంరక్ష, స్వాతంత్ర్య కాంక్ష రెండుకళ్ళుగా జీవించిన కనుపర్తి వరలక్ష్మమ్మ గారు 1934 మార్చి 11వ తేదీన

నెల్లూరులో జరిగిన సభలో గృహలక్ష్మి పత్రిక మొదటి స్వర్ణ కంకణాన్ని అందుకున్న తొలి రచయిత్రి. 1967వ సం॥ ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి ఉత్తమ రచయిత్రి బహుమతిని అందుకున్న ప్రథమాంధ్ర రచయిత్రి కూడా వరలక్ష్మమ్మ గారే. అరుదైన బిరుదాలు కనుపర్తి వరలక్ష్మమ్మ గారిని అక్కున జేర్చుకుని సమాదరించాయి. నిరాడంబర జీవితానికి నిలువెత్తు నిదర్శనంగా జీవించి స్త్రీల అభ్యున్నతికి బీటలు వారని బాటలు వేయాలని పాటుబడిన మహోన్నత సాహితీ శిఖరమైన కనుపర్తి వరలక్ష్మమ్మ అందించిన మహిళాభ్యుదయ స్వాతంత్ర్య దీపికలే – శారదలేఖలు.

**ఆధార గ్రంథాలు :-**


1. శారద లేఖలు – మొదటి సంపుటం
2. భారతీయ సాహిత్య నిర్మాతలు
   కనుపర్తి వరలక్ష్మమ్మ మోనోగ్రాఫ్
   రచన : పోలా ప్రగడ రాజ్యలక్ష్మి
   ప్రచురణ: సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ
3. 9వ తరగతి తెలుగువాచకం
   ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అమరావతి.

# భారత స్వాతంత్ర్యోద్యమం – రేడియో

**శ్రీమతి వెంకటలక్ష్మి చెరుకూరి**, ఎస్.ఏ తెలుగు, జడ్.పి.హెచ్.ఎస్, గౌరీపట్నం, చరవాణి : 9494158446

వందల సంవత్సరాలు మన దేశం పరాయిపాలనలో మగ్గుతున్నప్పుడు సాంస్కృతిక పునరుజ్జీవనం వల్ల ఆంగ్లవిద్యాభ్యాసం వల్ల జాతీయతను, సంస్కృతిని ఉత్తేజపరచిన మహనీయుల వల్ల భరతమాతను బానిస సంకెళ్ళ నుండి విముక్తి చేయాలన్న ఆలోచన వచ్చింది. జాతీయ భావన అందరిలోనూ పాదుకుంది. జాతీయత అంటే ఒక జాతి ఆత్మగౌరవానికి సంస్కృతికి సంబంధించిన ఉత్కృష్ట గుణం. ఒకే మనుగడ, ఒకే విశ్వాసం గల మానవ సమూహపు భావజాలమే జాతీయత. తాను పుట్టిననేల, సంస్కృతి, జాతుల పట్ల ఆదరభావం కలిగి ఉండడమే జాతీయత. జాతీయ భావాలు స్వాతంత్ర్యకాంక్షను పురుకొల్పాయి. భారతీయులందరూ స్వాతంత్ర్యం నా జన్మహక్కు అని నినదించారు. ఆంగ్లేయుల పరిపాలన అంతం అవ్వాలని స్వాతంత్రం సాధించాలని జాతీయోద్యమం ప్రారంభమైంది. మనభారతావని కోసం అసువులు బాసిన ఎంతోమంది త్యాగధనుల చరిత్ర ఇప్పటి యువతకు ఎంతో ఉద్వేగభరితంగా మారి ఎంతో ఉద్విగ్నంగా పరిణమిస్తుంది. స్వాతంత్రం కోసం చేసిన పోరాటంలో కేవలం పురుషులే కాకుండా మహిళలు చూపిన తెగింపు కూడా అసాధారణమైనదిగా చెప్పవచ్చు. స్వాతంత్ర్య పోరాటంలో స్త్రీలు కాదు శివంగులు అనిపించుకున్న మహిళలు ఎందరో ఉన్నారు. వారు చూపిన ధైర్య సాహసాలు అనన్య సామాన్యమైనవి. సాంప్రదాయాలకు, కట్టుబాట్లకు పెద్ద ఎత్తున ప్రాముఖ్యమత ఇచ్చే రోజుల్లో గుమ్మం దాటి కాలు బయట పెట్టడం నేరమన్న రోజుల్లోనే మహిళలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని భారతదేశ పౌరుషాన్ని చాటారు. తెగించి బ్రిటీషర్లతో పోరాడారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములు అయ్యారు. కాన స్వాతంత్ర్య పోరాట యోధులుగా మనం చెప్పుకుంటున్న వారి జాబితాలో మచ్చుకైనా వాళ్ళు కనిపించరు. బడుగు బలహీన వర్గాలకు చెందిన ఎందరో స్త్రీమూర్తులు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారు. వారు ఏనాడు వారు చేసిన పనులకు ప్రచారం కల్పించుకోవాలని, వారికి పేరు ప్రతిష్టలు, పదవులు కావాలని కోరుకోలేదు. స్వాతంత్రోద్యమంలో పాల్గొనడం వారి బాధ్యతగా భావించారు.

బొంబాయి (ఇప్పుడు ముంబై)లోని గవాలియా ర్యాంక్ గ్రౌండ్లో 1942 ఆగస్టు 8న ఓ పెద్ద సభ జరిగింది. ఆ రోజు గాంధీజీ చెప్పే మాటలను వినాలని వేలమంది తరలివచ్చారు. గాంధీ ఆ సభలో ప్రసంగిస్తూ ఈ రోజు నేను మీకు నినాదం ఇస్తున్న దీనిని హృదయంలో ఉంచుకోండి ఉన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో చేరాలని ప్రజలను అభ్యర్ధించారు. ఆ సభలో పాల్గొన్న వారిలో ఉషా మెహతా అనే ఓ యువ విద్యార్థిని కూడా ఉన్నారు. ఆమె గాంధీజీ ఇచ్చిన "డు ఆర్ డై" నినాదానికి తన హృదయంలో నిజంగానే స్థానం ఇచ్చారు. భారత స్వాతంత్ర పోరాటంలో తన వంతు పాత్రను పోషించారు.

**రహస్య రేడియో :** క్విట్ ఇండియా ఉద్యమం మొదలవడంతో గాంధీజీతో సహా కాంగ్రెస్లోని ప్రధాన నేతలను బ్రిటిష్ ప్రభుత్వం జైల్లో పెట్టింది. వారిని నిర్బంధించి ఉద్యమాన్ని అణచివేయాలని అనుకుంది. అప్పటికే నాయకులు ఉద్యమం చాపకింద నీరులా విస్తరించేందుకు చేయాల్సిన ఏర్పాట్లు చేశారు. ఆ ఏర్పాటులో భాగమే రహస్య రేడియో. దీనినే కాంగ్రెస్ రేడియో అని కూడా పిలిచేవారు. గుజారాత్లోని సూరత్ జిల్లా, సరస్ అనే గ్రామంలో 1920 మార్చి 25న ఉషా మెహత జన్మించింది. ఈమె తండ్రి బ్రిటిష్ పాలనలో జడ్జిగా పనిచేసేవారు. ఉషా చిన్నతనంలోనే స్వతంత్ర పోరాటంలో చేరారు. కానీ ఆమె తండ్రి బ్రిటిష్ ప్రభుత్వంలో జడ్జిగా ఉండటం వల్ల ఆమె నిర్ణయం పట్ల సంతోషంగా ఉండేవారు కాదు. కానీ ఉషా మాత్రం తన నిర్ణయానికి కట్టుబడి ఉన్నారు. నూలు వడకడం, బ్రిటిషర్లకు వ్యతిరేకంగా కరపత్రాలు పంచడం, సహాయ నిరాకరణ లాంటి కార్యక్రమాలు మొదలుపెట్టారు.

బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆమె గొంతెత్తి ఇచ్చిన మొదటి నినాదం "సైమన్ గో బ్యాక్". అప్పటికి ఆమె వయసు కేవలం ఎనిమిది సంవత్సరాలు. 1942 ఆగస్టులో బొంబాయిలో కాంగ్రెస్ కమిటీ సదస్సులో గాంధీ, నెహ్రూ, వల్లభాయ్ పటేల్ లాంటి నాయకుల ప్రసంగాలు విన్న తర్వాత రహస్య రేడియో ప్రారంభించాలన్న కృత నిశ్చయానికి వచ్చారు. విఠల్ దాస్ కక్కర్, చంద్రకాంత్ జువేరి, జగన్నాథ్ ఠాకూర్, నారిమన్ ప్రింటర్, మిర్జా రహస్య రేడియో కార్యకలాపాలలో భాగమయ్యారు. స్వతంత్ర ఉద్యమానికి సంబంధించిన వార్తలను ప్రసారం చేస్తూ, ప్రజలను సంఘటితం చేసేందుకు ఈ రహస్య రేడియో పని చేసేది. పత్రికల గొంతునొక్కి వార్తలపై నిషేధం విధించినప్పుడు దేశంలోని మారుమూల ప్రాంతాల్లోని వారికి కూడా సమాచారం చేరవేసేందుకు

రేడియో గొప్పసాధనంగా చెప్పవచ్చు. స్వాతంత్ర ఉద్యమ కార్యకలాపాలను నిర్వహించడానికి నిధులు లేమి అనే పెద్ద సమస్యను ఉషా బృందం కూడా ఎదుర్కొంది. వీరిలాగే కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓ బృందంను సంప్రదించారు. మనోహల్ లోహియాను కలవడంతో ఆయన రేడియో స్టేషన్ ఏర్పాట్లులో క్రియాశీలపాత్ర పోషించారు. ఆ విధంగా 1942 ఆగస్టు 14న వారి రేడియో ప్రసారాలు ప్రారంభమయ్యాయి.

**రేడియో ఎలా నడిచేది :** ఇది కాంగ్రెస్ రేడియో, భారత్‌లోనే ఒక చోట నుండి 42.34వీ ఫ్రీక్వెన్సీ పై ఇది ప్రసారమవుతుంది అని అర్థం వచ్చేలా ఆ రేడియో ప్రకటన ఉండేది. ముంబైలోని చౌపట్టి సమీపంలో ఓ భవనంలో ఇది నడిచేది. ఉషా బృందం రేడియోకు సాంకేతిక పరమైన సాయం చికాగో అండ్ టెలిఫోన్ నుండి లభించేది. వీరి రేడియోవి రహస్య కార్యకలాపాలు కావడంతో పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు తరచూ కొత్త చోట్లకి మార్చేవారు. మూడు నెలల కాలంలో 6,7 కొత్త చోట్లకి మార్చారు. ప్రారంభంలో రోజుకు రెండు సార్లు హిందీ, ఇంగ్లీష్‌లో ప్రసారాలు వచ్చేవి. తర్వాత ఒకే బులిటెన్‌కు పరిమితమయ్యాయి. రోజు రాత్రి 7:30 నుండి 8 వరకు ప్రసారాలు జరిగేవి. భారతదేశవ్యాప్తంగా ఉన్న ప్రత్యేక దూతల నుంచి, బొంబాయిలో ఉన్న ఏఐసిసి నుండి కూడా ముఖ్యమైన సమాచారం అందించేది. రహస్య రేడియో అప్పటి పరిస్థితులు కారణంగా దినపత్రికలు ఈ అంశాల గురించి రాసేవి కావు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి ప్రజలకు వాస్తవంగా జరుగుతున్నది ఏదో కాంగ్రెస్ రేడియో మాత్రమే చెప్పేది. ఈ రహస్య రేడియోలో ఎంతో మంది ప్రముఖులు కూడా ప్రసంగించేవారు. ఇప్పటి వరకు మనం ఉద్యమం చేసాం. ఇప్పుడు చేస్తుంది మాత్రం విప్లవం. విప్లవంలో గెలుపో, ఓటమో ఉంటుంది. ఇది ఒక పార్టీ విప్లవం కాదు, మొత్తం జాతి విప్లవం అని లోహియా ఈ రేడియో ద్వారా ప్రసంగించారు.

**చివరికి పోలీసులకు దొరికిపోయారు :** ప్రజలలో కాంగ్రెస్ రేడియోకి మంచి ఆదరణ లభించింది. నిధులు లేమి, ప్రభుత్వనిఘా ఉషా బృందానికి సమస్యలుగా ఉండేవి. ఆర్థిక ఇబ్బందులను ఏదో విధంగా అధిగమించినా పోలీసు వ్యానులు నిత్యం వీరిని వెంబడించేవి. కొన్నిసార్లు వెంట్రుక వాసిలో తప్పించుకునేవారు. చివరికి 1942 నవంబర్ 12న బ్రిటిష్ పోలీసులు వీరి రేడియో స్టేషన్‌ని గుర్తించగలిగారు. పోలీసులకు దొరికే రోజు కూడా వారి ప్రసారాలు యథాతథంగా జరిగాయి. చివరిలో వందేమాతరం గీతాన్ని ప్రసారం చేస్తుండగా పోలీసులు తలుపులు బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించారు. వందేమాతరం రికార్డు ప్రసారాన్ని ఆపాలని ఆర్డర్ వేశారు. దానికి ఉషా బృందం ఒప్పుకోలేదు. రేడియో ప్రసారం వింటున్న వాళ్ళందరికీ ఆ చప్పుళ్ళ ద్వారా వీరి అరెస్టు విషయం అర్థం అవుతూనే ఉంది. రెండు నెలల దర్యాప్తు తర్వాత ఉషా మెహతాతో పాటు 5 మంది నిందితులపై పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. ఆరు నెలల కోర్టు విచారణ సాగిన కాలంలో తీవ్రమైన మానసిక హింసను అనుభవించారు.

విదేశాల్లో చదువుకునే అవకాశం కల్పిస్తామంటూ జైలులో అధికారులు ఆశ చూపించిన, ఆమె దానికి ఉషా మెహతాకు 4 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష పడింది. 1942 నుండి 46 వరకు జైలు శిక్ష అనుభవించారు. 1946 ఏప్రిల్‌లో ఆమె ఎర్రవాడ జైలు నుంచి విడుదలయ్యారు. జైలు నుంచి వచ్చిన ఆమె తనకు సంతోషంగా, గర్వంగా ఉందని గాంధీ పిలుపును ఆచరించానన్న సంతృప్తి కలిగిందనిచెప్పారు. ఆ తర్వాత ఆమె పిహెచ్.డి చేశారు. బొంబాయి విశ్వవిద్యాలయంలోని విల్సన్ కాలేజీలో 30 సంవత్సరాలు ప్రొఫెసర్‌గా పని చేసారు. గాంధీ పీస్ ఫౌండేషన్కు అధ్యక్షురాలుగా ఉన్నారు. 1998లో భారత ప్రభుత్వం దేశంలోనే రెండో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మ విభూషణ్‌తో సత్కరించింది. ఉషా మెహతా తన 80వ సంవత్సరంలో 2000 ఆగస్టు 11న కన్నుమూశారు. **ముగింపు :** విపత్కర పరిస్థితుల్లో కూడా ఇటువంటి ధైర్య సాహసాలను ప్రదర్శించిన యువతులు నేటితరం స్త్రీలందరికి ఆదర్శంకాగలరు. ఇటువంటి స్త్రీల పోరాటాల ఫలితమే నేటి మన స్వేచ్ఛ, స్వాతంత్రాలకు ఆలవాలం.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్యంలో ఉద్యమాలు – డా॥ద్వా.నా.శాస్త్రి.
2. భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర – తుమ్మల వెంకటరామయ్య
3. పార్థ్ పాండ్యా, రవిపర్మాన్. – బి.బి.సి ప్రతినిధులు 15 ఆగస్టు 2020

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు – జాతీయోద్యమ స్పృహ

తంగి ఓగేశ్వరరావు, తెలుగు అధ్యాపకులు, వి.వి.గిరి ప్రభుత్వ కళాశాల, దుంపగడప Ph: 9959753832

“రాగమే గాని ద్వేషంలేని శుద్ధగాంధేయ పథంలో నడిచింది. సామాన్య జీవితం గడిపింది. గర్వించలేదు. అహంకరించలేదు. ప్రచార మాశించలేదు. ధన సంపాదన తలపెట్టనే లేదు. తాను స్వయంకృషితో సాధించిన విద్యాగంధ పరిమళాలను అనేకులయిన అభాగినులకు పంచింది. ఇరవయ్యో శతాబ్ది కవిపండిత ప్రపంచంలో శతజయంతి గౌరవం సంపాదించిన ఏకైక ఆంధ్రమహిళ ఆమె” అని బూదరాజు రాధాకృష్ణ, కనుపర్తి వరలక్ష్మమ్మని ఆదర్శమహిళగా ప్రస్తుతించారు.

కనుపర్తి వరలక్ష్మమ్మగారు పాలపర్తి హనుమాయమ్మ, శేషయ్య దంపతులకు బాపట్లలో 06-10-1896న జన్మించారు. కందుకూరి వీరేశలింగం ప్రభావం వల్ల ఈమెకు చదువుపట్ల ఆసక్తి కలిగింది. కావ్యాలూ, గ్రంథాలూ చదివారు. సంస్కృతం, హిందీ భాషలని అభ్యసించారు. మహిళా సంఘాలలో, గుంటూరు జిల్లా బోర్డులో సభ్యులుగా ఆంధ్రరాష్ట్రోద్యమంలో పాల్గొని మహిళా చైతన్యానికి కృషి చేశారు. ఆమె భర్త కనుపర్తి హనుమంతరావు ప్రతి కార్యక్రమంలోనూ ఆమెకు చేదోడువాదోడుగా ఉండి, ప్రోత్సహించారు.

కనుపర్తి వరలక్ష్మమ్మ అనగానే ‘శరదలేఖలు’ చెప్పి తీరాలి. తెలుగులో లేఖా సాహిత్యానికి ప్రాచుర్యం తెచ్చింది ఈవిడే. వివిధ సామాజిక అంశాలను, స్త్రీల సమస్యలను వివరిస్తూ ‘కల్పలత’ అనే ఆమెకు ‘శారద’ రాసిన లేఖలివి. ‘శారద’ కల్పితపాత్ర. అప్పట్లో (1928-34) ఈ శారదలేఖలు సంచలనం కలిగించి వరలక్ష్మమ్మ ‘గృహలక్ష్మి’ పత్రికలో ప్రచురించబడ్డాయి. ‘గృహలక్ష్మి సువర్ణకంకణం’ పొందిన మొట్టమొదటి మహిళ వరలక్ష్మమ్మ. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ రచయిత్రిగా సత్కరిస్తే, గుడివాడ పౌరులు ‘కవితాప్రవీణ’ తో వరలక్ష్మమ్మను గౌరవించారు. ఈమె పద్యాలు, కథానికలు, గేయాలు, వ్యాసాలు వివిధ పత్రికలలో ప్రచురించబడ్డాయి. ‘మావూరు’, ‘పెన్షన్ పుచ్చుకున్న రాత్రి’, ‘కథ ఎట్లావుండాలి’ వంటి కథానికలు మణిపూసలుగా బూదరాజు రాధాకృష్ణగారు పేర్కొన్నారు. గాంధీమీద దండకం రాశారు. స్త్రీల సమస్యను ప్రధానంగా తీసుకొని ఆమె ‘వసుమతి’, ‘విశ్వామిత్ర’ అనే రెండు నవలలను వ్రాశారు.

కనుపర్తి వరలక్ష్మమ్మగారి కథలను పరిశీలిస్తే వాటిలో సంఘసంస్కరణాభిలాష, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొవాలనే ఉద్బోధ, స్త్రీ చైతన్యం స్పష్టంగా కనిపిస్తాయి. చైతన్య వంతమైన సమాజాన్ని ఆమె ఆకాంక్షించారు. అటువంటి సమాజంలోనే స్త్రీలు వికసిస్తారని ఆమె భావించారు. వరలక్ష్మమ్మగారు భారత స్వాతంత్ర్యోద్యమంలోని దాదాపు అన్ని స్థాయిలను చూశారు. గాంధీ యుగంలో జీవించారు. మహాత్ముని అడుగు జాడలలో నడిచారు. అతని తత్వాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకున్నారు. వీరి ‘ప్రేమ ప్రభావము’, ‘ఐదుమాసముల యిరువది దినములు’ కథలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

**ప్రేమ ప్రభావము :** గాంధీజీ విజయవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సమావేశానికి కలకత్తా నుండి వస్తూ తెలుగుదేశంలోని అనేక పట్టణాలలో ప్రసంగించారు. అందులో భాగంగానే మద్రాస్‌లో గాంధీజీ ఉపన్యసించారు. విదేశీ వస్త్రాలను బహిష్కరించమని పిలుపునిచ్చారు. స్వరాజ్య స్థాపనకు దౌర్జన్య రహిత సహాయ నిరాకరణమే శరణ్యమని అభిప్రాయపడ్డారు. ఆ స్ఫూర్తితోనే కనుపర్తి వరలక్ష్మమ్మగారు ‘ప్రేమ ప్రభావము’ అనే కథను 1927లో వ్రాశారు.

లక్ష్మీదేవి, వేంకయ్యనాయుడు దంపతుల కొడుకు రామస్వామి చదువురీత్యా మద్రాస్‌లో ఉంటాడు. గాంధీజీ సహాయనిరాకరణోద్యమంలో భాగంగా మద్రాస్‌కు వచ్చి ఉపన్యసించినప్పుడు రామస్వామి ఆ ఉపన్యాస ప్రభావంతో సహాయనిరాకరణోద్యమంలో చేరాలని నిశ్చయించుకుంటాడు. ఆ సంకల్పంతో చదువుకు స్వస్థిపలికి నిర్ణయించుకున్న ప్రకారం స్వగ్రామం చేరతాడు. తండ్రి వేంకయ్యనాయుడు కొడుకు ఉద్యోగం చేయాలని, పెద్దమొత్తం వరకట్నం తీసుకొని అతనికి పెళ్ళి చేయాలని అనుకుంటాడు. కాని తండ్రి అభిప్రాయాన్ని రామస్వామి తిరస్కరిస్తాడు.కోపించిన తండ్రి కొడుకును ఇంట్లో ఉండొద్దంటాడు.

తల్లి లక్ష్మీదేవి రామస్వామి అభిప్రాయాన్ని అంగీకరించి ప్రోత్సహిస్తూ 'ఇల్లు, ఒళ్ళు గుల్లయ్యే చదువెందుకు? పూర్వులు వ్యవసాయం చేసుకొని పాడిపంటలతో సుఖించలేదా? సొంతంగా రాట్నం మీద నూలు వడుక్కొని నేయించుకొంటె గుడ్డలు మన్నుతాయి. డబ్బు వస్తుంది. మా నాయనమ్మ వడికిన నూలుతో కోకలు నేయించుకుంటే మూడేళ్ళు కట్టేవాళ్ళము. సన్న చీరలు అని గొప్పే కాని మూడు నెళ్ళైనా ఉండవు. నేను కాపురానికి వచ్చేటప్పుడు మా నాయనమ్మ కట్టెడు నూలు వడికి దుప్పటి నేయించి ఇచ్చింది. పాతికేండ్లయింది, ఇప్పటికి మాయలేదు' అని ఖద్దరు గొప్పతనాన్ని తెలియపరుస్తుంది.

అయినప్పటికి భర్త నిరాకరిస్తాడు. గాంధీజీ మద్రాస్ సభలో చెప్పిన అసహాయోద్యమానికి మూల సూత్రాలైన సత్యం, త్యాగం, అహింస, ఐక్యమత్యం అను నాలుగు సూత్రాలను గూర్చిన గాంధీ ఆలోచనలు రామస్వామి హృదయంలో గాఢంగా నాటుకొని పోయాయి. దేశహితైక చింతతో మనస్సాక్షి ప్రేరితుడై అతడు అసహాయోద్యమాన్ని చేపట్టినందుకు తండ్రి కోపిస్తున్నాడు, తల్లి దుఃఖిస్తుంది. జననీ జన్మభూములు రెండు అతనికి సమాన గౌరవపాత్రలుగానే ఉన్నవి. కాని తల్లిని సమ్మత పరిచి జన్మభూమిని సేవింప నిశ్చయుడై తల్లి సన్నిధికి వెళ్తాడు. ఉద్యమతత్వం ఆమెకు బోధపరుస్తాడు. చివరికి తల్లి సమ్మతిస్తుంది. ఇల్లు వదిలి అసహాయోద్యమ ప్రచారకుడై రామస్వామి ఆంధ్రదేశమంతా పర్యటిస్తాడు. అతని ఉద్యమ నిబద్ధత కఠినుడైన తండ్రిని కరిగిస్తూ వస్తుంది. రామస్వామి జాతీయగీతాలు పాడుతూ స్వదేశీ వస్త్రాలు విక్రయిస్తుండగా పట్టుకొని కఠినశిక్ష వేసి జైలుకు పంపిన విషయం తెలిసాక వేంకయ్యనాయుడు తన విలువైన వస్త్రాలను తీసి ఆవలపారవేసి, అధికారం వదిలి తన రావుసాహెబ్ బిరుదు వద్దని తిరస్కరించి ఖద్దరు వస్త్రధారియై, ఖద్దరు వస్త్రాలను విక్రయింప వెళ్తాడు.

సంవత్సరం తర్వాత రామస్వామి విడుదల రోజు పుష్ప వర్షం కురిసి జయధ్వానాలు మారుమ్రోగుతాయి. రామస్వామి తండ్రిని అపరిచిత వ్యక్తిగా తలచి, అతని దగ్గరకొచ్చి ప్రేమ పూర్వకంగా కౌగిలించుకుంటాడు. తాను కౌగిలించుకున్న వ్యక్తి తన తండ్రని గుర్తించి తండ్రి చరణాలపై ఆనంద బాష్పాలను వదిలి ఆనందిస్తాడు. రామస్వామి దేశం మీద ప్రేమతో కంకణ బద్ధుడు కావడమే కాకుండా తన తండ్రిలో కూడా దేశంపట్ల ప్రేమాంకురాన్ని మొలిపిస్తాడు. ఈ కథ వరలక్ష్మమ్మగారి జాతీయోద్యమ చైతన్యాన్ని సూచిస్తుంది. గాంధీజీ నిర్వహించిన చారిత్రక పాత్రను రచయిత్రి ఈ కథలో నమోదు చేయటం విశేషంగా చెప్పవచ్చు.

**ఐదు మాసముల యిరువది దినములు :** కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన మరో కథ 'ఐదు మాసముల యిరువది దినములు'. మహాత్మాగాంధీ పిలుపునందుకొని విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమంలో చేరుతాడు గోపాలరావు. అతని భార్య రుక్మిణి. ఏడోనెల పురిటికి పుట్టింటికి వెళ్ళిన భార్యను పిల్లవాడు పుట్టిన ఐదు నెలల వరకు కూడా చూడలేనంత తలమునకలుగా అతను సత్యాగ్రహోద్యమంలో పని చేస్తుంటాడు. పిల్లవాడితో పుట్టింటి నుండి తన కోసం వచ్చిన భార్య విదేశీ వస్త్రాలు ధరించి ఉండటం వల్ల గోపాలరావు ఆమెను పలకరించనైనా పలకరించడు. ఆ రాత్రికి రాత్రే గోపాలరావును బ్రిటిష్ ప్రభుత్వం అరెస్ట్ చేస్తుంది. విదేశీ వస్త్ర వ్యతిరేక బోధ చేస్తున్నందుకు ఆరు నెలల కారాగార శిక్ష విధిస్తుంది. ఈ సంఘటన చీరలు, నగలు మాత్రమే జీవితమనుకునే మామూలు స్త్రీల ప్రపంచం నుండి రుక్మిణిని బయటకి తీసుకువచ్చి దేశ స్థితిగతుల గురించి ఆలోచించేటట్లు చేస్తుంది.

స్వదేశీ వస్త్రాలనే ధరించమని తన భర్త ప్రబోధించడమే నేరమైనందుకు ఆశ్చర్యపోతుంది. ఆలోచించే కొద్దీ విదేశీ వస్త్రాలలోని పరాధీనత, అవి ధరించిన తన పట్ల భర్త ప్రదర్శించిన ఉదాసీన వైఖరి అన్నీ అర్థమవుతాయి రుక్మిణికి. భర్త ఆశయాన్ని అర్థం చేసుకున్న రుక్మిణి స్వదేశీ ఉద్యమానికి మద్దతుగా ఖద్దరు కట్టి, నూలు వడుకుతుంది. సావిత్రిగౌరి నోము నోచుకోవాలని తలపెట్టి ఆ నోము నోచేందుకు తన ఇంటికి వచ్చే యువతులు ఖద్దరు వస్త్రాలనే ధరించాలని షరతు పెడుతుంది. స్వదేశీ ఉద్యమం పట్ల ఆమె సంసిద్ధురాలు కావడమే కాకుండా చుట్టూ ఉన్న స్త్రీలను సమీకరించి కార్యోన్ముఖులను చేస్తుంది. భర్త జైలు నుండి వచ్చేసరికి అతని ఆదర్శాలకు, అభిరుచులకు అనుగుణమైన ప్రవర్తనతో తయారవుతుంది. రుక్మిణి భర్త జైలుకెళ్ళిన రోజు నుండి తిరిగి వచ్చే రోజు వరకు ఐదుమాసముల ఇరువది దినములు. ఈ కాలంలో స్వదేశీ ఉద్యమాన్ని ఆశయంగా చేసుకొని తాను నూలు వడకడానికి, భర్తకు అవసరమైన దుస్తులను తాను తీసిన నూలుతో నేయించి పెట్టడానికి ఖద్దరు వస్త్రాలు ధరించిన స్త్రీలతో కలిసి స్త్రీలు చేయదగినవిగా సమాజం నిర్దేశించిన నోములు, వ్రతాలు చేయటానికి ఆమె తనను తాను మార్చుకొంది.

స్త్రీలు భర్తల ఉన్నతాశయానికి భంగం కలిగించని రీతిలో స్త్రీలు విద్యావంతలు కావాలని పై కథ ఆచరణాత్మకంగా వివరిస్తుంది. జాతీయోద్యమ ఆశయాలతో కార్యశీలురైన పురుషులకు దీటుగా సహాయకారులుగా వారి సహచరులు కూడా సుశిక్షుతులైనప్పుడే ఉద్యమం బలోపేతం కావడానికి వీలవుతుంది. కనుపర్తి వరలక్ష్మమ్మ ఈ కథ వ్రాసి స్త్రీలకు ఆదర్శంగా చూపదగింది భర్తల ఉన్నతాశయాల తత్త్వమెరిగి నడుచుకోనటమేనని నిరూపించింది.

పై రెండు కథలలోనూ వరలక్ష్మమ్మగారు మహాత్ముడు బోధించిన సత్యం, అహింస, త్యాగం, సహనం, స్వదేశీ వస్తువుల ప్రోత్సహించడం, విదేశీ వస్తువులను త్యజించడం, ఖాదీ వస్త్రాల పునరుద్ధరణ ఇత్యాది లక్షణాలు ప్రధానంగా కనిపిస్తాయి. ఈమె ఆదర్శ దాంపత్య జీవనాన్ని తన కథల్లోని పాత్రల ద్వారా పాఠకుల ముందుంచారు. ఆంగ్లేయుల దౌర్జన్యాలు, జాతీయోద్యమకారుల త్యాగాలు, వారు ఎదుర్కొన్న కష్టనష్టాలను వరలక్ష్మమ్మగారు ఈ కథలలో చిత్రించినతీరు నేటి పాఠకుల హృదయ లోతులను తాకి కంటతడి పెట్టిస్తాయి.

**కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు – జాతీయోద్యమ స్పృహ :** 'ప్రేమ ప్రభావము' కథలో రామస్వామి పాత్రను రచయిత్రి మలచిన తీరు ఆసక్తి కలిగిస్తుంది. 1920వ దశకంలో ఆంధ్రదేశంలో మహాత్ముని బోధనలతో ప్రాభావితులైన అనేక మంది యువకులు తమ చదువులకు స్వస్థిపలికి జాతీయోద్యమంలో పాల్గొన్నారు. వారికి ప్రతినిధే ఈ కథలో రామస్వామి. శ్రీమంతుల కడుపున పుట్టి, న్యాయవాద వృత్తుని అభ్యసిస్తున్న రామస్వామి గాంధీజీ బోధనలతో తన చదువును, కుటుంబాన్ని వదిలి జాతీయోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్తాడు. తన చదువు, తన జీవితం గురించి మాత్రమే ఆలోచించే రామస్వామిలో గాంధీజీ ఉపన్యాసం విన్న తర్వాత వచ్చిన పరివర్తన రచయిత్రి అద్భుతంగా చిత్రించారు. రామస్వామి త్యాగనీరతి, దేశభక్తి ఆంగ్లేయుల ప్రాపకం కోసం, వారిచ్చే పదవులకు ఆశపడి జాతీయోద్యమానికి దూరంగా ఉన్న రామస్వామి తండ్రి వేంకయ్యనాయుడిని సైతం జాతీయోద్యమంలో పాల్గొనేలా చేసింది.

ఇక వేంకయ్యనాయుడుని తీసుకుంటే అతను ఆంగ్లేయులకు వీర విధేయుడు. ఆంగ్లేయులు ఇచ్చే పదవులు, అధికారం, ధనం కోసం వెంపర్లాడే వ్యక్తి. న్యాయవాద విద్యను మధ్యలో ఆపివేసి వచ్చిన కుమారుడిని నిందిస్తాడు. తాను చూపించిన ఉద్యోగం చేయమని ఒత్తిడి తేస్తాడు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జాతీయోద్యమంలో పాల్గొవద్దని హెచ్చరిస్తాడు. అయినా తన మాట వినకపోవడంతో కూమారుడిని ఇంటి నుండి బయటకు పంపించి వేస్తాడు. అంతటి కఠిన హృదయుడైన వేంకయ్యనాయుడు కుమారుడు జాతీయోద్యమంలో పడుతున్న కష్టాలను, సంకల్పాన్ని చూసి క్రమంగా మారిన తీరును వరలక్ష్మమ్మగారు చక్కగా చిత్రించారు. ఎప్పుడు సీమ దుస్తులు, వస్తువులు తప్ప దేశీయ దుస్తులు, వస్తువులు ధరించని వేంకయ్యనాయుడు "తన విలువ వస్త్రములనెల్లదీసి యావలపారవైచి, తన యధికారములనెల్ల నొక్కమారుజ్జగించి, తన రావుసాహెబు బిరుదమువలదని తిరస్కరించి, ఖద్దరువస్త్రధారియై ఖద్దరు వస్త్రముల విక్రయింపగడగినాడు. కఠినపు జొన్నరొట్టె తిండి, కర్కశపు నేలను నిదుర. ఖద్దరు వస్త్రముల విక్రయము. దినమున కొకయూరు. పూటకొక యూరు. తిండితినినయూర నిదురలేదు. నిదురించిన యూర తిండిలేదు. ఒకటే ఖద్దరు ప్రచారము" ఇలా వేంకయ్యనాయుడిలో వచ్చిన పరివర్తనను వరలక్ష్మమ్మగారు చెప్పిన తీరు ఆనాటి జాతీయోద్యమంలో పాల్గొన్న యోధుల జీవితాలను అద్దంపట్టే విధంగా ఉన్నాయి.

ఇక వేంకయ్యనాయుడి భార్య లక్ష్మీదేవి తండ్రి కొడుకుల మధ్య పంతానికి నలిగిపోయే పాత్ర. నాటి స్వాతంత్ర్యోద్యమంలో భిన్న ఆలోచనలు కలిగిన వ్యక్తులు ఒకే ఇంట్లో ఉన్నప్పుడు ఆ ఇంట్లోని స్త్రీలు పడే సంఘర్షణకు ప్రతిరూపమే ఈ కథలో లక్ష్మీదేవి. కొడుకు రామస్వామి చదువు మధ్యలో వదిలివేసి జాతీయోద్యమంలో పాల్గొంటానన్నప్పుడు వేంకయ్యనాయుడు కుమారుడిని నిందిస్తాడు. అప్పుడు లక్ష్మీదేవి 'చదువు ఒక్కటే జీవితం కాదు. చదువులు లేకుండా మన పూర్వీకులు చక్కగా జీవించారు. మన దుస్తులు మనమే తయారు చేసుకునేవాళ్ళం. వాటి నాణ్యత ఇప్పటి సీమ దుస్తులు కన్నా ఎక్కువగా ఉండేది. ఈ సీమ దుస్తుల వల్ల ఇల్లు, ఒల్లు రెండూ గుండవుతున్నాయి' అని చెబుతూ "కొండారెడ్డి గజం స్థలం ఆక్రమించాడని మూడుకోర్టులు తిరిగారు. మూడు వేలు ఖర్చుచేశారు. చివఅకు అతనిపక్షమయింది. ఇంత బేజారు లేకుండా మనవూళ్ళోనే మధ్యవర్తులద్వారా పరిష్కారం చేసుకున్నట్లయితే

కొంతయినా న్యాయంజరిగేది.లేక వదిలిపెట్టినా యింతనష్టం లేక పొయ్యేది. మూడువేలు పెట్టితే ఎన్ని వేలగజాలైన వచ్చేవి. ఇటువంటి నష్టాలు లేకుండా వుందామనేకా, మన రామస్వామి చెప్పేది! అందుకోసం వాడిని కొంపలోంచి వెళ్లకొట్టుతారా? పోగాపోగా ఉప్పుగల్లాలె వాడొక్కడు కనబడుతున్నాడు. వాడినిగూడా విడనాడుకోని మనం బావుకునేదేమున్నది?"అని భర్తకు నచ్చజేప్పటానికి ప్రయత్నిస్తుంది.

ఆమె భర్తతో చెప్పిన మాటలను పరిశీలిస్తే ఆనాటి వ్యవస్థపై ఆమెకు కొంత అవగాహన ఉన్నట్లు తెలుస్తుంది. ఆమె మాటలను లక్ష్యపెట్టక వేంకయ్యానాయుడు కొడుకును ఇంట్లో నుంచి పంపించి వేస్తాడు. కుమారుడు ఉద్యమంలో పడుతున్న కష్టాలను తలచుకొని లక్ష్మీదేవి దుఃఖిస్తుంది. చివరికి కుమారుడు జైలుకు వెళ్ళాడనే వర్త తెలిసి శోకసముద్రంలో మునిగిపోతుంది. ఈవిధంగా వరలక్ష్మమ్మగారు ఉద్యమంలో పాల్గొని, జైలుకువెళ్ళిన వ్యక్తులను తలచుకొని వారి ఆత్మీయులు ముఖ్యంగా స్త్రీలు పడ్డ ఆవేదనను లక్ష్మీదేవి పాత్ర ద్వారా పాఠకుల ముందుంచారు.

ఆంగ్లేయులు భారతదేశాన్ని ఆక్రమించుకోవడానికి వారు ప్రధానంగా అనుసరించిన మార్గం 'విభజించు పాలించు'. భారతీయులను మతపరంగా, కులపరంగా, ఆస్తి అంతస్తుల పరంగా విభజించి, భారతదేశాన్ని సుదీర్ఘకాలం పాలించారు. 'ప్రేమ ప్రభావము' కథలో వరలక్ష్మమ్మగారు ఆంగ్లేయులు కులపరంగా భారతీయులనులను ఏవిధంగా లోబర్చుకున్నారో వేంకయ్యానాయుని పాత్ర ద్వారా వాస్తవికంగా వివరించారు. బ్రాహ్మణులు అప్పటికే అధిక సంఖ్యలో విద్యావంతులై జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొవడంతో ఆంగ్లేయులు శుద్రులను, దళితులను తమవైపు తిప్పుకోవడినికి ప్రయత్నించారు. హిందూ సమాజంలోని అస్ప ృశ్యతను ఆశ్రగా చేసుకొని దళితులను క్రైస్తవ మతంలోకి మరే విధంగా ప్రోత్సహించి వారిని లోబర్చుకోగా, శుద్రులకు పదవులు, ఉద్యోగాల ఎర వేసినట్లు వేంకయ్యానాయుని పాత్ర ద్వారా తెలుస్తుంది.

వేంకయ్యానాయుడు "ఈదినాల్లో మన శూద్రులకు గవర్నమెంటులో పలుకుబడి యెక్కువగా వున్నది. తెలివిగలవాడని అధికారులకు దోచెనా, మూడురోజులలో పైకి తీసుకవస్తారు. మూడేండ్లలో తాసిల్దారవుతాడు" అని భార్య అక్ష్మీదేవితో అంటాడు. మరొకసారి కొడుకు చదువు వదిలేసి వచ్చాడని కొడుకును తిడుతున్న భర్తలో లక్ష్మీదేవి "ప్లీడరు సుబ్బారావుగారి అబ్బాయి చదువు చాలించుకొనివస్తే వారు యింట్లో పెట్టుకోని వూరుకోలేదా? ఇట్లాగె వెళ్లగొట్టుకున్నారా?" అని అన్నప్పుడు వేంకయ్యానాయుడు "వాళ్లమాటే చెప్పు. చాలించుకోక చదువుకుంటే మాత్రము బాపనయ్యలకు ఉద్యోగమిచ్చే దెవరు? అటువంటివాళ్లు చదివితేనేమి, మానితేనేమి; వాళ్లకేమి నష్టము? చదువులకోసం మడిమాన్యాలమ్ముకొని బ్రాహ్మణు లిదివఱకే సన్న్యాసులైనారు. వాళ్ల వుద్యోగ దాహం చూచి గవర్నమెంటువారు శూద్రాదుల కన్యాయం జరుగుతున్నదని ఉద్యోగాలు యియ్యక బిగించేటప్పటికి ఇబ్బడిసన్న్యాసులైనారు. ఇప్పుడు గాంధి ఉద్యమంలోజేరి ముమ్మడిసన్న్యాసులైనారు. వాళ్లు దీనిలో చేరినా చేరకపోయినా సన్న్యాసమే కాబట్టి వాళ్లకు గలిగే నష్టంలేదు. అనంతలాభాలు పొందటానికి వీలున్నవాళ్లము మన మెట్లా ఊరుకుంటాము? నీకేమైన మంచి చెడుగు తెలిస్తేనా! పో! కొడుకుతో చెప్పు, పో!" అని అన్న మాటలు ఈ విషయాన్ని స్పష్టంజేస్తున్నాయి.

కనుపర్తి వరలక్ష్మమ్మగారు ఈ 'ప్రేమ ప్రభావము' కథలో తండ్రి కొడుకుల మధ్య అంతర్లీనంగా ఉండే ప్రేమాభిమానాలను అద్భుతంగా అక్షరీకరించారు. "అనుగ్రహ మనునది మీనాయనకు లేదు. వదిలి పెట్టెనా మరల పిలుపు తలపు లుండవు. ఆయన మత మట్టిది. నా కొడుకని ప్రేమపడు మనిషి గాడు" అని లక్ష్మీదేవి కొడుకుతో అన్నప్పుడు "అమ్మా!నాన్న కోపదారియైనంత మాత్రమున ప్రేమ శూన్యుడని తలంచుట పొరబాటు. ఆయన వాత్సల్యవంతుడు గానిచో నేనింతవాడ నెట్లైతిని. ఆయన నాపై కోపించుటలోగూడ న్యాయమేకలదు. నేనెద్దియో గొప్పయుద్యోగము చేసి ఘనుడనగుదునని యాయన గంపెడాశతో నుండనేనాకస్మికముగ జదువు మానివైచి యాశాభంగము గలిగించితిని. ఆది ఆయనకు కోపకారణము గాకుండా నెట్లుండును? అట్లు వచ్చిననుగూడ మరల నా కుద్యోగమిప్పింప బ్రయత్నించుటగూడ ఆయనకు నాపైగల వాత్సల్యమువలననే. ఉద్యోగములపై నాకుగలయుదాసీనత వలన ఆయన పనులెల్ల స్వార్థచింతగా నాకు దోచుచున్నను, ఆయన కృషిలోమాత్ర మకలంకమగు పుత్ర ప్రేమ స్పష్టమగుచునే యున్నది" అని రామస్వామి తల్లికి ఇచ్చిన సమాధానం తండ్రిపై రామస్వామికి ఉన్న ప్రేమ, నమ్మకం

అర్థమవుతుంది. అదేవిధంగా రామస్వామిని ఖద్దరు ప్రచారోద్యమంలో పాల్గొన్నందుకు ఆంగ్లేయులు జైలులో పెట్టేరన్న వార్త రామస్వామికి తెలినప్పుడు అతని మానసిక సంవేదనను పరిశీలిస్తే కొడుకుపై వేంకయ్యనాదుడికి గల అవ్యాజ్యమైన ప్రేమను అర్ధం చేసుకోవచ్చు. "హే రామచంద్రమూర్తీ! నేను మ్రొక్కుచున్నాను. వింటివా! నా కొమారుడు జైలునందున్న యొక్కసంవత్సరము నా బిడ్డ తిండియే నా తిండి. నా కొడుకు పవళించు కర్కశ శయ్యయే నాశయ్య. నా కొడుకు చేయు పనియే నా పని. నీవు ఆనగా నిట్లు వ్రతము సలుపుదును. నా కొమారుని నాకు ప్రసాదింపుము. నీ సన్నిధికేతెంచి నీ పాదములదర్శించి నీకమూల్య కానుకలర్పింతును" అని వేంకయ్యనాయుడు అన్న మాటలు పాఠకుల హృదయ లోతులను తాకుతాయి. రామస్వామి ఇంట్లో నుండి వెళ్ళిపోయే యుందు "ప్రేమను ప్రేమచేతనె బడయు వచ్చునని నా విశ్వాసము" అని చెప్పి ఇల్లు విడిచిపెడతాడు. చివరికి తన దేశభక్తి, త్యాగం, కార్యనిష్ఠతో తండ్రిలో పరివర్తన తీసుకువచ్చి తన మాటను నిజం చేస్తాడు. రచయిత్రి ఈ కథకు పెట్టిన 'ప్రేమ ప్రభావము' పేరు సార్థకం చేస్తాడు.

ఇక 'ఐదుమాసములు యిరువది దినములు' కథలో గోపాలరావు పాత్రను తీసుకుంటే అతనిది సంపన్నుల కుటుంబం. అనుకూలవతైన భార్య, చక్కని కుమారుడు. అయినా అవన్నీ విడిచిపెట్టి జాతీయోద్యమంలో పాల్గొంటాడు. విదేశీవస్త్ర బహిష్కరణోద్యమంలో చురుకుగా పాల్గొని, జైలు శిక్ష అనుభవిస్తాడు. అతను జాతీయోద్యమంలో ఎంతగా లీనమవుతాడంటే ఏడు మాసములప్పుడు పురుటికి వెళ్ళిన భార్య ఐదు నెలల కుమారుడితో ఇంటికి వచ్చేవరకు ఆమె ధ్యాసే అతనికి ఉండదు. ఇంటికి వచ్చిన భార్య, కుమారుడు విదేశీ వస్త్రాలను ధరించి ఉండటం చూసి వాళ్ళను కనీసం పలకరించని ఉద్యమనిష్ఠ గోపాలరావుది. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని కుటుంబాన్ని త్యాగం చేసి, జైలుకు వెళ్ళి శరీర, మానసిక క్షోభను అనుభవించిన అనేక మంది ఉద్యమకారులకు ప్రతినిధి గోపాలరావు.

'ఐదుమాసములు యిరువది దినములు' కథలో మరో ప్రధాన పాత్ర రుక్మిణి. "రుక్మిణి సిరిగలయింటబుట్టినది. ఆమె తండ్రి గొప్ప ఉన్నతోద్యోగి. కాన స్వార్థప్రేరితమైన రాజభక్తి వారి చిత్తములకు పెట్టనికోట. బహిర్ప్రపంచములోని వ్యవహారములు వారి చెవికిచేరవు. పేదసాదల కష్టనిష్ఠురములు, విదేశవస్త్రముల వలని యనర్థకములు, పరాధీన భారతదేశపు అగచాట్లు వారెప్పుడును వినినసంగతులుగావు. ఇంటిలోని ఆడవారు నల్గురు ఒకచో కూర్చుండినచో వారి ప్రసంగ విషయములు చీరలు, నగలు, కాకపోతే పిండివంటలు, వేపుడు కూరలు, కాఫీలు, టీలు. ఇట్టిభోగప్రపంచములో పుట్టిపెరిగినదగుటచేత రుక్మిణి జ్ఞానము గూడ వీనికి మించలేదు. సత్యాగ్రహోద్యమముచే దేశమట్టుడికినట్లుడికి పోవుచున్నను వానిని గుఱించి ఆమె కొంచెముగూడ విచారించియుండలేదు." అటువంటి రుక్మిణి దేశీయ వస్త్రాలను ధరించి, ఇతరులను ధరించమని చెప్పినందుకు దొంగలను, హంతకుల మాదిరిగా తన భర్తను జైల్లో పెట్టారని తెలిసి ఆశ్చర్యపోతుంది.

"ఏమి! మనదేశపుగుడ్డ మనము కట్టుకొనుటగూడ తప్పేనా? నేడిదైనది. ఱేపు మీకుగావలసిన ఆహారపదార్థములను మేమే వచనముచేసి పంపెదముగాని మీరు తయారు చేసికొనరాదనినచో మన ప్రొయ్యిలు తవ్వివేసికొనవలసినదేనా?ఎంత అధమపుబ్రతుకు. నా పెనిమిటి నాతో మాట్లాడలేదని యెంతో వేదన పడితిని. కాని కారణము తెలిసికొనలేక పోతిని. నేను, పిల్లవాడు ధరించియున్న విదేశవస్త్రములే వారికి అసహ్యకారణమై యుండవలయును. విదేశవస్త్రములలో నైసూ, నాజూకూ ఉన్నదనుకొనుచుంటిమిగాని వానిలో ఇంత పరాధీనత యున్నదని గమనించలేదు. ఛీ! నా పతికి అప్రియములగుటయేగాక శిక్షాహేతువులైన ఈ విదేశవస్త్రములు నాకేల?" అని ఆమె తక్షణం తన చీనిచీనంబరాలను విడిచిపెట్టి ఖద్దరు వస్త్రాలనుధరిస్తుంది. ప్రతిదినము ఇంట్లో నూలు వడుకుతుంది. అలా వడికిన నూలతో తన భర్తకు దుస్తులను తయారు చేస్తుంది. చివరకి తాను నోచుకుంటున్న నోముకు రావాలనుకునే వాళ్ళు దేశీయ వస్త్రాలను ధరించి మాత్రమే రావాలని షరతు పెట్టి, అలా వచ్చిన వారితోనే నోము నోచుకుంటుంది. తన భర్త జైలు నుండి వచ్చే సమయానికి ఆమె మహాత్ముని అనుచరిణిగా మరిపోతుంది.

'ప్రేమ ప్రభావము' కథలో రామస్వామి త్యాగం, కార్యదక్షత తని తండ్రి వేంకయ్యనాయుడిలో మార్పుకు కారణంకాగా, 'ఐదుమాసముల యిరువది దినములు' కథలో గోపాలరావు కార్యనిష్ఠ అతని భార్య రుక్మిణిని దేశభక్తురాలుగా మారుస్తుంది. పై

రెండు కథలలో మహాత్ముని బోధనలైన విదేశీవస్త్ర బహిష్కరణ, ఖద్దరు పునరుద్ధరన, సత్యం, అహింస ప్రధానంగా కనిపిస్తాయి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో అనేక మంది యువతీ యువకులు మహాత్ముని బోధనలతో ప్రేరేపితులై తమ చదువు, వృత్తులను విడిచిపెట్టి జాతీయోద్యమంలో పాల్గొన్నారు. కనుపర్తి వరలక్ష్మమ్మగారు కూడా గాంధీజీ బోధల వలన ప్రభావితమై స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. మహాత్ముని అడుగుజాడల్లో నడిచి, తన జీవితాన్ని దేశంకోసం త్యాగం చేశారు. ఆమె తన రచనల ద్వారా మహాత్ముని సిద్ధాంతాలను వ్యాప్తి చేశారు. “ నా జీవము ధర్మము, నా మతము నీతి, నా లక్ష్యము సతీ శ్రేయము. ఈ మూడింటిని సమర్ధించుటకే నేను కలము బూనితిని” అని తన రచనల ప్రధాన ఉద్దేశ్యాన్ని లక్ష్మమ్మగారు చెప్పుకున్నారు.

స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ఆనాటి ఉద్యమకారుల లక్ష్యాలు పూర్తిగా నెరవేరకపోవడాన్ని గమనించిన వరలక్ష్మమ్మగారు “కొల్లగొని పోయె సర్వంబు తెల్లవాడు, చించుకొని పోయె ముస్లిము చిన్నవాడు, బడుగు దేశాన పేచీలు బహుళమయ్యె, క్రొత్త కాపురమింతట కుదుట పడునె” అని ఆవేదన చెందారు. కట్టమంచి రామలింగారెడ్డి చేత “శ్రీమతి వరలక్ష్మమ్మగారి జీవితము, సాహిత్యము సంస్కారవంతమైన ఒక తరాన్ని రూపొందించి తెలుగువారు మరచిపోలేని మహోపకారం చేసినవి” అని ప్రశంస పొందిన ఈమె ఆగష్టు 13, 1978న పరమపదించింది.

**ఆధారగ్రంథాలు:**

1. కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు – ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, గుంటూరు జిల్లా శాఖ ప్రచురణ, అగష్టు, 2015

# గృహలక్ష్మి మాసపత్రిక – మహిళాభ్యుదయం

**ముల్లంబుడు అప్పనరాజ్,** పి.హెచ్.డి. రిసెర్చ్ స్కాలర్‌తెలుగు శాఖ, యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్.

**1.ఉపోద్ఘాతం :** ఆంధ్రవ్మాయ క్షేత్రంసువిశాలమైనది. దీనిలోని కవిత పరిమళాలను వెదజల్లినకవయిత్రీమణులెందరో ఉన్నారు. "న స్త్రీస్వాతంత్ర్యమర్హతీ"అని మనువు చెప్పినప్పటికీ, ప్రతిభావంతులైన మహిళలు నాటి నుండి నేటి వరకు వివిధ రంగాలలో తమ నైపుణ్యాలను చూపుతూ పురుషులతో సమానంగా ఖ్యాతిని గడిస్తున్నారు. ఇందులో ముఖ్యంగా లలిత కళలైన కవిత్వం, గానం, చిత్రలేఖనం వంటి వాటిలో స్త్రీలు తమ ప్రపాటవాలను చూపించి కీర్తిపొందుతున్నారు. ఇలాంటి స్త్రీలు వేదకాలం నుండి నేటి వరకు ఎంతోమంది ఉన్నారు.

వేదకాలంలో స్త్రీలకు సమాజంలో గుర్తించదగిన గౌరవ మర్యాదలు ఉండేవి. ఈ కాలంలో స్త్రీని గృహసామ్రాజ్ఞిగా భావించి ధర్మ కార్యాలలోనూ, కుటుంబ రక్షణలోనూ, గృహనిర్వహణ వంటి పనులల్లో ఆమెకు ప్రముఖ స్థానాన్నిచ్చారు. కేవలం గృహ నిర్వహణలోని గృహిణిగానే కాకుండా వేదాధ్యయనంలో, వేద సూక్తాలను దర్శించుటలో, వేద గోష్ఠులలో, చర్చలలో మహిళలకు పురుషులతో సమానమైన అవకాశాలను కల్పించి ఆదరించారు. అంతటి ప్రాచీన కాలంలోనే మహిళలు విద్యానాన్ని పొంది మంత్రదర్శనం చేసి సమాజంలో గౌరవాన్ని పొందడం అనేది మనం గర్వించదగిన విషయంగా చెప్పవచ్చును.

అయితే సాహితీ రంగాలలో ప్రాచీన యుగం, మధ్యయుగం గడిచిన తరువాత ఆధునిక యుగం ప్రారంభమైనది. నిజానికి మహిళలపరంగాచూసినట్లయితే ఇది ఒక సంధి యుగంగా చెప్పవచ్చును. మనదేశంమహ్మదీయరాజులపాలనలోకి వచ్చిన తరువాత స్త్రీలకు రక్షణలేకుండా పోయింది. వారి చదువు, జీవితం రెండూ నాశనమయ్యాయి. స్త్రీ వంటయింటకుందేలయ్యింది. అయినప్పటికీ ఆ గాఢాంధకారాలలో కూడా జ్ఞానదీపికలను వెలిగించిన మహిళామణులుకొంతమందిఉన్నప్పటికీ స్త్రీల విద్య మందగించిందని చెప్పవచ్చును. అయితే కందుకూరి వీరేశలింగం పంతులు వంటి కొందరు స్త్రీవిద్యకోసం,స్త్రీ పునర్వివాహానికి పూనుకున్నారు.స్త్రీలకుజ్ఞానాభివృద్ధిని, వికాసాన్ని కలిగించడానికి సంఘ సంస్కరణానుకూలంగా పత్రికలు, రచనలను చేశారు. అంతేకాకుండా ప్రతి పట్టణంలో స్త్రీల సభలు, స్త్రీల సమాజాల ద్వారా చైతన్యాన్ని తీసుకురావడానికి, మహిళాభివృద్ధికి కోసం పురుషులతోపాటు కొటికలపూడి సీతమ్మ, బాలాంత్రపుశేషమ్మ, కందుకూరు రాజ్యలక్ష్మమ్మవంటి కవయిత్రులు, పండితులు పూనుకున్నారు.

మహిళాభ్యుదయానికిదోహదపడే వాటిలో పత్రికలు ముఖ్యమైన సాధనాలని గ్రహించి అనేక పత్రికలను వెలువరించారు. తెలుగులో పత్రికలు వెలువడిన ఎంతోకాలానికిస్త్రీలకొరకు ప్రత్యేకమైన పత్రికలు ప్రారంభమయ్యాయి. వాటిలో చెప్పుకోదగినవిసతీహితబోధిని, తెలుగు జనానా, శ్రీ బాలిక, హిందూసుందరి, సావిత్రి, వివేకవతి, అనసూయ, ఆంధ్రలక్ష్మి, గృహలక్ష్మి పత్రికలు.ఇవన్నీ కేవలం స్త్రీల పత్రికలే.అయితే ఈ పత్రికలలో పురుషుల రచనలు కూడా ఉండేవి.ఈ పత్రికలు ప్రధానంగా స్త్రీల విద్యా ఉద్యమాన్ని బలపరిచేవిగాఉండేవి.పైనపేర్కొన్నస్త్రీలపత్రికలలోనే కాకుండా తెలుగుపత్రికాచరిత్రలలోనే సువర్ణ పత్రములపై రాయదగినస్త్రీల సచిత్రమాసపత్రిక గృహలక్ష్మి.ఈ పత్రిక వ్యవస్థాపకులుకె.యన్.కేసరిగారు.

**2.కె.యన్. కేసరిగారు– వారి జీవితం:** వంద సంవత్సరాల క్రితం వనితల జీవితం అంధకారమయంగా ఉన్న సమయంలో వారి విద్యాభ్యుదయానికి, బాల్యవివాహాలను, కన్యాశుల్కాన్ని తొలగించటానికి, మహిళల మనోబుద్ధివికాసానికి, మహిళాజనోద్ధరణకుకృషిచేసిన వారు కందుకూరి వీరేశలింగంగారు. వీరిలాగానేసమాజపురోగతికి, మరీ ముఖ్యంగా స్త్రీల అభివృద్ధికి కోసం గృహలక్ష్మి పత్రికను స్థాపించి,మహిళలనుచైతన్యపథంలో నడిపిన మహిళాబంధువు,స్త్రీజనహితాభిలాషైన వారుకీ.శే. డా॥ కె.యన్.కేసరి.

కె.యన్.కేసరిగారు(కోట నరసింహం)గుంటూరు జిల్లాలోని వంగవోలు తాలూకాలో, ఇనమనమెళ్ళూరుగ్రామంలో ఒక పేద వెలనాటివైదికబ్రాహ్మణ కుటుంబంలో 24-04-1875లో జన్మించారు. వీరు జన్మించిన ఐదు నెలలకే తండ్రి కలరా వ్యాధి వచ్చి మరణించడంతో తన తల్లి అనేక కష్టాలుపడి పెంచారు. తల్లి కష్టాలు చూడలేకకాలినడకన మద్రాసు నగరానికి చేరుకొని అక్కడే పనిచేసుకుంటూఆంగ్లవిద్యను నేర్చుకోవడంతోపాటు,ఆయుర్వేదవిద్యలో కూడా ప్రావీణ్యం పొందారు. తరువాత "కన్యకా

పరమేశ్వరీ ధర్మ వైద్యశాల”లో డి. గోపాలాచార్యులపాటు వైద్యుడిగా పనిచేశారు. అయితే వారి మధ్య కొన్ని విభేదాలు రావడంతో కేసరిగారు స్వంతంగా “ కేసరి కుటీరము ఆయుర్వేద వైద్యశాల” ను ప్రారంభించారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొని క్రమక్రమముగా అభివృద్ధిచెంది లక్షాధికారి అయ్యారు. తనను ఇంత శ్రీమంతునిగా చేసినది లోధ్ర అనే ఔషధరాజమేఅని తన ఆత్మకథ అయిన చిన్ననాటి ముచ్చట్లులో చెప్పుకున్నారు. లోధ్రఅనేది స్త్రీల ఆరోగ్య సౌభాగ్యానికి సంబంధించిన ఔషధం. ఈ ఔషధం వలన వచ్చిన ధనాన్ని స్త్రీలధనంగా భావించి , స్త్రీలధనం పవిత్రమైనది కాబట్టిఆ ధనాన్నిస్త్రీల అభివృద్ధికే ఉపయోగించాలని భావించి “ కేసరీ కన్యా విద్యాలయం” ను స్థాపించారు.

**3. గృహలక్ష్మి మాసపత్రిక ప్రారంభం:** కేసరిగారు బందరు వీధిలో ఉన్నప్పుడు మందుల వ్యాపారం బాగా అభివృద్ధి కావడంతో, ఉన్న ఇల్లు చాలదని ఎగ్మూరులో ఒక పెద్ద భవనాన్ని కొన్నారు. అక్కడ కూడా వ్యాపారం అభివృద్ధి చెందడంతో ఆ ఇంటికి పక్కన పూనవల్లిహైరోడ్డులో ఒక పెద్ద భవనాన్ని అద్దెకు తీసుకొని అక్కడ మందులు తయారుచేసే ఫ్యాక్టరీని, లోధ్ర ముద్రణాలయాన్ని స్థాపించారు. కేసరిగారు యుక్తవయస్సులో ఉన్నప్పుడు గాంధీజీ విజయవాడకు వచ్చారు. జాతి చైతన్యానికి గాంధీజీ చెప్పిన మాటలు కేసరిగారిని ఎంతగానోఆలోచింపచేశాయి. అంతేకాకుండా కందుకూరి వీరేశలింగంగారు ప్రారంభించిన మహిళాజనోద్ధరణ చూసి ఎంతగానో ప్రభావితమయ్యారు. ఆ ప్రభావం తనపై బలంగా పడటంతోతానుకూడాస్త్రీజన సేవ చేయాలని భావించి అప్పటినుండిస్త్రీవిద్యాభివృద్ధికిఉపయోగపడేవిధంగా గృహలక్ష్మిమాసపత్రికను 1928వ సంవత్సరం మార్చినెలలో ప్రారంభించారు.

**4. గృహలక్ష్మి మాసపత్రిక:** స్త్రీవిద్య కోసం కేసరిగారు ఎక్కువగా కృషిచేశారనడానికి నిదర్శనం ఈ గృహలక్ష్మి పత్రిక. ఆ కాలంలో వచ్చిన పత్రికలన్నింటిలోనూ ఉత్తమమైన అభిరుచులతో వచ్చిన తెలుగు స్త్రీల పత్రిక గృహలక్ష్మిఅనిచెప్పవచ్చును. ఈ పత్రిక దాదాపు 40 సంవత్సరాలపాటు అంటే 1928 నుండి 1960 వరకు నడిపారు. భారతి మొదలైన ప్రాచీన పత్రికలను ప్రతిబింబించే విధంగాగృహలక్ష్మిపత్రిక నడిచింది.

గృహలక్ష్మిపత్రికమొదట్లోవిడిసంచికఆరు(6)అణాలు, సంవత్సరచందానాలుగు(4)రూపాయలు. ఎగ్మూరులోనిలోధ్ర ప్రెస్లో ముద్రించేవారు. ఈ పత్రిక పైభాగాన్ని (Cover Page) ఎరుపు రంగు చీర, తెల్లనిచుక్కల పట్టంచురవిక, చెవులకు సర్పిణీలు, మెడలో నాను త్రాడుమెరుస్తుండగాచెక్కిట చేయి చేర్చిచూస్తున్నట్లుత్రివర్ణాలతో (3D Picture) అందంగా రూపొందించారు. అదేవిధంగా ఈపత్రికమొదటిపుట ప్రారంభానికి పైభాగంలో“జయజయగృహలక్ష్మీ సఖి! జయజయలలితాంధ్ర మధుర సారస్వతమా!

జయజయలలనారత్నమ! జయజయ విద్య ప్రబోధ! జయ కళ్యాణీ!”అంటూచదువులతల్లి సరస్వతీ దేవిని, స్త్రీలనుస్తుతించే సంస్కృతశ్లోకంతో ప్రారంభమవుతుంది. ఈపత్రికలో ప్రధానంగా స్త్రీల ఆయురారోగ్యాలను పెంపొందించే విషయాలను చర్చించేవారు. వీటితోపాటుశరీర, మనోబలాలలోస్త్రీలు,పురుషులకంటెతక్కువవారు కారని నిరూపించడమే సంకల్పంగారూపొందించిందీ పత్రిక.

గృహలక్ష్మిపత్రికలోపొణకా కనకమ్మగారు, శేషమ్మగారు, కంచనపల్లి కనకాంబగారు, రావూరు సుబ్బమ్మగారు, దుర్గాబాయిగారు, కమలావతిగారు, చిల్కపాటిసీతాంబగారు, కనుపర్తి వరలక్ష్మిగారువంటివారుప్రతినెల పద్య రూపంలోనో, వ్యాస రూపంలోనో ఏదో ఒక రచనచేసేవారు. ఆ రోజులలో ఈ పత్రిక మూడువేలమందిచందాదారులతో నడిచింది. గృహలక్ష్మిపత్రిక వారుసనాతన హిందూసంప్రదాయాన్ని పాటిస్తూనే, ఆంగ్లవిద్య ప్రభావంతో వచ్చిన సంస్కారదృష్టిని కూడా ఆచరించారు.

గృహలక్ష్మిపత్రికలో కేవలం వ్రతకథలు,పాటలేకాకుండాశాస్త్రీయమైన విషయాలను,ఇంటిల్లిపాదికి ఆసక్తి కలిగించే విషయాలను ఇందులో ప్రచురించేవారు. ఆధునికకాలంలో వచ్చిన మహిళా పత్రికలకు ఆదర్శప్రాయమైనది. స్త్రీలజనోద్ధరణకు, స్త్రీలస్వాతంత్ర్యానికి, విద్యాభివృద్ధికి, వారి హక్కులను కాపాడటానికి, సంఘ దురాచారాలను రూపుమాపడానికిసంబంధించిన విషయాలను చర్చించడానికి గృహలక్ష్మిపత్రిక మంచిచర్చావేదిక అయ్యిందని చెప్పవచ్చు. స్త్రీలోకానికిసమస్యలు వచ్చినప్పుడు వాటిని నిర్మొహమాటంగా ఖండించి, వారికి అండగా నిలిచిన పత్రిక గృహలక్ష్మి పత్రిక.

**5. గృహలక్ష్మి పత్రిక స్వరూపం:** గృహలక్ష్మి పత్రికసంపాదకులైన కేసరిగారు తాము ఏర్పరుచుకున్న లక్ష్యాలకు, ఆశయాలకు అనుగుణంగా నడుస్తున్నదా? లేక ఏవైనా సమస్యలు ఉన్నాయా? అనే విషయాలను,అలాగే పత్రిక సాధించిన ప్రగతిని స్వవిషయం అనే శీర్షికలోతెలిపేవారు. ఇదే కాకుండా అనేక పత్రికలలో వచ్చిన విశేషాలను పుష్పచయం అనే శీర్షికతోనూ, చలివేంద్రం

ముచ్చట్లు అనే శీర్షికతో కబుర్లను చేర్చేవారు. బాల ప్షినం అనే శీర్షికతో చిన్న పిల్లల పాటలు, హాస్య ప్రసంగాలను,చిన్నచిన్న కథలు వేసేవారు. ఆ రోజులలోనే కొత్తగా సినిమాల విడుదలప్రారంభం కావడంవల్ల సినిమా కబుర్లను, సెట్లోని విశేషాలను కొన్నింటిని పూర్తిపేజినిడివితోనూ, కొన్ని చిత్రాలపై క్లుప్తమైన సమీక్షలను రాసి ప్రచురించేవారు. వీటితోపాటు డాక్టరుకె.యన్.కేసరిగారు వ్యాధులనుబట్టి ఆరోగ్య సూత్రాలను రాస్తూనే వాటికి తగిన మందులను కూడా రాసేవారు.

గృహలక్ష్మి పత్రికలో పూలమాల, పరధ్యానం, నీళ్ళుతెచ్చుకొనే పడుచులు, నవవర్ష, పద్మినీ వల్లభుడు, చిత్రాంగి, మాతృదేవత, ప్రతీక్షణము, ఆనందమయి మొదలైన ఎన్నో త్రివర్ణచిత్రాల(3%ణ%)తో ఈ పత్రికను ముద్రించేవారు.రత్నాల కమలాబాయిగారు వంటి చిత్రకళాకారులు ఈ పత్రికకు చిత్రాలను గీసేవారు.గృహలక్ష్మిపత్రికలోరచనలు ఆంధ్ర, తమిళ ప్రాంతాలలోని రచయితలు,కవయిత్రులు ఏదో ఒక సంచికలో తమ రచనలను ముద్రించేవారు. అంతేకాకుండా శేషాద్రి రమణ కవులు, అడవి బాపిరాజుగారు వంటి వారు ఈ పత్రికలో ప్రత్యేక వ్యాసాలను రాసేవారు. గృహలక్ష్మి పత్రిక ప్రారంభ సంచిక నుండి కనుపర్తివరలక్ష్మమ్మగారు రాసిన శారద లేఖలు ఈ పత్రికకు ప్రత్యేక అలంకరణగా ఉండేది.వరలక్ష్మమ్మగారు దక్షిణ భారతదేశ విహారయాత్రకు వెళ్ళిన సందర్భంలో అక్కడ ఆమె చూసినస్త్రీల వస్త్రధారణ, అక్కడి సమాజంలో స్త్రీలకు ఉన్న గౌరవాన్ని తన కల్పిత స్నేహితురాలైన కల్పలతకులేఖను రాస్తూ..... “నెచ్చెలీ!కుర్తాళంవెళ్లుటకై మేము తెంకాశీలో దిగి పురముదెసచూడగనేఆపుకమంతియునొకే తోటవలెగన్పట్టెను. అట నుండి బండిచేసుకొని అచ్చటికి మూడు నాల్గు మైళ్లదూరములో నున్నకుర్తాళమునకు బయలుదేరితిమి...... యచ్చటి స్త్రీలుగూడనిరస్త భూషలు మళయాళ స్త్రీలు సాధారణముగా నగలుధరింపరు. అచ్చట స్త్రీపురుషులొకే విధముగా వస్త్రములధరింతురు. తూర్పునకు (గంజాము విశాఖపట్టణ ప్రాంతములకు) పోయినకొలది స్త్రీల కట్టుబట్ట తొమ్మిదిమూరలే. అటునుండి క్రమముగా దక్షిణమునకు వచ్చినకొలదిస్త్రీలచీరలొక్కొక్కమూర పెరిగి పెరిగి పూర్తిగా దక్షిణమునకు వచ్చునప్పటికియిరువదిమూరలగును, కానికేరళ స్త్రీల కట్టుబట్ట పురుషునికట్టుబట్టలవోలెనాలుమూరలే. ఆధోవ దని వారునడిమికీమడిచిదాక్షిణాత్యులవలెగూడుకట్టుగా కట్టుకొని దానిపై నొక చిన్న తుండుగుడ్డనువల్లెవాటుగా భుజము పై వేసికొనియొక కొంగును మొలలోదోపుకొందుకు. రెవికకుమాఱుగానటిచేతులచొక్కావేసికొందురు.ఈ పైతుండును వారు బయటికి వచ్చునప్పుడుమాత్రమే యుపయోగింతురనితోచెడెవి. పార్శ్వభాగమును కప్పుటకు వారంతగాబ్రయత్నించరు. పైట లేకపోవుట వారి కొకయాక్షేపణీయ విషయముగాదు. పైట వేసికొననందుకువారేమాత్రముబిడియపడుట లేదు.........వాన్కూరు రాజ్యములో స్త్రీవిద్యమధికముగానున్నది. విద్యాంగమంత్రిగానున్నదిగూడ నొకస్త్రీయే యనివింటిమి.ఆడమళయాళమనిన అచ్చట పురుషులుండరనియుస్త్రీలు పైట వేసికొనరనియు అక్కడ అంతయుస్త్రీయధికారమనియుమనవారుయేదేదోవిపరీతముగా జెప్పుకొనెడివారు. అట్టి విపరీత మేదియు లేదు.కాని అచ్చటకానవారసత్వ మెక్కువ. రాజ్యాధికారములు గూడ కుమార్తె పుత్రునకువచ్చునే కానికొమారునికొమారునకు రావు....”అనితనలేఖలోతను చూసిన వాటిని, తెలిసిన వాటిని లేఖల రూపంలో ప్రతినెలగృహలక్ష్మిపత్రికలో ప్రచురించేవారు. ఇవేకాకుండా ఈ పత్రికలోమాతాశిశు సంరక్షణ, పుత్రపుత్రికా భేదము వంటి వ్యాసాలు స్త్రీల కోసం రాయడం జరిగింది.

గృహలక్ష్మిపత్రికమహిళల బుద్ధి వికాసం, ఆరోగ్యరక్షణ అనేవిప్రధాన ఆశయంగా ఉండడం వల్ల ఈపత్రికలో మంచి గ్రంథాలను విమర్శ చేయడంతోపాటు గ్రంథాలను పరిచయంకూడా చేసేవారు.దీనిలో భాగంగానే కే.యన్.కేసరిగారు రచించిన వేప, కాంతాజనకల్పభూరుహము అనే స్త్రీలకు సంబంధించిన గ్రంథాలను ప్రచురించడమే కాకుండా “స్త్రీల సంబంధ గర్భాశయరోగ నివారిణి, స్త్రీలబుతుస్రావ దోషములను చక్కబఱచి, దేహమునకు ఆరోగ్యమును కాంతిని కలుగజేయును. సర్వాభీష్టప్రదాయినియనిన్ని, కామధేనువనిన్ని, కొంగుబంగారమన్నిని వాడిన వారు పలువిధములు స్తుతించుచున్నారని”లోధ్రఔషధానికి సంబంధించిన ప్రకటనను కె.యన్.కేసరిగారుగృహలక్ష్మిపత్రికలో ప్రచురించిస్త్రీలకుదానిపైన అవగాహన కల్పించారు.“జలమువలననేకరోగములు నయమగును. సమస్తరోగములుజలమువలననేనయమగుననుజర్మను పండితుని సిద్ధాంతానుసారము మన దేశమందనేకులునీటివైద్యమును చేయుచున్నారు. దానినే తొట్టిస్నానములనినుడువుదురు. కావున నాంధ్రదేశమందలిస్త్రీలయభివృద్ధికైపాటుబడుస్త్రీలీ విషయము బోధించి, తల్లులు పిల్లల యారోగ్యసాధనకు గడంగవలయును. (1) తలపోటు, తలనొప్పివలన బాధపడుచుండు వారు శిరమున జలముధారగను పోయవలయును. అందువలన బాధతగ్గును.(2)ముక్కు నుండి నెత్తురు కారుచుండిన శీతలజలమును నాసికతోడ పీల్చవలయును.అందువలన నిదిసాధారణముగ నయమగును. (3) పొంగు, ఆటలమ్మ, స్ఫోటకము మొదలగువారికి శీతలజలమున తడిపిన వస్త్రమునుగప్పవలయును.అందువలనవారికా భాధచాలావరకులాఘవమగును”.ఇలాంటిఆరోగ్యసూత్రాలనుచెప్తూనేవాటిని ఎలా ఉపయోగించాలోకూడా చెప్పడం ఈ పత్రికకు ఉన్న ప్రత్యేక లక్షణంగా చెప్పవచ్చును.

గృహలక్ష్మిపత్రిక సాహిత్యరంగానికి సంబంధించిన గుమ్మిడిదలదుర్గాబాయమ్మగారు, పొణకా కనకమ్మగారు, రత్నాల కమలాబాయిగారు వంటి వారికి మాత్రమే పరిమితం కాకుండా వివిధ రంగాలలో ప్రఖ్యాతిగాంచిన స్వదేశీయ, విదేశీయ నారీమణుల ఛాయా చిత్రాలను ముద్రించి, వారి గురించి క్లుప్తముగా రాసి పాఠకులైన మిగతా మహిళలలో చైతన్యాన్ని తీసుకొనిరావడమే ప్రధాన లక్ష్యంగా పనిచేసిందని చెప్పవచ్చును.

ఈ పత్రికలో ఎక్కువ భాగము రచనలు, కథలు, కవితలు, నవలలు, పల్లె పదాలు, బాలగేయాలువంటివే కాకుండా ఎన్నో విశేషాంశాలను ఇందులో ప్రచురించడం జరిగింది. అయితే గృహలక్ష్మి పత్రిక వ్యవస్థాపకులు, ప్రధాన సంపాదకులైనడా?? కే.యన్.కేసరిగారు1954వ సంవత్సరంలోమరణించిన తరువాత 1960లో గృహలక్ష్మి పత్రిక ప్రచురణ ఆగిపోయింది. ఏది ఏమైనప్పటికీస్త్రీలకు సంబంధించి వచ్చిన పత్రికలన్నింటిలోనూ గృహలక్ష్మి పత్రికతలమానికంవంటిదని చెప్పవచ్చు.

**6. సారస్వత సన్మానములు:** కళారంగాలలో కృషి చేసిన వారికి బహుమతులతో సన్మానించడం అనాదిగా వస్తున్న ఆచారం.ఇదే ఆచారాన్ని కే.యన్.కేసరిగారుకూడా అవలంబించారని చెప్పవచ్చును. కేసరిగారు స్త్రీలవిద్య వికాసానికి పాఠశాలలను, పత్రికను స్థాపించడంతోనే తన పని ముగిసిందని భావించకుండా మంచిరచనలు చేసిన మహిళలను బహుమతులతో సన్మానించడం జరిగింది. ఇటువంటి కార్యక్రమాల వల్ల మహిళలలోని ప్రతిభను పెంపొందించడం జరిగింది.అనసూయ పత్రిక, నెల్లూరు వర్థమాన సమాజము వారు ప్రతిభావంతులైన మహిళలను ప్రతిసంవత్సరం బంగారు పతకాలతో సత్కరించేవారు.తరువాత గృహలక్ష్మిపత్రికకూడాప్రతిసంవత్సరం స్వర్ణపతకాలను ఇచ్చి గౌరవించేవారు. ఆ తరువాతి కాలంలో క్రమంగా స్వర్ణపతకం స్థానంలో స్వర్ణకంకణాన్ని ఇవ్వడం ప్రారంభించారు.నెల్లూరుజిల్లాలో 11-03-1934 వ తేదిన జరిగిన శ్రీ తిక్కనజయంతి ఉత్సవాలలో భాగంగానే గృహలక్ష్మి పత్రిక స్వర్ణకంకణప్రధానోత్సవంకూడా జరిగింది. ఆ ఉత్సవంలోశ్రీమతి కనుపర్తివరలక్ష్మమ్మగారినిమొట్టమొదటగా ఈ స్వర్ణకంకణంతోసన్మానించారు. 1954లో కేసరిగారు మరణించిన తరువాత పత్రిక ఆగిపోయింది. కానీస్వర్ణకంకణప్రధానోత్సవంమాత్రం ఈనాటికి జరుగుతూనేఉంది. అయితే ఈకంకణప్రధానోత్సవంమాత్రం రెండవప్రపంచ యుద్ధసమయం1942-1947మధ్యకాలంలోస్వర్ణకంకణప్రధానోత్సవం జరగలేదు.1948వ సంవత్సరంనుండి నేటివరకు నిర్విరామంగా జరుగుతూనే ఉంది.

**7. గృహలక్ష్మిపత్రికస్వర్ణకంకణ గ్రహీతలు:** గృహలక్ష్మిపత్రికస్వర్ణకంకణప్రధానోత్సవంఅనేది కేవలం తమపత్రికలో రచనలు చేసిన రచయిత్రులకు, కవయిత్రులకు, వ్యాసకర్తలకు మాత్రమే కాకుండా వివిధ రంగాలలోతమప్రతిభతోతమతమ రంగాలలో రాణిస్తూనే స్త్రీల సంక్షేమానికి, అభివృద్ధికికృషిచేసిన మహిళలను సత్కరించడం జరిగింది.

**I. సాహిత్యరంగం:** సాహిత్యాంశాలైనకవిత్వం,గేయాలు, కథలు, నవలలు, నాటకాలువంటి వాటిలో విశేషమైన కృషిచేసిన మహిళలకు కే.యన్.కేసరిగారుస్వర్ణకంకణాలను బహుకరించారు. ఈసత్కారం పొందిన వారిలోమొదటివారుకనుపర్తివరలక్ష్మమ్మ(1934), కవికలహంసిచిల్కపాటిసీతాంబ(1935), కాంచనపల్లికనకాంబ(1936), గిడుగు లక్ష్మీకాంతమ్మ(1951), స్థానాపతిరుక్మిణమ్మ(1952), ఊటుకూరిలక్ష్మీకాంతమ్మ(1953), పొణకాకనకమ్మ(1955),కె.రామలక్ష్మి(1957), దేశిరాజు భారతదేవి(1958), గుడిపూడిఇందుమతీదేవి(1959), కె. చంద్రమతీదేవి(1960), ఎ.కనకదుర్గా రామచంద్రన్(1961), ఇల్లిందల సరస్వతీ దేవి(1964), డా. తెన్నేటి హేమలత(1965), ద్వివేదులవిశాలాక్షి(1966), కోడూరికౌసల్యాదేవి(1967), ముప్పాళ్ల రంగనాయకమ్మ(1968), యద్దనపూడి సులోచనారాణి(1969),ఐ.వి.ఎస్. అచ్యుతవల్లి(1970), డి. కామేశ్వరి(1971), డా. సి.ఆనందారామం(1972), వాసిరెడ్డి సీతాదేవి (1976), మాదిరెడ్డి సులోచన(1978), డా. నాయనికృష్ణకుమారి(1979), అవసరాల (వింజమూరి) అనసూయదేవి(1984) జె.వరలక్ష్మి(1986), వేదులమీనాక్షిదేవి,ఉన్నవవిజయలక్ష్మి,పోలాప్రగడరాజ్యలక్ష్మి, వాసా ప్రభావతి.

**II సామాజికరంగం:** స్వాతంత్ర్య సమరయోధులకు,స్త్రీవిద్య కోసం పాఠశాలలు నెలకొల్పి సమాజపురోభివృద్ధికి కృషి చేసిన వారిలో బత్తులకామాక్షమ్మ(1941), ఉన్నవ లక్ష్మీబాయమ్మ(1948), కోడూరు లీలావతి(1974), పొణకా కనకమ్మ(1955)వంటి వారికి గృహలక్ష్మి పత్రిక స్వర్ణకంకణాలతో సత్కరించారు.

**III సామాజిక మాధ్యమం - పత్రికారంగం :** పత్రికారంగంలో కాలమిస్టులుగా,కార్టూనిస్టులుగా,రేడియో వ్యాకర్తలుగా కృషిచేసిన వారిలోబాలాంత్రపుశేషమ్మ(1938), తురగాజానకీరాణీ(1982), మాలతీ చందూర్, శారదా అశోక వర్ధన్ వంటి వారికి గృహలక్ష్మి పత్రిక స్వర్ణకంకణాలతో సత్కరించారు.

**IV లలితకళలు:** లలితకళలైన సంగీతం, నాట్యం, నాటకం, చిత్రలేఖనం, శిల్పం వంటి కళలో విశేషమైన ప్రతిభకనబరిచితరువాతి తరాలవారికి ఆదర్శప్రాయంగా నిల్చినరత్నాలకమలాబాయి%--%చిత్రలేఖనం(1938),బెంగుళూరునాగరత్నమ్మ- నాట్యం(1949), కొమ్మూరి పద్మావతీదేవి-నాటకం(1956),కోడూరు లీలావతీదేవి- సంగీతం (1974), ద్వారక పార్థసారథి- సంగీతం(1975) వంటి వారికి గృహలక్ష్మి పత్రిక స్వర్ణకంకణాలతో సత్కరించారు.

ఈ విధంగా గృహలక్ష్మి పత్రిక 1934 నుండి ప్రస్తుతం వరకు స్వర్ణకంకణోత్సవాలను నిర్వహిస్తూ మొత్తం60మంది మహిళలను స్వర్ణకంకణాలతో సత్కరించడం జరిగింది.

గృహలక్ష్మిపత్రిక ప్రారంభమై ఆరేళ్లు(6) పూర్తయిన సందర్భంలో శ్రీమతి కనుపర్తివరలక్ష్మమ్మగారు"సారస్వత విషమున గృహలక్ష్మి గ్రామ్య గ్రాంథికవిభేదములెఱుగదు. కవిత్వ విషయమునపురాతనాధునాతనకవిత్వములు రెండును గృహలక్ష్మికి సమ్మతమే. మతవిషయమునగృహలక్ష్మి పక్కా హిందువు సాంఘికములందు గృహలక్ష్మి భావము లతివిశాలములు".అని అలాగే " ఆర్థిక విషయమున గృహలక్ష్మి మహిళా పక్షపాతి, స్త్రీల హక్కులకై పోరాడుటలో గృహలక్ష్మి వీరబాల, రాజకీయముగా గృహలక్ష్మి అత్మగౌరవము కోల్పోని మితభాషిణి, తన యీడుజోడు పిల్లల నలరించుటలో గృహలక్ష్మి యింపైన నేస్తము. విద్యావిషమున గృహలక్ష్మి ప్రశంసనగత్యము"అనిగృహలక్ష్మిమాసపత్రికపైతన అభిప్రాయాన్ని ఆతేండ్ల గృహలక్ష్మి అనే వ్యాసంలో తెలిపారు.

**ముగింపు:** స్త్రీజనోద్ధరణకు, స్త్రీస్వాతంత్ర్యానికి, స్త్రీవిద్యాభివృద్ధికి, స్త్రీహక్కులను కాపాడటానికి, సంఘ దురాచారాలను రూపుమాపి స్త్రీ పురుషుల భేదాన్ని తొలగించడమే ప్రధాన ధ్యేయంగా, మహిళలను సామాజికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా చైతన్యపరిచిఅందరూ సమానులే అనే సమానత్వభావాన్ని కలిగించిమహిళాభ్యుదయమే పరమావధిగా నడిచిన ఏకైక స్త్రీలపత్రిక గృహలక్ష్మి మాసపత్రిక.

**ఉపయుక్త గ్రంథసూచి:**

1. కేసరి.కె.యన్(సం.)1929-1930 , గృహలక్ష్మి మాసపత్రికబీ రెండవ సంపుటము, మద్రాసు, లోద్రముద్రాలయము.

2 కేసరి.కె.యన్ 1999నా చిన్ననాటి ముచ్చట్లుబీరెండవ ముద్రణ, చెన్నై,శ్రీ మంజునాథ లేజర్ ప్రింటర్స్.

3. లక్ష్మీకాంతమ్మఊటుకూరి1975 ఆంధ్ర కవయిత్రులుబీ ప్రథమ ముద్రణ, ఖైరతాబాద్, దక్షిణ భారత ప్రెస్.

4. వరలక్ష్మమ్మకనుపర్తి1933ఆతేండ్ల గృహలక్ష్మివ్యాసంబీ ఫిబ్రవరి(పుట:7-8),గృహలక్ష్మి మాసపత్రిక, ఎగ్మూరు, లోద్రముద్రాలయము.

5. సుమిత్రాదేవి.జి1988 గృహలక్ష్మి స్వర్ణకంకణ గ్రహీతలైన కవయిత్రులు- వారి కావ్యాలుబీ ప్రథమ ముద్రణ, హైదరాబాద్.పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# జాతీయోద్యమ ప్రస్థానంలో స్త్రీలపాత్ర

**బి.గోపిర్యా నాయక్,** తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.ఎన్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), చిత్తూరు, చరవాణి: 99891 59196
**డాక్టర్ జి.ధర్మమూర్తి,** తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.ఎన్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), చిత్తూరు, చరవాణి: 98497 37115

భారతదేశంలో మహిళలు స్వేచ్ఛగా జీవించేందుకు, సంప్రదాయాలను నిరసించి తమ హక్కులను కాపాడుకునేందుకు ఎన్నో ఏళ్లుగా కృషి జరుగుతూనే ఉన్నది. మన దేశానికి రాజ్యాంగం అమలులో ఉన్నా ఇంకా పురుషులతో సరిసమానంగా మహిళలు మనుగడ సాగించలేని దశలో ఉన్నారు. హక్కుల సాధనకు ఇంకా కృషి సాగించాల్సిన అవసరం ఎంతో ఉన్నది. అందుకు అమృతోత్సవాలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో జాతీయోద్యమ కాలం నాటి స్త్రీల పరిస్థితులు పరిశీలిస్తే ఆనాటి సమాజం అవగతం అవుతుంది.

జాతీయోద్యమంలో అనేక సంస్థలు సామాజిక సంస్కరణలతో పాటు, విద్య ద్వారా స్త్రీల స్థితిని మెరుగుపరిచేందుకు ప్రయత్నించాయి. అలాగే మహిళల ఆర్థిక, రాజకీయ హక్కుల కోసం పోరాటం చేసాయి. ఆంగ్లేయుల రాక్షస పాలన నిర్మూలనకు అనేక సంస్థలు కృషి చేసాయి. మహిళలకు ఉన్నత విద్యావకాశాలు పెరగాలనీ, వారి సామూహిక స్వేచ్ఛ స్త్రీ స్వతంత్రానికి ప్రేరకమవుతుందనీ ఆశించారు. స్త్రీలు చదువుకోవడానికి ఆటంకమని బాల్య వివాహాలను నిరసించారు. వితంతు పునర్వివాహ హక్కునూ, గౌరవంగా జీవించే హక్కులను గుర్తించారు.

1905 నాటి స్వదేశీ ఉద్యమంలోనూ, అనంతరం జరిగిన ఉద్యమాలలో మహిళలు పాల్గొన్నారు. మహాత్మాగాంధీ నాయకత్వంలో జాతీయోద్యమంలో స్త్రీల భాగస్వామ్యం పెరిగిందని చెప్పవచ్చు. గాంధీ చేపట్టిన మొదటి జాతీయ స్థాయి ఉద్యమం సహాయ నిరాకరణ. ఇందులో స్త్రీలకు ప్రత్యేక స్థానం కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన సత్యాగ్రహాల్లో ముఖ్యంగా బోర్సాదే, బార్డోలి సత్యాగ్రహాల్లో రైతు కుటుంబాలకు చెందిన స్త్రీలపాత్ర మరువలేనిది.

ఆంగ్లేయుల పాలన తుద ముట్టించేందుకు స్త్రీ, పురుషులు కలిసి ఉద్యమించాల్సిన అవసరాన్ని గుర్తించడంతో పాటు తమ స్వతంత్రం కోసం స్త్రీలే సమైక్యంగా జాగృతం అవ్వాలని భావించారు. భారతదేశంలో బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా జరిగిన శాసనోల్లంఘనలో భాగంగా, మహాత్మాగాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెసు జరిపిన అహింసాయుత సత్యాగ్రహమే ఉప్పు సత్యాగ్రహం.

ఉప్పు పన్నును ధిక్కరిస్తూ గాంధీ, 1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహీలతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ తీరంలోని దండి వద్ద ఉప్పు తయారు చేసాడు. శాసనోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్ఫూర్తినిచ్చే బలమైన ప్రారంభ ఘటనగా దండి యాత్ర ఉపయోగపడింది. ఉప్పు సత్యాగ్రహంలో ఎంతోమంది మహిళలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఈ సమయంలో అనేక మంది స్త్రీలు నిర్బంధానికి గురయ్యారు. ఈ సంఘటనను బట్టి ఆనాటి జాతీయోద్యమంలో మహిళల భాగస్వామ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. సరోజినీ నాయుడు, కమలానెహ్రూ, రాణి గైడిన్ల్యు, పార్వతీబాయ్, రుక్మిణీ లక్ష్మీపతి, హన్సా మెహతా, సత్యవతి, దుర్గాబాయి, కమలాదేవి ఛటోపాధ్యాయ తదితరులు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. విదేశీ వస్తువుల బహిష్కరణ, సారా వ్యతిరేక ఉద్యమంలో దేవిదేవికా సంఘ్, నారీ సత్యాగ్రహ సమితి, మహిళా రాష్ట్రీయ సంఘ్, లేడిస్ పికెటింగ్ బోర్డ, స్త్రీ స్వరాజ్య సంఘ్, స్వయం సేవికా సంఘ్ తదితర ఎన్నో మహిళా సంఘాలు స్వాతంత్ర్యోద్యమ సమయంలో అనేక కార్యక్రమాలు చేపట్టాయి.

క్విట్ ఇండియా ఉద్యమంలోనూ అనంతరం జరిగిన ఉద్యమాలలోనూ మహిళల పాత్ర మరవలేనిది. ఆనాటి జాతీయ నాయకులను నిర్బంధించినప్పుడు ప్రత్యేక ఉద్యమాలు నడపడంలో స్త్రీలు ముందంజలో ఉన్నారు. అరుణా అసఫ్అలీ, శాంతి, సునీత, బీనాదాస్, కల్పనాజోషి, ప్రీతి లతా మొదలైనవారు ఉద్యమాలు నడిపారు. నేజాతీ సుభాష్ చంద్రబోస్ సారథ్యంలోని భారత జాతీయ సైన్యంలో మహిళా విభాగం ఝాన్సీ లక్ష్మీ రెజిమెంట్‌కు కెప్టెన్ లక్ష్మీసెహగల్ బాధ్యత చేపట్టారు.

సతీసహగమనం, స్త్రీవిద్య, బాల్య వివాహాలు, వితంతు వివాహాలు తదితర సంఘ సంస్కరణల గురించి ఉద్యమాలు జరిగాయి. మహిళలు జాతీయోద్యమంలో పాల్గొన్నప్పుడు తల్లిగా, గృహిణిగా తన బాధ్యతలను విస్మరించలేదు. స్త్రీలు చదువుకుంటే కుటుంబం, సమాజం అభివృద్ధిలోకి రావాలని ఆశించారు. జాతీయోద్యమంలో ఉన్నత వర్గాల స్త్రీలు, విద్యావంతులు మాత్రమే కాకుండా గ్రామీణ, పేద, చదువుకోని స్త్రీలు కూడా పాల్గొన్నారు. ఈ దశలో రాజకీయ హక్కులు, సంప్రదాయ చట్టాల్లో మార్పులే స్త్రీవాద ఉద్యమాల లక్ష్యం. మూఢాచారాల నిర్మూలన, రాజకీయ హక్కుల సాధన, స్వాతంత్ర్య సముపార్జన లక్ష్యంగా ఈ కాలం స్త్రీలు పోరాడారు. స్వాతంత్ర్య పోరాటంలో మహిళల భాగస్వామ్యం.. స్వతంత్ర భారత ప్రభుత్వ పాలనలో, నిర్ణయాల్లో భాగస్వామ్యాన్ని కోరుకునే అవకాశం కల్పించింది. స్వాతంత్ర్య పూర్వ స్త్రీవాద ఉద్యమాన్ని మహిళల పోరాటాల్లో మొదటి దశ అని చెప్పవచ్చు. ఈ దశలో తమ దుస్థితికి సంప్రదాయాలు, మతం కారణమని స్త్రీలు భావించారు. విద్య, న్యాయవ్యవస్థలో మార్పుల ద్వారా తమ జీవితం మెరుగుపడుతుందని వారు భావించారు.

అదేవిధంగా మహిళల కోసం ప్రత్యేకంగా పత్రికలు నడపాల్సిన అవసరముందనే విషయాన్ని గుర్తించింది మాత్రం కందుకూరి వీరేశలింగం పంతులు గారు. ఈయన స్త్రీల కోసం స్థాపించిన సతీహితబోధిని పత్రికే మొదటి పత్రికగా చెప్పవచ్చు. ఇందులో స్త్రీవిద్య, ఆరోగ్యం, నీతిసూత్రాలు, భార్యగా స్త్రీ విద్యుక్తధర్మాలు మొదలైన వాటిపై వ్యాసాలు వచ్చేవి. కేవలం స్త్రీని ఆదర్శగృహిణిగా నిలపడం గొప్ప సంస్కరణగా భావించారు. ఆయన తర్వాత రాయసం వెంకటశివుడుగారి సంపాదకత్వంలో 'తెలుగు జనానా' (1893) పత్రిక వెలువడింది. ఈ పత్రికలో స్త్రీలకోసం పద్యాలు, పాటలు ప్రచురించేవారు. తదనంతరం ఎస్.సీతారామయ్యగారు 'హిందూసుందరి' (1902) పత్రికను కేవలం స్త్రీలకోసం ప్రారంభించారు. ఇందులో స్త్రీవిద్య, బాల్యవివాహాలు, స్త్రీల సంఘాల ఆవశ్యకత మొదలైన భిన్న అంశాల మీద వ్యాసాలు ప్రచురించారు. అంతేగాకుండా స్త్రీల కోసం నడిచే పత్రికలకు స్త్రీలే సంపాదకత్వం వహించాలని కోరుకున్నారు. స్త్రీల సంపాదకత్వంలో ఈ పత్రికలు మరింత విజయవంతం కాగలవని ఆశించారు. చివరికి వీరి కోరిక నెరవేరింది. వీరు ప్రారంభించిన 'హిందూ సుందరి' పత్రికకే స్త్రీలు సంపాదకత్వం వహించారు. ఈ పత్రికే స్త్రీల సంపాదకత్వంలో వచ్చిన మొదటి పత్రిక అని చెప్పుకోవచ్చు. ఆనాటి పత్రికలలో స్త్రీవిద్య, తద్వారా స్త్రీచైతన్యానికి తోడ్పడిన పత్రికలే అధికం. ఆ రోజులలో విద్యావంతులైన కొంతమంది స్త్రీలు సాటి స్త్రీలలో చైతన్యాన్ని కలిగించేందుకు స్వయంగా పత్రికలు స్థాపించి సంపాదకత్వం వహించారు.

వేల సంవత్సరాల నాగరికత, ప్రాచీన చరిత్ర గల ఈ దేశ ప్రజలకు, ప్రజాపోరాటాలలో స్త్రీలకు గొప్ప స్థానముంది. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించి తరిమికొట్టిన ఘన చరిత్ర మన ప్రజలది. మన జాతీయోద్యమ ప్రస్థానంలో స్త్రీల పాత్రను మరవలేనిది. స్వాతంత్ర్య సమరంలో స్త్రీలు అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించారు. చరిత్రను మలుపు తిప్పిన ఘటనలకు ఆద్యులయ్యారు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగులో కవితోద్యమాలు – తెలుగు అకాడమీ ప్రచురణలు.
2. తెలుగు సాహిత్య సమీక్ష – డాక్టర్ జి.నాగయ్య
3. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా.శాస్త్రి.
4. ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు – ప్రయోగములు – డాక్టర్ సి.నారాయణరెడ్డి.
5. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు – డాక్టర్ కె.రంగనాథాచార్యులు.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమస్ఫూర్తి – తెలుగు మహిళాదీప్తి

డా॥ పి. విజయకుమార్, వైస్‌ప్రిన్సిపాల్ & తెలుగుశాఖాధ్యక్షులు, శ్రీ మహాయోగి లక్ష్మమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎమ్మిగనూరు

**మహిళాస్ఫూర్తి**

మహిలో మహిమాన్వితమైనది మహిళ. 'స్త్రీ' అన్నది కేవలం ఏకాక్షర పదమే అయినా సత్త్వ, తమో, రజో గుణాల సమాహారరూపం స్త్రీ. "ప్రపంచ చరిత్ర పురుడు పోసుకొనేది ఆమె గర్భంలోనే. సమాజానికి మార్గదర్శకులు పెరిగేది ఆమె పొత్తిళ్లలోనే. సాంకేతికతకు పరుగులు నేర్పే శాస్త్రవేత్తలు నడకలు నేర్చేది ఆమె చేతుల్లోనే. దేశాలను నడిపించే నాయకులు, ఎదిగేది ఆమె కంటిచలువలోనే. మన జీవితం ఆమె ఆశీర్వాదమే. మన సంతోషం ఆమె ఆత్మీయతే, మన భవిష్యత్తు ఆమె అనుబంధమే, మన సంపద ఆమె ప్రేమే. కార్మికుల నుంచి కర్షకుల దాకా, సైనికుల నుంచి నిపుణుల దాకా నీ నుంచి నాదాకా అంతా ఆమె పేగు తెంచుకుని పుట్టిన బిడ్డలమే; ఎంత చేసినా ఆమె రుణం తీర్చుకోలేని మనుషులమే.

**"వేదమూలం ఇదం బ్రహ్మం**
**భార్యామూలం ఇదం గృహం**
**కృషిమూలం ఇదం ధాన్యం**
**ధన మూలం ఇదం జగత్"**

బ్రహ్మ సృష్టిలో అద్భుతమైన శక్తిస్వరూపిణి మహిళ. హరిశ్చంద్రుడు తన భార్య చంద్రమతితో "నీవే కదా నాకు నిఖిలేప్సితంబుల కవగతంబు లొనర్చు కల్పతరువు / నీవే కదా నాకు నిత్యసత్య యశంబు దరిజేర్చుచుండెడు ధైర్యలక్ష్మి / నీవే కదా ఘోర దావానలము నుండి మమ్ము రక్షించిన మానవతివి / నీవే కదా మౌని ఋణబాధ తొలగించి పరువునిల్పిన యట్టి భవ్యమతివి / నీవేనా నిదానంబు, నీవెకాదె నాకులవిభూషణంబగు నలిననయన/ అమరునె నాకు వేయిజన్మలకునైన నిన్నువంటి సతీమతి నెలతమిన్న"అని అంటాడు. భర్తకు నిజంగా వెన్నంటి ఉండి ధైర్యాన్నిచ్చే శక్తిస్వరూపిణి మహిళ. కరుణతో లాలించినా, కర్తవ్యదీక్షతో పాలించినా, తల్లిగా దీవించినా, ధర్మపత్నిగా నడిపించినా ఆమెకు ఆమే సాటి. విశ్వమంతా వ్యాపించి, నిర్వహించే పరమచైతన్యాన్ని స్త్రీ శక్తిగా, జగదాంబగా కొలుచుకునే సంప్రదాయం మనది. అడుగడుగునా ఆమెకు నీరాజనాలుపట్టే సంస్కృతి మనది. ఆమె ఆత్మవిశ్వాసానికి ఓటమి ఓడిపోవాల్సిందే... కష్టాలు తలవంచాల్సిందే, సమస్యలు సమసిపోవాల్సిందే. అమృతం పంచే అమ్మగా, ఆనందానిచ్చే అర్ధాంగిగా, అనురాగం పంచే చెల్లిగా, అనుబంధమై నిలిచే కూతురుగా, పాలించే రాణిగా, అవనికే ఆధారం ఆమె. పాత్రలు మారినా, ప్రాంతాలు వేరైనా, ఆమెలేనిదే జీవితం లేదు. మనిషి మనుగడే లేదు. ఇదీ సృష్టిలో మహిళ స్థానం; సుస్థిర ప్రస్థానం. తన కడుపు కాలుతున్నా... కన్నబిడ్డ కడుపు నింపాలని చూస్తుంది అమ్మ. కుటుంబభారం మోయలేని భర్త ఇబ్బందులను చూసి తను కూడా పనిచేస్తూ వేడినీళ్లకు చన్నీళ్లు తోడు అంటుంది భార్య. విధివశాత్తు అమ్మ ఖాయిలా పడినా; అమ్మకే అమ్మ అవుతుంది కూతురు. అవకాశం వస్తే పురుషులకు దీటుగా సరిహద్దుల్లోనూ రక్షణ నిలుస్తుంది ధీరవనిత. అందుకే అపురూపమైనదమ్మ ఆడజన్మ అంటారు.

కాలగమనంలో కన్నీళ్ళు ఎదురైనా కనురెప్పలచాటున దాచుకుంది. కుటుంబ ఉన్నతికి, సమాజప్రగతికి సాయం అందించింది. చైతన్యకెరటమై, కుటుంబమకుటమై, ఇంటికి దీపమై, ఆర్థికకాంతియై, ఆనందాలకు నిలయమై, ఎనలేని కృషిచేసి గెలుపుబాటలో పయనిస్తుంది. ఒకప్పుడు మహిళ అంటే వంటింటికే పరిమితం. కానీ నేడు మహిళ మారింది. అన్ని రంగాలలో రాణిస్తుంది. స్వేదం చిందిస్తోంది. ఆత్మవిశ్వాసమే ఆసరాగా, ఆకాశానికి నిచ్చెన లేని బాటగా, అవకాశాలే ఆలంబనగా, ప్రగతిపథంలో దశదిశలా దూసుకెళ్తున్నారు. ఎందరో మహిళామణులు మేం అబలలం కాదు సబలలం అంటూ ఉపాధిలో సగమై, కుటుంబపోషణలో భాగమై, మహిళా సాధికార స్వప్నమై మహిళలు వర్ధిల్లుతున్నారు. తన శ్వాసను వదురుకునైనా సరే, బిడ్డకు శ్వాస అందించాలని కోరుకునే ప్రాణి, ఈ భూమి మీద కేవలం స్త్రీ మాత్రమే.

సమస్యల సవాళ్లు విసిరినా, సమాజం ఎగతాళి చేసినా, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, జీవితంలో ఎదురుదెబ్బలు తగిలినా, పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా, ఒడిదుడుకులు తడబడేలా చేసినా మందలో ఒకరిగా కాకుండా వందలో ఒకరిలా పేరు తెచ్చుకున్నారు. సమసమాజ నిర్మాణంలో పునాదిగా సృష్టికే ప్రతిసృష్టిగా 'స్త్రీ'ని భావించాలి.

**స్వాతంత్రోద్యమస్ఫూర్తి – తెలుగు మహిళ**

సాంఘిక సంస్కరణోద్యమాలలో 19వ శతాబ్దం నుండే మహిళలు నేతృత్వం వహించి క్రియాశీలకపాత్ర పోషించారు. గాంధీజీ ప్రధానంగా భావించిన హరిజనోద్యమం, మద్యపాన నిషేధం, వేశ్యావృత్తి నిర్మూలన, స్త్రీ జనోద్ధరణ, ఖద్దరు ధరించడం, గ్రంథాలయవిస్తరణ, దేశీయ విద్యాలయాల స్థాపన కార్యక్రమాలలో మహిళలు క్రియాశీలకంగా పాల్గొని తమవంతు బాధ్యతగా వ్యవహరించారు.

**ఎర్నేని లీలావతీదేవి**

దేశభక్తి, త్యాగనిరతి, సేవాదృక్పథం, ఉన్నత సంకల్పం కలగలిసిన సమాహారస్వరూపం ఎర్నేని లీలావతిదేవి. ఎనిమిదేళ్ళప్రాయంలోనే జాతీయోద్యమ స్ఫూర్తిపట్ల ఆకర్షితురాలై, అంకితభావంతో పనిచేసి గాంధీజీ ఆశీస్సులు, అభినందనలు పొంది, తుదిశ్వాస వరకు గాంధీజీ ఆశయాల బాటలో నడిచిన మహిళాదీప్తి ఎర్నేని లీలావతీదేవి.

1906లో కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులో వెంకటరామయ్య, వెంకమ్మ దంపతులకు 'లీలావతి' జన్మించారు. లీలావతికి ఇద్దరు అక్కలు, ఇద్దరు అన్నలు. లీలావతి పెద్దక్క శేషమాంబకి సంతానం లేకపోవడంతో లీలావతిని పెంచి పెద్దచేసి, విద్యాబుద్ధులు నేర్పించింది.

1915లో గాంధీజీ ఆంధ్ర ప్రాంతంలో పర్యటిస్తూ, కృష్ణాజిల్లా వచ్చారు. అప్పటికి లీలావతికి ఎనిమిదేళ్ళు. గాంధీజీని చూసిన లీలావతిలో తాను కూడా దేశం కోసం ఏదైనా చెయ్యాలనే ఆలోచన అంకురించింది. అక్కతోపాటు ఆమె కూడా నూలు వడకడం, ఖాదీ ధరించడం ప్రారంభించారు. కొన్నాళ్ళకు ఎర్నేని సుబ్రహ్మణ్యంతో ఆమెకు వివాహం జరిగింది. మంచి చదువరి అయిన సుబ్రహ్మణ్యానికి జాతీయోద్యమంతో, గాంధీజీతో సాన్నిహిత్యం ఉంది. పుట్టింట, మెట్టినింటా దేశాభిమానం గల వాతావరణం ఉండడంతో లీలావతీ దేవిలో జాతీయ భావాలు మరింత దృఢతరం అయ్యాయి. సుబ్రహ్మణ్యం 1930లో గాంధీజీ వెంట దండయాత్రకు వెళ్ళి, ఉప్పు వండి, శాసన ధిక్కారం చేశారు. దండిలో వండి తెచ్చిన ఉప్పును అప్పట్లో బంగారంకన్నా విలువైనదిగా పరిగణించేవారు. నాయకులు దాన్ని చిన్న పొట్లాలు కట్టి, విక్రయించేవారు. బదులుగా జాతీయాభిమానులు ఇచ్చిన డబ్బునూ, వస్తువులనూ కాంగ్రెస్ నిధికి ఇచ్చేవారు. తను ఎంతో పవిత్రంగా భావించే మెట్టెలను ఇచ్చి, మొదటి పొట్లాన్ని లీలావతి బందరులో కొన్నారు.

లీలావతి అత్తవారిది ఉమ్మడి కుటుంబం. వారి బంధువర్గంలో పదహారుమంది పురుషులు, మహిళలు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. అంగలూరులో వారి సొంత ఇల్లు వాలంటీరు శిబిరంగా; శాంతి సమర సైనికులతో కిటకిటలాడుతూ ఉండేది. దీంతో ఆ ఇంటిని బ్రిటిష్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. గాంధీజీ ఆదేశం మేరకు లీలావతి, ఆమె కుటుంబ సభ్యులు కొమరవోలు గ్రామంలో 'గాంధీ ఆశ్రమం' స్థాపించారు. అక్కడ పత్తి పండించటం, ఏకడం, వడకడం, వస్త్రం నేయించడం లాంటివి చేసేవారు. అలాగే స్వయంగా సేద్యం చేసి, పంటలు పండించేవారు. గ్రామీణులకు వైద్య సాయం కోసం ప్రకృతి చికిత్సాలయం, పశువుల కోసం ఆసుపత్రి ఏర్పాటు చేశారు. గ్రామాల మధ్య రోడ్లు, చిన్న వంతెనల నిర్మాణం, పాత చెరువుల మరమ్మతు లాంటి కార్యక్రమాలు చేపట్టారు. దేశంలో 1932లో శాసనోల్లంఘన మరింత ఉద్రిక్తంగా సాగింది. లీలావతీదేవి కుటుంబాన్ని ఒక విప్లవ దళంగా నాటి ప్రభుత్వం భావించింది. బంధుమిత్ర సపరివారంగా అరెస్ట్ చేసింది. లీలావతిని, ఎనభయ్యేళ్ళ ఆమె అత్తగారు పుల్లమ్మగారికి, తోటికోడలు అమృతమ్మకు ఏడాది చొప్పున శిక్ష విధించి, కన్ననూరు జైలుకు పంపింది. వారి ఆశ్రమాన్ని పోలీసులు ధ్వంసం చేసి, సీళ్ళు వేశారు.

1935లో పునఃప్రారంభమైన ఆశ్రమ కార్యకలాపాలను రెండేళ్ళు వార్ధా ఆశ్రమంలో శిక్షణ పొందిన లీలావతి మరింత విస్తృతపరిచారు. హిందీ టీచర్ ట్రైనింగ్ తరగతులు మొదలుపెట్టారు. గ్రామంలో దళితులకు నీటి వసతి కల్పించారు. మండవల్లిలో మరో ఆశ్రమం స్థాపించి, దళిత హాస్టల్ నెలకొల్పారు. వార్ధా ఆశ్రమంలో చెప్పులు కుట్టడం నేర్చుకొని; కొమరవోలు ఆశ్రమంలో లీలావతీదేవి దంపతులు ఇరవై జతలకు పైగా కుట్టడం ఆ రోజుల్లో గొప్ప సంచలనం. కఠినమైన నియమాలకు అనుగుణంగా ఆశ్రమ జీవితం గడపడమే కాకుండా తన బిడ్డలను కూడా అదే రీతిలో లీలావతి తీర్చిదిద్దారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమసందర్భంగా ఉధృతంగా శాసన ధిక్కారం, సత్యాగ్రహాలు చేసిన లీలావతి కుటుంబాన్ని పోలీసులు అరెస్ట్ చేసి, వేర్వేరు జైళ్ళకు పంపారు. లీలావతీదేవితో పాటు ఆమె పదమూడేళ్ళ కుమార్తె కూడా రాయవేలూరు జైల్లో ఆరు నెలల శిక్ష అనుభవించింది. 1944లో ఆమె చిన్న కుమార్తె ప్రఫుల్ల కుమారి తల్లివెంట జైలుకు వెళ్ళింది. ఇలా తన పిల్లలను కూడా జాతీయోద్యమంతో ఆమె మమేకం చేశారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా ఆమె జీవన విధానంలో మార్పేదీ రాలేదు. ఎలాంటి పదవులు, ఆర్థిక మద్దతు, సన్మానాలు ఆమెను వరించలేదు. ఆమె కూడా వాటిని ఆశించలేదు. తాను సృష్టించుకున్న ఆశ్రమ జీవితంలో శ్రమదానాన్ని కొనసాగించారు. కేవలం 45 సంవత్సరాలే జీవించి, 1951 నవంబరులో ఆమె మరణించారు. ఏడుగురు బిడ్డల తల్లిగా, గృహిణిగా, ఆశ్రమ నిర్వాహకురాలుగా, దేశ సేవికగా ఇలా అనేక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించిన లీలావతి తాను చేపట్టిన ప్రతి పాత్రకూ వన్నె తెచ్చారు.

**దేశబాంధవి – దువ్వూరి సుబ్బమ్మ**

దువ్వూరి సుబ్బమ్మ 1880లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, పంచారామాలలో ఒక్కటైన ద్రాక్షారామంలో జన్మించింది. ఆంధ్రరాష్ట్రం నుండి స్వాతంత్ర్య యుద్ధంలో మార్గదర్శిగా పనిచేసిన మహిళామణులలో దువ్వూరి సుబ్బమ్మ గారిది అగ్రతాంబూలం. భారతీయమహిళలలో ఉద్యమ శిక్షణ పొందిన వారిలో దువ్వూరి సుబ్బమ్మ కీలకపాత్ర పోషించారు. తనదైన వ్యక్తిత్వంతో 1922లో ఉద్యమానికి నాయకత్వం వహించి బ్రిటీష్ ప్రభుత్వాన్ని గడగడలాడించింది. బ్రిటీష్ ప్రభుత్వం దువ్వూరి సుబ్బమ్మను అరెస్టుచేసి సంవత్సరం పాటు జైలుశిక్ష విధించారు. ఈ జైలుశిక్షని దువ్వూరి సుబ్బమ్మ రాజమండ్రిలో అనుభవించారు. విడుదలయ్యాక కూడా తన సంకల్పాన్ని దృఢపరచుకుని ఉప్పు సత్యాగ్రహంలో చురుకుగా పాల్గొని అరెస్ట్ అయి నెల్లూరు జైలులో 6 నెలలపాటు శిక్ష అనుభవించింది. కారాగారవాసం పూర్తయ్యాక మరింత ఉత్సాహంతో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని పెద్దాపురంలో లాఠీఛార్జీకి గురయింది.

1923లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్‌సభలో దువ్వూరి సుబ్బమ్మకి 'దేశబాంధవి' బిరుదుతో గౌరవించడం జరిగింది. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సభ్యురాలుగా 16 వసంతాలు క్రియాశీలకంగా బాధ్యతలు నిర్వర్తించారు. 1964లో దువ్వూరి సుబ్బమ్మ అస్వస్థతకు గురయ్యారు. ఆ సమయంలో నెహ్రూ మరణించాడన్న వార్త విని మానసికంగా క్రుంగిపోయి 31-5-1964 పరమపదించిన ధన్యజీవి దువ్వూరి సుబ్బమ్మ.

**ఉన్నవ లక్ష్మీబాయమ్మ**

తెలుగులో తొలి సామాజిక నవల ఉన్నవ లక్ష్మీనారాయణ గారి 'మాలపల్లి'. ఈ నవలకే 'సంఘ విజయం' అని కూడా నామాంతరం. ఉన్నవ లక్ష్మీనారాయణ శ్రీమతి ఉన్నవ లక్ష్మీబాయమ్మ జాతీయోద్యమ నాయకురాలిగా ఎన్నో వితంతు వివాహాలను ప్రోత్సహించింది. లక్ష్మీబాయమ్మ నడింపల్లి సీతారామయ్య, రామలక్ష్మమ్మ దంపతులకు 1882లో గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం, అమీనాబాదు గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించింది. కుటుంబంలో అందరికంటే చిన్నది కాబట్టి అభ్యుదయభావాలతో పాటు సంప్రదాయ భావాలను అలవర్చుకుంది. ఉన్నవ దంపతులు గుంటూరు జిల్లాలో 1902లో వితంతు శరణాలయం స్థాపించి వితంతు పునర్వివాహాలు జరిపించారు. 1918లో ఉన్నవ లక్ష్మీబాయమ్మ దేశభక్త కొండా వెంకటప్పయ్య ఇంట్లో వయోజనులైన స్త్రీలకు తీరికవేళల్లో విద్యాబోధన, చేతిపనులు నేర్పేందుకు ఒక పాఠశాలను ప్రారంభించారు. ఈ పాఠశాల

నేడు 'శారదానికేతన్'గా వర్ధిల్లుతూ ఎంతో మంది బాలికలకు విద్యాకేంద్రం అయింది. జాతీయ విధానంలో స్త్రీవిద్య వ్యాప్తి చేయాలని ఆకాంక్షించింది. విదేశీవస్త్ర, వస్తు బహిష్కరణలకు ఉన్నవ లక్ష్మీబాయమ్మ పిలుపునిచ్చింది. సంస్థకు చెందిన బాలికలతో పాటు స్వయంగా లక్ష్మీబాయమ్మ నూలు వడికి ఖాదీని ధరించేది. లక్ష్మీబాయమ్మ సత్యాగ్రహంలో పాల్గొని 3 సార్లు అరెస్టుకాబడి జైలుశిక్ష కూడా అనుభవించింది. దేశసేవిక, సంఘసంస్కరిణి లక్ష్మీబాయమ్మ తన 74వ ఏట 1956లో స్వర్గస్తురాలయ్యింది.

**ఆచంట రుక్మిణమ్మ**

సుప్రసిద్ధ ఆయుర్వేదవైద్యులు ఆచంట లక్ష్మీపతి భార్య. ఆచంట రుక్మిణమ్మ సంఘ ఆచారాలను ఎదిరించి వివాహం చేసుకుంది. స్త్రీల చదువుకి ప్రోత్సాహం లేని కాలంలో పట్టభద్రురాలైంది. 1926 పారిస్‌లో జరిగిన 'ఇంటర్నేషనల్ విమెన్స్ సఫ్రేజ్ అలయన్స్ కాంగ్రెస్" సభకు భార్య ప్రతినిధిగా హాజరయ్యారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, జైలుకెళ్లిన తొలిమహిళా జట్టుగా చరిత్రలో నిలిచిపోయారు. 'క్విట్ ఇండియా ఉద్యమంలో కారాగారవాసం అనుభవించింది. ప్రకాశం గారి మంత్రివర్గంలో ఆరోగ్యశాఖామంత్రిగా కీలకపదవిని అలంకరించి ప్రజల సేవలో తరించారు. గుంటూరు మెడికల్ కాలేజ్ ఏర్పాటుకి కీలకంగా వ్యవహరించారు ఆచంట రుక్మిణమ్మ.

**భండారు అచ్చమాంబ**

తొలి తెలుగు కథారచయిత్రి భండారు అచ్చమాంబ. "ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ నిర్మాత కొమర్రాజు వేంకట లక్ష్మణరావు సోదరి భండారు అచ్చమాంబ. అచ్చమాంబ గురజాడ కన్నా ముందే 1902 నవంబరు నెలలో 'ధనత్రయోదశి' కథను హిందు సుందరి పత్రికలో ప్రచురించారు. అచ్చమాంబ 1874 సంవత్సరంలో కృష్ణాజిల్లా నందిగామ దగ్గర పెనుగంచిప్రోలులో కొమర్రాజు వెంకటప్పయ్య, గంగమ్మ దంపతులకు పుట్టింది. అచ్చమాంబ తొలి స్త్రీవాద చరిత్రకారిణి. మహిళాభ్యుదయానికి తొలి విదూషిణి అచ్చమాంబ. 1902లో ఓరుగంటి సుందరీ రత్నమాంబతో కలిసి మచిలీపట్నంలో మొదటి మహిళా సమాజం "బృందావన స్త్రీల సమాజం"ను స్థాపించింది. 'అబలా సచ్చరిత్ర రత్నమాల' రచించింది. మహిళోద్ధరణకై కృషిచేసిన మహిళామణి అచ్చమాంబ.

**తల్లాప్రగడ విశ్వసుందరమ్మ**

1899 మార్చి 6న ప.గో.జి. ఉండిలో జన్మించి తల్లాప్రగడ నరసింహశర్మను వివాహమాడిన విశ్వసుందరమ్మ శాసన ధిక్కార ప్రథమదళంలో ఉన్నారు. విదేశీ వస్తుబహిష్కరణ దహనం, అస్పృశ్యతా నివారణ, స్త్రీ జనాభ్యుదయాలలో చురుకుగా పాల్గొన్నారు. 1930లో ఉప్పు సత్యాగ్రహం చేసి జైలుకెళ్లింది. క్విట్ ఇండియా ఉద్యమంలో ఉండగా రాజమండ్రి గోదావరి గట్టున ఏర్పాటు చేసిన ఆనంద నికేతనాశ్రమంపై పోలీసులు దాడిశారు. మంచి కవయిత్రి, రచయిత్రి అయిన ఈమెను ఆచంట జానకిరాం బాగా మెచ్చుకొనేవారు. ఎన్నో ప్రబోధ గీతాలు రాసి స్త్రీలకూ ఉత్తేజం కలిగించారు.

వీరేకాక కందుకూరి రాజ్యలక్ష్మి, సంగెం లక్ష్మీబాయమ్మ, ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ, బోయపాటి సుభద్రాదేవి, బుర్రా దేవేంద్రనాథం గారి భార్య సూరమాంబ, దాసు శ్రీరాములు గారి కుమార్తె వేమూరి శారదాంబ, శెట్టి లక్ష్మీ నరసింహంగారి సోదరి సీరం సుభద్రమాంబ, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారి శిష్యురాలు పులుగుర్త లక్ష్మీనరసమాంబ, శ్రీమతి జూలూరి తులసమ్మ, కోటికలపూడి సీతమ్మ, కళ్ళేపల్లి వెంకట నరసమ్మ మొదలైన వారు మహిళాభ్యుదయానికి వారి వికాసానికి గొప్ప కృషిచేసి, తమ రచనల చేతనూ ప్రభావితం చేశారు. గాంధీగారి ఆదేశానుసారం హిందీనేర్చి, బోధించి, వ్యాప్తి చేశారు. గ్రామ సేవికలుగా మహిళలకు శిక్షణనిచ్చి సమాజసేవ చేయించారు. వీరందరి త్యాగఫలితమే మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం. ఆ త్యాగమూర్తులను స్మరిస్తూ పొందుతూ, అభ్యుదయ భారతానికి, రాష్ట్రసర్వతోముఖాభివృద్ధికి మహిళామ తల్లులు పునరంకితం కావాలి.

# స్వాతంత్ర్యోద్యమంలో – మహిళా చైతన్యం

డా॥ ఎన్. సూర్యకాంతి, అసోసియేట్ ప్రొఫెసర్, ఆరోరా డిగ్రీ & పీజీ డిగ్రీ కళాశాల, హైదరాబాదు. చరవాణి : 96666 43471.

భారతదేశ చరిత్రలో చారిత్రాత్మక ఘట్టాలలో ప్రాముఖ్యమైనది భారత జాతీయోద్యమం. దాదాపు 150 సం॥ల అవిశ్రాంత పోరాటం బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం భారతీయుల ఐక్యపోరాటం ఇది. భారతీయుల పట్ల వివక్షత, వారి కబంద హస్తాల నుండి విడివడుటకు భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడి మహాసభలను సమావేశాలను నిర్వహించుకొని జాతీయ భావాలను ప్రజల సమస్యలను తెలుసుకొని ఆ సమావేశాలలో వారి పరిష్కార మార్గాలను ప్రతిపాదనలు పంపడం జరిగాయి. అయితే ఇవి ఏ ఒక్క ప్రాంతానికో, సమాజానికో, వర్గానికో కాక భారత ప్రజలకు చెందినవిగా ఉండాలనే భావన వారిలో ఉంది. ప్రజలందరి భావనను కలుగజేయాలనే ఉద్దేశ్యంలో ఉన్నారు. అప్పటి నాయకులంతా కలిసి మొదట డెబ్బై రెండు మందితో మొదలైన ఈ సమావేశాలు అతి తొందరలో వేలసంఖ్యలోకి పెరిగింది. వాళ్ళలో ఎక్కువగా న్యాయవాదులు, పాత్రికేయులు, వ్యాపారస్థులు, పారిశ్రామికవేత్తలు, భూస్వాములు ఉండేవాళ్ళు. మహిళలు చాలా తక్కువ అయితే పురుషులు అధికసంఖ్యలో పాల్గొనేవారు. సమావేశాలు, ఉపన్యాసాలు, తీర్మాణాలు, దినపత్రికలు ప్రభుత్వానికి వినతి పత్రాలివ్వటానికి ప్రతినిధులుండేవారు. ఉద్యమం బలోపేతం కావడంతో మహిళలు విద్యార్థులు కూడా చురుకుగా పాల్గొంటుండేవారు. విదేశీ వస్తువులను బహిష్కరించుట, విదేశీయుల ఇండ్లలో పనులు చేయటానికి నిరాకరించుట చేశారు.

భారత స్వాతంత్ర్యోద్యమం, వందేమాతరఉద్యమం 1905 హోంరూల్ ఉద్యమం 1916 సహాయ నిరాకరణోద్యమం (1920–29), శాసనోల్లంఘన ఉద్యమం (1930–32), క్విట్ఇండియా ఉద్యమం (1942). ఇన్ని దశలుగా సాగిన ఉద్యమం లో క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రజలు తమకు తాము స్వతంత్రంగా ప్రకటించుకోవాలనుకున్నారు. అనేకమంది నాయకులు, విద్యార్థులు ప్రభుత్వ ఆస్తులపై దాడిచేశారు. పోస్టాఫీసు, రైలుపట్టాలు, రైలు బోగీలు, అనేక ప్రభుత్వ కార్యాలయాలపై దాడిచేశారు. కొన్ని ప్రాంతాల్లో బ్రిటీష్ అధికారులెవ్వరూ కనపడలేదు. అయితే ఎంతో విలువైన ఆస్తులు ధ్వంసమయ్యాయి. ఎంతోమంది పోలీసులు, సైనికుల చేతుల్లో ప్రజలు చనిపోయారు. వేలమంది జైలుపాలయ్యారు. ఈఉద్యమంలో భారతప్రజలు జాతి, కుల, మతబేధం లేకుండా లింగబేధము లేకుండా ఈ గడ్డపై పుట్టిన ఎంతోమంది పాల్గొన్నారు. చాలాచోట్ల మేము సైతం అంటూ ఎంతోమంది మహిళామణులు ఉత్తేజంగా పాల్గొన్నారు. వారిలో కొంతమందిని గురించి ప్రస్తావించవలసిన ఆవశ్యకత ఉంది. వేదకాలం నుండి ఆధునికకాలం వరకు భారతీయ మహిళలు సమాజంలో బాధ్యతను కలిగివున్నదనటం అతిశయోక్తి కాదు.

భారతీయ సమాజం స్త్రీని దేవతగా, మాతృమూర్తిగా, సోదరీమణిగా, ముద్దుల తనయగా, గృహిణిగా, అత్తింటి కోడలుగా తగిన ఆదరణను చూపి గౌరవించింది. స్త్రీ త్యాగమూర్తిగా, వినయవతిగా, విద్యావతిగా, ఆధ్యాత్మశీలిగా, వీరవనితగా నిలిచి ఆదరణ, ఆత్మీయత అనురాగాలను సమాజానికి పంచి ప్రపంచ మహిళలకే ఆదర్శంగా నిలిచింది. ప్రాధాన్యతను యమకింకరుల వంటి ఆంగ్ల సిపాయిలకు భయపడక, ఉప్పుసత్యాగ్రహం, నాన్ కోఆపరేషన్, స్వదేశీ, క్విట్ఇండియా ఉద్యమా లలో పాల్గొని, జైలుకు వెళ్లినవారు, ఖాదీఉద్యమంలో పాల్గొని, కల్లు దుకాణాలను ముట్టడించి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఆశ్రమాలను తిరిగి స్వాధీనం చేసుకున్నవారు మరెందరో! విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమంలో నాయకులంతా జైళ్లపాలైనప్పుడు శ్రీమతి దుర్గాబాయి, అవంతికాబాయ్, గోఖలే, రాజకుమారి అమృతకౌర్, సరోజినీనాయుడు, సుశీలా నయ్యర్, లీలావతి మున్నీ, కమలాబాయి ఛటోపాధ్యాయ వంటి నారీమణులు సత్యాగ్రహాలు నడిపించి పరాయి పాలకులను గడగడలాడించి అందరినీ ఆశ్చర్యచకితులను చేశారు.

**1. మాగంటి అన్నపూర్ణ దేవి :** ఆంధ్రప్రదేశ్‌లో ఖాదీ కట్టిన మొదటి మహిళే కాదు, ఒంటిమీద నగలన్నింటినీ గాంధీగారికి సమర్పించిన మొదటి మహిళ కూడ శ్రీమతి మాగంటి అన్నపూర్ణదేవి కావడం విశేషం. 1900 మార్చిలో పశ్చిమ గోదావరిజిల్లా ఏలూరులో అన్నపూర్ణాదేవి జన్మించారు. శ్రీమతి కలగార పిచ్చమ్మ, కలగార రామస్వామి దంపతులు ఆమె తల్లిదండ్రులు. స్వాతంత్ర్య సమరయోధులైన తల్లిదండ్రులు తాహతు లేకపోయినా ఏకైక కూతుర్ని చదువు నిమిత్తం కలకత్తా పంపించారు. ఆర్థర్

ఆమెకు విద్యాబుద్ధులు నేర్పించారు. 1921నాటికి అన్నపూర్ణదేవి దువ్వూరి సుబ్బమ్మగారిలా ఉపన్యసించి జనాన్ని ఆకట్టుకున్నారు. 1923లో అన్నపూర్ణదేవి భర్త మాగంటి బాపినీడు అమెరికా నుంచి స్వదేశానికి తిరిగి వచ్చారు. విదేశీ వస్త్రాలు వదిలి ఖాదీ కట్టారు. ఖాదీఉద్యమంలో విదేశీ వస్త్ర, వస్తు బహిష్కరణలో పాల్గొన్నారు. ఐదుసార్లు జైలుకు వెళ్ళివచ్చారు. నిద్రాహారాలు మాని ఉద్యమంలో వస్తున్న అన్నపూర్ణ దేవి ఆరోగ్యం దెబ్బతింది. అయినా ఆమె కార్యకలాపాలు ఆపలేదు. చివరకు 1927 సం॥లో మార్చి 9న అన్నపూర్ణదేవి పరమపదించారు. గాంధీగారు తన సొంత కుమార్తె చనిపోయిందని బాధపడ్డారు.

**2. చుండూరి రత్నమ్మ :** ఆత్మ, త్యాగము, స్వధర్మ దీక్ష మనకు ఆదర్శమంటూ చుండూరి రత్నమ్మగారి వాసవీ కన్యగాను స్త్రీలకు ప్రబోధం చేసేవాడు. 1932లో ఏలూరులో శాసన్‌ల్లంఘనంలో రత్నమ్మగారు పాల్గొన్నారు. అరెస్టు చేసి రాయవెల్లూరు జైలుకు పంపించారు. అక్కడ ఆజైలులో ఆమెకు చంద్రమ్మ, ఓరుగంటి మహాలక్ష్మమ్మ, మద్దాల కామయమ్మ మొదలైన వారితో రత్నమ్మగారికి స్నేహం ఏర్పడింది. 1892 ఫిబ్రవరి 7వ తేదీన కాకినాడలో రత్నమ్మగారు, వెంకటచలపతిరావు గారు పెద్ద జమీందారుగారికి జన్మించారు. ఆయన గొప్ప గాంధేయవాది. 21-12-1920 నాడు పెద్దాపురంలో జరిగిన లాల్‌చార్జీలో ఆయనను పోలీసులు నేలమీద పడేసి లాఠీచార్జి చేశారు. అది పార్లమెంటులో కూడ చర్చనీయమైన సంచలనం కల్గించింది. 1901లో ఆమెకు 9వ ఏట చుండూరి శ్రీరాములు శాస్త్రిగారితో వివాహం జరిగింది. ఆయన వీరేశలింగం పంతులుగారి శిష్యులు. సంస్కృతం, ఆంధ్ర హిందీ భాషలు భార్యను చదువుకోవాలని ప్రోత్సహించారు. స్త్రీలకు ఆభరణాలు ముఖ్యంకాదని సరస్వతీ ఆలయాలు ముఖ్యమని ప్రబోధించారు. మూఢనమ్మకాలు తొలగాలని కులాల పేరుతో వసతిగృహాలు పనికి రావని నిరసన వ్యక్తం చేశారు. 1932లో సత్యాగ్రహం చేసి జైలుకు వెళ్లారు. 1940లో వ్యష్టి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఈ సత్యాగ్రహంలో పాల్గొని వేలూరులో అరెస్టయ్యి ఆరు నెలలు జైలుశిక్ష అనుభవించారు. 1940లో ఏలూరు మున్సిపల్ సంఘ అధ్యక్ష పదవేకాక అనేక పదవులు చేశారు.

**3. సరోజినీ నాయుడు :** భారత జనకుడైన మహాత్మాగాంధీ రాజకీయ వ్యవహారాలలో నీతి ప్రయుక్తం చేశాడు. సరోజినీదేవి తన కళావైద్యరంగంలో మెరుగులు దిద్ది వాటికి మరింత శోభను చేకూర్చింది. సరోజినీదేవి వంటి బిడ్డ ఈ గడ్డపై మరోసారి జన్మిస్తుందా? గంభీరమైన వాక్కుతో స్వభావసిద్ధమైన పట్టుదలతో గాంధీజీ సిద్ధాంతాలను పూర్తిగా అర్థం చేసుకొని మానవత్వాన్ని పెంపొందించుకొని సంస్కార హృదయంతో ఆసేతు హిమాచలం తిరుగుతూ జనసమూహాన్ని ఉత్తేజపరచి ఉద్యమాన్ని నడిపిస్తూ, పరాయి పాలకులను భారతదేశం వదలి వెళటానికి కారణభూతురాలైన మహామనిషి సరోజినీదేవి. మహాత్మాగాంధీ ప్రారంభించిన కార్యరంగంలో పాల్గొంటూ తల్లిగా, తనయగా బాపూజీని ఆదరించిన సేవామూర్తి ఆమె. అన్ని మతాలవారిని గౌరవిస్తూ, నీరసులకు అసహాయులకూ అండగా నిలిచిన స్త్రీమూర్తిఆమె. తూర్పు బెంగాల్‌లో కులీన బ్రాహ్మణవంశంలో పుట్టిన అఘోరనాథ్ చటోపాధ్యాయకు, వసుంధరాదేవికి 1873 ఫిబ్రవరి 13వ తేదీన సరోజినీదేవి జన్మించింది. సరోజినీదేవి ఆంగ్లవిద్యాభ్యాసము చేయ ప్రారంభించింది. ఆమె 11సం॥లు ఉన్నప్పుడు ఆల్జీబ్రా చేస్తుంటే ఆవిడ నోటమ్మట కవిత వెలువడింది. ఆ కవిత ఆమెకు గొప్పఆనందాన్ని కలిగించింది. తరువాత 13వ ఏట గొప్ప గీతము వ్రాయుటచే ఆమెకు కవయిత్రిగా గుర్తింపు వచ్చింది. చిన్నతనం నుంచి ఆమె కొంచెం అనారోగ్యంగా ఉండేది. ఒకసారి అనారోగ్యంగా ఉండగా హఠాత్తుగా లేచి 1300 పంక్తుల కవిత రాసింది. ఆవిధంగా కవితారంగంలో ప్రవేశం లభించింది. కానీ ఆమె ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఆమె చదువు చాలించి స్విట్జర్లాండు బయల్దేరివెళ్లింది. ఆ ప్రకృతసౌందర్యంలోలీనమై మరిన్ని కవితలు రాసింది.

వీరు ప్రస్తుతకాలంలో ఉన్న సమస్యలను ఇతివృత్తంగా తీసుకొని వివిధ ప్రక్రియలలో రచనలు చేశారు. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలోని స్త్రీల పాత్రలను పోరాటస్ఫూర్తిగా రచించారు. కవిత్వం, కథ, నవల, కథానిక, ప్రక్రియలో స్త్రీవాదాన్ని బలంగాతెలిపారు. స్త్రీలు ఎదుర్కొంటున్న కష్టాలను సమాజంలో వీరిపై ఉన్న చిన్నచూపు సమానత్వంవంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని రచనలు చేశారు. స్త్రీలపై చేసే వివక్షతను, స్త్రీలు ఎదుర్కొనే విధానాన్ని ఆధునిక రచయితలు చక్కగా వర్ణించారు. స్త్రీలజననం, వివాహం, చదువు, ఉద్యోగంవంటి విషయాలలో పురుషుల నుండి ఎదుర్కొనే సవాళ్ళను కవిత్వంలో వర్ణించారు. స్త్రీలకు ఉన్న హక్కులను పురుషులతో సమానంగా ఉండాలని ప్రశ్నించారు. స్త్రీవాద రచయిత్రులు ప్రాచీనకాలంలోని కవులు చేసిన

సౌందర్యాత్మక, శారీరక వర్ణనను వ్యతిరేకించారు. ప్రాణ కవయిత్రులు రాజుల చరిత్రలను పురాణ కావ్యాలలోని ఇతివృత్తాలను తీసుకొని వర్ణనలు చేశారు. స్త్రీలకు చదువు, వివాహం, ఉద్యోగం విషయంలో స్వంతంగా నిర్ణయాలు తీసుకొనే స్వేచ్ఛ ఉండాలని రచనల్లో వివరించారు.

**ముగింపు :** ఒక దేశ అభివృద్ధికి అభ్యుదయానికి జరిపే కృషిలో ప్రతీఅడుగులో కూడ ఆ దేశ స్త్రీలశక్తిని, సామర్థ్యాలను వాడుకున్నప్పుడే ఆదేశం అభివృద్ధిపథంలోకి నడుస్తుంది అని మహాత్మాగాంధీ విశ్వసించారు. 1937వ సంవత్సరంలో గాంధీ నాయకత్వంలో సత్యాగ్రహంలో స్వతంత్రం కోసం జరిపిన అహింసా పోరాటంలో ఇటువంటి స్త్రీలు ఎందరో పాల్గొన్నారు. స్వతంత్ర్యం అంటే అన్ని దశల్లోనే ముందుకు నడవడం, అభివృద్ధి చెందడం, అది మహిళల అభివృద్ధితోనే సాధ్యమవుతుందని వీరందరూ ప్రపంచానికి చాటిచెప్పారు. మహాత్మాగాంధీ పిలుపునందుకుని కులమతభేదాలు వదిలి, బీద, ధనిక భేదాలు లేక స్వార్థాన్ని పక్కకు నెట్టి త్యాగశీలులై కొండంత హృదయంతో జాతీయోద్యమంలో ప్రధానపాత్రను వహించి భరతమాత దాస్య శృంఖలాలను పగులగొట్టిన ఘనత మహిళలకు దక్కింది. “జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి” అన్న సత్యాన్ని నిరూపించారు భారతీయ మహిళలు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా. శాస్త్రి
2. తెలుగులో కవిత్వోద్యమం – తెలుగు అకాడమీ
3. భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు స్త్రీలు – డా॥ వాసా ప్రభావతి
4. భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు మహిళల పాత్ర – డా॥ అక్కిరాజు రమాపతిరావు

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమంలో మహిళల పాత్ర – పరిశీలన

**డా॥ సీతా విజయులు రెడ్డి,** ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కార్వేటినగరం – 517 582. చరవాణి : 94400 79121.
**డా॥ వెంకటేశన్ పూజారి,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కార్వేటినగరం – 517 582. చరవాణి : 94940 65510.

**పరిచయం :** స్వతంత్ర భారతావనిలో 75 వసంతాల వజ్రోత్సవ వేళ స్వాతంత్ర సమరయోధుల గురించి తెలుసుకునే ముందు మన మహిళా స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలుసుకోవడం ఎంతైనా అవసరం. శారీరకంగా కాక మానిసికపరంగా చూసినప్పుడు స్త్రీలే శక్తిమంతులని మహాత్మా గాంధీగారి అభిప్రాయం. 'నేను' స్త్రీ పక్షపాతినని మీరనుకున్నా నాకభ్యంతరంలేదుగానీ, మీరే స్వీయ పరిశీలన చేసి చూడండి. స్త్రీనైనా పురుషుడినైనా స్త్రీయే కనాలి. అలాకాక స్త్రీలను స్త్రీలు కనండి, పురుషులను పురుషులు కంటామని చెప్పడానికి వీలు లేదు కదా! ఇప్పుడు కొన్ని పదప్రయోగాలు చూద్దాం. ప్రకృతీ పురుషులు, స్త్రీ పురుషులు, తల్లిదండ్రులు వీటన్నిటిలో స్త్రీవాచకమే ముందు. అర్ధనారీశ్వర పదప్రయోగంలో కూడా 'నారీ' ముందు తరువాతే ఈశ్వరుడు. పలుకే పార్వతి. పలుకులోని అర్థమే పరమేశ్వరుడు. ధ్రువీకరణకు క్రింది శ్లోకాన్ని చూద్దాం.

"వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే ।
జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ ॥"

ఈ శ్లోకం అనాదికాలము నుంచి పెళ్లి పత్రికలలో శీర్షికగా ఉండడం భారతీయ సాంప్రదాయంగా తెలుస్తోంది. ఇందులో ప్రకృతీ పురుషులే పార్వతీ పరమేశ్వరులనీ, దంపతులు ఇరువురూ ఏకాభిప్రాయంతో జీవించాలని చెబుతూ తల్లి (స్త్రీ) ప్రధానపాత్రగా వేదప్రామాణికం. ప్రకృతి లేకుంటే ప్రపంచానికి ఉనికి లేదు – అమ్మ లేకుంటే జన్మే లేదు. ఈ కారణాల చేత 75 వసంతాల వజ్రోత్సవ వేళ స్వతంత్ర భారత పోరాటంలో కదనరంగంలో కదం తొక్కిన కొంతమంది మహిళల గురించి సంక్షిప్తంగా తెలుసుకుందామా!

**స్వతంత్ర్యోద్యమంలో మహిళలు**

v **వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి :** పాఠశాల స్థాయి పాఠాలలో మనలోని ఉత్సాహాన్ని ఉరకలెత్తించిన మహిళ ఝాన్సీ లక్ష్మీబాయి. ఈమె పేరు వింటేనే ఇప్పటికీ మన శరీరము రోమాంచిత పులకాంకితమవుతుంది. స్వతంత్ర సమరంలో బ్రిటీష్ సేనలతో పోరాడిన వీర నారీమణులలో ముఖ్యంగా తెలుసుకోదగిన మహిళ ఝాన్సీ లక్ష్మీబాయి. ఈమెకు చిన్న వయస్సులోనే గంగాధరరావుతో వివాహం జరిగిందని, కొంతకాలానికే భర్త మరణించినా, చంటి బిడ్డను వీపున కట్టుకుని ఈమె కదనరంగంలో కదం తొక్కిన విషయం నాటి ఉపాధ్యాయులు చెప్పిన వైనం నేటికీ కళ్ళముందు కదలాడుతున్నట్లున్నది.

v **సరోజినీ నాయుడు :** భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో వినిపించే మరో వీరనారీమణి సరోజినీ నాయుడు. స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి. అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు తొలి మహిళా గవర్నర్. 1879 ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో ఆమె జన్మించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆమె పాత్ర మరువలేనిది. క్విట్ ఇండియా ఉద్యమంలోనూ ఆమె చురుకుగా పాల్గొన్నారు. ఈమెకు భారతకోకిల అనే బిరుదు కూడా ఉంది. ఆమెను నైటింగేల్ ఆఫ్ ఇండియా అని పిలుస్తారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన అత్యంత ప్రభావవంతమైన ప్రముఖ మహిళా స్వాతంత్ర్య సమరయోధులలో ఆమె ఒకరు.స్వతంత్ర కవయిత్రి, కార్యకర్త. శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమంలో ఆమె చాలా ముఖ్యమైన పాత్ర పోషించింది. దాని కోసం ఆమె జైలు శిక్షను కూడా అనుభవించింది. ఆమె అనేక నగరాలకు వెళ్లి మహిళా సాధికారత, సామాజిక సంక్షేమం మరియు స్వేచ్ఛ యొక్క ప్రాముఖ్యత గురించి ఉపన్యాసాలు ఇచ్చింది. భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మారిన రెండవ మహిళ ఈమె. 1949లో గుండెపోటుతో మరణించినప్పటికీ, భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆమె చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

v **బేగం హజ్రత్ మహల్ :** బేగం హజ్రత్ మహల్ భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ మహిళా స్వాతంత్ర్య సమరయోధులలో ఒకరు. 1857లో తిరుగుబాటు ప్రారంభమైనప్పుడు బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడటానికి వారి గొంతులను పెంచడానికి

గ్రామీణ ప్రజలను ఒప్పించిన మొదటి స్వాతంత్ర్య సమరయోధులలో ఆమె ఒకరు. ఆమె తన కుమారుడిని ఔద్ రాజుగా ప్రకటించి లక్నో నియంత్రణను చేపట్టింది. ఇది అంత తేలికైన యుద్ధం కాదు, బ్రిటీష్ ప్రభుత్వం లక్నో నియంత్రణను రాజు నుండి స్వాధీనం చేసుకుంది.

v **కిత్తూరు రాణి చెన్నమ్మ :** భారతదేశ స్వాతంత్ర్యంలో ఒక ప్రముఖ వ్యక్తి. ఆమె పేరు మనలో చాలామందికి తెలియదు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన కొద్దిమంది భారతీయ పాలకులలో ఆమె ఒకరు. తన కొడుకు, భర్త మరణించిన తరువాత ఆమె తన రాజ్య బాధ్యతను స్వీకరించవలసి వచ్చింది. ఆమె బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా పోరాడి తన రాజ్యాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నించింది. ఆమె సైన్యానికి నాయకత్వం వహించి యుద్ధరంగంలో ధైర్యంగా పోరాడింది. దురదృష్టవశాత్తు కిత్తూరు రాణి చెన్నమ్మ యుద్ధభూమిలో మరణించింది. ఆమె ధైర్యసాహసాల వెలుగు ఇప్పటికీ దేశంలో ప్రసిద్ధి చెందింది. ఆమె కర్ణాటకలో ధైర్యవంతురాలిగా గుర్తుండిపోతుంది.

v **అరుణా అసఫ్ అలీ :** ఉప్పు సత్యాగ్రహంలో అరుణా అసఫ్ అలీ ప్రధాన పాత్ర పోషించారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో ఆమె పాల్గొనడం వల్ల జైలు శిక్ష కూడా అనుభవించారు. ఆమె జైలు నుండి విడుదలైనప్పుడు, క్విట్ ఇండియా ఉద్యమానికి నాయకత్వం వహించింది. ఇది భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మహిళలు ఎంత నిర్భయంగా ఉన్నారో చూపిస్తుంది. తీహార్ జైలులో ఉన్న రాజకీయ ఖైదీల హక్కుల కోసం కూడా ఆమె పోరాడారు. దీనికోసం ఆమె నిరాహార దీక్షను ప్రారంభించింది. ఇది ఖైదీల పరిస్థితులను మెరుగుపరిచేందుకు దారితీసింది. ఆమె ధైర్యవంతురాలైన మహిళ ఆమె బ్రాహ్మణ కులంలో పుటిటనా ముస్లీం వ్యక్తిని వివాహం చేసుకుంది.

v **సావిత్రీబాయి పూలే :** సావిత్రీబాయి పూలే భారతదేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు. మొదటి భారతీయ బాలికల పాఠశాల స్థాపకురాలు. “మీరు అబ్బాయికి విద్యను అందిస్తే ... మీరు ఒక వ్యక్తికి విద్యను అందిస్తారు, కానీ మీరు ఒక అమ్మాయిని చదివిస్తే, మీరు మొత్తం కుటుంబాన్ని చదివిస్తారు”. ఈ కొన్ని మాటలు ఆమె అనుసరించిన భావజాలాన్ని తెలియజేస్తాయి. ఆమె ప్రయాణంలో ఆమె భర్త జ్యోతిరావుపూలే ఆమెకు మద్దతుగా నిలిచారు. సమాజంలో మహిళాసాధికారత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె సమాజంలోని బాలికలకు విద్యను అందించాలని నిశ్చయించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆమె సాహసోపేతమైన సాహిత్యరచనలకు ప్రసిద్ధిచెందింది. ఈ భావనను ప్రారంభించి, విద్య సహాయంతో ఒక అమ్మాయి నిజమైన శక్తిని తెలియజేసినందుకు క్రెడిట్ అంతా సావిత్రీబాయి పూలేకే చెందుతుంది.

v **ఉషా మెహతా :** ఉషా మెహతా భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న అతి పిన్న వయస్కులలో ఒకరు. గాంధీ భావజాలం ఉషపై చాలా ప్రభావం చూపింది. ఆమె ఐదు సంవత్సరాల వయస్సులో గాంధీని కలుసుకున్నారు. 'సైమన్ గో బ్యాక్' నిరసనలో పాల్గొన్నప్పుడు ఆమెకు కేవలం ఎనిమిదేళ్ళు. ఆమె తండ్రి బ్రిటీష్ ప్రభుత్వం క్రింద పని చేస్తున్న న్యాయమూర్తి. అతను గాంధీకి వ్యతిరేకంగా ఆమెను ఒప్పించడానికి ప్రయత్నించాడు. ఆమె తండ్రి బ్రిటీష్ ప్రభుత్వ ఉద్యోగి గనుక ఈ స్వాతంత్ర్యపోరాటంలో కుటుంబసంబంధాలు దెబ్బతిన్నప్పటికీ ఆమె ధైర్యంగా పోరాడాలని నిర్ణయించుకుంది. చదువు మానేసిన తర్వాత స్వాతంత్ర్య పోరాటానికి పూర్తిగా అంకితమైంది. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేడియో ఛానెల్లను నడిపినందుకు ఆమెకు జైలుశిక్ష కూడా పడింది.

v **బికాజీ కామా :** బికాజీ కామా భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులలో ఒకరు. ఆమెను మేడమ్ కామా అని కూడా పిలిచేవారు. స్వాతంత్ర్యపోరాటంలో ఆమె భారతీయపౌరుల మనస్సులలో మహిళా సమానత్వం మరియు మహిళా సాధికారత యొక్క బీజాలను నాటారు. భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రను స్థాపించిన మార్గదర్శకుల్లో ఆమె ఒకరు. ఆమె పార్సీ కుటుంబానికి చెందినది. ఆమె తండ్రి సొరాబ్జీ ఫ్రాంజీ పటేల్ పార్సీ కమ్యూనిటీ సభ్యుడు. చాలామంది అనాథ బాలికలకు కూడా ఆమె సహాయం చేసింది. జాతీయ ఉద్యమాల్లోనూ ఆమె కీలకపాత్ర పోషించారు.

v **లక్ష్మీ సహగల్ :** లక్ష్మీ సహగల్ సుభాష్ చంద్రబోస్ వలన ప్రభావితమై ప్రేరణ పొందింది. స్వాతంత్ర్య పోరాటంలో ఆమె మహోన్నతమైన వ్యక్తి. ఆమె సుభాష్ చంద్రబోస్‌ను తన రోల్‌మోడల్‌గా నమ్మింది. ఇండియన్ నేషనల్ ఆర్మీలో క్రియాశీలక సభ్యురాలుగా మారిన ధైర్యవంతురాలైన యువతి. ఆమె ఏకైక ఆశయం భారతదేశ స్వాతంత్ర్యం. ఆమె స్వతంత్ర్యపోరాటంలో ఒక ప్రత్యేకమైన మహిళా విభాగాన్ని సృష్టించి, దానికి ఝాన్సీరాణి రెజిమెంట్ అని పేరు పెట్టింది. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన అన్ని ఉద్యమాలలో ఆమె పాల్గొన్నారు. అన్ని విధాలుగా పోరాడి చరిత్ర సృష్టించారు.

v **సుచేతా కృపలానీ :** స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన మరో మహిళ సుచేతా కృపలానీ. స్వాతంత్ర్య సమరయోధురాలు, మహిళా రాజకీయవేత్త, ఉత్తరప్రదేశ్‌కు మొదటి మహిళా ముఖ్యమంత్రి. సుచేతా కృపలానీ హర్యానాలోని అంబాలాలో ఓ బెంగాలీ కుటుంబంలో జన్మించారు. భారత జాతీయ కాంగ్రెస్ కార్యకలాపాల్లో సుచేతా చురుకుగా పాల్గొనేవారు. క్విట్ ఉద్యమంలోనూ సుచేతా కృపలానీ చురుకుగా పాల్గొన్నారు. ఆ తర్వాత మహాత్మా గాంధీతోనూ సన్నిహితంగా పనిచేశారు.

v **అనిబిసెంట్ :** కాంగ్రెస్ మొదటి మహిళా అధ్యక్షురాలు అనిబిసెంట్ ఐరిష్ మహిళ. థియోసాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియాకు నాయకురాలు. ఆమె భారత జాతీయ కాంగ్రెస్ మొదటి మహిళా అధ్యక్షురాలిగా పనిచేశారు. 1906లో ఇండియన్ హోమ్‌రూల్ లీగ్‌ను ఆమె స్థాపించారు. ఆ సమయంలోనే భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. అంతేకాకుండా రాష్ట్రాలకు అధికారం కట్టబెట్టే క్రమంలో స్థానిక సంస్థానాలనుండి ఎదురైన సవాళ్లను కూడా మహిళలు సమర్ధవంతంగా ఎదుర్కొన్నారు.

v **కస్తూర్బా గాంధీ :** భారత స్వాతంత్ర్యపోరాట చరిత్రలో చెరగని పేరు. ఆమె జాతిపిత మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ భార్య అని మనందరికీ తెలుసు. భారతదేశ స్వాతంత్ర్యానికి గాంధీ చేసిన కృషి గురించి మనందరికీ తెలుసు కానీ కస్తూర్బా గాంధీ గురించి అంతగా తెలియదు. ప్రముఖమహిళా స్వాతంత్ర్య సమరయోధురాలిగా ఆమెచాలా ముఖ్యమైన పాత్ర పోషించారు. ఆమె రాజకీయ కార్యకర్త కూడా, పౌరహక్కుల కోసం తన గొంతును పెంచింది. తన భర్తలాగే స్వాతంత్ర్య సమరయోధులందరితోనూ సన్నిహితంగా, సమానంగా పనిచేసింది. ఆమె గాంధీ దక్షిణాఫ్రికా పర్యటన సందర్భంగా డర్బన్‌లోని ఫీనిక్స్ సెటిల్‌మెంట్‌లో చురుకైన సభ్యురాలిగా మారింది. ఇండిగో ప్లాంటర్స్ ఉద్యమం సమయంలో, పరిశుభ్రత, ఆరోగ్యం, క్రమశిక్షణ, చదవడం, రాయడం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ఆమె సహాయపడింది. తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎంతోమంది మహిళలు పోరాటం చేసిన సందర్భాలుకూడా ఉన్నాయి.

**ముగింపు :** వీరంతా స్వీయ క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా వ్యవహరించిన మహిళలు. నా దేశము నుండి నేను ఏమి పొందాలి? అని వీరు ఎప్పుడూ అనుకోలేదు. నా దేశానికి నేను ఏమి ఇవ్వగలను అని పరితపించినట్లు ఈ వ్యాసం ద్వారా మనకు తెలుస్తున్నది. 75వ స్వాతంత్ర్య వజ్రోత్సవ సందర్భంగా భారత స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన వీర నారీమణులందరికీ జోహార్లు. వీరిని ఆదర్శంగా తీసుకుని ఇదే ఆలోచనలతో ప్రతిఒక్కరూ సరైన అవగాహనతో, స్వీయ క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా స్వధర్మాన్ని ఆచరించిననాడే మనకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు భావించాలి.

**ఆధార గ్రంథాలు :**

1. రఘువంశం – కాళిదాసు
2. మంగల్ పాండే చలనచిత్రం
3. 8వ తరగతి హిందీ పాఠ్యపుస్తకం
4. సత్యశోధన – మహాత్మాగాంధీ
5. అంతర్జాల సమాచారం.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమం – రచయిత్రుల పాత్ర

డా॥ ఎన్. నిశ్చల, తెలుగు సహాయ ఆచార్యులు, ఎన్.టి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, మహబూబ్‌నగర్, సెల్ : 7680975761

తూర్పు దేశాలతో వర్తకం చేసుకోవడానికి ఇంగ్లాండులో మొదలైన వాణిజ్య సంస్థే ఈస్టిండియా కంపెనీ. మొదట వర్తకం పేరుతోనే బ్రిటిష్ వారు భారతదేశంలోకి ప్రవేశించారు. కాని మనదేశంలోని కొంత కొంత భూభాగాన్ని స్వంతం చేసుకుంటూ తమ పాలనను స్థిరపరుచుకున్నారు. ఈ పాలనను అంతంచేసి/వ్యతిరేకిస్తూ స్వరాజ్యం స్థాపించుకోవడానికి భారతీయులు సాగించిన ఉద్యమమే స్వాతంత్ర్యోద్యమం.

మొట్టమొదటిసారి ఆంగ్లేయులను ఎదిరించిన ఘనత వంగదేశం నవాబైన సిరాజుద్దౌలాకు దక్కింది. 1757లో ఆంగ్లేయులకు, సిరాజుద్దౌలాకు మధ్య ప్లాసీయుద్ధం జరిగింది. ఆంగ్లేయులకు ఈ ప్లాసీ యుద్ధ విజయం యావద్భారత దేశాధిపత్యాన్ని సంపాదించి పెట్టింది. 1857 తిరుగుబాటు విఫలమైంది. ఆంగ్లేయులు తిరుగుబాటును అణచగలిగామన్న అహంకారంతో ఉన్నారు. దీని ఫలితంగా భారతీయుల్లో రాజకీయ చైతన్యం పెల్లుబికింది.

అప్పట్లో దేశంలో బాల్య వివాహాలు, బహు భార్యత్వం, నిర్బంధ వైధవ్యం, సతీసహగమనం, మూఢనమ్మకాలు, నిర్హేతుకమైన కర్మకాండలు, శుష్కమైన బాహ్యాచారాలు, అవినీతికరమైన తాంత్రిక పద్ధతులు, సంకుచితమైన కులవర్ణభేదాలు, అస్పృశ్యత వంటి సాంఘిక దురాచారాలు భారతీయ సమాజాన్ని పీడిస్తున్నాయి. వీటిని ఆసరా చేసుకొని బ్రిటిష్ పాలకులతోపాటు క్రైస్తవమతం ప్రజల్లో కొందరిని క్రైస్తవులుగా మారుస్తూ మతాంతీకరణను ప్రోత్సహించడం మొదలుపెట్టింది. ఇవన్నీ నశించాలని గుర్తించి భారతదేశ పెద్దలు సంస్కరణోద్యమాలు చేపట్టారు. ఆంగ్లేయులు భారతీయుల పట్ల అమానుషంగా వ్యవహరించడం మొదలు పెట్టారు. అప్పుడు దేశం నలుమూలలా తీవ్రమైన అసంతృప్తి చెలరేగింది. అంతటా నిరాశ నిస్పృహలు అలుముకున్నాయి. 1885లో ఎ.ఓ. హ్యూమ్ 'భారత జాతీయ కాంగ్రెస్' స్థాపించారు.

వందేమాతర ఉద్యమం విఫలమై 1905లో వంగరాష్ట్ర విభజన జరిగింది. 1915లో గాంధీజీ దక్షిణాఫ్రికా నుండి భారతదేశం తిరిగి వచ్చాడు. మహాత్ముని ఆగమనం భారత స్వాతంత్ర్యోద్యమానికి ఒక వినూత్న శక్తిని సంతరించుకుంది. తన దేశానికి, తన ప్రజలకు సేవ చేయాలన్న తపన గాంధీజీలో గాఢంగా ఉంది. 1916లో అహమ్మదాబాద్‌లో సబర్మతి ఆశ్రమాన్ని నెలకొల్పాడు. ఈ ఆశ్రమం నుండే సత్యగ్రహ ఆయుధాన్ని ప్రయోగించాడు. ప్రజల్లో నిరాడంబర, త్యాగశీలత, సంయమనం, హిందూ ముస్లిం ఐక్యత, అస్పృశ్యతానివారణ, సర్వమానవ సౌభ్రాతృత్వం పాదుకొల్పడానికి ప్రయత్నించాడు.

భారతీయ సైనికులు అహోరాత్రులు (రాత్రింబగళ్ళు) పోరాడి, ప్రాణాలర్పించి ప్రథమ ప్రపంచ సంగ్రామంలో (1914–1918) ఆంగ్లేయులకు విజయం చేకూర్చిపెట్టారు. అయినా ఆంగ్లేయులు ఈ త్యాగాలను మరిచిపోయి నిరంకుశంగానే పరిపాలిస్తున్నారు. గాంధీజీ నాయకత్వంలో చంపారన్ సత్యాగ్రహం, అహమ్మదాబాదు సత్యాగ్రహం, ఖైరా సత్యాగ్రహం, ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, చౌరిచౌరా సత్యాగ్రహం, సైమన్ కమీషన్ ఉప్పు సత్యాగ్రహం, గాంధీ–ఇర్విన్ ఒప్పందం జరిగాయి. ద్వితీయప్రపంచ సంగ్రామం (1938–1945) జరుగుతున్నప్పుడే, 1942 ఆగస్టులో గాంధీజీ క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపునిచ్చాడు. దీంతో అశేష భారతావని ప్రజానీకం ఈ ఉద్యమానికి మద్దతు తెలిపారు. దాని ఫలితంగా 1947 ఆగస్ట్ 15న దేశవిభజనతో భారతదేశానికి స్వాతంత్ర్యం లభించింది.

1885లో 'భారత జాతీయ కాంగ్రెస్' ఆవిర్భవించింది మొదలు స్వాతంత్ర్యం వచ్చే వరకు ఆంధ్రుల కృషి చెప్పుకోదగ్గది. దేశ స్వాతంత్ర్యోద్యమంలో పత్రికలు కూడా తమవంతు కృషి చేసాయి. గాడిచర్ల హరిసర్వోత్తమ రావు స్వరాజ్య పత్రిక, చిలుకూరి వీరభద్రరావు ఆంధ్రకేసరి పత్రిక, కొండా వెంకటప్పయ్య దాసు నారాయణ రావు, ముట్నూరి కృష్ణారావు కృష్ణ పత్రిక, ఏ.సి. పార్థసారథి నాయుడు ఆంధ్ర ప్రకాశిక, కాశీనాథుని నాగేశ్వరరావు ఆంధ్ర పత్రిక, భోగరాజు పట్టాభి సీతారామయ్య జన్మభూమి

పత్రిక ద్వారా, కొమర్రాజు లక్ష్మణరావు విజ్ఞాన చంద్రికా గ్రంథమాల ద్వారా, చిలకమర్తి లక్ష్మీ నరసింహరావు దేశభక్తి రచనల ద్వారా ఆంధ్రదేశంలో స్వాతంత్ర్యోద్యమ చైతన్యాన్ని రగిలించారు. ఆంధ్రనాయకులు ఒకవైపు ఆంధ్రోద్యమం కొనసాగిస్తూనే, మరొకవైపు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. స్వరాజ్య సాధనకు గాంధీజీ సహాయనిరాకరణోద్యమం మొదలుపెట్టినప్పుడు, ఆయన పిలుపందుకొని ఆంధ్రదేశం ఈ ఉద్యమంలో అద్వితీయమైన పాత్ర నిర్వహించింది. గాంధీజీ ఆంధ్రదేశానికి రావడంతో ప్రజలు చైతన్యవంతులయ్యారు.

1938లో హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ ఏర్పడింది, వందేమాతర గీతం హైదరాబాద్ సంస్థానంలో రాజకీయ చైతన్యం తీసుకువచ్చింది. గాంధీజీ క్విట్ ఇండియా పిలుపునకు నిజాం రాష్ట్ర ప్రజలు కూడా బాగానే స్పందించారు. కుమారి పద్మజానాయుడు, జ్ఞానకుమారి హెడా, బూర్గుల రామకృష్ణారావు, కొమరగిరి నారాయణరావు మొదలైన వారు జైలుకు వెళ్ళారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన వెంటనే నిజాంరాజు స్వతంత్ర రాజునని ప్రకటించుకున్నాడు. తెలంగాణ విముక్తి కోసం ప్రజలు పోరాడారు. తెలంగాణ అంతా అట్టుడికిపోయింది. ఈ విషమ పరిస్థితుల్లో పోలీసు చర్య తప్పనిసరి అయ్యింది. హోంమంత్రి సర్దార్ వల్లభాయి పటేల్ జోక్యంతో 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ నిజాంరాజు లొంగిపోయాడు, తెలంగాణ విమోచనం జరిగింది. ఇలా భారత స్వాతంత్ర్యోద్యమంలో ఆంధ్రోద్యమంలో, తెలంగాణ విమోచనోద్యమంలో హైదరాబాదు సంస్థానంలోని తెలుగువారు ముందడుగు వేస్తూ జాతి గర్వించే రీతిలో తమవంతు పాత్రను చక్కగా నిర్వహించారు.

భారతదేశ స్వాతంత్ర్యోద్యమం నాటి స్త్రీల సాహిత్యంలో సుస్పష్టంగా ప్రతిఫలించిన స్వతంత్ర జీవన చైతన్యం, స్వరాజ్య హక్కుల పోరాటం, దేశభక్తి, మూఢ విశ్వాసాలపై వ్యతిరేకత, స్త్రీ అస్తిత్వం ప్రతిఫలించాయి. నాటి స్త్రీల సాహిత్యచైతన్యం నేటికీ స్ఫూర్తిదాయకం. అలాంటి ఇద్దరు రచయిత్రుల గురించి తెలుసుకుందాం, గుర్తుచేసుకుందాం.

**1. పొణక కనకమ్మ :** పొణక కనకమ్మ ఒక గొప్ప సంఘసంస్కర్త, స్వాతంత్ర్యసమరయోధురాలు, కవయిత్రి, రచయిత్రి, మహాత్మాగాంధీ శిష్యురాలు. ఈమె 10.06.1892 లో నెల్లూరుకు చెందిన మరుపూరు కామమ్మ, కొండారెడ్డిల కూతురు. ఆమెకు నెల్లూరు సమీపంలోని పొట్లపూడి గ్రామానికి చెందిన ధనిక భూస్వామి సుబ్బారామిరెడ్డితో పెళ్ళి జరిగింది. పెళ్ళినాటికి ఆమెకు ఎనిమిదేళ్ళ. ఆమె తన స్వయంకృషితో తెలుగు, హిందీ మరియు సంస్కృతంలో ప్రావీణ్యం సంపాదించుకుంది. 1907లో బిపిన్ చంద్రపాల్ మరియు అతని భార్య 'వందేమాతర ఉద్యమ' ప్రచారానికి నెల్లూరును సందర్శించినప్పుడు ఆమె ఈ దంపతులకు ఆతిథ్యం ఇచ్చింది. అలాగే తన నివాసంలో ఎందరో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులకు, కవులకు, కళాకారులకు ఆతిథ్యం ఇచ్చారు. వారిలో జాతీయ నాయకులైన బాబూ రాజేంద్రప్రసాద్, దేశబంధు చిత్తరంజన్ దాస్, కవులు, కళాకారులు ఉదయ్‌శంకర్, ఆత్రేయ, స్థానం, తిరువాన్కూర్ సోదరీమణులు మొదలగు వారు ఉన్నారు. ఆమె నెల్లూరు నుండి పెన్నానది ఒడ్డున 8 మైళ్ళ దూరంలో ఉన్న పల్లిపాడు గ్రామంలో 13 ఎకరాల భూమిని కొనుగోలు చేసి స్వాతంత్ర్య సమరంలో పాల్గొనే తన స్నేహితులకు భూమిని అప్పగించింది. ఈమె మహాత్మాగాంధీ అనుచరురాలు అయినప్పుడు 'పినాకిని సత్యాగ్రహాశ్రమం' స్థాపించడానికి భూమిని దానం చేసింది. గాంధీజీ పినాకినీ సత్యాగ్రహ ఆశ్రమాన్ని 07.04.1921 న ప్రారంభించారు. చతుర్వేదుల కృష్ణయ్య (సి.వి.కృష్ణ), దిగుమర్తి హనుమంతరావు, ఆయన భార్య కృష్ణాబాయి మరియు కొండిపర్తి పున్నయ్య ఆశ్రమ వ్యవస్థాపక సభ్యులు.

కనకమ్మ సహాయ నిరాకణోద్యమంలో, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. తనతోపాటు, తన కుటుంబం మొత్తం సత్యాగ్రహ పోరాటలో పాల్గొనేలా చేసింది. ఖద్దరు ప్రచారం చేసింది. ఆమె 1930లో రాయవెల్లూరు జైలులో 6 నెలల పాటు కఠిన కారాగార శిక్షకు గురైంది. మళ్ళీ 1932లో 13 నెలలపాటు రాయవెల్లూరులోనే జైలు శిక్ష అనుభవించింది. రాజాజీ, దుర్గాబాయి దేశ్‌ముఖ్, బెజవాడ గోపాలరెడ్డి మరియు అనేక ఇతర ముఖ్యమైన స్వాతంత్ర్య సమరయోధులు ఆమె సహ ఖైదీలుగా ఉన్నారు. పొట్లపూడి గ్రామంలో 'సుజన రంజనీ సమాజం' మరియు 'వివేకానంద గ్రంథాలయం' స్థాపించింది. ఆమె స్నేహితులు కూడా పొగడదొరువు, కంద్రిక, కొత్తూరు గ్రామాలలో గ్రంథాలయాలను ప్రారంభించారు. ఆమె హరిజన (కులబహిష్కరణ) మరియు పేదల అభ్యున్నతి

కోసం పనిచేసింది. ఆంధ్రా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలిగా కూడా వ్యవహరించారు. గాంధీజీ యొక్క నిర్మాణాత్మక కార్యక్రమంలో కనకమ్మ 1923 లో విజయదశమి రోజున శ్రీ కస్తూరీ దేవి విద్యాలయం బాలికల కోసం స్థాపించింది.

కనకమ్మ సాహిత్యరంగంలో కూడా ఎంతో కృషిచేసారు. ఆమె తిరువణ్ణామలై చెందిన రమణమహర్షి మరియు రామయోగి భక్తురాలైంది. రమణ మహర్షిపై అనేక తాత్వికపద్యాలు రాసారు. వీరి రచనలు జ్ఞాన నేత్రము, ఆరాధన, నైవేద్యము, గీత, రమణగీత, శ్రీరమణ గురుస్తవము శ్రీ రామయోగి స్వీయ జీవిత చరిత్రను తెలుగు మరియు ఆంగ్లంలో రాసారు. ఆమె కొంతకాలం 'జమీన్ రైతు' పత్రిక నడిపారు. ఆమె రచనలు భారతి, కృష్ణపత్రిక, గృహలక్ష్మి, అనసూయ, హిందూసుందరి, జమీన్ రైతు పత్రికలలో వచ్చాయి. ఆమె 1955లో గృహలక్ష్మి స్వర్ణకంకణం స్వీకరించారు. మద్రాసు మహిళాసంస్థ రజతోత్సవవేడుకల సందర్భంగా శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ కనకమ్మను వెండిపలకతో సత్కరించారు.

తెలుగులో ఆమె ఆత్మకథ 'కనకపుష్యరాగం' డా॥ కాళిదాసు పురుషోత్తం సంపాదకం వహిస్తే, 2011లో మనసు ఫౌండేషన్‌కు చెందిన మన్నెంరాయుడు ప్రచురించారు. 2017లో గాంధీజయంతి నాడు కనకమ్మ కాంస్యవిగ్రహాన్ని, పినాకిని సత్యాగ్రహాశ్రమ పల్లిపాడు ఆశ్రమ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసారు. ఆమె 15.09.1962లో మరణించారు.

**2. జాల మంగమ్మ :** దళిత జాతి ఉద్ధరణకు కలలుగని కృషిచేసిన వారిలో జాల మంగమ్మ ముఖ్యురాలు. ఈమె 1909లో తాడేపల్లి వెంకమ్మ, నరసింహంలకు జన్మించింది. పదవతరగతి వరకూ చదివి, టీచర్ ట్రైనింగ్ రాజమండ్రిలోని 'ఫాదే' స్కూలులో పూర్తి చేసుకుంది. 1923లో జాల రంగస్వామితో వివాహం జరిగింది. అప్పటికే రంగస్వామి జాతీయోద్యమంలోనూ, అంటరానితనం నిర్మూలనా ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొనేవాడు. మంగమ్మ విద్యావంతురాలిగా, నాయకురాలిగా దేశాన్ని విముక్తి చేయడానికి తన జీవితాన్ని అంకితం చేసింది. జాతీయ స్థాయి సమస్యల నుండి స్థానిక సమస్యల వరకు అన్నింటినీ సులువుగా అవగాహన చేసుకొని స్పందించేది. అనేకసార్లు ఉద్యమ ప్రచారాలలో, రంగస్వామితో కలిసి విస్తృతంగా పర్యటించింది. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వందలాది గ్రామాల్లో వీరి ఉద్యమ కార్యక్రమాలు కొనసాగాయి. గ్రామంలోని అన్ని కులాల ప్రజలను చైతన్యవంతులను చేసి, ప్రజలలో సమానత్వమును సాధించడం ద్వారా స్వాతంత్ర్యోద్యమానికి తోడ్పడాలని ఆమె కోరిక. గ్రామాలలో సభలను ఏర్పాటు చేసి అస్పృశ్యతానివారణ ఆవశ్యకతను వివరించేది. మాల మాదిగ కార్మికుల వేతనాలు పెంచాలని అనేక సమ్మెలు నిర్వహించింది. రాజమండ్రి కంబాలపేటలోని మాల, మాదిగలకు చదువు నేర్పించింది. పగలంతా పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా ఉద్యోగం చేసి, సాయంత్రం మాల, మాదిగ పల్లెల్లో స్త్రీలను కూడగట్టి చదువు చెప్పి, రాజకీయ తరగతులను నిర్వహించేది. ఈ నేపథ్యంలోనే 'హరిజన మహిళా సంఘము' ను స్థాపించి వారికి 100 రాట్నాలు ఇచ్చి, నూలు వడికించి వారికి ఉపాధిని కలుగజేసింది. అంటరానితనం నిర్మూలనకూ, మాల మాదిగల అభ్యుదయానికి విద్యావసరాన్ని గుర్తించి, రంగస్వామితో కలిసి హరిజన బాలబాలికల హాస్టళ్ళను 3 సం॥రాలు నడిపింది. మాల, మాదిగ యువకులకు కత్తులు, కత్తెర్లను ఇచ్చి మంగలిపనికి, బ్యాండు వాయిద్యాల శిక్షణనిప్పించి, వారికి స్వయం ఉపాధిని కల్పించింది. కాంగ్రెస్ చేపట్టిన ప్రతి ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొంటూ కొన్నిసార్లు నాయకత్వం వహించింది.

మొదట డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజమండ్రికి వచ్చినప్పుడు ఆయనను సన్మానించిన వారిలో వీరిద్దరూ ముఖ్యపాత్ర వహించారు. డా॥ బాబూ రాజేంద్రప్రసాద్ మొదటిసారి రాజమండ్రికి వచ్చినప్పుడు మాల, మాదిగల తరపున ఈమె సన్మానం చేసింది. అందుకు ఫలితంగా బ్రిటిష్ పాలకులు ఈమెను ఉపాధ్యాయ వృత్తి నుండి తీసేసినప్పుడు కుటుంబంలో ఆర్థిక సమస్యలు ఎక్కువైనప్పటికి, బ్రిటిష్‌వాళ్ళతో సామరస్యం వహించలేదు. గాంధీజీ రాజమండ్రికి వచ్చినప్పుడు, స్వయంగా మంగమ్మ, రంగస్వామిల చేత రాజమహేంద్రవరంలోని శ్రీరామమూర్తి అనే బ్రాహ్మణ సంఘసంస్కర్త ఇంటిలోపల నూతిలోనుండి నీళ్ళను తోడించి 'అంటు దోషముల నిర్మూలన' కు జరుపుతున్న వీరి కృషిని అభినందించాడు. 1935లో బ్రిటిష్ ప్రభుత్వం జాల మంగమ్మ, రంగస్వామిలను అరెస్ట్ చేసి తణుకు, నర్సాపురం జైళ్ళల్లో ఉంచింది.

పశ్చిమ గోదావరి జిల్లా చాగల్లులో మహాత్మాగాంధీ స్థాపించిన 'ఆనంద నికేతన ఆశ్రమం' లో టీచరుగా పనిచేస్తూ మూడేండ్లు గడిపారు. ఈ క్రమంలో ఆధిపత్యకులాలను కూడా ఎదుర్కొన్నారని జాల మంగమ్మ, రంగస్వామి 'స్వీయ చరిత్ర' లో రాసుకున్నారు. పాటలు, పద్యాలు, కావ్యాలు రాసి, కూర్చి ప్రచారం చేసారని కూడా 'రాష్ట్ర హరిజన నాయకులు' అనే గ్రంథంలో రాసుకున్నారు. 'ఆదిజన గ్రంథమండలి' అనే ప్రచురణ సంస్థను స్థాపించి, ముద్రణకు నోచుకోని గ్రంథాలెన్నింటినో ప్రచురించారు. ఈ గ్రంథమండలి ద్వారా ప్రచురితమైన అనేక గేయాలు రాష్ట్రమంతటా పాడుకున్నారు. నాటకాలను ఆంధ్రదేశమంతటా ప్రదర్శించారు. 'దున్నేవారిదే భూమి' వంటి ప్రముఖ సాంఘిక నాటకంతో పాటు, తొలి తెలుగు దళిత నవల అయిన 'రైతుపిల్ల' గ్రంథాలకు సంపాదకత్వం వహించి ప్రచురించింది. 1935లో చేతిరాతలతో 'వీరభారతి' అనే పత్రికను నడిపింది. జాల మంగమ్మ జీవితంలో కార్యకర్తగా, నాయకురాలిగా, సంస్కర్తగా, కవయిత్రిగా, రచయిత్రిగా, సంపాదకురాలిగా, ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేయడం కన్పిస్తుంది. స్వాతంత్ర్యపోరాటంలో హరిజనులను దేవాలయ ప్రవేశము, మద్యపాన నిషేధము ముఖ్యమైన అవసరాలని విస్తృతంగా ప్రచారం చేసి, దళిత జాతి పునరుద్ధరణకు, అంటరానితనం నిర్మూలనకు తన జీవితాంతం పోరాటం సల్పిన కార్యశీలి జాల మంగమ్మ. ఈమె 18.10.1974 న మరణించారు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్యంలో రచయిత్రులు – వై. సరోజినీ దేవి – మద్రాస్, 1964.
2. ఆంధ్రకవయిత్రులు–ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ – ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, సైఫాబాద్, హైదరాబాద్, 1975
3. మహిళ – 10వ రచయిత్రుల మహాసభల సాహిత్య సంచిక – ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, సైఫాబాద్, హైదరాబాద్, 1982.
4. ఆధునిక భారతదేశ చరిత్ర మూలం – బిపిన్ చంద్ర – తెలుగు అనువాదం – సహవాసి – హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్, మార్చి 1988.
5. హైదరాబాద్ – నాలుగు శతాబ్దాల స్వాతంత్ర్య వికాసం – సంపాదకులు : ఆచార్య ఎస్.వి. రామారావు, తెలుగు అకాడమి, హైదరాబాద్, 1991.
6. సంహిత – డి. చంద్రశేఖర్ రెడ్డి – మీడియా హౌస్ పబ్లికేషన్స్, హైదరాబాద్, జనవరి, 2011.
7. మనకు తెలియని మన చరిత్ర – స్త్రీ శక్తి సంఘటన, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్, మే, 2003
8. నల్లపొద్దు – దళిత స్త్రీల సాహిత్యం (1921–2002) – సంపాదకులు : గోగు శ్యామల, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్, మే, 2003.
9. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో తెలుగు యోధులు – ప్రధాన సంపాదకులు : బి.సిహెచ్. రంగారెడ్డి, ప్రచురణ : అంధ్రప్రదేశ్ ఫ్రీడం ఫైటర్స్ కల్చరల్ కమిటీ, హైదరాబాద్, 2006.
10. ఆధునిక భారతదేశ చరిత్ర (1757–1947) – ఆచార్య అల్లాడి వైదేహి – తెలుగు అకాడమీ, హైదరాబాద్, 2011.
11. రాజకీయ, సామాజిక స్వేచ్ఛా స్వాతంత్ర్య సాహిత్య కళారంగాలలో పేరెన్నికగన్న ప్రపంచ ప్రసిద్ధ మహిళలు – సేకరణ, సంకలనం : శ్రీపల్లవి – పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ, డిసెంబర్, 2011.
12. అద్యతన దృష్టి – సాహిత్య విమర్శ వ్యాసాలు – డా॥ ముదిగంటి సుజాతారెడ్డి – రోహణమ్ ప్రచురణలు, హైదరాబాద్, 2014

# భారత స్వాతంత్ర్యోద్యమంలో చిట్టగాంగ్ వీర విప్లవ నారీమణులు

**జి. మాణిక్యం,** పిజి విద్యార్థి జంతు శాస్త్ర విభాగం, శీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి
**డాక్టర్. జి.స్వాతి,** ప్రభుత్వ డిగ్రీ కళాశాల,పుత్తూరు.

**ఉపోద్ఘాతం :** సుమారు 200 సంవత్సరాలు పాటు భారత దేశానికి , వాణిజ్యం కొరకు వచ్చిన బ్రిటిష్ వారు భారత్ ను బానిస దేశంగా హస్తగతం చేసుకున్నారు. వారిని తరిమికొట్టడానికి 1857 సిపాయి తిరుగుబాటు నుండి 1947 గాంధీ అహింస పోరాటం వరకు కొనసాగింది. వీరిలో పురుషులు మాత్రమే కాదు ఆకాశంలో సగమైన స్త్రీలు కూడా సంగ్రామంలో పాలుపంచుకోవడం విశేషం. ఝాన్సి లక్ష్మి భాయ్, దుర్గా భాయ్ దేశ్ముఖ్, సరోజినీ నాయుడు వంటి ప్రముఖులే కాదు, ప్రీతి లత, కల్పన దత్, బీనా దాస్, సుహాసిని గంగూలీ, కళ్యాణి దాస్, ఇందుమతి సింగ్, ప్రేమ లత, అజ్ఞాత స్త్రీ , బినోధిని సేన్, మృణాళిని సేన్ వంటి చరిత్రకు కనుమరుగైన వారెందరో. ప్రస్తుత పరిశోధనాపత్రం చరిత్రకారులకు కనుమరుగైన ధైర్య సాహసాలకు, యుద్ధ విన్యాసాలకు ప్రతీకలై, తమ మాన ప్రాణాలను సైతం పణంగా పెట్టి స్వాతంత్ర సంగ్రామంలో విప్లవ పోరాటాలు చేసి, తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలేసిన వీర విప్లవ నారీమణులను వెలికతీసే ప్రయత్నం .

**నేపథ్యం :** 1928 దేశం స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం పోరాడుతున్న రోజులు. అహింస ద్వారా స్వాతంత్ర్యం సాధిద్దామని గాంధీ మార్గంలో వెళ్లేవారు కొందరైతే, దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవాలంటే సాయుధ పోరాటమే మార్గం అని నమ్మిన వాళ్లు ఇంకొందరు. అందులో ఒకరే సూర్యసేన్. ఇండియన్ రిపబ్లికన్ ఆర్మీ (ఐఆర్ఏ) నిర్మాత, దళపతి. రహస్యంగా కార్యకలాపాలు కొనసాగిస్తూ బ్రిటీష్ స్థావరాలు, బలగాల మీద దాడి చేసే భారతీయుల సాయుధ సైన్యం. ఏడు రోజుల్లో చిట్టగాంగ్ ప్రాంతాన్ని బ్రిటీష్ వాళ్ల చెర నుంచి విడిపించాలని టార్గెట్ పెట్టుకుని పోరాటం మొదలుపెట్టింది ఐఆర్ఏ. నాలుగు రోజులు ఐఆర్ఏ సైన్యానిదే పైచేయిగా ఆ పోరాటం సాగింది. చిట్టగాంగ్ ఇక స్వతంత్ర్య ప్రాంతం అని కూడా ప్రకటించారు ఐఆర్ఏ ప్రతినిధులు. భారత దేశంలో కొంత భూభాగం 1947 ఆగస్టు 15 కంటే ముందే స్వాతంత్ర్యం రాకమునుపే స్వతంత్రం పొందింది.

ఇందుకు 64 మంది విప్లవ కారుల త్యాగమే కారణం. అంతేకాకుండా మొదటి తరం మహిళలను సైతం సాయుధ పోరాటంలో భాగం చేశారు. అందుకే భారత స్వాతంత్రోద్యమ చరిత్రలో చిట్టగాంగ్ కి ఒక ప్రత్యేకత ఉంది. 1918 నుండి 1928 వరకు సూర్య సేన్, నిర్మల్ సేన్, లోక్ నాథ్ బాల్, వారి స్నేహితులు కలిసి 10 సంవత్సరాలుగా ఇండియన్ రిపబ్లిక్ ఆర్మీ( ఐ.ఆర్. ఎ) ని ఏర్పాటు చేసి చిట్టగాంగ్ లో ఏప్రిల్ 18, 1930 న ఒకే రోజు ఒకే సారి ఒకే సంస్థ 5 టార్గెట్లని ' ప్రోగ్రామ్ ఆఫ్ డెత్' ద్వారా పూర్తి చేసి, బ్రిటిష్ వారిని పడగొట్టి మన మువెన్నల జాతీయ జెండాను ఎగురవేసి, యావత్తు దేశానికి స్ఫూర్తిని నింపారు ఐ.అర్. ఏ సైనికులు. కానీ ఈ స్వతంత్రం 4 నాలుగు రోజులకు మాత్రమే ఉన్నది. కానీ బ్రిటీష్ ప్రభుత్వం అదనపు బలగాలను తెప్పించి ఐఆర్ఏ మీద దాడి చేసింది. ఐఆర్ఏ సైనికులు కనిపిస్తే కాల్చివేసేవారు. గాయాలతో దొరికిన వారిని అండమాన్ జైలుకు తరలించి చిత్రహింసలు పెట్టేవారు. ఆ తర్వాత బ్రిటీష్ వారు ఐ.ఆర్.ఏ పై "బ్యాటిల్ ఆఫ్ జలాలాబాద్" ప్రకటించింది. డి.ఐ.జి.పార్మర్ సైన్యం, కల్నల్ డల్లాస్ సైన్యం, కెప్టెన్ టెయిట్ సైన్యం రెండు భాగాలుగా అధునాతన ఆయుధాలతో నాలుగు దిక్కులా ఐ. ఆర్. ఏని చుట్టుముట్టి మట్టిగరిపించారు.

దీంతో ఐఆర్ఏ సభ్యులు రహస్య జీవితం గడపవలసి వచ్చింది. మహిళలు సాయుధ పోరాటంలో ఇమడలేరు. ఆ ఇబ్బందులు, కష్టాలు తట్టుకోలేరన్న ఉద్దేశ్యంతో మొదట్లో సూర్యసేన్ మహిళలకు ఐఆర్ఏలో చేర్చుకోలేదు. కానీ తప్పనిసరి పరిస్థితుల్లో చిట్టగాంగ్ మహిళల సాయం కోరారు. వారిని కోవర్టులుగా నియమించుకున్నారు. రహస్యంగా ఆయుధాలు అందించడం, వార్తలు, బ్రిటీష్ ఎత్తుగడలకు సంబంధించిన సమాచారం సేకరించడం వంటి పనులు చేయించేవారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో స్త్రీలకు కోవర్టులుగా ( కొరియర్లుగా ) అవకాశం కల్పించారు. అప్పుడు రంగంలోకి దిగారు చిట్టగాంగ్ మహిళలు. ఆయుధాలు చేపట్టి బ్రిటీష్ వారితో ప్రత్యక్ష యుద్ధం చేశారు. అది కేవలం పరాయి బ్రిటిష్ ప్రభుత్వం మీద చేసే పోరాటం మాత్రమే

కాదు. వాళ్ళు ఒకేసారి పితృస్వామిక ఆధిపత్యాల మీద, కుటుంబ వ్యవస్థ మీద, తమని రెండో తరగతి మనుషుల్లా చూస్తున్న సమాజ కట్టడులు, కట్టుబాట్లు మీద 'శారీరకంగా, మానసికంగా స్త్రీలు పురుషులతో సమానంగా కాదు' అని చలామణిలో ఉన్న మూఢనమ్మకం మీద లక్ష చేతులతో చేసిన పోరాటం అది.

**వీర విప్లవ నారీమణులు**

**ప్రీతి లత :** భారతదేశంలోనే కాకుండా తన స్వస్థలమైన బెంగాల్లో కూడా అంతగా తెలియని స్వాతంత్ర సమరయోధురాలు ప్రీతి లతా వడ్డేదార్. తాను బతికి ఉన్న కొంత కాలం కూడా బ్రిటిష్ పరిపాలన పై ఐ.అర్. ఏ తో కలిసి యుద్ధం సాగించింది. ధిపాలి, ఛత్రి సంఘ్ సభ్యురాలు. 1930లో ఆర్మీ దాడుల సమయంలో బ్రిటిష్ దళాలు మీద దాడి చేసింది. యురోపియన్ క్లబ్ పై 'కుక్కలకు, భారతీయులకి ప్రవేశం లేదు ' అని రాసుంటుంది. సెప్టెంబర్ 23, 1932 రాత్రి క్లబ్‌పై దాడి చేశారు. ప్రీతి లతాకి బుల్లెట్ తగిలింది,పోలీసుల అరెస్టు నుండి తప్పించుకోవడానికి ఆమె పొటాషియం సైనైడ్ తినేసి తన జీవితాన్ని తనే ముగించింది. అప్పటికి ప్రీతి లత వయసు 21 సంవత్సరాలు మాత్రమే.

**కల్పన దత్ :** కల్పన దత్ 1913 జూలై 27 న తెల్ల దొరల విధేయులకుటుంబంలో జన్మించింది. ఈమె తండ్రి బ్రిటిష్ అధికారుల దగ్గర పనిచేశారు. ఈయన చూపించే విధేయతకు మెచ్చి 'రాయ్ బహదూర్ ' అనే బిరుదు కూడా ఇచ్చారు తెల్ల దొరలు. కల్పన తన కాలేజీ లాబొరేటరీ నుండే పేలుడు పదార్థాలైన నైట్రిక్ యాసిడ్, సల్ఫ్యూరిక్ యాసిడ్లు కొంచెం కొంచెం సేకరించి ఏకంగా 32 కిలోలు పంపేది. తర్వాత కాలంలో ప్రాణాపాయ పని డైనమైట్ల తయారీలో నిమగ్నమైంది. స్వాతంత్రోద్యమానికి బాంబుల తయారు చేసింది. తప్పనిసరి పరిస్థితుల్లో అండర్ గ్రౌండ్ లోనే పుతుధా, కల్పన, సుధీంద్ర దాస్ లొంగిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో పైనున్న చొక్కా తీసేసి రావాలని హుస్సేన్ ఆర్డర్ వేశారు . అప్పుడు కల్పన దత్ " నేను నా చీర పైట ఉంచుకోవచ్చా ... తీసేయాలా " అని అడిగింది. ఆ ప్రశ్నతో బ్రిటిష్ పోలీసులని చకితుల్ని చేసింది కల్పన. ఉద్యమం కారణంగా చదువుకి స్వస్తి చెప్పింది. 1939 మే 1 న విడుదలై ఐ. ఆర్. ఏ క్షీణించి పోవడంతో కమ్యునిస్ట్ పార్టీలో చేరి ప్రజల పక్షాన నిలబడింది. అల్జీమర్స్ వ్యాధి వల్ల 1995 ఫిబ్రవరి 8 న మరణించారు.

**ఇందుమతి సింగ్ :** ఇందుమతి ఐ. ఆర్. ఏ నాయకుడైన అనంత సింగ్ చెల్లెలు. ఇందుమతి వస్త్రధారణ భిన్నంగా ఉంటుంది. కుస్తీ పడటంలో, గురితప్పకుండా కాల్చడంలో, కారు నడపడంలో దిట్ట. ఐ.ఆర్.ఏ నాయకులు అరెస్టయిన సమయంలో ఆర్థిక నిధుల మరియు రిక్రూట్మెంట్ పనులన్నీ ఇందుమతి చేసేది. విరాళాల కొరకు బేతున్ కాలేజీ, కలకత్తాలో ఈమె తట్టని తలుపంటు లేదు. ఈమె పనులను నిలిపివేయాలని తలచి బిటిష్ ప్రభుత్వం 1931 లో అరెస్టయి, 1937 వరకు సుమారు 6 ఏళ్లు జైలు జీవితం గడిపింది.

**ప్రేమలతజీ:** ప్రేమలత ఐ.ఆర్.ఎ ముఖ్య సభ్యుడు కాళికింకర్ దే భార్య. కల్పన దత్ తో పాటుగా తన ఇంటిలోనే జరిగే బాంబులు తయారు చేయడంలో సహాయ సహకారాలు అందించింది. విప్లవ కారులు రాత్రి సమయంలో వస్తుంటే అక్కింటి పక్కింటి వాళ్లు గుండెని బాకులతో గుచ్చే ఎన్నో మాటలు పడింది. పహర్తిలోని యురోపియన్ క్లబ్ పై డైరెక్ట్ యాక్షన్ లోకి తనని తీసుకోలేదని సూర్య సేన్ని ప్రశ్నించిన అగ్ని కణం ప్రేమలత."నా ప్రాణాలకు ముప్పు ఉంటుందని నన్ను వెనక్కి పంపే స్తారా? మరి మీ ప్రాణాలకు ముప్పు లేదా? నన్ను ఆపటానికి మీరెవరు? మీకేం హక్కు ఉంది? ప్రశ్నల తూటాలు పేల్చిన వీర నారి. కళ్ళముందు మిత్రులు దూరమై, స్వతంత్రం కొరకు భర్త దూరమై ఒంటరిగా బతికిన ఒక యోధ ను నిస్సహాయంగా ఏ అంధకారం అలుముకుందో కానీ ఆత్మహత్య చేసుకుని మరణించింది.

**సావిత్రి దేవి:** సావిత్రి దేవి వితంతువు. ఈమెకు రామకృషణ మరియు స్నేహలత అను ఇద్దరు బిడ్డలు. చిట్టగాంగ్ లో ఈమెకు రెండంతస్తుల మట్టి మేడ ఉంది. సావిత్రి ఐ.ఆర్.ఎ సంస్థలోను లేదు, విప్లవం అసలే తెలీదు. సావిత్రి చేసిందల్లా ఐ.ఆర్.ఎ. ముఖ్య నాయకులకు దేశం మీద, స్వతంత్ర రాజ్య కాంక్షతో ఆశ్రయం కల్పించడం మాత్రమే. బ్రిటిష్ జడ్జిని పట్టుకొని "నీకెందుకు

చెప్పాలి? మా అమ్మ తరపు చుట్టానివా? అత్తగారి తరపు చుట్టా నివా? అని ఈసడింపుగా అడిగి, బ్రిటీష్ సార్వభౌమత్వాన్ని తీసిపరేసింది. అది ఆమె ధైర్యం. బ్రిటిష్ ప్రభుత్వం ఉన్న ఈమె ఇల్లుని కూడా కుల్చేసింది. స్వతంత్ర కొరకు కన్న కొడుకు జైల్లో క్షయ వ్యాధితో చంపుకుని, ఒక్క పూట అన్నం కూడా దొరకడం కష్టమై వృద్ధాప్యంలో చనిపోయిన ధీశాలి సావిత్రి దేవి .

**అజ్ఞాత స్త్రీ :** ఐ.ఆర్.ఎ అగ్రనేత సూర్య సేన్ పట్టుబడటానికి కారణబూతుడు నేత్ర సేన్ . కోర్టు విచారణలో భర్తకు మద్దతుగా మాట్లాడకుండా "నేను నా సొంత కళ్ళతో చూసాను, కానీ వారి పేర్లు చెప్పటానికి నా హృదయం అంగీకరించటం లేదు. చిట్టగాంగ్ వీర పుత్రుడిని నా భర్త ద్రోహం చేశాడు అంటూ తనకి దోషులు తెలిసినా చెప్పకుండా సూర్య సేన్ కే మద్దతు పలికింది. ఆమె వ్యక్తి పేరు కూడా చరిత్రకారులకు కనుమరుగైనది. కానీ ఆమె వ్యక్తిత్వం ద్వారా ఎలా ఉండాలో తెలిజేసిన మహిమాన్విత.

**కళ్యాణి దాస్ :** కళ్యాణి దాస్ మరెవరో కాదు బెంగాల్ గవర్నర్ ను కాల్చిన భినా దాస్ అక్క ఈమె కాలేజీలో ఉండగానే "చత్రి సంఘ్" అనే సంస్థను స్థాపించి అమ్మాయిలకి కత్తి తిప్పటం, కర్ర సాము, యుద్ధ విద్యలు నేర్పించి ... చిట్టగాంగ్ లో విప్లవ జ్వాలలు రేపడానికి ప్రధాన కారణం. బట్టలు తీసేసి, చీకటి గదిలో ఒంటరిగా నిర్బంధించి, పళ్ళు ఊడిపోయేట్టు కొట్టి చిత్రహింసలు పెట్టినా పోలీసులకు ఎలాంటి వివరాలు చెప్పలేదు . 1937 లో జైలు నుండి విడుదలై కాంగ్రెస్ లో చేరి, తన సేవలు అందించింది.

**బినోధిని సేన్, మృణాళిని సేన్ :** ఐ.అర్.ఎ సభ్యుడైన రజత్ సేన్ తల్లి బినోధిని సేన్, రజత్ సేన్ అక్క మృణాళిని సేన్. ఐ.అర్. ఎ కి ఆర్థిక సహాయ సహకారాలు అందించేది. బాంబులు దాచటంలో సహయపడేది. 'కాలార్ పుల్ – జుల్దా ' ఎన్కౌంటర్ లో తన కొడుకు సహా కొందరు నాయకులు అమరులైనారు. ఇందుకు బినోదిని మరియు మృణాళిని ఐ.ఆర్.ఎ సంస్థ పట్ల ఎలాంటి ఆక్షేపణ లేకుండా వాళ్ళకి సాయం చేసిన ఆదర్శవంతులు.

**సుహాసిని గంగూలి :** గంగూలి 1909 ఫిబ్రవరి 3న బ్రిటిష్ ఇండియాలోని బెంగాల్‌లోని ఖుల్నాలో జన్మించారు. ఈమె మొదట 'అనుసీలన్ సమితి 'లో తర్వాత దాన్నుండి విడిపోయిన 'జుగంతర్' అటుపై ఆమె ''ఛత్రీ సంఘ'' సభ్యురాలైంది. కలకత్తా పోలీస్ కమిషనర్ చార్లెస్ టేగార్డ్ బూటు కాలితో తన్నినా, చేతి వేళ్ళ గోరులని పట్టకారతో పీకినా, పేపర్ వెయిట్ తో ముఖం మీద కొట్టినా, రెండు చేతుల మధ్య లాఠీ పెట్టి ఎముకలు విరిగేట్టు తిప్పి థర్డ్ డిగ్రీ ట్రీట్మెంట్ ఇచ్చినా సూర్య సేన్ ఆచూకీ చెప్పలేదు. మరలా చార్లెస్ మొహాన 'ఛూ' అని ఊసింది. సుహాసిని ఎంతో మంది విప్లవ వనితలని తీర్చిదిద్దిన యోధురాలు. స్వేచ్చ కొరకు పెళ్ళికాకుండానే ఇంకొకరి భార్య గా నటించింది. 1930, సెప్టెంబర్ 1 న బి.పి.సి. ఎల్ కేసు కింద సుహాసిని అరెస్టయింది. చార్లెస్ మీద అంతర్జాతీయ న్యాయస్థానంలో కేసు పెట్టి, ఆరేళ్ల తర్వాత కేసు గెలిచింది. ఆమె సాహసానికి యావత్ప్రపంచం ఆశ్చర్యపోయింది. జైల్లో ఉన్నప్పుడే కమ్యునిజం పట్ల ఆకర్షితులయ్యారు. 1965 లో రోడ్డు ప్రమాదంలో చనిపోయింది. ఈ ధిక్కార స్వతంత్ర సమరయోధురాలు.

**బీనాదాస్‌జి :** బీనాదాస్ కోల్‌కతాలోని మహిళల విప్లవ సంస్థ 'ఛత్రి సంఘ' సభ్యురాలు. 6 ఫిబ్రవరి 1932 న ఆమె బెంగాల్ గవర్నర్ స్టాన్లీ జాక్సన్‌ను కలకత్తా విశ్వవిద్యాలయంలోని కాన్వొకేషన్ హాల్‌లో హత్య చేసేందుకు ప్రయత్నించింది. ఈ సంఘటన వలన అరెస్టయిన 1939 లో ఆమె విడుదలైన తర్వాత దాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1942 లో, ఆమె క్విట్ ఇండియా ఉ ద్యమంలో పాల్గొంది 1942 నుండి 1945 వరకు మళ్లీ జైలు శిక్ష అనుభవించింది. 1946 నుండి 1947 వరకు, ఆమె బెంగాల్ ప్రావిన్షియల్ శాసనసభ సభ్యురాలు. 1947 నుండి 1951 వరకు, పశ్చిమ బెంగాల్ శాసనసభ సభ్యురాలు. 1960 లో భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రదానం చేసింది. ఆమె భర్త మరణం తర్వాత ఒంటరితనాన్ని అనుభవిస్తూ, అజ్ఞాత జీవిగా 26 డిసెంబర్ 1986 న పాక్షికంగా కుళ్లిపోయిన స్థితిలో రోడ్డు పక్కనుండి వెలికితీశారు.

ప్రేమించిన వ్యక్తి కళ్ళముందు చనిపోతున్నా దుఃఖాన్ని నొక్కి పెట్టి పోరాడిన కల్పన, సమాజ కట్టుబాట్లను ఈడ్చి తన్నిన

సుహాసినిని, కళ్ళ ముందు భర్తను చంపినా 'అతను ద్రోహి' అని కోర్టులో సాక్ష్యం చెప్పిన నేత్ర సేన్ భార్య, స్వతంత్రం కొరకు పోరాడి చికిత్స దొరకక కన్న కొడుకు మరణిస్తున్నా కడుపుకోతను తట్టుకున్న సావిత్రి, అమ్మాయిలతో కత్తి తిప్పించిన కళ్యాణి. వాళ్ళలో ఎన్ని భిన్న ఉద్వేగాలు.

**ముగింపు :** స్వతంత్రం అనే వజ్రాయుధాన్ని మనకి అందిచటం కొరకు, ఈ భూమి మీద నిశబ్దంగా నడిచి నిష్క్రమించారో. మైకు ముట్టకుండా, తుపాకులు, కత్తులతో యుద్ధం చేసి, తమ రక్తాన్ని మనకొరకు దారపోసిన వారి పేర్లు కూడా వార్తల్లోకి రాలేదు. ఇంకా ఎంతమంది స్త్రీలు మనకోసం పోరాడి నిశబ్దంగా నిష్క్రమించారో తెలియట్లేదు.తెలిసిన వాళ్ళు కొందరైతే తెలియని వాళ్ళు ఎందరో ఉండవచ్చు. ప్రస్తుతం వారి మీద దృష్టి పెట్టి, వారి జీవితాలు నుండి స్ఫూర్తి పొందే సమయమిది.

విచిత్ర విషాదం ఏమిటంటే భారత స్వతంత్రం కొరకు ఏ గడ్డ మీద నిలబడి పోరాటం చేశారో ఇప్పుడు ఆ చిట్టగాంగ్ నేల భారత భూభాగంలో లేదు. మతప్రాతిపదికి మొదట తూర్పు పాకిస్తాన్లో ఉండి మరలా 1971 లో బంగ్లాదేశ్ లోకి వెళ్లిపోయింది మనకోసం నిశబ్దంగా నిష్క్రమించిన వారిని మనం పూర్తిగా విస్మరించాం . ఇప్పుడు మనం చేయాల్సిందల్లా ఒక్కటే, అది- ఆ వీరుల త్యాగాలను గౌరవిస్తూ వాళ్ళు చూపిన ఆదర్శాన్ని మనం ఆచరించటం. స్త్రీలకి అన్నింట్లో సమాన అవకాశాలు ఇస్తే ఇంకెన్ని అద్భుతాలు చేస్తారో ఆలోచించాలి. అదే మన కోసం ప్రాణాల్పించిన వీర విప్లవ వనితలకు మన ఇవ్వాల్సిన అసలైన నివాళి.

**ఆధార గ్రంథాలు :**

1. ద చిట్టగాంగ్ రివోల్ట్ 1930-1934- సునితి భూషణ్ కునాగా.
2. ఈస్టర్ రెబెలియన్ ఇన్ ఇండియా బీ ది చిట్టగాంగ్ అప్ రైజింగ్ - మల్లికార్జున శర్మ.
3. డూ అండ్ డై - మానవి ఛటర్జీ.
4. చిట్టగాంగ్ ఆర్మరీ రైడర్స్, రెమెనిసెన్స్- కల్పన దత్.
5. చిట్టగాంగ్, ద సమ్మర్ ఆఫ్ 1930- మనోషి భట్టాచార్య.
6. ఎ మెమోరి - బీనా దాస్.
7. చిట్టగాంగ్ విప్లవ వనితలు - పింగళి చైతన్య .
8. ద ఉమెన్ రివల్యూషన్ ఆఫ్ బెంగాల్ 1905-1939 - తీర్థమండల్.
9. డికేడ్స్ ఆఫ్ డేరింగ్ డీడ్స్ - సత్య వ్రత ఘోష్.
10. ద హిస్టరీ ఆఫ్ డూయింగ్ - రాధా కుమార్.
11. మానుషి, వికీపీడియా మరియు మరికొన్ని ప్రముఖ వెబ్ సైట్లు.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు – జాతీయోద్యమ ప్రభావం

**గెద్దెల మోహిణి,** తెలుగు శాఖ, యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్. సెల్ : 8106957941

బ్రిటిష్, మరియు ఇతర వలస పాలకుల పరిపాలనలో బానిసత్వంతో మగ్గుతూ దేశ ప్రజలు హింసకు గురవుతున్న భారతదేశంలో వలస పాలకులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యసముపార్జనకై జరిగిన ఉద్యమాలన్నింటిని కలిపి భారత స్వాతంత్ర్యోద్యమం (%ఱఅఎఱఅ టతీవవసశీఎ ర్‌తీబస్త్రస్త్రశ్రీవ% ) అంటారు. దీనినే జాతీయోద్యమం అని కూడా అంటారు. సహాయనిరాకరణ ఉద్యమం, శాసనోల్లంఘన ఉద్యమం, ఉప్పుసత్యాగ్రహం, విదేశీ వస్త్రబహిష్కరణ, విదేశీ వస్తుబహిష్కరణ మొదలైనవన్నీ జాతీయోద్యమంలోని భాగాలు. ఈ జాతీయోద్యమంలో మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, వల్లభాయ్ పటేల్, బాలగంగాధర్ తిలక్, సుభాష్ చంద్రబోస్ వంటి అనేకమంది స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొన్నారు. వీరిలోదుర్గాభాయ్ దేశముఖ్, అనిబిసెంట్, సరోజినీనాయుడు, మొదలయిన అనేకమంది స్వాతంత్ర్య సమర వీరనారీమణులు కూడా ఉండటం విశేషం. శాసనోల్లంఘన ఉద్యమం, విదేశీ వస్త్రబహిష్కరణ మొదలయిన కొన్ని ఉద్యమాలలో మహిళలుపెద్దఎత్తున పాల్గొన్నారు.

జాతీయోద్యమ కాలంలో ప్రజలను చైతన్యపరిచేలా ఉద్యమ ప్రచారాలతో పాటు పెద్దఎత్తున ఉద్యమానికి సంబంధించిన సాహిత్యం, సాహిత్యపత్రికలు మొదలయినవి కూడా వెలువడ్డాయి. జాతీయోద్యమంలో పాల్గొన్నవారే కాకుండా ఇతర కవులు, కవయిత్రులు కూడా జాతీయోద్యమ ప్రభావం చేత, ప్రజలను చైతన్యపరుచుట కొరకు సాహిత్య రచనలు చేశారు. ఈ జాతీయోద్యమ సాహిత్యం కథలు, నాటకాలు, కవితలు, నవలలు, లేఖలు మొదలయిన అనేక ప్రక్రియల ద్వారా వెలువడింది. ఇందులో స్త్రీల కోసం, స్త్రీల స్వాతంత్ర్యంకోసం వచ్చిన సాహిత్యం, స్త్రీల చేత రాయబడిన సాహిత్యం కూడా ఉన్నది.

**కనుపర్తి వరలక్ష్మమ్మగారి జీవితం – దేశ భక్తి :** మొట్ట మొదటి స్వర్ణకంకణ సత్కార గ్రహీత, సుప్రసిద్ధ రచయిత్రి అయినకనుపర్తి వరలక్ష్మమ్మగారు 1886 అక్టోబరు 6 వ తేదీన బాపట్లలో పాలపర్తి శేషయ్య హనుమాయమ్మ దంపతులకు జన్మించారు. ఆమెకు చిన్న వయసులోనే అనగా పన్నిండేళ్లకే కనుపర్తి హనుమంతరావుగారితో వివాహం జరిగింది. వరలక్ష్మమ్మగారు రచయిత్రిగా, సారస్వత మూర్తిగా, ఉన్నతంగా ఎదగడానికి హనుమంతరావుగారు ఎంతగానో ప్రోత్సహించేవారు.

ఆ రోజుల్లో ఆడపిల్లలకి చదువు అవసరం లేదు. ఇంటిని చక్కదిద్దుకుంటూ భర్తకు అనుకూలంగా ఉంటే చాలు. అలాంటి రోజుల్లో వరలక్ష్మమ్మగారు కనిపించిన ప్రతి పుస్తకము, ప్రతి పత్రిక చదివేవారు. తన అన్నగారి ప్రోత్సాహంతో వీరేశలింగం గారి వ్యాసాలు చదివి వాటి సారాంశాన్ని వారి సొంత మాటలతో రాసేవారు. “స్త్రీలు విద్యనభ్యసించాలి” అని చెప్పిన కోటికలపూడి సీతమ్మ గారి ఉపన్యాసం విని నేను విద్యాభ్యాసం చేయాలి అనుకున్నారు. అన్నగారి ప్రోత్సాహంతో దిరికిన ప్రతి అవకాశాన్ని చేజిక్కించుకుంటూ గ్రంధాలయాలలోని పుస్తకాలు చదవడం, రకరకాల పరీక్షలు రాయడం చేసేవారు.

“వరలక్ష్మమ్మ గారి అన్న ఒకసారి ఒక ఆంగ్ల కథని వినిపించి ఆ కథని తెలుగులో స్వంతముగా వ్రాయమన్నారు. వరలక్ష్మమ్మగారు అలాగే తన శక్తియుక్తులన్నీ క్రోడీకరించి వ్రాసారు. ‘సౌదామిని’ అనే కాలం పేరుతో ఆ కథని అనసూయ అనే పత్రికకు పంపారు” (కనుపర్తి వరలక్ష్మమ్మ, పుట 20). అప్పటి నుంచే కనుపర్తి వరాలక్ష్మమ్మ గారి రచనా వ్యాసంగం మొదలైందని చెప్పవచ్చు. కథలు, నవలలు, నాటికాలు, వ్యాసాలు, కవితలు, లేఖలు ఇలా ఎన్నో రచనలు చేశారు. అప్పటి ప్రసిద్ధ పత్రికలైన భారతి, గృహలక్ష్మి, అనసూయ, వినోదిని మొదలయిన పత్రికల్లో ప్రచురించేవారు. ఆమె సాహిత్య కృషికి గుర్తింపుగా 1934 లో గృహలక్ష్మి స్వర్ణకంకణ సత్కారం పొందారు. ( గృహలక్ష్మి పత్రిక వారు స్వర్ణకంకణం బహూకరించడం ఇదే మొదటిసారి), 1967 లో ఆంధ్ర సాహిత్య అకాడమీ ఉత్తమ రచయిత్రి పురస్కారం లభించింది. 1930 లో ‘స్త్రీ అబల కాదు’ అనే శీర్షికతో గృహలక్ష్మి పత్రికవారు నిర్వహించిన వ్యాస రచనల పోటీలో స్వర్ణ పతకం లభించింది. అలాగే మరెన్నో సన్మానాలు, సత్కారాలు పొందారు.

వరలక్ష్మమ్మ గారు స్త్రీ జనోద్ధరణ కై స్త్రీ హితైషిణీ మండలి, ఆంధ్ర మహిళా సభ వంటి సంస్థల్ని స్థాపించారు. తన ఉపన్యాసాల ద్వారా మహిళల్లో చైతన్యం రగిలించేవారు. మహిళాభ్యుదయ ఆవశ్యకతను గురించి అనేక ఉపన్యాసాలిచ్చేవారు.

**దేశభక్తి :** 1921 సహాయనిరాకరణోద్యమం ముమ్మరంగా జరుగుతున్నరోజుల్లో "స్వారాజ్యనిధి సేకరణకై మహాత్మా గాంధీ ఆంధ్రప్రాంత పర్యటన చేస్తూ మచిలీపట్నం వెళ్ళినప్పుడు వరలక్ష్మమ్మగారు గాంధీజీని కలిశారు. అప్పుడామే రాట్నం పై వడికి ఉంచిన నూలు ఒక మాలగా పట్టుకొని వెళ్లారు. అప్పుడు గాంధీజీ గారు నవ్వి రోజూ నూలు వాడుకుతున్నారా? మరి మిల్లు చీర కట్టుకున్నారేం? ఇక నుంచైనా ఖద్దరు కడతారా?" అని అడిగారు."( కనుపర్తి వరాలక్ష్మమ్మ, పుట 57.) అలాగే అని మాట ఇచ్చి తాను తెచ్చిన మాలతో పాటు స్వరాజ్య నిధికై తన చేతి ఉంగరాన్ని గాంధీజీకి సమర్పించారు. అప్పటి నుంచి వరలక్ష్మమ్మ గారు ఖద్దరు వస్త్రాలే కట్టారు. ఒంట్లో ఓపిక ఉన్నంతవరకు రాట్నం వడికారు. జాతీయోద్యమ సంబంధ రచనలు చేశారు. దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించారు. దేశం గురించిననాటికలు పాటలు స్వయంగా రాసి విద్యార్థినుల చేత పాటలు పాడించి, నాటికలు వేయించేవారు. వరలక్ష్మమ్మ గారు ప్రత్యక్షంగా ఉద్యమంలో పాల్గొనలేదు జైలుకి వెళ్లలేదు కానీ విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్త్ర ధారణ, రాట్నం పై నూలు వడకడం మొదలయిన విషయాలను గురించిన తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించేవారు.

**కథలు – జాతీయోద్యమ ప్రభావం :** కనుపర్తి వరలక్ష్మమ్మ గారి రచనలలో దీర్ఘ సుమంగళీ భవ, రెండు కోర్కెలు, నేనే అపరాధిని, ముందుకథ, కన్యాశ్రమము మొదలైన అనేక కథలు ఉన్నాయి. కానీ వాటిలో కొన్ని కథలు స్త్రీల స్వతంత్రతను గురించి, కొన్ని సామాజిక చైతన్యం గురించి రచించిన కథలుగా చెప్పవచ్చు.కుటీర లక్ష్మీ, ప్రేమ ప్రభావము, ఐదుమాసముల ఇరువది దినములు, అనే ఈ మూడు కథలు మాత్రం జాతీయోద్యమ ప్రభావంతో రచించినవిగా కన్పిస్తున్నాయి.

**1. కుటీరలక్ష్మీ : (ఏప్రెల్, 1924. ఆంధ్ర పత్రిక)** ఈ కథలో భర్త వెంకటస్వామి మరణానంతరం అతని భార్య రామలక్ష్మి తన ఇద్దరి పిల్లలను రాట్నం తిప్పినూలువడికి పోషిస్తుంది. వెంకటస్వామి పిత్రుపితామహుల కాలం నుండి రంగుల అద్దకం వృత్తిగా కలవాడు. వర్తకులిచ్చిన నూలు వస్త్రములకు రంగులద్ది మరల అవర్తకులకే అప్పగించేడివారు. వెంకట స్వామి తండ్రి రామస్వామి, అతని తండ్రి వీరస్వామి ఉన్నంతకాలం వ్యాపారం కొద్దిగా సాగుతుండెడిది. రామస్వామి మరణానంతరం అ భాద్యత వేకటస్వామి మీద పడింది. వెంకటస్వామి తన మేన మరదలు రామలక్ష్మిని వివాహమాడాడు. వెంకటస్వామి వ్యాపార మెళుకువలు బాగా తెలిసిన వాడు అవ్వటం చేత తానే స్వయంగా బొంబాయి నుంచి వేరు వేరు రంగులు, బట్టలు తెప్పించి రంగులద్దించి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి వ్యాపారము సాగించేడి వాడు.

వ్యాపారము మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్టుగా సాఫీగా సాగిపోతుంది. రెండు సంవత్సరాలు గడిచాయి. 1914 వ సంవత్సరం ఐరోపాలో ఘోరమైన సంగ్రామం ప్రారంభమైంది. ప్రతి చిన్న వస్తువుకు పర దేశముపై ఆధారపడియున్న హిందూ దేశములో ధరలు పెరిగిపోయాయి. అందువల్ల వెంకటస్వామికి వ్యాపారంలో నష్టం వచ్చింది. అయినా ఎలాగోలా అ వ్యాపారాన్ని కొనసాగిస్తుండగా ఒకానొకరోజు తన అద్దకపు కొట్లకు నిప్పంటుకొన్నదని వార్త విని వెంకటస్వామి హఠాన్మరణం చెందాడు. తన భార్య రామలక్ష్మి కి నా అన్నవాళ్లు ఎవరూ లేకపోవడంతో దిక్కులేనిది అయిపోయింది. తన ఇద్దరి పిల్లలను పోషించుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఆ ఇంటా ఈ ఇంటా పిండి విసిరి బట్టలు కుట్టి అతి కష్టం మీద పిల్లలను సాకుతూ వచ్చింది.

అది 1921 వ సంవత్సరం. ఆంధ్ర దేశంలో స్వతంత్ర్యోద్యమం లో భాగమైన సహాయ నిరాకరణోద్యమం మహా విజృంభణ స్థితిలో జరుగుతున్నది. ఎక్కడ చూచిన ఖద్దరు సంఘములు, జాతీయ పాఠశాలలు, మధ్యపాన నిషేధములు, ఏ ఇంత చూచిన రాటములు. ఇలా ఉంది పరిస్థితి. ఒక రోజు రామలక్ష్మి కొడుకులు తీసుకొని వచ్చిన కాగితము లోని ప్రకటన చూసి ఇంట్లోనే ఉండి రాట్నము తిప్పి నూలు వడికే పనికి సంసిద్ధమవుతుంది. అలా నూలు వడుకుతూ రామలక్ష్మి జీవనం కొనసాగిస్తుంది.

కనుపర్తి వరలక్ష్మమ్మగారు ఈ "కుటీరలక్ష్మీ" కథలో జాతీయోద్యమం లో భాగమైనసహాయ నిరాకరణోద్యమం గురించి అందలో భాగాలైన ఖద్దరు వస్త్ర ఉత్పత్తి, మధ్యపాన నిషేదం, జాతీయ పాఠశాలలు మొదలైన వాటి గురించి చెప్పారు. జాతీయోద్యమంలో ప్రధాన ఘట్టాలుగా రాట్నం తిప్పి నూలు వడకడం, విదేశీ వస్త్ర బహిష్కరణ చేయడం అనేవి జరిగాయి. వరలక్ష్మమ్మగారు స్వయంగా ఆ పరిస్థితులను అనుభవించిన వారు కావడం వల్ల ఆ ప్రభావం చేతనే ఈ కథరాశారుఅని చెప్పడానికి

నిదర్శనంగా దారిద్ర్యం అనుభవిస్తున్న రామలక్ష్మీ సహాయ నిరాకరణోద్యమ కాలంలో నూలు వడికి తన పిల్లలను పోషించకున్నట్లు చెప్పారని చెప్పవచ్చు.

**2. ప్రేమ ప్రభావము : (మే, 1927. భారతి)** ప్రేమ ప్రభావము అనే కథలో వెంకయ్యనాయుడి కొడుకు రామస్వామి గాంధీ మహాత్ముని ప్రచారముల వలన ప్రభావితుడై చదువు సంధ్యలు మాని తండ్రి మాటకు వ్యతిరేకంగా జాతీయోద్యమంలో పాల్గొని జైలుకేళతాడు. తరువాత తండ్రి కూడా మారి కొడుకు మాటకు విలువిచ్చి ఖద్దరు ప్రచారం చేస్తాడు. వెంకయ్యనాయుడు బ్రహ్మణ వ్యతిరేకి. అతని భార్య లక్ష్మీదేవి దైవభక్తి బ్రాహ్మణ గౌరవం కలది. రామస్వామి వెంకయ్యనాయుడి ఏకపుత్రుడు, ఇరువదిమూడేండ్ల వయసు రామస్వామికి వెంకయ్యనాయుడుకు, ప్రహ్లాద హిరణ్యకొసిపులకున్నంత తారతమ్యమున్నది. తండ్రి చేసే అకృత్యాలు రామస్వామికి గిట్టవు. కానీ ఇతర విషయములు పట్టించుకోడు. తన చదువు తనదే. అతను చదువు రీత్యా మద్రాసులో ఉంటాడు.

వెంకయ్యనాయుడు రామస్వామికి పెళ్లి చేయుట కొరకు ఏ పిల్ల వలన ఎక్కువ ఆస్తి వచ్చునో ఏ పిల్ల తండ్రి ఎక్కువ అధికార ప్రాభల్యం కలవాడో అని ఆలోచిస్తాడు. తల్లి అ విషయము రామస్వామికి చెప్తుంది. రామస్వామి అందుకు ఒప్పుకోడు. తిరిగి చదువు కొరకు వెల్లవపోతాడు. 1921వసంవత్సరం గాంధీజీ అసహాయోద్యమ తత్వమును ఆంధ్ర దేశమంతా పర్యటించి ప్రచారము చేయుచున్నాడు. సత్యము, త్యాగము, అహింసా, ఐకమత్యము, అను నాలుగు సూత్రముల గురించి, విదేశి వస్త్రములు, మధ్యపాన నిషేధము, మొదలయిన షడ్విధ బహిష్కారముల గురించి ఉపన్యసించిన గాంధీజీ మాటలకు ప్రభావితం కావడం వల్ల తాను ఉద్యమంలో చేరాలని నిశ్చయించుకుంటాడు. తన స్నేహితుని మాటను సైతం లెక్కచేయడు చదువుమాని స్వగ్రామం చేరుతాడు.

తండ్రి వెంకయ్యనాయుడు కొడుకును ఉద్యోగం చేసితీరవలసిందేనని లేనిచో ఈ ఇంట్లో ఉండవద్దని చెప్తాడు. అందుకుగాను తల్లి బాధ పడుతుంది. రామస్వామి తల్లికి ఉద్యమ తత్వమును వివరించి ఒప్పించి ఉద్యమానికి వెళతాడు. సహాయనిరాకరణ ఉద్యమంలో ఉండగా రామస్వామి జైలుకి వెళతాడు. అ విషయము తెలిసిన రామస్వామి తండ్రి కొడుకుమీద ప్రేమతో మనసు మార్చుకొని అతను ఉద్యమములో చేరి ఖద్దరు ప్రచారం చేయనారంభించాడు. వెంకయ్యనాయుడికి బ్రాహ్మణద్వేషం పోయింది. భారతీయులంతా ఒక్కటే అనిపించింది. తిండి నిద్రలు మరచి ఖద్దరు వస్త్రములు విక్రయిస్తాడు. రామస్వామి జైలు నుంచి విడుదలయ్యే సమయానికి తండ్రిని ఖద్దరు వస్త్రములతో చూసీ ఆశ్చర్యానందములకు గురవుతాడు.

ఈ కథ కనుపర్తి వరలక్ష్మమ్మగారి నిజ జీవితంలోని ఒక సంఘటనను తలపిస్తున్నది. వరలక్ష్మమ్మగారు గాంధీజీగారిని కలిసిన తరువాత జాతీయోద్యమంలో పాల్గొన్నారు. అలాగే ఈ కథలో కూడా రామస్వామి గాంధీజీ ఉపన్యాసం విని ప్రభావితుడైనాడు. అలాగే ఈ కథలో వరాలక్ష్మమ్మగారు ఉద్యమతత్వాన్ని గురించి గాంధీజీ గారి ఉపన్యాసముల గురించి 1921 వ సంవత్సరం నాటి ఆంధ్రదేశంలోని జాతీయోద్యమ స్వరూపం మొదలయిన వాటిని వివరించారు. వరలక్ష్మమ్మగారు ఆంధ్రదేశంలోని సహాయ నిరాకరణోద్యమ ఘట్టాన్ని ప్రేమ భావము అను పేరుతో ఒక చిన్న కథగా మలిచారని చెప్పవచ్చు.

**3. ఐదుమాసముల ఇరువది దినములు : (అక్టోబర్ 1931. గృహలక్ష్మి)** సత్యాగ్రహొద్యమంలో పాల్గొని భర్త జైలుకి వెళ్ళగాభార్య భర్తను అర్థం చేసుకొని అతని దారిలో నడవడం గురించి చెప్పిన కథ "ఐదుమాసముల ఇరువది దినములు" గాంధీజీగారు జాతీయోద్యమంలో భాగమైన సత్యాగ్రహము ప్రారంభించి ఉద్యామంలో పాల్గొనుటకు ప్రజలకు ఆహ్వానం పలుకగా మాతృదేశమనిన పరమభక్తి కలిగిన గోపాలరావు ఆహ్వానాన్ని అందుకొని విదేశీవస్త్ర బహిష్కరణ కార్యక్రమాన్ని చేపడతాడు. పురిటి కోసం పుట్టింటికి వెళ్ళిన తన భార్యకు కొడుకు జన్మిస్తాడు. కొడుకు పుట్టి ఐదు నెలలయింది వచ్చి బారసాల చేసుకొని తన భార్యని తీసుకొని వెళ్ళమని తన మామగారు ఉత్తరములు రాసిన సత్యాగ్రహొద్యమంలో మునిగితేలుతున్న గోపాలరావు ఆ ఉత్తరాలకు జవాబు ఇవ్వలేదు. చివరికి తన భార్య రుక్మిణిని అత్తమామలు బిడ్డ సారే పెట్టి పంపించారు. విదేశీ వస్త్రములు ధరించి యున్నదని భార్యతో మాట్లాడకుండానే గోపాలరావు వెళ్ళిపోతాడు. అతని ప్రవర్తనకు రుక్మిణీ బాధపడుతుంది. ఆ ప్రవర్తనకు కారణం ఆమెకు అర్థం కాలేదు.

గోపాలరావు మళ్ళీ రాత్రి పదిగంటలకు ఇంటికి వస్తాడు. విదేశీ వస్త్ర బహిష్కార ప్రచారము చేస్తున్నందులకుగాను పోలీసు వచ్చి తీసుకెళ్తాడు. కోర్టులో గోపాలరావుని చూచి కోర్టు మెజిస్టరేటు కొన్ని ప్రశ్నలు వేసి డిఫెన్సు పెట్టుకుంటావా, అపాలజీ అని అడగగా "సత్యాగ్రహ వీరుల నిఘంటువుల నుండి డిఫెన్సు అపాలజీ అనే పద్యములు తుడిచివేయబడియనవి" (ఐదుమాసముల ఇరువది దినములు కథ) అంటాడు గోపాలరావు. చివకు ఆయనకు ఆరునెలలు జైలు శిక్ష విధించారు. భార్య రుక్మిణి ఎనిమిది నెలల తరువాత ఆ రోజే ఇంటికి వచ్చింది. తన పరిస్థితికి బాధపడుతుంది. కానీ చివరకు తన భర్త తనతో ఎందుకు మాట్లాడలేదో తెలుసుకొని, తన భర్త ఎందుకు జైలుకి వెళ్లాల్సి వచ్చిందో తెలుసుకొని ఆశ్చర్యపోయి మనదేశపు గుడ్డ మనం కట్టుకోవడం తప్పా అని బాధపడుతుంది. ఆమె కూడా విదేశీ వస్త్రములు మాని ఖద్దరు వస్త్రములు ధరించటం మొదలుపెట్టింది.

రుక్మిణీ రాట్నంతో నూలు వడికి ఖద్దరు తయారుచేయడం నేర్చకుంది. తోటి స్త్రీలు కూడా ఖద్దరు ధరించేలా చేసింది. తన భర్త కోసం తానే స్వయంగా నూలు వడికి ఖద్దరు బట్టలు నేయించిపెడుతుంది. రుక్మిణి సంక్రాంతి పండుగ కారణంగా సావిత్రిగౌరిని ప్రతిష్టించి నోము నోచుకుంటుంది. గోపాలరావు సత్ప్రవర్తన కారణంగా ఆరు నెలలు పూర్తి కాకుండానే ఐదుమాసముల ఇరువది దినములకే జైలు నుండి బయటకు వస్తాడు. ఆ రోజు రుక్మిణి ఎనిమిదోరోజు పూజలో ఉంటుంది. దేవికి సమర్పించడానికి ఉంచిన కుసుమ మాలను గోపాలరావుకు అందించబోయింది రుక్మిణి అది గమనించిన గోపాలరావు సీమ నూలుతో చేసినదేమో నేను ముట్టను అంటాడు. అంతట రుక్మిణి సీమ నూలు నా చేతి నుండి తొలగి "ఐదుమాసముల ఇరువది దినములు" అంటుంది.

కనుపర్తి వరలక్ష్మమ్మగారు ఈ కథలో కూడా సత్యాగ్రహోద్యమం, విదేశీ వస్త్ర బహిష్కరణ, ఖద్దరు వస్త్రధారణ స్వాతంత్ర్య పోరాట యోదులు జైలుకి వెళ్ళడం మొదలయిన వాటిని చెప్పారు.

**ముగింపు :** పైన చెప్పుకొన్న మూడు కథలలోనూ కనుపర్తి వరలక్ష్మమ్మగారు ప్రత్యేకంగా జాతీయోద్యమంలో భాగమైన సత్యాగ్రహోద్యమం, విదేశీ వస్త్రబహిష్కరణ, ఖద్దరు ధారణ, రాట్నం వడికి నూలు తీయడం వీటి గురించి చెప్పారు. అందువల్ల వరలక్ష్మమ్మగారి రచనల మీద, జాతీయోద్యమ ప్రభావం ఉన్నదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కుటీరలక్ష్మీ కథలో బతుకు తెరువు కోసం రాట్నం ఉపయోగపడినట్లు చెప్పారు. మిగిలిన ప్రేమప్రభావము,ఐదుమాసముల ఇరువది దినములు రెండు కథలుఒకే తీరుగా ఉన్నవి. మొదటిది ఉద్యమ కారణంగా కొడుకు జైలుకి వెళ్ళగా తండ్రిలో మార్పు వచ్చినట్లు చెప్పారు. రెండవది భర్త జైలుకి వెళ్ళగా భార్య లో మార్పు వచ్చినట్లు చెప్పారు.

**ఉపయుక్త గ్రంథసూచీ :**

1. కనకదుర్గ, జంద్యాల. స్వతంత్రత నుండి స్వాతంత్ర్యానికి (తెలుగులో స్త్రీల సాహిత్యం క్రీ. శ. 1900 %--% 1947 ). జకందు ప్రచరణలు, గుంటూరు: 2021.
2. రాజ్యలక్ష్మి, పోలాప్రగడ. కనుపర్తి వరలక్ష్మమ్మ. న్యూఢిల్లీ: సాహిత్య అకాడమీ, 2000.
3. లక్ష్మీకాంతమ్మ, ఊటుకూరి. ఆంధ్ర కవయిత్రులు. హైదరాబాదు: దక్షిణ భారత ప్రెస్, 1975.

**వ్యాసాలు :**

1. మాలతి, నీడదవోలు. కనుపర్తి వరలక్ష్మమ్మగారు(వ్యాసం). తెలుగు తూలిక (అంతర్జాల పత్రిక). జూలై 16,2009.
2. శాంతి ప్రబోధ, వి. స్త్రీల సాహిత్యం %--% కథ 1850 %--% 1960(వ్యాసం). విహంగ(అంతర్జాల మహిళా సాహిత్య పత్రిక), 01-01-2015.
3. శోభారాణి, కందాల. తొలితరం తెలుగు కథా రచయిత్రులు సంస్కరణోద్యమ జాతీయోద్యమ చైతన్యం(వ్యాసం). స్త్రీవాద పత్రిక భూమిక. 08-16-2011.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి – ఆరుట్ల కమలాదేవి

**డా॥ బూర్గుల స్వరూప,** తెలుగు సహాయాచార్యులు, ఎం.వి.యస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ), మహబూబ్‌నగర్ సెల్: 9000982008

**ప్రజలే తన దేవుళ్లు అన్న పవిత్ర ఆత్మకు జేజేలు.**
**సమానత్వమే సార్థకతయని నమ్మిన సాధ్వికి జేజేలు**
**కొందరు జన్మించి భూమికి భారమవుతారు**
**ఎక్కువ మంది కుటుంబం కోసం శ్రమిస్తారు**
**కొద్ది మంది మాత్రమే అందరి కోసం తమ జీవితాలను అంకితం చేస్తారు.**
**అలాంటి కొద్ది మందిలో ఆరుట్ల కమలాదేవి ఒకరు అని చెప్పవచ్చు.**

తెలంగాణ సాయుధ పోరాట నాయకురాలు స్వాతంత్ర్య సమరయోధురాలు ఉన్నత ఆశయాలు కలిగిన కమ్యూనిస్టు. ఆంధ్ర రాష్ట్ర మహిళా ఉద్యమ నిర్మాణంలో నిరంతరం కృషి చేసిన ధీరవనిత మన కమలాదేవి గారు. నిజాం పాలనను అంతమొందించుటకు జరిగిన పోరాటంలో నిస్వార్థంగా, అంకిత భావంతో పోరాటం చేసిన వీరవనిత ఆరుట్ల కమలాదేవి.

**బాల్య వివాహం:** ఆరుట్ల కమాలదేవి నల్గొండ జిల్లా ఆరేలు తాలుకా మంతపురి అనే గ్రామంలో 1920 జూన్‌లో జన్మించారు. పుట్టినప్పుడు తల్లిదండ్రులు ఆమెకు రుక్మిణి అని పేరు పెట్టారు. మధ్యతరగతి రైతు కుటుంబం వారిది. నిజాం కాలంలో పౌర హక్కులకు స్వేచ్ఛ లేని కాలం. సనాతన ఆచారాలు, మూఢ విశ్వాసాలు, కులమత తత్వం, అంటరానితనం వ్యవస్థను శాసిస్తున్న రోజులవి. పల్లెటూళ్లలో పాఠశాలలు ఉండేవి కావు. ఆరోజులలో ఆడపిల్లలకు చదువులు ఊహించడం కూడా తప్పే. అందువల్ల రుక్మిణి బాల్యం ఇంటికే పరిమితమైంది. ఆడపిల్లలకు బాల్యంలోనే వివాహాలు చేయడం ఆచారంగా ఉంది. రుక్మిణికి 11 సంవత్సరాల వయస్సు రాగానే తల్లిదండ్రులు పెళ్లి చేయాలని నిశ్చయించారు. రుక్మిణి పుట్టినప్పుడే మేనమామ కొడుకు ఆరుట్ల రామచంద్రారెడ్డి భార్య అవుతుందని రెండు కుటుంబాలు నిశ్చయించుకున్నవి. అప్పటికే ఆరుట్ల రామచంద్రారెడ్డి హైదరాబాదులో విద్యార్థిగా రెడ్డి వసతి గృహంలో ఉంటూ ఆంధ్ర మహా సభ సభ్యుడిగా, కాంగ్రెస్ కార్యకర్తగా, వందేమాతరం ఉద్యమకారుడిగా గుర్తింపు పొందారు. తల్లిదండ్రులు పెళ్లి ప్రస్తావన తేగానే బాలికగా ఉన్న రుక్మిణికి అప్పుడే పెళ్లి ఎందుకన్నారు. కొన్ని షరతులతో పెళ్లికి అంగీకరించాడు. పెళ్లి సాంప్రదాయ పద్ధతుల్లో కాకుండా ఆర్య సమాజపద్ధతుల్లో జరగాలి. కట్నకానుకలపద్ధతి ఉండకూడదు. పెళ్లయిన తర్వాత రుక్మిణి తన సహచరిగా రాజకీయాలలో పాల్గొనాలి అన్నాడు రామచంద్రారెడ్డి. ఇరుకుటుంబాల వారు షరతులు ఒప్పుకున్నారు. వివాహం జరిగింది. వివాహ వేదికపై రుక్మిణి పేరును కమలాదేవిగా మార్చారు. కమలాదేవిని తీసుకొని రామచంద్రారెడ్డి హైదరాబాద్ చేరాడు.

**చదువులతల్లి:** రామచంద్రారెడ్డి కమలాదేవిని చదివించాలని అని అనుకున్నాడు. కమలాదేవి ఈ వార్త వినగానే ఎంతగానో సంతోషించింది. మాడపాటి హనమంతరావు నెలకొల్పిన బాలికల పాఠశాలలో చేరింది. ఎక్కడ ఉండాలన్నది సమస్య. దంపతులిద్దరు రాజబహద్దూర్ వెంకటరామిరెడ్డి గారిని కలిసి బాలికలకు హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. దానికి వారు సరేనని బాలికల హాస్టల్ ఏర్పాటు చేశారు. ఆ బాలికల హాస్టల్‌లో కమలాదేవి ప్రథమ విద్యార్థిగా ప్రవేశించింది. పట్టుదలతో చదివి మెట్రిక్ పూర్తి చేసింది. విద్యతోపాటు రాజకీయాలు అర్థం చేసుకుంది. మహిళా ఉద్యమాలలో పాల్గొన్నది.

**నాటి తెలంగాణ గోస :** అప్పుడు తెలంగాణలో నిజాం రాచరిక పాలన ఉండేది. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ఆలోచన ప్రకారం నిజాం పాలన జరిగేది. సంస్థానాధీశులు, దేశ్‌ముఖ్‌లు లక్షల ఎకరాల భూమిని తమ ఆధీనంలో ఉంచుకునేవారు. భూస్వాములు గ్రామీణ పెత్తందారుల క్రింద గ్రామ ప్రజలు, రైతులు కష్టాలు పడ్డారు. అన్ని కులాల వాళ్లు అణిగి ఉండాల్సిందే. వెట్టిచాకిరి పేరుతో ప్రతిఫలం లేకుండా భూస్వాముల ఇండ్లలో పనిచేయాలి. తిరగబడితే దండన. ఇంటిలో పెంచుకున్న కోడినో, కుక్కనో

చంపినట్లుగా పేదలను చంపినా అడిగేవారు లేరు. చట్టం లేదు. తెలుగు భాషలో చదువుకునే అవకాశాలు లేవు. పాఠశాలలు, గ్రంథాలయాల స్థాపనకు అడ్డంకులు ఉండేవి. ఇట్లాంటి కష్టాలు ఆమెలో ఉద్యమ భావాలకు ప్రాణం పోశాయి. 1944లో పుట్టిన కొడుకుకు విప్లవం అని పేరు పెట్టింది. పురిటి బిడ్డను వదిలేసి కమలాదేవి ఉద్యమ కదనరంగానికి కదలింది.

**అక్షరాస్యతకై పోరాటం :**

**చల్లని వెన్నెల వంటి చిరునవ్వు,**
**అమృతం కురిసే ఆత్మీయమైన పలకరింపు**
**వయోభేదాలు పాటించని మమతల హరివిల్లు**

మృదుమధురమైన మాటల పూలజల్లు కురిసే కమలాదేవి జాతీయ భావాలతో ఎదుగుతూ ఇతరులకు ఏదైనా సహాయం చేయాలని నిరంతరం తపన పడేది. తనలాగే తన ఊరి జనులు చదువుకోవాలని ఆకాంక్షించింది. కొలనుపాకలో పాఠశాల స్థాపించాలని అనుకున్నది. అప్పుడు ఊరిలో బడిలేదు. అతి జాగీర్ గ్రామం. బడి పెట్టాలన్నా, గ్రంథాలయం నడపాలన్న ఆంక్షలు ఉండేవి. వంటశాల పేరుతో తలుపులు, కిటికీలు లేని స్థలంలో విద్యార్థులను ప్రోగుచేసి కమలాదేవి బడిని, గ్రంథాలయాన్ని నడిపింది. కొంత కాలానికి ఈ విషయం జాగీర్‌దారులకు తెలిసిపోయింది. వారు ఈ కేంద్రాన్ని మూసివేయించారు. కొలనుపాకలో పురాతన జైన దేవాలయం ఉన్నది. ఆ నిర్వహకులను అడిగి అక్కడ ఒక ఏడాది పాటు బడి నడిపి గ్రామీణ వయోజనులను అక్షరాస్యులుగా మార్చింది. దానితోపాటు రానున్న మహా సంగ్రామానికి రైతు కూలీలను సమరోన్ముఖులను గావించింది.

**ఉద్యమంలో కమలాదేవి:**

**నిజాం నిరంకుశత్వంపై పిడికిలెత్తిన సబల**
**శత్రువులపై విరుచుకుడిన వీరనారి!!**
**రెండో ప్రపంచయుద్ధం జరుగుతున్న రోజులవి.**

ఒకవైపు ప్రపంచ యుద్ధాలు, రెండోవైపు తెలంగాణాలో ప్రజా ఉద్యమజ్వాలలు, ఆంధ్ర మహాసభ ఒక ఉద్యమంగా రూపొందుతున్న సందర్భం. ఇటువంటి సమయంలో స్త్రీలకు ఆత్మరక్షణ అవసరమని భావించింది కమలాదేవి. కమ్యూనిస్టు పార్టీవారు నిర్వహించిన మహిళా ఆత్మరక్షణ శిక్షణా శిబిరంలో సైనిక శిక్షణ పొందింది. తుపాకి పట్టింది. భర్తతోపాటు తెలంగాణ సాయుధసమరంలో అడుగుపెట్టింది. రజాకర్లతో, నిజాం పోలీసులతో జరిగిన ప్రతిఘటన పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నది. చల్లూరుగుట్టల్లో జరిగిన చారిత్రాత్మక పోరాటంలో అపర కాళికవలే విజృంభించింది. పరాక్రమాన్ని ప్రదర్శించింది. అమెరికన్ రైఫిల్‌తో శత్రువులను తిప్పికొడుతూ దళానికి నష్టం వాటిల్లకుండా కాపాడింది. ఈ పోరాటంలో జబ్బు పడింది. ఆసుపత్రికి తీసుకెళ్తుండగా నిజాం పోలీసులు కమలాదేవిని అరెస్టు చేశారు. వరంగల్, ఔరంగాబాద్, సికింద్రబాద్, మొదలైన జైళ్లలో శిక్షలను భరించింది. వేలాదిమంది బలిదానంతో, వీరుల త్యాగాలతో నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి చెందింది. తెలంగాణ విమోచన స్వర్ణోత్సవాల సందర్భంగా అనేక సంస్థలు ఆరుట్ల కమలాదేవిని సత్కరించాయి. వీరు నిజంగా

అరణ్య అజ్ఞాతవాసాలు భరించిన సాహసి.
జైల్లోను హక్కుల కోసం పోరాడిన ధీశాలి.
భూస్వాముల గుండెల్లో రైళ్లుపరుగెత్తించిన విప్లవయోధ.
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఎగిసిన అగ్నిజ్వాల!!

**రాజకీయ చైతన్యం :** 1952 మొదటి సాధారణ ఎన్నికలలో ఆలేరు నుండి అత్యధిక ఓట్ల మెజార్టీతో శాసనసభకు ఎన్నికైంది. 1967 వరకు ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించి, ప్రజల ఆదరాభిమానాలను పొందింది.

1964లో శాసనసభలో ప్రతిపక్ష నాయకురాలిగా బాధ్యతలు నిర్వహించింది. స్వతంత్ర్య భారతదేశంలోని రాష్ట్రాల్లో మొట్టమొదటి ప్రతిపక్ష నాయకురాలిగా చరిత్ర సృష్టించింది. ప్రజల దైనిందిన సమస్యలపై అసెంబ్లీ లోపల, బయట క్రీయాశీలంగా పోరాడింది. పలుసమస్యలపై శాసనసభలో చర్చలు జరిగినప్పుడు వారి ప్రసంగంలో హుందాతనం, ఉన్నతభావాలు, ప్రజల సమస్యలపై అవగాహన స్పష్టంగా కనిపించేవి. 1988లో కాకతీయ విశ్వవిద్యాలయం ఆమెకు గౌరవడాక్టరేట్ ప్రధానం చేసింది.

**ముగింపు :** కమలాదేవి గారు సహృదయురాలు, సత్యాన్వేషి, కష్టజీవుల కడగండ్లు చూస్తూ కన్నీరుపెట్టిన కరుణామయి. కష్టాల నుండి శాశ్వత విముక్తిని సాధించే వరకు నిద్రపోని వ్యక్తిత్వం వీరిది. అందరిలాగే సామాన్య కుటుంబంలో జన్మించి, నాటి సామాజికస్థితికి అనుగుణంగా బాల్యవివాహం చేసుకొని భర్త ప్రోత్సాహంతో చదువుకొని, ఒక్కోమెట్టు ఎదిగి, రాజకీయ అవగాహనతో చురుగ్గా ఉద్యమంలో పాల్గొని మహిళా ప్రపంచానికి వెలుగుబాట చూపిన పుణ్యమూర్తి, మానవతావాది మన కమలాదేవి గారు మనందరికి మార్గదర్శకురాలు.

**ఉపయుక్త గ్రంథాలు:**

1) స్వాతంత్ర్య సమరంలో ఆంధ్ర మహిళలు
2) నవ వసంతం -2

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# భారతదేశ స్వాతంత్ర్యోద్యమపోరాటంలో – వీరనారీమణుల పాత్ర

డా. ఎం. ప్రభావతి, ఎస్.వి.ఎస్.డిగ్రీ కళాశాల.

భారతదేశం సంస్కృతి, సాంప్రదాయాలకు ఆలవాలమైంది. అటువంటి దేశం పరాయి వారి పాలనలో నలిగిపోతూ, ఎన్నో అవమానాలను భరిస్తున్న ప్రజలు వారిని మనదేశం నుంచి వెళ్లగొట్టడానికి నడుంబిగించి మనకు స్వాతంత్ర్యం కావాలి అని పోరాడిన పురుషులు ఎందరో ఉన్నారు. పురుషులతో పాటు స్వాతంత్ర్య సమరంలో పాలుపంచుకున్న వీరనారీమణులు లేకపోలేదు. ప్రాచీనకాలంలో ఆడవారు ఇంటి గుమ్మందాటి బయటకు రావాలంటేనే భయపడేకాలం అది. ఆధునిక కాలంలో పురుషులతో పాటు అన్ని రంగాలలో రాణించినట్లుగా, ఆనాటి కాలంలో స్త్రీలు కేవలం వంట ఇంటికి మాత్రమే పరిమితమై జీవిస్తున్న తరుణంలో స్త్రీలు సైతం స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొనడం అనేది గొప్ప విషయం అని చెప్పాలి.

భారత దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో యోధులతో పాటు సామాన్య ప్రజలు కూడా పోరాటం చేశారు. తమ పోరాటపటిమను తెగువను చూపించారు. భారత స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన ఎందరో మహానుభావులు లేకపోలేదు. అటువంటి వారు ప్రాణాలను అర్పించి భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకువస్తే ఇప్పుడు మనము ప్రశాంతంగా జీవిస్తున్నాము. మనకు ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు తెలిసి ఉండవచ్చు. కానీ, భారతీయ మహిళలు కూడా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని బ్రిటిష్ వారితో పోరాడి స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారు. భారత స్వాతంత్ర్య పోరాట కాలంలో భారతదేశంలోని మహిళలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉన్నారు. స్త్రీలు శక్తికి మూలం. స్వాతంత్ర్య పోరాటంలో స్త్రీల పాత్ర గణనీయమైనది. మార్పును తీసుకువచ్చింది.

భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో రక్తంమరిగే అంశాలు, రోమాలు నిక్కబొడుచుకునే సంఘటనలు ఎన్నో ఉన్నాయి. స్వేచ్ఛా భారతావని కోసం అశువులు బాసిన ఎంతోమంది త్యాగధనుల చరిత్ర ఇప్పటితరాల యువతకు ఎంతో ఉద్వేగభరితంగా, మరెంతో ఉద్విగ్నంగా పరిణమిస్తుంటుంది. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ కారణజన్ములనే భావనతో పాటు చరిత్రకారులనే భావన జనించకమానదు. స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటంలో కేవలం పురుషులే కాకుండా మహిళలు చూపిన తెగింపు కూడా అసాధారణమైనదిగా చెప్పుకోవచ్చు. ఎంతోమంది మహానుభావులు ప్రాణత్యాగం చేసి భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకొస్తే, వారితో సరిసమానంగా కొంతమంది మహిళలు కూడా తెగించి స్వేచ్ఛా భారతదేశం కోసం పోరాడారు. సాంప్రదాయాలకు, కట్టుబాట్లకు పెద్దయెత్తున ప్రాముఖ్యత ఇచ్చే రోజుల్లో మహిళలు స్వాతంత్ర పోరాటంలో పాల్గొని భారతదేశ పౌరుషాన్ని చాటారు. మహిళలు అయినప్పటికీ తెగించి బ్రిటీషర్లతో పోరాడారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారు.

బ్రిటిష్ వారు మన భారత దేశాన్ని దాదాపుగా 200 ఏళ్ళు పరిపాలించారు. వారు దేశంలో ఉన్నన్నిరోజులు వారికి వ్యతిరేకంగా ఏదో ఒక రూపంలో ఎన్నో పోరాటాలు జరిగాయి. ఆ పోరాటంలో ఎంతోమంది అసువులు బాసారు. అటువంటి పోరాటంలో పాల్గొన్న మహిళా సమరయోధులలో ఝాన్సీలక్ష్మీబాయి, సరోజినినాయుడు, సావిత్రిబాయి పూలే, కస్తూర్బాగాంధీ వంటి అతి కొద్దిమంది వనితల పేర్లు మాత్రమే ప్రముఖంగా వినపడుతూ ఉంటాయి. కానీ, ఇలా పోరాటంలో వీరితోపాటు సామాన్యమహిళలు సైతం తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశ స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొని బ్రిటిష్ పాలకులను గుజగజలాడించారు.

ఈ విధంగా తెగువ, సాహసం, చూపిన ప్రాణత్యాగం చేసిన మహిళలు చాలామంది ఉన్నారు.

**మాతంగిని–హజ్రా** :– సహాయ నిరాకరణ ఉద్యమంలో ఈమె కీలక పాత్ర పోషించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని భారతీయుల్లో జాతీయతను ప్రోత్సహిస్తుందని బ్రిటిష్ వారు ఈమెను కాల్చి చంపారు. "గాంధీ బురి"గా పిలువబడే ఈమె 71ఏళ్ల వయసులో ఉన్నప్పుడు పెద్ద జనసందోహంతో వెళ్లి బ్రిటిష్ పోలీస్ స్టేషన్ను ముట్టడించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో చివరకు ఊరు పేరు తెలియకుండా ఖాట్మండులో మరణించింది. మరణానంతరం ఆమె ధైర్యసాహసాలు, పోరాటపటిమకు గుర్తుగా భారత ప్రభుత్వం మే, 10, 1984లో బేగం హజ్రత్ మహల్ ఫోటో ముద్రించిన పోస్టల్ స్టాంపును విడుదల చేసింది.

**రాణి వేలు నాచియార్ :–** 1760–1796 కాలంలో మొట్టమొదటిగా బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి పోరాడిన మహిళారాణి వేలు నాచియార్. బ్రిటిష్ వారి నుంచి తమ రాజ్యాన్ని తాము తిరిగి దక్కించుకున్న కొద్దిమంది మహిళా సంఘం సమరయోధులలో ఒక యోధురాలిగా, వీరవనితగా ఘనతకెక్కిన తమిళమహిళ ఈమె. ఆమెకు సోదరులు ఎవరూ లేకపోవడం వల్ల చిన్నప్పటినుండి రాకుమారుడి లాగా పెరిగింది. వేలు నాచియార్ భర్త శివగంగ రాజు. 1772 లో ఆర్కాటు నవాబుతో కలిసి బ్రిటిష్ దళాలు శివగంగైను ఆక్రమించడానికి చేసిన కలైయార్‌కోయిల్ యుద్ధంలో శివగంగైరాజును హత్య చేశారు. అటుపిమ్మట శివగంగైకు చెందిన కొంతమంది శక్తివంతమైన సన్నిహితుల సాయంతో వేలు నాచియార్ దిండిగల్లో నివసించింది. ఆ సమయంలో సంకీర్ణ సేనలను తయారుచేసింది. 1780లో మైసూరు సుల్తాన్ హైదర్ అలీ సాయం తీసుకుని శత్రువులపై దాడి చేసింది. అప్పట్లోనే ఆమె సైన్యంలో ప్రాణాలను పణంగాపెట్టిన మానవబాంబు కుయిలీ పేరు ప్రఖ్యాతులు సంపాదించింది.ఆ యుద్ధంలో వేలు నాచ్చియార్ విజయం సాధించి, తన రాజ్యాన్ని చేజిక్కించుకుంది. ఇప్పటికీ తమిళనాడులో జనవరి 3న రాణి వేలు నాచియార్ జయంతిని వేడుకగా జరుపుకుంటారు. 2008 డిసెంబర్ 31న ప్రభుత్వం ఆమె శాశ్వత గుర్తుగా పోస్టల్ స్టాంపును విడుదల చేసింది.

**ఝుల్కారీభాయి :–** భారతసంగ్రామంలో పోరాడిన ప్రముఖ మహిళలలో ఒకరైన ఝాన్సీలక్ష్మీభాయి పేరు తలచుకున్న వెంటనే గుర్తుకు రావాల్సిన పేరు ఝుల్కారీభాయి. ఈమె ముస్లింమహిళ. పరదాల మాటున తప్ప పదిమందిలోకి సైతం స్త్రీలను అనుమతించని కాలంలో ఒక మహిళ యావత్ సామ్రాజ్య దర్గాసేనకి సేనానిగా ముందు వరుసలో నిలబడి, తలలు తెగి పడుతున్నా, తరగని గుండె నిబ్బరంతో సైన్యంలో సత్తువ నింపి ఉంటుందన్న ఊహ కూడా మనకు కలగదు. అటువంటి సంఘటన తలుచుకుంటే శరీరం ఉలిక్కి పడుతోంది. ఝాన్సీలక్ష్మీభాయికి మరో రూపంగా నిలిచి యుద్ధంలో పాల్గొని బ్రిటిష్ సైనికుల చూపులను తనవైపు తిప్పుకుంది. అలా నిజమైన రాణిలక్ష్మీభాయి ప్రాణాలను కాపాడింది. యుద్ధంలో ఆమె చూపిన పోరాటపాటవం, తెగువ స్త్రీలకే కాదు, పురుషులకు ప్రేరణ ఇచ్చింది. పులిని గొడ్డలితో వేటాడి చంపిన ధైర్యం ఆమె సొంతం. లక్ష్మీభాయికి ఆమె పట్ల ఉన్న నమ్మకం పట్టుదల ఝుల్కారీభాయిని దర్గాదళానికి నాయకత్వం వహించేలా చేశాయి.

**రాణి అవంతిభాయి :–** 1831– 1858 మధ్యకాలంలోని మరో మొదటి స్వతంత్ర యోధురాలు రాణి అవంతిభాయి. బ్రిటిష్ ప్రభుత్వం అప్పట్లో విధించిన చట్టాలకు అనుగుణంగా వాటికి తలవంచే అందరూ రాజులలాగే తాను కూడా వారసులు లేని వారు తమ రాజ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించి భరణం తీసుకోవాలన్న ఆదేశాలను పాటిస్తూ, తన రాజ్యాన్ని అప్పగించి వారిచ్చే భరణంతో బతకాల్సి వచ్చింది. కానీ అవంతిభాయికి అది నచ్చక, ఆమె బ్రిటిష్ వారి అరాచకాలను, ఆకృత్యాలను ఎదిరించి పోరాటం సాగించింది. ఆ విధంగా పోరాడి దక్కించుకున్న అధికారాన్ని కోల్పోయింది.

ఆరువేల మంది మద్దతుదారులకు నాయకత్వం వహించారు. పేద రైతు కుటుంబంలో పుట్టిన మాతంగీకి చిన్న వయసులోనే పెళ్లి అయింది. పెళ్లి అయిన కొద్ది రోజులకే భర్తను కోల్పోయింది. ఆ తర్వాత స్వాతంత్ర పోరాటానికి ఆకర్షితురాలై ఎన్నో నిరసనలో పాల్గొని జైలు జీవితం కూడా అనుభవించారు. “బురి” అనేది బెంగాలీ భాషలో “ముదసలిఅవ్వ” అని అర్థం. వృద్ధాప్యంలో కూడా ఎంతో చురుకుగా స్వాతంత్రపోరాటంలో పాల్గొంటున్న ఆమె ఎంతోమందికి ప్రేరణగా నిలిచారు. ఆమె నేతృత్వంలోని మదనిపూర్లో స్వాతంత్రసమరయోధుల ఊరేగింపు సందర్భంగా బ్రిటిష్ పోలీసులు ఆమెను కాల్చారు. ఆ సమయంలో కూడా ఆమె దేశజెండాను పట్టుకుని “వందేమాతరం” అని నినదిస్తూ మరణించారు.

**పర్బతి గిరి :–** బ్రిటిష్‌పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యానికి పూర్వం, అనంతరం కీలకపాత్ర పోషించారు. ఈమె పశ్చిమ ఒరిస్సా ప్రాంతంలో మరో మదర్‌థెరిస్సాగా పేరు పొందిన మహిళ. ఈవిడ మహాత్మాగాంధీ పిలుపుతో స్వతంత్ర ఉద్యమం పట్ల ఆకర్షితురాలై మూడవతరగతి చదువుతున్నపుడే పాఠశాల జీవితాన్ని పణంగా పెట్టి కాంగ్రెస్ తరుపున ప్రచారం చేస్తూ అనేక పోరాటాలలో ముందుండి నడిచారు. పదహారేళ్ల వయసులోనే క్విట్ ఇండియా ఉద్యమాలలో ప్రముఖ పాత్ర పోషించారు. అందుకుగాను ఈమె రెండేళ్ల జైలుజీవితం కూడా గడిపారు. దేశంలో గిరిజనహక్కులను అమలు చేయడానికి అప్పట్లోనే ఎంతోకృషి చేశారు. స్వాతంత్ర్యం అనంతరం తన జీవితం ప్రజాసేవకే అంకితం చేసిన మహోన్నతమహిళా పర్బతిగిరి.

**బేగం హజ్రత్ మహల్ :–** లక్నోలోని అతిపెద్ద ప్రాంతం అవధిని ఏలిన మహిళ రాణీ బేగం హజ్రత్‌మహల్. ఈమె అందాల సౌందర్యరాశి. అత్యంత విలాసవంతమైన జీవితం గడిపిన ఆమె బ్రిటిష్‌వారిపై వ్యతిరేకంగా జరిపిన యుద్ధంలో తాను ప్రత్యక్షంగా యుద్ధరంగంలో నిలబడి తన సైన్యంలో ధైర్యం నింపుతూ పోరాడింది. ఎప్పటికప్పుడు తన శక్తిమేరకు బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించి నిలబడింది. మొదటితరం స్వాతంత్ర సమరయోధులలో ఒకరైన నానాసాహెబ్‌వంటి వారితో కలిసి పనిచేసింది. బలవంతంగా తన రాజ్యాన్ని బ్రిటిష్ వారు దక్కించుకోగా, ధైర్య, సాహసాలతో నేపాల్ ప్రధాని పిలుపునందుకుని నేపాల్ చేరుకొని మనుగడ సాగించాల్సి వచ్చింది.

అయినా ధైర్యం కోల్పోకుండా సర్వశక్తులూ ఒడ్డి మరలా సైన్యాన్ని సమీకరించి పోరాటం చేయాలన్న ప్రయత్నం విఫలం అయింది. చివరకు బ్రిటీష్‌వారి సైన్యంచేతిలో చావటం ఇష్టంలేక తన కత్తితో పొడుచుకుని ప్రాణత్యాగం చేసిన ధీరోదాత్త, వీర మహిళరాణి అవంతిబాయి.

**రాణి చెన్నమ్మ :–** కర్ణాటకలోని కిట్టూర్ రాజ్యానికి రాణి. అప్పటి బ్రిటీష్ గవర్నర్ జనరల్ డల్హౌసి ప్రవేశపెట్టిన "డాక్రిన్ ఆఫ్ లాప్స్" అనే చట్టానికి వ్యతిరేకంగా పోరాడింది. యుద్ధంలో ఓడిపోయి బ్రిటిష్ వారికి పట్టుబడింది. కానీ, ఆమె చూపిన తెగువ, పట్టువదలక తిరుగుబాటు చేసిన తీరు తర్వాతితరం స్వాతంత్ర సమరయోధులకు స్ఫూర్తిని అందించింది. నేటికీ కర్ణాటక రాష్ట్రంలో అక్టోబర్ నెలలో బ్రిటిష్‌వారిపై ఆమె సాధించిన మొదటి విజయాన్ని గుర్తుగా "కిట్టూరు ఉత్సవం" పేరుతో ఘనంగా వేడుకలు నిర్వహించుకుంటారు. ఆమె ధైర్యాన్ని, విప్లవదళం సాయంతో పోరాడిన తీరు ఇప్పటికీ స్ఫూర్తివంతమైన నాటకాలుగా, జానపద పాటలుగా, కథలుగా గానం చేస్తున్నారు. ఇండియన్ వారు రోజు బెంగళూరు నుండి కొల్హాపూర్ ప్రయాణించే ఒక రైలుకు ఏకంగా "రాణి చెన్నమ్మ ఎక్స్‌ప్రెస్" అని పేరు పెట్టింది.

**అరుణ అసఫ్ అలీ :–** భారతదేశ అత్యున్నత పురస్కారమైన "భారతరత్న" అందుకున్న అరుదైన స్వాతంత్ర్య సమరయోధురాలు అరుణా అసఫ్‌అలీ ఉన్నత విద్యావంతురాలు. ఈమె ఉపాధ్యాయురాలిగా పనిచేసింది. దేశంలోని అప్పటిపరిస్థితుల్లో అది ఒక మహిళకు గొప్పఘనతే అని చెప్పాలి. భారత జాతీయకాంగ్రెస్లో క్రియాశీలక సభ్యురాలై ఉప్పుసత్యాగ్రహంలో నిర్వహించిన బహిరంగ ప్రదర్శనలో పాల్గొన్నందుకుగాను ఈమెను దేశదిమ్మరి అనే అభియోగంతో అరెస్టు చేశారు. 1942 క్విట్ఇండియా ఉద్యమసమయంలో ముంబైలోని గవాలియాట్యాంక్ మైదానంలో బ్రిటీష్‌సైన్యం చూస్తుండగా, జాతీయజెండాను ఎగురవేసిన ధైర్యం ఈమె సొంతం. జైల్లో బంధించినప్పుడు ఈమె చేపట్టిన నిరాహారదీక్ష స్వాతంత్ర్య పోరాటచరిత్రలో నిలిచిపోతుంది.

**దాక్షాయిని వేలాయుధన్ (1912–1978):–** 1946లో రాజ్యాంగసభకు ఎన్నికైన ఏకైక తొలిదళితమహిళ. ఈమె కేరళకి చెందినవారు. పులయ (కులానికి) అనే దళితసామాజికవర్గానికి చెందిన దాక్షాయిని ఆమె కమ్యూనిటీలో జాకెట్ ధరించిన తొలిమహిళ. (ఆరోజుల్లో దళిత మహిళలకు పై వస్త్రాలు ధరించే హక్కులేదు) కేరళలో కులోన్మాదానికి వ్యతిరేకంగా జరిగిన శ్రీనారాయణ గురు, అయ్యంకాళి ఉద్యమప్రభావం దాక్షాయినిపై ఉంది. అస్పృశ్యత పైనా, దళితుల విద్యాలయాల ప్రవేశం కోసం ఆమె ఉద్యమించారు. కేరళ రాష్ట్రంలోనే డిగ్రీ సాధించిన తొలి దళితమహిళ. రాజ్యాంగసభలో దళితుల విద్యపై ఆమె ప్రసంగాలు ఒక సంచలనం.

**హన్స జివరాజ్ మెహత (1897–1995) :–** హన్స జివరాజ్ మెహతాది గుజరాత్. గొప్పసంస్కరణవాది, సామాజిక కార్యకర్త, విద్యావేత్త. స్వాతంత్ర్యోద్యమకారిణి. పిల్లల సాహిత్యంపై ఎనలేనికృషి చేసారు. ఎన్నో ఆంగ్లకథలను గుజరాతీలోనికి అనువదించారు. యునెస్కో ఎగ్జిక్యూటివ్‌బోర్డు సభ్యులుగా నియమితులయ్యారు. భారతదేశంపై ఎగురవేసిన తొలిత్రివర్ణ పతాకాన్ని ఆగస్టు 15, 1947 భారతస్వాతంత్ర్య తొలిఘడియల్లో దేశమహిళల పక్షాన తొలిప్రధానికి బహూకరించారు.

**కమలాదేవి ఛటర్జీ :–** కమలాదేవి భారత స్వాతంత్ర్యపోరాటంలో గుర్తించదగిన నాయకురాలు. దేశంలోని సామాజిక–ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం ద్వారా బ్రిటిష్‌రాజ్‌కు వ్యతిరేకంగా పోరాడవచ్చని భావించారు. దేశ సామాజిక, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు థియేటర్, చేనేత, హస్తకళలను ఉపయోగించారు. దేశంలోని సామాజిక – ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చడానికి

మాత్రమే కాకుండా, సహకారేతర ఉద్యమానికి తోడ్పడటానికి ఆమె చాలామంది మహిళలను తనపార్టీలో చేరమని ఒప్పించింది. బ్రిటిష్‌ప్రభుత్వం అరెస్టు చేసిన మొదటి భారతీయ మహిళ కూడా ఆమె.

**ముగింపు :-** ఈ విధంగా ఎంతో మంది మహిళలు తమ సర్వస్వాన్ని కోల్పోయి స్వాతంత్రఉద్యమంలో పాల్గొన్నారు. ఒక్క మహారాణులే కాదు, దళితులు, ముస్లింమహిళలు, ఆదివాసి స్త్రీలు, మరియు సాధారణ కుటుంబాలకు చెందిన మహిళలు సైతం స్వాతంత్రపోరాటం కోసం తమ ప్రాణాలను విడిచారు. బలవంతులైన శత్రువులను శక్తితో, యుక్తితో మట్టికరిపించిన నైజం మహిళల సొంతం. బ్రిటీష్ వారి బానిన సంకెళ్లను తెంచి భరతమాత దాస్యవిముక్తి కోసం భారతీయులు ఎంతో కష్టపడ్డారు ఈ చారిత్రక ఘట్టాలలో, మన దేశస్వతంత్ర పోరాటంలో, భారత రాజ్యాంగ రూపకల్పనలో పురుషులతో పాటు స్త్రీలు కూడా అద్భుతమైన సాహసాలను ప్రదర్శించారు. అవిశ్రాంతంగా కృషిచేసిన స్త్రీలెందరో చరిత్ర మరుగున పడిపోయారు. మన దేశ నిర్మాణంలో, రాజ్యాంగావిష్కరణలో ఎన్నో కీలక చర్చలు చేసి, దేశ భవిష్యత్తుకి పునాదులు వేసిన స్త్రీలను అందరూ కాకపోయినా, కొందరినైనా స్మరించుకోవడం మనధర్మం.

**ఆధార గ్రంథాలు :-**

1. భారతదేశ స్వాతంత్రోద్యమ చరిత్ర – తెలుగు అకాడమీ
2. భారతదేశ చరిత్ర జాతీయోద్యమం – ప్రొఫెసర్ సీనయ్య
3. భారతదేశ చరిత్ర సంస్కృతి – బి.ఏ మొదటి సంవత్సరం పాఠ్యపుస్తకం
4. ప్రాచీన భారతదేశ చరిత్ర – వల్లంపాటి వెంకట సుబ్బయ్య
5. భారతదేశ చరిత్ర – సంస్కృతి – కె.ఎన్. రామేశ్వరరావు

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమంలో "రామాబాయి" అందించిన సహకారం

జి. రాజశేఖర్, పరిశోధక విద్యార్థి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి -517502

"ఆంధ్రదేశపు తొలి రాజకీయ ఖైదీ, గ్రంథాలయ ఉద్యమ నిర్మాత "గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారు. ఆయనకు స్వాతంత్రోద్యమంలోతన భార్య అయిన రామాబాయి అందించిన సహకారం చాలా గొప్పది.

గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారికి 18సంవత్సరాల వయసున్నప్పుడు 14సంవత్సరాల రామాబాయితో వివాహం జరిగింది.రామాబాయి చిత్తూరు జిల్లాలోని మదనపల్లిలో ఉన్న "పెరికలపెంట" అనే గ్రామంలో జన్మించింది. ఆమె భర్తకు రాసిన ఉత్తరం.

శ్రీవారి పాద పద్మములకు నమస్కరించి వ్రాయునది !

మీరు క్షేమంగా ఉన్నారని అనుకుంటున్నాను. గత రెండు నెలల నుండి మీ నుంచి ఉత్తరం రాలేదు. మీ నుండి ఎలాంటి సమాధానం రాకపోవడం చాలా నిరాశను కలిగించినది కాబట్టి ఈఉత్తరం అందినవెంటనే, తప్పక వస్తారనిఎదురుచూస్తున్నాను అని తన భర్తకు ఉత్తరం రాసింది రామాబాయి.

తన భార్య రాసిన ఉత్తరాన్ని చదివిన గాడిచర్ల హరి సర్వోత్తమరావు ఆలోచనలో పడ్డాడు. తన భార్యకుఉత్తరం రాయాలన్న కోరిక అనుక్షణం మదిలో మెదులుతున్నా, కావాలనే ఆలస్యం చేశాడు, దీనికి ఒకటే కారణం?

వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్నందుకు కాలేజీ నుండి డిస్మిస్ చేసి ఏ ఉద్యోగానికి అర్హత లేకుండా చేశారని ఆ విషయం తెలిస్తే ఇంట్లో వాళ్ళు బాధపడతారు అని ఊరికి బయలుదేరాడు. ఇంటికి వెళ్లిన గాడిచర్లను తన పినతండ్రి నీవు బ్రిటిష్ ప్రభుత్వానికి క్షమాభిక్ష అడుగు నా యావదాస్తికి నిన్ను వారసున్ని చేస్తాను నీవు పెళ్లి అయిన వాడివి పెళ్లాన్ని ఎలా పోషిస్తావు, అసలు నీకు పెళ్ళాం ఒకటి ఉంది అనేది గుర్తుందా అని అన్నప్పుడు మౌనం వహించిక్షమించండి, అని చెప్పి భార్యను గురించి చెప్తూ పెళ్లి చేసుకున్న వాడు కేవలం ఉద్యోగం చేసి మాత్రమే భార్యను పోషించనక్కర్లేదు అవసరమైతే కాయకష్టం చేసికూడా భార్యను పోషించవచ్చు అని చెప్పాడు.

"ఇంట్లో ఉన్న చిన్నాన్న అత్త మామ అందరూ కూడా ఎందుకు బాబు మీరు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా వెళ్లారు హాయిగా చదువుకొని ఉద్యోగం చేసి భార్య పిల్లలతో ఉండొచ్చు కదా అని గాడిచర్లకు చెబుతారు. మరుసటిరోజు తెల్లవారుజామున రామాబాయితో గాడిచర్ల "నేనంటే నీకు కోపంగా ఉంది కదూ! మౌనంగ తలూపిందిరామాబాయి, ఏం చెప్పాలో తెలియని పరిస్థితి. పర్వాలేదు చెప్పు!అంటూ భార్యను అడిగాడు గాడిచర్ల. కాసేపటి తర్వాత అంది రామాబాయి.

"మీరేమి చేసినా మీ నిర్ణయానికి తగురీతిగా ప్రవర్తించడం మీ అర్ధాంగిగా నా బాధ్యత!"

తన భార్య నుంచి అనుకూలమైన మాటలు విన్న గాడిచర్ల ఆనందంలో "చాలు రాముడు ఈ పలుకు చాలు! నా జీవిత గమనంలో ఎన్ని కష్టాలు ఎదురైనా ఎదిరించి ముందుకు సాగిపోగలను అన్నాడు. మరుసటి రోజు కన్నవారిని ఉన్నవారిని వదిలి ప్రయాణమై పోతున్న రామాబాయి కంతకన్నీరు ఆగింది కాదు, ఆ కన్నీరు కో అర్థం ఉంది.

బెజవాడ అద్దె ఇంట్లో కాపురం కొనసాగిస్తూ ఉన్నారు, రోజులు గడుస్తున్నాయి రామాబాయి ఏమండీ ఏంటి రాముడు మీకు ఎలా చెప్పాలో తెలియడం లేదు ఎలా చెప్పాలో తెలియలేకపోతే కాగితంపై రాసివ్వు అన్నాడు చమత్కారంగా, అప్పుడు సిగ్గుపడుతూ భర్తదగ్గరకు చేరి చెవిలో మీరు తండ్రి కాబోతున్నారు అని అన్నది ఆమె సమాధానం విన్న గాడిచర్ల ఆనందంతో ఉప్పొంగి పోయాడు.

ఎంత చక్కని వార్త నా చెవిన వేశావు రాముడు... కానీ... అర్ధాంతరంగా ఆగిపోయాడు ఏమైనది కంగారుగా అడిగింది. రామాబాయి ఇంత శుభవార్త చెప్పగానే, భార్యకి ఏదో ఒక బహుమానం ఇవ్వడం భర్త బాధ్యత! కానీ నేను... నీకు ఏ బహుమానం ఇవ్వలేని చేతిలో చిల్లి గవ్వలేని ఉత్తమ మనిషిని అని అంటున్నప్పుడు భర్త బాధనుఅర్థం చేసుకున్న రామాబాయి ఎందుకండీ బాధ నాకెందుకండీ బహుమానాలు అయినా ఇంత చక్కని బహుమానాన్ని ఇచ్చారుగా మాటల్లో చెప్పరానిఆనందం అని అన్నది.

రామాబాయికి ఐదవ నెల శ్రీమంతం జరపాలని ఊరికి తీసుకెళ్లాలని అత్తా, మామ వచ్చినప్పుడు భార్యను పంపిన రోజు హరి సర్వోత్తమరావు తన డైరీలో ఇలా రాసుకున్నాడు.

"నేను పెళ్లి చేసుకుని ఒక జీవిని మానసికంగా హింసిస్తున్నానేమో! ఆమె నాభావాలకు, ఆశయాలకు అనుగుణంగా నడుచుకున్నా, భర్తగా నేను ఆమె పట్ల నెరవేర్చవలసిన బాధ్యత నిర్వర్తించలేకపోతున్నాను అని బాధపడ్డాడు.

గాడిచర్ల బ్రిటిష్ ప్రభుత్వంకు వ్యతిరేకంగా ఒక "సంపాదకీయం"ను రాశాడు, అందుకుగాను బ్రిటిష్ ప్రభుత్వం రాజ ద్రోహనేరాన్ని మోపింది. రాజద్రోహనేరం కింద తన భర్త అరెస్టు చేయబడ్డాడన్న వార్త వినగానే రామబాయికిస్పృహ తప్పింది,తన అమ్మానాన్న మన అమ్మాయికి ఎంత కష్టమొచ్చి పడింది అంటూ బాధపడ్డారు, వెంటనే లేచి రామాబాయి నేను వెంటనే వారిని చూడాలి వెళ్దాం అమ్మ అంటూబయలుదేరారు రామాబాయి భర్త అరెస్టు కాబడ్డాడు అన్న వార్త తెలిసిన "పెరికల పెంట" గ్రామ ప్రజలందరూ జాలిగా చూస్తూ పాపం ఎంత కష్టం వచ్చి పడింది పైగా ఉట్టి మనిషి కాదాయే? అట్లాంటోడు అసలు పెళ్లెందుకు చేసుకున్నట్లు? అని మాట్లాడుకున్నారు, తరువాత బెజవాడ చేరుకున్నారు అత్త మామ గాడిచర్లను కలిశారు. భర్తతో మాట్లాడడానికి మాటలు మెదలక కళ్ళనీళ్ళ పర్యంతం అయినా చూపులతోనే తలవంచుకొని నిలిచిపోయింది రామాబాయి.

అలా నిలిచి పోయిన రామాబాయి చెంతకు చేరి ఆమె కన్నీళ్లను తుడిచి నీవైనా నా నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా హర్షించవా? అన్నట్లు ఆమె కళ్ళల్లోకి చూశాడు. భర్త మనోగతాన్ని అర్థం చేసుకున్న రామాబాయిచూపులతోనే తన అంగీకారాన్ని తెలిపింది.

**"నుదుటున బొట్టు పెట్టి ఆయన పాదాలకు నమస్కరించి, జైలుకు పంపినది"**

గాడిచర్లకు మూడేళ్ల పాటు కఠిన కారగారా శిక్ష విధించారు. రాయవేలూరు జైలు నరకానికి ప్రతీక అంటారు మూడేళ్ల కఠిన కారాగారశిక్షను నువ్వెలా భరిస్తావో ఏమో? అన్నాడు బోడి నారాయణరావు.

గర్భవతిగా ఉన్న రామాబాయికి కొద్ది రోజులకు మగ పిల్లవాడు జన్మించాడు. రామాబాయితండ్రి అమ్మ వీడు అచ్చం మీ ఆయన పోలికేనే! ఈ కళ్ళు... ముక్కు... జుట్టు... అని అన్నాడు చిన్నగా నవ్వినది రామాబాయి.

"ఏం చేద్దాం అమ్మ నీ రాత ఇలా ఉంది! తండ్రి వంక ఆశగా చూసింది రామాబాయి. ఏమ్మా అని ప్రేమగా అడిగాడు తండ్రి. వారిని ఒక్కసారి చూడాలని ఉంది వెళ్దాం నాన్న? అలాగేనమ్మా తప్పక వెళ్దాం అల్లుడికి ఈరోజు ఈ బుజ్జి గాడు పుట్టిన విషయం గురించి ఉత్తరం రాశాను అని చెప్పాడు.

రామాబాయి తండ్రి రెవెన్యూ ఇన్స్పెక్టర్గా రిటైర్డ్ అయినాడుతన మనవడి కోసం బొమ్మలు కొనుక్కోవడానికి పట్టణం కి వెళ్లి తన పెన్షన్ డబ్బులు అడిగాడు. అక్కడున్న అధికారి ఇకపై మీకు పెన్షన్ రాదు! అన్నాడు ఏం సరదాగా అంటున్నావా! పెన్షన్ రాకపోవడమేంటి. నిజమే చెబుతున్నాను, నీకు పెన్షన్ ఇవ్వరాదని నిన్ననే మద్రాసు నుండి ఆర్డర్స్ వచ్చాయి. మీఅల్లుడు జైలుకు వెళ్లినందుకు మీ పెన్షన్ రద్దు చేశారు. అని అన్నప్పుడు తాను చాలా బాధపడుతూ ఇంటికి వచ్చాడు. ఇక ఊర్లో అప్పు చేసి గాడిచర్లను చూడడానికి బయలుదేరారు, జైలు దగ్గరికి వెళ్లి వార్డును అడిగారు" ఆ రాజ ద్రోహిని చూడడానికి ఇంత దూరం వచ్చారా? అని అంటే తప్పదు కదా బాబు బంధం ఉన్నప్పుడు, ఎంత దూరం నుంచి అయినా రాక తప్పదు. మాట్లాడటానికి లేదు కేవలం దూరం నుండి మాత్రమే చూపిస్తా అన్నాడు అక్కడికి వెళ్లి చూపించారు అదిగో అక్కడున్న కాడిని మోస్తూ గానుగను తిప్పుతున్నారే అతనే మీ భర్త! అంటూ వేలు పెట్టి చూపించాడు.

“గుండుగీయబడి,గోచిగుడ్డతో,మండుటెండలో,సంకెళ్ల మధ్య , గానుగను తిప్పుతున్న భర్తను చూడగానే రామాబాయికి దుఃఖం వరదలా పొంగుకొచ్చి ఏడ్చేసింది!”

సెంట్రి వెళ్లి గాడిచర్లకు నిన్ను చూడడానికి నీ భార్య అత్తమామలు వచ్చారు.అటువైపు చూడు అన్నాడువారిని చూడగానే గాడిచర్లకు కన్నీరు ఆగింది కాదు, ఎలా ఉన్నారు కళ్ళతోనే ప్రశ్నించిందిరామాబాయి, చూస్తున్నావుగా అన్నట్లు ఆ చూపులు మన బాబు అని పిల్లవాణ్ణి చూపించింది రామాబాయి తన కొడుకుని చూడగానే ప్రేమ ఎదలో నుంచి పొంగి పోర్లింది. కన్నతండ్రి అయి ఉండి కన్నబిడ్డ కళ్ళఎదుట ఉండి కూడా అక్కున చేర్చుకొని తనివి తీరా స్పృశించలేనిదౌర్భాగ్య స్థితి? నాది అనిబాధపడ్డాడు.

కొద్ది రోజులు గడిచాక ఒకరోజు రామాబాయి తన కొడుకును చూసి ఏదో జ్వరం వచ్చింది అనుకుని పట్టణానికి తీసుకువెళ్లాలని తన తండ్రికి చెబుతుంది. తన తండ్రి బండిని తెచ్చేలోగా తన కొడుకు చనిపోతాడు ఇంటిలో నుంచి తన భార్య కూతురి ఏడుపు విని తన తండ్రి చాలా బాధపడతాడు. ఆ విషయం గురించి గాడిచర్లకు కొడుకు మరణించాడు అన్న వార్తను ఉత్తరం ద్వారాతెలియజేస్తాడు.

“మూడు సంవత్సరాలు కాలచక్రంలో గతించిపోయాయి జైలు నుంచి విడుదలైన గాడిచర్ల ఎదురుగా రామాబాయి భర్తను చూడగానేకళ్ళల్లో కన్నీటి భాష్పాలు.”

ఒకరోజు భార్య అందించిన కాఫీ తాగుతున్న గాడిచర్ల దృష్టి భార్య చిరిగిన చీర పై పడగానే అతని హృదయం బరువెక్కనది,“రాముడు! ఏమిటో ఈ జీవితం సంసార బాధ్యతలు పట్టించుకోకుండా నిన్ను నిరంతరం కష్టపెడుతున్న అన్నాడు అవేం మాటలండి! నేను ప్రతినిత్యం తులసి మాతను పూజిస్తున్నాను మీరు దేశమాతను ఆరాధిస్తున్నారు, మనిద్దరి మధ్య ఉన్న తేడా అంతే అంటూ, నేను ప్రతి రోజు తులసి మాతను ఎందుకు కొలుస్తున్నానో చెప్పండి చూద్దాం అంటూ భర్తను అడిగింది, ఏముంటుంది మా సంసారం బాగు చేయండి తల్లి అని ప్రార్థించి ఉంటావు అన్నాడు. కాదు అంది. నా భర్తకు భాధ్యతలు పట్టవు ఎలాగైనా ఇంటి విషయాలపై మల్లెలా అనుగ్రహించు అని ప్రార్థించి ఉంటావు అని అన్నాడు. అది కూడా కాదు అన్నది. ఇక నావల్ల కాదు నీవే చెప్పు అన్నాడు. మీరు కళ్ళు మూసుకుంటే చెప్తాను అన్నది ఆ మాటకు గాడిచర్ల ముసి ముసిగా నవ్వారు. ఎందుకు నవ్వారు అన్నది. కళ్ళు మూసుకొని వినమన్నందుకు చెవులు మూసుకొని వినమనింటే నా పరిస్థితి ఎట్లా ఉండేదో ఊహించుకుంటే నవ్వు వచ్చింది అన్నాడు. పోండి నా ప్రార్థన మీకు అంత అవహేళన అగుపించిందా?అవునులేండి! నా బ్రతుకే మీకు నవ్వులాట అయింది! అంటూ అలిగినది రామాబాయి.

“రాముడు! నిన్నుఅవహేళన చేస్తే నన్ను నేనే అవహేళన చేసుకున్నట్లే! ఏదో తమాషాకి అన్నా క్షమించు రాముడు! అన్నాడు వెంటనే కరిగిపోయింది రామాబాయి!

“ఎంత మాట అన్నారండి! నన్ను క్షమించమని ఎప్పుడూ అనకండి! భర్త అడుగుజాడలే భార్యకు శ్రీరామరక్ష మీశ్రేయస్సే నా శ్రేయస్సు!

“నా ప్రార్ధన, బానిసత్వంతో మగ్గుతున్న దేశ ప్రజలకు స్వాతంత్ర్యం సిద్ధించాలని”, “అందుకోసం మీరు చేస్తున్న పోరాటానికి గాను మీకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని” నిత్యం తులసీమాతను పూజిస్తున్నాను.

భార్య పలుకులకు గాడిచర్ల కళ్ళు చమర్చాయి. ఆమెలో పెరిగిన సంస్కరణ అభిలాషకు అతని హృదయం ఉప్పొంగింది.

“రాముడు! జీవితమన్నది అశాశ్వతం! ఎప్పుడూ సుఖ భోగాలతో తేలియాట్టంలో అర్థం లేదు, అశాశ్వతమైన ఈ జీవితంలో శాశ్వతమైన పని ఒక్కటైనా చేయాలి! అదే నా ధ్యేయం! అందుకోసమే ఈ పోరాటం! నా ఈ పోరాటానికి నీ చేయూతనందించావు. ఇంతకన్నా నాకు ఆనందం ఇంకేం కావాలి! అంటూ ఆమెను తన చెంతకు చేర్చుకున్నాడు.”

కొద్ది రోజులకు రామాబాయి గారు అనారోగ్యానికి గురయ్యారు. అది క్యాన్సర్, చివరి దశలో ఉన్నారు. తన భర్త తన దగ్గర ఉండడం కంటే కూడా దేశానికి ఏదో ఒకటి చేయడం మేలు అని అనుకున్నది. రామాబాయి గారు అంటరానితనం పాటించేవారు కాదు. ఆమె చల్లని తల్లి. ఏ వేళ ఎందరు వచ్చినా వంట వండి వడ్డించి ఆదరించేది. ఒకరోజు పెరంబూరు వాస్తవ్యులు వచ్చి గాడిచర్ల గారిని ఆహ్వానించి తీసుకు వెళుతున్నారట. అప్పుడు కూతురు ద్వారక నాన్న! ఇంత ప్రమాదంగా ఉన్న అమ్మను వదిలిపెట్టి మీటింగులకు పోతున్నారే అన్నదట,తల్లి అది విని ఆయన గారిని ఆపకమ్మా! వారి ధర్మాన్ని వారు నిర్వర్తించుకోని అని కుమార్తెను మందలించిందట. ఆరోజు 1942 ఆగస్టు 22వ తేదీ ఉదయం 6 గంటలకు భర్త ఒడిలోఆమె కన్నుమూశారు. అప్పుడు ఆమె వయసు 50 సంవత్సరాలు. అప్పుడు గాడిచర్ల తన మనసులో ఇలా అనుకున్నాడు.

"నా జీవితంలో ఒక అధ్యాయం నేటితోముగిసింది"

**ఆధార గ్రంథాలు :**


1. వందేమాతరం : – కే.ఎన్.ఎస్ రాజు
2. సర్వోత్తమ జీవితం : – మాదల వీరభద్రరావు

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ UGC Care List Approved Journals
అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమం – తెలుగు మహిళల ధీరత్వం

డా॥ సి. చినపాపమ్మ, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నగరి. చరవాణి : 99858 22436

**"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతాః "**

ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు నడయాడతారని వేదవాక్కు. ఎక్కడ స్త్రీలు అగౌరవానికి గురి అవుతారో అక్కడ వినాశనం తప్పదని మహాభారతం నిరూపించింది. ప్రకృతికి ప్రతిరూపాలైన స్త్రీలు శక్తిసంపన్నులు. శక్తి ఉన్న చోటే సకలం అభివృద్ధి చెందుతుంది. వేదకాలం నుంచి కూడా స్త్రీ గృహిణిగా గొప్ప గౌరవాన్ని పొందుతూనే మంత్రద్రష్టలుగా యజ్ఞ క్రతువుల్లో పాల్గొంటూ వాసికెక్కారు. గార్గి, మైత్రేయి, అపాలు, సులభ లాంటి మహిళామతల్లులు వేదవేదాలంగాలు చదివి బ్రహ్మవాదినులుగా ప్రసిద్ధిగాంచారు. వేదకాలం నాటి స్త్రీలకున్న స్వేచ్ఛ, గౌరవాలవల్ల వారు అన్నిరంగాల్లోనూ ఉత్కృష్టస్థానంలో నిలిచారు.

ఏ దేశమైనా, ఏ సమాజమైనా, ఏ కుటుంబమైనా స్త్రీని గౌరవిస్తేనే ఆ దేశం, ఆ సమాజం, ఆ కుటుంబం సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతుంది. అలాంటి అభివృద్ధిని ఆకాంక్షిస్తూ 19వ శతాబ్దపు దార్శనికులైన కందుకూరి, గురజాడ లాంటి సంస్కర్తలు స్త్రీకి విద్య అవసరమని, స్త్రీలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడు, వ్యక్తిత్వవికసన కల్గి అన్నివిధాలా అభివృద్ధిపంథాలో నడవగలరని తెలుసుకొన్నారు. అందుకోసమై వారు ఎంతగానో శ్రమించారు. ఆ దిశగా స్త్రీలను వెలుగుబాటలో ముందుకు నడిపించారు.

గురజాడ కన్యాశుల్కం నాటకం, కన్యక, పూర్ణమ్మ వంటి గేయాలు స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు మరియు వారిలో రావాల్సిన చైతన్యాన్ని గురించి తెలియజేస్తున్నాయి. తరతరాలుగా వంటింటికే పరిమితమైన స్త్రీలు వారి జీవితం దుఃఖభాజనం కావడానికి గల కారణాలు అన్వేషిస్తూ, వారికి విద్య, ఆర్థిక స్వేచ్ఛ లేకపోవడమని గుర్తించి, అందుకు పరిష్కారాన్ని చూపుతూ గురజాడ ముందుచూపుతో సాహిత్యరచనలు చేశారు. "ఆధునిక మహిళలు భారతదేశ చరిత్రను తిరగరాస్తారని" ఆశావహ దృక్పథాన్ని వ్యక్తం చేశారు. కందుకూరి, గురజాడ, ఇంకా స్త్రీల అభ్యున్నతిని ఆకాంక్షించిన మహనీయుల ఆలోచనలను నిజం చేస్తూ చదువుసంధ్యలు లేని కాలంలో, స్త్రీలు గడపదాటని రోజుల్లోనే ఎందరో ధీరవనితలు శక్తిస్వరూపిణులుగా మారి స్వాతంత్ర్యపోరాటంలో పురుషులతో ధీటుగా పాల్గొని తమదైన ప్రత్యేకతను, శక్తి సామర్థ్యాలను చాటుకున్నారు. అలాంటి వారిలో ముఖ్యంగా యల్లా ప్రగడ సీతాకుమారి, సంగెం లక్ష్మీబాయి, కొండపల్లి కోటేశ్వరమ్మ, సరస్వతిగోరా, ఐలమ్మ, దువ్వూరి సుబ్బమ్మ, మల్లు స్వరాజ్యం, మాగంటి అన్నపూర్ణాదేవి ... ఇంకా ఎందరో ధీరవనితలు స్వాతంత్ర్యపోరాటంలో స్ఫూర్తివంతమైన పాత్రను పోషించి తమ జన్మలను సార్థకం చేసుకున్నారు. అలాంటి ధీరవనితలు గురించి నేటియువతకు తెలియవలసిన అవసరం ఎంతైనా ఉంది. వారిలో కొండపల్లి కోటేశ్వరమ్మ, సరస్వతీగోరా, దువ్వూరి సుబ్బమ్మల గురించి ఈ వ్యాసంలో తెలియపరుస్తున్నాను.

**కొండపల్లి కోటేశ్వరమ్మ :** స్వరాజ్యసాధనకు గాంధీజీ తెలుగు గడ్డమీద పిలుపునివ్వడంతో పామర్రులో ఎంతోమంది మహిళలు తమ ఒంటిమీద వున్న నగలన్నీ గాంధీజీకి సమర్పించారు. అక్కడేవున్న బాలవితంతువైన కోటేశ్వరమ్మ తల్లిదండ్రుల అనుమతి లేకుండానే తన చెవిదుద్దులు, కాలిపట్టాలు తీసి గాంధీజీ దోసిట్లోపోసింది. ఇంటికెళ్ళగానే తల్లి మందలించినా, తండ్రి మాత్రం కోటేశ్వరమ్మ చేసిన పనికి సంతోషించాడు. అలా చిన్నవయసులోనే గొప్ప దేశభక్తి భావాలను అలవర్చుకొన్నది కోటేశ్వరమ్మ. వందేమాతరం పాట పాడిన.. దేశభక్తులైన మనవాళ్ళను పోలీసులు లాఠీలతో కొట్టి బ్రిటీష్ జైళ్ళలో పెట్టడం గురించి విని, బ్రిటీష్ పాలకుల పట్ల వ్యతిరేకతను పెంపొందించుకుంది.

అంతేకాక ఖద్దరు ధరించడం, విదేశీ వస్తు బహిష్కరణ, సత్యాగ్రహంలాంటి ఉద్యమాల స్ఫూర్తి కోటేశ్వరమ్మలో సరికొత్త ఆలోచనలను రేకెత్తించాయి. ఆరోజుల్లో తమ గ్రామానికొచ్చి ఖాదీవస్త్రాలను అమ్మిన ఎందరో స్త్రీలను ఆదర్శంగా తీసుకొని కోటేశ్వరమ్మ తల్లిగారు రాట్నం మీద నూలు వడకడం ప్రారంభించగా కోటేశ్వరమ్మ చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారు రచించిన.

**"భరత ఖండంబు చక్కని పాడియావు హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ "**

అనే పద్యాన్ని గరిమెళ్ళ రచించిన “మా కొద్దీ తెల్లదొరతనం దేవా...” గేయాన్ని పాటలుగా పాడుతూ స్వాతంత్ర్యోద్యమం వైపు దృష్టి సారించింది. స్వతంత్రపోరాటం గురించి, కమ్యూనిష్టు విప్లవాల గురించి కొంతమంది పెద్దలు కోటేశ్వరమ్మ తండ్రితో మాట్లాడుతుంటే ఆ విషయాన్ని శ్రద్ధగా వినేది. రామస్వామి మొదలగువారు వీరేశలింగం పంతులుగారి సంఘసంస్కరణ ఉ ద్యమాన్ని గురించి, రాజారామ్మోహన్ రాయ్ స్థాపించిన బ్రహ్మసమాజాన్ని గురించి చెప్పి, పుస్తకాలు చదవమని ఆమెను ప్రోత్సహించేవారు. వితంతువులు వివాహం చేసుకోరాదని నిషేదం వున్న ఆ రోజుల్లో రామస్వామిగారు అందించిన స్ఫూర్తితో కోటేశ్వరమ్మ ధైర్యంగా ముందుకొచ్చి కొండపల్లి సీతారామయ్యను వివాహం చేసుకుంది. ఈ సంఘటన ఆ రోజుల్లో గొప్ప సంచలనాన్ని సృష్టించింది.

స్వతంత్రభారతి అనే కమ్యూనిస్టు రహస్య పత్రిక ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్న సమయంలో కోటేశ్వరమ్మ దాన్ని కార్బన్ కాపీలుగా చేసి ప్రచారం చేసింది. యుద్ధ వ్యతిరేక ప్రచారంగా ఆ పత్రిక వుందని పోలీసులు అరెస్టు చేయడానికి వస్తే కోటేశ్వరమ్మ ఏ మాత్రం భయపడక తాను జైలుకి వెళ్ళడానికైనా సిద్ధమే అంటూ తన అభిప్రాయాన్ని ధైర్యంగా తెలియపరిచింది. అంతేకాక ప్రజోపయోగమైన ఎన్నో సాంఘిక సేవాకార్యక్రమాల్ని ధైర్యంగా చేసి తనలోని దేశభక్తిని, బాధ్యతాయుత వ్యక్తిత్వాన్ని చాటుకున్న ధీశాలి కోటేశ్వరమ్మ.

**సరస్వతి గోరా:** విజయనగరంలో జన్మించిన సరస్వతిగోరా గొప్ప స్వాతంత్ర్య సమరయోధురాలు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ధీరవనిత. జాతీయోద్యమంలో పాల్గొని ఎన్నోసార్లు జైలుకెళ్ళారు. గాంధేయవాదాన్ని ఒంటబట్టించుకున్న సరస్వతి గోరా ఎవరి పనులు వారే చేసుకోవాలన్న నియమాన్ని ఆచరణలో ఉంచుతూ రాట్నం తిప్పడం, నూలు వడకడం లాంటి పనులు చేసేది. సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చినా భర్త నాస్తిక సిద్ధాంతాల్ని అర్థం చేసుకొని వారి కుమార్తె మనోరమను అర్జునరావు అనే దళిత యువకుడికిచ్చి వివాహం జరిపించి సమసమాజ నిర్మాణంలో భాగస్వామ్యమైంది. అస్పృశ్యతా నివారణను ఆచరించి చూపిన ధైర్యశాలి. గాంధీజీతో కలిసి మరుగుదొడ్లను శుభ్రం చేయడం, సమాజంలో రావాల్సిన మార్పుల గురించి ఆలోచించి, వాటిని అమలుపరచడానికి ప్రయత్నించేవారు. కులమతాలకు అతీతంగా ఉంటూ సమాజంలో అస్పృశ్యత పూర్తిగా అంతరించాలని మనస్ఫూర్తిగా భావించి తాను కూడా దళితవాడల్లోనే వుంటూ, దళిత బాలికల్ని చేరదీసి తన ఇంటిలో తిరగనిచ్చేవారు. వారి ఇళ్ళలో భోజనాలు చేసేవారు. దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ లాంటి సంఘ సంస్కర్తలతో ఉన్న స్నేహం కొద్దీ ఆమె ఇంకా ధైర్యంగా వితంతు వివాహాలు జరిపించడం, అస్పృశ్యతపై ఉపన్యసించడంలాంటి ఎన్నో పనులు ఉత్సాహంగా చేసేవారు.

**దువ్వూరి సుబ్బమ్మ :** గాంధీజీ ఉద్యమస్ఫూర్తి నలుదిశలా వ్యాపిస్తున్న రోజుల్లో టంగుటూరి ప్రకాశం పంతులు అధ్యక్షతన కాకినాడలో (1921) గొప్పసభ జరిగింది. బులుసు సాంబమూర్తి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తీర్మానం ప్రవేశపెట్టారు. ఇంతలో ఒక వితంతువు ఆ సభలో లేచి నిలబడి స్వాతంత్ర్యోద్యమం కోసం, స్వేచ్ఛకోసం పాటలతో, పద్యాలతో తన గళం విప్పి గంగాఝురిలా ఉపన్యసిస్తూ సభకులను మంత్రముగ్దుల్ని చేసింది. తన ఉపన్యాసాలతో ఎంతోమందిలో దేశభక్తి భావాలను రేకెత్తించిన మహిళ ఎవరో కాదు ధైర్యసాహసాలకు ప్రతిరూపమైన దువ్వూరి సుబ్బమ్మ. “దేశబాంధవి”గా లోకం చేత గౌరవించబడిన దువ్వూరి సుబ్బమ్మ రాజమండ్రి తాలూకాలోని కడియం గ్రామంలో జన్మించారు.

తన 45వ ఏట భర్తను పోగొట్టుకున్న సుబ్బమ్మ శిరోముండనం చేయించుకొని, తెల్లచీర ముసుగుతో పోలియో కాలు సహకరించకపోయినా కర్రసాయంతో కుంటుతూ ఖాదీ వస్త్రాలమూట నెత్తినపెట్టుకొని ఊరూరా తిరిగి ప్రచారం చేసేది. ఈమెకు మించిన దేశభక్తులు, ధీరులు ఎవరుంటారు? పిఠాపురంలో దేశభక్తులైన మనవారిపై లాఠీచార్జీ చేస్తున్న సమయంలో ఈమె తన చేతికర్రనే ఆయుధంగా చేసుకొని పోలీసులపై విరుచుకుపడింది. ఆమె ధాటికి తట్టుకోలేని పోలీసులు పలాయనవాదం చిత్తగించారు. అంతేకాక ఆమె పోలీసుల్ని “బ్రిటీష్ బానిసా! రా!” అని సంబోధించేది. ఈమె చూపే ధైర్యసాహసాలకు బ్రిటీష్‌వాళ్ళే భయపడేవారు. దేశంకోసం ఒక ఏడాదిపాటు జైలుశిక్ష అనుభవించాల్సివచ్చినా ఏమాత్రం భయపడలేదు. నోటిమాటగా క్షమాపణ చెబితే చాలు,

వదిలేస్తామని పోలీసులు చెప్పినా. ఆత్మాభిమానం, దేశభక్తిని అణువణువులో నింపుకున్న సుబ్బమ్మ అందుకు నిరాకరించారు. ఆంధ్రదేశంలో మొట్టమొదటిసారిగా జైలుకెళ్ళిన మహిళ ధీరవనిత అయిన దువ్వూరి సుబ్బమ్మ. జైలునే పాఠశాలగా మార్చి జైలులో వున్నవారికి ఆటపాటలు నేర్పిస్తూ, పోలీసులకు కూడా అమ్మలా మంచిభోజనం వండిపెట్టిన అన్నపూర్ణ సుబ్బమ్మ.

ధైర్యసాహసాలు, వ్యక్తిత్వమనేది వారు ప్రవర్తించే తీరులో, చేసే పనుల్లో వ్యక్తమౌతూవుంటాయి. ముఖ్యంగా ఆచరణాత్మక జీవితాన్ని ఎవరు గడుపుతారో వారే లోకానికి ఆదర్శప్రాయంగా ఉంటారు. పదుగురికి ఉపయోగపడేలా, భావితరాలు గర్వించేలా వారి వ్యక్తిత్వాలను తీర్చిదిద్దుకోవడానికి చాలా ధైర్యంకావాలి. అలాంటి ధైర్యసాహసాలు ప్రదర్శించిన వీరి మార్గంలో యావత్ సమాజం నడుస్తుంది. అలా సమాజానికి స్ఫూర్తినందిస్తూ చరిత్రపుటల్లో చిరస్మరణీయులుగా ఉండిపోయిన ఈ ధీరవనితలకు సహస్రవందనాలు.

**"జయహో భారతనారీ!".**

**ఆధార గ్రంథాలు :**

1. భారత స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిష్టు దేశభక్తులు – పరకాల పట్టాభిరామారావు
2. భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు మహిళల పాత్ర – డా॥ వాసా ప్రభావతి

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమ పినాకినీ మహిళా రత్నదీపాలు

**డా॥ గోపవరం పద్మప్రియ,** పి.ఆర్.ఆర్.& వి.యస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విడవలూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. సెల్: 9177355538

భారత జాతీయోద్యమకాలంలో ప్రతి ప్రాంతం, ప్రతి వ్యక్తి ఆశయం స్వాతంత్ర్య సముపార్జన. దేశానికి స్వాతంత్ర్యసముపార్జనకై చేసే పోరాటంలో నెల్లూరు ప్రాంత వాసులు ప్రధాన భూమిక పోషించారు. పురుషులతో సమానంగా నెల్లూరు ప్రాంత మహిళా రత్నదీపాలు దేశ బానిస సంకెళ్ళ విముక్తి కోసం జాతీయోద్యమంలో తమ తమ మార్గాల ద్వారా ఉద్యమానికి ఊపిరి పోశారు. కొంతమంది నేరుగా జాతీయోద్యమంలో పాల్గొంటే, కొందరు భూములను దానం చేశారు. కొందరు నగలను దానం చేశారు. స్వేచ్ఛావాయువులు పీల్చడమే తమ లక్ష్యంగా అడుగు ముందుకు వేశారు. ఎట్టి సంకట పరిస్థితులు ఎదురైనా వెనుకంజ వేయలేదు. బ్రిటీష్ వారు చర్యలు తీసుకున్నా, జైళ్ళకు పంపినా, మొక్కవోని ధైర్యంతో ముందడుగు వేసి జాతీయోద్యమంలో తమ వంతు పాత్ర పోషించిన నెల్లూరు మహిళా మణులు ఎంతో మందికి స్ఫూర్తి ప్రదాతలు. అందులో కొంతమందిని గురించి ఇక్కడ ప్రస్తావించుకుందాం.

**పొణకా కనకమ్మ :** నెల్లూరు జాతీయోద్యమ చరిత్రను పరిశీలించాల్సి వస్తే పొణకా కనకమ్మ ప్రస్తావన లేనిదే నెల్లూరు చరిత్ర లేదు. పురుషులతో ధీటుగా, చురుకుగా పాల్గొన్న ధీరవనిత పొణకా కనకమ్మ

నెల్లూరు తాలూకా పోట్లపూడి గ్రామంలో జూన్ 10, 1892లో జన్మించారు. తన మేనమామతో బాల్యవివాహం జరిగింది. ఈ వివాహం భావి రాజకీయ జీవితానికి, త్యాగశీలతకు ఏ మాత్రం అడ్డురాకపోగా మరింత తోడ్పడింది. ఎల్లవేళలా భర్త ఆమెకు చేదోడువాదోడుగా నిలిచారు. 1913లో సుజన రంజనీ సమాజం నెలకొల్పింది. మిత్రుల సహకారంతో వివేకానంద గ్రంథాలయం ప్రారంభించింది. 1913 నుండే పోట్లపూడిని ఖద్దరు ఉత్పత్తి, విదేశీ వస్తు బహిష్కరణ కేంద్రంగా మలచింది.

1916 నుండే శ్రీయుతుల పాటూరు సుబ్బరామయ్య, వెన్నెలకంటి రాఘవయ్య, చతుర్వేదుల వెంకటకృష్ణయ్యతో చేయిగలిపి టెర్రరిస్టు ఉద్యమకారులకు సహకరించింది. కానీ గాంధీజీ రాజకీయ ప్రస్థానంతో హింసాపరమైన కార్యక్రమాలకు స్వస్థిపలికి గాంధీజీ మార్గాన్ని అనుసరించింది. 1920లో పోట్లపూడిలో హరిజన హాస్టల్‌ను నెలకొల్పింది. 1921లో పల్లెపాడు సత్యాగ్రహాశ్రమం ప్రారంభ సమయంలో తన నగలన్నింటిని గాంధీజీకి నిలువు దోపిడి ఇచ్చింది. ఆ తర్వాత ఆమె నగలను ధరించలేదు. 1923లో ప్రకాశం పంతులు చేతుల మీదుగా కస్తూరిదేవి విద్యాలయాన్ని స్థాపించింది. అక్షర జ్ఞానంతో పాటు మహిళల్లో స్వయం ఉపాధి దిశగా కూడా ఈ విద్యాలయాన్ని నడిపారు. 1929లో గాంధీజీ ఈ పాఠశాల స్వంత భవనాలకు శంకుస్థాపన చేశారు.

భూ వ్యవహారాల్లో వెంకటగిరి రాజాతో వచ్చిన వివాదాలను లోకానికి తెలియజేయడానికి జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా జమీన్‌రైతు పత్రికను స్థాపించారు.. దీని వ్యవస్థాపక సంపాదకుడు పొణకా పిచ్చిరెడ్డి. తన స్వీయచరిత్రలో ఈ పత్రిక గురించి 'ప్రపంచాన్ని చకితమొనర్చె జమీందారీ ఉద్యమం మా కుటుంబం యొక్క మహోగ్ని జ్వాలలోనే అవతరించి దశదిశలా వ్యాపించింది. దాని నుంచే "జమీన్‌రైతు" పుట్టింది. ఇది జగమెరిగిన సత్యం' అని రాసుకున్నారు. ఇదే విషయాన్ని ఆచార్య ఎన్.జి.రంగా కూడా జమీన్‌రైతు స్వర్ణోత్సవ సంచికలోనూ రాశారు. కాని తరువాత ఎక్కడా వ్యవస్థాపకులుగా వీరి పేర్లు కనబడవు.

ఈమె రాజకీయ ప్రస్థానం చాలా సుదీర్ఘమైనది. 1927 సం॥ చెన్నపట్నంలో జరిగిన రాజకీయ మహాసభకు తనతల్లితో కలిసి వెళ్ళింది. జాతీయ రాజకీయ నాయకులందరితో పరిచయం ఉంది వీరికి. నెల్లూరు వచ్చిన బిపిన్ చంద్రపాల్, తిలక్ ఎవరైనా వీరి ఇంట అతిథ్యం స్వీకరించవలసిందే.

1933లో విదేశీ వస్త్ర బహిష్కరణ కోసం పికటింగ్ జరుపుతుండగా జరిగిన లాఠీచార్జీలో ఆమె భుజం విరిగింది. అట్టి పరిస్థితుల్లోను పాల్గొని జైలుకెళ్ళిన ధీర వనిత. జాతీయోద్యమంలో అలుపెరగని "కర్మయోగ సన్యాసిని" అని పేరు గాంచిన వీరు మహిళా లోకానికే ఆదర్శ దీపిక.

**శ్రీమతి దొడ్ల రుక్మిణమ్మ :** శ్రీమతి రుక్మిణమ్మ స్వాతంత్ర్య ఉద్యమంలో నెల్లూరు జిల్లాకు విశిష్ట స్థానం కల్పించిన బెజవాడ వారి ఆడపడుచు. ఈమె తండ్రి బెజవాడ బాలకృష్ణారెడ్డి జిల్లాకు చెందిన రెడ్లలో తొలి పట్టభద్రుడు. తండ్రి నుండి దేశభక్తిని, అన్న నుంచి త్యాగశీలతను పుణికి పుచ్చుకున్న రుక్మిణమ్మ బ్రిటీషు పాలకులకు దన్నుగా నిలిచిన దొడ్లవారి కుదురుకు చెందిన రామిరెడ్డిని పెండ్లాడింది. అయినా తన వ్యక్తిత్వాన్ని, దేశభక్తి సాంప్రదాయాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంది. 1933లో గాంధీజీని అహ్వానించి తన ఇంటి ఆవరణలోనే మహిళల సభ జరిపించింది. అభరణాలు అలంకారం కాదని సౌశీల్యమే అసలైన ఆభరణమని తన దండ, గాజులను గాంధీజీ హరిజన నిధికి ఉదారంగా విరాళామిచ్చింది. ఈ సంఘటనను ఆదర్శంగా తీసుకుని శ్రీమతి సత్యవోలు సుబ్బమ్మ వంటి ఎంతో మంది సోదరీమణులు గాంధీ గారికి తమ గాజులను ఇచ్చివేశారు. మెట్ట ప్రాంతం నుండి వచ్చిన బీద విద్యార్థులు ఎంతో మందికి తన ఇంట భోజన వసతిని కల్పించి నెల్లూరు డొక్కా సీతమ్మగా పేరుగాంచింది.

**పాటూరు బాలసరస్వతమ్మ :** స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ పాటూరు సుబ్బరామయ్య గారి సతీమణి. భర్త అడుగుజాడల్లో నడిచి తొలుత టెర్రరిస్టు ఉద్యమంలో పాల్గొంది 1920 గాంధీజీ ప్రవేశం తర్వాత అహింసా రాజకీయాలవైపు నడిచి స్వాతంత్ర్య సమరంలో క్రియాశీల పాత్ర వహించారు. గాంధీజీ హరిజన ఉద్యమానికి ఒంటి మీద నగలు అమ్మి నిలువుదోపిడీ ఇచ్చిన నిస్వార్థ, నిరుపమాన దేశాభిమాని. సింహపురి, శారద, శశి మొదలైన పత్రికల ముద్రణకై పాటుపడిన శ్రామిక మహిళ.

1914లో పాండిచ్చేరి నుండి 4 పిస్తోళ్ళ కొనుగోలుకై తన మెడలోని నగలు అమ్మి డబ్బులు ఇచ్చారు. 1921 సం॥ సహాయ నిరాకరణ ఉద్యమంలోను, 1930లో ఉప్పు సత్యాగ్రహంలోను 1932లో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని శ్రీ కృష్ణ జన్మ స్థానమలంకరించిన వీరవనిత. నెల్లూరు మున్సిపల్ కౌన్సిలర్‌గా సేవలందించిన మాత

**శ్రీమతి కోబాక రుక్మిణమ్మ :** పేద శిల్పకారుల ఇంట పుట్టిన శ్రీమతి రుక్మిణమ్మ వెంకటగిరి పట్టణానికి చెందినవారు. బ్రిటీషు పాలకుల అనుంగు చెలికాండ్రయిన జమీందారుల దౌష్ట్యాలను ఎదిరించి జాతీయోద్యమంలో పాల్గొన్న సాహసుల్లో ఈమె ఒకరు. ఈమె భర్త సుబ్బయ్య కొండంత అండగా నిలబడి ఈమె కార్యక్రమాలకు తోడ్పడేవారు. చదువు ప్రాథమిక పాఠశాల పరిధిని దాటకపోయినా మంచి వాక్శుద్ధి, పురాణ జానపద గాథల ఉదాహరణలతో ఆకట్టుకొనే విధంగా ప్రసంగించేది. కాంగ్రెస్ సభల్లో ఒక ముఖ్య ఆకర్షణగా నిలిచేది. గొంతెత్తి పాడేది. శ్రీ కతికనేని కళ్యాణరావు, శ్రీ కనుపర్తి లక్ష్మీ నారాయణ రావుల సాహచర్యంతో జాతీయోద్యమందు ముందు వరసన నిలిచేది. 1941లో సత్యాగ్రహ ఉద్యమం సందర్భంగా జైలుకు వెళ్లింది. తాను పెద్దగా చదవకపోయినా మహిళా సాధికారత కొరకు విద్యా సంపద ముఖ్యసాధనమని గుర్తించింది. మహిళలకు వృత్తి విద్యలు నేర్పించి వారు తమ కాళ్ళపై తాము నిలబడేందుకు దోహదం చేసింది. జిల్లా బోర్డు సభ్యురాలిగా వెంకటగిరి ప్రాంతంలో విద్యా, వైద్య వసతుల వ్యాప్తికి కృషి చేసింది. జైలులలో తన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఖైదీలకు కనీస వసతుల కల్పనకు జైలు సంక్షేమ సలహా సంఘం అధ్యక్షురాలిగా చర్యలు గైకొన్నది. స్వాతంత్ర్య సమరయోధురాలిగా తనకున్న 5 ఎకరాల భూమిలో కొంత హరిజన గృహ నిర్మాణానికి దానం చేసిన దానశీలి.

**దిగుమర్తి (దామెర్ల) బుచ్చి కృష్ణమ్మ :** శ్రీమతి బుచ్చి కృష్ణమ్మ నిబద్ధత కలిగిన గాంధేయ వాది. జాతీయోద్యమ కార్యకర్త. అంతేగాక ఆంధ్రదేశానికి చెందిన తొలితరం చిత్రకారిణి కూడా. శ్రీ హనుమంతరావును వివాహమాడాక మద్రాసు వెళ్ళి భర్తతో పాటు సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ కార్యకలాపాల్లో పాల్గొనింది. భర్త అడుగు జాడల్లో నడుస్తూ సబర్మతీ ఆశ్రమవాసి అయింది. ఇంతలో భర్త మరణం ఆమెను కృంగదీసింది. 26 ఏళ్ళ వయసుకు వైధవ్యం అనుభవించింది. తదనంతరం భర్త చూపిన మార్గంలో నడిచి గాంధీజీ నిర్మాణ కార్యక్రమాల నిర్వహణకే తన జీవితాన్ని అంకితమొనర్చింది. గాంధీజీ అహ్వానం మేరకు సబర్మతీ ఆశ్రమంలో కొంతకాలం గడిపాక పల్లెపాడు, సీతానగరం ఆశ్రమ నిర్వహణలో చురుగ్గా పాల్గొన్నారు. తదనంతరం పల్లెపాడు ఆశ్రమానికి జీవిత కాల ట్రస్టీగా మారింది. ఆశ్రమ కార్యక్రమాల్లో పడుగు పీకల్లా అల్లుకుపోయింది. గాంధీజీ ఆదర్శాలను కార్యాచరణలో పెట్టిన కార్యశీలి బుచ్చి కృష్ణమ్మ. ఇందుకు ఒక సంఘటన ఉదాహరణంగా నిలిచింది. 1923లో మగవారంతా

బయటకు వెళ్ళినప్పుడు బందిపోటు ముఠా పల్లెపాడు ఆశ్రమంపై దాడిచేసింది. బుచ్చి కృష్ణమ్మ నాయకత్వంలో మహిళలందరు బందిపోట్లను అడ్డుకుని గాయాల పాలయ్యారు. నగలు చోరీ అయ్యాయి. కానీ ఇది తిండికి లేని నిర్భాగ్యులు చేసిన పని అని ఆమె రిపోర్టు ఇవ్వలేదు. ఫిర్యాదు చేయనప్పటకి పోలీసులు కేసు నమోదు చేసి దొంగలను కోర్టులో హాజరుపరచారు. ఆభరణాలను గుర్తించడానికి సమను చేయగా ఇవి మా వస్తువులను పోలివున్నాయి గాని ఇవి మావేనని చెప్పలేదు. ఇలా సాక్ష్యమిచ్చిన ఆమె ఉదాత్తను కళ్ళారా చూసిన దొంగలు తమ తప్పును ఒప్పుకుని శిక్షను అనుభవించారు. ఆ దొంగలు ఆమెలో జీన్‌వాన్ జీన్‌ను దర్శించారు. క్రీస్తు, గాంధీ సిద్ధాంతాలకు ఆదర్శంగా నిలచారు.

ఇలా ఆశ్రమ నిర్వహణతోపాటు కస్తూర్బా స్మారక నిధికి ఆంధ్ర ప్రాంత ప్రతినిధిగా నిర్వర్తించారు. దీనజనసేవకు ముఖ్యంగా హరిజన, మహిళాభ్యున్నతికి ఆమె చేసిన సేవలు అసమానమైనవి.

**కుమారి తన్నీరు సుబ్బమ్మ :** స్వరాజ్య ఉద్యమంలో భాగంగా గూడూరు ధర్మరాజుల మైదానంలో జరిగిన బహిరంగ సభలో జాతీయ విద్యా కుటీరం విద్యార్థిని తన్నీరు సుబ్బమ్మ అనర్గళంగా హిందీలో స్వాగత పత్రాన్ని చదివింది. గాంధీజీ సుబ్బమ్మను దగ్గరకు తీసుకుని ముద్దాడాడు.

**ముగింపు :** భారతదేశ చరిత్రలో జాతీయోద్యమం ఒక మైలురాయి. అందులో స్త్రీల భాగస్వామ్యం నెల్లూరు కీర్తి కిరీటంలోని మణులు.వెరసి మనకు ఆదర్శ దీపికలు –ఈ పినాకినీ రత్నదీపాలు.

**ఆధార గ్రంథాలు :**

1. కనకపుష్యరాగం – శ్రీమతి పొణకా కనకమ్మ స్వీయ చరిత్ర సంపాదకలు: డా॥ కాళిదాసు పురుషోత్తం.
2. పినాకిని రత్నదీపం – శ్రీమతి పొణకా కనకమ్మ : రావినూతల శ్రీరాములు, కవికోకిల దువ్వూరి రామిరెడ్డి ప్రచురణలు, నెల్లూరు
3. స్వతంత్రత నుండి... స్వాతంత్ర్యానికి, (తెలుగులో స్త్రీల సాహిత్యం క్రీ.శ: 1900–1947): డా॥ జంధ్యాల కనకదుర్గ

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# మహిళా చైతన్య స్ఫూర్తి ప్రదాత శ్రీమతి పొణకా కనకమ్మ

డా।। మల్లెపోగు మాదన్న, తెలుగు అధ్యాపకులు, యస్.జి.యస్.ఆర్ట్స్ కళాశాల (తి.తి.దే), తిరుపతి. చరవాణి: 99660 63428

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో స్త్రీలు తమవంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తూ, గృహిణిగా బాధ్యతను నిర్వహిస్తూనే దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాంతం కృషి చేసిన ఆంధ్ర మహిళలు ఎందరో వున్నారు. అందులో పొనకా కనకమ్మ ముఖ్యులు.

ఆంధ్రప్రాంతం నుంచి కూడా అసంఖ్యకంగా స్త్రీలు స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని తమ శక్తి యుక్తుల్ని, ప్రాణాల్ని ధారపోశారు. భారత స్వాతంత్ర్య పోరాట కాలంలో జరిగిన పలు ఉద్యమాలలో ఆంధ్ర మహిళలు అశేష ధైర్య సహసాలను అంకురిత దీక్షను, అసమాన దేశభక్తినీ ప్రదర్శించి పురుషులకు తామేమి తీసిపోమని నిరూపించుకున్నారు 'తెలుగు మహిళలు'.

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో 'విప్లవకణిక'గా పేరొందిన మహిళ శ్రీమతి పొణకా కనకమ్మ గారు ఈమె 1892 జూన్ 10న నాటి మద్రాసు ప్రెసిడెన్సీ (నేటి ఆంధ్రప్రదేశ్‌లోని) శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని మినగల్లు గ్రామంలో జన్మించారు. మరుపూరు కొండారెడ్డి, కావమ్మ ఈమె తల్లిదండ్రులు. ఈమె సంపన్న కుటుంబంలో జన్మించారు.

9 ఏళ్ళ వయస్సులోనే మేనమామ 'పొణకా సుబ్బరామిరెడ్డి'తో ఈమె వివాహం జరిగింది. ఆమె భర్త సంప్రదాయంగా ఉండడంతో ఆమెను పాఠశాలకు వెళ్ళనివ్వలేదు. పుట్టిల్లు, అత్తిల్లు కూడా ధనికులే! ఈమెకు విద్య పట్ల మక్కువ ఎక్కువ. పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చు. అందుచేతనే బాల్యంలో పాఠశాల విద్య అంతగా లేకపోయినా కష్టపడి చదువుకున్నారు. తెలుగు, సంస్కృతం, హిందీ భాషలలో పాండిత్యాన్ని సంపాదించారు. గొప్ప సాహితీవేత్తగా ఎదిగారు. విద్యావేత్తగా విద్యాలయాలను స్థాపించారు. 'జమీన్' పత్రికను స్థాపించిన కుటుంబం వీరిది.

కనకమ్మ రాసిన ఒక పద్యంలో పంక్తులు ఈ విధంగా సాగుతాయి.
"ఊయలలూగించే కోమల కరాలే రాజ్యాలు శాసిస్తవి
తూలికపట్టే మృదుహస్తాలే శతఘ్నులు విదలిస్తవి
జోలలుబుచ్చే సుకుమారపు చేతులే జయభేరులు మోగిస్తవి" దీనిని బట్టి పొణకా కనకమ్మలో స్త్రీవాద కోణం కూడా గోచరిస్తుంది.

జిల్లాలోని పెద్ద కుటుంబాలలో ఒకటి. 800 ఎకరాల పొలం 500 ఆవులుండేవట. కోడెదూడల మీద సంవత్సరానికి పదివేలరూపాయల ఆదాయం, 20,30 వేల రూపాయల ధాన్యం రాబడి. వారి అవ్వ మరణించినప్పుడు పదిపుట్ల అన్నప్రదానము చేశారట వచ్చినవారికి "త్రాగటానికి నీరుపోసే అవకాశము లేక వీధులలో కాలువలు త్రవ్వి నీరు పారించినారు". అన్నప్రదానము చేయుటలో సుబ్బరామిరెడ్డిగారికి పెట్టింది పేరు.

అందరు సంపన్నుల్లా కాకుండా ఈమె సంఘసేవ కోసం ఇల్లు విడిచి ఉద్యమబాటన నడిచారు. 1907లో వందేమాతరం ఉద్యమ సందర్భంగా ఆంధ్రదేశానికి వచ్చిన మహావక్త బిపిన్ చంద్రపాల్ ఒక దినమంతా కనకమ్మ గారి ఇంట్లో గడిపారు. 1913లో పోట్లపూడిలో 'సుజనరంజని' సమాజాన్ని కనకమ్మగారు స్థాపించారు. ఈ సమాజం ద్వారా సంఘసేవా కార్యక్రమాలను, సాంస్కృతిక కార్యక్రమాలను, స్వాతంత్ర్య పోరాట విషయాలకు సంబంధించిన అనేక కార్యక్రమాలను నిర్వహించేవారు.

ఈమె బాలికల విద్యకోసం కస్తూర్బా పట్ల గౌరవంతో 23 ఎకరాల స్థలాన్ని దానంగా అందించి, ధనాన్ని వెచ్చింది 'కస్తూరిదేవి విద్యాలయాన్ని' స్థాపించారు. దీనికి బాపూజీ పునాదిరాయి వేశారు. ఈమె రాయవెల్లూరులో జైలుశిక్షని అనుభవించినపుడు విద్యాలయ తాత్కాలికంగా మూసి వేశారు. జైలు నుండి విడుదలయిన అనంతరం మళ్ళీ స్కూలుని తెరిపించారు. కానీ ఈమె ప్రాణమైన పాఠశాలని ఈమెకి దూరం చేసి మానసికంగా బాధించారు ధనిక నిర్వహకులు.

ఈమె గ్రంథాలయోద్యమంలో కూడా కృషి చేశారు. 1913లో కొత్తురులో నెల్లూరు వాసుల సహాయంతో 'వివేకానంద గ్రంథాలయాన్ని' నెలకొల్పారు. ఇంకా అనేక గ్రామాలలో గ్రంథాలయాలను స్థాపించారు. పలు కారణాలవలన ఈమె ఆస్తులను పోగొట్టుకున్నారు. భర్తని, కుమార్తెని పోగొట్టుకున్నా మానసికంగా తట్టుకుని నిలబడి తన కార్యక్రమాలని ధైర్యంగా నిర్వహించారు. ఈమె కుటుంబ సభ్యులలో ఎక్కువ మంది సాహితీ సృజనకారులు, స్వాతంత్ర్యసమర యోధులు, సంఘసేవకులు కావడం విశేషం.

ఆంధ్ర ప్రాంతం నుండి భారత జాతీయ కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహించిన తొలి మహిళగా, బాపూజీ ఆశయాలకు అనుగుణంగా వివిధ ఉద్యమాలలో పాల్గొని జైలుకు వెళ్ళిన మహిళగా చరిత్ర సృష్టించారామె. కస్తూరిదేవి విద్యాలయాన్ని నిర్వహించిన స్త్రీ విద్యావేత్త. 'పినాకినీ' సత్యాగ్రహాశ్రమాన్ని స్థాపించేందుకు స్థలాన్ని అందించిన దాత. స్వయంగా ఖాదీని వడికి, ధరించి, అమ్మిన ఖాదీ ఉద్యమకారిణి. విప్లవ పథం వైపు మొగ్గి తుపాకీని పేల్చడం నేర్చుకున్న విప్లవోద్యమకారిణి. అయితే బాపూజీ సత్యాహింసాయుధాల పట్ల ఆకర్షితురాలైన శాంతియుత ఉద్యమ ప్రచారిణి.

స్వయంగా వివిధ భాషలను అభ్యసించి, వివిధ గ్రంథాలను తెలుగు భాషలోకి అనువదించారామె. 'భగవద్గీత'ను 'జ్ఞాననేత్రం' పేరుతో తెలుగులోకి అనువదించారు. ఈమె లక్ష్మీబాయమ్మ గారూ కలిసి మహిళలు చేసిన అనువాదం చాలా గొప్పగా ఉందని శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ గారు ప్రశంసించారు. ఈ గొప్ప మహిళే శ్రీమతి పొణకా కనకమ్మ.

ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మగారు, కనకమ్మ గారు జంట కవయిత్రులు. వీరిద్దరూ కలిసి 'ఆరాధన' అనే కావ్యాన్ని వ్రాశారు. శశిరేఖ, హిందూ సుందరి, అనసూయ పత్రికలలో ఈమె రచనలు ప్రచురించబడ్డాయి. ఈమె పద్యకవయిత్రి, వ్యాస రచయిత్రే కాదు. మంచి కాలమిస్ట్ కూడా! 'హిందూసుందరి' పత్రికలో 'చెట్టు నీడ ముచ్చట్లు' పేరుతో అనేక వ్యాసాలు వ్రాశారు. 'రాణిపద్మిని' నవల రచించి నవలా రచయిత్రి అయ్యారు.

వీరు గొప్ప స్వాతంత్ర్య పోరాట యోధురాలు. ఈమె తొలి రోజులలో చెన్నపట్టణంలోని ఓ.వి.చిదంబరం పిళ్లై, ఉన్నవ లక్ష్మీనారాయణ గార్లతో కలిసి తుపాకులు, బాంబులతో పోరాటంలో పాల్గొనాలని భావించారు. కాని భారత జాతీయ పోరాట ఘట్టాలలో గాంధీయుగం మొదలైన తరువాత సంపూర్తిగా 'గాంధేయవాది'గా మారారు.

గాంధీజీ పిలుపునందించిన శాసనోల్లంఘనోద్యమం, విదేశీ వస్తు బహిష్కరణోద్యమం, ఉప్పుసత్యాగ్రహం, స్వదేశీ ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం మొదలయిన వాటిలో ఉత్సాహంతో పాల్గొన్నారు.

నెల్లూరు ప్రాంతంలో వీరి కుటుంబం స్వాతంత్ర్యోద్యమ నాయకుల కుటుంబంగా పేరుపొందింది. శ్రీయుతులు బాపూజీ, బిపిన్ చంద్రపాల్, బాబూ రాజేంద్రప్రసాద్, టంగుటూరి ప్రకాశం పంతులు, యన్.జి.రంగా, బెజవాడ గోపాలరెడ్డి, శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ మొదలయిన నాయకులు వీరింటి ఆతిథ్యాన్ని స్వీకరించేవారు. వీరి గృహంలో ఉద్యమాలను గురించి చాలా చర్చలు జరిగేవి.

1921లో బాపూజీ 'పల్లెపాడు' గ్రామంలో ఒక గాంధీ ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఆశ్రమాన్ని 'పినాకినీ నది' పేరుతో చిరస్థాయిగా నిలపడం కోసం 13 ఎకరాల స్థలాన్ని అందించారు. తమ దాతృత్వ గుణాన్ని సుసంపన్నం చేశారు. దీనికి 'పినాకినీ సత్యాగ్రహ ఆశ్రమం' అని పేరు పెట్టారు. గాంధీజీ సిద్ధాంతాలు, అశయాలను పూర్తిగా అనుసరించిన 'సింహపురి ప్రాంతపు ఆశ్రమం'గా పేరు పొందింది. శ్రీచతుర్వేదుల కృష్ణయ్య, దిగుమర్తి హనుమంతరావులు ఈ సమాజాన్ని గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా నిర్వహించారు.

1930,1932 సంవత్సరాలలో ఈమెతో పాటు రాజాజీ, బెజవాడ గోపాలరెడ్డి, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ వంటి వారు రాయవెల్లూరులో శిక్షని అనుభవించారు.

ఆంధ్రప్రాంతం నుండి కాంగ్రెస్ కార్యకలాపాలలో పాల్గొన తొలి మహిళ ఈమె. 1934లో 'ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్'కు ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఈమె కుమార్తె వెంకట సుబ్బమ్మ బాపూజీ నెల్లూరు పర్యటనకు వచ్చినపుడు తన వంటిమీద

నగలన్నీ కాంగ్రెస్ నిధికి విరాళంగా అందించి తల్లికి తగ్గ తనయ అనిపించుకున్నారు. కనకమ్మ జైలు శిక్షను కూడా అనుభవించారు. ఖద్దరు స్వయంగా తయారుచేసి, ధరించారు. ఇల్లిల్లు తిరిగి ఖద్దరును అమ్మారు.

ఈమెని పలు సత్కారాలు వరించాయి. 1955లో గృహలక్ష్మి స్వర్ణకంకణం లభించింది. శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ 'మద్రాసు మహిళా సభ' రజతోత్సవ సభలలో తన మిత్రురాలు, సహ స్వాతంత్ర పోరాట యోధురాలు, జైలులో సహాధ్యాయ, సంఘసంస్కరణాభిలాష అయిన ఈమెను తన చేతులతో స్వర్ణకంకణాన్ని అందించి సత్కరించి గౌరవించారు. "స్త్రీలు సంకల్పిస్తే ఎంత పనైనా చేయగలము. ఒక పత్రికా నిర్వహణమునే కాదు. రాజ్యాంగమునే శాసించగలము". అనే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

"తెలుగునాట ఆడవాళ్ళు స్వీయచరిత్ర వ్రాసుకోవడము ఎక్కడైనా ఉండవచ్చును కానీ, అంతగా లేదు. ఆ భాగ్యము నాకు లభించినందుకు గర్వపడుచున్నాను. స్త్రీలకు సమర్థత లేక కాదుకానీ వారు బయట సంచరిటము తక్కువ" అంటూ తన స్వీయచరిత్రను 'కనకపుష్యరాగం' పేరుతో గ్రంథస్థం చేశారు కనకమ్మగారు. 1959 జనవరి15న మొదలుబెట్టి 1960 సెప్టెంబరు 20న ముగించినా, ఏ కారణాలచేతో కాని, 2011 వరకూ అముద్రితంగానే ఉండిపోయింది. కనకమ్మ గారు చివరి రోజులలో ఆరోగ్యం క్షీణించి, ఇబ్బందులు పడి, అష్టకష్టాలకు గురయినప్పటికీ స్వీయచరిత్రని పూర్తి చేశారు. నెల్లూరులో విశ్రాంతజీవనం గడుపుతున్న డాక్టర్ కాళిదాసు పురుషోత్తం గారు పనిగట్టుకొని ఈ వ్రాతప్రతిని సంపాదించి, సంస్కరించి, కనకమ్మగారి గురించి వెలుగులోకి తెచ్చి ఇతర విషయాలను సేకరించి శ్రద్ధగా ప్రచురించి మనకి అందించారు.

ముఖ్యంగా ఈ చరిత్రలో ఆత్మస్తుతీ, పరనిందా రెండింటికీ తక్కువ ప్రాముఖ్యతనిచ్చి తన సంస్కారాన్ని ప్రపంచానికి తెలియజేశారు. ఆగర్భ శ్రీమంతురాలైన, నిరాడంబర జీవితం గడిపి మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచిన స్ఫూర్తి ప్రదాత శ్రీపొణకా కనకమ్మ గారు.

కస్తూరి విద్యాలయ నిర్వహణనుంచి ఆమెను తప్పించటం ఆమె చరమాంకంలో విషాదఘట్టం. ఆరోగ్యం క్షీణించి, ఇబ్బందులు పడుతూనే స్వీయచరిత్రను ముగించి, 1963 సెప్టెంబరు 15న మరణించారు.

ఈమె జ్ఞాపకార్థం 08-03-2021వ తేదీన తపాలాశాఖ ప్రత్యేక కవరును ముద్రించి గౌరవించింది. ఈమె చిత్రాన్ని అందమైన చట్రంలో ముద్రించారు. శాంత గంభీరంగా తేజస్సుతో కనిపిస్తుందీమె చిత్రం.

**ముగింపు :** జైళ్లలో దారుణ పరిస్థితులు, జైలర్ల దౌష్ట్యం, అమానుష చర్యల దమన కాండలు, అత్యాచారాలు, కాల్పులు ఎంతగానో బాధించిన వాటిని లెక్కచేయకుండా ఈమె తమ కర్తవ్యాన్ని ఎంతో ధైర్యంగా నిర్వహించారు. ధర్నాలు పికెటింగ్‌లు జరిపి జైలు శిక్ష అనుభవించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాలైన పురుషులతో పాటు స్వాతంత్ర్య సముపార్జనలో భాగస్వామ్యం సంపాదించినప్పటికీ స్త్రీజాతి నేటికీ అధ్వాన్న పరిస్థితులను ఎదుర్కొంటుంది. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం నేటి స్త్రీ ఇంకా ఎదురుచుస్తూనే ఉంది.

**ఆధార గ్రంథాలు**

1. కనకపుష్యరాగం (పొణకా కనకమ్మ స్వీయచరిత్ర). సం. డా. కాళిదాసు పురుషోత్తం.
   రచనాకాలం 1959-60. ప్రచురణ 2011.
2. స్వాతంత్ర్యం తరువాత భారతదేశం - బిపిన్ చంద్ర, మృదుల ముఖర్జీ.
3. ఆంధ్ర మహిళలు - ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# జాతీయోద్యమ స్ఫూర్తి దీప్తి – పొణకా కనకమ్మ

**డా. పట్టపు శివకుమార్**, తెలుగు అధ్యాపకుడు, శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల(తి.తి.దే.), తిరుపతి. 94920 32640

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో నెల్లూరు నగరానికి జాతీయ ప్రఖ్యాతి కలిగించిన ధీరవనితారత్నం పొణకా కనకమ్మ గారు. ఆమె 10-6-1892 న నెల్లూరు జిల్లా పోట్లపూడి గ్రామంలో అవ్వగారి ఇంట జన్మించారు. కనకమ్మ గారి తల్లి చేతికొద్ది అన్నదానం చేసిన కామమ్మ, తండ్రి ఆధ్యాత్మిక సంపన్నుడైన మరువూరు కొండారెడ్డి. ఆమె విద్యాభ్యాసం తక్కువే. కనకమ్మ గారికి తొమ్మిదవ యేటనే మేనమామ గారైన పొణకా సుబ్బరామిరెడ్డి గారితో వివాహం జరిగింది.

**వ్యక్తిత్వం:** కనకమ్మ గారికి బాల్యంలోనే దానధర్మములు చేయటం అలవడింది. ఆమె ఇంట్లో పెద్దవారికి తెలియకుండా పేదవాళ్లకు తిండిగాను, ధాన్యంగాను, వస్త్రాలుగాను దానాలు చేస్తుండేది. అదేనిధంగా పోట్లపూడిలో వీరికుటుంబం వారు కట్టించిన చంద్రమౌళీశ్వరాలయ బ్రహ్మోత్సవాల సందర్భంలో బ్రాహ్మణ సంతర్పణలు వేలకొలది జరిగేవి. అదిగాక చుట్టుప్రక్కలంతా బ్రాహ్మణ కండ్రిగలు విశేషంగా వున్నందున నిరంతరం వారికి అన్నివిధాల సహాయాలు చేస్తుండడం కూడా జరిగేది. ఆకాలంలోనే కనకమ్మ తల్లిగారి కుటుంబం అన్నదానంలో జిల్లా కంతటికీ ప్రశస్తి చెందినది. ఆ రోజులలో రెడ్ల కుటుంబాల్లో సాధారణంగా ఘోషాపద్ధతి వుండేది. అయితే కనకమ్మ గారి కుటుంబంలో మాత్రం ఆ పద్ధతి లేదు. దీని గురించి కనకమ్మ గారి స్వీయచరిత్రలో, "ఎవరు వచ్చినా కనకమ్మగారే స్వయంగా ఎదురేగి సగౌరవంగా ఆహ్వానించి తగిన మర్యాదలు చేసేవారు. సాధారణంగా సంపన్న కుటుంబాల్లో ఇంటికి వచ్చిన అతిధులకు వంటవారే వడ్డన చేయడం అలవాటు. అయితే కనకమ్మగారే స్వయంగా వచ్చిన వారికి వడ్డిస్తేగాని ఆమెకు సంతృప్తి లేదు. పెద్ద కుటుంబం అయినా కనకమ్మ గారే దానికి పెత్తనదారు. ఆమెది నరము లేని చెయ్యి. ఇక అన్నివిధాల దానధర్మాలకు అంతేవుండేది కాదు.

ఇదంతా పూర్వచరిత్ర. 1913 సం.లో యీమెగారి ప్రోత్సాహ, అర్థ, ఆదరాల క్రింద పోట్లపూడిలో సుజనరంజనీ సమాజం నెలకొల్పబడింది. దీని క్రింద అనేక శాఖలు పనిచేసినవి." అనే ప్రస్తావన కనిపిస్తున్నది. (కనకపుష్యరాగం,253.2011) ఈ మాటలు కనకమ్మ గారి వ్యక్తిత్వాన్ని తెలుపుతున్నవి.

**జాతీయోద్యమం ప్రవేశం :** కనకమ్మది రైతుకుటుంబమే గాని, రాజకీయ కుటుంబం కాదు. ఐనా రాజకీయ చైతన్యం ఆమెలో మూర్తీభవించింది. అప్పట్లో స్త్రీలు గడపదాటి రాకూడదు. అయినా స్వాతంత్ర్యోద్యమంలో ఆమె చేపట్టని కార్యక్రమం లేదు. కనకమ్మ గారు చిన్న వయసులోనే సంఘ సేవ కోసం ఇల్లు విడిచి ఉద్యమ బాటన నడిచారు. అప్పట్లో పోట్లపూడి గ్రామానికి ప్రముఖులు ఎవరు వచ్చినా కనకమ్మ ఆతిథ్యం స్వీకరించి వెళ్ళేవారు. వందేమాతరం ఉద్యమం నెల్లూరులో మధ్యతరగతి, అపైవర్గాలను కదిలించినట్ల నిపిస్తుంది. వందేమాతరం ఉద్యమ సందర్భంగా 1907లో ఆంధ్రదేశానికి వచ్చిన బిపిన్ చంద్రపాల్ గారు ఒక రోజంతా పోట్లపూడి గ్రామంలో కనకమ్మ గారి ఆతిథ్యంలోనే గడిపారు. ఆ తర్వాతనే కనకమ్మ పోట్లపూడిలో మగ్గాలు నెలకొల్పారు. ఆనాడు ఆంధ్రదేశంలో వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్న కొద్దిమంది మహిళల్లో కనకమ్మ గారు ఒకరు.

గాంధీజీ ప్రభావానికి లోనుకాక ముందు 1915 లో మద్రాసులో ఓ.వి. చిదంబరం పిళ్ళై, గుంటూరులో ఉన్నవ లక్ష్మీనారాయణ లాంటి అతివాదులతో చేతులు కలిపి, రహస్యంగా పిస్టళ్ళు, బాంబులు దిగుమతి చేసుకొని 'సమయం కోసం వేచి వుండిన' సాహసి కనకమ్మ గారు. గాంధీజీ ప్రభావానికి లోనైనతర్వాత ఆమెలో వచ్చినమార్పును మనం గమనించాలి. 'హరిజనులకు' చదువు చెప్పించేందుకు పోట్లపూడిలో స్కూలు పెట్టింది. ఆనాడు ఆమె స్వయంగా రాట్నం వడికింది, అహింసను ప్రచారం చేసింది. మాదిగవాడలో కలరా సోకితే స్వయంగా చికిత్స చేయించింది. మాలవాడలో విషజ్వరాలు ప్రజలితే మందూమాకు అందజేసి వారిని తల్లిలాగ ఆదుకుంది. సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ ఎటువంటి భేషజాలూ లేకుండా ఖద్దరు గుడ్డలు భుజాన వేసుకొని నెల్లూరులో వీధివీధి తిరిగి అమ్మింది. ఇవన్నీ కనకమ్మ గారి వ్యక్తిత్వానికి నిదర్శనాలు.

పొణకా కనకమ్మ గారి చొరవతో 1913 లోనే పోట్లపూడి గ్రామంలో 'సుజన రంజనీ సమాజ స్థాపన', 'వివేకానంద గ్రంథాలయం', బాలబాలికల విద్య కోసం 'జాతీయ పాఠశాల' ఏర్పాటు చేయడం జరిగింది. ఆ రోజులలోనే కనకమ్మ గారు తమ సమీప గ్రామాలలో సామాన్య ప్రజల కోసం ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. 1917లో ఐదవ ఆంధ్రసభ సమావేశం జూన్ మొదటి వారంలో నెల్లూరులో జరిగింది. అదే రోజు అక్కడ ప్రత్యేకంగా మహిళల సభ కూడా జరిగింది. మహిళలను రాజకీయాల్లోకి ఆకర్షించాలని అందులో తీర్మానం చేశారు. ఈ సభలో కనకమ్మ కూడా ప్రసంగించారు. అదే సమయంలో ప్రారంభమైన అనిబిసెంట్ హోమ్ రూల్ ఉద్యమానికి నెల్లూరు జిల్లాలో పోట్లపూడి గ్రామమే ప్రధాన కేంద్రమైంది. భారత జాతీయోద్యమంలో కనకమ్మ గారే స్వయంగా చరఖా చేపట్టారు. కనకమ్మ గారి ఆధ్వర్యంలో స్వదేశీ చేనేత కేంద్రం ఏర్పాటైంది. కనకమ్మ గారు స్వయంగా నేసిన ఖద్దరు పంచెను మహాత్మాగాంధీకి కానుకగా పంపినారు.

1922, 23 సంవత్సరాలలో నెల్లూరు జిల్లా మహిళా సభలు నిర్వహణను కనకమ్మ గారు పర్యవేక్షించారు. అంతేకాకుండా ఆ సభలను దిగ్విజయంగా నిర్వహించారు. 1923 డిసెంబర్ 23 కాకినాడ కాంగ్రెస్సు సభలో కూడా కనకమ్మ గారు పాల్గొన్నారు. 1927 చెన్నపట్నం స్త్రీల రాజకీయ మహాసభలకు కనకమ్మ గారు అధ్యక్షులుగా వ్యవహరించారు.

**గాంధీ సత్యాగ్రహ ఆశ్రమం :** కనకమ్మ గారు ముందుకు వచ్చి పల్లెపాడులో పినాకినీ తీరాన మహాత్ముని ఆశయాలకు నిదర్శనంగా సత్యాగ్రహ ఆశ్రమాన్ని 1921 ఫిబ్రవరి 7న మహాత్మాగాంధీతో ప్రారంభింప జేశారు. ఈ ఆశ్రమం కోసం కనకమ్మ తన ఒంటిపైనున్న బంగారు నగలు అమ్మి విరాళంగా ఇచ్చారు. ఆనాటి నుంచి తుదిశ్వాస విడిచే వరకు ఆమె బంగారు నగలు ధరించలేదు. ఇది కనకమ్మ గారి దృఢ నిశ్చయానికి నిదర్శనం. అదేవిధంగా కనకమ్మ గారు పల్లెపాడు పెన్నానది ఒడ్డున గాంధీ ఆశ్రమం కోసం 18 ఎకరాలు కొని స్వరాజ్యం సంపాదించాలనే ధ్యేయంతో చతుర్వేదుల కృష్ణయ్యకు ఉచితంగా ఇచ్చింది. 1922 ఏప్రిల్ 1న ఆంధ్రప్రదేశ్‌లో తొలి సత్యాగ్రహి దేశబంధు దువ్వూరి సుబ్బమ్మ మొదటిసారి అరెస్టయ్యారు. ఈ సంఘటన కనకమ్మను కదిలించింది. 1930లో పల్లెపాడులో జరిగిన ఉప్పు సత్యాగ్రహం కార్యక్రమంలో కనకమ్మ ప్రముఖ పాత్ర వహించారు. ఆనాడు ఆమె నాయకత్వంలో ఉప్పు తయారు చేయడానికి మైపాడు సముద్ర తీరానికి భారీ స్థాయిలో మహిళలు తరలి వెళ్ళారు. ఇది కనకమ్మ గారి నాయకత్వ ప్రతిభకు నిదర్శనం.

**కస్తూరిదేవీ విద్యాలయం :** పొణకా కనకమ్మ గారు పెద్దచదువు చదువుకోలేదు. కానీ చిన్ననాటినుంచి ఆమెకు విద్యమీదనే గురి. సమాజంలో ఎటువంటి అవకాశంలేక, అణగారివున్న అభాగ్యులకు చదువు నేర్పాలన్నది ఆమె ఆశయం. తాను పాఠశాలకు వెళ్ళకపోయినా, విద్యాసంస్థలు నెలకొల్పి, కనకమ్మ గారు బాలికల నొసట విద్యాతిలకం దిద్దినది. కస్తూరిదేవి విద్యాలయం ఆమె మహోన్నత వ్యక్తిత్వానికి సంస్థారూపం. నిరుపేదలు, దళిత బాలికల కోసం పాఠశాల స్థాపించడం ఆమె ఆశయం. పాఠశాల కష్టకాలమంతా ఆమెతోనే గడిచింది. అయితే ఊహించనంత ఉన్నతంగా సంస్థ పెరిగి, ప్రఖ్యాతి కొచ్చిన తర్వాత, పాఠశాల ధనిక స్వాముల పాలయింది. అయితే కస్తూరిదేవీ విద్యాలయంవంటి సంస్థను సమర్థవంతంగా, ఆదర్శప్రాయంగా నిర్వహించాలంటే కార్యదక్షత ఉండాలి. ఎవరికీ దేనికీ వెరవని వ్యక్తిత్వం ఉండాలి. ఇవన్నీ ఉండీ కనకమ్మ స్కూలును ధనికుల హస్తగతం చేయాల్సివచ్చింది. అదే ఆమె జీవితంలో గొప్పవిషాదం.

**కారాగార వాసము :** 15-4-1930 జమీందారి రైతు "శ్రీమతి పొణకా కనకమ్మగారి కారాగారవాసము: నేటికి 31 దినములు" అని ఒకవార్త ప్రచురించింది. 27-6-1930 తేదీన ఆమెను వేలూరు జైలుకు మార్చారేమో తెలీదు. మొదటిసారి కనకమ్మ గారికి ఆరునెలల సాధారణఖైదు విధించబడింది. రెండోసారి కనకమ్మ, బెజవాడ గోపాలరెడ్డి ఒకే పర్యాయం అరెస్టయ్యారు. ఇద్దరికి 18 నెలల ఖైదు విధించబడింది. ఇద్దరు శిక్షాకాలం పూర్తికాకముందే ఏడాది తర్వాత ఒకేరోజు వేలూరు జైలునుంచి విడుదలయ్యారు. కనకమ్మ వేలూరు జైల్లో 26-5-32 నుంచి 30-6-33 వరకు ఉన్నట్లు, 30 వ తద్యూరీకున విడుదలైనట్లు ఆమె తమ్ముడు కోదండరామరెడ్డి పేర్కొన్నారు. బెజవాడ గోపాలరెడ్డి ప్రకారం, 1932 మే 31 నుంచి 1933 జూన్ 30 వరకు మొత్తం 13 నెలలు జైలుశిక్ష అనుభవించి ఇద్దరు వేలూరు జైలునుంచి విడుదలయ్యారు.

1913 మార్చి ఒకటోతేది కనకమ్మ మరిది పొణుకా పట్టాభిరామిరెడ్డి, మరి ఇద్దరు యువకులు కలిసి పోట్లపూడిలో సుజనరంజనీ సమాజం, వివేకానంద గ్రంథాలయం స్థాపించారు. 1919లో మద్రాసు వెళ్ళి గాంధీజీని కలుసుకున్నారు. 1921లో పల్లెపాడులో గాంధీజీ ప్రారంభించిన పినాకిని సత్యాగ్రహాశ్రమం నెలకొల్పడంలో కనకమ్మ దంపతులు ప్రధానపాత్ర నిర్వహించారు. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా జైలుకువెళ్ళి 1933లో విడుదలైనతర్వాతే, ఆంధ్రదేశంలో దుర్గాబాయి వంటి మహిళలు స్త్రీల అభ్యున్నతికోసం పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలు నెలకొల్పారు. వాళ్ళందరికంటే చాలా ముందుగా, గాంధీజీ నిర్మాణ కార్యక్రమం స్ఫూర్తితో 1923 అక్టోబరు మాసంలో విజయదశమి రోజు కనకమ్మ నెల్లూరులో కస్తూరీ బాయి పేరిట “జాతి వివక్షలులేని బాలికా పాఠశాల” ప్రారంభించారు. బహుశా ఈ కారణంచేతనే దుర్గాబాయి కనకమ్మను తనగురువుగా, మార్గదర్శిగా పేర్కొనడమే కాదు, కనకమ్మ మరణవార్త విన్నప్పుడు “ఆంధ్రదేశం ఒక వీరవనితను, గొప్ప సేవకురాలిని, ఉదాత్తచరితను కోల్పోయింది” అని నివాళు లర్పించారు.

“కస్తూరీదేవీ విద్యాలయంలో సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు బోధించడంతోపాటు రాట్నం మీద నూలువడకడం, పేము అల్లకం, కుట్టుపని, శాస్త్రీయసంగీతం, వ్యాయామం, యోగాసనాలు నేర్పించేవారు. వీటితోపాటే బాలికలకు గృహవిద్య, పౌరాణిక కథలు కూడా బోధించేవారు.” (కనకపుష్యరాగం, 13. 2011)

**స్త్రీ వాద దృక్పథం :** “వివిధ దేశాలవారు ఆ యానాటి స్త్రీల ఉద్యమాన్ని, చరిత్రలను ప్రకటిస్తూనే యున్నారు... దేశస్వాతంత్ర్యం కోసం మహోన్నత త్యాగములొనర్చిన ఆంధ్రస్త్రీల సత్యాగ్రహ చరిత్ర సమగ్రంగా రచింపడం అవసరమని పూనుకొన్నాము...” అని (గృహలక్ష్మి 1936 అక్టోబరు) పొణకా కనకమ్మ, ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ ఒక ప్రకటన చేశారు. “చైతన్యం కొంచమైనా లేని రోజుల్లో 1920వ సంవత్సరము నుంచి 1935 వరకు నడుముకట్టి అత్యంత సేవాత్యాగములొనర్చిన స్త్రీల” పదిహేనేళ్ళ ఉద్యమ చరిత్రము ప్రత్యేకంగా గ్రంథస్థం చెయ్యాలనే ఆలోచన, ఈ రచయిత్రులు స్త్రీవాద దృక్పథాన్ని సూచిస్తుంది.

అదేవిధంగా మద్రాసు రేడియో స్టేషనులో “స్త్రీలు భారతదేశం” అనే అంశంమీద కనకమ్మ చేసిన ప్రసంగపాఠం గృహలక్ష్మి (1940 మార్చి) లో అచ్చయింది. సీత, రాధ, ద్రౌపది, రాణి సంయుక్త, రుద్రమదేవి, మాంచాల, వెంగమాంబల చరిత్రలు ఈ ప్రసంగంలో పరిచయం చేశారు. “సీత సత్యము కోసము ఎంత త్యాగమయినా చేసినది. ప్రాణాధికుడైన పతికి కూడా దూరమైపోయినది కాని, ఆత్మగౌరవమును మాత్రము విడువలేదు. పవిత్రమైన తన వ్యక్తిత్వాన్ని, గ్రహించలేని రామరాజ్యానికి ఒక ధిక్కారముతో స్వస్తిచెప్పి, విశాలమైన ‘ మృత్యుగర్భములో లీనమైపోయినది.” అని వ్యాఖ్యానించారు. (కనకపుష్యరాగం, 25. 2011)

**స్వీయచరిత్ర :** కనకమ్మలోని స్త్రీవాద దృక్పథం ఆమె స్వీయచరిత్ర రచించడానికి పూనుకోడంలోనే వ్యక్తమయింది. “తెలుగునాట ఆడవాళ్ళు స్వీయచరిత్ర వ్రాసుకోవడం ఎక్కడైనా ఉండవచ్చును కాని, అంతగా లేదు. ఆ భాగ్యము నాకు లభించినందుకు గర్వపడుచున్నాను. స్త్రీలకు సమర్థత లేక కాదుకానీ వారు బయట సంచరించడం తక్కువ” అంటూ స్త్రీలు రచనావ్యాసంగం చేపట్టలేక పోవడానికిగల కారణాలు కూడా కనకమ్మ గారు వివరించారు.

“ఈ స్వీయచరిత్రను యధాలాపంగా కాకుండా పరిశీలనాత్మకంగా చదవండి ఇది వట్టి ఘటనల పోగుకాదు. ఒక్కొక్క సంఘటన వెనక అచంచలమైన కనకమ్మ ఆత్మస్థైర్యం, వ్యక్తిత్వం కనబడతాయి, స్వచ్ఛమైన మంచితనం. పలకరిస్తుంది! కంటనీరు పెట్టిస్తుంది.

యాభయ్యేళ్ళ అజ్ఞాతవాసం తర్వాత ఈ స్వీయచరిత్ర వెలుగు చూస్తోంది. డాక్టర్ కాళిదాసు పురుషోత్తం పట్టుదల, పరిశోధనా నైపుణ్యాలను ఈ కృషి ప్రతిఫలిస్తుంది. దీంతో నెల్లూరుజిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్రలోనేకాదు, ఆంధ్రదేశ ‘మహిళావరణం’లోనూ ఒక ఖాళీ పూరించబడుతుంది.” అని రచయిత, సీనియర్ జర్నలిస్టు అయిన పెన్నేపల్లి గోపాలకృష్ణ గారు పేర్కొన్నారు. (కనకపుష్యరాగం,6.2011)

కనకమ్మ గారు తన స్వీయచరిత్రలో విడిచి పెట్టిన కొన్ని సంఘటనలను గురించి పేర్కొంటూ, "1946 అక్టోబరులో నెల్లూరులో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు మహిళాసభలు చాలా ఘనంగా జరిగాయి. ఆరోగ్యమంత్రి ఆచంట రుక్మిణమ్మ కడప రామనుబ్బమ్మ, యామినీ పుర్ణతిలకం వంటి గొప్పగొప్ప మహిళలు ఆసభలో పాల్గొన్నారు. ఆ సభలకు ఆహ్వాన సంఘాధ్యక్షురాలు కనకమ్మే 1948 జూన్ 19, 20, 21 తారీకుల్లో నెల్లూరు ఆంధ్రసభ ప్రాంగణంలో జరిగిన సింహపురి పండితపరిషత్తు మహాసభల్లో కనకమ్మ దువ్వూరి రామిరెడ్డి మీద పద్యాలు చదివారు. స్థానం నరసింహారావు పద్మశ్రీ గౌరవం అందుకొన్న సందర్భాన్ని పురస్కరించుకొని కనకమ్మ ఆయనను నెల్లూరు టౌన్ హాల్లో సన్మానించారు. ఇటువంటి ఎన్నో ముఖ్యమైన విషయాలు స్వీయచరిత్రలో ప్రస్తావించకుండా విడిచిపెట్టారు.

ఇన్ని కొరవలున్నా నెల్లూరు జిల్లాకు సంబంధించినంతవరకు ఆమె స్వీయచరిత్రకు ఒక ప్రత్యేకత ఉంది. జాతీయోద్యమంలో పాల్గొన్న జిల్లా పెద్దల్లో స్వీయచరిత్రకు పూనుకున్న మొదటివ్యక్తి కనకమ్మే." అని 'కనకపుష్యరాగం' సంపాదకులు కాళిదాసు పురుషోత్తం పేర్కొన్నారు. (కనకపుష్యరాగం, 8. 2011)

**ముగింపు :** 'విముక్త మహిళ అని గురజాడ చాటి చెప్పేనాటికి తూర్పున కందుకూరి రాజ్యలక్ష్మమ్మ అనే గొప్ప ఇల్లాలు చరిత్రను తిరగరాసే ప్రయత్నంలో ఉంది. మరొక ఇరవయ్యేళ్ళ తర్వాత దక్షిణాన .. పొణకా కనకమ్మ అనే యువతి తనదైన శైలిలో చరిత్రను అర్థంచేసుకొంటూ సామాజిక న్యాయంకోసం చరిత్రను సృష్టించడానికి పూనుకున్నది. ఇద్దరివీ వేరువేరు బాటలు. ఐనా గమ్యం ఒకటే.' అని కనకమ్మ గారి స్వీయచరిత్ర వల్ల తెలుస్తున్నది.

"చరిత్రలో కనకమ్మమీద జరిగింది కుట్ర అనుకాని, నిర్లక్ష్యం.. దారుణమైన నిర్లక్ష్యం. ఆంధ్రదేశంలో స్వాతంత్ర్యోద్యమ చరిత్రను రాసే చరిత్రకారులు "నెల్లూరులో పొణకా కనకమ్మ ఖద్దరు గుడ్డలు అమ్మిందనీ, గాంధీజీకి బంగారు గాజులు తీసి ఇచ్చించన్నీ ఉప్పు సత్యాగ్రహంలో జైలుకు వెళ్ళిందనీ" ఒక వాక్యం రాసి మొక్కు తీర్చుకుంటారు. అంతేనా... కనకమ్మ అదేనా చరిత్రలో ఆమె స్థానం? కాదు, కానేకాదని నిర్వంద్వంగా నిరూపిస్తుందీ స్వీయచరిత్ర.

కనకమ్మది కొత్త బాట, తనంతటతాను వేసుకొన్నబాట కావడంవల్ల దారి పొడవునా రాళ్ళూ ముళ్ళూ, ఐనా ఆమె నడక కుంటుపడలేదు. నెల్లూరుజిల్లాలో పొట్లపూడి అనే చిన్నపల్లెలో బాల్యం, యవ్వనం గడిచినా, ఆమె తనను తాను ఆధునిక మహిళగా రూపొందిచుకొంది. భూస్వామ్య కుటుంబంలోని ఆంక్షలన్నిటీ ఆమె ఎదుర్కొంది. అయినాసరే ఆమె ఏక్షణంలోనూ స్థాణువు అయిపోలేదు. జీవితమంతా చైతన్యమే! అలుపెరుగని, ఓటమికి తలవంచని ఒంటరి పోరాటమే." అని పెన్నేపల్లి గోపాలకృష్ణ గారు పేర్కొన్నారు. (కనకపుష్యరాగం,6.2011)

"కనకమ్మది నిండు జీవితము, సార్థకమైన ప్రాణము, విజ్ఞానవంతమైన జీవయాత్ర. జీవితాంతమువరకు ఆమెను పూలలో బెట్టి పోషించిన ఆమె ఆత్మబంధువులు ప్రశంసకు పాత్రులు.

ఎక్కడెక్కడ స్త్రీవిద్య ఉద్ధరింపబడినదో, ఎక్కడెక్కడ మహిళల ప్రాథమిక హక్కులు రక్షింపబడినవో, ఎక్కడెక్కడ రైతు ఉద్యమాలు పుష్పించి ఫలములనిచ్చినవో అక్కడక్కడ ఆమెపేరు వినబడగలదుబీ ఆమెమూర్తి కనబడగలదు. సర్వేశ్వరుడు ఆమె ఆత్మకు శాంతిని ప్రసాదించుగాత!" అని పద్మభూషణ్ వెన్నెలగంటి రాఘవయ్య గారు కనకమ్మ గారిని ప్రశంసించారు. (కనకపుష్యరాగం, .2011)

"1930 జూలై 1న కనకమ్మ అరెస్టయి నెల్లూరు, వేలూరులలో జైలుశిక్ష అనుభవించారు. జైలు జీవితంలో భారతం, పురాణాలను సహచర ఖైదీలకు చదివి వినిపించేవారామె. ఈ కేసులో ఆమెకు 18 నెలల జైలుశిక్ష పడింది. అనారోగ్యం కారణంగా 1933 జూన్ 30న ఆమెను జైలునుంచి విడుదల చేశారు. 1917 నుంచే పొణకా కనకమ్మ ఎన్నో సాహిత్య రచనలు చేశారు. వ్యాసాలు, కవితలు రచించారు. ఆమెకు ప్రతిష్ఠాత్మకమైన గృహలక్ష్మి స్వర్ణకంకణం లభించింది. 1923లో బాలికా విద్య కోసం

కస్తూరిబా బాలికా విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు కనకమ్మ. ఆ పాఠశాలలో వృత్తి విద్య కూడా ఏర్పాటు చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం సర్వం త్యాగం చేసిన వీరవనిత పొణకా కనకమ్మ 1963 సెప్టెంబర్ 15న కన్నుమూశారు. మహిళా జాతికి వెలుగుచుక్కయిన కనకమ్మ స్మృతికి నెల్లూరు నగరంలో కనీసం శిలావిగ్రహం ఏర్పాటు చేయకపోవడం అన్యాయం. కనకమ్మ జీవితకథను పాఠ్యాంశంగా చేర్చి మహిళా స్ఫూర్తికి ప్రభుత్వం ముందుకొచ్చినప్పుడే ఆమెకు సరైన నివాళి అవుతుంది." అని ఈతకోట సుబ్బారావు పొణకా కనకమ్మ గారి గురించి పేర్కొన్నారు.

ఈవిధంగా భారత జాతీయోద్యమంలో పోరాట పటిమతో పాలుపంచుకొని, తమ జీవితాలను భరతమాత దాస్యశృంఖలాలను ఛేదించటానికి అంకితం చేసిన ఎందరో మహనీయులు ఉన్నారు. అటువంటి వారిలో నెల్లూరుకు చెందిన ప్రముఖ సామాజిక సేవాతత్పరురాలు, పేదల పాలిటి కల్పవల్లి, గాంధేయవాది అయిన శ్రీమతి పొణకా కనకమ్మ గారు ఆనాటికి మరియు ఈనాటికీ కూడా అందరికీ ఆదర్శప్రాయురాలని చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు :-**

1. కనకపుష్యరాగం, పొణకా కనకమ్మ. సునయన క్రియేషన్స్, బెంగుళూరు, 2011
2. తెలుగు సాహిత్య సమీక్ష, జి. నాగయ్య, నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి, 2009
3. స్వాతంత్ర్య సమరంలో ఆంధ్ర మహిళలు, డా. దుర్గాబాయ్ దేశ్ ముఖ్, అచ్యుతుని గిరిజ, ఆంధ్ర రాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాలలు శాఖ, హైదరాబాదు, 1987.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# నెల్లూరుజిల్లా స్వాతంత్ర్య సమరయోధురాలు – పొణకా కనకమ్మ

డా॥ కుమ్మెత లక్ష్మీ నారాయణరెడ్డి, తెలుగు శాఖ, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు

ఆంగ్లేయుల దురాగతాలకు, దోపిడీ పాలనకు వ్యతిరేకంగా భరతమాత దాస్యవిముక్తికోసం ఎందరో మహానుభావులు స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారు. దృఢసంకల్పంతో ముందుకుసాగారు. ఆ సంగ్రామంలో పురుషులతోపాటు ఎందరో స్త్రీలు పాల్గొన్నారు. అలా ఆ ఉద్యమంలో పాల్గొన్న స్త్రీలలో నెల్లూరుజిల్లా పోట్లపూడి గ్రామానికి చెందిన పొణకా కనకమ్మ ఒకరు. కనకమ్మ వందేమాతర ఉద్యమంతో ప్రారంభమైన అనేక ఉద్యమాల్లో పాల్గొనింది. ఆంధ్రోద్యమంలో కీలక పాత్ర పోషించింది. గ్రంథాలయోద్యమం ప్రారంభం కాకముందే తన గ్రామంలో గ్రంథాలయాన్ని స్థాపించింది. మహాత్మాగాంధీ రంగప్రవేశం చేయకముందే అస్పృశ్యతా నివారణకు కృషిచేసింది. అలాగే ఎన్నో కార్యక్రమాలను తన గ్రామంనుంచే ప్రారంభించింది. కవులను, కళాకారులను, విప్లవకారులను, ఆంధ్రోద్యమకారులను తన గ్రామానికి ఆహ్వానించింది. వారి ఆశయాలకు, ఆకాంక్షలకు వెన్నుదన్నుగా నిలిచిన గొప్ప నాయకురాలిగా ప్రజలమన్ననలు పొందింది పొణకా కనకమ్మ.

పొణకా కనకమ్మ 1892 జూన్ 10వ తేదీన పాతకోవూరు తాలూకా మినగల్లులో అమ్మమ్మగారింట జన్మించింది. ఈమె తల్లిదండ్రులు మరుపూరు కావమ్మ, కొండారెడ్డి. కనకమ్మను బాల్యంలో ఆమె తల్లిదండ్రులు స్కూల్‌కు పంపలేదు. స్వయంకృషితోనే విద్యాభ్యాసం చేసింది. వచనభాగవతంతో ప్రారంభించి ఎన్నో గ్రంథాలు చదివింది. తరువాత కొంతమంది గురువుల సహాయంతో సంస్కృతం, హిందీ భాషలు నేర్చుకొంది. కనకమ్మకు మేనమామ అయిన పోట్లపూడికి చెందిన పొణకా సుబ్బరామిరెడ్డితో వివాహమైంది. వారికి ఒక కుమార్తె జన్మించింది. కనకమ్మ కుటుంబం సిరిసంపదలతో తులతూగేది. ఆమె ఎందరో అతిథి అభాగ్యులకు ఆదరించి అన్నంపెట్టేంది. ఏదోవిధంగా పదిమందికీ సాయంచేయడం, పదిమందినీ కూడగట్టుకోవడం ఆమె సహజ స్వభావం. ప్రజోపయోగ కార్యాలు, దేశసేవ చేయాలన్న తపన ఆమెలోవుండేది. ఏదైనా సంస్థను స్థాపించి తన ఆశయాలను, ఆకాంక్షలను నెరవేర్చుకోవాలనుకుంది. అప్పుడు కనకమ్మ పోట్లపూడిలో 1913 మార్చి 15వ తేదీన మరిది పొణకా పట్టాభిరామిరెడ్డి, తమ్ముడు మరుపూరు పిచ్చిరెడ్డి, నెల్లూరు వెంకట్రామానాయుడు, పట్నం వెంకటసుబ్బారెడ్డి, గండవరం హనుమారెడ్డిలతో కలసి సుజనరంజనీ సమాజాన్ని స్థాపించింది. దానికి అనుబంధంగా వివేకానంద గ్రంథాలయాన్ని ఏర్పాటుచేసింది.

సుజనరంజనీ సమాజం పక్షాన పోట్లపూడిలోను, చుట్టుపక్కల గ్రామాలలోను కలరా, స్ఫోటకం విషజ్వరాలు సోకినప్పుడు మందులు తెప్పించి రోగులకు అందజేసేది. ఒకసారి కార్తీకమాసంలో ఇక ఫ్లూయన్‌జా వచ్చి మాలవాడను చుట్టివేసింది. వాడంతా జ్వరంతో బాధపడుతున్నారు. అప్పుడు కనకమ్మ వాడలోని రోగులందరికీ తనవాళ్ళ సహకారంతో జావ తయారుచేసి దాంతోపాటు మందులిచ్చి పంపింది. ఈవిధంగా జ్వరం తగ్గిపోయేవరకు ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సమయంలోనే మాదిగవాడలో ఒక మనిషికి కలరా సోకింది. వెంటనే ఆమె చతుర్వేదుల రాఘవయ్య దగ్గరకు వచ్చి విషయం చెప్పింది. వెంటనే ఆయన మాదిగవాడకు పోయి కలరా సోకిన రోగికి మందులిచ్చి తిరిగివచ్చాడు. యథావిధిగా ఇంటికి వచ్చి స్నానం, జపం చేసుకొని అన్నం వండుకుని తిన్నాడు. సుజనరంజనీ సమాజసభ్యులు పోట్లపూడి గ్రామవాసులు గాంధీజీ అస్పృశ్యతా నివారణ కంటే ముందే ఈ కార్యక్రమాలు చేపట్టారు.

మొదట సుజనరంజనీ సమాజానికి రాజకీయాలతో సంబంధంలేదు. వెన్నెలకంటి రాఘవయ్య, చతుర్వేదుల కృష్ణయ్య సమాజంలో సభ్యులైన తరువాత విప్లవోద్యమం ప్రారంభమైంది. చతుర్వేదుల కృష్ణయ్యకు మద్రాసులో విప్లవ కార్యకలాపాలు సాగిస్తున్న చిదంబరం పిళ్ళై, ఉన్నవ లక్ష్మీనారాయణలతో సాన్నిహిత్యం ఉండడంవల్ల సమాజానికి విప్లవోద్యమంతో సంబంధం ఏర్పడింది. చిదంబరం పిళ్ళై ద్వారా రాఘవయ్య రివాల్వార్‌ను రహస్యంగా తెప్పించాడు. రహస్యంగా తయారుచేసిన బాంబులను ఇసుకలో దాచుటకు వీలుగావుంటుందనే ఆలోచనతో పల్లిపాడులోని పెన్నాతీరంలో ఉన్న మామిడితోపును కొనుటకు తీర్మానించుకున్నారు. సమాజంలోని సభ్యులు రివాల్వార్‌తో కాల్చడం నేర్చుకున్నారు. ఆ సమయంలోనే కనకమ్మ రాఘవయ్యను తిలక్‌తో రహస్య సమాలోచనలు జరుపుటకు పూనాకు పంపింది.

1917వ సంవత్సరంలో కనకమ్మ పోట్లపూడిలో సుజనరంజనీ వార్షికోత్సవాలు నిర్వహించింది. ఈ కార్యక్రమం కాశీనాథుని నాగేశ్వరరావు ఆధ్యక్షతన జరిగింది. ఈ వార్షికోత్సవాలకు ఉన్నవ లక్ష్మీనారాయణ, చిలకమర్తి లక్ష్మీనరసింహం, అయ్యంకి వెంకటరమణ, ఆచంట లక్ష్మీపతి దంపతులు, అయ్యదేవర కాళేశ్వరరావు, రాయప్రోలు సుబ్బారావు, మంగిపూడి వెంకటశర్మ, ఉమర్ ఆలీషా కవి మొదలగువారు పాల్గొని ఉపన్యసించారు.

1918లో కనకమ్మ విప్లవసాహిత్యాన్ని తన ఇంటికి సమీపంలో గల చాకలి ఇంటిలో భద్రపరచింది. వీర సావర్కర్ రాసిన 'ది ఫైర్ ఆఫ్ వార్ ఆఫ్ ఇండియన్ ఇండిపెండెన్స్' ను తెలుగులోకి అనువాదం చేయమని చతుర్వేదుల రాఘవయ్యను కోరింది. తరువాత దాన్ని ముద్రించి రహస్యంగా పంపిణీచేశారు. దీపాల పిచ్చయ్యశాస్త్రి చేత 'స్వప్నప్రయాణం', దువ్వూరి రామిరెడ్డి చేత 'మాతృశతకం' రాయించి అచ్చువేయించింది. తరువాత బ్రిటీష్ ప్రభుత్వం ఆ కాపీలను స్వాధీనపరచుకొని తగులబెట్టించింది. దీనితో కనకమ్మ రహస్య విప్లవోద్యమం బయటి ప్రపంచానికి తెలిసింది. కనకమ్మ విప్లవభావాలు కల వ్యక్తి అయినా 1919లో గాంధీని దర్శించిన తరువాత అహింసామార్గంలో తన ప్రయాణం సాగించింది.

ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో తెలుగువారికి అన్యాయం జరుగుతుందని భావించిన కొందరువ్యక్తులు తెలుగు ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటుచేయాలనే కోరికతో ఆంధ్రమహాసభను ఏర్పాటుచేశారు. 1913లో ప్రథమాంధ్ర మహాసభ బాపట్లలో జరిగింది. 1917లో అయిదవ ఆంధ్ర రాష్ట్ర మహాసభ నెల్లూరులో జరిగింది. ఆ సభకు కొండా వెంకటప్పయ్య అధ్యక్షులుగా వ్యవహరించారు. ఆంధ్ర రాష్ట్ర తీర్మానానికి నెల్లూరుకు చెందిన కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి, ఆమంచర్ల కృష్ణారావు వ్యతిరేకులు. ఆదినారాయణరెడ్డి తన పలుకుబడిని ఉపయోగించి తీర్మానానికి వ్యతిరేకంగా ఓటే వేయించడానికి సర్వవిధాలా ప్రయత్నంచేశాడు. అయితే ఆంధ్రరాష్ట్ర తీర్మానం నెగ్గింది. ఈ తీర్మానం నెగ్గేందుకు బెజవాడ పట్టాభిరామిరెడ్డి, కనకమ్మ మరిది పొణకా పట్టాభిరామిరెడ్డిలు కృషిచేశారు. అప్పుడు రాయప్రోలు సుబ్బారావు రాసిన 'ఆంధ్రప్రబోధం' పద్యాలు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పాడగా సభ మారుమ్రోగింది.

ఆరోజు సాయంత్రం ఆంధ్రమహాసభతో పాటు స్త్రీల రాష్ట్రసభ జరిగింది. ఆ సభకు కాశీనాథుని నాగేశ్వరరావు భార్య రామాబాయమ్మ అధ్యక్షత వహించింది. ఆ సభలో రాయప్రోలు సుబ్బారావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావులు హాజరయ్యారు. కనకమ్మ మొదటిసారిగా ఆ సభలో ప్రసంగించింది. ఆ సభకు స్థాయిసంఘాన్ని ఏర్పాటుచేశారు. ఆ సంఘానికి కనకమ్మ 116రూపాయలు విరాళంగా ఇచ్చింది.

1914లో ఐర్లాండు దేశస్తురాలైన అనిబిసెంట్ 'హోంరూల్ ఉద్యమం' సాగించింది. హోంరూల్ ఉద్యమంలో సభ్యులను చేర్పించడానికి రంగనాథ మొదలియారు పోట్లపూడి వచ్చాడు. పొణకా కనకమ్మ నాయకత్వంలో పోట్లపూడి గ్రామస్తులను కనకమ్మ సభ్యులుగా చేర్పించింది. ఆ గ్రామస్తులు మాంసాహారాన్ని మానివేసి శాఖాహారులుగా మారిపోయారు. ప్రతి ఇంటా రాట్నాలతో నూలువడకడం నిత్యకృత్యమైంది. తరువాత కనకమ్మ బర్మాతో కలిసివున్న భారతదేశ పటం ప్రతిమను పెన్నేటి ఆదినారాయణరెడ్డి చేత అనిబిసెంటుకు పంపింది. 1919లో తిలక్ మద్రాసువచ్చి అనిబిసెంట్ నివాసంలో అతిథిగా ఉన్నప్పుడు కనకమ్మ తన సహచరులతో అతణ్ణి సందర్శించింది.

1918లో కనకమ్మ పోట్లపూడిలో రాట్నాలు పెట్టినూలు వడికించేది. నూలు వడకడంలో ఆమె తల్లి మంచి నైపుణ్యం ప్రదర్శించేది. తన తల్లి తీసిన నూలుతో పంచె నేయించి కనకమ్మ భక్తిపూర్వకంగా మహాత్మునికి పంపింది. 1919లో గాంధీ మద్రాసుకు వచ్చి రాజాజీ అతిథిగా ఉన్నప్పుడు చతుర్వేదుల కృష్ణయ్య ప్రోత్సాహంతో కనకమ్మ ఆమె తల్లితో కలసి గాంధీని సందర్శించింది. గాంధీ సమక్షంలో కనకమ్మ తల్లి రాట్నంతో నూలు తీసింది. గాంధీ ఆమె పనితనానికి మెచ్చి ప్రశంసించారు. ఆమెను సబర్మతీ ఆశ్రమానికి ఆహ్వానించారు.

నెల్లూరు పట్టణానికి ఆరుమైళ్ళ దూరంలో పినాకినీ నదిఒడ్డున పల్లిపాడు అనే గ్రామం కలదు. ఆ గ్రామంలో చతుర్వేదుల

కృష్ణయ్య అనే వ్యక్తి సబర్మతీ ఆశ్రమం వెళ్ళినాడు. అక్కడ కృష్ణయ్యకు దిగుమర్తి హనుమంతరావు అనే వ్యక్తి పరిచయమైనాడు. గాంధీ వీరిద్దరినీ పల్లెపాడులో సబర్మతీ ఆశ్రమంలాంటి ఆశ్రమాన్ని ఏర్పాటుచేయమన్నాడు. అఖిలభారత కాంగ్రేస్ సంఘం ఇచ్చిన విరాళంతో పల్లెపాడులో పది ఎకరాల పొలం కొని అందులో ఆశ్రమం నిర్మించాలనుకొన్నారు. వీరిద్దరూ సబర్మతీ ఆశ్రమం నుండి కనకమ్మకు తమ ఉద్ధేశ్యాలను తెలుపుతూ ఉత్తరంలో రాశారు. కనకమ్మ కూడా సత్యాగ్రహాశ్రమం ఏర్పాటుచేయడానికి 13 ఎకరాల చింతతోపు, మామిడితోపు గల ఏటిఒడ్డున ఉన్న భూమిని కొనుగోలు చేసింది. 1921లో ఆ స్థలంలో కనకమ్మ భర్త పరాభి సుబ్బరామిరెడ్డి ఏడు ఎనిమిది పాకలు వేయించాడు. అదే సంవత్సరం ఏప్రిల్ నెల ఏడవ తేదీన గాంధీ నెల్లూరుకు వచ్చాడు. గాంధీజీని కనకమ్మ భర్త సుబ్బరామిరెడ్డి సవారి బండిలో పల్లిపాడులోని ఆశ్రమానికి తీసుకొనివచ్చాడు. అప్పుడు కనకమ్మ తన ఒంటిమీద ఉన్న 40 సవరల బంగారు నగలు తీసి ఆశ్రమానికి విరాళంగా ఇచ్చింది. అంతేకాక తన తల్లి చేతుల్లోని బంగారుగాజుల్ని కూడా సమర్పించింది. జీవితంలో తిరిగి బంగారునగలు ధరించనని ఆమెతో గాంధీజీ ప్రమాణం చేయించాడు. పినాకినీ సత్యాగ్రహాశ్రమంలో కొన్ని మగ్గాలు, రాట్నాలు పెట్టినారు. పినాకినీ ఆశ్రమ భవనం కట్టినతర్వాత కనకమ్మ ఆశ్రమానికి కొన్ని వస్తువులు, మంచాలు, వంటసామానులు కానుకగా ఇచ్చింది.

1920వ సంవత్సరం నుంచి ఆమెకు కాంగ్రెస్‌తో సన్నిహిత సంబంధం ఉంది. ఆమె ఎంతో పట్టుదలతో స్త్రీలలో కాంగ్రేస్‌పై అభిమానాన్ని పెంపొందింపచేశారు. కాకినాడ స్త్రీ వాలంటీర్ దళానికి అధ్యక్షత వహించారు. స్త్రీలందరూ విద్యావంతులు కావాలని కాంక్షించారు. స్త్రీలు రాజకీయ చైతన్యంగల దేశభక్తులు కావాలనేది ఆమె తపన. అందుకే ఆమె నెల్లూరులో కస్తూరిదేవి విద్యాలయం నెలకొల్పారు. 1923లో దానిని శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులుతో ప్రారంభోత్సవం చేయించింది. స్కూలు స్వంతభవనాలకు 1929లో గాంధీజీచే శంకుస్థాపన చేయించింది. “నెల్లూరులో చూడదగినది ఏదైనా ఉంటే అది కస్తూరిదేవి విద్యాలయమే సుమా, మీరందరూ దీనికి సహకరించండి” అని ప్రజలకు ఉద్బోదించాడు గాంధీ. ఆ విద్యాలయంలో విద్యతో పాటు చేతివృత్తులు కూడా నేర్పేవారు.

1921లో అఖిల భారత కాంగ్రేస్ సమావేశం అహ్మదాబాద్‌లో జరిగింది. ఆ సభలో కనకమ్మను సభ్యురాలిగా ఎన్నుకొన్నారు. ఆంధ్ర మహిళల్లో తొలిసారిగా సభ్యత్వం పొందిన మొదటి మహిళ కనకమ్మ. 1922 మార్చినెలలో నెల్లూరు స్త్రీల కాంగ్రేస్ స్థాపించబడింది. దీనికి తిక్కవరపు సుదర్శనమ్మ అధ్యక్షురాలుగా, కనకమ్మ కార్యదర్శిగా ఎన్నికైంది. 1923వ సంవత్సరం నెల్లూరికి వచ్చిన చిత్తరంజన్‌దాస్‌ను దర్శించి కనకమ్మ ఆయనకు మద్దతు లెలిపింది. తిలక్ స్వరాజ్యనిధికి స్త్రీల కాంగ్రేస్ తరుపున ఊరూరా తిరిగి భారీగా విరాళాలు సేకరించింది. ఖద్దరు ప్రచారంలో కూడా ఉధృతంగా పాల్గొనింది.

1923లో కాకినాడలో జరిగిన అఖిలభారత కాంగ్రేస్ సమాశేశానికి అనుబంధంగా ఉన్న మహిళాసభకు అధ్యక్షత వహించింది. అదే సంవత్సరంలో నెల్లూరులో జరిగిన మహిళాసభను టంగుటూరి హనుమాయమ్మ ఆధ్వర్యంలో నిర్వహించింది. కనకమ్మ స్ఫూర్తితో ఎందరో ఉన్నతవర్గాల స్త్రీలు స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు.

1927-28వ సంవత్సరాలలో మదనపల్లి, తిరుపతిలలో స్త్రీల సభలను నిర్వహించినపుడు కనకమ్మ వెళ్ళి ఆ సభలలో పాల్గొని ప్రసంగించింది. రాయలసీమ కరువునిధికి విరాళాలు సేకరించడంలోనూ, 1927లో నెల్లూరులో వచ్చిన గాలివాన బాధితులను ఆదుకోవడంలో కీలకపాత్ర వహించింది. నరసాపురానికి చెందిన ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ, బందరుకు చెందిన మనపాక కమలమ్మలతో కలసి చెన్నపట్నం రాజకీయ మహాసభలలో పాల్గొంది. మద్రాస్ గోఖలే హాలులో జరిగిన సభలో బులుసు సాంబమూర్తి సంపూర్ణ స్వరాజ్య తీర్మానం ప్రవేశపెట్టగా కనకమ్మ సమర్థిస్తూ ప్రసంగించింది.

1929లో మద్రాస్‌లో డా॥ముత్తులక్ష్మిరెడ్డి అధ్యక్షతన జరిగిన మహిళాసమాఖ్య సమావేశంలో పన్నెండు తీర్మానాలు ఆమోదించబడ్డాయి. అందులో కనకమ్మ ప్రవేశపెట్టిన దేవదాసీ వ్యవస్థ రద్దు, మద్యనిషేదము అమలు అనే రెండు తీర్మానాలు కావడం గమనార్హం. అలాగే ఆంధ్రరాష్ట్ర కాంగ్రేస్ అధ్యక్షులు ఆచార్య ఎన్.జి. రంగా గారి ప్రతిపాదన మేరకు కనకమ్మ రాష్ట్ర

ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైంది. 1930లో విదేశీ వస్త్ర వస్తు బహిష్కరణ ఉద్యమంలో కనకమ్మ నెల్లూరులో కీలకపాత్ర పోషించింది.

1930లో ఉప్పు సత్యాగ్రహం దేశమంతటా వ్యాపించింది. అనేకమంది స్త్రీ పురుషులు శాసనోల్లంఘనం చేసి ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని జైలుకువెళ్ళారు. పల్లెపాడు శిబిరం ప్రారంభంకాగానే పరిసరగ్రామ ప్రజలు సహకరించారు. నెల్లూరు సంతపేటలో పికెటింగ్ చేస్తున్న కనకమ్మను అరెస్ట్‌చేసి 6నెలలు శిక్ష విధించారు. 1930డిసెంబరు 26న విడుదల అయ్యింది. తిరిగి 1932లో ప్రభుత్వ వ్యతిరేక ఉపన్యాసాలు ఇచ్చినందుకు బెజవాడ గోపాలరెడ్డితో పాటు అరెస్ట్ అయింది. తిరిగి 1932 మే 26న ఒకటిన్నర సంవత్సరం జైలుశిక్ష పడింది. ఈ రెండు జైలుశిక్షలు అనుభవించి బయటకు వచ్చేటప్పటికి ఆమె ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నది. ఆమె కలల ప్రపంచం కస్తూరిబా విద్యాలయం ఆర్థిక లోపంవల్ల నిలిచిపోయే దుస్థితికి వచ్చింది. లక్షలు ఖర్చుపెట్టి ప్రజోపకార కార్యక్రమాలు చేస్తున్న ఆమె ఇష్టపడి స్థాపించిన విద్యాలయం డబ్బులేక మూయవలసి వచ్చింది. ఆ రోజుల్లో సంస్థానాధీశులు, జమీందార్లు రైతులకు రకరకాల ఇబ్బందులకు గురిచేసేవారు. ఈ దురాగతాలను ఎదుర్కోవడానికి కనకమ్మ 'జమీన్‌రైతు' అనే పత్రిక ప్రారంభించింది. సంస్థానాధీశులకు జమీందార్లకు ఎదురుతిరిగింది. ఆమె వందల ఎకరాల ఆస్థిని పోగొట్టుకుంది. ఆమె కుటుంబం కట్టుబట్టలతో బయటపడింది. ఆనాటి ఈ జమీన్‌రైతు ఉద్యమకృషి ఫలితంగా 1946–47 జమీందారీవ్యవస్థ రద్దయ్యింది. తన యావదాస్తి పోయినా వేలాదిమంది పేదరైతులు బాగుపడ్డారని ఆమె ఎంతో సంతోషించింది.

స్వాతంత్రోద్యమంలో, ఆంధ్రోద్యమంలో, సంఘసేవలో యావదాస్థి పోగొట్టుకొంది. చివరకు అనారోగ్యంతో తన ఏకైక కూతరు కన్నుమూసింది. అంతటి దుఃఖంలోనూ గుండెను రాయిగా చేసుకొని జీవించింది. ఈ దుఃఖాన్ని తట్టుకోవడాన్ని శ్రీ రమణమహర్షి సన్నిధిలో కొంతకాలం గడిపింది. మరికొన్ని రోజులు అన్నారెడ్డిపాలెంలోని శ్రీరామయోగి ఆశ్రమంలో ఆధ్యాత్మిక జీవితం గడిపింది. తరువాత 1933లో ఆంధ్రదేశ పర్యటనకు వచ్చిన గాంధీతో కలసి కావలి, బుచ్చిరెడ్డిపాళెం, వెంకటగిరిలో పర్యటించి విరాళాలు సేకరించింది.

1928లో మహిళోద్ధరణ కోసం కె.ఎన్.కేసరి మద్రాస్‌లో స్థాపించిన "గృహలక్ష్మి" అనే మాసపత్రికలోను, 1917లో కాకినాడ నుండి వెలువడే 'హిందూసుందరి' అనే మాసపత్రికలో కనకమ్మ పద్యాలు, వ్యాసాలు రాసింది. 1955లో పొణకా కనకమ్మకు గృహలక్ష్మి స్వర్ణకంకణం లభించింది. 1962లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన రజతోత్సవసభలో రాజాజీ ముఖ్య అతిధిగా విచ్చేశాడు. ఆ సందర్భంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన ఇరవై మంది ఆంధ్రమహిళలకు ఆ రోజు సన్మానం చేశారు. వారిలో పొణకా కనకమ్మ ఒకరు. ఆ సభలోనే ఆనాటి మహారాష్ట్ర గవర్నర్ డా॥ సుబ్బరాయన్‌గారు మహిళాసభ తరపున కనకమ్మను రజితఫలకం అందించారు. ఇలా దేశసేవ, సంఘసేవ చేస్తూ బూజుపట్టిన ఆచారాలను తోసిపుచ్చి అభ్యుదయ భావాలను ఆహ్వానించిన మహాత్యాగశీలి కనకమ్మ. దేశంకోసం, సంఘంకోసం తన జీవితాన్ని సర్వస్వం త్యాగం చేసిన కనకమ్మ 1963 సెప్టెంబరు 15వ తేదీన మరణించింది.

**ఆధార గ్రంథాలు:**

1. **స్వాతంత్ర సమరంలో ఆంధ్రమహిళలు** దుర్గాబాయ్ దేశ్‌ముఖ్,అచ్యుతుని గిరిజ,ఆంధ్ర పురావస్తు ప్రదర్శనశాలల శాఖ, హైదరాబాద్ (1987).
2. **కనక పుష్యరాగం – పొణకా కనకమ్మ స్వీయచరిత్ర,** సంపాదకులు డా॥ కాళిదాసు పురుషోత్తం, పల్లవీ పబ్లికేషన్స్ 29–28–26/ 1, దాసరి వారి వీధి, సూర్యాపేట, విజయవాడ – 520002.
3. **పినాకినీ రత్నదీపం శ్రీమతి పొణకా కనకమ్మ** – రావినూతల శ్రీరాములు, కవికోకిల దువ్వూరి రామిరెడ్డి ప్రచురణలు (2020) నెల్లూరు.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# పోరాటంలోనూ సగం

**డా. నల్లపనేని విజయలక్ష్మి**, తెలుగు అధ్యాపకురాలు, యార్లగడ్డ అన్నపూర్ణాంబ ప్రభుత్వ మహిళా కళాశాల, చీరాల, సెల్: 9701667350

1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటుతో ప్రారంభమై 1947లో స్వాతంత్ర్య సముపార్జన వరకు ఉధృతంగా జరిగిన స్వాతంత్ర్యోద్యమ పోరాటానికి ఎంతోమంది మహిళలు మేము సైతం అంటూ తమ వంతు తోడ్పాటు నందించారు. అయితే పురుషులకు లభించినంత పేరు ప్రఖ్యాతులు వారికి లభించలేదు. కనీసం తరువాతి తరాలకు పేరు కూడా తెలియకుండా మరుగున పడిపోయిన ధీర వనిత లెందరో.

**వీరరాణులు :** సిపాయిల తిరుగుబాటు అనగానే మనకు గుర్తొచ్చే పేరు ఝాన్సీ లక్ష్మీబాయి. అయితే తమ సంస్థానాలను, ప్రజలను కాపాడుకోవడానికి ఆంగ్లేయులపై అలుపెరుగని పోరాటం చేసి వారిని ముప్పుతిప్పలు పెట్టిన రాణులు ఇంకా ఉన్నారు. వారికి లభించవలసినంత ఖ్యాతి లభించలేదు.

**రాణి అవంతీబాయి :** రామ్‌గఢ్ (ప్రస్తుత మధ్యప్రదేశ్‌లోని మాండ్లా జిల్లాలో గల దిండోరి పట్టణం) రాజ్యాధినేత విక్రమాదిత్య లోది భార్య అవంతీబాయి. భర్త అనారోగ్యంతో మరణించడం, పిల్లలు మైనర్లు కావడంతో అవంతీబాయి రామ్‌గఢ్ పాలనా బాధ్యతలను స్వీకరించింది. వారసుల్లేని రాజ్యాలను స్వాధీనం చేసుకునే పద్ధతిని ప్రవేశపెట్టిన ఈస్టిండియా కంపెనీ రామ్‌గఢ్‌ను స్వాధీనం చేసుకునే ఉద్దేశంతో మైనరు పిల్లలను వారసులుగా అంగీకరించలేదు. 1851లో కంపెనీ తరపున పాలనాధికారిని నియమించింది. అవంతీబాయి ఆ నిర్ణయాన్ని ప్రతిఘటించింది. చుట్టుపక్కల రాజ్యాల వారినందరిని కలుపుకొని తిరుగుబాటు చేసింది. 4వేల మంది సైన్యంతో తాను స్వయంగా రణరంగంలోకి దిగి కంపెనీ సైన్యంతో పోరాడి వారిని ఓడించింది. అప్పటికి పారిపోయిన కంపెనీ సైన్యం భారీ బలగాలతో మళ్లీ దాడికి దిగితే వారి ఆధునిక ఆయుధాల ముందు నిలువలేక తప్పించుకొని పారిపోయి దేవ్‌గఢ్ అడవుల్లో తలదాచుకుంది. అక్కడినుండే గెరిల్లా పద్ధతిలో పోరాడి ఆంగ్లేయులను ముప్పుతిప్పలు పెట్టింది. 1858 మార్చిలో బ్రిటీషు సైన్యం దేవ్‌గఢ్ గుట్టలను చుట్టుముట్టినపుడు వారి చేతికి దొరకకుండా ఆత్మార్పణం చేసుకుంది. 26 సంవత్సరాలు మాత్రమే జీవించిన ఆమె చూపిన పోరాటపటిమ అసామాన్యం.

**బేగం హజ్రత్‌మహల్ :** అవధ్ సంస్థానానికి రాణి హజ్రత్‌మహల్. స్వాతంత్ర్యానికి ముందు ప్రస్తుత ఉత్తరప్రదేశ్‌లో భాగంగా ఉండేది అవధ్ సంస్థానం. నిరుపేద కుటుంబంలో జన్మించి, బానిసగా రాజప్రసాదంలో అడుగుపెట్టి, రాజు హృదయాన్ని గెలుచుకొని రాణిగా మారిన స్త్రీ ఆమె. 1856లో బ్రిటీషు ప్రభుత్వం అవధ్ సంస్థానాన్ని స్వాధీనం చేసుకొంది. నవాబ్ వాజిద్ అలీ షా అశక్తుడై సంస్థానాన్ని, పరివారాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయాడు. అదే సమయంలో సిపాయిల తిరుగుబాటు మొదలైంది. మేరఠ్, బెంగాల్ సిపాయి దళాల్లో ఎక్కువమంది అవధ్ నుంచి భర్తీ అయినవారే కావడం, వారికి స్థానిక జాగీర్దార్లు సహకరించడంతో అవధ్‌లోనూ తిరుగుబాటు మొదలైంది. వారిని సమన్వయం చేసుకొని ముందుకు నడిపించే నాయకత్వ బాధ్యతను హజ్రత్ స్వీకరించింది. హిందువులను, ముస్లింలను ఒక్కతాటి మీదకు తెచ్చింది. పరదాల చాటున బ్రతుకుతున్న మహిళలను కూడా పోరాటంలో భాగస్వాములను చేసింది. ఆమె సారథ్యంలో సిపాయిలు లఖ్‌నవూను స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలం లఖ్‌నవూను పరిపాలించింది కూడా. బ్రిటీషు ప్రభుత్వం నెలకు లక్ష రూపాయలు పింఛను చెల్లిస్తామని ఆశ పెట్టినా ఆమె లొంగలేదు.

**రాణీ చెన్నమ్మ :** కర్ణాటకలోని బెలగావి జిల్లా కిత్తూరు సంస్థానాన్ని పారిపాలించిన మల్ల సర్జా రెండవ భార్య చెన్నమ్మ. పీష్వాల చేతుల్లో భర్త హతమయ్యాడు. ఆ విషాదంతో ఆయన మొదటిభార్య రుద్రమ్మ కూడా మరణించింది. దానితో సవతికొడుకు శివలింగకు పట్టాభిషేకం చేసి పరిపాలనలో సహాయం చేసింది చెన్నమ్మ. శివలింగ, చెన్నమ్మ కొడుకు ఇద్దరూ అనారోగ్యంతో మరణించారు. మరణానికి ముందే శివలింగ దత్తత చేసుకొన్నప్పటికీ అది చెల్లదని ప్రకటించి బ్రిటీషువారు సంస్థానాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించారు. చెన్నమ్మ ఎదురుతిరిగింది. ఫలితంగా థాకరే సారథ్యంలో బ్రిటీషు సైన్యం 1824 అక్టోబరులో

కిత్తూరు సంస్థానం మీద దాడి చేసింది. ఆ పోరాటంలో చెన్నమ్మ విజయాన్ని సాధించింది. థాకరే హతమయ్యాడు. రెండవసారి ఇరవైవేల సైన్యంతో బ్రిటీషు వారు చేసిన దాడిలోనూ ఆమె విజయం సాధించింది. ఈసారి షోలాపూర్ సబ్ కలెక్టర్ మన్రో ప్రాణాలు పోగొట్టుకున్నాడు. కిత్తూరు లక్ష్మీబాయిగా ప్రశంసలందుకున్న ఆమె చివరకు ఆంతరింగుకులు చేసిన ద్రోహంతో బ్రిటీషువారికి బందీగా చిక్కి జైలులోనే కన్నుమూసింది.

**రాణి పారుకుట్టి నెత్యార్ :** కొచ్చిన్ రాజు రామవర్మ-16 భార్య పారుకుట్టి నెత్యార్. రాజుకు రాజరికం, పాలనపై ఆసక్తి లేకపోవడంతో చిన్నవయసులోనే పరిపాలనా బాధ్యతను స్వీకరించిందామె. చక్కని పాలనా నిర్ణయాలతో సంస్థానాన్ని ఆర్థికంగా బలోపేతం చేసింది. బ్రిటీషు సర్కారు ఆమెను మెచ్చుకొని 1919లో ఆనాటి అత్యున్నత పౌర పురస్కారం కైజర్ ఎ హింద్ ను ప్రకటించింది. కొచ్చిన్‌కు 17 గన్‌ల శాల్యూట్ హోదాను కూడా ఇచ్చింది. అయినా రాణి బ్రిటీషువారిని నమ్మలేదు. భారత స్వాతంత్ర్య ఉద్యమానికి బహిరంగంగా మద్దతు పలికింది. చరికపు ఆడంబరాలు, ఆభరణాలు వదిలి ఖద్దరు కట్టడం ప్రారంభించింది. రాజప్రాసాదంలోనే ఖద్దరు తయారీ కేంద్రాన్ని ప్రారంభించి అందరి వస్త్రధారణను మార్పించింది. జాతీయోద్యమానికి భూరి విరాళం ఇవ్వడమే కాకుండా తన కుమారుడు అరవిందాక్షను గాంధీజీకి తోడుగా పంపించి, అతడు జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించింది. తన మంత్రాంగంతో తాను ఉండగా ఆంగ్లేయులు కొచ్చిన్ కోట వైపు కన్నెత్తి చూడకుండా చేయగలిగిందామె.

ఈ రాణులు పోరాడింది తమ సంస్థానాలను, ఆస్తులను కాపాడుకోవటం కోసమే కావచ్చు. కాని మహా మహా రాజులే ఆంగ్లేయుల ధాటికి ఎదురు నిలువలేక వారికి లొంగిపోయిన తరుణంలో తమ ప్రజలను తామే పాలించుకోవటం కోసం వారు జరిపిన పోరాటం స్ఫూర్తిదాయకం.

**విదేశీ మహిళలు :** భారత దేశ స్వాతంత్ర్యం కోసం కృషి చేసినవారిలో ఆంగ్ల వనితలూ ఉన్నారు. భారతదేశంతో ఆధ్యాత్మిక అనుబంధాన్ని కోరి వచ్చినవారు కొందరైతే, భారతీయ సంస్కృతి పట్ల ఆదరంతో వచ్చినవారు కొందరు. ఆంగ్లేయుల దుష్పరిపాలన కింద భారతీయుల బ్రతుకులు ఎలా అణగారిపోతున్నాయో గమనించి వారు ప్రజల పక్షాన నిలబడ్డారు.

**సిస్టర్ నివేదిత :** నివేదిత అసలు పేరు మార్గరెట్ ఎలిజబెత్ నోబెల్. ఐర్లాండ్‌లో జన్మించింది. లండన్‌లో వివేకానందుని కలిసి, ఆయన ప్రసంగాన్ని విని ఆయన శిష్యురాలిగా మారి రామకృష్ణ మిషన్‌లో చేరింది. తరువాత వివేకానందుడు ఆమె పేరును నివేదితగా మార్చాడు. భారతమాత చిత్రానికి ఆకృతి నిచ్చింది నివేదితే. 1905లో బెంగాల్ విభజన సమయంలో ప్రజల ఐక్యత కోసం బంగమాత చిత్రాన్ని గీయాలని నాటి వర్ణ చిత్రకారుడు అవనీంద్రనాథ్ రాయ్ భావించాడు. ఆయనకు భారతమాత ఆలోచనను ఇచ్చి చేతిలో జెండా, నుదుట బొట్టు, ప్రశాంతవదనంతో కనిపించే భారతమాత చిత్రపటం రూపకల్పనలో ఆమె పాలుపంచుకొంది. కోల్‌కతాలో బాలికల కోసం తాను నెలకొల్పిన పాఠశాలలో వందేమాతరాన్ని ప్రార్థనాగీతంగా ప్రవేశపెట్టింది. భారతీయ సాంస్కృతిక విలువలను కాపాడేందుకు పుస్తకాలు రచించిన ఆమె ఒకవైపు సామాజిక సేవలో పాల్గొంటూనే రాజకీయ ఉద్యమాల వైపు ప్రజలను చైతన్యపరిచింది.

**అనీబిసెంట్ :** ఆమె అసలు పేరు అనీఉడ్స్. 1847 ఆక్టోబరు 1న లండన్‌లో ఐరిష్ కుటుంబంలో జన్మించింది. ప్రాచీన గ్రీకు, బౌద్ధ, హిందూ సంప్రదాయాలను ఇముడ్చుకున్న థియోసాఫికల్ (దివ్యజ్ఞాన) ఉద్యమంపై ఆమెకు ఏర్పడిన ఆసక్తి ఆమెను భారతదేశానికి రప్పించింది. భారత్ స్వతంత్ర దేశంగా మారితే, ఇక్కడి జ్ఞాన సంపద యావత్ ప్రపంచానికి మార్గదర్శనం చేస్తుందనే నమ్మకంతో ఆమె 1913 నుంచి భారత రాజకీయాల్లో పాల్గొన్నది. అతివాద, మితవాద శిబిరాలుగా విడిపోయిన కాంగ్రెస్‌ను మళ్లీ ఒకే వేదిక మీదకు తెచ్చిన ఘనత ఆమెది. 1916లో బాలగంగాధర తిలక్‌తో కలసి హోమ్‌రూల్ ఉద్యమాన్ని నడిపింది. ఆ కారణంగా మూడు నెలల పాటు నిర్బంధానికి గురయింది. 1917 డిశెంబరులో ఆమె కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలిగా ఎన్నికయింది. గాంధీజీ నేతృత్వంలో చేపట్టిన సహాయ నిరాకరణోద్యమం చట్ట ధిక్కారాన్ని ప్రోత్సహిస్తుందని భావించి దానిని

వ్యతిరేకించి క్రమంగా కాంగ్రెస్‌కు దూరమైంది. ఆ తరువాత కూడా భారత స్వాతంత్ర్య ఆవశ్యకతపై దేశ విదేశాల్లో పర్యటిస్తూ ప్రసంగాలు చేసి భారతీయులకు అనుకూలంగా మద్దతు కూడగట్టడానికి ప్రయత్నం చేసింది.

**మెల్లీ షోలింగర్ :** మెల్లీ స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్‌లో జన్మించింది. ఆంధ్ర రచయిత ఉప్పల లక్ష్మణరావుతో పరిచయం, భారతీయ సంస్కృతి పట్ల గల అపరిమిత అభిమానం ఆమెను భారతదేశానికి రప్పించాయి. తాను భారతదేశం గురించి పుస్తకాల్లో చదివిన వైభవం స్థానంలో బానిసత్వం, పేదరికం కనిపించాయి. అందుకు కారణం ఆంగ్లేయుల దమననీతే నని గుర్తించి ప్రజా పోరాటంలో పాల్గొనేందుకు నిర్ణయించుకుంది. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొంది. ఏడాది పాటు గాంధీజీ సబర్మతి ఆశ్రమంలో ఉండి నూలు వడకటం నేర్చుకుంది. ఉప్పల లక్ష్మణరావును పెళ్లాడి విజయవాడలో స్థిరపడిన ఆమె 1940లో వ్యక్తిగత సత్యాగ్రహంలో, 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టయింది. మొత్తం మూడున్నరేళ్లు రాయవెల్లూరులో జైలుశిక్ష అనుభవించింది. దేశం స్వేచ్ఛా ఊపిరులను పీల్చుకోవటం చూసి ఎంతగానో సంతోషించింది.

**సరళా బెన్ :** ఆమె అసలు పేరు కేథరిన్ మేరీ హీల్‌మాన్. ఇంగ్లాండ్‌లో ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించింది. గాంధీజీ నేతృత్వంలో శాంతి, అహింసా మార్గాల్లో జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటం గురించి విని తాను కూడా అందులో భాగస్వామి కావాలనే కోరికతో 1932లో భారతదేశంలో అడుగుపెట్టింది. వార్ధాలోని సేవాగ్రామ్‌లో ఎనిమిదేళ్లు గాంధీజీ దగ్గర శిష్యరికం చేసింది. ప్రజలతో కలసి పని చేయాలన్న ఆయన సూచన మేరకు హిమాలయాల్లోని గర్వాల్‌కు వెళ్లింది. ప్రస్తుత ఉత్తరాఖండ్, కుమావ్ జిల్లాలోని కౌశనీ ప్రాంతంలో 'లక్ష్మీ ఆశ్రమం' స్థాపించి బాలికలు, మహిళలకు వృత్తివిద్యల్లో శిక్షణ ఇచ్చింది. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించింది. జాతీయ ఉద్యమాల్లో అక్కడి ప్రజలను భాగస్వాముల్ని చేసింది. 'క్విట్ ఇండియా' సమయంలో కుమావ్ జిల్లాలోని ప్రతి లోయలోనూ ర్యాలీలు నిర్వహించి నిర్బంధానికి గురయింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా పర్యావరణ పరిరక్షణోద్యమం, ఆచార్య వినోభా భావే భూదానోద్యమం, జయప్రకాష్ నారాయణ్ సోషలిష్టు ఉద్యమాల్లో భాగమైంది. చిప్కో ఉద్యమకారుల్లో ఒకడైన సుందర్‌లాల్ బహుగుణ ఆమె శిష్యుడే. స్థానికులు కాకపోయినా మాతృభూమి కంటె ఎక్కువగా భారతదేశాన్ని, భారత ప్రజలను ప్రేమించి వారి కోసం పోరాడిన వీరవనితలు వీరు.

**ఆంధ్ర మహిళలు :** గాంధీజీ రాకతో స్వాతంత్ర్య పోరాటం ఊపందుకున్నది. జాతీయనేతల ప్రసంగాలు సామాన్య ప్రజల్లో చైతన్యజ్వాలల్ని రగిలించాయి. ఎంతోమంది స్త్రీలు మేము సైతం అంటూ సమరరంగంలోకి ఉరికారు. వారిలో ఆంధ్ర మహిళా యోధులూ ఉన్నారు.

**దువ్వూరి సుబ్బమ్మ :** జాతీయోద్యమంలో జైలుకు వెళ్లిన ద్వితీయ మహిళగా, ప్రథమ ఆంధ్ర మహిళగా దువ్వూరి సుబ్బమ్మ చరిత్రలో స్థానం సంపాదించుకున్నారు. ప్రస్తుత కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామం ఆమె జన్మస్థలం. చిన్నతనంలోనే భర్తను కోల్పోయి కుంగిపోతున్న ఆమెకు తిరుపతి వెంకట కవుల్లో ఒకరు, సమీప బంధువు అయిన చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి చేరదీసి విద్యాబుద్ధులు నేర్పించారు. ఆయన ప్రోత్సాహంతో తెలుగు, సంస్కృత భాషల్లో పట్టు సంపాదించి గొప్ప వక్తగా మారింది సుబ్బమ్మ. 1921 కాకినాడ కాంగ్రెస్ సమావేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ ఆమె చేసిన అనర్గళ ప్రసంగం ఆ సభకు అధ్యక్షత వహించిన టంగుటూరి ప్రకాశం పంతులుతో సహా ప్రతి ఒక్కరినీ ముగ్ధులను చేసింది. మైకులు అవసరం లేని కంచు కంఠం ఆమెది. ఆమె ఉపన్యాసాలను వినటం కోసం ప్రజలు పది మైళ్లు నడిచి వెళ్లేవారు. 1921 కాకినాడ కాంగ్రెస్ సమావేశంలో ఆమెకు 'దేశ బాంధవి' అనే బిరుదు నిచ్చి గౌరవించారు.

కాంగ్రెస్ నడిపిన ప్రతి కార్యక్రమంలోనూ సుబ్బమ్మ పాల్గొంది. దండి యాత్ర, ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘనం, వ్యక్తి సత్యాగ్రహం, క్విట్ ఇండియా కార్యకలాపాల్లో ప్రధానపాత్ర పోషించి, లాఠీ దెబ్బలు తిని జైలుకు వెళ్లింది. 16 సంవత్సరాల పాటు అఖిల భారత కాంగ్రెస్ సంఘంలో సభ్యురాలిగా కొనసాగిన ఆమె తన యావదాస్తిని ఉద్యమం కోసం ధారపోసింది.

**బెన్నూరి కృష్ణవేణమ్మ :** కందుకూరి వీరేశలింగం మిత్రుడు, సంస్కార కార్యకలాపాల్లో ఆయనకు కుడి భుజం అయిన గుమ్మడిదల

మనోహరం ఆ రోజుల్లో పోలీస్ సూపరిండెంట్ హోదా పొందిన తొలి ఆంధ్రుడు. ఆయన కుమార్తె కృష్ణవేణమ్మ. బెన్నూరి రామారావుతో వివాహమయిన తరువాత ఆమె కాకినాడ వాస్తవ్యులయ్యారు. కాకినాడ కాంగ్రెస్ మహిళా విభాగానికి కార్యదర్శిగా, కోశాధికారిగా ఆమె పని చేసింది. తాను ఖాదీ ధరించడంతో పాటు, ఇంటింటికి తిరిగి ఖాదీ విక్రయించింది. 1920ల్లో ఆరంభించిన ఖాదీ విక్రయాలను 30ల్లోనూ ఆమె కొనసాగించింది. దానితో 1932 జనవరిలో ఆమెను పోలీసులు అరెష్టు చేసి, మండుటెండలో సబ్‌జైలుకు నడిపించుకొని వెళ్లారు. ఆరు నెలల జైలు శిక్ష విధించి రాయవేలూరు జైలుకు పంపారు.

కృష్ణవేణమ్మ తొలి సంతానం దుర్గాబాయి. జాతీయోద్యమం పట్ల దుర్గాబాయి ఆకర్షితురాలు కావడానికి కృష్ణవేణమ్మ ఎంతో దోహదం చేసింది. పదకొండేళ్ల వయసులోనే తన కుమార్తె బంగారు గాజులను విరాళంగా ఇచ్చినా, విదేశీ వస్త్రాలను తగులబెట్టినా ఆమె కాదనలేదు. తరువాతి కాలంలో దుర్గాబాయి విఖ్యాత స్వాతంత్ర్య సమర యోధురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్‌గా ప్రసిద్ధి కెక్కింది.

**పాదర్తి సుందరమ్మ :** సుందరమ్మ 1902 డిసెంబరు 2న గుంటూరు జిల్లా బ్రాహ్మణకోడూరులో జన్మించింది. ఆమె కుటుంబసభ్యులంతా పేరెన్నికగన్న దేశాభిమానులు, గాంధీజీ శిష్యులు. 1920లో గాంధీజీని దర్శించి, ఆయన ఉపన్యాసాలు విని ప్రభావితమై ఖాదీ ఉద్యమ ప్రచారంలో, విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో ఆమె పాల్గొన్నది. ఆమె భర్త వెంకటసుబ్బయ్య కూడా స్వాతంత్ర్య సమరంలో పాల్గొని జైలుకు వెళ్లాడు. ఆమె తన ఇద్దరు పసి పిల్లలను పెద్దల సంరక్షణలో ఉంచి పినతండ్రి వెంకటరంగయ్య, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వెంట చీరాల పరిసరాల్లో ప్రచారానికి వెళ్లేవారు. ఉన్నవ లక్ష్మీబాయమ్మ తదితర అగ్రశ్రేణి నాయకురాళ్లతో కలసి మహిళల బహిరంగసభల్లో ఉపన్యసించేవారు.

కరాచీ కాంగ్రెస్ సదస్సుకు హాజరవటం, అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి సభ్యురాలిగా, టౌన్ కాంగ్రెస్ కమిటీకి ఉపాధ్యక్షురాలిగా సేవలందించటం, బొంబాయి వెళ్లి అఖిల భారత స్త్రీ సేవాదళ శిబిరంలో వాలంటీర్ శిక్షణ లో భాగంగా కర్రసాము, గస్తీ తిరగటం అభ్యసించి రావటం, గాంధీ అరెష్టు సందర్భంగా విజయవాడ నగరంలో హర్తాళ్ జరిపించిన కారణంగా ఏడాదిన్నరపాటు జైలు శిక్ష అనుభవించటం ఆమె జీవితంలో ముఖ్య ఘట్టాలు. సుందరమ్మ స్వదేశీ వస్తు విక్రయశాలను ఏర్పాటు చేసి ఎనిమిదేళ్లపాటు నిర్విఘ్నంగా నడిపింది. 1934లో విజయవాడ పురపాలక సంఘ సభ్యురాలిగా పోటీ లేకుండా ఎన్నికై 18 సంవత్సరాలు ఆ స్థానంలో కొనసాగింది. ఆమె కృషి ఫలితంగా ఏర్పాటైన బాలికల పాఠశాల పాదర్తి సుందరమ్మ గరల్స్ హైస్కూల్ పేరిట ఈనాటికీ నడుస్తోంది.

ఉన్నవ లక్ష్మీబాయమ్మ, కనుపర్తి వరలక్ష్మమ్మ, మాగుంట అన్నపూర్ణ, సంగెం లక్ష్మీబాయమ్మ, దిగుమర్తి జానకీబాయి, పసల అంజలక్ష్మి, ఆరుట్ల కమలాదేవి – ఇలా చెప్పుకుంటూ పోతే ఎందరో. వీరంతా సౌఖ్య జీవనం పట్ల ఆసక్తిని విడిచిపెట్టి, తమ శక్తి సామర్థ్యాలను స్వాతంత్ర్యోద్యమం కోసం ధారపోసినవారే. పోరాటంలోనూ మేము సగం అని నినదించినవారే. మరుగున పడిపోతున్న వారి త్యాగాలను స్మరించుకోవడం, వారి గాథలను భావి తరాలకు తెలియజెప్పడమే మనం వారికి అందించే అసలైన నివాళి.

**ఆధార గ్రంథాలు:**

ఆజాదీ క అమృత్ మహోత్సవ్ పేరిట ఈనాడు దినపత్రికలో వెలువడిన వ్యాసాలు
మన ధీర పేరిట ఆంధ్రజ్యోతి నవ్య పేజీలో వచ్చిన వ్యాసాలు

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# ఆంధ్రమహిళా లలామ పొణకా కనకమ్మ

డా॥ మన్యం నరసింహులు, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు. చరవాణి : 93911 11307.
డా॥ జి. గంగయ్య, కామర్స్ అధ్యాపకులు,. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు.

జాతీయతా అనే భావన భారతీయులకే కాదు ప్రపంచ ప్రజలందరికీ ఆధునిక కాలంలోనే కలిగింది. "విదేశీ పాలనలో మగ్గుతున్న దేశాలలో విదేశీవ్యతిరేకతే జాతీయత" అని భారత ప్రథమప్రధాని పండిత జవహర్‌లాల్ నెహ్రూ అన్నారు. శకలాలు శకలాలుగా ఉన్న భారతీయ సమాజాన్ని ఆంగ్లేయులు రాజకీయంగా ఏకం చేశారు. ఆంగ్ల పాలకులు వాళ్ళ పాలనా సౌలభ్యం కోసం ప్రవేశపెట్టిన రవాణాసౌకర్యాలు, తంతి తపాలా వంటి కార్యక్రమాలు భారతీయులు మేల్కొనడానికి, జాతీయతా భావం పుట్టడానికి కూడా కారణమయ్యాయి.

భారతదేశచరిత్రలో జాతీయోద్యమం ఒక విశిష్ట ఘట్టం. ఎందుకంటే భారతదేశచరిత్రలోనే మొదటిసారిగా అధికసంఖ్యలో ప్రజలు పాల్గొన్న ఉద్యమం. అన్ని ప్రాంతం వాళ్ళు, అన్ని భాషల వాళ్ళు, అన్ని కులాల వాళ్ళు, అన్ని మతాలవాళ్ళు కలిసి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా చేసిన పోరాటం కాబట్టి భారతజాతీయోద్యమానికి మన దేశచరిత్రలో విశిష్టస్థానం ఉంది.

ఇంతటి ఉజ్వలఘట్టమైన భారతీయ స్వాతంత్ర్యోద్యమంలో కులమత పేద, ధనిక స్త్రీపురుష వ్యత్యాసం లేకుండా ఎంతోమంది మహనీయులు తమ జీవితాలను త్యాగం చేశారు. ఉద్యమస్ఫూర్తితో ఎందరో వీరవనితలు జాతీయోద్యమంలో పాల్గొన్నారు. అలాంటి వీరవనితల్లో ముఖ్యులు పొణకా కనకమ్మ.

పొణకా కనకమ్మ స్వాతంత్ర్య సమరయోధురాలు, గాంధేయ పథగామిని, విద్యావేత్త, ధీరవనిత, త్యాగశీలి. వీరి జననం 10-06-1892న నెల్లూరు జిల్లాలో మినగల్లు గ్రామంలో, మాతామహుల ఇంట్లో జన్మించారు. వీరికి తన మేనమామగారైన పొణకా సుబ్బరామిరెడ్డిగారితో వివాహం జరిగింది. కనకమ్మ చిన్నవయసులో పెద్దగా చదువుకోలేదు. కానీ తర్వాతకాలంలో స్వయంకృషితో చదువుకొని అనేక పత్రికలకు వ్యాసాలు రాసేది. బహుభాషల్లో ప్రావీణ్యం సాధించింది.

కనకమ్మగారి పుట్టిల్లు మరియు అత్తగారిల్లు రెండూ అన్నదానాలు చేయడంలో నెల్లూరు జిల్లాలోనే ప్రసిద్ధిగాంచాయి. ఈ విధంగా వీరి గృహం రాజకీయ సాంస్కృతిక సమావేశాలకు కేంద్రబిందువుగా ఉండేది. ఈ క్రమంలో శ్రీ పొణకా కనకమ్మగారు స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొనటం ప్రారంభించింది.

**వందేమాతరం ఉద్యమం :** పరిపాలనా సౌలభ్యం అనే సాకుతో లార్డ్ కర్జన్ బెంగాల్‌ను 1905లో రెండుగా విభజించాడు. ఈ విభజనను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమం నడిచింది. 'వందేమాతరం మందే రాజ్యం' అనే నినాదం అంతటా ప్రతిధ్వనించింది. 1907లో బిపిన్ చంద్రపాల్ మద్రాసు వెళుతూ నెల్లూరుకు వచ్చారు. బిపిన్ చంద్రపాల్‌ను కనకమ్మ తన ఇంటికి ఆహ్వానించి రాజకీయ ఉపన్యాసాలను ఏర్పాటు చేసింది. తన 13 ఎకరాల మామిడితోటను అమ్మడంతో పాటు తన స్వంత నగలను కూడా అమ్మి స్వాతంత్ర్యపోరాటానికి 'పినాకినీ సత్యాగ్రహ ఆశ్రమము' ను ఏర్పాటు చేసింది.

**సుజన రంజనీ సమాజము :** జన్మతః దేశభక్తి ప్రపూరితయైన శ్రీమతి పొణకా కనకమ్మ 1910లో విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించింది. ఖద్దరు వస్త్రాలనే ధరించేది. 1913లో పొట్లపూడిలో 'సుజన రంజనీ సమాజము'ను స్థాపించింది.

**హోమ్‌రూలు ఉద్యమము :** బాలగంగాధర్ తిలక్ మాండలే జైలు నుంచి తిరిగి వచ్చిన తర్వాత అనిబిసెంట్‌తో కలసి హోమ్‌రూల్ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమం నెల్లూరులో ఉధృతంగా కొనసాగింది. స్వాతంత్ర్యం కొరకు ఏ ఉద్యమం జరిగినా కనకమ్మ దానిని కౌగిలించుకొనేది. నెల్లూరుజిల్లాలో కూడా కనకమ్మ హోమ్‌రూలు ఉద్యమానికి తన సహాయసహకారాలు అందజేసింది.

**మహిళా కాంగ్రెసు :** కనకమ్మగారు గాంధీజీ బోధనకు ప్రభావితురాలైంది. ఈ బోధనలను ప్రచారం చేయడానికి పొణకా కనకమ్మ నెల్లూరు జిల్లాలో 'కాంగ్రెసు మహిళావిభాగాన్ని' ప్రారంభించింది. అంతేకాకుండా తర్వాతకాలంలో రాష్ట్రస్థాయిలో, దేశస్థాయిలో వివిధ పదవులను స్వీకరించి దేశసేవచేశారు.

**గాంధీజీ ప్రభావం :**

" సత్యమును ధర్మమును నహింసయును ప్రేమ
త్యాగమును పంచప్రాణమ్ములై స్వరూప
మవతరించిన బాపు మహాత్మతేజ
మెపుడు ముందయి మము నడిపించుగాక"

అంటూ గాంధీగారిపై తన అభిమానాన్ని చాటుకుంది. గాంధీజీ సత్యం, ధర్మం, అహింస, ప్రేమ, త్యాగము అనే విశేష గుణమూర్తి అని, వారి తేజస్సు తనను ముందుకు నడిపిస్తుందని కనకమ్మ భావించేది. గాంధీగారి బోధనలను ప్రచారం చేసేది. నూలు వడికే రాట్నములను పంచిపెట్టేది. ఖద్దరును ధరించేది. తానే స్వయంగా తన ఇంట్లో నూలు వడికేది. 1919లో గాంధీగారు మద్రాసు వచ్చారు. కనకమ్మ తన తల్లియైన కామమ్మను, మరికొందరిని తీసుకుని మద్రాసు వెళ్ళింది. అక్కడ కనకమ్మ తల్లి కామమ్మ గాంధీ సమక్షంలో నూలు వడికింది. ఆ నూలు సన్నముగా రావడం చూసి గాంధీగారు తన్మయులయ్యారు. కామమ్మను మెచ్చుకొని తనతో పాటు సబర్మతీ ఆశ్రమానికి రమ్మని ఎంతో బ్రతిమాలాడు. అయితే తనకు హిందీభాష రాదని ఆమె సున్నితంగా తిరస్కరించింది. తర్వాత కనకమ్మ, కామమ్మలు తాము వడికిన నూలుతో తయారుచేసిన వస్త్రాలను గాంధీగారికి, కస్తూర్బాగాంధీ గారికి సబర్మతీ ఆశ్రమానికి పంపేవారు. గాంధీ దంపతులు కనకమ్మ పంపిన వస్త్రాలు చూసి ఎంతో ఆనందపడేవారు.

7-4-1921వ తేదీ గాంధీజీ రైలులో నెల్లూరుకు వచ్చారు. కనకమ్మ భర్త సుబ్బరామిరెడ్డి గాంధీని ఎద్దులబండిలో తమ గ్రామమైన పల్లిపాడుకు తీసుకువచ్చారు. గాంధీజీ పల్లిపాడులో అడుగుపెట్టగానే ప్రజలు మహోత్సాహముతో తండోపతండాలుగా వచ్చారు. ప్రజలు అత్యంత భక్తితో ఆదరముతో గాంధీజీకి కర్పూరనీరాజనాలు అర్పించారు.

గాంధీ స్వరాజ్య నిధికి కనకమ్మ తన ఒంటిమీద ఉన్న సుమారు 40 సవర్ల బంగారమును తీసి గాంధీజీకి అందచేసింది. అప్పుడు గాంధీజీ కనకమ్మతో 'ఇక బంగారు నగలు పెట్టుకోవు కదా' అని ప్రశ్నించారు. గాంధీజీకి కనకమ్మ బంగారు నగలు పెట్టుకోనని వాగ్దానము చేసింది. గాంధీజీ కనకమ్మ కోరిక మీద 'పినాకినీ సత్యాగ్రహ ఆశ్రమానికి' శంఖుస్థాపన చేశాడు. అంతేకాక ఆశ్రమ నిర్మాణానికి రూ. 5000/- తర్వాత పంపారు.

1933లో కూడా హరిజన సహాయనిధికి గాంధీజీతో పాటు బిట్రగుంట, కావలి, బుచ్చిరెడ్డిపాళెం, గూడూరు, వెంకటగిరి, నెల్లూరు తదితర ప్రాంతాలు తిరిగింది కనకమ్మ.

**జైలు జీవితం :** 1930లో గాంధీజీ ఉప్పుసత్యాగ్రహాన్ని ప్రారంభించారు. గాంధీజీ ఉప్పు సత్యాగ్రహయాత్ర నాయకులకు, ప్రజలకు మధ్య దూరం తగ్గించింది. ఈ కాలంలో కనకమ్మ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా అనేక నిరసనలను చేపట్టింది. అప్పుడు పోలీసులు పొణకా కనకమ్మను అరెస్టు చేశారు. ఆమె ఆరునెలలు కారాగార శిక్ష అనుభవించింది. ఈ జైలు జీవితం పూర్తయిన తర్వాత 1932లో కనకమ్మ నాయకత్వంలో ఎంతోమంది ఆంధ్రమహిళలు విదేశీ వస్త్రదుకాణాల వద్ద, సారా దుకాణాల వద్ద పికెటింగ్ చేశారు. ఈ క్రమంలో మళ్ళీ కనకమ్మగారు ఒకటిన్నర సంవత్సరాలు జైలుశిక్షను అనుభవించింది. ఈ సందర్భంగా కనకమ్మ రాయవేలూరు జైలులో ఉండేది. అప్పుడు కనకమ్మ తీవ్ర అనారోగ్యం పాలైంది. దైవానుగ్రహంతో ప్రాణాపాయస్థితి నుంచి కనకమ్మ బయటపడింది.

**జాతీయోద్యమ సాహిత్యం :** కనకమ్మ చిన్నవయసులో పెద్దగా చదువుకోలేదు. అయితే వివాహానంతరం స్వయంకృషితో చదువుకొని పద్యరచన, కవిత్వములందు పట్టు సంపాదించింది. జస్టిస్‌పార్టీ పత్రిక, శశిరేఖ, హిందూసుందరి, అనసూయ మొదలైన పత్రికలకు స్వతంత్రం యొక్క ఆవశ్యకతను వివరిస్తూ వ్యాసాలు రాసేది. వీరసావర్కరుగారి 'భారత స్వాతంత్ర్యపోరాటము' అను పుస్తకాన్ని

తెలుగులోకి అనువదింపచేసి ఉచితంగా పంచింది కనకమ్మ. పొట్లపూడిలో తాను స్థాపించిన సుజనరంజనీ సమాజమునకు అనుబంధంగా 'వివేకానంద గ్రంథాలయము'ను ప్రారంభించింది.

1932లో రాయవేలూరు జైలులో ఉన్నప్పుడు కనకమ్మ హిందీభాషను అభ్యసించి, తెలుగులో కొన్ని అనువాదాలు కూడా చేసింది.

ఈ విధంగా ఆకాలంలో స్త్రీలపై ఎన్నో కట్టుబాట్లు ఉన్నప్పటికీ దేశంకోసం శ్రీమతి పొణకా కనకమ్మ ఎంతో సేవచేసింది. 1935లో తన ఏకైక కుమార్తె వెంకటసుబ్బమ్మ మరణం కనకమ్మను కృంగదీసింది. తదనంతరం జీవితాన్ని కనకమ్మ తిరువణ్ణామలైలోని భగవాన్ రమణమహర్షి ఆశ్రమంలో చాలాకాలం ఆధ్యాత్మిక జీవితం గడిపింది.

1962లో మద్రాసులో జరిగిన ఆంధ్రమహిళాసభ రజతోత్సవాల సందర్భంగా శ్రీమతి పొణకా కనకమ్మను ఘనసన్మానం చేసింది దుర్గాబాయి దేశ్‌ముఖ్. ఈ సందర్భంగా "ఆంధ్ర మహిళాలలామ" అనే బిరుదును కనకమ్మకు ప్రదానం చేశారు.

**విద్యావేత్త :** 1923లో కనకమ్మ నెల్లూరులో స్త్రీ విద్యావ్యాప్తి లక్ష్యంగా 'కస్తూరిదేవి విద్యాలయము' స్థాపించింది. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులుగారిని ఆహ్వానించి పాఠశాలకు శంఖుస్థాపన చేయించారు. ఈ విద్యాలయాన్ని 1929లో గాంధీగారు ఎంతో ప్రశంసించారు. విద్యాలయానికి కులమత పట్టింపులేని హాస్టలును నడిపేవారు. విద్యార్థినులకు విద్యాలయంలో హస్తకళలలో కూడా శిక్షణ ఇప్పించేవారు. ఈ విద్యాలయంలో నేత, అద్దకము, ఎంబ్రాయిడరీ మున్నగు వృత్తివిద్యలలో శిక్షణ ఇచ్చేవారు. సాధారణ విద్యతోపాటుగా భుక్తి, ముక్తి ఇవ్వగల విద్యలు విద్యార్థినులకు అవసరం కదా!

**సంఘసంస్కర్త :** కనకమ్మ సుజనీరంజనీ సమాజము ద్వారా విజ్ఞానము వెదజల్లడమే కాకుండా చురుకుగా సంఘసేవ కూడా చేసింది. పొట్లపూడి గ్రామంలోనే కాక చుట్టుప్రక్కల గ్రామాలలో కలరా సోకితే కనకమ్మ అక్కడికి వెళ్ళి రోగులకు కలరా మందులిచ్చి పరిచర్యలు చేసేది.

1927లో రాయలసీమలో కరువు వచ్చింది. ఆ క్లిష్ట సమయంలో శ్రీమతి కనకమ్మ వేలాదిమంది అన్నార్తులను ఆదుకుంది. క్షామపీడితుల సహాయార్థం ఆమె వస్త్రాలు, విరాళాలు సేకరించింది. అదే సంవత్సరంలో నెల్లూరుకు తుఫాను వచ్చింది. ఎంతోమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఆ సమయంలో కనకమ్మగారు తుఫాను బాధితులకు ఎంతో సహాయంచేశారు. ఎంతోమందికి వితంతు పునర్వివాహాలు చేసింది.

చివరకు తన 71వ సంవత్సరంలో నెల్లూరులో తన స్వగృహంలో 15-9-1963లో ప్రశాంతంగా కన్నుమూసిన శ్రీమతి పొణకా కనకమ్మ ధన్యజీవి.

**ఆధార గ్రంథాలు :**

1. స్వాతంత్ర్య సమరంలో ఆంధ్రమహిళలు : దుర్గాబాయి దేశముఖ్
2. భారత జాతీయోద్యమ సాహిత్యం : ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి
3. సాంఘిక సేవారంగంలో స్త్రీలు : డా॥ ముక్తేవి భారతి

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# భారత స్వాతంత్ర్య సమరంలో ముస్లిం మహిళ

డా॥ ఎస్. గులాబ్ జాన్, తెలుగు అధ్యాపకులు, ఎస్.డబ్ల్యూ.ఆర్. ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాల, కలికిరి, అన్నమయ్య జిల్లా. చరవాణి : 94935 64684

భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్య సమరం ఒక మహోజ్వల ఘట్టం. భారతీయుల పోరాటపటిమకు, త్యాగనిరతికి, నిరుపమాన దేశభక్తికి ఈ ఉద్యమం ఒక నిలువుటద్దం. ఈ పోరాటాన్ని సుసంపన్నం చేసేందుకు జాతి, మత, కుల, ప్రాంతీయతలను అన్నింటిని విడిచి భారతీయులంతా కలిసి ఐకమత్యంగా కలిసి పోరాడటం గొప్ప విషయం. ఈ పోరాటానికి భారతదేశపు అతిపెద్ద అల్పసంఖ్యాక వర్గమైన ముస్లింలు తమదైన భాగస్వామ్యాన్ని అందించి, గొప్ప త్యాగాలతో, అసమాన బలిదానాలతో భారతీయ ముస్లింలు మన మాతృభూమి విముక్తి పోరాటంలో పునీతులయ్యారు. అలాంటి త్యాగమూర్తుల చరిత్ర అనేక కారణాల వల్ల మరుగున పడిపోయింది. బ్రిటీష్ ప్రభుత్వం తమ పాలననూ సుస్థిరం చేసుకోవడం కోసం కుటిలత్వంతో భారతీయులను మతం పేరుతో హిందువులను – ముస్లింలను విభజించడంలో 'విభజించు – పాలించు' అన్న విధానంను అమలుపరిచింది. అందులో భాగంగా భారత విభజనకు దారితీసిన పరిస్థితులు, ఆ సమయంలో జరిగిన ఘోరాలు, పొరుగుదేశంగా ఏర్పడిన పాకిస్తాన్‌తో జరిగిన పోరు, వివాదాలు అన్నీ స్వాతంత్ర్య ఉద్యమ కాలం నాటి హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెట్టాయి. భారతదేశ విభజనానంతరం అపరాధన భావనకు గురికాబడ్డ ముస్లిం సమాజం, వారు చేసిన త్యాగాలు మరుగునపడ్డాయి. వివిధ కారణాలు, శక్తుల స్వార్థ రాజకీయ దురాగతాల మూలంగా మన భూమిపై మత ఘర్షణలు, అసత్యాల కారణంగా ప్రజల మధ్య మానసిక విభజనకు ప్రధాన కారణమయ్యాయి. బ్రిటీష్ బానిసత్వం నుండి మాతృభూమిని విముక్తి చేసేందుకు సాగిన సుదీర్ఘపోరాటచరిత్రలో ముస్లింల త్యాగాలు మరుగున పడటమే కాకుండా చరిత్రపుటల్లో కూడా కనిపించలేదు. ఒకవేళ కనిపించినా ఒకరిద్దరు మాత్రమే కన్పించారు. అది కూడా అతి సాధారణమైన వర్ణనలతో చూపించారు కాని చరిత్ర గ్రంథాలలో కాని పాఠ్యపుస్తకాలలో కాని చోటు చేసుకోకపోగా కనీసం ముస్లింల త్యాగచరితలు కథావస్తువుగా అయినా కాలేకపోయాయి. భారత స్వాతంత్ర్యసమరంలో ముస్లిం పురుషులకు ధీటుగా ముస్లిం మహిళలు కూడా తమదైన వీరోచిత పాత్ర నిర్వహించారు. మతపరమైన ఆచార సంప్రదాయాలపట్ల ముస్లిం మహిళలలో ఉన్న కట్టుబాట్లు, వారు అనుసరించే పర్దా పద్ధతి వారిని గడప దాటనివ్వని కారణాల వల్ల ముస్లిం మహిళల త్యాగాలు సామాన్య ప్రజానీకానికి చేరడం చాలా కష్టతరమైనదని చెప్పవచ్చు. విముక్తి పోరాటంలో శత్రువును సవాల్ చేసిన ఎందరో వీరవనితల చరిత్రలున్నాయి. అందులో కొందరి వీరవనితల గూర్చి నేను 'భారత స్వాతంత్ర్య సమరంలో ముస్లిం మహిళ' అన్న అంశంతో పత్రసమర్పణ చేయదలిచాను.

ప్రథమ స్వాతంత్ర్య సమరంలో ప్రధానపాత్ర వహించిన ముస్లిం మహిళలు తమ త్యాగాలతో, వీరత్వంతో, ఆత్మార్పణలతో చరిత్రపుటలను ఎరుపెక్కించారు. అటువంటి వారిలో అవధ్ రాణి 'బేగం హజరత్ మహల్'. బ్రిటీష్ పాలకులు కుట్రతో ఆమె భర్త అయిన నవాబ్ వాజిద్ అలీషాను అరెస్టు చేసి అవధ్‌ను స్వాధీనం చేసుకోగా, మాతృభూమి పరాయి పాలవడంతో ఆగ్రహించిన ఆమె ప్రజల సహాయంతో బ్రిటీష్ సైన్యంను ఎదిరించి తిరిగి తన రాజ్యాన్ని సొంతం చేసుకొన్నారు. పదమూడు సంవత్సరాల తన బిడ్డ అయిన బిర్జిస్ ఖదీర్‌ను నవాబుగా ప్రకటించి, అతని సంరక్షురాలిగా బాధ్యతలు చేపట్టి, స్వదేశీ పాలకులను, ప్రజలను, ప్రముఖులను కలిపి పరిపాలనలో శక్తి సామర్థ్యాలను బట్టి హిందూ, ముస్లింలకు స్థాయిలను కల్పించారు. పద్నాలుగు నెలలపాటు వలసపాలకుల ఎత్తులను చిత్తుచేస్తూ సమర్థవంతంగా పాలన సాగించారు. బేగంపై కోపోద్రిక్తులైన బ్రిటీష్ పాలకులు తమ సైన్యాన్ని అవధ్‌ను ముట్టడించినా బేగం మాత్రం అధైర్య పడకుండా వీరోచితంగా పోరాడారు. ఈస్ట్ ఇండియా సైనికులు లక్నోను చుట్టుముట్టిన వారిని ఎదుర్కోవడం కష్టమైన సమయంలో, తిరిగి దాడి చేయడానికి బేగం, ఆమె సహచరులు, అనుచరులతో నేపాల్ పర్వతాల్లోకి వెళ్ళి, కాన్పూర్ ప్రభువైన నానా సాహెబ్, మొగల్ రాకుమారుడు ఫిరోజ్ షా లాంటి యోధులను కలిసి ఆంగ్లేయులపై దాడి చేసేందుకు బలాన్ని, బలగాన్ని పెంచుకొంటూ, పరిస్థితులను ఎదుర్కొంటూ చివరకు ఆమె పద్దెనిమిది వందల డెబ్బై తొమ్మిదవ సంవత్సరంలో నేపాల్ అడవుల్లో తనువు చాలించారు.

**బేగం హజరత్ మహల్** చూపిన సాహసోపేతమైన మార్గాన్నే నడచిన ముస్లిం మహిళలు ఎందరో ఉన్నారు. వారిలో ఒకరు **అజీజున్**. తన మాతృభూమిపైన అపార ప్రేమాభిమానాలు గల వ్యక్తి. గురుభక్తి పరాయణురాలు. కాన్పూర్ ప్రభువైన నానా సాహెబ్ ఈస్ట్ ఇండియా కంపెనీ వారిపై తిరుగుబాటు చేయగా ఆయన పక్షాన నిలబడి యుద్ధంలో శత్రు సైన్యాలను ఎదుర్కొన్నారు. యుద్ధభూమిలో చివరి వరకు పోరాడుతూ గాయపడి శత్రువుచేత చిక్కినా క్షమాభిక్ష ప్రకటించినా, తనకు ప్రాణం కంటే మాతృభూమి విముక్తికై సాగుతున్న పోరాటం ముఖ్యమని చెప్పగా ఆ సైనికదళాల తుపాకీ గుండ్లకు ఎదురొడ్డి వీరమరణం పొందారు.

అరవై సంవత్సరాల అనామిక ఎల్లప్పుడు పచ్చరంగు దుస్తులు ధరించే మహిళ కనుక ఆమె పచ్చరంగు దుస్తుల మహిళగా పేరుగాంచింది. ఆమె సాగించిన గెరిల్లా పోరాటంతో బ్రిటీష్ సైనిక దళంలో భయాన్ని కలిగింపజేశారు. ఈస్ట్ ఇండియా కంపెనీ స్థావరాలలో కలకలం సృష్టించారు. ఆ పోరులో ఆమె గాయపడి బ్రిటీష్‌వారి చేతికి చిక్కగా వారు భారీ బందోబస్తుతో అంబాలాకు పంపుతూ "ఈ వృద్ధురాలు బహు ప్రమాదకారి... జాగ్రత్త" అంటూ అక్కడి అధికారులను హెచ్చరిస్తూ లేఖ రాసి ముందు జాగ్రత్తల గురించి అంబాలలోని అధికారులను హెచ్చరించారంటే ఆ పచ్చదుస్తుల స్త్రీ ఎంతటి ఘటికురాలో ఊహించవచ్చు. ఈ విధంగా మాతృదేశ విముక్తి కోసం ఉరిని కూడా లెక్క చేయని **హబీబా బేగం,** ఝాన్సీరాణి వెన్నంటే ఉండి పోరాడి ప్రాణాలర్పించిన మహిళ **ముందర్,** బ్రిటీష్ సైనికులను ఎదిరించిన ధైర్యశాలి బేగం రహిమా, తిరుగుబాటు యోధులక్షేమం కోరుతూ సజీవదహనమైన **అస్గరి బేగం,** కత్తిపట్టి యుద్ధంలో శత్రువును సవాల్ చేసిన సాహసవంతురాలు **బేగం ఉమ్ ద్దా** ఇలా ఎందరో కలరు. సాంఘిక జనసముదాయంతో పాటు వందలాది ముస్లిం మహిళలు కాల్చివేయబడ్డారు, సజీవ దహనమయ్యారు, ఉరితీయబడ్డారు, అవమానాలకు, అత్యాచారాలకు గురయ్యారు. ఇలా వీరి యొక్క అసమాన పోరాటాలను వారసత్వంగా స్వీకరించిన ముస్లిం మహిళలు ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు.

స్వదేశీ ఉద్యమంతో ప్రారంభమై ఖిలాపత్ ఉద్యమం ద్వారా పెద్దఎత్తున ముస్లీం మహిళలు జాతీయోద్యమంలో అడుగుపెట్టారు. సహాయ నిరాకరణోద్యమం, విదేశీవస్తు బహిష్కరణ, మద్యపాన నిషేధం లాంటి అనేక కార్యక్రమాలతో పాటుగా చివరకు బ్రిటీష్ పాలకులను మన భరతభూమి నుండి తరిమి వేసేవరకు సాగిన ప్రతి పోరాటంలో తమదైన పాత్రను నిర్వహించి, తమ త్యాగాలతో మాతృభూమి రుణం తీర్చుకున్నారు. అలాంటివారిలో **బీబీ అమ్మ** ఒకరు. ఈమె అసలు పేరు **ఆబాదీ బానో బేగం,** ఈమె జాతీయోద్యమంలో ఎనలేని ఖ్యాతి గడించడమే కాకుండా, అద్భుతమైన ప్రసంగాలతో, ఆదర్శవంతమైన నాయకత్వంలో ఖిలాపత్, సహాయ నిరాకరణోద్యమం కోసం దేశమంతా తిరిగి నిధులను సేకరించి భారత పర్యటన చేస్తున్న గాంధీజీకి ఉపయోగపడ్డాయి. జాతీయోద్యమకారులంతా ఆమెను 'అమ్మ' అని పిలుస్తూ గౌరవిస్తున్నందున తన బిడ్డల ఎదుట తనకు పర్దా అక్కరలేదని చెప్పి, పర్దా లేకుండా బహిరంగ సభలలో ప్రసంగించిన సాహసి ఆబాది బానో బేగం. చివరి రక్తపు బొట్టు వరకు పోరుబాట వీడని ఆమె జాతీయోద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.

జాతీయోద్యమములో ఫైర్ బ్రాండ్‌గా పేరుపొందిన మౌలానా హస్రత్ మొహాని భార్య **నిషాతున్నీసా బేగం** ఆబాది బానో బేగం మార్గంలో నడిచిన మరో సాహసవంతురాలు. ఆమె భర్త అనేకసార్లు జైలుకు వెళ్ళినా ధైర్యం కోల్పోకుండా బ్రిటీష్ ప్రభుత్వ దౌర్జన్యాలను ఎదుర్కొంటూ కూడా ఉద్యమ మార్గాన్ని వదలకుండా చివరకు జైలు జీవితాన్ని అనుభవించారు. తన భర్త మౌలాన హస్రత్ మొహాని గాంధీజీకి సంపూర్ణ స్వరాజ్య తీర్మానాన్ని ప్రతిపాదించగా గాంధీజీ తిరస్కరించినందుకు ఆయననే విమర్శించిన ధైర్యశాలి చివరకు గాంధీజీ చేతనే శభాష్ అనిపించుకున్న ప్రతిభాశాలి నిషాతున్నీసా బేగం.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను స్ఫూర్తిగా తీసుకొని పయనించిన **జులేఖా బేగం,** గాంధీజీ వ్యతిరేకించిన మద్యపాన నిషేధ ఉద్యమ నాయకురాలు **అమీనా తయ్యాబ్జీ,** స్వాతంత్ర్య స్వేచ్ఛకోసం రచనల ద్వారా ఉద్యమింప చేసిన కవయిత్రి జాహిదా ఖాతూన్. ఇలా జాతీయోద్యమంలో అనేకమంది ముస్లిం మహిళలు తమవంతు ప్రముఖ పాత్ర వహించారు.

జాతి ప్రయోజనం కోసం జాతీయోద్యమంలో తమ యావధాస్తిని ధారపోసిన ముస్లిం మహిళలు ఎందరో ఉన్నారు. వారిలో కొందరు **ఫాతిమాబేగం, జుబేదా బేగం,** నౌఖాళి ప్రాంతంలో రేగిన మతకలహాలను నివారించడానికి గాంధీజీ పిలుపునందుకొని

ఆ ప్రాంతానికి వెళ్ళి ఇరవై రెండు రోజులు నిరాహారదీక్ష చేసి శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పిన ఆమె గాంధీజీచే ప్రశంసలందుకొని మాతృభూమి కోసం చివరి వరకు పోరాడిన ప్రతిభావంతురాలు. గాంధీజికి ఉర్దూ నేర్పి గురువయ్యారు రెహనా తయ్యాబ్జీ.

యావత్ భారతదేశంలోనే కాకుండా ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలో కూడా ముస్లిం మహిళలు మాతృభూమి విముక్తి కోసం పోరాటం చేశారు. రష్యాను సందర్శించిన తొలి భారతీయ ముస్లిం మహిళగా గుర్తింపు పొంది, స్వాతంత్ర్య ఉద్యమకారులచే హజరా ఆపాగా పిలిపించుకున్న వ్యక్తి హజరా అహమ్మద్. గాంధీజీ అనుచరుడుగా ప్రఖ్యాతిగాంచిన ఖద్దర్ ఇస్మాయిల్ భార్య **హాజరా బీబీ** గాంధీ అడుగుజాడలో నడుస్తున్నందుకు ఆమె కుటుంబాన్ని వెలివేసినా ధైర్యం కోల్పోని ధీమంతురాలు. భారతీయ జాతీయ సైన్యంలో నేతాజీ వెంటన నడిచి **అబిద్ హసన్ సఫ్రాని** నిజాం సంస్థానంలో ఖద్దరు ప్రచారం చేసిన **బద్రుల్ హసన్ కన్నా ఫక్రుల్ హాజియా** విదేశీ వస్త్రాలను తగులబెట్టి అందరికీ ఆదర్శవంతురాలయ్యారు.

ఇస్లాం మత సంప్రదాయం ప్రకారం పర్దా పద్ధతిని పాటిస్తూ, సాధారణ జీవనం సాగించే మహిళలోనూ తమ మాతృభూమి విముక్తి కోసం పర్దా పద్ధతిని సైతం పక్కన పెట్టించి దేశసేవలో లీనమయ్యే విధంగా ప్రోత్సహించిన భర్తలు కూడా ఉండటం హర్షనీయం. అలా అనంతపురం జిల్లా చియ్యేడు గ్రామానికి చెందిన **రబియాబీ** భర్త మొహిద్దీన్ సాహెబ్ జాతీయ ఉద్యమకారుడు. ఆమెను పర్దా పద్ధతి నుండి విముక్తి గావించి సత్యాగ్రహ ఉద్యమంలో బహిరంగా పాల్గొనేలా ప్రోత్సహించడం జరిగింది. ఆమె ఎన్నో సాహసోపేతమైన కార్యక్రమాలు కూడా చేపట్టారు.

నైజాం వ్యతిరేక పోరాటం నుండి తెలంగాణా రైతాంగ పోరాటం వరకు ముస్లిం కుటుంబాలు ఉద్యమకారులను తమ కడుపులో పెట్టుకుని కాపాడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ విధంగా చెప్పుకొంటూపోతే మణిపూసల్లాంటి, సాహసోపేతమైన మహిళలు చాలామంది గురించి చెప్పవచ్చు. అప్పటివారి త్యాగాల గురించి అందరికీ తెలియాలంటే జాతీయస్థాయిలో చరిత్ర గ్రంథాలలో స్వాతంత్ర్య సమరయోధులందరికీ తగిన స్థానం కల్పించాలి.

ఇలాంటి సెమినార్లతో అయినా వారియొక్క త్యాగ చరిత్రలను ప్రజలందరికీ తెలిసే అవకాశం ఉంటుంది.

**ఆధార గ్రంథాలు :**

1. భారత స్వాతంత్ర్యోద్యమం – ముస్లిం మహిళలు – సయ్యద్ నశీర్ అహమ్మద్.

# డా॥ వాసా ప్రభావతిగారి "స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు మహిళలు" – కార్యదక్షత

డా॥ జి. శైలమ్మ, అసిస్టెంట్ ప్రొఫసర్, డిపార్ట్మెంట్ ఆఫ్ ప్రసారాంగ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం. ఫోను: 9618361905

**స్వాతంత్ర్యోద్యమం:** దేశం పరపీడనలో మ్రగ్గిపోతూ భారతీయులు అనేక కష్టాలు అనుభవిస్తున్నారు. ఈబానిససంకెళ్లు తెంపుకొని మనల్ని మనమే పరిపాలించుకొనే క్రమంలో భారతీయులందరు స్వాతంత్ర సంగ్రామంలో బ్రిటీషువారితో వీరోచితంగా పోరాడి విజయాన్ని సాధించారు. తెలుగు మహిళల పట్టుదల, తెగువను గుర్తించి వారికి సంబంధించిన విషయాలను నేటి సమాజంలో అందరికి తెలియజేయాలన్న సంకల్పంతో డా॥ వాసా ప్రభావతి గారు రాసిన "స్వతంత్ర్యోదమంలో తెలుగు మహిళలు" అన్న వ్యాసం సంపుటి ఆధారంగా మహిళామణుల దేశభక్తిని వివరించే ప్రయత్నం చేశాను.

ఈ క్రమంలో స్త్రీలు చూపిన తెగువకు మెచ్చి స్త్రీలు గురించి చులకన భావంతో చూడకూడదని గాంధీజి ఆశించారు. "నా దృష్టిలో స్త్రీలు దుర్భలులుగారు. పురుషులకన్నా స్త్రీలే యుదార చరిత్రలు నేటికిని వారే తాగ్యమూర్తులు విశ్వాసమూ, సౌజన్యము, రెండవ కంటి వారెరుగని బాధననుభవించుట, జ్ఞానము వారియందు మూర్తీభవించెను" గాంధీ గాంధీజీ గారు భారతదేశానికి స్త్రీత్వం ఆపాదించి ఈ దేశాన్ని తల్లిగా భావించి పూజించే గొప్ప మనస్సున్న స్త్రీ పక్షపాతి గాంధీ జీ.

"భరత భూమి నా మాతృదేవత. నా సర్వస్వము ఆమె పెట్టిన భిక్షయే. ప్రపంచమున కామె ఒక ఉత్కృష్ట సందేశమును గొంపోవనున్నది. యూరపు దేశమును ఆమె గుడ్డిగా అనుకరింపజాలదు" గాంధీజీ. స్త్రీల యొక్క విజ్ఞతను గాంధీజీ కొనియాడారు. **(పుట : 1)** సరోజినీ నాయుడు స్త్రీలనుద్దేశించి భయాన్ని వదలమని, స్త్రీల పాత్రినిధ్యం అవసరమని, స్త్రీలతో ఘర్షణలు మాని కాలాన్ని వృధా చేయవద్దని స్వాతంత్రం సాధించుకొనుటలో వెనుకపడిపోకూడదని భారతీయులను జాగరూకులనుగా చేసే ప్రయత్నం చేశారు.

"మీ ప్రాచీన సంప్రదాయాలను పెంపొందించుకుంటూ అభివృద్ధి మార్గాన నడవాలంటే మీ యిరుగు పొరుగు ప్రాంతాలలోని స్త్రీలందరితో స్నేహ వైజ్ఞానిక సంబంధాలు వృద్ధి చేసుకోవాలి. సరోజిని నాయుడు భారతీయులందరికి తన సందేశాన్ని వినిపించారు. కీ.శే. కాశీదయమం సూర్యనారాయణగారు శ్రీమతి లక్ష్మీదేవమ్మ దంపతులు. చనిపోయేంత వరకు స్వదేశీ వస్త్రధారణ నియమాన్ని పాటించారు. వ్యక్తి సత్యాగ్రహంలో 10.03.1941 నుండి 11.05.1941 రెండు నెలలు కఠినమైన కారాగార శిక్షననుభవించారు. ఈ దంపతుల సంతానమే డా॥ వాసా ప్రభావతి గారు. తల్లిదండ్రుల అడుగు జాడల్లో నడుస్తూ నేడు ఆదర్శ మహిళగా అవతరించారు.

ఈ దంపతులు 20 రూ॥ జరిమానా చెల్లించారు. జీవితాంతం ప్రజాసేవ, దేశసేవ చేసేవారు. సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. వాడపల్లి వెంకటేశ్వరస్వామి సన్నిధిలో జెండా ఎగురవేయడానికి ఎంతగానో వెనుక నుండి కృషి చేయుట ఈ దంపతుల కర్తవ్యం. వీరి లక్షణాలు పుణికి పుచ్చుకున్న ప్రభావతి గారు అదేబాటలో పయనించడం ముదావహం.

**స్వతంత్ర సంగ్రామం – బ్రిటీషువారి విధానాలు :**

1724లో హైదరాబాదు నవాబు ఉల్ముల్క్ అసఫ్జా ఫ్రెంచి సేనలు ఈ దేశంలో వుండటానికి ఫ్రెంచ్ సేనాని. బుస్సీకి అనుమతిచ్చాడు. 1800 సంవత్సరానికి నవాబు ఈస్టిండియా కంపెనీకి రాయలసీమ ప్రాంతాన్ని అధీనం చేసాడు. అప్పటికే ఈస్టిండియా కంపెనీ కోస్తా ప్రాంతాన్ని, గుంటూరు సీమను ఆక్రమించుకొంది. 1800 నాటికి తెలుగు ప్రాంతం రెండుగా చీలిపోయింది.

ఈ క్రమంలో ఆంధ్రప్రాంతంలో దారిద్ర్యం చోటు సంపాదించుకుంది. బ్రిటీషువారు తమ మతాన్ని స్వీకరించేలా చేయడం, విద్యా సంస్థలు ఏర్పాటు చేయడంతో దేశంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ఆంధ్ర ప్రాంతంలో అలజడి రేకెత్తింది. స్వాతంత్రం సాధించుకోవాలన్న కాంక్ష పెరిగిపోయింది. ఈ క్రమంలో గౌతమీ పత్రిక, కృష్ణాపత్రిక మొదలైనవి రాజకీయ విషయాలపై చర్చలు ప్రారంభించి జనులను ఉత్తేజితుల్ని చేయడానికి ప్రారంభించాయి.

ఐకమత్యమే మహాబలమన్నట్లు స్త్రీలు గాంధీజీకి ముందు నడిచి స్వాతంత్రం సాధించుకోవడం ముఖ్యమని భావించారు. స్త్రీలు కూడా స్వాతంత్రం సాధించే పనిలో పాల్గొనాలని సూచించారు.

1. ఆంగ్ల పాలకుల దుండగాలు, దౌర్జన్యాలు, అన్యాయాలు, అక్రమాలు.
2. కరవు ఆర్థిక యిబ్బందులు
3. అప్పటికే రాజారామమోహన్‌రాయ్ వంటి వారు సతీసహగమనం వంటివి దురాచార భావనలని స్త్రీలను చైతన్యం వైపు నడిపే ప్రయత్నం చేశారు.
4. అప్పటికే స్త్రీ విద్యను ప్రోత్సహిస్తూ మహాత్మాపూలె, సావిత్రిబాయిపూలే నినాదాలు, ప్రోత్సాహం స్త్రీ శక్తిని మరింత బలపరిచింది.
5. స్వాతంత్రం నడిపే నాయకుడు గాంధీగారు. స్త్రీలు ముందుండాలని కాంక్షించే స్వభావం వుండటంతో అనేకమంది స్త్రీలు స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు.

**స్త్రీల హక్కుల కోసం పోరాడిన స్త్రీలు:**

**శ్రీమతి సరోజినీ నాయుడు :** 'హక్కు' అంటే కలిగుండటం. స్త్రీలు కూడా తమని ఎవరు పరిపాలించాల్లో ఎన్నుకొనే హక్కు వుండాలని సరోజినీ నాయుడుగారు సంకల్పించారు. 'ఓటింగు' హక్కు. స్త్రీలు కూడా శాసనసభల్లో నిలబడే హక్కు వుండాలని పట్టుపట్టి సాధించుకున్నారు. ఫలితంగా శ్రీమతి ముత్తులక్ష్మీ రెడ్డిని మద్రాసు ప్రభుత్వం శాసనసభకు నామినేట్ చేసింది. అప్పుడే స్త్రీల కొరకు పత్రికలు సంస్థలు వెలువడ్డాయి. స్త్రీ విద్యా ప్రాధాన్యం పెరిగింది.

**త్యాగమూర్తులుగా స్త్రీలు :** స్త్రీలు ఆభరణాలపై అలంకరణపై మక్కువ ఎక్కువ చూపుతారు. అది తప్పు అనక తప్పదు. అలంకరణ కంటె దేశం బాగుండాలని కాంక్షించి ఆభరణాలను స్వాతంత్ర్యం కోసం

**అన్నపూర్ణమ్మ :** స్వరాజ్య సాధన అందరి లక్ష్యం. అందరు పాల్గొంటే అందరికి భోజనం ఎక్కడ నుండి లభిస్తుంది. అందుకే స్త్రీలు తమ నగలను త్యాగం చేశారు. వారిలో బాపివీడుగారి సతీమణి మాగంటి అన్నపూర్ణమ్మ గారు తను ప్రేమగా దాచుకున్న నగలను, తాను ధరించి వున్న నగలు కూడా తీసి గాంధీ గారికి సమర్పించారు. ఖద్దరు దుస్తులు ధరిస్తానని ప్రతినపూనింది. ఎందరో మహిళలకు ఆదర్శప్రాయురాలైంది. (పుట:17)

**యామినీ పూర్ణతిలకం :** ఈమె ఒక వేశ్య. ఎంతో ధనాన్ని సమకూర్చుకుంది. ఈ దేశానికి స్వాతంత్రం ఎంతో అవసరమని భావించింది. అంతే వేశ్యావృత్తికి స్వస్తి పలికి సహాయ నిరాకరణోద్యంలో పాల్గొన్నారు. కొండావెంక ఉప్పయన పంతులు గారితో కలిసి ఆంధ్రలో పర్యటించారు. స్త్రీలు చేసిన త్యాగాలకు ఆంధ్రదేశం పెట్టింది పేరుగా చరిత్రలో ఒక గొప్ప స్థానాన్ని నిలుపుకుంది.

**ఉప్పు సత్యాగ్రహంలో స్త్రీల పాలుపంచుకోవడం :** ఉప్పు సత్యాగ్రహం గాంధీజీ ప్రారంభించిన తరువాత అనేక మంది స్త్రీలు ఈ సత్యాగ్రహంలో పాలుపంచుకున్నారు. గుంటూరు జిల్లాలో ఉన్నవ లక్ష్మీ బాయమ్మ, శ్రీమతి రుక్మిణీ  లక్ష్మీపతి ఇంటింటికి తిరిగి ఉప్పుసత్యాగ్రహంలో స్త్రీలందరు పాల్గొనేవారు. నెల్లూరు, తూర్పుగోదావరి సీతానగరం ఆశ్రమంలో, పశ్చిమగోదావరి గణపవరంలో, నాగల్లు ఆశ్రమంలో ఉప్పుసత్యాగ్రహాలు నిర్వహించారు. ఈ సత్యాగ్రహాలలో స్త్రీలు 500లకు పైగా పాల్గొనడం విశేషం.

ఆంధ్రదేశంలో విదేశీ వస్త్ర దహనం, మద్యపాన వ్యతిరేకోద్యమం పెద్ద ఎత్తున జరిగాయి. స్త్రీలు పాల్గొని పోలీసులాఠీ దెబ్బలు, జైలు శిక్షలు, జరిమానాలు వంటి అనేక శిక్షలను అనుభవించారు.

**క్విట్‌ఇండియా ఉద్యమం :** ఈ ఉద్యమానికి ఒక ప్రత్యేక గుర్తింపు వుంది. వయో భేదం మరచి బ్రిటీషువారితో వీరోచితంగా పోరాడుతారు. ఈ ఉద్యమంలో స్త్రీలు పాల్గొనడం విశేషం. 1943 ఆగష్టు 9న క్విట్ ఇండియా ఉద్యమ ప్రథమ వార్షికోత్సవం జరుపుకున్నారు. ఈ ఉద్యమంలో మహాదేవసాయి, కస్తూరిబా గాంధీ జైల్లోనే తనువులు చాలించడం శోచనీయం.

**హజరత్ బేగమ్ :** అయోధ్యను బ్రిటీషువారు ఆక్రమించుకున్న సమయంలో నవాబు భార్య హజరత్ బేగం బ్రిటీషువారితో తిరుగుబాటు చేశారు. అంతమాత్రమే కాదు నానాసాహెబ్ వంటి విప్లవ వీరులతో చేతులు కలిపి బ్రిటీషువారితో ధైర్యంగా నిలబడి యుద్ధం చేశారు.

1858 నవంబరులో ఈస్టిండియా కంపెనీ పరిపాలన రద్దు చేస్తూ లండన్‌లోని బ్రిటీషు పాలనకిందికి తీసుకుంది. బ్రిటీషువారికి సవాలు విసిరింది. బ్రిటీషువారు చంపడానికి వలవేసినప్పుడు పన్నాగం నుండి తప్పించుకొని లక్నో నుండి నేపాల్‌కు వెళ్లిపోయి తన ప్రాణాన్ని రక్షించుకుంది.

**కస్తూరిభా గాంధీ :** గాంధీ ఆ శ్రమంలో అనేక మంది స్త్రీలు పాల్గొనేలా చేశారు. నూలువడకడంలో, ముదుక ఖద్దరు దుస్తులు ధరించడంలో, ఉప్పుసత్యాగ్రహంలో అనేకమంది స్త్రీలు పాల్గొనేలా ప్రేరేపించారు.

**స్వరూపరాణి :** నెహ్రూగారి కన్న తల్లి. ధనవంతురాలు. సత్యాగ్రహ ఉద్యమంలో కస్తూరిభా గాంధీతోపాటు పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమప్పుడు కారాగారంలో మరణించిన వీరనారి స్వరూపరాణి గారు.

**విమలాబాయి మేల్కొటె :** క్విట్ ఇండియా ఉంద్యమం విమలాభాయి మేల్కొటె పాల్గొని అరెస్టు అయ్యారు. ఇండియన్ యూనియన్‌లో హైదరాబాదు చేర్చాలన్న ఉద్యమంలో పాల్గొన్నారు.

**రాజ్యలక్ష్మీ దేవి :** రాజ్యలక్ష్మి 1914 మే 18న కృష్ణజిల్లా నందిగామా తాలుకా వీరులపాడులో జన్మించారు. ఆ ప్రాంతంలో వెలసిన మిడిల్ స్కూలుకి హనుమయ్య చౌదరిగారు మహాపండితులు. ఈయన దగ్గర రాజ్యలక్ష్మి ఎన్నో విషయాలు నేర్చుకున్నారు.

రాజ్యలక్ష్మి 17 సం॥లో భారతస్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొనడానికి ప్రయత్నించారు. ఎన్నో రకాల శ్రమలను, జైలు శిక్షలను అనుభవించారు.

**శ్రీమతి పసల అంజలక్ష్మి:** పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన దాసం వెంకమ్మ దాసం వెంట్రామయ్యలకు 1904లో అంజలక్ష్మిగారు జన్మించారు. ఈమెకు 12 సంవత్సరాలకు పసల కృష్ణమూర్తిగారితో వివాహమైంది. ఆ తరువాత ఈమె దేశ స్వాతంత్ర్యం సాధించుకొనే పనిలో తీవ్రంగా పని చేసే అవకాశం లభించింది.

కులమతం పట్టింపులు లేకుండా, ధనిక పేద భావన లేకుండా మహిళలు స్వాతంత్ర్య సంగ్రామంలో పాలుపంచుకున్నారు. కుటుంబ నేపథ్యం దేశ స్వాతంత్ర్య సాధన అయితే ఆ గృహం నుండి స్త్రీలకు పూర్తి స్వేచ్ఛనిచ్చి పంపేవారు. కొంతమంది స్త్రీలు వివాహానంతరం భర్త స్వాతంత్ర్యం సాధనలో పాలుపంచుకుంటే వారి వెంట వారి భార్యలు వెళ్లడానికి అవకాశం లభించింది. స్త్రీలు ఇంటి పని వంటపని చేసుకొని దేశం కోసం పోరాటం చేసే నాయకుల వెంట అనేక వేలమైళ్లు నడిచారు. నినాదాలు చేశారు. పాటలు పాడారు. ఉపన్యాసాలిచ్చారు. వీరి త్యాగఫలం నేటి స్వాతంత్ర్యం.

**ఆధారగ్రంథం :**

స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు మహిళలు – డా॥ వాసా ప్రభావతి గారు.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమంలో – స్త్రీలపాత్ర

**డాక్టర్ బి.చక్రవర్తి,** కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, ముక్త గంగోత్రి, మైసూరు –570 006, చరవాణి: 96664 54688

వేదకాలం నుండి ఆధునిక కాలం వరకు భారతీయ మహిళలు సమాజంలో ప్రాధాన్యతను, బాధ్యతను కలిగి వున్నారనడం అతిశయోక్తి కాదు. భారతీయ సమాజం స్త్రీని దేవతగా, మాతృమూర్తిగా, సోదరీమణిగా ముద్దుల తనయగా, గృహిణిగా, అత్తింటి కోడలుగా తగిన ఆదరణ చూపి గౌరవించింది. స్త్రీ త్యాగమూర్తిగా, వినయవతిగా, విద్యావతిగా, ఆధ్యాత్మశీలిగా, వీరవనితగా నిలిచి ఆదరణను, ఆత్మీయతను, అనురాగాన్ని సమాజానికి పంచి ప్రపంచ మహిళలకే ఆదర్శంగా నిలిచింది.

స్త్రీలందరూ అంత ఉన్నత స్థితిలో ఉన్నారంటే ఉన్నారని కాదు! ఒక తరానికి ఒక స్త్రీ రత్నము ఉదయించిన అది స్త్రీ జాతికి గర్వకారణమే కదా! ఆ స్త్రీని ఆదర్శంగా తీసుకుని మిగిలినవారు ఆ స్థితికి చేరాలన్నదే ధ్యేయం. పురుష వేషం ధరించి ఓరుగల్లును పరిపాలించిన రాణీ రుద్రమదేవి స్త్రీ జాతికే గర్వకారణం. భరతావనికే మణిహారం. అంతటి శక్తి సామర్థ్యాలు కలిగిన భారతీయ మహిళలు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని తమలో దాగున్న శక్తి సామర్థ్యాలను సమాజంలో నిరూపించుకున్నారు.

మహాత్మాగాంధీ పిలుపునందుకుని కులమత భేదాలు వదలి, బీద ధనిక భేదాలు లేక స్వార్థాన్ని పక్కకు నెట్టి త్యాగశీలలై కొండంత హృదయంతో స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన పాత్రను వహించి భారతమాత దాస్యశృంఖలాలను పగులకొట్టిన ఘనత మహిళలకు దక్కింది. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాతపి గరీయసీ" అన్న సత్యాన్ని నిరూపించారు భారతీయ మహిళలు. ఎండుకన్నెరుగని సంపన్న గృహిణులు, వీధిగడపతొక్కని గృహిణులు, రాజకీయ పరిజ్ఞానములేని వనితలు, చదువుసంధ్యలు లేనివారు, అక్షరం ముక్క నేర్వని ఆడువారు ఎందరో స్వాతంత్ర్యోద్యమాన్ని జయప్రదం చేశారు.

ధరించిన నగలను మహాత్ముని వడిలో గుమ్మరించి బోసిమెడలతో కదలినవారు, పవిత్రమైన మంగళసూత్రాలను కూడా ఉద్యమానికి సమర్పించి పసుపుతాడు ధరించినవారు, సర్వం గాంధీజీకి సమర్పించి వట్టిచేతులతో నిలిచినవారు మహిళలు. రాజకీయ రంగంలో చేరి పగలూ రాత్రీ తెలియక పనిచేసినవారు సన్నని వస్త్రాలను వదలి ముతుక ఖద్దరు కట్టిన ముద్దుగుమ్మలు, ఖద్దరు మూటలు నెత్తినపెట్టి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసినవారు, విదేశీ వస్త్రాలను పోగుచేసి భోగిమంటలుగా పేర్చి కాల్చి ఆనందించినవారు, రాట్నాలు వడికి నూలు తీసిన మహిళలు మరెందరో ఉన్నారు.

యమకింకరులవంటి ఆంగ్ల సిపాయిలకు భయపడక, ఉప్పు సత్యాగ్రహం, నాన్‌కోపరేషన్ ఉద్యమం, స్వదేశీ ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమాలు జయప్రదం చేసి జైలుకు వెళ్ళినవారు, ప్రాణాలకు తెగించి ఆంగ్లేయ ప్రభుత్వాన్ని ఎదిరించినవారు, చంటిపిల్లలను చంకన ఇదుకొని జైళ్ళకు నడచినవారు, లాఠీ దెబ్బలకోర్చి, తుపాకీ గుళ్ళకు భయపడక ఉద్యమాలు నడిపించి ఆంగ్ల ప్రభుత్వాన్ని గడగడలాడించిన మహిళలు వీర వనితలు ఉన్నారు.

పరాయిపాలకుల దుండగాలను చూసి సహించలేక, వారు పెట్టే బాధలు పడలేక, వారు చేసే అవమానాలు భరించలేక, చావగొట్టి చంపుతుంటే, ఉరి శిక్షలు వేస్తుంటే సహించలేక, రైతు కూలీలను బండిటెద్దులుగ కట్టించి రథాలను, గుఱ్ఱపు బండ్లను తోలించె నాయకుల ఆగడాలు చూసి సహనం నశించిపోగా, ఆంగ్లపాలకుల దౌర్జన్యాలతో మావద్భారతం రక్త పుటేరులై పారుతుంటే గుండెచెదిరి పోగా, గాంధీ పిలుపు వేణునాదంలా వినబడితే ఆ పిలుపు వెంట నడిచారు ఆడువారు. స్త్రీ శక్తి స్వరూపిణి. త్యాగమూర్తి. ఓర్పు సహనానికి సహవాసి అని నిరూపించుకున్నారు.

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో వీరవనితయై ఝాన్సీ లక్ష్మీబాయి పాత్ర కనివిని ఎరుగనిది. అసలు ఆమె తిరుగుబాటు వల్లనే ఆ సంగ్రామం జరిగిందని చెప్పవచ్చు. ఝాన్సీ రాజై గంగాధరరావు మరణానంతరం అతను చేసుకున్న దత్తత చెల్లదని బ్రిటీషు వారు ఝాన్సీ కోటను ఆక్రమించుకొనగా లక్ష్మీబాయి ఆ అన్యాయం సహించలేక నిప్పులు కురిపించింది. కత్తి సాములో,

గుఱ్ఱపు స్వారీ మొదలగు యుద్ధవిద్యలలో ఆరితేరి ఉన్న గంగాధరరావు భార్య. ఝాన్సీ లక్ష్మీబాయి సైన్యసమీకరణ చేసుకొని ఆంగ్లేయులపై తిరుగుబాటు చేసింది. బాలుణ్ణి వీపున కట్టుకొని వీరోచితంగా యుద్ధంచేసి ఆంగ్లేయులను గడ గడ లాడించింది. అటువంటి కారణం వల్లనే రాజ్యం కోల్పోయిన నానాసాహెబ్, మహావీరుడైన తాంతియాతోపీలు ఆమెకు సహకరించి బ్రిటీష్ వారిని ముప్పుతిప్పలు పెట్టారు. మరొక పక్క దేశాభిమానం గల ప్రజలు సహకరించారు. మందుగుండు సామాన్యులు, మరఫిరంగులు, తుపాకులు వీరికి లేక పోయినను వీరోచితంగా పోరాడి బ్రిటీష్ పాలకుల గుండెల్లో చిచ్చురేపి వీరస్వర్గం అలంకరించిన నారీమణి ఝాన్సీ లక్ష్మీబాయి.

ఆనాడు స్వతంత్ర రాజ్యాలన్నీ ఏకమై ఝాన్సీ లక్ష్మీబాయిలా తిరుగుబాటు చేసి ఉంటే భారతదేశానికి స్వరాజ్యం ఎప్పుడో వచ్చి ఉండేది. కానీ కొందరు భారతీయులే ఆంగ్లేయులకు సైన్య సహకారం చేసి లక్ష్మీబాయి ఓడిపోవడానికి కారణభూతులవడం విచారకం.

ఆ కాలంలో మరో వీరవనిత ఒక సామాన్యురాలు అయినా తిరుగుబాటు దారులకు ఆమె గృహమే నిలయముగా నిలిపి కాన్పూరును ఆంగ్లేయులు ముట్టడించినప్పుడు నానాసాహెబ్ సైన్యంతో పాటు ఆంగ్లేయులతో వీరోచితంగా పోరాడి దేశం కోసం ప్రాణాలర్పించిన వీరనారి ఆమె.

అదేకాలంలో పేర్కొనదగిన మరోవీరనారీమణి హజరత్‌బేగమ్. అయోధ్యరాజ్యాన్ని బ్రిటీష్‌వారు ఆక్రమించుకొన్నప్పుడు నవాబు భార్యయైన హజరత్ బేగమ్ ఝాన్సీలక్ష్మిబాయి వలెనే తిరుగుబాటు చేసింది. నానాసాహెబ్ వంటి విప్లవీరులతో చేతులు కలిపింది. లక్నోపై బ్రిటీష్‌వారు దాడిచేసినప్పుడు స్వయంగా ఎదిరించి నిలబడింది. తరువాత అహ్మదుల్లా సైన్యసహకారంతో షాజన్‌పూర్ యుద్ధంలో పాల్గొని బ్రిటీష్ సైన్యాలను గడగడలాడించింది. 1858 నవంబర్‌లో ఈస్టిండియా కంపెనీ పరిపాలన రద్దుచేస్తూ లండన్‌లోని బ్రిటీష్ పాలనకిందికి భారతదేశాన్ని తీసుకుంటూ చేసిన నిర్ణయాన్ని సవాలుచేసి ఎదిరించింది. పైగా కంపెనీవారు భారత సంస్థానాలకు చేసిన ద్రోహాన్ని దుయ్యబట్టింది. దానితో కక్షకట్టిన ఆంగ్లేయులు నాలుగువైపుల నుండి సైన్యాలను పంపి ఆమెను చంపటానికి వలలు పన్నితే నేపాలుకు తప్పించుకుపోయిన వీరనారీ మణి ఆమె.

ఈ విధంగా ఈ మొదటి భారత సంగ్రామంలో ఎందరో నారీమణుల వీరోచిత పాత్ర పేర్కొనదగినది.

రాను రాను బ్రిటీషు వారి దౌర్జన్యాలు భారత ప్రజలపై పెరిగిపోయాయి. 1885లో కాంగ్రెస్ పార్టీ స్థాపించినను చెప్పుకోదగిన మార్పుకనబడకపోయినను క్రమంగా పుంజుకుంటూ వచ్చింది. కాంగ్రెస్ పార్టీలో ఏర్పడిన మితవాద, అతివాదులు మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఏకమై పోరాటం సాగించారు. అప్పటికే కొన్ని పత్రికలు స్థాపించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో జరిగిన కొన్ని సంఘటనల వల్ల భారతీయులలో రాజకీయ చైతన్యం మరింత కలిగింది. 1919లో జలియన్‌వాలాబాక్ జరిగిన హత్యాకాండ నాయకులతో పాటు యావద్భారతీయులను కదిలించి వేసింది. చివరకు నాయకులంతా ఏకమై జాతీయోద్యమాన్ని నడిపించడం మొదలు పెట్టారు. ఆసేతు హిమాచల ప్రజలు ఏకమై ఉద్యమంలో పాల్గొన్నారు. బ్రిటీష్‌వారిని ఎదిరించి ఎన్ని బాధలు పెట్టినా, లాఠీ ఛార్జీలు చేసినా, జైళ్ళకు పంపినా, సహించి పోరాటం సాగించారు. చివరకు 1947లో భారతదేశాన్ని వదిలి బ్రిటీష్‌వారు పారిపోయారు. భారత్ స్వతంత్రభారతమై వెలిగింది.

ఈ స్వతంత్ర పోరాటంలో ఎందరో మహిళలు పాల్గొన్నారు. స్త్రీ పురుష భేదం లేకుండా పనిచేశారు. ఇది శాంతి పోరాటం. ఆయుధాలు లేవు. అహింస పునాదులపైన నడిచిన పోరాటమిది. దేశభక్తి, త్యాగం, అహింస ఇందు ఆయుధాలు. జాతి సమైక్యత పెట్టుబడి "ఐకమత్యమే బలం" అన్న స్ఫూర్తి యథార్థమైన పోరాటమిది.

v స్త్రీలలో అంతటి చైతన్యం రావడానికి ఆ రోజులలో అనేక కారణాలున్నాయి.

v ఆంగ్లపాలకుల దుండగాలు, దౌర్జన్యాలు, అన్యాయాలు, ఆక్రమాలు.

v కరువు, కాటకాలు, ఆర్థిక ఇబ్బందులు.

v అప్పటికే రాజారామమోహన్ వంటి వారు సతీసహగమనం వంటి దురాచారాలు ఎదురించి స్త్రీ చైతన్యానికి పాటుబడుట.

v వీరేశలింగం పంతులు వంటివారు వితంతు వివాహాన్ని, బాల్య వివాహాన్ని ఎదురించి స్త్రీ విద్యను ప్రోత్సహించుట.

v స్త్రీలకు ప్రత్యేక సంస్థలు స్థాపింపబడుట.

v గాంధీమహాత్ముడు స్త్రీలకిచ్చిన ప్రత్యేకత, స్త్రీచైతన్యానికి చేసిన సేవ, ఉపన్యాసాలు, సమాజంలో వారి బాధ్యతను తెలియజెప్పుట.

v స్త్రీలలో ఉద్యమాలపై గలిగిన నమ్మకం. వారిలో దేశసేవకు కలిగిన నూతనోత్సాహం.

v కొందరి భర్తలు, కొందరి తండ్రులు, కొందరి సోదరులు, కొందరి బంధువులు ఉద్యమాలలో పాల్గొనుట.

v పై కారణాలవల్ల కొంత వరకు స్త్రీలలో నూతన చైతన్య కలిగిందని చెప్పవచ్చు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న స్త్రీలను రెండు రకాలుగా విభజింపవచ్చు.

v జాతీయోద్యమంలో గాంధీ, నెహ్రూ మొదలగు నాయకుల వెంటనుండి ఉద్యమం నడిపించినవారు.

v గాంధీ పిలుపునందుకుని (నాయకుల పిలుపునందుకుని) తమ తమ ప్రాంతాలలో ఉద్యమం నడిపించినవారు.

v గాంధీ నెహ్రూ మొదలగు నాయకులతో పనిచేసి పోరాటం సాగించినవారిలో కస్తూరిబాగాంధీ, సరోజినీనాయుడు, రాజకుమారి అమృత్‌కౌర్, దుర్గాబాయి, విజలక్ష్మి పండిల్, స్వరూపరాణి మొదలగు స్త్రీలు పేర్కొనదగినవారు.

విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమంలో నాయకులంతా జైళ్లపాలైనప్పుడు శ్రీమతి దుర్గాబాయి, అవంతిబాయ్ గోఖలే, రాజకుమారి అమృతకౌర్, సరోజినీనాయుడు, సుశీలానయ్యర్, లీలావతీమున్సీ, కమలాబాయి చటోపాధ్యాయవంటి నారీమణులు సత్యాగ్రహాలను నడిపించి పరాయి ప్రభుత్వాన్ని గడగడ లాడించారు. భారతీయులను ఆశ్చర్య చకితుల్ని చేస్తారు.

వీరిలో కస్తూరిబాగాంధీ పాత్ర నారీమణులకే ఆదర్శం. గాంధీ ఆశ్రమం ఈవిడవల్లనే ఆడువారితో నిండిపోయింది. నూలువడకడంలో ముదుక ఖద్దరు ధరించడంలో, ఉప్పు సత్యాగ్రహంలో ఎందరో స్త్రీలను తనవెంట నడిపించి విజయానికి కారణభూతురాలయింది. ధనవంతురాలైన నెహ్రూను కన్నతల్లి స్వరూపరాణి ఈవిడతో ఉద్యమంలో పాల్గొన్న నారీమణి, క్విట్ ఇండియా ఉద్యమంలో కారాగారంలో మరణించి యావత్ భారతీయులకు ఆదర్శంగా నిలిచిన మహిళ ఈమే.

సరోజినీనాయుడు గాంధీ వెంట ఉద్యమాలలో నడిచి ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షురాలై రాజకీయ రంగంలో ఆడువారికే ఆదర్శంగా నిలిచింది. "జాతి గులాబీ"గా పేరుగాంచి అనేక సార్లు జైలుకు వెళ్ళి ఆంగ్ల సిపాయిలను ఎదిరించి భయాన్ని రేపింది. జాతీయ నాయకురాలిగా పేరుగడించి పనిచేసింది.

దుర్గాబాయమ్మగారు కూడా ఆ కోవకు చెందిన స్త్రీ. 12వ ఏటనే గాంధీ పిలుపునందుకుని ముదుకు ఖద్దరు ధరించి ఇతర స్త్రీల చేత ధరింపచేసింది. ఆంధ్రప్రాంతంలోనే కాక మద్రాసులో, ఢిల్లీలో కృషిచేసిన వనిత ఈమె. మద్రాసులో హిందీ పాఠాలు నేర్పడానికి స్కూలు స్థాపించింది. 1930 ఉప్పు సతాగ్రహంలో తాను పాల్గొనడమే కాక ఎందరో స్త్రీలను ముందుకు నడిపించింది. మహాత్మాగాంధీ ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చినప్పుడు ధనము వసూలు చేసి ఇచ్చింది. ప్రతి ఉద్యమంలోనూ ఈమె పాత్ర ఇతర స్త్రీలకు ఆదర్శం.

గాంధీజీ పిలుపునందుకుని ఉద్యమాలు నడిపించిన వారిలో మద్రాసులో కమలాబాయి చటోపాధ్యాయ, ముత్తులక్ష్మిరెడ్డి, దుర్గాబాయి, ఆచంట రుక్మిణమ్మ ప్రధానులు.

తెలంగాణాలో విమలాబాయి మేల్కొటే, పద్మజానాయుడు. యల్లాప్రగడ సీతాకుమారి, సంగం లక్ష్మిబాయి, కలపకుంట్ల సరస్వతీదేవి, సుమిత్రాబాయి విద్యాదేవి ఓంప్రకాష్, సూర్యదేవర రాజ్యలక్ష్మి, జ్ఞానకుమారి హెడా మొదలగు స్త్రీల పాత్ర ప్రధానమైనది.

ఆంధ్రా ప్రాంతంలో స్త్రీల పాత్ర మరింత ప్రధానమైనది. శ్రీమతి దుర్గాబాయి, చిలకమర్తి వారిమేనకోడలు దువ్వూరి సుబ్బమ్మ, బత్తుల కామాక్షమ్మగారు, నాళం కృష్ణారావుగారి భార్య శ్రీమతి నాళం సుశీలమ్మగారు, ద్రోణం రాజులక్ష్మీబాయి,

స్త్రీహితైషిణి మండలి స్థాపకురాలైన కనుపర్తి వరలక్ష్మమ్మగారు, గుంటూరిలో శారదానికేతన్ స్థాపించిన ఉన్నవ లక్ష్మిబాయమ్మ, బసవరాజు అప్పారావుగారి సతీమణి బసవరాజి రాజ్యలక్ష్మి, దూళ్ళ వెంకట రమణమ్మ, పులవర్తి కమలావతీదేవీ, కోడూరి లీలావతమ్మ రామసుబ్బమ్మ, దేవులపల్లి సత్యవతమ్మ, కొండా వెంకటప్పయ్య పంతులుగారి సోదరి కొండా పార్వతి, పసల అంజలక్ష్మి, పొనకా కనకమ్మ. శ్రీమతి మాగంటి అన్నపూర్ణమ్మ, బాలాత్రిపురసుందరి ఉద్దరాజు మాణిక్యాంబ మొదలగు నారీమణులు మరెందరో పేర్కొనదగినవారున్నారు.

సరోజినీదేవి వంటివారు మహాత్మాగాంధీ వెంట అనేక ప్రాంతాలు సందర్శించి ఉపన్యాసాలు చేశారు. మద్రాసులో రౌలట్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆవిడ చేసిన ఉపన్యాసం ఎందరినో ఆకర్షించింది. ఆంధ్రదేశంలో మహాత్మాగాంధీ పర్యటనకు వచ్చినప్పుడు విజయవాడ సభలో ఎన్నో తీర్మానాలు చేశారు. ప్రకాశం పంతులు, పట్టాభి సాంబమూర్తి మొదలగు వారితో పనిచేసిన దువ్వూరి సుబ్బమ్మగారి పాత్ర పేర్కొనదగినది. ఖద్దరు మూటను నెత్తిన పెట్టి వాడవాడలా తిరిగి స్త్రీలను కట్టమని ప్రోత్సహించడమే కాకుండా ఎన్నో సార్లు జైలుకు వెళ్ళి లాఠీ దెబ్బలు తిన్నమహిళల ఈమె. మద్యపాన వ్యతిరేకోద్యమంలో పొనకా కనకమ్మ పాత్ర పేర్కొనదగినది. మహాత్ముని ఆంధ్రదేశ పర్యటనలో తిలక్ స్వరాజ్యనిధికి మాగంటి బాపినీడుగారు సతీమణి అన్నపూర్ణమ్మగారు తన నగలన్నింటిని గాంధీకి సమర్పించి ఖద్దరు కడతానని ప్రతినబూనింది. ఈ సందర్భంలో ఒక వేశ్యపాత్ర పేర్కొనదగినది. యానినీపూర్ణ తిలకమనే వేశ్య తన వృత్తిని వదిలి సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని దేశ స్వాతంత్ర్య సముపార్జనకు జీవితం అంకితం చేసింది.

ఆంధ్రదేశంలో స్త్రీలు ఉప్పు సత్యాగ్రహకాలంలో కొత్త పద్ధతులు ప్రవేశ పెట్టారు. "స్వరాజ్యలక్ష్మీపూజ" పేరిట ఇంటింటికి తిరిగి ఉగాదినాడు పూజలు జరిపి స్త్రీలు పిలుపునిచ్చుటలో ఉన్నవ లక్ష్మీబాయమ్మ, రుక్మిణి లక్ష్మిపతి మొదలగు స్త్రీలు పేర్కొనదగినవారు. నెల్లూరు జిల్లాలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న మొదటి మహిళ పాతూరి బాలసరస్వతమ్మ, ఆమె కుమార్తె, మద్రాసులో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో శ్రీమతి దుర్గాబాయమ్మ, ప్రకాశం పంతులుగారి భార్య పేర్కొనదగినవారు. చొల్లంగిలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో 500 మంది స్త్రీలు పాల్గొన్నారు.

విదేశీ వస్త్ర దుకాణాలముందు పికెటింగ్ జరిపిన నారీమణులలో దిగుమర్తి బుచ్చికృష్ణమ్మ, గాడిచర్ల శేషాబాయి, పాలకోడేటి శ్యామలాంబ మొదలగు స్త్రీలు ఉన్నారు. 1932 శాసనోల్లంఘనోద్యమంలో గుడివాడలో వల్లభనేని సీతామహాలక్ష్మి నాయకత్వం వహించగా దిగుమర్తి జానకమ్మ, చుక్కమ్మ వేదాంతం కమలాదేవి, కంభంపాటి మాణిక్యాంబ మొదలగు వారు 144 సెక్షన్ ధిక్కరించి పికెటింగ్ చేసి సంవత్సరం జైలు శిక్ష అనుభవించారు. మాణిక్యాంబగారు ఆరుమాసాల పసిబిడ్డనెత్తుకుని జైలుకు వెళ్ళారు. కొందరు మహిళా ప్రదర్శకులపై రంగునీళ్ళు, బురదనీళ్ళు జల్లి ఉక్కిరి బిక్కిరి చేస్తారు.

జైళ్ళలోని దారుణ పరిస్థితికి వ్యతిరేకంగా జరిపిన ఉద్యమంలో భారతీదేవిరంగా రేపల్లె, తెనాలి, కోవూరు మొదలగు ప్రాంతాలలో ప్రచారం చేసినందుకు సంవత్సరం జైలు శిక్ష 500 రూపాయలు జరిమానా విధించారు. గుంటూరులో జరిగిన రహస్య రాజకీయ సభకు వేదాంతం కమలమ్మ అధ్యక్షత వహించగా, మరోసభకు ప్రగడ విశ్వసుందరమ్మ, భీమవరం సభకు లావు అంకమ్మ, బాపట్లలో కంభంపాటి మాణిక్యాంబ తెనాలిలో టేకుమళ్ళ అచ్యుతమ్మ, కైలాస పట్టంలో భవనం తిరుమలమ్మ అధ్యక్షత వహించగా అరెస్టు చేసి అధికారులు జైళ్ళకు పంపారు.

మద్రాసులో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో స్త్రీల పాత్ర ప్రధానమైంది. ప్రకాశం పంతులుగారితోపాటు దుర్గాబాయమ్మగారు. శ్రీమతి రుక్మిణి లక్ష్మిపతి పేర్కొనదగినవారు. శ్రీమతి రుక్మిణి లక్ష్మీపతిగారు ఉరంతా తిరిగి ఉద్బోధన చేయగా 20 మంది స్త్రీలతో హైకోర్టు బీచ్ ముందు దుర్గాబాయమ్మగారు ఉప్పు తయారు చేసారు. తరువాత మైలాపూర్‌లోని శాంతోమ్ బీచ్‌లో 90 మంది స్త్రీలతో ఉప్పుచేస్తుండగా పోలీసులు తరిమికొట్టారు. మద్రాసులో "వేదారణ్యం" శిబిరం వద్ద కాపలా పెట్టబడిన రిజర్వు పోలీసులను ఆంగ్లేయులపై తిరగబడమని శ్రీమతి రుక్మిణీ లక్ష్మీపతి కరపత్రాలు పంచి పెట్టడం స్త్రీల సాహసానికి నిదర్శనం.

ఆధార గ్రంథాలు :-

1. డాక్టర్ సి.మృణాళిని, స్త్రీవాద నవలలు – కథలు : అస్తిత్వ పోరాటం వివేచన, పరిశోధన పత్రిక, జాతీయ సాహితీ సదస్సు ప్రత్యేక సంచిక, సంచిక 27, సెప్టెంబర్ 2006 (తెలుగు శాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు-7
2. రాజేశ్వరి స్త్రీవాద దృక్పథం వ్యాసావళి, 2003.
3. ఆధునికాంధ్ర సాహిత్య వికాసం, దూరవిద్యాకేంద్రం ప్రచురణ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.
4. డాక్టర్ ద్వానా శాస్త్రి, తెలుగు సాహిత్య చరిత్ర, ప్రతిభ పబ్లికేషన్స్, హైదరాబాద్, ద్వితీయ ముద్రణ 2004.
5. పూర్లి, సత్యవతి, స్త్రీవాద కవిత్వం – వస్తువైవిధ్యం, ఎం.ఫిల్., లఘు సిద్ధాంత వ్యాసం, శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, జూన్, 2005.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# జాతీయోద్యమంలో మాగంటి అన్నపూర్ణాదేవి

డా॥ సి. చెన్నకేశవులు, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.యన్. ప్రభుత్వ కళాశాల (స్వ.ప్ర), చిత్తూరు. చరవాణి : 94943 68020.
ఎం. ఏకాంబరం, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.యన్. ప్రభుత్వ కళాశాల (స్వ.ప్ర), చిత్తూరు. చరవాణి : 94942 09340.

**పరిచయం :** మన భారతదేశం సుమారు రెండువందల సంవత్సరాలు బ్రిటీష్‌వారి పాలనలో మగ్గిపోయింది. ఆర్థికంగాను, సామాజికంగాను, నైతికంగాను, మతపరంగానూ బ్రిటీష్‌వారు అనేక ఆంక్షలను మనపైన విధించారు. బ్రిటీష్‌వారి కఠినమైన పరిపాలన వలన భారతీయ విలువలు భ్రష్టమవుతుంటే భరించలేక మనదేశాన్ని మనమే పరిపాలించుకుందామని ఎంతోమంది నాయకులు, మహిళా నాయకులు, ప్రజలు తమ ప్రాణాలు కూడా లెక్కచేయకుండా దేశభక్తితో స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. అలా వందల ఏళ్ళు పోరాటం చేసి, అనేకమంది తమ ప్రాణాలను అర్పించి సాధించినదే మన స్వాతంత్ర్యం.

**జాతీయోద్యమం :** సుగంధద్రవ్యాల వ్యాపారం కోసం వచ్చిన ఐరోపా వారు క్రమంగా భారతదేశ రాజకీయాల్లో జోక్యం చేసుకుని వలస వాణిజ్య సామ్రాజ్యవాదంతో వ్యవహరించారు. ఈ క్రమంలో ఆంగ్లేయులు మిగతా ఐరోపా దేశాలను అధిగమించి భారతదేశాన్ని ఆక్రమించుకుని, తమ ప్రధాన వలసరాజ్యంగా మార్చుకున్నారు. 1757 నాటి ప్లాసీయుద్ధం వారి రాజకీయ అధికారానికి పునాది వేసింది. 1764 నాటి బాక్సర్ యుద్ధానంతరం ఆర్థిక పునాదిని ఏర్పాటు చేసుకున్నారు. 1773లో రెగ్యులేటింగ్ చట్టం ద్వారా ఆంగ్లేయులు పాలనా సంస్కరణలను ప్రారంభించారు. తమ దేశ పాలనా విధానాలను భారతదేశంలో ప్రవేశపెట్టారు. ఆర్థిక దోపిడీ విధానాల ద్వారా భారతదేశ వ్యవసాయ, వాణిజ్య పారిశ్రామిక రంగాలను నాశనం చేశారు. వారు ప్రవేశపెట్టిన సాంఘిక సంస్కరణలు భారతీయులకు ఆంగ్లేయులపట్ల వ్యతిరేక భావాలు రావడానికి కారణమయ్యాయి.

ఆంగ్లేయులు రాకముందు భారతదేశం మొఘలు చక్రవర్తుల పాలనలో ఉండేది. వారి బలహీనతల వల్ల దేశం అనేక చిన్న స్వతంత్రరాజ్యాలుగా విడిపోయింది. కానీ ఆంగ్లేయుల యుద్ధాలు, రాజ్యసంక్రమణ, సైన్య సహకార పద్ధతి లాంటి విధానాలు, బిరుదులు, భరణాలు రద్దుచేయడం, దుష్టపరిపాలన నెపంతో రాజ్యాలను ఆక్రమించడం ద్వారా మొత్తం భారతదేశాన్ని ఒకే పాలన కిందకు తెచ్చారు. ఇది భారతీయుల్లో రాజకీయ ఐక్యతకు కారణమై తామంతా ఒక్కటే అనే భావన తలెత్తి జాతీయోద్యమం ఆవిర్భవించడానికి దోహదపడింది.

ఆంగ్లేయులు భారతదేశాన్ని ఆక్రమించి వలసరాజ్యంగా మార్చుకుని దేశ సంపదను దోపిడీ చేశారు. వారు భారత వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టిన వ్యవసాయ వాణిజ్య విధానాలు, తీన్ కథియా పద్ధతులు, భూమి శిస్తు విధానాలు భారత రైతాంగాన్ని దోపిడీ చేయడానికి కారణమయ్యాయి. అదేవిధంగా పారిశ్రామిక విప్లవం కారణంగా మన దేశంలో చేనేత, కుటీర, చిన్నతరహా పరిశ్రమలు నాశనమయ్యాయి. ఫలితంగా దేశంలోని కార్మికులు, వృత్తిపనివారు తమ దైన్యస్థితికి ఆంగ్లేయులే కారణమని తెలుసుకొని జాతీయతాభావాన్ని పెంచుకున్నారు. ముఖ్యంగా ఆధునిక విజ్ఞానాన్ని పొందిన భారతీయ విద్యావంతులు ఆంగ్లేయుల ఆర్థిక, దోపిడీ విధానాలను ప్రజలకు తమ రచనల ద్వారా (దాదాబాయ్ నౌరోజీ తన డ్రైయిన్ సిద్ధాంతం, ఆర్.సి.దత్. వాణిజ్య విధానం) వివరించి వారిని జాతీయోద్యమం వైపు నడిపించారు.

1857 నాటి సిపాయిల తిరుగుబాటు భారత జాతీయోద్యమ ఆవిర్భావానికి మరో ముఖ్య కారణం అయింది. సిపాయిల తిరుగుబాటును వి.డి. సావర్కర్ ప్రథమ భారత స్వాతంత్ర్య సమరం అని పేర్కొన్నాడు. భారతీయులంతా ఐక్యంగా ఉద్యమం చేసి ఆంగ్లేయులను వెళ్ళగొట్టగలమని భావించి జాతీయోద్యమాన్ని ప్రారంభించారు. 1885 నుంచి మితవాదులుగా, అతివాదులుగా, గాంధేయవాదులుగా పనిచేసి, చివరకు 1947లో స్వాతంత్ర్యాన్ని పొందగలిగాము.

**జాతీయోద్యమంలో మహిళలు :** భారత స్వాతంత్ర్య పోరాటకాలంలో భారతదేశంలోని మహిళలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉన్నారు. స్త్రీలు ఎల్లప్పుడూ శక్తికి మూలం మరియు సమాజానికి ధైర్యసాహసాలు. భారత స్వాతంత్ర్యపోరాటంలో అనేక మంది

స్త్రీలు పాల్గొన్నారు. స్వాతంత్ర్యపోరాటంలో ఈ స్త్రీలపాత్ర గణనీయమైన మార్పును తీసుకువచ్చింది. మహిళా స్వాతంత్ర్యసమరయోధులు భారతదేశ స్వాతంత్ర్యం కోసం తన సంస్కృతీసాంప్రదాయాలను త్యజించి, ఎంతో ధైర్యంగా పోరాడి స్వాతంత్రసముపార్జనలో వారి త్యాగం విలువకట్టలేనిది.

ధైర్య సాహసాలకు మారుపేరుగా పిలుచుకునే ఝాన్సీరాణి లక్ష్మీబాయి. ఉత్తరభారతదేశానికి ఝాన్సీ రాజ్యానికి రాణిగా వ్యవహరించారు. 1857లో జరిగిన భారతదేశ దిరుగుబాటులో ఆమె ప్రముఖ పాత్రపోషించారు. ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామం అది. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకైన పాత్రపోషించిన మరో మహిళ సుచేతా కృపలానీ స్వాతంత్ర్య సమరయోధురాలు, మహిళా రాజకీయవేత్త, ఉత్తరప్రదేశ్‌కు మొదటి మహిళా ముఖ్యమంత్రి భారతజాతీయ కాంగ్రెస్ కార్యకలాపాల్లో సుచేతా కృపలానీ చురుకుగా పాల్గొన్నారు. మహాత్మాగాంధీతోను సన్నిహితంగా పనిచేశారు. భారతదేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు మరియు మొదటి భారతీయ బాలికల పాఠశాల స్థాపకురాలు సావిత్రీబాయి పూలే. ఆమె చెప్పిన పదాలు “మీరు అబ్బాయికి విద్యను అందిస్తే మీరు ఒక వ్యక్తికి విద్యను అందిస్తారు, కానీ మీరు ఒక అమ్మాయిని చదివిస్తే. మీరు మొత్తం కుటుంబాన్ని చదివిస్తారు” అన్నది. ఈమెకు ఈమె భర్త జ్యోతిరావుపూలే మద్ధతుగా నిలచాడు.

అరుణా అసఫ్ అలీ ఉప్పు సత్యాగ్రహంలో ప్రధానపాత్ర పోషించారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఉప్పుసత్యాగ్రహంలో ఆమె పాల్గొనడం వల్ల జైలుశిక్ష కూడా అనుభవించారు. ఆమె జైలు నుండి విడుదలైనప్పుడు, ఆమె క్విట్ ఇండియా ఉద్యమానికి నాయకత్వం వహించింది. తీహార్ జైలులో ఉన్న రాజకీయ ఖైదీల హక్కుల కోసం కూడా ఆమె పోరాడారు. నిరాహారదీక్షను కూడా చేశారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో ధైర్యంగా పోరాడారు. భారత స్వాతంత్ర్యఉద్యమంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల్లో ఒకరు మేడమ్ కామా. స్వాతంత్ర్య పోరాటంలో ఆమె భారతీయ పౌరుల మనస్సుల్లో మహిళా సమానత్వం మరియు మహిళా సాధికారిత యొక్క బీజాలను నాటారు.

కాంగ్రెస్ మొదటి మహిళా అధ్యక్షురాలు అనిబిసెంట్. ఈమె ఐరిష్ మహిళ. థియోసాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియాకు నాయకురాలు. ఆమె భారత జాతీయ కాంగ్రెస్ మొదటి మహిళా అధ్యక్షురాలు. 1906లో ఇండియన్ హోమ్ రూల్ లీగ్‌ను ఆమె స్థాపించారు. ఆ సమయంలోనే భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. సుభాష్ చంద్రబోస్ చేత ప్రభావితమై ప్రేరణ పొంది, స్వాతంత్ర్యపోరాటంలో క్రియాశీల సభ్యురాలుగా మారింది లక్ష్మీసహగల్. ఆమె ధైర్యవంతురాలైన యువతి. ఆమె ఏకైక ఆశయం భారతదేశ స్వాతంత్ర్యం. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన అన్ని ఉద్యమాలలో ఆమె పాల్గొన్నారు. ఈ విధంగా ఉషా మెహతా, అరుణా అసఫ్ అలీ, రాణి చెన్నమ్మ, రాణి లక్ష్మీబాయి, మేడమ్ కామా, లక్ష్మీ సహగల్, అనిబిసెంట్, సుచేతా కృపలానీ, సరోజినీ నాయుడు మొదలైన అనేకమంది మహిళా సమరయోదులు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని స్వాతంత్ర్యాన్ని సాధించారు.

**జాతీయోద్యమంలో తెలుగు మహిళలు :** భారత స్వాతంత్ర్యంకోసం ఎంతోమంది తెలుగు మహిళలు పోరాటం చేశారు. దాస్య శృంఖలాలను తెంచుకునేందుకు పోరాట పటిమను, తెగువను చూపించారు. ఒకానొక సందర్భంలో భారత స్వాతంత్ర్యంకోసం తమ ప్రాణాలను సైతం అర్పించారు. స్వేచ్ఛాభారతదేశం కోసం పోరాడారు. సాంప్రదాయాలకు, కట్టుబాట్లకు పెద్దయెత్తున ప్రాముఖ్యత ఇచ్చే రోజుల్లో తెలుగు మహిళలు స్వతంత్ర పోరాటంలో పాల్గొని ఆంధ్రదేశ పౌరుషాన్ని చాటారు. మహిళలు అయినప్పటికి తెగించి బ్రిటీషర్లతో పోరాడారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారు.

సరోజినీ నాయుడు హైదరాబాదులో బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో ఈమె జన్మించారు. ఈమె గొప్ప స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి. అఖిలభారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు తొలిమహిళా అధ్యక్షురాలు, స్వతంత్ర భారత తొలిమహిళా అధ్యక్షురాలు సరోజినీనాయుడు భారత స్వాతంత్ర్యపోరాటంలో ఆమెపాత్ర మరువలేనిది. క్విట్ ఇండియా ఉద్యమంలోనూ ఆమె చురుకుగా పాల్గొన్నారు. ఈమెకు భారతకోకిల అనే బిరుదు కూడా ఉంది.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. ఈమె 12వ ఏటనే రాజమండ్రిలో గాంధీ మహాత్ముడిని చూడటం, ఆయన స్వాతంత్ర్య సమరశంఖారావం విని ఉత్తేజితురాలు కావటం జరిగింది. 1927లో భారీప్రచారం సాగించుతూ గాంధీ మహాత్ముడు కాకినాడ వచ్చారు. ఈ సందర్భంలో ఆమె 25 రోజులపాటు గాంధీజీ వెంట ఆంధ్రదేశ పర్యటనచేసి, ఆయన ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించేవారు. సభల్లో ఎంతో ఉత్తేజపూరితంగా ఉపన్యాసాలు ఇచ్చేవారు. ఉప్పుసత్యాగ్రహ ఉద్యమంలో ఆమె ఉద్రేకపూరితంగా అనర్గళధారతో ఉపన్యసించేవారు. లాఠీదెబ్బలు తిన్నారు. నాటి అగ్రనాయకులలో ఒకరుగా నియంతగా ఉద్యమం నడిపారు. ఈ ఉద్యమంలోనే ఆమెను అరెస్టుచేసి జైలు శిక్షవేశారు. ఇలా అనేక ఉద్యమాల్లో పాల్గొనిన గొప్ప వీరవనిత దుర్గాబాయి దేశ్‌ముఖ్. అదేవిధంగా దువ్వూరి సుబ్బమ్మ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ, జయంతి సూరమ్మ, దేవులపల్లి సత్యవతమ్మ, న్యాపతి కామేశ్వరమ్మ, లక్ష్మీబాయమ్మ, బసవరాజు రాజ్యలక్ష్మమ్మ, మాగంటి అన్నపూర్ణాదేవి మొదలైన అనేకమంది తెలుగు మహిళలు భారత స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా పాల్గొని భారత స్వాతంత్ర్య సముపార్జనలో భాగస్వాములయ్యారు.

**మాగంటి అన్నపూర్ణాదేవి – బాల్యం :** ఈమె 10 మార్చి 1990న శ్రీమతి పిచ్చమ్మ, కలగర రామస్వామి గార్లకు పశ్చిమగోదావరి జిల్లాలో జన్మించారు. మాగంటి అన్నపూర్ణాదేవి ఏకైక సంతానంగా జన్మించారు. ఆమె తల్లిదండ్రులు బ్రహ్మమత ప్రభావితులు. మతవిషయంగా గాని, రాజకీయంగా గాని బానిసత్వం, దాస్యం పనికి రాదు అని వారి భావన.

**మాగంటి అన్నపూర్ణాదేవి – విద్యాభ్యాసం :** అన్నపూర్ణాదేవి తల్లిదండ్రులు సంఘంలో సగభాగమైన స్త్రీలు విద్యావంతులై, వివేకంతో స్వాతంత్ర్యపు విలువ తెలుసుకోనిదే సమాజానికి గాని, దేశానికిగాని మోక్షం లేదని వాళ్ళ విశ్వాసం. చదువుకోవడానికి తగిన వాతావరణం ఏలూరులో వుండదని ఆమెను కలకత్తా పంపించి బ్రాహ్మణబాలిక పాఠశాలలో చదివించారు. అక్కడే ఇంటర్మీడియట్ కూడా చదివారు. ఆమెది చాలా కుశాగ్రబుద్ధి. అందువల్ల బెంగాలీలో మంచి పాండిత్యం సంపాదించారు. అనేక బెంగాలీ పుస్తకాలు చదివారు. బెంగాలీ భాషలో అనేక పుస్తకాలు చక్కని రంగురంగుల బొమ్మలతో పిల్లలకోసం ఉంటే, తెలుగు పిల్లలకు ఒక్కటైన చిన్నకథల పుస్తకం లేకపోవడం అనే పేరుతో ఎంతో చక్కగా అందరూ మెచ్చుకునేటట్లుగా 1916లో వ్రాశారు. అప్పటికి ఆమెకు పదహారవ సంవత్సరం. అదేవిధంగా వివాహమంగళము, శ్రీ అరవిందుని లేఖలు మొదలైనవి తెనిగించారు.

**మాగంటి అన్నపూర్ణాదేవి – వివాహ సంబంధం :** మాగంటి అన్నపూర్ణాదేవి 1920లో ఆమె మేనమామ అయిన శ్రీ మాగంటి బాపినీడుతో ఆమె కోరికననుసరించి బ్రహ్మధర్మ సాంప్రదాయంలో వివాహం జరిగింది. శ్రీ బాపినీడు కూడ కలకత్తాలో అమరజీవి నేతాజీ సుభాష్‌చంద్రబోసుతో కలిసి చదువుకున్నారు. ఆ రోజుల్లో ఆ యువకులిద్దరు ఎంతో ముందడుగువేసి ఇండియన్ డిఫెన్సు కోర్సులో చేరారు. బాపినీడుగారు ఉన్నతవిద్యలకై అమెరికా వెళ్లారు. ఈమె కూడా వెళ్ళి చదవాలనుకున్నది. కానీ 1921లో గాంధీగారి స్వాతంత్ర్య సమర శాంఖారావం వినిపించింది. దానితో విదేశీ ప్రయాణం మానుకొని దేశసేవకు దిగారు.

**స్వాతంత్ర్యోద్యమంలో అన్నపూర్ణాదేవి పాత్ర :** జాతీయోద్యమంలో అన్నపూర్ణాదేవి తన ప్రాణాలను సహితం లెక్కచేయకుండా ఉద్యమాన్ని నడిపించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోదురాలు. 1921లో గాంధీజీ బెజవాడ వచ్చిన సమయంలో తన నగలన్నీ కాంగ్రెస్ నిధికి సమర్పించిన మొట్టమొదటి స్త్రీ అన్నపూర్ణాదేవి. దీన్ని చూసి ఆశ్చర్యపడిన గాంధీజీ ఆమెతో నీ నగలన్నీ ఇచ్చివేయడానికి నీ తల్లిదండ్రుల అనుమతి తీసుకున్నావా అని అడిగారు. అందుకామె ఇటువంటి పనులు చేయటంలో నా తల్లిదండ్రులు నన్ను అడ్డగించరు అన్నది. ఆమె విదేశీవస్తు బహిష్కరణలో భాగంగా నూలువడకటం, ఖాదీ ధరించటమేకాక ఇంటింటికి వెళ్ళి ఖాదీ ప్రచారం చేశారు. రాట్నాలు, మగ్గాలు కొని పేదలకు ఇచ్చింది. మోహనదాసు పరిశ్రమాలయం స్థాపించి వడకటం, నేయటం, ఇంకా కొన్ని కుటీర పరిశ్రమలు నెలకొల్పారు. ఆమె తల్లి పిచ్చమ్మ ఆమెకు అండదండలుగా ఉండి సహకరించేవారు.

అన్నపూర్ణాదేవి స్వయంగా కొంతకాలంగా గాంధీజీ ఆశ్రమంలో ఉండివచ్చారు. దేశం పర్యటించి ఉద్యమ ప్రచారం చేశారు. ఆమె ఇంగ్లీషు, తెలుగు, బెంగాలీలో అనర్గళంగా ఉపన్యసించగలరు. 1921–22 నాటికి నిస్సంకోచంగా వేదికనెక్కి

దువ్వూరి సుబ్బమ్మగారి లాగ ఉపన్యసించగలవారు. పురుషుల సభలలో సైతం నిస్సంకోచంగా ఉపన్యసించేవారు. ఆమె వాక్ప్రవాహం, ఆవేశం ప్రేక్షకులను ఉద్రూతలూగించేవి. అసంఖ్యాక ప్రజలతో కలిసి దేశానికి సేవచేయమని తన భర్తని వేడుకునేవారు. తనను మరిచినా, మాతృదేశాన్ని మరవద్దు అని పదేపదే తన భర్తకు గుర్తుచేసేవారు.

1923లో స్వదేశం తిరిగివచ్చిన భర్తకి రాజకీయాలలో ఆమె మార్గదర్శిని అయినారు. విదేశీసూటు బదులు శాశ్వతంగా ఖాదీధారి అయినారు. ఆమె దగ్గర శిష్యరికం వహించిన మాగంటి బాపినీడుగారు ఐదుసార్లు జైలుకు వెళ్లారు. హరిజన దేవాలయ ప్రవేశ ఉద్యమంలో రాత్రింబవళ్ళు కృషిచేశారు. ఆంధ్ర అగ్రనాయకులలో ఒక్కరై గాంధీ మహాత్ముడి సన్నిహితులలో ఒకరై కీర్తి గడించారు. ఆమెకు భగవంతుడు అన్నీ ప్రసాదించాడు. కాని ఆరోగ్యం మాత్రం ఇవ్వలేదు. చిన్నప్పటి నుంచి చాలా సున్నితమైన ఆరోగ్యం ఆమెది. అందులోను క్రమేపి జాతీయోద్యమంలో ప్రవేశించి రాత్రింబవళ్ళు శక్తికి మించి శ్రమపడటంతో ఆరోగ్యం బాగా క్షీణించిపోయింది. ఈ క్రమంలోనే 1927, మార్చి 9వతేదీన అందరిని వదిలి దూరలోకాలకు తరలిపోయింది.

**ఉపసంహారం :** ఆంధ్రదేశ చరిత్రలోనే పేరొందిన స్వాతంత్ర్య సమరయోధుల్లో మాగంటి అన్నపూర్ణాదేవి ఒక్కరు. ఆమె దేశంకోసం తన నగలన్నీ కాంగ్రెస్ నిధికి ఇచ్చిన మొదటి స్త్రీ. దేశప్రజలను ఉద్యమం వైపు నడపడానికి ఆమె చేసిన ప్రసంగాలు ఎందరికో ఆదర్శం. 1927లో ఆమె మరణించినపుడు ఒక శిష్యురాలిని మాత్రమే కాదు నేనొక కన్నకూతురిని కోల్పోయినానని గాంధీజీ అన్న మాటలు వింటే మాగంటి అన్నపూర్ణాదేవి ఎంత గొప్పనాయకురాలో తెలుస్తుంది. ఇంత గొప్ప ఆంధ్రమహిళా నాయకురాలు గురించి తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**ఆధార గ్రంథాలు :**

1. స్వాతంత్రోద్యమ సమరంలో ఆంధ్రమహిళలు : డా॥ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ (1987), ఆంధ్ర రాష్ట్ర పురావస్తు, హైదరాబాదు.
2. ఆంధ్రప్రదేశ్ చరిత్ర : జోగినాయుడు .పి, నిపుల పబ్లికేషన్స్ హైదరాబాదు.
3. సాంఘికశాస్త్రం : ఆంధ్రప్రదేశ్ ప్రచురణ, అమరావతి.
3. స్వాతంత్ర్యోద్యమంలో తెలుగుకవులు : ఆంధ్రజ్యోతి దినపత్రిక.

# జాతీయోద్యమంలో తెలుగు వనిత – దువ్వూరి సుబ్బమ్మ

**పి. కేశవులు,** పాఠశాల సహోపాధ్యాయులు (తెలుగు), జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, పుత్రమద్ది, ఐరాల మండలం, చిత్తూరు జిల్లా. చరవాణి : 91820 29026.

జాతీయత అంటే ఒక జాతి ఆత్మగౌరవానికి, సంస్కృతికి సంబంధించిన ఉత్కృష్ట గుణం. ఒకే మనుగడ, ఒకే విశ్వాసం గల మానవ సమూహపు భావజాలమే జాతీయత. తాను పుట్టిన నేల, సంస్కృతి, జాతుల పట్ల ఆదరభావం కలిగి ఉండటమే జాతీయత. జాతీయ భావాలు స్వాతంత్ర్య కాంక్షని పురికొల్పాయి. వందల సంవత్సరాలు మన దేశం పరాయి పాలనలో మగ్గుతున్నప్పుడు సాంస్కృతిక పునరుజ్జీవనం వల్ల, ఆంగ్ల విద్యాభ్యాసం వల్ల జాతీయతను సంస్కృతిని ఉత్తేజపరచిన మహనీయుల వల్ల, మహాత్మాగాంధీ నాయకత్వం వల్ల భారతమాతను బానిస సంకెళ్ళ నుండి విముక్తి చేయాలన్న ఆలోచన వచ్చింది. అందులో మహిళల పాత్ర కూడా మరువరానిది.

"దేశ నిర్మాతలు మీరు కాదు, మేము. అభివృద్ధి క్రమంలోని అన్ని దశలలో మా చురుకైన సహకారం లేకుండా మా కాంగ్రెసులూ, మహాసభలూ నిష్ప్రయోజనం. మీ స్త్రీలను విద్యావంతులను చేస్తే చాలు దేశం బాగుపడుతుంది. నిన్న, నేడూ, రేపూ మా జీవితం ఉన్నంత కాలం ఇది సత్యం. ఉయ్యాలలూపిన చేతులు ప్రపంచాన్ని పరిపాలిస్తాయి" – సరోజినీ నాయుడు.

ఆంగ్లేయుల దురాగతాలు, అరాచకాలకు వ్యతిరేకంగా, భారతమాత దాస్యవిముక్తి కోసం ఎందరో స్వరాజ్య సంగ్రామంలో పాల్గొన్నారు. దృఢసంకల్పంతో పాటు ఎందరో మహిళలు ఉద్యమానికి ఊపిరిగా, ఊతంగా నిలిచారు. ఉద్యమంలో పాల్గొన్న అలనాటి మహిళల్లో ప్రథమవరుసలో నిలిచే వ్యక్తి దువ్వూరి సుబ్బమ్మగారు. నలుగురు జనం గుమిగూడితే చాలు స్వాతంత్ర్యోద్యమం కోసం వాళ్ళల్లో స్ఫూర్తి రగిలించి బ్రిటీషు బలగాలను వణికించిన అపరకాళి దువ్వూరి సుబ్బమ్మగారు.

**బాల్యం :** ఈమె సనాతన బ్రాహ్మణ కుటుంబంలో 1880 సం॥ తూర్పు గోదావరి జిల్లాలోని రామచంద్రాపురం మండలం ద్రాక్షారామంలో మల్లాది వెంకటనరసమ్మ, మల్లాది సుబ్బావధానులకు జన్మించింది. చిన్నతనంలోనే దువ్వూరి వెంకటప్పగారితో ఆమెకు బాల్యవివాహం జరిగింది. రాజమండ్రి తాలూకా కడియం గ్రామంలో అత్తింట ఆమె అడుగుపెట్టింది. కొద్దికాలంలోనే భర్త మరణిస్తే బాలవితంతువుగా మారి కృంగిపోయింది. ఈ వైధవ్యం నాటి బ్రాహ్మణ స్త్రీలకు సర్వసాధారణంగా జరిగేదే. ఆ తర్వాత వాళ్ళ జీవితాలు ఇంటిచాకిరీకి పరిమితమై అనామకంగా సాగేవి. భర్త, పిల్లలు లేని ఆ బాధను దిగమింగి, దేశ ప్రజలనే పిల్లలుగా భావించి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనాలనే ఆశయాన్ని సంకల్పంగా చేసుకున్నారు. అప్పటికీ ఆమెకు అక్షరజ్ఞానం లేదు.

**విద్యాభ్యాసం :** తిరుపతి వెంకటకవులలో ఒకరు, సమీప బంధువైన చెళ్ళపిళ్ళై వెంకటశాస్త్రిగారు చేరదీసి విద్యాబుద్ధులు నేర్పారు. ఆయన ప్రోత్సాహంతో తెలుగు, సంస్కృతభాషల్లో పట్టు సంపాదించి గొప్పవక్తగా మారారు సుబ్బమ్మ. వెంకటశాస్త్రిగారు ఇచ్చిన స్ఫూర్తితో ఆమెలో స్వాతంత్ర్యోద్యమం గురించి ఆలోచించేలా చేశాయి. అనేక సభలు, సమావేశాలలో ఆమె పాల్గొన్నారు. ఆ సమావేశాలలో తన మేనమామ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు రాసిన "భరత ఖండంబు చక్కని పాడియావు ...." పద్యాన్ని రాగయుక్తంగా పాడుతూ జనంలో స్వాతంత్ర్య జ్వాల రగిలించి, ప్రజలు దేశభక్తితో ఉప్పొంగేరీతిగా గానం చేసేది.

**రాజకీయ ప్రవేశం :** 1921లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ రాజకీయ మహాసభలో మొదటిసారిగా అడుగుపెట్టింది. అప్పటికి ఆమె బాలవితంతువు. నాటి ఆచారాన్ని బట్టి ఆమెకు కేశములు తీసివేసినా, తలకు ముసుగు వేసినా, సంప్రదాయ కట్టుబాట్లను కాదని తన వేషానికి సిగ్గుపడక వేదిక మీదికి వస్తే అక్కడున్న జనం ఆమెను ఆశ్చర్యంగా చూశారు. ప్రకాశం పంతులుగారు ఆ సభకు అధ్యక్షులు. బులుసు సాంబమూర్తిగారు ప్రవేశపెట్టిన సంపూర్ణ స్వరాజ్యతీర్మానాన్ని ఆమె బలపరచడమే కాదు, సభలో ఆమె గంభీరోపన్యాసం అందర్నీ ఆకట్టుకుంది. స్వరాజ్యసాధనకు మహాత్మాగాంధీ సాగిస్తున్న పోరాటం గురించి తెలుసుకుని ఉప్పొంగిపోయారు. కుటుంబసభ్యులను ఒప్పించి స్వరాజ్య సమరంలో దూకారు. తన వాక్పటిమతో నారీలోకాన్ని కదిలించారు.

"ఉరిమింది భారత జాతి ...
రగిలింది ప్రజాశక్తి ...
మోగింగి విజయభేరి ...
ఎగిరింది జాతీయ జెండా"

అంటూ ఊరూరా తిరిగి ప్రజల్లో స్వాతంత్ర్యోద్యమ కాంక్షను రగిలించారు. దేశభక్తి గేయాలు, పాటలు పాడుతూ, ఇతిహాసాల్లోని సూక్తులను ఉటంకిస్తూ ... సూటిగా, చురుగ్గా, కరుగ్గా ఆమె చేసే ప్రసంగాలు ప్రతిఒక్కరినీ ఆకట్టుకునేది. కేవలం సుబ్బమ్మ ప్రసంగం వినడానికే సభకు ఎంతోమంది హాజరవుతుండేవారంటే అతిశయోక్తి కాదు.

ఆమె గొంతెత్తి పాడితే శ్రోతలందరూ కార్యకర్తలైపోయేవారు. మైకులు లేని ఆ రోజుల్లో ఆమె గళం కంచుకంఠమైంది. ఆమె గొంతెత్తి పాడినా, నినాధాలు చేసినా, ప్రసంగించినా ఐదారువేలమంది పాల్గొనే సభల్లోనూ, సమావేశంలోనూ ఎంత దూరంలో ఉన్నవారికైనా ఎంతో స్పష్టంగా వినిపించేది. ఆమె పాట ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చింది. గరిమెళ్ళ సత్యనారాయణ గారి పాట "మా కొద్దీ తెల్లదొరతనం దేవా..." ఆమె పాడినట్లుగా మరెవనూ పాడలేకపోయేవారు. సుబ్బమ్మ ఉపన్యాసం జనానికి వినిపించకూడదన్న ఉద్దేశంతో బ్రిటీష్ పోలీసులు ఆమె ప్రసంగిస్తున్న చోటుకు వెళ్ళి డప్పులు, డబ్బాలు కొడుతుండేవారు. ఆగ్రహించిన సుబ్బమ్మ పోలీసులపై విరుచుకుపడేవారు. "నేను గంగాభగీరథ సమానురాలును. నేను తలుచుకుంటే మిమ్మల్ని గంగలో ముంచేయగలను. కానీ గాంధీజీ ఆజ్ఞానుసారం అహింసావ్రతాన్ని పూనాను. నా దగ్గరా! మీ కుప్పిగంతులు... జాగ్రత్త!" అని హెచ్చరించేది. ఆ గర్జన వినగానే వారు నెమ్మదిగా జారుకునేవారు. సుబ్బమ్మ మాటతీరు ముక్కుసూటిగా, కరుగ్గా వుండేది. లాఠీలతో వచ్చిన పోలీసులను అదిలించటం, బెదిరించటం ఆమెకు, ఆమె చుట్టూరా ఉన్నవారికి వినోద కార్యక్రమంగా ఉండేది. ఆమెను చూసి పోలీసులు భయపడేవారనటంలో అతిశయోక్తి లేదు.

**గాంధీజీతో అనుబంధం :** స్వరాజ్యసాధనకు ప్రతిఒక్కరూ ఉద్యమిస్తున్న రోజులలో గాంధీజీ అహింస, సత్యాగ్రహమనే ఆయుధాలతో స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రారంభిస్తే, ఆయన వెంట నడిచిన వారెందరో ఆనాటి కుటుంబ కట్టుబాట్లను వదలి బానిసత్వాన్ని పారద్రోలడానికి ఉద్యమంలోకి నడిచిన ధీశాలి, ఆత్మస్థైర్యంతో ఆంగ్లేయులను ఎదిరించి, తన గొంతుకతో స్వాతంత్ర్యోద్యమ కాంక్షను రగిల్చిన ధైర్యనారీశిరోమణి దువ్వూరి సుబ్బమ్మగారు.

గాంధీజీ తాడేపల్లిగూడెంను దర్శించినపుడు 1921లో ఆంధ్రాకాంగ్రెస్ మహిళాసంఘం విభాగం వారి కోరికతో దువ్వూరి సుబ్బమ్మగారు గాంధీజీకి హారతి ఇచ్చి ఆహ్వానించేందుకు పూనుకున్నారు. రాజమండ్రి విద్యార్థినులను తీసుకొనివచ్చి బాపూజీని గౌరవించారు. గాంధీయుగంలోని అన్ని ఉద్యమాలలోనూ ఈమె నిర్వహించిన పాత్ర అద్వితీయం. తన ఉపన్యాసఝురితో ప్రజలను ఆకట్టుకున్నారు. బాపూజీ అభిమానాన్ని చూరగొన్నారు. ఉద్యమాలలో పాల్గొని ప్రజలను స్వేచ్ఛాదిశగా నడిపించారు. ఆమెను అడ్డుకోవడానికి ఆంగ్లేయులు ఆమెను నిర్బంధించి జైలుకు పంపారు. "తప్పు ఒప్పుకొని క్షమాపణ చెబితే" నిన్ను వదిలిపెడతాం అన్నాడు అప్పటి బ్రిటీష్ కలెక్టర్. ఆ మాటలను అసహ్యించుకున్న సుబ్బమ్మ "ఛీ...ఛీ...! నా కాలిగోరు కూడా ఆ పనిచేయదు" అని ధీటైన సమాధానం చెప్పిన ఆత్మాభిమాని.

**జైలు జీవితం :** జాతీయోద్యమంలో భాగంగా గాంధీజీబాటలో నడిచిన దువ్వూరి సుబ్బమ్మగారు ఆరునెలల పాటు కారాగారంలో గడిపారే కానీ తెల్లదొరలు ఇచ్చిన ఏ అవకాశాన్నీ అస్సలు వినియోగించుకోలేదు. సుబ్బమ్మ జైల్లో ఉపన్యసిస్తూ, పాటలుపాడుతూ ప్రతిఒక్కరిలో జాతీయభావాన్ని పెంపొందించేవారు. ఈటెల్లాంటి మాటలతో జైలు అధికారులను హడలెత్తిస్తూ కారాగారంలో ఉన్నవారందరికీ అవసరమైన సదుపాయాలు కల్పించడలంలో విజయం సాధించారు.

**స్త్రీవిద్య :** పొనక కనకమ్మ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ మొదలగువారితో కలసి పనిచేశారు. పరస్పర అభిప్రాయాలు తెలుసుకునేవారు. స్వాతంత్ర్యపోరాటంలో మహిళల భాగస్వామ్యాన్ని సుసంపన్నం చేయడానికి, స్త్రీ విద్యాభివృద్ధికి చేపట్టవలసిన కార్యక్రమాలను

గురించి చర్చించుకునేవారు. అన్ని రంగాల్లోనూ మహిళలు వెనుకబాటుతనానికి ముఖ్య కారణం.. చదువుకోకపోవడం. చదువుతోనే చైతన్యం సాధ్యమౌతుందని గ్రహించిన ఆమె విరాళాలు సేకరించి స్త్రీలకు విద్యనేర్పింది. ఉచితంగా వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రాజమండ్రిలో "సనాతన స్త్రీ విద్యాలయ"మనే బాలికా పాఠశాలను స్థాపించింది. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు స్వేచ్ఛను పొందండి, ఆనందాన్ని అనుభవించండి. ఈ శుభవేళలో తీపి తినండి అంటూ మిఠాయిలు పంచింది. స్వాతంత్ర్యం అనంతరం 16 ఏళ్ళపాటు ఏఐసీసీ సభ్యురాలిగా కొనసాగిన ఈమె తన యావదాస్తిని ఉద్యమం కోసమే ధారపోశారు.

**సహాయ నిరాకరణోద్యమం :** 1922 జనవరిలో తలపెట్టిన ఈ ఉద్యమంలో పాల్గొని భారత, భాగవత పద్యాలు రాగయుక్తంగా చదువుతూ గంభీరోపన్యాసాలు ప్రారంభించింది. ఆమెను ఆంగ్లేయులు భరించలేకపోయారు. కలెక్టర్ ఆమెను రాజమండ్రి సెంట్రల్ జైల్లో పెట్టారు. క్షమాపణ చెబితే వదులుతామన్నారు. ఆమె అంగీకరించలేదు. 100 రూ॥ జరిమానా చెల్లించమన్నారు. ఆమె తలముసుగు తీసి చూపించి "ఇదే నా దగ్గర ఉందని" సమాధానమిచ్చింది. ఆమె ధైర్యానికి కలెక్టర్ సిగ్గుపడ్డాడు.

**విదేశీ వస్తుబహిష్కరణ :** స్వాతంత్ర్యసమరంలో చురుగ్గా పాల్గొన్న సుబ్బమ్మ మహాత్ముడి స్ఫూర్తితో విదేశివస్తు బహిష్కరణోద్యమంలో తనవంతు పాత్ర పోషించారు. జైలు నుండి వచ్చాక ఖాదీ ఉద్యమం ఆమె ఊపిరైపోయింది. తాను ఖద్దారు దుస్తులను ధరించడమే కాకుండా, ఖద్దరు చరఖా మీద నేసి, ఖద్దరు బట్టలమూటను నెత్తిమీద పెట్టుకొని ఊరూరా తిరిగి అమ్మిన నిజమైన గాంధేయురాలు. ఓసారి కొందరు మహిళలు... ఖద్దరు చీర బరువు మోయలేకపోతున్నామని సుబ్బమ్మకు మొరపెట్టుకున్నారు. దాంతో "గుండెలెత్తు బరువున్న మొగుళ్ళను మోస్తున్నారు. ఉద్యమం కోసం ఈ మాత్రం కోకలు బరువయ్యాయా... మోయలేరా?" అంటూ మహిళలను తనదైనశైలిలో మందలించి వారిలో చేనేత స్ఫూర్తిని నింపారు.

**ఉప్పు సత్యాగ్రహం :** ఉప్పు సత్యాగ్రహం చేసి అరెస్టయ్యి సంవత్సరం పాటు రాయవెల్లూరులో జైలుశిక్ష అనుభవించారు. ఆనాటి నుంచి జరిగిన జాతీయోద్యమ ప్రధాన ఘట్టాలన్నిటిలో ఆమె ముందుండి నాయకత్వం వహించారు. ఇంకా వ్యక్తి సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో ఆమె మహిళలకు ఎంతో ఉత్సాహాన్నిచ్చారు. అరెస్టులు, జైలుశిక్షలు ఆమె జీవిత విధానంలో భాగమయ్యాయి.

**బిరుదులు – ప్రశంసలు :** పోరాట పటిమను ప్రదర్శించిన ఆమెను కాకినాడ కాంగ్రెస్ సభలో దేశబాంధవి అనే బిరుదును ఇచ్చి గౌరవించారు. సంఘ సేవకురాలిగా, మహిళా విద్య ఉద్యమకారిణిగా, స్వాతంత్ర్య పోరాట యోధురాలిగా, దేశం కోసం పరితపించిన ధీశాలి దువ్వూరి సుబ్బమ్మగారు. ఆంధ్రలోనే కాక భారతదేశంలోనూ గొప్ప వ్యక్తిగా పేరుపొందారు. దువ్వూరి సుబ్బమ్మగారి జ్ఞాపకార్థం 2021 మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒక ప్రత్యేక తపాలా కవరును విడుదల చేసి గౌరవించింది భారత తపాలాశాఖ. ఈ కవర్ మీద సుబ్బమ్మగారి విగ్రహచిత్రాన్ని ముద్రించడం స్త్రీజాతికే గర్వకారణం.

**చివరి రోజులు :** చివరిరోజుల్లో తన బంధువులైన రామచంద్రాచార్యులు గారికి చెందిన ఒక గదిలో కడియం గ్రామంలో నివాసముండేవారు. జీవిత చరమాంకంలో సుబ్బమ్మను పరామర్శించడానికి 1954లో అప్పటి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులుగారు స్వయానా కడియం గ్రామానికి వెళ్ళి పరామర్శించారు. అహర్నిశలూ దేశం కోసం పరితపించిన ఆమె 1964 మే 31వ తేదీన పరమపదించారు.

**పరిశీలనా గ్రంథాలు :**

1. భారత స్వాతంత్ర్యోద్యమంలో స్త్రీలు – డా॥ వాసా ప్రభావతి
2. మహిళావరణం – ఓల్గా వసంత కన్నాభిరాన్, కల్పనా కన్నాభిరాన్.
3. దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మ – పుట్టి నాగలక్ష్మి – సంచిక

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# "జాతీయోద్యమానికి జీవితం అంకితం చేసిన వీరనారి – సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి"

డా॥ జి. తిరుమలయ్య, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు. చరవాణి : 99853 13431
డా॥ ఎం. ధర్మారావు, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నగరి. చరవాణి : 91107 24373

మన భారతదేశ చరిత్రలో అనేక యుద్ధాలు, ఉద్యమాలు, పోరాటాలు జరిగాయి. ఇటువంటి యుద్ధాలు, ఉద్యమా లలో రాజులు, సైన్యాధికారులు, సైనికులు మాత్రమే పాల్గొన్నారు. కానీ స్వాతంత్ర్యోద్యోమ పోరాటంలో పెద్దపెద్ద నాయకులు, గొప్పగొప్ప దేశభక్తులతో పాటు సాధారణ పౌరులు, సామాన్య ప్రజలతో అనేకమంది మహిళలు స్వతహాగా, స్వచ్ఛందంగా పాల్గొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళలు చురుకుగా పాల్గొనడమే కాకుండా తమ ధన, మాన, ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించి భారతమాత దాస్యశృంఖలాలు విముక్తి చేయడంలో తెలుగు మహిళలు కూడా కీలకపాత్ర పోషించారు.

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అని వాల్మీకి మహర్షి అన్నారు. అంటే జనని, జన్మభూమి స్వర్గం కంటే చాలా గొప్పది అని అర్థం. అంతటి గొప్పదైన మన జన్మభూమి ఆంగ్లేయుల కబందహస్తాలలో బంధించబడి బానిసగా కన్నీరు కారుస్తుంటే, అంతవరకూ నిద్రాణావస్థలో ఉన్న భారతీయులు 1857 సిపాయిల తిరుగుబాటుతో మేల్కొని సంఘటితులై భరతమాత స్వేచ్ఛకోసం రక్తార్పణ చేస్తూ చెరసాలలకు, ఉరితాళ్ళకు భయపడకుండా ప్రాణాలను వదలడానికి సిద్ధమయ్యారు. ఇందులో అనేకమంది మహిళలు కూడా ఉండటం ఎంతో గొప్ప విషయం.

పురాతన కాలం నుండి 19వ శతాబ్దం వరకు భారతీయ సమాజం భారత మహిళలను దేవతగా, మాతృమూర్తిగా, సోదరీమణిగా, ముద్దులతనయగా, గృహిణిగా, అత్తింటి కోడలిగా, వినయవతిగా, గుణశీలిగా గౌరవించింది, కానీ స్త్రీ త్యాగమూర్తిగా, వీరవనితగా, ధీరురాలుగా మహిళలోని మరో కోణం భారతీయ స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో బయటపడింది. భారతీయ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న మహిళలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చును. జాతీయోద్యమంలో గాంధీజీ, నెహ్రూ మొదలగు నాయకుల వెంటనుండి ఉద్యమం నడిపించినవారు మొదటి వర్గం వారు కాగా, గాంధీజీ పిలుపునందుకుని తమతమ ప్రాంతాలలో ఉద్యమాలు నడిపించి చైతన్యపరచేవారు రెండవ వర్గానికి చెందుతారు.

జాతీయోద్యమంలోకి గాంధీజీ అడుగుపెట్టడంతో ఉద్యమం జోరు పెరిగింది. గాంధీజీ ప్రభావంతో చైతన్యం పొంది ఉద్యమంలోకి ఉరికిన అనేకమంది తెలుగు వీరమహిళల్లో శ్రీమతి సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవిగారు ఒకరు. కొంతమంది తమకు లభించిన దానితోనే తృప్తిచెందుతారు. అక్కడితోనే తమ జీవితాన్ని ఆపేస్తారు. కానీ మరికొంతమంది తమకు సమకూరిన జీవితంతో తృప్తిపడక, తమకు నచ్చిన మార్గంలో జీవితాన్ని సాగించడానికి పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తూ... సాహసంతో, ధైర్యంతో, ఉత్సాహంతో పైపైకి వెళ్ళాలనుకుంటారు. ఇటువంటి ఆలోచనావిధానం వల్ల వారు ఒకవిధమైన ప్రత్యేకతతోనే, ఇతరుల కన్నా పది అడుగులు ముందుగానో ఉంటారు. సరిగ్గా ఈ రెండోరకం కోవకు చెందిన వ్యక్తియే శ్రీమతి సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవిగారు.

ఈమె కృష్ణాజిల్లా, నందిగామ తాలుకా వీరులపాడు గ్రామంలో 1914 మే 18వ తేదిన వాసిరెడ్డి సీతారామయ్య, సుబ్బమ్మ దంపతులకు నాల్గవ సంతానంగా సూర్యదేవర రాజ్యలక్ష్మీగారు జన్మించారు. ఈమెకు ఒక అక్క మరియు ఇద్దరు అన్నయ్యలు ఉండేవారు. పెద్దన్నయ్య మల్లికార్జునరావు ఆ రోజులలోనే బి.ఏ., చదువును పూర్తిచేసుకుని విదేశాలకు వెళ్ళి, పెద్దస్థాయిలో స్థిరపడాలని అనుకున్న అతనికి 1920లో గాంధీ మహాత్ముని పిలుపు దేశసేవలో పాల్గొనేలాగ చేసింది. ఈ నిర్ణయమే ఈమె పసిహృదయంలో దేశభక్తి రగిలించే తొలికార్యం అయింది. ఆ తరువాత ఈమె గురువుగారు అయిన శ్రీ జంగాహనుమయ్య చౌదరి గారు మంచికవి, పండితుడు కావడం చేత ఇతను ఉత్తమ కావ్యాలన్నీ బోధించి ఈమెలో మంచి విద్వత్తును కలిగించారు. అటు తరువాత వీరులపాడులో కొత్తగా స్థాపించిన గ్రంథాలయంలో తాపీధర్మారావు, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం పంతులు, త్రిపురనేని రామస్వామి చౌదరి వంటి ప్రముఖ సంఘసేవకుల రచనలు చదివి ఆకలింపు

చేసుకునే క్రమంలో దేశభక్తి మరింత బలపడటం జరిగింది. ఈ మూడు ప్రధాన సంఘటనలు ఈమె జీవితాన్ని మలుపుతిప్పి జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొనేలాగా చేసాయి.

ఈమె తొలిసారిగా భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నది ఉప్పు సత్యాగ్రహం ఉద్యమంలో. గాంధీజీ 1930లో ప్రారంభించిన ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొనాలని ఈమె ప్రయత్నించారు. కానీ ఈమె సత్యాగ్రహంలో పాల్గొనడానికి, జైలుశిక్షను అనుభవించడానికి తన భర్త ఇంట్లోని పెద్దలు అంగీకరించలేదు.

1932 శాసనోల్లంఘన ఉద్యమంనాటికి ఈమె చేబ్రోలు వచ్చారు. చేబ్రోలు వీరులగడ్డ. ఇక్కడ అప్పటికే అనేకమంది జాతీయోద్యమంలో పాల్గొన్నారు. హిందీ నేర్చుకోవడం, రాట్నంమీద నూలు వడకడం, ఖాదీ వస్త్రాలు ధరించడం ఈ ప్రాంతంలో నిత్యసాధారణం అయిపోయాయి. ఇదే సమయంలో జాతీయోద్యమాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ శ్రీమతి భారతీదేవి రంగా చేబ్రోలు వచ్చారు. దీంతో శ్రీమతి రాజ్యలక్ష్మీదేవి బహిరంగంగా ఉద్యమంలో పాల్గొనడం ప్రారంభించారు. ఈమె, ఈమె పినతండ్రి కూతురు సూర్యదేవర అన్నపూర్ణమ్మ, తోడికోడలు శ్రీమతి రాజ్యలక్ష్మమ్మ. ఈ ముగ్గురు కలిసి 1932 జనవరి 26న శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొంటున్నట్లు ముందుగానే చుట్టుప్రక్కల గ్రామాలవారికి తెలిసి, జనం వీరిని చూడటానికి తండోపతండాలుగా వచ్చి చేరడంతో వీధులన్నీ జనాలతో కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా ప్రజలందరూ వీధివీధిన జాతీయగీతాలు పాడుతూ, శాసన ధిక్కార నినాదాలు చేస్తూ ఉత్సాహంతో ఊరేగింపుగా బయలుదేరారు. ఊరేగింపు కొన్ని వీధులు దాటి రాజవీధిలోకి ప్రవేశించేటప్పటికి జనప్రవాహంపై లాఠీచార్జి చేసి, ప్రజలందరినీ చెదరగొట్టి ఈ ముగ్గురిని అరెస్టు చేసారు. పొన్నూరు కోర్టులో విచారణ జరిపి ఈ ముగ్గురికి ఒక సంవత్సరం కఠిన కారాగారశిక్ష మరియు 50 రూపాయిలు జరిమానా విధించారు. జరిమానా కట్టలేకపోతే ఇంకా రెండు నెలలు ఆదనంగా జైలుశిక్ష అనుభవించేలా తీర్పుచెప్పారు.

దీనితో ఈమె రాయవేలూరు జైలులో జైలుశిక్ష అనుభవించే సమయంలో అక్కడ ఎంతోమంది దేశభక్తులను ప్రత్యక్షంగా, ముఖాముఖిగా కలుసుకోగలిగినందుకు ఈమె ఎంతగానో సంతోషపడిపోయారు. ఈ విధంగా ఒకవైపు జైలుశిక్షను అనుభవిస్తూనే ఇంకోవైపు అక్కడి ఖైదీలతో హిందీ నేర్చుకుని, మరికొంతమందితో కుట్లు, అల్లికలు నేర్చుకుంటూ ఉండగానే 6 నెలలు గడిచిపోయాయి. అయితే అక్కడి జైలు ఖైదీలతో నిండిపోవడంతో ఈమెను అక్కడినుండి మద్రాసు జైలుకు మార్చారు. ఈ విధంగా తన మొదటి జైలు జీవితం గడిపి తరువాత ఇల్లు చేరుకున్నారు. కానీ తన ఆలోచనలు, వ్యాపకాలు, దేశభక్తి మాత్రం మానలేదు, తరగలేదు. పైపెచ్చు పెరిగింది కూడా.

ఆ తరువాత వెల్లిమాంబ స్త్రీల గ్రంథాలయానికి కార్యదర్శిగా ఉంటూ, ఖాదీప్రచారం చేయడం, మహిళా ఉద్యమం నడపడం, జాతీయోద్యమ కార్యకలాపాలు చెయ్యడం, గ్రంథాలయంలో హిందీ క్లాసులు బోధించడం ఈమె జీవితంలో సర్వసాధారణంగా మారిపోయాయి.

ఆ కాలంలో ఒక మహిళ ఇల్లు దాటి పొరుగూరుకి పోయి పురుషులతో కలిసి చదువుకోవడం అంటే సామాన్య విషయం కాదు. అలాంటిది ఈమె చదువుమీద ఆసక్తితో బాగా చదివి రాష్ట్రభాష పరీక్షలో ఉత్తీర్ణులు అయ్యారు. అంతటితో ఆగకుండా తెనాలి వెళ్ళి హిందీవిద్యాలయంలో చదివి రాష్ట్రభాషా విశారద పట్టాను సంపాదించారు. ఈమె ఒక పనిని చెయ్యాలనుకుంటే ఎన్ని అడ్డంకులు ఎదురైనా వేటినీ లెక్క చేయకుండా అనుకున్నది సాధించేవరకు విశ్రాంతి తీసుకోని ప్రత్యేకత ఈమె సొంతం. ఇదే స్వభావాన్ని జాతీయోద్యమంలోనూ చూపించారు.

1940లో వ్యక్తి సత్యాగ్రహం ప్రారంభం అయింది. గుంటూరు జిల్లాలో వ్యక్తి సత్యాగ్రహం చేయడానికి అనుమతి లభించిన మొదటి మహిళ ఈమె. ఆ ఊరి పెద్దల అభీష్టాన్ని అనుసరించి ఈమె బాపట్ల తాలుకా బ్రాహ్మణకోడూరులో 1941 జనవరి 30న సత్యాగ్రహం చేపట్టారు. దీనితో ఆంగ్లేయ ప్రభుత్వం ఈమెను ఆ రాత్రికి రాత్రి అరెస్టుచేసి ఒంగోలు సబ్‌జైలుకు తరలించారు. ఈ విధంగా ఈమె రెండవసారి రెండునెలలు జైలు జీవితం గడిపారు.

ఇంతలో క్విట్ ఇండియా ఉద్యమం వచ్చింది. విజయమో, వీరస్వర్గమో తేల్చుకోవల్సిన సమయం రానే వచ్చింది. దేశనాయకులు అందరినీ జైలులో బంధించారు. దేశవ్యాప్తంగా ప్రజలు ఎదురుతిరిగారు. జైలు నుంచి తప్పించుకుని శ్రీ జయప్రకాష్ నారాయణగారు ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నారు. ఐదుగురు సభ్యులతో ఆంధ్రరాష్ట్రంలో ఉద్యమసారధ్య సంఘం ఏర్పడింది. అందులో ఈమెను శాసన ధిక్కారశాఖ మెంబరుగా నియమించారు. ఈమె రహస్యంగా అన్ని జిల్లాలు తిరుగుతూ ప్రజలను ఉద్బోధిస్తూ, చైతన్యపరుస్తూ, శాసనధిక్కారం చేయించారు. దీంతో పోలీసులు ఈమెను వెంబడించేవారు. కానీ దేశభక్తుల అప్రమత్తతతో ఆమెను కాపాడేవారు. ఈ విధంగా ఉద్యమంలో తిరుగుతూ ప్రజలను రెచ్చగొడుతున్న కారణంగా చేబ్రోలులో ఆమె 1941లో స్థాపించి నడుపుతున్న జాతీయ మహిళావిద్యాలయ విద్యార్థినులను కూడా అరెస్టు చేసేవారు. అయినా తన ప్రయత్నం మాత్రం విరమించుకోలేదు.

సూర్యదేవర రాజ్యలక్ష్మీగారు 1945 అక్టోబరు 2న గాంధీజీ జయంతి సందర్భంగా చేబ్రోలులో ఆంధ్రరాష్ట్ర మహిళారాజకీయ పాఠశాలను ప్రారంభించారు. శ్రీమతి భారతీరంగాగారు కూడా ఆ పాఠశాల కమిటీ అధ్యక్షులుగా ఉంటూ ఈమెకు సహకరించారు. ఈ రాజకీయ పాఠశాల కారణంగా అనేకమంది రాజకీయ నాయకులు, దేశభక్తులు ఆ ఊరికి రావడం, ప్రజలకు చైతన్య పరచడం, ఉత్తేజపరచడం జరిగింది.

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పటికీ నైజాము ప్రజలకు విముక్తి కలగకపోవడంతో అక్కడి ప్రజలలో చైతన్యం కలిగించడానికి కూడా రాజ్యలక్ష్మీగారు నడుం బిగించారు. టంగుటూరి సూర్యకుమారితో కలిసి పాటల కచ్చేరీల ద్వారా చందాలు, విరాళాలసేకరణతో రాజ్యలక్ష్మీదేవిగారు ధనసహాయం చేస్తూ, వ్యక్తిగతంగా అక్కడే ఉండి ప్రచారాన్ని తీవ్రతరం చేసారు. 1948 సెప్టెంబరులో పోలీసు చర్య ముగిసి హైదరాబాద్ సంస్థానం స్వతంత్ర భారతదేశంలో విలీనం అయ్యేవరకూ ఈమె అక్కడే ఉండి మాట నిలుపుకున్నారు. ఆ తరువాత మద్రాసు నుండి భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ విభజన ఉద్యమంలోనూ తనదైన పాత్రను పోషించారు.

ఈమె ఎంతో ధైర్యవంతురాలు, దేశభక్తురాలు, స్వాతంత్ర్య సమరయోధురాలు కనుకనే 1977వ సంవత్సరంలో భారతప్రభుత్వం అండమాన్ నికోబార్ దీవులలో ఏర్పాటుచేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణకు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖులలో 60 మందిని ఎంపిక చేయగా, వారిలో మహిళలు కేవలం నలుగురే ఉండగా.. ఆ నలుగురిలో ఈమె కూడా ఒకరుగా ఉన్నారంటే ఈమె గొప్పతనం మనం అర్థం చేసుకోవచ్చును.

**ఆధార గ్రంథాలు :**

1. స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు మహిళలు – డా॥ వాసా ప్రభావతి
2. స్వాతంత్రసమరంలో ఆంధ్ర మహిళలు – డా॥ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్
3. కవయిత్రుల కవిత్వంలో స్త్రీ మనోభావాలు – పి. లక్ష్మి
4. అంతర్జాల సమాచారం.

# కనుపర్తి వరలక్ష్మమ్మ కథ – విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమం

డా॥ యస్.సి. సంజీవ రెడ్డి, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జమ్మలమడుగు, కడప జిల్లా, సెల్. 92904 47642

**సారాంశం :** “నా జీవము ధర్మము నా మతము నీతి, నా లక్ష్యం సతీ శ్రేయము – ఈ మూటిని సమర్థించుటకే నేను చేత కలము బూనితిని” అని ప్రకటించుకొని కనుపర్తి వరలక్ష్మమ్మ జీవితాంతం ఆ మాటను నిలుపుకున్నారు. ఆ బాటనే నడిచారు. కాంగ్రెస్ పార్టీ సభ్యురాలై స్వాతంత్రోద్యమ కార్యకలాపాలలో పాల్గొన్న దేశభక్తురాలు వరలక్ష్మమ్మ ఆధునిక తెలుగు కథకు “దిద్దుబాటు” ద్వారా 1910 అద్యుడైన గురజాడ తరువాత పదునైదు సంవత్సవములకు కథారచన కొనసాగించిన తొలితరం రచయితలలో ఒకరు. విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమాన్ని ‘ఐదు మాసముల ఇరువరి దినుములు’ కథలో అద్భుతంగా చిత్రించారు.

**ఐదు మాసముల ఇరువది దినములు – విదేశీవస్త్ర బహిష్కరణ :** కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన సుప్రసిద్ధ స్వాతంత్ర్యోద్యమకథ ఐదు మాసముల ఇరువదిదినములు. ఈ కథలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా నిర్వహించిన విదేశీ వస్త్ర బరిష్కణము ముఖ్యమైన అంశము. కథలో గోపాలరావు, రుక్మిణి దంపతులు. వారు నిర్వహించిన విదేశీ – వస్త్ర బరిష్కరణము ఇందులోని యితివృత్తం. ఈ కథలో గోపాల రావును వర్ణిస్తూ రచయిత్రి “సన్నని గోరంచు ధోవతులు, మెత్తని పట్టుచొక్కాయిలు. పాముకుబుసములాగు మిసమిసలాడే జరీ ఖండువాలు తప్ప వేరొక వస్త్రమే వాడి యెరుగడు” అంటుంది రచయిత్రి. గాంధీసత్యాగ్రహ పిలుపు నందు కొనిన విద్యార్థులలో గోపాలరావు గారు ఒకరు. స్వాతంత్రోద్యమకాలంలో అనేక మంది విద్యార్థులు, సంపన్నులు, రచయితలు, కవులు మొద్దైలన అనేక మంది తమవృత్తులను త్యజించి ఉద్యమములోకి పరుగు తీసిన వారిలో గోపాలరావు గారు ముఖ్యులు. స్వాతంత్రోద్యమంలోకి ఇంటిలోని మగవారు వెలితే, ఇంటిపట్టునే ఉండి చక్కగా గృహిణి బాధ్యతలు నిర్వహించిన స్త్రీలు అనేకం ఉన్నారు. ఈ కథలో గోపాలరావు భార్య రుక్మిణి గృహిణి భాద్యతలతో పాటు, భర్త ఎంచుకున్న మార్గాన్ని ఆమె కూడా అనుసరిస్తూ ఉద్యమాన్ని నిర్వర్తించిన పాత్రగా ఈ కథలో రుక్మిణి కనిపిస్తుంది. రుక్మిణి గర్భవతి అయిన తరువాత పురిటికి పుట్టింటికి వెళ్లిపోయింది. పుట్టింటికి వెళ్లి కుమారుని గని, ఎనిమిది మాసములైనను భర్త నుండి ఎటువంటి కబురులేదు. రుక్మిణి తండ్రిగారే బారసాల చేసి రుక్మిణిని పిల్ల వాడితో సహా అత్తగారింటిలో వదిలి వెళ్లినాడు.

ఆరోజు గోపాలరావు విదేశీ వస్త్ర దుకానముల వద్ద పికిటింగు జరిపి అలిసిపోయి మధ్యాహ్నం పన్నెండు గంటలకు యింటికి చేరాడు. ఇంట్లో భార్యను చూసి ఈ రోజు తన భార్య ఇంటికి వస్తుందని ఉత్తరము వ్రాసిన విషయం గుర్తుకుతెచ్చుకున్నాడు. అయినను తన భార్య, కుమారుడు ధరించిన విదేశీ వస్త్రాలను చూసిన గోపాలరావుకు కోపము, అసహ్యాము కలిగాయి. అయితే ఆరోజు రాత్రే గోపాలరావును పోలీసులు అరెస్టుచేసి జైలుకు తరలించారు. విదేశీ వస్త్ర బహిష్కరణ కారణంగా అతనికి ఆరు మాసములు జైలు శిక్ష పడింది. భర్త జైలుకు వెళ్లిన తరువాత రుక్మిణికి ఇల్లంతా అరణ్యమైపోయింది. తన భర్తకు కుమారుని చూపి ఆనందపరచవలెననెడి తన కోరిక తీరకుండానే భర్త దూరమైనాడు. తన భర్త విదేశీ వస్త్ర బరిష్కరణోద్యమంలో ఉండగా తాను తన బిడ్డ విదేశీ వస్త్రాలు ధరించడం, అతనికి ఇష్టం లేదన్న విషయం ఆమె గ్రహించింది. రుక్మిణి ధనవంతుల ఇంట్లో పుట్టి పెరిగింది. తన తండ్రి గొప్ప ఉన్నతోద్యోగి ఆమెకు స్వాతంత్రోద్యమం, విదేశీవస్త్రాలు బహిష్కరణ మీద పెద్దగా అవగాహన కూడా లేదు. తన భర్తకు విదేశీ వస్త్ర బహిష్కరణ కారణంగా జైలుకు వెళ్లడము, విదేశీ వస్త్రాలు బహిష్కరించిన మాత్రన చేతికి బేడీలు వేసి జైలుకు తీసుకెల్లడము ఆమె జీర్ణించుకోలేక పోయింది. ఆమెలో కూడా బ్రిడిష్ వారిపై వ్యతిరేకతాభావం, ఉద్యమస్ఫూర్తి స్పష్టంగా కనిపించాయి.

సంక్రాంతి పండుగ సందర్భంగా రుక్మిణి అత్తగారు ప్రతి సంవత్సరం లాగే ఇంటిలో సావిత్రీ వ్రతం నోచుకొమ్మని రుక్మిణికి చెప్పింది. అయితే ఆ వ్రతం జరుపడానికి చాలా మంది స్త్రీలను ఇంట్లోకి పిలవాలి. అయితే వారందరూ విదేశీ వస్త్రాలు ధరించి వస్తే తన భర్తకు ఇష్టంలే పని చేసినట్లవుతుందని ఆమె తను చేసే వ్రతానికి ఇంటికి వచ్చే స్త్రీలను ఖద్దరు ధరించి రావలసినదిగా షరతు విధిస్తూ పిలిచింది. ఈ విధంగా పిలవటం వలన వ్రతానికి అనుకొన్నంత మంది రాలేదు. ఎనిమిది దినములుగా వ్రతం నిర్విఘ్నంగా సాగింది. పూజలు చక్కగా నిర్వహించారు. తెల్లవారితే తొమ్మిదవ దినంలో వ్రతం పూర్తి అవుతుంది. అయితే ఆరోజు

రాత్రి ఎనిమిది గంటలకు గోపాలరావు రైలు బండిలో ఊరికి వచ్చాడు. జైలులో అతని సత్ప్రవర్తన కారణంగా పన్నెండు రోజులు ముందే జైలు నుండి విడుదలయ్యాడు. ఈ విషయం రుక్మిణికి తెలియదు. ఇల్లంతా సావిత్రీ దేవీ పూజతో కలకలలాడుతోంది. అయితే ఆ ఇంట్లోకి గోపాలరావు వచ్చాడనే చిన్న కలకలము బయలుదేరింది వెంటనే రుక్మిణి సావిత్రి దేవి కోసం తయారు చేసిన మాలను తీసుకొని భర్తకు ఎదురుగా వెళ్లిది ఆ సమయంలో ఆమెకు అది దేవతకోసం చేయించిన మాల అనే విషయం గుర్తుంకు రాలేదు. ఆ దృష్యాన్ని భర్త చూశాడు. ఆయన సందేహంతో ఆ మాల విదేశీ దారంతో కట్టినదేనా అని రుక్మిణిని అడిగాడు. ఆమె తన భర్తతో ఈ రోజుకు నేను విదేశీ వస్త్రాలను త్యజించి ఐదుమాసముల ఇరువది దినములైనదని భర్తకు తెలిపినది ఇది రుక్మిణి కథ. ఈ కథలో ఉద్యమ కాలం నాటిసన్ని వేశాలను రచయిత్రి అద్భుతంగా చిత్రించింది. భర్త ఉద్యమంలో పాల్గొని జైలుపాలైనా తన భర్త విధిని సక్రమంగా నిర్వహించిన పాత్రగా ఈ కథలో రుక్మిణి కనిపిస్తుంది. ఉద్యమ కాలంలో స్త్రీలు పురుషులకు ఏమాత్రం తీసిపోరని ఈ కథ వివరిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**


1. శారద లేఖలు – కనుపర్తి వరలక్ష్మమ్మ
2. కథాస్రవంతి – కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు
3. భారతదేశ చరిత్ర – తెలుగు అకాడమి రచన

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# సహాయ నిరాకరణోద్యమంలో సుశీల పాత్ర

ఈ. కుమరేషన్, పరిశోధక విద్యార్థి, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

సహాయ నిరాకరణోద్యమం భారత స్వాతంత్ర్య సమరంలో మహాత్మగాంధీ నేతృత్వంలో జరిగిన ఒక ప్రధాన ఉద్యమం. బ్రిటిషు ప్రభుత్వపు వెన్ను విరిచిన ప్రజా ఉద్యమం. 1920 సెప్టెంబరు 4న మొదలై 1922 ఫిబ్రవరిలో 12 న ముగిసింది. ఆంగ్లేయులు ప్రభుత్వాన్ని పోషించే అన్ని రకాల పనుల నుంచి భారతీయులను తప్పుకోమని గాంధీజీ ప్రజానికాన్న కోరాడు. బ్రిటిష్ పరిశ్రమలు, విద్యా సంస్థలు మరియు విదేశీ వస్తువుల వినియోగాన్ని నిషేదించి స్వదేశీ వస్తువుల వినియోగాన్ని పెంపొందించిన ఉద్యమం. ఆంధ్ర దేశంలో ఈ ఉద్యమం చాల ప్రభావితం చేసింది. ఆ ఉద్యమ నేపథ్యంతో సాగిన చలంగారి సుశీల కథలో ఉద్యమం యొక్క రూపాన్ని చూడవచ్చు.

నారాయణప్ప గారు బ్రాహ్మణులు ఆయన సామాజిక సమానత్వం పాటిస్తాడు అందర్ని సమంగా చూస్తాడు. ఎటువంటి కుల, మత, వర్గ పట్టింపులు లేదు అందర్ని సమంగా చూసే ఉదాత్తమైన విలువల గల మనిషి. తనకు ఆస్తిపాస్తులు ఎక్కువగా ఉన్న ఏదొక పనిచేసుకుంటు సంతోషంగా గడుపుతుంటాడు. తన భార్య చాల అందమైనది. ఇద్దరిది ఆదర్శ దాంపత్యం. ఒకరొకరంటే ప్రాణంగా జీవిస్తూంటారు.

నారాయణపు సమాజంలో గొప్ప పలుకుబడి ఉన్న వ్యక్తి తమ ఊరిలోకి ఏ ప్రభుత్వ ఉద్యోగి వచ్చిన ముందు నారాయణప్ప గారి స్నేహం దీన్ని బట్టి ఆయన ఎంతో గొప్పవాడో తెలుస్తుంది. తన యింటినే క్లబ్బుగా మార్చేశాడు. ప్రభుత్వ ఉద్యోగులందరు అన్ని వర్గాలవారు ఆ యింట్లో కబుర్లు, చెప్పుకుంటూ, చీట్లాటలు మొదలైన ఆడుతుంటారు. సుశీల కూడా వాళ్ళందరికి కలిసి సరదాగా కబుర్లు చెబుతూ, దేశంలో జరిగే స్వాతంత్ర్య ఉద్యమాలు గూర్చి చర్చించేది, ఆ కాలంలో న్యూస్‌పేపర్లు చాలా హడావిడి చేస్తూ వుండేవి. సత్యాగ్రహం, రౌలట్ యాక్టు ఇవన్నీ అయిపోయి పంజాబు వదలకాలం వొస్తుంది. దేశమంతా అల్లకల్లోలమయ్యేటట్టు కనపడుతోంది. దేశం కోసం పోరాడే దేశభక్తుల గూర్చి తెలుసుకోవడం సుశీలకి అదొక సంతోషంగా భావించేది.

నారాయణప్ప గారికి "దేశంలో ఏమి జరుగుతున్నదో బాగా తెలుసు దేశంకోసం జరిగే పోరాటం గూర్చి ప్రభుత్వ ఉద్యోగులతో చాలా చర్చలు జరిగేవి. సుశీల వ్యూహాల చాలమట్టుకు గవర్నమెంటు ఉద్యోగస్తుల వల్ల ఏర్పడినవే. ఆమెకి విశాలమైన దృష్టి లేదు. నారాయణప్ప గారికి ఊరికి కొత్తగా ఒక తురక పోలీసు సూపరింటెండెంట్ వొచ్చాడు. సులేమాన్ అందమైనవాడు. ఆయన స్నేహం కోసం వచ్చి సుశీలను ప్రేమిస్తాడు. సుశీల ముందు ఇది తప్పు అనుకుంటుంది. సులేమాన్ ప్రేమకి ఆమె లొంగిపోతుంది సుశీల. తనలో తాను చాల మదనపడుతుంది. నారాయణపుగారితో అంతా చెబుదామనుకుంటుంది. చెప్పలేక, సులేమాన్‌తో సంతోషంగా గడుపుతుంది. నారాయణప్ప గారికి ఒకరోజు వాళ్ళ ప్రేమ వ్యవహారం తెలుసుకొని నేను చేసే పవిత్ర ఉద్యమేంటి. ఇక మీదట యిలా జరగకుండా చూసుకోండి. అని ప్రేమతో మందలిస్తాడు.

ఇంతలో దేశాన్నంతా వూగించేసే " నాన్‌కో – ఆపరేషన్ వొచ్చింది. దేశానికంతా ఆదేశంపై ఆదేశం వస్తోంది. అందరికన్నా ముందు నారాయణప్ప గారి మనసులో ఆ విషయాలు కలవరం కల్గించాయి. తన సూట్లు, మల్లుపంచాలు మానేసి, ఖద్దరు కట్టాడు. ఇంటి నిండా పంచమ జాతి నౌకర్లను పెట్టాడు. గాంధి పటాలు తగిలించాడు. ప్రొసెషనులలో గవర్నమెంటు గురించి అతి తీవ్రంగా విమర్శించెవారు. వీరి ధాటికి గవర్నమెంట్ నౌకర్ల భయపడి ఆయన స్నేహం మానేశారు. కాని సులేమాన్ మానలేదు కారణం సుశీలపై ప్రేమ వచ్చేయ్ నాతో యింకా నేనుండలేను నీవు లేక, నేను రాలేను ఆయన్ని వదిలి అంటూంది సుశీల.

నాన్‌కో – ఆపరేషన్ చాలా ఉధృతంగా సాగుతుంది. ప్రజలు తమ ధన, మాన, ప్రాణాలు సైతం త్యాగం చేస్తున్నారు. వార్తాపత్రికల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తూ ఉద్యమాన్ని ప్రజలలో భజనలు, కీర్తనలు మీటింగులు, ప్రొసెషనులు లెక్చర్లు,

సమ్మెకట్ల ద్వారా ఉద్యమాన్ని నడిపిస్తున్నారు నారయణప్ప దేశం కోసం చేసే ఉద్యమం చూసి అతని నిజమైన త్యాగము, యివన్ని సుశీలలో దేశభక్తిని కలిగించాయి. ప్రజలను స్వరాజ్యం కోసం పోరాటం ఉసికొల్పారని రాజద్రోహం క్రింద నారాయణప్పను అరెస్ట్ చేశారు. యివన్ని చూసి సుశీలలో దేశభక్తి పెరిగి యంగ్ ఇండియా , చదవటమూ, దేశంలో స్వరాజ్యం కోసం ఈ ఉద్యమాల అవసరమని తెలుసుకొని తను కూడ ఖద్దరు బట్టలు ధరించింది. తన వద్ద ఉన్న విదేశీ బట్టలన్నీ, పట్టుచీరెలను రోడ్డు మీద వేసి తగలేసింది. ఖద్దరు బట్టలమ్మే వాళ్ళతో కల్సి ఖద్దరు బట్టలు అమ్మింది. సులేమానుతో కూడ కొనిపించింది.

సుశీల సహాయ నిరాకరణోద్యమంలో ప్రవేశించడం నారాయణప్ప గారికి చాలా సంతోషం కల్గించాయి. స్పెషల్ కాన్ఫరెన్స్‌కి ఉత్తర భారతదేశం నారాయణప్ప వెళితే సుశీలనే ఆ ఉద్యమ బాధ్యతంతా వహించి ముందుండి నడిపించింది. కొందరు నాయకుల్ని అరెస్ట్ చేస్తే వారిని విడిపించింది. ఊరి ప్రజలంతా ఆమెను భక్తితో కొలిచారు. సుశీల అంత దేశ సేవ చేసింది. స్వరాజ్యం కోసం ఉద్యమాన్ని నడుపుతున్న సుశీలను చూస్తే సులేమాన్ కూడ పూజ్యాభావమూ, భక్తి ఏర్పడింది. సులేమాన్‌లో కూడ దేశభక్తిని కల్గించింది.

సుశీల వీటినన్నిటిని వదలి వచ్చేయ్ నాతో అని పిలిస్తే సులేమాన్. దేశం యిట్లా అశాంతితో, అలజడితో, త్యాగాలతో స్వరాజ్యం కోసం ప్రజలు పోరాడుతున్నారు. అనేకమంది స్త్రీలు తమ భర్తలు జైల్లో మగ్గుతుంటే, నేను నీతో వచ్చిన సౌఖ్యమనుభవించలేను. నన్ను దేశం కోస సేవ చెయ్యనివ్వు అంటుంది. మాకు డిసెంబరు 31 వ తారీఖు స్వరాజ్యం వస్తుంది. అప్పుడు నీ పని ఊడిపోతుంది. అప్పుడు యిద్దరం సంతోషంగా జీవిద్దామంటుంది సుశీల.

నారాయణప్పగారు ఉత్తర ఇండియా నుండి వచ్చారు. సుశీల పొరుగూరుకు వెళ్లి ఖద్దరు బట్టలు అమ్మింది. నాన్ –కో – ఆపరేషన్ పార్టీలెక్కడక్కడ జరిగిన అందులో సుశీల కీలక పాత్ర పోషించింది. కాంగ్రెస్ నుండి వచ్చిన పదిహేను రోజుల్లో నారాయణప్ప గారిని మరల అరెస్ట్ చేస్తే ఊరంతా ధర్నాలు చేశారు. ఈ ఉద్యమంలో యెడతెరపి లేకుండా పనిచెయ్యడం వల్ల అనారోగ్యానికి పాలైతే నారాయణప్ప, సుశీలలో అతని త్యాగాన్ని చూసి అతనిపై గౌరవంతో ఉద్యమంలో యింకా చురుగ్గా పనిచేసింది. తనను కూడా అరెస్ట్ చెయ్యమని అడిగిన గొప్ప దేశభక్తురాలు.

"స్వరాజ్యం పని యింక మానెయ్యి మరి...

ఈ ప్రచారం ఈ ముతక బట్టలు" అన్నాడు. సులేమాన్, దేశంలో స్వరాజ్యం ఉద్యమం పోతే పోవచ్చు కాని నా హృదయంలోంచి పోదు నా జీవిత లక్ష్యమే మారింది. యింతకు ముందు మనిషి కాను. నా జీవితానికో గొప్ప అర్ధమొచ్చింది. దేశ సేవ చేసుకుంటాను జీవితానికో ఆదర్శాన్ని ఆనందాన్ని, ఆసక్తిని యిచ్చింది. యింతకు ముందు నీహోద ఉద్యోగం చూస్తే గౌరవం ఉండేది. కాని యిప్పుడా నా అభిప్రాయం అంత తిండి కోసం బానిసత్వమని ఆ యూనిఫారం అంత చూస్తే నాకు పంజాబు, వధలు నిరాయుదుల్ని కాల్చడం గుర్తుకొస్తున్నాయి అంటుంది సుశీల, ఒకప్పుడు ఆరాధించిన హెూదాను చూస్తే యిప్పుడు తనకి దేశం కోసం అశ్రువులు బాసినా వారి త్యాగాల గుర్తుకొస్తున్నాయి. ఎంత పరివర్తన చెందిందో దేశం కోసం సేవ చెయ్యటమే తన జీవిత పరమావదిగా భావించింది.

నారాయణప్ప గారు క్షయరోగంతో బాధపడుతుంటే ఇక్కడుంటే చచ్చిపోతాడని డాక్టర్లంటే మదనపల్లికి పిలుచుకువెళ్లి తన ప్రాణాలను అడ్డుపెట్టి చంటి పిల్లవాణ్ణి అత్యంత ప్రేమ గల తల్లి కూడా అంత శ్రద్ధతో చూసి ఉండదు. అంత ప్రేమతో పరిచర్యలు చేస్తూ ఉంటుంది. ఆమె కళ్ళలోంచి ప్రేమ, దయ వొలికి పోతున్నాయి. సులేమాన్ అక్కడ కూడ వచ్చి నాతో వచ్చేయ్ అంటూ పిలుస్తాడు. సుశీలా నారాయణప్ప గారి పాదాల దుమ్ము నెత్తిన వేసుకోవడానికి తగినవారుకాము మనము. ఆయనపై భక్తితో కూడిన ప్రేమ, నా దేశం, నా ప్రజలు కోసం తన సర్వస్వాన్ని అర్పించారు. ఆయన ఊపిరి ఉన్నంతవరకు సేవ చేస్తాను. ఆయనతోనే నేను మరణిస్తాను. ఆయన లేని జీవితం నాకొద్దు నన్ను వదిలి వెళ్ళిపో అంటుంది సుశీల.

ఒకప్పుడు ప్రేమయే జీవితమనుకుంటుంది. తనలో దేశభక్తి అంకురించడంతో ఆ ప్రేమను వద్దనుకుంటుంది. నారయణప్ప వద్దకు వస్తుంది. ఆయన సుశీలతో నన్ను వదిలి నీ సౌఖ్యాన్ని చూసుకో అంటాడు. దానికి నాకు ఏలాంటి బాధ లేదు. నేను మీ సేవ చెయ్యడానికి తగివుంటె అదే నాకు స్వర్గంగా భావిస్తున్నాను. యిలాంటి అదృష్టం నన్ను వరించినందుకు చాల సంతోషపడుతున్నా అంటు తన ఆనందాన్ని వెలిబుచ్చింది సుశీల.

సహాయ నిరాకరణోద్యమంలో సుశీల ప్రముఖ పాత్ర వహించింది. ఉద్యమాన్ని ముందుండి నడిపించిన నారాయణప్ప గారి త్యాగానికి తను కూడ దేశం కోసం తన సుఖ సంతోషాలను త్యాగం చేసి నారాయణప్ప గారి గొప్ప వ్యక్తిత్వానికి సంతసించి ఆయనకు సేవచేసుకుంటుంది. దేశం కోసం పోరాడిన వ్యక్తికి సేవ చేసుకోవటం కూడ నిజమైన దేశభక్తి అని సుశీల ద్వారా మనం గ్రహించవచ్చు. సుశీలను సహాయ నిరాకరణోద్యమం చాల మార్పుకు గురి చేసింది. గొప్ప దేశభక్తురాలుగా మార్చింది.

**ఆధార గ్రంధాలు :-**

వందేళ్ళ కథకు వందనాలు – గొల్లపూడి మారుతీరావు

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# వీరమంగై మహారాణి వేలు నాచియార్

డా. కరణం శ్రీనివాసులు రెడ్డి, తెలుగు అధ్యాపకులు, సంజయ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీలేరు. చరవాణి: 9493212454

ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందనేది అందరూ అనే మాట. ఒక్క పురుషుడి విజయం వెనకే కాదు ప్రతి సామాజిక పరిణామంలోనూ, స్వాతంత్రోద్యమంలోనూ, సమాజాన్ని సన్మార్గం వైపు నడిపించడంలోనూ స్త్రీలు వెనుకే కాదు ముందుండి నడిపించడం కూడా మనం చరిత్రలో చూడవచ్చు. అలా ఇక సమాజ విజయం వెనుకా ముందూ కూడా స్త్రీలు ఉంటారు. కానీ చరిత్ర పురుషుడి దృక్పథం నుండి రాయబడుతుంది కనుక ఆ దృక్ 'పథం'లో స్త్రీ పాత్ర మసక మసకగాను లేక పూర్తిగా కనబడకపోయి ఉండొచ్చు. అందువల్ల చారిత్రక పరిణామంలో, సామాజిక అభివృద్ధిలో సామాజిక మార్పులో స్త్రీ పాత్ర ఏమిటి అనే విషయం పైన ఇంకా మనం పరిశోధించుకోవాల్సిన అంశాలు, నిర్ధారించుకోవాల్సిన సత్యాలు అనేకం ఉన్నాయి. మహిళల పాత్ర లేకుండా స్వాతంత్రం చరిత్రను నిర్మిస్తే అది అసంపూర్ణమే అవుతుంది. స్వాతంత్ర ఉద్యమ బీజం దగ్గర నుండి స్వాతంత్ర సిద్ది వరకు ఎందరో భారతీయ మహిళా మణులు స్వాతంత్రోద్యమంలో తమ మాన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పురుషులకు దీటుగా పోరాడారు. చాలా సందర్భాల్లో వారే స్వయంగా కత్తి పట్టి కదన రంగంలో దూకి బ్రిటిష్ వారిని అనేక యుద్ధాల్లో ఓడించారు. ఉద్యమం సామాన్య ప్రజల్లోకి వెళ్లిన తర్వాత ప్రజల్ని ముందుండి నడిపించారు. అలా మహారాణి వేలు నాచియారు మొదలు క్విట్ ఇండియా ఉద్యమ సారధ్యాన్ని చేపట్టిన అరుణ అసఫ్ అలీ వరకు వేలాదిమంది స్త్రీలు స్వాతంత్రోద్యమంలో సమిధలై ఉద్యమ సిద్ధికి పాటుపడ్డారు.

స్వాతంత్రానికి పూర్వం భారతదేశంలో స్త్రీ విద్యా రాజకీయపాలనా రంగాల్లో చురుకైన పాత్ర పోషించినట్టు సింధులోయ నాగరికత ఆర్యులు నాగరికత నుండి మనకు ఆనవాళ్లు దొరుకుతున్నాయి. కానీ కాలక్రమంలో కులమత చట్రంలో స్త్రీ బందీగా మారడంతో మత చాందస భావాలు అధికం కావడంతో స్త్రీపై కట్టుబాట్లు నిబంధనలు పెరిగిపోవడంతో మధ్యయుగాల తర్వాత స్త్రీలు చాలా రంగాల్లో పరిమితమైన పాత్రను పోషించారని చెప్పవచ్చు. 16 శతాబ్దంలో భారతదేశానికి ఐరోపా వారి రాక మొదలైంది. వ్యాపారంతో మొదలైన వారి దురాక్రమణ పర్వం 19వ శతాబ్దం నాటికి భారతదేశాన్ని భౌగోళికంగానూ, రాజకీయంగాను వివిధ మాయోపాయాలతో, సైనిక శక్తితో వారి వశం చేసుకున్నారు. ఆ తర్వాత వారి పాలనా సౌకర్యం కోసం, భారతదేశ సంపదను దోచుకోవడం కోసం రవాణా, తంతి తపాలా, విద్య వంటి సౌకర్యాలు కల్పించబడ్డాయి. వారికి తొత్తులుగా పనిచేయడానికి గుమాస్తాలను తయారు చేసుకోవడానికి ఆంగ్ల విద్యా విధానాన్ని ప్రవేశపెట్టారు. అలా మొదలైన ఆంగ్ల విద్య భారతీయుల్లో కొత్త ఆలోచనలను, హేతువాద దృక్పథాన్ని, ప్రశ్నించే తత్వాన్ని, సంఘ సంస్కరణాభిలాషను పెంపొందింప చేసింది. ఇది క్రమంగా స్త్రీవిద్యకు దారితీసింది. అలా తిరిగి స్త్రీ శక్తిని, చైతన్యాన్ని పొందింది.

సుదీర్ఘమైన భారతదేశ చరిత్రలో స్వాతంత్ర ఉద్యమం ఒక ఉజ్వల ఘట్టం. దాదాపు 200 సంవత్సరాలు సుదీర్ఘంగా సాగిన ఈ చారిత్రాత్మక ఉద్యమంలో ఎందరో మహిళామణులు కీలక భూమికను పోషించారు. భారతదేశ స్వాతంత్ర సిద్ధిని పొంది 75 సంవత్సరాలు పూర్తికావస్తున్నందున ఈ 75 సంవత్సరాల స్వతంత్ర భారతాన్ని ఘనమైన ఉత్సవంగా జరుపుకోవాలని భారత ప్రభుత్వం భావించి, 12 మార్చి 2021 నుండి 15 ఆగస్టు 2023 వరకు 75 వారాల పాటు 'ఆజాది కా అమృత మహోత్సవ్' పేరుతో దేశవ్యాప్తంగా ఉత్సవాలను జరుపుతున్నారు. ఈ సందర్భంగా వారిని గుర్తు తెచ్చుకోవడం వారి పోరాట స్ఫూర్తిని, త్యాగనిరతిని మరొకసారి మననం చేసుకోవడం మన అందరి కర్తవ్యం. వేలాదిగా ఉన్న ఆ మహిళల్లో కొందరిని ఉదహరిస్తాను. మహారాణి వేలు నాచియర్, రాణి చెన్నమ్మ, రాణి గైడిన్లు, ఝాన్సీరాణి లక్ష్మీబాయి, రామ్ఘర్ మహారాణి, రాణి జిందాన్ కౌర్, రాణి తేజ్ భాయ్, బైజాబాయి చౌహాన్, రాణి తపస్విని, మహారాణి బేగం హజరత్ మహల్, రాణి దుర్గాబాబి వంటి సంస్థాన రాణులు స్వయంగా యుద్ధ రంగంలో దిగి వీరోచితంగా ఈస్ట్ ఇండియా కంపెనీ సైనికులపై పోరాడారు. 1905 తర్వాత సరోజినీ నాయుడు, కస్తూర్బా గాంధీ, విజయలక్ష్మి పండిట్, అన్నిబిసెంట్, దుర్గాబాయి దేశ్ ముఖ్, ఉషామహత, కమలా నెహ్రూ, మేడం

బికాజి కామ, సుచేత కృపలాని, రాజకుమారి అమృత కౌర్, కమలాదేవి చెటోపాధ్యాయ, సిస్టర్ నివేదిత, కెప్టెన్ లక్ష్మీ సహగల్, అరుణ అసఫ్ అలీ తెలుగువారైన దువ్వూరి సుబ్బమ్మ, మాగంటి అన్నపూర్ణమ్మ ఇలా లెక్కకు మిక్కిలి ఉన్నారు.

ఈ సందర్భంగా ప్రత్యేకించి 'వీరమంగై మహారాణి వేలు నాచియార్' గురించి తెలియజేయడం ఈ వ్యాసం ప్రధానోద్దేశ్యం. 1857 స్వాతంత్ర సమరానికంటే ముందే బ్రిటిష్ వారితో వీరోచితంగా పోరాడి విజయం సాధించిన వీర వనిత మహారాణి వేలు నాచియార్. బ్రిటిష్ వారిని ఓడించిన మొదటి రాణిగా ఈమె పేరుగాంచినది. ఈమె 3 జనవరి 1730 సంవత్సరంలో తమిళనాడు శివగంగ సంస్థానంలోని రామనాథపురంలో జన్మించారు. తల్లిదండ్రులు ముత్తతాళ్ నాచియార్, చల్ల ముత్తు విజయ రఘునాథ సేతుపతి. ఈ దంపతులకు వేలు నాచియార్ ఒక్కగానొక్క కూతురు. బాల్యం నుండి వేలు నాచియార్‌కు కలరి, సిలంబం, గుర్రపుస్వారీ, కత్తిసాము, విలువిద్య వంటి యుద్ధ విద్యలన్నీ నేర్పించారు. అంతేకాక ఆమె గొప్ప విద్యావంతురాలు కూడా. ఫ్రెంచి, ఉర్దూ భాషల్లో ప్రావీణ్యం సంపాదించింది. 1746లో శివగంగై సంస్థానాధీశుడైన ముత్తు వడుగనాథ పెరియ వుడయ దేవర్‌ను వివాహమాడింది. వీరికి ఒక కుమార్తె. పేరు వెల్లాచి.

ఒకరోజు కలైయార్ కోవెల్లో ఉండగా ఈస్ట్ ఇండియా కంపెనీ వారు మోసకారైన ఆర్కాటు నవాబు సహాయంతో ముత్తు వడుగనాథ దేవర్ను అంతమొందించారు. అంతటితో వదలక ఆర్కాట్ నవాబు వేలు నాచియార్ ను కూడా చంపి, వంశమే లేకుండా చేసి, శివగంగను ఆక్రమించుకోవాలని పథకం వేశాడు. ఆ సమయంలో అదృష్టం కొద్దీ తల్లీకూతుళ్ళిద్దరూ కొల్లంగుడి దేవాలయంలో ఉన్నారు. సంస్థానానికి నమ్మకస్తులైన మార్తాడు సోదరులు కంపెనీ సైన్యంతో పోరాడుతూనే కొల్లం గుడి చేరుకుని రాణిని, వెల్లాచిని తీసుకుని దిండిగల్ వైపు ప్రయాణించారు. రాణి వేలు నాచియార్ తన భర్త అంత్యక్రియలు కూడా చూడలేకపోయింది. ఈ సందర్భంగా కొల్లంగుడిలో రాణికి రక్షణగా ఉన్న ఆమె అంగరక్షకురాలు ఉడైయాళ్ మరియు మహిళా సైనికులు ఆర్కాట్ నవాబుకు బందీలుగా చిక్కారు. రాణి అనుపానులు చెప్పాలని ఎంతగానో హింసించారు. అయినా చెప్పని ఉడైయాళ్ తల నరికేశాడు క్రూరుడైన ఆర్కాట్ నవాబు, ఈ విషయం వేలునాచియార్ కు తెలిసింది. ఉడైయాళ్ సంస్మరణార్థం ఆమె పేరుమీద ఒక మహిళా సైనిక దళాన్ని ఏర్పాటు చేసింది. దానికి కుయిలీ అనే సైనికురాలని నాయకురాలుగా నియమించింది. తిరిగి శివగంగ రాజ్యాన్ని చేజిక్కించుకోవాలంటే ఇతరుల సహాయ సహకారాలు కూడా అవసరమని గ్రహించింది వేలు నాచియార్. దాంతో మైసూరు పాలకుడైన హైదర్ అలీ సహకారం కోరింది. ప్రమాదమని తెలిసినా మైసూరుకు ప్రయాణించింది. తన ఉర్దూభాషా ప్రావీణ్యంతో హైదరాలిని ఒప్పించి,అతని దళపతి అయిన సయ్యద్ కర్కిని, ఐదువేల పదాతిదళాన్ని మరియు ఐదువేల అశ్వికదళాన్ని తన వెంట తెచ్చుకుంది.

బలోపేతమైన సైన్యంతో ఒక్కొక్క ప్రాంతాన్ని జయిస్తూ వచ్చింది. కానీ శివగంగ కోట మాత్రం ఇంకా స్వాధీనం కాలేదు. సయ్యద్ కర్కీ కూడా ఈ విషయమై చేతులెత్తేశాడు. ఉడయాళ్ దళాధిపతి అయిన కుయిలీ మాత్రం పట్టు వదలలేదు. విచారంగా ఉన్న రాణికి ఒక ఉపాయాన్ని చెప్పింది. 'వచ్చే విజయదశమికి చుట్టుపక్కల గ్రామాల మహిళలు పూజలు చేయడానికి శివగంగై కోటలోని కలయార్ గుడికి వెళ్తారు. ఆ సమయంలో ఉడైయాళ్ సైన్యంలో సుశిక్షితులైన మహిళా సైనికులు కొంతమంది రహస్యంగా ఆయుధాలు ధరించి గ్రామ మహిళల్లో కలిసిపోయి కోట లోపలికి చేరుకోవాలి. ఆ తర్వాత అతను చూసి దెబ్బ కొట్టి, కోట తలుపులను బ్రద్దలు చేసి రాణి వేలు నాచియార్ కోటలో ప్రవేశించేందుకు అవకాశం కల్పించాలి అన్నది ఆ ఉపాయం'. అనుకున్నట్లుగానే విజయదశమి రోజు రానే వచ్చింది. కుయిలీ నేతృత్వంలో మహిళా సైనికులు విజయదశమి రోజున పూజలు చేసే మహిళల్లో కలిసిపోయి కలైయార్ ఆలయం చేరుకున్నారు. పూజ ముగుస్తుందనగా కుయిలీ "లేవండి సైనికులారా" అన్న అరుపుతో ఒక్కసారి ఆయుధాలు తీసి ఈస్ట్ ఇండియా కంపెనీ సైనికులను నిర్జించడం మొదలుపెట్టారు ఉదయార్ మహిళా సైనిక దళం. కుయిలీ మాత్రం అక్కడే గుడిలో జ్యోతిని వెలిగించడానికి పెట్టిన నేతిని అమాంతం తన ఒంటిపై గుమ్మరించుకొని కత్తి తీసి అరుచుకుంటూ ఎదురొచ్చిన శత్రు సైనికులను నరుక్కుంటూ కోట గుమ్మం దగ్గరే ఉన్న ఆయుధాగారాన్ని చేరుకుంది. అక్కడ వెలుగుతున్న దీపాన్ని తీసుకుని శరీరాన్ని అంటించుకుంది. "నా రాణి విజయం కోసం" అంటూ మండుతున్న శరీరంతో

ఆయుధాగారంలోకి చొరబడింది. పెద్ద శబ్దంతో ఆయుధాగారంతోపాటు కోట తలుపులు కూడా బ్రద్దలయ్యాయి. కుయిలీ ఆత్మాహుతి దాడితో రాణి వేలు నాచియారుకు కోటలోకి ప్రవేశం సుగమం అయింది. రాణి కోటలోకి ప్రవేశిస్తూ కుయిలీని గురించి విచారించింది. ఆమె మరణ వార్త విని క్రుంగిపోయింది. సయ్యద్ కర్కి "మనం విచారంలో మునిగితే కుయిలీ ఆత్మాహుతికి అర్థం లేదని, పోరాటమే కయిలీకి మనం ఇచ్చే నివాళి" అని రాణికి చెప్పి కోటలో ప్రవేశించి ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యాన్ని సంహరించారు. దానితో కోట తిరిగి రాని వశమైంది ఇదంతా జరిగింది 1780లో.

ఆ తరువాత పది సంవత్సరాలు రాజ్యాన్ని పరిపాలించింది వేలు నాచియార్. 1790లో రాజ్యాన్ని తన కూతురు వెల్లాచికి అప్పగించింది. 1796 డిసెంబర్ 25న మహారాణి వేలు నాచియార్ తనువు చాలించింది. మహిళా సైన్యాన్ని ఏర్పాటు చేయడమే కాక మహిళగా వీరోచిత పోరాటాన్ని సలిపి భారత స్వాతంత్ర సమరానికి గొప్ప స్ఫూర్తిని అందించిన వీరమాత, వీరనారి మహారాణి వేలు నాచియార్. 2008లో భారత ప్రభుత్వం ఆమె సంస్కరణార్థం పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. 2014 జూలై 18న ఆనాటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత 'వీరమంగై వేలు నాచియార్ మెమోరియలు'ను శివగంగలో ప్రారంభించింది. ఆ తరువాత దాని పక్కనే అమరవీరవనిత 'కుయిలీ మెమోరియలు'ను కూడా నిర్మించారు. 1857 ప్రథమ స్వాతంత్ర సంగ్రామానికి మునుపే భారతదేశంలో ఒక వీరోచిత పోరాట గాథను, చరిత్రను సృష్టించింది వేలు నాచియారు. ఇప్పటికీ ఆమె పోరాటం భారతీయుల్లో స్ఫూర్తిని నింపుతూనే ఉంది.

# స్వాతంత్ర్య ఉద్యమం – మహిళా చైతన్యం

డా॥ దేవరపల్లి మంజునాథ, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు, శ్రీవాణి డిగ్రీ కళాశాల, అనంతపురం

భారతదేశంలో స్త్రీలు శతాబ్దాల తరబడి పురుషాధిక్యత క్రింద నలిగిపోయారు. సామాజికంగా అణిచివేయబడ్డారు. మత మూఢ నమ్మకాలు, సామాజిక ఛాందసత్వం అలీన హానికరమైన సాలెగూడెలో భారత సమాజం చిక్కుకుపోయింది. మాక్స్ వెబర్ దృష్టిలో హిందూ మతం "గారడి విద్య, అన్నింటిలోనూ ఆత్మ ఉన్నదనే విశ్వాసం, మూఢ నమ్మకాల సమ్మేళనంగా తయారైంది. మత బోధకులు ప్రజలకు తలపెట్టని ఆకృత్యం లేదు. ఇక స్త్రీల విషయంలో అయితే అత్యంత దయనీయం. పూజారుల కామ వాంఛల్ని సైతం తీర్చేందుకు మహిళలు తమను తాము అర్పించుకునే వరకు వెళ్లింది వ్యవహారం. ఆడపిల్ల పుట్టుకను స్వాగతించలేని పరిస్థితి. స్త్రీ శిశు హత్య సాధారణం. పెళ్లి అనేది సామాజిక అవమానాల నుండి కాపాడుకునే సాధనం. బెంగాల్‌లో ఓ వృద్ధ బ్రాహ్మణుడికి 200ల మంది భార్యలుంటే అందులో అందరికంటే చిన్న ఆమె వయస్సు 8 సం॥లు. ఎంతోమంది మహిళలకు వైవాహిక జీవితం నామమాత్రం. భార్యలు సతిని పాటించాలి. అందులో రాజా రామ్మోహన్ రాయ్ "ఏ శాస్త్రం ప్రకారమైనా ఇది హత్య" అని విమర్శించాడు'. స్త్రీలు సామాజికంగా అణచివేయబడ్డారు. పై వర్గాల స్త్రీల పరిస్థితి వ్యవసాయ మహిళల కంటే అధ్వాన్నం. వ్యవసాయ మహిళలు పురుషులతో కలిసి పనిచేస్తారు కనుక వారి కదలికలపై ఆంక్షలు తక్కువ. కొన్ని అంశాలలో వారు పై తరగతి మహిళల కంటే మంచి స్థితిలో ఉన్నారు.

19వ శతాబ్దపు మనవతా వాదం సమానత్వ భావాలతో ప్రభావితులైన సంస్కరణ వాదులు స్త్రీల స్థితి గతుల్ని అభివృద్ధి పరిచేందుకు ఉద్యమాలు ప్రారంభించారు. మహిళల్లో విద్యా వ్యాప్తి కొరకు, వితంతు పునర్వివాహాల కొరకు, వితంతు జీవన స్థితి మెరుగుదల కొరకు, బాల్య వివాహాలను అడ్డుకొనేందుకు, బహు భార్యత్వాన్ని అడ్డుకొనేందుకు అసంఖ్యాకంగా వ్యక్తులు, సంస్కరణ సంస్థలు, మత సంస్థలు తీవ్రంగా కృష చేశాయి. దీనికి తోడు ఆంగ్లేయ విద్య కూడా ప్రభావితం చూపింది. వైస్రాయి డఫరిన్ భార్య లేడి డఫరిన్ పేరు మీద డఫరిన్ ఆసుపత్రులు ప్రారంభమైన తర్వాత ఆధునిక వైద్య ప్రసూతి విధానాలు అందుబాటులోనికి తెచ్చే ప్రయత్నాలు జరిగాయి.

20వ శతాబ్దంలో సమరశీల జాతీయోద్యమం పెరుగుదల నుండి మహిళా విముక్తి ఉద్యమానికి మంచి ఊపు లభించడంతో స్వతంత్ర్య పోరాటంలో మహిళలు చాలా చురుకైన పాత్ర పోషించారు. వలస వాదానికి, పాలనకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సాంప్రదాయ కుటుంబాలు, ప్రగతిశీల కుటుంబాలు, పట్టణ, జిల్లా, గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన పెళ్లైన, పెళ్లి కాని, యువతులు, ముసలి వారు ఇలా మహిళలందరూ పాలుపంచుకున్నారు. వారి సంఖ్య తక్కువే అయినప్పటికి వారి భాగస్వామ్యం చాలా ముఖ్యమైనది. మహిళా భాగస్వామ్యం బ్రిటిష్ పరిపలనా హక్కును ప్రశ్నించింది. వాస్తవానికి జాతీయ ఉద్యమానికి ఊపిరి పోసిన 1857 సిపాయిల తిరుగుబాటులో ఝాన్సీ లక్ష్మీభాయ్ ప్రముఖ స్థానాన్ని పొందింది. రాజ్య సంక్రమణ సిద్ధాంతం అమలు జరిపి ఝాన్సీ సంస్థానాన్ని ఆక్రమించి ఆమెకు ఏటా 60 వేల రూపాయల భరణం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అక్రమ చర్యను ఆమె తీవ్రంగా నిరసించింది. దీనికి ప్రతిగా తిరుగుబాటులో పాల్గొని స్వయంగా యుద్ధంలో 8 రోజుల పాటు అసాధారణ శౌర్యాన్ని ప్రదర్శించింది. లక్ష్మీభాయ్‌తో పాటు ఆమె పరిచారికలు మందర, కషిలతో కలిసి యుద్ధాన్ని కొనసాగించింది. ఈ ముగ్గురు మహిళలు స్ఫూర్తిదాయకం. లక్ష్మీభాయ్ యుద్ధభూమిలో అత్యంత సాహసంతో పోరాడుతూనే 1858 జూన్ 18న వీర మరణం పొందింది. ఆమె వీరోచిత కృత్యాల ద్వారా రాణి లక్ష్మీభాయ్ దేశచరిత్ర మహోజ్వల విప్లవ జ్యోతిగా స్థానం పొందింది. ఆమెను "భారతదేశపు జోన్ ఆఫ్ ఆర్క్" అని ఇంగ్లీషు వారు వర్ణించారు. సర్ హ్యూరోస్ "ఈ స్త్రీ తిరుగుబాటు దారులలో ఏకైక పురుషుడు" అని కీర్తించాడు.

భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించి నాలుగేళ్లు గడిచిన తర్వాత 1889లో 10 మంది మహిళలు కాంగ్రెస్ వార్షిక సమావేశానికి హాజరయ్యారు. 1890లో మహిళా రచయిత్రి స్వర్ణకుమారి ఘోషాల్, బ్రిటిష్ సామ్రాజ్యంలో బి.ఏ. పట్టా పొందిన

మొదటి మహిళ కాదంబినీ గంగూలి, మొదటి మహిళా మెడికల్ డాక్టర్లలో కొంతమంది ప్రతినిధులుగా హాజరయ్యారు. ఇక్కడి నుండి మహిళలు ప్రతి కాంగ్రెస్ సమావేశానికి ప్రతినిధులుగా, పరిశీలకులుగా హాజరయ్యారు. భారత్‌లోని అన్ని ప్రాంతాల నుండి వచ్చిన 56 మంది బాలికలు 1901లో "హిందూస్థాన్" అనే పాటను ఆలపించారు. మరుసటి ఏడాది ఇద్దరు గుజరాతీ సోదరీమణులు ప్రారంభ సెషన్‌లో ఈ పాటను అనువదించి పాడారు. 1905లో బ్రిటిష్ బెంగాల్‌ను విభజించినప్పుడు దానికి వ్యతిరేకంగా విదేశీ వస్తువుల బహిష్కరణ, స్వదేశీ వస్తువులు కొనుగోలు కార్యక్రమంలో మహిళలు కూడా క్రియాశీలకంగా పాల్గొన్నారు. కొంతమంది మహిళలు విప్లవకార సంస్థలకు కూడా మద్ధతునిచ్చారు. నావి బాలాదేవి (188–1967) 15 ఏళ్ల వయసులో వితంతువుగా మారింది. న్యూ జగంతర్ పార్టీ నాయకుడైన తన మేనల్లుడు అమరేంద్రనాథ్ చటోపాధ్యాయ నీడకు చేరడమే కాక పార్టీలో చేరి గృహ నిర్వాహకురాలిగా, కొన్ని సందర్భాలలో ఏదో ఒక విప్లవకారుడికి భార్యగా కూడా నటించింది. భారత జాతీయోద్యమ కాలంలో తిలక్‌తో కలిసి హోంరూల్ ఉద్యమాన్ని తన పత్రికలు "కామన్ వీల్" "న్యూ ఇండియా"ల ద్వారా కొనసాగించిన వనిత అనిబీసెంట్. 1917లో అనిబీసెంట్ భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలై జాతీయోద్యమంలో కీలకపాత్ర పోషించింది. 1930, 1931, 1932లో లండన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశాలకు మహిళా ప్రతినిధిగా హాజరయ్యి జాతీయోద్యమంలో కీలకపాత్ర పోషించిన మరో వనిత సరోజినీ నాయుడు. 1942 క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో గాంధీజీ అరెస్ట్ అయినప్పుడు క్విట్ ఇండియా ఉద్యమానికి నాయకత్వం వహించిన మహిళ అరుణా అసఫ్ అలీ. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో బొంబాయిలోని గవాలియా ట్యాంకు మైదానంలో భారత జాతీయ పతాకాన్ని ఎగురవేసి అజ్ఞాతంలో వుండి రహస్య భూగర్భ రేడియో ద్వారా జాతీయ ఉద్యమంలో పాల్గొన్న వీర వనిత "క్వీన్ ఆఫ్ క్విట్ ఇండియా"గా కీర్తి పొందింది. క్విట్ ఇండియా ఉద్యమంలో గాంధీజీ సతీమణి కస్తూరిబా కూడా కీలకపాత్ర పోషించి అరెస్ట్ కాబడింది. దేశంతో పాటు ఆంధ్రదేశంలో కూడా జాతీయోద్యమంలో అనేక మహిళలు కీలకపాత్ర పోషించారు. గుడివాడలో శాసనోల్లంఘనలో భాగంగా 144 సెక్షన్ అమలులో ఉన్నప్పటికీ దానిని లెక్క పెట్టక వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ తన మహిళా సహచరులైన దిగుమర్తి జానకమ్మ, చుక్కమ్మ, వాసిరెడ్డి హనుమాయమ్మ, త్రిపురనేని కౌసల్యమ్మ, వేదాంత కమలాదేవి, కంభంపాటి మాణిక్యాంబ మొ॥న వారు క్రియాశీలకంగా వ్యవహరించడంతో ప్రభుత్వం అరెస్ట్ చేసి ఒక్కొక్కరికి ఒక్క సంవత్సరం కారాగార శిక్ష విధింపజేసింది. వారిలో కంభంపాటి మాణిక్యాంబ ఆరు నెలల పసిబిడ్డతో జైలుకు పోవాల్సి వచ్చింది. ఈ విధంగా దేశంలోనూ, రాష్ట్రంలోనూ మహిళలు క్రియాశీలకంగా జాతీయోద్యమంలో పాల్గొన్నారు.

**ముగింపు:** ఈ వ్యాసంలో పేర్కొన్న వీర వనితలు ముచ్చుకు మాత్రమే. చరిత్ర పుటల్లో ఎందరో మహిళలు జాతీయోద్యమంలో పాల్గొని స్వాతంత్ర్య సముపార్జనలో విశేష కృషి చేశారు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ఆంధ్రలో స్వాతంత్ర్యోద్యమ చరిత్ర – ఎం.ఏ. తెలుగు అకాడమి
2. భారత స్వాతంత్ర్య సమర చరిత్ర – ఆర్వియార్
3. భారత స్వాతంత్ర్య పోరాటం – బిపిన్ చంద్ర
4. సమగ్ర భారత చరిత్ర – జాతీయోద్యమం – కె. కృష్ణారెడ్డి.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమంలో మాగంటి అన్నపూర్ణదేవి

డా।। బి. తేజోవాణి, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల, తిరుపతి.

1905 సంవత్సరంలో దాదాభాయి నౌరోజీ అధ్యక్షతన కలకత్తాలో కాంగ్రెస్ మహాసభ సమావేశమై "స్వరాజ్యము దేశీయులు జన్మహక్కు" అని ప్రకటించి అది సాధించటానికి స్వదేశీ ఉద్యమం, విదేశీ వస్త్ర బహిష్కరణ, జాతీయ విద్య అను మూడు విధాలైన కార్యక్రమాలను జాతికి ఉపదేశించింది. ఈ నూతన సందేశాన్ని ఆంధ్రదేశంలో ప్రచారం చేసినవారు బెంగాల్ ప్రాంతవాసులు. అప్పటి నుంచీ ఆంధ్రదేశం రాజకీయంగా మేల్కొన్నది.

వీరేశలింగం పంతులుగారు అనేక ప్రహసనాలు, హాస్యరచనలు రచించి సంఘంలోని దురాచారాలను ఎత్తి చూపిస్తూ ప్రజల హృదయాల్లో భావ పరివర్తన తీసుకురావటానికి కృషిచేశారు. ఆ కాలంలో అనేక బాలికా పాఠశాలలు వెలసినవి. విదుషీమణులైన స్త్రీలు గ్రంథాలు రచించి, సభలలో ఉపన్యాసాలు చేయటం ప్రారంభించారు. బ్రహ్మసమాజం, దివ్యజ్ఞాన సమాజం, ఆర్య సమాజం వంటి సంస్థలశాఖలు ఆంధ్రదేశంలో వెలసినవి. అన్ని వర్గాలవారు కలిసి సహపంక్తి భోజనం చేయటం ప్రారంభమైంది. ఈ క్రమంలోనే శ్రీమతి దుర్గాబాయి, ఉన్నవ లక్ష్మీబాయమ్మ, దువ్వూరి సుబ్బమ్మ, మాగంటి అన్నపూర్ణదేవి వంటి వారు చైతన్యవంతులై సత్యాగ్రహం చేసి, లాఠీ దెబ్బలు తిని జైలుయాత్రలు చేశారు. అలాంటి సమరయోధులలో మాగంటి అన్నపూర్ణాదేవిగారు కూడా ప్రముఖులే.

1990 సం।।లో పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు సమీపాన ఉన్న ఒక చిన్న గ్రామంలో రైతు దంపతులైన రామస్వామి, పిచ్చమ్మలకు అన్నపూర్ణాదేవి జన్మించింది. ఆడపిల్లలకు చదువు అవసరంలేదని, వంటింటికి మాత్రమే పరిమితం చేసే ఆ రోజుల్లోనే అభ్యుదయ భావాలు గల రామస్వామి విద్యావిహీనురాలైన తన భార్యను సమాజానికి భయపడక గొప్ప విద్యావంతురాలిగా చేసినాడు. తన కుమార్తె అయిన అన్నపూర్ణాదేవిని గారాబంగా పెంచి, ఏడేండ్ల వయస్సులో బడికి పంపాడు. మొదట్లో అయిష్టంగానే వెళ్ళినప్పటికీ , విద్యాభిరుచులు పెరిగి అనతికాలంలోనే పుస్తకాలు చదవటం ప్రారంభించింది. విద్యతోపాటు వినయం కూడా అబ్బినది. తొమ్మిదేండ్లు వచ్చేసరికి ప్రాథమిక విద్య ముగించుకొని గుంటూరు మిషనరీ పాఠశాలలో చేరింది. తరువాత కలకత్తా వెళ్ళి ఐదవ ఫారం వరకు చదివింది. ఇంగ్లీషు, బెంగాళీ భాషల్లో పట్టు సాధించింది. 16 సం।।ల వయస్సులో అనారోగ్యం కారణంగా చదువు నిలిచిపోయింది. ఆరోగ్యం కుదుటపడగానే మద్రాసుకు వెళ్ళి మెట్రిక్యూలేషన్ పూర్తి చేసింది. వివేకవతి అయిన అన్నపూర్ణ తల్లిదండ్రుల ఆర్థిక స్థోమతను గుర్తించి స్వయంగా సంపాదిస్తూ చదువు కొనసాగించాలనుకుంది. తెలుగులో గ్రంథ రచన చేసి ధనం సంపాదించాలనే కోరికతో ' సీతారామము' అనే కావ్యాన్ని రచించినది. అది బాలికా పాఠశాలలో పాఠ్యగ్రంథంగా నిర్ణయింపబడినది. దీంతో ఆమెకు గ్రంథ రచనలో ఆసక్తి పెరిగి 'నవవర్ష స్వప్నము' అను పేరుతో ఒక ఇంగ్లీషు గ్రంథాన్ని తెలుగులోకి అనువాదం చేసింది. 'వివాహ మంగళం' అనే మరొక గ్రంథాన్ని రచించింది. ఆ గ్రంథం సహృదయులు ప్రశంసలు అందుకున్నది. ఇంకా ' నారీ ' అనే గ్రంథం రాసి, వీరామృతం అనే గ్రంథాన్ని అనువాదం చేసింది.

యుక్తవయస్సు వచ్చిన అన్నపూర్ణకు మేనమామ అయిన మాగంటి బాపినీడులో వివాహం అయింది. వారి సంసారం సుఖంగా మూడు నెలలు సాగింది. పిదప బాపినీడు వ్యవసాయ శాస్త్రంలో ప్రావీణ్యాన్ని సంపాదించడానికి అమెరికా వెళ్ళడానికి సిద్ధపడగా, భర్తను వదిలి ఉండటం అసాధ్యమని తెలిసి అతని అభ్యున్నతికి అడ్డుపడరాదని తలచి తన అంగీకారాన్ని తెలిపింది. భర్త అమెరికాకు వెళ్ళగానే తన సర్వ సుఖాలను విసర్జన చేసింది. విలువైన వస్త్రాలను కూడా పెట్టె అడుగునకు చేర్చింది.

ఒక సంవత్సరం అయిన పిదప స్వాతంత్ర్యోద్యమంతో ప్రభావితురాలైన అన్నపూర్ణకు అంతులేని దేశభక్తి కలిగింది. దేశభక్తిని ప్రబోధించుచూ భర్తకు లేఖలు రాసేది. ఆమె ఉత్తరాలు చదివి బాపినీడులో స్వదేశాభిమానం విస్తృతమయింది. భర్తతోపాటు అమెరికాలో ఉండాలని నిశ్చయించుకొని ఓడ టిక్కెట్టు కొరకు డిపాజిట్టు కూడా కట్టింది. కానీ ఆ కాలంలో గాంధీ

నాయకత్వంలో ఉధృతంగా సాగుతున్న సహాయనిరాకరణోద్యమం అన్నపూర్ణను ఆకర్షించింది. గాంధీ దివ్యమైన బోధనలను విని పులకించి పోయింది. విదేశీ విద్యను, విదేశీ వస్త్రాలను బహిష్కరించాలని నిర్ణయించుకొని అమెరికా ప్రయాణాన్ని రద్దుచేసుకున్నది.

మహాత్మాగాంధీ సందేశంతో ప్రభావితురాలై భారత స్వాతంత్ర్య పోరాటంలో క్రియాశీలకంగా పనిచేసింది. 1921 లో గాంధీజీ ఆంధ్రా పర్యటనలో తన చేతి గాజులు, మెడలోని పెద్ద గొలుసు వారికి ఇచ్చి గాంధీజికి అభిమాన పాత్రురాలుగా మారింది. అదే సమయంలో ఆమె డబ్బుకోసం చాలా ఇబ్బందులు పడింది. అయినప్పటికీ విదేశీ వస్త్ర బహిష్కరణలో భాగంగా 1200 రూపాయల విలువైన తన చీరలన్నీ తగులబెట్టి దేశాభిమానాన్ని చాటుకొన్నది. ఏలూరులో మోహన్‌దాస్ ఖద్దరు పరిశ్రమ స్థాపించి, ఆంధ్రదేశమంతటా పర్యటించి స్వదేశీ ఉద్యమానికి చేయూతనిచ్చింది.

1923 లో తన భర్త బాపినీడు అమెరికా నుండి తిరిగివచ్చాడు. బొంబాయిలో స్టీమరు దిగిన వెంటనే ఆమె తన వెంట తెచ్చిన ఖద్దరు బట్టలను ఆయనికిచ్చి, తన విదేశీ వస్త్రాలను సముద్రంలో విసిరివేయమని చెప్పింది. ఒక్క క్షణం ఆలోచించకుండా బాపినీడు తన విదేశీ వస్త్రాలను సముద్రంలో పారవేశాడు. ఈ విషయం తెలుసుకున్న గాంధీజీ ఆమెను గురించి “She had already acquired a gentle but commanding influence over her husband, by her purity and single minded devotion" అని ప్రశంసించాడు.

అన్నపూర్ణమ్మ స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా అనేక ప్రాంతాల్లో పర్యటిస్తూ, పలు సభల్లో ఉపన్యాసాలు ఇస్తూ ప్రజలను చైతన్యం చేసింది. ఈ క్రమంలోనే 1924లో ఆమె ఆరోగ్యం క్షీణించింది. అతి చిన్న వయస్సులో 9-11-1927 నాడు అన్నపూర్ణమ్మ తుదిశ్వాస విడిచింది.

**ఆధార గ్రంథాలు :-**

1. యుగయుగాల్లో భారతీయ మహిళ - జె. వరలక్ష్మి
2. స్వాతంత్ర్యోద్యమంలో తెలుగువారు - ఆచార్య శ్రీరంజని సుబ్బారావు.
3. స్వాతంత్ర్యసమరంలో ఆంధ్ర మహిళలు - దుర్గాబాయి దేశ్‌ముఖ్.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వామ్యులైన ఆంధ్రమహిళలు

**ఎం.సి. సుధాకర్,** వసతిగృహ సంక్షేమ అధికారి, సాంఘిక సంక్షేమశాఖ, దండికుప్పం. చరవాణి : 95732 66403.

భారతదేశం సుమారు 200 సంవత్సరాల పాటు బ్రిటీష్ వారి కబంధహస్తాల్లో మగ్గింది. మనదేశ ఆర్థిక వ్యవస్థను పీల్చిపిప్పిచేసి మనల్ని బానిసలకంటే హీనంగా చూసిన బ్రిటీష్ వారి దాస్య శృంఖలాల నుండి బయటకు రావడానికి ఎంతోమంది ఎన్నో బలిదానాలు, త్యాగాలు చేసి పోరాడారు. బ్రిటీష్ వారి పాలన నుంచి విముక్తి కొరకు మన నాయకులు చేసిన పోరాటాలనే జాతీయ ఉద్యమం అంటారు.

ఈ భారత జాతీయ ఉద్యమంలో పురుషులతో పాటు వారికి ధీటుగా పోరాడిన వీరవనితలు కోకొల్లలు. ఆ కాలంలో వున్న సామాజిక మూఢాచారాలను, కుటుంబ కట్టుబాట్లను చీల్చివేసి పోలీసులు, అరెస్టులు, కేసులు, జైళ్ళు వంటివాటికి బెదరకుండా పోరాటాలు చేసిన వీరాంగనలు ఆ కాలానికే కాక నేటితరాలతో పాటు భవిష్యత్తరాలకు కూడా ఆదర్శప్రాయము. అలాంటి వీరవనితల్లో కొంతమందిని గూర్చి తెలుసుకుందాము.

దేశబాంధవి శ్రీమతి దువ్వూరి సుబ్బమ్మ : దువ్వూరి సుబ్బమ్మగారు మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబంలో 1880లో ద్రాక్షారామంలో జన్మించారు. చిన్నతనంలోనే బాలవితంతువుగా మారిన సుబ్బమ్మకు విద్యాబుద్ధులు నేర్పింది చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి. వీరు తెలుగు, సంస్కృత భాషాజ్ఞానంతో పాటు స్వాతంత్రం గూర్చి ఆలోచించేలా స్ఫూర్తి నింపారు. దీంతో సుబ్బమ్మగారు దేశాన్నే కుటుంబంగా, దేశప్రజలే తన పిల్లలుగా భావించి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు.

1921లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ సభలో మొదటిసారి అడుగుపెట్టింది. ఈ సభకు ప్రకాశం పంతులుగారు అధ్యక్షులు. ఈమె వితంతువు అవడం వలన శిరోముండనం చేసుకుని, తలకు ముసుగువేసుకుని వేదిక మీదకు రావడాన్ని ప్రజలు ఆశ్చర్యంగా చూసినా వెరవకుండా, కంచుకంఠంతో ప్రసంగించి బులుసు సాంబమూర్తి ప్రవేశపెట్టిన స్వరాజ్య తీర్మానాన్ని బలపరిచి, స్వరాజ్యం యొక్క ఆవశ్యకతను, అవసరాన్ని సభికులకు తెలియపరిచారు.

" ఉరిమింది భరతజాతి
రగిలింది ప్రజాశక్తి
మోగింది విజయభేరి
ఎగిరింది జాతీయజెండా"

అంటూ ఊరూరా తిరిగి ప్రజల్లో స్వాతంత్రోద్యమ కాంక్షను రగిలించారు. కేవలం సుబ్బమ్మగారి ప్రసంగాలను వినడానికి చాలామంది సభకు హాజరయ్యేవారంటే అతిశయోక్తి కాదు.

1921లోనే ఆంధ్రా కాంగ్రెస్ మహిళావిభాగాన్ని ఏర్పాటుచేశారు. తమిళులు తమ పట్ల చూపిస్తున్న వివక్షతను గమనించి మద్రాస్ రాష్ట్రం నుంచి ఆంధ్రను వేరు చేయాలని ఆమె అప్పట్లోనే ఆకాంక్షించారు.

1922 ఏప్రిల్ 4న ఆమెను అరెస్ట్‌చేశారు. కోర్టు ఆమెకు 1సం॥ జైలుశిక్ష విధించింది. జైలులో వున్న ఆమె దగ్గరికి కలెక్టరు వచ్చి లిఖితపూర్వకంగా కాకున్నా కనీసం నోటిమాటగా క్షమాపణ చెపితే జైలు నుంచి విడుదల చేస్తామని చెపితే, ఆమె నా కాలిగోరు కూడా ఆ పని చేయదు అని ఫీంకరించారు. ఈమె బ్రిటీష్ ప్రభుత్వాన్ని, జైలుగోడల్ని గడ్డిపోచలా భావించింది. జాతీయోద్యమకాలంలో పార్వతిదేవి (పంజాబు) తర్వాత జైలుకెళ్ళిన ద్వితీయ మహిళగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. గాంధీజీ తాడేపల్లి గూడెంకు వచ్చినపుడు వితంతువైనా కూడా జాతీయ నాయకులు ఈమె చేతనే గాంధీజీకి హారతి ఇచ్చి ఆహ్వానించారు.

ఈమె పోరాటపటిమకు 1923లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ సభలో దేశబాంధవి అనే బిరుదునిచ్చి గౌరవించారు. అహర్నిశలు దేశస్వాతంత్ర్యం కోసం పోరాడిన ఆమె స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ఏ పదవులు ఆశించక నిరాడంబరంగా జీవించి 1964లో పరమపదించారు.

దువ్వూరి సుబ్బమ్మగారి జ్ఞాపకార్థం 2021 మార్చి 8న జాతీయ మహిళా దినోత్సవం నాడు ఆమె ముఖచిత్రం వున్న తపాలాకవరును ముద్రించి విడుదల చేశారు.

**నిప్పుకణిక శ్రీమతి పొనకా కనకమ్మ :** ఈమె ఒక విప్లవవనిత. కట్టుబాట్లనే గోడలను చీల్చుకుని సంఘసేవ కోసం ఉద్యమించిన ధీశాలి. దేశంకోసం సర్వం ధారపోసిన మాతృమూర్తి. స్వాతంత్ర్యోద్యమంలో ఆమె కనపరిచిన తెగువ మహిళాలోకానికే ఆదర్శం. నిప్పుకణికగా పేరుపొందిన శ్రీమతి పొనకా కనకమ్మగారు 1892లో నెల్లూరుజిల్లా పొట్లపూడిలో జన్మించారు. ఈమె కుటుంబానికి 150 ఎకరాల స్థిరాస్థి ఉండేది. పోట్లపూడి గ్రామానికి ఉద్యమకారులు ఎవరు వచ్చినా ఈమె తన ఇంట్లోనే ఆతిథ్యం ఇచ్చేవారు. 1907 సం॥ వందేమాతర ఉద్యమవ్యాప్తికి ఆంధ్రకు వచ్చిన మహావక్త బిపిన్ చంద్రపాల్ గారు ఒకరోజంతా పోట్లపూడిలోనే గడిపారు.

1913లో సుజనరంజనీ సమాజాన్ని స్థాపించి, దాని ద్వారా అనేక ఉద్యమాలకు నాంది పలికింది. పొట్లపూడిలో వివేకానంద గ్రంథాలయం, జాతీయ పాఠశాల ఏర్పాటు ఈమె కృషివల్లనే సాధ్యమయ్యింది.

1917లో నెల్లూరులో ఆంధ్ర మహాసభలో ప్రసంగించిన కనకమ్మ మహిళలను రాజకీయాల్లోకి తీసుకురావాలని కోరింది. అదే సమయంలో హోంరూల్ ఉద్యమంలో భాగంగా తానే స్వయంగా ఖద్దరు పంచెనేసి మహాత్మాగాంధికి పంపింది.

1921 ఫిబ్రవరి 7న పోట్లపూడిలో పినాకిని (గాంధి) సత్యాగ్రహ ఆశ్రమ ఏర్పాటుకు తన ఒంటిమీదున్న బంగారాన్ని విరాళంగా ఇచ్చి, నాటి నుంచి తుదిశ్వాస విడిచేవరకు బంగారాన్ని ధరించలేదు. బ్రిటీష్ వారు నిషేధించిన జాతీయోద్యమ సాహిత్యాన్ని భద్రపరిచి యువతకు అందించింది. 1919 సంవత్సరంలోనే పోట్లపూడిలో హరిజన వసతిగృహాన్ని ఈమె ఏర్పాటు చేశారు. ఈ సమయంలో మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు పోట్లపూడిలో పర్యటించి, వీరి ఆతిథ్యాన్ని స్వీకరించారు.

1922 ఏప్రిల్ 4వ తేదీన దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మను అరెస్టుచేయడం, ఈమెను కలచివేసింది. 1930లో పల్లెపాడులో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని ప్రముఖపాత్ర వహించడంతో 1930 జూలై 27వ తేదీ ఈమెను అరెస్టు చేసి ఆరు నెలలు జైలుశిక్ష విధించారు. 1923లో బాలికల విద్యకోసం పొట్లపూడిలో కస్తూరిదేవి బాలికా విద్యాలయాన్ని స్థాపించింది.

1932లో శాసనోల్లంఘనలో భాగంగా సారా దుకాణాల వద్ద పికెటింగ్ చేస్తుండగా పోలీసులు చేసిన లాఠీచార్జీలో బలమైన గాయమైనప్పటికీ ఆమె వెనక్కుమల్లలేదు. చేసేది లేక పోలీసులు ఆమెను అరెస్టుచేసి 18 నెలలు జైలుశిక్ష విధించారు. అనారోగ్యకారణంగా 1933 జూన్ 30న విడుదలయ్యారు. తర్వాత జమీందార్లకు వ్యతిరేకంగా నడిచిన జమీన్ రైతుసంఘ పోరాటంలో అపరరుద్రమలా పోరాడారు. రైతుసభకు అధ్యక్షత వహించి జమీందారీ వ్యవస్థను రద్దుచేయాలని తీర్మానించారు. 1962 మేనెలలో మద్రాస్‌లో జరిగిన ఆంధ్రమహిళాసభ రజతోత్సవాలలో మహారాష్ట్ర గవర్నర్ అయిన డా॥ సుబ్బరాయన్ ఆమెకు

" ఆంధ్రమహిళా సభా రజిన సమారోహే
భారత మహిలలామ భూతాయై
శ్రీమతి పొనకాకనకమ్మ ఇత్యస్యై
నమ్మా న పురస్కారః "

అని రాసి ఉన్న రజిత ఫలకాన్ని అందించి సత్కరించారు.

దేశ స్వాతంత్ర్య సౌభాగ్యం కొరకు సర్వస్వాన్ని త్యాగం చేసి, మహిళాజాతికి వెలుగుచుక్కగా నిలిచిన శ్రీమతి పొనకా కనకమ్మగారు 1963 సెప్టెంబర్ 15న కన్నుమూశారు.

**శ్రీమతి అచంట రుక్మిణి లక్ష్మీపతి :** రుక్మిణి లక్ష్మీపతిగారు 1892లో మద్రాస్‌లో స్థిరపడిన ఆంధ్ర కుటుంబంలో జన్మించారు. ఈమె 12వ సంవత్సరంలోనే వీణావాయిద్యంలో నైపుణ్యం సాధించారు. వీణతో పాటు వయొలిన్, సితార, ఉత్తర హిందుస్తానీ సంగీతం నేర్చుకున్నారు. ఆంగ్లంలో అనర్గళంగా ఉపన్యాసాలు ఇచ్చేవారు.

1926లో ప్యారిస్‌లో జరిగిన ప్రపంచ మహిళా సభకు భారత ప్రతినిధిగా వెళ్ళారు. 1929లో అఖిలభారత ఆసియా సభకు అధ్యక్షత వహించి శ్లాఘనీయంగా నడిపారు. 1929లోనే ఉన్నవ లక్ష్మీబాయమ్మతో కలిసి ఆంధ్రదేశమంతటా సంచారం చేసి విస్తృతంగా జాతీయోద్యమ ప్రచారం చేశారు. 1930లో తంజావూరు దగ్గర గల వేదారణ్యంలో ఉప్పు సత్యాగ్రహంలో భాగంగా ఉప్పుతయారుచేసినందుకు ఒక సంవత్సరం జైలుశిక్ష పడింది. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా జైలుకెళ్ళిన తొలి భారత మహిళగా రుక్మిణి లక్ష్మీపతిగారు నిలిచారు.

1936లో జరిగిన జనరల్ ఎలక్షన్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచి శాసనసభ్యురాలు అయ్యారు. 1937లో శ్రీ రాజాజీ మంత్రివర్గంలో డిప్యూటీ స్పీకర్‌గా పదవి చేపట్టారు. 1940లో వ్యష్టి సత్యాగ్రహం చేసి, మరలా ఆరు నెలలు రాయవేలూరు జైలులో ఉన్నారు. 1939లో మద్రాస్‌లో ఆలిండియా రేడియో కేంద్రం ఏర్పాటు చేస్తే, దాని ద్వారా తన వీణాగాన మాధుర్యాన్ని వినిపించారు.

ముగ్గురు బిడ్డలతల్లిగా కుటుంబబాధ్యతలతో తీరిక లేకపోయినా తనదేశం ఇతర దేశాలతో సాటిగా స్వతంత్రదేశంగా తులతూగాలన్న కాంక్షతో, స్వాతంత్రోద్యమంలో పాల్గొని, స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత అనేక పదవులు చేపట్టి ఆ పదవులకే వన్నెతెచ్చిన అచంట రుక్మిణి లక్ష్మీపతమ్మగారు 1951లో అమరులయ్యారు.

**శ్రీమతి వేదాంతం కమలాదేవి :** వేదాంతం కమలాదేవిగారు 1897 మే 5న కడపజిల్లా నందలూరులో జన్మించారు. 1920లో తన భర్త అయిన వేదాంతం వెంకటకృష్ణయ్యతో పాటు జాతీయోద్యమాల్లో అడుగుపెట్టారు.

విదేశీవస్తు, వస్త్ర బహిష్కరణ, నూలు వడకడం, ఖాదీ వస్త్రాలు ధరించి, ఇల్లిల్లూ తిరిగి ఖాదీవస్త్రాలు అమ్మటం చేసేవారు. 1921లో అఖిలభారత శాసనోల్లంఘన విచారణ సంఘం సామర్లకోటకు వచ్చింది. అప్పటికి కొద్దిరోజులకు మునుపే కమలాదేవిగారి కుమార్తె చనిపోయింది. ఆ బాధను దిగమ్రింగుకుని ఆ సంఘానికి వినతిపత్రాన్ని సమర్పించింది.

1923లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహాసభలకు హాజరైన స్త్రీల శాంతిదళాలకు శ్రీమతి కమలాదేవి ఆధిపత్యం వహించారు. ఈమె భర్త వెంకటకృష్ణయ్య వైద్యదళానికి ప్రాతినిధ్యం వహించారు. ఆమె మహిళాసంఘ కార్యదర్శినిగా ఆంధ్రదేశమంతా సంచారంచేసి విస్తృతంగా ఖాదీ ప్రచారం చేశారు. తిలక్ సహాయనిధికి భారీగా విరాళాలు సేకరించారు.

1930లో ఉప్పుసత్యాగ్రహం నాటికి ఆమె తీవ్ర అనారోగ్యంతో వున్నా దాన్ని లెక్కచేయకుండా, అరెస్టులకు, లాఠీదెబ్బలకు వెరవకుండా నౌపదా ఉప్పు కొఠార్లు దగ్గర సత్యాగ్రహం చేసి ఆరు నెలలు రాయవేలూరు జైలులో శిక్ష అనుభవించారు. అక్కడ శ్రీమతులు ఉన్నవ లక్ష్మీబాయమ్మ, ఆచంట రుక్మిణి లక్ష్మీపతి, దుర్గాబాయమ్మ, దువ్వూరి సుబ్బమ్మ గార్లతో జాతీయోద్యమం గురించి చర్చించేవారు.

జైలునుంచి విడుదలైన తర్వాత ఇచ్ఛాపురంలో జరిగిన గంజాం జిల్లా మహిళాసభకు అధ్యక్షత వహించారు. 1932 శాసనోల్లంఘనకు వ్యతిరేకంగా ఢిల్లీలో కాంగ్రెస్ సమావేశం జరగకూడదని బ్రిటీష్‌వారు 144 సెక్షన్ విధించి ముఖ్యనాయకులను నిర్బంధించారు. అయినా కూడా గుట్టుచప్పుడు కాకుండా ఆ సమావేశాన్ని ఢిల్లీలోనే వేరేచోట జరిపి తీర్మానాలు ఆమోదించారు.

ఈ విధంగానే ప్రతి ప్రాంతంలోను రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయిలో సభలు జరపాలని కాంగ్రెస్ నిర్ణయించింది. దీంతో గుంటూరులో ఈమె ఆధ్వర్యంలో మహాసభను నిర్విఘ్నంగా జరిపి తీర్మానాలు ఆమోదించారు. దీంతో పోలీసులు ఈమెను అరెస్టుచేసి రెండవసారి జైలుకు తరలించారు.

ఈమె 1929, 1930, 1934 సంవత్సరాల్లో అఖిలభారత కాంగ్రెస్ స్థాయి సభ్యులుగా సేవచేశారు. అంతటి పట్టుదల, సమయస్ఫూర్తి గల ధీశాలి అయిన వేదాంతం కమలాదేవిగారు తన 48వ యేటనే (1940లో) పక్షవాతంతో అకాల మరణం పొందారు.

**శ్రీమతి ఓరుగంటి మహాలక్ష్మమ్మ :** ఓరుగంటి మహాలక్ష్మమ్మగారు 1884లో నెల్లూరుజిల్లా కావలిలో జన్మించారు. ఆమె విదేశీ వస్త్ర బహిష్కరణకు పూర్వమే అంటే ఖాదీవస్త్రాల ధరింపు గాంధీజీకి కూడా భావనలో లేని సమయంలోనే (1899 నుంచే) ఖాదీవస్త్రాలను మాత్రమే ధరించేవారు. తర్వాతికాలంలో తిలక్ విదేశీవస్తు, వస్త్ర బహిష్కరణ, స్వదేశీ వస్త్రాలు ధరించాలన్న పిలుపుతో మహాలక్ష్మమ్మగారు కావలిలో స్వదేశీ వస్త్ర విక్రయశాలను స్థాపించి, ఎంతోమందికి జీవనోపాది కల్పించారు. ఊరూరా జాతీయ ఉద్యమగీతాలు పాడుతూ ఖాదీ బట్టలను విక్రయించేవారు. ఈమె మూడవ కుమార్తె శ్రీమతి మైత్రేయ నూలు వడుకుపోటీలో బంగారు పతకం సాధించింది.

ఏ పని అయినా అందరూ పూనుకుని చేసినపుడే విజయవంతం అవుతుందని, స్త్రీలు కూడా జాతీయోద్యమంలో చేరాలని భావించి 1910లోనే కావలిలో మహిళా సమాజాన్ని ఏర్పరిచి, దానికి కార్యదర్శిగా ఉంటూ మహిళల్లో జాతీయోద్యమం పట్ల చైతన్యం కల్పించారు. 1912లో కావలిలో బాలికా పాఠశాలను స్థాపించారు. తమ ఇంట్లోనే రాత్రి పాఠశాల ఒకటి ఏర్పాటు చేశారు.

ఏ పని చేసినా పదిమందికి ప్రయోజనకారిగా ఉంటూ నవసమాజ నిర్మాణానికి దారి తీయాలన్నదే ఈమె దృఢ సంకల్పం 1914-15 ప్రాంతంలో బాలవితంతువు అయిన తన కుమార్తెకు వితంతు వివాహం జరిపించారు. ఆ కుటుంబాన్ని కావలికి ఆహ్వానించి వనభోజనాలు ఏర్పాటు చేయించారు. దీంతో కావలిలోని చాంధసవాదులతో పాటు పుట్టింటివారు కూడా ఆగ్రహించి ఈమె కుటుంబాన్ని బహిష్కరించారు. కానీ ఈమె సామాజిక మూఢవిశ్వాసాలను లెక్కచేయకుండా కట్టుబాట్లను చీల్చి కాశీవిద్యాపీఠంలో చరిత్ర, ఆయుర్వేద, వేదాంత, వ్యాకరణ, అలంకారాల్లో శాస్త్ర కోవిదుడైన తన కుమారుడికి ఒక బాలవితంతువునిచ్చి శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు సమక్షంలో శాస్త్రోక్తంగా వివాహం జరిపించారు. నమ్మింది చెప్పడం, చెప్పింది చేయడం ఈమె యొక్క దృఢమైన వ్యక్తిత్వం.

ఈమె భర్త వెంకటసుబ్బయ్యకు న్యాయవాది వృత్తిపై విముఖత కల్గి నెల్లూరులో 1917లో హోంరూల్ లీగ్ స్థాపించారు. 1921లో ఈమె పొనకా కనకమ్మ వంటి ఉద్యమనాయకురాళ్ళతో కలిసి నెల్లూరులో కాంగ్రెస్ సంఘ మహిళా విభాగం ఏర్పాటుచేశారు. ఆ సంఘానికి కనకమ్మ అధ్యక్షురాలు, ఈమె కార్యదర్శిగా పనిచేశారు. జాతీయ విద్యావిధానంలో విద్యనేర్పడానికి కస్తూరిదేవి విద్యాలయ ఏర్పాటుకు కనకమ్మతో పాటు తనవంతు కృషిచేశారు.

1921లో గాంధీ చేపట్టిన సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా మహాలక్ష్మమ్మగారు తిక్కవరపు సుదర్శనమ్మ, కందాళై యతిరాజమ్మ వంటి మహిళామణులతో కలిసి గ్రామాల్లో ఖాదీప్రచారం, మద్యపాన నిషేద ప్రచారం చేశారు. దీంతో బ్రిటీష్‌వారి ఆబ్కారీకి తీవ్ర ఆర్థికనష్టం ఏర్పడింది.

ఈమె జాతీయోద్యమ కార్యకలాపాలతో ఉన్నా మానవసేవను మరువలేదు. 1927 నెల్లూరు తుఫాను సమయంలోను, కావలిలో కలరా వ్యాధి ప్రబలిన సమయంలోను, పేదల ఇల్లు కాలిపోయిన సమయంలోను, తిండి పదార్థాలు, బట్టలు, మందులు, విరాళాలు సేకరించి ఆ బాధితులను ఆదుకున్నారు.

1930లో ఉప్పుసత్యాగ్రహ ఉద్యమానికి భర్త వెంకటసుబ్బయ్య నాయకత్వం వహించారు. ఈ సత్యాగ్రహంలో కనకమ్మ, తోటి స్త్రీలతో కలిసి పాల్గొని అరెస్ట్‌కాబడి రాయవేలూరు జైలుకెళ్ళి ఆరు నెలలు శిక్ష అనుభవించారు.

జైలు నుంచి విడుదలయ్యాక స్వాతంత్ర్యోద్యమంలోకి తిరిగి ప్రవేశించి ఖాదీప్రచారం, మద్యపాన నిషేదం, విదేశీవస్త్ర, వస్తు బహిష్కరణలతో పాటు, అస్పృశ్యతా నివారణ పోరాటం కూడా చేశారు. జాతీయోద్యమంలో ఈమె కుటుంబం మొత్తం పాల్గొన్నది. ఈమె ఇద్దరు కొడుకులు కూడా జాతీయోద్యమంలో పాల్గొని జైలుకెళ్ళారు.

ఓరుగంటి మహాలక్ష్మమ్మగారు జాతీయోద్యమంలోనే కాక ప్రతిరంగంలోను తన భర్తకు నీడలాగా తోడ్పాటునందించింది. సేవాపరాయణి అయిన ఆమె తీవ్ర అనారోగ్యంలో ఉన్నా కూడా లెక్కచేయక 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని మూడవసారి జైలుకెళ్ళి, అక్కడ దుర్బరపరిస్థితులు భరించలేక మతిచలించి, స్వాతంత్ర్యం సిద్ధించకముందే 1945లో కనుమరుగయ్యారు.

**ఆధార గ్రంథాలు :**

1. స్వాతంత్ర్యోద్యమ సమరంలో ఆంధ్రమహిళలు : డా॥ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, అచ్యుతుని గిరిజ
2. ఆంధ్ర వీరాంగనలు : మాగంటి బాపినీడు
3. ఆంధ్రప్రదేశ్ చరిత్ర : తెలుగు అకాడమి

# స్వతంత్రతతో స్వాతంత్ర్యోద్యమంలో స్త్రీలు

ఐ. సజని, తెలుగు అధ్యాపకులు, శ్రీమతి ఎన్.పి. సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల, చిత్తూరు. చరవాణి : 93983 78841.

19వ శతాబ్దం రెండవ భాగం నుండి ఆంధ్రదేశంలో అనేక రంగాలలో సంస్కరణ, విప్లవం, సృజనాత్మకతలను ప్రవేశపెట్టి ఆయారంగాలలో తమదైన ముద్రవేసి స్త్రీలు సమాజాన్ని నడిపించారు అనడంలో అతిశయోక్తి లేదు. స్త్రీలు సామాజిక జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాత ఏ ఒక్కరంగాన్నో, అందులో ఏ ఒక్క కోణాన్నో సంస్కరించుకోవటంతో సరిపెడదామనుకునే ఆలోచనలకు చోటు లేకుండా పోయింది. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకై జరిగే పోరాటాలతో, జాతి విముక్తి పోరాటాలతో, రకరకాల సిద్ధాంత సంఘర్షణలతో సృజనాత్మక సాంకేతిక శక్తుల కలయికతో వంద సంవత్సరాల కాలగమనాన్ని స్త్రీలు నిర్దేశించారు. సామాజిక జీవనంలో, వ్యక్తుల ప్రాపంచిక దృక్పథాలలో అంతకుముందు రాని అలజడీ, మార్పు, తిరుగుబాటు, స్త్రీలు ఒక సమూహంగా తమదైన చైతన్యంతో నాయకులుగా, కార్యకర్తలుగా ప్రవేశించిన తర్వాతనే వచ్చాయి.

స్త్రీలు విద్యారంగంలోకి రావడం వల్లే అనేక సామాజిక రంగాలలోకి, అలాగే జాతీయోద్యమంలోకి రావడం జరిగింది. 1917లో మార్గరెట్ కజిన్స్, సరోజినీ నాయుడు నాయకత్వంలో భారతీయ మహిళా ప్రతినిధివర్గం మాంటేంగుని కలిసి ఓటుహక్కు కావాలని మొదటిసారిగా స్త్రీలు రాజకీయ హక్కులను డిమాండ్ చేశారు. మదనపల్లి థియోసాఫికల్ కాలేజిలో పనిచేసిన మార్గరెట్ కజిన్స్ (1916–21) ఆ రోజుల్లో 'Women's Indian Association' అనే స్త్రీల సంఘాన్ని ప్రారంభించి 'స్త్రీధర్మ' అనే పత్రిక నడపటంతో ఆంధ్రదేశంలో జాతీయోద్యమానికి, మహిళా ఉద్యమాలకు అంకురార్పన జరిగిందని చెప్పవచ్చు. ఇలా జాతీయోద్యమంలో పాల్గొన్న మరియు జాతీయోద్యమ నాయకులుగా పోరాడిన స్త్రీలలో కొందరి గూర్చి .....

**సరోజినీ నాయుడు :** "నైటింగేల్ ఆఫ్ ఇండియా"గా పేరుగాంచిన సరోజినీ నాయుడు 1905 సం॥లో జాతీయోద్యమంలో ప్రవేశించారు. భారత రాజకీయరంగంలోని కీలక ఘట్టాలన్నింటిలో తన ముద్రను వేశారు. అప్పటినుండీ ఆమె జీవితచరిత్రకూ జాతీయోద్యమ చరిత్రకు పెద్దతేడా లేదనే చెప్పాలి.

సరోజినీ దేవి స్వరాజ్య నినాదంతో భారతదేశమంతటా పర్యటించి ఆ నినాదం వెనుక ప్రజలను సమీకరించారు. కాన్పూరులో జరిగిన (1925) కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షురాలయ్యారు. కాంగ్రెస్ మహాసభకు ఒక మహిళ సారథ్యం వహించడం పరాధీన భారతదేశంలో అదే మొదటిసారి. 1937లో దేశపర్యటన చేశారు. ఉప్పు సత్యాగ్రహ సమయంలో గాంధీజీతో పాటు దండికి బయలుదేరిన సాహసి సరోజినీదేవి. గాంధీజీ, నెహ్రూ అరెస్టుల తర్వాత సరోజినీదేవి నాయకత్వం ఉప్పు కొఠారుల మీదకు వెళ్ళిన సత్యాగ్రహుల బృందాన్ని ఆపేందుకు పోలీసుల ప్రయత్నంచేసి చివరకు సరోజినీదేవిని అరెస్టు చేసారు. ఆరోగ్య పరిస్థితిని కూడా లెక్కచెయ్యకుండా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్ట్ అయ్యారు. దేశం స్వతంత్రమయ్యాక సంయుక్త రాష్ట్రాల గవర్నర్‌గా పనిచేశారు.

ఒక అగ్రశ్రేణి నాయకురాలిగా జాతీయోద్యమం వంటి పెద్ద ఉద్యమంలో వుండడం సామాన్యమైన విషయం కాదు. ఉద్యమంలో నిర్ణయాధికార స్థానంలో ఉండేందుకు కావలసిన మేథ, చొరవ, వాక్చాతుర్యం, ధైర్యం వంటి గుణాలన్నీ సరోజినీదేవిలో వున్నాయి. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సంక్షోభ సమయాలలో ఆమె కీలకపాత్ర వహించేవారు. హాస్యంతో, చమత్కారంతో కూడిన ఆమె సంభాషణాచాతుర్యం ఎంత క్లిష్ట సందర్భాన్నయినా తేలికచేయగలిగేది.

**మార్గరెట్ కజిన్స్ :** ఐర్లండ్‌లో జన్మించిన మార్గరెట్ తన జీవితంలో ప్రధాన భాగం దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రాంతాలలో గడిపారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని భారత స్త్రీలలో ఒకరైనారు. మహిళోద్యమ నిర్మాణంలో భాగస్వామ్యమయ్యారు. మార్గరెట్ ఐర్లండ్‌లోని రాయల్ ఐరిష్ అకాడమీ ఆఫ్ మ్యూజిక్‌లో చదువుకున్నారు. రాయల్ యూనివర్శిటీ నుంచి సంగీతంలో పట్టభద్రురాలయ్యారు. 1915 సం॥లో మద్రాసులోని దివ్యజ్ఞాన సమాజంలో అనిబిసెంట్‌తో కలిసి పనిచేసారు. 1916 నుంచి 1921 వరకు మదనపల్లెలోని థియోసాఫికల్ కళాశాలలో పనిచేసారు. ఆ కాలంలోనే "వియెన్స్ ఇండియన్ అసోసియేషన్" అనే స్త్రీల సంఘాన్ని ప్రారంభించి 'స్త్రీధర్మ' అనే పత్రికను సంపాదకురాలిగా ఉన్నారు. 1926లో అఖిలభారత మహిళా మహాసభను

ప్రారంభించిన స్త్రీలతో మార్గరెట్ కజిన్స్ ఒకరు. జాతీయోద్యమంలో పాల్గొని విదేశీ వస్తు బహిష్కరణకు నాయకత్వం వహించి, ఆ వస్తువులమ్మే దుకాణాల దగ్గర పికెటింగులు చేసారు. శాసనోల్లంఘన ఉద్యమంలో బ్రిటీష్ ప్రభుత్వం పత్రికల మీద సెన్సారును తీవ్రం చేసింది. సభలలో నాయకులు ఇచ్చే ఉపన్యాసాలను కూడా నిషేదించి వాక్ స్వాతంత్ర్యాన్ని లేకుండా చేసింది. ఈ రెండు విషయాల గూర్చి తన నిరసనను వ్యక్తం చేసినందుకు ఆమెను అరెస్టు చేసి ఒక సంవత్సరం పాటు మద్రాసు, వెల్లూరులో జైల్లో ఉంచారు. ఈమె "ఎవేకనింగ్ ఆఫ్ ఏసియన్ విమెన్‌హుడ్", "ఇండియన్ విమెన్‌హుడ్ టుడే" అనే రచనలు, ఎన్నో వ్యాసాలు కూడా రాసారు. 1954లో భారతదేశంలోని మద్రాసులో కాలధరణంచేసారు.

**దువ్వూరి సుబ్బమ్మ :** పదేళ్ళ వయసు వచ్చీ రాకుండానే వివాహం, ఆ తర్వాత కొద్దికాలానికే వైధవ్యం. ఇది 19వ శతాబ్ద బ్రాహ్మణ స్త్రీలకు సర్వసాధారణం. తర్వాత వాళ్ళ జీవితం ఇంటిచాకిరీతో గడిచిపోయేవి. కానీ గోదావరి జిల్లా దాక్షారామంలో పుట్టిన దువ్వూరి సుబ్బమ్మ గారు దయనీయమైన తన స్థితిని రాజకీయ ఉద్యమజీవితానికి వీలు కలిగించే అంశంగా మలచుకున్నారు. 1921లో కాకినాడలో జరిగిన రాజకీయ మహాసభకు హాజరై సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరుతూ ఉపన్యాసం ఇచ్చారు. సహాయ నిరాకరణోద్యమంలో పూర్తిగా లీనమయ్యారు. ఆ రోజుల్లో జాతీయోద్యమంలో అగ్రభాగాన నిలబడ్డ ఆమెను అరెస్టుచేయడానికి పోలీసులు కాస్త ఆలోచించారు కానీ ఉద్యమతీవ్రత చూసి, ఆమె దీక్షకు భయపడి, ఆమెను నిర్బంధించి సంవత్సరం పాటు రాజమండ్రి సెంట్రల్ జైలులో వుంచారు.

జైలు నుంచి వచ్చాక ఖాదీ ఉద్యమం ఆమె ఊపిరై పోయింది. ఖద్దరు బట్టలు మూటను నెత్తిమీద పెట్టుకుని ఊరూరా తిరిగి అమ్మేవారు. బాలికల కోసం రాజమండ్రిలో జాతీయ పాఠశాలను ప్రారంభించి నడిపించారు. ఉప్పు సత్యాగ్రహం చేసి అరెస్టయి, సంవత్సరం పాటు రాయవెల్లూరు జైల్లో శిక్ష అనుభవించారు. ఆనాటి నుండి జరిగిన జాతీయోద్యమము ప్రధాన ఘట్టాలన్నిటిలో ఆమె ముందు నిలిచి నాయకత్వం వహించారు. వ్యక్తి సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలో ఆమె మహిళలకు ఎంతో ఉత్సాహాన్నిచ్చారు. అరెస్టులు, జైలుశిక్షలు ఆమె జీవితవిధానంలో భాగమయ్యాయి. ఆమె గొంతెత్తి పాడితే శ్రోతలందరూ కార్యకర్తలైపోయేవారు. సాహిత్య పరిచయం, పాండిత్య ప్రతిభా ఆమెను గొప్ప ఉపన్యాసకురాలిగా మలిచాయి. మైకులేని ఆ కాలంలో ఆమె గొంతెత్తి పాడినా, నినాదాలు చేసినా, ప్రసంగించినా ప్రజలు సమరోత్సాహంతో ఉప్పొంగిపోయేవారు. గరిమెళ్ళ సత్యనారాయణగారి పాట "మా కొద్దీ తెల్లదొరతనము" ఆమె పాడినట్లు మరెవరూ పాడలేకపోయేవారు. లాఠీలతో వచ్చే పోలీసులను అదిరించటం, బెదిరించటం ఆమెకు, ఆమె చుట్టూరా ఉన్నవారికి వినోద కార్యక్రమంగా ఉండేది. ఆమెను చూసి పోలీసులు భయపడేవారనటంలో అతిశయోక్తి లేదు. జైళ్ళలో కూడా స్త్రీలకు సరైన సౌకర్యాలు లేవనే ఆందోళన చేసి ఆమె జైలు అధికారులను భయపెట్టి కావలసిన సదుపాయాలు పొందారు. తన జీవితాన్నే ఉద్యమంగా మలుచుకున్న దువ్వూరి సుబ్బమ్మ తన ఆస్తినంతా ఉద్యమానికే ధారపోశారు. దేశబాంధవి అన్న పిలుపుకు అన్నివిధాల ఆమె అర్హురాలు.

**ఉన్నవ లక్ష్మీబాయమ్మ :** సుప్రసిద్ధ సంఘసేవకురాలు, సంస్కరణోభిలాషి, జాతీయోద్యమంలో వీరోచితంగా పోరాడిన మహిళారత్నం ఉన్నవ లక్ష్మీబాయమ్మ.

1921లో గాంధీగారి సహాయ నిరాకరణోద్యమంలో ఉన్నవ లక్ష్మీబాయమ్మగారు, భర్త ఉన్నవ లక్ష్మీనారాయణతో పాటు పాల్గొనడమే కాకుండా సత్యాగ్రహోద్యమంలో భర్తను చెరసాలలో బంధించినపుడు ఆంధ్రదేశమంతటా పర్యటించి సత్యాగ్రహోద్యమాన్ని గూర్చి ప్రచారం చేయటం గొప్ప విశేషం. ఈమె గొప్ప వక్త. ఆమె ఉపన్యాసాలు విద్యార్థుల్ని, స్త్రీలను చైతన్యవంతం చేసి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేందుకు పురిగొల్పాయి. ఈమె ఖద్దరు ప్రచారం అస్పృశ్యతా నివారణ, మహిళా జనోద్ధరణకై కంకణం కట్టుకున్నారు. ఉన్నవ లక్ష్మీబాయమ్మ ఉద్యమస్ఫూర్తికి నిదర్శనం, గాంధీగారు మొదలెట్టిన జాతీయ నిధికోసం బర్మా వెళ్ళి ధనవంతుల దగ్గర నుంచి విరాళాలు సేకరించడం మహత్తరం. విదేశీ వస్తుబహిష్కరణ ప్రచారమేకాక, ఆ దంపతులు స్థాపించిన శారదా నికేతన విద్యార్థులచే నూలు వడకడం, ఖాదీ బట్టలు నేయడం, ధరించడం చేయించేవారు. గుంటూరులో స్వాతంత్ర్యోద్యమం సాగుతుంటే శారదానికేతనం బాలికలు "వీరగంధము తెచ్చినారము వీరులెవ్వరో తెల్పుడీ" అనీ, "మా కొద్దీ తెల్లదొరతనము" అనే పాటలో ఉత్సాహంగా పాడేవారు.

శాంతి సైనికులు రెండువందల మందితో దేశసేవకులను తీర్చిదిద్దాలనే శిబిరం ఏర్పడినప్పుడు స్త్రీలతో ఒక శిబిరం ఏర్పాటు చేయబడింది. ఉన్నట్టుండి పోలీసులు దౌర్జన్యానికి దిగి లాఠీలతో అందర్నీ కొట్టారు. లక్ష్మీబాయమ్మ ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొంటూ జైలుశిక్షలు అనుభవిస్తూ రాయవేలూరు జైలులో ఖైదీలకు సహాయం చేసారు. స్వాతంత్ర్యమొచ్చినా ఏ పదవులూ కోరని నిస్వార్థపరురాలు, సంఘ సేవకురాలిగా, స్వాతంత్ర్యోద్యమ నాయకురాలిగా లక్ష్మీబాయమ్మ స్థానం విశిష్టమైనది.

**ఆచంట రుక్మిణి :** దేశాభిమానంలో జాతీయోద్యమంలో పనిచేయటమే కాకుండా రాజకీయాలంటే ఆసక్తి, పరిపాలనారంగంలో ప్రావీణ్యం వుండి దేశాభివృద్ధికోసం కృషిచేసిన వ్యక్తి రుక్మిణి. 1911లో ఆమె భారతీయ మహిళామండలి మద్రాసుశాఖకు కార్యదర్శిగా ఉంటూ ఆ మహిళామండలిని అనేక కార్యక్రమాలతో చైతన్యవంతం చేశారు. సభలు, ప్రదర్శలు వంటి కార్యక్రమాలే కాకుండా మహిళామండలి తరపున స్వదేశీ దుకాణాన్ని ప్రారంభించి స్వదేశీ ఉద్యమానికి ఊతంగా నిలబడ్డారు. జాతీయోద్యమంలో పనిచేస్తూనే రుక్మిణి బి.ఏ., పాసయ్యారు.

1926లో పారిస్‌లో జరిగిన “ఇంటర్నేషనల్ సఫ్రేజ్ అలయన్స్ కాంగ్రెస్” పదవ సభకు భారతదేశ ప్రతినిధిగా వెళ్ళారు. అప్పటినుంచీ ఆమె స్వతంత్రోద్యమంతో పాటు పరిపాలనారంగంలో కూడ చొరవ తీసుకుని పనిచేశారు. చెంగల్పట్టు జిల్లాబోర్డు సభ్యురాలిగా, మద్రాసు విశ్వవిద్యాలయం సెనెట్ సభ్యురాలిగా, మద్రాసు కార్పొరేషన్‌లో ఎగ్మూరు డివిజన్‌కు ప్రతినిధిగా, వర్క్స్ సబ్‌కమిటీ అధ్యక్షురాలిగా రకరకాల విభాగాలలో పరిపాలనా అనుభవాన్ని సంపాదించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని సంవత్సరం పాటు వెల్లూరు జైలులో శిక్ష అనుభవించారు. గాంధీ – ఇర్విన్ ఒప్పంద సమయంలో విడుదలయ్యారు. వ్యక్తి సత్యాగ్రహ సమయంలో మళ్లీ ఒక సంవత్సరం వెల్లూరు జైలులో గడిపారు. ఉప్పు సత్యాగ్రహంతో మొదలుపెట్టి క్విట్ ఇండియా ఉద్యమం వరకూ ఆమె ఒక కాలు జైలు, ఒక కాలు ఇల్లు అన్నట్లుగా స్వాతంత్రోద్యమంలో భాగమయ్యారు. ఇంకొకవైపు ......... ప్రొవెన్షియల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా, కంపోజిట్ మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యురాలిగా, మద్రాసు లెజిస్లేటివ్ అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు.

**కొమర్రాజు అచ్చమాంబ :** ఆరోగ్యాన్ని, మరీ ముఖ్యంగా స్త్రీల ఆరోగ్యాన్ని రాజకీయ విషయంగా గుర్తించిన డాక్టర్ కొమర్రాజు అచ్చమాంబ గుంటూరులో జన్మించారు. తండ్రి కొమర్రాజు లక్ష్మణరావుగారు ప్రసిద్ధ చరిత్రకారుడు. అచ్చమాంబ మద్రాసులో ఎగ్మూరులోని ప్రెసిడెన్సీ ట్రైనింగ్ పాఠశాలలో, క్వీన్ మేరీస్ కళాశాలలో చదివారు. మద్రాసు వైద్య కళాశాలలో M.B.B.S చేసారు. విద్యార్థిగా ఉన్నప్పటి నుంచీ ఆమె ఉద్యమాలలో పనిచేసారు. సైమన్ కమీషన్ బహిష్కరణ, విదేశీవస్తు బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహం మొదలైన స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలలో నాయకత్వం వహించారు. లాఠీదెబ్బలు తిని గాయపడి స్పృహ తప్పిన వాలంటీర్ల కోసం ఒక ఆసుపత్రి నిర్వహించారు. యువజన సమితి (యూత్‌లీగ్)లో సభ్యురాలిగా ఉన్న అచ్చమాంబ తను నివసించే ఇంటికి “తిరుగుబాటు” (రివోల్ట్) అని పేరు పెట్టుకున్నారు.

**సంగెం లక్ష్మీబాయి :** బాల్యంలోనే వైధవ్యం పొందిన సత్తెమ్మ శారదానికేతనంలో విద్యను శ్రద్ధగా అభ్యసించింది. 1922లో విద్వాన్ పరీక్షలో ఉత్తీర్ణురాలు అయి తన జీవితంలో విజయానికి తొలిమెట్టు వేసుకుంది.

గాంధీగారి అనుయాయులుగా ఉద్యమంలో పాల్గొన్న వారు విదేశీవస్తు బహిష్కరణలు, ఖాదీధారణ, సూత్రయజ్ఞం, సహాయ నిరాకరణ మొ॥న ఉద్యమాలకు ఆకర్షితులై గాంధీవెంట స్త్రీలు, పురుషులు విద్యార్థులు పరుగులు తీసారు. ఉన్నవ లక్ష్మీనారాయణగారు, లక్ష్మీబాయిగారు కొండా వెంకటప్పయ్య గారు మొ॥న దేశభక్తులు గుంటూరులో గొప్ప చైతన్యం తెచ్చారు. లక్ష్మీబాయమ్మకు చాలా ఉత్సాహం కలిగి ఉద్యమంలో తానూ పాల్గొని దేశసేవ చేయాలని దుర్గాబాయి గారి స్నేహంతో ఉద్యమంలో పాల్గొన్నారు. చెరసాల శిక్ష అనుభవించారు. అక్కడ ఆచంట రుక్మిణమ్మ ఖైదీలకు నాయకురాలుగాను వున్నప్పుడు సంగం లక్ష్మీబాయమ్మ “అది ఒక చెరసాలగా, మేము ఖైదీలుగానూ కనిపించలేదు. అది ఒక పాఠశాలగా భావించాము, ఎన్నో విషయాలు నేర్చుకున్నాము” అంటారు.

స్త్రీలు, అనాథలు రక్షణ కోసం “ఇందిరాసేవాసదనం” ప్రారంభించారు. గాంధీజీ ఆశ్రమాల పద్ధతిని ఈ సదనంలో మొదలుపెట్టారు. తోటపనులు, ఇంటిపనులు, వ్యవసాయ పనులు అన్నీ ఆ సదనంలో వారే చూసుకునేవారు. లక్ష్మీబాయమ్మకు గురువులు “గాంధీజీ”, “వినోభా భావే”. అందుకే వారి ఆదర్శాలనే ఆమె ఆదర్శంగా తీసుకున్నారు.

ఆచార్య వినోభా భావే భూదానయాత్ర చేసినపుడు ఆ కమిటీలో సభ్యుల్లో ఈమె ఒకరు. వినోభాభావే ఉపన్యాసాలకు అనువాదకురాలిగా వుండేవారు. ఆయనతో గ్రామాలను పర్యటించి అక్కడ గ్రామ పెద్దలను చేర్చి భూదాన యజ్ఞాన్ని గూర్చి వివరించి ఉపన్యసించేవారు. అలా పదహారు (16) గ్రామాలు తిరిగి రెండువందల పద్నాలుగు (214) ఎకరాలు సేకరించిన సంకల్పసిద్ధురాలు లక్ష్మీబాయమ్మగారు.

**కనుపర్తి వరలక్ష్మమ్మ :** "త్రిపుర సుందరీ సమాజం", "యువతీ విద్యాలయాన్ని" బాపట్లలో నిర్వహించిన కొటికలపూడి సీతమ్మను ఆదర్శంగా తీసుకున్న కనుపర్తి వరలక్ష్మమ్మకు బాల్యంలోనే పుస్తకపఠనం, విద్యాభ్యాసం పై ఆసక్తి అలవడ్డాయి. వరలక్ష్మమ్మగారి భర్త కనుపర్తి హనుమంతరావు 'స్త్రీవిద్యను ప్రోత్సహించాలనే వీరేశలింగంగారి ఉద్యమాలకు ప్రభావితులు కావడంచే స్త్రీవిద్యకు సంబంధించిన గ్రంథాలు భార్యచే చదివించేవారు. దీంతో ఆమె సామాజిక సేవాదృక్పథం పెంచుకుంది.

పక్కింటికి వచ్చిన లేఖలు చదవడం, జవాబు రాయడం నాందిగా ఈమె 'శారదలేఖలు' రచన వెలువడింది. గృహలక్ష్మి పత్రికలో ధారావాహికగా వెలువడ్డ ఈ లేఖలు ఆనాటి రాజకీయ, నైతిక, మత, సాంఘిక విషయాలనెన్నింటినో తెలియజేసేవి. ఈ లేఖలు అందుకొన్న కల్పిత వ్యక్తి కల్పలత. ఈ లేఖలు సామాజిక స్థితిగతులకు అద్దంపట్టేవి. స్త్రీలు నాటకరంగంలో ప్రవేశంలో శారదాపెళ్ళిళ్ళు, విడాకుల చట్ట వ్యతిరేకత, స్త్రీలు మద్యపాన నిషేధాన్ని ప్రచారం చేయటం, స్త్రీలు రాజకీయాల్లోకెళ్ళి చెరసాలలో పడి దేశభక్తిని చాటుకోవటము, వితంతువైన స్త్రీకి శుష్కవేదాంతం కాకుండా, దేశసేవ ముఖ్యమనే సందేశం, అస్పృశ్యతా నివారణ... ఇలా రెండు సంపుటాలుగా శారదలేఖలు సమాజసేవకు అంకితం చేసాయి.

వరలక్ష్మమ్మగారు దేశభక్తిని ప్రోత్సహిస్తూ స్త్రీలు రాట్నం వడకడం, దేశభక్తి పాటలు పాడడం నేర్పించేవారు. ఖద్దరు కట్టడం అయితే సహాయ నిరాకరణోద్యమం జరుగుతుంటే ఆంగ్ల ప్రభుత్వం నుంచి చాలా నిఘావుండేది. అయినా భయపడక 'స్త్రీహితైషిణీ మండలి'లో ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు చేయడానికి వెనుకాడని ధైర్యశాలి. కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన 'మంగళహారతి'లో రాట్న ప్రశంస ప్రధానం.

" రాజ్యలక్ష్మికి మంగళం / మా రాజ్యలక్ష్మికి మంగళం

పాలబోలిన నూలునొసగే / భాగ్యలక్ష్మికి మంగళం " – జారిపోయిన దేశగౌరవాన్ని చేరదీసేది కదురేనన్న నమ్మకం మంగళహారతిలో కనిపిస్తుంది. ఉద్యమ ప్రభావం వల్ల అసంఖ్యాకంగా మంగళహారతులు కూడా ఉద్భవించాయని తెలుస్తుంది.

ఓటు హక్కు విలువ గురించి స్త్రీలకు తెలియజేసి, స్త్రీలతో ఓటు వేయించారు. ఈమె గొప్ప రచయిత్రి. 'ఓటు పురాణం' అనే రచనతో ఓటు ప్రత్యేకతను చాటారు.

" ఓటే దైవము సత్యము / ఓటే ప్రాణము రాజ్యం ఓటున నిలుచున్
వోటుల కెక్కువ బడయును / యోటు పడును నెట్టిదైన నుర్విని సుండీ!

– ఓటును ఆలోచించకుండా వేయద్దని, ఒత్తిడులకు తలొగ్గొద్దని, ఓటు విలువ తెలుసుకుని దేశహితార్థం వినియోగించుకోవాలని సందేశం ఇచ్చారు. దేశాభిమానంతో ఆమె సాహిత్యకృషి ఎనలేనిది. ఆమె భరతభూమిని పలువిధాల స్తుతించారు. ధర్మమే మన జీవితార్థమని నమ్మిన విమల భూమి" అన్నారు.

"చతర పురుషార్థి సాధనా చతురులైన / పూత చరితులగన్నట్టి పుణ్యభూమి " మన భరతభూమి అని కొనియాడారు.

**ఆధార గ్రంథాలు :**

1. ఆదర్శ మహిళలు : శ్రీమతి టి. శాంతాభాస్కర్
2. తెలుగులో ఉద్యమగీతాలు : డా॥ ఎస్.వి. సత్యనారాయణ
3. దుర్గాబాయి దేశ్‌ముఖ్ : రామలక్ష్మి ఆరుద్ర

ISSN 2457-0796

UGC Care List Approved Journals

**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక** **సంపుటి -25 : సంచిక - 12 (2)** **హైదరాబాద్** **అక్టోబరు - 2022**

# స్వాతంత్ర్యోద్యమస్ఫూర్తి – మహిళామూర్తి

**డా॥ లంకిపల్లె జ్యోతీశ్వర నాయుడు,** ఆంధ్రోపన్యాసకులు, విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వెంకటగిరి, చరవాణి : 92908 81346.

వేల సంవత్సరాల నాగరికత, ప్రాచీనచరిత్ర గల ఈ దేశప్రజలకు, ప్రజాపోరాటాలకు గొప్ప స్థానముంది. సూర్యుడు అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి, తరిమికొట్టిన గొప్పచరిత్ర మన ప్రజలది. జాతీయోద్యమ ప్రస్థానంలో స్త్రీల పాత్ర ఎంతో గణనీయమైంది. స్వాతంత్ర్య సమరంలో స్త్రీలు అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించి, చరిత్రను మలుపుతిప్పిన ఘటనలకు ఆద్యులయ్యారు. జాతీయోద్యమంలో మహిళలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, చేసిన త్యాగాలు మరువలేనివి. ఉప్పుసత్యాగ్రహంలో దుర్గాబాయి. సరోజినీ నాయుడు, రుక్మిణీ లక్ష్మీపతి, కమలాదేవి ఛటోపాధ్యాయ వంటి మహిళామణులెందరో పాల్గొని భాగస్వాములైనారు. వీరు విదేశీ వస్తువుల బహిష్కరణ, సారా వ్యతిరేక ఉద్యమం మొదలైన బ్రిటీష్ ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలను ఎన్నింటినో చేపట్టారు.

స్వాతంత్ర్యపోరాటంలో మహిళామణులెందరో పాల్గొని స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఈ చారిత్రక ఉద్యమంలో పురుషులతో పాటు స్త్రీలు కూడా పాల్గొని అద్భుతమైన సాహసాలను ప్రదర్శించారు. ఆనాటి మహిళలు బయటికి రావడమే అరుదైన కాలంలో భారతమాత దాస్య సంకెళ్లను తెంచేందుకు స్వతంత్ర పోరాటం చేస్తూ ఆ ఉద్యమానికి ఎందరో మహిళలు ఊపిరిగా నిలిచారు. ఆనాటి మహిళామణులలో ముందువరుసలో నిలిచే మహిళామణి సరోజినీ నాయుడు. తమ ప్రసంగాలతో, పాటలతో, నాటకాలతో, కవితలతో ఆమె తనదైన రీతిలో స్వాతంత్ర్య సమరస్ఫూర్తిని నింపారు. దేశమాతకోసం స్వతంత్ర్య సమరంలో పాల్గొని జైలుకు వెళ్ళిన ధీశాలి దువ్వూరి సుబ్బమ్మను గూర్చి నేటికీ కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. భయం అంటే ఏమిటో తెలియని స్వాతంత్ర్య సమరయోధురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్. మహిళా సాధికారత కోసం పాటుపడిన సామాజిక కార్యకర్తగా పేరుపొందారు. సుభాష్ చంద్రబోస్ చేసిన స్వాతంత్ర్య పోరాటంలో ఆయనకు అత్యంత సన్నిహితురాలిగా మెలిగిన కెప్టెన్ లక్ష్మీసెహగల్ భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆజాద్ హింద్ ఫౌజ్ తరపున కదంతొక్కిన వీరవనిత. అభినవ ఝాన్సీ లక్ష్మీబాయిగా పేరు తెచ్చుకున్న ధీరవనిత లక్ష్మీ సెహగల్ గురించి అనేక నవలలు, సినిమాలు వచ్చాయి. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇచ్చిన పిలుపుమేరకు ఇండియన్ నేషనల్ ఆర్మీలోని ఝాన్సీరాణి రెజిమెంట్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన తొలి మహిళగా లక్ష్మీ సెహగల్ చరిత్రపుటల్లోకి ఎక్కారు.

స్వాతంత్ర్యోద్యమంలో గాంధీకి వెన్నుదన్నుగా నిలిచి అర్ధాంగి అనే పదానికి అసలైన నిర్వచనం ఇచ్చిన చైతన్యశీలి కస్తూరిబా గాంధీ. సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్న మహిళలకు నాయకత్వం వహించిన మహిళ. వీరితోపాటుగా అరుణ అసఫ్ అలీ స్వాతంత్ర్యోద్యమంలో నిర్వహించిన పాత్ర ఎంతో ఉంది. గాంధీ నమ్మకాన్ని పొంది అనేక ఉద్యమాలకు ఆమె నాయకత్వం వహించారు.

ఆనాటి హిందూ మహిళలతో సమానంగా అనేకమంది ముస్లిం మహిళలు కూడా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమ సంగ్రామంలో అవధ్‌రాణి బేగం హజరత్‌ను అగ్రగామిగా చెప్పుకోవచ్చు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ స్త్రీవిద్య కోసం తన జీవితమంతా అవిశ్రాంతంగా కృషిచేశారు. స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పనిచేయడమే కాకుండా దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. మహిళాభ్యున్నతికి విద్యయే ఆయుధమని ఆమె విశ్వసించారు. భయం అంటే ఏమిటో తెలియని స్వాతంత్ర్య సమరయోధురాలుగా గుర్తింపు పొందారు. మహిళా సాధికారత కోసం పాటుపడిన సామాజిక కార్యకర్తగా ఆమె పేరుపొందారు. భారత సామాజిక సర్వీస్ మదర్‌గా పేరుపొందిన ఆమె మహిళలకు చేసిన సేవలు అసామాన్యమైనవి.

దేశమాతకోసం స్వాతంత్ర్య సమరంలో పాల్గొని జైలుకు వెళ్ళిన ధీశాలి దువ్వూరి సుబ్బమ్మ. 1922 సంవత్సరంలో సహాయ

నిరాకరణోద్యమంలో పాల్గొని ప్రముఖపాత్ర వహించింది. అంతేకాకుండా ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొన్నది. స్వాతంత్ర్యోద్యమంలో గాంధీకి వెన్నుదన్నుగా నిలిచి అర్థాంగి అన్న పదానికి అసలైన నిర్వచనం ఇచ్చిన చైతన్యశీలి, అద్భుతమైన, అరుదైన మహిళ కస్తూరిబాయి. సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్న ఎందరో మహిళలకు నాయకత్వం వహించిన ధీరవనిత కస్తూర్బాగాంధీ. ధైర్యంలో నేటి యువతసైతం స్ఫూర్తిగా తీసుకునే వీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయి. అసామాన్య ధైర్యసాహసాలు ప్రదర్శించిన వారిని ఈమెతోనే పోలుస్తారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ముఖ్యభూమిక పోషించిన వీరనారీమణి.

భారత స్వతంత్ర సంగ్రామంలో ముందు వరుసలో నిలిచిన ధీరవనిత నైటింగేల్ ఆఫ్ ఇండియా సరోజనీ నాయుడు. భారతదేశాన్ని అస్పృశ్యతా సంకెళ్ళనుంచి విముక్తి కలిగించాలని కంకణం కట్టుకొన్న సమానత్వ కాంక్షాపరురాలు. మహిళలు బయటికి రావడమే అరుదైన తరుణంలో స్వాతంత్ర్య సంగ్రామ ఉద్యమంలో పురుషులతో సమానంగా ఉద్యమంలో పాల్గొన్నారు. భారతమాత దాస్యసంకెళ్లను తెంచేందుకు స్వతంత్ర పోరాట ఉద్యమానికి ఊపిరిగా నిలిచారు. తమ ప్రసంగాలతో, పాటలతో, నాటకాలతో, కవితలతో, బుర్రకథలతో ఎవరికివారు బ్రిటీష్ ప్రభుత్వతీరును ఎండగట్టారు. ప్రజలలో స్వాతంత్ర్య సమరస్ఫూర్తిని రగిలించారు. అటువంటివారిలో సరోజనీ నాయుడిని ప్రముఖంగా చెప్పుకోవచ్చు. స్వాతంత్ర్యోద్యమంలో కదంతొక్కిన మహిళ రాజ్‌కుమారి అమృత్‌కౌర్. ఈమె సామాజిక కార్యకర్త. బాల్యవివాహాలపైనా, స్త్రీల పరదావ్యవస్థపైనా తిరుగుబాటు బావుటాని ఎగురవేశారు. దండి సత్యాగ్రహంలో, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న రాజ్‌కుమారి కొంతకాలం జైలుజీవితం గడిపారు. పులయ కులము అనే దళిత సామాజిక వర్గానికి చెందిన మహిళ దాక్షాయిని వేలాయుధన్. ఆరోజుల్లో దళిత మహిళలకు పైవస్త్రాలు ధరించే హక్కులేకున్నా వారి సాంప్రదాయాలను ఎదిరించి జాకెట్ ధరించిన తొలి మహిళ. ఈమె కేరళకి చెందినవారు. కేరళలో కులోన్మాదానికి వ్యతిరేకంగా జరిగిన శ్రీనారాయణగురు, అయ్యంకాళి ఉద్యమ ప్రభావం దాక్షాయినిపై ఉంది. అస్పృశ్యతపైన, దళితుల విద్యాలయాల ప్రవేశంకోసం ఆమె ఉద్యమించారు. గాంధీజీ స్ఫూర్తితో ఉద్యమంలోకి వచ్చినవారు రేణుకారాయ్. బ్రిటీష్ విద్యావిధానాన్ని బహిష్కరించాలన్న పిలుపునందుకొని కాలేజి చదువుని వదలివచ్చి ఉద్యమంలో చేరారు. మహిళల హక్కులకోసం, తల్లిదండ్రుల ఆస్తిలో వాటాకోసం, స్త్రీల ఆస్తిహక్కుకోసం ఉద్యమించారు.

స్వాతంత్ర్య సమరోజ్వల చరిత్రలో ముస్లిం మహిళలు కూడా పురుషులతో ధీటుగా తమదైన వీరోచితపాత్ర నిర్వహించారు. స్వాతంత్ర్య సమరంలో ప్రధానపాత్ర వహించిన ముస్లిం సామాజిక వర్గానికి చెందిన స్త్రీలు తమ అపూర్వ త్యాగాలతో చరిత్ర పుటలను ఎరుపెక్కించారు. వారిలో అవధ్‌రాణిబేగం, హజరత్ మహల్‌ను అగ్రగామిగా చెప్పుకుని తీరాల్సిందే. తమ ప్రాణాలను సైతం పణంగాపెట్టి శత్రువును మట్టుపెట్టేందుకు కదనరంగానికి కదలిన వారిలో బేగం అజీజున్ ఒకరు. సాహసిగా పేరొందిన హబీబా బేగం, ఝాన్సీరాణి కోసం ప్రాణాలర్పించిన ముందర్, బ్రిటీష్ సైనిక మూకలను అహింసాయుధంతో ఎదుర్కొన్న బేగంరహిమా, మాతృభూమికోసం సజీవదహనమైన అస్గరిబేగం, ఆంగ్లసైన్యాలను ముప్పుతిప్పలు పెట్టిన బేగం జమీలా, కత్తిపట్టి కదనరంగాన శతృవులను సవాల్‌చేసిన సాహసి బేగం ఉమ్దా. ఈ విధంగా ఎందరో నారీమణుల పోరాట పటిమను వర్ణించేందుకు మాటలు చాలవు. చరిత్ర నమోదు ప్రకారం స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న వందలాది ముస్లిం మహిళలు కాల్చివేయబడ్డారు, ఉరితీయబడ్డారు. తీవ్రమైన అవమానాలకు, అత్యాచారాలకు గురయ్యారు.

ఆబాది బానో బేగం బాటలో నడిచిన ఎందరో మహిళామణులున్నారు. నిషాతున్నీసా బేగం, షౌకత్ అలీ భార్య అంజాదీ బేగం, మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు స్ఫూర్తిగా నిల్చిన జులేఖా బేగం, స్వాతంత్రేచ్ఛను రగిల్చే సాహిత్యాన్ని సృష్టించిన కవయిత్రి జాహిదాఖాతూన్, ఆలోచనాత్మక ప్రసంగాలకు పెట్టిందిపేరైన అక్బరీబేగం, బ్రిటీష్ పోలీసులు గుర్రాలచేత తొక్కించినా, లాఠీలతో రక్తసిక్తంచేసినా పోరుబాట వీడని హమీదా తయ్యాబ్జీ, అమీనా తయ్యాబ్జీ, షఫాతున్నిసాబేగం, ఆదర్శ జాతీయవాదిగా ఖ్యాతిగాంచిన మజీదాబాను, "బానిసత్వం కంటే మరణమే మేలు" అని చాటిన బేగం మహమ్మద్ ఆలంలు జాతీయోద్యమంలో ప్రముఖపాత్ర వహించారు.

ఇలా ఎంతోమంది మహిళలు తమ సర్వస్వాన్ని కోల్పోయినా సరే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. దళితులు, ఆదివాసీలు, ముస్లింలు, సాధారణ కుటుంబాలకు చెందిన మహిళలు స్వాతంత్ర్యపోరాటం కోసం తృణప్రాయంగా తమ ప్రాణాలను విడిచారు. బలవంతుడైన శత్రువును శక్తితో, యుక్తితో మట్టుగరిపించిన నైజం ఆ మహిళల సొంతం. కానీ నేటి మహిళల పరిస్థితి ఏంటి? దేశంలో పురుషులతోపాటు మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళుతున్నారా? వారికి సమాన ప్రోత్సాహం ఇస్తున్నారా? కనీసం వారికలలను సాకారం చేసుకునే వాతావరణం ఉంటుందా? ఎక్కడికక్కడ ఆంక్షలు, నిర్బంధాలు ఆమెను చుట్టుముడుతున్నాయి. ఆధునిక సమాజంలో కూడానా అని నోరెళ్లబెట్టేవారే ఆమెను అధఃపాతాళానికి తొక్కేస్తున్నారు. ఇక బడుగు బలహీన వర్గాలవారిపై నిత్యం ఎక్కడో ఒకచోట దాడులు జరుగుతూనే ఉంటున్నాయి. ఎప్పుడైతే దేశంలో స్త్రీలకు బడుగు బలహీన వర్గాలవారికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వస్తుందో అప్పుడే నిజమైన స్వాతంత్ర్య ఫలాలు అనుభవించిన వారవుతారు. ఎదురుచూస్తూ కూర్చుంటే ఆరోజు రాదు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో పోరాడి సాధించాలి.

**ఆధారగ్రంథాలు**


1. విశిష్ట తెలుగు మహిళలు – డాక్టర్ దామెర వేంకట సుబ్బారావు
2. మహిళల నవలలు – మానవవీయవిలువలు – కాత్యాయని విద్మహే
3. ఆంధ్ర రచయిత్రుల సమాచార సూచిక – కె.రామలక్ష్మి

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్య పోరాటంలో అరెస్ట్ అయిన తొలి తెలుగు మహిళ

డా. జూరెడ్డి నిర్మల, తెలుగు అధ్యాపకురాలు, సెయింట్ జోసఫ్ మహిళా కళాశాల, విశాఖపట్నం. చరవాణి - 7095072353.

పోలీసులనే భయపెట్టి స్వాతంత్ర్యోద్యమంలో ఒక వితంతువు ఉపన్యాసాలతో అందరినీ ఆకర్షించి, దేశసేవకు జీవితం అర్పించిందంటే ఆమెకు అభినందనలు తెల్పని వారుండరు కదా!

దేశస్వాతంత్ర్య పోరాటం కోసం ఆమె అనేక త్యాగాలు చేశారు. సొంత ఆస్తిని సైతం సమాజ సేవకు వినియోగించారు తన జీవితాన్ని ప్రజాసేవకే వినియోగించారు. సుధీర్ఘ కాలం పాటు జైలు జీవితం గడిపారు. " దేశబాంధవి " గా లోకంచే గుర్తించి గౌరవింపబడిన దువ్వూరి సుబ్బమ్మ 1880 నవంబరు 15 న కోనసీమ జిల్లాలోని రామచంద్రాపురం మండలం ద్రాక్షారామంలో మల్లాది సుబ్బావధాని, వెంకల రమణమ్మలకు జన్మించారు. దువ్వూరి సుబ్బమ్మకు ఆమె చిన్నతనంలోనే నాటి ఆచారాన్ని బట్టి పదేళ్ళ వయస్సులో వివాహం జరిగింది. వారికి పిల్లలు పుట్టక ముందే భర్త మరణించడంతో బాల వితంతువుగా మారాల్సి వచ్చింది.

భర్త మరణం, బిడ్డలు లేకపోవడంతో ఇక తన జీవితాన్ని దేశ సేవకు అప్పగించాలని ఆమె సంకల్పించుకుని స్వాతంత్ర్య పోరాటం వైపు మొగ్గు చూపారు.

1920 నాటికి దేశంలో జాతీయ కాంగ్రెస్ కార్యక్రమాలు విస్తృతమయ్యాయి. మహాత్మా గాంధీ వచ్చిన తర్వాత వివిధ కార్యక్రమాలకు పిలుపు నిచ్చారు. సహాయ నిరాకరణ వంటివి ఉధృతంగా సాగాయి. సరిగ్గా వాటి ప్రభావంతో దువ్వూరి సుబ్బమ్మ కూడా స్వాతంత్ర్య పోరాటంలో అడుగు పెట్టినందుకు సిద్ధమయ్యారు. కానీ ఆమెకు అక్షర జ్ఞానం లేకపోవటంతో సమీపంలోని కడియం గ్రామానికి వెళ్ళి చెళ్లపిళ్ల వెంకట శాస్త్రి వద్ద విద్య నేర్వటమే కాక స్వయంకృషితో సంస్కృతాంధ్ర పాండిత్యాల్ని కరతలామలకం చేసుకున్నారు. గాంధీ గారి ఉద్యమ శంఖారావం నలుదిశలా వ్యాపించి గోదావరి జిల్లాలో కాకినాడ జాతీయ కాంగ్రెస్ సభలకు 1921 లో వేదికయ్యింది. మహానాయకుడు టంగుటూరి ప్రకాశం పంతులు అధ్యక్షులు. ఆ సభలో బులుసు సాంబమూర్తి గారు స్వాతంత్ర్య సంబంధిగా సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తీర్మానం ప్రవేశ పెట్టడం, అందరూ అంగీకరించడం జరిగింది.

ఆ సభలో ఒక వితంతువు లేచి నిలబడింది. అంతవరకు ఆమె ఎవరో ఎవరికి తెలియదు. కానీ ఆమె గొంతు విప్పి ఉపన్యసిస్తుంటే అక్కడున్న వారంతా నోరు తెరచి చూస్తూ ఉండి పోయారు. ఏమీ వాగ్ధాటీ! భర్త మరణించి కొద్ది నెలలు అయినా మనస్సుని సముదాయించుకొని, స్వాతంత్ర్యోద్యమం కోసం ఇంటి నుంచి బయటకు వచ్చిన మహిళ. ఆ పరిస్థితుల్లో ఇంటి నుంచి వితంతువు రాకూడదనే కాలంలో, తన భర్త మరణం వల్ల కలిగిన దు:ఖాన్ని గుండెలో దాచుకుని, ఆ సభలో గంభీరోపన్యాసం చేసే సరికి ఒక్కసారి అందరూ ఆశ్చర్య పోయారు. ఆనంద పడ్డారు. ఆమె భారత భాగవతాది గ్రంథాలు బాగా చదువుకోవటంతో, ఉపన్యాసంలో అందరి పద్యాలు చదివేస్తూ, గంగా నిర్ఝరిలా ఉపన్యాసం సాగిపోతుంటే ఒక్కరూ లేవకుండా కూర్చుని విన్నారు.

ఆమె గొంతు మధురంగా ఉండేది. పాటలతో, పద్యాలతో సాగిన ఉపన్యాసాలు ప్రజలను చాలా ప్రభావితం చేసి, ప్రభుత్వ వ్యతిరేకతనూ, దేశభక్తిని పెంచాయి. ఆమె ఉపస్యాసాలు ఆపాలని చాలా ప్రయత్నం చేసింది ప్రభుత్వం. మాట వినపడకుండా డప్పులు మోగిస్తే జనం వాళ్ళు వెళ్ళి పోతారని ఉద్దేశ్యం. అయినా దువ్వూరి సుబ్బమ్మ ఉపన్యాసం ఆపేది కాదు. దువ్వూరి సుబ్బమ్మ మండనం చేయించుకొని, తెల్లని ఖాదీ చీర ముసుగుతో కనిపించేది. ఆమెకు బాల్యంలో పోలియో రావటంతో ఒక కాలు కుంటింది. కాలుతో కుంటుతూ కర్ర పట్టుకు నడుస్తూ, ఖాదీ మూటలు నెత్తిన పెట్టుకొని ఖాదీ వస్త్రాలు అమ్మే ఆమె కన్నా దేశ సేవకురాల్ని మరొకర్ని చూడగలమా! ఆవిడ చేతికర్రే ఆమె ఆయుధం. సహాయ నిరాకరణోద్యమం , ఉప్పుసత్యాగ్రహం సహా కాంగ్రెస్ పార్టీ పిలుపులన్నింటిటా పాల్గొంటూ బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాల్లో ఆమె భాగస్వామిగా మారారు .

ఆనాటి మహిళలు ఉద్యమాల్లోకి రావడమే అరుదు . వివిధ ఆంక్షలున్న సమాజంలో దువ్వూరి సుబ్బమ్మ దూసుకు రావడంతో నేతలను సైతం ఆశ్చర్యానికి గురి చేసింది . కేవలం ఆందోళనల్లో పాల్గొనడం , ఉపన్యాసాలు ఇవ్వడమే కాకుండా, తన గంభీర స్వరంతో పాటలు పాడుతూ అందర్నీ ఆకర్షించిన నాయకురాలిగా సుబ్బమ్మ పేరు మారు మ్రోగింది. ఆమెకి వరుసకి మేనమామ అయిన చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు రాసిన "భరత ఖండంబు చక్కని పాడియావు" పద్యాన్ని రాగయుక్తంగా ఆలపించడంతో సుబ్బమ్మ అందరికీ చేరువయ్యారు.

విదేశీ వస్తు బహిష్కరణ వంటి ఉద్యమాల్లో ఆమె ముందు వరుసలో నిలిచారు. ఖద్దరు వస్త్రాలను ప్రోత్సహించేలా ప్రచారం నిర్వహించారు. ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఆ సమయంలోనే ఆమెను పోలీసులు పలుమార్లు అరెస్టు చేశారు . జైలుకి కూడా తరలించారు. పోలీసులకు ఆమె ఏనాడూ బెదర లేదు. పైగా వారు రాజకీయ కార్యకర్తలను లాఠీ చార్జి జరిగినపుడు ఒకామెను పోలీసులు బాగా కొట్టారు . దువ్వూరి సుబ్బమ్మ ఆవేశం కట్టలు తెంచుకుంది. పోలీసులపై విరుచుకు పడింది. " మీరు మనుషులా, రాక్షసులా, ఆ పిల్లను చంపడానికి మీకు చేతులెలా వచ్చాయిరా, మీకు మనసెలా ఒప్పిందిరా అంటూ పోలీసుల మీద విరుచుకు పడ్డారు. ఏమీ చేయలేని పోలీసులు తప్పే అయిందమ్మా క్షమించండి అంటూ లాఠీలు దించి తప్పుకున్నారు".

ఆ రోజుల్లో వితంతువులను గంగా భగీరథీ సమానురాలు అనటం ఉంది. దువ్వూరి సుబ్బమ్మ గారు పోలీసులతో నేనంటే ఎవరనుకున్నావు. నేను గంగా భగీరథీ సమానురాలను. నిన్ను గంగలో ముంచి పారేయ గలననేవారు. కానీ నేను అహింసావాదిని. కనుక ఊరుకున్నా అంటూ గంభీర స్వరంతో అనేసరికి పోలీసులు భయపడి పోయేవారు. అంతేకాక బ్రిటిష్ బానిసా, రా, రా, అనేవారట.

గోదావరి తీరంలోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించేవారు. మహిళలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వారిని ఉత్తేజ పరిచేవారు. దేశ విముక్తి కోసం బ్రిటిష్ వారితో సాగిస్తున్న ఉద్యమంలో అందర్నీ భాగస్వాములు చేసేందుకు ప్రయత్నించేవారు. ఆ క్రమంలో ఓసారి పెద్దాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె లాఠీలకు సైతం ఎదురొడ్డి ముందుకు సాగారు.

ఒకసారి పెద్దాడ కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఓ తోటలో వన భోజనాలంటూ మహిళలను సమీకరించారు. ఆ పేరుతో రాజకీయ సభలు జరుగుతోంది . ప్రారంభంలోనే దువ్వూరి సుబ్బమ్మ గారు దేశభక్తి గీతాలు పాడి స్వాతంత్ర్యోద్యమ నాయకులను ఉత్తేజ పరిచారు. అది గ్రహించిన బ్రిటిష్ సైనికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు . తోటలోకి చొరబడి విచక్షణా రహితంగా మహిళలు యువకులపై దాడి జరిపారు. అప్పుడు చాలామంది చెల్లాచెదురు కాగా దువ్వూరి సుబ్బమ్మ మాత్రం బ్రిటిష్ సైనికులను ఎదిరించి నిలబడ్డారు . లండన్ పార్లమెంట్‌లో సైతం ఈ ఘటన ప్రస్తావనకు వచ్చింది. "ది పెద్దాపురం ఇన్సిడెంట్ " పేరిట అప్పటి ప్రధాన ఆంగ్ల పత్రికలన్నీ ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ప్రచురించాయి.

దువ్వూరి సుబ్బమ్మ అంటే గోదావరి తీరంలో మహిళా చైతన్యానికి మూలస్తంభం వంటివారు. గాంధీ నుంచి ప్రశంసలు అందుకోవడమే కాకుండా సామాన్య మహిళలలో స్వాతంత్ర్య కాంక్ష రగిలించారు . సామాజిక స్పృహ మహిళలకు అవసరమని చెప్పేవారు . మహిళా ఉద్యమాల్లో దువ్వూరి సుబ్బమ్మ వంటి వారు అగ్రగణ్యులు . ఒకవైపు స్వాతంత్ర్య పోరాటం సాగిస్తూనే మహిళలను చైతన్య పరిచేందుకు స్త్రీ విద్య అత్యవసరమని ఆమె గుర్తించారు. అందుకు అనుగుణంగా విద్యారంగంలో మహిళలను ప్రోత్సాహించేందుకు విరాళాలు సేకరించారు. ఆనాడే రాజమండ్రిలో బాలికల పాఠశాలను స్థాపించడంలో ఆమెది ముఖ్యపాత్ర. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు ఆమె తన వంతు ప్రయత్నం చేశారు.

ఆమె ఉద్రేకమైన తత్వం, ఆమె ధైర్య సాహసాలు ఆనాటి పరిపాలకుల్ని వణికించాయంటే ఆశ్చర్యం లేదు. ఆడవాళ్ళని జైళ్ళలో పెట్టడానికి కొంత జంకే వారు ప్రభుత్వం వారు. కానీ దువ్వూరి సుబ్బమ్మని జైలుకి పంపకుండా ఉండటం సాధ్యం కాలేదు వారికి. ఆవిడ ఒక పక్క సనాతనాచార పరాయణురాలు. మరో పక్క గొప్ప దేశభక్తిపరురాలు. ఆమెని జైల్లో పెడితే కొన్ని సమస్యలు ఎదుర్కోవాలనీ భయం ఉంది.

దువ్వూరి సుబ్బమ్మను అరెస్టు చేసి ఒక సంవత్సరం రాజమండ్రి జైలుకి పంపారు. ఆమె ఆ జైలు శిక్షకు ఏ మాత్రం బెదర లేదు. నోటి మాటగా క్షమాపణ చెప్పమన్నారు. కానీ ఆత్మాభిమానం గల దువ్వూరి సుబ్బమ్మ క్షమార్పణ చెప్పడం జరిగే పని కాదుగా. అయితే వంద రూపాయలు జరిమానా చెల్లించమంటే, ఆవిడ నా గుండు తప్ప నా దగ్గర ఏమి లేవని అనటంతో వారికి ఏం చేయాలో తోచ లేదట.

ఆ రోజుల్లో సంజాబ్‌లో పార్వతీదేవి అనే ఆమెను మాత్రమే జైల్లో పెట్టారు. తరువాత ఆంధ్ర దేశంలో దువ్వూరి సుబ్బమ్మ గార్ని మాత్రమే జైల్లో పెట్టారు. ఆంధ్ర దేశంలో మొదటి సారి జైలుకి వెళ్ళిన స్త్రీగా ఆమె ఎందరికో ఆదర్శం.

దువ్వూరి సుబ్బమ్మ జైల్లో ఉన్నా సనాతన బాలికా పాఠశాలను ఆమె శిష్యులు తీర్చిదిద్దారు.

దువ్వూరి సుబ్బమ్మ విజయవాడ రాజకీయ మహాసభల్లో పెద్దలతో పాటు పాల్గొన్నారు. అంతేకాక ఉప్పుసత్యాగ్రహంలో జైలు జీవితం అనుభవించారు. అయితే జైలును కూడా పాఠశాలగా మార్చి ఆటలు పాటలు నేర్చేవారు. పాటలు పాడేవారు. పూజలు జరిపేవారు. పోలీసులకు కుడా మంచి భోజనాలు పెడదామంలూ వంటలు చేసేవారట సుబ్బమ్మ గారు. జైల్లో ఉండి అందరికి భాగవతం చదివి వినిపించడం మరో విశేషం. తన ఆస్తినంతా కాంగ్రెస్ కార్యక్రమాల కోసం అప్పగించారు. చివరకు సొంత బిడ్డలు, ఆస్తి కూడా లేకుండానే ఆమె గడిపారు.

దేశ బాంధవి దువ్వూరి సుబ్బమ్మ గారి లాంటి త్యాగమూర్తులు, నిస్వార్ధ సేవా పరాయణులు మహిళలకెప్పటికీ ఆదర్శమే. చివరి రోజుల్లో ఆమె జీవితం కడియంలో సాగింది. చివరకు 1964 మే 31 వ తేదీన ఆమె మరణించారు.

**ఆధార గ్రంథాలు :**

1. సాంఘిక సేవారంగంలో స్త్రీలు – శ్రీమతి డా. ముక్తేవి భారతి
2. భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు మహిళల పాత్ర – ప్రభావతి

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# తొట్టతొలి స్వాతంత్ర్య సమర యోధురాలు – రాణి వీరమంగ వేలు నాచియార్

డా. సగిలి సుధారాణి, పరిశోధకురాలు, ఫో.నెం. 9490428825

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ వారిని ఎదిరించిన వీరనారి అంటే అందరికీ ముందు గుర్తుకువచ్చేది ఝాన్సీ రాణి(1828–1858) కానీ, అంతకంటే చాలాకాలం ముందే బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ వారిని ఎదిరించి యుద్ధం చేసి వారిని గెలిచిన వీరనారి మరొకరు ఉన్నారు. ఆమే రామనాథాపురం కోటకు యువరాణి! శివగంగ సీమ సంస్థానానికి రారాణి! బ్రిటిష్ వారిని ఎదిరించిన తొట్టతొలి మహిళా యోధురాలు! వేలు నాచ్చియార్. (1730–1790)

**రామనాథపురం సంస్థానం ఆడపడుచు!**

రాజు చెల్లముత్తు విజయ రఘునాథ సేతుపతికి, ముత్యాల నాచియార్ రాణి దంపతులకు 1730 సంవత్సరంలో ఏకైక కుమార్తె వీరమంగ (వేలునాచియార్) జన్మించింది. మగ సంతానం లేకపోవడంతో మగపిల్లాడులాగానే వారి తల్లిదండ్రులు ఆమెను పెంచారు. బాల్యంనుండే విద్యాబుద్ధులతో పాటు వివిధ యుద్ధ కళలలన్నింటిలో నైపుణ్యాన్ని సాధించింది.

**పుట్టినిల్లు రామనాదు సంస్థానమైతే మెట్టినిల్లు శివగంగ సంస్థానం!**

శివగంగ సంస్థానం ఒకప్పుడు వైభవంగా వెలిగింది. దక్షిణాది సంస్థానాలలో కీలక సంస్థానంగా పేరొందింది. శివగంగ రాజు ముత్తు వడగనాథర్‌తో రాణి వేలు నాచియార్ వివాహం జరిగింది. మెట్టినింట శివగంగ సంస్థానంలో అడుగు పెట్టింది 'వేలునాచియార్'. ఈ దంపతులకు ఒక కుమార్తె వెళాచి నాచియార్ కలిగింది.

లక్షరూపాయల కప్పం కట్టమని ఈస్టిండియా కంపెనీ వారు శివగంగ పాలకునికి ఆజ్ఞ జారీ చేశారు. కానీ, శివగంగ రాజు ముత్తు వడగనాథర్ దానిని దిక్కరించాడు. తమపై శత్రువులు దాడి చేస్తారని ముందే పసిగట్టి, తమ రాజధానిని తాత్కాలికంగా 'కలయార్‌కోయిల్'కు మార్చారు. 1772 సం. జూన్–25 తేదీన కలయార్‌కోయిల్‌లో శివగంగరాజు తన రెండవ భార్య గౌరీ నాచియార్, ఇతర సైనికులతో రహస్య సమావేశమై ఉన్నప్పుడు కప్పం కట్టలేదన్న నెపంతో బ్రిటిష్ ఈస్టిండియా పాలకుడు 'జోసఫ్‌స్మిత్' నవాబు కుమారుడైన 'ఉమ్మత్తుఉమర్' అండతో, దాడిచేసి అందరినీ చంపేసి, శివగంగ సంస్థానంలోని ధనం, బంగారాన్ని కొల్లగొట్టాడు. ఈ విషయాన్ని నాటి లండన్‌లోని ప్రముఖ పత్రికలు "కలయార్ కోయిల్ దాడి దారుణమైనది" అనే ప్రధాన మకుటంతో కథనాలు ప్రచురించాయి.

ఆ సమయంలో శివగంగ రాజు ముత్తు వడగనాథర్ మొదటిభార్య రాణి వేలునాచియార్, కుమార్తె వెళాచి నాచియారు తాండవరాయ పిళ్ళై సహాయంతో కొల్లన్ గుడిప్రాంతంలో తలదాచుకొన్నారు. బ్రిటిష్ ఈస్టిండియా వారిని ఎలాగైనా నిలువరించాలని భావించి దివాను సహాయంతో దిండిగల్ దగ్గర గల విరుపాక్షపాళెంకు చేరుకొని అజ్ఞాతంలో, గోపాలనాయకర్ అనే సామంత పాలకుడి సంరక్షణలో సుమారు 8సంవత్సరాలు 'తాండవ రాయ్ పిళ్ళై' శిక్షణలో తమిళ, తెలుగుతో పాటు ఉర్దు, పర్షియన్, ఫ్రెంచ్ ఆంగ్లం మొదాలైన ఆరు భాషలలో రాణి వేలునాచియార్ ప్రావీణ్యాన్ని సాధించింది. అంతేగాక ఫ్రెంచ్ దేశస్థుడైన 'జోస్‌దూప్లే' శిక్షణలో యుద్ధాతంత్రాలు నేర్చుకొని రహస్యంగా జీవిస్తూనే, ఏవిధంగా బ్రిటిష్‌వారిని ఎదుర్కోవాలో ఎత్తులు వేయసాగింది.

**యుద్ధబలం కన్నా యుద్ధతంత్రం మిన్న!**

ఇదే సమయంలో గోపాల్ నాయకర్ సహాయసహకారాలతో మైసూరు పాలకుడు హైదార్ ఆలీతో మైత్రి చేసుకొని తన బలాన్ని, బలగాన్ని పెంచుకొంది రాణి వేలునాచియార్. 1780 సం.లో 'ఉదయల్' అనే ఒక ప్రత్యేక మహిళ సైనికదండును తయారుచేసింది. అయితే ఆంగ్లేయుల దగ్గర ఉన్న ఆయుధసామగ్రి ముందు వీరి బలం చిన్నదే! ఇక్కడ 'యుద్ధబలం' కన్నా 'యుద్ధతంత్రం' పని చేస్తుందని భావించి తన దండులోని వారికి మానసికబలాన్ని అందించింది. అదనుకోసం ఎదురుచూడసాగింది.

ఆంగ్లేయుల ఆధీనంలో ఉన్న శివగంగ కోటలోపలి కోవెలలో అమ్మవారిని దర్శించుకొనేందుకు ఆడవారికి మాత్రం అనుమతి ఇచ్చేవారు. దీనిని అవకాశంగా తీసుకొని ఒకసారి దసరా నవరాత్రి ఉత్సవాలలో గుళ్ళో పూజలుచేసే నెపంతో రాణి వేలు నాచియార్ 'ఉదయల్' ప్రత్యేక మహిళా సైనిక దండు 'కుయిలీ' అనే యువతి నేతృత్వంలో భక్తుల ముసుగుల్లో జొరబడింది. ఆంగ్లేయులపై ప్రతీకారం తీర్చుకొనేందుకు గుడిలో దీపంకోసం వుంచిన ఆజ్యాన్ని(నెయ్యి) కుయిలీ ఒంటిపై కుమ్మరించుకొని ఆంగ్లేయుల ఆయుధాల గదిలోనికి జొరబడి తనకుతాను నిప్పు అంటించుకొని ఆత్మాహుతి అయ్యి, ఆయుధాల గదిని పేల్చి వేసింది. చరిత్రలో మొట్ట మొదటిసారి 'మానవ బాంబు' ఇదేనని చరిత్రకారుల అభిప్రాయం. (ఇటీవల చిరంజీవి, తమన్నా నటించిన సైరా నరసింహారెడ్డి చలన చిత్రంలో ఈ దృశ్యాన్ని చిత్రీకరించడం జరిగింది)

ఆ విధంగా ఆంగ్లేయుల ఆయుధాలను నాశనంచేసి, వారిని బలహీనపరచి, వారిపై దాడిచేసి తన శివగంగసీమను తిరిగి దక్కించుకొంది రాణి వేలునాచ్చియార్. శివగంగ సంస్థానంలో తన పాలనకాలంలో ఉరిశిక్షను రద్దు చేసింది. కొన్నేళ్ళకు వేలునాచ్చియార్ అనారోగ్యానికి గురై ఫ్రాన్స్ దేశానికి వెళ్ళి చికిత్స కూడా తీసుకొంది. కానీ, ఫలితం లేక పోయింది. 1790 సం. లో వేలు నాచియార్ మరణించింది.

నేటి తమిళనాట శివగంగ కోట ముందు వేలు నాచ్చియార్ కాంస్య విగ్రహం మనకు దర్శనం ఇస్తుంది. ప్రస్తుతం శివగంగ వారసులే ఆనాటి కోటలు, దేవాలయాలు, విద్యాలయాలు, ఇతర కట్టడాల భాధ్యతలు చూసుకొంటున్నారు. వారి వారసులు వేలునాచ్చియార్ రాణి మధురాంతకి నాచ్చియార్, మహేష్ దొరె అవ్వగారైన "రాణి వేలు నాచ్చియార్ ఆంగ్లేయులతో పోరాడి, ఓడిపోయి తిరిగివచ్చి తన సీమను చేజి క్కించుకొన్న మొట్టమొదటి స్వాతంత్ర్య సమర యోధురాలు" అని గర్వంగా చాటి చెబుతారు. ముత్తు వడుగు నాయకర్ అనేది తమకు గల బిరుదని చెప్పారు. సంగమకాల చరిత్ర ప్రకారం తమిళులు తెలుగువారిని 'వడుగర్' అని పిలిచేవారు. 'వడుగర్' అని అంటే వారికి ఉత్తర ప్రాంతంలో ఉన్నవారు అని అర్థం. ఇంకా "గౌరి వల్లభ, ముత్తువల్లభ" అనే బిరుదులు వీరికి ఉన్నాయి. "మా తాతగారు షణ్ముగరాజు తెలుగు, సంస్కృత భాషలలో చక్కటి ప్రావీణ్యాన్ని సాధించారు" అని చెప్పారు.

**అన్నవరంతో అనుబంధం**

శివగంగ సంస్థానానికి తెలుగువారికి చాలా బలమైన సంబంధాలే ఉన్నాయి. తూర్పుగోదావరి అన్నవరం సంస్థానంతోను, విజయనగరం జిల్లా బొబ్బిలివారితోను వైవాహిక సంబంధాలు ఉన్నాయి. ముఖ్యంగా అన్నవరం ఆలయధర్మకర్తలతో సన్నిహితసంబంధాలున్నాయని చెప్పారు. "రాజమ్మ(జేజమ్మ)గారి అన్నకొడుకు అన్నవరం ఆలయధర్మకర్త!" అని ప్రస్తుత రాణి మధురాంతకి నాచ్చియార్ అన్నారు. అన్నవరం దేవస్థాన ధర్మకర్త కిల్లంపూడి జమిందార్లు ఇసుగంటి రామ్‌కుమార్ ఇదే విషయాన్ని ధృవీకరించారు. "పూర్వం శివగంగ సంస్థానంలోని రాజాగారికి మా మేనత్తను ఇచ్చారు. మా అత్తవాళ్ళ సంబంధీకులు శివగంగ సంస్థానంలో ఉన్నారు. అలాగే రామనాథ సంస్థానంలో మా అక్కగారిని ఇచ్చాము. అక్కడివారు తెలుగు భాషను అర్థం చేసుకోగలుగుతారు" అని చెప్పారు.

రాణి మధురాంతకినాచ్చియార్‌తో నేను ముఖాముఖి జరిపినపుడు తెలుగులో మాట్లాడితే బాగా అర్థం చేసుకొంది. కాకపోతే ఇంగ్లీషు, తమిళంలో సమాధానం చెప్పింది. "బావ, పెద్దమ్మ, నాయన, రాజమ్మ, బువ్వ, సీమ" మొదలైన కొన్ని తెలుగు పదాలు వారి వాడుక భాషలో ఉపయోగిస్తారని చెప్పింది. "మీరు తెలుగు మూలలు ఉన్నవాళ్ళే!" అని నేను మధురాంతకి రాణితో అనగానే ఆమె వెంటనే సంతోషంతో ఒక చిరునవ్వు నవ్వి, తన ముందువున్న బల్లపై ఉన్న నోటుపుస్తకంలో తెలుగు అక్షరమాలలోని 'అ,ఆ' రెండు అక్షరాలను చక్కగా వ్రాసిచూపి నా పరిశోధనకు మరింత బలం చేకూర్చింది. తను చవరాలు చేసిన శివగంగ చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని నాకు అందించారు. దానిని భద్రంగా దాచుకొన్నాను.

**ఆ నాణేలు తెలుగులో....**

పూర్వకాలంలో తమ సంస్థానంలో తెలుగు నాణేలు ముద్రించారు. వాటిని లండన్ మింట్‌లో ముద్రించేవారని చెబుతున్నారు. ఆ నాణేలపై 'విజయ' అని తెలుగులో రాసి ఉంది. ఈ నాణేలు శివగంగ సంస్థానానికి, పుదుక్కోట సంస్థానానికి తెలుగువారికి గల బంధానికి బలం చేకూరుస్తున్నాయి.

**శివగంగ కోటలో గౌరి విలాసం (మూలమాడి సంస్థానం)**

శివగంగ కోటలోపల మూడు అంతస్థుల భవంతి ఉంది. పై అంతస్థులో రాణివాసం. అంతస్థు పైన బంగారంతో నిర్మించిన బంగారు కలశం ఉండటంతో దీనికి 'తంగ కలశ భవంతి' అనే పేరు వచ్చింది. రెండో అంతస్థులో అపురూపమైన తైల వర్ణచిత్రాలు ఉన్నాయి. మొదటి అంతస్థులో, వీరి పూర్వీకులు ఉపయోగించిన ఖడ్గాలు, ఆయుధాలు ఉన్నాయి. వీరి రాజచిహ్నం ఆంజనేయుడు, గంగతో కూడుకొని ఉంటుంది. ఇది తమిళనాట వేరెక్కడా మనకు కనిపించదు.

**తొట్టతొలి స్వాతంత్ర్య సమరయోధురాలుగా ఘనత!**

చివరిగా నా విశ్లేషణలో తేలిందేమంటే బ్రిటిష్ వారిని ఎదురొడ్డి నిలిచిన తొలి స్వాతంత్ర్య సమర యోధుడు కట్టబొమ్మన అయితే, తెల్లవాళ్ళ అంతు చూసేందుకు కత్తి దూసిన తొలి వీరనారి, ప్రథమ స్వాతంత్ర్య సమర యోధురాలు రాణి వేలునాచియార్ అన్న సంగతి చాలామందికి తెలియదు! సుమారు పది సంవత్సరాలు పాటు శివగంగ సంస్థానాన్ని పాలించి దాక్షిణాపథ చరిత్రలో మొట్టమొదాటి స్వాతంత్ర్య సమరయోధురాలుగా ఘనతకెక్కింది. ఇక్కడ చారిత్రకమైన ముఖ్యమైన విషయం ఏమిటంటే "ఝాన్సీ లక్ష్మీబాయి లాంటి వాళ్లు శత్రువులతో పోరాడి వాళ్ల ప్రాణాలను పోగొట్టుకొన్నారు. కానీ ఈమె ఓడిపోయినా, తిరిగివచ్చి ఆంగ్లేయులతో పోరాడి తన శివగంగసీమను చేజిక్కించుకొని చరిత్రలో నిలబడి పోయింది! తెలుగు జాతికి గర్వకారణమైంది!"

**ఆధారగ్రంథాలు**

1. రాణి మధురాంతకినాచియార్, మహేష్ దొరైతో జరిపిన ముఖాముఖి
2. తమిళనాట తెలుగు ప్రజలు జానపద విజ్ఞానం – డా. సగిలి సుధారాణి-ISBN–81–86073– 316–1 ప్రపంచ తెలుగు మహాసభలు– 27–29– డిసెంబర్,2012 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి మరియు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
3. A STRUGGLE FOR FREEDOM IN THE RED SOIL OF SOUTH – PUBLISHER BY BHARATHI AUTHOR- M.BALA KRISHNAN,HEAD MASTER, Rtd,SIVA GANGA.
4. నా పరిశోధన ఆధారంగా టివి. 9 లో మనకు తెలియని మన చరిత్ర శివగంగపై ప్రత్యేక డాక్యుమెంటరీ కథనం.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమం– మహిళా చైతన్యం

**వి. వెంకటేశులు**, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి. సెల్: 8142257837

భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో పోరాటం చేశారు. తమ పోరాట పటిమను చూపించారు. భారత స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించారు.ప్రాణత్యాగం చేశారు ఎందరో మహానుభావులు. వాళ్ళ ప్రాణత్యాగం చేసి భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకొస్తే ఇప్పుడు మనం హాయిగా బతుకుతున్నాం. మీకు ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు తెలిసి వుండవచ్చు. కానీ ఈ భారత మహిళలు కూడా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నవాళ్ల పోరాట పటిమ తెలుసా? మహిళలు అయినప్పటికీ తెగించి బ్రిటిషు వార్లతో పోరాడారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వామ్యులయ్యాయి.

**సరోజిని నాయుడు :** 1897వ సంవత్సరం ఫిబ్రవరి 13 వ తేదిన డాక్టర్ అఘోరనాథ్ చటోపాధ్యాయ, వరద సుందరీ అనే దంపతులకు హైదరాబాద్‌లో జన్మించారు. అఘోరనాథ్ చటోపాధ్యాయ గారు హైదరాబాద్ కళాశాలకి (నిజాం) మొట్టమొదటి ప్రధానోపాధ్యాయులు పనిచేశారు. తల్లి వరదదేవీ చక్కని రచయిత్రి.

శ్రీమతి సరోజిని నాయుడు తల్లిదండ్రులు విద్యాధికులవడం వలన ఆమెలో చిన్నతనం నుండే కార్యదీక్ష పట్టుదల విద్యపై తిరుగులేని సదభిప్రాయాలు ఏర్పడడం జరిగింది. ఏది చూసిన ఎవరి మాటలు విన్నా పట్టించుకోకుండా తమ ఆలోచనల్లో తాముంటారు. చాలామంది కొందరు  కాక బాల్యం నుంచి ప్రతి విషయంలోనూ కూతుహలం కనపరిచి ఏది ఏమిటో తెలుసుకునే వరకు విశ్రమించారు. రెండవ కోవకు చెందిన మేధావి శ్రీమతి సరోజిని నాయుడు.

ఆమె 12 వ ఏట మద్రాసు విశ్వవిద్యాయలంలో మెట్రిక్‌లేష్యన్ పూర్తి చేయగలిందంటే ఆమె చురుకైన తెలివి తేటలు  విద్య యందు ఆమెకు గల అంకితభావం మనం అర్థం చేసుకోవచ్చు. చాలామంది విద్యార్థులు నిత్యం పాఠశాలకు వెళుతూ విద్యయందు దృష్టి నుంచక గురువులు చెప్పే పాఠాలు కాలక్షేపానికి భావిస్తూ గురువులను విద్యార్థులను అవహేళన చేస్తూ కాలం విలువ తెలియక ప్రవర్తించి  జీవితంలో అడుగుపెట్టి సాదక బాధకాలు ఎదురయ్యాక వృధా చేసిన కాలం గురించి బాధపడుతుంటారు. అటువంటి వారందరికి శ్రీమతి సరోజిని నాయుడు నిజంగా ఆదర్శనమూర్తి.భారతదేశ మొదటి మహిళ గవర్నర్‌గా  సరోజిని నాయుడు చరిత్రకు ఎక్కారు.

సరోజిని 12 వ యేట మద్రాసు విశ్వవిద్యాలయం మెట్రిక్‌లేష్యన్ పరీక్షల్లో ప్రథమురాలిగా నిలిచి పలువురి ప్రశంసలు అందుకుంది. ఈమె 13 సంవత్సరాల వయస్సులోనే " ది లేడి ఆఫ్ ది లేక్" పేరున 1300 పంక్తుల కవితను 6 రోజుల్లో రాసింది.

1930లో ఉప్పు సత్యాగ్రహంలో మహాత్మగాంధీతో పాటు పాల్గొన్నది. ఆమె మద్రాసులో చదువుకున్నది. చదువు పూర్తి అయిన తర్వాత 19 సంవత్సరాల వయస్సులో కులాంతర వివాహం చేసుకున్నది. కులాంతర వివాహంలకు సమాజం  చాలా వ్యతిరేకంగా ఉన్న ఆ రోజుల్లో సరోజిని గోవిందరాజులు నాయుడును బ్రహ్మోవివాహం చట్టం 1872 ప్రకారం 1898  డిసెంబర్ న మద్రాసు లో పెళ్లి చేసుకుంది. వీరి వివాహాన్ని కందుకూరి వీరేశలింగం పంతులు జరిపించారు.  నాయుడు దంపతులకు నలుగురు పిల్లలు కలిగారు. జయసూర్య, పద్మజ, ధనధీర, లీలామణి.

ఆమె ప్రతిభని గుర్తించిన హైదరాబాద్ నిజాం ప్రభువు విదేశాల్లో చదువికి ఉపకార వేతనం ఇచ్చారు. కానీ అనారోగ్యం కారణంగా 2 సంవత్సరాలు విశ్రాంతి తీసుకోవాల్సివచ్చింది. ఆ రెండు సంవత్సరాలు పుస్తక పఠనంలోనే గడిపి అపారమైన జ్ఞానాన్ని సముపార్జించారు.

ఆ కాలంలోనే 16ఏళ్ల వయస్సులో సరోజిని చటోపాధ్యాయ పై చదువులకు లండన్ పయానమై వెళ్లారు. లండన్‌లోనే ప్రముఖకవులైన  హెడ్మండ్ గాస్కీ, ఆర్థర్ సైమన్‌ల పరిచయం కలిగింది. సరోజిని రాసిన  "దిబర్డ్ ఆఫ్ టైమ్" కవితా సంకలనం

పరిచయ వాక్యాలలో హెడ్మండ్ గాస్కీ వెలిబుచ్చిన భావాలు ఆయన మాటల్లోనే సరోజిని మొదటి కవితా సంకలనం "ది గోల్డేన్ త్రేషోల్డ్" లో ప్రచురించారు. తనకు మార్గదర్శి అయిన హెడ్మండ్‌గాస్కీకే ఆ సంకలనాన్ని అంకింతం ఇచ్చారు. దానికి పరిచయ వాక్యాలు ఆర్థర్ సైమన్ రాశారు. కవికోకిల కవితలలో గేయాలు, గీతాలు, పద్యాలున్నాయి. ఆవిడ ప్రథమ కవితా సంకలనం గోల్డేన్ త్రైషోల్డ్‌లో ఈ మూడు ప్రక్రియలున్నాయి. ఆ సంకలనం రూపొందడానికి ఆర్థర్ సైమన్ ముఖ్యకారకులు. 1908లో మూసి నదికి వరదలు సంభవంచిన సమయంలో చేపట్టిన సేవకార్యక్రమానికి బ్రిటిష్ ప్రభుత్వం "కైజర్ ఏ హిందూ" స్వర్ణ పథకాన్ని బహుకరించింది.

19 వ శతాబ్ధపు చివరలో సంధ్యా సమయంలో హైదరాబాద్ నగరం ఏ విధంగా ఉండేది? కవి కోకిల కవితా "నైట్‌వాల్ ఇన్ ది సిటి ఆఫ్ హైదరాబాద్" చదివితే చాలు కళ్ల ముందు నిలుస్తుంది. నగర వంతెన మీద నుండి రివిలా రాణిలా వస్తుంది రాత్రి. ఒక్కసారి ఆ కాలానికి వెళ్లి నగర వీధుల్లో సంచారం చేసిననట్లు ఇంకా హైదరాబాద్ బజార్లలో సందడి ఎలా ఉండేది. ఇన్ ది బజార్ ఆఫ్ హైదరాబాద్ చదివామంటే చాలు ఆ బజార్లోకి వెళ్లిపోవాల్సిందే.

సరోజిని నాయుడు మహిళాభివృద్ధికే ఎంతో కృసి చేసి 1906లో మహిళలకు విద్య అవసరమని దేశమంతా ఎన్నో మహిళా సమావేశాలు ఏర్పరచి మహిళలో చైతన్యం తీసుకురావడానికి ఎంతో పాటు పడ్డారు. స్వాతంత్ర్య సాధనలో తాను పాలు పంచుకోవాలని ఆలోచించిన శ్రీమతి సరోజిని నాయుడు కాంగ్రెస్ జాతీయ భావాలకు అనుగుణంగా నడుచుకోనారంభించింది. 1915వ సంవత్సరం బొంబాయిలో జరిగిన కాంగ్రెస్ మహా సభలలో, 1916 లో జరిగిన లక్నో కాంగ్రెస్ సభలలో ఆమె పాల్గొనడం జరిగింది. ఆ నాటి కాంగ్రెస్ భావాలు చాలా ఆదర్శంగా ఉండేవి. సరోజిని నాయుడు భారతదేశంలో గల ముఖ్యమైన నగరాల్లో తిరుగుతూ స్వాతంత్రోద్యమ ఉపన్యాసలిచ్చి ప్రజలలో భాష విప్లవం వచ్చేందుకు కారకురాలు అయ్యింది.

మృదువుగా మాట్లాడుతూ, ఎంత కఠినమైన విషయాలైన శ్రోతల గుండెలను హత్తుకుని మరుగున ఉన్న యదార్థస్థితిని అర్థమయ్యే విధంగా ఉండే ఆమె గంభీరమైన ఉపన్యాసాలు శ్రోతలకు కాలం, శ్రమ తెలియనిచ్చేవి కావు.

ప్రభుత్వానికి ఎదురుతిరిగి తూటదెబ్బలకు చీకటి కోట్లకు బలయ్యే బదులు ఈ బానిస బ్రతుకే నయం అనుకునే సర్ధుకుపోయే ఆ అమాయక ప్రజానీకములో ఆమె ఉపన్యాసాలు దేశభక్తిని నూరిపోసి చావుకు కూడా భయపడని తెగింపుకును తేగలిగాయి. " జాతివేరని దేశం వేరని నువ్వు వేరని ఏడగ ఉండక నీకు జరిగితే దేశానికి జరిగినట్టే దేశం అనుభవించే భానిసతనం నీవు అనుభవించవలసినదే" అంటూ దేశమంతా తిరిగి దేశభక్తిని నూరిపోసిందా? వీరతిలకం.

విశ్రాంతిలేని ప్రయాణాలతో, ఉపన్యాసాలతోనూ ఆమె ఆరోగ్యం పాడైంది. 1919లో పంజాబ్‌లోని జలియన్ వాలాబాగ్‌లో హత్యాకాండ జరిగింది. ఆ సయయానికి సరోజిని నాయుడు లండన్‌లో చికిత్స పొందుతోంది. అప్పటి పంజాబ్ గవర్నర్ డయ్యర్ లక్షలాది ప్రాణాలను తుపాకీ గుండ్లకు బలిచేసి దారుణంగా హింసించి చంపిన విషయం ఆమె లండన్ నగరంలో విన్నది. ఆమె గుండె జబ్బుకాక చనిపోయిన వారి భార్యలు, కుమార్తెలు, కుమారుల గుండెలు పగిలే శోకాలు తలుచుకుని ఆ కరుణామూర్తి చలించిపోయింది.

ఆ పరిస్థితిలో తను ఉండి కూడా ఆరోగ్యాన్ని ఏ మాత్రం లెక్కలేయక డయ్యర్ మీద ఆందోళన లేవదీసింది. గాంధీజికి పంజాబ్ దారుణం గురించి ఉత్తరము వ్రాస్తూ యావత్ ప్రపంచ భారతీయులకు డయ్యర్ ద్వారా జరిగిన ఘోరాన్ని వినిపించనిదే నిద్రపోనని వారి రాక్షస కృత్యాలకు బదులుగా భారతదేశం నుంచి వారిని తరిమికొట్టి భారతీయుల స్వేచ్ఛ చూడనిదే భారతమాత ఆత్మ శాంతించదని తన సందేశం ద్వారా తెలిపింది.

భారతదేశం పైన భారతీయుల పట్ల ఆమెకున్న ప్రేమ,వాత్సల్యం ఆమె సొంత ఆరోగ్య విషయం కూడా మరచిపోయే విధంగా చేశాయంటే ఆమె దేశభక్తి,త్యాగనిరతిని మనం అర్థం చేసుకోవచ్చు. ఆ సమయంలోనే ఒక బహిరంగ సభలో ఉపన్యసిస్తూ బ్రిటిష

పాలకులు భారతదేశాన్ని సొంతంగా భావించడమే అపరాధం. భారతీయుల హక్కులు కాలరాసి, బానిసలు చేసి వారి ప్రాణాలు సైతం బలితీసుకోవడం క్షమించరాని అపరాధం అంటూ ఆడ పులిలా గర్జించింది.

లండన్ కామన్స్ సభలోనే భారతదేశ మంత్రి ఆమె చేస్తున్న తిరుగుబాటు దాటికి చలించిపోయారు. ఆమె ఉపన్యాసాలు, ఉద్వేగం సక్రమైనవి కావని ఇక పై అటువంటి ప్రచారం చేయవద్దని, బ్రిటిష్ ప్రభుత్వం ఆమెపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చింది. తనకు ఏరకమైన శిక్ష విధించిన యదార్థాన్ని ప్రచారం చేయక మాననని నిర్భయంగా సమాధానం చెప్పింది సరోజిని నాయుడు. ఒక భారత స్త్రీకి దేశంపై గల ప్రేమను, ఆమెకు గల స్వాతంత్ర్య పిపాసను అర్థం చేసుకున్న గాంధీజి ఆనందానికి అంతులేకుండా పోయింది. ఆయన రాజద్రోహము నేరము క్రింద ఆరేండ్లు కారాగార శిక్ష అనుభవించేందుకు వెళుతూ సరోజిని నాయుడుపై గల విశ్వాసంతో ఉద్యమ నాయకత్వం ఆమెకు అప్పగించారు.

ఊరూర, వాడవాడల తిరుగుతూ స్వాతంత్ర్య ప్రబోధం ముమ్మరగా సాగింది. అప్పటికే ఆమె ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉంది. తన భర్త,బిడ్డల మాదిరిగా భావించి పర్యటన సాగించిందా త్యాగమూర్తి. విరామ సమయాల్లో దేశ ప్రజల భవిష్యత్‌ను గుర్తించి బ్రిటిషువారి ఘోర పరిపాలన గురించి రచనలు చేస్తూనే ఉంది. ఎక్కడున్నా ఏదోక రకంగా దేశ ప్రజలకు స్వాతంత్ర్య ప్రబోధాలు అందజేస్తూనే ఉందావిడ.

పురోగతిని, స్వచ్ఛమైన స్వేచ్ఛ స్వాతంత్ర్య జీవితాలను వాచించినా పురుష కవి రవీంద్రనాథ్ ఠాగూర్ మాదిరిగా స్త్రీయై కృషి చేసిన త్యాగపూరిత కవయిత్రి శ్రీమతి సరోజిని నాయుడు అనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

తనే దేశం దేశమే తనుగా భావించి దేశసేవ చేసిన అబేధ భావాలమూర్తి, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, సాహిత్య రంగాలలో రకరకాలుగా సేవలు చేసి మానవసేవ చేయదలచుకున్నవారికే మార్గాలనేకమని నిరూపించిన మహిమాన్వితురాలు, జీవితమంతా మానవసేవకు దేశ సేవకు అంకింతచేసే తన 70వ ఏట 1949 మార్చి 2 వ తేదిన లక్నోలు ప్రశాంతంగా కన్నుమూసింది.

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# "సిక్కోలు సివంగి" సాసుమాను గున్నమ్మ

**కొర్లాం సాయి వెంకటేష్, డా. జర్రా కోటేశ్వరరావు, శిరసన్మేటి పద్మావతి**
వృక్షశాస్త్ర విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు, తిరుపతి జిల్లా, ఆం.ప్ర. – 517 583

శ్రీకాకుళం ఉత్తరాంధ్ర శిఖరాగ్రం. ఈ జిల్లాలో ప్రధానంగా రైతాంగం రైతు సమస్యలు సర్వసాధారణంగా కనిపిస్తాయి. సుమారు 1940 దశకంలోనే అటు బ్రిటిష్ సామ్రాజ్యవాద పోకడలు కు మరోవైపు జమీందారుల పెత్తందారీ తనానికి మధ్యలో నలిగిపోతున్న సామాన్య ప్రజానీకానికి ఉద్యమం అనే ఊపిరి, విప్లవం అనే ఆయుధం, అందించిన స్వాతంత్ర్య సమరయోధులలో వీర గున్నమ్మ ప్రధానమైన వారు. 'కళింగాంధ్ర వీరసివంగి' గా పేరు సంపాదించుకున్న సాసుమానుగున్నమ్మ సర్వసాధారణమైన రైతు కుటుంబానికి చెందిన మహిళ. కట్టుబాట్లకు, కడగళ్ళకు ఆలవాలమైన ఆమె జీవితం విప్లవం బాట పట్టడానికి, ఎర్రబావుట ఎగరవేయడానికి కారణం జమీందారుల పెత్తందారీతనం. బ్రిటిష్ అధికారుల తొత్తులుగా ఉన్న జమీందారులు పేద రైతుల నుంచి వారు సంపాదించే ప్రతి పైసా లో వాటా దౌర్జన్యంగా చేజిక్కించుకోవడాన్ని నిరసిస్తూ వీర గున్నమ్మ పోరాటం చేసింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీకాకుళం గా పిలవబడుతున్న చిక్కోలుకు తనదైన స్వాతంత్ర సమరయోధుల జాబితా ఉంది. అయితే అందులో పేరెన్నిక కలిగిన మహిళా స్వాతంత్ర్య సమరయోధురాలుగా వీర గున్నమ్మను చెప్పొచ్చు. ఈమె విరోచిత పోరాటానికి గుర్తుగా శ్రీకాకుళం జిల్లా "గుడారి రాజమణిపురం" గా (జి ఆర్ పురం) పిలవబడుతున్న గ్రామానికి " వీర గున్నమ్మ పురం" (వి జి పురం) అని పేరు పెట్టటం ఆమె స్ఫూర్తిని ప్రజల హృదయాలలో చిరస్థాయి గా శిలాశాసనం చేయడమే. ఒక గర్భిణి, చావుకు వెరవకుండా, యుద్ధ వాతావరణానికి భీతిల్లకుండా, విప్లవ సివంగి గా ముందుకురుకుతూ, తోటి సాయుధులలో పోరాట స్ఫూర్తిని రగిలించడం ద్వారా బ్రిటిష్ మరియు జమీందారుల పోలీసుల గుండెల్లో భయం కల్పించడం, అణచివేయబడిన, అణగారబడిన పీడిత కర్షక ప్రజానిక ఆక్రందన యొక్క అనంత ఆవేశాన్ని ప్రదర్శించడమే. అయితే ఆ విప్లవానికి, ఆ ఆయుధానికి తగిన స్థానం చరిత్రలో లభించకపోవడం శోచనీయాంశం. మందస పరిసర ప్రాంతాలలో గున్నమ్మ కథ వివిధ జానపద పాటల రూపంలోనూ రూపకాల రూపంలోనూ ఇప్పటికీ వీధి వీధి ప్రదర్శిస్తూ తిరిగేటటువంటి కళాకారులు ఉండడం గున్నమ్మ వీరత్వానికి ఆ ప్రాంత ప్రజలు పలుకుతున్న నీరాజనం గానే చెప్పవచ్చు.

"వీర గడ్డ రా.....
**మందస యుద్ధభూమి రా.....**
**రైతు బిడ్డ గున్నమ్మను కన్న నేలరా.....**
**నీళ్లు పోసి పెంచలేదు, జమీందారు అడవులను**
**రెచ్చగొట్టి రైతులను, కొల్లగొట్టి జమీందారు...."**

అంటూ సాగిపోయే జానపద పాట ఆనాటి పరిస్థితుల్లో జమీందారులు చేసేటటువంటి దాష్టీకానికి ఒక వెచ్చని నెత్తుటి సంతకంగానే మిగిలిపోయింది. అటువంటి కష్టానికి విలువివ్వని కసాయితనాన్ని వెక్కిరించే మెరుస్తున్న ఎర్ర బావుట గా గున్నమ్మ ఈనాటికి జనాల మనసుల్లో ఒక స్ఫూర్తి మూర్తిగా నిలిచింది.

పలాస పరిసర ప్రాంతాల్లో జరిగిన అఖిల భారత కిసాన్ సభలకు ప్రేరణ పొందిన రైతాంగానికి తన సూచనలతో దగ్గర్లో ఉన్న అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లి అక్కడ కలప సుమారు 100 ఎడ్లబండ్ల పైన రవాణా చేసే క్రమంలో స్థానిక జమీందారుల నుంచి ఎదుర్కొన్న అమానవీయ సంఘటనలకు, వారిపై జరిగిన దాడులకు ప్రతిధ్వని గా గున్నమ్మలో వీరత్వం గర్జించింది.

గున్నమ్మ నాయకత్వంలో ఉన్న రైతాంగాన్ని, వారి పోరాటాన్ని అణిచివేసే క్రమంలో స్థానిక జమీందారులు బ్రిటీష్ పోలీసుల సహాయంతో యుద్ధ వాతావరణాన్ని తలపించే భీతావాహ పరిస్థితుల్ని కల్పించారు. అయితే ఒక గర్భిణి, అక్కడ రైతులలో పోరాట స్ఫూర్తిని నింపి, తెల్లవారిని తరిమికొట్టే క్రమంలోనే, ఆ సూర్యాస్తమయ వేళ నేలకొరకడం, ఆ ప్రదేశానికి వీర గున్నమ్మ పురంగా పేరు పెట్టడానికి తగిన అర్హతను సంపాదించి పెట్టింది.

గున్నమ్మ చేసిన వీరోచిత పోరాటానికి గుర్తుగా ఆ గ్రామం పొలిమేరలో నిర్మించిన స్వాగత ద్వారం ఆనాటి యుద్ధ సన్నివేశ చిత్రీకరణ చేస్తుంది. చరిత్రలో సముచిత స్థానం లభించకపోయినా, స్థానిక జన హఅదయాలలో చిరస్థాయిగా , సుస్థిర స్థాయిగా, స్థానం సంపాదించుకున్న గున్నమ్మ నారీమణులకే కాదు , పోరాట పటిమను ప్రదర్శించవలసిన ప్రతి సమూహానికీ, విప్లవ వీరావేశ శంఖారవమే ఆశయ సాధనకు పరమ సోపానమనుకున్న ప్రతి వ్యక్తి కి అవసరమైన జీవిత పాఠం.

మందస తాలూకాకు చెందిన గుడారి రాజమణిపురం అనే గ్రామం గున్నమ్మ స్వగ్రామం. ఒక రైతు కుటుంబంలో జన్మించిన గున్నమ్మ తల్లితండ్రులు దుంపల కిష్టమ్మ, పారమ్మ దంపతులు. తల్లి పారమ్మ, గున్నమ్మ చిన్నవయసులోనే మరణించగా తండ్రి అన్నీ తానై పెంచడం జరిగింది. తండ్రి కిష్టమ్మ నిరక్షరాస్యుడైనప్పటికీ, సమాజం పట్ల, సమాజంలో జరుగుతున్న వివిధ పరిస్థితుల పట్ల అవగాహన కలిగి ఉన్న వ్యక్తిగా, ఇంటిదగ్గర రైతాంగ సమస్యలు, అప్పటి ప్రజల ఆర్థిక స్థితిగతులు మొదలైన వాటి గురించి చర్చించేవాడు. చిన్న వయసులోనే గున్నమ్మ కు సాసుమాను మాధవయ్య అనే వరునితో వివాహం జరిగింది. మాధవయ్య ఉపాధి కోసం రంగూన్ వెళ్లి కొంతకాలానికి అక్కడే అనారోగ్యంతో మరణించడం జరిగింది. చిన్న వయసులోనే భర్తను కోల్పోయిన గున్నమ్మ, భర్త చనిపోయిన నాటికి ఒక గర్భిణి స్త్రీ.

1988 లో అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ కుముర్బెన్ జోషి, గున్నమ్మ స్మారక స్థూపం ఆవిష్కరించారు. ఆమె జీవనోద్యమ పోరాటాన్ని 'మందస జమీందారీ రైతుల తిరుగుబాటు– గున్నమ్మ' పేరిట డా. బి.వి.ఎ.రామారావు నాయుడు ఓ చిన్న పుస్తకం గా తీసుకొచ్చారు. నల్లా ధర్మారావు రచించిన "వీర గున్నమ్మ కళింగ సివంగి" అన్న పుస్తకం ఆమె జీవిత విశేషాలను వర్ణిస్తుంది. దీనికి తోడుగా చలనచిత్ర రంగంలో కొందరు ఈ కథ అంశాన్ని తెరకెక్కించాలని అభిలాషించటం ఒక చక్కని దేశభక్తి నిండిన ప్రయత్నం గానే ఆశీర్వదించాలి.

మందస జమిందారి వేధింపులకు వ్యతిరేకంగా జమీన్ పరిధిలో రైతు నాయకుడు మార్పు పద్మనాభం నాయకత్వంలో మందస జమీన్ రైతు సంఘం ఏర్పడి, అదనపు శిస్తు వసూళ్లకు వ్యతిరేకంగా రైతులను సమీకరించడం మొదలు పెట్టింది. రైతు సంఘం కార్యక్రమాలకు దుంపల కిష్టమ్మ ఇల్లే కేంద్ర బిందువు. రోజు రోజుకు జమిందారీ వ్యతిరేకత పెంచుకుంటున్న గున్నమ్మలో రైతు నాయకుల ప్రసంగాలు బలమైన ముద్ర వేయసాగాయి. మందస జమిందారు పట్ల రైతుల్లో తీవ్ర వ్యతిరేకత పెంపొందించడంలో రైతు సంఘం విజయం సాధించిందనే చెప్పాలి. ఎందుకంటే 1937లో మద్రాస్ ప్రెసిడెన్సీలో జరిగిన శాసన సభ ఎన్నికలలో రైతు సంఘం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి పుల్లెల శ్యామసుందర రావు చేతిలో జమిందారు బలపరచిన జస్టిస్ పార్టీ అభ్యర్థి ఘోర పరాజయం పాలయ్యారు.

ఆల్ ఇండియా కిసాన్ 5వ మహాసభలు 1940 మార్చి 27, 28 తేదీలలో పలాసలో జరిగాయి. మందస జమీన్ రైతులు ఎంతో ఉత్సాహంతో మహాసభల జయప్రదానికి కఅషి చేశారు. గున్నమ్మ నాయకత్వంలో ఒక దళం అవిశ్రాంతంగా పనిచేసింది. వేదికపై జాతీయ రైతు నాయకులు స్వామి దయానంద సరస్వతి, ఆచార్య ఎన్.జి రంగా మొదలగు వారు ఆసీనులయ్యారు. సభలో నాయకుల ఉపన్యాసాలు రైతులను ఎంతో ఉత్తేజితులను చేశాయి. ప్రత్యేకంగా మందస రైతులు ఊగిపోయారు. అంతే కాదు, తక్షణ కార్యాచరణ ప్రకటించి, మరుసటి రోజు మందస రైతు సంఘం సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. మరుసటి రోజు రైతుల తరపున జమీందార్లతో పోరాడిన ఆమె 1940, ఏప్రిల్ 1న చరిత్రాత్మక మందస పోరాటంలో జరిగిన కాల్పుల్లో అసువులు బాసారు.

విప్లవం ఎరుపు రంగు పులుముకొని ఉత్తేజ పరచడానికి , హక్కులు కాలరాయబడడం ప్రథమ కారణం. గున్నమ్మ రైతుల పక్షాన నిలవడానికి, కర్షకుల కష్టం ధన రూపం గా బ్రిటిష్ వారి ఖజానా నిండడానికి జమిందారులు ఉపకరణాలుగా మారిపోవడమే మూలం. మనిషిని మనిషిగా, మనవాడిగా అంగీకరించలేనపుడు ఎదుటి వారి హక్కులు కాలరాయాలన్న దుర్బుద్ధి పుట్టడం పరిపాటే. పగ వాడికి ఉపకరించే నీచపు స్వార్థం విషసర్పమై కాటువేయడం గున్నమ్మ ప్రాణాన్ని హరించినా, ఆమె పోరాట జీవితం హక్కులు కాపాడుకోవాలనుకున్న ప్రతి వారికీ ఆదర్శమనే చెప్పాలి.

# స్వాతంత్ర్యోద్యమం – రచయిత్రుల పాత్ర

డా॥ ఆర్. చంద్రమౌళి, జంతుశాస్త్ర అధ్యాపకులు, ఎస్.వి.ఎ. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా. చరవాణి : 81259 69136.

భారతదేశంలో స్వాతంత్ర్యోద్యమానికి ముందు కూడా అనేకమంది రచయిత్రులు అనేక రచనలను ప్రచురించారు. బ్రిటిష్‌వారు భారతదేశానికి రాకముందు కూడా రచయిత్రులు సమాజంలోను, దేశంలో మరియు ప్రపంచంలో జరిగే సంఘటనలను తమ రచనలలో ప్రచురించారు. తమ హక్కుల కోసం అనాదికాలం నుండి సమాజంలో రచనల ద్వారా పోరాటం జరిపారు. తమ హక్కులను కాపాడుకోవటానికి పురుషాధిక్యాన్ని అధికమించటానికి ఆనాటి నుండి ఈనాటి వరకు అలుపెరుగని పోరాటాన్ని ఉద్యమాల ద్వారాను మరియు రచనల ద్వారాను కొనసాగిస్తున్నారు. తమ రచనలతో ప్రజలను చైతన్యం చేస్తున్నారు. ఆడవారు అబలలు కారు సబలలు అని నిరూపించుకుంటున్నారు. పురుషులతో అన్ని రంగాలలో సమాన హక్కులు పొందుతున్నారు మరియు పోటీపడుతున్నారు. ప్రపంచంలో కొన్ని రంగాలలో ప్రత్యేక గుర్తింపును పొందుతున్నారు. గౌరవాన్ని మరియు పురస్కారాలను పొందుతున్నారు.

రచయిత్రులు సమానహక్కులకోసం స్వరాలను జోడించారు. లింగం, మతం, కులపోరాటాల మధ్య సూక్ష్మభేదాలను మహిళారచనలు ద్వారా అర్థం చేసుకోవచ్చును. కొన్ని శతాబ్దాల క్రితం నుండి మహిళారచయిత్రులు తమ ఉనికిని చాటారు. భక్తి ఉద్యమంలో వారు ప్రత్యేకమైన పాత్రను పోషించారు.

| మహిళా రచయిత్రి | | శతాబ్దం |
|---|---|---|
| ఆండాల్ | – | 7వ లేదా 8వ శతాబ్దం |
| అక్కమహాదేవి | – | 12వ శతాబ్దం |
| లాల్ డెడ్ | – | 14వ శతాబ్దం |
| మీరాభాయి | – | 16వ శతాబ్దం |

మొగలుల కాలంలో గుల్బధన్ బేగం, నూర్జహాన్ షాద్నా బేగం, జహనారా వంటి మహిళలు తమ రచనలను కొనసాగించారు.

కమలామార్కండేయ, రుత్ ప్రావర్‌జబ్‌వాలా, అనితాదేశాయ్, భారతిముఖర్జీ, నమితా గోక్లే, శశిదేశ్‌పాండె, నయన్‌తార సహగల్, సోభాడే, అరుంధతిరాయ్, కిరణ్ దేశాయ్, మహాశ్వేతాదేవి వంటి మహిళా రచయిత్రులు అప్పటి ఆచారాలకు, ఆధునికతకు గల తేడాలు, కుటుంబంలో మరియు సమాజంలో స్త్రీలహక్కులు, జాతీయోద్యమ సంఘటనలు, త్వరిత పట్టణీకరణ, మహిళల వలస మరియు వారి అణచివేత వంటి అంశాలను వివరించారు.

**మొదటితరం రచయిత్రులు : కమలా మార్కండేయ (1924–2004) :** తన మొదటి నవల "నెక్టార్ ఇన్ సీవ్"ను 1955సం॥లో ప్రచురించింది. ఈ నవలలో భారతీయులు అతివృష్టి, అనావృష్టిలకు గురైనపుడు వారు ఎదుర్కొనే బాధలను, కష్టాలను తెలుపుతుంది. "ఎ హాండ్‌ఫుల్ ఆఫ్ రైస్, ది కాపర్ డామ్, ది ప్లజర్ సిటీ" మొదలగునవి పట్టణీకరణను, భారతీయ సాంకేతిక అభివృద్ధిని సమాజం మరియు సంస్కృతిపై వాటి ప్రభావాన్ని తెలుపుతాయి. ఈమె చివరి నవల "బొంబే టైగర్స్" నవ ధనికవర్తకులు వారి అవినీతిని మరియు స్త్రీ స్థానాన్ని తెలుపుతుంది.

**రూత్ ప్రవర్‌జబ్‌వాలా (1927–2013) :** మొదటి భారతీయ స్త్రీ రచయిత్రి. ఈమె 1975సం॥లో బుకర్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈమె యొక్క "హీట్ మరియు డస్ట్" నవల ఆంగ్లేయులకు మరియు భారతీయులకు గల సంబంధాలను వివరిస్తుంది. తన నవలల ద్వారా పట్టణీకరణను ఎక్కువగా తెలిపింది. భారతదేశంలో విదేశీయుల అస్థిరత్వాన్ని తెలిపింది. అదేవిధంగా విదేశీయతకు ఆకర్షించబడుతున్న భారతీయుల స్థితిని తెలిపింది.

**నయనతార సెహగల్ (1927) :** ఈమె భారత రాజకీయ నవలా రచయిత్రి. తన యొక్క అన్ని నవలలు భారతదేశంలో రాజకీయ అంశాలను తెలుపుతాయి. "రిచ్ లైక్ అజ్" అనే నవలకు సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఈ నవల 1975–76

సం॥లో భారతదేశంలో జాతీయ అత్యవసర పరిస్థితిని తెలుపుతుంది. ఇందిరాగాంధీ నిరంకుశత్వానికి ప్రజలు బలై అనేక కష్టాలకు గురైనారు. నీతినియమాలను మరియు ప్రజల హక్కులను పూర్తిగా ప్రభుత్వం అణచివేసింది.

**శశిదేశ్ పాండె (1938) :** ఈమె నవలలు, చిన్న కథలు భారతదేశంలో మధ్యతరగతి ప్రజల కష్టాలను తెలుపుతాయి. తన మొదటి నవల "ది డార్క్ హోల్డ్స్ నో టెర్రర్"ను 1980 సం॥లో ప్రచురించింది. తన ఐదవ నవల "దట్ లాంగ్ సైలెన్స్"కి సాహిత్య అకాడమీ పురస్కారం వరించింది. ఈ నవల మధ్యతరగతి స్త్రీల స్థితిగతులను వివరిస్తుంది. ఈమె నవలలన్నీ స్త్రీ కేంద్రీకృతం.

**అనితాదేశాయ్ (1937) :** ఈమె పది నవలలను రచించింది. స్త్రీవిద్యను మరియు సామాజిక జీవనంలో, కుటుంబాలలో తిరుగుబాటు జరిపే మహిళలను వివరించింది. ఈమె స్త్రీవాద రచయిత. ఇంటి ఇల్లాలు ఇంటి బయట ఎలా అభివృద్ధి చెందాలో తెలుపుతుంది.

**భారతి ముఖర్జీ (1940) :** భారతీయ–అమెరికా రచయిత్రి మరియు పొట్టికథల రచయిత్రి. అమెరికా వలసపోయిన భారతీయ స్త్రీల అనుభవాలను తెలుపుతుంది. వేరేదేశంలో అక్కడ వాతావరణానికి అమరికైన స్త్రీలు మరియు వాతావరణం సరిపోకపోవడం వల్ల స్త్రీల కష్టాలను వివరిస్తుంది. ఈమె మొదటి నవల "ది టైగర్స్ డాటర్" (1972).

**సోభాడే (1948) :** ఈమె తన నవలలో పట్టణాలలోని ఉన్నత మధ్యతరగతి స్త్రీల సామాజిక జీవనాన్ని ప్రతిబింబిస్తుంది. ఈమె మొదటి నవల "సోసియలైట్ ఈవినింగ్స్" ఉన్నత తరగతి ప్రజల జీవనాన్ని వర్ణిస్తుంది. "స్ట్రేంజ్ ఒ బిసనస్", సెకెండ్ థాట్స్, స్పీడ్ పోస్ట్ మొదలగునవి ఇతర నవలలు.

**నమితా గోఖ్లే (1956) :** తన నవలల్లో మహిళల గుర్తింపును లైంగిక స్వేచ్ఛను వర్ణిస్తుంది. ఈమె మొదటి నవల "డ్రీమ్స్ ఆఫ్ పాసన్" గుర్తింపు పొందింది.

**రెండవతరం రచయిత్రులు :**

- ఇస్మత్ చుగ్తాయ్
- అమృతాప్రీతమ్
- మహాశ్వేతాదేవి
- కృష్ణసోబ్ధి
- కమలాదాస్
- ఉమా చక్రవర్తి
- కుంకుమరాయ్
- కమలా బాసిన్
- కొండపల్లి కోటేశ్వరమ్మ
- కిరణ్ దేశాయ్
- జంపాలహరి (1967)
- అరుంధతిరాయ్

| రచయిత్రి | | రచన (పుస్తకం) |
|---|---|---|
| కృష్ణసోబ్ధి | – | ప్రీతమ్స్ పింజర్ (1930) |
| కమలాదాస్ | – | మై లైఫ్ |
| మహాశ్వేతాదేవి | – | బెస్ట్ స్టోరీస్ |
| కిరణ్ దేశాయ్ | – | ద ఇన్‌హెరిటెన్స్ ఆఫ్ లాస్ |
| జంపాలహరి | – | నేమ్ సాకె |
| అరుంధతిరాయ్ | – | గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్ |

భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో స్త్రీలు అంతర్భాగం. మాతృభూమిపై వారికున్న ప్రేమ అపరిమితం. స్వతంత్ర భారతదేశాన్ని రూపొందించుటలో సహాయపడిన కొంతమంది రచయిత్రులను భారతపౌరులు ఎల్లవేళలా గుర్తుపెట్టుకోవాలి.

**సరోజినీ నాయుడు :** ఒక భారతీయ కవియిత్రి మరియు రాజకీయ కార్యకర్త. స్వాతంత్ర ఉద్యమంలో ఒక ముఖ్యమైన కవయిత్రిగా పేరుపొందారు. ఈమెకు "నైటింగేల్ ఆఫ్ ఇండియా" అనే మారుపేరు కలదు. ఈమె రచించిన "ది గోల్డెన్ థ్రెషోల్డ్", "ది బర్డ్ ఆఫ్

టైమ్" (1912), "ది ఫెదర్ ఆఫ్ ది డాన్" (1961) మొదలైన నవలలు ప్రసిద్ధిచెందాయి. మహాత్మాగాంధీ – హిజ్ లైఫ్; రైటింగ్స్ అండ్ స్పీచెస్; పాలంక్విన్ బేరర్స్ వంటి రచనలు చేశారు.

**విజయలక్ష్మీ పండిట్ :** ఈమె రచించిన "ప్రిజన్ డేస్", "ది స్కోప్ హ్యాపీనెస్", "ఎ పర్సనల్ మెమోయిర్" మొదలైన రచనలు మంచిపేరును తెచ్చిపెట్టాయి. స్వాతంత్ర్యానికి ముందు భారతదేశంలో క్యాబినెట్ పదవిని పొందిన మొదటి మహిళ.

**ఉషామెహతా :** ఈమె భారతదేశం యొక్క గాంధేయవాది మరియు స్వాతంత్ర సమరయోధురాలు. "క్విట్ ఇండియా" ఉద్యమంలో మీడియాకు ఎక్కువ మద్ధతు పలికింది. ఆమె యొక్క "ఉమెన్ అండ్ మెన్ ఓటర్లు – 1981". "1977–80 ప్రయోగం" మొదలగు రచనలు పేరు సంపాదించాయి.

**అరుణా ఆసఫ్ ఆలీ :** ఈమె భారతీయ విద్యావేత్త, రాజకీయ కార్యకర్త మరియు ప్రచురణకర్త. "ద రిసర్జెన్స్ ఆఫ్ ఇండియన్ ఉమెన్", ప్రైవేట్ పేస్ ఆఫ్ ఎ పబ్లిక్ పర్సన్", "ఎ స్టడీ ఆఫ్ జవహర్‌లాల్ నెహ్రూ మొదలగు రచనలు ఆమెకు మంచిపేరును సంపాదించాయి.

**సావిత్రీబాయి పూలే :** మహారాష్ట్ర మరియు భారతదేశ ఇతర రాష్ట్రాలలో ఆడపిల్లల విద్యకోసం అవిరళమైన కృషి చేశారు. తన భర్త జ్యోతిరావ్‌పూలేతో కలిసి కులవృత్తిలో అణచివేయబడిన వారికోసం ఆమె అవిశ్రాంతిగా పనిచేశారు. బాలికలకు విద్యను అందుబాటులోకి తెచ్చారు.

**తెలుగు రచయిత్రులు :**

- అబ్బూరి చాయాదేవి
- బండారు అచ్చమాంబ
- ఉమార్జి అనురాధ
- నతాంచ అప్పనా
- జె. భాగ్యలక్ష్మి
- సరస్వతి గోర
- తెన్నేటి హేమలత
- తురగా జానకీరాణి
- పి. లలిత కుమారి
- కొండపల్లి కోటేశ్వరమ్మ
- నిడదవోలు మాలతి
- నంబూరి పరిపూర్ణ
- రంగనాయకమ్మ
- వాసిరెడ్డి సీతాదేవి
- జి. శ్యామల
- యుద్దనపూడి సులోచన

**ఆధార గ్రంథాలు :**

1. https://www.freepressjournal.in
2. https://www.arcjournals.org
3. https://hercircle.in>culture>books.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్య ఉద్యమంలో తెలుగు మహిళ పాత్ర

డా॥ ఎన్. భీమన్న, ఎస్.వి. ఆర్ట్స్ కళాశాల, తిరుపతి.

భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్యోద్యమం ఒక మహోజ్జ్వల ఘట్టం. భారతీయుల పోరాట పటిమకు, త్యాగ నిరతికి, నిరుపమాన దేశభక్తికి ఈ ఉద్యమం ఒక నిలువుటద్దం. ఈ పోరాటాన్ని సుసంపన్నం చేసేందుకు జాతి, మత, కుల ప్రాంతీయతలను విస్మరించి భారతీయులంతా ఒకే తాటిపై నిలిచి ఆత్మార్పణలకు పోటీ పడటం అపూర్వం. ఒకే నినాదం, ఒకే లక్ష్యంతో కోట్లాది ప్రజానీకం ముందుకు సాగడం ప్రపంచ చరిత్రలోనే అరుదైన మహత్తర సంఘటన.

అంతటి మహోజ్జ్వల త్యాగమయ చరిత్రలో తెలుగు మహిళలు స్థానం సంపాదించారు. భారతదేశంలో బ్రిటిషు అధికారం వాణిజ్యం పేరుతో ప్రారంభమయ్యింది. కానీ పంతొమ్మిదో శతాబ్దం మధ్య కాలానికి అది వాణిజ్య స్వరూపాన్ని వదిలిపెట్టి రాజకీయ పాలన రూపంలో బ్రిటిషు పరిశ్రమలోకవసరమైన ముడిసరుకును అందించి పారిశ్రామిక ఉత్పత్తులకు అమ్మకపు అవకాశాన్ని కలిగించే స్థితికి క్రమంగా దిగజారింది. భారత ప్రజలు 1857లో బ్రిటిషు అధికారంపై చేసిన ప్రతిఘటన విఫలం కావడంతో, దేశంలో బ్రిటిషు పాలన సుస్థిరమయ్యింది. దీన్ని వ్యతిరేకిస్తూ జరిపిన స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ, నెహ్రూలవంటి జాతీయ నాయకులతోపాటు కస్తూరిభా గాంధి, విజయలక్ష్మి పండిట్, సరోజినీనాయుడు, అనిబిసెంట్ మొదలైన మహిళలెందరో పాలు పంచుకున్నారు. స్వాతంత్ర్య పోరాట జ్వాలలో సమిధలైనారు.

ప్రజల్లో స్వాతంత్ర్యం, సంఘర్షణ వంటి భావాలను ఉన్నత విద్యావకాశాలు తోడ్పడినాయి. మద్రాసు, రాజమండ్రి, నెల్లూరు, గుంటూరు, విజయనగరం, కాకినాడ, బందరు పట్టణాలలో కళాశాలల స్థాపన జరిగింది. ముఖ్యంగా ఆంధ్రదేశములో కందుకూరి వీరేశలింగం గారు సంఘ సంస్కరణోద్యమం ద్వారా స్త్రీలలో చైతన్యం కలిగించారు. విజ్ఞాన దృష్టిని వారిలో కలిగించి స్త్రీలు స్వాతంత్ర్యం పట్ల ఆకర్షితులు కావడానికి అవసరమైన భావాలను, సామాజిక నేపథ్యాన్ని వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు మొదలైన మహానుభావులు కలిగించారు. ఇది క్రమంగా స్త్రీలు రాజకీయ రంగంలో ప్రవేశించి ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించడానికి దోహం చేసింది. చెడును ఎదిరించే తత్త్వం, స్వాతంత్ర్య కాంక్ష, హక్కులకోసం పోరాడాలనే తెగింపు వంటి భావాలు స్త్రీలలో కలగడానికి పునాది అయింది. అందుకు ఆనాటి పత్రికలు కూడా దోహదం చేశాయి.

కందుకూరి వీరేశలింగం సాంఘిక సంస్కరణోద్యమం ఫలితంగా ఫ్యూడల్ సాంఘిక దురాచారాలకు, ఫ్యూడల్ సంస్కృతికి వ్యతిరేకంగా స్త్రీలు మొదటిసారిగా చైతన్యం పొందారు. బాలికా పాఠశాలలు ప్రారంభించబడ్డాయి. ఇళ్ళ నుండి పారిపోయి రాజమండ్రి వచ్చి వీరేశలింగం దంపతుల అండదండలతో వితంతు యువతులు పునర్వివాహాలు చేసుకున్నారు. కందుకూరి, గురజాడ, కొమర్రాజు లక్ష్మణరావు, రఘుపతి వెంకటరత్నంనాయుడు మొదలైన నవయుగాంధ్ర నిర్మాతలు, జాతీయ పునరుజ్జీవన ఉద్యమ నేతలు స్త్రీ విముక్తి ఉద్యమానికి ప్రేరణ ఇచ్చారు. ఇది తెలుగునాట అసంఖ్యాక మహిళలు చైతన్యం పొంది జాతీయోద్యమంలోకి పెద్దయెత్తున రావడానికి దోహదం చేసింది.

గాంధీజీ నాయకత్వాన 1919-22 మధ్య కాలంలో జరిగిన సహాయ నిరాకరణోద్యమం, 1930-32 నాటి ఉప్పు సత్యాగ్రహం మొదలైన ఉద్యమాలలో ఆంధ్రదేశంలోని స్త్రీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కల్లు అంగళ్ళ వద్ద, విదేశీ వస్త్ర దుకాణాల వద్ద పికెటింగ్‌లలో పాల్గొన్నారు. విదేశీ వస్త్రాలను దహనం చేశారు. ధైర్య సాహసాలు ప్రదర్శించి నిర్బంధాలను ఎదుర్కొన్నారు. చంటి బిడ్డలతో జైళ్ళకు వెళ్లారు. పిల్లలను తల్లులను వేరు చేసినా భరించారు. బంగారంపై స్త్రీలకు సహజంగా ఉండే వ్యామోహాన్ని పక్కకు పెట్టి మాగంటి అన్నపూర్ణాదేవి వంటివారు తమ నగలన్నింటినీ గాంధీజీకి ఇచ్చి ఆదర్శంగా నిలిచారు.

1921 లో బెజవాడలో జరిగిన కాంగ్రెస్ మహాసభలకు తొలిసారిగా స్త్రీలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆ తరువాత ఆంధ్రదేశమంతటా గాంధీజీకి స్త్రీలు కనక వర్షం కురిపించారు. యలమంచిలి సత్యవతి అనే వితంతు యువతి తన ఒంటిమీద నున్న 100 కాసుల బంగారం ఇచ్చింది. స్త్రీలు వంటింటి కుందేళ్ళు కారాదని, జాతీయ విముక్తి పోరాటంలో పురుషులతో పాటు తనవంతు పాత్ర పోషించాలని, మూఢ నమ్మకాలను, మూఢాచారాలను విడనాడాలనీ, సాంఘిక దురాచారాలను పటాపంచలు

చేయాలని గాంధీజీ నాయకత్వాన జాతీయోద్యమం ఇచ్చిన పిలుపు స్త్రీలలో అపూర్వ చైతన్యం తెచ్చింది. దువ్వూరి సుబ్బమ్మ వంటి బ్రాహ్మణ వితంతు స్త్రీలు లాఠీ చార్జీలకు ఎదురొడ్డి వీరోచితంగా పోరాటం చేశారు. ఆచంట రుక్మిణి, వేదాంతం కమలాదేవి, పెద్దాడ కామేశ్వరమ్మ ఉన్నవ లక్ష్మీబాయమ్మ, కనపర్తి వరలక్ష్మమ్మ, సూర్యదేవర రాజ్యలక్ష్మి, మొదలైన అనేక మంది స్త్రీలు స్వాతంత్ర్య సమరంలోకి దూకి, పిదప స్త్రీ విముక్తి పోరాటానికి నాంది పలికారు.

రాజారామ్ మోహన్‌రాయ్, వీరేశలింగం, గాంధీజీ మొదలైన మహనీయులు ఇచ్చిన స్ఫూర్తితో, ముఖ్యంగా జాతీయోద్యమం ఇచ్చిన స్ఫూర్తితో స్త్రీలు ఉత్తేజితులై తమంతట తాము సంఘాలు ఏర్పరచుకొని, తమ హక్కుల కోసం పోరాడే చైతన్యాన్ని సంపాదించారు. 1927 లో సరోజినీనాయుడు, విజయలక్ష్మీ పండిట్ మొదలైన వారి నాయకత్వాన అఖిలభారత మహిళా సంఘం అనే సంస్థ ఏర్పడి భారతీయ మహిళా ఉద్యమ నిర్మాణానికి దోహదం చేసింది. బండారు అచ్చమాంబ, కందుకూరి రాజ్యలక్ష్మమ్మ మొదలైనవారు మహిళా సంఘాలు స్థాపించి స్త్రీ విద్యావ్యాప్తికి, మూఢాచారాల నిర్మూలనకు విశేష కృషి చేశారు.

బ్రిటిషు ప్రభుత్వం వ్యక్తిగతమైన పన్నులేకాక, సామూహికమైన పన్నులను కూడా ప్రజలపై విధించేది. ఈ సందర్భంలో స్త్రీలు పోరాట రంగంలోకి దూకి అసంఖ్యాకంగా అణచివేతకు గురవయ్యారు. జైళ్ళకు వెళ్ళారు. స్త్రీలను పోలీసు వాహనాల్లో తీసుకెళ్ళి దూరంగా వదిలివచ్చేవారు. నిందాపూరితమైన భాషతో వారిని అవమానించేవారు. స్త్రీలు మద్యపాన విక్రయశాలల ముందు పికెటింగ్ చేస్తుంటే కల్లు నెత్తిమీద కుమ్మరించేవారు. ఈ రకమైన అవమానాలన్నింటినీ సహించి స్త్రీలు పురుషులతో సమానంగా స్వాతంత్ర్యపోరాటంలో ముందుకు నడిచారు.

ఒకవైపు బ్రిటిషు ప్రభుత్వం అణచివేతకు పూనుకుంటే మరొకవైపు స్త్రీలు అంతే కార్యదీక్షతో తమ కార్యాచరణపట్ల విశ్వాసం ప్రకటిస్తూ బ్రిటిషు వారికి వ్యతిరేకంగా సమావేశాలు జరుపడం, జాతీయగీతాలు ఆలపించడం, జాతీయ పతాకాన్ని ఎగురవెయ్యడం, స్వాతంత్ర్య నినాదాలు చెయ్యడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. 1934 జనవరి 4 న గాంధీజీ అరెస్ట్ సందర్భంగా స్త్రీలు ఆంధ్రదేశమంతటా సమావేశాలు జరిపారు. ఢిల్లీలోని చాందినీ చౌక్ వద్ద జరిగిన సమావేశానికి గుంటూరుకు చెందిన ఉన్నవ లక్ష్మీబాయమ్మ హాజరయ్యారు.

ఈమె సంస్కరణాభిలాషి. జాతీయోద్యమంలో మహిళలకు నాయకత్వం వహించారు. ఖద్దరు ప్రచారానికి, అస్పృశ్యత నివారణకు, మహిళా జనోద్ధరణకు ఎంతగానో కృషి చేశారు.

ఆంధ్రదేశంలోని మహిళలకు జాతీయస్థాయిలో కస్తూరిబా గాంధీ, కమలాదేవి చటోపాధ్యాయ, మహాదేవి దేశాయ్ వంటి మహిళలు ఎందరో ఉత్తేజాన్ని కలిగించారు. స్త్రీలలో వచ్చిన ఈ చైతన్యం వలన తరువాత కాలంలో స్త్రీల అనర్హతలు తొలగించే అనేక చట్టాల రూపకల్పనకు దారి తీసింది. బాల్యవివాహాల నిరోధక చట్టం 1929 లో చేయబడింది. శ్రీహర విలాస శారద అనే శాసన సభ్య సభ్యుడు ప్రవేశపెట్టిన చట్టం గనుక దీనికి శారద చట్టం అనే పేరు వాడుకలోకి వచ్చింది. దీని ప్రకారం 14 సంవత్సరాల లోపు బాలికలకు వివాహం నిషేధించబడింది.

అటు తెలంగాణాలో కమ్యూనిస్టు ఉద్యమం ప్రారంభమై ఆంధ్ర మహాసభల వేదికలపై మహిళా సభలు జరిపి స్త్రీలలో చైతన్యం కలిగించారు. ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం ఇంకా ఎంతో మంది మహిళా కార్యకర్తలు ఆయుధాలు పట్టి పోరాటం చేసి భరతమాత దాస్య సంకెళ్ళు తెంపడానికి కృషి చేశారు.

**ఆధార గ్రంథాలు :**


1. ఆంధ్రప్రదేశ్ దర్శిని – ఏటుకూరి బలరామమూర్తి
2. స్త్రీ విముక్తి ఉద్యమ పూర్వాపరాలు – పరకాల పట్టాభిరామారావు.
3. యుగయుగాల్లో భారతీయ మహిళ – జె. వరలక్ష్మి.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్య కాలం నాటి పాఠ్యపుస్తకాల్లో స్త్రీ జీవిత చిత్రణ

డా. పెద్దింటి ముకుందరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఆర్.జి.యు.కె.టి, శ్రీకాకుళం

సమాజంలో సాహిత్యానికున్న స్థానం అపూర్వమైనదీ, అతి పవిత్రమైనది, ఎంతో శక్తివంతమైనది. సమజపరంగా రచయిత కాపాదించబడిన బాధ్యతలు గురుతరమైనవి. పాఠ్యపుస్తకాలు సామాజిక జీవితానికి ప్రతిబింబాలు. సామాజిక విలువలను, ఆశయాలను, ఆకాంక్షలను,అవసరాలను అక్షర రూపంలో అందించి, అభ్యాసనానుభవములు కలిగించి చదువరులకు సమగ్ర మూర్తిమత్వాన్ని అందివ్వగల సాధనాలుగా ఆనాటి విద్యావేత్తలు గుర్తించారు. పాఠ్యపుస్తకాలలోని అంశాలను ఉపాధ్యాయులు ఆకళింపుజేసుకొని, అందలి విషయ పరిజ్ఞానంతో పాటు విద్యార్థులు ఏర్పరుచుకొను వైఖరులను, వారి మానసికవికాసమునకు, నైతిక విలువలను సాధించుటకు చేయదగు అంశాలను నిర్ణయించి ఆచరించుట ఉపాధ్యాయుల కర్తవ్యము. కనుక విద్యాసముపార్జలో మంచిపౌరులుగా బాలలను తీర్చిదిద్దుటలోనూ పాఠ్యపుస్తకాల పాత్ర గణనీయము.

జాతీయ విద్యావిధానము 1986 విద్యాప్రణాళికలో దేశ పాఠశాలలన్నింటిలోనూ పది మౌలికాంశాలను పొందుపరచాలని నిర్దేశించింది. అవి:

1. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర
2. రాజ్యంగ బాధ్యతలు
3. జాతీయ భావాన్ని పెంపొదించుటకు అవసరమైన విషయాలు
4. భారతదేశపు సామాన్య సాంస్కృతిక వారసత్వము.
5. దేశసమైక్యత
6. స్త్రీ,పురుష సమానత్వము.
7. పరిసరాలు పరిరక్షణ
8. సాంఘిక అవరోధాల తొలగింపు
9. చిన్న కుటుంబ భావన
10. వైజ్ఞానిక, శాస్త్రీయ దృక్పథము కలిగించుట.

ఈ పది మౌలికాంశాలు విద్యార్థులను సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, నైతికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, వైజ్ఞానికంగా మరియు విద్యాపరంగా ఉన్నతమైన విలువల్ని సాధించి భావితరాలకు ఆదర్శంగా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి తోడ్పడతాయి. ఈ అంశాలలో స్త్రీపురుష సమానత్వం అను అంశము కూడా చోటు చేసుకోవడం గొప్ప విషయం.

**స్త్రీ పురుష సమానత్వం ఆవశ్యకత:** జాతీయ విద్యావిధానము 1986ను అమలు జరుపుటకు కార్యాచరణ కార్యక్రమం చేపట్టబడింది. భారత ప్రభుత్వంచే జారీ చేయబడిన కార్యమ్రంలో స్త్రీ సమానత్వము విషయంలో ఈ విధంగా వివరించడం జరిగింది.

“విద్యావిధానంలో స్వాతంత్యానంతరం స్త్రీలకు విద్యావకాశాలు అనే ముఖ్యాంగం పొందుపరచడింది. 1951 నుండి 1981మధ్య కాలంలో స్త్రీలలో అక్షరాస్యతా శాతం 7.93 నుండి 24.2కు అభివృద్ధి చెందింది. కాని నిరక్షరాస్యులైన స్త్రీల సంఖ్య 158.7 మిలుయన్ల నుండి 241.7 మిలియన్లకు పెరిగింది. స్త్రీలు నిరక్షరాస్యులలో 57% కలరు. పాఠశాలలో నమోదు కాని బాలబాలికలలో బాలికల శాతం70. ఇంతవరకూ తీసుకోబడిన అనేక చర్యలలో స్త్రీ విద్యలో సమానత్వమును సాధించుటకు సరియైన చర్యలు గైకొనబడలేదు” కాబట్టి కొన్ని నిర్దిష్టమైన ప్రతిపాదనలు అమలు జరుపుచున్నారు. అట్టి చర్యలలో־ాగంగా పాఠ్యపుస్తకాలలో లింగవివక్షత, సాంప్రదాయక పద్ధతిలో చిత్రించబడిన స్త్రీ పాత్రలు గల అంశాలను తొలగించడం ఒక ముఖ్య చర్య. కాని 1986 నాటికి పాఠ్యపుస్తకాలలో స్త్రీలను కించపరిచే వారి హోదాను తగ్గించే అంశాలు, లింగ వివక్షతకు సంబంధించిన విషయాలు కలవని జాతీయ స్థాయిలో అంగీకరించడం జరిగింది. ఇవి కూడా సామాజిక పద్ధతుల ప్రతిబింబాలే కదా.కనుక సమాజంలో స్త్రీ పాత్ర ఔన్నత్యం ఎట్టిది అనే ప్రశ్న తలెత్తుతుంది.

**సమాజంలో స్త్రీ జీవిత చిత్రణ :** అనాది నుండి నేటి వరకూ సమజంలో స్త్రీ సాధారణంగా అన్ని రంగాలలోనూ అంటే సాంఘికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా నేడు విద్యాపరంగా, రాజకీయంగా చట్టసభలలో అత్యంత వేగవంతమైన అభివృద్ధిని సాధిస్తూ అవకాశాలను అందిపుచ్చుకుంటూ పురుషులతో సమానంగా అన్ని రంగాలలోనూ రెండవ శ్రేణి పౌరసత్వాన్ని ఆయా రంగాలను పరిశీలిస్తే తెలుస్తుంది. మానవ మనుగడకు స్త్రీయే ఆధారం. కుటుంబ వ్యవస్థ వర్థిల్లాలన్నా, సామాజిక వ్యవస్థ సక్రమంగా సాగాలన్నా, మంచి సంప్రదాయం నిలవాలన్నా, అది ముందు తరాలకు సంక్రమించాలన్నా అందుకు స్త్రీయే కారణమనే సత్యాన్ని విస్మరించలేము. మహిళలు ఉద్యమించి ఒత్తిడి తెచ్చిన కారణంగా భారతప్రభుత్వం స్రీల సామాజిక, ఆర్థిక స్థాయిని మెరుగుపరచడానికి ప్రణాళికలను ప్రభుత్వాలు రూపొందిస్తున్నాయి.

**సాంఘిక రంగం:** ఋగ్వేదకాలనికి ముందు స్త్రీ పురుషులు సమానంగా వేటాడి, కష్టాలనెదుర్కొని, కలసి మెలసి ఉండేవారని చరిత్రకారుల అభిప్రాయం. ఋగ్వేద కాలంలో పురుష సంతానం కావాలని ఋక్కులున్నవి. కాని స్త్రీ శిశుజననం దురదృష్టంగా భావించిన దాఖలాలు లేవు. కానీ అదర్వణ వేదంలో ఆడపిల్లలు వద్దనే ప్రార్ధనలున్నాయి. బ్రాహ్మణాల కాలం నుండి కుమారునికి విలువ పెరిగింది. 'నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అనే మనుధర్మ శాస్త్ర నిర్ధేశాన్ని నేటికీ ఏదో ఒక రూపంలో అమలు జరుపుతునే ఉన్నారు. కార్యేషు దాసి, అని గృహంలో పని మనిషి స్థాయి ఏర్పాటు చేయబడింది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో స్రీవాద సాహిత్యం ఊపందుకున్నాక కొంత మార్పు వచ్చినప్పటికీ సమాజంలో సాంఘిక స్వేచ్ఛ కొరకు పరితపిస్తున్నా సనాతన పరిస్థితి పూర్తిగా మార్పు చెందలేదనిపిస్తోంది. సాంఘికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, నైతికంగా అణచివేతకు గురైంది స్రీ. చివరికి ప్రకృతి సహజమైన లైంగిక విషయాలలో కూడా వివక్షకు గురైంది. సమానత్వాన్ని సాధించుకొనే క్రమంలో తిరుగుబాటు తప్పనిసరి అయిన సందర్భం ఇది. ఏ ఉద్యమ సందర్భాన్ని చూసినా మొదట కవిత్వం, ఆ తర్వాత కథానిక, నవల పుడతాయి. ఎందుచేతనంటే ఉద్విగ్నభరితమైన ఆవేశంలో నుంచి ఉన్నట్లుండి పుట్టినట్లుగా వచ్చేది కవిత్వం. కొంత నింపాదిగా కథ, ఇంకా స్థిరంగా నవల వస్థాయి.

**ఆర్థిక రంగం:** నాటి నుంచి నేటి వరకూ స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. కుటుంబ అభివృద్ధికి పాటుపడవలసిందే తప్ప ఆధాయ వ్యయాలపై ఆమె పాత్ర తక్కువగా ఉన్నట్లు అనిపిస్తోంది. కొద్ది మంది ఉద్యోగినులు, కూలీలు సంపాదించినది కుటుంబ యజమానికందించి వారి నిర్ణయాలకు కట్టుబడి ఉంటున్న పరిస్థితి నేటికీ కనిపిస్తోంది.

**రాజకీయ రంగం:** వేద కాలంలో స్త్రీలు యుద్ధాల్లో పాల్గొనిన సందర్భాలు కలవు. ముద్గలుని భార్య ముద్గలని శత్రువులను తరిమి కొట్టింది. తరువాత అప్పుడప్పుడు స్త్రీలు రాజ్యమేలినట్లు, సాతంత్ర్యోద్యమంలో ఝాన్సీ రాణి మొదలగు వారు యుద్ధంలో పాల్గొన్నప్పటికీ సాదారణంగా స్త్రీలకు రాజకీయ ప్రవేశం బహుతక్కువ.నేడు పార్లమెంటులో గల 595 సభ్యులలో 27 మంది మాత్రమే స్త్రీలు. రాష్ట్రాలలోనూ అదే పరిస్థితి సమానత్వం లేదు.

**సాంస్కృతిక రంగం:** పూర్వం స్త్రీ పాత్రలు గూడా నాటకరంగంలో పురుషులే ధరించేవారు. దేవదాసీలు మొదలగు నర్తకీ మణులకు న్యూనత భావమే ఎదురైంది. నాటి నుండి నేటి కాలానికి చాలా మార్పులు వచ్చాయి. కళారంగంలో స్టేజీపై నటించినా, నర్తించినా ఆడపిల్లలు చాలా చక్కని ప్రతిభను కనబరుస్తారు. వారి సహనం కనిపిస్తుంది. 1990 దశకం నాటికి చాలా మార్పులు వచ్చాయి. ఆటపాటలలోను, సాహస క్రియలలోను ఎక్కడో ఒక పి.టి.ఉష, అశ్విని నాచప్ప, బిచేంద్రపాల్, ఎమ్.ఎస్.సుబ్బలక్ష్మి లు తప్ప తగినంత మంది కానరారు.

**విద్యారంగం:** వేదకాలంలో ఆడ పిల్లలు ఇంట్లో పెద్దల వద్ద విద్యనభ్యసించారు. ఘోష, లోపాముద్ర వంటి కవయిత్రలు ఋషులు కలరు. గార్గి మైత్రేయ, బ్రహ్మ జ్ఞానాభ్యాసకులు. భౌద్ధుల కాలంలో స్రీలు సన్యసించి గ్రంథాలు రచించారు. క్రమేణా ముఖ్యంగా ముస్లిం యుగం నుండి వీరి విద్యా వ్యాసంగం దాదాపు అంతరించి, బ్రిటిషు కాలం నుంచి మరల కొంచెం మేలుకొన్నది.జాతీయ విద్యావిదానం 1986ను సవరించి మన రాష్ట్రంలో పాఠ్యపుస్త రచన కొనసాగుతుంది. కొన్ని పుస్తకాలు పాఠశాలల్లో ప్రవేశపెట్టబడ్డాయి. కొన్ని ప్రవేశపెట్టబడుతున్నాయి. ఇవన్నీ పది మౌలికాంశాలను దృష్టిలో ఉంచుకొని వ్రాయబడుచున్నవి. ప్రస్తుతం అమల్లో ఉన్న పాఠ్యపుస్తకాలలో స్త్రీ జీవిత చిత్రణ జాతీయ విద్యావిధానం ప్రకారం ఉందా అనేది పరిశీలించాల్సిన అవసరం ఉంది.

మొదటి తరగతి నుండి పదవ తరగతి వరకు అన్ని పుస్తకములు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే తయారు చేయరు చేయబడి అమలునందున్నవి.

1. ప్రస్తుత పాఠ్యపుస్తకాలలో సాధారణంగా అన్ని పాఠాలు పురుషాధిక్యతనే కలిగి ఉన్నాయి. కొన్ని పాఠాలలో స్త్రీల ప్రసక్తి ఉంది. వాటిలో 272 అంశములు స్త్రీలను గౌరవించేవిగా, వారి హోదాను ప్రతిబింబించేవిగా, ప్రదీపింపచేసేవిగా ఉన్నాయి. 339 అంశాలు వివక్షతతో స్త్రీని కించపరిచేవిగా, ఆమె హోదాకు భంగం కలిగించేవిగా ఉన్నాయి. కొన్ని సాంప్రదాయాక పద్ధతిలో స్త్రీని చిత్రికరించాయి.

2. పాఠ్యపుస్తకాలు మొత్తం 117 మంది రచయితలు తయారు చేస్తే అందులో 85మంది పురుషులు ఉంటున్నారు. అందులో ఇద్దరే సంపాదకులు కాగలరు.

3. స్త్రీపట్ల వివక్షత చూపు అంశములు అన్ని విషయములకు సంబంధించిన పాఠ్యపుస్తకములలోనూ కలవు.

4. సాంఘిక రంగంలోనూ స్త్రీ జీవిత చిత్రణ కొన్ని అంశాలు గౌరవించేదిగానూ మరికొన్ని అంశాలు వివక్షత చూపేవిగానూ నేటికీ ఉన్నాయి.

5. ఆర్థికపరమైన చిత్రణలో గూడ గౌరవ వివక్షలు చోటు చేసుకున్నాయి.

6. రాజకీయపరమైన అంశాలలోనూ స్త్రీ జీవితంలో ఎన్నో సందర్భాలలో వివక్షలు కనిపిస్తాయి. ఉదా: ఓరుగల్లు ప్రాంతాన్ని పరిపాలించిన రుద్రమాదేవి వీరవనిత. శత్ర రాజులను ఓడించి శాంతి భద్రతలను నెలకొల్పింది. ఆనాటి కాలంలో స్త్రీ పరిపాలనను కొందరు సామంతరాజును దేవగిరి రాజును ఉసిగొల్పుతారు. అప్పుడు కొందరు ఒక ఆడదానికి లొంగి ఉండడమా? చేతులకు గాజులు తొడుక్కున్నామా? అనే ధోరని కనిపిస్తోంది.

7. కొన్ని సన్నివేశాలలో సాంస్కృతిక పరమైన పాఠ్యపుస్తకాలలో కలవు. కానీ బహుతక్కువ. అయినను ఎక్కడో ఒక చోట వివక్షత కనిపిస్తుంది.

**ఉదా:** వివిధ రంగాలలో ప్రతిభ కనభరచిన అమ్మ సరోజినీదేవి భారత నారీలోకానికి గర్వకారణం.

8. విద్యావిషయకంగా స్త్రీ పాత్రచిత్రణలో న్యూనత, గౌరవం రెండూ ఉన్నాయి.

**ఉదా:** మొల్ల రాసిన పాఠము స్వయంవరము కలదు. తాళ్లపాక తిమ్మక్క తొలి తెలుగు కవయిత్రి.

ప్రస్తుత సమాజంలో స్త్రీలు ఏకదాటిగా గ్రంథపఠనం సాగించేవారు లేకపోలేదు. అదే విధంగా మొత్తం స్త్రీలలో గృహిణులైన తరువాత పుస్తకాలు చదివి తమ ప్రతిభకు పట్టంగడుతున్నారు. పైన పేర్కొన్న అంశాలు ఆయా పుస్తకాలలో పేర్కొనబడినవే. అదే విధంగా మాతృభాష, ద్వితీయ భాష తెలుగు పాఠ్యపుస్తకాల నుండి గ్రహించబడినవి.

స్త్రీల సమస్యలను ముందుగా బయలు పరచిన వారు పురుషులు. స్త్రీల సమస్యలను కవితల్లో పొదిగి నలుగురిలోకి రసమయంగా తెచ్చినవారు పురుషులు. ప్రాచీనకాలంతో పోల్చి చూస్తే ఈ యుగంలో స్త్రీలలో విద్యావంతుల సంఖ్య అధికం. అయితే వారిలో తమ సమస్యలను తాము కవితా రూపంలో చెప్పినవారు తక్కువ కవయిత్రులున్నారు. కవితలు రాశారు కాని తమ సమస్యలను వస్తువులుగా చేసికాదు. స్రీలకు తమ సమస్యలను వ్యక్తం చేయడానికి కవిత్వం కాక ఈ యుగంలో లభించిన నూతన వచన ప్రక్రియలు నవల, కథానిక అధికంగా తోడ్పడ్డాయి.

భారతదేశం అనేక మార్పులని చవిచూసింది. భారత నారి అనేక ఒడిదుడుకులని ఎదురొడ్డింది. తట్టుకుంది. నిండుగా నిలబడింది. క్షీణిస్తున్న అపూరూపమైన కుటుంబ వ్యవస్థను భారతనారి కాపాడుతుంది. భారత సంస్కృతికి బీజాలైన ఆత్మనిగ్రహం, సహనం మూర్తిభవించిన భారతీయ స్రీ కుటుంబ పరారక్షకురాలవుతుంది. ఎప్పుడైతే స్త్రీ పురుష సమానత్వం వస్తుందో, పురుషులు

స్త్రీల పట్ల సహనం, సయోధ్యతను ప్రదర్శిస్తూ స్త్రీకి చేదోడు వాదోడు ఉన్ననాడు కుటుంబ వ్యవస్థ బాగుంటుంది.

జాతి నిర్మాణంలో పురుషులు కంటే మమిళల పాత్రే విశిష్టమనందువల్ల, చట్ట సభల్లో మహిళల బిల్లులు ఆమోదలం పొందితే, అంతా అనుకున్నట్లుగా జరిగితే ప్రపంచ పటంలో మహిళలకు పట్టం గట్టిన దేశంగా మన దేశ ఖ్యాతి ఇనుమడింపజేస్తుంది. పాఠ్యపుస్తకాలలో స్త్రీ జీవిత చిత్రణ కొంత వరకూ జాతీయ విద్యా విధానలమునకు అనుకూలముగా లేదనిపిస్తోంది. కానీ ప్రస్తుత పరిస్థితులలో బాలబాలికలలో స్త్రీలపట్ల గౌరవాన్ని మరింత పెంపొందింపజేయు కల్పించి వివక్షతకు దారి తీసే అంశాలను తొలగించి సమానత్వం కల్పించాలి. పాఠశాల స్థాయి నుంచి కొన్ని మార్పులు చేసుకుంటూ వస్తే ఆశించిన స్థాయిలో భావిభారత పౌరులలో మార్పులు వస్తాయి. అప్పుడు సమాజంలో స్త్రీ, పురుష సమానత్వమును సాధించుట సాధ్యపడవచ్చు.

**ఆదార గ్రంథాలు**

1. తెలుగు వైజ్ఞానిక త్రైమాసిక మాసపత్రిక – తెలుగు అకాడమి
2. వెండి వెలుగులు – యువభారతి రజతోత్సవ సంచిక
3. తెలుగు భాషావైభవం – కిన్నెర పబ్లికేషన్స్
4. ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియలు, ధోరణలు – తెలుగు అకాడమి

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# భారత స్వాతంత్ర్యోద్యమంలో స్విస్ వనిత మెల్లీ సోలింగర్

**డా. శాంసన్ రాజు చెరుకూరి,** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు.
**డా. నరసింహ వర్మ కర్లపూడి,** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తి.
**శైలజ తిరుకాల్వ,** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తి.

భారతదేశమంటే, భారతీయులంటే అప్పటికీ ఇప్పటికీ విదేశీయులు చాలామందికి ఇష్టం, ప్రేమ, అభిమానం. ఆ ఇష్టం అభిమానంతోనే బ్రిటిష్ పాలనలో మగ్గుతున్న మన అమాయకత్వాన్ని పోగొట్టి, మనకు ధైర్యసాహసాలు నూరిపోసి మన పక్షాన నిలబడి మనకు స్వాతంత్ర్యం సంపాదించి పెట్టేంతవరకూ నిద్రపోని వారు ఎందరో. అందునా విదేశీ మహిళలు మన దేశం రావడం, మన బాధల్ని తమవిగా భావించి, భారత స్వాతంత్ర్యోద్యమంలో మనల్ని భాగస్వాములయ్యేట్లు చేస్తూ, వారూ భాగస్వాములు కావడం మన దేశానికే గర్వకారణం. అలాంటి వారిలో స్విట్జర్లాండు యువతి మెల్లీ సోలింగర్ ఒకరు.

**బాల్యం :** స్విట్జర్లాండ్ రాజధాని జూరిచ్ లో 1898వ సంవత్సరం మార్చి 28వ తేదీన అడాల్ఫ్ సోలింగర్, బెర్తా దంపతులకు మెల్లీ సోలింగర్ జన్మించారు. వీరి మాతృభాష జర్మన్. ఈమె తండ్రి రేయాన్ ఫ్యాక్టరీ లో భాగస్వామి. సంపన్న కుటుంబం కావడం వల్ల మంచి విద్య కోసం బోర్డింగ్ స్కూలులో మెట్రిక్యులేషన్ చేర్పించారు. తర్వాత హోమ్ సైన్స్ కాలేజీలో పట్టభద్రురాలు అయ్యారు. వైద్య విద్యలో ప్రవేశింపొందినా కూడా కుటుంబ పరిస్థితుల కారణంగా పూర్తి చేయలేక పోయారు. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో వారి తండ్రిగారి ఫ్యాక్టరీకి నష్టాలు ప్రారంభమయ్యాయి. దీని కారణంగా ఆమె వైద్య విద్యను మధ్యలోనే వదిలేయాల్సి వచ్చింది. బాల్యం నుండి మెల్లి గుర్రపు స్వారి, రైఫిల్ రేంజ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, యాచింగ్, వాలీబాల్, ఈత పోటీల వంటి అనేక క్రీడల్లో పాల్గొంటూ ఉండేది. ఆ కాలంలోని జర్మన్ మేధావులు అనేకులు భారతదేశం గురించి, అక్కడి సంస్కృతి, సంప్రదాయాల గురించి, వేదాల గురించి అనేక పుస్తకాలు రాసేవారు. హెర్మాన్ ఓల్డెన్బర్గ్, హెర్మన్ కార్ల్ హేసా వంటి ఓరియంటాలజిస్టులు, ఇండాలజిస్టులు భారతదేశపు వేదాల గురించి, బౌద్ధమతం గురించి, "సిద్ధార్థ" వంటి పుస్తకాలను చదివి భారతదేశం గురించి అనేక విషయాలు తెలుసుకున్న ఆమెకు భారత దేశం అంటే ఎనలేని అభిమానం ఏర్పడింది. రామకృష్ణ పరమహంస, వివేకానందుడి జీవిత చరిత్రలను కూడా ఎంతో ఆసక్తితో తెలుసుకున్నారు.

ఆ కాలంలో యూరోప్ లో రాచరికలు తగ్గిపోయి అనేక రాజకీయ మార్పులు, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ జరిగాయి. అంతకుమునుపే పారిశ్రామిక విప్లవం ఫలితంగా ఆవిరి యంత్ర వినియోగం, అనేక సాంకేతిక పురోగతులు జరిగాయి. పారిశ్రామిక శక్తులు పెరగడంతో సోషలిజం, ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు ఎక్కువ అయ్యాయి. కార్ల్ మార్క్స్, లెనిన్ల కమ్యూనిజం గురించి చర్చలు జరిగేవి. కార్మిక, రాజకీయ, మహిళా నిరసనలు జరిగేవి. అటువంటి అత్యంత చైతన్య పూరితమైన వాతావరణంలో మిల్లి పెరిగారు.

**లక్ష్మణరావు గారితో పరిచయం :** బరంపురం వాస్తవ్యులు వుప్పల లక్ష్మణరావుగారు టుబింగన్ యూనివర్సిటీలో పీహెచ్డీ చేసే సమయంలో ఒక స్నేహితుడి ద్వారా మెల్లి పరిచయమయ్యారు. భారతదేశం నుండి వచ్చిన లక్ష్మణరావు గారిని మెల్లీ గారు ఇష్టపడ్డారు. ఆనాటి పరిస్థితుల గురించి వారిమధ్య ఎంతో అర్థవంతమైన చర్చలు జరిగేవి. యూరోప్ దేశాల్లో మహిళలకు ఓటు హక్కు కలిగించాలనే ఉద్యమాల్లో మెల్లి పాల్గొన్నారు. కొద్దికాలం తరువాత మెల్లి లక్ష్మణరావు గారిని తమ వివాహం గురించి ఎటువంటి అభిప్రాయం ఉందో తెలియజెప్పాలన్నారు. దేశం, ప్రాంతం, భాష, మతం, రంగు, ఆహారపు అలవాట్లు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలలో ఉన్న తేడాలను దృష్టిలో ఉంచుకొని లక్ష్మణ్ రావు గారు మొదట మెల్లిని భారతదేశానికి వచ్చి, వారి కుటుంబ సభ్యులతో కలిసి కొద్దికాలం ఉండవలసిందిగా కోరారు. ఇది 1922వ సంవత్సరంలో జరిగింది. దానికి మెల్లి అంగీకరించారు.

**భారతదేశానికి రావడం :** మహాత్మా గాంధీ గారు హరిజన్ పత్రికలో రాసిన వ్యాసాలను జర్మనీ భాషలోకి అనువదించడానికి అనుమతి కోసం గాంధీతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపారు. అప్పట్లో బ్రిటన్, జర్మనీ దేశాల మధ్య ఉన్న రాజకీయ సంబంధాల వల్ల ఆమెకు వీసా నిరాకరించారు. మెల్లి పట్టు విడవకుండా వారి నాన్నగారి వ్యాపార పరపతి రీత్యా ప్రయత్నించి 1929లో వీసా తెచ్చుకొని బొంబాయి చేరారు.

**రైలు యాత్రలు :** హిందూదేశాన్ని, భారత ప్రజలను గురించి తెలుసుకోవాలని కోరికతో కాశీ, బుద్ధగయ, అలహాబాద్, లక్నో, అలీఘర్, అమృత్సర్, హరిద్వార్ మొదలైన యాత్రా స్థలములను రైలులో మూడవ తరగతిలోనే ప్రయాణించి దర్శించేవారు. ఖరీదైన హొటల్లో కాకుండా సత్రాలలో, ధర్మశాలల్లో మకాం చేసి భారతీయ హృదయ స్పందనను మెల్లి అర్థం చేసుకున్నారు.

**స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వామ్యం :** ఈ పర్యటన ఫలితంగా బ్రిటిష్ వారి దోపిడీ పాలన, భారతీయుల కష్టాలు ఆమెను కదిలించాయి. విదేశీ వనిత అయినప్పటికీ ఆమె మనస్సు భారతీయుల కష్టనష్టాలతో మమేకమై నిజాయితీగా, స్వచ్ఛందంగా, అంకితభావంతో భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. 1929 వ సంవత్సరం లాహోర్లో జరిగిన కాంగ్రెస్ సమావేశాలకు లక్ష్మణరావు గారితో కలిసి హాజరయ్యారు. అధ్యక్ష హోదాలో పండిట్ జవహర్లాల్ నెహ్రూగారి ఆధ్వర్యంలో భారత జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వాతంత్ర్యం (పూర్ణ స్వరాజ్) నినాదాన్ని అందుకున్నది. మొదటిసారిగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి 1930 జనవరి 26వ తేదీని స్వాతంత్ర్యదినంగా పరిగణించాలని జాతీయ నాయకులు పిలుపునిచ్చారు. ప్రస్తుత రిపబ్లిక్ దినోత్సవాన్ని జనవరి 26వ తేదీ జరపడానికి ఈ సభలో తీసుకున్న నిర్ణయమే నాంది.

మనస్ఫూర్తితో భారతదేశ స్వాతంత్ర్య సిద్ధికి తాము అంకితం అవుతామని మెల్లిగారు, లక్ష్మణ్ రావుగారు ప్రతిజ్ఞ చేశారు. 1931 – 32 సంవత్సరాల లో జరిగిన కార్యక్రమాల్లో ముఖ్యంగా విదేశీ వస్తు బహిష్కరణ, నూలు మిల్లు దుకాణాల వద్ద పికెటింగ్‌లలో మెల్లీ గారు ఒంటరిగా పాల్గొన్నారు.

**సబర్మతి ఆశ్రమ దర్శనం :** గాంధీ గారి సబర్మతి ఆశ్రమ జీవితాన్ని అర్థం చేసుకోవాలని మెల్లీ గారు ఆశ్రమంలో చేరి ఒక సంవత్సరం పాటు అక్కడే ఉన్నారు. సాదాసీదా జీవితాన్ని గడుపుతూ ఖద్దరు దీక్ష గురించి తెలుసుకున్న ఆమె అక్కడే ఉండి పత్తిని ఏకడం, నూలు తీయడం మొదలైన కార్యాలలో నిపుణత సాధించారు. అప్పట్లో ఆశ్రమానికి ఒకవైపు చిట్టడవి ఉండేది. అక్కడనుండి అప్పుడప్పుడు విషసర్పాలు ఆశ్రమంలోకి ప్రవేశించేవి. కానీ అహింసా సూత్రానికి కట్టుబడ్డ ఆశ్రమవాసులు వాటిని చంపకుండా, ప్రత్యేక పరికరాలతో పట్టుకుని దట్టమైన అడవుల్లో విడిచి పెట్టేవారు. గాంధీ గారి సూచనల ప్రకారం ఆశ్రమ వాసుల్లోని పురుషులు రాత్రిపూట దుండగుల నుండి, విషసర్పాల నుండి రక్షించడానికి వంతుల వారీగా ఆశ్రమానికి కాపలాగా ఉండేవారు.

**స్త్రీ పురుష అసమానతలపై పోరాటం :** స్త్రీ పురుష సమానత్వాన్ని బలంగా నమ్మి మెల్లిగారు రాత్రిపూట గస్తీ తిరిగే పనిని స్త్రీలకు కూడా ఇవ్వవలసిందిగా నిర్వాహకులను కోరగా స్త్రీలలో ధైర్య సాహసాలు తక్కువనీ, స్త్రీలు అటువంటి వాటిని చేయలేరని గాంధీగారు అభిప్రాయపడినందున స్త్రీలను రాత్రిపూట గస్తీకి ఎంపిక చేయలేమని నిర్వాహకులు తెలియజేశారు. స్త్రీలలో సహజంగానే ధైర్య సాహసాలు ఉంటాయనీ, ఆశ్రమ విధుల పాటింపులో స్త్రీ పురుష వ్యత్యాసం ఉండకూడదని ఆమె బలమైన అభిప్రాయాన్ని కలిగి ఉండేవారు. స్త్రీలు పిరికివారు కారని, ధైర్య సాహసాల్లో సమానమేననీ, స్త్రీ పురుష సమానత్వానికి ప్రతీకగా ఈ నిబంధనను సవరించవలసిందిగా ఎరవాడ జైలులో శిక్ష అనుభవిస్తున్న గాంధీ గారికి ఆమె అనేక లేఖలు రాసి ఆశ్రమ నిబంధనలను, గాంధీ గారి అభిప్రాయాలను మెల్లీ మార్చగలిగింది. 1933 డిసెంబర్ మాసంలో నెల్లూరు జిల్లాలో చరఖా ప్రదర్శన పర్యటనకు వచ్చిన గాంధీ గారితో మెల్లి గారు భేటీ అయ్యారు. ఆమె పట్టుదల, ధైర్య సాహసాలను గాంధీగారు ప్రశంసించారు. సబర్మతి ఆశ్రమంలో ఆమె నివసించిన కాలంలోనే పొట్టి శ్రీరాములుగారు కూడా ఉండడంతో వారితో ఆమెకు సన్నిహిత స్నేహం ఏర్పడి ఆయన మరణం వరకు కొనసాగుతూ వచ్చింది. బెజవాడ గుండా వెళ్ళవలసి వచ్చిన ప్రతిసారి శ్రీరాములుగారు ఈ దంపతుల ఇంట్లో వసతి పొందేవారు.

**ఖాదీ శిక్షణ :** ఖాదీ శిక్షణ పొందిన ఆమె 1935 వరకు ఆంధ్ర రాష్ట్రమంతా ఖాదీ ప్రచారం చేశారు. తర్వాత కలకత్తాలోని "ఖాదీ ప్రతిష్ఠాన్" స్వచ్ఛంద సంస్థలో అనేక మెళకువల్ని నేర్చుకున్నారు. తరువాత ఆంధ్ర దేశంలోని సన్ననూలు కేంద్రమైన శ్రీకాకుళం నగరంలో స్థిర నివాసం ఏర్పరచుకొని కొన్ని సంవత్సరాల పాటు అక్కడే ఉండి, పొందూరు, బొంతలకోడూరు మొదలైన ప్రదేశాల్లో చేనేత పద్ధతులను క్షుణ్ణంగా అభ్యసించారు. చేనేత పద్ధతుల గురించి, చేనేత పరిశ్రమని ఎలా అభివృద్ధిపరచవచ్చుననే విషయాల గురించి భారతి మాసపత్రికలో అధ్యయన పత్రాలు రాశారు.

లక్ష్మణరావుగారి కన్నా మెల్లీగారే ఎక్కువగా ఉద్యమ జీవితాన్ని గడిపారు. భారత ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలలో ఆమె ఆసక్తిగా పాల్గొనేవారు. తూర్పుగోదావరి జిల్లా ఖాదీ ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన మెల్లి గారిని అక్కడి పోలీస్ సూపరిండెంట్ అరెస్ట్ చేస్తానని బెదిరించగా, ఆ ధీర వనిత అరెస్టువల్ల ఈ సమస్య అంతర్జాతీయ సమస్యగా మారుతుందని హెచ్చరించగా ఆ ఎస్పీ వెనుకంజ వేశాడు.

**వివాహం :** 1922లో పరిచయమైన లక్ష్మణరావు గారితో 14 సంవత్సరాల పాటు అనేక పరిస్థితులు, ఉద్యమాలు, పోరాటాల గుండా ప్రయాణించిన తర్వాత వివాహం చేసుకోవడానికి మెల్లి గారు కొన్ని షరతులను విధించారు. రాజకీయ, సాంఘిక, ఆర్థిక విషయాలన్నిటిలో, స్త్రీ పురుష సమానత్వం గల ఏకైక దేశమైన సోవియట్ రష్యాలో తమ వివాహం జరగాలని ఆమె ఆకాంక్షించగా, లక్ష్మణరావు గారు అంగీకరించారు. ఆనాటి సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజావిప్లవ కేంద్రమైన సోవియట్ యూనియన్‌లో దేశాంతర, మతాంతర, వర్ణాంతర వివాహం వారి 39వ ఏట 1937 ఆగస్టు 30వ తేదీన జరిగింది.

**జైలు శిక్ష :** భారతీయులపై దమనకాండను అంతర్జాతీయంగా ఎలుగెత్తి చాటిచెబుతున్న మెల్లిగారిని బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసి మూడున్నర సంవత్సరాలు తమిళనాడులోని వేలూరులో మూడవ తరగతి జైలు శిక్ష విధించింది. జైలు శిక్షను ఆనందంగా స్వీకరించి జైలులో గడిపిన కాలంలో కూడా కృంగిపోక జైలులోని మూడవ తరగతి స్త్రీలకు మరుగుదొడ్ల సౌకర్యానికై గళం ఎత్తి, పోరాడి అనుకున్నది సాధించిన ధీశాలి మెల్లిగారు.

**బాల్ బేరింగ్ చరఖా రూపకల్పన :** 1939 నుండి 1959 వరకు భర్త లక్ష్మణరావుగారు బెజవాడ ఆంధ్ర సిమెంట్ కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తుండగా మెల్లిగారు ఆయనతో ఉంటూ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేవారు. ఆంధ్ర ఇంజనీరింగ్ కంపెనీ అధినేత శ్రీ దంతులూరి లక్ష్మీనారాయణ గారితో ఉన్న పరిచయం కారణంగా అప్పట్లో వాడుకలో ఉన్న నూలువడికే రాట్నాలకి బేరింగ్స్ వాడటం ద్వారా ఆధునీకరించాలని బాల్ బేరింగ్ రాట్నాన్ని తయారుచేయించారు. ఈ నూతన బాల్ బేరింగ్ రాట్నం కారణంగా కార్మికుల శ్రమను తగ్గించి ఉత్పాదకతని పెంచారు మెల్లి గారు. ఆ రాట్నాన్ని దేశంలోని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లి ప్రదర్శించి కార్మికుల మన్ననని పొందారు.

**సాహస వనిత :** మెల్లీ సాహసానికి మారు పేరు. తనకు అవమానం కలిగినా, తాను తలపెట్టిన మంచిపనికి అవరోధం కలిగినా ఆమె సహించేది కాదు. ఒకరోజు తూర్పు గోదావరి జిల్లాలోని రాజోలు నుండి పశ్చిమ గోదావరి జిల్లాలోని నరసాపురానికి తిరుగు ప్రయాణమైంది. గోదావరి నది దాటటానికి ఒక లాంచీ ఎక్కింది. అయితే ఎవరో పెద్దఅధికారి లాంచీలో ప్రయాణం చేయడానికి వస్తున్నాడని, లాంచీని చాలా సేపు ఆపేశారు. ఎంతసమయం ఎదురుచూసినా అతను రాలేదు. లాంచీ కదలలేదు. సహనం కోల్పోయిన మెల్లీ ఈతకు అనువైన బట్టలు ధరించి ఆలస్యం చేయకుండా అమాంతం గోదావరిలో దూకి, ఐదు గంటలపాటు 15 మైళ్ళు ఈది నరసాపురం చేరుకుంది. ఒళ్ళు గగుర్పొడిచే మెల్లీ సాహసానికి లక్ష్మణరావు మొదట నొచ్చుకున్నా, ఆ తరువాత మెచ్చుకున్నారు.

**కమ్యూనిస్టులుగా మార్పు :** కాలం గడిచే కొద్దీ మెల్లి లక్ష్మణరావు దంపతులు కాంగ్రెస్ పార్టీ విధానాల నుండి విభేదించారు. "కాంగ్రెస్ పార్టీలో ఎందుకు చేరలేదు" అని వివరించే చిన్న పుస్తకాన్ని ప్రజాశక్తి కార్యాలయం తరఫున ప్రచురించారు. 1946లో మద్రాసు అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఏలూరు నియోజకవర్గానికి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి అయిన అచ్చమాంబగారికి మద్దతిచ్చారు.

మార్క్సిస్ట్ సాహిత్యాన్ని జర్మనీ భాషలో అధ్యయనం చేసి, ఒక దశాబ్దం పరిశీలన చేసిన తరువాత మెల్లీ లక్ష్మణరావు దంపతులు భారత కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం తీసుకున్నారు.

**రష్యా దేశంలో జీవితం :** 1947 ఆగస్టు 15వ తారీఖున స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత మెల్లీ లక్ష్మణరావు దంపతులు బెజవాడలో ఉండేవారు. 1957వ సంవత్సరంలో లక్ష్మణరావుగారిని జర్మనీ యూనివర్సిటీలో రీసెర్చ్ ఫెలోగా ఆహ్వానించగా అక్కడ పరిశోధనలు జరిపారు. తర్వాత రష్యన్ కమ్యూనిస్టు పార్టీ వారి ఆహ్వానం మేరకు 1958 వ సంవత్సరంలో వారు రష్యన్ సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించటం కోసం మాస్కో చేరుకొని, సుమారు 12సంవత్సరాలు అక్కడే ఉన్నారు. ఈ కాలంలో అనేక పుస్తకాలను రష్యన్ భాషనుంచి తెలుగులోకి అనువదించారు. వాటన్నిటిలో "రష్యన్– ఇండియన్ నిఘంటువు"ను అత్యంత అమూల్యమైన పుస్తకంగా పరిగణిస్తారు. రష్యా దేశానికి వెళ్లిన ఏడు సంవత్సరాల తర్వాత 1965 వ సంవత్సరం జూలై 27వ తారీకు ఉదయాన చిన్న ఆక్సిడెంట్ లో మెల్లి గారు అనూహ్యంగా పరమపదించారు.

స్విట్జర్లాండ్ యువతి భారతదేశం మీద భారతీయత మీద ఇష్టంతో ఇక్కడి ఆంధ్రలోని బెజవాడ రావడం మనతోపాటు సహజీవనం చేయడం ఆశ్చర్యం కల్గించే విషయమే. ఇప్పటివారి విదేశీ మోజును, మనదేశంమీదున్న అయిష్టతను తలచుకుంటే ఆశ్చర్యమే. సహానుభూతి, నిస్వార్థం, దయ, ప్రేమ, సమానత్వం, ధైర్యం, పోరాటం, సేవాగుణం, నమ్మిన సిద్ధాంతాల పట్ల మొక్కవోని ధీరత్వం, స్త్రీ పురుష సమానత్వం ఇవి మెల్లీకి పెట్టని ఆభరణాలు. భారతీయతలో మమేకం కావడం మన అదృష్టం.

**ఆధారగ్రంథాలు:**

1. బతుకు పుస్తకం, వుప్పల లక్ష్మణరావు, విశాలాంధ్ర ప్రచురణ
2. సోవియట్ దేశం – భూతల స్వర్గం, మెల్లీ సోలింగర్, ఉప్పల లక్ష్మణరావు, సెట్టి ఈశ్వరరావు (అను.)
3. తెలుగు వికీ పీడియా – మెల్లి సోలింగర్

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# సింహపురి "కనకపుష్యరాగం" పొణకా కనకమ్మ

డా. వై. దివ్య, తెలుగు అధ్యాపకులు, దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల(స్వయం), చరవాణి : 9848278788

"ఊయలలూగించే కోమలకరాలే రాజ్యాలు శాసిస్తవి
తూలిక పట్టే మృదు హస్తాలే శతఘ్నులు విదిలిస్తవి
జోలలు పుచ్చే సుకుమారపు చేతులే జయభేరులు మోగిస్తవి"
– పొణకా కనకమ్మ

శ్రీ మరుపూడి కొండారెడ్డి శ్రీమతి కామమ్మ గార్ల ముద్దుబిడ్డగా 1892లో శ్రీమతి కనకమ్మ జన్మించారు. పొట్లపూడి ఆమె జన్మస్థలం. మేనమామ గారైన శ్రీ పొణకా సుబ్బరామిరెడ్డి తో వివాహం అయింది. నెల్లూరు జిల్లాలో పోట్లపాడి అనే చిన్న పల్లెలో బాల్యం యవ్వనం గడిచిన ఆమె తనంత తాను ఆధునిక మహిళగా రూపొందించుకుంది. భూస్వామ్య కుటుంబంలోని కష్ట సుఖాలన్నింటిని ఆమె ఎదుర్కొంది. ఆమె జీవితంలో ఒక్కొక్క సంఘటన వెనక అచంచలమైన కనకం ఆత్మస్థైర్యం వ్యక్తిత్వం కనబడతాయి. ఆమె వీర వనిత విప్లవకారిణి బూజు పట్టిన పాత భావాలను ఆచారాలను తోసిబుజ్జి అభ్యుదయ కరమైన కొత్త రీతుల్ని ఇట్లే ఆమోదించి స్వీకరించగల సంస్కర్త అని చెప్పవచ్చు.

వందేమాతరం ఉద్యమం నెల్లూరులో మధ్యతరగతి ఆపై వర్గాలను ప్రభావితం చేసినది. 1907 వేసవిలో విపించంద్ర పాలు దంపతులు నెల్లూరు వచ్చినప్పుడు వారికి కనకమ్మ ఆతిథ్యం ఇచ్చారు. అప్పుడు ఆమె పదహారేళ్ల యువతి. ఆంధ్రదేశంలో వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్న కొద్దిమంది మహిళల్లో కనకమ్మ ఒకరు.

కనకమ్మ రచన వ్యాసాంగం 20 ఏళ్ల వయసులోనే ప్రారంభమైంది. భాష విషయంలో కనకమ్మ సాంప్రదాయవాది కాదు ఆధునిక తెలుగు భాషలో వస్తున్న మార్పులను గుర్తించి స్వాగతించారు వ్యవహారిక భాషా ప్రయోజనాన్ని గుర్తించి గుణంగానే రచనలు చేశారు. శశిరేఖ, హిందూసుందరి, అనసూయ వంటి పత్రికల్లో పద్యాలు వ్యాసాలు రాయడంతో ఆమె రచన జీవితం మొదలైంది. "చెట్టు నీడ ముచ్చట్లు" పేరుతో ఆమె మొదట్లో కొన్ని వ్యాసాలు రాశారు. జాతీయ ఉద్యమ స్ఫూర్తితో కనుక 1920 ప్రాంతంలో 'రాణి పద్మిని' అనే చారిత్రక నవల రాశారు. కనకమ్మ ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ సుమారు 30 సంవత్సరాలు కలిసి సేవా కార్యక్రమాలు సాగించారు. తెలుగులో తొలి జంట కవయత్రులుగా రమణ మహర్షి భక్తులై భగవాన్ మీద స్తుతి గీతాలు రాశారు. భగవద్గీతలో కొన్ని శ్లోకాలను జ్ఞాననేత్రం పేరుతో తెలుగులోకి అనువదించారు. రమణ మహర్షి గురించి భారతి గృహలక్ష్మి తదితర పత్రికల్లో ప్రచురించారు. అలాగే దువ్వూరి రామిరెడ్డి మీద రాసిన పద్యాలు జమీన్ రైతు పత్రికలో ప్రచురితమయ్యాయి. గురుదేవుడు పేరుతో రామయోగి చరిత్రను కనకమ్మ వచనంలో రాశారు.

జన్మతః అబ్బిన సంస్కారంతో దేశ సేవ చేయాలన్న కోరిక కలిగిన ఆమె పల్లెటూరైన పొట్లపూడిలోనే 1913లో సుజర సృజన రంజని సమాజం స్థాపించి దాని ద్వారా అనేక ఉద్యమాలకు నాంది పలికారు. ఆ కాలంలోనే ఆంధ్రోద్యమం ప్రారంభమైంది. శ్రీ అయ్యంకి వెంకటరమణయ్య గ్రంథాలయ ఉద్యమం ఆరంభించారు. దానికి అనుగుణంగా పొట్లపూడిలో వివేకానంద పుస్తకభాండాగారం వెలసింది. ఆ పల్లెటూరి ఉద్యమాలకు కేంద్రమై సభలు సమావేశాలు నిరంతరం జరుగుతూ ఉండేవి. చిలకమర్తి లక్ష్మీనరసింహం అయ్య దేవర కాళేశ్వరరావు కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు ఉన్నవ లక్ష్మీనారాయణ వంటి ప్రముఖులు ఈ సభల్లో సమావేశాల్లో తరచూ వచ్చి పాల్గొనేవారు.

స్వాతంత్ర్యోద్యమంలో ఆమె చేపట్టని కార్యక్రమం లేదు. గాంధీజీ ప్రభావానికి లోను కాక ముందు 1915న మద్రాస్‌లో ఓ.వి చిదంబర పిళ్లై, గుంటూరులో ఉన్న లక్ష్మీనారాయణ లాంటి ఉద్యమకారులతో చేతులు కలిపి రహస్యంగా పిస్టళ్లు బాంబులు దిగుమతి చేసుకొని సమయం కోసం వేచి ఉండిన సాహసి ఆమె. గాంధీజీ ప్రభావానికి లోనైన తర్వాత ఆమెలో మార్పు కలిగింది. హరిజనులకు చదువు చెప్పించేందుకు పోట్లపాడిలో స్కూల్ పెట్టింది. రాట్నం వడికింది. అహింసను ప్రచారం చేసింది. మాదిగ వాడలో కలరా సోకితే స్వయంగా చికిత్స చేసింది. మాలవాడలో విష జ్వరాలు ప్రబలితే మందు మాకు అందజేసింది. ఖద్దరు గుడ్డలు భుజాన వేసుకుని నెల్లూరులో వీధి వీధి తిరిగి అమ్మింది.

శ్రీ బాలగంగాధర్ తిలక్ స్వదేశీ ఉద్యమంలో భాగంగా పొట్లపూడిలో స్వదేశీ నేత సంఘం అనే పేరుతో గొప్ప ఉత్పత్తి సంఘాన్ని ప్రారంభించారు. తిలక్ మద్రాసు వచ్చినప్పుడు కనకమ్మ వారిని దర్శనం చేసుకున్నారు. అనిబిసెంట్‌తో సంబంధాలు పెట్టుకొని హోమ్‌రూల్ ఉద్యమంలో పనిచేశారు. 1919లో మద్రాసు వెళ్లి గాంధీజీని కలుసుకున్నారు.ు 1921లో పల్లెపాడు లో గాంధీజీ ప్రారంభించిన వినాయకుని సత్యాగ్రహం ఆశ్రమం నెలకొల్పడంలో కనకమ్మ దంపతులు ప్రధాన పాత్ర నిర్వహించారు. పొణకా కనకమ్మ తన నగలనమ్మి పల్లెపాడులో పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం నెలకొల్పారు. గాంధీ మహాత్ముడు ఆశ్రమ ప్రారంభోత్సవం జరిపారు.

1920 నుంచి కాంగ్రెస్ తో సన్నిహిత సంబంధం కలిగిన ఆమె పట్టుదలతో స్త్రీలలో కాంగ్రెస్ అభిమానం ప్రజలింపచేశారు. స్త్రీలందరూ విద్యావంతులు కావాలని రాజకీయ చైతన్యం కలిగి దేశభక్తులు కావాలని ఆమె కోరిక అందుకే నెల్లూరులో ఆమె కస్తూరిదేవి విద్యాలయం నెలకొల్పారు. గాంధీ మహాత్ముడు ఈ కస్తూరి విద్యాలయాన్ని శంకుస్థాపన చేశారు. "నెల్లూరులో చూడదగినది ఏదైనా ఉందంటే అది కస్తూరిదేవి విద్యాలయమే సుమ. మీరందరూ దీనికి సహకరించండి" అని ప్రజలను ఉద్దేశించారు బాపూ. కస్తూరిదేవి పారిశ్రామిక విద్యాలయ ప్రారంభోత్సవ సందర్భంలో ఆమెకు కష్ట స్త్రీ అని గాని శ్రమ శ్రీ అని బిరుదు ఎందుకు ఇవ్వకూడదని శ్రీ బెజవాడ గోపాలరెడ్డి చమత్కరించారు. ఇతరుల బాధలు కష్టాలు పోగొట్టుకోవడానికి తాను సంతోషంగా కష్టశ్రీ, శ్రమశ్రీగా మలుచుకోగలిగినందువలన ఆమె మూర్తీభవించిన ఒక మహా సంస్థగా కీర్తి తెచ్చుకున్నారు.

ఉప్పుసత్యాగ్రహం సందర్భంగా జైలుకు వెళ్లి 1933లో విడుదలైన తర్వాతే ఆంధ్రదేశంలో దుర్గాబాయి వంటి మహిళలు స్త్రీల అభ్యున్నతి కోసం పాఠశాలలు స్వచ్ఛంద సంస్థలు నెలకొల్పారు. వాళ్లకంటే చాలా ముందుగా గాంధీజీ నిర్మాణ కార్యక్రమం స్ఫూర్తితో 1923 అక్టోబర్ మాసంలో విజయదశమి రోజు కనకమ్మ నెల్లూరులో కస్తూరిబా పేరిట జాతి వివక్ష లేని బాలిక పాఠశాల ప్రారంభించారు. బహుశా ఈ కారణం చేతనే దుర్గాబాయి కనకమ్మను తన గురువుగా మార్గదర్శినిగా పేర్కొన్నారు. కనకమ్మ మరణ వార్త విన్నప్పుడు 'ఆంధ్రదేశం ఒక వీరవనితను గొప్ప సేవకురాలిని ఉదాత్త చరితను కోల్పోయింది' అని నివాళు లర్పించారు.

ఆ కాలంలోనే జమీన్ రైతు అనే పత్రికను ఏర్పాటు చేసి, నిర్వహిస్తూ స్త్రీ చైతన్యానికి కృషిచేశారు. స్త్రీలు రాజకీయాల్లో పాల్గొనవలసిందని ఆమె ని ర్ద్వంద్వంగా ప్రకటించారు. స్త్రీలు సంకల్పిస్తే ఎంత పనైనా చేయగలరని ఒక పత్రిక నిర్వహణమే కాదు, రాజ్యాంగాన్నే శాసించగలరని స్త్రీ శక్తి మీద గొప్ప విశ్వాసం ప్రకటించారు పొణకా కనకమ్మ. రాజకీయ రంగం స్త్రీలను జాగృతం చేసి వారి శక్తిని బహిర్గతం చేస్తుందని ఆమె భావించారు. సభలకు పోవడానికి జంకే స్త్రీలు నేడు సభా వేదికలు చలించేటట్లు అనేక విషయాలు ధారాళంగా, సమర్ధవంతంగా చర్చించగలుగుతున్నారంటే అది వారి రాజకీయ సేవా ప్రాబల్యమే అని అభిప్రాయపడ్డారు. కనకమ్మ లోని స్త్రీవాద దృక్పథం ఆమె స్వీచరిత్ర రచించడానికి పూనుకోవడంలోనే వ్యక్తం అవుతుంది. తెలుగు నాట ఆడవాళ్లు స్వీయ చరిత్ర రాసుకోవడం అరుదుగా జరిగిందని చెప్పుకోవచ్చు.

1962 మే 26న ఆంధ్ర మహిళా సభ రజితోత్సవాలు మద్రాసులో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్ర దేశానికి చెందిన 20 మంది దేశ సేవకులు, సంఘ సేవకులు, రచయితలు, కళాకారులను సత్కరించి సన్మానించారు. పొణకా కనకమ్మ సేవలకు గుర్తింపుగా ఆమె జీవిత చరమ సంధ్యలో మద్రాస్ ఆంధ్ర మహిళా సభ రజితోత్సవ సభలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ సన్మానించి గౌరవించారు. ఇదే కనకం అందుకున్న అత్యుత్తమ పురస్కారం. ఈ కార్యక్రమానికి నాటి భారత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు అధ్యక్షులు. ఆనాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి మహారాష్ట్ర గవర్నర్ డాక్టర్ పి.సుబ్బరాయన్ శ్రీ రాజగోపాలాచారి వంటి విశిష్ట అతిథులు ఆ సభలో ఆసీనులయ్యారు. ఆ సభలో భారతదేశ స్త్రీల ఉద్యమానికి విశిష్ట సేవలందించిన డాక్టర్ ముత్తు లక్ష్మిరెడ్డి, డాక్టర్ సుశీల, బత్తుల కామాక్షమ్మ, పొణకా కనకమ్మ, బి. కృష్ణవేణి అమ్మ మొదలైన 20 మంది మహిళలను సన్మానించి గౌరవించారు. ఈ సభలో ఆనాటి మహారాష్ట్ర గవర్నరయిన డాక్టర్ సుబ్బరామన్ చేతుల మీదగా మహిళా సభ తరపున పొణకా కనకమ్మ రజత పతాకాన్ని, సన్మానాన్ని అందుకున్నారు. ఆ పతకంపై

**"ఆంధ్ర మహిళా సభ రజిత సమారోహ"**

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# చరిత్ర మరచిన వీరనారి ఝల్కారీబాయి

**అర్జా. నాగేశ్వరరావు**, రాజనీతిశాస్త్ర అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,పుత్తూరు,తిరుపతి జిల్లా.చరవాణి : 98491 95349.

**పరిచయం :** చరిత్రలో సరైన గుర్తింపు లభించక, మరుగున పడిపోయిన అనేకమంది వీరనారీమణుల్లో ఝల్కారీబాయి ఒకరు. ఈమె రాణి లక్ష్మీబాయికి నమ్మకమైన సలహాదారు. 1857లో జరిగిన సిపాయిలతిరుగుబాటులో బ్రిటీష్ సైన్యంపై పోరాడిన ధీరవనిత. 1857లో జరిగిన భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా పిలుచుకునే సిపాయిల తిరుగుబాటు బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా భారతదేశంలో జరిగిన తిరుగుబాటు. ఈ తిరుగుబాటు దేశచరిత్రపై ఒక లోతైన ముద్రను వేసింది. ఈ యుద్ధంలో పోరాడిన మంగళం పాండే, ఝాన్సీ లక్ష్మీబాయి, తాంతియా తోపే, నానాసాహెబ్ లాంటి ప్రసిద్ధమైన అమరవీరుల పేర్లు దేశంలోని ప్రజలందరికీ సుపరిచితమే. కానీ చరిత్రలో కొంతమంది మరీ ముఖ్యంగా అణగారిన కులాలకు చెందినవీరుల, వీరనారీమణుల గాథలు, దేశంకోసం వారు చేసిన త్యాగాలు, వారి సాహస కార్యాలు వెలుగులోకి రాకపోవడం శోచనీయం.

1857లో జరిగిన తిరుగుబాటులో వీరోచితంగా పోరాడిన ఝల్కారీబాయి లాంటి అణగారిన కులానికి చెందిన వీరసైనికురాలికి చరిత్రలో రావలసినంత గుర్తింపు రాలేదు. అయితే కాలం ఎప్పుడూ ఒకే మాదిరిగా ఉండదు. అణగారిన వర్గాల్లో కూడా చైతన్యం పెరిగింది. ఇటీవలకాలంలో ఆ వర్గాల్లోని కొంతమంది విద్యావంతులు, మేధావులు, చరిత్రకారులు మరుగుపరచబడిన చరిత్రను మరొకసారి తవ్వితీసి దళితవర్గాల్లోని వీరుల, ఉద్యమకారుల వివరాలను, వారి త్యాగాలను ఆధారసహితంగా వెలుగులోకి తేవడం జరుగుతూంది. అలా మరుగుపరచబడిన ఒక గొప్ప వీరనారి ఝల్కారీబాయి. ఆమె 1857 సంగ్రామంలో భాగంగా ఝాన్సీ కోట నుండి బ్రిటిష్ సైనికులతో గొప్ప తెగువతో, ధైర్యసాహసాలతో, త్యాగనిరతితో ఎదురొడ్డి పోరాడిన వీర సైనికురాలు.

**ఝల్కారీబాయి జీవిత విశేషాలు :** ఝల్కారీబాయి నేటి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఝాన్సీ పట్టణానికి సమీపంలోగల భోజ్లా అనే గ్రామంలో **కోలీ** అనే ఒక అణగారిన కులంలో 22 నవంబర్ 1830న సదోవాసింగ్, జమునాదేవి దంపతులకు జన్మించిన ఏకైక కుమార్తె. చిన్నతనంలోనే తల్లి మరణించడంతో ఆమె తండ్రే ఆమెను శ్రద్ధగా పెంచాడు. ఆనాటి సామాజిక పరిస్థితులవల్ల ఆమె సరైన విద్యను అభ్యసించలేకపోయింది. కానీ గుర్రపుస్వారీ, మల్లయుద్ధం, ఆయుధాలను ఉపయోగించడం లాంటి యుద్ధకళలలో శిక్షణ పొందింది. ఝాన్సీ లక్ష్మీబాయి సైన్యంలో గొప్ప సామర్థ్యంగల సైనికుడుగా పేరెన్నికగన్న **పురాన్ సింగ్** అనే సైనికుడిని వివాహమాడింది. ఒకసారి గౌరీపూజ సందర్భంగా గ్రామానికి చెందిన కొంతమంది మహిళలతో కలిసి కోట వద్దకు ఝల్కారీబాయి వెళ్ళినప్పుడు తన పోలికలతో ఉన్న ఝల్కారీబాయిని చూసి రాణీ లక్ష్మీబాయి ఆశ్చర్యపోయింది. వెంటనే ఆమె గురించి ఆరాతీసింది. ఝల్కారీబాయి ధైర్యసాహసాల గురించి తెలుసుకున్న రాణి ఆమెను సైన్యంలోని మహిళావిభాగంలోకి తీసుకొంది. **దుర్గాదళ్** అనే మహిళాసైన్యంలో ఝల్కారీబాయి చురుకైన పాత్రను పోషించింది. అనతికాలంలోనే సైన్యంలో ఆమె ఉన్నతస్థాయికి చేరింది. ఝాన్సీరాణికి ఒక కీలకమైన సలహాదారుగా పనిచేసింది.

**ఝల్కారీబాయి యొక్క సాహసోపేత కార్యాల పై ప్రాచుర్యంలో ఉన్న గాథలు :** ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్ఖండ్ లాంటి ప్రాంతాల్లో ఝల్కారీబాయి సాహసోపేత కార్యాలను నేటికీ కథలుకథలుగా చెప్పుకుంటారు. అలా ప్రాచుర్యంలో ఉన్న కొన్ని కథనాలు. ఒకసారి గ్రామంలో నివసిస్తున్న వ్యాపారి ఇంటిపై దొంగలు దాడి చేసేందుకు ప్రయత్నించినప్పుడు ఝల్కారీబాయి ఒంటరిగా పోరాడి ఆ దొంగలను తరిమికొట్టినట్లు చెబుతారు. అలాగే ఒకసారి అడవిలో ఒక పులి తనపై దాడిచేయడానికి ప్రయత్నించినప్పుడు ఆమె తన గొడ్డలితో ఆ పులిని చంపిందని చెబుతారు. మరొకసారి ఒక అడవిలో ఒక చిరుతపులిని కేవలం పశువులను మేపే కర్రతో ఎలా మట్టుపెట్టిందో చెబుతారు.

బుందేల్ఖండ్ ప్రాంతంలోని అనేక దళితవర్గాలు ఝల్కారీబాయిని ఈనాటికీ ఒక భగవంతుని అవతారంగా భావించి ఆమె గౌరవార్థం ప్రతి సంవత్సరం ఝల్కారీబాయి జయంతిని నవంబర్ 22న అత్యంత కోలాహలంగా జరుపుకుంటారు.

**1857 సిపాయిల తిరుగుబాటులో ఝల్కారీబాయి పాత్ర :** 1857వ సంవత్సరంలో జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఝల్కారీబాయి ఝాన్సీ రాజ్యం తరపున పోరాడింది. 1857లో మీరట్‌లో సిపాయిల తిరుగుబాటు ప్రారంభమయ్యింది. ఉత్తర, మధ్య భారతదేశం అంతటా అనేక తిరుగుబాట్లకు దారితీసింది. ఆ సిపాయిల తిరుగుబాటులో ఝాన్సీ కూడా చురుకుగా పాల్గొనడం జరిగింది. ఫీల్డ్ మార్షల్ జనరల్ **హ్యూ హెన్రీ రోసెస్** తిరుగుబాటును శాశ్వతంగా ముగించడానికి ఝాన్సీ కోటపై దాడిచేశారు. ఝాన్సీ లక్ష్మీబాయి బ్రిటీష్ సైనికులతో కొంతకాలం పోరాడిన తరువాత తన సలహాదారుల సూచన మేరకు ఝాన్సీ కోటను వదిలి బ్రిటిష్ సైన్యం కళ్ళుకప్పి తప్పించుకోవాలని భావించినప్పుడు రాణి ఝాన్సీ లక్ష్మీబాయికి హాని కలగకుండా ఆమె వేషాన్ని ఝల్కారీబాయి ధరించి, తన ప్రాణాలను పణంగాపెట్టి తానే అసలైన ఝాన్సీబాయిగా బ్రిటిష్ సైన్యాన్ని సమర్థవంతంగా గందరగోళానికి గురిచేసి, రాణి తనబిడ్డతో సహా తప్పించుకునేలా చేయడం ద్వారా ఝల్కారీబాయి త్యాగనిరతి, ధైర్యసాహసాలు ప్రపంచానికి వెల్లడయ్యాయి.

**ఝల్కారీబాయికి ఈ మధ్యకాలంలో లభించిన గుర్తింపు :** 1951లో బి.ఎల్. వర్మ రాసిన **'ఝాన్సీ కి రాణి'** నవల్లో ఝల్కారీబాయి ప్రస్తావన ఉంది. వర్మ తన నవల్లో ఝల్కారీబాయి గురించి ఒక ఉపకథను కూడా సృష్టించాడు. అదే సంవత్సరంలో ప్రచురించబడిన రామచంద్ర హెరాన్ బుందేలీ నవల 'మాతి' లో ఆమె ధైరవంతురాలిగా, అమరవీరనారిగా చిత్రీకరించబడింది. ఝల్కారీబాయి కథను వివరిస్తున్న రచయితలు ఆమెకు రాణీలక్ష్మీబాయితో సమానమైన స్థానాన్ని కల్పించడం జరిగింది. 1990 నుండి ఝల్కారీబాయి కథ కోలీ స్త్రీత్వం యొక్క ఉగ్రరూపానికి ప్రతిరూపంగా భావింపబడుతూ రాజకీయ కోణాన్ని సంతరించుకుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుండి బుందేల్ఖండ్ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా విభజించాలనే ఉద్యమానికి ఝల్కారీబాయి ధైర్యసాహసాలు కూడా కొంతమేరకు ప్రేరణగా నిలిచాయి. కోలీ కులానికి చెందిన సంస్థలు ఝల్కారీబాయి వర్ధంతిని 'షాహిద్ దివస్' (అమరవీరుల దినోత్సవం)గా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 4వ తేదీన జరుపుకుంటారు. భారత తపాలా, టెలిగ్రాఫ్ శాఖవారు ఝల్కారీబాయి గౌరవార్థం ఆమె చిత్రంతో కూడిన ఒక పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. అలాగే ఝాన్సీకోట లోపల ఉన్న పంచమహల్ వద్ద ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియావారు ఝల్కారీబాయి విశేషాలతో కూడిన ఒక మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. 10 నవంబర్ 2017న భోపాల్‌లోని గురుతేజ్ బహదూర్ కాంప్లెక్స్‌లో ఆనాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఝల్కారీబాయి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

**ముగింపు :** ఈ విధంగా ఒక సామాన్య అట్టడుగు కులమైన కోలీ కులంలో పుట్టి అపారమైన ధైర్యసాహసాలతో 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటులో ఝాన్సీరాజ్యం తరపున బ్రిటీష్ సైనికులతో వీరోచితంగా పోరాడిన గొప్ప వీరనారి ఝల్కారీబాయి. చరిత్ర మరచిన ఇటువంటి సమరయోధుల గాథలు వెలుగులోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే వారి త్యాగాలకు సరైన గుర్తింపు లభిస్తుంది, మనం సరైన నివాళులు అర్పించినట్లవుతుంది.

**References :**

1. Varma, B.L. (1951), Jhansi Ki Rani, P- 225, as quoted in Badri Narayan 2006, PP. 119-120.
2. Wikipedia, the freee Encyclopedia.
3. Narayan, Badri (7 November 2006). **Women Heroes and Dalit Assertion in North India : Culture, Identity and Politics.** SAGE Publications, India. **ISBN : 9788132102809.**
4. Mutiny at the Margins : New Perspectives on the Indian Uprising of 1857, Edited by Crispin Bates, SAGE Publications India, 2014.
5. Virangana Jhalkari Bai by Bhawani Shankar Vishard, Anand Sahitya Sadan, 1964.

"భారత మహిళాలలామభూతాయై
శ్రీమతి పోనకా కనకమ్మ నిత్యశ్రీ సన్మాన పురస్కారః"

అని ఉన్నది. ఉత్తమ దేశభక్తురాలిగా స్వాతంత్రోద్యమానికి సర్వస్వం అర్పించిన త్యాగశీలిగా నెల్లూరు మండల యువతులలో రాజకీయ చైతన్యం, విద్యా వికాసం ఆత్మ ధృతి కలిగించిన సంఘసేవికగా గాంధీజీ నిర్మాణాత్మక కార్యకలాపాలకు రూపం ఇచ్చిన శిల్పిగా నిత్యం కవి పండిత గాయక కళాకారులతో గోష్టులు సమావేశాలు జరిపిన స్త్రీమూర్తి . ప్రజా ఉద్యమాలను నడిపిన ధీరగా, వీర విహారం చేసి అలసిపోయి విశ్రాంతి తీసుకుంటున్న వీర బొబ్బిలిగా గుర్తించి ఆంధ్ర మహిళా సభ ఆమెను గౌరవించింది. 72 సంవత్సరాల నిండు జీవితం గడిపి ఆమె 1963 సెప్టెంబర్ 15 ప్రశాంతంగా కన్నుమూశారు.

**ఆధార గ్రంథాలు:**

1. కనకపుష్యరాగం– పొణకా కనకమ్మ స్వీయచరిత్ర – డాక్టర్ కాళిదాసు పురుషోత్తం, ప్రభవ పబ్లికేషన్స్, పొగతోట, నెల్లూరు.
2. స్వాతంత్ర సమరంలో ఆంధ్ర మహిళలు– ఆంధ్ర రాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాల శాఖ –హైదరాబాద్, 1987.

# భారత స్వాతంత్ర్యోద్యమంలో చిట్టగాంగ్ వీర విప్లవ నారీమణులు

డాక్టర్. జి.స్వాతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు. జి.మాణిక్యం, పిజి విద్యార్థి, జంతు శాస్త్ర విభాగం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

**ఉపోద్ఘాతం :** సుమారు 200 సంవత్సరాలు పాటు భారత దేశానికి , వాణిజ్యం కొరకు వచ్చిన బ్రిటిష్ వారు భారత్ ను బానిస దేశంగా హస్తగతం చేసుకున్నారు. వారిని తరిమికొట్టడానికి 1857 సిపాయి తిరుగుబాటు నుండి 1947 గాంధీ అహింస పోరాటం వరకు కొనసాగింది. వీరిలో పురుషులు మాత్రమే కాదు ఆకాశంలో సగమైన స్త్రీలు కూడా సంగ్రామంలో పాలుపంచుకోవడం విశేషం. ఝాన్సి లక్ష్మి భాయ్, దుర్గా భాయ్ దేశ్ముఖ్, సరోజినీ నాయుడు వంటి ప్రముఖులే కాదు, ప్రీతి లత, కల్పన దత్, బీనా దాస్, సుహాసిని గంగూలీ, కళ్యాణి దాస్, ఇందుమతి సింగ్, ప్రేమ లత, అజ్ఞాత స్త్రీ , బినోధిని సేన్, మృణాళిని సేన్ వంటి చరిత్రకు కనుమరుగైన వారెందరో. ప్రస్తుత పరిశోధనాపత్రం చరిత్రకారులకు కనుమరుగైన ధైర్య సాహసాలకు, యుద్ధ విన్యాసాలకు ప్రతీకలై, తమ మాన ప్రాణాలను సైతం పణంగా పెట్టి స్వాతంత్ర సంగ్రామంలో విప్లవ పోరాటాలు చేసి, తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలేసిన వీర విప్లవ నారీమణులను వెలికతీసే ప్రయత్నం .

**నేపథ్యం :** 1928 దేశం స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం పోరాడుతున్న రోజులు. అహింస ద్వారా స్వాతంత్ర్యం సాధిద్దామని గాంధీ మార్గంలో వెళ్లేవారు కొందరైతే, దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవాలంటే సాయుధ పోరాటమే మార్గం అని నమ్మిన వాళ్లు ఇంకొందరు. అందులో ఒకరే సూర్యసేన్. ఇండియన్ రిపబ్లికన్ ఆర్మీ (ఐఆర్ఏ) నిర్మాత, దళపతి. రహస్యంగా కార్యకలాపాలు కొనసాగిస్తూ బ్రిటీష్ స్థావరాలు, బలగాల మీద దాడి చేసే భారతీయుల సాయుధ సైన్యం. ఏడు రోజుల్లో చిట్టగాంగ్ ప్రాంతాన్ని బ్రిటీష్ వాళ్ల చెర నుంచి విడిపించాలని టార్గెట్ పెట్టుకుని పోరాటం మొదలుపెట్టింది ఐఆర్ఏ. నాలుగు రోజులు ఐఆర్ఏ సైన్యానిదే పైచేయిగా ఆ పోరాటం సాగింది. చిట్టగాంగ్ ఇక స్వతంత్ర్య ప్రాంతం అని కూడా ప్రకటించారు ఐఆర్ఏ ప్రతినిధులు. భారత దేశంలో కొంత భూభాగం 1947 ఆగస్టు 15 కంటే ముందే స్వాతంత్ర్యం రాకముసుపే స్వతంత్రం పొందింది.

ఇందుకు 64 మంది విప్లవ కారుల త్యాగమే కారణం. అంతేకాకుండా మొదటి తరం మహిళలను సైతం సాయుధ పోరాటంలో భాగం చేశారు. అందుకే భారత స్వాతంత్రోద్యమ చరిత్రలో చిట్టగాంగ్ కి ఒక ప్రత్యేకత ఉంది. 1918 నుండి 1928 వరకు సూర్య సేన్, నిర్మల్ సేన్, లోక్ నాథ్ బాల్, వారి స్నేహితులు కలిసి 10 సంవత్సరాలుగా ఇండియన్ రిపబ్లిక్ ఆర్మీ( ఐ.ఆర్. ఎ) ని ఏర్పాటు చేసి చిట్టగాంగ్ లో ఏప్రిల్ 18, 1930 న ఒకే రోజు ఒకే సారి ఒకే సంస్థ 5 టార్గెట్లని ' ప్రోగ్రామ్ ఆఫ్ డెత్' ద్వారా పూర్తి చేసి, బ్రిటిష్ వారిని పడగొట్టి మన మువెన్నల జాతీయ జెండాను ఎగురవేసి, యావత్తు దేశానికి స్ఫూర్తిని నింపారు ఐ.అర్. ఏ సైనికులు. కానీ ఈ స్వతంత్రం 4 నాలుగు రోజులకు మాత్రమే ఉన్నది. కానీ బ్రిటీష్ ప్రభుత్వం అదనపు బలగాలను తెప్పించి ఐఆర్ఏ మీద దాడి చేసింది. ఐఆర్ఏ సైనికులు కనిపిస్తే కాల్చివేసేవారు. గాయాలతో దొరికిన వారిని అండమాన్ జైలుకు తరలించి చిత్రహింసలు పెట్టేవారు. ఆ తర్వాత బ్రిటిష్ వారు ఐ.ఆర్.ఏ పై "బ్యాటిల్ ఆఫ్ జలాలాబాద్" ప్రకటించింది. డి.ఐ.జి.పార్మర్ సైన్యం, కల్నల్ డల్లాస్ సైన్యం, కెప్టెన్ టెయిట్ సైన్యం రెండు భాగాలుగా అధునాతన ఆయుధాలతో నాలుగు దిక్కులా ఐ. ఆర్. ఏని చుట్టుముట్టి మట్టిగరిపించారు.

దీంతో ఐఆర్ఏ సభ్యులు రహస్య జీవితం గడపవలసి వచ్చింది. మహిళలు సాయుధ పోరాటంలో ఇమడలేరు. ఆ ఇబ్బందులు, కష్టాలు తట్టుకోలేరన్న ఉద్దేశ్యంతో మొదట్లో సూర్యసేన్ మహిళలకు ఐఆర్ఏలో చేర్చుకోలేదు. కానీ తప్పనిసరి పరిస్థితుల్లో చిట్టగాంగ్ మహిళల సాయం కోరారు. వారిని కోవర్టులుగా నియమించుకున్నారు. రహస్యంగా ఆయుధాలు అందించడం, వార్తలు, బ్రిటీష్ ఎత్తుగడలకు సంబంధించిన సమాచారం సేకరించడం వంటి పనులు చేయించేవారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో స్త్రీలకు కోవర్టులుగా ( కొరియర్లుగా ) అవకాశం కల్పించారు. అప్పుడు రంగంలోకి దిగారు చిట్టగాంగ్ మహిళలు. ఆయుధాలు చేపట్టి బ్రిటీష్ వారితో ప్రత్యక్ష యుద్ధం చేశారు. అది కేవలం పరాయి బ్రిటీష్ ప్రభుత్వం మీద చేసే పోరాటం మాత్రమే కాదు. వాళ్ళు ఒకేసారి పితృస్వామిక ఆధిపత్యాల మీద, కుటుంబ వ్యవస్థ మీద, తమని రెండో తరగతి మనుషుల్లా చూస్తున్న

సమాజ కట్టడులు, కట్టుబాట్లు మీద 'శారీరకంగా, మానసికంగా స్త్రీలు పురుషులతో సమానంగా కాదు' అని చలామణిలో ఉన్న మూఢనమ్మకం మీద లక్ష చేతులతో చేసిన పోరాటం అది.

**వీర విప్లవ నారీమణులు**

**ప్రీతి లత :** భారతదేశంలోనే కాకుండా తన స్వస్థలమైన బెంగాల్లో కూడా అంతగా తెలియని స్వాతంత్ర సమరయోధురాలు ప్రీతి లతా వద్దేదార్. తాను బతికి ఉన్న కొంత కాలం కూడా బ్రిటిష్ పరిపాలన పై ఐ.అర్. ఏ తో కలిసి యుద్ధం సాగించింది. ధిపాలి, ఛత్రి సంఘ్ సభ్యురాలు. 1930లో ఆర్మీ దాడుల సమయంలో బ్రిటిష్ దళాలు మీద దాడి చేసింది. యురోపియన్ క్లబ్ పై 'కుక్కలకు, భారతీయులకి ప్రవేశం లేదు ' అని రాసుంటుంది. సెప్టెంబర్ 23, 1932 రాత్రి క్లబ్‌పై దాడి చేశారు. ప్రీతి లతాకి బుల్లెట్ తగిలింది,పోలీసుల అరెస్టు నుండి తప్పించుకోవడానికి ఆమె పొటాషియం సైనైడ్ తినేసి తన జీవితాన్ని తనే ముగించింది. అప్పటికి ప్రీతి లత వయసు 21 సంవత్సరాలు మాత్రమే.

**కల్పన దత్ :** కల్పన దత్ 1913 జూలై 27 న తెల్ల దొరల విధేయులకుటుంబంలో జన్మించింది. ఈమె తండ్రి బ్రిటిష్ అధికారుల దగ్గర పనిచేశారు. ఈయన చూపించే విధేయతకు మెచ్చి 'రాయ్ బహదూర్ ' అనే బిరుదు కూడా ఇచ్చారు తెల్ల దొరలు. కల్పన తన కాలేజీ లాబొరేటరీ నుండే పేలుడు పదార్థాలైన నైట్రిక్ యాసిడ్, సల్ఫ్యూరిక్ యాసిడ్లు కొంచెం కొంచెం సేకరించి ఏకంగా 32 కిలోలు పంపేది. తర్వాత కాలంలో ప్రాణాపాయ పని డైనమైట్ల తయారీలో నిమగ్నమైంది. స్వాతంత్రోద్యమానికి బాంబుల తయారు చేసింది. తప్పనిసరి పరిస్థితుల్లో అండర్ గ్రౌండ్ లోనే పుతుధా, కల్పన, సుధీంద్ర దాస్ లొంగిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో పైనున్న చొక్కా తీసేసి రావాలని హుస్సేన్ ఆర్డర్ వేశారు . అప్పుడు కల్పన దత్ " నేను నా చీర పైట ఉంచుకోవచ్చా ... తీసేయాలా " అని అడిగింది. ఆ ప్రశ్నతో బ్రిటిష్ పోలీసులని చకితుల్ని చేసింది కల్పన. ఉద్యమం కారణంగా చదువుకి స్వస్తి చెప్పింది. 1939 మే 1 న విడుదలై ఐ. ఆర్. ఏ క్షీణించి పోవడంతో కమ్యూనిస్ట్ పార్టీలో చేరి ప్రజల పక్షాన నిలబడింది. అల్జీమర్స్ వ్యాధి వల్ల 1995 ఫిబ్రవరి 8 న మరణించారు.

**ఇందుమతి సింగ్ :** ఇందుమతి ఐ. ఆర్. ఏ నాయకుడైన అనంత సింగ్ చెల్లెలు. ఇందుమతి వస్త్రధారణ భిన్నంగా ఉంటుంది. కుస్తీ పడటంలో, గురితప్పకుండా కాల్చడంలో, కారు నడపడంలో దిట్ట. ఐ.ఆర్.ఏ నాయకులు అరెస్టయిన సమయంలో ఆర్థిక నిధుల మరియు రిక్రూట్మెంట్ పనులన్నీ ఇందుమతి చేసేది. విరాళాల కొరకు బేతున్ కాలేజీ, కలకత్తాలో ఈమె తట్టని తలుపంటు లేదు. ఈమె పనులను నిలిపివేయాలని తలచి బిటిష్ ప్రభుత్వం 1931 లో అరెస్టయి, 1937 వరకు సుమారు 6 ఏళ్ల జైలు జీవితం గడిపింది.

**ప్రేమలతజీ:** ప్రేమలత ఐ.ఆర్.ఎ ముఖ్య సభ్యుడు కాళికింకర్ దే భార్య. కల్పన దత్ తో పాటుగా తన ఇంటిలోనే జరిగే బాంబులు తయారు చేయడంలో సహాయ సహకారాలు అందించింది. విప్లవ కారులు రాత్రి సమయంలో వస్తుంటే అక్కింటి పక్కింటి వాళు గుండెని బాకులతో గుచ్చే ఎన్నో మాటలు పడింది. పహర్తిలోని యురోపియన్ క్లబ్ పై డైరెక్ట్ యాక్షన్ లోకి తనని తీసుకోలేదని సూర్య సేన్ని ప్రశ్నించిన అగ్ని కణం ప్రేమలత."నా ప్రాణాలకు ముప్పు ఉంటుందని నన్ను వెనక్కి పంపే స్తారా? మరి మీ ప్రాణాలకు ముప్పు లేదా? నన్ను ఆపటానికి మీరెవరు? మీకేం హక్కు ఉంది? ప్రశ్నల తూటాలు పేల్చిన వీర నారి. కళ్ళముందు మిత్రులు దూరమై, స్వతంత్రం కొరకు భర్త దూరమై ఒంటరిగా బతికిన ఒక యోధ ను నిస్సహాయంగా ఏ అంధకారం అలుముకుందో కానీ ఆత్మహత్య చేసుకుని మరణించింది.

**సావిత్రి దేవి :** సావిత్రి దేవి వితంతువు. ఈమెకు రామకృషణ మరియు స్నేహలత అను ఇద్దరు బిడ్డలు. చిట్టగాంగ్ లో ఈమెకు రెండంతస్తుల మట్టి మేడ ఉంది. సావిత్రి ఐ.ఆర్.ఎ సంస్థలోను లేదు, విప్లవం అసలే తెలీదు. సావిత్రి చేసిందల్లా ఐ.ఆర్.ఎ. ముఖ్య నాయకులకు దేశం మీద, స్వతంత్ర రాజ్య కాంక్షతో ఆశ్రయం కల్పించడం మాత్రమే. బ్రిటిష్ జడ్జిని పట్టుకొని "నీకెందుకు చెప్పాలి? మా అమ్మ తరపు చుట్టానివా? అత్తగారి తరపు చుట్టా నివా? అని ఈసడింపుగా అడిగి, బ్రిటీష్ సార్వభౌమత్వాన్ని

తీసిపరేసింది. అది ఆమె ధైర్యం. బ్రిటిష్ ప్రభుత్వం ఉన్న ఈమె ఇల్లుని కూడా కుల్చేసింది. స్వతంత్ర కొరకు కన్న కొడుకు జైల్లో క్షయ వ్యాధితో చంపుకుని, ఒక్క పూట అన్నం కూడా దొరకడం కష్టమై వృద్ధాప్యంలో చనిపోయిన ధీశాలి సావిత్రి దేవి .

**అజ్ఞాత స్త్రీ :** ఐ.ఆర్.ఎ అగ్రనేత సూర్య సేన్ పట్టుబడటానికి కారణబూతుడు నేత్ర సేన్ . కోర్టు విచారణలో భర్తకు మద్దతుగా మాట్లాడకుండా "నేను నా సొంత కళ్ళతో చూసాను, కానీ వారి పేర్లు చెప్పటానికి నా హృదయం అంగీకరించటం లేదు. చిట్టగాంగ్ వీర పుత్రుడిని నా భర్త ద్రోహం చేశాడు అంటూ తనకి దోషులు తెలిసినా చెప్పకుండా సూర్య సేన్ కే మద్దతు పలికింది. ఆమె వ్యక్తి పేరు కూడా చరిత్రకారులకు కనుమరుగైనది. కానీ ఆమె వ్యక్తిత్వం ద్వారా ఎలా ఉండాలో తెలిజేసిన మహిమాన్విత.

**కళ్యాణి దాస్ :** కళ్యాణి దాస్ మరెవరో కాదు బెంగాల్ గవర్నర్ ను కాల్చిన భినా దాస్ అక్క ఈమె కాలేజీలో ఉండగానే "చత్రి సంఘ్" అనే సంస్థను స్థాపించి అమ్మాయిలకి కత్తి తిప్పటం, కర్ర సాము, యుద్ధ విద్యలు నేర్పించి ... చిట్టగాంగ్ లో విప్లవ జ్వాలలు రేపడానికి ప్రధాన కారణం. బట్టలు తీసేసి, చీకటి గదిలో ఒంటరిగా నిర్బంధించి, పళ్ళు ఊడిపోయేట్టు కొట్టి చిత్రహింసలు పెట్టినా పోలీసులకు ఎలాంటి వివరాలు చెప్పలేదు . 1937 లో జైలు నుండి విడుదలై కాంగ్రెస్ లో చేరి, తన సేవలు అందించింది.

**బినోధిని సేన్ , మృణాళిని సేన్ :** ఐ.అర్.ఎ సభ్యుడైన రజత్ సేన్ తల్లి బినోధిని సేన్, రజత్ సేన్ అక్క మృణాళిని సేన్. ఐ.అర్. ఎ కి ఆర్థిక సహాయ సహకారాలు అందించేది. బాంబులు దాచటంలో సహాయపడేది. 'కాలార్ పుల్ – జుల్దా ' ఎన్కౌంటర్ లో తన కొడుకు సహా కొందరు నాయకులు అమరులైనారు. ఇందుకు బినోదిని మరియు మృణాళిని ఐ.ఆర్.ఎ సంస్థ పట్ల ఎలాంటి ఆక్షేపణ లేకుండా వాళ్ళకి సాయం చేసిన ఆదర్శవంతులు.

**సుహాసిని గంగూలి :** గంగూలి 1909 ఫిబ్రవరి 3న బ్రిటిష్ ఇండియాలోని బెంగాల్‌లోని ఖుల్నాలో జన్మించారు. ఈమె మొదట 'అనుసీలన్ సమితి 'లో తర్వాత దాన్నుండి విడిపోయిన 'జుగంతర్' అటుపై ఆమె '"ఛత్రీ సంఘ"' సభ్యురాలైంది. కలకత్తా పోలీస్ కమిషనర్ చార్లెస్ టేగార్డ్ బూటు కాలితో తన్నినా, చేతి వేళ్ళ గోరులని పట్టకారతో పీకినా, పేపర్ వెయిట్ తో ముఖం మీద కొట్టినా, రెండు చేతుల మధ్య లాఠీ పెట్టి ఎముకలు విరిగేట్టు తిప్పి థర్డ్ డిగ్రీ ట్రీట్మెంట్ ఇచ్చినా సూర్య సేన్ ఆచూకీ చెప్పలేదు. మరలా చార్లెస్ మొహాన 'ఛూ' అని ఊసింది. సుహాసిని ఎంతో మంది విప్లవ వనితలని తీర్చిదిద్దిన యోధురాలు. స్వేచ్ఛ కొరకు పెళ్ళికాకుండానే ఇంకొకరి భార్య గా నటించింది. 1930, సెప్టెంబర్ 1 న బి.పి.సి. ఎల్ కేసు కింద సుహాసిని అరెస్టయింది. చార్లెస్ మీద అంతర్జాతీయ న్యాయస్థానంలో కేసు పెట్టి, ఆరేళ్ల తర్వాత కేసు గెలిచింది. ఆమె సాహసానికి యావత్ప్రపంచం ఆశ్చర్యపోయింది. జైల్లో ఉన్నప్పుడే కమ్యునిజం పట్ల ఆకర్షితులయ్యారు. 1965 లో రోడ్డు ప్రమాదంలో చనిపోయింది. ఈ ధిక్కార స్వతంత్ర సమరయోధురాలు.

**బీనాదాస్‌జి :** బీనాదాస్ కోల్‌కతాలోని మహిళల విప్లవ సంస్థ 'ఛత్రి సంఘ' సభ్యురాలు. 6 ఫిబ్రవరి 1932 న ఆమె బెంగాల్ గవర్నర్ స్టాన్లీ జాక్సన్‌ను కలకత్తా విశ్వవిద్యాలయంలోని కాన్వొకేషన్ హాల్‌లో హత్య చేసేందుకు ప్రయత్నించింది. ఈ సంఘటన వలన అరెస్టయిన 1939 లో ఆమె విడుదలైన తర్వాత దాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1942 లో, ఆమె క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొంది 1942 నుండి 1945 వరకు మళ్లీ జైలు శిక్ష అనుభవించింది. 1946 నుండి 1947 వరకు, ఆమె బెంగాల్ ప్రావిన్షియల్ శాసనసభ సభ్యురాలు. 1947 నుండి 1951 వరకు, పశ్చిమ బెంగాల్ శాసనసభ సభ్యురాలు. 1960 లో భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రదానం చేసింది. ఆమె భర్త మరణం తర్వాత ఒంటరితనాన్ని అనుభవిస్తూ, అజ్ఞాత జీవిగా 26 డిసెంబర్ 1986 న పాక్షికంగా కుళ్లిపోయిన స్థితిలో రోడ్డు పక్కనుండి వెలికితీశారు.

ప్రేమించిన వ్యక్తి కళ్ళముందు చనిపోతున్నా దుఃఖాన్ని నొక్కి పెట్టి పోరాడిన కల్పన, సమాజ కట్టుబాట్లను ఈడ్చి తన్నిన సుహాసిని, కళ్ళ ముందు భర్తను చంపినా 'అతను ద్రోహి' అని కోర్టులో సాక్ష్యం చెప్పిన నేత్ర సేన్ భార్య, స్వతంత్రం కొరకు పోరాడి చికిత్స దొరకక కన్న కొడుకు మరణిస్తున్నా కడుపుకోతను తట్టుకున్న సావిత్రి, అమ్మాయిలతో కత్తి తిప్పించిన కళ్యాణి. వాళ్ళలో ఎన్ని

భిన్న ఉద్యోగాలు.

**ముగింపు :** స్వతంత్రం అనే వజ్రాయుధాన్ని మనకి అందిచటం కొరకు, ఈ భూమి మీద నిశబ్దంగా నడిచి నిష్క్రమించారో. మైకు ముట్టకుండా, తుపాకులు, కత్తులతో యుద్ధం చేసి, తమ రక్తాన్ని మనకొరకు దారపోసిన వారి పేర్లు కూడా వార్తల్లోకి రాలేదు. ఇంకా ఎంతమంది స్త్రీలు మనకోసం పోరాడి నిశబ్దంగా నిష్క్రమించారో తెలియట్లేదు. తెలిసిన వాళ్ళు కొందరైతే తెలియని వాళు ్ళ ఎందరో ఉండవచ్చు. ప్రస్తుతం వారి మీద దృష్టి పెట్టి, వారి జీవితాలు నుండి స్ఫూర్తి పొందే సమయమిది.

విచిత్ర విషాదం ఏమిటంటే భారత స్వతంత్రం కొరకు ఏ గడ్డ మీద నిలబడి పోరాటం చేశారో ఇప్పుడు ఆ చిట్టగాంగ్ నేల భారత భూభాగంలో లేదు. మతప్రాతిపదికి మొదట తూర్పు పాకిస్తాన్లో ఉండి మరలా 1971 లో బంగ్లాదేశ్ లోకి వెళ్లిపోయింది మనకోసం నిశబ్దంగా నిష్క్రమించిన వారిని మనం పూర్తిగా విస్మరించాం . ఇప్పుడు మనం చేయాల్సిందల్లా ఒక్కటే, అది- ఆ వీరుల త్యాగాలను గౌరవిస్తూ వాళ్ళు చూపిన ఆదర్శాన్ని మనం ఆచరించటం. స్త్రీలకి అన్నింట్లో సమాన అవకాశాలు ఇస్తే ఇంకెన్ని అద్భుతాలు చేస్తారో ఆలోచించాలి. అదే మన కోసం ప్రాణాల్పించిన వీర విప్లవ వనితలకు మన ఇవ్వాల్సిన అసలైన నివాళి.

**ఆధార గ్రంథాలు :**

1. ద చిట్టగాంగ్ రివోల్ట్ 1930-1934- సునితి భూషణ్ కునాగా.
2. ఈస్టర్ రెబెలియన్ ఇన్ ఇండియా బీ ది చిట్టగాంగ్ అప్ రైజింగ్ - మల్లికార్జున శర్మ.
3. డూ అండ్ డై - మానవి ఛటర్జీ.
4. చిట్టగాంగ్ ఆర్మరీ రైడర్స్, రెమెనిసెన్స్- కల్పన దత్.
5. చిట్టగాంగ్, ద సమ్మర్ ఆఫ్ 1930- మనోషి భట్టాచార్య.
6. ఎ మెమొరి - బీనా దాస్.
7. చిట్టగాంగ్ విప్లవ వనితలు - పింగళి చైతన్య .
8. ద ఉమెన్ రివల్యూషన్ ఆఫ్ బెంగాల్ 1905-1939 - తీర్థమండల్.
9. డికేడ్స్ ఆఫ్ డేరింగ్ డీడ్స్ - సత్య వ్రత ఘోష్.
10. ద హిస్టరీ ఆఫ్ డూయింగ్ - రాధా కుమార్.
11. మానుషి, వికీపెడియా మరియు మరికొన్ని ప్రముఖ వెబ్ సైట్లు.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# జాతీయోద్యమంలో విద్యావంతులైన స్త్రీల పాత్ర

డా. టి. షర్మిలా ప్రతిమ, సహాయాచార్యులు, ఐఐఐటి ఒంగోలు, చరవాణి : 8074427397.

17 వ శతాబ్దంలో వ్యాపార నిమిత్తం భారతదేశంలో అడుగు పెట్టిన ఆంగ్లేయులు క్రమక్రమంగా అన్నిప్రాంతాల్లోనూ తమ వ్యాపారాన్ని విస్తరింప జేసుకొని, రాజ్యాలను హస్తగతం చేసుకొని పరిపాలన ప్రారంభించారు. వీరి ఆధిపత్యం రోజురోజుకు పెరగడంతో ప్రజలు వీరి పాలనను వ్యతిరేకిస్తూ, నిరసనలు తెలిపారు. ఇందులో భాగంగా మొదలైన స్వాతంత్ర్యోద్యమం క్రమక్రమంగా దేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించి అనేక మంది ప్రజలను ప్రభావితం చేసింది. బెంగాల్ విభజన, జలియన్ వాలాబాగ్ సంఘటన వంటి వాటితో బ్రిటీష్ ప్రభుత్వం పై ప్రజానిరసన పెల్లుబికింది. వందేమాతర ఉద్యమం ఫలితంగా స్వదేశీ అభిమానం ఎక్కువైంది. రాజకీయాలపట్ల , విద్య పట్ల ప్రజలు ఆకర్షితులైనారు. ఆవిధంగా స్వాతంత్ర్యోద్యమంలో పురుషులతో పాటు అనేక మంది స్త్రీలు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ పాల్గొన్నారు.

అటువంటివారిలో దువ్వూరి సుబ్బమ్మ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ, పొణకా కనకమ్మ, ఓరుగంటి మహాలక్ష్మమ్మ, సరోజినీ నాయుడు, కాశీభట్ల వెంకట రమణమ్మ, సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి మొదలైన స్త్రీమూర్తులు అనేకమంది ఉన్నారు. వీరి కృషిని, స్ఫూర్తిని, సేవానిరతిని, ధీరతను స్థూలంగా తెల్పడమే ఈ పత్ర ఉద్దేశ్యం.

**దుర్గాబాయి దేశ్ ముఖ్ :** జూలై 10, 1909వ తేదీన తూర్పుగోదావరిజిల్లా రాజమండ్రికి చెందిన బెన్నూరి రామారావు, కృష్ణవేణమ్మ దంపతులకు దుర్గాబాయి దేశ్ ముఖ్ జన్మించారు. చిన్నతనం నుండే తల్లివెంట ఖాదీ వస్త్రాలు అమ్ముతూ, అనేకమంది స్త్రీలకు చేతిపనులు, జాతీయగీతాలు పాడటం, నూలు వడకడం నేర్పించేవారు. అంతేకాక బాలికలకు హిందీ నేర్పేవారు. తాను చదువుకొంటే, నిస్సహాయులైన స్త్రీలకు చేయూత అందించవచ్చు అనే ఆశయంతో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులైనారు. ఆతర్వాత ఇంటర్మీడియేట్ చదివారు. గాంధీజీ, మదన్ మోహన్ మాలవ్య వంటి వారిని ఆదర్శంగా తీసుకొని జాతీయోద్యమంలో పాల్గొన్నారు. వయోజన విద్యను, శ్రామికులకు, కర్షకులకు, గ్రామీణులకు ఉపకరించే విధంగా 'సాక్షరతాభవనం' అనే సంస్థను స్థాపించారు. శిశువిహార్లు, హైస్కూల్, కాలేజీలు, చేతిపనుల శిక్షణాలయం వంటివి స్థాపించి నిరక్షరాశ్యతను నిర్మూలించడానికి కృషిచేశారు. జాతీయోద్యమంలో పాల్గొని అనేక రకాలుగా తనవంతు సేవను అందించారు. వీరి కృషికి గానూ 1973లో విద్యావేత్తగా, స్త్రీ విద్యా ప్రదాయినిగా ఆమెకు నెహ్రూ అవార్డు లభించింది. ఈ విధంగా తన చదువును సంఘసేవకు, స్వతంత్రపోరాటంలో అనేకమంది ప్రజలు పాల్గొనేలా అనేక ఉపన్యాసాలద్వారా, కార్యక్రమాలద్వారా ఉత్తేజితం చేశారు.

**సరోజినీ నాయుడు :** వంగదేశీయులైన అఘోరనాథ చటోపాధ్యాయ, వరద సుందరీదేవి దంపతులకు 1879 ఫిబ్రవరి 13న హైదరాబాదులో జన్మించిన సరోజినీ నాయుడుగారు, లిటిల్ గర్ల్స్ స్కూల్లో చదువుకున్నారు. అదే ఈనాడు ఉస్మానియా స్త్రీల కళాశాలగా అభివృద్ధి చెందింది. చిన్నవయసులోనే మెట్రిక్యులేషన్ ఉన్నతశ్రేణిలో పూర్తిచేశారు. 11వ యేటనుంచే ఇంగ్లీషులో కవితలు అల్లేవారు. లండన్, కేంబ్రిడ్జి వంటి విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించారు. హైదరాబాదుకు చెందిన శ్రీ ముత్యాల గోవిందరాజులు నాయుడుగారిని వివాహంచేసుకొని తెలుగింటి కోడలిగా అడుగుపెట్టారు. ఆంధ్రమహిళగా అందరిమన్ననలను పొందారు. ఆమె ఇంగ్లీషు, హిందీ, బెంగాలీ, ఉర్దూలలో అనర్గళంగా ఉపన్యసించి, ప్రజల్లో దేశభక్తిని పెంపొందించారు. గాంధీజీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉప్పు సత్యాగ్రహ సమయంలో దండియాత్ర చేసినవారిలో ముఖ్యులు. స్త్రీల ఓటింగ్ హక్కుకోసం పోరాటం చేశారు. ఇలా స్త్రీశక్తిని తెలియజేసి, ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన సరోజినీ నాయుడు మహిళా ప్రతినిధిగా, స్వతంత్ర భారతదేశంలో ఉత్తరప్రదేశ్ గవర్నర్ గా పనిచేశారు.

**దువ్వూరి సుబ్బమ్మ :** ద్రాక్షారామంలోని సనాతన మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన దువ్వూరి సుబ్బమ్మగారు, సంస్కృతాంధ్ర

భాషలలో ప్రావీణ్యం కలవారు. గొప్పవేదాంతి. చల్లపల్లి వెంకటశాస్త్రి శిష్యురాలు. సంపూర్ణస్వాతంత్ర్య సాధనే ప్రధాన లక్ష్యంగా తీర్మానం ప్రవేశపెట్టిన బులుసు సాంబమూర్తి గారిని బలపరస్తూ, అనర్గళంగా చక్కటి ఉపన్యాసం ఇచ్చారు. గరిమెళ్లవారి రచనలను సభలలో శ్రావ్యంగా గానం చేసేవారు. వీరి గానానికి, ఉపన్యాసాలకు జనం మంత్రముగ్ధులయ్యేవారంటే అతిశయోక్తి కాదు. ఆంధ్ర చరిత్రలో జాతీయోద్యమంలో జైలుకు వెళ్లిన మొదటి మహిళగా చరిత్రలో స్థానం సంపాదించుకున్నారు. స్త్రీ విద్యాభివృద్ధి వల్లే సమాజం బాగుంటుందని భావించి, సనాతన విద్యాలయం అనే జాతీయ విద్యాలయం స్థాపించి, తెలుగు, సంస్కృతం, కుట్టుపనులు వంటివి బోధించి, స్త్రీలకు ఆర్థికంగా తోడ్పాటును అందించారు. దండియాత్ర, ఉప్పుసత్యాగ్రహం వంటి వాటిలో భజనలు, పాటలు పాడుతూ ఉత్సాహంగా పాల్గొని జైలు జీవితం గడిపారు. జైలులోకూడా ఆచారవ్యవహారాలను నిష్ఠగా పాటిస్తూ, విద్వాంసురాలైన పొణకా కనకమ్మ వంటి వారితో కలిసి మిగతావారిని చైతన్య పరచే వారు.

**పొణకా కనకమ్మ :** పొట్లపూడిలో 1892లో జన్మించిన వీరు డిగ్రీలు చదవకపోయినా స్వయంకృషితో హిందీ, ఆంగ్లవిద్యను అభ్యసించిన గొప్ప రచయిత్రి. సుజనరంజనీ సమాజం స్థాపించి అనేక కార్యక్రమాలను ప్రారంభించారు. రోగులకు ఉపచారం చేయడం, కలరా వ్యాధి సోకినవారికి మందులివ్వడం, చేనేత వస్త్రాలను తయారు చేయడం వంటివి చేసేవారు. స్త్రీలందరూ విద్యావంతులు కావాలనే సంకల్పంతో నెల్లూరులో కస్తూరిదేవి విద్యాలయాన్ని ప్రారంభించి, అందులో జాతీయవిద్య, చేతివృత్తులు నేర్పేవారు. అయ్యంకి వెంకటరమణయ్య ఆంధ్రలో గ్రంథాలయోద్యమం స్థాపించారు. ఈయన స్ఫూర్తితో పొట్లపూడిలోనూ వివేకానంద పుస్తక భాండాగారం ప్రారంభమైంది. ఆరోజుల్లో సాహిత్యగోష్ఠులు, సమావేశాల్లో కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, ఉన్నవ లక్ష్మీనారాయణ, కాంచనపల్లి కనకమ్మ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ వంటి వారు తరచూ సభలు సమావేశాల్లో పాల్గొనేవారు. స్వదేశీ వస్తువులనే వాడాలన్న బాలగంగాధర తిలక్ ఆదేశం మేరకు స్వదేశీ నేత సంఘాన్ని స్థాపించారు. హోంరూల్ ఉద్యమంలో, ఉప్పుసత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారు. వీరి సేవాస్ఫూర్తి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచింది.

**వేదాంతం కమలాదేవి :** కమలాదేవిగారు 1897 మే 5న కడపజిల్లా నందలూరులో జన్మించారు. తండ్రి ప్లీడరు కావడంతో రోజూ కోర్టుకు తీసుకెళ్లేవారు. అందువల్ల చిన్నవయసులోనే సాంఘిక, రాజకీయ పరిజ్ఞానం కలిగింది. 12వ యేట శ్రీ వేదాంతం వెంకట కృష్ణయ్యతో వివాహం అయింది. ఆయనతో కలిసి కలకత్తా వెళ్లారు. అక్కడ బెంగాలీ , ఆంగ్లం నేర్చుకొని, బెంగాలీ పుస్తకాలను తెలుగులోకి అనువదించారు. వెంకటకృష్ణయ్యగారు డాక్టరుగా కాకినాడలో స్థిరపడిన తర్వాత కాంగ్రెసు మహాసభలు జరిగాయి. అందులో స్త్రీలు దళాలుగా ఏర్పడి స్వచ్ఛందసేవ చేశారు. స్త్రీల శాంతి దళాలకు కమలాదేవి ఆధిపత్యం వహించారు. ప్రాథమిక విద్యను వ్యాపింపజేశారు. అస్పృశ్యతా నివారణకు కృషి చేశారు.

**బసవరాజు రాజ్యలక్ష్మమ్మ:** విజయవాడలో శ్రీ రంగనాయకమ్మ, గోవిందరాజు బాలాజీ రావు జన్మించిన వీరు బసవరాజు అప్పారావుగారిని వివాహమాడారు. అప్పారావుగారికి చిన్నతనం నుండే గేయాలు, విమర్శ గ్రంథాలు రచించడం అలవాటు. అప్పారావు ప్రోత్సాహం మేరకు ఈమెకూడా గీతాలు, కథలు, వ్యాసాలు రాసి, భారతి, గృహలక్ష్మి వంటి పత్రికల్లో అచ్చువేయించారు. శారదానికేతనంలో జాతీయవిద్యను బోధిస్తూ, ధర్మం, నీతి, సంఘసేవ వంటి వాటిని తెలిపి, విద్యార్థులను ప్రోత్సహించేవారు. వీరు రాసిన 'అప్పారావుగారు నేను', ఆకాశకుసుమావళి , వైతాళికులు, మణిమకుటాలు వంటి రచనలు ప్రఖ్యాతి చెందినవి. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని అనేకసార్లు జైలు జీవితం గడిపారు.

కాశీభట్ల వెంకట రమణమ్మ: పశ్చిమ గోదావరి జిల్లా బోడపాడులో 1911లో అన్నపూర్ణమ్మ, చీమలకొండ సూర్యనారాయణ శాస్త్రి దంపతులకు జన్మించారు. 1923లో కాశీభట్ల లక్ష్మీనరసింహారావుగారితో వివాహం జరిగింది. ఈమె ఎలిమెంటరీస్కూలు పూర్తిచేసి, 2సంవత్సరాలు ప్రాచీన పాఠశాల విద్యను అభ్యసించారు. ఆరోజుల్లోనే జాతీయోద్యమంలో పాల్గొని జైలు శిక్షను అనుభవించారు. విదేశీ వస్తు బహిష్కరణ, హరిజనసేవ మొదలైన కార్యక్రమాలను నిర్వహించేవారు. స్త్రీలకు హిందీక్లాసులు

బోధించేవారు. ఇలా పరోక్షంగా జాతీయోద్యమానికి కృషిచేశారు.

**లక్ష్మీబాయమ్మ :** చన్నా ప్రగడ సుందరరామయ్య, రామలక్ష్మాంబ దంపతులకు చివరి సంతానంగా 1898లో పశ్చిమగోదావరిజిల్లా నర్సాపురంతాలూకాలోని ముత్యాలపల్లిలో జన్మించారు. వీరిది పండిత కుటుంబం. ఇంట్లో నిత్యం సాహితీ చర్చలు పండిత గోష్ఠులు జరుగుతుండేవి. దీంతో సంస్కృతాంధ్ర భాషల్లో పాండిత్యం సంపాదించారు. హిందీ, ఇంగ్లీషు భాషలు చదవడం, రాయడం చేసేవారు. వీరు కృష్ణశతకం, వీరమతి, శాంతికాముడు, దుర్గా దండకం, వంటి కథలు, గేయాలు, వ్యాసాలు రచించారు. గాంధీ పిలుపుతో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని దేశభక్తిని నింపుతూ, అనర్గళంగా సభారంజకంగా ఉపన్యాసాలు చేసేవారు. పొణకా కనకమ్మగారితో స్నేహం ఏర్పడింది. ఇద్దరూ కలిసి ఆధ్యాత్మిక చింతన చేస్తూ, భగవద్గీతను తేటగీతిలో సుబోధకంగా తెలుగు చేశారు. ఎంతో మంది స్త్రీలకు తమకాళ్లపై తాము నిలబడగల శక్తిని ఆత్మస్థైర్యాన్ని అందించారు. ఆంధ్రావతరణతర్వాత ఆంధ్రరాష్ట్ర శాసనమండలి సభ్యురాలిగా ఎన్నికయ్యారు.

**ముగింపు :** ఇలా ఎంతో మంది మహిళా మూర్తులు జాతీయోద్యమంలో పాల్గొని ఆనాటి సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలు, అస్పృశ్యత, నిరక్ష్యరాశ్యత వంటి వాటిని తొలగించడానికి సంఘ సంస్కరణలు చేస్తూ, క్రమంగా విద్యద్వారా ప్రజలను చైతన్య వంతులను చేసి స్వాతంత్ర్యోద్యమం విజయవంతం కావడానికి తమ విద్యను, తమ శక్తియుక్తులను, తమజీవితాన్ని అంకితం చేసి మహిళాలోకానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. వీరిని జీవితాలను ఆదర్శంగా తీసుకొని భావితరంకూడా తమశక్తియుక్తులను, విద్యను దేశాభివృద్ధికి తోడ్పడేలా, వీరందించిన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను సద్వినియోగించుకొనేలా కృషిచేయాలని కోరుకొందాం.

**ఆధార గ్రంథాలు :**

1. స్వతంత్రత నుండి స్వతంత్రానికి : 2021, డా. జంధ్యాల కనకదుర్గ, జంకదు ప్రచురణలు, గుంటూరు.
2. ఆంధ్ర మహిళలు :1987 , ఆంధ్ర రాష్ట్ర పురావస్తు ప్రదర్శన శాలల శాఖ, హైదరాబాదు.
3. ఆంధ్రలో స్వాతంత్ర సమరము : 1972, సాంస్కృతిక వ్యవహారిక శాఖ, హైదరాబాదు
4. ఆంధ్ర ప్రదేశ్ చరిత్రలో ప్రధాన ఘట్టాలు: 1979, జి. వెంకట రామారావు. హైదరాబాదు

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# జాతీయోద్యమ అనంత బెబ్బులి ఇల్లూరు కేశమ్మ

**డా॥ బత్తల అశోక్ కుమార్,** గ్రంథాలయ సహాయకులు, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ విభాగం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము. సెల్ : 94901 94780

1885వ సం॥లో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనతో జిల్లాలో స్వాతంత్ర్య సముపార్జనకై నవశకం మొదలైంది. జిల్లా కాంగ్రెస్ శాఖ ఏర్పాటు చేయబడింది. ఈ శాఖ ఆధ్వర్యంలో అనేక సమావేశాలు జరిగాయి. జిల్లా నుండి ప్రతినిధులను జాతీయస్థాయి కాంగ్రెస్ సమావేశాలకు పంపసాగారు. అటువంటి ప్రముఖులలో అగ్రగణ్యుడు గుత్తి కేశవపిళ్ళై. అనేకమంది స్వాతంత్ర్యాభిలాషులు బ్రిటీష్ వారి అన్యాయాలను, దుష్టపాలనను ఖండింపసాగారు. బెంగాలు విభజన అనంతరం జిల్లాలో స్వదేశీ ఉద్యమం, జాతీయ విద్య, విదేశీవస్తు బహిష్కరణ ఊపందుకున్నాయి. సురేంద్రనాథ్ బెనర్జీ అనుయాయులైన ఎం.ఎన్. సిన్హా అతని సోదరుడు 2906లో జిల్లాలో పర్యటించి స్వదేశీ ఉద్యమానికై మద్ధతును, ప్రమాణాలను స్వీకరించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కోపల్లె హనుమంతరావు మచిలీపట్నం నుండి గుత్తికి వచ్చి జాతీయ కళాశాలకై విరాళాలు సేకరించారు. 1908 బళ్ళారి నుండి స్వామిరావు జిల్లాలో పర్యటించి స్వదేశీ ఉద్యమ ప్రాముఖ్యాన్ని వివరించాడు.

అనిబిసెంట్ ప్రారంభించిన హోంరూల్ ఉద్యమం పట్ల గుత్తి కేశవపిళ్ళై ఆకర్షితుడయ్యాడు. 1919 ఆగష్టు 25న ఆంధ్రరాష్ట్ర సభ ఎ.యస్. కృష్ణారావు అధ్యక్షతన అనంతపురం జిల్లాలో జరిగింది. ఆంధ్రమహాసభ సమావేశాలు హరిసర్వోత్తమరావు నాయకత్వంలో జరిగాయి. రాష్ట్రాలకు స్వతంత్ర ప్రతిపత్తి ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వ పాలనలో రాష్ట్రాలకు సముచిత స్థానం కావాలని, బ్రిటీష్ వారు భారతీయుల పట్ల చూపుతున్న వివక్ష రూపుమాపాలని ఈ సభలు డిమాండ్ చేశాయి.

1920వ సం॥లో మహాత్మాగాంధీ ఇచ్చిన సహాయ నిరాకరణోద్యమం పిలుపుతో జిల్లాలో తీవ్ర స్పందన వెలువడింది. ముఖ్యంగా అనంతపురం, గుత్తి, కళ్యాణదుర్గం, పెనుగొండ తాలూకా ప్రజలు సమరోత్సాహంతో పాల్గొన్నారు. ఉద్యమ స్ఫూర్తితో కాంగ్రెస్ కమిటీలు పెక్కుచోట్ల ఏర్పాటు చేశారు. పెనుగొండ, కళ్యాణదుర్గంలో కల్లుకు వ్యతిరేకంగా ఎ.వి.కవి, వెంకటప్ప, ఎ.నారాయణరెడ్డి పికెటింగ్‌లు చేశారు. అనేకమంది విద్యార్థులు, పెక్కుమంది ఉపాధ్యాయులు కళాశాలలు బహిష్కరించారు. తాడిపత్రిలో రాట్నంపై నూలు వడికారు. ఇంకా సారా అంగళ్ళు ముందు పికెటింగులు చేశారు. జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో 1923వ సం॥లో జాతీయ పాఠశాల ప్రారంభించబడింది. 1921వ సం॥ అక్టోబరు 9న జిల్లా సంఘటనలో మరచిపోలేని దినం. ఆ రోజు మౌలానా ఆజాద్ సుభానీ, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కొండా వెంకటప్పయ్యలు వెంటరాగా, మహాత్మాగాంధీ తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో దిగారు. బ్రహ్మాండమైన బహిరంగ సభలో ఉపన్యసించి తిలక్ స్వరాజ్య నిధికి విరాళాలు సేకరించారు. ఆంగ్ల ప్రభుత్వం ఈ చర్యలను తీవ్రంగా పరిగణించి సభలు, సమావేశాలు, ఊరేగింపులు, హర్తాళ్‌లు నిషేధించి, స్థానిక నాయకులను అరెస్టు చేసింది.

9వ ఆంధ్రరాష్ట్ర మహాసభ కూడా ఈ జిల్లాలోనే జరిగింది. సైమన్ కమీషన్ ఇండియా రాక సందర్భంగా అనంతపురం ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు గాంధీటోపీలను ధరించి తరగతులను బహిష్కరించారు. 1929వ సం॥లో లాహోర్ కాంగ్రెస్ సభ తీర్మానం మేరకు సి.వి. ఓబిరెడ్డి మద్రాస్ లెజిస్లేటివ్ సభ్యుడు (అనంతపురం నుండి) తన పదవికి రాజీనామా ఇచ్చాడు. అనేకమంది దేశభక్తులు జైళ్ళపాలయ్యారు. 1930 మే 31న జిల్లా బోర్డు ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ తీర్మానం చేసింది.

1934,35 సంవత్సరాలలో మహాత్మాగాంధీ, రాజేంద్రప్రసాద్‌లు జిల్లాలో పర్యటించారు. గాంధీగారు 1934వ సం॥ జనవరి 3వ తేది నుండి గుత్తి, పెద్దవడుగూరు, రామరాజుపల్లి, తిమ్మంచెర్ల, గుంతకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు, అనంతపురం మరియు హిందూపురాలను సందర్శించి అనేక ఉపన్యాసాలను ఇవ్వడం జరిగింది.

1940 వ సం॥లో వ్యక్తిగత సత్యాగ్రాహ ఉద్యమాలతో 98 మంది సత్యాగ్రహులు డిఫెన్స్ ఆఫ్ ఇండియా యాక్టు క్రింద అరెస్టు అయ్యారు. 1942వ సం॥లో క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా జిల్లాలో హింసాత్మక సంఘటనలు జరిగాయి. గుంతకల్లు వద్ద రైల్వేపట్టాలను ధ్వంసం చేశారు. పెనుకొండలో డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ స్కూల్స్ భవనాన్ని, బోర్డు హైస్కూళ్ళను

తగలబెట్టారు. అనేకచోట్ల టెలిగ్రాఫిక్ వైర్లను, స్థంభాలను ధ్వంసం చేశారు. దానితో ప్రభుత్వం సత్యాగ్రహులను అరెస్టు చేసింది. భారీ జరిమానాలు విధించింది. అప్పటి నుండి జిల్లాలో ఫిబ్రవరి 20, 1947 వరకు అలజడిగానే వుంది.

1920 ఖిలాఫత్ఉద్యమం, సహాయనిరాకరణోద్యమం మొదలుకొని 1930 ఉప్పుసత్యాగ్రహం, 1940 వ్యష్టి సత్యాగ్రహం, 1942 క్విట్ ఇండియా ఉద్యమం, హరిజన దేవాలయ ప్రవేశం, కల్లంగళ్ల ముందు పికటింగు మొదలగు స్వాతంత్ర్యోద్యమ ముఖ్యమైన ఘట్టాలన్నింటిలోనూ అనంత దేశభక్తులు పాల్గొన్నారు.

జిల్లాలోని అన్నితాలూకాల నుండి ప్రజలు పాల్గొన్నారు. కానీ ఇందులో దాదాపు 284 మందికి శిక్షలు పడగా , ఇందులో మహిళలు నలుగురు. ఈ నలుగురూ వ్యష్టి సత్యాగ్రహం, క్విట్ యిండియా ఉద్యమంలో పాల్గొని శిక్షలు పొందినారు. ఒక ముస్లిం మహిళ శ్రీమతి రాబియాబీ ఆమెను అరెస్టు చేయలేదు ప్రభుత్వం.

1. ప్రతాపగిరి శాంతాబాయి వ్యష్టి సత్యాగ్రహంలో పాల్గొని 20-01-1941 నుండి మూడు నెలలు వెల్లూరు జైలులో శిక్ష అనుభవించినారు.

2. కరణం ఉమబాయమ్మ (కల్యాణదుర్గం తాలుకా శెట్టూరు గ్రామం) వ్యష్టి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టిందని ప్రభుత్వం శిక్ష వేసింది. 25-01-1941 నుండి మూడు నెలలు వేలూరు, కడలూరు జైళ్లలో శిక్ష అనుభవించినారు.

3. వెంకమ్మ క్విట్ యిండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 28-01-1943 నుండి ఆరు నెలలు వెల్లూరు జైలులో శిక్ష అనుభవించినారు.

4. ఎక్కువ శిక్ష పొందిన మరో దేశభక్తురాలు ఇల్లూరు కేశమ్మగారు.

కేశమ్మ 01-05-1916లో అనంతపురం ఇల్లూరు గ్రామంలో జన్మించినారు. తండ్రి అయితరాజు నరసప్ప. తల్లి లక్ష్మమ్మ . నరసప్పగారు ఇల్లూరు కరణం. కేశమ్మ చెల్లెలు రాజమ్మ. (వీరు అనంతపురం జిల్లా కమ్యూనిస్టుఉద్యమ నిర్మాతలలో ఒకరైన ఐదుకల్లు సదాశివన్ గారి సతీమణి.) తమ్ముడు సుందరయ్య. నరసప్ప గారికి , నీలం చిన్నపరెడ్డిగారికి మంచి స్నేహం వుంది. నీలం చిన్నపరెడ్డి గారు, తరిమెల సుబ్బారెడ్డిగారు గాంధీ గారి ప్రభావంతో ఇల్లూరు, తరిమెల గ్రామాలలో కల్లంగళ్ళు లేకుండా చేశారు. మంచి పుస్తకాలతో గ్రంథాలయం నిర్వహించే వారు. తమ పిల్లల చదువుల పట్ల చాలా శ్రద్ధ వహించినారు. వీరి స్నేహితుడైన నరసప్ప కూడా తమ ఇద్దరు కూతుర్లనూ చదివించారు. స్వాతంత్ర్యోద్యమం వల్ల మహిళలకు కలిగిన మేలు ఇది. జాతీయోద్యమం స్త్రీలను కుటుంబ పరిధి దాటి విశాలమైన సమాజం లోకి రావడానికి అవకాశం కల్పించింది.

1940 ఏప్రిల్ లో గాంధీ నాయకత్వాన కాంగ్రెసుపార్టీ వ్యష్టి సత్యాగ్రహం ప్రారంభించింది. యుద్ధాన్ని వ్యతిరేకించమని, అరెస్టులకు సిద్ధం కమ్మని పిలుపు యిచ్చింది. ఈ సమయానికి కేశమ్మ మదనపల్లిలో ఇంటరు రెండో సంవత్సరం చదువుతున్నారు. గాంధీగారి పిలుపు అందుకొని చదువు వదిలేసి స్వాతంత్ర్య సమరానికి సిద్ధమైనారు. సత్యాగ్రహం చేసినా ప్రభుత్వం ఈమెను అరెస్టు చేయలేదు. అరెస్టే దేశభక్తి కొలతను నిర్ణయిస్తుంది. అరెస్టు అయితే తప్పదాస్యశృంఖలాల మీద దెబ్బ వేసిన తృప్తి కలగదు. అందుకే మరింత విస్తృతంగా ఉద్యమములో పాల్గొన్నది.

ఆమె ఒంటరిగానే 60 గ్రామాలలో కాంగ్రెస్ ప్రచారం చేసింది. ఒక మహిళ ఇంత అంకిత భావంతో పట్టుదలతో స్వాతంత్ర్య సమరంలో పాల్గొనడం ప్రజలకు ఆశ్చర్యం, ఉత్తేజం కలిగించింది. ఉద్యమంలో పాల్గొనే మహిళల పట్ల గౌరవం పెరిగింది. ముఖ్యంగా స్త్రీలపై మంచి ప్రభావం కలుగ చేసింది.

1942 ఆగస్టు 9న గాంధీజీ "క్విట్ యిండియా" నినాదం యిచ్చాడు. కేశమ్మ ఆమె చెల్లెలు రాజమ్మ కరపత్రాలు రాసి, కార్బన్ నకళ్ళు తయారు చేసినారు రాత్రంతా మేల్కొని. వాటిని తీసుకొని కేశమ్మ ఒక్కతే తాలుకా కేంద్రమైన "గుత్తి' కి వెళ్ళింది. అక్కడ డిప్యూటి కలెక్టరు అధికారులతో సమావేశం జరుపుతున్నారు. ఆ సమావేశంలోకి దూసుకొని వెళ్లి, కరపత్రాలు పంచింది.

ప్రభుత్వం వెంటనే ఈమెను అరెస్టు చేసి, ఒక నెలవరకు గుత్తి సబ్ జైలులో వుంచింది. విచారణ తర్వాత కోర్టు తొమ్మిది నెలలు శిక్ష విధించింది. 02-12-1942 నుండి 9 నెలలు రాయవేలూరు జైలులో శిక్ష అనుభవించింది కేశమ్మ. శిక్షా కాలం పూర్తి అయిన తరువాత 1943 లో తిరిగి వచ్చింది.

ఆ సమయంలో బెంగాల్ లో భయంకరమైన కరువు వుంది. లక్షలాది మంది స్త్రీ, పురుషులు, పిల్లలు ఆకలితో చనిపోతున్నారు. జైలు నుండి రాగానే బెంగాల్ కరువు గురించి తెలుసుకొని చలించి పోయింది. తన చెల్లెలు రాజమ్మను తోడుతీసుకోంది. అలాగే సంఘ సేవకురాలు హట్టిపిళ్ళెమ్మ (అనంతపురం), పుల్లమ్మ (ఛాయాపురం) గార్ల సహాయం తీసుకొని జిల్లాలోని అనేక ప్రాంతాలు తిరిగి, సుమారు నాలుగువేల రూపాయలు వసూలు చేసి సహాయనిధికి పంపారు.

శారదా సమాజం అనంతపురం జిల్లాలోని మొదటి మహిళా సమాజం. 1920 తొలి నుండే మహిళలకు కొన్ని కార్యక్రమాలు నిర్వహించేది. జిల్లా ఉన్నతాధికారుల సతీమణులు అంటే జిల్లా కలెక్టరు, డిప్యూటి కలెక్టరు, ఎస్.పి, జిల్లా జడ్జి, ఆసుపత్రి సర్జన్, ఇన్స్పెక్టరు, ప్రొఫెసరు, ఇంజనీరు, వకీలువారి సతీమణులు శారదా సమాజ నిర్వాహకులు.

శారదాసమాజానికి మూడో రోడ్డులో సొంత కార్యాలయం వుంది. రోజూ మహిళలు సమావేశం అయ్యేవారు. స్త్రీలకు కుట్టుపని మొదలగు చేతి పనులు నేర్పే వారు. ప్రతి శుక్రవారం ఎవరో ఒకరు ఏదోఒక విషయముపై వ్యాసాలు చదివేవారు. చర్చలు జరిగేవి. 'శారదా మునిసిపల్ ఉన్నత పాఠశాల" శారదా సమాజం ప్రారంభించిందే. ఈ సమాజం గ్రంథాలయం కూడా నిర్వహించేది. కేశమ్మ గారు 1944 నుండి 1945 వరకు గ్రంథాలయ బాధ్యతలు తీసుకున్నారు. స్త్రీలలో పఠనాభిలాషను పెంచడానికి కృషి చేసినారు.

వార్ధాలో "నయీతాలిం" సంఘంలో నూతన విద్యాబోధనలో శిక్షణ పొందటానికి ఆంధ్ర ప్రాంతం నుండి ఎనిమిది మంది మహిళలు ఎన్నికైనారు. అందులో కేశమ్మగారు ఒకరు. ఆమె వార్ధా వెళ్లి ఒక సంవత్సరం శిక్షణ పొందినారు. మహాత్మా గాంధీ , రాజేంద్రప్రసాద్, అరుణా అసఫ్ అలీ, సుచేతా కృపలానీ, అమృత కౌల్, జాకీర్ హుస్సేన్, వినోబాబావే మొదలగు వారు అక్కడ ఉపన్యాసాలు యిచ్చి, బోధనలు చేశారు.

1947, 1948 రెండు సంవత్సరాలు పెద్దవడుగూరులో అనాథ శరణాలయం నిర్వహించినారు. నిర్వహణకు పెద్ద వడుగూరులో చిన్నారపరెడ్డి గారు సహాయ సహకారాలు అందించినారు. తరువాత 1949 నుండి రెండు సంవత్సరాలు దుర్గాబాయి ప్రోత్సాహంతో హైదరాబాద్ లో "కస్తూరిబా గాంధీ నేషనల్ మెమోరియల్ ట్రస్టు"లో ఆర్గనైజరుగా పని చేసారు. తరువాత నిజామాబాద్ జిల్లాలో ప్రధానోపాధ్యాయినిగా పని చేసి పదవీ విరమణ చేసినారు.

1975 లో అప్పటి ముఖ్య మంత్రి జలగం వెంగళరావు గారు అంతర్జాతీయ మహిళా సంవత్సరం సందర్భంగా అనంతపురంలో కేశమ్మగారిని సన్మానించినారు. 17-03-1991న తనువు చాలించినారు.

ప్రజాసేవ పట్ల తపనతో, అంకిత భావంతో జీవితాంతము కార్యకలాపాలు నిర్వహించినారు. మితభాషి, నిరాడంబర జీవి, ఆదర్శ మూర్తి , స్ఫూర్తి దాత శ్రీమతి ఇల్లూరు కేశమ్మ.

**ఆధార గ్రంథాలు**

1. ఇల్లూరు కేశమ్మ - విద్వాన్ దస్తగిరి (12-08-2001న ఆకాశవాణి అనంతపురం కేంద్రం నుండి ప్రసారితం)
2. అనంతదర్శిని (సంపాదకులు), డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, ఎబిసి పబ్లికేషన్స్, అనంతపురము, ఫిబ్రవరి (2009)
3. అనంతపురం జిల్లా చరిత్ర (1928) - కలవటాల జయ రామారావు

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్య సమరంలో – మల్లు స్వరాజ్యం

**డా॥ జి. రాజేష్ కుమార్,** అర్థశాస్త్ర అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల, తిరుపతి జిల్లా. సెల్ : 94902 47286

**బాల్యం :** తెలంగాణ ప్రాంతమైన నల్గొండ జిల్లా, సూర్యపేట తాలూకా, కొత్తగూడెంలో శ్రీ భీమిరెడ్డి రామిరెడ్డి, శ్రీమతి చుక్కమ్మల రెండవ కుమార్తెగా స్వరాజ్యం 1931లో జన్మించారు.

**వివాహం :** 1954లో శ్రీమల్లు నరసింహారెడ్డితో ఆమె వివాహం అయ్యింది. 1946లో కాలేజీలో చదువుతున్న రోజులలోనే నరసింహారెడ్డి చదువుకు స్వస్తి చెప్పి దళంలో చేరారు. నైజాం ఆంధ్ర మహాసభ తరపున ప్రజా ఉద్యమంలో పాల్గొన్నారు. అడవులలో ప్రవాసం చేస్తూ ఏరియా కమాండర్ ఆయన స్వాతంత్ర్య సమరంలో వీరవిహారం చేశారు. అందువల్లే వారిద్దరినీ తగిన జంట అని అందరూ మెచ్చారు.

**సంఘసంస్కర్తగా విప్లవకారిగా, స్వాతంత్ర్యోద్యమ నాయకురాలుగా :** ఆంధ్రరాష్ట్ర శాసనసభ వార్తలను ఏపాటి చదివే వారికైనా మల్లు స్వరాజ్యం పేరు బాగా తెలిసి ఉంటుంది. స్త్రీలు, పేదలు బలహీన వర్గాల వారికి ఎక్కడ, ఎప్పుడు అన్యాయం జరిగినట్లు తోచినా ఆమె వెంటనే శాసనసభల్లో ప్రశ్నలు, చర్చలు ఆరంభించి దాని పర్యావశానములను న్యాయబద్ధంగా, క్షేమదాయకంగా వుండేటట్లు చూస్తారు. అది ఆమెలోని ప్రత్యేకత. ఆమె శాసనసభ్యురాలయి ప్రజా సేవకు ఆరంభించలేదు. ప్రజా సేవలో స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలను గడ్డిపోచగా భావించి రాటుదేలి ప్రస్తుతం ఇదొక సాదనంగా మాత్రమే వ్యవహరిస్తున్నారు. దీని వలన ఆమె జంకు గొంకు లేకుండా కుశాగ్ర బుద్ధితో, అప్రమత్తతో పరిస్థితులను గమనించుచూ తమ ధర్మం నెరవేర్చుతుంటారు. స్త్రీలకు చదువు లేదు, బాల్యవివాహాలు అమలులో వుండేవి. వితంతు వివాహాలు తలువరాదు. బహుభార్యాతత్వం పరిపాటి. మద్యపానం గౌరవసూచకంగా భావించే పురుషులకు భార్యాబిడ్డలను కొట్టడం పరిపాటి.

వందేమాతరం ఉద్యమం నాటి నుండి బ్రిటీష్ పాలనలో వున్న మిగతా భారతదేశంలో రాజకీయ చైతన్యం కలిగి ప్రజలు విప్లవధోరణి అవలంబిస్తున్న 1930లో దేశ వ్యాప్తంగా శాసనవికారం చేసి వేల సంఖ్యన ప్రజలు జైళ్ళకు వెళ్ళినా ఈ సంస్థానంలో సభలు, సమావేశాలు జరుపకూడదు. స్వాతంత్ర్యేచ్ఛ కనపరచకూడదు. కానీ, బ్రిటీష్ ఇండియాలో నటించిన సత్యాగ్రహం వీరిలోనూ చైతన్యం కలిగించింది.

నైజాం రాష్ట్రంలో మాడపాటి హనుమంతరావు గారు, శ్రీ బూర్గుల రామకృష్ణ వంటి వారిని జత కలుపుకొని ఆంధ్రజాతి ఉద్ధరణకు పూనుకున్నాడు. తెలుగు పిల్లలకు తెలుగు బడులు స్థాపించి హాస్టళ్ళను నిర్మించి ఆంధ్రమహాసభల పేరుతో కాంగ్రెస్ సభల పద్ధతిన సభలు జరిపించి ఆంధ్రులకు ఏకత్వం కలిగించారు. అందుకే ఈయన ఆంధ్రపితామహుడుగా తెలంగాణ హృదయాలలో నిలిచిపోయాడు. అవకాశం కోసం వేచివున్న ఆంధ్రస్త్రీలు, శ్రీమంతులు ఎల్లాప్రగడ సీతాకుమారి, రంగమ్మ, ఓబుల్‌రెడ్డి, సీతాదేవి మరెందరో తోటి స్త్రీలను కలుపుకొని ఆంధ్రమహిళా సభలు జరిపి స్త్రీలలో చైతన్యం కలిగించనారంభించారు.

1944 నాటికి ప్రజలలో విపరీతమైన చైతన్యం కలిగి రకరకాల దాస్య విమోచనానికి ప్రజలు చేతులు కలిపి ముందుకు నడిచారు. సంస్థానంలోకి కాంగ్రెస్ వాదులు, కమ్యూనిస్టులు, బ్రిటీష్ ఇండియాలోని కాంగ్రెస్ వాదులు అందరూ ఏకమై ప్రజా విప్లవాన్ని నడిపించారు. బెజవాడలో డా॥శ్రీమతి కొమ్మరాజు అచ్చమాంబ నడుపుతున్న ఆత్మరక్షణ శిక్షణా తరగతులకు శ్రీమంతులు ఆరుట్ల కమలాదేవి మొదలైన వారు వచ్చారు.

స్వరాజ్యం తండ్రి చనిపోయిన తరువాత అన్న భీమారెడ్డి నరసింహారెడ్డి గారు పేరుపొందిన కమూనిస్టు నాయకుడిగా ఉద్యమంలో బహిరంగంగా ప్రవేశించారు. స్వరాజ్యం తల్లి శ్రీమతి చుక్కమ్మ "నా పిల్లలు భరతమాతకు పిల్లలే, వాళ్ళను ఆమే కాపాడుకుంటుంది" అని వీరమాతకు తగినట్లుగా అన్నారు. స్వరాజ్యం బెజవాడలో ఆత్మరక్షణ శిక్షణ పొంది కోస్తా జిల్లాలన్నీ తిరిగి మద్రాసు వరకు వెళ్ళి సాతంత్ర్య సమర ప్రచారం చేశారు. ఆమె కామాలు, ఫుల్‌స్టాప్‌లు లేకుండా టకటక ఉపన్యసిస్తూ వుంటే ప్రజలు వింతగా చూసేవారు.

గ్రామీణ పాఠక జనుల కోసం నాటి పరిస్థితులను వివరించుతూ పెద్ద యేలపాట రచించారు. స్వయంగా పెద్ద

గొంతుకతో దానిని పాడి జనానికి తెలియజెప్పినారు. రాత్రింతల గ్రామీణులను సమావేశ పరచి ఉయ్యాల చుట్టూ కావడి వంటి జానపద ఆటల ద్వారా ప్రభోదం చేసేవారు. చివరకు అన్నతో, అక్కతో కలసి అడవులలో ప్రచ్ఛన్నవాసానికి వెళ్ళారు. రోడ్డు సౌకర్యాలు లేని ఆ కొండ ప్రాంతం ప్రదేశాలలో గుర్రాలు ఎక్కి, తుపాకి ధరించి అక్కా చెల్లెలు ఆనాటి ఝాన్సీ రాణి లాగా వీరవిహారం చేసేవారు. అధికారుల స్థావరాల పైన మెరుపుదాడులు జరిపి ఆయుధాలు మొ॥ సేకరించేవారు. కోయ స్త్రీలందరికీ ఆయుధాలు వాడడం, మాన ప్రాణాలు రక్షించుకోవడం తెలియజెప్పేవారు. అప్పటికీ ఆకునూరు మాచిరెడ్డి పల్లి వంటి చోట గూండాలు స్త్రీలను అమానుషంగా భంగపరచడంలో శ్రీమతి సరోజిని నాయుడు గారి పెద్ద కుమార్తె శ్రీమతి పద్మజ నాయుడు మొదలైన పెద్దలు స్వయంగా వెళ్ళి విచారణ జరిపి గూండాల గాటుక చర్యలను గుర్తించారు. అన్ని పార్టీల వారు ముక్తకంఠంతో ఒకే మార్గాన స్వాతంత్ర్య సంపాదనకు సింహ గర్జన చేస్తూ బయలుదేరారు.

1948 సెప్టెంబర్ 12వ తేదీన స్వతంత్ర్య భారత సేవలు సంస్థానాన్ని చుట్టిముట్టి లోబరుచుకున్నవి. ఆనాటితో ఈ సంస్థానం కూడా స్వతంత్ర్య భారతంలో ఒక భాగంగా విలీనమైపోయింది. అడవులు పట్టి ప్రచ్ఛన్నవాసం చేస్తూ ఉద్యమం నడిపించిన అనేకులు తిరిగి జానపదులకు వచ్చారు.

తరతరాలుగా నిరంకుశ ప్రభుత్వానికి గురైవున్న రాష్ట్రం కాబట్టి భారత ప్రభుత్వం వెంటనే అన్ని రకాల మార్పులు రాజ్యాంగంలో ప్రవేశపెట్టలేకపోయారు. జైలులో పరిస్థితులను క్షణంలో మార్చలేకపోయినట్లే పేద రైతుల, కూలీల ఆర్థిక సమస్యలను కూడా వెంటనే పరిష్కరించి తేల్చి చెప్పలేకపోయినారు. 1953 వరకు శ్రీమతి స్వరాజ్యం కూడా అట్లాగే వుండిపోయినారు. 6 సం॥ల పాటు ఆ జీవితం గడిపిన కారణంగా ఆమె ఆరోగ్యం దెబ్బతిన్నది. మలేరియాతో సరైన పోషకాహారం లోపంతో కృశించారు. 1953లో భారత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకటనతో ఆమె అజ్ఞాన వాసం ముగిసింది.

**రాజకీయ ప్రస్థానం :** కొంత కాలం ఆమె సూర్యపేటలో పార్టీ వైస్ ప్రెసిడెంట్‌గా వున్నారు. రాష్ట్ర మహిళా సంఘానికి సహాయ కార్యదర్శి ప్రతివారికీ స్వతంత్ర్య వృత్తి వుండాలన్న తలంపుతో సేద్యంలో ప్రవేశించారు. ఆమెకు ఉద్దేశ్యం కలగక పోయిన పార్టీ ప్రోద్భలంతో ఎన్నికలలో సి.పి.ఎం. తరపున తుంగతుర్తి నియోజకవర్గం నుండి పోటీ చేసి 6 వేల ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ సభ్యత్వం వహించారు. గత చరిత్రను బట్టి స్త్రీలకు బలహీన వర్గాలకు, దళితులకు అన్యాయం జరుగుతున్నట్లు తోస్తే ఆమె సహించలేరు. వెంటనే ప్రశ్నల వర్షం కురిపిస్తారు. సంజాయిషీలు అడుగుతారు. హామీలు తీసుకుంటారు. మద్యపాన నిషేదం గురించి సందర్భం వచ్చినప్పుడల్లా ప్రచారం చేస్తూనే వుంటారు. అధికారంలో వున్నది ఏ పార్టీ అయినా ప్రజల అవసరాలకు ఆదుకోవడంలో జాప్యం చేయడం తగిన నిధులు లేవని ప్రజాహిత కార్యాలు వాయిదా వేయడం, కుదించడం సబబు కాదంటారు.

నాటి పరిస్థితులను బట్టి డిగ్రీ చదువులు లేకపోయినందుకు ఆమె చాలా బాధపడుతారు. పెద్ద డిగ్రీలు సంపాదించగలిగి వుంటే ఇంకా ఎంతో కొంత సాధించగలిగేదానిని కదా అని నిరుత్సాహ పడుతారు. “ఆనాటి తెలంగాణ ప్రజా ఉద్యమంలో ఎంతో మంది స్త్రీలు, ఇల్లు, వాకిలి, సుఖం, భద్రత వదులుకొని దేశాభిమానంతో ప్రజాసేవను రక్తితో అడవులలో వున్నారు. పురుషులను మించి పరాక్రమంతో ప్రాణాలను తెగించి మెరుపులు దాడులు జరిపి సాయుధ పోరాటాలలో పాల్గొన్నారు. కానీ, ఈనాడు వారందరూ యేరి? ఆ స్త్రీలకు ఈనాడు గుర్తింపు ఉన్నదా? పదవులు ఇచ్చారా? హోదాలు ఇచ్చారా? ఈ విధంగా స్త్రీలకు మన దేశంలో అన్ని ఉద్యమాలలోనూ, అన్ని పార్టీల వారు అన్యాయం చేస్తూనే వుంటారు. దీంట్లో మాత్రం ఏ మార్పూ రావడం లేదు”. అని కొలికి పూసలాగా, మణిపూస వంటి అభిప్రాయం వెళ్ళబుచ్చారు శ్రీమతి మల్లు స్వరాజ్యం గారు.

**ఆధార గ్రంధాలు**

1. నామాటే తుపాకి తూటా పుస్తకం, మల్లుస్వరాజ్యం ఆత్మకథ, 2019.
2. టైమ్స్ ఆఫ్ ఇండియా, కథనం, 2019.
3. ది హిందూ న్యూస్ పేపర్ ఆర్టికల్, కథనం, 2019.
4. హాన్స్ ఇండియా, కథనం, 2022.
5. వికీపీడియా, అంతర్జాలం.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# క్విట్ ఇండియా ఉద్యమ నాయకి అరుణా అసఫ్ అలీ

కె. విశ్వనాథ్, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి. చరవాణి: 8309425062

స్వేచ్ఛకోసం, స్వాతంత్ర్యం కోసం, దేశమాత బానిస సంకెళ్ళ విముక్తికోసం, ఎందరో స్వాతంత్ర్య సమరవీరులు, వీరనారీమణులు, తమ జీవితాలను ప్రాణాలను అంకితం చేశారు. మార్గాలు, సిద్ధాంతాలు ఏవైన అందరికి ఒకటే లక్ష్యం. ముక్త కంఠంతో కోట్లాది ప్రజలు గర్జించిన సందర్భం. అదే భారత జాతీయోద్యమం. దేశంలోని ప్రజలు కుల, మత, వర్గ, జాతి లింగ భేదాలు మరచి మేమంత భారతీయులమని ప్రపంచానికి చాటారు. వలసపాలనకు వ్యతిరేకంగా జరిగిన ఈ పోరాటంలో పురుషులే కాదు, వీరనారీమణులు కూడా ఉన్నారు. వీరి సంఖ్య చిన్నదే కావచ్చు కానీ వారి కృషి గొప్పది. వారు చేసిన సేవ అసమానమైనది.

భారత జాతీయోద్యంలో మొదట స్త్రీల భాగస్వామ్యం చాలా తక్కువగానే కనిపిస్తుంది. 1905లో జరిగిన స్వదేశీఉద్యమం వరకు స్త్రీలు ప్రత్యక్షంగా ఉద్యమంలో పాల్గొన్న ధాకలాలు లేవు. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో బెంగాల్‌లోని మహిళలు నిరసనలు చేశారు. కాని ప్రత్యక్షంగా వారు ఎలాంటి స్వయం నిర్ణయాలను తీసుకోలేక పోయారు. ఇదంతా కూడా పురుషుల కనుసున్నలలోనే జరిగాయి. ఇది కేవలం మొదటి దశ మాత్రమే. మహిళలు పాల్గొన్న మొదటి ఉద్యమం కూడా ఇదే కావడం విశేషం. 1920కి ముందు అంటే గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభించే వరకు జాతీయోద్యంలో మహిళా నాయకులుగా అనిబిసెంట్, విదేశాలలో ఉంటు ఉద్యమం నడిపిన "మేడం భికాజికామా" లాంటి ఇద్దరు మాత్రమే కనిపిస్తారు. అనిబిసెంట్ లాంటి వారు మహిళలు రాజకీయ కార్యక్రమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చి తన పత్రికైన "కామన్ విల్" లో స్త్రీలను చైతన్యపరిచేవారు. విద్యా, సంఘ సంస్కరణలు, మహిళా భాగస్వామ్యాన్ని పెంచడంలో కీలక పాత్రను పోషించాయి. ముఖ్యంగా ఉన్నత వర్గాల కుటుంబంలో స్త్రీలు చదువుకోవడం వల్ల వారు చైతన్యంవంతులై జాతియోద్యంలో ప్రత్యక్షంగా పాల్గొనడం జరిగింది.

భారత జాతీయోద్యమంలో గాంధీ ప్రవేశించాక ఆయన మొదట చేసిన జాతీయ స్థాయి ఉద్యమం సహయనిరాకరణ ఉద్యమం (1920). ఇందులో మహిళలు ప్రధాన పాత్ర వహించారు. 1930లో జరిగిన ఉప్పుసత్యాగ్రహంలో సుమారు 17 వేల మంది స్త్రీలు నిర్భందానికి గురయ్యారు. ఈ ఉద్యమంలో మహిళలు విరివిగా పాల్గొనడానికి కారణం వివిధ మహిళా సంఘాలు నారీ సత్యాగ్రహ సంఘ్, మహిళా రాష్ట్రీయ సంఘ్, స్వయం సేవికా సంఘ్, స్త్రీ స్వరాజ్య సంఘ్ మొదలైన సంఘాలు ప్రధాన పాత్ర పోషించాయి. సరోజిని నాయుడు, రాణి గైడున్లు, కమళా నెహ్రూ, హన్సా మెహుతా, సత్యవతి, పార్వతి బాయ్, రుక్మిణి లక్ష్మీపతి, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కమళా చటోపాధ్యామ, అరుణా అసఫ్ అలీ లాంటి వారు స్త్రీలను చైతన్య పరచి వారికి స్పూర్తిదాయకంగా నిలిచారు.

జాతీయోద్యంలో కీలకమైన ఘట్టం, చివరి అంకం క్విట్ ఇండియా ఉద్యమం (1947-8-8)ఈ ఉద్యమంలో స్త్రీలు భాగస్వామ్యం చాలా స్పూర్తి దాయకమైనది. కొందరు విప్లవ పంతాను ఎన్నుకొంటే మరికొందరు అహింస మర్గాన్ని ఎన్నుకున్నారు. నేతాజి స్థాపించిన జాతీయ సైన్యంలో విప్లవ భావాలు ఉన్న స్త్రీలు చాలా మంది చేరారు. స్త్రీలతో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక రెజిమెంటుకు ఝాన్సీ లక్ష్మీబాయి పేరు పెట్టి దానికి కెప్టెన్‌గా లక్ష్మీసెనెగల్‌ను నియమించారు. ఆనాటికి ఇదో గొప్ప నిర్ణయంగా, అభివర్ణించడంలో సందేహం లేదు. క్విట్ ఇండియా ఉద్యమానికి అగ్రనాయకులను బ్రిటీష్ ప్రభుత్వం నిర్భిందించి ఆటంకం కలిగించింది. అందరూ ఆగిపోయిందనుకున్న ఉద్యమానికి నాయకత్వం వహించి "క్విట్ ఇండియా ఉద్యమ నాయకి"గా పేరు పొందిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధురాలు, సామాజిక వేత్త అరుణా అసఫ్ అలీ.

అరుణా అసఫ్ అలీ అసలు పేరు అరుణా గంగూలి 1909-జూలై-16న హర్యనాలో కల్కాలో బెంగాళి కుటుంబంలో జన్మించారు. వీరి కుటుంబం బ్రహ్మ సమాజ పద్ధతులు పాటించేవారు. చిన్నప్పటినుండి ఆమె స్వేచ్ఛాభావనలలో ఎదిగారు. ఇంట్లో వారి అభిప్రాయాలకు భిన్నంగా ప్రాథమిక విద్యను లాహోర్‌లలోని క్రైస్తవ మిషనరీ పాఠశాలలో, కళాశాల విద్య నైనిటాల్‌లోని క్రైస్తవ విద్యా సంస్థలలో జరిగింది. చదువు పూర్తయిన తరువాత కలకత్తాలోని గోఖలే స్మారక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా

పనిచేసింది. అరుణా స్వతహాగా విప్లవభావాలు కలిగిన వ్యక్తి అయినా గాంధీ సిద్ధాంతాలు, అహింసా మార్గాలు ప్రభావితం చేశాయి.

అరుణా అసఫ్ అలీ తన 18వ ఏటనే ప్రముఖ జాతియోద్యమ నాయకుడు, న్యాయవాది అయిన అసఫ్ అలీని 1928లో వివాహం చేసుకుంది. అరుణా తన కంటే 20 ఏళ్ళు పెద్ద వాడైన వ్యక్తిని, అదిగాక మతాలు వేరు. కుటుంబసభ్యులు దీనికి అంగీకరించిక పోయినా అందరిని ఎదిరించి అసఫ్ అలీని వివాహం చేసుకున్నారు. గాంధీతో సహ వీరి వివాహాన్ని అందరూ ప్రసంశించారు. వీరి వివాహాన్ని హిందూ, ముస్లిం ఐక్యతకు చిహ్నంగా గాంధీ ప్రశంసించగా "నేను ఆయన ముస్లిం మతాన్ని చూసి వివాహం చేసుకోలేదు. ఆయన గుణగుణాలు చూసి వివాహం చేసుకోవలనుకున్నా" అంటూ సమాధానం చెప్పడంలో ఆమె వ్యక్తిత్వం తెలుస్తుంది. భర్తతో పాటు జాతియోద్యంలో చురుకుగా పాల్గొనేవారు. 1931లో జరిగిన ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొంది బ్రిటిష్‌వారు ఈమెను అరెస్టు చేశారు. గాంధీ-ఇర్విన్ ఒప్పందంలో భాగంగా రాజకీయ ఖైదీలందరిని విడుదల చేయవలసి ఉండగా, అరుణా అసఫ్ అలీని విడుదల చేయడానికి అంగీకరించలేదు. ఇది తెలిసిన తోటిఖైదీలు కూడా అరుణాను విడుదల చేసేవరకు జైలు వదలమని తేల్చి చెప్పారు. దీనితో గాంధీ కలుగచేసుకొని వారికి సర్ది చెప్పారు. ప్రజా ఆందోళనల తరువాత అరుణా అసఫ్ అలీని విడుదల చేయడం జరిగింది. 1932లో తీహార్ జైలులో ఖైదుగా ఉండగా అక్కడ రాజకీయ ఖైదీలపై చూపుతున్న వివక్షకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేశారు. దీనితో ఈమెను అంబాలాలో ఒంటరి ఖైదీగా ఉంచారు. విడుదలైన తరువాత రాజకీయ కార్యక్రమంలో దూరంగా ఉండిపోయింది.

1942లో ఆగస్టు 8న బొంబాయి లోని గోవాలియా ట్యాంక్ మైదానంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమావేశం అయ్యి క్విట్ ఇండియా తీర్మాణాన్ని ఆమోదించగానే ఆంగ్లేయ ప్రభుత్వం కాంగ్రెస్ అగ్రనాయకులందరిని అరెస్టు చేశారు. ఎలాగైన ఉద్యమాన్ని నీరుగార్చాలని ప్రభుత్వం విచక్షణ రహితంగా వ్యవహరించింది. ఉద్యమానికి నాయకత్వం లేకుండా చేసింది. పార్టీ శ్రేణులకు, ప్రజలకు ఏమి చెయ్యాలో తోచక అయోమయంలో పడిపోయారు. ఈ సందర్భంలో అనుహ్యంగా అరుణా అసఫ్ అలీ తెరపైకి వచ్చారు. జైలు నుండి విడుదలయ్యాక క్రీయశీలక రాజకీయాలకు దూరంగా ఉండడం వల్ల బ్రిటిష్ అధికారులు ఈమెను లెక్కచేయలేదు. 1942-8-9న బొంబాయిలో గోవాలియా ట్యాంక్ మైదానంలో జరిగిన సదస్సును విజయవంతంగా ముగించి, కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ద్వారా ఉద్యమాన్ని ప్రారంభించింది. దీనితో బొంబాయిలో ఉద్యమం తీవ్రస్థాయికి చేరింది. క్రమంగా దేశం మొత్తం విస్తరించాయి. ఈ అనుకోని పరిణామాలకు బ్రిటిష్ ప్రభుత్వం పీఠాలు కదిలాయి. మరుసటి రోజే అంటే 1942-8-10న కాంగ్రెస్‌ను ప్రభుత్వ వ్యతిరేక సంస్థగా గుర్తిస్తు నిషేధించింది. అలాగే అరుణా అసఫ్ అలీ అరెస్టుకు వారెంటును, ఆమెపై 5000 రివార్డును ప్రకటించడం జరిగింది. ఈ పరిణామాలను ముందే ఊహించిన ఆమె అజ్ఞాతంలోకి వెళ్ళారు. అజ్ఞాతంలో ఉండి రామ్ మనోహర్ లోహియాతో కలిసి "ఇంక్విలాల్" పత్రికను నడిపారు. గాంధీ స్వయంగా తన లేఖలో "లొంగిపోవలసినదిగా' ఇచ్చిన సూచనలను సైతం ఆమె పట్టించుకోలేదు. ఆమె స్వతంత్ర ఆలోచను పటిమకు ఇవి నిదర్శనం. 1946లో ఆమెపై ఉన్న అరెస్ట్ వారెంటును వెనక్కి తీసుకునే వరకు ఆమె అజ్ఞాతం నుండి బయటకురాలేదు. బయటకు వచ్చిన వెంటనే నౌకదళ తిరుగుబాటులో పాల్గొన్నారు.

స్వతంత్ర భారతదేశంలో ఆమె రాజకీయ కార్యక్రమాల కంటే సామాజిక కార్యక్రమాలలో ఎక్కువగా పాలుపంచున్నదని చెప్పవచ్చు. దేశ విభజన, గాంధీ హత్య వంటివి ఆమెను తీవ్రంగా కలిచివేశాయి. 1948లో సోషలిస్టు భావాలకు ప్రభావితం అయ్యి సోషలిస్టు పార్టీలో చేరారు. ఈ సమయంలోనే 'యునెస్కో' వారు మెక్సికోలో నిర్వహించిన సమావేశానికి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ నాయకులుగా వెళ్ళిన బృందంలో అరుణా అసఫ్ అలీ సభ్యులుగా కూడా ఉన్నారు. 1955లో ఆమె సభ్యురాలిగా ఉన్న సోషలిస్టు పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీలో విలీనం అయ్యింది. తద్వారా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీలో సభ్యురాలుగా కూడా పని చేశారు. 1958లో ఢిల్లీకి మొట్టమొదట మహిళా మేయర్‌గా ఎన్నికయ్యారు. ఆమె మేయర్‌గా అనేక సంక్షేమ పథకాలు పేదప్రజల కోసం ప్రారంభించారు. తరువాత రాజకీయ ఒత్తిళ్లలకు తాలలేక దానిని వదిలేసింది. 1964లో కాంగ్రెస్ పార్టీలో మరల పునఃప్రవేశించింది. 'లింక్', 'పేట్రియాట్' అనే పత్రికలను నడిపారు. 1964 తరువాత ఆమె స్వతంత్ర భారత దేశంలోని

రాజకీయాల పట్ల ఆమె విముకత చూపింది. ఆనాడే కుళ్ళు రాజకీయాలపట్ల విరక్తి చెందారు. కాంగ్రెస్‌లో చేరినా రాజకీయాలకు దూరంగానే ఉంది.

1954 "నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్" ను స్థాపించారు. ఇది భారత కమ్యూనిస్ట్ పార్టీ విభాగం, పేదరిక నిర్మూలనకి, సాధికారత అణగారిన వర్గాల అభివృద్ధికి సూచనలు చేయడమే గాక నిరంతర కృషి సలిపారు. మహిళాభివృద్ధి కోసం మహిళా విద్యకోసం కృషి చేశారు. కమళాదేవి ఛటోపాధ్యామతో కలిసి మహిళా ఉద్యమాన్ని నడిపారు.

ఈమె కాంగ్రెస్, సోషలిస్ట్, కమ్యూనిస్ట్ పార్టిలో పనిచేశారు. కానీ రాజకీయాలు నచ్చక దేనిలోను ఇమడలేక పోయారు. తను నమ్ముకున్న సిద్ధాంతాల కోసం ఒంటరి ప్రయాణం చేశారు. అరుణా అసఫ్ అలీ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూనే దానికి సమాంతరంగా మహిళా అభివృద్ధి, సాంఘీక సమానత. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేశారు. ముఖ్యంగా అణగారిని వర్గాల కోసం చేసిన సేవ అసమానమైనది. అందుకే ఆమెను అనేక బిరుదులు, అవార్డులు ఆమెను వరించాయి. ఆమెను అవి వరించడం వల్లె వాటికి గౌరవం దక్కింది అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

అరుణా అసఫ్ అలీ చేసిన అనేక కార్యక్రమాలకు, సేవలకు గాను అనేక పురస్కారాలు లభించాయి. 1964లో కమ్యూనిస్ట్ రష్యా అందించే "లెనిన్ శాంతి' పురస్కారాన్ని జాతీయ సమైక్యత కోసం కృషి చేసినందుకు ఇచ్చే "ఇందిరాగాంధీ జాతీయ సమైక్యత" పురస్కారాన్ని 1987లోను, 1991లో అంతర్జాతీయ అవగాహనకు "జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ అవగాహన" పురస్కారాన్ని అందుకున్నారు.

భారతదేశ అత్యున్నత పురస్కారాలైన పద్మవిభూషణ్ అవార్డును 1992లో అందుకున్నారు. 1996 జూలై 29వ తేదిన ఆమె ఢిల్లిలో మరణించారు. మరణానంతరం 1997లో భారత అత్యున్నత పురస్కారమైన "భారతరత్న" అవార్డును భారత ప్రభుత్వం ప్రకటించింది. ఇందిరాగాంధీ, మదర్ థెరిస్సా తరువాత భారతరత్న అందుకున్న మహిళగా పేరు పొందింది.

అరుణా అసఫ్ అలీ నేటి తరం వారికి ఆదర్శవంతం 1928లోనే అంటె 18 ఏళ్ళ వయసులోనే తనకంటె వయసులో 20 సంవత్సరాల వయోబేధం మతాలు వేరు. అయిన ఆలోచనలు, భావాలు కలవడంతో వివాహం చేసుకుంది. ఇవి ఆమె నూతన ఆలోచన ధోరణికి విప్లవకరమైన భావాలకు ప్రతీకగా చెప్పవచ్చు. తను నమ్ముకున్న భావాలకోసం, ఆశయాలకోసం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి. స్వాతంత్ర్యం అనంతరం జాతీయోద్యంలో పాలుపంచుకున్న నాయకులు పదవుల కోసం పాకులాడుతుంటే ఈమె అవి ఏవి ఆశించకుండా ప్రజాసేవకే అంకితమైన నిస్వార్థపూరిత మహిళ. మహిళలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన నిరాడంబర జీవి అరుణా అసఫ్ అలీ అందుకే మనం ఈమెను "క్విట్ ఇండియా ఉద్యమ నాయకి" (Queen of Quit India) అని "Grand Old Lady of Indian" అని ఆమెను గౌరవించుకున్నం, స్మరించుకుందాం.

**ఆధార గ్రంథాలు :-**

1. "భారత రత్న"లు – సత్యనారాయణ ఆవంచ
2. సమగ్ర భారత చరిత్ర – జాతీయోద్యమం – కృష్ణారెడ్డి .కె
3. సమగ్ర భారత దేశ చరిత్ర ఆధునిక యుగం – సతీష్ చంద్ర
4. వివిధ పత్రికలలోని వ్యాసాలు

# స్వాతంత్ర్య సంగ్రామంలో – సర్దార్ అమరావతమ్మ

**కె. వెంకట స్వామి,** పరిశోధక విద్యార్థి తెలుగు శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, చరవాణి: 7780398573, 9052961440,

వేదాకాలం నుండి ఆధునిక కాలం వరకు భారతీయ మహిళలు సమాజంలో ప్రాధాన్యతను,బాధ్యతను కలిగి వున్నారనడం అతిశయోక్తి కాదు.భారతీయ సమాజం స్త్రీని దేవతగా,మాతృమూర్తిగా,సోదరీమణిగా,ముద్దుల తన యగా,గృహిణిగా,అత్తింటి కోడలుగా తగిన ఆదరణ చూపి గౌరవించింది.స్త్రీ త్యాగమూర్తిగా,వియవతిగా, విద్యా వతిగా,ఆధ్యాత్మశీలిగా,వీరవనితగా నిలిచి ఆతదరణను,ఆత్మీయతను,అనురాగాన్ని సమాజానికి పంచి ప్రపంచ మహిళలకే ఆదర్శంగా నిలిచింది.

ఒక తరానికి ఒక స్త్రీ రత్నము ఉదయించిన అది స్త్రీ జాతికి గర్వకారణమే,ఆ స్త్రీని ఆదర్శంగా తీసుకుని మిగిలినవారు ఆ స్థితికి చేరాలన్నదే ధ్యేయం. పురుషవేషం ధరించి ఓరుగల్లును పరిపాలించిన రాణీ రుద్రమ దేవి స్త్రీ జాతికే గర్వకారణం, భరతావనికే మణిహారం.అంతటి శక్తి సామర్థ్యాలు కలిగిన భారతీయ మహిళలు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని తమలో దాగున్న శక్తిసామర్థ్యాలను సమాజంలో నిరూపించుకున్నారు. మహాత్మా గాంధీ పిలుపునందుకుని కుల,మత భేదాలు వదిలి,బీదా,ధనిక భేదాలు లేక స్వార్థాన్ని పక్కకు నెట్టి త్యాగశీలలై కొండంత హృదయంతో జాతీయోద్యామంలో ప్రధానపాత్రను వహించి భరతమాత దాస్యశృంఖలాలను తెగ్గొట్టిన ఘనత మహిళలకు దక్కింది. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ అన్న సత్యాన్ని నిరూపించారు భారతీయ మహిళలు.

ఎండకన్నెరుగని సంపన్న గృహిణులు,వీధిగడపతొక్కని గృహిణులు, రాజకీయ పరిజ్ఞానములేని వనితలు, చదువు సంధ్యలు లేనివారు అక్షరం ముక్క నేర్వని స్త్రీలెందరో స్వాతంత్ర్యోద్యమాన్ని జయప్రదం చేశారు. వారు ధరించిన నగలను మహాత్ముని వడిలో గుమ్మరించి బోసిమెడలతో కదిలినవారు, పవిత్రమైన మంగళసూత్రాలను కూడా ఉద్యమానికి సమర్పించి పసుపుతాడు ధరించారు, సర్వం గాంధీజీకి సమర్పించి వట్టిచేతులతో నిలిచనవారు మరెందరో స్వాతంత్ర్యోద్యమంలో చేరి పగలూ రాత్రీ తెలియక పనిచేశారు. సన్నని వస్త్రాలను వదిలి ముతుక ఖద్దరు కట్టిన ముద్దుగుమ్మలు, ఖద్దరు మూటలు నెత్తిన పెట్టి యింటింటికీ తిరిగి ప్రచారం చేసినవారు, విదేశీ వస్త్రాలను పోగుచేసి భోగిమంటలుగా పేర్చి కాల్చి ఆనందించారు. రాట్నాలు వడికి నూలు తీసిన మహిళలు మరెందరో యమకింకరుల వంటి ఆంగ్ల సిపాయిలకు భయపడక, ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ ఉద్యమం, స్వదేశీ ఉ ద్ యమం, క్విట్ యిండియా ఉద్యమాలు జయప్రదం చేసి జైలుకు వెళ్ళారు. ప్రాణాలకు తెగించి ఆంగ్లేయ ప్రభుత్వాన్ని ఎదిరించినవారు, చంటిపిల్లలను చంకన యిడుకొని జైళ్ళకు నడచారు.లాఠీ దెబ్బలకోర్చి, తుపాకీ గుళ్ళకు భయపడక ఉద్యమాలు నడిపించి ఆంగ్ల ప్రభుత్వాన్ని గడగడలాడించిన మహిళలు ఎందరో. పరాయిపాలకుల దుండగాలను చూసి సహించలేక, వారు పెట్టే బాధలు పడలేక, వారు చేసే అవమానాలు భరించలేక, చావగొట్టి చంపుతుంటే, ఉరి శిక్షలు వేస్తుంటే సహించ లేక, రైతు కూలీలను బండిఎద్దులుగ కట్టించి యావద్భారతం రక్తపుటేరులై పారుతుంటే గుండె చెదిరిపోగా, గాంధీ పిలుపు వేణునాదంలా వినబడితే ఆ పిలుపు వెంట నడిచారు ఆడవారు. స్త్రీ శక్తి స్వరూపిణి. త్యాగమూర్తి. ఓర్పు సహనానికి సహవాసి అని నిరూపించుకున్నారు.

1887లో జరిగిన మొదాటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో వీరవనితయైన ఝాన్సీ లక్ష్మీబాయి పాత్ర కనివిని ఎరుగనిది.అసలు ఆమె తిరుగుబాటు వల్లనే ఆ సంగ్రామం జరిగిందని చెప్పవచ్చు.ఝాన్సీ రాజైన గంగాధరరావు మరణానంతరం అతను చేసుకున్న దాత్తత చెల్లదని బ్రిటీషు వారు ఝాన్సీ కోటను ఆక్రమించుకొనగా లక్ష్మీబాయి ఆ అన్యాయం సహించలేక నిప్పులు కురిపించింది. కత్తి సాము, గుఱ్ఱపు స్వారీ మొదలగు యుద్ధవిద్యలలో ఆరితేరి వున్న గంగాధరరావు భార్య. ఝాన్సీ లక్ష్మీబాయి సైన్యసమీరకణ చేసుకొని ఆంగ్లేయులపై పిరుగుబాటు చేసింది.మరొక పక్క దేశాభిమానం గల ప్రజలు సహకరించారు. మందుగుండు సామానులు, మరఫిరంగులు, తుపాకులు వీరికి లేక పోయినను వీరోచితంగా పోరాడి బ్రిటీష్ పాలకుల గుండెలో చిచ్చురేపి వీరస్వర్గం అలంకరించిన నారీమణి ఝాన్సీ లక్ష్మీబాయి.ఆనాడు స్వతంత్ర రాజ్యాలన్నీ ఏకమై ఝాన్సీ అక్ష్మీబాయిలా తిరుగుబాటు చేసి ఉంటే భారతదేశానికి స్వరాజ్యం ఎప్పుడో వచ్చి వుండేది.

ఈ విధంగా ఈ మొదటి భారత సంగ్రామంలో ఎందరో నారీమణుల వీరోచిత పాత్ర పేర్కొనదగినది. రానురాను బ్రిటీష్ వారి దౌర్జన్యాలు భారత ప్రజలపై పెరిగిపోయాయి. మొదటి ప్రపంచయుద్ధంలో జరిగిన కొన్ని సంఘటనల వల్ల భారతీయులలో రాజకీయ చైతన్యం కలిగింది. 1919లో జలియన్ వాలాబాగ్‌లో జరిగిన హత్యాకాండ నాయకులతో పాటు యావద్భారతీయులను కదిలించి వేసింది. చివరకు నాయకులంతా ఏకమై జాతీయోద్యమాన్ని నడిపించడం మొదలు పెట్టారు. ప్రజలు ఏకమై ఉద్యమాలలో పాల్గొన్నారు. బ్రిటీష్ వారు ఎదిరించి ఎన్ని బాధలు పెట్టినా, లాఠీ ఛార్జీలు చేసినా, జైళ్ళకు పంపినా, సహించి పోరాటం సాగించారు. చివరకు 1947లో భారత దేశాన్ని వదిలి బ్రిటీష్ వారు పారిపోయారు. భారత్ స్వతంత్ర భారతమై వెలిగింది.

ఈ స్వతంత్ర పోరాటంలో ఎందరో మహిళలు పాల్గొన్నారు. స్త్రీ పురుష భేదం లేకుండా పనిచేశారు. ఇది శాంతిపోరాటం. ఆయుధాలు లేవు. అహింస పునాదులపైన నడిచిన పోరాటమిది. దేశభక్తి, త్యాగం,అహింసలే ఇందులో ఆయుధాలు. జాతి సమైక్యత పెట్టుబడి. ఐకమత్యమే మహాబలం అన్న సూక్తి యదార్థమైన పోరాటమిది.

**స్త్రీలలో అంతటి చైతన్యం రావడానికి ఆ రోజులలో అనేక కారణాలున్నాయి.**

1. ఆంగ్లపాలకుల దుండగలు, దౌర్జన్యాలు, అన్యాయాలు, అక్రమాలు.
2. కరువు, కాటకాలు, ఆర్థిక యిబ్బందులు.
3. అప్పటికే రాజారామమోహన్ వంటి వారు సతీసహగమనం వంటి దురాచారాలు ఎదిరించి స్త్రీ చైతన్యానికి పాటుబడుట.
4. వీరేశలింగంపంతులు వంటివారు వితంతు వివాహాన్ని,బాల్య వివాహాన్ని ఎదిరించి స్త్రీ విద్యను ప్రోత్సహించుట.
5. స్త్రీలకు ప్రత్యేక సంస్థలు స్థాపింపబడుట.
6. గాంధీమహాత్ముడు స్త్రీలకిచ్చిన ప్రత్యేకత, స్త్రీ చైతన్యానికి చేసిన సేవ, ఉపన్యాసాలు,సమాజంలో వారి బాధ్యతను తెలియచెప్పుట.
7. స్త్రీలలో ఉద్యామాలపై గలిగిన నమ్మకం. వారిలో దేశసేవకు కలిగిన నూతనోత్సాహం.

దేశమాత సేవలో కర్నూలు నేల బిడ్డలు,సర్వస్వం అర్పించిన మహనీయులు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడినఎందరో వీరులనుగన్న ఘనత కర్నూలు జిల్లాది. తొలిదశలో కత్తులతో కదం తొక్కిన, మలితరంలో అహింసతో ఎదురొడ్డి నిలిచిన ఎందరికో ఈ నేలతల్లి పురుడు పోసింది. 1857 సిపాయిల తిరుగుబాటుకు పూర్వమే ఇక్కడ రైతాంగ పోరాటం జరిగింది.రైతుల కాయకష్టాన్ని దోచుకోవాలని చూసిన ఈస్ట్ ఇండియా కంపెనీపై 1800లో ముత్తుకూరి గౌడప్ప నేతృత్వంలో తిరుగుబాటు చేశారు. ఆ తరువాతి కాలంలో కర్నూలు నవాబు గులాం రసూల్ ఖాన్ ఆంగ్లేయులపై 1839లో యుద్ధ భేరి మోగించారు. 1846-47 కాలంలో మడమ తిప్పని పోరాటం చేసి. ఉరికొయ్యపై వీర మరణం పొందిన యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఈ గడ్డపైనే పుట్టడం గర్వకారణం.

మలితరం సంగ్రామంలో గాంధీజీ చూపిన అహింసా మార్గంలో శాంతియుత ఉద్యమాలు చేసి జైలు జీవితాలను గడిపిన మహనీయులు కూడా ఎందరో ఉన్నారు. గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కాదరాబాద్ నరసింగ రావు,మేడం వెంకయ్యశెట్టి, బియాబానీ, ముచ్చుకోట వెంకట్రామయ్య, వనం శంకర శర్మ, ధరణి రామ చంద్రరావు, నివర్తి వెంకటసుబ్బయ్య, సర్దార్ నాగప్ప, అమరావతమ్మ, యాళ్లూరి స్వామిరెడ్డి, గామాగో, దామోదారం సంజీవయ్య, గుర్రం వెంకటరెడ్డి,పెండేకంటి వెంకట సుబ్బయ్య వంటి మహనీయులు.వీరితో పాటు స్త్రీలు సర్దార్ అమరావతమ్మ,పేరంబోయమ్మ,యలకూరు సుబ్బరత్నమ్మ,ఔకు లక్ష్మాదేవమ్మ,బల్లేకల్లు రామక్క, డా. లక్ష్మీసెహెగల్ వంటివారు బ్రిటీషు వారిని ఎదురించి లాఠీ దెబ్బలు తిన్నవారు. కారాగారాల్లో చిత్రహింసలు అనుభవించారు. తమ ఆస్తులను కూడా పోరాటానికి దారపోశారు.

స్వాతంత్ర్య సంగ్రామంలో స్వాతంత్ర్య సమరయోధులు తమ నిరసనలను దేశవ్యాప్తంగా విస్తరింపజేయుటకు స్వాతంత్ర్య పోరాట నాయకులు ఒక్కొక్క ప్రాంతాన్ని సందర్శిస్తూ అక్కడి ప్రజలను చైతన్యపరుస్తూ, సదస్సులు, సమావేశాలు, చర్చలు నిర్వహిస్తు ముందుకు తీసుకెళ్ళడానికి ప్రాంతాల వారిగా ఆరంబించినప్పుడు, మహాత్మ గాంధీజీ కర్నూలు ప్రాంతం సందర్శించి కర్నూలు ప్రజానికానికి స్వాతంత్ర్య సంగ్రామంకు పిలుపునిచ్చారు. అప్పుడు స్వాతంత్ర్య సంగ్రామంకు విరాళాలుకు జోలిపట్టి ముందుకు

వెళ్ళుతుంటే ఎందరో మహిళా మూర్తులుతమ నగలను దానంగా వేశారు,ఎంతో మంది మహిళలు గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గనడానికి ముందుకు వచ్చారు. ఆ విధంగా ముందుకు వచ్చిన మహిళలను కలుపుకొని స్వతంత్ర్య సంగ్రామానికి కంకణం కట్టుకొన్న కర్నూలు ఆడబిడ్డ సర్దార్ అమరావతమ్మ.

శ్రీ కృష్ణదేవరాయలు ఏలిన నేల, రతనాలసీమ, రాయలసీమ మట్టి గడ్డపై పుట్టిన తెలుగింటి ఆడపులిగా వేటాడటం తెలిసినా, నడుమకి చీర కొంగును చుట్టి,వొడిలో గొడ్డు కారంతో శత్రువుల కళ్ళలోకి కారం చల్లి శత్రువులను పరిగెత్తించ గల్గిన ధైర్యమున్న మహిళ అయినప్పటికీ అహింసతో ఎదురొడ్డక, పోరాటం అనేది అహింస, రక్తపాతం కాదు, మన యొక్క హక్కులు, స్వేచ్ఛకోసం మన స్వరాన్ని, భావాన్ని పరాయి పాలకులకు వినిపించి, మెప్పించి వారిని శాంతియుత మార్గంలోనే దేశ బహిష్కరణ చేయాలనే దృఢసంకల్పంతో శాంతి యుత ఉద్యమ స్ఫూర్తికి నాంది పలికిన మన జాతీయపిత గాంధీజీ మార్గాన్ని ఎన్నుకొని, ఆంగ్లేయులు ప్రవేశ పెట్టిన రైత్వారీవిధానంలో రైతులపై విధించే పన్నులను వ్యతిరేకిస్తూ, తన భర్త సర్దార్ నాగప్పగారి అడుగు జాడల్లో నడుస్తు, పన్ను సత్యాగ్రహంలోనూ, క్విట్ ఇండియా ఉద్యామంలోనూ పాల్గొని, చెయ్యని నేరాలకు శిక్షలు వేస్తున్నా, జరిమానాలు విధించినా బెదరకుండా,పట్టు వదలకుండా,పట్టువదలని మహిళా ధీరోత్తమరాలులైన సతీ అనసూయ, సతీ సావిత్రిలా, పట్టువదలకుండా స్వతంత్ర్య పోరాటంలో ఆంగ్లేయుల యొక్క అరాచకాలకు, వారి వేధింపులకు తలొంచకుండా, భారత దేశపు ఉక్కు మనిషిగా పిలువబడే సర్దార్ వల్లబాయ్ పటేల్ లాగా, సర్దార్ అమరావతమ్మ తెలుగు గడ్డపై తిరుగులేని స్వాతంత్ర్య సమరయోధురాలుగా చరిత్రలో మిగిలి మహిళా లోకానికి ఆదర్శప్రాయురాలైంది.

శ్రీమతి సర్దార్ అమరావతమ్మగారు కర్నూల్ పట్టణ వాస్తవ్యులు. వీరి తండ్రి ఎనుముల అంకన్నగారు. ఈమె తన భర్త సర్దార్ నాగప్పగారితో కలసి వ్యష్టి సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు కర్నూల్ సబ్ జైలులో రెండు మాసాల పాటు అండంటయల్ ప్రిజనర్గా జైలు జీవితం గడిపారు. తదుపరి కోర్టు ఆదేశం మేరకు 25.01.1941 నుండి 10 మాసాల పాటు వెల్లూరు జైలులో కఠిన కారాగారవాస శిక్షను అనుభవించారు. ఆ తదుపరి జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో కూడా పాల్గొని 26.10.1942న అరెస్టయ్యారు. కోర్టు ఆదేశం మేరకు 05.11.1942 నుండి వెల్లూరు జైలులో కఠిన కారాగార శిక్షను అనుభవించారు. వీరి భర్త సర్దార్ నాగప్పగారు కూడా వష్టి సత్యాగ్రహంలో పాల్గొని డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్సు క్రింద 28.11.1940 నుండి వెల్లూరు జైలులో కఠిన కారాగార శిక్షను అనుభవించారు. 250 రూపాయల జరిమానాను కూడా విధించబడింది. జరిమానా చెల్లించని పక్షంలో మరొక ఆరు మాసాలు కారాగార శిక్షను అనుభవించాలని కోర్టు ఆదేశించింది. బళ్లారి, తిరుచునాపల్లి, వెల్లూరు, కన్ననూరు, తంజావూరు జైళ్ళలో శిక్షను అనుభవించారు.

**ఆధార గ్రంథాలు**

1. స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు మహిళలు: డా వాసా ప్రభావతి
2. మరుగునపడిన అభిమానధనులు: బి.హెచ్. రంగారెడ్డి
3. ఆంధ్రలో స్వాతంత్ర్యోద్యమ చరిత్ర : తెలుగు అకాడమి.

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# మహిళా ధీశాలి దువ్వూరి సుబ్బమ్మ

డా॥ వి. వాసవి, వాణిజ్యశాస్త్ర అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు. చరవాణి : 77801 96730.

స్వాతంత్ర్యసాధనాయజ్ఞంలో ఎందరో మహానుభావులు తమ ధన, మాన, ప్రాణాల్ని సమిధులుగా సమర్పించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్భై అయిదు సంవత్సరాలు పూర్తయిన శుభతరుణమిది. ఈ సందర్భంగా దేశంకోసం ప్రాణాలర్పించిన త్యాగధనులను స్మరించుకోవటం మన కర్తవ్యంగా భావిస్తూ స్వాతంత్ర్యసమరంలో దేశబాంధవిగా గుర్తింపుపొందిన శ్రీమతి దువ్వూరి సుబ్బమ్మ పాత్రను, త్యాగాన్ని, వ్యక్తిత్వాన్ని తెలపటమే ఈ పత్ర ఉద్దేశ్యం.

చిన్నచిన్న సమస్యలకే భయపడిపోవటం, లేదా లేని సమస్యను ఊహించుకొని మన స్థైర్యాన్ని కోల్పోవటం నేడు యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. అంతేకాకుండా ప్రస్తుతకాలంలో స్వార్థం విడనాడి, జనహితం కోసం పనిచేయటం, ఉద్యమించడం అనేది ఊహకందని విషయం. తనకు ఎదురైన కష్టాలకు కృంగిపోకుండా, తన జీవితాన్ని చక్కదిద్దుకొని, స్వాతంత్ర్య సముపార్జన కొరకు నిస్వార్థంగా పనిచేసిన మహిళాధీశాలి దువ్వూరి సుబ్బమ్మ. సుబ్బమ్మ యొక్క జీవిత గమనాన్ని, అందులోని వివిధ కోణాల్ని స్మరించటం ఎంతైనా అవసరం.

దువ్వూరి సుబ్బమ్మ జన్మతః సామాన్యమైన వ్యక్తి. ఈమె తూర్పు గోదావరి జిల్లా ద్రాక్షారామం గ్రామంలో 1880లో జన్మించింది. దురదృష్టవశాత్తు చిన్నతనంలో పోలియోవ్యాధి సోకడం వలన ఆమెకు కొద్దిపాటి అంగవైకల్యం ప్రాప్తించింది. ఆమె పాఠశాల విద్యకు నోచుకోలేదు. పైగా తన పదవ ఏటనే బాల్యవివాహమనే దురాచారానికి బలైంది.

సుబ్బమ్మకు పది సంవత్సరాల ప్రాయంలో కడియంవాసియైన దువ్వూరి వెంకటప్పయ్యతో వివాహం జరిగింది. అయితే అనతికాలంలోనే భర్తను కోల్పోయి బాలవితంతువుగా మారింది. ఆ రోజుల్లో వితంతువులు కఠినమైన నియమాలు పాటించాల్సివుండేది. ఈ కారణంచేత ఆమె బాహ్యావతారం పూర్తిగా మారినప్పటికీ కించిత్తు కూడా వెరవకుండా, భర్తకు దూరమయ్యానని, పిల్లలు లేరనే వేదనతో క్రుంగిపోలేదు. చిన్నప్పుడు చేయలేకపోయిన విద్యాభ్యాసంపై దృష్టి నిలిపింది. సంస్కృత ఆంధ్రభాషల్లో గొప్ప విద్వత్తును సంపాదించింది.

గాంధీజీ భారత స్వాతంత్ర్యోద్యమానికి ప్రధాన నాయకుడైన తర్వాత ఆమెపై గాంధీజీ ప్రభావం పడింది. 1921 వరకు ఆమెకు ఎటువంటి రాజకీయాలు తెలియవు. తర్వాత భారత స్వాతంత్ర్యం యొక్క వశ్యకతను గుర్తించింది. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అడుగుపెట్టింది. తన ఉపన్యాసపటిమతో, గంభీరమైన కంఠంతో అనర్గళంగా ఉపన్యసిస్తూ ప్రజలను ఉత్తేజితులను చేసేది.

చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి –

**" భరత ఖండంబు చక్కని పాడియావు**
**హిందువులు లేగదూడలై యేడ్చుచుండ**
**తెల్లవారను గడుసరి గొల్లవారు**
**పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"**

మరియు గరిమెళ్ళ సత్యనారాయణ గారి –

**" మా కొద్దీ తెల్లదొరతనము దేవా**
**మా కొద్దీ తెల్లదొరతనము మా**
**పాణాలపై పొంచి మానాలు హరియించే**
**మా కొద్దీ తెల్లదొరతనము** " అనే గీతాలతో పాటు ఇతర దేశభక్తి గీతాలను కూడా రాగయుక్తంగా, హృద్యంగా పాడుతూ ప్రజల్లో విప్లవాగ్నులను రగిల్చేది.

దువ్వూరి సుబ్బమ్మ యొక్క ఉద్యమ కార్యకలాపాలను అడ్డుకొనే ఉద్దేశ్యంతో ఆంగ్లేయులు ఆమెను అరెస్టుచేశారు. ఆమెకు ఏడాది జైలుశిక్ష ఖరారయింది. ఈ సందర్భంగా ఆమె క్షమాపణ చెపితే జైలుశిక్ష తప్పించుకొనే అవకాశం కలిగింది. అయితే సుబ్బమ్మగారు చాలా ఆత్మాభిమానంతో "నా కాలిగోరు కూడా క్షమాపణ చెప్పడానికి అంగీకరించదు" అని ప్రకటించింది. జాతీయోద్యమ సమయంలో ఆంగ్లేయులకు ఎదురునిలిచి జైలుకు వెళ్ళిన ప్రథమ ఆంధ్రమహిళ దువ్వూరి సుబ్బమ్మే.

గాంధీగారి ఆదేశాలమేరకు సుబ్బమ్మ ఆంధ్రదేశపు నలుమూలలా పర్యటించింది. కాంగ్రెసు కార్యకలాపాలను ప్రచారం చేస్తూ మహిళల కొరకు సభలు, సమావేశాలు ఏర్పాటు చేసింది. మహిళల్లో చైతన్యం నింపే ప్రయత్నం చేసింది దువ్వూరి సుబ్బమ్మ. స్వాతంత్ర్యపోరాటంలో భాగంగా గాంధీ తలపెట్టిన ఉప్పుసత్యాగ్రహం, విదేశీ వస్త్ర బహిష్కరణ, సహాయనిరాకరణోద్యమం, క్విట్ ఇండియా ఉద్యమాలలో తనవంతు పాత్ర పోషించింది. ఖాదీ ఉద్యమాన్ని కొనసాగించారు. నిరంతరం స్వాతంత్ర్య సాధనాపిపాసతో పనిచేస్తున్న ఆమెకు అరెస్టు, జైలుశిక్షలు, లాఠీచార్జీలు జీవితంలో భాగంగా మారిపోయాయి. ఈ రాజకీయ స్వాతంత్ర్య ఉద్యమాలన్నీ ఆమె జీవితగమనంలో ఒక పార్శ్వమైతే, సామాజికసేవ, స్త్రీజనోద్ధరణ పట్ల ఆమె నిబద్ధత ఇంకో పార్శ్వంగా చెప్పవచ్చు. విద్యతోనే మహిళాచైతన్యము సాధ్యమవుతుందని భావించింది. ఆమె ప్రజలనుండి విరాళాలను సేకరించి రాజమండ్రిలో 'సనాతన స్త్రీ విద్యాలయము' పేరిట ఒక మహిళావిద్యాలయాన్ని స్థాపించింది. ఉచితంగా వసతి, భోజనము, విద్యా సౌకర్యాలను కల్పించి ఎందరో స్త్రీలకు మంచి జీవితాన్ని కల్పించారు. స్త్రీవిద్యా ప్రాధాన్యతను గుర్తించి, దానికోసం కృషిసల్పిన ఆమె దార్శనికతకు వందనాలు. 1923లో కాకినాడలో జరిగిన కాంగ్రెసు సభలో సుబ్బమ్మను 'దేశబాంధవి' అనే బిరుదుతో గౌరవించారు. 15 ఏళ్ళపాటు సుబ్బమ్మ ఏఐసిసి సభ్యురాలిగా తన సేవలను అందించారు. తన యావదాస్తిని దేశంకోసం, సంఘంకోసం వెచ్చించిన గొప్ప త్యాగశాలి, దేశభక్తి పరాయణురాలు సుబ్బమ్మ. తన జీవితకాలంలో ఎటువంటి పదవులు, అధికారాలు పొందలేదు. ఇప్పుడమే తప్ప తీసుకోవడం తెలియని కొద్దిమంది ఉద్యమకారులలో సుబ్బమ్మ ఒకరు. తన జీవిత చరమాంకంలో పేదరికాన్ని చవిచూసిన దువ్వూరి సుబ్బమ్మ 31-5-1964లో పరమపదించారు.

ఆంధ్రరాష్ట్ర తొలిమహిళా స్వాతంత్ర్య సమరయోధురాలుగా స్త్రీచైతన్యం కోసం పోరాడింది. సమాజంలోని అంటరానితనం నివారణకోసం పోరాడింది. స్వాతంత్ర్యసాధన సంగ్రామంలో పాల్గొని పలుమార్లు జైలుశిక్ష అనుభవించింది. వీరి సేవలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ తపాలాశాఖ వారు 2021లో 'అంతర్జాతీయ మహిళా దినోత్సవరం' సందర్భంగా దువ్వూరి సుబ్బమ్మ చిత్రముతో కూడిన ప్రత్యేక తపాలా కవరును విడుదల చేశారు. సుబ్బమ్మ జ్ఞాపకార్థం రాజమండ్రి స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో సుబ్బమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రతికూలతకు తలొగ్గని ఒక మహిళాశక్తిని, పోరాట పటిమను ఆంధ్రసమాజానికి పరిచయం చేసిన ధీశాలి, దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మ చిరస్మరణీయురాలు.

**ఆధార గ్రంథాలు :**


1. భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగుస్త్రీలు – డా॥ వాసా ప్రభావతి
2. దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మ – వెబ్ పత్రిక
3. దువ్వూరి సుబ్బమ్మ – వికీపీడియా
4. స్వాతంత్ర్య సమరంలో ఆంధ్రమహిళలు – డా॥ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మరియు అచ్యుతుని గిరిజ.

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమంలో దువ్వూరి సుబ్బమ్మ పాత్ర

డా॥ కె.సుధాకర్, తెలుగు అధ్యయన శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

'దేశ నిర్మాతలు మీరు కాదు, మేము. అభివృద్ధి క్రమంలోని అన్ని దశలలో మా చురుకైన సహకారం లేకుండా మీ కాంగ్రెసులూ, మహాసభలు నిష్ప్రయోజనం. మీ స్త్రీలను విద్యావంతులను చేస్తే చాలు దేశం బాగుపడుతుంది. నిన్నా, నేడూ, రేపూ, మానవ జీవితం ఉన్నంత కాలం ఇది సత్యం. ఉయ్యాలలూపిన చేతులు ప్రపంచాన్ని పరిపాలిస్తాయి –సరోజినీ నాయిడు.

సరోజినాయుడుగారి పై మాటలు అక్షర సత్యాలు, పోరాట పటిమకు నిదర్శనం మహిళ అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. స్వరాజ్యసాధనకు ప్రతిఒక్కరూ ఉద్యమిస్తున్న రోజులవి. గాంధీజీ అహింస, సత్యాగ్రహమనే ఆయుధాలతో స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రారంభిస్తే, ఆయన వెంట నడిచిన వారెందరో ఆనాటి కుటుంబ కట్టుబాట్లను వదిలి బానిసత్వాన్ని పారద్రోలడానికి ఉద్యమంలోకి నడిచిన ధీశాలి, ఆత్మస్థైర్యంతో ఆంగ్లేయులను ఎదిరించి, తన గొంతుకతో స్వాతంత్ర్యోద్యమ కాంక్షను రగిల్చిన ధైర్యనారీ శిరోమణి, దేశం కోసం సర్వస్వం అర్పించిన దేశ బాంధవి దువ్వూరి సుబ్బమ్మగారు.

కంచుకంఠం ఆమె సొంతం. తాను చదువుకోకపోయినా ఎందరో బాలికలకు విద్యనందించిన ధీర వనిత మన దేశ స్వాతంత్ర్యోదమంలో చురుకుగా పాల్గొని జైలుకి వెళ్ళిన మొట్టమొదటి మహిళ. సమాజ సేవిక, స్త్రీ విద్యకు, స్త్రీ జనోద్ధరణకు కృషి చేసిన మహనీయురాలు.

ఆంగ్లేయుల దురాగతాలు, అరాచకాలకు వ్యతరేకంగా, భరతమాత ధాస్యవిముక్తి కోసం ఎందరో స్వరాజ్య సంగ్రామంలో పాల్గొన్నారు. దృఢ సంకల్పంతో ముందుకు సాగారు. ఆ సంగ్రామంలో పురుషులతో పాటు ఎందరో మహిళలు ఉద్యమానికి ఊపిరిగా, ఊతంగా నిలిచారు. ఉద్యమంలో పాల్గొన్న అలనాటి మహిళల్లో ప్రథమ వరుసలో నిలిచే వ్యక్తి దువ్వూరి సుబ్బమ్మగారు. నలుగురు జనం గుడిగూడితే చాలు స్వాతంత్ర్య ఉద్యమం కోసం వాళ్ళల్లో స్ఫూర్తి రగిలించి బ్రిటిష్ బలగాలను వణికించిన అపరకాళి దువ్వూరి సుబ్బమ్మగారు.

ఈమె సనాతన బ్రాహ్మణ కుటుంబంలో 1888సం॥ తూర్పుగోదావరి జిల్లాలోని రామచంద్రాపురం మండలం ద్రాక్షారామంలో, మల్లాది సుబ్బావధానులకు జన్మించింది. చిన్నతనంలోనే దువ్వూరి వెంకటప్పగారితో ఆమెకు బాల్యవివాహం జరిగింది. రాజమండ్రి తాలుకా కడియం గ్రామంలో అత్తింట ఆమె అడుగు పెట్టింది. కొద్దికాలంలోనే భర్త మరణిస్తే బాలవితంతువుగా మారి కృంగిపోయింది. ఈ వైధవ్యం నాటి బ్రాహ్మణ స్త్రీలకు సర్వసాధారణంగా జరిగేదే. ఆ తర్వాత వాళ్ళ జీవితాలు ఇంటి చాకిరీకి పరిమితమై అనామకంగా సాగేవి. భర్త, పిల్లలు లేని ఆ బాధను దిగమింగి, దేశ ప్రజలనే పిల్లలు అని భావించి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనాలనే ఆశయాన్ని సంకల్పంగా తీసుకున్నారు. అప్పటికీ ఆమెకు అక్షరజ్ఞానం లేదు.

తిరుపతి వేంకటకవుల్లో ఒకరు సమీప బంధువైన చెళ్ళ పిళ్ళ వేంకటశాస్త్రి చేరదీసి విద్యాబుద్ధులు నేర్పారు. ఆయన ప్రోత్సాహంతో తెలుగు, సంస్కృత భాషల్లో పట్టు సాధించి గొప్ప వక్తగా మారారు సుబ్బమ్మ. వేంకటశాస్త్రిగారు ఇచ్చిన స్ఫూర్తి ఆమెలో స్వాతంత్రోద్యమం గురించి ఆలోచించేలా చేశాయి. అనేక సభలు, సమావేశాలలో ఆమె పాల్గొన్నారు.

1921 లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ రాజకీయ మహాసభలో మొదటిసారిగా అడుగు పెట్టింది. అప్పటికి ఆమె బాలవితంతువు. నాటి ఆచారాన్ని బట్టి ఆమెకు కేశములు తీసివేసినా, తలకు ముసుగు వేసినా, సంప్రదాయ కట్టుబాట్లను కాదని తన వేషానికి సిగ్గుపడక వేదిక మీదికి వస్తే అక్కడున్న జనం ఆమెను ఆశ్చర్యంగా చూశారు. ప్రకాశం పంతులుగారు ఆ సభకు అధ్యక్షులు బులుసు సాంబ మూర్తి గారు ప్రవేశపెట్టిన సంపూర్ణ స్వరాజ్య తీర్మానాన్ని ఆమె బలపరచడమే కాదు. సభలో ఆమె

గంభీరోపన్యాసం అందర్నీ ఆకట్టుకుంది. స్వరాజ్య సాధనకు మహాత్మాగాంధీ సాగిస్తున్న పోరాటం గురించి తెలుసుకొని ఉప్పొంగిపోయారు. కుటుంబ సభ్యులను ఒప్పించి స్వరాజ్య సమరంలో దూకారు. తన వాక్పటిమతో నారీలోకాన్ని కదిలించారు.

**"ఉరిమింది భరతజాతి......**

**రగిలింది ప్రజాశక్తి.......**

**మోగింది విజయ భేరి.....**

**ఎగిరింది జాతీయ జెండా"** అంటూ ఊరురా తిరిగి ప్రజల్లో స్వాతంత్ర్యోద్యమ కాంక్షను రగిలించారు. దేశ భక్తి గేయాలు, పాటులు పాడుతూ, ఇతిహాసాల్లోని సూక్తులను ఉటంకిస్తూ......సూటిగా చురుగ్గా కరుగ్గా ఆమె ప్రసంగాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేవి. కేవలం సుబ్బమ్మ ప్రసంగం వినడానికే సభకు ఎంతో మంది హాజరువుతుండే వారంటే అతిశయోక్తి కాదు.

ఆమె గొంతెత్తిపాడితే శ్రోతలందరూ కార్యకర్తలైపోయేవారు. మైకులు లేని ఆ రోజుల్లో ఆమెగళం కంచుకంఠమైంది. ఆమె గొంతెత్తి పాడినా, నినాధాలు చేసినా, ప్రసంగించినా ఐదారు వేలమంది పాల్గోన్న సభల్లోనూ,ఎంత దూరంలో ఉన్న వారికైనా ఎంతో స్పష్టంగా వినిపించేది. ఆమె పాట ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చింది. గరిమెళ్ళ సత్యనారాయణ గారి పాట "మాకొద్దీ తెల్లదొరతనం దేవా......."ఆమె పాడినట్లు మరెవరూ పాడలేకపోయేవారు. సుబ్బమ్మ ఉపన్యాసం జనానికి వినిపించకూడదన్న ఉద్దేశంతో బ్రిటిష్ పోలీసులు......ఆమె ప్రసంగిస్తున్న చోటుకు వెళ్ళి డప్పులు, డబ్బాలు కొడుతుండేవారు. ఆగ్రహించిన సుబ్బమ్మ పోలీసులపై విరుచుకు పడేవారు. "నేను గంగాభగీరథ సమానురాలును. నేను తలుచుకుంటే మిమల్మి గంగలో కలిపేయగలను. కానీ గాంధీజీ ఆజ్ఞానుసారం అహింసావ్రతాన్ని పూనాను. నా దగ్గరా మీ కుప్పిగంతులు జాగ్రత్త" అని హెచ్చరించేది. ఆ గర్జన వినగానే వారు నెమ్మదిగా జారుకునేవారు. సుబ్బమ్మ మాట ముక్కుసూటిగా, కరుగ్గా వుండేది. లాఠీలతో వచ్చిన పోలీసులు అదిలించటం, బెదిరించటం ఆమెకు, ఆమె చుట్టురా ఉన్నవారికి వినోద కార్యక్రమంగా ఉండేది. ఆమెను చూసి పోలీసులు భయపడే వారనటంలో అతిశయోక్తి లేదు.

1921 లోనే ఆంధ్రా కాంగ్రెస్ మహిళా విభాగాన్ని ప్రారంభించారు. అప్పట్లోనే తమిళులు తమ పట్ల చూపిసున్న వివక్షతను ఆమె గ్రహించారు. అందు చేతనే మద్రాస్ నుండి ఆంధ్రను వేరుచేయాలని ఆక్షాంక్షించారు. ఈ దిశగా ప్రచారాన్ని చేశారు.

గాంధీజీ తాడేపల్లి గూడెంను దర్శించినపుడు ఆహ్వాన సంఘం వారు కోరిన విధంగా గాంధీజీకి హారతి ఇచ్చి ఆహ్వానించేందుకు పూనుకున్నారు. రాజమండ్రి విద్యార్థినులను తీసుకుని వచ్చి బాపూజీని గౌరవించారు. గాంధీయుగంలోని అన్ని ఉద్యమాలలోను ఈమె నిర్వహించిన పాత్ర అద్వితీయం. తన ఉపన్యాసఝరితో ప్రజలను ఆకట్టుకున్నారు. బాపూజీ అభిమానాన్ని చూరగొన్నారు. ఉద్యమాలలో పాల్గోని ప్రజలను స్వేచ్ఛాదిశగా నడిపించారు. ఆమెను అడ్డుకోవడానికి ఆంగ్లేయులు ఆమెను నిర్బంధించి జైలుకు పంపారు. తప్పు ఒప్పుకుని క్షమాపణ చెబితే నిన్ను వదిలి పెడతాం అన్నాడు బ్రిటిష్ కలెక్టర్. ఆ మాటలను అసహ్యించుకున్న సుబ్బమ్మ "ఛీ........ఛీ......నా కాలిగోరు కూడా ఆ పనిచేయదు అని ధీటైన సమాధానం చెప్పిన ఆత్మాభిమాని.

ఆరు నెలలు పాటు కారాగారంలో గడిపారే గానీ తెల్లదొరలు ఇచ్చిన అవకాశాన్ని అస్సలు వినియోగించుకోలేదు. సుబ్బమ్మ జైల్లో ఉపన్యసిస్తూ పాటలు పాడుతూ ప్రతి ఒక్కరిలో జాతీయ భావాన్ని పెంపొందించేవారు. ఈటెల్లాంటి మాటలతో జైలు అధికారులను హడలెత్తిస్తూ కారాగారంలో ఉన్నవారందరికీ అవసరమైన సదుపాయాలు కల్పించడంలో విజయం సాధించారు.

పొనకా కనకమ్మ, ఉన్నవలక్ష్మిబాయమ్మ మొదలగు వారితో కలిసి పనిచేశారు. పరస్పరం అభిప్రాయాలు తెలుసుకునేవారు. స్వాతంత్ర్య పోరాటంలో మహిళల భాగస్వామ్యాన్ని సుసంపన్నం చేయడానికి, స్త్రీ విద్యాభివృద్ధికి చేపట్టవలసిన కార్యక్రమాలను

గురించి చర్చించుకునేవారు. తన మేన మామ చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారు రాసిన భరత ఖండంబు చక్కని పాడియావు....... పద్యాన్ని రాగ యుక్తంగా పాడుతూ జనంలో స్వాతంత్ర్య జ్వాలరగిలించేది, ప్రజలు దేశభక్తితో ఉప్పొంగే రీతిగా గానం చేసేది. బ్రిటిష్ అధికారులను, పోలీసులను తన సింహగర్జన వంటి స్వరంతో అరిచి కోప్పడి భయభ్రాంతులను చేయడం విశేషం.

1922 జనవరిలో తల పెట్టిన సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గోని భారత,భాగవత పద్యాలు రాగయుక్తంగా చదువుతూ గంభీరోపన్యాసాలు ప్రారంభించింది. ఆంగ్లేయులు ఆమెను భరించలేకపోయారు. కలెక్టర్ ఆమెను రాజమండ్రి సెంట్రల్ జైల్లో పెట్టారు. క్షమాపణ చెబితే వదులుతామన్నారు. ఆమె అంగీకరించలేదు. 100 రూ॥ జరిమానా చెల్లించమన్నాడు. ఆమె తల ముసుగు తీసి చూపించి ఇదే నా దగ్గర ఉందని సమాధానమిచ్చింది. ఆమె ధైర్యానికి కలెక్టర్ సిగ్గుపడ్డాడు.

స్వాతంత్ర్య సమరంలో చురుగ్గా పాల్గోన్న సుబ్బమ్మ మహాత్ముడి స్ఫూర్తితో విదేశీవస్తు బహిష్కరణ ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించారు. తాను ఖద్దరు దుస్తులను ధరించడమే కాకుండా, ఖద్దరు చరఖా మీదనేసి, ఖద్దరు బట్టల మూటను నెత్తిమీద పెట్టుకొని ఊరురా తిరిగి అమ్మిన నిజమైన గాంధేయురాలు.

ఉప్పు సత్యాగ్రహం చేసి అరెస్టయ్యి సంవత్సరం పాటు రాయవెల్లూరు జైల్లో శిక్ష అనుభవించారు. ఆనాటి నుంచి జరిగిన జాతీయోద్యమ ప్రధాన ఘట్టాలన్నింటిలో ఆమె ముందు నిలిచి నాయకత్వం వహించారు. వ్యక్తి సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలో ఆమె జీవితంలో విధానంలో భాగమయ్యాయి.

స్వాతంత్ర్యపోరాట వీరులను బ్రిటిష్ వారు పట్టుకోవడానికి వచ్చినప్పుడు సుబ్బమ్మ రహస్యంగా వంట ఇంటిలో, పొగ గూళ్ళల్లో చాకచక్యంగా దాచి పెట్టి పోలీసు వారి నుండి కాపాడేవారు కొన్నిసార్లు గూఢాచారిగా పోలీసు బలగాలతో కలిసి పోయి ఆ రహస్యాలను కాంగ్రెస్ నాయకులకు చేరవేసిన ధైర్యశాలి.

పోరాట పటిమను ప్రదర్శించిన ఆమెకు కాకినాడలో 1923లో నిర్వహించిన కాంగ్రెస్ సభలో దేశబాంధవి అనే బిరుదును ఇచ్చి గౌరవించారు. స్వాతంత్ర్య పోరాట యోధురాలైన దువ్వూరి సుబ్బమ్మగారు ఆంధ్రాలోనే కాక భారతదేశంలో గొప్ప వనితగా పేరుపొందినది.

అన్ని రంగాల్లోను మహిళలు వెనకబాటుతనానికి ముఖ్యకారణం చదువుకోకపోవడం. చదువుతోనే చైతన్యం సాధ్యమౌతుందని గ్రహించిన ఆమె విరాళాలు సేకరించి స్త్రీలకు విద్య నేర్పింది. ఉచితంగా వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రాజమండ్రిలో "సనాతన స్త్రీ విద్యాలయము" అనే బాలికా పాఠశాలను స్థాపించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు స్వేచ్ఛను పొందండి. ఆనందాన్ని అనుభవించండి. ఈ శుభవేళలో తీపి తినండి అంటూ మిఠాయిలు పంచింది. స్వాతంత్ర్య అనంతరం 16 ఏళ్ళపాటు ఏఐసిసి సభ్యురాలిగా కొనసాగిన ఆమె తన యావదాస్తిని ఉద్యమం కోసమే ధారపోశారు.

చివరి రోజుల్లో తన బంధువైన రామచంద్రాచార్యులు గారికి చెందిన ఒక గదిలో కడియం గ్రామంలో నివాసముండేవారు. జీవిత చరమాంకంలో సుబ్బమ్మను పరామర్శించడానికి 1954లో అప్పటి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారు స్వయానా కడియం గ్రామానికి వెళ్ళారు. అప్పుడు వారి బంధువు 'ఒక కుర్చీని వేయించి ప్రకాశుగారిని కూర్చుండబెట్టారు. అంటే ఆమె ఇంట్లో కనీసం కుర్చీ కూడా లేనంత దీనావస్థను, పేదరికాన్ని అనుభవించారు. ఎటువంటి పదవులను, అధికారాన్ని అందుకోలేదు. ఆమె ప్రకాశంగారితో మాట్లాడుతూ "ఓరేయ్ పంతులు ఎలా ఉందిరా? ఈ నల్లోళ్ళ పరిపాలన అని అడిగిందట". అహర్నిశలూ దేశంకోసమే పరితపించిన ఆమె 1964 మే 31వ తేదిన పరమపదించారు. దేశభక్తురాలిగా ఆమె ధన్యజీవి. ఆమె స్మారకార్థం రాజమండ్రి స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో విగ్రహాన్ని ప్రతిష్టించారు.

దువ్వూరి సుబ్బమ్మగారి జ్ఞాపకార్థం 2021 మార్చి 8వ తేదిన అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఒక ప్రత్యేక తపాలాశాఖ, ఈ కవర్ మీద సుబ్బమ్మగారి విగ్రహం చిత్రాన్ని ముద్రించడం స్త్రీ జాతికే గర్వకారణం.

సంఘసేవకురాలిగా, మహిళ ఉద్యమకారిణిగా, స్వాతంత్ర్యపోరాట యోధురాలిగా, దేశంకోసం పరితపించిన ధీశాలి, దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మగారు యావత్ ప్రజానీకానికి చిరస్మరణీయురాలు.

**ఆధార గ్రంథాలు**

1. మహిళావరణం – ఓల్గా వసంత కన్నాబిరాన్, కల్పన కన్నాబిరాన్.
2. భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు స్త్రీలు – డా॥వాసా ప్రభావతి.
3. నవ తెలంగాణా – (సమగ్ర–తెలుగు దినపత్రిక)–దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మ–మానవి
4. దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మ – పుట్టి నాగలక్ష్మి – సంచిక (తెలుగులో తొలి డైనమిక్ వెబ్ పత్రిక)

# వీరనారి కిత్తూరు చెన్నమ్మ

**పి.వీరేష్,** పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.చరవాణి: 96521 78205

భారతదేశాన్ని ఆంగ్లేయులు దాదాపు రెండువందల సంవత్సరాలు పాలించారు. ఆంగ్లేయుల పాలనా కాలంలో మనదేశ ప్రజలు బానిసలుగా జీవించారు. ఆంగ్లేయులు మనదేశ ప్రజలను వారి అవసరాలకు అనుగుణంగా పనులుచేయించుకోవడం, హింసించడం, వివిధ రకాల పన్నులు విధించి ఎన్నోరకాలుగా ఇబ్బందులకు గురిచేశారు. భారతీయులకు స్వేచ్ఛ లేకుండా చేస్తున్న ఆంగ్ల వలస పాలకులకు వ్యతిరేకంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకోసం సాగిన ఉద్యమమే భారత స్వాతంత్ర్యోద్యమం.

భారతజాతి దాస్య శృంఖాలా నుంచి విముక్తి కోసం ఎందరోమహానుభావులు తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యాగం చేసిన ఫలితమే 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పురుషులతో పాటు ఎందరో వీరనారీమణులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో వీరనారి కిత్తూరు చెన్నమ్మ ఒకరు.

చెన్నమ్మ కన్నడ దేశంలోని బెల్గాం ప్రాంతానికి 5 కి.మీ. దూరంలో ఉన్న కిత్తూరు రాజ్యంలో 1778 అక్టోబర్ 23న జన్మించారు. చెన్నమ్మ తండ్రి కాకతీయ దేశాయి కుటుంబానికి చెందిన ధూళప్ప గౌడరు. చెన్నమ్మను కిత్తూరు పాలకుడైన దేశాయిరాజ కుటుంబికుడైన మల్ల సర్జనతో వివాహం జరిపించారు. చెన్నమ్మ మల్ల సర్జనకు రెండవ భార్య. చెన్నమ్మ చిన్నతనము నుండే గుర్రపుస్వారి, విలువిద్యలలో శిక్షణపొంది, యుద్ధవిద్యలలో ఆరితేరారు. చెన్నమ్మకు ఒక కుమారుడు జన్మించాడు. కాని అనారోగ్యంతో మరణించాడు. అప్పుడు చెన్నమ్మ శివలింగ రుద్రప్ప అనే బాలకుడిని కుమారుడిగా దత్తత తీసుకొని తన వారసుడిగా ప్రకటించింది.

కిత్తూరు రాజ్య చరిత్ర 1586 నుండి ప్రారంభమైంది. బ్రిటీషు ఈస్టు ఇండియా పాలనా పగ్గాలు చేపట్టే సమయానికి దక్షిణ భారతంలో తమ అస్తిత్వాన్ని నిలుపుకొనుటకు దేశాయిలు, హైదరాబాదు నిజాంషాహి, హైదరాలి నడుమ పోరుసల్పుచున్న రోజులలో హైదరాలితో జరిగిన యుద్ధంలో మల్లసర్జన బంధి అయ్యాడు. మల్లసర్జన ఉపాయంతో అక్కడినుండి తప్పించుకొని 1803లో అప్పటి బ్రిటీషు ఇండియాకు చెందిన వెల్లస్లీతో ఒప్పందం చేసుకొనెను. తరువాత 1809లో వేశ్వేకు 1,75,000 రూపాయలిచ్చి స్థానిక బ్రిటీషు ఖర్చులు భరించేలా ఒప్పందం చేసుకున్నాడు. కానీ విశ్వే విశ్వాస ఘాతకానికి ఒడిగట్టి మల్లసర్జనకు మూడు సంవత్సరాలు పూణెలో బందీగా ఉంచెను. 1816లో విడుదలై తిరిగి వచ్చే సమయంలో మార్గమధ్యలో 1817లో మరణిస్తాడు.

చెన్నమ్మ, మల్లసర్జనల దత్తపుత్రుడు శివలింగ రుద్రను టిప్పుసుల్తాను నుండి రక్షించడానికి బ్రిటీషు ఇండియాతో సంవత్సరానికి 1,70,000 కప్పం చెల్లించుటకు చెన్నమ్మ ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం 1824 వరకు కొనసాగింది. 1824 సెప్టెంబరు 11న శివలింగరుద్రప్ప మరణిస్తాడు. శివలింగరుద్రప్ప మరణ సమయానికి భార్య వీరమ్మ వయస్సు పదకొండు సంవత్సరాలు. శివలింగరుద్రప్ప మరాణికి ముందే మాస్తమరణి గౌడరు కుమారుడు శివలింగప్పను దత్తత తీసుకోవడం జరిగుంటుంది. దీనిని అదునుగా తీసుకొని ధార్వాడ కలెక్టర్ థ్యాకరే దత్తతను నిరాకరించి 1824 సెప్టెంబరు 13న కిత్తూరు వచ్చి మల్లప్పసెట్టి, హవేరి వెంకటరావులను అధికారులుగా నియమించి ధనకోశమునకు తాళం వేస్తాడు. దీనిని చెన్నమ్మ ఎదిరిస్తుంది.

శివలింగప్ప వారసత్వాన్ని అంగీకరించి పాలనాధికారం ఇప్పించమని బ్రిటీషు అధికారులను కోరుతుంది. కాని వారు నిరాకరిస్తారు. అప్పుడు చెన్నమ్మ బ్రిటీషు వారి వ్యవహారంతో కోపంగా ఉన్న సంస్థానాలతో సహకారినికై సంప్రదిస్తుంది.

ధార్వాడ కలెక్టర్ సైన్యసమేతంగా 21 అక్టోబర్ 1824న కిత్తూరు వచ్చి యుద్ధం ప్రకటించి ఫిరంగులను పేల్చుటకు

సిద్ధమవ్వగా, కోట ముఖద్వారం తెరుచుకొని బయటికి వచ్చిన చెన్నమ్మ గురుసిద్ధప్ప అను సైన్యాధిపతి నేతృత్వంలో శత్రుసైన్యంపై ఊపిరి సల్పనివ్వకుండా మూకుమ్మడిగా దాడి చేశారు. చెన్నమ్మ అంగరక్షకుని తుపాకీ గుండుకు కలెక్టరు మరణించగా స్టివన్సన్, ఇలియట్ అను బ్రిటీషువారు బందీలుగా చిక్కారు. చెన్నమ్మకు నమ్మకంగా ఉంటూ దేశద్రోహానికి ఒడిగట్టి ఆంగ్లేయులకు సహకరించిన కన్నూరు వీరప్ప, సర్దారుమల్లప్ప కిత్తూరు సైన్యం చేతిలో ప్రాణం పోగొట్టుకుంటారు.

బ్రిటీషు వారు చెన్నమ్మతో ఒప్పందానికి వచ్చినట్లు నటించి కుటిల నీతితో బందీలైన తమ ఇద్దరు బ్రిటీషు అధికారులను 1824 డిసెంబరు 2న విడిపించుకెళ్తారు. బ్రిటీషువారు డిసెంబరు 3న అపార సైన్యంతో కిత్తూరు మీద దాడి చేస్తారు. ఫిరంగులతో కోటగోడలను బద్దలుకొట్టి లోపలికి ప్రవేశిస్తారు. చెన్నమ్మ తన సైన్యంతో కలిసి వీరోచితంగా పోరాడినా చివరకు లొంగిపోక తప్పలేదు. డిసెంబరు 5, 1824న చెన్నమ్మను బందీగా చేసి బైలహొంగలకు తీసుకెళ్తారు. చెన్నమ్మ 4 సంవత్సరాలు బైలహొంగలలో బందీగా ఉండి ఫిబ్రవరి 2, 1829న స్వర్గస్థురాలైనారు. చెన్నమ్మ మరణానంతరం ఆమె సమాధిని బైలహొంగలలో నిర్మించారు. కాని సరైన పర్యవేక్షణ లేనందున సమాధి నేడు శిథిలావస్థకు చేరుకుంది. కిత్తూరురాణి చెన్నమ్మ ఇతిహాసం ఆధారంగా కన్నడంలో బి.రామకృష్ణయ్య పంతులు దర్శకత్వం 1962లో కిత్తూరు చెన్నమ్మ పేరుతో సినిమా వచ్చింది. కిత్తూరు చెన్నమ్మ పేరు మీద జానపద రీతిలో బల్లడ, లావణి, గిగిపద గేయాలు జనప్రాచుర్యంలో ఉన్నాయి.

ఈ విధంగా బాల్యంలోనే యుద్ధవిద్యలు నేర్చి, కిత్తూరు ప్రాంతానికి రాణిగా సేవలందించి, రాణి చెన్నమ్మగా ఆంగ్లేయులను ఎదిరించి పోరాడి, తొలిపోరాటంలో గెలిచి, మలిపోరాటంలో ఆంగ్లేయులు చేసిన కుట్రలకు ఓడి, బందీ అయి మాతృభూమికై ప్రాణాలు అర్పించిన కిత్తూరు చెన్నమ్మ దేశభక్తి అపారమైనది. 19వ శతాబ్ది తొలి దశాబ్దాలలో పురుషులు కూడా బ్రిటీషు వారికి లొంగిపోతున్న సమయంలో భయపడకుండా ధైర్యంగా తన సైన్యంతో బ్రిటీష్ కలెక్టర్‌ని హతమార్చిన సైన్యానికి నాయకత్వం వహించడం, ధీరురాలిగా పోరాటం జరపడం అగ్రరూపం, అసామాన్యం, అద్భుతమైన చారిత్రక విశేషం. దీనిని బట్టి చూస్తే కిత్తూరు రాణి చెన్నమ్మను వీరనారి అనడం అతిశయోక్తికాదు. రాణి కిత్తూరు చెన్నమ్మ ధైర్య సాహసాలకు, పోరాటపటిమకు గుర్తుగా భారత ప్రభుత్వం ఆమె విగ్రహాన్ని పార్లమెంట్ ప్రాంగణంలో 2007 సెప్టెంబరు 1న అప్పటి భారత ప్రథమ మహిళా రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ ఆవిష్కరించారు. అంతేకాదు కర్నాటక రాష్ట్రంలో ఆమె విగ్రహాలను బెంగుళూరు, కిత్తూరు నగరాలలో ప్రతిష్ఠించారు. భారతప్రభుత్వం 1997 అక్టోబరు 23న రాణి కిత్తూరు చెన్నమ్మ స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసింది. బెంగుళూరు మరియు మిరాజ్‌లను కలుపుతున్న భారతీయ రైల్వే రైలు రాణిచెన్నమ్మ ఎక్స్‌ప్రెస్‌కు ఆమె పేరు పెట్టారు. ఆమె గౌరవార్థం బెలగావిలోని రాణి చెన్నమ్మ విశ్వవిద్యాలయం పేరు పెట్టబడింది.

**ఆధార గ్రంథాలు**

1. దక్షిణ భారత తిరుగుబాట్లు : 1800కి ముందు మరియు తరువాత – గోపాలకృష్ణన్, సుబ్రమణియన్ (సంపాదకులు), 2007.

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# భారత మహిళా రత్నం – డాక్టర్ ముత్తు లక్ష్మి

డాక్టర్. జి. తిరుమల వాసు దేవ రావు, చరిత్ర శాఖ అధ్యక్షులు, ప్రభుత్వ డిగ్రీ & పీజీ కళాశాల, పుత్తూరు.

సంక్షిప్త పరిచయం: మహిళల పట్ల వివక్షతతో కూడుకున్న సామాజిక వ్యవస్థను సంస్కరించడం స్వాతంత్రోద్యమంలో అత్యంత ఆవశ్యకమని దేశ నాయకులు భావించారు. ఇందులో భాగంగానే మహిళల అంతస్తును దెబ్బతీస్తున్న అనేక సాంఘిక దురాచారాలను నిర్మూలన చేయడానికి కృషి జరిగింది. మానవ నాగరికతలో ప్రారంభ కాలంలో స్త్రీ పురుషులు సమాన హోదాను అనుభవించినా, కాలక్రమంలో గుర్రపు స్వారీ, నాగలి లాంటి ఆవిష్కరణలు మహిళల సామాజిక స్థాయి దిగజార్చే వేశాయి. ఆకాశంలో సగమని మహిళలు ఆక్రోశిస్తున్నా, అన్ని రంగాలలో మహిళలు వివక్షను ఎదుర్కొంటున్నారు. సంప్రదాయక పితృస్వామ్యం భూస్వామ్య వ్యవస్థగల భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మహిళలను రెండవ తరగతి పౌరులుగా పరిగణించబడ్డారు. మన దేశంపై జరిగిన విదేశీ దండయాత్రలు, ప్రకృతి వైపరీత్యాల వలన నిరంతరం ఏర్పడిన కరువు కాటకాలు మహిళల పరిస్థితి మరింత దిగజార్చాయి.

ఒక దేశం యొక్క అభివృద్ధినీ ఆ దేశంలోని మహిళల స్థాయిని ఆధారంగా లెక్కిస్తారు. దేశజనాభాలో సగభాగంగా ఉన్న మహిళలు అభివృద్ధి సాధించినదే దేశాభివృద్ధి వీలుపడదని దేశభక్తులు గ్రహించారు. మేధావులైన వీరి నిరంతర కృషి ఫలితంగా భారతదేశంలో మహిళల అభ్యున్నతికి బలమైన ప్రయత్నాలు జరిగాయి. వీరిలో మహిళామణులు ఉన్నారు. ఈ మహిళల్లో ప్రముఖులు డాక్టర్ ముత్తులక్ష్మి గారు.

భారత రాజకీయ రంగంలో తొలినాళ్లలో ఎదిగిన ధ్రువ తారలుగా వెలిగిన అనీబిసెంట్ గారు, సరోజినీ దేవి గారు. భారత మహిళలకు ఆదర్శమూర్తులుగా నిలిచారు. వీరిద్వారా స్ఫూర్తిని పొంది భారత సామాజిక రాజకీయ రంగాలలో అత్యున్నత హోదాలను అధిరోహించిన భారత మహిళారత్నం డాక్టర్ ముత్తులక్ష్మి గారు.

సామాజిక వివక్షకు గురయ్యే దేవదాసి వర్గంలో డాక్టర్ ముత్తు లక్ష్మి గారు జూలై 30, 1886న జన్మించారు. సామాజిక ప్రతిఘటనను ఎదుర్కొంటూ, అవమానాలను సహిస్తూ పాఠశాలలో ఉన్నత ప్రతిభను కనపరుస్తూ మద్రాసు వైద్య కళాశాలలో వైద్యవిద్యను 1907లో పూర్తి చేశారు. శస్త్రచికిత్స విభాగంలో నూటికి నూరు మార్కులు సాధించిన మొదటి విద్యార్థినిగా, అరుదైన ప్రతిభావంతురాలుగా నిలిచింది. ఆమె మద్రాసులోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో మొదటి మహిళా హౌస్ సర్జన్ అయ్యారు.

ముత్తు లక్ష్మీ గారు చిన్నవయసు నుండి సామాజిక అసమానతలపై తిరుగులేని యుద్ధం ప్రకటించారు. సమాజంలో వివక్షకు గురవుతున్న వర్గాల సముద్ధరణకు తన జీవితాన్ని అంకితం చేయాలని డాక్టర్ ముత్తులక్ష్మి గారు భావించారు. వీరికి రాజకీయ చైతన్యం కూడా ఎక్కువే. నాయకత్వ లక్షణాలు పుష్కలంగా ఉండేవి. డాక్టర్ ముత్తు లక్ష్మి గారి రాజకీయ ఆలోచనలను అనిబిసెంట్ గారు సరోజినీ దేవి గారు విద్యార్థి దశ నుండి ప్రభావితం చేశారు. ముత్తు లక్ష్మి గారికి వీటి తో పరిచయము మరియు మంచి స్నేహం ఉన్నాయి.

జాతీయత మతంతో సంబంధం లేకుండా మహిళల సమస్యలు మరియు సామాజిక రుగ్మతలపై మహిళా సభ్యులు కృషి చేయడానికి ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలి జ్ఞాన జీవులైన కొంతమంది మహిళలు చేసిన ప్రయత్నాల ఫలితంగా 1917 మే 8వ తేదీన, మద్రాసులోని అడయార్ లో మార్గరెట్ కజిన్స్ చేత "ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్" స్థాపించబడింది. వ్యవస్థాపక సభ్యులుగా అంబుజమ్మాళ్, కమలాదేవి చటోపాధ్యాయ, మేరీ పూనెన్ లూకోస్, బేగం హస్రత్ మోహని, సరళాబాయి నాయక్, ధన్వంతి రామారావు, ముత్తులక్ష్మి, మంగళమ్మాళ్ సదాసివియర్, హేరాబాయి టాటా ఉన్నారు. దీని మొదటి అధ్యక్షురాలు గా అనిబిసెంట్ గారు పని చేశారు. ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్ తన ఆదర్శాలు, నమ్మకాలను వినిపించడానికి "స్త్రీ ధర్మం" అన్న పత్రికను ప్రచురించేది. ఈ సంస్థలో డాక్టర్ ముత్తులక్ష్మి గారు క్రియాశీలమైన సభ్యురాలిగా ఉంటూ, నిర్వహణ బాధ్యతలు చూస్తుంటే వాళ్లు.

ఉన్నత విద్యను అభ్యసించడానికి లండన్ వెళ్లిన ముత్తులక్ష్మి గారు మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్లో ప్రవేశించమని మహిళా భారతీయ సంఘం చేసిన అభ్యర్థనకు ప్రతిస్పందనగా ఆమె వైద్యరంగంలో ఉన్నత విద్యను వదులుకుంది. మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్లో పోటీ చేయడానికి భారతదేశానికి తిరిగి వచ్చారు. ఈ విధంగా 1927లో శాసనమండలిలో మొదటి మహిళా సభ్యురాలిగా ఎన్నిక కాబడిన ముత్తు లక్ష్మి గారు తమకు వచ్చిన ప్రతి అవకాశాన్ని భారతీయ మహిళల జీవితాలను మెరుగుపరచడానికి ఉపయోగించుకున్నారు. శాసన మండలి డిప్యూటీ ఛైర్ పర్సన్‌గా ఎన్నికయ్యాక, చట్టసభల ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన ప్రపంచంలోనే తొలి మహిళగా గుర్తింపు పొందారు.

కాలక్రమంలో డాక్టర్ ముత్తులక్ష్మి రాజకీయ భావాలపై గాంధీ గారి ప్రభావం మనం గమనించవచ్చు. 1930లో మహాత్మా గాంధీని బ్రిటిష్ ప్రభుత్వం నిర్బంధించినందుకు నిరసనగా తన మద్రాసు శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. గాంధీ గారు ముత్తులక్ష్మిగారి మేధాశక్తిని, చురుకుదనాన్ని, కార్యదక్షతను, అంకితభావానికి ,సేవాదృక్పథాన్ని, ఎంతో అభిమానించారు. ముత్తులక్ష్మి గారు దేవదాసీ నిషేధ చట్టాన్ని రూపొందించి మద్రాసు శాసనసభలో ప్రవేశపెట్టినప్పుడు ఈ చట్టానికి న్యాయపరమైన ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ సందర్భంగా ముత్తులక్ష్మి గారు గాంధీగారి సహకారంకోరుతూ ఉత్తరం రాశారు.

దీనికి గాంధీ స్పందిస్తూ మతంపేరుతో జరుగుతున్న ఇటువంటి అనైతిక కార్యక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించగూడదు అని, ఇప్పటికే ఈ అంశంపై చాలా ఆలస్యం జరిగిందని, మద్రాసు శాసనసభలోని కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు ఈ అంశంపై ముత్తు లక్ష్మి గారికి పూర్తి సహకారాన్ని అందించాలని ఆదేశించారు. ఈ ఉత్తరప్రత్యుత్తరాలు గాంధీ గారి "యంగ్ ఇండియా" పత్రికలో ప్రచురించబడినాయి.

దక్షిణ భారతదేశంలో అప్పట్లో విస్తృతంగా వ్యాపించిఉన్న దేవదాసీ వ్యవస్థను తొలగించడానికి శాసన సభలో ఆమె తీవ్రమైన ప్రయత్నాలు చేశారు. అనాథలైన దేవదాసీ బాలికల కొరకు "అవ్వాయి హోమ్" అనే వసతి గృహాలను ఏర్పాటు చేశారు. ముత్తులక్ష్మి గారు మహిళల అంతస్తును తక్కువ చేసే దేవదాసీ వ్యవస్థను నిర్మూలించడానికి తన నిరంతర కృషిద్వారా దేవదాసీ వ్యవస్థ నిషేధ చట్టాన్ని 1947 డిసెంబర్ 5వ తేదీన ఉమ్మడి మద్రాసు రాష్ట్రప్రభుత్వంచేత ఆమోదింపజేశారు. మతపరమైన వ్యభిచారాన్ని నిషేధించడంలో వీరి కృషి చిరస్మరణీయమైనది.

అదేవిధంగా వివాహ కనీస వయస్సును అబ్బాయిలకు కనీసం 21, బాలికలకు 16 ఏళ్లకు పెంచాలని ఆమె ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. మహిళలకు ఓటు హక్కు, వివాహ వయోపరిమితి పెంపు, పాఠశాల విద్యార్థులకు పరీక్షలు వైద్య పరీక్షలు, చిన్న పిల్లలకు ప్రత్యేక ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని, ఉద్యోగ ప్రదేశాలలో మహిళా ఉద్యోగులకు విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు లాంటి సౌకర్యాల కొరకు తీవ్రంగా ప్రయత్నించారు.

1935లో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు మెరుగైన చికిత్సను అందించడానికి ఆధునిక వైద్యశాల మద్రాసు నగరంలో ఏర్పాటు చేయాలని ముత్తులక్ష్మి గారు, అనితర సాధ్యమైన కృషి చేసి 1952లో భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూచేత అడయార్ క్యాన్సర్ ఇన్స్టిట్యూషన్ కు శంకుస్థాపన చేయించి, ఆసుపత్రి నిర్మాణాన్ని శరవేగంగా పూర్తిచేసింది. ఆస్పత్రి 18 జూన్ 1954 నుండి పనిచేయడం ప్రారంభించి, దేశంలో రెండవ అతిపెద్ద క్యాన్సర్ ఆసుపత్రిగా గుర్తింపు పొందింది.

సమాజానికి ఆమె చేసిన లెక్కలేనన్ని సేవలకు ఆమెకు పద్మ పురస్కారం లభించింది. 81 ఏళ్ల వయసులో ముత్తులక్ష్మి 1968లో కన్నుమూశారు. 1956 లో భారత ప్రభుత్వం డాక్టర్ ముత్తు లక్ష్మీ గారి విశిష్ట సేవలను గుర్తిస్తూ పద్మవిభూషణ్‌తో సత్కరించింది.

సర్జన్, విద్యావేత్త, సంఘ సంస్కర్త మరెన్నో. డాక్టర్ ముత్తులక్ష్మి బహుముఖ ప్రజ్ఞాశాలి. మహిళల హక్కుల ప్రచారకర్త. లక్ష్మీగారి గౌరవార్థం తమిళనాడు ప్రభుత్వం వీరి జన్మదినమైన జూలై 30వ తేదీని "హాస్పిటల్ డే"గా నిర్వహిస్తున్నది. భారతదేశపు మొట్టమొదటి మహిళా శాసనసభ్యురాలు, భారతదేశంలోని మొదటి మహిళా వైద్యుల్లో ఒకరైన డాక్టర్ ముత్తులక్ష్మిని ప్రముఖ

ఇంటర్నెట్ సెర్చ్ ఇంజన్ గూగుల్ "గూగుల్ డూడుల్" ద్వారా ఆమె 133వ జయంతి సందర్భంగా సత్కరించింది.

**ముగింపు :** భారత సామాజిక, రాజకీయ రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం కొరకు మొదటి తరం మహిళా నాయకులు బలమైన పునాదులు వేశారు. పునాదుల ఆధారంగానే నవభారతంలో మహిళలస్థానం నిర్దేశింపబడిఉంది.

**సంప్రదింపు గ్రంథాలు :**

1. ఆధునిక భారతదేశ సామాజిక చరిత్ర - తెలుగు అకాడమీ.
2. గాంధీ గారి ఆంధ్ర పర్యటన . (కొడాలి ఆంజనేయులు)- తెలుగు అకాడమీ.
3. డాక్టర్ ముత్తులక్ష్మి - వికీపీడియా.
4. సుదర్కోడి, (1997). "ది ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్ అండ్ ది ఎమాన్సిపేషన్ ఆఫ్ ఉమెన్ ఇన్ ది మద్రాస్ ప్రెసిడెన్సీ". ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ యొక్క ప్రొసీడింగ్స్. 742–743.
5. కె. బ్రూమ్, సారా (2012). స్త్రీ-ధర్మ: భారతీయ మహిళల హక్కుల ఉద్యమం యొక్క వాయిస్ 1928–1936 (థీసిస్). జార్జియా స్టేట్ యూనివర్శిటీ.
6. రెడ్డి, ఎస్. ముత్తులక్ష్మి (2015–08–14) - (ఆగస్టు 15, 1947) "మహిళల విముక్తి", ది హిందూ.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# ఉన్నవ లక్ష్మీబాయమ్మ

**సంక్రాంతి రాజేంద్రుడు**, తెలుగు సహాయాచార్యులు, యస్.వి.ఎ. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తి

ఆంధ్రదేశచరిత్రలో 19వశతాబ్దం సువర్ణాక్షరాలతో రాయదగింది. ఎందుకంటే ఎందరో దేశభక్తులు సంఘసంస్కర్తలు, మరెందరో విజ్ఞాన వేత్తలూ తత్వవేత్తలు మన రాష్ట్రంలో జన్మంచి ఆంధ్రుల గౌరవాన్ని,భారత జాతి విశిష్టతను. దిగంతాలవరకు చాటారు. వారిలో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గని ధన,మాన, ప్రాణాలను త్యాగం చేసిన దేశభక్తులు ఎంతో మంది ఉన్నారు.

స్వాతంత్ర్యం కోసం పోరాటమంటే కేవలం బ్రిటిష్‌వారితో యుద్ధం చేయటమే కాదు. ప్రజలలో విద్య,ధర్మం నీతి, సంఘం పట్ల చైతన్యం కలిగించటం కూడా ! ఇదే ఆలోచనలతో,ఆంధ్రరాష్ట్ర స్వాతంత్రోద్యమం.సంఘసంస్కరణ. స్త్రీ విధ్యావ్యాప్తి వలన ప్రజల ఆలోచనలను రేకెత్తించాయి. ముఖ్యంగా స్త్రీలు విద్య,రాజకీయ, సామాజిక రంగాలలో తమ ప్రతిభను చాటారు. అలాంటి ఉన్నతమైన భావాల వైపుగా స్త్రీలను చైతన్యపరచిన మహిళారత్నం శ్రీమతి ఉన్నవ లక్ష్మీభాయమ్మ.

**జననం** : లక్ష్మీబాయమ్మ గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకా లోని అమీనాబాద్ అనే గ్రామంలో జన్మించారు. పదేళ్ళ వయస్సులోనే ఉన్నవ లక్ష్మీనారాయణ గారితో వివాహం జరిగింది. ఈదంపతులు గుంటూరు జిల్లాలోని పల్నాటి సీమను. కొండవీటిరాజులేలిన భూమి, అచట పుట్టిన చిగురుకొమ్మైన చేవకల్గి ఉంటుందట. ఆ గడ్డపై రామలక్ష్మమ్మ నడింపల్లి సీతా రామయ్యలకు లక్ష్మీభాయమ్మ జన్మించింది.

**వివాహం** : ఉన్నత భావాలు విశిష్టవ్యక్తిత్వం కలిగిన. ఉన్నవ లక్ష్మీనారాయణ గారితో 10సం॥రాల వయస్సులో వివాహం జరిగింది. వీరు ఉన్నవ దంపతులుగా జాతీయోద్యమంలో అడుగుపెట్టారు.

**జాతీయోద్యమంలో పాత్ర** : డా॥ బి. అనిబిసెంటును బ్రిటిష్‌వారు నిర్బంధించినపుడు స్త్రీలు, అనేక చోట్ల నిరసన సభలు నిర్వహించారు. పల్నాడులో పుల్లరి సత్యాగ్రహం సహాయ నిరాకరణోద్యమంలో ప్రధాన ఘట్టము. ఇక్కడ అటవీప్రాంతం ఎక్కువ గనుక ప్రజలు పశువులను తోలుకుని పోయేవారు. అక్కడ నుండి ఎండుకట్టెలు తెచ్చుకునేవారు. ఇందుకు రెవెన్యూ శాఖవారు ప్రజలపై పన్నుభారం మోపారు. పన్నుకట్టని వారిని బందెల దొడ్లోకి తోలి బంధించి హింసించేవారు. అరెస్టు అయిన వారిని విడుదల చేయమని అడిగిన వారిపై పోలీసులు కాల్పులు జరిపేవారు.దీనిని అడ్డుకున్న వారినిసైతం అరెస్టు చేసేవారు.అలా అరెస్టు కాబడినవారిలో ఉన్నవ లక్ష్మీనారాయణ, మాడభూషి మొదలైన వారున్నారు. వారిని విడుదల చేయాలని ఉన్నవ లక్ష్మీభాయమ్మ నాయకత్వంలో తీవ్ర నిరసన ప్రకటించి వారిని తీసుకుని వెళ్ళే రైలును కూడ కదలనివ్వ లేదు . ఈవిషయాన్ని ఆంధ్రపత్రిక 1921 ఆగస్టు 17న ఈవిధంగా రాసింది. "గుంటూరు ఉన్నవ సతీమణి ఆధ్వర్యంలో వందల్లో స్త్రీలు స్పందించిన విధంచూస్తే వారి కోమల హస్తాలతో స్వరాజ్యరథము నడిపించగలరని ప్రజాశక్తి అనర్గళంగా ప్రవహించగలదని భావము కల్గింది."

ఆ తరువాత విదేశ వస్త్ర బహిష్కారం ఖాదీ ఉద్యమంతో మొదలైన సహాయ నిరాకరణ ఉద్యమాల్లో లక్ష్మీభాయమ్మ ముందుండేది. హరిజనులను ఆదరించింది. అంటరాని తనాన్ని తొలగించటానికి కృషిచేసి, మానవులంతా ఒక్కటే అందరిదీ ఒకే మతం. అదే మానవతా మతం అంటూ ఎంతో ఉద్వేగంగా ప్రభోధించింది. ఇటు ఒకవైపు సంస్కరణలకోసం, మరోవైపు స్వాతంత్రోద్యమ పనుల్లో పట్టువదలకుండా శ్రమించింది. 1923లో కాకినాడలో కాంగ్రెసు మహాసభలు జరిగాయి. ఆంధ్రదేశమంతటినుండి విశేషంగా స్త్రీలు ఆ సభలకు వచ్చారు. ఆ అశేషప్రజానీకాన్ని ఆకర్షించేలా లక్ష్మీభాయమ్మ ఉపన్యసించింది. ఆమె స్ఫూర్తితో ఎందరో జాతీయోద్యంవైపు కదిలారు.

గాంధీగారు 1930లో దండి ఉప్పుసత్యాగ్రహం మొదలుపెట్టారు. దీంతో ఆంధ్రదేశంలో గుంటూరు కోనేటి వద్ద వందల మంది సత్యాగ్రహలకు ఉన్నవ లక్ష్మీబాయమ్మ, కొండా వెంకటప్పయ్య గారు వీరకంకణాలు కట్టారు.

లక్ష్మీబాయమ్మ స్త్రీలకు నాయకురాలుగా వుండి దేవరంపాడు శిబిరానికి ప్రాతినిధ్యం వహించింది. పోలీసులు మూడుసార్లు ఈశిబిరాన్ని చుట్టిముట్టినా స్త్రీలు భయపడక ధైర్యంగా వారిని ఎదుర్కొన్నారు. లక్ష్మీభాయమ్మ కృషి ఫలించింది. అంతటితో ఆగకుండా సహాయనిరాకరణోద్యమ బాధ్యతను తన భుజాలపై తీసుకుని పల్లెపల్లెకు తిరిగి కాంగ్రెసు ప్రచారాన్ని, జాతీయోద్యమ ప్రచారాన్ని చేసింది. కాంగ్రెసుకు మహిళా వాలంటీర్లను తయారుచేసింది.

**శారదానికేతన్**: 1918లో ఉన్నవ లక్ష్మీభాయమ్మ, దేశభక్త కొండా వెంకటప్పయ్య గారి ఇంట్లో వయోజనులైన స్త్రీలకు తీరిక సమయములలో విద్యాబోధన, చేతిపనులు నేర్పేందుకు ఒక పాఠశాలను ప్రారంభించారు. ఆ పాఠశాల కాలక్రమంగా శారదాని కేతనంగా రూపుదిద్దుకున్నది. శారదానికేతన్ ఎందరో బాలవితంతువులకు ఆశ్రయం ఇచ్చింది. కుట్లు అల్లికలు, జరీ నగీషీ పనులు నూలు వడకడం చేతిపని, సవారు చెయ్యటం, బుట్టల అల్లిక మొదలైన పనులు నేర్పేవారు. ప్రభుత్వసాయం లేకున్నా ప్రజల ఆదరణ వలన శారదానికేతన్ వేగంగా అభివృద్ధి చెందింది. ఇక్కడ స్త్రీల ప్రవర్తన, పనితనం అన్నింటినీ లక్ష్మీభాయమ్మ స్వయంగా చూసుకునేది.

ఇక్కడ శిక్షణ పూర్తయిన వారు ప్రభుత్వ పరీక్షలకు పంపేవారు. స్త్రీలు స్వంత శక్తితో ఉన్నతంగా బతకాలని ఆమె ఆశయం. ఆ ఆశయాలకు అనుగుణంగా స్త్రీలు జీవితాలను బాగుపరచుకోవటమేగాక, స్వాతంత్ర్యఉద్యమంలో కూడ పాల్గొనేవారు, వారిలో సంగం లక్ష్మీబాయి, మాగంటి అన్నపూర్ణదేవిలాంటి స్త్రీ సంస్కర్తలు శారదానికేతన్ ద్వారానే విద్యావంతులయి స్వాతంత్రసమరంలో సమిధలయ్యారు.

లక్ష్మీబాయమ్మ గొప్ప ఉపన్యాసకురాలు. ఒకసారి విశాఖపట్నం మెడికల్ కాలేజీలో ఒక ఉపన్యాసం చేశారు. అక్కడ ఆమె మాటలు ఏం మంత్రం వేశాయోగాని మర్నాడు ఆ మెడికల్ కాలేజీ విద్యార్థులందరూ గాంధీ టోపీలు ధరించి కాలేజీకి వచ్చారట.

**సంస్కరణలు**: సమాజంలోని దురాచారాల నిర్మూలనకే గాక, జంతుబలులు తొలిగించటానికి ప్రయత్నించింది. మూగజీవుల మీద ఆమెకెంతో ప్రేమ,దయ,జాలి. ముందు నన్ను బలి ఇవ్వండి తరువాత జంతువులను బలి ఇవ్వండి అని అడ్డుపడేవారు. ఎంతో మంది బాల వితంతువులు వారింటికి వచ్చేవారు. లక్ష్మీభాయమ్మ వారికి రవికెలు ఇచ్చి, పెళ్ళి ప్రయ త్నాలు చేసి వివాహాలు చేసేవారు. ఈ కారణంగా ఊరంతా వీరిని వెలివేశారు. పుట్టింటి వారుకూడ ఇలాంటి ప్రయత్నం చేయద్దని ఒత్తిడి తెచ్చారు. అయినా లక్ష్మీభాయమ్మ భయపడలేదు. గాంధీ స్ఫూర్తితో ఖద్దరు వస్త్రాలు ధరించి, విదేశవస్తువులు బహిష్కరించి, జాతియోద్యమంలో బంగారునగలు ధరించనని ప్రమాణం చేశారు.

ఒకసారి విజయవాడలో జరిగిన ఒక సాహిత్య సభలో ఒక ప్రసిద్ధికవి గాయకుడు, పండిత శిల్పులను ప్రస్తుతిస్తూ ఉపన్యాసం చేసి ముగించాక లక్ష్మీభాయమ్మ కోపంతో ఊగిపోతూ, ఏం ఉపన్యాసమయ్యా ఇదీ! ఒక స్త్రీ పేరు కూడా చెప్పలేదేం? తెలుగు స్త్రీలలో పండితులు లేరా? చిత్రకారిణులు లేరా? ఆంధ్రనారీలోకం అంత గొడ్డు పోయి లేదు. ఈ సభలో పాల్గొనుట మాకు మర్యాదగా లేదని, సభనుంచి బయటకు వచ్చేశారు.

అటు జాతీయోద్యమంలోను, ఇటు సంఘ సంస్కరణ లోను అవిశ్రాంతంగా పనిచేసిన లక్ష్మీబాయమ్మ 1952 ఫిబ్రవరి 28న స్వర్గస్తులైనారు. ఆమె మార్గంలో మహిళలెందరో ఉన్నారు. అందుకే లక్ష్మీభాయమ్మ మహిళల్లో మణిపూస.

**ఆధారగ్రంథాలు :**

1. రాష్ట్ర విధ్యా పరిశోధన శిక్షణ సంస్థ.
2. 6వ తరగతి “తెలుగు కుసుమాలు” పాఠ్యపుస్తకం ఆధారంగా.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# భారతనారీ చైతన్యస్ఫూర్తి "సరోజినీదేవి"

**డా॥ గుమ్మనూరు ఉషారాణి**, ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, తెలుగు శాఖాధ్యక్షులు, శ్రీమతి ఎన్.పి. సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల, చిత్తూరు. చరవాణి : 99082 75001.
**డా॥ ఎస్. షంషాత్కర్**, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ హిందీ, శ్రీమతి ఎన్.పి. సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల, చిత్తూరు - 517 002. (ఆం.ప్ర).

భారతదేశచరిత్రలో "స్వాతంత్ర్యోద్యమం" అత్యంత ప్రధానఘట్టం. బ్రిటీష్‌ప్రభుత్వ బానిససంకెళ్ళనుండి భరతమాతకు విముక్తికలిగించే క్రమంలో జరిగిన వివిధ ఉద్యమాలలో పురుషులతో పాటు మహిళలు సైతం అవిశ్రాంతంగా మడమతిప్పక అహర్నిశలు "సహనమూర్తి" అన్న పేరును సార్థకం చేసుకుంటూ అప్రతిహతంగా పోరాటం చేశారు. ఝాన్సీ లక్ష్మీబాయి, దుర్గాబాయి దేశ్‌ముఖ్, సావిత్రీబాయి పూలే, విజయలక్ష్మీ పండిట్, కస్తూరిబా గాంధీ, అమ్ముకుట్టి స్వామినాథన్, సరోజినీ నాయుడు వంటి విద్యావంతులతో పాటు, విద్య నేర్వకపోయినా దేశసేవకోసం దూసుకువెళ్ళిన మరెందరో మహిళామణులు తమ ధన, మాన, ప్రాణాలను సైతం పణంగాపెట్టి స్వాతంత్రసముపార్జనలో తమవంతు కృషిచేశారు. అటువంటి భారతనారీమణుల్లో సుప్రసిద్ధులు శ్రీమతి సరోజినీనాయుడు. ఆమెను గురించి ...

**భారతీయుల కళాప్రాభవం ఒలికించి**
**తీయగా పాడిన కోయిలమ్మ**
**కమనీయ వంగ వంగడమెల్ల మూర్తిలో**
**ప్రసరించినట్టి మేల్ పసిడిబొమ్మ**
**స్వారాజ్య వీర విహార రంగములోన కోరి**
**దూకిన తెల్గుకోడలమ్మ**
**మానవకళ్యాణ మంగళారతి జ్యోతి**
**చెయ్యెత్తి చూపిన చెల్లెలమ్మ**
**ప్రాగ్ పశ్చిమాలు విస్తరించి ప్రేమింప**
**పాఠాలు నేర్పిన పంతులమ్మ**
**భారతనారీ ప్రతాప ప్రాభవ గరిమ**
**ఖండఖండాలుజల్లి విఖ్యాతిగన్న దివ్యమూర్తి**
**సరోజినీదేవి వోలె శీఘ్రసూత్రాన**
**ఆ దేవి దివ్యసుగుణ పుష్పములనేరి**
**విరిదండ పూర్తిచేసి పుణ్యభరతమాతను పూజచేసి**

**ఘనతకెక్కుడి భారత వనితలార! .....** అంటూ ఒక కవి మన తెలుగింటి కోయిలమ్మ సరోజినీ నాయుడును స్ఫూర్తిగా తీసుకొని భారతవనితలందరూ స్వరాజ్యఉద్యమంలో పాల్గొనమని బోధించాడు.

దేశస్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నవారిలో విద్యావంతురాలు, గొప్పవక్త, కవయిత్రి, ధైర్యవంతురాలు, రాజకీయనాయకురాలు, మహిళాహక్కులకోసం పోరాడిన వనిత, స్వతంత్రభారతదేశంలో గవర్నర్, వంటింటి గడపదాటితే వంశం పరువుపోతుందనుకొనే సమాజంలో / కాలంలో కులాంతరవివాహం చేసుకొన్న ఆదర్శమహిళ, శ్రీమతి సరోజినీనాయుడు. జన్మతః బెంగాలీ వనిత అయినా పుట్టిపెరిగింది మన తెలుగుప్రాంతమైన హైదరాబాదులోనే. జన్మించింది సదాచార సంపన్న బ్రాహ్మణకుటుంబములోనే అయినప్పటికి హైదరాబాద్‌లో చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసిన శ్రీ ముత్యాల గోవిందరాజులు నాయుడు గారిని వివాహమాడింది.

సరోజినీదేవి 1879 ఫిబ్రవరి 13వ తేదీన డా॥ అఘోరనాథ్ ఛటోపాధ్యాయ, వరదసుందరులకు జన్మించారు. తండ్రి అఘోరనాథ్ నిజాం కాలేజ్ ప్రధానాచార్యులుగా పనిచేసేవారు. బహుభాషాకోవిదులు. తల్లి వరదసుందరి విద్యాధికురాలు,

కవయిత్రి. కుటుంబంలో అందరూ విద్యాధికులుకావడంతో సరోజినీదేవి సైతం విద్యపట్ల మక్కువ చూపేది. తన 12వ ఏటనే మద్రాసు విశ్వవిద్యాలయం నుండి మెట్రిక్యులేషన్ పూర్తిచేసిన ఘనత ఆమెది. “పువ్వు పుట్టగానే పరిమళిస్తుంద”నే సామెతను నిజంచేస్తూ తన 13వ ఏటనే “లేడీ ఆఫ్ ద లేక్” అన్న కవితను రచించారు. అది చదివిన నిజాంనవాబు ఉపకారవేతనం ఇచ్చి ఇంగ్లాండుకు పంపారు. తదుపరి ఉన్నతవిద్యను కింగ్స్‌కళాశాల, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయాల్లో అభ్యసిస్తూ పలురచనలు చేసి పండితుల ప్రశంసలుపొందారు. ఆమె రాసిన కవితల్లో భారతీయత ప్రతిఫలిస్తుంది. తన సుస్వరంతో ఆ కవితల్ని పాడుతూ శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేసేవారు.

భారతదేశానికి తిరిగివచ్చిన తరువాత తన రాజకీయగురువు గోపాలకృష్ణ గోఖలే సూచనమేరకు 1905వ సంవత్సరంలో కాంగ్రెస్‌సభ్యులుగా చేరారు. గాంధీగారి ప్రోత్సాహంతో 1915వ సంవత్సరంలో జాతీయోద్యమంలో కాలుమోపారు. 1917లో “భారత మహిళా సమాఖ్య” ఏర్పాటులో అనిబిసెంట్‌కు సహకరించి మహిళల ఓటుహక్కు కోసం ఉద్యమించారు. రైతుల సంక్షేమం కోసం కూడ సరోజినీ నాయుడు బ్రిటీష్‌వారికి ఎదురుతిరిగిన ఉదంతాలున్నాయి. 1916వ సంవత్సరంలో బ్రిటీష్ పాలకులు బీహార్‌లోని చెంపారన్ ప్రాంత రైతులను ఆహారపంటలకు బదులుగా ఇండిగో మొక్కలు (నీలిరంగు అద్దకపు రంగుల) నాటమని ఒత్తిడిచేసినపుడు సరోజినీ నాయుడు రైతులకు మద్దతుగా నిలిచింది.

1917వ సంవత్సరంలో దక్షిణ ఆఫ్రికాలో హీనమైన జీవితాన్ని గడుపుతున్న ప్రవాస భారతీయులను కాపాడటం కోసం ఆమె నిర్బంధకూలీ చట్టానికి వ్యతిరేకంగా పనిచేశారు. 1923 సంవత్సరం కాకినాడలో జరిగిన కాంగ్రెస్ సభలో విదేశాల్లోని భారతీయుల రక్షణశాఖకు అధ్యక్షురాలిగా ఎన్నికయి కెన్యాలో భారతీయులతో బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సహాయనిరాకరణోద్యమం చేశారు.

ఆమె తన ఉపన్యాసాలలో స్త్రీలశక్తిని గురించి చక్కగా వివరించారు. స్త్రీలు తమను తాము కాపాడుకోగలరని, ప్రత్యేకరక్షణ కోరుకుంటే వారు అసమర్థులుగా పరిగణింపబడతారని, స్త్రీలు స్వయంగా పోరాడి ఓటింగ్‌లాంటి అన్ని హక్కులు సాధించగలరని అన్నారు. 1923లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ సభలో “నేను ఆంధ్రమహిళను. నాది ఆంధ్రదేశం. ఆంధ్రమహిళలను మహాత్మాగాంధి రాట్నంరాణిగా పేర్కొన్నారు. అది వారి ప్రత్యేక వారసత్వమైన అచంచలస్వభావం, మర్యాద, లక్షణాలకు తగివున్నది” అన్నారు.

1919–1924 మధ్య జరిగిన ఖిలాఫత్ ఉద్యమం దక్షిణ ఆసియాలో ఉస్మానియాసామ్రాజ్యంపై బ్రిటీష్‌ప్రభుత్వ దమననీతిని ఎదుర్కొనడానికి చేసిన ఉద్యమం. ఈ ఉద్యమం మతసంబంధమైనది అయినప్పటికీ భారతీయులు దీనికి ఎంతగానో చేయూతనిచ్చారు. చివరకు ఈ ఖిలాఫత్ ఉద్యమం భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో ఒక భాగంగా మారింది. గోఖలే 1911లో ఆమెను దేశంకోసం తను ఏమి చేయగలదని ప్రశ్నించినపుడు తాను ఐదు సంవత్సరాలలో దేశంలో హిందూ, ముస్లింలమధ్య సఖ్యతను పెంచుతానని సమాధానమిచ్చింది. తాను పుట్టిపెరిగిన ప్రాంతమైన హైదరాబాదు ఒక ముస్లిం రాజ్యం. ఆమెకు ఎందరో హిందూ, ముస్లిం మిత్రులున్నారు. సర్వమతాలవారు సోదరభావంతో ఉండాలన్న భావనతోనే 1921లో వెల్లువెత్తిన హిందూ ముస్లిం మతకలహాల సమయంలో వారిమధ్య స్నేహభావాన్ని పెంపొందించారు. అందుకే 1922లో జైలుకు వెళుతూ గాంధీ దేశఐక్యతాబాధ్యత ఆమెకు అప్పగిస్తున్నానన్నారు.

1925లో కాన్పూరులో జరిగిన అఖిలభారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు తొలి మహిళ అధ్యక్షురాలు. కాంగ్రెస్‌వారు చేసిన దండి, సహాయనిరాకరణ మొదలైన ఉద్యమాలలో ఎందరో స్త్రీలను తన ఉపన్యాసాలతో ఉత్సాహపరచి, వాటిలో అధికసంఖ్యలో పాల్గొనేలా చేసిన ఘనత సరోజినీదేవిదే.

తన కుటుంబాన్ని సైతం లెక్కచేయకుండా అవిశ్రాంతంగా ఊరూరా, వాడవాడలా, దేశవిదేశాలలో తిరిగి ఉపన్యాసాలిచ్చి, ప్రజలతో తాను మమేకమైపోయి స్వాతంత్ర్యసంగ్రామంలో స్త్రీలుసైతం సింహభాగాన్ని నిర్వహించేలా చేసిన ఘనత సరోజినీదేవిది.

అలుపెరగక తిరిగితిరిగి చివరికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చినతరువాత గవర్నరు హోదాలో 1949 మార్చి 2వ తేదీన తన దేహాన్ని భారతావనికి అప్పగించి వెళ్ళి పోయారు.

"I say it is not your pride that you are a Madarasi,
it is not your Pride that you are a Brahmin,
it is not your Pride that you belong to South India,
it is not your Pride that you are a Hindu,
that it is your Pride that you are an Indian" భారతీయులకు ఆవిడ ఇచ్చిన ముఖ్యసందేశం ఇది.

(నువ్వు ఏ కులానికో, మతానికో, సంస్కృతికో లేదా ఏ ప్రాంతానికో చెందావని కాదు, నీవొక భారతీయుడవని గర్వించు) సరోజినీదేవి మరణానంతరం శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి రచనగా చెప్పబడుతున్న, ఘంటశాల వారి గళంలో చిందిన అమృతగానం, సరోజినీదేవికి భారతావని అందించిన అశ్రునివాళిగా చెప్పవచ్చు.

| | | |
|---|---|---|
| ప॥ | అమ్మా! సరోజినీ దేవీ! పరిపూర్ణ సువర్ణ కళామయజీవీ | ॥అమ్మా॥ |
| చ.1 | స్త్రీజాతి శిరోమణివమ్మా! మా జాతి గులాబీరెమ్మా!<br>మధురాల వరాల స్వరాలు పల్కు మంజుల కోయిలవమ్మా। | ॥అమ్మా॥ |
| చ.2 | స్వారాజ్యస్సమర కరాసి చరితార్థవు సద్గుణరాశి<br>వరవీర విహార స్వరాజ్య సమర ధ్రువతారవు నీవమ్మా | ॥అమ్మా॥ |
| చ.3 | నీ జీవిత కావ్యాలాపం విశ్వానికి ప్రేమ కలాపం<br>అనురాగతరంగ మృదంగ భంగిమల అమృదము చిందితివమ్మా! | ॥అమ్మా॥ |

**ఆధార గ్రంథాలు :**


1. స్వాతంత్ర్య సమరంలో ఆంధ్రమహిళలు : డా॥ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, అచ్యుతుని గిరిజ.
2. ఆదర్శమహిళలు : శ్రీమతి టి. శాంతాభాస్కర్
3. Sarojini Naidu Quotes with Message - Source : feedingtrends.com

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# భారత జాతీయోద్యమం – మహిళల ఉద్యమ పటుత్వం

డా॥ ఇ. వాసు, తెలుగు అధ్యాపకులు, ఎస్.వి.సి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలమనేరు. చరవాణి : 94901 75017.

భారతదేశ స్వాతంత్ర్యపోరాటంలో రక్తం మరిగే అంశాలు, రోమాలు నిక్కబొడుచుకునే సంఘటనలు ఎన్నో చోటు చేసుకున్నాయి. స్వేచ్ఛా భారతదేశానికి తపించిన త్యాగధనులు కోకొల్లలుగా ఉన్నారు. ఆ క్రమంలోనే ఎందరో అసువులుబాసారు. వీరి చరిత్రలు నేటితరానికి, ముఖ్యంగా యువతకు చక్కని ప్రేరణ కలిగిస్తాయని రూఢిగా చెప్పవచ్చు. వారి సాహసచరిత్రలు చదివినా, విన్నా మనం ఉద్విగ్నతకు, ఉద్వేగానికి గురౌతాము. స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్న ఆ మహనీయులు ప్రతిఒక్కరూ కారణజన్ములనే భావనతో బాటు చరిత్ర సృష్టికర్తలనే భావన కలుగక మానదు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటంలో కేవలం పురుషులే గాకుండా మహిళలు చూపిన తెగింపు కూడా అసాధరణమైనదిగా చెప్పవచ్చు. వారు అహర్నిశలూ ఉద్యమించారు. జైలు జీవితాన్ని అనుభవించారు.

భారతదేశ స్వాతంత్ర్యం కోసం చాలామంది మహిళలు కూడా తెగించి ఉద్యమాలు నడిపారు. భారతదేశ పౌరుషాన్ని రవి అస్తమించని బ్రిటీషు సామ్రాజ్యవాదులకు చాటిచెప్పారు. భారత స్వాతంత్ర్యపోరాటంలో తమవంతు బాధ్యతను నెరవేర్చి, నాడు పురుషులకు కూడా కనువిప్పు కలిగించారు. అటువంటి వారి త్యాగనిరతిని స్మరించుకోవడం ప్రస్తుత మన కర్తవ్యం. వారి పోరాటపటిమకు తెల్లదొరలు సైతం తెల్లబోయారు. భారతీయ మహిళల స్వాతంత్ర్యకాంక్షకు తెల్లదొరలు నివ్వెరపోయారు. అయినా మన మహిళలను వారు ఉక్కుపాదంతో క్రూరంగా అణచి వేశారు. అలాంటి మహిళలను దిజ్మాత్రంగా పరిశీలిస్తే వారి త్యాగం మనకు అవగతమౌతుంది.

**రాణి చెన్నమ్మ :–** కర్నాటకలోని బెల్గాం ప్రాంతానికి చెందిన కిట్టూరు రాజా మల్లసర్జా భార్య చెన్నమ్మ. వీరిది రాజకుటుంబం. 1778లో జన్మించిన చెన్నమ్మ 1829లో మరణించారు. కిట్టూరు రాజు మరణించిన తరువాత రాజ్యాధికారాన్ని చెన్నమ్మ చేపట్టింది. ఈ నేపథ్యంలోనే 1824లో తమ రాజ్యంపై బ్రిటీషువాళ్ళు ఆధిపత్యాన్ని చూపడాన్ని గట్టిగా ఎదిరించి ప్రతిఘటించింది. వాళ్ళపై యుద్ధం ప్రకటించింది. అయితే తెల్లదొరలు ఆమెను ఓడించి ఖైదుచేశారు. దాంతో ఆమె చరిత్ర ముగిసినట్లైంది. తమరాజ్య రక్షణకోసం బ్రిటీషువారిని రాణిచెన్నమ్మ ఎదిరించింది. ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసం కలిగిన మహిళగా చెన్నమ్మ కీర్తి ప్రతిష్ఠలను మూటగట్టుకున్నది.

**సరోజినీ దేవి :–** భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న మరో అగ్రగణ్య మహిళ సరోజినీనాయుడు. ఈమె స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి. అఖిలభారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు తొలిమహిళా అధ్యక్షురాలు. స్వతంత్ర భారత తొలి మహిళా గవర్నర్‌గా జాతికి నిస్వార్థంగా సేవలందించారు. 1879 ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో ఈమె జన్మించారు. 'క్విట్‌ఇండియా' ఉద్యమంతో బాటు వివిధ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఈమె ఉపన్యాసాలు ఆనాడు దేశప్రజలను ఎంతగానో ప్రేరేపించి ఉద్యమం వైపు పయనింపజేశాయి. ఈమెకు 'భారతకోకిల' అనే బిరుదు ఉంది. ఈమె గాంధీ మార్గనిర్దేశంలో నడుస్తూ ఉద్యమాలను నడిపింది.

**ఝాన్సీలక్ష్మీబాయి :–** ధైర్యసాహసాలకు మారుపేరుగా పిలుచుకునే ఝాన్సీరాణి లక్ష్మీబాయి చరిత్ర మనలను ఉద్రూతలూగిస్తుంది. మనలో దేశభక్తిని రగిలిస్తుంది. 1857లో జరిగిన భారతదేశ పోరాటంలో ఆమె పాత్ర అనన్య సామాన్యమైనది. ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా సాగిన మొదటి ఉద్యమం కూడాఅదే. అందుకు హేతువుగా నిలబడ్డది లక్ష్మీభాయి కావడం మనకు గర్వకారణం. 'దత్తత స్వీకారచట్టానికి' వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటం జరిపి తెల్లదొరలకు సింహస్వప్నమైంది. చివరికి వారిచేతిలో ప్రాణాలు వదిలింది. వారికి లొంగిపోయి ఉంటే ఆమె జీవితం సుఖసౌఖ్యాలతో వర్ధిల్లేది. కానీ అలాంటి వాటికి ఆమె ఆస్కారం ఇవ్వకుండా తనకున్న దేశభక్తిని చాటిచెప్పింది. మహిళాశక్తి అంటే ఏమిటో బ్రిటీషు వారికి తెలియజెప్పింది. ఈమె చరిత్ర వర్తమాన భావితరాలకు స్ఫూర్తిదాయకం.

**సుచేతా కృపలానీ :–** స్వాతంత్ర్యఉద్యమంలో అత్యంత చురుకైనపాత్ర పోషించిన ఇంకొక మణిపూస సుచేతా కృపలానీ. ఈమె స్వాతంత్ర్య సమరయోధురాలు, మహిళా రాజకీయవేత్త. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి మొట్టమొదటి మహిళా ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఈమె హర్యానాలోని అంబాలాలో ఒక బెంగాలీ కుటుంబంలో జన్మించారు. మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడిచారు. ఈమెను స్ఫూర్తిగా తీసుకొని ఎందరో మహిళలు జాతీయోద్యమంలో అత్యంతచురుకుగా పాల్గొన్నారు. ఈమె నిరాడంబరంగా ఉంటూ వివిధ ఉద్యమాల్లో పాల్గొని తనకున్న దేశభక్తిని చాటుకున్నది.

**బేగం హజ్రత్‌మహల్ :–** ఈమె భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ మహిళా స్వాతంత్ర్యసమరయోధులలో ప్రముఖులు. ఝాన్సీలక్ష్మీభాయికి ప్రతిరూపమని ప్రశంసలందుకున్నారు. 1857లో తిరుగుబాటు ప్రారంభమైనపుడు తెల్లదొరల పాలనకు వ్యతిరేకంగా పోరాడటానికి, మరియు వారి గొంతులను పెంచడానికి గ్రామీణ ప్రజల్లో చైతన్యం తెచ్చింది. ఆమె తెల్లదొరలపాలనకు వ్యతిరేకంగా తన కుమారుడిని 'ఔద్' రాజుగా ప్రకటించి లక్నో నియంత్రణను చేపట్టింది. ఇది అంత తేలికైన యుద్ధం కాదు. బ్రిటీషు ప్రభుత్వం లక్నో నియంత్రణను రాజునుండి స్వాధీనం చేసుకున్నది. దాంతో ఆమె నేపాల్‌కు వెళ్ళిపోయింది. జాతీయోద్యమాన్ని గ్రామీణస్థాయి నుంచి రగిలించాలని ఎంతగానో తపనపడింది. ఆక్రమంలో మంచి ఫలితాలను సాధించిందనే చెప్పాల్సిఉంది. విభిన్నమైన ఆలోచనాతీరుకు ఈమె జీవితం ఆదర్శప్రాయమైనదనవచ్చు.

**అరుణా అసఫ్ అలీ :–** ఈమె ఉప్పుసత్యాగ్రహంలో ప్రధానపాత్ర పోషించారు. ఆ నేపథ్యంలో జైలుకు కూడా వెళ్ళారు. ఆ తర్వాత జైలు నుండి విడుదలై 'క్విట్‌ఇండియా' ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఈమె వృత్తాంతం భారతదేశ స్వాతంత్ర్యపోరాటంలో మహిళలు ఎంతటి త్యాగధనులో నిరూపిస్తున్నది.

తీహార్ జైలులో మగ్గుతున్న రాజకీయ ఖైదీల హక్కుల కోసం కూడా ఆమె పోరాడారు. దీని కోసమై ఆమె నిరాహారదీక్ష కూడా చేశారు. ఆమె చేపట్టిన ఈ ఉద్యమం ఖైదీల పరిస్థితిని మెరుగుపరిచేందుకు దోహదపడింది. ఆమె అబలకాదు సబలగా గుర్తింపు తెచ్చుకున్నది. ఆమె అన్ని మూసపద్ధతులను విచ్ఛిన్నం చేసింది. ఆమె బ్రాహ్మణురాలైనప్పటికీ ముస్లింవ్యక్తిని వివాహం చేసుకున్నది. అయితే ఆనాడు ఆమె నిర్ణయాన్ని ఆమె కుటుంబం గట్టిగా వ్యతిరేకించింది. అయినా ఆమె వెనుకంజ వేయలేదు. మతాంతర వివాహం చేసుకోవడంతో పాటు జాతీయోద్యమంలోని వివిధ సంఘటనల్లో పెద్ద ఎత్తున పాల్గొని తనకున్న సామాజిక స్పృహను నిరూపించుకున్నది.

**ఉషా మెహతా:–** భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న అతి పిన్నవయస్కులలో ఉషామెహతా అగ్రగణ్యులుగా పేర్కొనవచ్చు. గాంధీ ప్రభావం ఆమెపై గాఢంగా పనిచేసింది. ఆమె ఐదు సంవత్సరాల వయస్సులోనే గాంధీని కలుసుకున్నారు. 'సైమన్ గో బ్యాక్' నిరసనలో పాల్గొన్నపుడు ఆమెకు కేవలం ఎనిమిదేళ్ళు. ఆమె తండ్రి బ్రిటీషు ప్రభుత్వం కింద పనిచేస్తున్న న్యాయమూర్తి. అతను గాంధీకి వ్యతిరేకంగా ఆమెను మరలించడానికి ఎంతగానో ప్రయత్నించాడు. అయినా ఆయన ఆశయం నెరవేరలేదు. బ్రిటీషువారికి వ్యతిరేకంగా, గాంధీ ఆదేశాల మేరకు నడవాలని నిశ్చయించుకొన్నది. చదువు మానేసి పూర్తిగా స్వాతంత్ర్య పోరాటంలోనే పాల్గొన్నది. బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేడియోఛానెళ్ళు నడిపింది. దాని మూలంగా ఆమె జైలుశిక్ష కూడా అనుభవించింది. చదువుకు స్వస్తిచెప్పి, తండ్రి ఆజ్ఞను ధిక్కరించి స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్న మహిళారత్నం ఈమె.

**భికాజీ కామా :–** ఈమె జాతీయోద్యమ మహిళల్లో ప్రముఖురాలు. ఈమెను 'మేడం కామా' అని కూడా పిలుస్తారు. ఈమె భారతీయుల మనస్సుల్లో మహిళా సమానత్వం మరియు మహిళా సాధికారత ఉండాలనే చైతన్య బీజాలు నాటింది. చాలామంది అనాథ బాలికలకు ఈమె సహాయం చేసింది. అందువల్ల భారతస్వాతంత్ర్య పోరాటచరిత్రను స్థాపించిన మార్గదర్శకుల్లో ఒకరుగా ఈమె పేరు నిలిచిపోయింది.

**మహిళల దృక్పథం :–** ఆనాడు స్త్రీవాద సంస్థలు మహిళల ఆర్థిక, రాజకీయ హక్కులకోసం ఒకవైపు పోరాటం చేస్తూనే సంస్కరణలు, విద్య ద్వారా స్త్రీలస్థితిని మెరుగుపరిచేందుకు ప్రయత్నించాయి. విదేశీపాలనను అంతమొందించాలనే లక్ష్యంతో స్త్రీలు జాతీయోద్యమంలో

పాల్గొన్నారు. కానీ గాంధీజీ నాయకత్వబాధ్యతలు చేపట్టాక స్త్రీల భాగస్వామ్యం పెరిగిందని చెప్పవచ్చు. గాంధీ చేపట్టిన మొదటి జాతీయస్థాయి ఉద్యమం సహాయనిరాకరణ. ఇందులో స్త్రీలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించబడింది. ఆనాడు గ్రామీణప్రాంతాల్లో జరిగిన సత్యాగ్రహాల్లో రైతు కుటుంబాలకు చెందిన స్త్రీల పాత్ర ఎనలేనిది, మరువలేనిది, ఆదర్శవంతమైనది కూడా. ఇలా గ్రామం, నగరం, అక్షరాస్యులు, నిరక్షరాస్యులు, పేద, ధనిక అనే తేడా లేకుండా స్త్రీలు జాతీయోద్యమంలో పాల్గొన్నారు.

**కవుల ఉత్తేజం :–** ఆనాటి స్త్రీల పోరాటపటిమను చూచిన కవులు ఎందరో ఘనంగా శ్లాఘించారు. వారిలో చెప్పదగినవారు మిక్కిలినేని భగవంతరావు. ఈయన నాగపూర్ 'జెండా సత్యాగ్రహం' సందర్భంగా ఇలా అంటారు.

శాంతి దండుగ బైలు దేరండీ
భారతీయులకు ప్రాణ ప్రదమగు ॥ జెండా ॥
నాగపురిని నేడు నారీమణులు కూడా
శాంతి సమరము చేయుచుండ
చూచు చుండ తగదు తగదిక ॥ జెండా ॥
జండా పట్టని చేయి దండుగనుచు
మీరు గుండెలలో నుంచరయ్య
ముచ్చటగ నీ మూడురంగులు ॥ జెండా ॥
స్త్రీలు పురుషులనక బాల బాలికలనక
లీలతో మీరంత జేరి
జాతీయ జీవన నిలయమగునీ ॥ జెండా ॥

అంటూ జెండా ప్రాశస్త్యాన్ని తెలియజేస్తూనే, జెండాను చేతగొని జాతీయోద్యమంలో దండివీరులుగా బయలుదేరమనే ఉత్సాహాన్ని తెలుగుకవులు జాతి జనులకు కలిగించారు. ఇందులో స్త్రీలు ఎంత ఉత్సాహంగా, చురుకుగా పాల్గొంటున్నారో కవులు కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. కొందరు మహిళలు తమ రాచరికాన్ని నిలుపుకొనుటకు ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఇంకొందరు దేశస్వేచ్ఛకోసం త్రికరణశుద్ధిగా జాతీయోద్యమంలో పాల్గొన్నారు. కారణాలు ఏవైనా స్త్రీలు జాతీయోద్యమంలో పాల్గొని తమవంతు బాధ్యతను నెరవేరుస్తూ దేశభక్తిని చాటుకున్నారు. వారి పోరాటతత్వం వర్తమాన, భావితరాల బాలికలకు చక్కని ప్రేరణను, స్ఫూర్తిని కలిగిస్తాయని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు :–**

1. తెలుగులో ఉద్యమగీతాలు : డా॥ ఎస్.వి. సత్యనారాయణ
2. భారత జాతీయోద్యమం : ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి
3. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం : ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి
4. ఆధునిక భారతదేశ చరిత్ర : బిపిన్ చంద్ర

# స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి స్త్రీల సామాజిక పరిస్థితులు – వారి సాహిత్యం

డా॥ శ్రీభాష్యం అనూరాధ, తెలుగు అధ్యాపకురాలు, TSWRDC/ మహీంద్రాహిల్స్, హైదరాబాద్ సెల్ : 8790325502.

సమాజంలో చోటుచేసుకుంటున్న సంస్కరణల వల్ల, స్త్రీ విద్యా వ్యాప్తి వల్ల చైతన్య మనస్కులైన స్త్రీలు, భారత స్వాతంత్ర్య సమర శంఖారావాన్ని పూరించిన గాంధీజీ పిలుపుతో సహాయ నిరాకరణోద్యమంలో, సత్యాగ్రహ ఉద్యమాలలో వందలు, వేలుగా పాల్గొని తొలిసారిగా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఇలా రావడం అన్నది స్త్రీలకు రాజకీయ, సాంఘిక, ఆర్థిక హక్కుల కోసం పోరాడే చైతన్యాన్ని కలిగించింది. 1916లో హోమ్‌రూల్ ఉద్యమానికి అనీబిసెంట్ (ఐరిష్ మహిళ) నాయకత్వం వహించింది. 1919లో మాంటెన్ ఛెమ్స్‌ఫర్డ్ కమీషన్‌కు స్త్రీల ఓటింగ్ హక్కు గురించి విజ్ఞాపన పత్రాన్ని కజిన్స్ సతి, సరోజినీ నాయుడు కలిసి సమర్పించారు. 1920లో శాసన సభకు స్త్రీలు పోటీ చేయడానికి ఆమోదాన్ని పొందారు. మద్రాసు శాసన సభకు తొలి మహిళా సభ్యురాలిగా శ్రీమతి ముత్తు లక్ష్మీ రెడ్డి ఎన్నికయ్యారు. 1927లో సైమన్ కమీషన్ 2:1, పురుషులు, స్త్రీల నిష్పత్తిలో ఓటింగ్ హక్కు ఇవ్వడం జరిగింది. ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ ఉద్యమం, భారతదేశమంతటా ఉవ్వెత్తున కల్లోలం రేపుతున్న తరుణంలో ఆంధ్ర మహిళా చైతన్యం వెల్లివిరిసింది. దేశంలోని ఇతర ప్రాంతాలలోని మహిళల సమరోత్సాహం, స్వాతంత్ర్య నిరతి, త్యాగశీలత... ఇవన్నీ తెలుగు మహిళలపై కూడా ప్రభావాన్ని చూపాయి.

1921లో అఖిల భారత కాంగ్రెస్ మహాసభ జరిగింది. ఆ సమయంలో మహాత్మా గాంధీ ఆంధ్ర దేశంలో పర్యటించారు. వారి ఉపన్యాసాలకు గుమ్మిడిదల దుర్గాబాయమ్మ గారు భావస్ఫోరకమైన తెలుగు అనువాదాన్ని చేసి మహాత్ముని ప్రశంసలు అందుకున్నారు. ఉత్తేజితురాలైన తెలుగు వనితలు అత్యంత త్యాగ నిరతితో తమ ఒంటిమీద నగలు వలచి, ఆనందంగా స్వరాజ్య నిధికి విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంలో ప్రముఖంగా చెప్పుకోవాల్సిన మహిళలు 1. మాగంటి అన్నపూర్ణమ్మ, 2. యలమంచిలి తాయారమ్మలు. సహాయ నిరాకరణోద్యమానికై తన నగలన్నింటినీ గాంధీజీకి అర్పించిన తొలి మహిళ మాగంటి అన్నపూర్ణా దేవి. భర్తతో పాటు ఉన్నత విద్యాభ్యాసానికై అమెరికా వెళ్లబోతున్న సమయంలో గాంధీజీ పిలుపు వల్ల ప్రభావితురాలై దేశ స్వాతంత్ర్య సాధనకు తన జీవితాన్ని అంకితం చేసింది. “నాకు జ్ఞాపకమున్నంత వరకు తనకు ఉన్న బంగారు నగలన్నింటినీ నాకు సమర్పించిన ప్రథమ మహిళ ఈమెయే” అని బాపూజీ ప్రశంసలందుకుంది.

“సభ్యత కలది సంఘము. కళ్యాణ గుణవత్త్వము సభ్యత. అట్టి సభ్యతగల సంఘానుభూతి సాహిత్య విషయము... కానీ... మహిళలకి యవకాశమేది? అసూర్యంపశ్యలై అంత:పురమేలు అంగనల బుద్ధి ప్రాభవములను అవని రాజ్యాంతరములనే అవధులుగా చేసుకొని రాజ్యమేలినవి.... కలి కుమారులు స్వస్తి వాక్యములు బలుకుచు ముందు నడువ, సారస్వత స్వర్ణ రథమెక్కి వాడవాడలా విజయోత్సవము వెడలినను తెలుగు వారికి నీరాజనమెత్తుటకును తీరక లేకపోయినది”[2] అంటారు లక్ష్మీ కాంతమ్మ గారు. సంఘానుభూతి కొరవడిన మహిళలు పురుషులతో ధీటుగా గ్రంథాలు వెలువరించలేకపోయారు. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో సంప్రదాయ కవిత్వం, భావ కవిత్వం విరివిగా వనితలు వెలువరించినా నవలా ప్రక్రియ చేపట్టిన వారు అతి కొద్ది మంది.

మొట్టమొదటిసారి కృపాబాయి సత్యనాధమ్మగారు ‘కమలాంబ’ అనే ఆంగ్లానువాద గ్రంధాన్ని వెలువరించారు(1909). తదుపరి ‘రూపవతి’ అనే చారిత్రాత్మక నవలను శ్రీమతి అట్లూరి వెంకట సీతమ్మ గారు రచించారు (క్రీ.శ.1918). ‘ఉత్తర దేశపు గాథను జేపట్టుటచే నా వాతావరణ చిత్రణమనివార్యము. కానీ మన నవలాకర్త పాత్రల పేర్లు మున్నగు అప్రధాన విషయములను దప్ప ప్రధాన విషయముల యందు ఔత్తరహచార్య వ్యవహారములను స్ఫురింపజేయ జాలలేదు”[3] అని డా॥ బొడ్డపాటి కుటుంబరావు గారు ఈ నవలను కొనియాడారు.

తరువాత చెప్పుకోదగిన రచయిత్రి శ్రీపులుగుర్తి లక్ష్మీ నరసమాంబ గారు. ఈమె వీరేశలింగ యుగమున వర్ధిల్లిన కవయిత్రి. వీరేశంలింగం గారి ప్రతికక్షి అయిన కాశీభట్ల బ్రహ్మయ్య గారి శిష్యురాలు. ‘సావిత్రి’ పత్రికా సంపాదకురాలు. సంఘ సంస్కరణలలో వీరేశలింగం గారికి వ్యతిరేకంగా ఉన్నా, స్త్రీ విద్యా ప్రచారంలో సేవచేసి, ఆంధ్ర దేశంలో ప్రథమ స్త్రీ సమాజం ‘విద్యార్థినీ’ సమాజాన్ని కాకినాడలో స్థాపించారు. 1904లో ‘సావిత్రి’ పత్రికను స్థాపించి సమర్థతో నడిపారు. బంకించంద్రుడి వంగ నవల ‘యోగేశ్వరి’ని దామోదర ముఖ్యోపాధ్యాయుని ‘అన్నపూర్ణ’ నవలను తెలుగులోకి అనువాదం చేశారు. సీరము సుభద్రయాంబ గారు ‘జాగిలము’ అనే ఫ్రెంచి నవలను తెలుగులోకి అనువదించారు. కవి తిలక శ్రీమతి పులవర్తి కమలాదేవి గారు ‘కుముద్వతీ’

అనే చారిత్రక నవలను వ్రాశారు. ఇది పాఠ్య గ్రంథంగా నిర్ణయించబడింది.

దేశ స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖంగా పాల్గొన్న ఆంధ్ర మహిళ మాగంటి అన్నపూర్ణమ్మ త్యాగనిరతి, అకుంఠిత దేశభక్తి గలది. అన్నపూర్ణమ్మ భర్తకు తాను స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాగ్నిలో సమిధ కానున్న ఆశయాన్ని తెలుపుతూ వ్రాసిన లేఖాంశాలను సయితం, ఇందిర & భారతీ దేవి సోదరీమణులు కవిత్వ రూపంలో 'అన్నపూర్ణా సుభాషిత రత్నావళి' పేరిట వెలువరించారు. ఈ సోదరీమణులు 'ప్రతిమాదేవి' అన్న చారిత్రాత్మక నవలను వ్రాశారు.[-4] తరిగొండ వెంగమాంబకు తదుపరి ఏబది వర్షములు సారస్వత రంగమున అంధకారం ఆవహించినదని పేర్కొనవచ్చు.[-5]

వీరేశలింగం పంతులు గారు చేసిన స్త్రీ విద్యా ప్రచారము వలన బహుముఖ ప్రజ్ఞ ప్రదర్శించిన శిష్యురాళ్లలో శ్రీమతి కొటికెలపూడి సీతమ్మ కావ్య రచనకు శ్రీకారం చుట్టారు. వీరి కుమార్తె శ్రీమతి చంద్రమతి. 1948లక్ష 'సరళా ప్రభావము' & 'హిందు గృహము' నవల వ్రాసి తల్లికి అంకితం చేశారు. సంపన్న గృహాలు, ఎగువ మధ్య తరగతి కుటుంబాలలో స్త్రీల దినచర్య, ఆచార వ్యవహారాలు, స్థితిగతులు అన్నీ దీనిలో వివరించారు. స్త్రీలకు సరైన విద్య, పని ఒత్తిడి, కుటుంబ అవసరాలు తీర్చడంలో …. తీరిక ఎక్కువ లభించడం వల్ల ఇటువంటి అవాంఛితమైన దుష్ట సంస్కారం ఎక్కువ అవుతుంది అని అభిప్రాయం. 'హిందు గృహం' నవలలో రచయిత్రి ఆనాటి బాలికల, స్త్రీల సాంఘిక పరిస్థితులను చాలా వరకు ఉటంకించారు. రచయిత్రి తన భావాలను చాలా సందర్భాలలో పాత్రల ద్వారా కాకుండా నేరుగా చెప్పి, సంప్రదాయాలకు పెద్ద పీట వేశారు.

స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి స్త్రీల స్థితిగతులను, స్త్రీ సంస్కర్తలను గురించి బాపిరాజు గారు 'తుఫాను' నవలలో… శ్రీమతులు రత్నాల కృష్ణాబాయమ్మ గారు, కమలాదేశి గారు, దిగుమర్తి బుచ్చి కృష్ణమ్మ గారు, దామెర్ల సత్యవాణి గారు, సీతా కుమారి గారు, జంగం లక్ష్మీబాయమ్మ గారు మొ॥ చిత్ర లేఖనంలో ప్రాశస్త్యం వహించిన మహిళలను పేర్కొన్నారు. ఆనాడు వివిధ రంగాలలో ప్రాశస్త్యం వహించిన స్త్రీల గురించిన ప్రశస్తి ఉండి దుర్గాబాయమ్మ గారు ఉపన్యసించినట్లు వ్రాసారు.[-6]

"మహిళోద్యమం, మహిళా సభ స్ఫూర్తితో దేశమంతటా స్త్రీలకు క్లబ్బులు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలు, సేవా సంఘాలు ఏర్పాటు కావడం జరిగింది. దేశ సేవను స్త్రీలు, పురుషులతో పాటు చేస్తున్నారని, పవిత్ర స్త్రీల ఆశ్రమాలు ముత్త లక్ష్మీ రెడ్డి, యామినీ పూర్ణ ఫలితంగా నేడు భారత దేశంలో స్త్రీలకు ఓటు, శాసన సభా సభ్యత్వము, మంత్రిత్వము, చదువు, ఉద్యోగాలు, న్యాయవాదిని, వైద్యురాలు, ఉపాధ్యాయిని మొదలయిన వృత్తులెన్నియో లభిస్తున్నాయి. ఈ కృషి ఫలితంగానే శారదా శాసనం వచ్చింది. అందువల్ల దేశంలో ఎంతో మార్పు కలిగిందని, స్త్రీలకు ఆస్తి, బహు భార్యత్వ నిషేధము, విడాకుల వాప్యము రాగలవని, తామందరూ కొంత ప్రయత్నం చేసింది, నాంది మాత్రమేనని, ఇంకా కొన్ని వేల రెట్ల ఉత్సాహంతో స్త్రీలందరూ నడుం కట్టుకొని ప్రయత్నం చేయాలనీ, అప్పుడుకానీ స్త్రీ ఆశయాలు నెరవేరవనీ చెబుతారు".

**– దుర్గాబాయమ్మ గారి ప్రసంగం (ప్రదర్శన మందిరం ప్రారంభోత్సవం రోజు)**

సామాజిక పరిస్థితులలో అనేక మార్పులు సంభవించినా యువతి అడుగడుగునా సమస్యలనే ఎదుర్కొంటోంది. సమస్యలే జీవితంగా జీవిస్తుంది. అణచివేతను ఎదుర్కొంటుంది. దాన్ని అధిగమించడానికి సమస్యల మూలాల్ని తెలుసుకోవడానికి, పరిష్కారాలను సాధించడానికి సాహిత్య పరంగా, సమాజ పరంగా కృషి జరగాలి. స్త్రీలలో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించే రచనలు, వాటికి పరిష్కారాలను సూచించగలిగిన సాహిత్యం సమాజంలోనికి ప్రవహించి మానసికంగా పరివర్తన తీసుకొచ్చినపుడే స్త్రీల సమస్యలు కొంత వరకైనా సమసి పోవడమన్నది జరుగుతుంది.

**ఆధార గ్రంథాలు**

1. విజ్ఞాన సర్వస్వం – ఆంధ్ర సంస్కృతి – పేజీ : 9, 30, 31
2. ఆంధ్ర కవయిత్రులు – శ్రీమతి ఊటుకూరి లక్ష్మీ కాంతమ్మ, పేజీ–4
3. ఆంధ్ర నవలా పరిణామము – డా॥ బొడ్డపాటి కుటుంబరావు, పేజీ : 226
4. ఆంధ్ర నవలా పరిణామము – డా॥ బొడ్డపాటి కుటుంబరావు, పేజీ : 226
5. హిందు గృహము – శ్రీమతి చంద్రమతి, పేజీ–5, 7
6. దుర్గాబాయమ్మ గారు అనీబిసెంటు ప్రస్తావన, పద్మినీ కుమారి – పేజీ : 344

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# జాతీయ స్వాతంత్ర్యోద్యమం – సూర్యదేవర రాజ్యలక్ష్మీ దేవి

**ఎం.అశోక్ కుమార్**, ఎస్.ఎ.తెలుగు, జెడ్.పి.హెచ్ఎస్, నడిమూర్, కుప్పం మండలం, చిత్తూరు జిల్లా చరవాణి : 79936 69083

దాదాపు రెండు వందల ఏళ్లపాటు దేశాన్ని పాలించిన బ్రిటిష్ వలస పాలకులకు వ్యతిరేకంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం సాగిన ఉద్యమమే స్వాతంత్ర్యోద్యం. భారత జాతివాస్య శృంఖలాల నుంచి విముక్తి కోసం ఎందరో మహానుభావుల తమ ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా త్యాగం చేసిన ఫలితమే 1947లో దేశానికి స్వరాజ్యం సిద్ధించింది. తెల్లదొరల కబంధహస్తాల నుండి భరతమాతకు విముక్తి లభించింది.

భారత స్వాతంత్ర ఉద్యమ చరిత్రలో పురుషులతో పాటుగా మహిళలు తమదైన శైలిలో వారి వారి పాత్రలను వారు పోషించారు.

1914 మే 18న కృష్ణా జిల్లా నందిగామా తాలుకా వీరులపాడులో రాజ్యలక్ష్మి దేవి గారు జన్మించారు.

వీరులపాడు చైతన్యానికి పెట్టింది పేరు. ఒక పక్క వీరేశలింగం మహానుభావులు సంఘ సంస్కారణార్థం దురాచారాలను ఖండిస్తూ సాహిత్యం పండిస్తున్న రోజులవి.

ఆకాలంలో ఆ కుగ్రామంలో ఆ చుట్టు ప్రక్కల మిడిల్ స్కూల్ వెలసింది. హనుమయ్య చౌదరిగారు మహాపండితులు అంతవరకు ఆడపిల్లలకు చదువులే లేవు. అప్పుడే ప్రారంభ కాలమిది. ఆయన గురుత్వంతో రాజ్యలక్ష్మీదేవి గారు చదువుతో పాటు ఎన్నో విషయాలను నేర్చుకున్నారు.

గాంధీగారి ప్రభావం వల్ల ఊరూర ఆడువారు రాట్నాలు ఒడకడం ప్రారంభించారు. రాజ్యలక్ష్మీదేవి తల్లి అక్క చెల్లెళ్లతోపాటు రాత్రి పగలనక రాట్నం ఒడకడం చేసేవారు.

పువ్వు పుట్టగానే తావి విరజిమ్మునట్లుగా 17 సంవత్సరాల రాజ్యలక్ష్మీ దేవి మనస్సు, భారత స్వాతంత్ర్యోద్యమం వైపు మళ్ళింది. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొంటానని పట్టు పట్టింది. జైల్లో చీకటల్లో ఉంచుతారని పగలు కూడా బయట తిరగ నీయరని, తిండి పెట్టారని పైగా మైనారిటీ తీరనిదే సత్యాగ్రం పనికి రాదని అన్నగారు చెప్పిన మాటలకు భయపడి ఆవిడ ఆ ప్రయత్నం విరమించుకున్నారు. కాని మనస్సు అటే లాగుతోంది. అంతలో తెలివి తాలుకా చేబ్రోలు వాస్తవ్యులైన శ్రీనాగయ్య గారితో వివాహమైన రాజ్యలక్ష్మీ దేవి చేబ్రోలులో అడుగుపెట్టారు. చేబ్రోలు నాగరికతకు పెట్టింది పేరు. వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు గారు కట్టించిన 101 దేవాలయాలలో, చదువుకున్న సంపన్నులతో కలకలలాడేది, ప్రాంతీయ నాయకులే కాదు జాతీయ నాయకులు కూడా బస చేశారు.

అప్పటికే 40 మంది ఆడువారు జైలుకెళ్ళినారు. అక్కడే ఉండేవారు. ఒక పక్క పరదా పద్ధతిలో గుఱ్ఱపు బండికి పరదాలు కట్టి ఆడువారు బయట అడుగు పెడుతుంటే మరో పక్క కొందరు ఆడువారు పరవా పద్ధతులు వదలి సత్యాగ్రహాలు చేసి జైళ్ళకు నడిచారు.

18వ సంవత్సరంలో అడుగు పెట్టిన రాజ్యలక్ష్మీదేవికి అవకాశం వెతుక్కుంటూ వచ్చింది. పెద్దలు వద్దంటున్నా రాజ్యలక్ష్మీ దేవితో పాటు తోటికోడలు, అక్కగారు అన్నపూర్ణగారు 1932 జనవరి 26న శాసనోల్లంఘనం చేయ్యడానికి ముందు కొచ్చారు. అప్పటికే సెక్షన్ 144 అమలులో ఉంది. ఈ ముగ్గురు ఆడవారు శాసనోల్లంఘన చేస్తారని ముందే ప్రకటించడం వల్ల ఎంతో మంది ఆడమగ భేదం లేకుండా జనం చుట్టు పక్కల ఊళ్ళ నుంచి కూడా తరలి వచ్చారు. వారు జాతీయ గీతం పాడుకుంటూ అందరు ఊరేగింపుగా బయలు దేరారు. పోలీసు ధిక్కార నేరం క్రింద అందరి మీద లాఠీ చార్జి చేసి ముగ్గుర్ని అరెస్టు చేసి అక్కడ సబ్ జైలు లేనందున పోలీసు స్టేషన్‌కి తీసుకువెళ్ళి పైగా 50 రూపాయలు జరిమానా విధించారు. వీరు స్వతంత్ర్య ఉద్యమం కోసం ఒంటి నిండా ఉన్న బంగారు నగలు, ఒడ్డాణం, బంకీలు కాసుల పేర్లు, చంద్రహారాలు, గాజులు మొదలైనవి కండువాలో పెట్టి ఇచ్చేశారు.

జైల్లో నిబంధన ప్రకారం వెళ్ళాలని గాంధీ గారి ఆదేశం అందుకే ఎవరు పేచీలు పెట్టేవారుకాదు. హిందు ధర్మ శాస్త్రానికి విరుద్ధంగా ముందు జైల్లోకి వెళ్ళగానే ఆడవారి చేతిగాజులు పగులగొట్టేవారు. అది మాధర్మానికి విరుద్ధమని అల్లర్లు చేయగా ప్లాస్టిక్ గాజులు ఆడవారు ధరించడానికి అంగీకరించారు. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు జైళ్ళలోని ఆడవారి అందరికీ గాజులు పంపించారు.

జైల్లో ఉన్నందుకు దు:ఖంలేదు, బెంగలేదు, పైగా పలు రకాల ఆటలతో, పాటలతో గడిపేవారు. పైగా చదువు నేర్చుకోవడం, ఇతరులకు చదివి వినిపించడం అందరినీ జాతీయ ఉద్యమం వైపు నడిపించారు. 1940లో వ్యక్తి సత్యాగ్రహాలు ప్రారంభమయ్యాయి. రెండవ ప్రపంచ యుద్ధానికి వ్యతిరేకంగా శాంతి మూలంగా వ్యక్తిగత సత్యాగ్రహాలు జరగాలని అధిష్టానం ఆదేశం. గుంటూరు జిల్లా నుండి రాజ్యలక్ష్మీదేవి ఎన్నికయ్యారు. బాపట్ల తాలుకా బ్రాహ్మణ కోడురులో 1941 జనవరి 30న రాజ్యలక్ష్మీ దేవి వ్యక్తి సత్యాగ్రహం చేశారు. ముందుగానే పోలీసులకు నోటీసు ఇచ్చారు. ఒక సర్కిల్ ఇనస్పెక్టరుకి మాత్రమే వారిని అరెస్టు చెయ్యడానికి అధికారముంది. అలాని క్రిందివారు ఎవరుకూడా అరెస్టు చెయ్యడానికి వీలులేదు. ఆనాడు వ్యక్తి సతాగ్రహంలో పాల్గొన్న వ్యక్తి రాజ్యలక్ష్మీదేవి నుదుటికి తిలకం పెట్టి ఉద్యమ గీతాలు పాడుకుంటూ బాపట్లలో వ్యక్తి సత్యాగ్రహం చేశారు.

రాజ్యలక్ష్మి దేవిని అరెస్టు చేసి ఒంగోలు జైలుకి తీసుకువెళ్ళారు. రాత్రి కలెక్టరు వచ్చి రాయివేలూరు జైలుకు తీసుకు వెళ్ళారు. ఆయనది ఉత్తరప్రదేశ్ ఆయనే కాదు ఆయన కుటుంబీకులందురూ దేశభక్తులే. ఆయన జైల్లో ఉన్న వారందరినీ దేశభక్తిని గురించి వివరించారట "మాతృదేశభక్తిని డ్యూటి నిర్బందించలేదు కదా!"

1940 – 41లో రాజకీయ పాఠశాలను స్థాపించారు. 1942లో జయప్రకాష్ నారాయణ ఆంధ్రాకు వచ్చి ఐదుగురు మెంబర్లతో ఒక కమిటీని వేశారు. ఆ అయిదుగురులో ఒకరు రాజ్యలక్ష్మిదేవిగారు.

మగ వారంతా జైళ్ళపాలు అయ్యారు. స్త్రీలు అరెస్టు కాకుండా తప్పించుకుంటూ జైళ్ళలో ఉన్న వారికి సహకరించాలి. స్త్రీలు మగ వేషాలు వేసి తిరగవలసి వచ్చేది. రాజ్యలక్ష్మి పురుష వేషంలో తిరిగేవారు. ఈవిడను అరెస్టు చెయ్యడానికి పోలీసులు వారంటు పట్టుకొని తిరిగేవారు. ఒకసారి అనారోగ్యంగా ఉన్న తల్లిని చూడటానికి ఇంటికి వచ్చారు. ఈవిడా కిటికీ తలుపులు తెరచి బయటకు చూడగ అక్కడ ఉన్న పోలీస్ వారు ఆమెను పసిగట్టి వెంబడించారు. ఆమె పెరటి గోడ దాటి మూడిళ్ళు దాటి నాలుగో యింటి అటక మీద దాగున్నారు. పోలీసులు రాత్రి అంతా వెతుకుతున్న ఆమె ఆరాత్రి అంతా అటక మీదనే ఉండి తెల్లవారు ఝూమున ఆకు పచ్చరంగు చీరకట్టుకుని కాలకృత్యాలు తీర్చుకునే నేపంతో చెంబు పట్టుకుని బయటకు వచ్చి పోలీసుల కళ్ళకప్పి ఆ గ్రామ సరిహద్దులు దాటి తప్పించుకు పారిపోయ్యారు. పరదాల మధ్యలో రాణి వాసంలో మసలె ఆవిడ మారు వేషంలో ఉరుకులు, పరుగులు పెడుతూ పారిపోవడం ఆశ్చర్యంగా లేదూ! ఆవిడ పట్టుదల చురుకుదనం కార్యదీక్ష చూసి చేబ్రోలు టౌన్‌కి ఆవిడను కాంగ్రెస్ ప్రెసిడెంట్ చేశారు. అయిన ఆమె జీవితం చీకటి మయం అయింది. భర్తతో విడిపోవలసిన పరిస్థితులు వచ్చాయి. చీకటింట్లోని తెల్లవారినట్టుగా ఆ ఇబ్బందుల్లోనే స్వరాజ్యం వచ్చింది. భరతమాత సంకెళ్ళు వీడి స్వతంత్ర దేశంగా నిలిచింది. దేశమంతా ఆనందమయంలో ఉరకలు వేస్తూ ఉంటే రాజ్యలక్ష్మీ గారి జీవితంలో చీకట్లు తొలిగిపోలేదు. ఆవిడ కృషి అంతటితో ఆగలేదు. తెలంగాణాలోని రజాకార్ల అల్లర్లలో బాధపడుతున్న ఆడవాళ్ళ మీదకు మళ్ళింది. వారికి సహాయం చెయ్యాలని నిశ్చయించుకుంది. ఆమె తుదిశ్వాస విడిచినప్పటికి ఎందరినో అదిలించి స్వతంత్ర్య ఉద్యమం వైపు నడిపించిన స్త్రీరత్నం త్యాగశీలి మన సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి.

**ఆధార గ్రంథాలు :**

1. ప్రభావతి, వాసా – స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు మహిళలు – జాలీ ఫ్రెండ్స్ కల్చురల్ అసోసియేషన్, (మహిళావిభాగం), మలక్‌పేట్, హైదరాబాదు.

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమం – దువ్వూరి సుబ్బమ్మ

డా॥ బి. సురేంద్ర, ఉప ఆచార్యులు (హిందీ), ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల, తిరుపతి జిల్లా.

**"దేశ నిర్మాతలు మీరు కాదు, మీ స్త్రీలను విద్యావంతులు చేస్తే చాలు దేశం బాగుపడుతుంది. నిన్నా, నేడూ, రేపూ, మానవ జీవితం ఉన్నంత కాలం ఇది సత్యం. ఉయ్యాలలూపిన చేతులు ప్రపంచాన్ని పరిపాలిస్తాయి." – సరోజినీ నాయుడు.**

సరోజినీ నాయుడుగారి పై మాటలు అక్షర సత్యాలు. పోరాట పటిమకు నిదర్శనం మహిళ అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. స్వరాజ్యసాధనకు ప్రతి ఒక్కరు ఉద్యమిస్తున్న రోజులవి. గాంధీజీ అహింస, సత్యాగ్రహమనే ఆయుధాలతో స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రారంభిస్తే, ఆయన వెంట నడిచిన వారెందరో ఆనాటి కుటుంబాలను వదలి బానిసత్వాన్ని పారద్రోలడానికి ఉద్యమంలోకి నడిచిన ధీసాలి, ఆత్మస్థైర్యంతో ఆంగ్లేయులను ఎదిరించి, తన గొంతుకతో స్వాతంత్ర్యోద్యమ కాంక్షను రగిల్చిన ధైర్యశిరోమణి, దేశం కోసం సర్వస్వం అర్పించిన ధైర్యవంతురాలు దువ్వూరి సుబ్బమ్మ గారు.

కంచుకంఠం ఆమె సొంతం. తాను చదువుకోకపోయినా ఎందరో బాలికలకు విద్యనందించిన ధీర వనిత. మన దేశ స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొని జైలుకు వెళ్ళిన మొట్టమొదటి ఆంధ్ర మహిళ. సమాజ సేవిక, స్త్రీ విద్యకు, స్త్రీ జనోద్ధరణకు కృషి చేసిన మహనీయురాలు.

ఈమె సనాతన బ్రాహ్మణ కుటుంబంలో 1880 సం॥ తూర్పు గోదావరి జిల్లాలోని రామచంద్రాపురం మండలం ద్రాక్షారామంలో, మల్లాది వెంకటనరసమ్మ, మల్లాది సుబ్బావధానులకు జన్మించింది. చిన్నతనంలోనే దువ్వూరి వెంకటప్పగారితో ఆమెకు బాల్య వివాహం జరిగింది. రాజమండ్రి తాలూకా కడియం గ్రామంలో అత్తింట ఆమె అడుగుపెట్టింది. కొద్దికాలంలోనే భర్త మరణిస్తే బాలవితంతువుగా మారి కృంగిపోయింది. ఈ వైధవ్యం నాటి బ్రాహ్మణ స్త్రీలకు సర్వసాధారణంగా జరిగేదే. ఆ తరువాత వాళ్ళ జీవితాలు ఇంటిచాకిరీకి పరిమితమై అనామకంగా సాగేవి. భర్త, పిల్లలు లేని ఆ బాధను దిగమింగి, దేశ ప్రజలనే పిల్లలుగా భావించి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనాలనే ఆశయాన్ని సంకల్పంగా తీసుకున్నారు. అప్పటికీ ఆమెకు అక్షరజ్ఞానం లేదు.

తిరుపతి వెంకటకవుల్లో ఒకరు, సమీప బంధువైన చెళ్ళపిళ్ల వేంకటశాస్త్రి చేరదీసి విద్యాబుద్ధులు నేర్పారు. ఆయన ప్రోత్సాహంతో తెలుగు, సంస్కృత భాషల్లో పట్టు సంపాదించి గొప్ప వక్తగా మారారు సుబ్బమ్మ. వేంకటశాస్త్రిగారు ఇచ్చిన స్ఫూర్తి ఆమెలో స్వాతంత్ర్యోద్యమం గురించి ఆలోచించేలా చేశాయి. అనేక సభలు, సమావేశాలలో ఆమె పాల్గొన్నారు.

1921లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ రాజకీయ మహాసభలో మొదటిసారిగా అడుగుపెట్టింది. అప్పటికి ఆమె బాలవితంతువు. నాటి ఆచారాన్ని బట్టి ఆమెకు కేశములు తీసివేసినా, తలకు ముసుగు వేసినా, సంప్రదాయ కట్టుబాట్లను కాదని తన వేషానికి సిగ్గుపడక వేదిక మీదికి వస్తే అక్కడున్న జనం ఆమెను ఆశ్చర్యంగా చూశారు. ప్రకాశం పంతులుగారు ఆ సభకు అధ్యక్షులు. బులుసు సాంబమూర్తిగారు ప్రవేశపెట్టిన సంపూర్ణ స్వరాజ్య తీర్మానాన్ని ఆమె బలపరచడమే కాదు. సభలో ఆమె గంభీరోపన్యాసం అందరిని ఆకట్టుకుంది. కుటుంబసభ్యులను ఒప్పించి స్వరాజ్య సమరంలో దూకారు. తన వాక్పటిమతో నారీలోకాన్ని కదిలించారు.

**"ఉరిమింది భరత జాతి . . .**
**రగిలింది ప్రజా శక్తి . . .**
**మోగింది విజయభేరి . . .**
**ఎగిరింది జాతీయ జెండా"**

అంటూ ఊరూరా తిరిగి ప్రజల్లో స్వాతంత్ర్యోద్యమ కాంక్షను రగిలించారు. దేశభక్తి గేయాలు, పాటలు పాడుతూ, ఇతిహాసాల్లోని సూక్తులను ఉటంకిస్తూ . . . సూటిగా, చురుగ్గా కరుగ్గా ఆమె చేసే ప్రసంగాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేవి. కేవలం సుబ్బమ్మ ప్రసంగం వినడానికే సభకు ఎంతో మంది హాజరవుతుండేవారంటే అతిశయోక్తి కాదు.

ఆమె గొంతెత్తి పాడితే శ్రోతలందరూ కార్యకర్తలైపోయేవారు. మైకులు లేని ఆ రోజుల్లో ఆమె గళం కంచుకంఠమైంది. ఆమె గొంతెత్తి పాడినా, నినాధాలు చేసినా, ప్రసంగించినా ఐదారు వేల మంది పాల్గొన్న సభల్లోనూ, ఎంత దూరంలో ఉన్నవారికైనా ఎంతో స్పష్టంగా వినిపించేది. గరిమెళ్ళ సత్యనారాయణగారి పాట "మాకొద్దీ తెల్లదొరతనం దేవా..." ఆమె పాడినట్లు మరెవరూ పాడలేకపోయేవారు. సుబ్బమ్మ ఉపన్యాసం జనానికి వినిపించకూడదన్న ఉద్దేశంతో బ్రిటీష్ పోలీసులు... ఆమె ప్రసంగిస్తున్న చోటుకు వెళ్ళి డప్పులు, డబ్బాలు కొడుతుండేవారు. ఆగ్రహించిన సుబ్బమ్మ పోలీసులపై విరుచుకుపడేవారు. "నేను గంగాభగీరథ సమానురాలును, నేను తలుచుకుంటే మిమ్మల్ని గంగలో నిలిపేయగలను. కానీ గాంధీజీ ఆజ్ఞానుసారం అహింసావ్రతాన్ని పూనాను. ఆమె చుట్టూరా ఉన్నవారికి వినోద కార్యక్రమంగా ఉండేది. ఆమెను చూసి పోలీసులు భయపడే వారనటంలో అతిశయోక్తి లేదు.

ఆమెను అడ్డుకోవడానికి ఆంగ్లేయులు ఆమెను నిర్బంధించి జైలుకు పంపారు. "తప్పు ఒప్పుకుని క్షమాపణ చెబితే" నిన్ను వదిలిపెడతాం అన్నాడు అప్పటి బ్రిటీష్ కలెక్టర్. ఆ మాటలను అసహ్యించుకున్న సుబ్బమ్మ "ఛీ . . . ఛీ! నా కాలిగోరు కూడా ఆ పనిచేయదు అని ధీటైన సమాధానం చెప్పిన ఆత్మాభిమాని. ఆరు నెలలపాటు కారాగారంలో గడిపారే కానీ తెల్లదొరలు ఇచ్చిన ఆ అవకాశాన్ని అస్సలు వినియోగించుకోలేదు. సుబ్బమ్మ జైల్లో ఉపన్యసిస్తూ పాటలు పాడుతూ ప్రతి ఒక్కరిలో జాతీయభావాన్ని పెంపొందించేవారు.

పొనకా కనకమ్మ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ మొదలగు వారితో కలిసి పనిచేసారు. పరస్పరం అభిప్రాయాలు తెలుసుకునేవారు. స్వాతంత్ర్య పోరాటంలో మహిళల భాగస్వామ్యాన్ని సుసంపన్నం చేయడానికి, స్త్రీ విద్యాభివృద్ధికి చేపట్టవలసిన కార్యక్రమాలను గురించి చర్చించుకునేవారు. తన మేనమామ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు రాసిన "భరత ఖండంబు చక్కని పాడియావు . . . పద్యాన్ని రాగయుక్తంగా పాడుతూ జనంలో స్వాతంత్ర్య జ్వాల రగిలించేది, ప్రజలు దేశభక్తితో ఉప్పొంగేరీతిగా గానం చేసేది. బ్రిటీష్ అధికారులను, పోలీసులను తన సింహగర్జన వంటి స్వరంతో అరిచి కోప్పడి భయభ్రాంతులను చేయడం విశేషం.

1922 జనవరిలో తలపెట్టిన సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని భారత, భాగవత పద్యాలు రాగయుక్తంగా చదువుతూ గంభీరోపన్యాసాలు ప్రారంభించింది. ఆమెను ఆంగ్లేయులు భరించలేకపోయారు. కలెక్టర్ ఆమెను రాజమండ్రి సెంట్రల్ జైల్లో పెట్టారు. క్షమాపణ చెబితే వదులుతామన్నారు. ఆమె అంగీకరించలేదు. 100 రూ॥ జరిమానా చెల్లించమన్నాడు. ఆమె తల ముసుగు తీసి చూపించి "ఇదే నా దగ్గర ఉందని" సమాధానమిచ్చింది. ఆమె ధైర్యానికి కలెక్టర్ సిగ్గుపడ్డాడు.

. . . ఖద్దరు చీర బరువు మోయలేక పోతున్నామని సుబ్బమ్మకు మొరపెట్టుకున్నారు. దాంతో "గుండెత్తుల బరువున్న మొగుళ్లను మోస్తున్నారు. ఉద్యమం కోసం ఈ మాత్రం కోకలు బరువయ్యాయా . . . మోయలేరా?" అంటూ మహిళలను తనదైన శైలిలో మందలించి వారిలో చేనేత స్ఫూర్తిని నింపారు.

ఉప్పు సత్యాగ్రహం చేసి అరెస్టయ్యి సంవత్సరం పాటు రాయవెల్లూరు జైల్లో శిక్ష అనుభవించారు. ఆనాటి నుంచి జరిగిన జాతీయోద్యమ ప్రధాన ఘట్టాలన్నిటిలో ఆమె ముందు నిలిచి నాయకత్వం వహించారు. వ్యక్తి సత్యాగ్రహంలో సుబ్బమ్మ పాల్గొంటున్నట్లు ఆంగ్లేయ పోలీసులు తెలుసుకొని అక్కడ దాడి చేశారు. దానికి సుబ్బమ్మగారు ఆగ్రహించి వారిపై విరుచుకుపడిన ఆమె ధైర్యాన్ని చూసి మిగిలినవారు ధైర్యం తెచ్చుకుని, వారు కూడా బ్రిటీష్ రక్షకదళాలపై విరుచుకుపడ్డారు.

పోరాట పటిమను ప్రదర్శించిన ఆమెకు కాకినాడలో 1923లో నిర్వహించిన కాంగ్రెస్ సభలో దేశబాంధవి అనే బిరుదును ఇచ్చి గౌరవించారు. స్వాతంత్ర్య పోరాటయోధురాలైన దువ్వూరి సుబ్బమ్మగారు ఆంధ్రాలోనే కాక భారతదేశంలో గొప్ప వనితగా పేరుపొందినది.

అన్ని రంగాల్లోను మహిళలు వెనుకబాటుతనానికి ముఖ్య కారణం చదువుకోకపోవడం. చదువుతోనే చైతన్యం సాధ్యమౌతుందని గ్రహించిన ఆమె విరాళాలు సేకరించి స్త్రీలకు విద్య నేర్పించి, ఉచితంగా వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు

చేశారు. రాజమండ్రిలో "సనాతన స్త్రీ విద్యాలయమ"నే బాలికా పాఠశాలను స్థాపించారు. స్వాతంత్ర్యం వచ్చినపుడు స్వేచ్ఛను పొందండి. ఆనందాన్ని అనుభవించండి. ఈ శుభవేలలో తీపి తినండి అంటూ మిఠాయిలు పంచింది. స్వాతంత్ర్యం అనంతరం 1954లో అప్పటి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారు స్వయానా కడియం గ్రామానికి వెళ్ళారు. అప్పుడు వారి బంధువు 'ఒక కూర్చీని వేయించి ప్రకాశంగారిని కూర్చుండబెట్టారు. అంటే ఆమె ఇంట్లో కనీసం కుర్చీ కూడా లేనంత దీనావస్థను, పేదరికాన్ని అనుభవించారు. ఎటువంటి పదవులను, అధికారాన్ని అందుకోలేదు. ఆమె ప్రకాశంగారితో మాట్లాడుతూ "ఒరేయ్ పంతులూ ఎలా ఉందిరా? ఈ నల్లోళ్ల పరిపాలన అని అడిగిందట. అహర్నిశలు దేశం కోసమే పరితపించిన ఆమె 1964 మే 31వ తేదీన పరమపదించారు. దేశభక్తురాలిగా ఆమె ధన్యజీవి. ఆమె స్మారకార్థం రాజమండ్రి స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో విగ్రహాన్ని ప్రతిష్టించారు.

దువ్వూరి సుబ్బమ్మ గారి జ్ఞాపకార్థం 2021 మార్చి 8వ తేదిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒక ప్రత్యేక తపాలా కవరును విడుదల చేసి గౌరవించింది భారత తపాలాశాఖ, ఈ కవర్ మీద సుబ్బమ్మగారి విగ్రహం చిత్రాన్ని ముద్రించడం స్త్రీ జాతికే గర్వకారణం.

సంఘసేవకురాలిగా, మహిళా విద్య ఉద్యమకారిణిగా, స్వాతంత్ర్యపోరాట యోధురాలిగా, దేశం కోసం పరితపించిన ధీశాలి, దువ్వూరి సుబ్బమ్మగారు యావత్ ప్రజానీకానికి చరస్మరణీయురాలు.

**ఆధార గ్రంథాలు :**

1. మహిళావరణం – ఓల్గా వసంత కన్నాబిరాన్, కల్పన కన్నాబిరాన్.
2. భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు స్త్రీలు – డా॥ వాసా ప్రభావతి.
3. నవ తెలంగాణ (సమగ్ర తెలుగు దినపత్రిక) – దేశభాందవి దువ్వూరి సుబ్బమ్మ – మానవి.
4. దువ్వూరి సుబ్బమ్మ – పుట్టి నాగలక్ష్మి – సంచిక (తెలుగులో తొలి డైనమిక్ వెబ్ పత్రిక)

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# భారత స్వాతంత్ర్య సమరంలో కస్తూరిబాగాంధీ పాత్ర

డా॥ పి. గాయత్రి, గణిత అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు. తిరుపతి జిల్లా. చరవాణి : 89852 59613
డా॥ సి. నరసింహా రెడ్డి, గణిత అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు. తిరుపతి జిల్లా.చరవాణి : 99088 53837

కస్తూరిబాయి మానవసేవే మాధవసేవ అని ఐహికసుఖాలను లక్ష్యపెట్టక మహాత్ముని వెంట ఉద్యమకర్తగా నడిచిన మహామనిషి. ఈమె ఒక భారతీయ రాజకీయ కార్యకర్త. 13 సం॥ వయస్సులో వివాహమై అత్తింట అడుగుపెట్టిన కస్తూరిబాయి భోగభాగ్యాలను త్యజించి నిరాడంబరమూర్తియై భారత స్వాతంత్ర్యదీక్షాకంకణముతో అనారోగ్యమును లెక్కించక పలుసార్లు జైలుకు వెళ్ళిన దీక్షామూర్తి కస్తూరిబాయి. మహాత్ముడు ఉపవాసదీక్షలోనున్నప్పుడు అతనికి నీడలా వెన్నంటి ఉండి లోకకళ్యాణానికి జీవితాన్ని అంకితం చేసిన త్యాగమూర్తి కస్తూరిబాగాంధీ. భారతీయులకు ఆపద్భాందవి. భారతదేశంలో ప్రతి సంవత్సరం కస్తూరిబాగాంధీ జయంతి సందర్భంగా ఏప్రిల్ 11న జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం జరుపుకుంటారు. కస్తూరిబాగాంధీ భరతమాతకు ముద్దులబిడ్డ.

కస్తూరిబాయి గోకుల్‌దాస్ కపాడియా 1869 ఏప్రిల్ 11న గోకుల్‌దాస్ కపాడియా మరియు వ్రాజ్‌కున్ వెర్బా కపాడియాకు పోర్బందర్ నగరంలో జన్మించారు. మే 1883లో కస్తూరిబాయికి 13 సం॥ల వయస్సు వున్నప్పుడు మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీతో వారి తల్లిదండ్రులు వివాహం ఏర్పాటుచేశారు. వీరి వివాహం భారతదేశంలో సాధారణంగా మరియు సాంప్రదాయంగా జరిగింది. తండ్రి రాజకోట సంస్థానంలో ప్రధానమంత్రి. కస్తూరిబాయి తన వివాహానికి ముందు పాఠశాల విద్యను అభ్యసించలేదు. మహాత్మాగాంధీ గారు ఆమెకు ప్రాథమిక విద్యను అందించడానికి బాధ్యత వహించారు. విద్య నేర్చుకొనుటలో చురుకుతనము లేకపోయినా కస్తూరిబాయి కార్యనిర్వహణలో చురుకుతనాన్ని అందుకుంది. జీవితాంతం లోకాన్ని చదవాలని నిశ్చయించుకుంది.

కస్తూరిబాయికి, మహాత్మాగాంధీకి ఐదుగురు సంతానము కలుగగా, వారిలో నలుగురు పెద్దవారైరి. సంతానవతియైన కస్తూరిబాయి ఎల్లవేళల భర్తకు అండదండగా నిలిచింది. సాధారణమైన కాతియావారి కుటుంబంలో జన్మించిన కస్తూరిబాయి ఆయనతో పాటు లండను వెళ్ళి తిరిగివచ్చిన తర్వాత వేషభాషలతో పాటు ప్రవర్తనలో నాగరికతను సంతరించుకొన్నారు.

1904లో కస్తూరిబాగాంధీ తన భర్త మరియు ఇతరులతో దర్బన్ సమీపంలో వున్న ఫీనిక్స్ సెటిల్‌మెంట్‌ను స్థాపించినపుడు మొదటిసారిగా దక్షిణాఫ్రికాలో రాజకీయాలలో మరియు సామాజిక క్రియాశీలతలో పాల్గొన్నారు. గాంధీగారు దక్షిణాఫ్రికాలో చేసిన కార్యక్రమాలన్నిటికీ ఆమె చేయూతనిచ్చారు. మొదట్లో ఆమె తన సిద్ధాంతాలను అనుసరించుటకు గాంధీ చాలా కష్టపడెను. ఆమె పూర్తిగా గాంధీ సిద్ధాంతాలను అర్థము చేసుకొని వాటిని ఆచరించుటకు తిరిగి అంత కష్టపడి జీవితాన్నే గాంధీ సిద్ధాంతాలకు అంకితము చేసింది. 1913లో దక్షిణాఫ్రికాలో భారతీయుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినందుకు జరిగిన నిరసనలలో ఆమె పాల్గొన్నారు. అందుకోసం ఆమెను అరెస్టుచేసి మూడు నెలల జైలుశిక్ష విధించారు. జైలులో వున్నప్పుడు ఆమె చదువుకోని మహిళలకు చదవడం మరియు వ్రాయడం ఎలాగో నేర్పించమని విద్యావంతులైన మహిళలను ప్రోత్సహించేది.

గాంధీజీ ఆశయాన్ని, ఆదేశాన్ని అనుసరించి ఆమె ప్రతిదినము రాట్నముపై నూలు వడికి ఎందరో భారతీయులకు ఆదర్శంగా నిలిచింది. కస్తూరిబాగాంధీ నిత్యము రామాయణము, భగవద్గీత పారాయణము చేసేది. జైలులో ఉన్నాకూడా ఆమె తన నియమములు పాటించేది. పూనాలోని ఆగాఖాన్ నిర్బంధ భవనములో అనారోగ్యముతో ఉన్నప్పటికీ తన దినచర్యను విస్మరించక మరింత నీరసపడింది. అయినా కాని ఆమె తన పట్టుదల వదలలేదు. కస్తూరిబాగాంధీ తన జీవితాన్ని తన ఆశయాలకే అంకితం చేయ నిశ్చయించుకుంది. ఎన్ని ఆటంకములు ఎదురొచ్చినా తన ఆశయాన్ని వదలని ధీశాలి.

1897లో మహాత్ముడు దక్షిణాఫ్రికాలో వుండగా కస్తూరిబా అక్కడికి చేరుకున్నారు. అప్పటినుండే ఆమె భర్త ఆశయాలు తన ఆశయాలుగా స్వీకరించింది. అప్పటినుండియే ఆమె బహిరంగ జీవితం ప్రారంభమైంది. అప్పటివరకు ఆమె ఒక గృహిణి.

1904 నుంచి 1914వరకు కస్తూరిబాయి గాంధీ దక్షిణాఫ్రికాలో గాంధీతోపాటు పనిచేసి అందరిచేత అమ్మగా పిలువబడినారు. కస్తూరిబాగాంధీ ఇండియాకు తిరిగివచ్చిన తరువాత సబర్మతి, కోచిగ్రామ ఆశ్రమంలో అదే పాత్ర నిర్వహించి అందరిచేత అమ్మగా పిలువబడి దేశప్రజలకే అమ్మగా నిలిచింది. దక్షిణాఫ్రికాలోని అంతిమపోరాటంలో ఆమె నాయకురాలై సత్యాగ్రహం నడిపించారు. ఆమె జైలుశిక్ష అనుభవించి వచ్చేటప్పటికి ఆమె ఆరోగ్యం మరింత క్షీణించింది.

1915లో గాంధీగారితో పాటు ఆమె ఇండియాకు నూతన చైతన్యమూర్తిగా తిరిగివచ్చారు. బీహారులోని ఛాంపారన్ ప్రాంతంలో శ్వేతజాతీయులు భారత కూలీల అణచివేతకు నిరసనగా గాంధీ ఉద్యమం చేపట్టారు. వారి సమస్యలకు పరిష్కారంగా వారి బతుకులు చక్కబడుటయే గాంధీ ధ్యేయం. ఆ ధ్యేయానికి అనుగుణంగా కస్తూరిబాయి పల్లెస్త్రీలకు, వారి పిల్లలకు రాయుట, చదువుటే కాకుండా పరిశుభ్రత, క్రమశిక్షణ నేర్పించడానికి ఎంతగానో కృషిచేశారు.

1918లో గాంధీజీతోపాటు కైరా సత్యాగ్రహంలో ఆమె కూడా పాల్గొని పల్లె స్త్రీలకు అహింసాపద్ధతులతో ఆంగ్ల ప్రభుత్వాన్ని ఎదిరించడం నేర్పించారు. మనోధైర్యం, పట్టుదల ఆమెలో మరింతగా చోటుచేసుకున్నాయి. అది మొదలు ఆమె మహాత్ముని జైలులో బంధించినప్పుడల్లా ఆమె గాంధేయ సిద్ధాంతాలతో స్వరాజ్య సమరంలో పాల్గొనడమే కాదు సభలలో ప్రసంగించి, వారిని స్వరాజ్యపోరాటం వైపు మరలించి ప్రజలకు మనోధైర్యం చేకూర్చేవారు. రాణిపరాజ్ రెండవ మహాసభకు ఆమె అధ్యక్షస్థానం వహించి ఆమె చేసిన ప్రబోధానికి వారి జీవితాలే మారిపోయాయి. చీకటిలో నలిగిపోతున్నవారు చైతన్యవంతులై వెలుగురేఖల వైపు పయనించారు. కన్నీళ్ళ బతుకుల్లో నుండి ప్రశాంత జీవితంలో అడుగుపెట్టారు.

1922లో గుజరాత్‌లోని బోర్సాడ్‌లో జరిగిన సత్యాగ్రహ ఉద్యమంలో ఆమెకు ఆరోగ్యం సరిగాలేకపోయినా పాల్గొన్నారు. 1930లో జరిగిన ప్రసిద్ధ సాల్ట్‌మార్చ్‌లో ఆమె పాల్గొనలేదు. అనేక శాసనోల్లంఘన ప్రచారాలు మరియు కవాతుల్లో పాల్గొన్నారు. ఫలితంగా ఆమె అనేక సందర్భాల్లో అరెస్టు చేయబడి జైలుశిక్ష అనుభవించారు.

1939లో ఆమె రాజకీయ సంస్కరణలకై నిర్వహించబడిన సత్యాగ్రహంలో పాల్గొన్న కారణంగా ఆమెను బంధించి త్రాంబా జైలుకు పంపించారు. అదే సమయంలో గాంధీజీ ఆంగ్లేయుల రాజకీయ విశ్వాసఘాతానికి నిరసనగా నిరసన వ్రతం ప్రారంభించారు. దానికి భయపడిన ఆంగ్లేయులు ఆమెను జైలు నుండి విడుదల చేసారు. కాని ఆమె అందుకు అంగీకరించలేదు. జైలులో తనకు సహచరులైన మణిబేన్ పటేల్, మృదులబేన్ సారాభీలను కూడ విడుదల చేయమని, లేనిచో తానిక్కడి నుండి కదలనని పట్టుపట్టింది. గాంధీజీ ఉపవాసదీక్షతోనే అల్లకల్లోలంగా ఉన్న భారతదేశం మరింత అల్లకల్లోలం అవుతుందనే భయంతో మరో దారిలేక ఆంగ్లేయులు వారిని కూడా విడుదల చేశారు.

1942 ఆగస్టులో బొంబాయి కాంగ్రెసు జాతీయ మహాసభలో 'క్విట్ ఇండియా' ఉద్యమ తీర్మానం ఆమోదించబడింది. నాయకులను బంధించి జైలుపాలు చేస్తే ఆ ఉద్యమం అంతటితో ఆగిపోతుందనే ఉద్దేశ్యంతో వారు మహాత్మాగాంధీని బంధించారు. గాంధీజీ ఉపన్యసించవలసిన సభకు కస్తూరిభా సారథ్యం వహించారు. ఆమెను బంధించి ఆంగ్లేయులు బొంబాయిలోని ఆర్థూర్ జైలుకు పంపించారు. ఆమె బాంబేలోని జైలులో ఉంటే ప్రజలు తిరుగుబాటు చేస్తారనే భయంతో ఆమెను రెండురోజుల తరువాత పూనాలో గాంధీజీ వున్న ఆ కారాగారానికే పంపించారు. ఆంగ్లేయులు చేస్తున్న అణచివేతల చర్యలకు, అమాయకులను హింసిస్తున్న రక్తపాతానికి, అన్యాయాలకు, ప్రభుత్వ అక్రమాలకు ప్రజలు అదుపులేకుండా మరింత రెచ్చిపోతున్నారు.

1943 ఫిబ్రవరిలో మహాత్మాగాంధీ తిరిగి 21 రోజులు ఉపవాసదీక్ష ప్రారంభించాడు. కస్తూరిబాయి ఆయనను కనిపెట్టుకుని సపర్యలు చేసింది. ఆయన ఉపవాసములో ఉండగా ఆమె కడుపునిండా తినలేక ఒకపూట పాలు, పండ్లు ఆహారముగా తీసుకొనేది. గాంధీజీ ఉపవాసదీక్షలో ఉండగానే ఆమె ఆరోగ్యం మరింత క్షీణించడం ప్రారంభించింది. ఆమె అనారోగ్యముతో మంచం మీద ఉన్నప్పటికీ గాంధీ ఆహార విషయంలో ఆమె ఎంతో శ్రద్ధ వహించారు.

కస్తూరిబాగాంధీ పాత్ర నారీమణులకే ఆదర్శం. గాంధీ ఆశ్రమం ఈవిడ వల్లనే ఆడవారితో నిండిపోయింది. నూలువడకడంలో, ముదురు ఖద్దరు ధరించడంలో, ఉప్పు సత్యాగ్రహంలో ఎందరో స్త్రీలను తనవెంట నడిపించి విజయానికి కారణభూతురాలైంది. ధనవంతురాలైన నెహ్రూను కన్నతల్లి స్వరూపరాణి ఈమెతో ఉద్యమంలో పాల్గొన్న నారీమణి. క్విట్ ఇండియా ఉద్యమంలో కారాగారంలో మరణించి యావత్ భారతీయులకు ఆదర్శంగా నిలిచిన మహిళ కస్తూరిబాయి.

కస్తూరిబాయి పుట్టుకతో వచ్చిన సమస్యల కారణంగా క్రానిక్ బ్రాంకైటిస్‌తో బాధపడ్డారు. 1908 జనవరిలో గాంధీ జైలులో ఉన్నప్పుడు ఆమె నిరాహార దీక్ష చేయడంతో ఆమె ఆరోగ్యం మరింత క్షీణించి తీవ్ర అస్వస్థతకు గురైంది.

1944 జనవరిలో ఆమెకు రెండుసార్లు గుండెపోటు వచ్చింది. ఆ తర్వాత ఆమె ఎక్కువ సమయం మంచానికే పరిమితమైంది. ఆమెకు నొప్పి నుంచి ఉపశమనం లభించలేదు. ఊపిరి అందకపోవడం వల్ల రాత్రిపూట ఆమె నిద్రకు ఆటంకం ఏర్పడింది. భారతీయ చికిత్సలో మరింత సుపరిచితమైనది ఆయుర్వేద చికిత్స. అనేక ఆటంకాల తరువాత, భారతీయ వైద్యంలో సాంప్రదాయ నిపుణుడిని ఆమెకు వైద్యం చేయడానికి ప్రభుత్వం అనుమతించింది. 1944 ఫిబ్రవరి 22వ తేది రాత్రి 7.35 గంటలకు పూనాలోని అగాఖాన్ ప్యాలెస్‌లో 74 ఏళ్ళ వయసులో మరణించారు.

**ప్రస్తావనలు :**

1. స్వాతంత్రోద్యమంలో తెలుగు మహిళలు, వాసా ప్రభావతి, జూలీ ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్.
2. గాంధీ, అరుణ్ మరియు సునంద ది ఫర్గాటెన్ ఉమెన్ హాంట్సవిల్లే, AR : జుర్క్ మౌంటైన్ పబ్లిషర్స్.
   P-314, ISBN 940-02-9.
3. జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం & ఆశించే తల్లులకోసం పువ్వులు Aims India.

# స్వాతంత్ర్య సమరంలో ముస్లీం మహిళల పాత్ర–పరిశీలన

డా|| కె. చిట్టి కళావతి, చరిత్ర అధ్యాపకులు, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, పాకాల.

సాధారణంగా ముస్లీం సాంప్రదాయ జీవితాన్ని గడిపి, ముస్లీం మహిళలు రాజకీయ పోరాటాల్లో పాల్గొనడం అరుదు. అయిన భారతదేశం స్వతంత్ర్య పోరాటంలో అభ్యుదయ భావాలు కలిగిన ముస్లీం మహిళలు దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని లాఠీ దెబ్బలకు, జైలు శిక్షలకు వెనుకంజు వేయకుండ పోరాడిన ముస్లీం మహిళల పాత్ర ఔన్నత్యాన్ని తెలియజేయడమే నా పత్ర సమర్పణ సారాంశం.

భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్యోద్యమం మహోజ్వల ఘట్టము. భారతీయుల పోరాట పటిమకు త్యాగ నిరతికి, అసమాన దేశభక్తికి, ఈ ఉద్యమం నిలువుటద్దం. ఈ పోరాటానికి భారతదేశపు అతి పెద్ద అల్ప సంఖ్యాక వర్గమైన ముస్లీం సమాజం తమదైన భాగస్వామ్యాన్ని అందించింది. ఈ సమర జ్వాల చరిత్రలో ముస్లీం మహిళలు కూడా పురుషులతో దీటుగా తనదైన విరోచిత పాత్ర నిర్వహించారు.

**జాతీయోద్యమం:** ప్రథమ స్వాతంత్ర్య సమరము రగిల్చిన స్వాతంత్ర్య కాంక్ష లక్షలాది మహిళలు స్వాతంత్ర్యోద్యము వైపు నడిపినది. పూర్వీకుల అసమాన పోరాటాలలో వారసత్వంగా స్వీకరించిన ముస్లీం మహిళలు ఖిలాఫత్ ఉద్యమం ద్వారా పెద్ద సంఖ్యలో జాతియోద్యమంలో అడుగు పెట్టారు. జలియన్‌వాలాబాగ్ మారణకాండలో 378 మంది బలైపోగా అందులో 55 మంది ముస్లింలు. వారిలో ఒక ముస్లిం మహిళకూడ వుంది. స్వాతంత్ర్య పోరాటంలో ముస్లిం స్త్రీ పురుషులు అసంఖ్యాకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖిలాఫత్ కమిటీ జాతీయ కాంగ్రెస్ నిర్వహించిన సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్తు బహిష్కరణ, మద్యపాన నిషేధం లాంటి పలు కార్యక్రమంలో ముస్లీం స్త్రీలు బృహత్తర పాత్ర నిర్వహించారు.

బ్రిటీష్ పాలకుల దమననీతి, నిర్బంధాలకు భయపడకుండ జాతీయోద్యమ బాటలో నడిచిన స్త్రీలలో బీబీ అమ్మకు తొలి స్థానం లభించింది. ఈమె అనితర సాధ్యమైన సాహసంతో, అద్భుతమైన ప్రసంగాలతో, ఆదర్శవంతమైన నేతృత్వంలో ఖిలాఫత్ ఉద్యమం కోసం దేశమంతా తిరిగి ఆమె నిధులను సమకూర్చారు. అబాదీ భానూ బేగం బాటలో నడిచిన మరొక చిచ్చర పిడుగు నిషాతున్నీషా బేగం. ఆమె ఫైర్ బ్రాండ్‌గా పిలువబడిన మౌలానా హస్రత్ మోహాని భార్య.

గాంధీజీ అడుగుజాడల్లో నడిచిన ప్రముఖులలో శ్రీమతి అముతుస్సలాం ఒకరు. నౌఖాళి మతకలహాల నివారణకు గాంధీజీ ఆమెను పంపారు. కలహాల గ్రామీణులు సహకరించకుండా మంకుపట్టు పట్టడంతో 22 రోజులుపాటు నిరాహారదీక్ష పూని ఆ ప్రాంతంలో శాంతి సామరస్యాన్ని నెలకొల్పిన ఆమె గాంధీజీ ప్రశంసలందుకున్నారు. బేగం రెహనా తయ్యబ్జీ గాంధీజీకి ఉర్దూ భాషను నేర్పి గురవయ్యారు. స్వాతంత్ర్య ఉద్యమకారులచే హజఁరా అపాగా (హాజఁరా అక్కయ్యాగా) హాజఁరా అహమ్మద్‌ను పిలిపించుకున్నారు. ఈమె ఆంధ్ర రాష్ట్రంలోని మంతెనవారిపాలెంలో జరిగిన రాజకీయ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. గాంధీజీ నేతృత్వంలో ఆదర్శ వివాహం చేసుకున్న బేగం అమనా ఖురేషి, పోరుబాటలో నడిచినందుకు అరెస్టుయైన డిల్లీలోని తొలి మహిళా కార్యకర్త బేగం మహబూబ్ ఫాతిమా లాంటి వారెందరో వున్నారు.

**స్వాతంత్ర్య పోరాటంలో ఆంధ్ర మహిళలు:** శ్రీమతి రబియాబి, శ్రీమతి మహమ్మద్ గౌస్ ఖాతూన్ బీబీ, హజారా బీబీ ఇస్మాయిల్, శ్రీమతి నఫీస్ అయేషా బేగం, శ్రీమతి సుగరా ఖాతూన్, బేగం మజీదా బానో బీ, శ్రీమతి ఖుర్షీద్ ఖ్వాజా మొదలైన ముస్లీం మహిళలు ఆంధ్ర మరియు ఇతర ప్రాంతాలలో స్వాతంత్ర్య సమరంలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ చురుకుగా పాల్గొన్నారు.

**1. శ్రీమతి రబియాబి :** స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న సామాన్య స్త్రీలు పలు కష్టాలు మూడు రకాలుగా మహిళలను చుట్టుముట్టాయి. ప్రప్రథమంగా కుటుంబం, తరువాత సమాజం, చివరగా బ్రిటీష్ పోలీస్ మూకల నుండి ఇబ్బందుల వాతావరణం. ఈ కష్టాలు ముస్లింమహిళల. విషయానికి వచ్చే, సరికి మరింత కఠినమైన వారిని ముందుకు సాగనిచ్చేవికావు. బ్రిటీష్ పోలీసుల దారుణ

హింసకంటే కుటుంబము, సమాజము కల్పించే ఆటంకాల ప్రభావం. చాలా-తీవ్రంగా ఉండేది. తద్వార మాతృదేశ సేవకు అవరోధం ఏర్పడింది. అయినప్పటికీ ఇలాంటి విపత్కర పరిస్థితులలో రబియాబిలాంటి వారు ప్రతికూల వాతావరణాన్ని అధిగమించి జాతీయోద్యమంలో పాల్గొని చరిత్ర సృష్టించారు.

ఈ మహత్తర చరిత్రకు తనదైన పాత్రను నిర్వహించిన శ్రీమతి రబియాబి అనంతపురం జిల్లాలోని చియ్యడు గ్రామానికి చెందిన మహిళ. ఈమె భర్తపేరు యం. మొహిద్దీన్ సాహెబ్, స్వాతంత్ర్య సమరయోధుడు. భర్తతో పాటు ఈమె జాతీయభావాలను అలవర్చుకుంది. మహాత్ముని నేతృత్వంలో కొనసాగుతున్న జాతీయోద్యమంలో తాను భాగంగ ఉవ్విళ్ళూరింది. సహజంగానే కుటుంబము, సమాజము ఆమె ఆలోచనలను ముందుకు సాగనివ్వలేదు. "అయినా ఆమె ఎన్ని సమస్యలు వచ్చిన నిరాశ చెందలేదు. భర్త స్వాతంత్ర్య సమరవీరుడు కావటం వలన ఆయనతో తన అభిప్రాయాలను పంచుకుంది. భార్య ఆలోచనపట్ల మొహిద్దీన్ ఎంతో ఆనందించాడు. సంకుచిత మనస్కుడు కాని ఆయన విముక్తి పోరాటంలో పాల్గొనాలనుకుంటున్న ఆమెను పర్దా నిబంధనల నుండి మినవాయింపు కల్పించాడు. ఆమెను ముందుకు సాగమని ప్రోత్సహించి తోడు నిలిచాడు.

ఆ సమయంలో రెండవ ప్రపంచయుద్ధం సాగుతోంది. భారతీయులు ఇష్టాయిష్టాలతో పని లేకుండా, భారతదేశాన్ని కూడా బ్రిటీష్ వారు ప్రపంచయుద్ధంలోకి లాగారు. దీనికి వ్యతిరేకంగా జాతీయ కాంగ్రెస్ ఉద్యమించింది. దేశవ్యాప్తంగా యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు ఊపందుకున్నాయి. ఆంధ్రులు ఏమాత్రం తీసిపోకుండా ప్రదర్శను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లాలో జరిగిన యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలో రబియాబీ పాల్గొన్నారు. పరదా చాటున వుండవలసిన మహిళ బహిరంగ ప్రదర్శనలో పాల్గొని, యుద్ధం వద్దని నినాదించడం పట్ల సంప్రదాయవాదులంతా విమర్శలు చేయగా, ప్రజలు ఆశ్చర్యపోయి, అభినందించారు.

ఆతరువాత ఆమె అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. 1941లో అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన వ్యక్తి సత్యాగ్రహంలో రబియాబీ పాల్గొన్నారు. ఒక ముస్లిం మహిళ జాతీయోద్యమంలో భాగంగా సాగిన ప్రదర్శనలో పాల్గొనడం, యుద్దానికి వ్యతిరేకంగా నినాదాలు ఇవ్వటం, వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొనటం తెలుగు గడ్డమీద ఇదే ప్రథమమని పలువురు శ్లాఘించారు. ఆనాడు జైళ్లలో మహిళలకు అవసరమైన కనీస వసతులు లేకపోవడంతో మహిళలు అరెస్టుకు ఇష్టపడేవారు కాదు. రబియాబీ పలుకార్యక్రమాలలో పాల్గొన్నప్పటికి, అరెస్టు కాకపోవడంతో ఆమె సాహసకృత్యాలు పోలీసు రికార్డులో నమోదు కాలేదు.

**2. శ్రీమతి మహమ్మద్ గౌస్ ఖాతూన్ బీబీ :** స్వాతంత్ర్యద్యోమంలో ప్రత్యక్ష – పరోక్ష కార్యాచరణ కలసికట్టుగా సాగుతున్నది. ప్రత్యక్ష కార్యక్రమాలలో ధైర్యసాహసాలు ప్రధానంకాగా, పరోక్ష కార్యకలాపాలకు సమర్పణలు, త్యాగాలు, ప్రమాణాలుగా ఉండేవి. ఈ పరోక్ష కార్యాచరణలో భాగంగా త్యాగాల బాటలో నడిచినవార శ్రీమతి ఖాతూన్‌బీబీ. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మహమ్మద్‌గౌస్‌బేగ్ జీవిత భాగస్వామియే ఖాతున్ బీబీ. భారత స్వాతంత్ర్య చరిత్రలో ప్రత్యేక స్థానం పొంది, మహాత్ముడి అభినందనలు అందుకోవడమేకాక, "చీరాలా – పేరాల పోరాటం", "పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమం"లలో మహమ్మద్‌గౌస్ పాల్గొన్నారు. అయితే గౌస్ భార్య అయిన బీబీ ప్రత్యక్ష అండగా నిలవడమే కాక, జాతీయోద్యమ నేతలైన శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య, శ్రీమతి దుర్గాబాయమ్మ, శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులులాంటి ప్రముఖులకు తన ఇంటిలో ఆమె ఆతిధ్యం కల్పించారు. జాతీయ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపట్ల ఖాతాన్‌బీబీ ఎంతో ఆదరణ, ఆప్యాత చూపారు. ఆమె ఇల్లు ఉద్యమకారులకు స్వంత గృహంలాంటిది.

1921లో సహాయ నిరాకరణద్యోమంలో గౌస్‌ను బ్రిటీష్ ప్రభుత్వం అరెస్ట్ చేసి, ఒక సంవత్సరం జైలు, వెయ్యి రూపాయలు జరిమానా విధించినది. జరిమానాకు డబ్బులేక శ్రీమతి బీబీ తన బంగారం అమ్మి జరిమాన కట్టింది. మరోపర్యాయం గుంటూరు జిల్లా పెదనందిపాడు ఉద్యమంలో గౌస్ అరెస్ట్‌కాగా, శ్రీమతి బీబీ తనకు మిగిలిన బంగారం అమ్మి, జరిమానాను కట్టింది. అప్పటి

నుండి ఆమె బంగారాన్ని ధరించడానికి ఇష్టపడలేదు. శాసనోల్లంఘన ఉద్యమ బోధనలు నిర్వహిస్తుండగా, బ్రిటీష్ ప్రభుత్వం గౌస్ స్థిరాస్తులను అమ్మి, వచ్చిన డబ్బును జరిమాన క్రింద జమచేసుకున్నారు. బంగారు, నగదు, సర్వత్యాగం చేయటం అదృష్టంగా వారు భావించి పొంగిపోయారు. ఆమె ఖాదీ ప్రచారంలో ఎంతో శ్రద్ధగా పాల్గొన్నారు. జీవితాంతం ఖద్దరునే ధరించారు. గౌస్ 1976లో మరణించగా, బీబీ 1990 నవంబర్ 20న ప్రాణాలు వీడారు.

**3. హజారా బీబీ ఇస్మాయిల్:** హజారా బీబీ ఇస్మాయిల్ ఆంధ్ర ప్రదేశ్ లోని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు మహమ్మద్ ఇస్మాయిల్ సాహెబ్ భార్య. ఈ జంట మహాత్మా గాంధీచే బలంగా ప్రభావితమయ్యారు మరియు ఖాదీ ప్రచార ఉద్యమానికి తమను తాము అంకితం చేసుకున్నారు. ఆమె భర్త మొహమ్మద్ ఇస్మాయిల్ గుంటూరు జిల్లాలో మొదటి ఖద్దరు దుకాణాన్ని ప్రారంభించాడు, దీని ద్వారా అతను 'ఖద్దర్ ఇస్మాయిల్'గా పేరు పొందాడు. ఆ రోజుల్లో ఆంధ్ర ప్రాంతంలో ముస్లిం లీగ్ చాలా చురుకుగా ఉండేది. దీనికి తెనాలి ప్రధాన కార్యాలయం. హజారా మరియు ఆమె భర్త గాంధీని అనుసరించినందున, వారు ముస్లిం లీగ్ నుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నారు, జాతీయ ఉద్యమంలో తన పాత్ర కోసం తన భర్తను అనేకసార్లు అరెస్టు చేసినప్పటికీ హజారా బీబీ ధైర్యం కోల్పోలేదు. భార్యాభర్తలు, ఇస్మాయిల్ దంపతులు తమ పిల్లలను ఎక్కడ జాతీయవాదం బోధిస్తారో అక్కడే చదివించాలని కోరుకున్నారు. దీంతో వారు తమ ఆడపిల్లలను హిందీ పాఠశాలకు పంపారు. ముస్లిం మతవాదులకు వ్యతిరేకంగా, వారు బహిష్కరణను ఎదుర్కోవలసి వచ్చింది. హాజీరా బీబీ 1948లో తన భర్త ఖద్దర్ ఇస్మాయిల్‌ను కోల్పోయిన తర్వాత కూడా దీనికి వ్యతిరేకంగా బలంగా నిలబడింది. మహమ్మద్ పదే పదే జైలు శిక్షల కారణంగా అనారోగ్యానికి గురై మరణించాడు. భర్త చనిపోవడంతో ప్రభుత్వం ఆమెకు భూమిని స్వాతంత్ర్య సమరయోధుల కేటగిరీ కింద ఇచ్చింది. కానీ, ఆ భూమిని తీసుకోవడానికి సున్నితంగా నిరాకరించిన ఆమె.. ఆస్తుల ద్వారా తన దేశభక్తికి విలువనివ్వడం ఇష్టం లేదని చెప్పింది. అంతేకాదు, తన భర్త చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడానికి ఆమె తన కుటుంబానికి చెందిన సొంత భూమిని 'కపురు వినయాశ్రమం'కి దానం చేసింది. భర్త చనిపోయిన తర్వాత కూడా ఆమె విస్తృత పోరాటానికి అంకితమయ్యారు. ఆమె తన భర్త తర్వాత తన పిల్లలచే వారి ఖాదీ దుకాణాన్ని నడిపించింది మరియు ఆమె తన చివరి శ్వాస వరకు ఖాదీని ధరించింది. తన భర్తలాగే అంకితభావంతో ఖాదీ కార్యకర్త అయిన హాజరా బీబీ ఇస్మాయిల్ 1994 జూన్ 16న తెనాయిలిలో కన్నుమూశారు.

**4. శ్రీమతి నఫీస్ అయేషా బేగం :** పరోక్ష జాతీయోద్యమానికి సహాయ సహకారాలు అందించి, బ్రిటీష్ పోలీసుల చిట్టాలలో ఎక్కకుండా పోయిన తెలుగింటి మహిళలు ఎందరో ఉన్నారు. అందువల్ల వారి త్యాగాలు చరిత్రకు అందకుండా పోయాయి. పోలీస్ రికార్డులలో ఎక్కిన మహిళా యోధురాలు శ్రీమతి నఫీస్ అయేషాబేగం, ఈ అయేషాబేగం తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు కావడంతో ఆయన వలన ప్రభావితురాలై హైదరాబాద్ కేంద్రంగా జాతీయోద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించాక ఇండియన్ యూనియన్‌లో చేరడానికి నిరాకరించిన నైజాం సుల్తానపట్ల బేగం నిరసన వ్యక్తం చేశారు. నిజాం భారత్‌లో విలీనం కావాలని, నైజాం నివాసులంతా భారతదేశ పౌరులుగా పరిగణించబడాలని శ్రీమతి అయేషాబేగం కాంక్షించారు. అందుకు భిన్నంగా నిజాం నవాబు వ్యవహరించడంతో, ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనలు ప్రదర్శనలుగా మారాయి. ఈ వ్యతిరేక ప్రదర్శనల పట్ల ఆగ్రహించిన నిజాం ప్రభుత్వం ప్రదర్శనకారులను నిర్బంధించింది. అరెస్టుల పర్వం సాగించినది. ఈ అరెస్టులలో భాగంగా శ్రీమతి బేగం కూడా జైలు పాలయ్యారు. ఆమెను హైదరాబాద్ జైలులో నిర్బంధించారు. అరెస్టులు ఆమెను అధైర్యపరచలేదు. జైలు నుండి విడుదలైన తరువాత కూడా ఆమె జాతీయోద్యమంపట్ల మొగ్గచూపారు. చివరకు ఇండియన్ యూనియన్‌లో నైజాం సంస్థానం విలీనమైంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీ॥శే॥ డాక్టర్ శ్రీమతి సరోజినిదేవి గారి సంపాదకత్వంలో రూపొందించిన "Who's who of Freedom struggle in Andhra Pradesh" అన్న సంపుటులలో స్థానం పొందగలిగిన ఏకైక ముస్లిం మహిళ అయేషా భేగం కావడం విశేషం. ఆ గ్రంథంలో ఆమె అరెస్టుకు సంబంధించిన వివరాలు, కొద్దిపాటి వ్యక్తిగత విశేషాలను పేర్కొనడంతో ఆమె గురించి కొద్దిపాటి సమాచారం మనకు లభిస్తున్నది.

**5. శ్రీమతి సుగరా ఖాతూన్ :** హైదరాబాద్‌కు చెందిన ఉస్మానాబాద్‌లో ఈమె జన్మించారు. తల్లి సైదున్నీషా, తండ్రి సయ్యద్‌హదీ, పదమూడు సంవత్సరాల వయసులో జమిందారీ కుటుంబానికి చెందిన మహమ్మద్ జమీర్‌ను వివాహమాడారు. పెళ్ళి అయిన ఆరు సంవత్సరములకే భర్తను కోల్పోయారు. 19వ సంవత్సరములకే వితంతువు అయి, అత్త ఇంట్లో తలెత్తిన ఆస్థి వివాదాల కారణంగా లక్నోలో వున్న తన మేనమామ ఇంట చేరారు. ఆ సమయంలో ఖిలాఫత్, సహాయనిరాకరణోద్యమాలు సాగుతున్నవి. విదేశీ వస్త్రాలయాల ఎదుట 'రాస్తారోకో కార్యక్రమంలో శ్రీమతి సరోజినినాయుడు, శ్రీమతి మోతీలాల్ నెహ్రూలాతో కలిసి పాల్గొని పోలీస్ లాఠీ దెబ్బతిన్నారు. ఆమె ఖద్దరు "చుడీదార్, కుర్తా" ధరించేవారు. వితంతువులు అలాంటి వస్త్రాలు ధరింపరాదని సంప్రదాయవాదులు తెలిసినా, వారి మాటలను తోసిపుచ్చారు. ఖిలాఫత్ ఉద్యమం నిధుల కోసం బీబీ లక్నో వచ్చిన సందర్భంలో శ్రీమతి ఖాతూన్ 50 తులాల బంగారాన్ని ఇచ్చారు. ఈమె వ్రాసిన కవితలు, ఆలోచనాత్మకమైన వ్యాసాలు "హందర్ద్" "జమిందార్, "హందం" లాంటి పత్రికలో ప్రచురితమైనాయి. నెహ్రూ కుటుంబంతో అత్యంత సన్నిహిత సంబంధాలు కలవు.

కుటుంబకారణాల వల్ల చాలా పర్యాయాలు హైదరాబాద్‌కు రావటం జరిగింది. స్వాతంత్ర్యానికి ముందు హైదరాబాద్‌కు వచ్చి నిజాం పాలన పూర్తి అయిన తరువాత లక్నో వెళ్లటం జరిగింది. అక్కడే ప్రజాసేవలో గడుపుతూ 1968, మే 10న కన్నుమూశారు.

**6. బేగం మజీదా బానో బీ :** హైదరాబాద్‌లో బేగం మజీదా బానో 1919న జన్మించారు. ఈమె పదవ తరగతి చదువుతున్నప్పుడే ఉత్తర ప్రదేశ్‌కుచెందిన న్యాయవాది అయిన మహమ్మద్ సిద్దీఖీతో వివాహం జరిగింది. వివాహం అయిన వెంటనే ఉత్తరప్రదేశ్‌కు వెళ్ళిపోయారు. జాతీయోద్యమ నాయకుడైన రఫి అహమ్మద్ కిద్వాయ్ ప్రభావంతో భారత జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించారు. జాతీయోద్యమం సంపూర్ణ విజయం సాధించాలంటే, ప్రజలు మతాలకు అతీతంగా ఐక్యం కావాల్సి వుందని భావించి, మతం పేరుతో ఏర్పాటువాద రాజకీయాలు నడుపుతున్న "ముస్లింలీగ్"ను విమర్శించారు. 1936లో జాతీయవాదులైన కొందరు ముస్లింలీగ్ అధినేత మహమ్మద్ అలీజిన్నాకు వ్యతిరేకంగా బేగం మజీదా బానో పాల్గొన్నారు.

1935 భారత చట్టం ప్రకారం 1937న దేశంలో ఎన్నికలు జరుగుతున్నాయి. జాతీయ కాంగ్రెస్ తన అభ్యర్థులను రంగంలోకిదించగా, ముస్లింలీగ్ కూడా తన ప్రతినిధులను ప్రకటించింది. లక్నో మహిళా నియోజకవర్గం నుండి శ్రీమతి మజీదా, ముస్లింలీగ్ అభ్యర్థిగా బేగం ఇనాం హబీబుల్లా పోటీ పడ్డారు. అలీసోదరులతో ఒకరైన మౌలానా షౌకత్ అలీ లీగ్ గెలుపు కోసం ప్రచారం చేశారు. ఈ షౌకత్ అలీ ఖురాన్ గ్రంథాన్ని చేతబూని ఎన్నికల ప్రచారం చేశారు. దీనిని బట్టి ఈ ఎన్నికలు ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకొన్నారో అర్థం చేసుకోవచ్చు. శ్రీమతి మజీదా తరపున కాంగ్రెస్ నాయకులు, లక్నో అధ్యక్షులు ప్రచారం చేశారు. మజీదా కేవలం 175 ఓట్ల తేడాతో ఓడారు. ఈ ఎన్నికలు జయాపజయములతో నిమిత్తం లేకుండా హిందూ–ముస్లింల ఐక్యతానినాదంతో ఆమె ముందుకు సాగారు. స్వాతంత్ర్యం సాధించాక, దేశ సేవకు అధిక ప్రాధాన్యత ఇచ్చి చివరి క్షణం వరకు మత సామరస్యం కోసం కృషి చేస్తూ, (ప్రజాసేవలో గడిపి చివరకు 1974, ఫిబ్రవరి 2న బారంబంకీలో ఈమె మరణించారు.

**7. శ్రీమతి ఖుర్షీద్ ఖ్వాజా :** ఈమె 1896న హైదరాబాద్ నగరంలో జన్మించారు, ఈమె తండ్రి సర్ బులంద్ హైదర్‌జంగ్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి. ఈమె అలీఘర్‌కు చెందిన బారిస్టర్ అయిన ఖ్వాజా అబ్దుల్ మజీద్‌ను వివాహమాడారు. శ్రీమతి సరోజినాయుడు భావాలకు ప్రభావితం అయి జాతీయోద్యమంలో పాల్గొన్నారు. వివాహానంతరం భర్తతో కలిసి స్వాతంత్ర్య పోరాటం చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రతినిదిగా జాతీయ కాంగ్రెస్ సబ్జెక్ట్ కమిటీకి ప్రాతినిధ్యం వహిస్తూ, 1921 నాటి ఉద్యమంలో బేగం హసరత్ మోహాని, బేగం మహమ్మద్ అలీ, శ్రీమతి కమలా నెహ్రూ, శ్రీమతి స్వరూపారాణిలతో కలిసి పనిచేశారు.

అలీఘర్‌లో "హింద్" అను మాస పత్రికను 1921లో ప్రారంభించి, సంపాదకత్వ బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, బ్రిటీష్ ప్రభుత్వ ఆగ్రహానికి గురి అయ్యారు. సహాయ నిరాకరణోద్యమంలో అవిశ్రాంతంగా పాల్గొని పలువరికి ఆదర్శమయ్యారు. ఈ సందర్భంలో ఆమె అరెస్టు కాలేదు. "ఈ విధంగా నేను అరెస్టు కాకపోవడం బాధగా వుందని" గాంధీజీకి ఉత్తరం వ్రాయడం

జరిగింది. ఆమె కార్యనిర్వహణా దీక్ష జాతీయోద్యమ లక్ష్యాల పట్ల ఆమెకున్న నిబద్ధత గురించి గాంధీజీ వ్యాసం రాశారు.

భారతదేశానికి బ్రిటీష్ సామ్రాజ్య వాదుల నుండి విముక్తి లభించినప్పటికీ, మాతృదేశం విభజనను గురి కావడం వల్ల తీవ్రంగా చలించిపోయిన బేగం ఖుర్షీద్ స్వతంత్ర భారత పౌరులుగా సామాజిక సేవారంగానికే అంకితమయ్యారు. శ్రీమతి ఖ్వాజా 1981 జూలైలో తుదిశ్వాస విడిచారు.

**ముగింపు :** ఆంధ్ర రాష్ట్రంలో పలువురు ముస్లిం మహిళలు స్వరాజ్య సాధనకోసం సాగించిన పలు పోరాటాలలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్నప్పటికీ వారికి చరిత్రలో తగిన స్థానం లేకపోవడం విచారకరం. స్వాతంత్ర్యపోరాట యోధులపై బ్రిటీష్ ప్రభుత్వం సాగించిన పైశాచిక దాడులకు గురి అయ్యారు. మాతృభూమిని దాస్యశృంఖలాల నుండి విముక్తి చేయడానికి సాగిన మహత్తర స్వాతంత్ర్య సంగ్రామంలో ముస్లిం మహిళలు విభిన్న పాత్రలను నిర్వహించి లక్ష్యసాధనలో తోడ్పడ్డారు. ఈ పోరు బాటలో నడిచిన మహిళలు కొందరు ఆత్మార్పణ చెందారు, మరి కొందరు అద్వితీయ త్యాగనిరతిని ప్రదర్శించగా ఇంకొందరు దాన – ధర్మ – దయా గుణాలతో మాతృభూమికి అర్పించారు.

మాతృదేశం పట్ల భక్తి భావనగల దేశభక్తులైన మహిళలు జాతీయోద్యమంలో ప్రవేశించాక ఎదురైన మానసిక, ఆర్థిక, కష్టనష్టాలను చిరునవ్వుతో సహిస్తూ లక్ష్యసాధనపట్ల ధృడ చిత్తంతో ముందడుగు వేసి భారత భూమిపట్ల తమ ప్రేమను చాటుకొన్నారు. ఈ విధంగా పరిశీలిస్తే చరిత్రకు, అందినా, అందకున్నా రాష్ట్రంలోని ఎందరో మహిళలు జాతీయోద్యమంలో పాల్గొన్నారు. దేశభక్తిగల ముస్లింలకు సంబంధించిన అమల్యూమైన చరిత్ర సరిగ్గా వెలుగులోకి రాలేదు. ఇలాంటి మతాతీతమైన దేశభక్తిని స్ఫూర్తిగా తీసుకొంటే మత విద్వేషాలను మరచిపోవచ్చు. మతాల 'పేరిట జరుగుతున్న మారణహోమంలో సమిధలుగా మారుతున్న ముస్లీం మనోభావాలలో కొంతైనా మార్పు రావచ్చు. దేశస్వాతంత్ర్యానికి వారధులుగా వున్న ముస్లీంల చరిత్రను వెలుగులోకి తెచ్చి దేశ సమైక్యతను, సమగ్రతను నిలబెట్టవచ్చు. ముస్లీం మహిళలను మరింత చైతన్యపరచవచ్చు.

**పత్ర రచనకు సంప్రదించిన గ్రంథాలు :**


1. Indian Freedom Movement, Muslim Women - Sayed Naseer Ahmed
2. Highlights of the Freedom Movement in Andhra Pradesh - Dr. Sarojini Regani
3. History of Andhra Movement - G.V. Subbarao
4. నా జైలు జ్ఞాపకాలు – అనుభవాలు సంగం లక్ష్మీబాయి.
5. ఆంధ్రలో స్వాతంత్ర సమరం, ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య,
6. స్వాతంత్రోద్యమంలో తెలుగు మహిళలు, డా॥ వాసా ప్రభావతి.

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# మేము సైతం....

**శ్రీ టి. నరసింహులు,** ఆర్థికశాస్త్ర శాఖాధ్యక్షులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు, తిరుపతి జిల్లా, ఆం.ప్ర. చరవాణి : 91821 36020.
**డా॥ కె. నరసింహుడు,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, చిన్నగొట్టిగల్లు, చిత్తూరు జిల్లా.చరవాణి : 89782 48551.

ప్రపంచ విముక్తిపోరాటాల చరిత్రలో భారతీయులు సాగించిన స్వాతంత్ర్య సంగ్రామం సువర్ణాక్షరాలతో లిఖించదగిన మహత్తర ఘట్టం. బ్రిటీష్ పాలకుల నుండి స్వేచ్ఛ – స్వాతంత్ర్యాలు కోరుకుంటూ భరతగడ్డ మీద ఉన్న అన్ని సాంఘిక జనసముదాయాలు ఏకోన్ముఖంగా పోరుబాట సాగాయి. ఈ పోరాటాలలో పురుషులతోపాటు మహిళలు కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములయ్యారు. ఆచార సంప్రదాయులు, సామాజిక పరిమితులలో ఉన్న మహిళలు ఉద్యమకారులైన తమ కుటుంబసభ్యులను బ్రిటీషు ప్రభుత్వ వ్యతిరేకపోరాటాల దిశగా ప్రోత్సహిస్తూ, స్వాతంత్ర్యపోరాటంలో అద్వితీయ పాత్ర వహించారు. కాని, భారతదేశ దాస్యశృంఖలాల విముక్తికి తమ సర్వస్వం ఒడ్డి పోరాడిన అనేకమంది మహిళల గురించి నేటితరానికి తెలిసింది తక్కువ. చాలామంది మహిళలు పోరాట గాథలు చీకటి పుటల్లోనే ఉండిపోయాయి.

స్వాతంత్ర్యపోరాటంలో లక్షలాదిమంది పాల్గొన్నారు. అందులో స్త్రీలు కూడా చాలామంది పాల్గొన్నారు. కాని స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్న స్త్రీల గురించి చాలా తక్కువ సమాచారం నేడు అందుబాటులో ఉంది.

భారత్‌కు స్వాతంత్ర్యం లభించి 75 ఏళ్ళవుతోంది. ప్రతి మగాడి విజయం వెనుక మహిళ పాత్ర ఉంటుందంటారు. మరి అలాంటిది దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడానికి ఎంతమంది వీర మహిళల పాత్ర ఉండాలి. కొన్ని వేలమంది పోరాడారు. వారిలో కొంతమంది చరిత్రలో నిలిచిపోయారు. అలాంటి పదిమంది గురించి మనం ఇప్పుడు తెలుసుకుందాం.

**ఝాన్సీ రాణి లక్ష్మీబాయి :** ఝాన్సీరాణి అంటే వీరత్వానికి మరోపేరుగా మనం చెప్పుకుంటాం. ఝాన్సీరాణి అంటే గుండెలు ఉప్పొంగేంత ధైర్యం మనకు వస్తుంది. అంటే... మరి ఏస్థాయిలో ఆ వీరనారి బ్రిటిష్‌వారిపై పోరాడివుంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరమహిళల్లో ఆమె ఒకరు. భయం అనే పదానికి చోటే లేకుండా ఒంటరిగా బ్రిటిష్ సైన్యంతో పోరాడింది. లక్ష్మీబాయికి చిన్న వయస్సులోనే ఝాన్సీరాణి, రాజాగంగాధరరావుతో వివాహం జరిగింది. వారికి పిల్లల్లేరు. వారిద్దరూ ఒక కుమారుడిని దత్తత తీసుకున్నారు. కానీ గంగాధర్‌రావు మరణం తరువాత ... ఝాన్సీకి దత్తత కుమారుడిని రాజుని చేయడానికి అప్పటి బ్రిటిష్ పాలకులు అంగీకరించలేదు. ఇదే అదునుగా ఝాన్సీని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారు. కానీ లక్ష్మీబాయి తన సైన్యాన్ని తీసుకొని బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడింది. బ్రిటీషర్లు తమవంతు ప్రయత్నం చేసినా చివరికి ఝాన్సీరాణిని పట్టుకోలేకపోయారు. అయితే బ్రిటిష్ బలం ముందు ఈమె నిలువలేకపోయారు. వారికి చిక్కడం కన్నా ప్రాణాలర్పించడం మంచిదని ఆత్మహత్య చేసుకున్నారు. అయితే ఝాన్సీరాణి లక్ష్మీబాయి చూపించిన సాహసం .... అనంతరం స్వాతంత్ర్యపోరాటంలో ఎంతోమంది ఝాన్సీరాణిలు రావడానికి స్ఫూర్తి అయింది.

**సరోజినీ నాయుడు :** సరోజినీ నాయుడుని "నైటింగేల్ ఆఫ్ ఇండియా" అని పిలుస్తారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన అత్యంత ప్రభావవంతమైన మహిళల్లో ఒకరు. సరోజినీ నాయుడు ప్రసిద్ధకవయిత్రి. శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమంలో ఆమె చాలాముఖ్యమైన పాత్ర పోషించింది. దానికోసం ఆమె జైలుశిక్ష అనుభవించింది. ఆమె అనేక నగరాలకు వెళ్ళి మహిళా సాధికారత, సామాజిక సంక్షేమం మరియు స్వేచ్ఛ యొక్క ప్రాముఖ్యత గురించి ప్రసంగించి చైతన్యపరిచేవారు. సరోజినీ నాయుడు ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా పనిచేసిన మొదటి మహిళ కూడా. భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా వ్యవహరించిన రెండవ మహిళ. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతనే ఆమె కన్నుమూశారు. ఆమె చేసిన పోరాటం అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ఉంది.

**బేగం హజ్రత్ మహల్:** బేగం హజ్రత్ మహల్ కూడా మహిళా స్వాతంత్ర్య సమరయోధుల్లో ప్రముఖులు. ఝాన్సీ లక్ష్మీబాయికి ఉండేంత ధైర్యసాహసాలు ఈమెకు ఉన్నాయి. 1857లో తిరుగుబాటు ప్రారంభమైనపుడు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడడానికి

ముందుకువచ్చారు. గ్రామీణ ప్రజలను స్వాతంత్ర్యఉద్యమం వైపు మళ్ళించిన వ్యక్తుల్లో ఈమె ఒకరు. ఆమె తన కుమారుడిని ఔద్‌రాజుగా ప్రకటించి లక్నోను ఆధీనంలోకి తీసుకుంది. అంతపెద్ద బ్రిటీష్ పాలకులను సైతం ఎదురించి స్వాధీనం చేసుకోవడంతో ఆమె పేరు మార్మోగిపోయింది. అయితే తమను ఎదిరిస్తారా అని బ్రిటిష్ పాలకులు అదనపు సైన్యంతో వచ్చి దాడి చేయడంతో ... లక్నో పరిపాలనపై పట్టు కోల్పోయారు.

**కిత్తూరు రాణి చెన్నమ్మ :** మహిళా స్వాతంత్ర్య సమరయోధుల్లో చాలామంది పేర్లకు ప్రాచుర్యం లభించలేదు. అలాంటివారిలో కిత్తూరు రాణిచెన్నమ్మ ఒకరు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన కొద్దిమంది తొలి భారతీయ మహిళా పాలకుల్లో ఆమె ఒకరు. తన భర్త, కుమారుడు మరణించిన తర్వాత రాజ్యబాధ్యతను స్వీకరించవలసి వచ్చింది. అయితే బ్రిటిష్ పాలకులు ఆమె రాజ్యంపై కన్నేశారు. ఆమె బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా పోరాడి తన రాజ్యాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నించింది. ఆమె సైన్యానికి నాయకత్వం వహించి యుద్ధరంగంలో ధైర్యంగా పోరాడింది. అయితే చివరకు కిత్తూరు రాణిచెన్నమ్మ యుద్ధభూమిలో మరణించింది. ఆమె ధైర్యసాహసాల వెలుగు ఇప్పటికీ దేశంలో ప్రకాశిస్తూనేవుంది. కిత్తూరు రాణిచెన్నమ్మ గురించి కర్ణాటకలో విద్యార్థులు పాఠ్యాంశాలుగా బోధిస్తున్నారు.

**అరుణా అసఫ్ అలీ :** అరుణా అసఫ్ అలీ ఉప్పు సత్యాగ్రహంలో ప్రధాన పాత్ర పోషించారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో ఆమె పాల్గొనడం వల్ల జైలుశిక్ష కూడా అనుభవించారు. ఆమె జైలునుండి విడుదలైన తర్వాత క్విట్ ఇండియా ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఇది భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మహిళలు ఎంత నిర్భయంగా ఉన్నారో అరుణా అసఫ్ అలీని సూచికగా చూపిస్తారు. తీహార్‌జైలులో ఉన్న రాజకీయ ఖైదీల హక్కుల కోసం ఆమె పోరాడారు. అప్పట్లోనే ముస్లిం వ్యక్తిని ప్రేమవివాహం చేసుకొని సమాజానికి దిశానిర్దేశం చేశారు.

**సావిత్రీబాయి పూలే :** భారతదేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే. మొదటి భారతీయ బాలికల పాఠశాల స్థాపకురాలు కూడా. "మీరు అబ్బాయికి విద్యను అందిస్తే.. మీరు ఒక వ్యక్తిని చదివించినట్లు ... కానీ ఒక అమ్మాయిని చదివిస్తే ... మీరు మొత్తం కుటుంబాన్ని చదివించినట్లు" అని చెప్పి అందరికీ కళ్ళు తెరిపించే ప్రయత్నంచేశారు. ఆమె ప్రయాణంలో ఆమె భర్త జ్యోతిరావుపూలే కూడా ఆమెకు మద్దతుగా నిలిచారు. వారిద్దరూ అన్ని మూసపద్ధతులకు వ్యతిరేకంగా పోరాడారు. సమాజంలో మహిళా సాధికారత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

**ఉషామెహతా :** భారత స్వాతంత్ర్య ఉద్యమంలో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న అతిపిన్న వయస్కులలో ఒకరు ఉషామెహతా. మహాత్మాగాంధీ స్వాతంత్ర్యపోరాటం ఉషపై చాలా ప్రభావం చూపింది. ఆమె ఐదు సంవత్సరాల వయస్సులో గాంధీని కలుసుకున్నారు. "సైమన్ గో బ్యాక్" నిరసనలో పాల్గొన్నప్పుడు ఆమెకు కేవలం ఎనిమిదేళ్ళు. ఆమె తండ్రి బ్రిటీష్ ప్రభుత్వం క్రింద న్యాయమూర్తిగా పనిచేసేవారు. ఆమె మనసు మార్చడానికి తండ్రి ప్రయత్నించారు.... కానీ సాధ్యం కాలేదు. మహాత్ముడితోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నది. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేడియో ఛానెళ్ళను నడిపినందుకు ఆమెకు జైలుశిక్ష కూడా పడింది.

**భికాజీ కామా :** భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులలో ఒకరు భికాజీకామా. ఆమెను మేడమ్ కామా అని పిలిచేవారు. స్వాతంత్ర్యపోరాటంలో ఆమె భారతీయ పౌరుల మనస్సులలో మహిళా సమానత్వం, మహిళా సాధికారత గురించి ప్రధానంగా ప్రచారం చేసేవారు. భారత స్వాతంత్ర్యపోరాట చరిత్రను స్థాపించిన మార్గదర్శకుల్లో ఆమె ఒకరు. ఆమె పార్శీ కుటుంబానికి చెందినవారు. జాతీయ ఉద్యమాల్లోనూ ఈమె కీలకపాత్ర పోషించారు.

**లక్ష్మీ సెహగల్ :** సుభాష్ చంద్రబోస్ చేస్తున్న స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రభావితమై లక్ష్మిసెహగల్ ... బ్రిటిష్‌వారిపై పోరాటానికి వచ్చారు. స్వాతంత్ర్యపోరాటంలో ఈమె మహోన్నతమైన వ్యక్తి. సుభాష్‌చంద్రబోస్ ఏర్పాటుచేసిన "ఇండియన్ నేషనల్ ఆర్మీ"లో క్రియాశీలక సభ్యురాలు. ఈమె ఏకైక ఆశయం భారతదేశ స్వాతంత్ర్యం. ఈమె మహిళా విభాగాన్ని సృష్టించి, దానికి ఝాన్సీ రెజిమెంట్‌కి చెందిన రాణి అని పేరు పెట్టింది. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన అన్ని ఉద్యమాలలో ఈమె పాల్గొన్నారు. అన్నివిధాలుగా పోరాడి చరిత్ర సృష్టించారు.

**కస్తూర్బా గాంధీ :** భారత స్వాతంత్ర్య పోరాటచరిత్రలో చెరగని పేరు కస్తూర్బాగాంధీది. ఆమె జాతిపిత మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ సతీమణి. భారతదేశ స్వాతంత్ర్యానికి గాంధీ చేసిన కృషి గురించి మనందరికీ తెలుసు కానీ కస్తూర్బాగాంధీ గురించి అంతగా ప్రచారం కాలేదు. ప్రముఖ మహిళా స్వాతంత్ర్య సమరయోధురాలిగా ఆమె చాలా ముఖ్యమైన పాత్ర పోషించారు. పౌర హక్కుల కోసం పోరాడారు. దక్షిణాఫ్రికా పర్యటన సందర్భంగా డర్బన్‌లోని ఫీనిక్ సెటిల్‌మెంట్‌లో చురుకైన సభ్యురాలిగా వ్యవహరించారు. ఇండిగో ప్లాంటర్స్ ఉద్యమం సమయంలో, పరిశుభ్రత, ఆరోగ్యం, క్రమశిక్షణ, చదవడం, రాయడం వంటివాటిపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ఆమె కీలక ప్రయత్నాలు చేశారు.

**ముగింపు :** వీళ్ళు మాత్రమేకాక **సుచేతా కృపలానీ** గారు హర్యానాలోని అంబాలలో ఓ బెంగాలీ కుటుంబంలో జన్మించారు. భారత జాతీయ కాంగ్రెస్ కార్యకలాపాల్లో సుచేతా చురుకుగా పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలోనూ సన్నిహితంగా పనిచేశారు. **అనిబిసెంట్** ఐరిష్ మహిళ, 'థియోసాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా'కు నాయకురాలు. ఈమె భారత జాతీయకాంగ్రెస్ మొదటి మహిళా అధ్యక్షురాలుగా పనిచేశారు. 1916లో 'ఇండియన్ హోమ్‌రూల్ లీగ్'ను ఆమె స్థాపించారు. ఆ సమయంలోనే భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. అంతేకాకుండా, రాష్ట్రాలకు అధికారం కట్టబెట్టే క్రమంలో స్థానిక సంస్థానాల నుండి ఎదురైన సవాళ్లను కూడా మహిళలు సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. తెలంగాణలో నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేకంగా ఎంతోమంది మహిళలు పోరాటం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన వీరనారీమణులందరికీ పాదాభివందనం.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. ఆంధ్రస్వాతంత్రోద్యమం – ప్రముఖ వ్యక్తులు : సరోజినీ
2. జాతీయోద్యమంలో మహిళల పాత్ర : సరోజినీ
3. రాయలసీమలో జాతీయోద్యమం : పి. యానాది రాజు

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# జాతీయోద్యమంలో తెలుగు వీర నారీమణులు

డాక్టర్ మామిడి మురళి, సహాయాచార్యులు, తెలుగుశాఖ, రాజధాని కళాశాల,చెన్నై - 05.

స్వాతంత్రోద్యమంలో పురుషులతో పాటు స్త్రీలు ప్రత్యక్షంగానో పరోక్షంగానో పాల్గొని భారతదేశాన్ని బానిస సంకెళ్ళ నుండి విముక్తి చేయడానికి ఆంగ్లేయులను ధైర్యంగా ఎదుర్కొన్న వీరవనితలు ఎంతోమంది స్వాతంత్ర్యం కోసం పోరాడి తమ తెగువను చూపి, ప్రాణాలను అర్పించారు. వారిలో మన వీరనారీమణులు ఆంగ్లేయులను సైతం లెక్కచేయక పోరాటంలో భాగస్వాములయ్యారు. అలాంటి వారిలో

**సరోజనీదేవి నాయుడు (1879 -1949)** : భారతకోకిలగా ప్రసిద్ధిచెందిన సరోజనీదేవి హైదరాబాదులో స్థిరపడిన బెంగాలీ బ్రహ్మణ వంశీయురాలు ఆమె కవయిత్రి, స్వాతంత్ర సమరయోధురాలు. 1925లో కాన్పూర్‌లో జరిగిన "అఖిల భారత జాతీయ కాంగ్రెస్" మహాసభలకు తొలి మహిళా అధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. కులాంతర వివాహం చేసుకొని ఆదర్శంగా నిలిచిన వీర వనిత. స్త్రీ విద్య కోసం ఎన్నో సమావేశాలు ఏర్పాటు చేసి మహిళల్లో చైతన్యం తీసుకువచ్చిన ధీరురాలు. స్త్రీల పురోభివృద్ధికై 'స్త్రీ ధర్మ' పత్రికను నడిపారు. భారతదేశంలో ముఖ్యమైన నగరాలు, పట్టణాలు తిరిగి స్వాతంత్ర్యోద్యమ ఉపన్యాసాలిచ్చి ప్రజలలో చైతన్యం తీసుకొచ్చారు. "జాతి వేరనీ, దేశం వేరనీ, నువ్వు వేరనీ విడిగా ఉండకు, నీకు జరిగితే దేశానికి జరిగినట్టే, దేశం అనుభవించే బానిసతనం నీవూ అనుభవించవలసిందే" అంటూ దేశభక్తిని నూరిపోసింది. రాష్ట్రానికి తొలి మహిళా 'గవర్నర్'గా 1947లో పనిచేశారు. భారతదేశం ఆమె జన్మదినాన్ని ఫిబ్రవరి13,1879 జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటుంది.

**ఉన్నవ లక్ష్మీబాయమ్మ** : దేశసేవకి, సంఘసంస్కరణోద్యమారాలు ఆమె స్వాతంత్ర్య సమరయోధుడు ఉన్నవ లక్ష్మీనారాయణ సతీమణి. 1882లో గుంటూరులో జన్మించిన ఆమె అదే గుంటూరులో శారదా నికేతవని స్థాపించింది. 1902లో వితంతు శరణాలయం స్థాపించి వితంతు పునర్వివాహాలు జరిపించారు. స్వరాజ్య భావనతో విదేశీ వస్త్ర, వస్తు బహిష్కరణకు పిలుపునిచ్చారు. ఉప్పుసత్యాగ్రహంతో భారతీయులందరికి పాల్గొనేలా తమ వంతు కృషి చేసిన వీర వనిత, అలాంటి మాతృమూర్తి సేవలను ప్రతి ఒక్కరు గుర్తించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**భండారు అచ్చమాంబ (1874 -1905) :** స్వాతంత్ర్య సమరయోధురాలు, సమాజసేవకి, రచయిత్రి. మహిళాభివృద్ధికి కృషి చేసిన వీరవనిత. ప్రథమ స్త్రీవాద చరిత్ర కారిణి 1874లో కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలులో జన్మించింది. గురజాడ అప్పారావుకు ముందే 1902లో 'ధనత్రయోదశి' అనే తెలుగు కథను రాసింది.ఈ కథను 'హిందూ సుందరి' పత్రికలో ప్రచురించారు. 1902లో 'బృందావన స్త్రీల సమాజం' అనే మొదటి మహిళా సమాజమును మచిలిపట్నంలో స్థాపించారు. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో స్త్రీ సంఘాలను ఏర్పరచింది. తన తమ్ముడి ప్రోత్సాహంతో 'అబలా సచ్చరిత్రమాల' అనే గ్రంథాన్ని రచించింది. "స్త్రీ అభివృద్ధి చెందకుండా మూర్ఖులుగా తయారవడానికి పురుషుల పక్షపాతమే కారణమని, స్త్రీ విద్య స్వతంత్రత వలన దేశానికి లాభమే కాని నష్టము కలుగదు అంటుంది.

**పొణకా కనకమ్మ (1892 -1963) :** జూన్ 10న నెల్లూరు జిల్లా పొట్లపూడి గ్రామంలో జన్మించింది. 1907లో వందేమాతరం ఉద్యమ సందర్భంగా ఆంధ్రదేశానికి విచ్చేసిన బిపిన్ చంద్రపాల్ ఒక రోజంతా వీరింటిలో అతిథిగా ఉన్నారు.1913లో 'సుజనరంజనీ సమాజం' స్థాపించి దీని ద్వారా 'వివేకనంద గ్రంథాలయం' స్థాపించారు. ఇంకా మరెన్నో కార్యక్రమాలు దీని ద్వారా చేపట్టారు. 'ఖద్దరు' ప్రచారం చేసి స్వయంగా ఆమె నేసిన ఖద్దరు పంచెను గాంధీకి పంపింది. 1921 ఫిబ్రవరి 7న స్థాపించిన 'పినాకిని ఆశ్రమానికి' తన నగలను అమ్మి విరాళమిచ్చిన మహాసాధ్వి అంతేకాదు బాలగంగాధర తిలక్ పిస్తోళ్ళ సేకరణకు కనకమ్మ మరోసారి తన నగలను అమ్మి విరాళం ఇచ్చిన వీరవనిత. ఆమె లక్షణాలను నాయకులు ఆమెను 'కణకణమండే విప్లవకణికగా' వర్ణించారు. ఉప్పుసత్యాగ్రహంలో ప్రముఖపాత్ర వహించారు. 1923లో తన స్వంత ఖర్చుతో "కస్తూరిబా బాలికల సంస్థ'ను స్థాపించక ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మతో కలిసి కవయిత్రులుగా రమణగీతి నైవేద్యం మొదలగు రచనలు చేశారు. ఉద్యమ వ్యాప్తి

కోసం 'జమిందార్ రైతు' సంచికను వెలువరించారు. 'జమిన్ రైతు' పత్రికను కొన్నాళ్లు నడిపారు. ఇలా ఈమె రచయితగా, సంఘసేవకిగా, స్వాతంత్రోద్యమంలో వీరవనితగా ఎంతో సేవచేశారు.

**సూర్యదేవర రాజ్యలక్ష్మీ దేవమ్మ :** గుంటూరు ఝాన్సీరాణిగా పేరొందిన ఆమె పత్రికారచయిత. ఆమె శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గోన్నందుకు సంవత్సరం పాటు, క్విట్ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు నెల్లూరు, మద్రాసు జైల్లో శిక్ష అనుభవించారు.

**సంగెం లక్ష్మీబాయమ్మ :** ఆమెను సత్తెమ్మ, సీతమ్మ అని పిలుస్తారు. ఆమె 1911లో హైదరాబాద్లో జన్మించారు. 1928లో సైమన్ కమిషన్ పట్ల నిరసనలో పాలుపంచుకున్నారు. ఉప్పుసత్యాగ్రహంలో ఎంతో ఉత్సాహంగా దీక్షతో పాల్గోన్నారు. ఉన్నవ లక్ష్మీబాయమ్మతో కలిసి ఊరూరు తిరిగి ప్రభోధం చేసేవారు. చుట్టు ప్రక్కలా ఉండే కల్లు, సారా దుకాణాలు దగ్గర విదేశీ వస్తు, వస్త్ర దుకాణం దగ్గర సత్యాగ్రహం చేసేవారు. ఆమె లెక్కకులేనన్ని సార్లు జైలుకు వెళ్లారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1952లో హైదరాబాదు బాన్సువాడ నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. విద్యాశాఖకు ఉపమంత్రిగా తీసుకున్నారు. ఈ పదవిని అలంకరించిన మొదటి తెలంగాణ మహిళ.

**దుర్గాబాయి దేశ్ముఖ్ (1909 –1981) :** 1909 జూలై 15న రాజమండ్రిలో ఒక బ్రహ్మణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించింది. ఈమె చిన్నతనం నుంచి సేవాభావం, పట్టుదల, ధైర్యం, దేశభక్తి మొదలగు లక్షణాలను కలిగినది. స్వాతంత్రోద్యమంలో తనవంతు కృషిచేసిన ధీరురాలు. 12 ఏళ్ల వయసులోనే విరాళాలను సేకరించి గాంధీకి అందజేసి, ఆయన సూచన మేరకు ఆలోచించకుండా తన చేతులలో ఉన్న బంగారు గాజులను సైతం విరాళంగా ఆయనకు అందించిన త్యాగమూర్తి. ఆమెకు ఏదైనా పని అప్పజెబితే ఎంతో నిజాయితీతో చేస్తుంది. 1923లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ సభలకు విచ్చేసిన నెహ్రుగారి వద్ద టిక్కెట్ లేని కారణంగా ఆయనను అనుమతించలేదు అందుకు ప్రతిఫలంగా ఆయననుండి ప్రశంసలందుకుంది. ఆమె చురుకుగా ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని అరెస్టుకాబడింది. ఈమె మహిళా అభ్యున్నతికోసం ఎంతో కృషిచేసింది. 1937లో చెన్నపట్నంలో 'ఆంధ్రమహిళా సభ' ను స్థాపించింది. అలాగే "ఆంధ్రమహిళ పత్రిక" ను స్థాపించింది. 1971లో ఆమె సేవలను అభినందించి ఆంధ్రవిశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ను ప్రధానం చేసింది. 1975లో 'పద్మవిభూషణ్' ను పొందారు. ఆమెను ఆందరూ "సామాజిక సర్వీస్ మదర్" పిలిచేవారు.

**దిగుమర్తి జానకమ్మ (1902–1973) :** ఈమె 1902లో విశాఖపట్నంలో జన్మించింది. ఈమె కుటుంబం మొత్తం జాతీయోద్యమానికి పాటుబడినవారే. అదే భావాలు ఈమె మనసులో గట్టిగా నాటుకున్నాయి. విద్యార్థి దశలోనే జాతీయోద్యమ విరాళాల కోసం ఇంటింటికి వెళ్లింది. ఈమెకు13వ సంవత్సరంలో వివాహమైనది. భార్య భర్త లిద్దరు ఉత్సాహంగా స్వాతంత్రోద్యమంలో కలుసుకోనేవారు. ఉప్పుసత్యాగ్రహంలో తన భర్తను జైల్లో పెట్టగా, ఉప్పుసత్యాగ్రహంలో ఈమె పాల్గొనడమే కాకుండా ఈ సత్యాగ్రహంలో మహిళలకు నాయకత్వం వహించింది. ఈమెకు 18నెలలు కారాగార శిక్ష విధించగా ఆ జైల్లోనే స్త్రీ శిశువుకు జన్మనిచ్చింది.

**గోగినేని భారతీదేవి (1908 – 1972) :** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, రైతు బాగు కోసం కృషి చేసిన మహిళా నాయకురాలు ఈమె గుంటూరు జిల్లా మాచవరంలో జన్మించింది. స్వాతంత్ర్యసమరయోధుడు, రైతు నాయకుడు, పార్లమెంటు సభ్యుడైన ఎన్.జి.రంగా గారి సతీమణి. 1930లో గాంధీగారి పిలుపు మేరకు తన భర్త అడుగుజాడలతో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గోన్నది. అస్పృశ్యత నిర్మూలన కొరకు భజనసంఘాలను ఏర్పాటు చేసింది. సహాయ నిరాకరణోద్యమంలో మల్పూరి చుక్కమ్మతో కలిసి పాల్గొని జైలుపాలైనది. 1935లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యురాలుగా ఎన్నికైనది. 1942లో క్విట్ఇండియా ఉద్యమంలో పాల్గొంది. ఇలా సమాజం కోసం ఎన్నో సేవలందించినది ఈ వీర మహిళా మణి.

**దువ్వూరి సుబ్బమ్మ :** 1920లో గాంధీగారి పిలుపు మేరకు స్వాతంత్ర్య సమరంలో దిగిన ప్రథమ ఆంధ్ర స్త్రీ, ఈమె తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామంలో మధ్యతరగతి వైదిక బ్రహ్మణ కుటుంబంలో 1880,నవంబర్లో జన్మించింది. ఈమె బాల్య వితంతువు అందుకే ఈమె దేశసేవకోసం ఉద్యమం వైపు నడించింది. ఎన్నో లాఠీదెబ్బలు తిన్నది. పలుమార్లు జైలుకు వెళ్లింది. సంపూర్ణ

స్వాతంత్ర్య లక్ష్యాన్ని బలపరుస్తూ కాకినాడలో జరిగిన సభలో అనర్గళంగా మాట్లాడి ప్రజలను ఉద్యమము వైపు నడిపింది. ఆమె 1922లో సహాయనిరాకరణోద్యమంలో, ఉప్పుసత్యాగ్రహంలో, క్విట్ఇండియా ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించింది. ఒకసారి ఆంగ్లేయులు ఆమెను క్షమాపణ చెప్పమనగా " నా కాలి గోరు కూడా ఆలా చేయదు" అని ధైర్యంగా చెప్పిందట. ఆమె అఖిలభారత కాంగ్రెస్ సంఘములో పద్నాలుగెల్లు సభ్యురాలుగా ఉండిన భారతదేశ గొప్ప వనిత. 1923లో జరిగిన కాంగ్రెస్ సభలో ఈమెకు 'దేశబాంధవి' అనే బిరుదును ప్రధానం చేశారు.

**డాక్టర్ కొమర్రాజు అచ్చమాంబ :** ఈమె 1906లో సెప్టెంబర్ 6న గుంటూరులో జన్మించింది. విద్యార్థి దశ నుండే జాతీయోద్యమ కార్యక్రమలలో చురుకుగా పాల్గొన్న ధీరురాలు. మాతాశిశులు ఆరోగ్యంగా వుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆరోగ్యమే దేశాభివృద్ధికి కొలమానం అని చాటిచెప్పిన ఉద్యమకారిణి అచ్చమాంబ. ఈమె అధ్యక్షతన 1938లో జరిగిన మహిళా సభకు అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారు ఇందులో వివాహ స్వాతంత్ర్యం, స్త్రీ విద్య ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు అనే అంశంపై తీర్మానాలు తీసుకొచ్చారు.

**వేదాంతం కమలాదేవి :** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, ప్రముఖ సంఘసేవకురాలు, కాంగ్రెసువాది, సంఘంలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ప్రసిద్ధిచెందిన తెలుగు మహిళలలో ఒకరు. ఈమె 1897 మే 5న కడపజిల్లా నందలూరు గ్రామంలో జన్మించింది. 1920 నుండి జాతీయోద్యమ పోరాటంలో పాల్గొనడం ప్రారంభించారు. విదేశీ వస్త్ర బహిష్కరణ , నూలు వడకడం, ఖద్దరు ప్రచారం చేశారు. దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మ గారిని ఆదర్శంగా తీసుకొని సహాయనిరాకరణోద్యమంలో పాల్గొనింది. తిలక్ స్వరాజ్య నిధికి అనేకమంది దాతల నుండి భారీ విరాళాలు స్వీకరించి గాంధీ ప్రశంసలను అందుకున్నారు. ఒక ప్రక్క స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటూ మరోవైపు స్త్రీలలో విద్యావ్యాప్తిని, జాతీయభావాలను ప్రేరేపించేవారు. పక్షవాతంలో సరిగా తిరగలేని స్థితిలో కూడా సేవానిరతిని కోల్పోలేదు. తన స్వంత గృహాన్ని అనాథ శరణాలయంగా మార్చేసింది. విశాఖపట్నంలో జరిగిన ఉప్పుసత్యాగ్రహానికి తానే బాధ్యతను నిర్వహించారు. అలాగే ఈమె అన్ని సామాజిక కార్యకలాపాల్లో పాల్గొన్న కమలాదేవి బావితరాల మహిళలకు మార్గదర్శకురాలైనది.

**కందుకూరి రాజ్యలక్ష్మీ :** ప్రముఖ సంఘసేవకురాలు, ఈమె సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం భార్యామణి. ఈమెకు 8 సంవత్సరాల వయస్సులో కందుకూరి వారితో వివాహం జరిగింది. తన మేనమామ నేర్పిన సంస్కారం వల్ల తన భర్తతో పాటు అనేక సంఘసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేది. ఆనాటి సమాజంలో బాల్యవివాహాలు ఎక్కువగా జరిగేవి. దీని మూలనా వితంతు పునర్వివాహులు జరిపించడానికి కంకణం కట్టుకున్నారు. వితంతువుల కోసం ప్రార్థన సమాజాన్ని స్థాపించారు. ఈ వివాహాలను ప్రోత్సహించినందుకు వారింటికి నీళ్ల వాళ్ళు, వంట వాళ్ళు రాకుండా నిరాకరించినపుడు గోదావరి కెళ్లి నీళ్ళు తెచ్చి పెళ్లి వారికి వంట చేసి పెట్టేది. ఇలా భర్తతో పాటు ఎన్నో సేవా కార్యక్రమాల్లో పాల్గొంది.

**గోళ్ళమూడి రత్నమ్మ :** 1886లో గుంటూరు జిల్లా, చేబ్రోలు గ్రామంలో ఒక సంపన్న కర్షక కుటుంబంలో జన్మించింది. 1921లో గాంధీగారు స్వరాజ్యయాత్ర చేస్తూ చేబ్రోలులో ఉపన్యసించినపుడు విని ఉత్తేజితురాలై, గాంధీని ఆదర్శంగా తీసుకొని జాతీయోద్యమంలో పాల్గొనింది. రాట్నం వడికి నూలు తయారుచేయడం, ఖాదీ ధరించింది.మద్రాసులో జరిగిన కాంగ్రెస్ మహాసభలకు వెళ్లింది. ఉప్పు సత్యగ్రహంలో పాల్గొంది. ఈమెను విప్లవ వనితగా గ్రహించిన బ్రిటిష్వారు జైల్లో పెట్టారు. గాంధీ – ఇర్విన్ ఒడంబడిక వల్ల విడుదలై, ప్రచారకార్యక్రమాలను ఉధృతం చేసింది. రత్నమ్మను బ్రిటిష్వారు దాదాపు ఐదార్ల సార్లు జైల్లో వేశారు. 1936 లో గుంటూరు జిల్లా కాంగ్రెసు బోర్డుకు జరిగిన ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిచింది. 1939లో చేబ్రోలులో మహిళా గ్రంథాలయమును స్థాపించింది, 1940లో స్త్రీలకు హిందీ విద్యాలయం స్థాపించింది. 1942లో 'క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గోని అరెస్టు అయినది.

**కొడాలి కమలాంబ :** కమలమ్మ అని పిలువబడే ఆమె స్వాతంత్రసమరయోధురాలు. క్విట్ఇండియా ఉద్యమంలో పాల్గొని 16నెలలు

జైలుశిక్ష అనుభవించారు. సంఘసంస్కర్త, హేతువాది కమలాంబ 1915 గుంటూరు జిల్లా మోపర్రు గ్రామంలో జన్మించింది. స్వాతంత్రద్యోదమ పోరాటంలో భాగంగా మోపర్రు గ్రామంలో రాట్నాలపై నూలు వడకి, చీరలు నేయించి ధరించేవారు. గ్రామ హరిజనవాడలో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. సింగంపల్లి సుబ్బారావు ప్రారంభించిన "జాతి భేద నిర్మూలన" కార్యక్రమంలో పాల్గొన్నారు. " ఈ క్షణం నుండి ప్రతి భారతీయుడు స్వతంత్రుడు విజయమో వీర స్వర్గమో తేల్చుకోవాలి" అని గాంధీ పిలుపు మేరకు కమలాంబ క్విట్ ఇండియా ఉద్యమంకు నడుంకట్టింది. ఈమెను 16నెలలు జైల్లో పెట్టగా వారి కళ్ళుగప్పి జైల్లోనే జాతీయజెండాను ఎగరవేసిన ధీరురాలు కమలాంబ. స్వరాజ్య సాధనకోసం తన వంటి మీద నగలన్ని తీసి గాంధీ గారికి ఇచ్చింది. ఆనాటి ఆమె నగలను ధరించడం మానేసింది. ఇలా అనేక జాతీయోద్యమ కార్యక్రమాల్లో పాల్గొన్న వీర వనిత.

భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో పోరాటం చేశారు. తమ ఉద్యమ పటిమను , తెగువను చూపారు. స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించారు. ప్రాణ త్యాగం చేశారు. ఈ పైవారే కాక మరెంతో మంది మహిళామణులు స్వతంత్ర పోరాటంలో పాల్గొని తెగించి ఆంగ్లేయులతో పోరాడారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారు. చరిత్రలో నిలిచిపోయినవారు కొందరైతే, అసలు చరిత్రలోకి రాని ఎంతో మంది మహిళామణులు తమ ప్రాణులను సైతం దేశం కోసం అర్పించారు. ఆడవాళ్ళ గడపదాటి బైటరాకూడదనే ఆంక్షలున్న ఆ రోజుల్లో దేశం కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన మహెూన్నత వీర వనితామూర్తులుగా చరిత్రలో నిలిచి మరెందరికో ఆదర్శమయ్యారు.

# స్వాతంత్ర్యయోధురాలు – "రాణి చెన్నమ్మ"

ఒ. హరీష్, పరిశోధక విద్యార్థి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి – 517502

బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన కాలంలో కన్నడ దేశానికి చెందిన "కిత్తూరు" అనే చిన్న రాజ్యానికి రాణి. మధ్యప్రదేశ్ లోనిఝాన్సీకి చెందిన లక్ష్మీబాయి కన్నా 56 సంవత్సరాల ముందేపుట్టి, తన రాజ్య స్వతంత్రానికై బ్రిటిష్ కంపెనీ తో పోరాటం చేసిన మొదటి భారతీయ వీరవనిత.

కిత్తూరు అనేది బెల్గాము రాజ్యానికి దగ్గరలో ఉన్న ఒక చిన్న రాజ్యం. అయితే ఆమె బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా తన గొంతెత్తి వారి అఘాయిత్యాలను వ్యతిరేకిస్తూ, 1824 లో బ్రిటిష్ వారి అపారమైనటువంటి సైన్యానికి భయపడకుండా ఎంతో ధైర్యంతో యుద్ధం చేసింది. అయితే మొదట విజయం ఆమె వైపే ఉన్ననూ చివరికి బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి బందీగా చిక్కి చెరసాలలో చివరగా కన్ను మూసింది.

"కన్నడ దేశానికి చెందిన ఆనాటి వీర వనితలైన అబ్బక్కరాణి,కెలారిచెన్నమ్మ,ఒనక ఓబవ్వల సరసన అగ్రస్థానంలో పేరెక్కిన సాహసి కిత్తూరు చెన్నమ్మ."

**చెన్నమ్మ జననము – బాల్యము :** చెన్నమ్మ బెల్గాంకు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి కిత్తూరు రాజ్యంలో 1778 అక్టోబర్ 23వ తేదీన జన్మించింది. ఈమె తండ్రి కాకతీయ దేశాయి కుటుంబానికి చెందినటువంటి ధూ లప్ప గౌదరు.చెన్నమ్మకు చిన్నతనంలోనే గుర్రపు స్వారీ విలువిద్యలలో శిక్షణ పొంది యుద్ధ విద్యలలో ఆరితేరింది.

**వివాహము రాజ్యపాలన :** చెన్నమ్మకు పెళ్లి వయసు రాగానే కిత్తూరు పాలకుడైన దేశాయి రాజ కుటుంబానికి చెందిన " మల్ల సర్జన"తోవివాహం జరిగింది. పెళ్లి అయిన తరువాత ఆమె కిత్తూరు రాజ్యానికి రాణిఅయినది. అయితే మల్ల సర్జనకు చెన్నమ్మ రెండో భార్య, రెండవ రాణి. వారికి ఒక కుమారుడు కూడా జన్మించాడు, కానీ అతను అనారోగ్యంతో చనిపోతాడు అప్పుడు చెన్నమ్మ" శివలింగ రుద్రప్ప" అనే బాలకుడిని తన కొడుకుగా దత్తత తీసుకుంటుంది.అతనిని తన వారసునిగా ప్రకటించింది. కిత్తూరు రాజ్య చరిత్ర 1586 నుండి అసలు కథ ప్రారంభించడం జరిగింది.

మాలినాడుకు చెందిన మల్ల అనే పేరుగల అన్నదమ్ములు బీజాపూర్ సంస్థానము పాలకుడు ఆదిలషాహిసైన్యములో పనిచేసేవారు .అయితే వారి వీరత్వానికిమెచ్చి,వారికి శంశేరజంగ్ బహుదూర్ అనే బిరుదు హుబ్లీ ప్రాంతంలో తమకు పాలనాధికారం ఇచ్చెను.

బీజాపూర్ రాజ్యం పతనమైన తరువాత వీరి వంశీకులు కిత్తూరు దేశపాలనను వారే స్వయంగా చూసుకునేవారు.బ్రిటిష్ ఈస్ట్ ఇండియా వారు పాలనాపగ్గాలు చేపట్టేసమయానికి దక్షిణ భారతంలో తమ అస్తిత్వాన్నినిలుపుకొనుటకు దేశాయిలు అటు హైదరాబాదు నిజాంసాహి,ఇటు మైసూరు హైదర్ అలీ మధ్య పోరు జరుగుతున్న రోజులలో హైదర్ ఆలీతో జరిగిన యుద్ధంలో మల్లసర్జన బంధీగా అయి ఉపాయంతో తప్పించుకు వచ్చిన మల్ల సర్జన 1803లో అప్పటి బ్రిటిష్ ఈస్ట్ ఇండియాకు చెందిన వెల్లస్లీతో ఒప్పందం చేసుకొనడం జరిగింది.తరువాత 1809 లో వెల్లస్లీకి ఒక లక్ష 75 వేల రూపాయలు ఇచ్చి స్థానిక బ్రిటిష్ ఖర్చులు భరించేలా ఒప్పందం చేసుకొనెను.

కానీవెల్లస్లీ విశ్వాసాన్ని కోల్పోయిమల్లసర్జననను మూడు సంవత్సరాలు పూణేలో బందీగా ఉంచెను. 1816లో విడుదలై తిరిగి వస్తూ మార్గమధ్యలో 1817లో మరణించడం జరిగింది.చెన్మమ్మ,మల్లసర్జనల దత్తపుత్రుడు శివలింగ సర్జనము టిప్పు సుల్తాన్ నుండి రక్షణకై బ్రిటిష్ ఇండియాతో ఒప్పందం చేసుకొనెను.సంవత్సరానికి 1,70,000రూపాయలు కప్పం చెల్లించుటకు ఒప్పందంతో వీరి ఒప్పందం 1824 వరకు కొనసాగింది.

1824 సెప్టెంబర్ 11 లో శివలింగ రుద్రసర్జనను వారసుడు లేకుండగానే మరణిస్తాడు.అతడు చనిపోయే సమయానికి

అతని భార్య వీరమ్మ వయస్సు 11 సంవత్సరాలు. చనిపోవడానికి ముందే మాస్తమరడి గౌడర కుమారుడు శివలింగప్పను దత్తత తీసుకోవడం జరిగింది. దీనిని అదునుగా తీసుకొని అప్పటి ధారవాడ కలెక్టరు థ్యాకరే ఈ దత్తతను నిరాకరించి 1824 సెప్టెంబర్ 13న కిత్తూరు వచ్చి మల్లప్ప శెట్టి,హవేరి వెంకటరావులను అధికారులుగా నియమించి ధనకోశముకు తాళము వేశాడు.

దీనిని చిన్నమ్మ ఎదిరిస్తుంది. ఈ విషయమై చెన్నమ్మ థ్యాకరేకు,చాప్లినుకు, మన్రోకు,విన్నపం చేస్తుంది. శివలింగప్ప వారసత్వాన్ని అంగీకరించి పాలనా అధికారం ఇప్పించమనగా దానికి వారు నిరాకరించగా సమీపంలో ఉన్న కోలాపూర సంస్థానంతో మిగతా బ్రిటిష్ వ్యవహారం పట్ల కోపంతో ఉన్న వారితో సహకారానికి సంప్రదింపులు జరుపుతుంది.

**చెన్నమ్మ బ్రిటిష్ ఈస్ట్ ఇండియా తో యుద్ధం :** ధారావాడ కలెక్టర్ సైన్య సమేతంగా 21 అక్టోబర్ 1824 న కిత్తూరు వచ్చి యుద్ధము ప్రకటించి ఫిరంగులను పేల్చుటకు సిద్ధమవ్వగా కోట ముఖ ద్వారం తెలుసుకొని బయటకు వచ్చిన చెన్నమ్మ సైన్యం మూకుమ్మడిగా బ్రిటిషు సైన్యంపై గురు సిద్ధప్ప అను చెన్నమ్మ సైన్యాధిపతి నేతృత్వంలో శత్రు సైన్యంపై ఊపిరి ఆడనివ్వకుండా దాడి చేయడం జరిగింది. చెన్నమ్మ అంగరక్షకుని తుపాకీ గుండుకు కలెక్టర్ మరణించాడు. స్టీవెన్స్, ఇలియట్ అనే ఇద్దరు బ్రిటిష్ వాళ్ళు బందీలుగా చిక్కారు.

అయితే దేశద్రోహానికి ఒడికట్టినటువంటి బ్రిటిష్ వారికి సహకరించినకన్నూరు వీరప్ప, సరదార మల్లప్ప కిత్తూరు సైన్యం చేతిలో ప్రాణాలు పోగొట్టుకుంటారు. తరువాత బ్రిటిష్ వారి కుటిల బుద్ధితో ఒప్పందానికి వచ్చినట్లు నటించి బందీలైన తమ ఇద్దరి బ్రిటిష్ అధికారులను 1824 డిసెంబర్ 2న విడిపించుకువెళ్లారు. అయితే మాట తప్పి బ్రిటిష్ వారు మళ్ళీ డిసెంబర్ 3 తేదీన తమ అపారమైన సైన్యంతో కిత్తూరు మీద దాడి చేస్తారు. ఫిరంగులతో కూట గోడలను బద్దలు కొట్టి లోపలికి ప్రవేశిస్తారు అయితే కిత్తూరు సైన్యం వారితో వీరోచితంగా పోరాడినను చివరికి లొంగిపోక తప్పలేదు. చివరకు 1824 డిసెంబర్ 5న చెన్నమ్మ ఆమె కోడలు వీరమ్మ, జానకిబాయిలతో పాటు బ్రిటిష్ వారికి బందీగా చిక్కుతుంది. వీరిని బందీలుగా బైలహెూ%శీ%గల కు తీసుకెళ్లారు బ్రిటిష్ వారు. చివరకు బ్రిటిష్ వారితో ఎంతో వీరోచితంగా పోరాడి నాలుగు సంవత్సరాలు ఖైదీగా ఉండి 1829 ఫిబ్రవరి 2న వీరమరణం పొందెను అంతటితో చరిత్రలో చిన్నమ్మ శకం ముగిసింది.

**రాణి చెన్నమ్మ. :** "మేము బతికితే స్వేచ్ఛ జీవులుగానే బతుకుతాము ఒకడి క్రింద బానిసలుగా మేము బ్రతకము" అంటూ విజయమో వీర స్వర్గమో అనే ఆర్యోక్తికి నిదర్శనంగా తన రాజ్యసంరక్షణ కోసం బ్రిటిష్ వారితో పోరాడి అలసి సొలసి అసువులు బాసిన స్వాతంత్ర పోరాట మహిళ సింగం కిత్తూరు రాణి చెన్నమ్మ.

**ఆధార గ్రంథాలు :**

వీరనారి కిత్తూరు రాణి చెన్నమ్మ : పుట్టి నాగలక్ష్మి (తెలుగు సాహిత్య వేదిక) ( సంచిక)
ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో భారత ప్రభుత్వం ప్రత్యేక సేవ మరియు ఫీచర్లు : డాక్టర్ నందిత కృష్ణ
కిత్తూరు రాణి చెన్నమ్మ అంతర్జాల సమాచారం (వికీపీడియా)

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# తెలుగు సాహిత్యం లో భారత స్వాతంత్ర్య ఉద్యమం

డా ॥ పి. శిరీషా కుమారి, హైదరాబాదు

ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరిసిన భారతదేశం కర్మభూమి, పుణ్యభూమి, దివ్యభూమి. ఇక్కడ ప్రభవించిన సమస్త వాఙ్మయం ముందుగా కర్మ తత్త్వాన్ని ప్రబోధిస్తోంది. కర్మాచరణ ద్వారా మాత్రమే మానవుడు ఉన్నత పదాన్ని పొందుతాడు. ఆధ్యాత్మిక తత్త్వవిదుల పరిభాషలో చెప్పాలంటే మోక్షాన్ని పొందుతాడు. ఇహలోకంలో కరచరణాద్యవయవరూపమైన దేహంతో మనం చేసే సత్కార్యం వలన మాత్రమే పుణ్య సముపార్జన చేయగలం. అందుకే కర్మభూమి అయిన భారత భూమిలోమానవులు తమకన్న ధన్యులని దేవతలు భావిస్తున్నారు.

"గాయన్తి దేవాః కిలగీతికాని ధన్యాస్తు యే భారత భూమి భాగే ।
స్వర్గాపవర్గాస్పద హేతుభూతే, భవన్తి భూయః పురుషాః సురత్వాత్ ॥

స్వర్గానికి, ముక్తికి ద్వారంవంటిదైన ఈ భారత భూమిలో పుట్టిన మానవులు తమకన్న ధన్యులని దేవతలు గానం చేస్తున్నారు.. అందుకనే కర్మాచరణకోసం దేవతలు దివినుండి భువికి దిగి వస్తారు అంటారు.

మాతృ భూమిని, అందలి నదీనదాల్ని, ప్రకృతిని, వృక్షసంపదను, వాతావరణాన్ని, వ్యక్తులను, వారి త్యాగాలను గానం చేయటం, దానినుండి ప్రేరణ పొందటం మొదలైన సామాన్య లక్షణాలు దేశభక్తి కవిత్వం కలిగి ఉంటుంది.

ప్రజలలో ఐకమత్యాన్ని ఏకాత్మ భావనను ప్రచారం చేసిన వేదాలు సమైక్యంగా ఉండి, దేశాభివృద్ధికై కృషి చేయమని ప్రబోధించాయి. మన మనస్సులలోను, ఆలోచనలలోను, కార్యకలాపాలలోను ఏ రకమైన ఐకమత్య రాహిత్యం ఉండరాదని అంటూ –

"సందోమనాంసి సంవ్రతా సమాకూతిర్నమామసి ।
అలాయే వివృత్ స్థాన తాన్వః సం నమయామసి ॥

మనం కలిసి పయనిద్దాం. కలిసి భుజిద్దాం. కలిసి జ్ఞానాన్ని గ్రహిద్దాం. కలిసిమెలిసి జీవిద్దాం. సౌమనస్యభావనం కలిగి ఉందాం. తగిన బాధ్యతలు స్వీకరిద్దాం, కలసి ఆలోచిద్దాం, సమాన హక్కులు పొందుదాం.

స్వాతంత్ర్యోద్యమం

యావత్ భారతదేశం దేశ స్వాతంత్ర్యంకోసం జరిపిన మహోద్యమమే స్వాతంత్ర్యోద్యమం. ఈ ఉద్యమంలో జాతి యావత్తు పాల్గొని అనేక త్యాగాలు చేసింది. అయితే జాతి అంటే ఒక భూభాగమో లేదా ఒక ప్రజా సమూహమో కాదు. ఈ రెంటి కలయికా కాదు. ఒక మహాద్భుతమైన సృష్టే. ఒక జాతి మనుగడ వర్తమానానికి మాత్రమే పరిమితమైనది కాదు. సుదూర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వర్తమాన కాలంలో చేయదగిన పనులు చేయటం జరుగుతుంది. ఇటువంటి జాతి పట్ల గల అభిమానానికి స్వాతంత్ర్యకాంక్ష అని భావించవచ్చు.

**స్వాతంత్ర్య కాంక్ష :** ప్రజలలో ఆత్మ విశ్వాసాన్ని, ఆత్మ గౌరవాన్ని కలిగిస్తుంది. తమ దేశాన్ని తామే పరిపాలించుకొని, దానిని అన్నివిధాల అభివృద్ధిపరచి, ప్రపంచంలో ఒక గౌరవ స్థానాన్ని పొందాలి అని భావించి, ఆ దేశ ప్రజలు ప్రయత్నాలు సాగిస్తారు. ఆ ఆశయ సిద్ధికి, ప్రయత్నాలకు బానిసత్వం అడ్డుగాను, పరపరిపాలన ఆటంకంగాను ఉన్నపుడు ఆ దేశ ప్రజల మొట్టమొదటి కర్తవ్యం స్వాతంత్ర్యం కోసం పోరాడటమే. తమ లక్ష్యం సిద్ధించేవరకు ప్రజలు అవిశ్రాంతంగా పోరాడుతారు. ఈ పోరాటం కొనసాగించడానికి దేశ ప్రజలకు అవసరమైన స్ఫూర్తి, ప్రేరణ పైన పేర్కొన్న ఆసక్తి, కాంక్షల ద్వారా స్వాతంత్ర్యం సిద్ధిస్తుంది. ఇందులో ఎంతమాత్రం సందేహం లేదు.

ఈ విశాల విశ్వంలో బానిసత్వాన్ని ఏ దేశమూ అంగీకరించదు. ఆకాశంలో పక్షి రెక్కలు విప్పుకొని స్వేచ్ఛా విహారం

చేస్తుండగా, వసంతం రాగానే కోకిల గొంతువిప్పి కమనీయంగా గానం చేస్తున్నపుడు మనిషి మాత్రం బానిసత్వ బాధా సర్ప దష్టుడై మనగలగటం ఏం న్యాయం? ఏం అవసరం? అందుకే ప్రపంచ చరిత్రలో మానవుడు స్వాతంత్ర్యంకోసం ప్రాణాలర్పించటానికై సిద్ధపడిన సంఘటనలు మనకు అనేకం కనిపిస్తాయి. ప్రతి జాతి తన దేశ స్వాతంత్ర్యంకోసం పోరాడిందే. జాతి యావత్తు తన మాతృదేశ స్వాతంత్ర్యంకోసం విసుగు విరామం లేకుండా సాగించిన పోరాటాన్నే మనం స్వాతంత్ర్యోద్యమంగా వ్యవహరిస్తున్నాం. ఈమహోద్యంలో ఎందరో దేశభక్తులు అసువులు అర్పించారు. ఎన్నో జీవన కుసుమాలు కరకు కర్కశ అధికార ఉక్కుపాదాల క్రింద పడి నలిగి నశించిపోయాయి.

ఆనాటి దుర్భర పరిస్థితిని 'యూరోపియన్ అధికారులు భారతీయ జాతులపట్ల చూపిన అయోగ్య ప్రవర్తనను, వ్యక్తిత్వ చైతన్యమున్న ఏ జాతి కూడ ఒక గంటకాలం కూడ సహించి యుండజాలదని' బాల్ అనే ఆంగ్లేయ చరిత్రకారుడు పేర్కొన్నాడు.

సమాజ పరమేశ్వరుడు తన విప్లవ నేత్రాన్ని తెరిచాడు. దానినుండి వెలువడిన జాతీయ విప్లవ ప్రచండాగ్నిలో అనేకమంది మహావీరులు అనుపమ ధైర్యసాహసాలతో పోరాడి, మాతృభూమి దాస్యవిముక్తికై ప్రాణాలు ధారపోశారు. లక్షలాది పౌరులు, వేలాది సైనికులు, వీరనారీమణులు కూడా ఈ ఉద్యమంలో పాలుపొంచుకొన్నారు. ఈ జాతీయ చైతన్యమే సాహిత్య కళా రంగాలలోను ప్రస్ఫుటంగా కనిపించింది. కవులు విప్లవ గీతాలు, స్వాతంత్ర్య సందేశ గేయాలు రచించారు. నాటి సారస్వతం అంతా స్వాతంత్ర్యోద్యమ ప్రభావంతో నిండింది.

రాణి ఝాన్సీలక్ష్మీబాయి, సరోజినీ నాయుడు, కిత్తూరు రాణి చెన్నమ్మ, ఉషా మెహతా, సావిత్రీబాయి పూలే, భికాజీకామా, లక్ష్మీసహగల్, కస్తూరిబాగాంధీ వంటి వీరనారీమణులు భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న కొందరు పేరెన్నికగన్న, చెప్పుకోదగ్గ వీర నారీమణులు. ఇలా ఎందరెందరో ........

వందే మాతరం గీతం వ్రాసిన బంకించంద్ర బెంగాలీ పులి.

'*ఇంక్విలాబ్ జిందాబాద్*' అంటూ ఉర్దూ కవి అయిన మౌలానా హస్రత్ మెహనిబ్ స్వాతంత్ర్యోద్యమంలోకి దూకిన సింహకిశోరం. '*జై హింద్*' '*మీరు రక్తాన్నివ్వండి, నేను మీకు స్వాతంత్ర్యాన్నిస్తా*' అన్న నేతాజీ, '*సత్యమేవ జయతే*' అన్న మదన్‌మోహన్‌మాలవ్య, '*దుష్మన్‌కీ గోలియోంకా హమ్ సామ్నా కరేంగే, ఆజాద్ హీ రహేన్‌హై, ఆజాద్‌హీ రహేంగే*', అన్న చంద్రశేఖర్ ఆజాద్, '*క్విట్ ఇండియా, సైమన్ గో బ్యాక్*' అన్న యూసఫ్ మెహరలి, 'డూ ఆర్ డై' అన్న గాంధీజీ, '*జల్ జంగిల్ జమీన్*' అన్న కొమురంభీం –వీరంతా మన స్వాతంత్ర్య సమర నేతలు. వీరి ఈ నినాదాలు మనలను దాస్య శృంఖలాలనుంచి బయటపడవేసినాయి.

చాలామంది తెలుగు కవులు తమ రచనలద్వారా ప్రజలలో స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేలా చేయడంలో అద్భుతమైన పాత్ర నిర్వహించారు. తెలుగు కవులు స్వాతంత్ర్య ఉద్యమానికి సంబంధించిన ఘట్టాలపైన ఉద్యమానికి నాయకత్వం వహించిన లాలా లజపతిరాయ్, బిపిన్‌చంద్రపాల్, బాలగంగాధర తిలక్, మహాత్మాగాంధీ మొదలగు నాయకుల గురించి అనేక రచనలు చేశారు.

శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం, గురజాడ అప్పారావు, మంగిపూడి వెంకట రాయ శర్మ, తుమ్మల సీతారామమూర్తి, రాయప్రోలు సుబ్బారావు, శ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రి, గుఱ్ఱం జాషువా, శంకరంబాడి సుందరాచారి, పుట్టపర్తి నారాయణాచార్యులు, చెరుకువాడ వెంకటరామయ్య, దువ్వూరి రామిరెడ్డి, ఉన్నవ లక్ష్మీనారాయణ, కరుణశ్రీ, గరిమెళ్ల సత్యనారాయణ తదితర కవులెందరో అనేక రచనలు చేసి ప్రజలలో స్వాతంత్ర్య కాంక్ష రగిలించటంతోపాటు ఉద్యమంలో పాల్గొన్నారు. అస్పృశ్యత లాంటి సాంఘిక దురాచారాలను సైతం తరిమివేయడానికి తమవంతు కృషి చేశారు.

శ్రీ చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారు

భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి

అనే కవిత బహుళ ప్రచారం పొందింది. ఆంధ్ర దేశంలో ప్రతిసభలోనూ ఈ పద్యం పాడేవారు. హరికథలలో సైతం ఈ పద్యం చోటుచేసుకుంది.

"చిలకమర్తి" వారి 'భరతఖండంబు' అను పద్యము తెలుగులో భారతజాతీయోద్యమ పరమైన తొలి రచన అని చెప్పవచ్చు.

శ్రీ రాయప్రోలు వారి దేశభక్తి అనితర సాధ్యమైనది. ఈ దేశంలో పరిఢవిల్లిన సంస్కృతి సంప్రదాయాలు, ఇచ్చట జన్మించిన వీరులు – వారి సాహసాలు రాయప్రోలువారిలో ఎంతో విశ్వాసాన్ని కల్గించాయి.

"ఏ దేశ మేగినా, ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వ రేమనినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండుగౌరవము
. . . . . . . . . . . . . .
లేదురా యిటువంటి భూదేవి యెందు"

అన్న గీతం నాటికి నేటికి మనలో ఎంతో ఆత్మ విశ్వాసాన్ని కల్గిస్తుంది, అంతేగాక ఎంతో స్వాభిమాన పూర్వకంగా ఆత్మవిశ్వాసంతో చెప్పగల్గేలా చేశాయి.

శ్రీలు పొంగిన జీవ గడ్డయి, పాలు పాఱిన భాగ్యసీమయి –
వందన మాంధ్ర మహా జనని–సుందరతర పౌరాణికావని – అన్న తెలుగు దేశభక్తి గీతాలు
వందే త్వాం భూదేవీం ఆర్య మాతరం జయతు జయతు పదయుగళం తే నిరంతరం అనే సంస్కృత గీతం
ఇవి కూడ రాయప్రోలువారి దేశభక్తికి మచ్చు తునకలు.

రాయప్రోలు తరువాత ఆత్మ విశ్వాసంతో కవిత చెప్పగలిగిన కవికోకిల శ్రీ దువ్వూరి రామిరెడ్డి గారు అస్థిపంజరాన్ని సయితం ఆడించగల శక్తి జాతీయతకు ఉందని చెప్తూ, –

"అంబుదంబుల నమృత పూరమ్ము లొలక
నింద్ర చాపంపు తోరణ మింపు గులుక
కాఱు మెఱుగులు నెల్లెడ గడలుకొనగ
వెడలె స్వాతంత్ర్య రథము విన్వీథియందు" అన్నారు.

శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రి గారు తమకు గల మాతదేశ భక్తిని ప్రకటించు కోవటంలో దువ్వూరివారితో సమానులని చెప్పవచ్చు.

'కాదుకనై ధరాధిపుల కాళ్లకడం బొరలాడి వాడిపో' లేనని,
'ధరా పరాగ పటలీ మలినమ్మగు ద్వార తోరణాస్థానమునందురింబడగ జాల'నని ఉద్ఘోషించారు.
"నీచపు దాస్య వృత్తి మననేరని శూరత మాతృ దేశ సే
వాచరణమ్ము నందసువులర్పణ జేసిన వారి పార్థివ
శ్రీ చెలువారు చోట దదస్రుశ్రుచులనే వికసించి వాసనల్

వీచుచు రాలిపోవగ వలెం దదుదాత్త సమాధిమృత్తికన్"

అన్న కాంక్ష వ్యక్తం చేశారు.

కరుణశ్రీ జంధ్యాల వారి – 'విజయశ్రీ' భారతేతిహాసాన్ని వస్తువుగా తీసుకొని, భారత జాతీయోద్యమ భావాలను, స్వాతంత్ర్యేచ్ఛను వ్యక్తం చేశారిలా –

దొరల మటంచు రాజసముతో తెగనీలిగి పట్టు పాన్పులన్

బొరలు దినమ్ము లన్నియును పోయె, ప్రపంచము మారిపోయె ము

ష్కరులు కురూద్వహుల్ మనల గాదని కన్నులు మూసికొన్న ఈ

నరుని కఠోర గాండివ నినాదము నిద్దుర మేలుకొల్పెడిన్

శ్రీ విశ్వనాథ వారి ఝాన్సీ రాణి

వీరావేశంతో శత్రు సమూహాన్ని చీల్చి చెండాడిన అపరకాళిక ఝాన్సీ లక్ష్మీబాయి. ఈమె జీవిత చిత్రణతో ఆంధ్రపాఠకులను వీరావేశంతో ఉద్రూతలూగించారు విశ్వనాథ వారు. ఈవిధంగాతెలుగు సాహిత్యం లో భారత స్వాతంత్ర్య ఉద్యమం గురించి వివరించే ప్రయత్నం ఎంతోమంది మహాకవులు చేశారు.

నాశ్వాపాతము పండువెన్నెల ప్రభారాహిచ్ఛటల్ తెచ్చెడున్

తెలుగు సాహిత్యం లో భారత స్వాతంత్ర్య ఉద్యమం గురించి వివరించే ప్రయత్నం చేశారు.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# ఉప్పు సత్యాగ్రహం – స్వాతంత్ర సమర తెలుగు నాయకురాండ్లు

**పూజ ఎరికంబట్టు,** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు.

**సంక్షిప్త పరిచయం:** సుదీర్ఘ కాలం శాంతియుతంగా జరిగిన భారత స్వాతంత్ర పోరాటం ప్రపంచ చరిత్రలో ఒక ఆసక్తిదాయకమైన విషయం. ఈ పోరాటంలో భారతీయ మహిళలు అందునా ముఖ్యంగా తెలుగు మహిళలు స్ఫూర్తిదాయకమయిన పాత్రను పోషించారు. ఈ మహిళలు భారత స్వాతంత్ర పోరాటంలో పాల్గొనడమే కాక ప్రజా జీవితంలో మహిళల భాగస్వామ్యానికి బలమైన పునాదులు వేశారు. అటువంటి మహిళలలో కొంతమంది గురించి రేఖామాత్రంగా ఈ వ్యాసంలో పరిశీలించడం జరిగింది.

**ముఖ్యాంశాలు:** అచంట రుక్మిణీ లక్ష్మీపతి, మార్గరెట్ ఈ కజిన్స్, గోగినేని భారతీదేవి తెలుగు ప్రాంతాలలో స్వాతంత్రోద్యమం దీప్తి మహిళల పాత్ర ఆధునిక యుగం ఆరంభంలో భారత దేశం లో ప్రారంభమైన పునరుజ్జీవన ఉద్యమంలో స్వాతంత్ర సమరం విడదీయరాని భాగంగా మనం భావిస్తున్నాము. 1857 లో దేశవ్యాప్తంగా జరిగిన సాయుధ తిరుగుబాటు విఫలం కావడం భారతదేశంలో పాతతరం ప్రాబల్యం అంతరించడానికి కొత్త తరం చేతికి నాయకత్వం రావడానికి విభజన రేఖ గా గుర్తిస్తారు. లార్డ్ మెకాలే విద్యా విధానం ద్వారా భారతదేశంలో ఆవిర్భవించిన మేధావి వర్గం భారత సమాజాన్ని ప్రభావితం చేయడం ప్రారంభించింది.

1880 నుండి ఈ క్రియాశీలతను భారత సామాజిక వ్యవస్థలో గమనించగలం. 1885లో ఏ. ఓ. హ్యూమ్ గారి నాయకత్వంలో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ రూపొందింది రూపొందిన అప్పటినుండి మార్పులు స్పష్టమైన రూపాన్ని తీసుకున్నాయి. దేశంలో జరుగుతున్న రాజకీయ మార్పులకు అనుగుణంగా తెలుగు ప్రాంతాలు కూడా ప్రతి స్పందన ప్రారంభమై అనుసంధానం చెందింది. వందేమాతరం ఉద్యమం సమయంలో తెలుగు ప్రాంతాలలో జాతీయ భావన రూపొంది విరామం లేకుండా విస్తరించింది. వందేమాతరం ఉద్యమంలో ప్రత్యక్షంగా మహిళల పాత్ర తెలుగు ప్రాంతాలలో రికార్డుల్లో లేకున్నా, జాతీయ ఉద్యమం పట్ల తెలుగు మహిళలలో ప్రగాఢ సానుభూతి ఉన్నట్లు వివిధ ఆధారాల ద్వారా మనం గమనించవచ్చును.

గాంధీ గారు ప్రబోధించిన అహింసా సిద్ధాంత,నిర్మాణ కార్యక్రమాలు నిర్మాణాత్మక కార్యక్రమాలు మహిళలను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వాతంత్రం సంపాదించుకోవాలంటే వీధిపోరాటాలు చెయ్యనక్కరలేదని, మగ్గం పై నూలు వడికితే చాలని, గాంధీ గారు బోధించారు. గాంధీ గారి పోరాటంలో ఒక విశేషమేమిటంటే మహిళలు చేయలేని కార్యక్రమాలను స్వాతంత్ర పోరాటంలో భాగంగా చెయ్యడు. పై విధాలైన చర్యల ద్వారా గాంధీ గారు మహిళలను స్వసంత్ర పోరాటంలో భాగం చేయడమే కాక విశేషంగా బంగారు నగలను విరాళంగా పొందగలిగాడు. మహిళలు ఇది తమకు అందివచ్చిన అవకాశంగా భావించి, స్వాతంత్ర పోరాటంలో పాల్గొని పురుషులతో సమానమైన అంతస్థుల సంపాదించుకోవడానికి చేశారు కృషి చేశారు. భారత నారీమణులు పూర్ణ స్వరాజ్యం కొరకు పురుషుల కంటే ఎక్కువ తోడ్పడగలరని, నిజంగానే మహిళలకు ఎక్కువ ధైర్యం, స్వార్థ త్యాగబుద్ధి ఉద్యమాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకు వెళ్ళ గలరని గాంధీ గారు పేర్కొన్నారు.

గాంధీ గారి సహాయ నిరాకరణోద్యమంలో ప్రారంభమైన మహిళా చైతన్య ధోరణి, ఉప్పు సత్యాగ్రహం కాలంనాటికి సంపూర్ణ స్వరూపాన్ని తీసుకున్నది. గాంధీ గారి ఆంధ్ర రాష్ట్ర పర్యటనలో మహిళలతో ప్రత్యేక సమావేశాలు తప్పనిసరి అంశంగా మారిపోయాయి. ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమాలలో పాల్గొన్న కొంతమంది తెలుగు మహిళా మణుల గురించి రేఖామాత్రంగా మనం పరిశీలిద్దాం.

**సంగం లక్ష్మీబాయి :** సంగం లక్ష్మీబాయి గారు 1911లో హైదరాబాదులో జన్మించిన ఈమె గుంటూరులోని శారదా నికేతన్ లో విద్యనభ్యసించారు. మహారాష్ట్ర ప్రాంతంలోని పూనా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను చదువుకున్నారు. 1928లో భారతదేశంలో రాజకీయ మార్పులను దానికి పరిశీలించడానికి ప్రభుత్వంచే నియమించబడిన కమిషన్ పై సైమన్ కమిషన్ ను బహిష్కరించ

ఉద్యమంలో పాల్గొన్నారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని ఒక సంవత్సర కాలం రాయవెల్లూరు లోని జైలులో కారాగార శిక్షను అనుభవించారు. 1932లో శాసనోల్లంఘన ఉద్యమంలో గాంధీ గారి తో కలిసి ఉపవాసం చేశారు. 1951లో ఆచార్య వినోబా భావే భూదానోద్యమం ప్రారంభించినప్పుడు వీరి తో కలిసి తెలంగాణ ప్రాంతంలో పర్యటించారు. భారతదేశ స్వాతంత్రం అనంతరం 1951 నుండి 1971 వరకు లోక్ సభ సభ్యురాలిగా పనిచేశారు. ఈమెను భారత ప్రభుత్వం తామ్ర పత్రంతో సన్మానించింది.

**మార్గరెట్ ఈ కజిన్స్** : మార్గరెట్ ఈ కజిన్స్ గారు ఐర్లాండ్ దేశంలో 1878 లో జన్మించారు. 1915లో భారతదేశం వచ్చారు. అనిబిసెంట్ గారు మదనపల్లిలో నెలకొల్పిన జాతీయ కళాశాలలో వీరు ప్రిన్సిపాల్ గా పని చేశారు. వీరు దివ్యజ్ఞాన సమాజ సభ్యురాలు. హోంరూల్ లీగ్ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఖాకీ వస్త్రాల వాడకం, రాట్నం పై నూలు వడకడం మొదలైనఅంశాలను ప్రచారం చేశారు. 1932లో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని ఒక సంవత్సర కాలం పాటు వేలూరు జైలులో నిర్బంధ శిక్ష అనుభవించారు.

**గుత్తా సుందరమ్మ :** గుత్తా సుందరమ్మ గారు 1904లో వీరు జన్మించారు గుంటూరు జిల్లాలోని రేపల్లె వీరి నివాస ప్రాంతం. 1932లో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని ఒక సంవత్సర కాలం పాటు వేలూరు జైలులో నిర్బంధించిన అనుభవించారు. వీరు1937లో కీర్తిశేషులయ్యారు.

**వాసిరెడ్డి హనుమాయమ్మ :** వాసిరెడ్డి హనుమాయమ్మ గారు 1910 లో వీరు జన్మించాడు చేబ్రోలు వాస్తవ్యులు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని ఒక సంవత్సర కాలానికి శిక్షను గురయ్యారు. 1932 లో తిరిగి జైలుకెళ్లి నెల్లూరు, కోయంబత్తూరు లో జైలు శిక్ష అనుభవించారు. 1941 లో వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని మూడునెలల్లో శిక్షను కడలూరు జైలులో అనుభవించారు.

**సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి :** సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి గారు 1914లో కృష్ణా జిల్లాలోని నందిగామ లో జన్మించారు. 1932లో శాసనోల్లంఘన ఉద్యమంలో మీరు పాల్గొని ఒక సంవత్సరం జైలు శిక్ష నెల్లూరు మద్రాసు జైలులో అనుభవించాడు. సత్యాగ్రహం లో కూడా పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. హిందీ భాష ప్రచారోద్యమం గ్రంథాలయ ఉద్యమం లోపాల్గొన్నారు. వీరు "తెలుగుదేశం" అన్న వార పత్రికను నడిపారు.

**గోగినేని భారతీదేవి :** గోగినేని భారతీదేవి గారు గుంటూరు లోని మాచవరం లో వీరు 1908లో జన్మించారు ధోని కీర్తనలో చదివారు బంధంలోని ఆక్స్ఫర్డ్ రస్కిన్ ఆర్ట్స్ విద్య సంస్థలు లో 1925 నుంచి 1926 వరకూ విద్యనభ్యసించారు. 1931లో శాసనోల్లంఘన లో భాగంగా విదేశీ వస్త్ర దుకాణాల వద్ద ఆరు నెలల పాటు నడిపారు. 1932 లో పశ్చిమ గోదావరి కృష్ణా జిల్లాలో మహిళా సత్యాగ్రహం సంఘటిత పరచారు. శాసనోల్లంఘనం లో పాల్గొని ఒక సంవత్సర కాలం జైలు శిక్ష అనుభవించారు. వెంకటగిరి జమీందారీ రైతు ఉద్యమంలో పాల్గొన్నారు. 1934లో వ్యతిరేక ఉద్యమం దాడి జమీందారీ వ్యతిరేక ఉద్యమం, సంస్థానాల వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని మహిళలకు శిబిరాలను నిర్వహించారు. కుల రహిత సమాజం కొరకు కృషి చేశారు. కులాంతర వివాహాలను జరిపించారు. 1944లో మహిళా రాజకీయ పాఠశాలను నెల

కొల్పారు. అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ సంఘానికి అధ్యక్షుడయ్యారు. 1952– 53 ప్రాంతంలో రాయలసీమ ప్రాంతం తీవ్ర కరువు గురైనప్పుడు సహాయ శిబిరాలను ఏర్పాటు చేశారు. 1958లో ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులు అయ్యారు . ప్రముఖ జాతీయ నాయకుడు ఎన్ . జి రంగా గారు ఈమె భర్త. గోగినేని భారతీదేవి గారు 1972 సెప్టెంబరు 27న కీర్తిశేషులయ్యారు.

**అచంట రుక్మిణీ లక్ష్మీపతి** : అచంట రుక్మిణీ లక్ష్మీపతి గారు వీరూ 1881లో పశ్చిమ గోదావరి జిల్లా జన్మించారు ఈమె బి.ఎ పాసయ్యారు. మద్రాసులో స్వదేశీ స్టోర్ నెలకొల్పారు1930 లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 10 నెలల కఠిన కారాగార శిక్షను వెల్లూరు జైలులో అనుభవించారు. మద్రాస్ యూనివర్సిటీ సెనెట్ సభ్యురాలు. 1937లో మద్రాసు రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ లో

ఈమె సభ్యురాలు. 1937లో మద్రాసు శాసనసభకు డిప్యూటీ స్పీకర్ గా పనిచేశారు. ప్రకాశం గారి మంత్రివర్గంలో ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నారు. 1951లో మీరు కీర్తిశేషులయ్యారు.

**దువ్వూరి సుబ్బమ్మ :** దువ్వూరి సుబ్బమ్మ గారు 1880లో ఈమె రామచంద్రపురం తాలూకా ద్రాక్షారామంలో జన్మించారు. స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 1922లో ఏప్రిల్ నాలుగో తారీఖున కాలం పాటు కఠిన కారాగార శిక్షకు గురయ్యారు. రాజమండ్రి జైలులో నిర్బంధానికి గురయ్యారు. తిరిగి ఆరు నెలల కాలానికి శిక్షణ బద్దారు నెల్లూరులో నిర్బంధించ బడ్డాడు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా తీవ్రమైన లాఠీఛార్జి గురయ్యారు. సుబ్బమ్మ 16 సంవత్సరాల పాటు ఎఐసిసి సభ్యురాలు. 1923లో కాకినాడలో కాంగ్రెస్ మహాసభ ఈమెకు "దేశ బాంధవి" అన్న బిరుదుతో సత్కరించారు. 1964 వీరూ మే 31న కీర్తిశేషులయ్యారు.

**ఉన్నవ లక్ష్మీబాయమ్మ :** ఉన్నవ లక్ష్మీబాయమ్మ గారు వీరు గుంటూరు జిల్లాలోని సత్తెనపల్లి సమీపంలో జన్మించారు. శారదా నికేతన్ ను నెలకొల్పి మహిళల విద్యావకాశాలను ఇప్పించారు. వితంతు వివాహాలను ప్రోత్సహించారు. సహాయ నిరాకరణోద్యమం లోనూ సత్యాగ్రహ ఉద్యమంలోనూ పాల్గొన్నారు జైలు శిక్ష అనుభవించారు వ్యక్తి సత్యాగ్రహం లో కూడా పాల్గొని తిరిగి జైలు శిక్ష అనుభవించారు.

**వేదాంతం కమలాదేవి** : వేదాంతం కమలాదేవి గారు 1897లో కడప జిల్లాలోని రాజంపేటలో వీరు జన్మించారు. వీరు కాకినాడలో నివసించారు. 1920లో గాంధీ గారి పిలుపు అందుకున్న సహాయ నిరాకరణోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆంధ్ర దేశమంతటా తిరిగి ఖబర్దార్ ప్రచారం చేయడమే కాక తిలక్ స్వరాజ్య నిధికి పెద్దమొత్తంలో డబ్బు వసూలు చేశారు.

1929, 1930, 1934 లలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా పనిచేశారు. సత్యాగ్రహం సందర్భంగా ఆరు నెలల శిక్షకు గురయ్యారు. ఇచ్ఛాపురం లో జరిగిన మహిళా కాంగ్రెస్ కు అధ్యక్షత వహించారు. 1932 తిరిగి ఆరు నెలల కఠిన కారాగార శిక్షకు గురయ్యారు. తెలుగు ప్రజలు వీరికి "దేశ సేవిక" అన్న బిరుదు ఇచ్చారు .

**ముగింపు :** సమాజంలో సగ భాగం అయిన మహిళల భాగస్వామ్యం లేనిదే ఏ ప్రజా ఉద్యమము విజయవంతంగా సాగదు. ఆధునిక యుగం ఆరంభంలో చైతన్యవంతులైన తెలుగు మహిళలు స్వాతంత్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొని స్వాతంత్ర సంపాదించుకోవడానికి సహాయ పడటమే కాకుండా, ప్రజా జీవనం లో మహిళల భాగస్వామ్యానికి కూడా వేశారు బాటలు.

**ఆధార గ్రంథాలు :**


1. తెలుగునాట స్వాతంత్ర సంగ్రామ చరిత్ర – శ్రీ పరుచూరి కోటేశ్వరరావు –కృష్ణా జిల్లా స్వాతంత్ర సమరయోధుల సంఘం.
2. ఆధునిక ఆంధ్ర చరిత్ర.– తెలుగు అకాడమీ.
3. ఆంధ్ర ప్రాంతంలో స్వాతంత్ర్యోద్యమ చరిత్ర – తెలుగు అకాడమీ.
4 గాంధీ గారి ఆంధ్ర పర్యటన. (కొడాలి ఆంజనేయులు)– తెలుగు అకాడమీ.
5. పి. రఘునాధ రావు: ఆధునిక ఆంధ్ర చరిత్ర.
6. సరోజిని రేగాని: ఆంధ్రప్రదేశ్లో స్వాతంత్ర్య ఉద్యమం యొక్క ముఖ్యాంశాలు.

# స్వాతంత్ర్యోద్యమ భావనలు – స్త్రీల ఆకాంక్షలు

వంగాల సంపత్ రెడ్డి, కాకతీయ ప్రభుత్వ కళాశాల, హనుమకొండ.

ఉద్యమాల కాలంలోనే ప్రజలు తమ ఆకాంక్షలను వ్యక్తం చేస్తారు. నిర్దిష్ట ఆశయంతో ఆదర్శంతో నడిచే ఏ ఉద్యమమైన సమాజంలో ఉన్న భిన్న వర్గాల ప్రజల ఆకాంక్షలను వేదికగా ఉండాలి. ఒక విధంగా చెప్పాలంటే ప్రజల ఆకాంక్షలను వ్యక్తపరిచేవే ఉద్యమాలు. ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా నడిచే ఏ ఉద్యమాలు సఫలీకృతం కావు. బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగిన భారత స్వాతంత్ర్యోదమ్యకాలంలో భిన్న వర్గాల ప్రజలు తమ ఆకాంక్షలను వ్యక్తం చేసారు. అందులో మహిళలు ముందు వరుసలో ఉన్నారు.

స్వాతంత్ర్యోద్యమకాలంలో దేశవ్యాప్తంగా స్వయం పాలన, స్వరాజ్యం, ప్రజాస్వామ్యం, స్వదేశీ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, దేశభక్తి, దేశాభిమానం, మహిళాభివృద్ధి, బాలికా విద్య, దేశభాషాభిమానం, సత్యాగ్రహం లాంటి భావనలు విస్తృత ప్రచారంలోకి వచ్చాయి.

స్వాతంత్రోద్యమ క్రమంలో తెలుగు ప్రాంతంలో మహిళలు తమ ఆకాంక్షలను ఎలా వ్యక్తం చేసారో పరిశీలించడమే ఈ పత్రం ఉద్దేశం. ఆ ఆకాంక్షల్ని హిందూ సుందరి, సావిత్రి, అనసూయ, గృహలక్ష్మి లాంటి పత్రికలలో మహిళలు ప్రకటించారు. వ్యాసాల రూపంలో, కవిత్వం రూపంలో, కథల రూపంలో, ఉపన్యాసాల రూపంలో ప్రచురించారు. అందువల్లనే హిందూసుందరి, సావిత్రి, అనసూయ, గృహలక్ష్మి పత్రికలను ఆధారం చేసుకొని ఈ పత్రాన్ని రూపొందించాను.

1885లో కాంగ్రెస్ పార్టీ స్థాపనతో భారత స్వాతంత్ర్య ఉద్యమానికి తొలి అడుగు పడింది. బ్రిటిష్ వలస పాలన వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో ప్రజలను సమీకరించే క్రమంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే పని ఉద్యమ నాయకత్వాలు తీసుకున్నాయి. స్వాతంత్రోద్యమ క్రమంలో సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు తమ ఆకాంక్షలను ఆలోచనలను వ్యక్తం చేయడానికి ఎన్ని మార్గాలు ఉంటే అన్ని మార్గాలు వాడుకున్నారు. అలాంటి ఒక మార్గమే పత్రికలను వాడుకొని తమ ఆకాంక్షలను వెలువరించారు. స్వాతంత్ర్యోద్యమంలో మహిళలను భాగస్వామ్యం చేసే క్రమంలో ఉద్యమ నాయకత్వాలు మహిళల ఆకాంక్షలను గౌరవించాయి.

స్త్రీ విద్య, బాల్య వివాహాల రద్దు, వితంతు వివాహాలను ప్రోత్సహించడం, బాలికల కోసం గ్రంథాలయాలను స్థాపించడం, బాలికలు తమ కాళ్ళ మీద తాము నిలబడే విధంగా పారిశ్రామిక పాఠశాలలు నెలకొల్పడం – మొదలగు ఆకాంక్షలను వెలువరించారు. అదేక్రమంలో స్వాతంత్ర్యోద్యమం ప్రచారం చేసిన స్వదేశీ వస్తువుల వినియోగం, దేశభక్తి, స్వరాజ్య సాధన లాంటి భావనలు కూడా తమ ఆకాంక్షల్లో చేర్చుకున్నారు. తమ ఆకాంక్షల స్వరూప స్వభావాలేంటో, ఆ ఆకాంక్షలు నేరవేరే విధానం ఏంటో వాళ్ళే సూచించారు.

ఈ పత్రంలో స్త్రీ విద్య, మహిళల స్థితిగతులు, దేశభక్తి, గాంధీజీ, ఓటింగు హక్కు విషయంలో స్త్రీలు వెలువరించిన ఆకాంక్షలను స్థూలంగా పరిచయం చేస్తాను.

వెన్నా మంగ తాయమ్మ "స్త్రీ విద్య" వ్యాసంలో స్త్రీ విద్యను నిర్వచించింది. దేశ చారిత్రలు, గణితము భాషాజ్ఞానము, శారీరిక శాస్త్ర పరిచయమునకు తోడు శిశుపోషణము, పాకశాస్త్రము, గృహపారి శుధ్యలంకారనిపుణత, చిత్రలేఖనము, సంగీతశాస్త్రములే గాక యుత్తమగృహిణిధర్మములుగూడ తెలియ చేయువిద్య నేర్పుటగా నిర్వచించింది. అస్కా స్త్రీ సమాజ వార్షికోత్సవం సందర్భంగా సమాజ కార్యదర్శి బంగారమ్మ ఒక వ్యాసం రాసింది. బాలికా విద్యను పెంపొందించడమే ఈ సమాజం యొక్క లక్ష్యం(సెప్టెంబర్ – అక్టోబర్, 1905, సావిత్రి).

జులై 1910 సావిత్రి పత్రికలో ప్రస్తుత తెలుగు స్త్రీల విద్యాస్థితి అనే అంశం మీద ఒక వ్యాసం వచ్చింది. విద్యా

నాగరికతలలో తెలుగు దేశపు స్త్రీల స్థితి ఏ మాత్రం సంతృప్తికరంగా లేదని ఈ వ్యాసం ఉద్దేశం.

తాము నడుపుతున్న పాఠశాలలో స్త్రీ విద్య నిర్వహణ నిమిత్తం ధన, పుస్తక సహాయాన్ని కోరుతూ మెన్నేని దమయంతి ప్రకటన చేసింది. (హిందూ సుందరి, మే –1914)

ఆంధ్ర స్త్రీల విద్యాభివృద్ధి సంఘం, విశాఖపట్నం ఆధ్వర్యంలో విశాఖపట్నం నందు స్త్రీల పారిశ్రామిక పాఠశాల స్థాపించ బడుచున్నదని, ఈ పాఠశాలలో చిత్తరువులుల రాయుట, దుస్తులు తయారు చేయుట, కుట్టుపని, జరీ పని, నగిషీ పని, చేతి పనులు చేయుట నేర్పుతారని ప్రకటించబడింది. (హిందూ సుందరి, ఆగస్టు –1915) అంటే స్త్రీలు తమ కాళ్ల మీద తాము నిలబడే విద్య కావాలనుకున్నారని అర్థమవుతుంది.

క్రీ శే మాగంటి అన్నపూర్ణా దేవి గారు "ఓ భారతీయుడా" అనే పేరుతో ఒక వ్యాసం ప్రకటించబడింది. ఈ వ్యాసంలో స్త్రీని విద్యావిహీనంగా మారుస్తూ ఉన్నటువంటి మగవాడి ఆధిపత్యాన్ని నిరసించింది. స్త్రీని గౌరవించమని చెప్పింది. 'నారీ కళ్యాణమే నీ కళ్యాణమనియు ఒకవేళ కళ్యాణమే దేశ కళ్యాణం' అని నొక్కి చెప్పింది. నారీ గౌరవం బట్టే దేశ గౌరవం ఉంటుందన్నది. (1930, సెప్టెంబరు – అక్టోబరు, గృహలక్ష్మి)

"స్త్రీ విద్య" అనే వ్యాసంలో క్వీన్ మేరీ కళాశాలకు బిఏ విద్యార్థిని కె. నాగమణి చెందిన ఈమె స్త్రీ విద్యా ప్రాధాన్యతను తెలుపుతూ ఒక వ్యాసం రాసింది. దేశాభివృద్ధి కావాలని అంటే స్త్రీలకు చక్కని విద్యను అందజేయాలని రాసింది. అవకాశాలిస్తే స్త్రీలు అన్ని రంగాలలో ముందు ఉంటారని చెప్పింది.(ఏప్రిల్ 1933, హిందూ సుందరి) బాలిక విద్యను ప్రోత్సహించే క్రమంలో అనేక పాఠశాలలు మహిళలు నిర్వహించారు. ఆ క్రమంలో బాలిక విద్యను పెంపొందించడానికి ఆర్థిక వనరులను పుస్తకాలను గ్రంథాలను విరాళంగా అడిగారు. బాలికా విద్యను వ్యతిరేకించే సమాజంలో బాలిక విద్య కోసం మొట్టమొదటగా పాఠశాలలు ఏర్పడడమే పెద్ద విప్లవం. వాటిని నిర్వహించడం అది కూడా ప్రభుత్వ సహాయం లేకుండా బాలికలను వాళ్ళ జీవితాలను తీర్చిదిద్దే క్రమంలో ఆదర్శాలతో చాలామంది స్త్రీలు ముందుకు వచ్చారు.

స్వదేశీ వస్తువులను ప్రోత్సహించడంలో స్త్రీలే ముందుండాలని పిలుపునిచ్చారు. భాషాభిమానం దేశాభిమానం ముఖ్యమని భావించారు. బాలిక పాఠశాలలకు బాలికల విద్యకు ప్రధాన కేంద్రం. 1941– 1942, 1942 –1943 సంవత్సరాలతో పోల్చుకుంటే ప్రాథమిక బాలికా పాఠశాలలు 4502 నుండి 4492కు తగ్గడంను చాలామంది మహిళలు నిరసించారు. కళాశాల విద్యార్థినుల సంఖ్య 871 నుండి 976కి పెరిగింది. ఈ పెరుగుదల చెప్పుకోతగ్గస్థాయిలో లేదు. "స్త్రీలుపాధ్యాయినిలుగా నుండుట వలని లాభములు" అనే అంశం మీద అనసూయ పత్రిక సంపాదకులు వింజమూరు వెంకటరత్నమ్మ గారు ఒక వ్యాసం రాశారు.(సెప్టెంబర్ – అక్టోబర్ 1919, అనసూయ). ఇందుమతి 'స్వ దేశాభిమానము–స్వజాతీయ విద్య' అనే పేరుతో ఒక వ్యాసం రాసింది. (సెప్టెంబర్ – అక్టోబర్ 1919, అనసూయ).

"స్వదేశ వస్తు ప్రోత్సాహం" పేరుతో ఒక ఉపన్యాసం కనబడుతుంది. మోటుపల్లి రాజాబాయమ్మ గారి ప్రోత్సాహం మేరకు స్వదేశీ వస్తువులను మాత్రమే వాడవలెనని వక్త ఉపన్యసించింది. (మే, 1914, హిందూ సుందరి) కె. కనకమ్మ "కన్యాశు ల్క నిషేధం" అనే పేరుతో ఒక వ్యాసం రాసింది. కన్యాశుల్కం పేరుతో జరిగే తప్పుడు విధానాలను వ్యతిరేకించింది.(అక్టోబర్, 1914, హిందూ సుందరి) "దేశభక్తి" వ్యాసంలో దేశభక్తి అంటే ఏంటో పెండ్యాల బాల త్రిపురసుందరమ్మ నిర్వచనం ఇచ్చింది. దేశభక్తి ప్రాధాన్యతను నొక్కి చెప్పింది. మొదట దేశభక్తి తర్వాతనే దైవభక్తి అని ప్రకటించింది(అక్టోబర్, 1914, హిందూ సుందరి)

"స్వాతంత్ర్య లక్ష్మి" పేరుతో శ్రీమతి ఓలేటి నిత్య కళ్యాణమ్మ కొన్ని పద్యాలు వ్రాశారు.(1931, ఆగస్టు, గృహలక్ష్మి). 1932లో కొమర్రాజు అచ్చమాంబగారు "నేటి రాజకీయాలు స్త్రీలు" అనే అంశాన్ని గురించి గృహలక్ష్మి పత్రికలో ఒక వ్యాసం రాశారు. "స్వతంత్ర భారత వర్షంలో మహిళల కర్తవ్యం" అనే పేరుతో దుర్గాబాయి ఆల్ ఇండియా రేడియోలో చేసిన ఉపన్యాసాన్ని వ్యాసంగా ప్రకటించారు. మహాత్ముని ఆదేశము లేదు కావున భగత్ సింగ్ మీద పాటను పాడడానికి ప్రముఖగాయని కె బి సుందరాం బాల్

నిరాకరించింది. దీనిని బట్టి గాంధీ ప్రభావం ఆనాటి కాలంలో ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక విధంగా చెప్పాలంటే మధ్యతరగతి స్త్రీలు గాంధీ వల్ల ప్రభావితమైనారు. గాంధీని పొగుడుతూ కవిత్వం, వ్యాసాలు వ్రాసారు. (గృహలక్ష్మి పత్రిక డిసెంబర్ 1931).

"గాంధీ స్తుతి" పేరుతో వెలువ లి వెంకట లక్ష్మీ నరసమాంబ కొన్ని పద్యాలు ప్రచురించారు. (1944, నవంబర్, హిందూ సుందరి) "మహాత్ముడు" పేరుతో ఆంధ్ర మహిళ పత్రికలో 1949లో ఆ భాస్కరమ్మగారు ఒక వ్యాసం రాశారు. గాంధీ వల్లనే ఈ దేశంలో స్త్రీలకు ఉన్నత స్థానం దక్కిందని పొగిడారు. "పూజ్య బాపూజీ లక్ష్యసాధనమే మన కర్తవ్యం" అని మంత్రి లక్ష్మీ ప్రసూనాంబ వ్రాసిన వ్యాసం గాంధీకి నివాళి వ్యాసం. మహాత్ముని ధర్మసంస్థాపనార్థమే జీవించారు, అందు నిమిత్తమే మరణం పొందినారు, మనమందరము భారత జనకుని ఆశయ సాధనములపై ప్రయత్నం చేయాలన్నది.

"మహాత్ముని ఆదేశం – నిరాడంబరత్వము" అని శ్రీమతి సత్యరాజు సూర్యకాంతమ్మ గారు ఒక వ్యాసం రాశారు. గాంధీజీ మానవజాతిలోని మానవత్వానికి చిహ్నం. ఈ మానవత్వమే ఎప్పటికైనా జయిస్తుందని ప్రపంచ క్షేమం కాంక్షించే వారంతా గాంధీజీ మీదనే ఆశ పెట్టుకున్నారు అని పెరల్బక్ అన్న మాటలను గుర్తు చేసింది (1950, ఫిబ్రవరి, గృహలక్ష్మి). "స్త్రీ స్వాతంత్ర్య ఉద్యమ ప్రగతి" అనే పేరుతో శ్రీమతి డి.దుర్గావతి దేవి ఒక వ్యాసం రాశారు ఆంధ్ర మహిళ పత్రికలో. స్త్రీనియోజక స్వాతంత్ర్యం పేరుతో జరుగుమిల్లి రామాబాయి ఒక వ్యాసం రాసింది. భారతీయ స్త్రీలలో విద్యాధికులు లేరని అందువలన భారతీయ స్త్రీలకు ఓటింగ్ హక్కును వినియోగించుకొనే అర్హత ఇంకా పొందలేదని చర్చ జరుగుతున్న కాలంలో వచ్చిన వ్యాసం ఇది. ఓటింగును నిరాకరించడం ఎంత అసమంజసమో వివరించింది. (జులై – ఆగస్టు, 1919 అనసూయ).

"ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం" వ్యాసంలో కాకినాడ తాలూకా మహిళా సభ కాకినాడలో స్త్రీ విద్యాభివృద్ధి నిమిత్తం కాకినాడ బాలికల హైస్కూల్ స్థాయి పెంచవలెనని, ప్రతి మండలమునకు ప్రత్యేకంగా స్త్రీల కోసం ఒక గ్రంథాలయమును స్థాపించాలని, నిర్బంధ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టాలని, రాత్రి పాఠశాలలు స్థాపించి పెద్దవారికి విద్యను అందించాలని, ప్రతి బాలికాపాఠశాల యందు హిందీని బోధింపవలెనని, అన్ని పాఠశాలలో పరిశ్రమలను ప్రవేశపెట్టాలని, లలిత కళలను కూడా పాఠశాలలో బోధించాలని, అతి బాల్య వివాహాల రద్దుకోసం ప్రయత్నించాలని, బాల వితంతువులకు మళ్లీ వివాహాలు చేయాలని, వివాహం చేసుకోవడానికి నిరాకరించిన మహిళలకు విద్యను అందించి వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడే విధంగా తీర్చిదిద్దాలని, యుక్త వయసు వచ్చిన ప్రతి స్త్రీకి ఓటింగ్ అధికారం ఇవ్వవలసిందేనని, చట్టసభలలో స్త్రీల ప్రాతినిధ్యం కోసం ప్రయత్నించాలని, కుమారులతో పాటు కుమార్తెలకు సమాన వాటా పంచిపెట్టుట ఆవశ్యంగా జరుగాలని, స్వదేశీ వస్త్రధారణ, స్వదేశీ వస్తువుల ఉపయోగంను ముఖ్యంగా స్త్రీలు అవలంబించాలని, స్త్రీలు గ్రామ పునర్నిర్మాణ ఆవశ్యకత గురించి పాటుపడాలని, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం అత్యవసరము అని చేసిన తీర్మానాల ద్వారా మహిళలు ఎంత బలంగా తమ ఆకాంక్షల పరిధిని ఎలా విస్తృత పరుచుకున్నారో 1937నాటికే గమనించవచ్చు(నవంబర్, 1937, హిందూ సుందరి).

**ఆధారాలు:**

1. హిందూ సుందరి పత్రికలు
2. గృహలక్ష్మి పత్రికలు
3. సావిత్రి పత్రికలు
4. అనసూయ పత్రికలు

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# తెలుగు మహిళా చైతన్య జ్యోతి ఉన్నవ లక్ష్మీబాయమ్మ

**డాక్టర్. జి. స్వాతి,** జువాలజీ అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు.
**డాక్టర్. ఎం. తేజోమూర్తి,** జువాలజీ శాఖాధ్యక్షులు, పి.వి.కె.ఎన్. ప్రభుత్వ కళాశాల, చిత్తూరు.

**సంక్షిప్త పరిచయం:** ఆధునిక తెలుగు జాతి వైతాళిక రాళ్ళల్లో ఒకరైన ఉన్నవ లక్ష్మీబాయమ్మ అభ్యుదయ భావాలు కలిగి ఉండి సామాజిక ప్రచారాలు నిర్మూలన, మహిళల ప్రగతి, స్వాతంత్ర సమర మొదలగు అంశాలలో బహుముఖమైన ప్రతిభను చూపి, విశిష్టమైన కృషిని విజయవంతంగా నిర్వహించి ఆధునిక తెలుగుజాతి మహిళా చరిత్రలో శిఖరాయమాన మైన కీలక స్థానాన్ని అధిరోహించారు.

**ముఖ్యాంశాలు:** లక్ష్మీబాయమ్మ గారు, శారదా నికేతన్, సాంఘిక దురాచారాలు, స్వాతంత్ర సమరం. 19వ శతాబ్దం చివరి భాగంలో నూ ఇరవైయ్యవ శతాబ్దపు తొలి భాగంలోనూ తెలుగు ప్రాంతాలు అభ్యుదయ భావాల అభ్యుదయ భావాల తో పవనాలు అభిషేకం చేయబడ్డాయి. ఆనాటి సంస్కర్తల లో సహజంగానే పురుషులు ఆధిపత్యం వహిస్తే కొంత మంది మహిళా శిరో మణులు సామాజిక బంధనాలను అధిగమించి, నూతన ప్రపంచ సృష్టి లో తమ వంతు పాత్రను సమర్ధవంతంగా నిర్వహించారు ఇటువంటి అరుదైన తెలుగు మహిళా రత్నాలలో ఉన్నవ లక్ష్మీబాయమ్మ గారు అగ్రస్థానంలో నిలుస్తారు. శ్రీనడింపల్లి సీతారామయ్య, రామలక్ష్మమ్మ దంపతులకు లక్ష్మీబాయమ్మ గుంటూరు జిల్లా సత్తెన్నపల్లి తాలుకాలోని అమీనాబాద్ గ్రామ లో జననం 1882 న జన్మించారు. అప్పటి కాలం సంప్రదాయాలను అనుసరించి 10 సంవత్సరాల వయసులో 1892 న గుంటూరు తాలుకా వేములూరిపాడు వాస్తవ్యులైన ఉన్నవ లక్ష్మీ నారాయణ గారితో వివాహం జరిగింది.

వీరు ఉన్నత సంస్కార భావాలుగల విద్యావేత్త. ఇంగ్లాండులో బారిష్టర్ పట్టా సాధించాడు భారత సమాజ పతనానికి, బానిసత్వానికి కారణాలను అన్వేషిస్తూ అంతర్మథనం చెందేవాడు. విదేశాలకు వెళ్లి అక్కడి పరిస్థితులను ఆకళింపు చేసుకునిఉదారత భావాలను పుణికిపుచ్చుకున్న గొప్పవాడు. మహాత్మా గాంధీ గారి పిలుపు మేరకు స్వాతంత్ర సమరంలో చురుకుగా పాల్గొని, రాయవేలూరు జైలు లో కఠిన కారాగార శిక్షను అనుభవిస్తూ "మాలపల్లి" అనే చారిత్రక ప్రాధాన్యత ఉన్న సామాజిక నవలను రచించిన మేధావి. మహిళల హక్కులను గౌరవించే ఉన్నవ లక్ష్మీనారాయణ గారు లక్ష్మీబాయమ్మ గారికి కావలిసిన స్వేచ్ఛ స్వాతంత్రాలు ఇస్తూ ఆమెలో అభ్యుదయ భావాలు ఏర్పడడానికి కావలసిన వాతావరణాన్ని ఏర్పరిచాడు.

1902 లోనే ఆ దంపతులు గుంటూరులో ఒక వితంతు శరణాలయంన్ని స్థాపించి సంఘ సంస్కరణోద్యమాన్ని ప్రారంభించారు. అనేక వితంతు పునర్వివాహలు నిర్వహించారు. ఆపై వీరి కార్యదక్షత కందుకూరి వీరేశలింగం గారి దృష్టిలో పడటంతో వీరికి తాను స్థాపించిన సంస్థల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. నాటి తెలుగు ప్రాంతాలలో సంఘ సంస్కరణ వైతాళికు డి సంస్థలలో పనిచేసి విశేషమైన అనుభవాలు సంపాదించి, కార్య నిర్వహణ అధ్యక్షత దక్షతలో నిష్ణాతులైనరు.

మహిళా సాధికారికత అనేది, సాధించిన విజ్ఞానం, సొంత ఉపాధి మరియు ఆర్ధిక స్వావలంబన పైనే ఆధారపడి ఉంటుంది అని ఆనాడే గ్రహించిన దూరదృష్టి కలిగిన మేధావి ఉన్నవ లక్ష్మీబాయమ్మ గారు. అప్పటి రోజులలో తెలుగు ప్రాంతాలలో మహిళలకు విద్యావకాశాలు చాలా స్వల్పంగా ఉండేవి. ఈ సమస్యను అధిగమించడానికి ఉన్నత ప్రమాణాలతో శారదా నికేతన్ విద్యా సంస్థను లక్ష్మీబాయమ్మ గారు ఎంతో శ్రద్ధాసక్తులతో నిర్వహించి విద్యార్థుల బంగారు భవితకు పాటలు వేశారున. వయోజనులైన మహిళల కొరకు కొండా వెంకటప్పయ్య గారి ఇంట్లో ప్రారంభమైన మహిళల పాఠశాల కాలక్రమంలో అభివృద్ధిచెంది శారదా నికేతన్ గా మారింది. ఇందులో జానకీ బాయమ్మ ఇంగ్లీషు, లెక్కలు బోధించుతువుండేవారు. గుంటూరు పట్టణంలోని ప్రజలు శారదా నికేతన్ విద్యార్థినుల ను అభ్యుదయ వాదానికి, అభివృద్ధికి గుర్తుగా పరిగణించే వాళ్లు.

గాంధీ గారు ఆంధ్ర రాష్ట్ర పర్యటనలో భాగంగా గుంటూరుకు వచ్చినప్పుడు తప్పకుండా శారదా నికేతన్‌ను దర్శించే వాడు. గాంధీ గారి దివ్య ప్రవచనాలతో శారదా నికేతన్ ఎన్నోసార్లు పులకరించి పునీతం కాబడింది. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా త్రిపురనేని రామస్వామి చౌదరి గారి "వీర గంధము తెచ్చినార ము, వీరులెవ్వరో తెల్పుడీ" అనే గీతం శారదా నికేతన బాలికలు ఆలపించి, గుంటూరు పట్టణ ప్రజలు ప్రజలలో గొప్ప సంచలనాన్ని సృష్టించారు. బాల్య వివాహాల ను తగ్గించడానికి బాలికలకు

విద్యావకాశాలు పెంచవలసిన ఆవశ్యకత ఉందని ఆనాడే ఆనాడే వీరు గ్రహించారు.

లక్ష్మీబాయమ్మ గారికి మహిళా విద్య పై స్పష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి లక్ష్యంపై మహిళలు విద్య నేర్చుకోవడం ద్వారా తమను తాము అభివృద్ధి పరచుకోవడం తోపాటు దేశాభివృద్ధికి కూడా తోడ్పడడానికి విద్య అవసరమని భావించారు. మహిళల అభివృద్ధికి అడ్డుగా నిలిచే సంప్రదాయాలను ఎటువంటి సంశయం లేకుండా తిరస్కరించాలని లక్ష్మీబాయమ్మ గారు భావించేవారు. పురుషులతో సమానమైన హోదా స్థానం మహిళలకు ఉండాలని, అప్పుడు మాత్రమే దేశం అభివృద్ధి చెందుతుందని వీరు భావించేవారు. బాల వితంతువుల సమస్య ఏర్పడటానికి బాల్య వివాహాలే కారణంగా వీరు గుర్తించారు. అగ్నికి గాలి తోడైనట్లు వీరికి ఉన్నవ లక్ష్మీనారాయణ గారు తోడయ్యారు. వీరిరువురు తెలుగు ప్రాంతాల్లో వ్యాపించిన సాంఘిక దురాచారాలను నిర్మూలించడానికి కృషి చేశారు. దేశాభి ఉన్నతికి స్వాతంత్రం ఆవశ్యకమని దృఢంగా విశ్వసించి స్వాతంత్ర సాధన కొరకు గట్టి ప్రయత్నాలు చేశారు. తెలుగు ప్రాంతాలలో చైతన్యం పొందిన తొలితరం వైతాళికులు ఉన్నవ లక్ష్మీబాయమ్మ గారు మహిళా ప్రపంచంలో ధ్రువ తారల ప్రకాశిస్తారు.

స్వరాజ్య సంపాదన, తెలుగు వాళ్ళు నిర్వహించవలసిన పాత్ర, ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తెలుగు ప్రజల స్థితి గతుల గురించి వీరు శ్రీయుతులు రాయప్రోలు సుబ్బారావు, కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు , అయ్యదేవర కాళేశ్వరరావు, టంగుటూరి ప్రకాశం పంతులు, ఆచంట లక్ష్మీపతి దంపతులు మొదలగు వారితో సమావేశాలు నిర్వహించి, చర్చలు జరిపి సమస్యలపైలోతైన అవగాహన ఏర్పరుచుకొన్నారు.

గాంధీ గారి పిలుపునందుకుని ఉన్నవ లక్ష్మీనారాయణ గారు జైలు శిక్షకు గురికాగా, లక్ష్మీబాయమ్మ గారు స్వాతంత్రోద్యమంలో దూకి మరొక గొప్ప దేశ భక్తురాలు రుక్మిణి గారితో కలిసి తెలుగు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి అనేక బహిరంగ సభలలో స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసాలు ఇచ్చారు. మహిళలకు స్ఫూర్తి ప్రదాత గా నిలిచారు. విశాఖపట్టణం మెడికల్ కళాశాలలో వీరి ఉపన్యాసాన్ని విని , వీరి ప్రభావానికి లోనైన వైద్య విద్యార్థులు ఖద్దరు బట్టలను, గాంధీ టోపీని ధరించి కళాశాల నుండి బహిష్కరణకు గురయ్యారు.

ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా శాంతి సేన ను తయారు చేసి ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. అందుకు ప్రభుత్వం వీరికి ఆరు నెలల కారాగార శిక్షను విధించింది. దీర్ఘకాలం లక్ష్మీబాయమ్మ గారు గుంటూరు పాలక సంఘంలో సభ్యురాలిగా ఉంటూ ప్రజా సేవ నిర్వహించారు. ఆదర్శ తెలుగు మహిళ లక్ష్మీబాయమ్మ గారు తన 70 వ సంవత్సరం 1952 లో మరణించారు.

**ముగింపు:** ఉన్నవ లక్ష్మీబాయమ్మ గారు మహిళల ఉద్ధరణ, స్త్రీల విద్య, ఉపాధి అవకాశాలు మరియు దేశ స్వాతంత్ర ఉద్యమం మొదలగు అనేక అంశాలలో ఉదాత్తమైన కృషిచేసి చిరస్మరణీయురాలిగా ఆధునిక తెలుగుజాతి చరిత్రలో నిలిచిపోయారు.

**ఆధార గ్రంధాలు :**

1. తెలుగునాట స్వాతంత్ర సంగ్రామ చరిత్ర, – శ్రీ పరుచూరి కోటేశ్వరరావు – కృష్ణా జిల్లా స్వాతంత్ర సమరయోధుల సంఘం.
2. ఆధునిక ఆంధ్ర చరిత్ర.– తెలుగు అకాడమి.
3. ఆంధ్ర ప్రాంతంలో స్వాతంత్రోద్యమ చరిత్ర – తెలుగు అకాడమీ.
4 గాంధీ గారి ఆంధ్ర పర్యటన . (కొడాలి ఆంజనేయులు)– తెలుగు అకాడమి.
5. స్వాతంత్ర సమరం – బిపిన్ చంద్ర (తెలుగు అనువాదం : తిరుమలశెట్టి శ్రీరాములు) నేషనల్ బుక్ ట్రస్ట్. ఇండియా.
6. ఆధునిక ఆంధ్ర చరిత్ర – పి. రఘునాధ రావు.
7. ఆంధ్రప్రదేశ్లో స్వాతంత్ర్య ఉద్యమం యొక్క ముఖ్యాంశాలు – సరోజిని రేగాని.
8. ఆంధ్ర ప్రదేశ్ (ఆంధ్ర)లో స్వాతంత్ర్య పోరాటం, సం. 3. ఎం. వెంకటరంగయ్య (ఇ).
9. స్వాతంత్ర సమరంలో మహిళలు ఆంధ్ర మహిళలు – దుర్గాబాయి దేముఖ్ – ఆంధ్ర రాష్ట్ర ఆర్కియాలజీ డిపార్ట్మెంట్, హైదరాబాదు.

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# "రాయలసీమలో తొలి మహిళా పట్టభద్రురాలు కె.నారాయణమ్మ : ఒక పరిశీలన"

**డా॥ డి.సహదేవుడు,** చరిత్ర ఉపన్యాసకులు, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (ఎ), అనంతపురము
**డా॥ యం.హరిప్రసాద్,** చరిత్ర ఉపన్యాసకులు, వై.వి.ఎన్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కైకలూరు, కృష్ణా జిల్లా.

**పరిచయం :** మహిళ విద్య పరంగా చారిత్రక పరిణామాలు పరిశీలిస్తే తొలి వేదకాలంలో స్త్రీలు పురుషులతో సమానంగా పాండిత్యాన్ని ప్రదర్శించినట్లు వేద సాహిత్యం తెలుపుతుంది. పితృస్వామ్య కుటుంబంలో సైతం స్త్రీలకు సంఘంలో సమగౌరవం లభించింది. విశ్వవర, లోపాముద్ర, సీకత, అపల వంటి స్త్రీలు తమ పాండిత్య ప్రతిభతో పురుషులతో సమానంగా నిలిచి ఋషుల స్థానం పొందారు. మలి వేద కాలం నుండి స్త్రీల పరిస్థితి దిగజారి, మధ్యయుగాన అధోగతికి చేరినది. ఆధునిక భారతదేశంలో బ్రిటీష్ వారి పాలనలో నామమాత్ర విద్యా సంస్కరణలు ఫలాలు పురుషులకే తొలినాళ్ళలో దక్కాయి. సావిత్రిబాయి పూలే లాంటి మహిళా సంఘ సంస్కర్తలు నాటి సంప్రదాయ సవాళ్ళను ఎదుర్కొని మహిళా వయోజనా విద్యావ్యాప్తికి నడుం కట్టారు. ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం బాలికల పాఠశాలలు స్థాపన స్త్రీవిద్యకు బీజాలు తొడిగాయి. సాంప్రదాయ సంకెళ్ళు తెంచి స్త్రీ విద్యకు ప్రోత్సాహకాలు క్రమక్రమంగా చారిత్రక పరిణామాలు నిదానంగా దోహదం చేశాయి. ఇలాంటి మహిళా విద్యకు సంబంధించిన తొలినాళ్ళలో రాయలసీమ ప్రాంతంలో తొలి మహిళా పట్టభద్రురాలు కె.నారాయణమ్మ ప్రస్థానంపై పరిశీలన కావించిన మహిళా విద్యకు నాటి సవాళ్ళు అవగతమవుతాయి. తర్వాత తర మహిళలకు ప్రేరణగా నిలుస్తాయి. ఈ ప్రాంతం భారత జాతీయోద్యమ చైతన్యం వెల్లివిరచడానికి పరోక్షంగా దోహదపడిన అంశాలు వెలుగులోకి వస్తాయి.

**నారాయణమ్మ జీవితం :** స్వాతంత్ర్యానికి పూర్వం మహిళలు చదువుకోవడం అంటే చాలా చాలా అరుదైన విషయం. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అనంతపురము ఆర్ట్స్ కళాశాలలో ఏకైక విద్యార్థినిగా బి.ఏ. డిగ్రీ సంపాదించిన ఘనత అనంతపురము వాసి కాశినేని నారాయణమ్మకే దక్కుతుంది. ఈమె రాయలసీమలోనే డిగ్రీ పూర్తి చేసిన మొదటి మహిళగా చరిత్ర సృష్టించి, తొలి మహిళ పట్టభద్రురాలుగా నిలిచారు. కాశినేని నారాయణమ్మ గారు 06-12-1915వ తేదీన అనంతపురములో జన్మించారు. ఈమె తల్లిదండ్రులు గుర్రమ్మ, కాశినేని నాగలింగప్ప. తల్లిదండ్రులు ఇద్దరూ విద్యావంతులే. తండ్రి ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఈమెకు చిన్నప్పటి నుండి చదువు అంటే చాలా మక్కువ. ఈమెకు ఐదుగురు సోదరులు. వీరిలో నారాయణమ్మ మాత్రమే ఉన్నత విద్యను అభ్యసించారు. అనంతపురములోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఎస్ఎస్‌యల్‌సి చదివారు. అప్పట్లో ఆంధ్రదేశంలో రాజమండ్రి, అనంతపురములో మాత్రమే ప్రభుత్వ కళాశాలలు ఉండేవి.

**ఆర్ట్స్ కళాశాల తొలి విద్యార్థిని కాశినేని నారాయణమ్మ :** అనంతపురము ఆర్ట్స్ కళాశాలలో అడ్మిషన్ కోసం నారాయణమ్మ దరఖాస్తు చేసుకోగా, ప్రిన్సిపాల్ ఎన్.ఆర్. కృష్ణ నిరాకరించారు. అప్పటివరకు కళాశాలలో మహిళా విద్యార్థినులు ఎవరు లేకపోవడం వలన ఈమెకు అడ్మిషన్ ఇస్తే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటాయోనన్న భయాందోళనలతో ప్రిన్సిపాల్ ఆ నిర్ణయం తీసుకున్నారు. ఉన్నత విద్య అభ్యసించాలన్న నారాయణమ్మ కోరిక, పట్టుదలను చూసి తండ్రి నాగలింగప్ప తన మిత్రుడు వకీలు కొండప్ప ద్వారా ప్రిన్సిపాల్‌పై ఒత్తిడి తెచ్చి, అడ్మిషన్ ఇవ్వని పక్షంలో కోర్టుకు వెళతామని హెచ్చరించగా, ఎట్టకేలకు ఆర్ట్స్ కళాశాల తొలి విద్యార్థినిగా 1931లో అడ్మిషన్ ఇచ్చారు. కళాశాలలో నాడు తెలుగు లెక్చరర్‌గా ప్రయాగ వెంకటరామశాస్త్రి, చిలుకూరు నారాయణరావు ఉండేవారు. మిగిలిన వారంతా తమిళ మాస్టార్లే. ఆ కళాశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య 250 మాత్రమే. నాడు కళాశాలలో అమ్మాయిలు ఎవరూ లేరు. నారాయణమ్మ ఒక్కరే పాతూరు. అనంతపురము నుండి కళాశాలకు రావాలి. ఆమె అన్నయ్యలు అందరూ కళాశాల వరకు రక్షణగా వచ్చి, తిరిగి కళాశాల వదిలేశాక ఇంటికి తీసుకెళ్ళేవారు. ఇలా చాలా కష్టపడి నారాయణమ్మ డిగ్రీ పూర్తి చేశారు. అయితే ఆనాడు పురుషులలో కూడా ఆమెలా ధీటుగా చదువుకున్న వారెవరూ లేకపోవడంతో ఆమె వివాహం ఆలస్యమైంది. చివరికి మద్రాస్ (చెన్నై) నివాసికి ఇచ్చి వివాహం చేశారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె పుట్టపర్తి గీతాదేవిని ఆమె మేనల్లుడు అంజన్‌బాబుకు ఇచ్చి వివాహం చేశారు. ఈయన డిప్యూటీ

ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్గా అనంతపురములో పదవీ విరమణ పొందారు. వీరికి హరిప్రియ, మాధవి, వీణ అను ముగ్గురు కూతుర్లు.

**నారాయణమ్మ ఉద్యోగ ప్రస్థానం :** వివాహం తర్వాత నారాయణమ్మ టీచర్ ట్రైనింగ్ పూర్తి చేశారు. ఉపాధ్యాయినిగా ప్రొద్దుటూరు, హిందూపురం, నెల్లూరు, రాజమండ్రి మొదలగు ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. ప్రధానోపాధ్యాయురాలిగా పులివెందులకు బదిలీ అయిన సందర్భంలో అందరూ ఆమెను భయభ్రాంతులకు గురిచేశారు. అయితే రాజారెడ్డి సహకారంతో ఈమె సమర్థవంతంగా విధులు నిర్వహించి, అందరి మన్ననలు పొందారు. (రాజారెడ్డి తనయుడు నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి దివంగత వై.యస్.రాజశేఖర్‌రెడ్డి, ఈమె కూతురు గీతాదేవి క్లాస్‌మేట్స్). ఈమె ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అచిరకాలంలోనే ప్రమోషన్ సాధించి ఐదు జిల్లాలకు ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్గా అధికారిణి అయ్యారు. ఈమె తన సర్వీస్‌లో ఎక్కువ కాలం రాయలసీమలోనే విధులు నిర్వర్తించారు. చివరగా కర్నూలు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పదవీ విరమణ పొందారు. ఆనాటి భూస్వాముల దౌర్జన్యాలకు ఎదురు నిలిచి, బాలికల ప్రగతి కోసం రాయలసీమలో విస్తృత స్థాయిలో పాఠశాలలను స్థాపించి, బాలికల అక్షరాస్యతను గణనీయంగా పెంచారు. ఈమె శిరిడి సాయిబాబా భక్తురాలు. ఈమె, తన తండ్రి, అన్న, అల్లుడు, మనవరాలు వీరందరూ విద్యాశాఖలో సేవలందించడం విశేషం.

నారాయణమ్మ ఉన్నతస్థాయికి చేరుకోవడంలో తండ్రి కిష్టప్ప ఎంతో కృషి చేశారు. ఈమె మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి సమకాలికురాలు. సంజీవరెడ్డి, అప్పటి స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ డి.ఎస్. రెడ్డిలు ఈమె విద్యా, ఉద్యోగ విషయాల్లో ప్రోత్సహించేవారు. ఈమె గురువు విశ్రాంత డిఈఓ కల్లూరి వేంకట నారాయణరావు.

**ముగింపు :** "అజ్ఞానపు చీకటులను పారద్రోలేది విద్య. విద్య అమృతంతో సమానం". ఒక పురుషుడు విద్యావంతుడు అయితే ఆ విద్య అతని ఎదుగుదలకే పరిమితం అవుతుంది. ఒక స్త్రీ విద్యావంతురాలు అయితే ఆ విద్య ఆమె కుటుంబం అంతా వ్యాపించి తర్వాతి తరాలపై కూడా ప్రభావం ఉంటుంది. స్త్రీ విద్య తమ కుటుంబాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితుల మెరుగుదలకు ఎంతో దోహదం చేస్తుంది. మహిళా సాధికారికతకు విద్య రాచబాట ఏర్పాటు చేయగలరు. రాయలసీమలో మహిళా విద్య అంధకారంలో ఉన్న సమయంలో నారాయణమ్మ ఒక వెలుగు రేఖ. ఆమె విద్యాభ్యాసం తర్వాత మహిళల విద్యకు ఈ ప్రాంతంలో ప్రేరణగా నిలిచింది.

ఆధునిక భారతంతో మహిళా విద్య సామాజిక మార్పుకు నాంది. వంటింటికి పరిమితమైన మహిళలు విద్యతో నేడు అన్ని రంగాలలో ముందుకు దూసుకువెళుతున్నారు. ఆరంభంలో కేవలం పాఠశాల విద్య వరకే బాలికలకు పరిమితం చేసిన కాలం మార్పుకు, కళాశాల విద్య మహిళల జీవితాలలో పెను ఆశావాహ మార్పులకు దారితీసింది. ఆర్ట్స్ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ హరనాథ్ చొరవతో, నాటి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వసంత హయాంలో ఈ కళాశాల తొలి మహిళా విద్యార్థినిగా ఘనంగా సన్మానించారు. నారాయణమ్మ తొలి విద్యార్థినిగా నాంది వాచకం పలికిన ఆర్ట్స్ కళాశాలలో నేడు దాదాపు ఎనిమిది వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో దాదాపు నాలుగు వేల మంది విద్యార్థినులు నారాయణమ్మ స్ఫూర్తితో చదువుకుంటున్నారు. నారాయణమ్మ 29-04-1998వ తేదీన అనంతపురములో తుది శ్వాస విడిచారు. ఇలా తొలి మహిళ పట్టభద్రురాలు రాయలసీమ ప్రాంతంలో భారత స్వాతంత్ర్య ఉద్యమ చైతన్యానికి విద్య ఎంతో దోహదపడుతుందని ప్రతీకగా నిలిచింది.

**ఉపయుక్త గ్రంథాలు :-**

1) స్వర్ణోత్సవ సంబరాల సావనీర్, ప్రభుత్వ కళాశాల, అనంతపురము.
2) బి.యల్. గ్రోవల్, యస్.గ్రోవల్ : ఎ న్యూ లుక్ అట్ మాడ్రన్ ఇండియన్ హిస్టరి
3) అనంతపురము తెలుగు మాసపత్రిక డిసెంబర్ 2018.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబరు - 2022

# THE THREE WOMEN WHO INFLUENCED NON-VIOLENT HERO POTTI SRIRAMULU

# అహింసా వీరుడు పొట్టి శ్రీరాములును ప్రభావితం చేసిన ముగ్గురు మహిళలు

**వాడ్రేవు సుందర్రావు,** రీసెర్చి స్కాలర్, చరిత్ర విభాగం, డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలాం యూనివర్సిటి, ఇండోర్, మధ్యప్రదేశ్
**డా॥ వందనావర్మ** ప్రొఫెసర్ - చరిత్ర విభాగం, డా॥ ఎ.పి.జె.అబ్దుల్ కలాం యూనివర్సిటి, ఇండోర్, మధ్యప్రదేశ్

పొట్టి శ్రీరాములు గొప్ప దేశభక్తుడు. ఉత్తమ సత్యాగ్రహి. మహాత్మాగాంధీజీ మార్గంలో సాగిన మహనీయుడు. గాంధీజీ ఆదేశంతో సబర్మతీ ఆశ్రమంలో శిక్షణ పొందిన సత్యాగ్రహమూర్తి. స్వాతంత్ర్య పోరాటంలో, సంఘసేవలో జీవితాన్ని చరితార్థం చేసుకొన్న గొప్పవ్యక్తి. ఆంధ్రరాష్ట్రం కోసం తన జీవితాన్ని ధారపోసిన త్యాగధనుడు. అటువంటి మహనీయుడ్ని ఎన్నో విధాలుగా ప్రభావితం చేసిన మహిళలు కొందరున్నారు. వారందరి వల్లనే, శ్రీరాములు అమరజీవిగా చిరస్మరణీయులయ్యే చారిత్రక సన్నివేశానికి బాటలు పడ్డాయి. అటువంటి మహిళల్లో ఆయన కన్నతల్లి మహలక్ష్మమ్మది అగ్రస్థానం. ఆ తరువాత ఆయన అక్క గురమ్మ, ధర్మపత్ని సీతల పాత్ర గొప్పది. సబర్మతీ ఆశ్రమంలో ఆశ్రమ నిర్వాహకులలో ఒకరైన ప్రేమ బహెన్ కంటక్, అలాగే గాంధీ ఆశ్రమంలో ఎర్నేని సుబ్రహ్మణ్యంగారి ధర్మపత్ని లీలావతీదేవి వంటి వారెందరో శ్రీరాములును ఎన్నోవిధాలుగా ప్రభావితం చేశారు. వారందరి సహృదయం, సౌజన్యం పొట్టి శ్రీరాముల్ని ఉత్తమోత్తమ సత్యాగ్రహిగా తీర్చిదిద్దాయి.

**కీలకపదాలు (Keywords)**

1. ధాతకరువు 2. పేరంటాలు 3. అహింస 4. ఆంధ్రరాష్ట్రం 5. చితాభస్మం 6. నిమజ్జనం

**1.1. ఉపోద్ఘాతం** : పొట్టి శ్రీరాములు అమరజీవి. ఆంధ్రరాష్ట్ర చరిత్రలో ఆయన స్థానం నిరుపమానమైనది. ఆంధ్రరాష్ట్రమే కాదు, తెలుగు భాష మాట్లాడే ప్రజల కోసం శ్రీరాములు చేసిన అహింసాయుత పోరాటం అపూర్వమైనది. వీటికి తోడుగా దళిత సోదరీ సోదరులకు దేవాలయ ప్రవేశం కోసం, అస్పృశ్యతా నిర్మూలన కోసం శ్రీరాములు సాగించిన సత్యాగ్రహ సమరం చాలా గొప్పది. మానవీయమైన, మహనీయమైన కోణాన్ని ఆవిష్కరించిన దివ్యఘట్టం అది. వీటన్నిటికన్నా ముందుగానే భారత స్వాతంత్ర్య సమరంలో పొట్టి శ్రీరాములు పాత్ర చిరస్మరణీయమైనది. ముఖ్యంగా, సత్యాహింసల శాంతిమార్గాన్ని మనసారా నమ్ముకొని, మహాత్మాగాంధీజీ బాటలో చివరివరకూ సాగిన ధన్యజీవి పొట్టి శ్రీరాములు. బీహార్‌లో సంభవించిన భయంకరమైన భూకంపంలో వేలాది ప్రజలు మరణించినప్పుడు, లక్షలాదిమంది నిరాశ్రయులైనప్పుడు, బెల్సంచ్ డివిజన్‌లోని సీతామోరి తాలూకాలో పొట్టి శ్రీరాములు చేసిన సహాయ కార్యక్రమాలు చిరస్మరణీయమైనవి. ఈ విధంగా వ్యక్తిగా, సమిష్టి శక్తిగా, సత్యాగ్రహ మూర్తిగా, సహాయ కార్యక్రమ నిర్వాహకుడిగా, దళితజనోద్ధారకుడిగా, అస్పృశ్యతా నిరోధనకు ఉద్దేశించిన కార్యకర్తగా, చివరికి ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసిన మహనీయుడిగా పొట్టి శ్రీరాములు పాత్ర అపూర్వమైనది. అనితర సాధ్యమైనది. ఇంతటి ఉన్నతుడిగా శ్రీరాములు రూపుదిద్దుకోవడం వెనుక కొందరు స్త్రీల కృషి ఉంది. త్యాగం ఉంది. అందించిన స్ఫూర్తి నిలచి ఉంది. వారందరి ప్రోత్సాహం వల్లనే, వారందరి తోడ్పాటు వల్లనే పొట్టి శ్రీరాములులో గొప్ప గుణాలు వృద్ధి చెంది, వికసించి, ఫలించాయి. దానివల్ల దేశానికి ప్రయోజనం కలిగింది. విజయం సాధించిన ప్రతి పురుషుడి వెనుకా ఒక స్త్రీ ఉంటుంది అన్నది పెద్దల మాట. కానీ జీవితాన్ని దేశం కోసం ధారపోసిన ఈ పురుషుడు తనని తీర్చిదిద్దుకోవడం వెనుక ముగ్గురు మహిళల ప్రభావం ఉందనేది చాలామందికి తెలియని విషయం. అది చెప్పడానికే ఈ వ్యాసం.

**1.2. పొట్టి శ్రీరాములు జీవితంపైన కన్నతల్లి మహలక్ష్మమ్మ ప్రభావం** : పొట్టి శ్రీరాములు జీవితాన్ని తీర్చిదిద్దడంలో ఆయన కన్నతల్లి మహలక్ష్మమ్మ పాత్ర చాలా గొప్పది. శ్రీరాములులో కనిపించే ఎన్నో ఉత్తమ గుణాలకు మూలం కన్నతల్లే. పొట్టి శ్రీరాములు పూర్వీకులు నేటి కనిగిరి ప్రాంతంలోని పడమటిపల్లె అనే గ్రామంలో నివసించేవారు. 1876వ సంవత్సరంలో భయంకరమైన కరువొచ్చింది. దానిని ధాతకరువు అన్నారు. తెలుగు సంవత్సరాలలో చెప్పే ధాతనామ సంవత్సరంలో వచ్చిన కరువు అది. ఆ రోజుల్లో తినడానికి తిండిలేక ప్రజలు ఎన్నో కష్టాలు పడ్డారు. అప్పుడు పొట్టివారి కుటుంబం నెల్లూరు వదలి నేటి

తమిళనాడులోని న్యాయపాళెం వలస వెళ్ళిపోయారు. అయితే అక్కడా సరైన జరుగుబాటు కాక, చివరికి మద్రాసు చేరారు. మద్రాస్ అంటే నేటి చెన్నై. అక్కడే 1901వ సంవత్సరం మార్చి నెల 16వ తేదీన పొట్టి శ్రీరాములు జన్మించాడు.

పొట్టి శ్రీరాములు తల్లిదండ్రులు పొట్టి గురవయ్య, మహలక్ష్మమ్మ. పొట్టి గురవయ్య సంపాదనపరుడు కాదు. అందువల్ల ఆ కుటుంబ బాధ్యత అంతా మహలక్ష్మమ్మే స్వీకరించింది. బాల్యం నుండీ మహలక్ష్మమ్మలో సంస్కారం వృద్ధి చెందుతూ వచ్చింది. తల్లిదండ్రులంటే ఆమెకు అమితమైన భక్తి. చెప్పలేనంత గౌరవం. అందువల్ల బాల్యం నుండే పెద్దల్ని సేవించే లక్షణం, ప్రేమించే సహృదయం మహలక్ష్మమ్మకు అలవడ్డాయి. ఆమెతండ్రి నారాయణ శెట్టి, తల్లి పేరమ్మల దగ్గర మహలక్ష్మమ్మ ఎంతో జీవితాన్ని తెలుసుకొంది. జీవన సూత్రాల్ని నేర్చుకొంది. మంచిగా జీవించడం ఎలా, మర్యాదగా జీవనం సాగించడం ఎలా అన్నది మహలక్ష్మమ్మకి తెలిసిన గొప్ప విద్య. తన వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా, కష్టపడి పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేది.

ఆ రోజుల్లో ఆ కుటుంబాన్ని పోషించడానికి ఆమె ఎంతో కష్టపడింది. ఆర్యవైశ్యుల ఇళ్లలో పేరంటాలుగా ఉంటూ, పూజలు నిర్వహిస్తూ ఆ రోజంతా పస్తుండేది. అలా తాను రోజంతా పస్తులుండి, ఆ వచ్చిన సొమ్ముతో అందరికీ అన్నం పెట్టడానికి శ్రమించేది. ఇళ్లలో పనిపాటలు చేయాల్సి వచ్చినా ఆమె బాధపడేది కాదు సరికదా, ఎంతో ఆనందంగా చేసేది. పైగా అంతమందికి సేవచేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావించేది.

అబద్ధం ఆడడం మహలక్ష్మమ్మకు తెలీదు. ఎంతటి కష్టమైన స్థితిలో కూడా ఆమె నోట అసత్యం వినిపించేది కాదు. ఏ విషయాన్నైనా నిర్భయంగా నిజాయితీతో చెప్పేది. ఎప్పుడూ ఎవరి మనసునూ నొప్పించేలా మాట్లాడేది కాదు. అలా అని అందరిముందు యదార్థాన్ని దాచి ఉంచేది కాదు. నిర్మొహమాటంగానే మాట్లాడేది. అయితే మాటల్లో మర్యాద, ప్రవర్తనలో నమ్రత తొణికిసలాడుతూండేవి. ఆమె వ్యక్తిత్వమే చిన్ననాట శ్రీరాముల్ని ఎంతగానో ప్రభావితం చేసింది.

పొట్టి శ్రీరాములు వ్యక్తిత్వం వికాసవంతమవడంలో మహలక్ష్మమ్మ నుండి నేర్చుకొన్న ఎన్నో విషయాలే సహాయకారులయ్యాయి. కష్టించి పనిచేయడం అనే సూత్రం కన్నతల్లి నుండి నేర్చుకొన్నదే. శ్రీరాములు దానిని జీవితాంతం అనుష్ఠించాడు. నిరాడంబరమైన జీవితం, ఉన్నతమైన ఆలోచనలు శ్రీరాములుకు తల్లినుండి లభించినవే. నమ్మిన వాళ్లకోసం తన సర్వస్వాన్ని త్యాగం చేయడం కూడా అమ్మనుండి నేర్చుకొన్నదే.

వీటన్నిటితోపాటుగా ఉపవాసం చేయడం, శ్రీరాములుకు బాగా అర్థమైంది అమ్మదగ్గరే. తనను ప్రేమించే మనుషుల కోసం, ఉపవాసం చేసినా ఆనందమే లభిస్తుందని తెలిసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు. అందుకే, తన జీవితాన్ని తెలుగువారి అభ్యుదయ వికాసాల కోసం ధారపోసి, చరితార్థుడయ్యాడు.

ఈ విధంగా పొట్టి శ్రీరాముల్ని అత్యున్నత సత్యాగ్రాహిగా నిలపడంలో కన్నతల్లి మహలక్ష్మమ్మ ప్రభావం ఎంతో ఉంది.

**1.3 పొట్టి శ్రీరాములుపై సోదరి గురమ్మ ప్రభావం :** శ్రీరాములు అక్క గురమ్మ. పొట్టి గురవయ్య, మహలక్ష్మమ్మ దంపతుల ప్రథమ సంతానం గురమ్మ. ఆమెను వెల్లంపల్లి పెదరోశయ్యగారికి ఇచ్చి వివాహం చేశారు. చాలా బుద్ధిమంతురాలు గురమ్మ. పుట్టింటి దగ్గర ఉన్నన్నాళ్లు, తల్లికి తలలో నాలుకలా వ్యవహరించేది. తమ్ముళ్లకు స్నానాలు చేయించడంలోనూ, ఇతర కార్యక్రమాలలోనూ గురమ్మ ఎంతో ఇష్టంగా ఉండేది. అయితే పెదరోశయ్య ఎక్కువ కాలం జీవించలేదు. వారికి ఒక కుమారుడు కలిగాడు. అతడే నరసింహ గుప్తా. రామాయణ కథలో రాముడ్ని వెన్నంటి ఉన్న లక్ష్మణుడిలా, పొట్టి శ్రీరాముల్ని జీవితాంతం వెన్నంటి ఉన్నాడు నరసింహ గుప్తా. అడుగడుగునా శ్రీరాములుతో కలసి నడచి, ఆయన తలపెట్టిన ప్రతి కార్యక్రమాలలోనూ తనవంతుగా సహకారం అందించారు గుప్తా. చిన్నతనంలోనే గురమ్మ మరణించింది కానీ, జాతిరత్నం లాంటి కొడుకుని శ్రీరాములుకు అందించింది. ఆ కుర్రాడు బాల్యంలో మహలక్ష్మమ్మ పెంపకంలోనే పెరిగాడు. అందువల్ల చదువుతోపాటు సంస్కారం, సభ్యత ఎంతగానో నేర్చుకొన్నాడు. దానివల్ల ఎన్ని వత్తిడులు వచ్చినా వాటన్నిటినీ తట్టుకొంటూ ముందుకు సాగాడు. సబర్మతీ ఆశ్రమంలో శ్రీరాములుతో కలసి ఉన్నాడు. బీహార్ భూకంప బాధితుల్ని ఆదుకోవడంలో ఎంతో శ్రమించాడు. ఆంధ్రరాష్ట్రం కోసం శ్రీరాములు నిరాహార దీక్ష

చేసినప్పుడు, నరసింహ గుప్తాయే తోడుగా నిలబడ్డాడు.

ఈ విధంగా నరసింహ గుప్తాలాంటి ఉత్తముడ్ని, శ్రీరాములుకు తోడుగా ప్రసాదించి ధన్యురాలయింది సోదరి గురమ్మ.

**1.4. శ్రీరాములు జీవితంపై సీత ప్రభావం :** సీత శ్రీరాములు భార్య. పొట్టి శ్రీరాములు మేనమామ గునుపూడి నరసయ్య శెట్టి కుమార్తె. ఆమె అసలు పేరు సుబ్బమ్మ. వారిది ఆనాటి నెల్లూరు జిల్లా దర్శి తాలూకాలోని మారెళ్ల గ్రామం. ఆయనది ఒకప్పుడు బాగా బ్రతికిన కుటుంబమే గానీ, అనేక కారణాల వల్ల ఆర్థికంగా చితికిపోయారు. పెళ్లి ఖర్చులకి కూడా డబ్బులేని పరిస్థితి వారిది. అది మహలక్ష్మమ్మకి తెలుసు. శ్రీరాములుకీ తెలుసు. అందుకే ఎటువంటి కట్నకానుకలకు, పెట్టుపోతలకు, మర్యాదలకు ఆశించకుండా శ్రీరాములు సుబ్బమ్మని వివాహం చేసుకొన్నాడు. శ్రీరాములు భార్య సీత అయితే బావుంటుందని తలచి, పెళ్లిలో సుబ్బమ్మ పేరును సీతగా మార్చింది మహలక్ష్మమ్మ.

సీత ఎంతో అనుకూలవతి. భర్త అంటే ఎంతో అనురాగం. చాలా చిన్న పల్లెటూరి నుండి వచ్చినా భర్త భావాలతో ఎంతగానో ప్రభావితం అయ్యింది. ఆయన అడుగుజాడల్లో నడిచింది. వారి వైవాహిక జీవితం కొద్దికాలం బాగా జరిగింది. ఈలోగా ఆమెకు ఒక పిల్లవాడు పుట్టడం, కేవలం నాలుగు రోజులు మాత్రమే జీవించి మరణించడం జరిగింది. దీంతో ఆమె మానసికంగా కృంగిపోయింది. ఆ తరువాత ఆమె ఎక్కువ కాలం జీవించలేదు. క్షయ వ్యాధితో మరణించింది.

సీత మరణంతో శ్రీరాములు జీవితం పూర్తిగా స్వరాజ్య పోరాటంవైపు సాగిపోయింది. తనకున్న కొద్దిపాటి సామానులను బొంబాయిలో పేదలకు పంచిపెట్టి, మహాత్ముడి దర్శనానికి వెళ్లిపోయారు శ్రీరాములు. శ్రీరాముల్ని చూసి సంతోషించారు గాంధీజీ. సబర్మతీ ఆశ్రమానికి వెళ్లి, అక్కడ సత్యాగ్రహ శిక్షణ పొందమని శ్రీరాముల్ని ఆదేశించాడు.

బుద్ధ భగవానుడి మహాభినిష్క్రమణంలా, సీత అస్తమయం పొట్టి శ్రీరాముల్ని పూర్తిగా దేశానికే సమర్పించింది.

**1.5. ముగింపు మాట :** కన్నతల్లి, తోడబుట్టిన సోదరి, కట్టుకొన్న భార్య అందరూ పొట్టి శ్రీరాములు జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేశారు. ఒక సాధారణ వ్యక్తిని త్యాగశీలిగా రూపొందించడంలో ఈ ముగ్గురు మహిళలూ ఎంతో గొప్ప పాత్రను పోషించారు. శానిటరీ ఇంజనీరింగ్ చదువుకొన్న ఓ యువకుడు, తన మేధస్సును, తన వ్యక్తిత్వాన్ని, తన త్యాగశీలతను లోకానికి సమర్పించి చరితార్థుడైన మహనీయుడుగా రూపొందాడు. అలా రూపొంది, భారత స్వాతంత్ర్య పోరాటంలోనూ, తెలుగువారికి ప్రత్యేక అస్తిత్వం కల్పించడంలోనూ చిరస్మరణీయుడయ్యాడు పొట్టి శ్రీరాములు. ఆయన అమరజీవి. పొట్టి శ్రీరాములు అమరజీవి. ఆ మహనీయ రూపం వెనుక, ఆ మహోత్తమ త్యాగధనుడి వెనుక కనిపించే ముగ్గురు మహిళామూర్తులూ చిరస్మరణీయులే. వీరితో పాటుగా సబర్మతీ ఆశ్రమంలో పొట్టి శ్రీరాములు సత్యనిష్ఠను ఎంతగానో గౌరవించిన మహిళ ప్రేమబెహన్ కంటక్, గాంధీ ఆశ్రమంలో శ్రీరాముల్ని సోదరుడిగా ఆత్మీయంగా చూపిన ఎర్నేని లీలావతిదేవి, శ్రీరాములు అంతిమ యాత్ర తరువాత ఆ చితాభస్మాన్ని గోదావరిలో నిమజ్జనం చేయడానికి తెచ్చిన పత్తిమణెమ్మ వంటి స్త్రీలందరూ కూడా చిరస్మరణీయులే. ఈ స్వాతంత్ర్య అమృతోత్సవాలలో వారందరినీ మనసారా స్మరించడం మనందరి కర్తవ్యం. బాధ్యత.

**ఈ వ్యాస రచనలో నాకు సహాయపడిన గ్రంథాలు – గ్రంథ రచయితలు – ప్రచురణ కర్తలు**

**వీరందరికీ నా కృతజ్ఞతలు**

1. అమరజీవి పొట్టి శ్రీరాములు “90వ జయంతి సంచిక” 1992 మరియు “బలిదానం” (శ్రీరాములు గారి చరిత్ర); రచయితలు : శ్రీ వై.ఎస్. శాస్త్రి గారు, విద్వాన్ ఎ. సుబ్బరాయ గుప్త గారు; ప్రచురణ: అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ సొసైటి (రి) మద్రాసు.
2. ఆంధ్రజ్యోతి – అమరజీవి; రచయిత శ్రీ చిప్పాడ సూర్యనారాయణమూర్తి గారు; ప్రచురణ : గాంధీ సాహిత్య ప్రచురణాలయం, హైదరాబాదు.

3. అమరజీవి పొట్టి శ్రీరాములు గారి జీవిత చరిత్ర; పరిశోధనా గ్రంథము రచయిత: డా॥ బాదం శ్రీ రాములు గారు, లెక్చరర్, మార్కాపురం; ప్రచురణ : అఖిల భారత వైశ్య యువజన సంఘం, హైదరాబాదు.
4. మన జాతీయ నాయకులు – అమరజీవి పొట్టి శ్రీరాములు; రచయిత : శ్రీ పురాణపండ రంగనాథ్ గారు; ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, విజయవాడ – 2.
5. ఆంధ్ర రాష్ట్రావతరణ సంచిక – 1953; ప్రకాశకులు : వెంకట్రామా అండ్ కో బుక్ పబ్లిషర్స్, ఏలూరు,
6. అమరజీవి; రచన : శ్రీ దరువూరి వీరయ్య గారు – స్వాతంత్ర్య సమరయోధులు.
7. ఆంధ్రరాష్ట్రావతరణ సంచిక – ప్రజాపత్రిక – రాజమండ్రి. ప్రస్తుత సంపాదకులు శ్రీ దేవీ సుదర్శన్.
8. వాసవీ స్రవంతి – దశాబ్ది ఉత్సవ సంచిక – వ్యాస రచయిత : శ్రీ ఎం.ఆర్.కె. మూర్తి గారు.
9. సుప్రసిద్ధుల జీవిత విశేషాలు – రచయిత శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి గారు, కడప; ప్రచురణ : శ్రీ విశాలాంధ్రా పబ్లిషింగ్ హౌస్ హైదరాబాదు.
10. తెలుగు వెలుగులు – వ్యాస సంపుటి; ప్రచురణ: అమరావతీ పబ్లికేషన్స్, గుంటూరు.
11. నా జీవితయాత్ర (టంగుటూరి ప్రకాశం గారిది); ప్రచురణ : ఎమెస్కో, హైదరాబాదు.
12. వైశ్య ప్రబోధినీ సంచిక – జయనగర్ కాలనీ – కడప.
13. పూర్ణాహుతి (శ్రీ పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర); రచన : శ్రీ కె.సభా గారు; ప్రచురణ : ఆత్మారాం అండ్ కో – అనంతపురం.
14. జాతి నిర్మాతలు. రచన : శ్రీ తుర్లపాటి కుటుంబరావు గారు. ప్రచురణ : దేశీ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, విజయవాడ–2
